ఉపోద్ఘాతము

ఇది అష్టమ స్కంధము.

అష్టమ స్కంధము పరమాత్మ యొక్క భుజముగ తెలియు చున్నది. ఈ స్కంధమున గజేంద్ర మోక్షము, క్షీరసాగర మథనము, బలిచక్రవర్తి చరిత్ర, వామన చరిత్ర, మత్స్యావతార కథ ఇత్యాది అమోఘమైన విషయములు చర్చింప బడినవి.

కాలములో దిగిన గజేంద్రునివలె మానవుడు సంసార సరోవరమున ఎలా దిగబడి యున్నది గజేంద్ర మోక్షమున తెలుపును. దానికి తరుణోపాయమును గూడ సూచించును.

భగవద్భక్తులను అవమాన పరచినచో మంద బుద్ధులగుదురు. జంతుజన్మ నెత్తెదరు. పరమాత్మకు జేసిన అపచారము తీరునేమో గాని గురువులకు చేసిన అపచారము వలన కలిగెడి కీడును ఎవ్వరును తొలగించలేరు యనెడి విషయమును గజేంద్రుని పూర్వజన్మ వృత్తాంతము ద్వారా తెలుపును.

తత్త్వచింతనము గల సాత్త్విక మనసే క్షీర సాగరమనియు, ప్రతిసాధకుడు ఆంతరంగిక శోధనచేసి అమృతత్వాన్ని పొందుటయే క్షీరసాగర మథనంలోని భావ సౌందర్యము. ప్రతి ఒక్కరు జ్ఞాన నిర్మథనాభ్యాసము ద్వారా అమృతసిద్ధిని బొంది అమరులగుటయే క్షీరసాగర మథనంలోని సందేశాత్మక సమన్వయ సారాంశము.

త్యాగము వలననే అమృతత్వము ప్రాప్తించును. బలి చక్రవర్తి త్యాగమయ దానము ముల్లోకములలోను శ్లాఘింపబడినది. త్యాగము యొక్క దివ్యవైభవమును ఈ బలిచక్రవర్తి చరిత్ర మనకు నిరూపించును. నవమ స్కంధమున శ్రీరాముని చరిత్ర వచ్చును. భగవంతుడైన శ్రీరాముని బొందుటకు కావలసిన భక్తి లక్షణముల నన్నిటిని అష్టమ స్కంధము అందించును. అందుచేత ఇది పరమాత్మకు భుజముని వర్ణింపబడినది.

చైతన్య భాగవతము

అష్టమ స్కంధము

గజేంద్రమోక్షము

చక్రభ్రమణంలా కాలం నడచిపోతున్నది. కాలంతోపాటు జీవులు నడక సాగిస్తున్నారు. కాల మార్పులతోపాటు జీవులలోకూడా మార్పులు గోచరిస్తున్నాయి. దేహం మారుతున్నది. భావాలు మారుతున్నాయి. అభిరుచులు మారుతున్నాయి. పరిస్థితులు మారుతున్నాయి. సంస్కృతులు మారుతున్నాయి. మతులు మారుతున్నాయి. గతులు మారుతున్నాయి. మారే దేదైనా మరణరూపమే. గతించే వాటిలో గతి తెలియదు. మతి నిలిచినా గతించే వాటిని స్మరించేవాడు యతి కాలేడు.

కాలం ఎవరినీ కనికరించదు. కాలరూప సుడిగుండంలో ఎన్నోరాజ్యాలు నామరూపాలు లేకుండాపోయాయి. సామ్రాజ్యాలు సాగర తరంగముల వలె లేచి అదృశ్యమైనాయి. కాలకడలిలో ఎన్నోరూపాలు కెరటాలవలె అదృశ్యమైనా, అవి అలా అదృశ్యమైననవేది తెలుసు. ఇదియే తెలివి లేక జ్ఞానము. ఇది సామాన్య జ్ఞానముకాదు. విశేష జ్ఞానము. సమస్తమును ఏకముగా వీక్షించే విశిష్టజ్ఞానము. ఈ జ్ఞానమును పొందినవ్యక్తి పరిణామ సంసారమునుండి నివృత్తిని పొందుచున్నాడు. ఈ స్థితిని పొందుటకే సర్వులూ యత్నిస్తున్నారు. యత్నించాలి.

కో ధర్మః సర్వధర్మాణాం భవతః పరమోమతః
కిం జప న్ముచ్యతే జంతుః జన్మ సంసార బంధనాత్

"సర్వ ధర్మములలో ఉత్తమమైన ధర్మమేది? దేనిని జపించుట వలన జీవులు పరిణామ రూపమైన జనన మరణ సంసారబంధము నుండి విముక్తిని పొందుచున్నారు?" అని ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు భీష్ముడు ఇలా సమాధానమిచ్చెను:

జగత్ప్రభుం దేవదేవ మనన్తం పురుషోత్తమమ్
స్తువన్ నామ సహస్రేణ పురుషః సతతోత్థితః

ధర్మరాజు అడిగిన ప్రశ్నకు భీష్ముడు నామస్మరణమునే ముఖ్య సాధన విషయముగా సూచించెను. భగవన్నామమును ఎవరు శ్రద్ధతో గానము చేయుదురో వారు **"సర్వదుఃఖాతిగో భవేత్"** అట్టివారు సమస్త శోకములను అధిగమించుచున్నారని అర్థము. అయితే ఈ స్మరణ కాలపరిధిలో కట్టుబడి పోకూడదు. అందుచేతనే భీష్ములవారు **"సతతోత్థితః"** అన్నారు. సదా శ్రద్ధావంతుడై పరమాత్మను కీర్తించాలి అని భావము.

కాలహరణము చేయువారు కాలములో మరణమునే దర్శిస్తారు. కాలమును జయించినవారు కాలుని నోటపడక కైవల్యమును పొందుతారు. గడచిన సమయము మనదికాదు. మనకులేదు. సమయాన్ని తెలిసి సంయమనాన్ని పాటించకపోతే యముడే గతి. కాలాన్ని మనం హరిస్తే కాలం మనలను హరిస్తుంది.

I waste time and now doth time wastes me

"నేను కాలాన్ని వృథా చేశాను. ఇపుడు కాలమే నన్ను కాలరాచింది" అంటాడు షేక్స్పియర్.

ప్రతివ్యక్తి కాలాన్ని జయించాలి. మృత్యువును జయించాలి. అమృతత్వమును పొందాలి. అజేయుడై నిలవాలి. ఈ సత్యమును ఎరుక పరచునదియే గజేంద్రమోక్షము. ప్రతిజీవికి మోక్షము నందించు అమృతమయ సందేశము.

శ్రీశుకుడు మన్వంతరముల వర్ణించి, నాల్గవ మన్వంతరములో భగవానుడు శ్రీహరిగా వ్యక్తమై గజేంద్రుని రక్షించెనని పలికెను. గజేంద్రుని నారాయణుడు రక్షించిన విధమును తెలుపమని పరీక్షిత్తు డడుగగా శుకబ్రహ్మ గజేంద్రమోక్షమును గూర్చి చెప్పుచున్నాడు.

త్రికూటమనెడి పర్వత మొకటుండెను. అది పదివేల యోజనముల ఎత్తైనది. అతి రమణీయముగ నుండును. లోహ, రజత, హేమమయము లగు మూడు శిఖరములచే ఆ పర్వతము చక్కగా శోభించుచుండెను. అచ్చట ఋతుమంతం అనెడి మనోహర ఉద్యానవనము కలదు. ఆ ఉద్యానవనములో ఒక సరోవరము కలదు.

ఆ ప్రాంతమున గజేంద్రుడనే గజరాజుండెను. అతడు గొప్ప బలవంతుడు. ఒకనాడు గజరాజు తన భార్యలైన ఏనుగులతోను, ఏనుగు గున్నలతోను విహారార్థమై ఋతుమంతానికి వచ్చెను. బాగా అలసి యుండుటచే స్నానమాచరించుటకై, తన వారితో కలసి సరోవరములో దిగెను. కరిణీ సంఘముతో కలసి నీటిలో విహరించుచు హాయిగా, తృప్తిగా నీటిని పానము చేసెను.

క॥ **తుండంబుల బూరించుచు గండంబుల జల్లుకొనుచు గళగళరవముల్**
మెండుకొన వలుదకడుపులు నిండవ్ వేదండకోటి నీటిం ద్రావెన్.

గజేంద్రు డిలా ఆనందముగా విహరించుచుండగా భయంకరమైన మొసలి ఒకటి గజేంద్రుని కాలును గట్టిగా పట్టుకుంది. దాని నుండి విడిపడటానికి గజరాజు విఫల ప్రయత్నం చేస్తూనే యున్నాడు. జలచరమైన మొసలి ముందు భూచరమైన గజపతి నిలువలేక పోతున్నాడు. క్షణక్షణానికి బలహీను డగుచున్నాడు.

గజేంద్రుడు త్రికూట పర్వతమున వసించుచుండెను. మానవదేహమే త్రికూట పర్వతము. కూటమనగా సమూహము లేదా గృహము యని అర్థము. స్థూల, సూక్ష్మ, కారణ దేహములతో నిండిన మానవదేహమే త్రికూట పర్వతము. ఈ పర్వతముపై గజేంద్రుడు చరించుచుండును. ప్రతి మానవుడు స్థూలశరీరము ద్వారా కార్యముల నాచరించును. సూక్ష్మదేహము ద్వారా సంకల్ప వికల్పాదులను చేయుచు భావసంపదను పొందును. కారణ శరీరములో తమోభూతుడై యుండును.

స్థూలదేహము జాగ్రదవస్థకు మాత్రమే పరిమితమై యుండును. స్వప్నావస్థ యందు స్థూలదేహము అనుభవమునకు అందదు. సూక్ష్మశరీరమే అక్కడ తెలియును. గాఢనిద్రలో స్థూల, సూక్ష్మ శరీరములు రెండును తెలియవు. కానీ కారణ శరీరము తెలియును. కానీ ఈ మూడు దేహాదులలో జరిగే అనుభవములను జీవుడు గ్రహించును. శరీరత్రయము నందు అతడు సంచరించును గనుక అతనికి తెలియును. అలాగే గజేంద్రుడనెడి జీవుడు త్రికూటాచల మనెడి దేహములో సంచరించుచున్నాడు. అనుభవములను పొందుచున్నాడు.

పురత్రయే క్రీడతి యశ్చ జీవః తతస్తు జాతం సకలం విచిత్రం

"జీవుడు మూడు పురముల యందును క్రీడించుచున్నాడు. అతని నుండియే విచిత్రమైన ప్రపంచము ఉత్పన్న మగుచున్నది" యని కైవల్యోపనిషత్తులో బ్రహ్మదేవుడు అశ్వలాయన మహర్షికి చెబుతాడు.

త్రికూటాచలమున విహరించు గజేంద్రుడు దప్పిక గొన్నవాడై కరిణీసంఘముతో కలసి సరోవరములో ప్రవేశించెను. ప్రతిమానవుడు ఆనందము నన్వేషించుచు భార్యతో కూడి సంసారమనెడి సరోవరములో ప్రవేశించును.

త్రికూటపర్వతము పది యోజనముల ఎత్తైయుండెను. మానవదేహము దశేంద్రియములతో గూడి నిలబడి యుండును. త్రికూటపర్వతము నందు హేమ, రజత, లోహ మయములగు మూడు శిఖరము లుండెను. అవియే మానవుని దేహములో తెలియు సత్త్వ రజ స్తమో గుణములు. గజేంద్రుడు ఋతుమంతమనే ఉద్యానవనములో ప్రవేశించెను. ఋతుమంతమనగా సత్యమును గూర్చి తెలిసికొన దగిన ప్రదేశము యని అర్థము. అదియే ప్రపంచము. ప్రపంచము అనిత్యమైనను నిత్యరూపుడైన పరమాత్మ జీవులకు ఈ విశ్వములోనే లభించును. విశ్వదర్పణము ద్వారా విశ్వనాథుని దివ్యతేజమును దర్శింప వలసియున్నది. కారణము ఈ విశ్వమును సృజించినది అతడే గనుక.

య ఏతద్వా భగవాన్ స నిత్యో వికార యోగేన కరోతి విశ్వమ్

"ఈ దృశ్యమాన జగత్తంతయూ పరమాత్మయే. మాయతో గూడి ఈ విశ్వమును అతడే రచించుచున్నాడు" అని మహాభారతము సనత్సుజాతీయము నందున్నది.

గజేంద్రుడు ఋతుమంత మనెడి ఉద్యానవనమున విహరిస్తూ దప్పికగొనెను. ఈ ప్రపంచ ఉద్యానవనమున ప్రతిజీవుడు దప్పికతో బాధపడుచూనే యున్నాడు. కొందరికి ధనదాహం, కొందరికి పదవీదాహం, కొందరికి కీర్తిదాహం ఇదీ అదీ యననేల, వారు వీరు యని ప్రత్యేకించ నవసరములేదు. సర్వులు దాహం దాహం అంటూ దహింపబడుచునే యున్నారు.

ఈ జగత్తులో ఇంతవరకు పిపాసులు జీవించారేగాని సుఖవాసులు లేరు. అందరూ దాహంతోనే యున్నారు. ఇంతవరకు ఎవరి దాహం తీరిందో పరమాత్మకే ఎరుక.

జీవులందరు నిత్యానంద రసపానమునకై ప్రయత్నిస్తూనే యున్నారు. ప్రయత్నాలు ఎంత పరుగిడినా ఫలితాలను పట్టలేక పోతున్నాయి. అలసటే మిగులుతున్నది. ఆవేదనే కలుగుతున్నది. అశాంతి కుటీరంలో నిలువలేని జీవులు దప్పిక తీర్చుకొనే యత్నంలో ఎక్కడో ఒకచోట కాలుమోపుతూనే ఉంటారు.

గజేంద్రుడు సరోవరములో దిగాడు. కొందరు రాజకీయాలలో దిగుతారు. కొందరు నటులుగా జేరుతారు. కొందరు ఆశ్రమాలకు బంధీలవుతారు. కొందరు గృహాలలో ప్రవేశిస్తారు. ఏది ఏమైనా దిగేవారంతా దిగులు చెందేవారే. ఎవరికీ శాంతిలేదు.

గజేంద్రుడు సరోవరంలో కాలుపెట్టాడు. జీవులందరు సంసారములలో దిగుతారు. సన్యాసికి సంసారము లేదు కదా యని మీరనవచ్చును. సంసారము సన్యాసికి లేకపోవచ్చు. కానీ సంసార దుఃఖము మాత్రము లేకపోలేదు. సంసార మెక్కడున్నది? మనస్సులో యున్నది. చిత్తమున్నంతవరకు సంసారమున్నట్లే.

చిత్త మేవహి సంసారః తత్ప్రయత్నేన శోధయేత్

"చిత్తమే సంసారము. కనుక చిత్తమును నిర్మల మొనర్పవలెను" యని మైత్రాయణ్యుపనిషత్తు బోధించినది.

ప్రయాస తీరాలని, పిపాస తొలగాలని గజేంద్రుడు కొలనులో దిగాడు. దుఃఖము దూరం కావాలని, సుఖం చేరువ కరుదెంచాలని జీవులు సంసారములో ప్రవేశిస్తారు. భార్యా పిల్లలతో గజేంద్రుడు ఆనందముగా విహరించినట్లు, జీవులు సంసారములో సంచరిస్తారు. ఏగినంతసేపు పట్టలేదు ఏడ్వటానికి. గజేంద్రుని పాదమును భయంకరమైన మొసలి పట్టుకుంది.

సరస్సులో మొసలుంది, సంసారములో కాలముంది. కొలనులో ప్రవేశించిన గజేంద్రుని మొసలి పట్టుకొనినట్లు, సంసారిని కాలుడు పట్టుకుంటాడు.

ఏనుగు బలిష్టమైనదియే. కాని సరోవరములో దిగిన తరువాత దాని శక్తి నిరుపయోగమైంది. సంసారమగ్నులై, బ్రహ్మచర్యమునకు దూరులైనవారు శక్తిహీనులు కాకపోరు.

సరోవరంలో విహరిస్తుండిన గజేంద్రుని మొసలి ఒక్కక్షణాన పట్టుకుంది. సంసారంలో చరించే జీవులను మృత్యువు ఏ క్షణానైన్నా ముట్టవచ్చు.

నాతి దూరే నృణాం మృత్యుః ఇతి వేదాన్త డిండిమః

"మృత్యువు ఎంతో దూరములేదు యని వేదాంత డిండిమము మ్రోగుచున్నది" అంటారు శ్రీశంకరులు.

మొసలి గజేంద్రుని పాదమును గట్టిగ పట్టుకొనెను. బలిష్టమైన పాదము కదలికను కోల్పోయెను. మృత్యువెప్పుడూ పాదమునే పట్టుకుంటుంది. కాలునికి చేరువగువాడు కాలును కదల్పలేడు. ఇది ఒక్క గజేంద్రుని విషయంలోనే గాక అందరి విషయంలోనూ సత్యమే. కదలలేని కాళ్ళు చివరగా కదిలేది కాటికే.

గజము పైకి రావాలని ప్రయత్నం. మకరము లోపలికి ఈడ్వాలని తీవ్రప్రయత్నము. క్షణక్షణానికి గజేంద్రుని శక్తి సన్నగిల్లుతూ ఉంటుంది. ప్రతిక్షణమూ మకరము శక్తివంతమగుతూ ఉంటుంది. జీవునిశక్తి తగ్గుతూ ఉంటే యమునిశక్తి పెరుగుతూ ఉంటుంది. ఇదొక భయంకర పోరాటము.

క॥ కరి దిగుచు మకరి సరసికి గరి దరికిని మకరి దిగుచు గరకరిబెరయన్
గరికి మకరి మకరికి గరి భర మనుచును నతలకుతల భటు లదరిపడన్.

ఈవిధముగా కరిమకరంబులు సముద్దండ దండంబులై తలపడినారని పోతనా మాత్యుడు.

గజగ్రాహములు ఈవిధముగా సహస్రవర్షంబులు పోరినవట. సహస్రమను పదమును అసంఖ్యాక మనెడి భావముతో గ్రహించాలి. పరమాత్మని "సహస్రాక్షః" అంటాము. అంటే పది వందల నేత్రములున్నవని భావముకాదు. అనేక నేత్రములని అర్థము. ఇక్కడ కూడా అలాగే గ్రహించాలి. మృత్యువుతో జీవుడెప్పుడూ పోరాడుచునే యుండును. ఇది ఒక్కనాడు ప్రారంభమై మరునాడు అంతమయ్యేది కాదు.

మకరము గజమును లోనికి లాగికొని పోవుచుండెను. ఇక లాభములేదని భావించిన ఏనుగులు గజేంద్రుని వదలి వెళ్ళిపోయిరి. గట్టున క్షేమంగా నిలబడి చూచుచుండిరి. జలక మాడునపుడు అందరూ తోడుండిరి. జవముడగగనే అందరూ దూరమైరి. ఇదియే బంధుత్వము.

పురా పరజన స్వార్థే కృతం కర్మ శుభాశుభమ్, ఏకాకీ తేన దహ్యామి గతాస్తే ఫలభాగినః

"పూర్వము అన్యులకొరకై శుభాశుభములగు అనేక కర్మములను చేసితిని. ఇపుడు నేను ఏకాకినై ఒంటరిగా బాధపడుచున్నాను. ఫలమనుభవించిన వారందరూ పలాయనమైరి" అని గర్భోపనిషత్తు జీవుని ఆవేదనను ప్రతిధ్వనింప చేసింది.

ఈ స్థితి అందరిది. ఈ పరిస్థితి ప్రతి ఒక్కరికి ఎదురు నిలుస్తుంది. ఏ కుటుంబ సౌఖ్యమును వాంఛించి జీవులు పాప పుణ్యములతో గూడిన అనేక కర్మల నాచరించిరో, ఆ కుటుంబములోని వారే అంత్యసమయమున దూరమగుదురు.

సుఖాలను అందరూ కలసి పంచుకుంటారు. దుఃఖము మాత్రము వ్యక్తిగత అనుభవమునకు సంబంధించినదియై ఉంటుంది. కనుక దుఃఖానుభవమును పంచే పాపము నెప్పుడూ చేయకూడదు. సుఖమును పంచే పుణ్యకార్యములనే జీవు లాచరించాలి.

సాధారణంగా జీవులు ఇందుకు భిన్నంగా వర్తిస్తుంటారు. పుణ్యమువలన సుఖం లభిస్తుంది. పాపంవలన దుఃఖం ప్రాప్తిస్తుంది. పుణ్యఫలమైన సుఖమును అందరూ వాంఛిస్తారు. అది లభ్యము కావలెనన్నచో పుణ్యమును ప్రేమించి ఆచరించాలి కదూ! ఆ పనిని మాత్రము చేయరు.

పుణ్యస్య ఫల మిచ్ఛంతి పుణ్యం నేచ్ఛన్తి మానవాః

"పుణ్యఫలమును కోరుతారు. కానీ పుణ్యము నాచరింపరు" అని శాస్త్రము.

అలాగే పాప ఫలమైన శోకమును ఎవ్వరూ అభిలషింపరు. కానీ పాపాచరణమును సాగిస్తారు. పాపముచేసి పాపఫలము రాకూడదంటే ఎలా సాధ్యపడుతుంది?

న పాప ఫల మిచ్ఛంతి పాపం కుర్వన్తి యత్నతః

"పాప ఫలమైన దుఃఖమును నిరాకరిస్తారు. కానీ యత్నించి పాపంచేస్తారు" అని శాస్త్రము.

బంధితుడైన గజేంద్రుని బంధములను తొలగించలేక అతనితో తమకున్న బంధములను త్రెంచుకొని బంధువులందరూ దూరమైనారు. "నాకిక ఎవరు దిక్కు? మకరికి నేను తోడైనాను. నాకు తోడెవ్వరు?" అని తీవ్రంగా ఆలోచించాడు గజేంద్రుడు.

ఆలోచించే వారికే అవకాశాలు మెండు. ఏదీ చేయని వానికి చేరువయ్యేది మృత్యువొక్కటియే. బలహీనుడైన గజేంద్రుడు దైవబలమే శరణ్యమని భావించెను. బాధలలోనే జీవులకు భగవంతుడు స్మృతిలో నిలుస్తాడు. కనుకనే పరమాత్మను మరిపించే సుఖముల కన్నను పరమాత్మను జ్ఞాపకము చేయుబాధలే హితకరములని శాస్త్రము నిర్ణయించింది.

సర్వ ప్రయత్నములు విఫలమైన పిదప జీవుడు అన్యశరణ్య మెరుగక పరమాత్మని శరణుబొందును. తమ శక్తి సన్నగిల్లగనే జీవులందరు పరమాత్మనే ఆశ్రయింతురు. గజేంద్రుడు అదే చేసాడు. భగవంతుని కన్నను తనకు శరణ్య మెవ్వరూ లేరని భావించి మనస్సును మాధవుని వైపుకు త్రిప్పెను.

గజేంద్రునికి స్మృతి కలిగెను. గత జన్మలో నేర్చిన స్తోత్రమును పఠింపసాగెను. స్మృతి గలవారు మృతి నెరుగరు. "పరమాత్మ బీజరూపుడు. ఆయన వలననే జడమైన దేహాదులు చైతన్యవంతములై చరించుచున్నవి. అట్టి వాసుదేవునకు నా నమస్కారము" అంటూ ఇంకా ఈ క్రింది విధముగా ప్రార్థించసాగెను.

ఉ॥ ఎవ్వనిచే జనించు జగ, మెవ్వనిలోపల నుండు లీనమై,
యెవ్వనియందుడిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు సర్వము దానయైనవా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్.

"దేవా! ఒకప్పుడు నీ నుండి ఈ ప్రపంచము ఆవిర్భవించును. ఒకప్పుడు నీలోకి తిరిగి ప్రవేశించును. నీవు పరాత్పరుడవు" అని ధ్యానించి శ్రీవిష్ణువునే ఆశ్రయించుటకు గజేంద్రుడు నిర్ణయించుకొనెను.

క॥ లోకంబులు లోకేశులు లోకస్థులు దెగిన దుది నలోకం బగు పెం
జీకటి కవ్వల నెవ్వం డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్

"నటించు నటునివలె అనేక రూపములతో శోభిల్లు ఏ మహితాత్ముని దేవతలుగాని, ఋషులుగాని తెలియలేకపోయిరో అట్టి దివ్యాత్ముని నేనేమి తెలియగలను? ఆతని నాశ్రయించుటయే నాకు తెలియును.

తస్మై నమః పరేశాయ బ్రహ్మణేఽనన్త శక్తయే
అరూపాయోరు రూపాయ నమ ఆశ్చర్య కర్మణే

"అనంత శక్తియుతుడును, రూపరహితుడును, అనేకరూపియు, విస్మయ మొందించు కర్మలను చేయువాడును అగు పరమేశ్వరునకు నేను నమస్కరించు చున్నాను."

ఈ విధముగా ఆర్తుడైన గజేంద్రుడు శ్రీహరిని ప్రార్థించెను. మృత్యువు భయంకర మైనది. అనివార్యమైనది. ఏ సమయము నందైనను తలుపుతట్టును. ఆ క్షణం మనది కాదు. అది మృత్యుక్షణం. చేసిన యోచనలకు, ఊహాలకు తెరపడే కర్కశమైన క్షణం. ఆడిన నాటకం సమాప్తమని తెలిపే ఆఖరిక్షణం. అంతిమక్షణం.

నాటకం సమాప్తమై, తెరపడే సమయాన నటులిక నిస్సహాయులే. ఇక నటన జరుగదు. ప్రదర్శన ఫలించదు. తెరపడక ముందే ఆడేదేదో ఆడాలి. పాడేదేదో పాడాలి. జీవిత నాటకం పరిసమాప్త మయ్యే వేళ జీవులు దేవుని ప్రార్థించలేరు. దేహేంద్రియ మనో బుద్ధులు స్వాధీనములో నున్నపుడే పరమాత్మను ప్రార్థించాలి.

గజేంద్రునకు పూర్వజన్మ సుకృతమున్నది. అందుచేత అతడు శ్రీహరిని చివరి క్షణంలో ప్రార్థించగలిగెను. మన పరిస్థితి ఎలా ఉన్నదో? ఇప్పుడే ప్రారంభించుట మంచిది. గజేంద్రుడు అద్భుతంగా ప్రార్థించాడు. గజేంద్రుని ప్రార్థనలను నిత్యమూ పారాయణ చేసేవారుకూడా కలరు. ఈ ప్రార్థనలు జీవులకు అమృతమయ స్థితిని ప్రసాదించునని ఎందరో పెద్దలు చెప్పగా నేను విన్నాను. ఈ సన్నివేశములో వ్యాసభగవానుడు సంస్కృతము లోను, పోతనామాత్యుడు ఆంధ్రములోను పరస్పరము పోటీపడి రచించినారా? అన్నట్లున్నది. నేను అవికొన్ని, ఇవికొన్ని ఇచ్చట పొందు పరచుచున్నాను. నిత్యమూ ఈ ప్రార్థనలను శ్రద్ధాభక్తులతో పఠించండి. మీరూ అమృతరూపులు కాగలరు. గజేంద్రుని వలె శ్రీహరి కృపకు పాత్రులయ్యెదరు.

నమః శాన్తాయ ఘోరాయ మూఢాయ గుణధర్మిణే
నిర్విశేషాయ సామ్యాయ నమో జ్ఞాన ఘనాయచ

శాంతరూపుడును, ఉగ్రరూపుడును, ప్రచ్ఛన్నుడు, శుద్ధసత్త్వస్వరూపుడు, నిర్విశేషుడు, నిర్వైరుడు, జ్ఞానఘనుడగు పరమాత్మకు నమస్కరించుచున్నాను.

ఈ శ్లోకమున పరమాత్మను శాంతుడు, ఉగ్రుడు, ప్రచ్ఛన్నుడు యని వర్ణించెను. ఈ మాటలు పరస్పర విరుద్ధములు గావు. భక్తులకు పరమాత్మ శాంతరూపుడు కాగా, దుష్టులకు ఉగ్రరూపుడై యున్నాడు. గృహస్థులకు ప్రచ్ఛన్నుడై యున్నాడని భావము.

శ్రీహరి ప్రహ్లాదునకు శాంతుడై గన్పట్టును. హిరణ్యకశిపునకు భయంకరముగ గోచరించినట్లు సప్తమ స్కంధములో చూచియున్నాము గదా! శాన్తరూపములో శిష్టరక్షణము, ఉగ్రరూపములో దుష్టశిక్షణము, ప్రచ్ఛన్న రూపములో ధర్మసంస్థాపనము జరుగుచూ అవతార వైశిష్ట్యము మంగళకరముగ వ్యక్తమగుచున్నది.

క్షేత్రజ్ఞాయ నమస్తుభ్యం సర్వాధ్యక్షాయ సాక్షిణే
పురుషాయాత్మ మూలాయ మూల ప్రకృతయే నమః

"క్షేత్రజ్ఞ రూపుడును, సర్వాధ్యక్షుడును, సాక్షిరూపుడును యగు పరమాత్మకు వందనములు. పరమపురుషుడును, ప్రకృతి కాధారమైన వాడును, పూర్ణపురుషుడు నగు భగవానునకు వందనములు.

నమో నమస్తేఽఖిల కారణాయ నిష్కారణా యాద్భుత కారణాయ
సర్వాగ మామ్నాయ మహార్ణవాయ నమోఽప వర్గాయ పరాయణాయ

"సమస్తమునకు కారణమైనవాడును, నిష్కారణుడును, అద్భుత కారణుడును అగు పరమాత్మకు నమస్కృతులు. వేదాగమములకు ఆశ్రయుడును, మోక్షరూపుడును, సాధు శరణ్యుడును అగు పరమాత్మకు వందనములు.

సోఽహం విశ్వసృజం విశ్వమవిశ్వం విశ్వవేదసమ్
విశ్వాత్మాన మజం బ్రహ్మ ప్రణతోఽస్మి పరంపదమ్

"విశ్వమును రచించిన వాడును, విశ్వరూపుడును, విశ్వరహితుడును, విశ్వము నెఱిగిన వాడును, విశ్వాత్ముడును, పుట్టుక లేనివాడును, పరమపదరూపుడగు పరమాత్మకు ప్రణామములు.

యోగ రన్ధిత కర్మాణో హృది యోగ విభావితే
యోగి నో యం ప్రపశ్యన్తి యోగేశం తం నతోఽస్మ్యహమ్

"యోగము ద్వారా కర్మలను దగ్ధమొనర్చి, యోగులు తమ యోగ బుద్ధియందు యే యోగీశ్వరుని దర్శించుచున్నారో ఆ పరమాత్మకు నమస్కృతులు."

అహంభావముతో విఱ్ఱవీగువానికి తన గొప్పతనమేగాని పరమాత్మ యొక్క కల్యాణ గుణములు అర్థంగావు. పర్వులు దూరమై, ఉన్న సమస్తమూ దూరమయ్యేదేనని గ్రహించిన తరుణములో భగవాముని విభూతులు తెలుస్తాయి. పరమాత్మనెలా స్తుతించాలో గజేంద్రుడు చక్కగా తెలిపాడు. ఇక ఆంధ్రంలో అద్భుత రచన సాగించిన సహజ పండితుని కమనీయ ప్రార్థనలను చూచెదము.

క॥ కల డందురు దీనుల యెడ, గల డందురు పరమయోగిగణముల పాలం
గల డందు రన్నిదిశలను, గలడు కలం డనెడువాడు గలడో లేడో.

అని గజేంద్రుడు తనలో తాను తర్కించుకొనుచు, శ్రీహరి అన్నిరూపములలో గలడని దర్శించుచున్నాడు.

సీ॥ కలుగడే నాపాలి కలిమిసందేహింప గలిమిలేములు లేక గలుగువాడు
నా కడ్డపడరాడె నలి నసాధువులచే బడిన సాధుల కడ్డపడెడువాడు
చూడడే నాపాటు జూపుల జూడక జూచువారల గృప జూచువాడు
లీలతో నామొఱాలింపడే మొఱగుల మొఱలెరుంగుచు దన్ను మొఱగువాడు
తే॥ యఖిలరూపులు దనరూపమైనవాడు ఆదిమధ్యాంతములు లేక యలరువాడు
భక్తజనముల దీనుల పాలివాడు వినడె చూడడె తలపడె వేగ రాడె.

మకరము లోనికి ఈడ్చుచుండగా, శక్తిహీనుడైన గజేంద్రుడు సర్వశక్తిమంతుడగు పరమేశ్వరునికి సంపూర్ణ శరణాగతు డగుచున్నాడు.

శా॥ లా వొక్కింతయు లేదు, ధైర్యమువిలోలంబయ్యె, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె, దనువున్‌డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుగ, మన్నింపం దగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

ఇది గజేంద్రుని నిరాశ్రయస్థితి. సంపూర్ణ శరణాగతి. మరణ కాలమున ప్రతి ఒక్కరు ఇలాగే నిరాశ్రయులై యుంటారు. కానీ గజేంద్రుని వలె ఎంతమంది శ్రీహరిని ప్రార్థించ గలరు? మరణకాలములో అందరూ ధ్యానించలేరు. అది పుణ్యాత్ములకే సాధ్యము. కనుక నిరంతరము పరమాత్మను ధ్యానించే పరిస్థితిని ఆంతర్యంలో కలిగియుండాలి.

గజేంద్రుని ప్రార్థన వైకుంఠమును చేరింది. ఆర్తితో సాగించిన భక్తి తప్పక అచ్యుతుని చేరుతుంది. శ్రీహరి గజేంద్రుని కరుణించాడు. భక్తుని రక్షించుకొఱకు ఉద్విగ్న మనస్కుడై బయలుదేరాడు. వైకుంఠ వాసులందరు విస్మయమొంది తిలకించుచున్నారు. విష్ణువు బయలుదేరాడు.

మ॥ సిరికిం జెప్పడు, శంఖచక్రయుగముం జేదోయి సంధింప, డే
పరివారంబును జీర దభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తరధమ్మిల్లము జక్కనొత్తడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడడు గజప్రాణావనోత్సాహియై.

భక్తుని రక్షించుటకు ఎవ్వరితోను చెప్పకుండా భగవంతుడు బయలుదేరాడు. ఆయన ననుసరించుచు లక్ష్మీదేవి బయలు దేరింది. ఆమె వెంట గరుత్మంతుడు కదిలాడు. అతనిని ధను వనుసరించింది. శంఖ చక్ర గదాదులు వెనుక పరుగులిడుచున్నాయి. వారి వెంట నారదుడు నడచెను. విష్ణువు ఎక్కడికి పయనించుచున్నాడో అడిగి తెలిసికొనుటకు లక్ష్మి ప్రయత్నించెను. కానీ ధైర్యము చాలదాయెను.

క॥ అడిగెద నని కడువడి జను నడిగిన దను మగడు నుడువడని వడ యుడుగున్
వెడవెడ సిడిముడి తడబడ నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్

శ్రీహరి ఋతుమంతమున అడుగిడెను. గజరాజు శ్రీహరిని దర్శించి శరణాగతుడై నమస్కరించెను. సరోవరమును సమీపించిన శ్రీనాథుడు సుదర్శనముచే మొసలియొక్క నోటిని జీల్చి గజేంద్రుని రక్షించెను. దేవతలు పూలవానను గురిపించిరి. స్వర్గమునుండి దేవతలు శ్రీహరిని స్తుతించిరి. శరణాగతుడైన గజేంద్రుని పరమాత్మ ఎలా ఉద్ధరించెనో, అలాగే శరణాగతులైన వారినందరిని రక్షించును. ఆశ్రయించదగినవాడు పరమాత్మయే గనుక సర్వులూ ఆ దివ్యాత్ముని ఆశ్రయించి తరించాలి. ఇచ్చట సుదర్శనమనగా చక్కని దర్శనము అని భావము. భక్తుడైన గజేంద్రుడు భగవంతుడైన హరిని, భగవంతుడైన శ్రీహరి భక్తుడైన గజేంద్రుని దర్శించుటయే ఇచ్చట సుదర్శన మనబడినది. ఇట్టి దర్శనములో సంసారభ్రాంతి నివృత్తియగును.

కరి మకరుల పూర్వ చరిత్ర

మృతిచెందిన మకరము గంధర్వుని రూపముతో ప్రత్యక్షమాయెను. పూర్వము "హూహూ" యనెడి నామముతో ఒక గంధర్వు డుండెడివాడు. అతడు స్త్రీలతో గూడి సరోవరములో స్నానమాచరించుచు విహరించుచుండెను. ఆ సమయముననే దేవల ఋషి గూడా స్నానమాచరించు చుండెను. ఋషివరుని గాంచి హూహూ పరిహసించు చుండెను. ఒక దశలో స్త్రీలను ఆనందింప జేయుటకు ఋషి పాదములనుబట్టి లాగెను. ఋషి గంధర్వుని ప్రవర్తనకు క్రుద్ధుడాయెను. మకరజన్మ మెత్తునటుల శపించెను.

అన్యులముందు తమ గొప్పతనమును ప్రదర్శించే ప్రయత్నములో కొందరు మనుజులు యతిపురుషులను గూడా అవమానించు చుందురు. అట్టివారు మొసళ్ళై పుట్టుదురు. మహాత్ములను కష్టపెట్టు వారికి భయంకరజన్మ ప్రాప్తించును. పెద్దలను గౌరవించువాడు లోకపూజితు డగును. పెద్దల నగౌరవపరచినవాడు హీనుడై జన్మించును.

అభి వాదన శీలస్య నిత్యం వృద్ధోప సేవినః
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశోబలమ్

"ఆచార్యునకు అభివాదనము చేయుచు, ప్రతినిత్యము పెద్దలకు సేవచేయువానికి ఆయుస్సు, విద్య, యశస్సు, బలము వృద్ధియగును" యని మనుస్మృతి చెప్పుచున్నది.

మునిశాపము నాలకించిన గంధర్వుడు దుఃఖితుడాయెను. మహర్షిని ప్రార్థించుచు శరణువేడెను. జాలిగుండెగల మహర్షి గజేంద్రునికి మోక్షము లభించు సమయమున గంధర్వుని శాపము తీరునట్లు అనుగ్రహించెను. ఒకరిని బాధించుట వలన కలిగిన దుఃఖము, మరొకరిని ఆనందింప జేయుటవలన తీరునని గ్రహించాలి. శ్రీహరి సుదర్శన చక్రముచే మకరి నోరును చీల్చగా "హూహూ" యనెడి గంధర్వుడు శాపవిముక్తుడై గంధర్వ శరీరమును ధరించెను.

"హూహూ" యొక్క పూర్వచరిత్రమును తెలిపిన శుకమహర్షి గజేంద్రుని యొక్క పూర్వచరిత్రమును కూడా తెలుపుచున్నాడు.

గజేంద్రుడు గత జన్మములో ఇంద్రద్యుమ్ను డనబడెడి పాండ్యరాజు. అతడు విష్ణు భక్తుడు. నిత్యము తపోధ్యానాదులచే తృప్తి చెందుచుండెడివాడు. ఒకనాడు అగస్త్యమహర్షి శిష్యగణముతో కూడి ఇంద్రద్యుమ్నుని వద్దకువచ్చెను. ఆ సమయానికి అంతర్ముఖుడై యున్న ఇంద్రద్యుమ్నుడు మహర్షిని గుర్తించలేదు. గౌరవించలేదు. లేచి నిలబడలేదు.

అగస్త్యముని ఆగ్రహమును బొందెను. తన మనస్సులో అనుగ్రహమునకు ఏ మాత్రము తావీయక "సాధువు నవమానించిన ఈ దురాత్ముడు ఏనుగువలె జడమతి యగుగాక! గజయోనిని పొంది గజేంద్రుడై జీవించుగాక" అని శపించెను. అగస్త్యుడు వెడలెను. ఇంద్రద్యుమ్నుడు గజమై జన్మించెను.

భగవద్భక్తులను అవమాన పరచినచో మందబుద్ధు లగుదురు. జంతుజన్మ నెత్తుదురు. భగవంతునికి చేసిన అపచారము తీరునేమోగాని గురువులకు చేసిన అపచారము వలన కలిగెడి కీడును ఎవ్వరూ తొలగించలేరు. శాస్త్రవచనములను వినండి.

బ్రహ్మ స్థానే కృతం పాపం విష్ణుస్థానే వినశ్యతి
విష్ణు స్థానే కృతం పాపం శివస్థానే వినశ్యతి
శివ స్థానే కృతం పాపం గురుస్థానే వినశ్యతి

"బ్రహ్మ స్థానమున చేసిన పాపమును విష్ణుదేవుడు పోగొట్టగలడు. విష్ణు సన్నిధిలో ఆచరించిన పాపమును శివుడు పోగొట్టగలడు. శివ స్థానమున చేసిన పాపమును గురువు పోగొట్టగలడు." మరి గురు స్థానమున చేసిన పాపమును ఎవ్వరు పోగొట్టగలరు? ఎవ్వరికీ సాధ్యపడదు గనుకనే శాస్త్రము ఆ విషయము నుదహరించలేదు.

శాప విషయము తెలిసిన ఇంద్రద్యుమ్నుడు ఇదంతయు పరమేశ్వరుని సంకల్పమని భావించెను. శ్రీహరి స్మరణయందే శేషజీవితమును గడిపెను. అందుచేత గజయోనిలో ప్రవేశించినను సకాలానికి భగవత్స్మృతి కలిగెను. ఏ సంకల్పమూ వృథాగాదు. కనుక ప్రతి ఒక్కరు కాలము కనికరించినపుడంతయు **"ఓం నమో భగవతే వాసుదేవాయ"** యనెడి దివ్య మంత్రమును పఠించు చుండవలెను.

ఈ "గజేంద్ర మోక్ష" మనెడి దివ్యచరితము శ్రోతలను పునీతమొనర్చును. అందు చేత ముముక్షువులు ఈ కథను పారాయణము చేయుచుందురు" అని శుకుడు పలికెను. ఈ గజేంద్రమోక్షము యొక్క ఫలశ్రుతిని అంతర్హితు డయ్యేముందు శ్రీహరియే తెలిపినాడని శుకబ్రహ్మ చెప్పుచున్నాడు.

సీ॥ నరనాథ! నీకును నాచేత వివరింప బడిన ఈకృష్ణామభావ మైన
గజరాజమోక్షణకథ వినువారికి యశము లిచ్చును గల్మషాపహంబు
దుస్స్వప్ననాశంబు దుఃఖసంహారంబు ప్రొద్దున మేల్కాంచి పూతవృత్తి
నిత్యంబు బఠియించు నిర్మలాత్మకులైన విప్రులకును బహువిభవ మమరు

తే॥ సంపదలు గల్గు బీడలు శాంతి బొందు సుఖము సిద్ధించు వర్ధిల్లు శోభనములు
మోక్ష మఱచేతిదై యుండు ముదము పేరు వనుచు విష్ణుండు ప్రీతుడై యానతిచ్చె.

"రాజా! హృషీకేశుడు ఈవిధంగా ఆనతిచ్చి పాంచజన్యమును పూరించి, బ్రహ్మాది దేవతలను సంతోషపరచుచు గరుత్మంతునిపై నెక్కి వైకుంఠమున కేగెను" అని శ్రీశుకుడనెను.

దేవాసుర సమాగమము

ఆఱవ మన్వంతరములో భగవానుడు అజితుడనెడి నామముతో జన్మించెను. సాగర మథనము గావించి అమృతమును వెలికిదీసెను. దానిని దేవతలచే త్రాగించెను. కూర్మరూపమును ధరించి మందరపర్వతమును వీపుపై ధరించెను.

శుకబ్రహ్మ ఇలా చెప్పగనే పరీక్షిత్తుడు ప్రశ్నించెను. "మహాత్మా! శ్రీమహావిష్ణువు పాల సముద్రమును ఎందులకు మథించెను? మందరపర్వతము నెందులకు ధరించెను? కూర్మముగా అవతరించవలసిన అవసరమేల కలిగెను? సముద్రము నుండి ఏ యే వస్తువు లావిర్భవించినవి? దయచేసి తెలుపుడు" అని ప్రార్థించెను. శ్రీశుకుడు చెప్పుట కుప క్రమించెను.

ఇంద్రుడు ఒకసారి విహరించుచుండగా దుర్వాస మహాముని జూచెను. దుర్వాసుడు ప్రేమతో ఇంద్రునకు పుష్పహారమును సమర్పించెను. ఇంద్రుడు దానిని గ్రహించెను. అలా గ్రహించుటలో భక్తికి బదులుగ అహంకారము చోటు చేసికొనెను.

మహాత్ము లనుగ్రహించిన దానిని ప్రసాదముగా స్వీకరించాలి. వారు దీవించి ఇచ్చెడి వస్తువులను భగవద్విభూతులుగా భావించాలి. సాధువులిచ్చిన వస్తువులను భక్తులు అమూల్యంగా దాచుకుంటూ ఉంటారు.

సురరాజు ననెడి గర్వముతో ఇంద్రుడు ఆ పూలమాలను ఏనుగు తొండముపైకి విసిరివేసెను. గజము పూలమాలపై బలమైన తన పాదము నుంచెను. సర్వశుభముల నొసగూర్చు పూలమాలను అలా పతనము చేయుటవలన ఇంద్రుడు దరిద్రు డగునని దుర్వాసుడు శాపము నిచ్చెను.

ధనగర్వముతో విఱ్ఱవీగుచు మహాత్ములను అవమానించువారు ధనహీనులై దరిద్రు లగుదురు. రాజు ధనహీనుడు కాగానే రాజ్యమే దారిద్ర్యమునకు నిలయమాయెను. సుర రాజ్యము దురదృష్ట రూపమును ధరించెను.

ఇంద్రుడు అహంకారియే కావచ్చు. కానీ సంయమ శీలురైన మహర్షులు శాపము లొసంగుట పాడియా? సాధువులు అక్రోధులు కానవసరము లేదా? యని కొందరు వాదించుచుందురు.

సమాజమును సరిజేయవలసినవారు సాధువులు. వారిలో స్వార్థముండదు. క్రోధము కలదు. బిడ్డను తండ్రి మందలించుట వెనుక యుండేది కాఠిన్యము కానేరదు. అది

కారుణ్యమే కాగలదు. కొన్ని సమయాలలో కాఠిన్యము వెనుక కారుణ్యమే దాగి యుంటుంది.

I must be cruel, only to be kind

"కారుణ్యమును జూపేందుకే నేను కాఠిన్యమును ధరింపవలసి వచ్చింది" యని హామ్లెట్ నాటకంలో షేక్స్పియర్ పలికిస్తాడు.

శ్రీ హీనులైన సురులు బ్రహ్మదేవుని సమీపించి ప్రార్థించిరి. దేవతలతో గూడి బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువును సమీపించెను. ఆదిదేవుని ప్రార్థించెను.

అవిక్రియం సత్య మనన్త మాద్యం గుహాశయం నిష్కల మప్రతర్క్యమ్
మనోఽగ్రయానం వచసా నిరుక్తం నమామహే దేవ వరం వరేణ్యమ్

"దేవా! నీవు క్రియా రహితుడవు, సత్య రూపుడవు, అనంతుడవు, ఆదిదేవుడవు, అంతరాత్మవు, నిరుపాధికుడవు, తర్కమునకు అతీతుడవు, మనస్సుకన్నా ముందు చరించువాడవు, వాక్కుల కందని వాడవు, సర్వశ్రేష్ఠుడవునగు నీకు నేను నమస్కరించు చున్నాను" అని బ్రహ్మదేవుడు శ్రీహరికి నమస్కరించెను.

మహాత్ముని అవమానపరచుట యనగా ఆ మహాత్మునిలోని మాధవుని అవమాన పరచినట్లే యగును. సాధు జనాశ్రయుడైన శ్రీమహావిష్ణువు అనుగ్రహమును పొందుటకు మొదట విష్ణురూపులైన మహాత్ములనే ఆశ్రయించాలి. వారి ద్వారా పరమాత్మ కృప లభించును. పరమాత్మను సేవించిన పిమ్మట సర్వులను సేవించిన తృప్తి, ఫలము లభించును.

క॥ మొదల జలమిడిన భూజము దుది నడుమను జల్లదనము దొరకొనుమాడ్కిన్
మొదలను హరికిని మ్రొక్కిన ముద మొందుదు మెల్ల వేల్పుమూకలు వేమన్.

"చెట్టుమూలమున నీరు పోసినచో, దానియొక్క కాండము, కొమ్మలు మొదలగు నవి కూడా చల్లబడి తృప్తిచెందును. అలాగే పరమాత్మ తృప్తిద్వారా సర్వభూత తృప్తి కలుగును" యని భావించుచు దేవతలు దేవదేవుని ధ్యానించిరి. పురుషోత్తముడు ప్రత్యక్ష మాయెను. బ్రహ్మదేవుడు ఆదిదేవు నిలా ప్రార్థించెను.

"దేవా! మథించుటవలన కొందరు కట్టెలయందు అగ్నిని వెలికి తీయుదురు. కొందరు గోవులనుండి పాలు తీయుదురు. మరికొందరు భూమినుండి ధాన్యమును పండింతురు. అలాగే పండితులు బుద్ధిద్వారా నిన్ను బొందుదురు. దావాగ్నిచే పీడితమైన గజములకు గంగాజలము లభించునట్లు, నీ దర్శనము మమ్ముల నానంద పరచినది. దేని గోరి మేము నీ పాదముల నాశ్రయించితిమో, దానిని నెరవేర్చుడు" యని ప్రార్థించెను.

బ్రహ్మదేవుని మాటల నాలకించిన శ్రీపతి ఇలా పలికెను: "మహాత్మా బ్రహ్మదేవా! మీకు శ్రేయము నొసగూర్చెడి నా వచనములను శ్రద్ధతో నాలకింపుడు. దేవతలు శ్రీయుతులయ్యేంతవరకు శుక్రాచార్యునిచే అనుగ్రహింపబడి యున్న రాక్షసులతో కలసి

మెలసి యుండక తప్పదు. సంధి చేసికోక తప్పదు. ఈ విషయమున మరొక ఆలోచన సముచితమైనది కానేరదు.

అరయోఽపి హి సన్ధేయాః సతి కార్యార్థ గౌరవే
అహి మూషిక వద్దేవా హ్యర్థస్య పదవీం గతైః

"దేవతలారా! అవసర మైనపుడు కార్యసిద్ధికై శతృవుతో కూడ సంధిచేసికొనక తప్పదు. ఫలితము సిద్ధించిన పిదప సర్ప మూషికములవలె శత్రుత్వమును ప్రదర్శింప వచ్చును."

"మీరు అమృతపానము చేయవలసిన అవసరమున్నది. అది తక్షణ కర్తవ్యమై యున్నది. క్షీరసాగరమున గుల్మ, తృణ, లత, ఓషధాదులను పడవేసి, మందర పర్వతమును కవ్వముగా ఉపయోగించి, వాసుకిని త్రాడుగా జేసికొని శ్రమలేనివారై మీరు పాలసముద్రమును మథింపుడు. మీకు నా సాయము లభించును. ఈ పవిత్రకార్యము ద్వారా మీకు ఫలము సిద్ధించును. దైత్యులకు దుఃఖము కలుగును. మీరు క్రుద్ధులై రాక్షసులను జయించలేరు.

న సంరంభేణ సిధ్యన్తి సర్వేఽర్థాః సాన్త్వయా యథా

"ఉపాయముచే సాధింపబడు కార్యములు క్రోధముతో సాధింపబడవు."

"క్షీరసాగర మథనములో బహిర్గతమయ్యే కాలకూట విషమును గాంచి భయపడకుడు. మథనములో బయల్వెడలిన వస్తువులపై ఆశలను వీడి, కోరికలకు దూరులై, క్రుద్ధులు గాకుండా యుండుడు" అని శ్రీహరి పలికెను.

దేవతలు దైత్యరాజగు బలిచక్రవర్తిని సమీపించినారు. యుద్ధమునకు విముఖులుగా యున్న దేవతలను గాంచి, వారిని వధించుటకు రాక్షసులు ఉద్యుక్తులైనారు. విరోచనుని పుత్రుడగు బలిచక్రవర్తి రాక్షసులను వారించెను. దేవరాజగు ఇంద్రుడు భాషించిన వచనములకు బలి సంతృప్తి చెందెను. అసురులు కూడా ముదమొందిరి. దేవ దానవుల మధ్య స్నేహము కుదిరెను. అమృతమును వెలికి దీయుటకు ప్రయత్నములు ప్రారంభమయ్యెను.

హృదయమనెడి క్షీరసాగరము నుండి శాంతియనెడి అమృతమును ఉత్పాదనము గావించుటకు పరస్పర విరుద్ధమైన భావాలను తొలగించుకోవాలి. రాగద్వేషాలు అంతరించినపుడే ఆనందముతో హృది పరవశించును.

దేవదానవులు కలసి మందర పర్వతమును పెల్లగించిరి. గొప్పశబ్దములు చేయుచు మందర పర్వతమును క్షీరసాగరము వద్దకు గొనిపోయిరి. గొప్పదైన ఈ పర్వతమును మోయలేక బలి, ఇంద్రుడు మొదలైన దానవ దేవ వీరులు సైతము అలసిపోయిరి. ఒకచోట ఆ పర్వతమును క్రిందబడవేయగా, దాని క్రిందపడి అనేక మంది దేవదానవ వీరులు హతులైరి.

సాధన సులభమైనదికాదు. అట్టి బరువైన బ్రతుకును సాగించే యత్నంలో అనేక మంది బలహీనులు రాలిపోతుంటారు. ఆటుపోట్లకు తట్టుకొనిన వారే ఆప్తకాములై నిలుస్తారు.

మెడలు విరిగి, తొడలుతెగి, నడుములు పట్టుదప్పి శిథిలావయవములతో రోదించుచున్న దేవదానవులను జూచి భగవానుడు వారిపై అనుగ్రహ దృష్టిని సారించెను. గరుడునిపై ఆసీనుడై వారిని సమీపించెను. తన అమృతమయదృష్టిని వారిపై సారించెను. వారు ఆరోగ్యవంతులైరి. శోకరహితులైరి.

సాధనలో ఎన్ని అవాంతరము లెదురైనను సాధనను ఆపకూడదు. సాధనను విడువక సాగిపోయే వారికి వచ్చెడి విఘ్నములను వాసుదేవుడే తొలగించును. అండయై నిలుచును. క్షణంలో బాధలను నివారించును.

భగవానుడు ఒకచేతితో అనాయాసముగ మందర పర్వతమునెత్తి గరుడునిపై ఉంచెను. తాను గరుడునిపై కూర్చుండి, సంతుష్ట చిత్తులైన దేవదానవులతో కూడి సముద్రమును చేరెను.

భక్తులకు కష్టమైన కార్యములను, వారికొరకై భగవానుడు అవలీలగ చేసిపెట్టును. వారి బాధ్యతలను తన బాధ్యతలుగా స్వీకరించును. వారి బరువులను తానే మోయును. అంతేకాదు, వారితోపాటు ఆనంద యాత్రను చేయును. ప్రారంభములో సాధకులు శ్రమించాలి. శ్రద్ధాభక్తుల చేత భగవంతుడు సంతృప్తి చెందగనే భక్తుల శ్రమలు అదృశ్యమౌతాయి. పరమాత్మ కృపా కటాక్షము సమస్త కార్యములను నిర్వహిస్తూ పోతుంది.

క్షీరసాగర మథనము

మందర పర్వతమును సాగర సమీపమున ఉంచి భగవంతునికి నమస్కరించి గరుడుడు వెడలిపోయెను. మందర పర్వతమును కవ్వముగా ఉపయోగించి మథించుటకు దేవ దానవులు నిర్ణయించుకొనిరి. మరి దానిని లాగుటకు త్రాడు కావలెను గదా! వాసుకి యనెడి నాగరాజుని ప్రార్థించిరి. వాసుకి ప్రత్యక్షమాయెను. వాసుకిని త్రాడుగా మందర పర్వతమునకు జుట్టిరి. సంతృప్త హృదయులై క్షీరసాగరమును మథింపసాగిరి.

శ్రీహరి వాసుకిని ముఖమునైపు పట్టుకొనెను. దేవతలందరు హరి ననుసరించి వాసుకి ముఖమును పట్టుకొనిరి. దైత్యులు విముఖులైరి. వాసుకి ముఖమును పట్టుకొనుటను ఘనకార్యమని భావించిరి. తోక భాగమును పట్టుకొనుటను అశుభముగా తలంచిరి. మంథన కార్యమును త్యజించి దూరంగా వెళ్ళి ఆసీనులైరి. అర్థరహిత, భావహీన ప్రతిపక్షముగా తయారైరి.

మ.కో॥ స్వచ్ఛమైన ఫణంబు మీరలు పక్క బట్టి మథింపగా
బుచ్ఛ మేటికి మాకు బట్టగ బూరుషత్వము గల్గి మే
మచ్ఛ మైన తపోబలాఢ్యయవాన్వయంబులవార మై
యిచ్ఛయింతుమె తుచ్ఛవృత్తికి నిండు మాకు ఫణాగ్రముల్.

అని పలికి మిన్నకుండిన అసురులను గాంచి, శ్రీహరి మందహాసవదనుడై వాసుకి పుచ్ఛభాగమును బట్టుకొనెను. దేవతలందరు శ్రీహరి ననుసరించిరి.

శుభకార్యాలలో అహంకారులు అడ్డుగోడలై నిలుస్తుంటారు. మర్యాదలు సరిగ జరుగలేదని వివాహ సమయాలలో కొందరు కినుక వహిస్తుంటారు. తనను గుర్తించలేదని, ఆలయ మర్యాదలతో ఆహ్వానించలేదని గుడిని చావడిగా కొందరు మారుస్తుంటారు. ఒక మంచిపనికి సహకరించడ మనేది పుణ్యకార్యము. ఆ మాత్రం పుణ్యంలేనిచో కనీసం విఘ్నములు కల్పించుటయన్నను మానేయాలి. ఎవరైతే మంగళ కార్యములకు ఆటంక ములను కల్గింతురో వారే రాక్షసులు.

తమోగుణ ప్రధానులైన రాక్షసులు భీష్మించుకోగా, సత్త్వగుణ శోభితులగు దేవతలు వాసుకి పుచ్ఛభాగమును పట్టుకొనుటకు సమ్మతించినారు. ఇరువైపుల దేవ దానవులు నిలబడి అమృతోత్పాదనమునకై పాలసముద్రమును చిలుకుటకు యత్నించిరి.

సాగరమథనము జరుగుచుండెను. బలాఢ్యులగు దేవదానవులు పట్టుకొని లాగు చుండినను, ఆధారము లేనందునను, అధికభారము వలనను మందర పర్వతము సముద్ర జలమున మునిగిపోయెను. అది గాంచి దేవ దానవులు దిగులు చెందిరి.

అపార శక్తిమంతుడైన భగవానుడు కచ్ఛప రూపమును ధరించి మునిగిపోవుచున్న మందర పర్వతమును పైకి ఎత్తెను. మందర పర్వతము పైకి లేచుచుండెను. దేవ దానవులు పున: ఉత్సావంతులై మథింప నారంభించిరి. భగవంతుడగు శ్రీహరి లక్షయోజనముల వైశాల్యముగల తన పృష్ఠ ప్రదేశమున మందర పర్వతమును ధరించెను. సురాసురులు మందరగిరిని అతివేగముగా త్రిప్పుచుండిరి. తన పృష్ఠ దేహమున బంతివలె తిరుగుచున్న ఆ కొండను భరించుచూ, దురదున్నచోట గోకు విధమున శ్రీహరి ఆనందముగా గన్పట్టుచుండెను.

ఆ సమయమున అసురులకు, సురులకు పరమాత్మ శక్తిని ప్రసాదించెను. బాధ తెలియక యుండులాగున వాసుకిలో నిద్రారూపమున ప్రవేశించెను. వాసుకి మొగము నుండి అగ్ని జ్వాలలు బయల్వెడలుచుండెను. శ్వాసలద్వారా అగ్నిజ్వాలలు బహిర్గతమగు చుండ, ఆ వేడిని భరించలేక కొందరు దేవతలు గూడా వైభవమును గోల్పోయిరి. ఈ విధంగా కుమిలిపోవుచున్న సురాసురులను గాంచి, దయామయుడైన శ్రీహరి తన యాజ్ఞచే మేఘములను వర్షింపజేసెను. సాగరపవనాలు చల్లగా వీచునట్లు చేసెను.

దేవదానవు లెంత ప్రయత్నించు చుండినను అమృతము లభించలేదు. అది గాంచి భగవానుడే స్వయముగా మథించుట కుద్యుక్తుడయ్యెను. ఈ విధముగ శ్రీహరి మథించు చుండగా దాని నుండి మొదట హాలాహల మనెడి భయంకరమైన విషము బహిర్గత మయ్యెను. దానిని జూచి భయకంపితులైన సర్వులు కైలాసమున కేగి సదాశివుని శరణు జొచ్చిరి. ప్రార్థించిరి.

సీ॥ భూతాత్మ! భూతేశ! భూతభావవరూప! దేవ! మహాదేవ! దేవవంద్య !
యాలోకములకెల్ల నీశ్వరుండవు నీవ బంధమోక్షములకు బ్రభుడ నీవ
యార్తశరణ్యుండ వగు గురుండవు నిన్ను గోరి భజింతురు కుశలమతులు
సకలసృష్టిస్థితి సంహారకర్తవై బ్రహ్మవిష్ణుశివాఖ్య బరగు దీవు
ఆ॥ పరమగుహ్య మయిన బ్రహ్మంబు సదసత్త మంబు నీవశక్తి మయుడ నీవ
శబ్దయోని నీవ జగదంతరాత్మవు నీవ ప్రాణ మరయ నిఖిలమునకు.

"పరమశివా! నీవు శరణాగత వత్సలుడవు. సృష్టి స్థితి లయ కారకుడవు. పరబ్రహ్మ రూపుడవు. నీ నుండియే శ్రుతులు కదలినవి. నీ లీలలు సర్వులకు అవగతము కానివి " యని ప్రార్థించిరి. హాలాహలమును పానము చేసి సర్వులకు భయమును పోగొట్టి, ఆనందమును కలుగజేయుటకు మహేశ్వరుడు నిర్ణయించుకొనెను. అప్పటికే విశ్వవ్యాప్తమై యున్న కాలకూట విషమును అఱచేతిలోనికి తీసికొని సదాశివుడు పానము చేసెను. అందుచేత పరమేశుని కంఠభాగము నీలివర్ణముతో శోభించినది.

యచ్చకార గలే నీలం తచ్చ సాధో ర్విభూషణమ్

సదాశివుని కంఠమున వెలసిన నీలివర్ణము ఆ దివ్యాత్మునికి భూషణమాయెను.

నీలకంఠుని త్యాగమయ కార్యమును గాంచి విష్ణుదేవుడు సంతసించెను. బ్రహ్మ, విష్ణు, మహేంద్రాదులు పరమశివుని స్తుతించిరి.

శివుడు విషమును పానముచేయు సమయమున అతని హస్తమునుండి కొన్ని విష బిందువులు జారినవి. ఆ విషపు బొట్లను తేళ్ళు, పాములు, విషపూర్ణ తీగలు, విషకీటక ములు పానము చేసినవి. అందుచేత ఈ క్షీరసాగర మథనము కథను విన్నవారు, అన్న వారు, వ్రాయువారు ఈ విషపురుగుల వలన దు:ఖింపరని శుకబ్రహ్మ చెప్పినాడు.

క॥ హాలాహలభక్షణకథ హేలాగతి విన్న వ్రాయ వెలమి, బఠింపన్
వ్యాళానలవృశ్చికముల పాలై చెడ రెట్టిజములు భయవిరహితులై.

నీలకంఠుని కృపచే గండము గడచినది. దేవ దానవులు మఱల క్షీరసాగరమును మథింప నుద్యుక్తులైరి.

భగవంతుని కథాశ్రవణము విషమును గూడా అమృతముగా మార్చును. విషయ ములే విషములు. విషతుల్యమైన ప్రాపంచిక విషయ వాసనాలోలురై పరితపించు జీవులు భగవానుని కథామృతమును పానము చేయుట కుద్యుక్తులైనచో విషము వారివి బాధించదు. అందుచేతనే పరమ భక్తులైన గోపికలు

తవ కథామృతం తప్తజీవనం కవిభిరీడితం కల్మషాపహమ్

కల్మషములను పోగొట్టి, తాపముల నుపశమింప జేసి, క్రాంతదర్శులైన మహాత్ము లచే స్తుతింపబడిన కృష్ణ కథామృతమును పరవశించి కీర్తించినారు.

అమృత దర్శనము

దేవ దానవులు మఱల క్షీరసాగరమును మథింప సాగిరి. కృషి సలుపువారికి దుర్భిక్ష ముండదని ఆర్యోక్తి. క్షీరసాగరము నుండి ప్రథమ ఫలముగా **"సురభి"** యనెడి ధేనువు లభించెను. ఆ గోమాతను మహర్షుల కొసంగిరి.

జీవితములో ఏ ప్రయోజనము కలిగినను దానిని భగవత్ప్రసాదముగ భావింపవలెను. ప్రసాదమును తొలుత ఇతరులకు సమర్పించి తదుపరి యజమాని అనుభవించాలి. క్షీర సాగర మథనమనెడి ఈ పవిత్ర కార్యంలో ప్రథమ ఫలంగా లభించిన ధేనువును మహర్షుల కివ్వడము జరిగింది.

ఉద్యోగి తన జీతము నుండి తన శక్తి ననుసరించి కొంత పైకమును తీసి పరోపకార మునకు వినియోగించాలి. వ్యాపారస్థులు కూడా అలాగే చేయాలి. ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులు, కర్షకులు సర్వులూ ఈ పుణ్యకార్యమును చేపట్టాలి. సమర్పణ భావము లేని వారు సమదర్శులు కాలేరు.

బీహారులో ఒక మహాత్ము డుండేవాడు. ఆయన స్థాపించిన సత్సంగము కూడా చక్కగా, ఆదర్శనీయముగా నడుస్తూ ఉంది. ఆ సత్సంగ సభ్యుడొకరు నాతో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలిపినాడు. సత్సంగ సభ్యులు "గురుసమర్పణ" యనెడి కార్యక్రమమును నిర్వహింపనిదే దైనందిన కార్యక్రమములను ప్రారంభించరట. వారి వారి స్థాయినుండి కొంత పైకమును, అది రూపాయి కావచ్చు లేదా పదిపైసలే కావచ్చు మొదట దానిని గురువు గారికి సమర్పించి, ఆ తరువాత తమ కార్యక్రమములలో నిమగ్న మౌతారట. ఇలా నిలువ జేసిన ధనమును సంవత్సరమున కొకసారి ఆశ్రమానికి పంపు తారట. తద్వారా ఆశ్రమములో అద్భుతమైన కార్యక్రమాలు చేపడుతారట.

ఎంతచక్కని సంప్రదాయము! సమర్పణ భావము సముజ్జ్వలమైనది. సాధకులు త్యాగభావముల నలవరచుకొని, సమాజానికి ఆదర్శప్రాయులై జీవించాలి.

ధేనువును మహర్షుల కొసగిరి. యజ్ఞములు నిర్వహించుటయే పవిత్ర కార్యముగా భావించు ఋషులు ఘృతాది పదార్థముల కొఱకై ధేనువును గ్రహించిరి. ప్రథమ సంపదగా లభించిన గోవును సర్వులు కలసి మహర్షుల కివ్వగా, సర్వుల కుపయోగపడు పవిత్ర యజ్ఞములకే సురభి యొక్క సంపదను ఉపయోగించుటకు ఋషులు నిర్ణయించిరి. పర స్పరావగాహనతో సర్వులూ లోకకళ్యాణానికి యత్నించినపుడే సమాజములో అభ్యుదయ ముదయించును.

గోమాత పవిత్రమైనది. ఎవరి గృహమునందు ధేనువుండునో వారికి సర్వసంపదలు సమకూరును. గోవులను పోషించేది పాలకొఱకు గాదు. పుణ్యముకొరకు. సత్త్వసంపదను వృద్ధి చేసికొనుటకు.

పుట్టగానే తల్లి బిడ్డకు పాలిస్తుంది. బిడ్డ పెరుగుతుంటే తల్లిపాలు తరిగిపోతాయి. మాత అందించలేని క్షీరమును గోమాత అందిస్తుంది. అందుచేత గోవును తల్లివలె పోషించాలి. ప్రతి గృహములో కనీసము ఒక్క గోవైనా ఉండాలి. ఇది చాలా పవిత్రమైన కార్యము. ఆవు పాలిచ్చుట లేదు యని కొందరు ఫిర్యాదులు చేస్తుంటారు. ఇంటిలో మరొక బిడ్డ పుడితే పోషించమా? ఆలోచించండి.

నేను ఒక గృహస్థునితో ఇలా అన్నాను: "గోవును పోషించడం కష్టముగా యున్నదని బాధపడుతున్నావు. ఒక్కొక్కసారి మృతిచెందిన తల్లిని తలచుకొని దు:ఖిస్తుంటావు. మీ అమ్మే ఈ గోవు రూపంలో ఉందని ఎందుకు భావించవు?" అన్నాను. ఆనాటి నుండి అతడు ఆనందముతో గోమాతను పోషించుచున్నాడు.

గోసంరక్షణ ప్రథమ కర్తవ్యంగా గృహస్థులు భావించాలి. పుణ్యకార్యాలలో జమా ఖర్చులు బేరీజు వేయడం మంచిదికాదు. మన ఆశ్రమంలో ఇరువదికి పైగా గోవులున్నాయి. అప్పుడప్పుడు భక్తులు పంపే గ్రాసాదులను ప్రక్కనుంచితే, నెలకు నాలుగైదువేల రూపాయలు గోశాలపై ఖర్చవుతుంది. ఆశ్రమానికి ఎక్కువశాతం పాలను పాలశీతల కేంద్రము నుండియే కొంటూ ఉంటారు. ప్రతి గృహస్థుడు కనీసము ఒక్క గోవునైనా పోషించగలిగితే, ఈనాడు దారుణంగా జరిగే గోవధను నిషేధించవచ్చు. వికృత ప్రభుత్వాలు విఫల ప్రయత్నాలు చేయునపుడు ప్రజలే సఫలులై ఆదర్శాన్ని రూపొందించాలి.

క్షీరసాగరమున మొదట సురభి లభించింది. తరువాత **"ఉచ్చైశ్శ్రవ"** మనెడి చంద్ర కాంతిని బోలు గుఱ్ఱము లభించినది. ఇంద్రుడు దానిని గ్రహించుటకు ఉత్సాహపడెను. కానీ రాక్షసులు దానిని వాంఛించిరి. భగవంతుని సూచన ననుసరించి ఇంద్రుడు తన ప్రయత్నమును విరమించుకొనెను. దైత్యులు దానిని గ్రహించిరి.

ఉచ్చైః శ్రవః కీర్తి ర్యస్య ఉచ్చైశ్శ్రవాః

"గొప్పదియైన కీర్తి గలది ఉచ్చైశ్శ్రవ" మని అర్థము.

అసురులు ఉచ్చైశ్శ్రవమును వాంఛించిరి. కీర్తిదాహము చాలా చెడ్డది. కీర్తి దాహంతో అలమటించు వారు అమృతపానము చేయలేరు. కనుక జయింపను వీలుపడని కీర్తి విషయంలో సాధకులు జాగరూకులై మనగలగాలి. ఇంద్రియాలను, మనస్సును స్వాధీన పరచుకొని జీవించాలి. అందుచేతనే ఇంద్రుడు అశ్వమును పొందుటకు ఉత్సాహపడగనే భగవంతుడు వద్దని వారించెను. శుద్ధబుద్ధి గలవారు ఇంద్రియములను అరికట్ట గలరు.

సాధకు లందరు ప్రారంభములో ఉత్తములుగనే ఉంటారు. కాలం గడచే కొలది కీర్తికాంక్ష వృద్ధి చెందుతుంది. సమస్యలకు అక్కడే పునాది ఊయి పడుతుంది. కీర్తికాంక్ష యనెడి రాక్షసి యొక్క కోఱలలో చిక్కినవారు సంఘాలను ఛిద్రంచేస్తారు. గురువులను ధిక్కరిస్తారు. విషప్రచారాలు సాగిస్తారు. బ్రతుకునే పాడుచేసికొని దు:ఖభాగుల కోవలో చేరుతారు. కీర్తి వాంఛించి పొందదగినది కాదు. జీవించి అందుకోదగినది.

తదనంతరము శుభ్రవర్ణముగల **ఐరావతము** ఆవిర్భవించెను. అది ఇంద్రుని కొసంగబడెను. ఐరావతమును పోగొట్టుకొనిన దైత్యులు ఉచ్చైశ్శ్రవమును గ్రహించినందులకు పశ్చాత్తాపము నొందిరి. కీర్తికాముకులకు దీప్తి లభించదు. ఐరావతమనెడి శ్రేష్ఠమైన ఏనుగు ఇంద్రుని వాహన మాయెను.

ఇరా ఆపః అస్మిన్ సంతీతి ఇరావాన్ సముద్రః తస్మిన్ జాతః ఐరావతః

ఇరములనగా జలములు. వాటిని కల్గినవాడు సాగరుడు. అట్టి సముద్రము నుండి పుట్టిన దగుటచే దానికి ఐరావతమనెడి పేరు కలిగినది యని అమరకోశము నుడివినది.

ఏనుగు ప్రతి సూక్ష్మ వస్తువును గ్రహించును. ఏనుగు తన తొండము ద్వారా పెద్ద పెద్ద వృక్షములను పెకలించును. అలాగే సూదివంటి చిన్నవస్తువులను కూడా గ్రహించును. అణువులోను, మహత్తులోను నిండియున్న పరమాత్మను గ్రహించుటకు సూక్ష్మదృష్టి అవసరము. ఏనుగు సూక్ష్మదృష్టికి సంకేతము. సూక్ష్మదృష్టిని పొందినవారే అమృతమును పానము చేయగలరు.

తదనంతరము **కౌస్తుభమణి** ఉద్భవించెను. దానిని శ్రీహరి గ్రహించెను. తరువాత దివికి అలంకారమగు **పారిజాతమను** వృక్షము పుట్టెను. ఈ సందర్భమున శ్రీశుకుడు పరీక్షిత్తుని ప్రశంసించెను. "రాజా! అర్థితులైన వారి వాంఛలను దీర్చి సర్వులను నీవు సంతోష పెట్టు లాగున, ఈ దేవతరువు గూడ కోరినవారి యభిలాషలను దీర్చుచుండును" అనెను.

ఆ తరువాత **అప్సరసలు** ఆవిర్భవించిరి. తదుపరి భగవత్సేవా పరాయణము, విశ్వము నానందింప జేయునదియునగు **లక్ష్మీదేవి** దివ్య ప్రకాశముతో ఆవిర్భవించెను. ఆమె రూప వైభవములను గాంచి సర్వులు సమ్మోహితులైరి. ఆమె సౌందర్యము వర్ణింప నలవి గాకుండెను.

క॥ కెం పారెడు నధరంబును జం పారెడి నడుము సతికి శంపారుచులన్
సొం పారు మోము గన్నులు బెం పారుచునొప్పు గొప్పపిఱుదును గుచముల్.

ఆమెకు మంగళ స్నానము చేయించుటకు ఇంద్రుడు మణిమయ సింహాసనమును దెప్పించెను. దేవకన్యలు పవిత్ర కలశముల ద్వారా పవిత్ర జలములను దెచ్చిరి. భూదేవి పల్లవముల నందించెను. గోవులు పంచగవ్యముల నిచ్చెను. మహర్షులు మంత్రములు పలుకుచుండిరి. మేఘములు పణవ గోముఖ కాహళ పటహ మురజ శంఖ వల్లకీ వేణు నిస్వనములను మ్రోగించెను. గంధర్వులు పాడిరి. నాట్యాంగనలు ఆడిరి. దివ్యముగా అభిషేక కార్యము పూర్తియయ్యెను.

సాగరుడు పచ్చని పట్టువస్త్రముల నిచ్చెను. వరుణుడు వైజయంతీమాల నిచ్చెను. విశ్వకర్మ కాంచన కేయూర కటకాదులను, విచిత్రములైన అలంకారముల నొసంగెను. వాణి హారము నొసగెను. వాణీపతి పద్మము నిచ్చెను. నాగులు చెవిపోగుల నిచ్చిరి. సిరికి అందరూ దాసులే.

సర్వలక్షణ శోభితయగు లక్ష్మీదేవి తనకు ఆశ్రయమిచ్చువాడెవరా? యని ఆలోచింపసాగెను. దుర్వాసాది మహర్షులు తపోధనులైనను క్రోధహరులు గారు. దేవతలు క్రోధమును జయించిరి గాని కామమును జయింపలేక పోయిరి. ధర్మాత్ములైన పరశురామాదుల యందు ఆశించినంతగ కరుణ గోచరింపదు. ఇలా ఆలోచించిన లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువే తనకు తగినవాడని భావించెను.

"జరామరణంబులు లేనివాడైనందున నేను నిత్యసుమంగళినై యుందును. సవతులు లేని కారణమున సరిపడి యుండగలను. శృంగార చందన శీతలుడైన ఈ దివ్యపురుషుడు విశ్వమందిరములో నివసించును. దయామయుడు. కారుణ్యమూర్తి యైనందున కలహ ముండదు. మాటతప్పడు. మగువల వెంటబడడు. నిలుకడ గలవాడు. నిఖిలలోక పూజితుడు. అరిషడ్వర్గముల నంతమొందించినవాడు. సాధురక్షకుడైన ఈ మహితాత్ముడే నాకు నాథుడు" యని భావించి శేషశాయిని సమీపించెను. శ్రీహరి లక్ష్మీదేవికి ప్రసన్నుడై ఆమెను యెదపై నుంచుకొనెను.

క॥ ఇందీవరదామమున ముకుందుని బూజించి తనకు గూడి వసింపన్
మందిరముగ దద్వక్షము నందంద సలజ్జదృష్టి నాలోకించెన్.

సిరికి సరియైనవాడు హరియే. దరిజేరిన సిరిని హరి వీక్షించగనే సిరి చూపు మార్చెను. హృదయానందముతో సిరి హరిని దర్శింపగనే హరి దృష్టిని ప్రక్కకు త్రిప్పుకొనెను.

క॥ హరి సూచిన సిరి సూడదు సిరి సూచిన హరియు జూడ సిగ్గున బొందున్
హరియును సిరియును దమలో సరిజూపుల జూడ మరుడు సందడి వెట్టెన్.

హరి లేని సిరి బ్రతుకుకు ఉరియే. హరి లభించిన వానికి సిరి సంపద కాగలదు. హరిలేని వానికి సిరి ఆపదయే. లక్ష్మి చేరవచ్చును. కానీ లక్ష్యము దూరము గాకూడదు.

లక్ష్మీనారాయణుల సమాగమమును గాంచి సర్వులు సంతసించిరి. దానవులు అసంతృప్తిని బొందిరి. ధనము కొఱకు దుఃఖించువారు దానవులు. ధనముపై ఆపేక్ష లేనివారు దేవతలు. ధనమున్నను ఘనమని భావింపనివారు అమృత స్వరూపులు.

సముద్ర మథనము మఱల ఆరంభమాయెను. **వారుణియను కన్య** ఉద్భవించగా ఆమెను రాక్షసులు గ్రహించిరి. అటుపిమ్మట క్షీరసాగరము నుండి అమోఘ భరితుడు, అద్భుత చరితుడునగు ఒక మహాత్ముడుదయించెను. అతడే **ధన్వంతరి.** విష్ణ్వాంశ సంభూతుడు. ఆయుర్వేద శాస్త్రవిదుడు. అతడు **అమృత కలశమును చేబూని** యరుదెంచెను. దానిని దానవులు హరించిరి. దేవతలు దిగ్భ్రాంతి చెందినవారై శ్రీహరి నాశ్రయించిరి.

శ్రీహరి సురులను ఓదార్చెను. దుర్మార్గుల విషయమున శక్తి కంటెను యుక్తియే ఎన్నదగినది యని చెప్పి ఆదిదేవుడు దానవులను సమీపించెను.

అహం పూర్వ మహం పూర్వం నత్వం న త్వం

"నేను ముందు, నేను ముందు, నీవు గాదు, నీవు గాదు" యనెడి కేకలు వినబడెను.

ధన్వంతరి నుండి గ్రహించిన అమృతమును "నేను ముందు పానము చేయాలి, నేను ముందు పానము చేయాలి" అని అసురులు కలహించు కొనుచుండిరి. కలహ ప్రియులు అదృష్టహీనులు. అమృత పానమునకు అర్హులు గారని విష్ణువు గ్రహించెను.

దానవులు అమృతమును బొందిరి. కానీ పానము చేయలేకపోయిరి. కొందరికి భాగ్యములుండునే గాని భోగము లుండవు. అందిన దానిని అనుభవించలేనివారు అయోగ్యులు. నిజానికి వారే అభాగ్యులు.

సర్వులకు సంబంధించిన దానిని తనదని భావించు వారే రాక్షసులు. "నేను ముందు" యనెడి మందభాగ్యుని బ్రతుకులో అందము నిలువదు. ఆనందము మిగలదు. "నేను ముందు" యనెడి విషపు మందును మ్రింగిన వానికి మరణమే శరణ్యము. మృత జీవిగా మహిలో చరించుచుండును.

"అహం పూర్వ" మనే ఈ రాక్షస భావము ఈనాడు ఆధ్యాత్మిక జీవనము గలవారిలో గూడ చోటు చేసుకున్నది. సాధు సంఘాలలో గూడ ఇది శోభిస్తున్నది. "మైకులో నేను ముందు మాట్లాడాలి" అని కొందరు. "ముందుగా నేను సంకీర్తన చేయాలి" అని మరి కొందరు. "ముందుగా నన్ను గౌరవించాలి, పెద్ద అక్షరాలతో ముందు నా పేరుండాలి" అని ఇంక కొందరు. ఇదీ వరుస. రాక్షస భరోసా.

ఆధిపత్యము లాశించువారికి మిగిలేవి అగచాట్లే. ఇక్కట్లే. అసురులు పరస్పరము కలహించుకొనిరి. తత్ఫలితముగా అమృతమును పోగొట్టుకొనిరి. ఆస్తి పంపకములో ఏ గృహమునందు కలహము ప్రారంభమగునో వారు సంపదలను పోగొట్టుకొందురు. న్యాయ వాదులు లబ్ధిబొందుచుందురు. న్యాయవాది వాదిస్తుంటాడు. ఫిర్యాది రోదిస్తుంటాడు. దానవుల స్థితి గూడా అలాగే వుంది. వారూ న్యాయస్థానము ముందు నిలువక తప్పలేదు.

అమృతమును దేవతలకు ఖాయము చేయుటకు న్యాయాధీశుడగు నారాయణుడు జగన్మోహనాకారు డయ్యెను. పరమాద్భుతమైన నారీరూపమును ధరించి శోభించెను.

సీ॥ పాలిండ్లపైనున్న పయ్యెద జాఱించు జాఱించి మెల్లన జక్కనొత్తు
దళ్కు దళ్కను గండఫలకంబు లొలయించు నొలయించి కెంగేల నుజ్జగించు
గటుమెఱుంగులు వాఱు కడకన్ను లల్లార్చు నల్లార్చి ఱెప్పల నండగొలుపు
నవరసదరహాసచంద్రిక జిలికించు జిలికించి కెమ్మోవి జిక్కుపఱచు

తే॥ దళితధమ్మిల్ల కుసుమగంధమ్ము వెఱపు
గంకణాదిఝణంకృతుల్ గడలుకొలుపు
నొడలికాంతులు పట్టులే కులుకబాఱు
పన్నవలిపంపు బయ్యెద సొకళింప.

ఈ విధముగా జగన్మోహనదేవత శోభించగా, రాక్షసు లామెను గాంచి మోహితులైరి.

అమృత వితరణము

రాక్షసులు అమృతమును గ్రహించుటకై పరస్పరము కలహించుకొనుచుండిరి. ఇంతలో నవ యౌవనాంగియగు యువతి వారిని సమీపించెను. అసురు లామెను జూచిరి. ఆమె అందమును గాంచి పిచ్చివారైరి. మతులను పోగొట్టుకొనిరి. గతులను విస్మరించిరి. "ఆహా! ఏమి లావణ్యము? ఏమి మాధుర్యము?" అని పలుకుచూ ఆమె దరిజేరిరి.

కాత్వం కంజ పలాశాక్షి కుతో వా కిం చికీర్షసి
కస్యాసి వద వామోరు మథ్నన్తీవ మనాంసి నః

"పద్మ పలాశలోచనా! నీ వెవరు? ఎక్కడ నుండి వచ్చితివి? నీ వెవరి దానవు? నిన్ను గాంచిన పిదప మా మనస్సు పట్టు తప్పుచున్నది" అనిరి.

ఇది రాక్షసపద్ధతి. దారిన బోవు అపరిచిత వనితతో పరాచకాలాడువారు దైత్యులు. పరస్త్రీ వ్యామోహము రాక్షసుల లక్షణము. బస్‌స్టాప్‌ల వద్ద, రైల్వేప్లాట్‌ఫారాల మీద, సినిమాహాళ్ళ వద్ద, షోరూంల దగ్గర ఇప్పటికీ ఈ దైత్య వాలకములు వాలము లాడిస్తూ చరిస్తూనే ఉన్నాయి. అందమైన స్త్రీ కనుపించగనే "మీరెవరు?"**(కాత్వం)** అని ప్రశ్నించడం, ఎక్కడనుండి వచ్చారు? ఇత్యాది వివరాలు సేకరించడం, తదనంతరము "మీరు చెప్పింది బావుంది. మీరు చూపింది బావుంది" **(కంజపలాశాక్షి)** యంటూ చౌకబారు పొగడ్తలు, తరువాత మతి చలించడం, గతి క్షీణించడం ఇదే గదూ మోహినిని చూడగనే రాక్షసులు చేసిన నిర్వాకము!

మోహిని బాధించదు. మోహము బాధిస్తుంది. మోహము మనస్సులో నున్నదే గాని మహిలో లేదు. మోహినిని వాంఛించువారికి అమృతము లభించదు. మోహమునకు గురియగు వారికి అమృతత్వము సిద్ధించదు.

అందము దృశ్యములో లేదు, దృష్టిలో ఉంది. విషయములో లేదు,చిత్తములో ఉంది. ప్రపంచము మోహనాకారముగా గోచరించినచో మనస్సులో మోహమున్నదని భావము. ఎవరి దృష్టి జ్ఞానమయమో వారిని మోహము బంధించలేదు. అంతవరకు సాధకుడు జాగరూకుడై యుండవలెను.

అసంభాషేత్ స్త్రియా కాంచి త్పూర్వదృష్టాం చ న స్మరేత్
కథాం చ వర్జయే త్తాసాం న పశ్యే ల్లిఖితా మపి

"స్త్రీతో ముచ్చటించుట, గతంలో చూసిన స్త్రీని గుర్చి తలపోసుకొనుట, స్త్రీల విషయముల నాలకించుట, వారి చిత్రములను దర్శించుట త్యాజ్యము" అని నారద పరివ్రాజకోపనిషత్తు హెచ్చరించినది.

దానవులు మోహినిని స్తుతించుటలో అలసట నొందలేదు. వారి పొగడ్తలు నదీ ప్రవాహమువలె నుండెను. మోహపైత్య మధికమగుట చేత ఉన్మాద కవిత్వము పొంగి పొఱలెను.

"దేవీ! నిన్ను సురులు గూడ పొందలేరు. ఏమి నీ కనుబొమ్మలు! మా కళ్ళలోనికి బొమ్మలను ప్రవేశింపనీయ కున్నవి. ఆహా! సృష్టికర్త ఎంత కరుణామయుడు! మా దృష్టిని ఫలప్రద మొనర్చుటకు నిన్ను సృష్టించెను.

సా త్వం నః స్పర్ధమానానా మేక వస్తుని భామిని
జ్ఞాతీనాం బద్ధవైరాణాం శం విధత్స్వ సుమధ్యమే

"భామినీ! సుమధ్యమా! ఒక వస్తువును గూర్చి మేము పరస్పర స్పర్ధలతో బద్ధ శత్రువులమై యున్నాము. మేము జ్ఞాతులము. నీవు మాకు శుభమును చేకూర్చుము" యనిరి.

కులప్రసక్తి యందు ఆసక్తి గలవారు అసురులు. కులరొంపిలో జిక్కుకొనిన వారికి అనుకూల జీవనము అవగతము గాదు. కులాలు కుటిల జీవనానికి పునాదులు. మాలిన్యానికి ప్రతిరూపాలు.

కలహమును నివారించి, అమృతమును వితరణము గావింపుమని కలశమును దైత్యులు కన్యచేతిలో పెట్టిరి. దురదృష్టవంతులు లభించిన దానిని పరులకిచ్చి దుఃఖిస్తుంటారు. పెరిగే వడ్డీని చూస్తారే గాని విరిగే నడ్డిని పట్టించుకోరు.

మోహినీ రూపమును ధరించియున్న శ్రీహరి భగవానుడు అసురుల మాటల నాలకించి ఇట్లనెను:

"కశ్యప తనయులారా! మీరు ప్రాజ్ఞులు. విజ్ఞులు. నేను కామినిని. నన్ను కామించుట విజ్ఞులకు భావ్యము గాదు. మర్కటములు, జంబుకములు, శునకములు సదా నూతన మైత్రిని వాంఛించునట్లు, స్వేచ్ఛను బొందిన కామినులు చరించుచుందురు. అట్టివారి స్నేహము అభిలషణీయము గాదని పండితులు పలుకుచుందురు.

క॥ పలుకులు మధురసధారలు దలపులు నానాప్రకార దావానలముల్
సెలుములు సాలావృకములు సెలువల నమ్ముటలు వేదసిద్ధాంతములే.

"దైత్యులారా! మీరు కోరినందున నేను అమృతమును మీకు వితరణ జేయు చున్నాను. నేను వగలెరుగను. వంచన నెరుగను. అమృత విభజనము నందు మంచి జరిగినను, చెడు జరిగినను మీరు భరించవలసి యుండును. లేనిచో నేను సుధను పంచ లేను" యని పలికెను.

ఆమె వాక్కులు అసురులకు అమృతము కన్నను మధురముగా యుండెను. మోహము కన్నను తీపియగు వస్తువు మరొకటుండునా? మోహిని చెప్పిన దానిని వారా మోదించిరి.

సురాసురులు స్నానము లాచరించి దర్భాసనములపై ఆసీనులైరి. అమృత కలశమును దీసికొని జగన్నాథుడు జగన్మోహినీ రూపమున యరుదెంచెను. ఒక్క క్షణ మాలోచించెను. రాక్షసులు అహంకారులు. వారికి అమృతము లభించినచో, ఆ తరువాత వారి పాపకృత్యములకు అంతముండదు. కనుక వారికి అమృతము నివ్వకూడదని భావించెను.

అసురాణాం సుధా దానం సర్పాణా మివ దుర్నయమ్

"రాక్షసులకు అమృతమును ప్రసాదించుట పాముకు పాలుబోయుట వంటి" దని శ్రీహరి భావించెను.

క్రూరులను, పాపులను పరమాత్మ కరుణించడు. వారికి అమృతము నివ్వడు. కనుక పాపకార్యములను విడనాడి, పుణ్యవంతులై జీవించువారు పరమాత్మ కృపకు పాత్రులై, అమృతపానము జేసి అమరులయ్యెదరు.

జగన్మోహినీ రూపుడైన శ్రీహరి దేవ దానవులను వేఱువేఱు వరుసలలో కూర్చుండ బెట్టెను. పుష్పిత వాక్కులచే అసురులను సంతోష పరచుచు, అమృతమును దేవతలకు పంచిపెట్టుచుండెను.

"కలశమునందు పైనున్న అమృతము నీళ్ళవలె యున్నది. దానిని దేవతలకు పోయు చున్నాను. క్రింది భాగమున నిలచియున్న మధురమైన అమృతమును మీకు పోసెదను" అని రాక్షసులతో మాయా మానుష విగ్రహుడు పలికెను. దానవులు ఆమె వాక్కులచే మోహితులై అమితానందము నొందిరి. కాదనినచో ఆమె ప్రేమ దూరమగునేమో యని భావించి, దేవతలు సుధాపానమును చేయు దుర్భర కార్యమును సంయమనముతో వీక్షించసాగిరి.

బలహీనత బరువు నెరుగదు. స్త్రీలపై నున్న మోహముతో అనేక మంది వారు చెప్పినట్లు ఆడి, ఆవేదనలకు గురియవుతుంటారు. మోహిని దేవతలకు అమృతమును పోయుచుండెను. రాక్షసుడైన రాహువు రహస్యమును గ్రహించెను. మోహిని అసురులను మోసముచేసి దేవతలకు పీయూషము నందించు చున్నదని గుర్తించెను. అతడు కూడా దేవరూపమును ధరించి, సురుల వరుసలో కూర్చొనెను. సూర్యచంద్రులకు అమృతము పోయు సమయమున రాహువు వచ్చి కూర్చొనెను. అతనిని సూర్యచంద్రులు గ్రహించిరి. శ్రీహరికి తెలిపిరి.

శ్రీహరి రాహువుకు కూడ అమృతమును పోసెను. భోజన పంక్తిలో భేదము పాటింప కూడదు. అది మహాదోషము. అందుచేత శ్రీహరి రాహువుకు గూడా సుధను పోసెను. కొందరు పంక్తిలో భుజించునపుడు గోత్రము చెప్పలేదని పంక్తినుండి లేపి బయటికి పంపుచుందురు. కొందరు ఆరగించు విధానములో తమదైన మార్గమును అనుసరించ నందున అతడు తమ వర్ణమువాడు గాదని భావించి, అతనిని పంక్తినుండి బహిష్కరించు చుందురు. ఇలాంటివారు పరమాత్మ దృష్టిలో దోషులగుదురు. పంక్తిలో భేదము చూచు వారికి **"సంగ్రహణి"** యనెడి వ్యాధి వచ్చునని బుధజనులు చెప్పుదురు.

శ్రీహరి రాహువునకు అమృతమును పోసెను. అతడు పానము చేయునపుడు కంఠము నుండి క్రిందికి దిగక మునుపే అతని శిరస్సును ఛేదించెను. అమృతముచే తడుపబడినది యైనందున అతని శిరస్సు నశింపకుండెను. బ్రహ్మదేవుని కృపచే ఆ శిరస్సు గ్రహరూపమున నిలచెను. అదియే రాహుగ్రహము. ఇప్పటికి కూడా పూర్ణిమ, అమావాస్య తిథులయందు రాహువు చంద్ర సూర్యుల నైపు పరుగులిడుచుండును.

రాహువు సూర్యచంద్రుల మధ్యన ఆసీనుడాయెను. చంద్రుడు మనస్సునకు అధిష్ఠాన దేవత కాగా, సూర్యుని వలన బుద్ధి ప్రకాశించుచున్నది. వాసనా రూపమైన రాహువు సూర్యచంద్రుల ప్రక్కన కూర్చుని, వారికి అమృతమును ప్రసాదింపనీయక అడ్డు వడును. మనోబుద్ధులు పరమాత్మను ధ్యానించి తరించునపుడు విషయవాసనలు మధ్యలో ప్రవేశించి ధ్యానమును భగ్నమొనర్చును. శ్రీహరి సుదర్శనముచే రాహువును ఖండించినట్లు, జ్ఞానము ద్వారా వాసనను నశింపజేయవలెను. వాసన లంతరించగనే జీవులు అమృతరూపు లగుదురు.

ధ్యానతో హృదయాకాశే చితి చిచ్చక్ర ధారయా

"హృదయాకాశమున ధ్యానమగ్నుడవై, జ్ఞాన మనెడి చక్రము ద్వారా చిత్తమును ఛేదింపుము" యని మహోపనిషత్తు ప్రవచించినది.

సురులకు అమృతమును పోసిన పిదప అసురుల ఎదుటనే శ్రీహరి తన నిజ రూపమును ప్రకటించి ప్రదర్శించెను. గరుడ వాహనము నెక్కి వైకుంఠమున కేగెను. సురాసురులు ఏకమై క్షీర సాగరమును మథించినను, అమృతమును ఇరువురు పానము చేయలేకపోయిరి. కారణమేమి? దీనికి వ్యాస భాగవతము చక్కని సమాధానము నొసగినది.

ఏవం సురాసుర గణాః సమదేశకాల హేత్వర్థ కర్మ మత యోఽపి ఫలే వికల్పాః
తత్రామృతం సురగణాః ఫలమంజసాపు ర్యత్పాద పఙ్కజ రజః శ్రయణాన్న దైత్యాః

దేశము, కాలము, హేతువు, అర్థము, కర్మ, మతి ఇవి ఇరువురికి సమానమైనను ఫలము భిన్నమాయెను. భగవానుని చరణకమల రేణువుల నాశ్రయించుటచేత సురులు అమృతమును పానముచేసిరి. భగవచ్చరణారవిందములను ఆశ్రయింపక పోవుటచేత అసురులు అమృతమునకు దూరులైరి.

సమస్త కర్మల యొక్క ఏకైక ఫలమును మూఢులు గాంచలేరు. పరమ పురుషార్థమైన మోక్షమును గ్రహింపలేరు. సంసారమును వృద్ధిపరచు కొనుటకు, భార్యాపుత్రులను సంతోష పరచుటకు శ్రమించుచుందురు. ఇది యంతయు మూలమును వదలి ఆకులపై నీరు చల్లుట వంటిది. శాఖలను తడుపుట వంటిది. మూలమును నీటితో తడుపగనే చెట్టు పచ్చదనముతో శోభించి, ఫలముల నొసంగును. చెట్టు యొక్క మూలమును తడుపగనే వృక్షమంతయు శోభను సంతరించుకొనునట్లు, పరమాత్మను శాంతింప జేయగనే పర్వులు సుఖముల ననుభవించెదరు. శుభములను బడసెదరు. ఈ సత్యమును గ్రహించలేని జనులు సంసారమే సమస్తమని భావించి దుఃఖములకు లోనగుచుందురు.

దేవదానవ యుద్ధము

అమృతపానము జేసిన దేవతలపై క్రుద్ధులైన దానవులు అస్త్రశస్త్రములను ధరించి వారిపై యుద్ధమునకు వెళ్ళిరి. అసురసేనకు విరోచన నందనుడగు బలిచక్రవర్తి సారధ్యము వహింపగా, సురసేనకు మహేంద్రుడు నాయకత్వము వహించెను. ఉభయ

సైన్యములు రెండు సాగరముల వలె గోచరింప సాగినవి. రణరంగ మంతయు భయంకర ధ్వనులతో నిండిపోయెను.

క॥ భేరీభాంకారంబులు వారణఘీంకారములును వరహరిహేషల్
భూరిరథనేమిరవములు ఘోరములై పెల్లగించె గులశైలములన్.

బలి ఇంద్రునితో పోరాడుచుండెను. తారకాసురునితో కార్తికేయుడు తలపడెను. వరుణుడు హేతి నెదుర్కొనగా, సూర్యుడు ప్రహేతితో పోరాడెను. కాలనాభితో యముడును, మయునితో విశ్వకర్మయును, రాహువుతో చంద్రుడును, శుక్రునితో బృహస్పతి, నరకాసురునితో శని తలపడి పోరాడసాగిరి.

బలిచక్రవర్తి విజృంభించెను. పది బాణములచే మహేంద్రుని, మూడు శరములచే నైరావతమును, నాలుగు బాణములచే నాలుగు గుఱ్ఱములను, ఒక బాణముతో మావటివానిని గొట్టెను. దేవేంద్రుడు ఆ బాణముల నన్నింటిని ఛేదించెను.

బలిచక్రవర్తి గొప్పదియగు అగ్నిని సృష్టించెను. అతి భయంకరమైన ఆ యగ్ని దేవతల సేనను దగ్ధమొనర్ప సాగెను. దేవత లందరు విషాదముతో ఖిన్నులైరి. ప్రతీకారము చేయజాలని వారైరి. భగవానుడగు శ్రీపతిని ధ్యానించిరి.

అసురభావములు తల ఎత్తినపుడు సాధకుడు అతి జాగరూకుడై యుండాలి. తన బలము చాలనపుడు దైవబలమునకై ప్రార్థించాలి. దేవతలు శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. వెంటనే శ్రీనాథుడు కరుణించి ప్రసన్నుడైనాడు.

మ॥ విహగేంద్రాశ్వనిరూఢుడై మణిరమావిభ్రాజితోరస్కుడై
బహుశస్త్రాస్త్రమహాభుజాకలితుడై భాస్వత్కిరీటాదిదు
స్సహుడై నవ్యపిశంగచేలధరుడై సంపుల్లపద్మాక్షుడై
విహితాలంకృతితోడ మాధవుడు దావేంచేసె నచ్చోటికిన్.

మాధవుడు ప్రవేశించగనే మాయలన్నీ పటాపంచ లయ్యెను. మేల్కొనగనే స్వప్నము అదృశ్యమైనట్లు పరమ ఆగమనముతో సర్వ దురితములు తొలగిపోయినవి. ఈ సందర్భమున శ్రీశుకుడు బాధలను పోగొట్టునది భగవన్నామమే యని పరీక్షిత్తునకు తెలిపెను.

హరి స్మృతిః సర్వ విప ద్విమోక్షణమ్

"సర్వ ఆపదలకు పరిష్కృతము హరిపాద స్మరణమే" యనెను.

ఇంద్రుడు వజ్రాయుధమును ప్రయోగించెను. ఱెక్కలు తెగిన పర్వతమువలె బలిచక్రవర్తి విమానముతోపాటు భూమిపై బడెను. అది గాంచిన బలి స్నేహితుడగు జంభాసురుడు మహేంద్రునిపై బడెను. అతనిని గూడా ఇంద్రుడు వజ్రాయుధముతో ఖండించెను.

బ్రహ్మదేవుడు నారదుని యుద్ధరంగమునకు బంపెను. నారదుడు హితబోధచేసి వారిరువురుని శాంతింపజేసెను. సురులు సురలోకమునకు, అసురులు అసురలోకమునకు

వెడలిరి. అసురులు అస్తాచలమునకు వెళ్ళగా, అవయవములు తెగినను మస్తకముండిన అసురులందరిని శుక్రాచార్యుడు తన సంజీవినీ విద్య ద్వారా తిరిగి బ్రతికించెను.

క్షీరసాగర మథనము - తాత్త్విక అవగాహన

ఆత్మ సామ్రాజ్యాన్ని అధిష్ఠించుటకు సాధకుని ఆంతర్యంలో జరిగే ప్రయత్నమే క్షీరసాగర మథనంలోని తాత్త్విక అవగాహనయై యున్నది. తాత్త్విక అవగాహన, భావ సౌందర్యము, అలంకార శిల్పము తెలియనివారు ఈ కథలోని స్వారస్యమును గ్రహింప లేక మిడిమిడి జ్ఞానంతో మహర్షి వాఙ్మయము అర్థరహితమైనదని అసందర్భ, అప్రస్తుత ప్రసంగాలు చేస్తుంటారు.

పాల సముద్రమంటూ స్థూలంగా ఒకటుంటే అది ఎలా తయారయింది? సముద్ర మంత క్షీరాన్ని అందించిన ఆవులు, గేదెలు ఎక్కడ? లేక మేఘాలు జలాన్ని వర్షించి నట్లు, పాలను క్రుమ్మరించే క్షీరమేఘాలు గతంలో ఉండేవా? ఒకవేళ అలా జరిగి ఉంటే రసాయనిక ప్రక్రియ ద్వారా ఆ పాలు పెరుగుగా మారదా? ఇలా ఆలోచిస్తుంటే మనమొక పూడిక తెలియని అగాధంలో పడిపోతాము.

ప్రతి మానవునిలో చెలరేగే కల్లోల తరంగాలకు ఆలవాలమైన మనసే క్షీరసాగరము. తత్త్వచింతన గల సాత్త్విక మనసే క్షీరసాగరము. ప్రతి సాధకుడు ఆంతరంగిక శోధన చేసి అమృతత్వాన్ని పొందుటయే క్షీరసాగర మథనంలోని భావ సౌందర్యము. క్షీరసాగర మనెడి మనస్సులో మందర పర్వత మనెడి బుద్ధి నుంచాలి. మందర పర్వతానికి అహంకారమనెడి వాసుకిని త్రాడుగా అమర్చాలి. ప్రతి వ్యక్తిలోని దైవాసుర గుణాలే దేవ దానవులు. ఒకవైపు దైవగుణాలు, మరియొకవైపు అసురగుణాలు అహంకారాన్ని పట్టి చిలకడ మనెడి ధ్యానాన్ని కొనసాగించాలి. ప్రారంభదశలో ఎన్నియో సిద్ధులు కలుగవచ్చు. శంఖారావం, ఘంటానాదం, మురళీగానం లాంటి శబ్దాలు వినిపించడం; దూరదర్శనం, దూరశ్రవణం లాంటి శక్తులు లభించడం; అద్భుతదృశ్యాలు గోచరించడం జరుగవచ్చు. అయినా అమృతానుభవమునకు వీటిని త్యజింపక తప్పదు. అలాగే ధ్యానం కొనసాగించగా అమృతత్వం సిద్ధించే ముందు అహంకారములో ఇమిడియున్న చివరి కొద్దిపాటి వాసనలు గూడ వెళ్ళగ్రక్కడం జరుగుతుంది. అయితే ఆ వాసనా ప్రభావము మనస్సును, హృదయమును స్పృశించకుండా చూసుకోవాలి. అహంకారము సమూలంగా నశించి, మనస్సులోని వాసనలు ప్రక్షాళనం కాగానే ఆత్మ దర్శనమవుతుంది. ఆత్మానందమే అమృతపానం. అమృతపానం చేసినవారు అమరులౌతారు. ప్రతి ఒక్కరు అమృతసిద్ధిని పొంది అమరు లగుటయే ఈ క్షీరసాగర మథనంలోని సందేశాత్మక సమన్వయ సారాంశము.

హాలాహలాన్ని పానం చేసిన శివుడు త్యాగపురుషుడు. పరులకొఱకు తాను విషాన్ని పానంచేశాడు. శివుడు త్రినేత్రధారి. అతని మూడవ నేత్రం తెరువబడగనే ఎదుటనున్న వస్తువులు, వ్యక్తులు భస్మీపటల మవుతారు. మూడవ నేత్రమనేది ప్రతి వ్యక్తికీ యున్నది.

అదే జ్ఞాన నేత్రం. జ్ఞాన చక్షువు తెరువబడగనే మనకు గోచరమయ్యే ఈ జగత్తు అదృశ్యమవుతుంది. జ్ఞాన తేజస్సులో అజ్ఞానాంధకారము పటాపంచ లవుతుంది. అదృశ్యమైన నామ రూపాత్మక ప్రపంచముస్థానే పరమాత్మ దివ్య దర్శనము గోచరమై **"వాసుదేవ స్సర్వమితి"** యన్న అనుభూతి కలుగుతుంది. ఆ దివ్యానుభూతిలో అజ్ఞానమేఘాలు చెదరిపోతాయి. ఆనంద జల్లులు కురుస్తాయి.

మహాదేవునిపై మాయా ప్రభావము

మధుసూదనుడు మగువ రూపమున దైత్యులను మోహమునకు గురిజేసి దేవతలకు అమృతమును పంచిపెట్టెను. ఈ విషయమును తెలిసి మహేశ్వరుడు పార్వతీ సమేతుడై, ప్రమథగణ పరివృతుడై, మోహినీ రూపమును దర్శింప నిచ్ఛగించి శ్రీహరి వద్దకు వెడలెను. నారాయణుడు నీలకంఠునికి స్వాగతం పలికెను. మాధవుని మహిమను మహేశ్వరుడు వర్ణింపసాగెను.

"జగదీశ్వరా! నీవు సర్వలోకములకు మూలకారణమై యున్నావు. నీవు సర్వవ్యాపకుడవు. సర్వశక్తిమంతుడవు. చైతన్య రూపుడవు. సృష్టి స్థితి లయాదులకు నీవే కారణుడవు." యని భగవద్వైభవమును అత్యంత రమణీయముగా వర్ణింప సాగెను.

మమతల నెండగట్టిన మునులు ముక్తిని బడయగోరి ముకుందుని పాదముల నాశ్రయింతురు. మాధవుడు పరబ్రహ్మ స్వరూపుడు. జనన మరణములు తెలియనివాడు. శోకము లేనివాడు. తన కన్యముగా లోకము లేనివాడు. సర్వము తనయందే యున్నను నిజానికి తాను వాటికంటెను భిన్నుడు. జీవులకు తానే కర్మఫల ప్రదాతయై యున్నాడు. కర్మఫలాలకై సర్వలోకములు ఆయన దయను వేడుకొంటున్నవి. అయినను అతడు నిరపేక్షుడు.

కార్యకారణములు తానైయున్నాడు. ఏకత్వంలో భిన్నత్వము అతని అమోఘ రచనయే. భిన్నత్వంలో ఏకత్వము అతని దివ్య మహిమయే. బంగారమునకు, ఆభరణములకు వస్తుగత భేదములేనట్లు, కారణ రూపుడైన జగన్నాథునకు కార్యరూపమైన జగత్తునకు భేదము లేదు. అతని స్వరూపము నెవ్వరును ఎఱుగజాలరు.

సీ॥ భావించి కొందఱు బ్రహ్మంబు నీవని తలపోసి కొందఱు ధర్మమనియు
జర్చించి కొందఱు సదసదీశ్వరుడని పరని గొందఱు శక్తి సహితుడనియు
జింతించి కొందఱు చిరతరుం డవ్యయు డాత్మతంత్రుడు పరుం డధికు డనియు
దొడరి యూహింతురు తుది సద్వయద్వయ సదసద్విశిష్టసంశ్రయుడ నీవు
తే॥ తలప నొక్కింత వస్తుభేదంబు గలదె కంకణాదులు బసిడి యొక్కటియకాదె
కడలు సైకత్యైన వార్ధియొక్కటియకాదె భేదమంచును నిను వికల్పింపవలదె.

యని పరమేశ్వరుడు శ్రీనాథుని వైభవమును వర్ణింపసాగెను.

భేదము అజ్ఞాన జనితము. ఆరోపితము. గుణ పరిణామమే భేదమును గోచరింప జేయుచున్నది. ఆదిత్యుని కాంతితో అంధకారము అదృశ్య మగునట్లు, జ్ఞానోదయంతో అజ్ఞానము అంతరించుచున్నది. అవ్యయుడైన అచ్యుతు డొక్కడేయని తెలియుచున్నది. అనిర్వచనీయు డైనందున షడ్దర్శనములు పలుపలు విధముల అతని వైభవమును వర్ణించినవి.

"నేను, బ్రహ్మ, మరీచాది మునులే నిన్నెఱుగ జాలము. ఇక సామాన్యుల విషయము చెప్పనేల?" యని పరమేశ్వరుడు భగవద్విభూతిని పరవశించి వర్ణించుచున్నాడు.

"హే జగన్నాథా! వాయువు ఆకాశ మంతటను వ్యాపించి యున్నట్లు వాసుదేవుడవైన నీవు జగమంతట వ్యాపించి యున్నావు. గతంలో మహిమాన్వితమైన నీ నరసింహాది అవతార వైభవములను నేను దర్శించి యున్నాను. దానవులను వంచించి, దేవతలకు సుధను పంచి యిచ్చిన నీ మోహినీ రూపమును గాంచ నిచ్ఛగించి ఇచ్చటి కరుదెంచితిని. దేవా! అనుగ్రహింపుము" అనెను. మహేశ్వరుని ప్రార్థనను మాధవుడు అంగీకరించెను. మోహినీ రూపమును జూపుటకు నిచ్ఛగించెను. వెంటనే అదృశ్య మయ్యెను. ఉమానాథుడు సతీ సమేతుడై అటునిటు చూపులు సారించుచుండెను.

అదొక ఉద్యానవనము. ఎఱ్ఱని చిగురుటాకులు గల వృక్షసముదాయము, నానావిధ సుమభరితమై మనోహరముగ నొప్పారుచుండెను. ఆ వనములో పలుచని వస్త్రమును గప్పుకొని, పూల బంతులాడుచు యొక వనిత గోచరించెను. బంతిని పట్టుకొను ప్రయత్నములో ఎగురునపుడు ఆమె కుచములు కమనీయముగ కదలును. అలలు లేచి పడునట్లు స్తనద్వయము చలించును. ఆమె చరణములు చిగురుటాకులవలె కోమలములై యుండెను. అన్నివైపుల చరించే పూబంతిని పరిశీలించే యత్నములో కదలే ఆమె మనోహర కనుద్వయము ముల్లోకములను మోహింపజేయుచుండెను. ఆమె రూప లావణ్యమును, అమోఘ సౌందర్యమును గాంచి భూతనాథుడు మోహభూతము ఒడిలో పడెను.

వడివడిగా పరుగిడే వనితయొక్క చీరముడి వీడింది. వస్త్రము విడిపోయింది. జుట్టు ముడి జారిపోయింది. ఎడమచేతిలో వీడిన జుట్టు ముడిని పట్టుకొని, కుడిచేతితో పూబంతిని వీడకుండా క్రీడించసాగింది. తానూ ఆడాలని ముచ్చట పడినాడు నటరాజు. భామినిని తదేకంగా వీక్షిస్తున్నాడు భూతనాథుడు. చంద్రశేఖరుని వైపు చూపు సారించినది చంద్రవదన. జవ్వని చూపు ననుసరించిన తన చూపు ఎటుకేగినదో తెలియదు. తాను చూపులేని వాడయ్యెను. రూపును మఱచెను. దాపునున్నవారిని విస్మరించెను. ఊపెక్కిన కాగా పిగ్గును బాపుకొని, జారిన సిగను పట్టుకొనుటకు శూలపాణి పరుగులిడెను.

ఆ॥ వాలుగంటి వాడి వాలారు జూపుల శూలి ధైర్య మెల్ల గోలుపోయి
తఱలి యెటుక లేక మఱచె గుణంబుల వాలి మఱచె నిజగణాలి మఱచె.

మహాదేవుని చిత్తము మగువలో చిక్కుకొనెను. విషమును జీర్ణించుకొనిన పరమేశ్వరుడు వనిత ఉనికిని గ్రహింపలేకపోయెను. విషము కన్నను విషయములే ప్రమాదకరములని నిరూపింపబడెను.

ఉమాపతి వనిత ననుసరించెను. చీర వీడిన చెలియ చెట్లమాటునకు చనెను. చేతో భవుడు చిత్తము నావరించగా శివుడు చంచలు డాయెను. చెలువముగోరి చెలువను చేర బోయెను. ఆడయేనుగు వెంట పరుగిడు మగయేనుగు వలె మహేశ్వరుడు మగువ వెంట పరుగిడెను.

ఆశ ఆకాశమంతాయెను. పిగ్గు ఆవగింజంతాయెను. పాదములు పరుగులే నేర్చెను. ఎలాగో కోమలి కేశపాశము హస్తగత మయ్యెను. వనిత విముఖతను వ్యక్తము చేయుచున్నను పట్టించుకొనక వామదేవుడు వనితను వాటేసుకొనెను. ఫాలనేత్రునితో పోటీబడిన ఆ కులుకులాడి విడిపించుకొని వడివడిగా పరుగిడెను.

నదులు దాటెను. గిరులు దాటెను. వనములు తిరిగెను. వనితను తరిమెను. చెలియ చిక్కదు. చిత్తము దక్కదు. తరిగే ఆశ పరుగును పెంచింది. కానీ విధి మగువను దూరముగనే ఉంచింది. కొంప మునిగింది. కైలాసము కల్లోలమైంది. విలాసాలు విద్దూరాలని తెలిసింది. ఉన్మత్తశేఖరుని మతి స్థిమితపడింది. విష్ణుమాయ తెలిసింది. చిత్త భ్రాంతి తొలగింది. మగువ మగవాడాయెను. ప్రేమతో మహేశ్వరుని పలుకరించెను.

ఆ॥ కాము గెలువవచ్చు గాలారిగావచ్చు మృత్యుజయము గలిగి మెరయవచ్చు
నాడువారి చూపుటంపఱ గెలువంగ వశముగాదు త్రిపురవైరికైన.

"పరమ పురుషా! పరమేశా! నా మాయలో పడినవారు తిరిగి స్వస్థతను బొందలేరు. అది నీలాంటి మహితాత్ములకే సాధ్యము. నీవు దప్ప అన్యులు నా మాయను దాటలేరు" యనెను. మహేశ్వరుడు భగవానునకు ప్రదక్షిణ మాచరించి, పార్షదులతో పార్వతితో గూడి కైలాసమున కేగెను. అచ్చట పరమేశ్వరుడు ఆదిదేవి యగు పార్వతీదేవితో ఇలా పలికెను:

అయివ్యపశ్య స్త్వ మజస్య మాయాం పరస్య పుంసః పరదేవతాయాః
అహం కలనా మృషభోఽపి ముహ్యే యయావశోఽన్యే కిముతా స్వతన్త్రాః ॥

"భవానీ! పుట్టుకలేనివాడు, పరమపురుషుడు నగు విష్ణుదేవుని మాయను గాంచితివి గదా! నేను ఆ మహితాత్ముని యంశయైనను ఆయన మాయకు మోహితుడ నైతిని. ఇక సామాన్యులు వశపడకుందురా?" యనెను.

కాముని గెలిచిన వారు కాలుని గెలువగలరు. స్త్రీ సంగము వాంఛనీయము గాదు. అలాగే స్త్రీలకు పురుష సంగము అభిలషణీయము గాకూడదు. కామము మనస్సును విషయ సుడిగుండములో పడద్రోయును. బుద్ధిని భ్రష్ట మొనర్చును. వైభవమును హరించును. కామము విషయములో జయము కలిగిందని భ్రమింపరాదు. కామము ఎంతటి వారినైనను మోసగించును.

ఎంత నేర్చిన ఎంత జూచిన ఎంతవారలైన కాంత దాసులే

యని త్యాగరాజస్వామి గళమెత్తి చాటెను.

ఈ సత్యమును ముముక్షువుల హృదయములో స్థిరపరచుటయే మహాదేవుని మోహమనెడి ఇతివృత్తము వెనుక దాగియున్న పరమార్థము. లేనిచో కాముని దహించిన

వాడు మోహమునకు గురియగుట సంభవమా? శివుడే పరవశుడైనచో ఇక మనలాంటి సామాన్యులు ఎలా ప్రయత్నించి సాధింపవలెనో తెలుపుటయే ఇందులోని సారాంశము.

కామము కల్మషము. మోహము ముష్కరము. పరమాత్మ యందు పూర్ణ విశ్వాస ముంచి, నిత్య భజనలో సంతసించువారే కామమును జయింపగలరు. కామము విషయంలో వ్యక్తి కృషికన్నను వాసుదేవుని కృప ఎక్కువగా యుండవలెను. మనస్సును కామము ఆవరించినపుడు **"ఓం నమో భగవతే వాసుదేవాయ"** యనెడి దివ్య మంత్రమును విడువకుండా స్మరించాలి. శ్యాముడు నిలిచిన హృదిలో కాముడు నిలువలేడు. రాజుగారి ఆస్థానములోనికి శునక మెలా ప్రవేశించలేదో పరమాత్మ వసించే హృదయమున పాపిష్టి కామము ప్రవేశింపలేదు. శీతలోదకమును కడుపారా త్రాగిన వాడు ఎండమావుల వెంట పరుగులిడునా? భగవన్నామామృతపానము చేసిన మహితాత్ముని మోహము కదలించునా? మోహము అంతరించినవాడు మోక్షమును బొంది తరించును.

తదనంతరము ఏడవ మన్వంతరము నుండి పదునాల్గవ మన్వంతరము వరకు శ్రీశుకుడు పరీక్షిత్తునికి చెప్పెను. ఈ పదునాలుగు మన్వంతరములు ఒక కల్పమనియు, కల్పమనగా సహస్ర యుగాత్మక మనియు తెలిపెను.

బలి విజయము

మహాతపస్వి యైన మహేశ్వరుడు మగువ వెంట బరుగిడెను. మరి మహాతేజస్వి యగు లక్ష్మీపతి బలిచక్రవర్తిని దానమెందులకు యాచించెను? ఈ ప్రశ్నయే పరీక్షిత్తునిలో ఉత్పన్నమాయెను. బ్రహ్మజ్ఞానియగు శ్రీశుకుడు శిష్యుని సందేహమును నివారింప, బలి నిర్వహించిన విశ్వజిద్యాగమును ఎఱుకపరచి, వామనమూర్తి దర్శనమును అనుగ్రహింపబోవు చున్నాడు.

దానవులు దేవతల చేతిలో ఓడిపోయిరి. ఇంద్రుని చేతిలో బలి నిహతు డయ్యెను. భృగు వంశీయుడగు శుక్రాచార్యుడతనిని పునర్జీవితుని గావించెను. బలి శుక్రునికి శిష్యుడై సేవించుచుండెను. బలిమిని వాంఛించు వారెల్లరు శుక్రుని సేవింపక తప్పదు.

శుక్రుడనగా బ్రహ్మచర్య మని భావము. **"శుక్రం తేజః అస్యాస్తీతి"** శుక్ర మనగా తేజస్సు లేదా వీర్యము అని భావము. వీర్యము వలననే దేహము జనించినది. వీర్యమే దేహమునకు బలమై యున్నది. వీర్య నష్టముతో వ్యక్తి బలహీనుడగును.

మరణం బిన్దు పతేన జీవనం బిన్దు రక్షణాత్

వీర్య నష్టమే మరణ మనియు, వీర్య రక్షణమే జీవన మనియు యోగశాస్త్రము వచించినది.

వీర్యమును రక్షించుకొనువారు తేజోవంతు లగుదురు. ఇదియే బ్రహ్మచర్య వైభవము. బ్రహ్మచర్యము రెండువిధములు: (1) శారీరకము, (2) మానసికము. దేహమును నిగ్రహించుట మొదటిది కాగా, చెడువృత్తులు లోన ప్రవేశింపనీయక

నిరోధించునది రెండవది. బ్రహ్మచర్యము ముదిమిని నిరోధించును. మృత్యువును నివారించును.

బ్రహ్మచర్యమును భగ్న మొనర్చు చెడు సంకల్పములు మనస్సులో ప్రవేశింపకుండా జాగ్రత్తపడవలెను. చెడు సంకల్పము రాగానే దానిని తరిమి వేసే ప్రయత్నము చేయరాదు. ఇక్కడే బ్రహ్మచారులు, బ్రహ్మచర్యవ్రత మవలంబించువారు జాగరూకులై యుండవలెను. చెడు సంకల్పమును తరిమివేసే ప్రయత్నములో నీవు చాలా శక్తిని పోగొట్టుకొందువు. అలసి పోవుచుందువు. ఆవేదన చెందుచుందువు. ఇవన్నియు నీ మానసిక శక్తిని హరించును. బ్రహ్మచర్యమును బలహీన మొనర్చును. చెడు సంకల్పములకు ఒక నైపుణ్య మున్నది. నీవు వాటిని ఎంతటి శక్తితో త్యజింతువో, అంతకు రెండింతలుగా మించిన శక్తితో అవి తిరిగి నిన్ను చేరును. అది కూడా చాలా వేగముగా వెనుదిరుగును. నీవు అనేక సార్లు ప్రయత్నించుచుండినను, అవి నిర్విరామంగా ప్రవేశించుచునే యుండును.

కామానికి, వ్యామోహానికి సంబంధించిన సంకల్పములు మనలో ప్రవేశింపగనే నీవు ఉదాసీనంగా ఉండుట యలవరచుకొనవలెను. విచారణను ప్రారంభించవలెను. సద్భావాలతో మనస్సును నింపవలెను. బ్రహ్మచర్యము యొక్క వైభవమును మననము చేయవలెను. తుచ్ఛమైన విషయలోలత్వమునకు, ఉన్నతమైన సుగుణములకు, బ్రహ్మచర్యమునకు గల తారతమ్యమును స్పష్టముగ దర్శింపవలెను.

క్వ శరీర మశేషాణాం శ్లేష్మాదీనాం మహాచయః
క్వ చాఙ్గ శోభా సౌభాగ్య కమనీయాదయో గుణాః

"శ్లేష్మాదులతో కూడిన దేహ మెక్కడ? కమనీయమై, శుభముల నొసగెడి సుగుణము లెక్కడ?" యని ఉపనిషత్తు ప్రశ్నించినది.

కనుక కామాది వాసనలు ఆంతర్యమున ప్రవేశించి, బ్రహ్మచర్యమును భగ్న మొనర్చెడి సమయ మాసన్నమైనపుడు, దేహము యొక్క వాస్తవిక స్థితిని మననము చేసు కోవాలి. ఏమున్నది ఈ శరీరములో సౌందర్యము? అని ప్రశ్నించుకోవాలి.

రక్త, శల్య, మాంసాదులతో తయారైన తోలుబొమ్మయగు శరీరము తనలో దుర్గంధ భూయిష్టమైన మలమూత్రాదులను నింపుకొని, కామాంధకారముతో నేత్రములు గానరాకున్న అజ్ఞానులను మోహింపజేయుచున్నది. బ్యాంక్‌లో ఎంతయున్నదో మానవుడు సగర్వముగా తెలుపును. బాడీ (దేహం) లో ఏమున్నదో ఎంత యున్నదో తెలుపడు. ఈ విషయమున ఉపనిషత్తు చక్కగా వివరముల నందించినది.

తస్మిన్ లోమ్నా మష్టౌ కోటయ స్త్వశీతి సంధి శతం నవస్నాయు శతాని హృదయ
పలాన్యష్టౌ ద్వాదశ పలా జిహ్వా పిత్తం ప్రస్థం కఫశ్చాఢకం శుక్లం కుడవం మేదః
ప్రస్థౌ ద్వౌ సర్వం నశ్వరం విజ్ఞాయ......... న పునశ్శరీరం ప్రాప్నోతి

" ఈ దేహమునందు ఎనిమిది కోట్ల వెంట్రుకలు గలవు. ఎనిమిది వేల సంధులున్నవి. తొమ్మిదివందల నరములు గలవు. ఎనిమిది పలముల గుండెకలదు. పంన్రెండు పలముల నాలుకగలదు. పిత్తము ఒకపడి (తవ్వ) యున్నది. కఫము ఒక

తూము గలదు. శుక్లము రెండు తూములు. క్రొవ్వు రెండు పళ్ళు గలదు. ఈవిధమైన శరీరము అశాశ్వతమని ఎవడెరుగునో అట్టివాడు మఱల దేహమును బొందడు.

శుక్రుని సేవించి బలి యోగబలముతో వెల్గొందెను. బ్రహ్మచర్యమును పాటించు వారే నిజమైన బలాఢ్యులై యుందురు.

బలి విశ్వజిద్యాగమును చేసెను. ఆ యాగమహిమ వలన బలికి ఒక సువర్ణ రథము లభించినది. ఉచ్చైశ్శ్రవము వంటి కొన్ని గుఱ్ఱములు లభించినవి. ఒక సింహధ్వజ మొసగ బడినది. రెండు అక్షయ తూణీరములు, దివ్యమైన ఒక ధనువూ లభించినవి. తాతయగు ప్రహ్లాదుడు వాడిపోని పద్మమాల నొసగెను. శుక్రాచార్యుడు శంఖము నొసగెను.

బలి బ్రాహ్మణులకు నమస్కరించెను. ప్రహ్లాదునకు ప్రణమిల్లెను. తదనంతరము రథము నెక్కి, దైత్యసేన వెంటరాగా అమరావతి మీదకు దండెత్తెను. నలువైపుల నుండి ఇంద్రపురిని ముట్టడించెను. శుక్రుడు ప్రసాదించిన శంఖమును పూరించెను. ఆ భయంకర శబ్దమునకు సురులు పలాయనమైరి. బలి నెదిరించుటకు ఇంద్రు డశక్తుడై దేవగురుడగు బృహస్పతి వద్దకు పరుగులిడెను.

శుక్రుని సేవించిన వారు ఇంద్రుని గెలువగలరు. ఎవరు బ్రహ్మచర్యమును పాటింతురో, వారు ఇంద్రియములను జయింపగలరు. వారు చేయునది విశ్వజిద్యాగము. విశ్వమును జయించెడి యాగము బ్రహ్మచర్యమే. ఎవడు కామమునకు వశపడడో వానికి లోకము వశపడును.

ఇంద్రుడు బృహస్పతిని సమీపించెను. బలి నెదుర్కొనుశక్తి తనకులేదని పలుకుతూ, బలి ఇంతటి తేజోవంతు డగుటకు కారణమును తెలుపుమని బృహస్పతి నడిగెను. "ఇంద్రా! నీ శత్రువుయైన బలి యొక్క వైభవమునకుగల కారణమును నేనెఱుగుదును. భృగువంశీయులగు బ్రాహ్మణులు తమ శిష్యుడైన బలికి తేజము నొసంగిరి" యనెను.

గురువుల కృపకు పాత్రులైనవారు తేజోవంతు లగుదురు. అట్టివారిని ఎవ్వరూ ఎదిరించలేరు. ఇచ్చట మరియొక రహస్యమును గూడ గ్రహింపవలసియున్నది. గురుకృపకు పాత్రులైన వారు తేజోవంతులగుచున్నపుడు, గురునిందకు పాల్పడువారు, గురుద్రోహ మొనర్చువారు తేజో హీనులగుదురని వేరే చెప్పనవసరములేదు. గురుకృపకు పాత్రులైనవారు ధన్యులు.

అభివాదన శీలస్య నిత్యం వృద్ధోప సేవినః
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశోబలమ్

"గురువులకు నమస్కరించుచు, నిత్యము సేవించువారికి ఆయుస్సు, విద్య, యశస్సు, బలము లభించును" అని మనుస్మృతి తెల్పినది.

"ఇంద్రా! ఇప్పుడు బలి నెవ్వరూ జయించలేరు. అతనిని శ్రీహరి యొక్కడే జయించ గలడు. యముని ముందు మానవులు నిలువలేనట్లు, బలి ముందు సర్వులూ పరాభవితులే. కనుక మీరు సురలోకమును త్యజింపుడు. అతని వైభవము అంతరించగనే మీరు మీ లోకమును చేజిక్కించుకొనగలరు" యని బృహస్పతి పలికెను. బృహస్పతి

మాటల నాలకించిన ఇంద్రుడు బలివైభవము క్షీణించుకాలము నెరుగుటకు ఉత్సాహపడెను. బృహస్పతి ఇలా పలికెను:

ఏష విప్ర బలోదర్కః సంప్ర త్యూర్జిత విక్రమః
తేషా మేవాప మానేన సానుబన్ధో వినఙ్క్ష్యతి

"విప్రులను సేవించుటచే బలి ఇపుడు తేజోవంతుడై యున్నాడు. ఆ విప్రులనే ఎపుడు అవమానించునో అప్పుడతడు సైన్యముతోపాటు నశింపగల" డనెను.

మహాత్ముల నాశ్రయించి కొందఱు వారి కృపకు పాత్రులగుదురు. సద్గురు కృప లభించుటచే వారు దేదీప్యమానముగా విరాజిల్లుదురు. కాలము గడచే కొలది అహంకారము వృద్ధినొందును. అంతయూ తమ మహిమయే నని భావింతురు. గురువులను నిరాకరింతురు. వారిని అవమానింతురు. తాము లేనిదే గురువు లేడని వ్యర్థ ప్రసంగములు చేయుదురు. విఱ్ఱవీగుదురే గాని పుణ్యము తొఱ్ఱయగుచున్నదని గ్రహింపరు. పిపాసా పీడితుడైనవాడు ప్రాణాపాయ స్థితిలో బావినుండి నీటిని గ్రహించుటకు, ప్రాణమును రక్షించుకొనుటకు ఉపకరించిన త్రాడే కాలము విషమించినపుడు ఉరిత్రాడుగా మారినట్లు, శరణాగతులను రక్షించిన గురువుల వైభవములే, అహంకారములు పెరిగినపుడు అట్టివారు నశించుటకు కారణము లగుచున్నవి.

బృహస్పతి మాటల నాలకించిన దేవతలు స్వర్గమును త్యజించి వెడలిరి. దేవతలు నిష్క్రమించగా బలి ఇంద్రుని సింహాసనము నధిష్ఠించెను. భృగువంశీయులగు బ్రాహ్మణులు బలిచేత నూఱు అశ్వమేధ యాగములను జేయించిరి. బలికీర్తి విశ్వవ్యాప్తమాయెను. గురువుల కృపచే తాను కృతార్థుడైనట్లు బలి సంతృప్తి చెందెను.

అదితి కశ్యపులు

ఇంద్రాది దేవతలు సురపురము నొదలి వెళ్ళిరి. దేవమాత యైన అదితి పరితాప హృదయంతో కలతచెందెను. సమాధి నుండి లేచిన కశ్యపుడు భార్యయగు అదితియొక్క ఆశ్రమమునకు వచ్చెను. ఆ ప్రదేశము నిరుత్సవమై, నిరానందమై యుండెను. అదితి భర్తను పూజించెను. నమస్కరించెను. దీనవదనయై యున్న సతిని గాంచి కశ్యపుడిలా పలికెను:

"శుభకరీ! ప్రపంచములో ధర్మమునకు హాని కలుగలేదు గదా! మంచివారికి అమంగళములు కలుగలేదు గదా!" యని ప్రశ్నించి, అదితిలోని వెలితిని గ్రహించుటకు కశ్యపుడు యత్నించుచున్నాడు.

అదితి దుఃఖమగ్నమై గోచరించెను. ధర్మమునకు, మంచివారికి అశుభము లేర్పడ లేదు గదా! యని కశ్యపుడు ప్రశ్నించుచున్నాడు. ముఖ్యంగా మనిషి దుఃఖింపదగిన వాటిలో ఈ రెండు ముఖ్యములని యర్థము. తాను జీవించే సమాజమునకు ధర్మహాని కలిగినపుడు వ్యక్తి వ్యథచెందాలి. వృక్షశాఖపై ఆసీనుడైనవాడు తన కొమ్మకు హాని లేదని

మురిసిపోవుట గాదు. మూలమే ఛేదింపబడునపుడు తన బ్రతుకు గూడ ఆపదలకు నిలయమగు ననెడి నగ్నసత్యాన్ని గుర్తింపగలగాలి. వ్యక్తి హానికన్నా ధర్మహానికి వగచే సంస్కారాన్ని మనిషి తయారుచేసుకోవాలి.

స్వార్థం పెరిగిన సమాజంలో సంస్కారాలు నశిస్తాయి. అహంకారాలు పుట్టుకొస్తాయి. తమ ఆధిక్యతలు, ఆడంబరాలు ముఖ్యమౌతాయే గాని సమాజాభ్యుదయము మనస్సులకు పట్టదు. బుద్ధికి గిట్టదు.

Some men weave their sophistry till their own reason is entangled

"కొందరు తమ ఆడంబరాలను ఎంత చక్కగా అల్లుకుపోతారంటే, ఆ అల్లికలలో చిక్కుకు పోయేదాకా గుర్తించలేరు" అని జాన్సన్ అభిప్రాయ పడినాడు.

సమాజమునకు ధర్మహాని కలుగరాదు. ఆ తరువాత వ్యక్తి ఔన్నత్యమునకు విఘాత మేర్పడగూడదు. అందుచేత బ్రాహ్మణులకు అశుభములు కలుగలేదుగదా! యని కశ్యపుడు ప్రశ్నించెను.

సంస్కారము కలిగినవాడు, సమాజాభ్యున్నతికి కృషిచేయువాడు బ్రాహ్మణుడు. అట్టివ్యక్తియే సమాజ వికాస సౌధమునకు పునాది కాగలడు. మంచివారు వంచింపబడే సమాజానికి మనుగడ మిగలదు. నిలకడ కలుగదు. అభ్యుదయ వాదులకు అవరోధాలు మెండు. వారి శుభమును కాంక్షించే సుగుణము, వారి యశుభములను గాంచి వ్యథచెంది, సహకరించే సౌజన్యమును సర్వులూ తయారుచేసుకోవాలి. కశ్యపుడు తదనంతరము ఇలా పలుకుతున్నాడు:

అపి వా కుశలం కించద్గృహేషు గృహమేధిని
ధర్మ స్యార్థస్య కామస్య యత్ర యోగో హ్య యోగినామ్

"గృహమేధినీ! స్వధర్మము నాచరించుట చేత గృహస్థాశ్రమము యోగములేని వారలకు గూడ యోగఫలము నొసంగును. అట్టి నీ గృహమున ధర్మార్థకామము లనెడి త్రివర్గములకు అమంగళము కలుగలేదు గదా!" యనెను.

గృహస్థాశ్రమము పరమ పవిత్రమైనది. యోగులు యోగములో పొందెడి సుఖమును గృహస్థులు ధర్మాచరణము ద్వారా గృహములలో పొందుదురు. త్రివర్గములలో ధర్మము మొదటిది. కామము చివరిది. గృహము ధర్మనిలయమేగాని కామసంకులము గాదు. అదితికశ్యపులు కలసి పరమాత్మ నారాధించుచుండిరి. అందుచేత వారి గృహస్థాశ్రమము ఉన్నతమై యుండెను. ధర్మజీవనము శుభకరమైనది. సర్వ సమున్నత ఫలముల నొసగునది. అధర్మము దుర్భరమైన ఒక్క ఫలమునే అందించును.

ధర్మా ద్రాజ్యం ధనం సౌఖ్యం అధర్మా ద్దుఃఖ సంభవః

"ధర్మము రాజ్య సుఖాన్నిస్తుంది. ధనప్రాప్తిని కల్పిస్తుంది. సుఖప్రాప్తిని ప్రసాదిస్తుంది. అధర్మము దుఃఖమునే అందిస్తుంది" అంటుంది మహాభారతము.

కశ్యపు డింతవరకు మూడు విషయములను ప్రస్తావించుచు ప్రశ్నించినాడు. 1. సమాజాభ్యుదయము, 2. సత్పురుషుల సౌఖ్యము, 3. గృహమున అమంగళము లేకుండుట. మొదటి రెండిటిని పాటించువారికి మూడవది అనాయాచితముగ లభించును. ఇదియే గృహస్థుని ముఖ్యకర్తవ్యము. గృహస్థధర్మమన నదియే. ధర్మమేమిటో తెలిసి అద్దానిని గృహమునం దాచరించిన అది గృహస్థధర్మ మనబడును.

యతోఽభ్యుదయ నిశ్శ్రేయస సిద్ధిః స ధర్మః

సమాజమునకు అభ్యుదయమును, వ్యక్తికి శ్రేయస్సును ఒనగూర్చున దేదియో అదియే ధర్మమని వైశేషిక దర్శనము నందు కణాదమహర్షి చెబుతాడు.

ఈవిధంగా గృహస్థుడు ధర్మాచరణము ద్వారా సంతుష్టి చెందుతున్నాడు. ఇలా ప్రయత్నించి సుఖమును పొందుటయే గాక, కొన్ని సమయాలలో ఆశించకుండానే పుణ్యము గృహస్థుని సమీపించును. అతిథి రూపములో అనుగ్రహించును. ఈ విషయమును కూడా కశ్యపుడు ప్రస్తావించుచున్నాడు.

"శుభచరితా! ఒకవేళ నీవు గృహాసక్తవై యుండగా ఇంటికి వచ్చిన యతిథి అపూజితుడై వెడలలేదు గదా!" యని కశ్యపు డడిగెను.

అతిథి భగవత్స్వరూపమని శాస్త్రము ప్రవచించినది. నారాయణరూపుడైన అతిథి గృహస్థు నాశ్రయించునేగాని యతి ననుసరించడు. అతిథి అభ్యాగతుల నాదరించే సంస్కారమును గృహస్థుడు కలిగియుండాలి. పరమాత్మ గృహస్థుని పరీక్షింప బూనినచో అతిథి రూపముననే యరుదెంచును. ఏ గృహమున అతిథి తిరస్కరింపబడునో ఆ గృహమున శుభము నశించునని శాస్త్ర నిర్ణయము.

గృహేషు యే ష్వతిథయో నార్చితాః సలిలైరపి
యది నిర్యాన్తి తే నూనం ఫేరు రాజ గృహోపమాః

"ఏ గృహముల నుండి జలము నైనను స్వీకరించకుండా అతిథులు తిరిగి పోవుదురో అట్టి గృహములు నక్కల నిలయముల వంటివి" అని కశ్యపుడనెను.

అతిథిని కనీసము జలముతో నైన సంతృప్తి పరచవలెనని కశ్యపు డనుచున్నాడు. ఒకవేళ వచ్చిన అతిథికి దాహము లేక పోవచ్చును. పిపాస లేనివాడు మన ధర్మాచరణమునకు హారతులిచ్చేందుకు కడుపును కొలనుగా మార్చుకోలేడు గదా! ధర్మ రహస్యాలను సూక్ష్మబుద్ధితో గ్రహించాలి. జలమునందు చల్లబరచే సుగుణ మున్నది. అతిథి హృదయమును చల్లబరచే రీతిలో మనము వర్తించాలని దాని భావము.

"మనస్వినీ! నీ పుత్రులు క్షేమమా? నీవు అస్వస్థతగా యున్నట్లు నీ ముఖము చెప్పుచున్నది" యని చివరగ కశ్యపు డడిగెను. సమాజమును, సత్పురుషులను, అతిథులను గూర్చి పరామర్శించిన పిదప నిజపుత్రుల క్షేమమును కశ్యపు డడుగుచున్నాడు. అవును. గృహస్థుడాచరించు ఉన్నత ప్రమాణములతో గూడిన ధర్మమే తన బిడ్డలకు శ్రీరామరక్ష యగుచున్నది. కనుక నిత్యము ధర్మాచరణమును కొనసాగించాలి. ధనాన్ని

ఎవరైనా కూడబెట్టగలరు. ధర్మాన్ని కూడబెట్టేవారే ధన్యాత్ములు. దివ్యాత్ములు. మరి ఈ ధర్మాన్ని ఎలా కూడబెట్టాలి? ఈ విషయంలో ధర్మశాస్త్ర మందించిన విశిష్ట విషయమును తెలిసికొందుము.

ధర్మం శనై స్సంచిను యాత్ వల్మీక మివ పుత్తికాః
పరలోక సహాయార్థం సర్వభూతా న్యపీడయన్

తేనెటీగలు ప్రతిరోజు పుష్పాలపై వ్రాలి, యందలి మకరందమును గ్రహించి, మెల్లగా తేనెపట్టును తయారుచేస్తాయి. అది తనకు, పరులకు ఉపకరిస్తుంది. అలాగే మానవుడు నిత్యము ధర్మాచరణము ద్వారా కూడబెట్టిన ధర్మఫలమును తాననుభవించుటయే గాక ఇతరులకు గూడా తృప్తి నొనగూర్చును. ఇచ్చట మరొక అంతర్భావమును గూడ గ్రహించాలి. తేనెటీగ మకరందమును గ్రహించునే గాని పూలతేకులను పాడుచేయదు. అలాగే ధర్మాచరణము నందు పరులను బాధించకూడదు. ఇతరులను బాధించే ధర్మ జీవనము ఇహపర సుఖనిరోధము.

కశ్యపుని దివ్యములైన ప్రశ్నల నాలకించిన అదితి తన పరితాప కారణమును కశ్యపునకు తెలియజేసెను. "మహాత్మా! బ్రాహ్మణులు, గోవులు, ధర్మము, మానవులు క్షేమముగనే యున్నారు. ఈ విధముగా ధర్మబోధ నను(గహించు పూజనీయుడవగు నిన్ను బొందిన నాకు వెలితి యుండదు.

సర్వం భగవతో బ్రహ్మ న్నను ధ్యానా న్న రిష్యతి

"మీ ధ్యానవైభవము నా ధర్మమునకు హానిని కలుగనీయదు. సువ్రతుడా! దానవులు దేవతల సంపదల నపహరించి వారిని పరాభవించినారు. రాజ్యభ్రష్టుల గావించినారు. ఎండ నెరుగని ఇంద్రుని సతి పలువంచలబడి తిరుగుచున్నది. త్రిలోక రాజ్యాధిపత్యము పోగా ఇంద్రుడు కానలలో పరిభ్రమించుచున్నాడు. మహేంద్రుని పుత్రులైన జయంతుడు మొదలైనవారు బోయ బాలురతో అడవులలో చరించుచున్నారు. అమరావతీపురము అసురులకు నిలయమాయెను. యాగబలిమితో బలిసియున్న బలి నెదుర్కొను సామర్థ్యము దేవతలకు లేదాయెను. మహాత్మా! నీవు కళ్యాణ ప్రదుడవు. ధర్మవేత్తవు. సురాసురు లిరువురు నీ బిడ్డలేయైనను దేహములో దుష్టాంగమును ఖండించునట్లు నీవు దానవులను సంహరించక తప్పదు. పరమేశ్వరునకు సర్వులపై సమదృష్టి యున్నను, భక్తులపై అధిక ప్రేమను జూపునట్లు, నీవు దేవతలగు నీ కుమారులను రక్షింపవలెను" అనెను.

అదితి మాటల నాలకించిన కశ్యపుడు "కళ్యాణీ! మాయ దుస్తరమైనది. దానిచేత ఈ జగత్తు స్నేహబద్ధమై గోచరించుచున్నది. నిత్యమైన ఆత్మ నెఱుగని దోషముచేత దేహముతో తాదాత్మ్యము చెంది, పతి పుత్రులయందు మమకారమును పెంచుకొనుట జరుగుచున్నది. నిజానికి ఈ ప్రపంచములో ఎవరికి ఎవరితో బంధమున్నది?" యని దివ్యదృష్టి చేత భవిష్యత్తును దర్శించినవాడై అదితితో భాషించెను.

మ॥ జనకుం డెవ్వడు జాతు డెవ్వడు జనిస్థానంబు లెచ్చోటు సం
జననం బెయ్యది మేను లేకాలది సంసారంబు లేరూపముల్
వినుమాయింతయు విష్ణుమాయ దలపన్ వేఱేమియున్ లేదు మో
హ నిబంధంబు నిదాన మింతటికి జాయా! విన్నబోవేటికిన్.

"కురుకుల శిరోమణీ! తండ్రి యెవడు? పుత్రు లెవరు? దేహము లేపాటివి? దేహ లెంత వరకు? అంతయూ విష్ణుమాయయే గాని ఇచ్చట శాశ్వత మేదియును లేదు" అని చెప్పెను.

కశ్యపుని హితోపదేశము అదితిని సంతృప్తి పరచలేకపోయెను. పుత్రప్రేమ సత్యమును గ్రహించుటకు వెనుకాడెను. అది గ్రహించిన కశ్యపుడు ఆమెకు తరుణోపాయ మును తెలియజేసెను.

"దేవీ! దానవు లిపుడు శుక్రుని సేవించుచున్నారు. బ్రహ్మచర్యము నవలంబించు చున్నారు. అట్టివారిని భగవంతుడు కూడా సంహరింపలేడు. నీవు సర్వేశ్వరుని ధ్యానింపుము. శక్తి వలన గానిచో యుక్తి వలన పరమాత్మ నీకు శుభముల నొనగూర్చును. భక్తి ఎన్నడూ వృథాగాదు. శ్రీహరి నీ యభిలాషను దీర్చును. పూర్వము బ్రహ్మదేవుడు నాకు పయోవ్రతమును చెప్పెను. దీనినే పయోభక్షణ వ్రతమనియు, దుగ్ధపాన వ్రతమనియు పిలుతురు. ఈ వ్రతము నాచరించి నేను కేశవుని కృపకు పాత్రుడనైతిని. అద్దానిని నీకు తెలిపెదను. నీవు ఆచరించి, విష్ణువు నర్చింపుము. నీకు సర్వశుభములు చేకూరి, ఆవేదన లంతరించును" యని కశ్యపుడనెను.

సర్వయజ్ఞ ఫలరూపము, సర్వవ్రత ఫలదాయకము, తపోసారము, ఈశ్వర తృప్తి కరమునగు పయోవ్రతము నాచరించు విధిని తెలిపెను. వెంటనే అదితి పయోవ్రతమును పండ్రెండు రోజులు భర్త చెప్పినట్లుగా ఆచరించినది. సద్విషయము అందుట యనునది పూర్వజన్మ సుకృతముపై ఆధారపడి యుంటుంది. అందిన దానిని ఆచరించుట యనునది పురుషార్థమునకు వన్నెనిస్తుంది. ఆచరణయే వ్యక్తికి ఔన్నత్యమును ప్రసాదిస్తుంది.

To accept good advice is but to increase one's ability

"సుభాషితాన్ని ఔదల దాల్చడ మంటే మన సామర్థ్యాన్ని పెంపొందించు కోవడమే అవుతుంది" అంటాడు గోథే.

అదితి ఏకాగ్రబుద్ధితో వ్రతము నారంభించినది. బుద్ధియనెడి సారథి ద్వారా, మనస్సనెడి పగ్గముచే ఇంద్రియములనెడి చెడు గుఱ్ఱములను నిరోధించినది. చిత్తమును పరమాత్మ యందే లగ్నమొనర్చి పయోవ్రతము నాచరింపసాగింది.

అదితి అచ్యుతుని దర్శించుట

అదితికి భగవానుడు దర్శన మొసంగెను. ఆదిపురుషుడైన భగవానుడు చతుర్భుజుడై, పీతవాసుడై, శంఖచక్ర గదాధారియై దర్శన మొసగెను. అదితి సాష్టాంగ

దండప్రణామ మాచరించెను. ఆనందముతో ఆమె నేత్రములు అశ్రుపూర్ణము లాయెను. భగవద్దర్శనము వలన కలిగిన దివ్యానందము వలన ఆమె శరీరము కంపించసాగెను. పరమాత్మను కనులార దర్శించుచు ఆమె మెల్లమెల్లగ స్తుతించెను.

యజ్ఞేశ యజ్ఞపురుషాచ్యుత తీర్థపాద తీర్థశ్రవః శ్రవణ మఙ్గళ నామధేయ
ఆపన్నలోక వృజి నోపశమో దయాద్య శం నః కృధీశ భగవన్నసి దీననాథః

"యజ్ఞేశా! యజ్ఞపురుషా! అచ్యుతా! తీర్థపాదా! తీర్థశ్రవా! శ్రవణ మంగళ నామధేయా! ఆపన్నులగు జనుల శోకము నుపశమింప జేయువాడా! ఆదిదేవా! దీననాథ! మాకు శుభములు కలుగ జేయుము" యని పరమాత్మను అదితి స్తుతించెను. పుష్కరాక్షుడైన పరమాత్మ అదితితో ఇలా పలికెను:

"దేవమాతా! నీ మనస్సును గ్రహించితిని. శత్రువులచే బాధింపబడి, స్వస్థానము లను త్యజించిన పుత్రులను గూర్చి నీవు విచారించుచున్నావు. వారిని పూర్వవైభవముతో జూచుటకు ఇష్టపడుచున్నావు. అసురులు ప్రస్తుతము అజేయులై యున్నారు. భగవత్కృపకు పాత్రులైనవారి రక్షణలో యుండువారిని ఎవ్వరూ జయించలేరు. అయినను నేను నీ వ్రతముచే తృప్తి చెందితిని. శక్తిచేత జయించుటకు వీలుగాని అసురులను యుక్తితో జయించాలి. నా కొరకు చేసిన పూజలేవీ వ్యర్థముగావు. తల్లీ! నేను నీ గర్భములో కుమారుని రూపమున ఉదయింతును. నేను నీ పతియందు ఉండెదను. నీవు నీపతిని పరమాత్మ స్వరూపముగా వీక్షించి సేవింపుము" యని పలికి శ్రీహరి అంతర్హితు డయ్యెను.

భగవానుడు తనయందు ప్రవేశించినట్లు కశ్యపునకు అనుభూతి కలిగెను. సతీపతులు నారాయణుని ధ్యానింపసాగిరి. భార్యాభర్త లిరువురు భక్తి కలిగి నామము యందు మనస్సును నిలిపినచో వారికి భగవానుడే బిడ్డయై జనించును.

అదితి గర్భము ధరించెను. నవమాసములు గడచెను. పరమాత్మను గూర్చి నిరంతరము స్మరించుచు అదితికశ్యపులు ఆ దివ్యాత్ము డెప్పుడావిర్భవించునో యని ఆతురతతో యుండిరి. పరమాత్మ దర్శనాభిలాషులై క్షణమొక యుగముగా గడుపసాగిరి. పరమాత్మ కొఱకు పరితపించని వారికి భగవద్దర్శనము లభించదు. శ్రద్ధను బట్టి జ్ఞానము లభించును. భక్తిని బట్టి దర్శనము ప్రాప్తించును. అహర్నిశలు అదితికశ్యపులు భగవన్నామమునే జపించుచుండిరి. నామము నామిని దరిజేర్చును. భగవానుడు జన్మించెను.

వామన చరిత్ర

భగవానుడు ప్రాదుర్భవించెను. అపూర్వ సౌందర్యముతో ఆయన వదనము ప్రకాశించుచు సర్వుల నాకర్షించుచుండెను. దిక్కులు నిర్మలము లయ్యెను. నదీజలములు ప్రశాంతముగ పారుచుండెను. జనుల చిత్తములు ప్రసన్నములయ్యెను. ప్రకృతియంతయు శోభాయమానముగ గన్పట్టుచుండెను. శంఖ దుందుభులు, మృదంగ పణవానకములు

మ్రోగినవి. దేవాంగనలు సంతృప్త హృదయులై నృత్యము లొనరించిరి. దేవతలు పుష్ప వృష్టిని గురిపించిరి.

శా॥ చింతంబాపిరి యక్షతార్క్ష్యసుమన సిద్ధోరగాధీశ్వరుల్
సంతోషించిరి సాధ్యచారణమునీశబ్రహ్మవిద్యాధరుల్
గాంతిం జెందిరి భానుచంద్రములు రంగద్గీతవాద్యంబులన్
గంతుల్ వైచిరి మింట గింపురుషులున్ గంధర్వులుం గిన్నరుల్.

పరమ పురుషుడైన భగవానుని దర్శించి అదితి కశ్యపులు పరమానంద భరితులైరి. పుట్టిన కొన్ని క్షణములలోనే భగవానుడు విచిత్రముగా వటుని రూపమును ధరించెను. ఏడు సంవత్సరముల బాలుడై గన్పట్టెను.

బభూవ తే నైవ స వామనో వటుః సంపశ్యతో ర్దివ్య గతిర్యథా నటః

"తల్లిదండ్రులు గాంచుచుండగనే అద్భుత చరితుడగు వటునివలె బ్రాహ్మణ బ్రహ్మచారి రూపమును ధరించెను. అందుచేత భాగవతములో వామనుని బాల్యక్రీడలు వర్ణించలేదు. మహర్షులా బ్రాహ్మణ బాలుని దర్శించి పరవశించిరి. కశ్యపుని కోర్కెపై ఆ బాలునకు జాతకర్మాదులను జేసిరి. ఇవి సంస్కారాలని పిలువబడుతాయి. సంస్కారాల ద్వారా జీవులు శుద్ధిబొందుతారు. **"సంస్క్రియన్తే ఏభిరితి సంస్కారాః"** సంస్కరించునవి గనుక అవి సంస్కారములైనవి.

జాతకర్మ చాలా విశిష్టమైనది. ఈ సంస్కారము వలన బిడ్డలు వృద్ధిచెందిన పిదప చక్కని సంస్కారు లగుదురు. బిడ్డడు పుట్టగనే తండ్రి వచ్చి బిడ్డ ముఖమును చూడాలి. పుత్ర ముఖదర్శనంతో అంతవరకు మిగిలియున్న పితృఋణం తీరిందని భావము.

ఋణా త్పితా విముచ్యేత పుత్రస్య ముఖ దర్శనాత్

అని శాస్త్ర ప్రమాణము. అలా బిడ్డను దర్శించిన పిదప జనకుడు సచేలస్నానం చేయాలి. కట్టుకున్న వస్త్రముతో స్నానము చేయుటను సచేలస్నాన మంటారు.

పుత్రే జాతే పితుః స్నానం సచేలం తు విధీయతే

అని చెబుతారు. స్నాన సమయంలో తండ్రి మెల్లగా దిగకూడ దంటారు. ఎగిరి దుముకాలి. అలా దుమికినపుడు నీరు పైకి చిమ్ముతుంది. దీని భావమేమనగా ఈ వంశమున బిడ్డడు జన్మించినాడు. అతడు శ్రాద్ధ తర్పణాది క్రియల ద్వారా పితృదేవతలను సంతృప్తి పరచును యని పైకి చిమ్మిన జలము సూచించును. జాతకర్మ సంస్కారముతో జాతారిష్టాలు తొలగుతాయి. జాతకర్మ సంస్కారము కాగానే తల్లి తన స్తనమును బంగారు ఉంచిన జలముతో కడిగి బిడ్డనోటికి అందించి అభిమంత్రిస్తుంది.

యస్మై త్వగ్గ్ స్తన ప్రప్యాయాయు ర్వర్చో యశోబలం

"ఓ పయోధరమా! నా బిడ్డకు దీర్ఘాయుష్షును, దేహకాంతిని, కీర్తిని, శక్తిని ప్రసాదించు క్షీరమునందించి, అతడిని అనుగ్రహింపుము" యని ప్రార్థించును.

ఉపనయన సమయమున ఆదిత్యుడు గాయత్రి నుపదేశించెను. బృహస్పతి యజ్ఞ సూత్రమును ప్రసాదించెను. కశ్యపుడు మేఖల నొసగెను. భూదేవి కృష్ణాజినము నిచ్చెను. తల్లియగు అదితి కౌపీనము నిచ్చెను. బ్రహ్మ కమండలము నిచ్చెను. సప్తఋషులు దర్భలను ప్రసాదించిరి. శారద అక్షమాల నిచ్చెను. కుబేరుడు అక్షయపాత్ర నొసగెను. భవాని భిక్షపెట్టెను.

బలిచక్రవర్తి భృగువత్స మనుచోట అశ్వమేధ యాగమాచరించుచు, అక్షయ దానము లొసగుచున్నాడని వామనునకు తెలిసెను. విప్రులతో కలసి వామనుడు భృగువత్సమున కేగెను. భృగువంశీయులగు బ్రాహ్మణుల ఎదుట సూర్యుని వలె తేజోమయుడై గోచరించెను.

క॥ వెడవెడ నడకలు నడచుచు వెడనెడ నడు గిడక నడరి యిల దిగబడ గా
బుడిబుడి నొడువులు నొడువుచు జిడిముడి తడబడగ వడుగు పేరెన్ రాజున్.

వామనుడు నడచుచుండగా కృప, ఐశ్వర్యము మున్నగువాని భారముచేత ప్రతి అడుగునందును భూమిని అవనతము చేయుచు బలి కడకేగెను. సభాసదులు వామనుని గని ఈవిధముగా తలపోసుకొనిరి.

శా॥ శంభుండోహరియోపయోజభవుడో చడాంశుడో వహ్నియో
దంభాకారత వచ్చె గాక ధరణిన్ ధాత్రీసురుం డెవ్వ డీ
శుంభద్యోతను డీమహోజ్జ్వలతను డంచున్ విస్మయభ్రాంతులై
సంభాషించిరి బ్రహ్మచారి గని తత్సభ్యుల్ రహస్యంబుగన్.

వామనుడు యజ్ఞశాలలో కొందరితో చర్చించును. కొందరితో గోష్టి జేయును. కొందరితో తర్కించును. మరి కొందరితో ముచ్చటలాడుతూ నవ్వును. ఇలా చేయుచు బలిని సమీపించెను. కుశ పవిత్రాక్షత సంయుతంబగు దక్షిణ హస్తమును సాచి ఆశీర్వదించెను.

ఉ॥ స్వస్తి జగత్రయీభువన శాసనకర్తకు హాసమాత్రవి
ధ్వస్తనిలింపభర్తకు నుదారపదవ్యవహర్తకున్ మునీం
ద్రస్తుతమంగళాధ్వరవిధానవిహర్తకు నిర్జరీగళ
న్యస్తసువర్ణసూత్రపరిహర్తకు దానవలోకభర్తకున్.

వామనుని స్వస్తి వచనములతో సంతుష్టచిత్తుడైన బలిచక్రవర్తి ఆయనకు ఉచితాసనమును సమర్పించెను. పాదములను కడిగి, ఆ పవిత్ర పాదోదకమును శిరమున ధరించెను. ఏ పవిత్ర పాదతీర్థమును మహేశ్వరుడు శిరమున ధరించెనో, ధర్మరూపుడైన బలిగూడ ఆ దివ్య పాదోదకమును శిరమున జల్లుకొని వామను నుద్దేశించి ఇలా పలికెను:

మ॥ వడుగా! యెవ్వరివాడ వెవ్వడవు సంవాసస్థలం బెయ్య ది
య్యెడకున్ నీవరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మముం
గడుధన్యాత్ముడ నైతి నీమఖము యోగ్యం బయ్యె నాకోరికల్
గడతేఱెన్ సుహుతంబులయ్యెశిఖులుం గల్యాణమిక్కాలమున్

"మహాత్మా! నమస్కారము. నిన్ను గొప్ప తపస్విగా నేను గాంచుచున్నాను. నీవు నా గృహమున కాలిడుట వలన నా పితృదేవతలు సంతుష్టచిత్తులై యుందురు. నా వంశము పవిత్రమయ్యెను. నా యజ్ఞము సఫల మయ్యెను. నీ పవిత్ర పాద స్పర్శచేత ధరణి గూడా పవిత్రమైనది. వటుడా! నీవు అర్థించువానివలె గన్పట్టుచున్నావు. వలసిన దానిని వచింపుము. నా నుండి స్వీకరించి నన్ను కృతార్థుని గావింపుము. నీకేది కావలయునో తెలుపుము.

మ॥ వరచేలంబులో మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులో విశిష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీఖండమొ కాక యేమడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా!

అని బలిచక్రవర్తి వినమ్రుడై యడిగెను. బలి వచనముల నాలకించిన వామనుడు సంతృప్త హృదయుడై, "రాజా! ముదావహము. నీవు మహానుభావుడైన ప్రహ్లాదుని మనుమడవు. శుక్రాచార్యుని శిష్యుడవు. నీ వాక్కులు సత్య స్వరూపములు. ధర్మయుతములు. కులోచితములు. యశస్కరములు. ఇంతవరకు మీ వంశమున గరుణానువర్తులు, ఘనసత్త్వ మూర్తులే ఉదయించిరి. రణభీరువులు లేరు. వితరణ భీరువులు లేరు. ఇంతవరకు నీ వంశమున యాచించిన విప్రుడు రిక్తహస్తములతో తిరిగివెళ్ళుట జరుగలేదు. మాటతప్పిన వారు నీ కులమందు ఉద్భవించలేదు. క్షుద్రమనస్కులు ఆవిర్భవించలేదు. మీ తాత యగు ప్రహ్లాదుడు దివ్యకీర్తితో గగనమున చంద్రుని వలె శోభించుచున్నాడు.

"రాజా! మీ పూర్వీకులలో అజేయుడైన హిరణ్యాక్షుడు గదాహస్తుడై భూమండలము నంతటిని ఒంటరిగ పర్యటించినను అతనిని ఎవ్వరును ఎదుర్కొన లేకపోయిరి. శ్రీహరి వరాహమూర్తియై అవతరించి అతి కష్టముతో అతనిని సంహరించెను. హిరణ్యాక్షుడు మరణించగనే అతని సోదరుడగు హిరణ్యకశిపుడు విష్ణువును వధించుటకు వైకుంఠము నకు వెడలెను.

"శూలాయుధమును ధరించి యముని వలె నరుదెంచుచున్న హిరణ్యకశిపుని గని, ఇతనికి దూరముగా వెడలుట సాధ్యపడదని విష్ణువు అతని హృదయమునందే ప్రవేశించెను.

"రాజా! ప్రహ్లాదుని పుత్రుడును, నీ తండ్రియును అగు విరోచనుడు త్యాగధనుడు. దేవతలు బ్రాహ్మణ వేషధారులై వచ్చి యర్థించుచుండిరని తెలిసినను, కాదనక వారికి తన ఆయువు నొసంగెను. నీవు గూడ వారి మార్గముననే చరించుచుంటివి. ధర్మమార్గము

నెన్నుకొని ఆదర్శమయుడ వగుచుంటివి. రాజా! ఇక నా విషయమును గూర్చి యడిగితివి. చెప్పెదను. వినుము.

సీ॥ ఇది నాకు నెల వని యేరీతి బలుకుదు నొక చో టనక యెందు నుండ నేర్తు
నెవ్వనివాడ నం చేమని నుడువుదు నాయంతవాడనై నడవనేర్తు
నీ నడవడి యని యెట్లు వక్కాణింతు బూని ముప్పోకల బోవనేర్తు
నదినేర్తు నిదినేర్తు నని యేల జెప్పంగ నేరుపు లన్నియు నేన నేర్తు
ఆ॥ నొరులు గారు నాకు నొరులకు నే నాదు నొంటివాడ జుట్ట మొకడు లేడు
సిరియు దొల్లి గలదు చెప్పెద నా టెంకి సుజనులందు దఱచు సొచ్చి యుందు.

"రాజా! అంతకు మించి నన్ను గూర్చిన వివరము లేవియును లేవు. ఇక నన్ను యాచింపుమని పలికితివి. దానవేశ్వరా! నేను ఒంటరివాడను. బ్రాహ్మణుడను. నాకు మూడడుగుల భూమిని సమర్పించిన జాలును" యని వామనుడనెను.

వామనుని మాటల నాలకించిన బలి విస్మితుడై, "బాలుడా! నీ వాక్కులు ప్రశంస నీయములై, వృద్ధ సమ్మతములై యున్నవి. కానీ నీవు బాలుడవగుట చేత స్వార్థము నెరుగని వాడనై దేనిని కోరవలెనో దెలియకుంటివి.

"నన్ను గొప్పదాతగా కీర్తించితివి. అల్పమగు మూడడుగల దానము నడుగుచుంటివి. దాతయొక్క పెంపు సొంపులను గాంచనవసరము లేదా? నాయనా! నన్ను యాచించినవాడు మరియొకరిని యాచింప బనిలేదు. కనుక నీవు నన్ను యధికముగా అర్థింపుము" యనిన బలితో వామను డిలా పలికెను:

"రాజా! ముల్లోకముల యందు ప్రియమగు వస్తువు లేవి గలవో అవి ఇంద్రియము లను పెడదారి పట్టించునవియే గాని వాంఛా పూర్ణములు గానేరవు. మూడడుగుల భూమిచే నాకు సంతోషము కలుగనిచో, సప్తద్వీపములను బొందినను సుఖము లభింపదు. ఉన్న వస్తువు ఎప్పుడూ లేని వస్తువును గుర్తుచేసి, బాధించుచునే యుండును. కనుక కోరికలనేవి అంతమొందించు కొనుటకే గాని తృప్తిపరచు కొనుటకు గాదు. లభించిన వస్తువుతో తృప్తి చెందువాడు సుఖించును గాని, అజితేంద్రియుడు సుఖింపలేడు.

"రాజా! త్రిలోక నాథుడనైన నిన్ను అంతటి స్వల్పమైన కోరికను గోరుట సమంజసము గాదని నాకు తెలియును. కానీ నేను విప్రుడను. అవసరమైన దానినే యడిగితివి. మించిన ధనము మనుజుని ఏనాడైనా ముంచును. "విత్తమ్ యావత్ప్రయోజనమ్" అవసరము ననుసరించియే విత్తముండవలెను. బ్రహ్మచారినైన నాకు నా ఆశ్రమ ధర్మానుసారము గొడుగో, జందెమో, కమండలువో అవసరములు గాని గృహారామాదులు, కాంచన కన్యాదుల యొక్క అవసర మేమున్నది?

మ॥ గొడుగోజన్నిదమోకమండలువొ నాకున్ ముంజియోదండమో
నడు గేనెక్కడు భూము లెక్కడ కరుల్ వాహాశ్వ లశ్వంబు లె
క్కడ నిత్యోచితకర్మ మెక్కడ మదాకాంక్షామితంబైన మూ
డడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటది బ్రహ్మాండంబు నాపాలికిన్.

"రాజా! తాము త్యాగధనులు. నేను నిర్ధనుడ నైనను లోభము తెలియని వాడను. మీరు ఉదారులు. కానీ నాదారి సరిగా యుండవలెను గదా! సంతృప్తి సదా సంతృప్తిని పెంచును. లోభము లోభమును వృద్ధిచేయును. ఆశ భయంకరమైనది. వయస్సు గతించినా ఆశ నశించదు. లోభము పాపాచరణమునకు నాంది పలుకును. యాచకుడు అవసరము ననుసరించి యాచింపవలెను. కూడబెట్టుటకు యాచింప గూడదు" యనెను.

లోభమువలన శాంతి నశించును. ప్రతిజీవి మనోవృక్షము నుండి కూడబెట్టవలె ననెడి ఊడలు దుర్భేద్యములై జారియున్నవి. ఈ కారణముగా ఎవరికీ శాంతి లభించుట లేదు. ఈనాడు యాచకులు గూడ తృప్తిగా లేరు. వారికి గూడ బ్యాంక్‌ఖాతా లుండుటయే దుఃఖమునకు కారణమైనది.

వామనుడు పలుకుచున్నాడు: "రాజా! అత్యాశాపరులకు సప్తద్వీపాల నొసగవచ్చు. కానీ తృప్తి పరచలేరు. సంతృప్తి చెందు హృదయాలు శాంతి నిలయాలు. శాంతమూర్తి లోకపూజితుడగును. ఆశల వలయంలో చిక్కినవాడు అభాగ్యుడగును. నిర్భాగ్యుడగును. ఆశయొక్క అంతమును చూడ నిచ్చగించి తన అంతమును జూచును.

శా॥ ఆశాపాశము దా గడున్ నిడుపు లేదంతంబు రాజేంద్ర! వా
రాశిప్రావృతమేదినీవలయసామ్రాజ్యంబు సేకూడియున్
గాసిం బొందిరిగాక వైన్యగయభూకాంతాదులు న్నర్థకా
మాశన్ బాయగ నేర్చిరే మును! నిజాశాంతంబులం జూచిరే!

"రాజా! సంతృప్త హృదయునకు సదా సుఖములే లభించును. తృప్తిలేని వాని వైభవము నీరు పడిన నిప్పువలె నశించును. నీవు రాజువని ఆశను ముందుంచుట నాకు సముచితము గానేరదు. నే నడిగిన పదత్రయమును నా కొసగిన చాలును" యనెను.

బలిచక్రవర్తి మందహాసమును చిందించెను. దాన మొసంగుటకు జలపాత్రను గ్రహించెను. ఇంతలో రహస్య మెరిగిన శుక్రాచార్యుడు బలిని సమీపించెను.

"రాజా! పొరబడుచున్నావు. కాస్త నిగ్రహముతో యోచింపుము. వచ్చినవాడు వటుడుగాడు. కపటియై యున్నాడు. అతడు విష్ణువే యని గ్రహింపుము. ముందు వెనుక లాలోచింపకుండా దానమిచ్చెదనని పలికితివి. ఇది దానవ సామ్రాజ్యమునే నశింపజేయు కార్యముగ గన్పట్టుచున్నది. ఇతడు నీ రాజ్యము నంతటిని సంగ్రహించి సురరాజున కొసంగును. పదత్రయము నడుగుటలో ఆతని ఆంతర్యమును నీవు గ్రహింపకుంటివి. అతడు మూడడుగులతో ముల్లోకముల నాక్రమించును. ఆ తరువాత నీవెలా జీవింతువు? నీపై ఆధారపడిన వారి నేమి జేయుదువు?

"అతడు మొదటి పాదముతో భూమి నాక్రమించును. రెండవ పాదముతో స్వర్గము నాక్రమించును. అతని మూడవ పాదమును అపుడు ఎచ్చట నుంచగలడు? అప్పుడు నీవు చేసిన ప్రతిజ్ఞ కుంటుబడును. మాట తప్పిన దోషానికి నీకు నరకము ప్రాప్తించును. తన్ను మాలిన ధర్మము మొదలు చెడ్డబేరము. అట్టి దానములు శాస్త్ర సమ్మతములు గూడ కావు. తాను జీవించి గదా సకల పురుషార్థములను బొందవలెను" యని పలికెను.

శుక్రుని మాటల నాలకించిన బలి, "గురుదేవా! నేను మాట ఇచ్చినాను. దాన మివ్వనిచో మాట తప్పినవాడ నగుదును. అధర్మపరుడ నగుదును. అపకీర్తిని బొందెదను. పూర్వీకుల వైభవమును నశింపజేసినవాడ నగుదును. అసత్య మాడినచో పాపము సంక్రమించును గదా!" యనెను. దానికి మేధావియగు శుక్రాచార్యుడు ఈవిధముగా సమాధాన మొసగెను.

"దానవేంద్రా! దానికి తరుణోపాయము గలదు. చెప్పెదను. ఈ రహస్యమును అవధానముతో గ్రహింపుము. ఈ విషయమున ఋగ్వేదమున ఒక విషయము చెప్పబడి యున్నది. దాని ననుసరించి నీవు రక్షింపబడుము.

సత్య మోమితి యత్ప్రోక్తం యన్నేత్యాహో నృతం హి తత్

"ఓం" యనెడి అంగీకారముతో పలికినది సత్యము. "న" అనగా లేదని నుడివిన అసత్యము."

"రాజా! రాగి కలియనిచో స్వర్ణమునకు వన్నెరాదు. అసత్యము చేరనిచో సత్యము నకు పూర్ణశోభ లభింపదు. దేహమనెడి వృక్షమునకు సత్యము ఫలమైయున్నది. దేహము అసత్యము. సత్యము నిత్యము. దేహములేనిచో సత్యము అనుభవమునకు అందదు. కనుక నిత్యమైన సత్యమును గ్రహించుటకు అనిత్యమైన దేహము అవసరమే గదా!

"చెట్టు యొక్క మూలమును ఛేదించినచో చెట్టే నశించును. అలాగే అసత్యము కనుమరుగైనచో సత్యమే అదృశ్యమగును. కనుక అసత్యము అనుసరణీయమే. అలాగని అసత్య వాక్కులకే అలవాటు పడినవాడు నిందితు డగును. దోషి యగును. అతడు బ్రతికి యున్నను మరణించినవాడే. కనుక కొన్ని అనివార్య పరిస్థితుల యందు బొంకిన తప్పులేదు.

ఆ॥ వారిజాక్షులందు వైవాహికములందు బ్రాణవిత్తమాన భంగమందు
జకితగోకులాగ్ర జన్మరక్షణమందు బొంకవచ్చు నఘము వొంద దధిప!

"రాజా! స్త్రీలను వశపరచుకొనుట యందును, వివాహములు కుదుర్చుట యందును, ప్రాణము కొఱకు, విత్తము కొఱకు, మానభంగము నందును, గో బ్రాహ్మణు లను రక్షించుట యందును అసత్యము లాడదగును. దానిచే పాపము సంక్రమించదు" యని శుక్రుడు పలుకగా బలిచక్రవర్తి గురువచనములను కొన్ని నిమిషములు ఔదలదాల్చెను. అతని గురుబోధ తనకు వర్తించేది గాదని గ్రహించెను. అనృతదోషాన్ని పొందుటకు మనస్సు అంగీకరించలేదు.

బలి ఆలోచించెను. వచ్చినది వెన్నుడే యైనచో తన దానతీరుయే మారిపోవును. మొదట బాలుడని భావించుట జరిగెను. ఇప్పుడు శ్రీమన్నారాయణుడే యని తెలిసినది. ఇంతకన్నను ఏమి కావలెను? సర్వము నారాయణార్పణము గావించుటకన్నను కావలసిన దేమున్నది?

దానము గ్రహించువానిలో కృష్ణుని దర్శించి దానముచేయుట మన సంప్రదాయము. అందుచేతనే భాగ్యవంతులైన స్త్రీలు గూడా బిచ్చమొసంగిన పిదప బిచ్చగానికి నమస్కరింతురు. అలాంటప్పుడు సాక్షాత్తు నారాయణుడే దానమును గ్రహించునపుడు అంతకన్నను కావలసిన దేమున్నది? యని బలి చింతించెను.

భిక్ష, దాన ప్రదానముల యందు సనాతన ధర్మము చక్కని అవగాహనను కలిగి యున్నది. అందుచేతనే బిచ్చగాడు నారాయణుడుగా చూడబడుచున్నాడు. కృష్ణార్పణ మని దాతచే పలికించు చున్నాడు.

భిక్షుకాః నైవ భిక్షంతి బోధ యన్తి గృహే గృహే

"బిచ్చగాడు కేవలము తిరిపమునకు గాక బోధచేయుటకై ఇంటింటికి వచ్చుచున్నా" డని శాస్త్రము పలికింది. ఏమిటి బిచ్చగాని బోధ?

అదాన దోషేన భవేద్దరిద్రః

గత జన్మములో ఎవరికీ దానము చేయని దోషము వలన ఈ జన్మములో నేను బిచ్చగాడినైతిని. ఈ జన్మములో మీరు దానము చేయనిచో రాబోవు జన్మ ఎలా యుండునో ఊహింపుమని చెప్పుటకు బిచ్చగాడు యరుదెంచునని మహాత్ములు ప్రవచించిరి. కనుక దానము అత్యున్నతమైన పావనవ్రతము. మనము అనేక దుష్ట కర్మముల నాచరించి ధనమును సంపాదింతుము. దానము ఈ పాపములను ప్రక్షాళన మొనర్చును. నీటితో దేహము శుభ్రపడునట్లు, దానముతో ధనము పవిత్రమగును.

"గురుదేవా! దానము మాటనొసగినపుడే జరిగిపోయినది. దాన విషయమునందు గ్రహీత కన్నను అనుగ్రహీతయే కీర్తిమంతుడగును. ఈ దానము జగత్తులో కీర్తి ప్రతిష్ఠ లను పెంపొందించును. పరలోకమున అమరత్వమును ప్రసాదించును. కనుక నా నాలుక అసత్యము నెరుగదు. ఈ దానఫల మెలాయున్నను ఆడిన మాట తప్పుట సముచితము గానేరదు.

మ॥ నిరయంబైన నిబంధమైన ధరణీనిర్మూలనంబైన దు
ర్మరణంబైన గులాంతమైన నిజమున్రానిమ్ము కానిమ్ము పో
హరుడైనన్ హరియైన నీరజభవుం డభ్యాగతుండైన నౌ
దిరుగన్ నేరదు నాదుజిహ్వ వినుమాధీవర్య! వేయేటికిన్.

"ఈ దానవ్రతము నాచరించుట వలన వసుధ నశించినను, ప్రాణము హరింప బడినను, కులము అంతమైనను గానిమ్ము. గురుదేవా! వచ్చినవాడు విష్ణువే గావచ్చు. లేదా

శివుడు గానిమ్ము. అదియును గానిచో విరించియే గానిమ్ము. ఏది ఏమైనను నా నాలుక ఆడినమాట తప్పదు. గురుదేవా! ఈ దేహములు అశాశ్వతములు. పదవులు నీటిమూటలు. ఈ ప్రపంచమునకు సర్వులు ఒంటరిగనే వత్తురు. ఒంటరిగానే పోవుదురు. గతంలో ఈ భూమిని రాజు లెందరో పరిపాలించారు. కానీ వారి పేరు మచ్చుకైనను లేదు. శిబి మొదలైన రాజుల కీర్తి వసుంధర యున్నంతవరకు స్థిరముగా యుండును. దాన మహిమ అమోఘము. దానముచేయు భాగ్యమునకు నోచుకొనువారు ధన్యులు. వదాన్యులు. మాన్యులు. ప్రాతఃస్మరణీయులు. పావనాత్ములు.

శా॥ కారే రాజులు?రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?
వా రేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపై
బేరైనం గలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా?

"గురుదేవా! నేను ఈ బ్రాహ్మణ బాలునకు దానమిత్తునని చెప్పితిని. ప్రహ్లాదుని మనుమడనై యుండి మఱల ఇవ్వనని ఎలా చెప్పగలను? అసత్యమునకు మించిన అధర్మ మెచ్చటైనను గలదా? అసత్యవాదియగు మనుజుని తప్ప తాను సర్వులను మోయగలనని భూదేవి చెప్పియున్నది. నేను అసత్యమునకు భయపడు నంతగ నరకమును జూచిగాని, దారిద్ర్యమువలన గాని, దుఃఖప్రాప్తి వలనగాని, స్థానభ్రంశము వలన గాని, మృత్యువు వలన గాని భీతిచెందుట లేదు" యనెను.

సర్వులు మృత్యువును జూచి భయపడుచుందురు. బలిచక్రవర్తికి మృత్యువు కన్నను అసత్యమే భయంకరముగ గోచరించుచున్నది. పాపమును జూచి భీతి చెందువాడు పాపము నాచరింపలేడు. ఈనాడు మనుజులెల్లరు అసత్యమునే భాషించుచుందురు. అసత్యవాది సత్యరూపుడు కాలేడు. అసత్యజీవన ఊబిలో దిగి వ్యథ చెందుచుండును. అసత్యములు అంతఃకరణను కలుషిత మొనర్చును. ధ్యానమును నిరోధించును. విశ్రాంతిని కూడా భంగ మొనర్చును. పరితాపములను కలిగించు పనుల నెప్పుడూ ఆచరించరాదు. సాధారణంగా అబద్ధాలను పలికి అందల మెక్కినామని కొందరు భావించి మురిసి పోవుచుందురు. కాలతీర్పులో అట్టివారు కన్నీటిలో ఈదులాడక మానరు. తమది గెలుపని విఱ్ఱవీగుదురే గాని ఆ గెలుపు వెనుకయున్న ఓటమిని గాంచలేరు.

బలి శుక్రునితో ఇంకను చెప్పుచున్నాడు: "ఆచార్యా! విష్ణువంతటివాడు భీతుడై ప్రచ్ఛన్న రూపముతో బ్రాహ్మణ బాలకునివలె నావద్ద కరుదెంచినాడు. అతడు అధర్మముతో నన్ను హింసించినను, నేను అతనిని బాధించను. ఇచ్చిన మాటను తప్పుట కన్నా ప్రాణమును త్యజించుటయే మేలు" అనెను.

ఇదియే వీరుని లక్షణము. భీరుడు క్షణక్షణమునకు మరణించుచుండును. ఆత్మ విశ్వాసముగల ధీరుడే మరణమును ఒకేసారి దర్శించును. తాను నమ్మిన ధర్మాలను ఆచరింపగలిగే దృఢవిశ్వాసము గలవారే ఈ లోకమున కీర్తిమంతు లగుదురు.

Self trust is the essence of heroism

"ఆత్మ విశ్వాసమే వీరోచిత జీవనసారం" అని ఎమర్సన్ అభిప్రాయపడినాడు.

మేరువు దలక్రిందైనను, భూమి పొడిపొడి యైనను దానము తప్పక ఇత్తునని బలి పలికెను. బ్రాహ్మణ బాలుడు బలిని సంహరించుట కరుదెంచిన విష్ణువు యని పదేపదే గుర్తుచేయుచున్నను బలి చక్రవర్తి అంగీకరించలేదని శుక్రునకు కోపమొచ్చెను. "ఆచార్యా! ఎందులకు శ్రమపడెదరు? అతడు విష్ణువే యైనచో, వాస్తవానికి గెలుపు మనదే" అని బలి పలికెను.

శా॥ ఆదిన్ శ్రీసతికొప్పుపై దనువుపై నంసోత్తరీయంబుపై
బాదాబ్జంబులపై గపోలతటిపై బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు గ్రిందగుట మీదై నాకరంబుంట మేల్
గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే!

"గురూత్తమా! లక్ష్మీదేవిని స్పృశించిన హస్తములు దానమును గ్రహించినపుడు క్రిందికిరాగా, నా చేతులు పైన ఉండును. ఇంతకు మించిన కీర్తి మరియొకటి గలదా? రాజ్యములు శాశ్వతమా? ఆచార్యా! రాజ్యములు శాశ్వతము గావచ్చును. మరి ఈ తనువులు శాశ్వతమా? బాధలు రానిమ్ము! బంధములు కలుగనిమ్ము! ధనము పోనిమ్ము! ప్రాణము విడువనిమ్ము! మాటమార్చి బ్రతుకలేను. ఇచ్చిన మాటను తిరిగి గ్రహింపలేను" అనెను.

ఆ॥ బ్రదుక వచ్చుగాక బహుబంధనము లైన వచ్చుగాక, లేమి వచ్చుగాక,
జీవధనములైన జెడుగాక, పడుగాక, మాట దిరుగలేరు మానధనులు.

అని శుక్రాచార్యుడు గ్రహించినను, శిష్యుడు తన మాట నాలకించలే దనెడి కోపముతో బలిచక్రవర్తిని శపించెను. సంపదలు హరింపబడునని శాపమిచ్చెను.

గురువు శపించెను. ఆపద ఎదురుగ నిలిచి యుండెను. అయినను బలి చలించ లేదు. విప్రబాలకునకు భూమిని దానము చేయుటకు సిద్ధపడెను. రాజ్యములను జయించినవాడు ధీరుడుగాడు. ఐశ్వర్యముల మధ్య తులతూగువాడు ఉత్సాహవంతుడు గానేరడు. జీవితములో ఎన్ని గడ్డు సమస్య లెదురగుచున్నను నవ్వును వదలనివాడు, ధైర్యమును వీడనివాడే నిజమైన ఉత్సాహవంతుడగును. విషమ పరిస్థితులలో నిమలచిత్తు లగువారే నిజ ధైర్యవంతులు.

ఉత్సాహవన్తో హి నరా న లోకే సీదన్తి కర్మ స్వతి దుష్కరేషు

"ఎంతటి దుర్భరము లైనను తాము తలపెట్టిన కార్యముల యందలి అపజయములను గాంచి ఉత్సాహవంతులు చలింపరు" అని శ్రీమద్రామాయణము అరణ్యకాండము నందున్నది.

వామనుని విశ్వరూపము

బలిచక్రవర్తి ధర్మపత్ని యగు వింధ్యావళి జలపూర్ణమైన సువర్ణ కలశమును చేబూని బలిని సమీపించినది. ఆమె వామనుని పవిత్ర చరణములపై జలమును పోయు చుండెను. తన భాగ్యమునకు పొంగిపోతూ, పరవశిస్తూ, బలిచక్రవర్తి ప్రక్షాళన మొనరించెను. విశ్వపావనమగు నా చరణామృతమును శిరమున జల్లుకొనెను.

క॥ సురలోకసముద్ధరణము విరతశ్రీకరణ మఖిలనిగమాంతాలం
కరణము భవసంహరణము హరిచరణము నీట గడిగె వసురోత్తముడున్.

ఆ సమయమున అసంఖ్యాకములైన దుందుభులు మ్రోగినవి. దేవ గంధర్వాదులు బలిపై పుష్పవృష్టిని గురిపించిరి. కిన్నర కింపురుషాదులు ఆయన ఔన్నత్యమును స్తుతించిరి. వచ్చినవాడు దేవ పక్షపాతి యని తెలిసికూడా బలిచక్రవర్తి దానమొసగి, ఇచ్చిన మాటను నిలబెట్టుకొనెనని సర్వులు ప్రశంసించిరి.

విష్ణుపాదములను బలిచక్రవర్తి కడుగుచుండెను. కలశ రంధ్రము వద్ద శుక్రుడు ప్రవేశించి జలధార నడ్డుపరచెను. ఈ విషయమును గ్రహించిన వామనమూర్తి దర్భను చేత బట్టుకొని ఆ రంధ్రములోనికి పొడిచెను. తత్కారణముగ శుక్రాచార్యుడు ఏకనేత్రు డాయెను.

భగవంతుని దృష్టి ఎవరిపై ప్రసరించునో వారు ఏకనేత్రు లగుదురు. ఏకనేత్రమనగా ఏకత్వ దృష్టి. రెండు నేత్రములు ద్వంద్వ దృష్టికి సంకేతము. ఇదియే ద్వైతము. ద్వైతము భేదము నందించును. పరమాత్మను గాంచిన పిమ్మట శుక్రాచార్యుని వలె భేద ప్రపంచమును వీక్షింపకూడదు. అంతయూ విష్ణుమయముగా దర్శింప వలెను. ఇదియే ఏకత్వానుభూతి. అద్వైతానుభూతి.

ఇదం సర్వం యదయ మాత్మా, బ్రహ్మై వేదం విశ్వం సర్వం ఖల్విదం బ్రహ్మ

ఈ ప్రపంచము కన్నను పరమాత్మ అన్యముగాలేదని వేదము పై వాక్యముల ద్వారా తెలుపుచున్నందున ప్రతి మనుజుడు ఏకత్వమును దర్శించే ప్రయత్నమునే చేయవలెను.

వామనమూర్తి తన రూపమును వృద్ధి చేయుచుండెను. భూమ్యాకాశములను, దిక్కులను ఆవరించుచుండెను. విశ్వరూపుడగు వామనుని పదతలమున రసాతలాది సప్తలోకము లుండెను. పద యుగళమందున పృథ్వియుండెను. ఆ దివ్యాత్మునిలో భవ్యమైన వాయువులు వీచుచుండగా పక్షులు, పర్వతములు గోచరించుచుండెను. త్రిలోకములు ఆయనయందే చోటు చేసికొని యుండెను. అతని కుక్షియందు సప్త సముద్రములు గోచరించుచుండెను. వటుడలా పెరుగుచునే యుండెను.

శా॥ ఇంతింతై వటు డింతయై మఱియు దానింతై నభోవీథిపై
నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై.

త్రివిక్రమ భగవానుడు సమస్త విశ్వమున వ్యాపించెను. ఒక్కపాదముతో భూ భాగము నంతటిని ఆవరించెను. దేహముతో అంతరిక్షము నాక్రమించెను. భుజములతో దిక్కులంతయు వ్యాపించెను. రెండవ పాదముతో దివి నాక్రమించెను. మూడవ పాదము నుంచుటకు స్థలమే లేకపోయెను.

త్రివిక్రముడు విశ్వరూపమును ఉపసంహరించుకొనెను. "రాజా! దానవేశ్వరా! నీవు నాకు మూడడుగుల భూమిని దానము చేసితివి. నాకు రెండడుగుల భూమియే లభించినది. మూడవ పాదము నెక్కడ ఉంచవలెను" యని వామనుడు బలి నడిగెను.

"ఈ వామనుడు బ్రాహ్మణుడు కాడు. దేవతల కుపకారము చేయుటకు, దానవుల కసకారము చేయుట కరుదెంచిన విష్ణువుయే. మా ప్రభువును మోసగించెను. ఇతనిని వధించుటయే మా ధర్మము" అని పలికి బలి యనుచరులగు అసురులు అస్త్రములను ధరించి అచ్యుతుని పైకి ఉరికిరి.

విష్ణు పార్షదులు దైత్యులను నిరోధించిరి. హింసించిరి. కొందరిని వధించసాగిరి. తనవారు దేవతలచేత నశించుటను బలిచక్రవర్తి గాంచెను. శుక్రాచార్యుని శాపము అంతర్యమున స్మృతి కందెను. క్రుద్ధులైన రాక్షసులను బలి నివారించి "అసురువీరులారా! నా వచనముల నాలకింపుడు. సమరమును త్యజింపుడు. ప్రస్తుతకాలము మనకు శుభదాయకము గానేరదు. పైగా ప్రతికూలముగ యున్నది. ఇంతవరకు కాలము మనకు అనుకూలముగను, దేవతలకు ప్రతికూలముగను యుండినది. ఆ కాలమే ఈనాడు తారుమారై యున్నది. కాలము నెవ్వరూ ఎదిరించలేరు. మఱల దైవము మనకు ప్రసన్నమై నప్పుడు మనము దేవతలను ఓడించగలము. కాలమునకై కట్టుబడి నిరీక్షింపుడు" యనెను.

హద్దులెరిగి ప్రవర్తించువారి బ్రతుకులు శుద్ధముగనే యుండును. నియమా లెరిగినవారు నీతిబాహ్యులు కాలేరు. అవధులెరిగి వర్తించు వారికి ఆపద లెదురుగావు. సముద్రు డనంతుడైనను తన పరిధిని దాటిరాడు.

నహి క్షుభ్యతి దుర్ధర్షః సముద్రః సరితాం పతిః

"సర్వనదులకు పతియైన అగాధరూపుడగు సముద్రుడు ఒడ్డును దాటడు" యని శ్రీమద్రామాయణము అయోధ్య కాండము చెప్పుచున్నది.

బలి యాజ్ఞానుసారము దైత్యులు పాతాళమున ప్రవేశించిరి. గరుత్మంతుడు వామనుని యాజ్ఞానుసారము వరుణ పాశములచే బలిని బంధించెను. తనకు మూడవ పాదము నుంచుటకు తగిన స్థలమును జూపుమని త్రివిక్రముడు బలి నడిగెను.

బద్ధుడైయున్న బలిచక్రవర్తి త్రివిక్రమునితో ఇలా పలికెను: "ఉత్తమశ్లోకా! పరమేశా! తండ్రీ! నా మాటలు అసత్యములని భావింపకుడు. నా వాగ్దానమును నెరవేర్చుకొను చున్నాను.

కరోమ్యృతం తన్న భవేత్ప్రలంభనం పదం తృతీయం కురు శీర్ష్ణిమే నిజమ్

"దేవా! నా మాట అసత్యము గానేరదు. నీ తృతీయ పాదమును నా శిరమున నుంచుము" అని శిరమును భక్తితో వంచెను.

ఆ॥ సూనృతంబుగాని నుడియదు నాజిహ్వ బొంకజాల నాకు బొంకులేదు
నీ తృతీయపదము నిజము నా శిరమున నెలవు సేసిపెట్టు నిర్మలాత్మ!

"తండ్రీ! జగన్నాథా! అసురులమైన మాకు నిజముగా నీవు పరమహితైషివి. ఏలననగా మేము గర్వితులము. అహంకారులము. మోక్షము నొందుటకు అశక్తులము. మా మద మణగించి మాకు దివ్యదృష్టిని నీవు ప్రసాదింతువు. గతంలో నీయందు విచ్ఛిన్నము గాని శత్రుభావమును వృద్ధి జేసికొని ఎందరో అసురులు, యోగులు బొందిన స్థితిని బొంది యున్నారు. నీవు నన్ను వరుణ పాశ బద్ధుడను గావించితివి. ఇది అంతయు నీ అనుగ్రహము. నా అదృష్టము. భక్త పూజ్యుడు, నా పితామహుడగు ప్రహ్లాదుడు నిన్ను శరణుబొంది ఉన్నతపదవి నలంకరించెను. తండ్రీ! నీవే పొంద దగినవాడవు. అనిత్యమైన సంసారములను పెనవేసుకొని సాధించున దేమున్నది? ఈ ప్రపంచములోని బాంధవ్యములే నిజబంధములు. నీ అనుగ్రహ ప్రేమపాశమే భక్తులకు చతుర్విధ పురుషార్థముల నొసంగు చున్నది. సంసారములు వాస్తవానికి నిస్సార జీవనములు.

సీ॥ చుట్టాలు దొంగలు, సుతులు ఋణస్థులు, కాంతలు సంసారకారణములు,
ధనము లస్థిరములు, దను వతిచంచల, గార్యార్థు లన్యులు, గడచు గాల,
మాయువు సత్వర, మైశ్వర్య మతిశీఘ్ర మనికాదె తమతండ్రి నతకరించి
మాతాత సాధుసమ్మతుడు ప్రహ్లాదుండు నీ పాదకమలంబు నియతి జేరె
తే॥ భద్రు డతనికి మృతిలేని బ్రతుకు గలిగె నైరులై కాని తొల్లి మావారు గాన
రర్థినై వచ్చి నీవు నన్నడుగు టెల్ల బద్మలోచన! నాపుణ్య ఫలముగాదె.

"దేవా! బంధువులు చోరులై బ్రతుకుధనము నపహరించు చున్నారు. బిడ్డలు అప్పులవారై శ్రమను దోచుకొనుచున్నారు. దుఃఖమయ సంసార చక్రమునకు భార్యలు బంధించుచున్నారు. ధనములు చెప్పకనే మాయమగును. దేహములు నీటిబుడగలై యున్నవి. ఇతరులు వారి కార్యములకు ఉపయోగించుకొను స్వార్థపరులు. ఆయుసు నమ్మదగినది కాదు. సంపదలు గగన కుసుమాలు. ఇలా గ్రహించుట చేతనే పితామహుడగు ప్రహ్లాదుడు నీ పాదముల నాశ్రయించి శుభచరితుడాయెను. అట్టి నీ పదపంకజమును నా శిరముపై నుంచుట నా పుణ్యఫలము గాక మరేమగును." బలిచక్రవర్తి ఇలా వచించు సమయమున పూర్ణచంద్ర వదనుడైన ప్రహ్లాదు డచ్చటి కరుదెంచెను.

బలి పితామహుడగు ప్రహ్లాదుని దర్శించెను. వరుణపాశ బద్ధుడై యుండుటచేత పూర్వమువలె పితామహునికి బలి వందన మాచరింపలేక పోయెను. అశ్రుపూర్ణ నయనాలతో కేవలము శిరస్సు వంచి భక్తితో నమస్కరించెను. ప్రహ్లాదుడు పరవశ హృదయుడై శ్రీనాథునికి సాష్టాంగ దండప్రణామ మాచరించెను. ప్రహ్లాదుడు నారాయణునికి నమస్కరించుచు ఇలా పలికెను:

"దేవా! నీవు బలికి ఇంద్రపదవి నొసగితివి. ఈనాడు దానిని మరల దీసికొంటివి. సంపదలు మోహజనకము లనియు, మోక్ష ప్రతిబంధకము లనియు తెలుపుచు అతని నుండి సంపదలను హరించితివి. ఇది బలిపై నీవు జూపిన విశేషానుగ్రహము" యనెను. బ్రహ్మదేవుడు శ్రీహరిని స్తుతించెను.

బలిచక్రవర్తి ధర్మపత్ని శ్రీహరికి నమస్కరించుచు, "దేవా! ఈ జగత్తు నీ క్రీడార్థమై యున్నది. అజ్ఞానులగు జీవులు కర్తృత్వ, భోక్తృత్వ అభిమానములను తమయం దారోపించుకొని దుఃఖితులగుచున్నారు. అట్టివారు నిన్నేమి సంతృప్తి పరచగలరు? నీ కృపయే వారిని కాపాడాలి" యనెను.

"భూతభావనా! భూతేశా! ఈ బలిచక్రవర్తిని నీవు కృతార్థునిగ జేసితివి. నీ కృపకు పాత్రుడైన వాడు దండమునకు అర్హుడుకాడు. కనుక బలిని బంధ విముక్తుని గావింపుము" అని బ్రహ్మదేవుడు శ్రీహరిని ప్రార్థించెను.

భగవత్కృపను బొందిన బలిచక్రవర్తి

భగవానుడగు శ్రీహరి బ్రహ్మదేవునితో ఇలా పలికెను: "మహాత్మా! మనుజులు ధనమదముచే జడులై, జగత్పతియగు నన్ను గూడ తిరస్కరింతురు. కనుక సర్వ దుఃఖము లకు ధనమే కారణమై యున్నది. నే నెవ్వరి ననుగ్రహింప దలతునో వారి ధనమును మొదట అపహరింతును.

"జీవులు జన్మ, కర్మ, రూప, విద్య, సంపద లున్నను అహంకారులు గానిచో వారిపై నా కృప యున్నదని గ్రహింపుము. బలి శ్రేష్ఠుడు. ఉన్నతుడు. అందుచేత సంపదలు నశించినను శ్రేయోమార్గమును వీడడు. కపట యుక్తులగు ధర్మముల నెందరు చెప్పినను బలి వాటిని అనుసరించలేదు. అందుచేత నేనతనిని యనుగ్రహించు చున్నాను. ఉత్తమ పదవి నొసగుచున్నాను. సావర్ణి మన్వంతరమున బలిచక్రవర్తి ఇంద్రపదవి నధిష్ఠించును. ఈలోగా ఏ ఉపద్రవములు లేని సుతలమను లోకములో యుండగలడు. అచ్చట నా సుదర్శనము అతనికి రక్షణగా యుండును. నేను గూడా అతని సమీపము నందే యుందును" అనెను.

"తలం" అనగా పై భాగమని భావము. సుతలమనగా ఉత్కృష్టమైనది యని అర్థము. అది సర్వోపద్రవ రహితస్థితి యని పరమాత్మ తెలిపెను. అట్టిది మోక్షమేగాని మరొకటి గానేరదు. అచ్చట లభించునది సుదర్శనము. అనగా చక్కని దర్శనము. రెండు అర్థము

గాని అద్వయ సత్తాస్వరూప దర్శనము. ఈ స్థితిలో పరమాత్మ అన్యంగా ఉండేందుకు వీలులేదు గనుక అతనితో కలసియే యుండును.

ఉ॥ ఎన్నడు లోకపాలకుల నీకృప జూడని నీవు నేడు న
మ్మన్నతుజేసి నాబ్రదుకు నోజయు నానతియిచ్చి కాచి తీ
మన్నన లీ దయారసము మాటలు పెద్దటికంబు జాలవే
పన్నగతల్ప! విన్నెఱిగి పట్టిన నాపద గల్గనేర్చునే?

అని ప్రార్థించి బలిచక్రవర్తి సుతలమునకు జనెను. జగన్నాథుని యాజ్ఞచే ప్రహ్లాదుడు గూడ బలి ననుసరించెను.

శ్రీహరి శుక్రాచార్యునితో "విప్రోత్తమా! నీ శిష్యుడు, ఉత్తమ భక్తుడునైన బలి యొక్క యజ్ఞమున దోషము లేనైన యుండినచో వాటిని విస్తరింప జేయుము.

యత్ర త్కర్మ సు వైషమ్యం బ్రహ్మదృష్టం సమం భవేత్

"ఏ ప్రదేశములందు వైషమ్యము లుండునో అవి బ్రాహ్మణుల కృపాదృష్టి పడగనే సమత్వములుగా మారును" అనెను.

శుక్రుడు శ్రీహరితో ఇలా పలికెను: "దేవా! నీవు సర్వకర్మ ఫలప్రదాతవు. యజ్ఞమయ పురుషుడవు. నిన్ను ఆరాధించువారికి కర్మవైషమ్య మెలా కలుగును?

మన్త్ర తస్తన్త్ర తశ్ఛిద్రం దేశ కాలార్హ వస్తుతః సర్వం కరోతి నిశ్ఛిద్ర మను సంకీర్తనం తవ

"మంత్ర దోషములు, తంత్ర దోషములు, దేశకాల గతములైన న్యూనతలు నీ నామ సంకీర్తనముచే నిర్దోషము లగును" యనెను.

విధి బలీయమైనది. కర్మలు సుడిగుండాలు. జీవులెంత ప్రయత్నించుచున్నను ఇంద్రియములు హరించుటచేత మనస్సు దోషములయందు రమించును. అలాంటి సమయాలలో భగవన్నామ సంకీర్తనము చేయవలెను. కాలికి అంటిన బురదను జలము శుభ్ర మొనర్చునట్లు, హృదయ మాలిన్యమును కీర్తనము పోగొట్టును. సంత్ ఏక్‌నాథ్ మహారాజ్ హరికీర్తనము యొక్క వైభవమును ఒక అభంగములో తెలుపుతారు.

సాధనాంచే సార్ నామ్ ముఖీఁ గాతాఁ హరి హరి మ్హణతాఁ కార్యసిద్ధీ

నిత్య ముక్త్ తో చి ఏక్ బ్రహ్మజ్ఞానీ ఏకా జనార్దనీఁ హరిబోలా

"హరినామస్మరణమే సర్వసాధనల సారము. హరి హరి యని స్మరించువారికి సర్వకార్యములు సిద్ధించును. బ్రహ్మజ్ఞాని యొక్కడే నిత్యముక్తుడు. కనుకనే హరిని స్మరింపుమని ఏకనాథుని విన్నపము."

శుక్రుడు హరికృపచే యజ్ఞమును పూర్తిచేసెను. దానవులచేత అపహృతమైన సురలోకమును భగవానుడు ఇంద్రున కప్పగించెను.

"పరీక్షిన్మహారాజా! అద్భుతమగు వామన చరితమును నీకు తెలియజేసితిని. దీనిని అధ్యయనము చేయువారు, శ్రవణము చేయువారు ఉత్తమగతిని బొందెదరు.

మత్స్యావతారము

త్రివిక్రముని వైభవమును గ్రహించిన పిమ్మట, భగవానుని మొదటి యవతారమైన మత్స్యావతారమును గూర్చి వినవలెనని పరీక్షిన్మహారాజు కోరగా శుకబ్రహ్మ మత్స్యావతార వైభవమును వర్ణించుచున్నాడని నైమిశారణ్యంలో సూతమహర్షి శౌనకాదిమునులకు చెప్పుచున్నాడు.

భగవానుడు గోవులను, బ్రాహ్మణులను, దేవతలను, సాధువులను, వేదములను, ధర్మమును రక్షించుటకై అవతారములను ధరించుచుండును. భగవానుడు ఏ రూపమును ధరించినను ఆ రూపము యొక్క గుణ దోషములు తనకు అంటవు.

ఉచ్చావచేషు భూ తేషు చరన్ వాయురివేశ్వరః

నోచ్చా వచత్వం భజతే నిర్గుణత్వా ద్ధియోగుణైః

ప్రాకృత గుణయుక్తులు, ఉచ్చనీచులునగు జీవుల మధ్య అవతరించినను తాను గుణరహితు డయ్యే యున్నాడు యని శుకులవారు తెలుపుచున్నారు.

నైమిత్తిక ప్రళయము సంభవించినది. భూమి మొదలగు లోకములన్నియు జలమయమైనవి. దినావసాన మగుటచేత బ్రహ్మదేవునకు నిద్రవచ్చెను. ఆయన నిద్రించగా, ఆయన నోటినుండి జారిపడిన వేదములను హయగ్రీవుడను రాక్షసుడు అపహరించెను. జగదీశ్వరుడును, ప్రభువును యగు శ్రీహరి'శఫరి'యను మత్స్యరూపమును ధరించి హయగ్రీవుని వద్దనుండి వేదములను గ్రహించి బ్రహ్మదేవున కొసంగెను.

దారుణ క్లిష్ట సమస్యలు చుట్టుముట్టి జీవుని మరణ యాతనకు గురిజేయు దుర్భర సమయమే ప్రళయకాలము. అట్టి బీభత్స సమయమునందు వ్యక్తి జాగరూకుడై యుండాలి. పరిస్థితులు ప్రతికూల మైనపుడు ప్రవర్తనను అనుకూలంగా మలచుకోవాలి.

To climb steep hills requires slow pace at first.

"నిటారుగాయున్న కొండ నధిగమించాలంటే అడుగు నిదానంగా పడాలి" అంటాడు షేక్స్పియర్.

పరిస్థితులు భయంకర రూపమును దాల్చినపుడు రజస్తమో గుణములను వదలిపెట్టి, సత్త్వగుణ సంపన్నులై, నారాయణ నామస్మరణతో కాలమును ఆనందముగా నడపాలి.

యాచేఁ యాఁస్ కరూఁ సర్వనివేదన్ వారిల్ హా శీన్ సంసారీ చా

"సమస్తములైన మన నివేదనములను పరమాత్మముందు ఉంచెదము. సంసార దుఃఖముల నన్నిటిని అతడే తొలగించగలడు" అంటాడు సంత్ తుకారాం.

ప్రళయకాలమున బ్రహ్మదేవుడు నిద్రించెను. తత్ఫలితముగా ఆయన నోటినుండి వేదమాత జారిపోయినది. పరిస్థితులు తారుమారైనపుడు ఎవరయితే భగవత్స్మరణము

మాని మాయామోహిత నిద్రలో కాలమును హరింప జేసికొందురో అట్టివారిని వేదమాత బ్రహ్మదేవుని వదలివెళ్ళినట్లు వదలిపెట్టును.

తన నిస్సహాయ స్థితిని, తెలుపుతూ బ్రహ్మదేవుడు నారాయణుని శరణువేడగనే జగద్రక్షకుడైన శ్రీహరి 'శఫరి' యను మత్స్యరూపము ధరించి, హయగ్రీవుని వద్దనుండి వేదములను సంగ్రహించి బ్రహ్మదేవున కొసగెను. విజ్ఞానమును పోగొట్టుకొనిన దుర్ముహూర్తములో అజ్ఞానమును ఆలింగన మొనర్చుకొని పరిస్థితులను అర్థరహితముగా ఎదుర్కొనేందుకన్నను, జగద్రక్షకుడైన నారాయణుని బ్రహ్మదేవుని వలె శరణుజొచ్చి, ఆయన దివ్యాశీస్సులతో పూర్వస్థితిని అపూర్వముగా బొంది ఆనందించాలి. ఇదియే మత్స్యావతార కథ ద్వారా మనము గ్రహింపదగిన ఆధ్యాత్మిక సందేశము.

సత్యవ్రతుడను రాజర్షి జలపానము మాత్రమే చేయుచు నారాయణుని గూర్చి కఠోరతప మాచరించుచుండెను. ఒకనాడు సత్యవ్రతుడు కృతమాలా నది యందు జలతర్పణము విడచు సమయాన అతని దోసిలిలో ఒక మత్స్యము కనుపించెను. సత్యవ్రతుడు వెంటనే జలముతో పాటు మత్స్యమును కూడా నదిలో విడచెను. 'శఫరి' యనెడి ఆ మత్స్యము సత్యవ్రతునితో "రాజా! ఈ నది యందున్న పెద్దమీనములు నన్ను మ్రింగుటకు ప్రయత్నించుచున్నవి. మృత్యుభయముతో కదలిపోతూ నేను నీ దోసిలి లోనికి చేరితిని. నీవు నన్ను మఱల నదిలో విడచితివి" యని తియ్యగా పలికెను.

మ.కో॥ పాటువచ్చిన జ్ఞాతిఘాతులు పాపజాతిరుషంబు లీ
యేట గొండొక మీనుపిల్లల వేఁటిపట్టి వధింప న
చ్చోట మండక నీదుదోసిలి సొచ్చివచ్చిన నన్ను న
ట్టేట ద్రోవగ బాడియే కృప యింత లేక దయానిధీ!

శఫరి మాటల నాలకించిన సత్యవ్రతుని మనస్సు ద్రవించెను. వెంటనే శఫరిని తన కలశమునందిడుకొని ఆశ్రమము చేరెను. ఒకరాత్రి గడచెను. మత్స్యము కమండలము పట్టనంతగ పెద్దదాయెను. రాజు దానిని ఒక పెద్ద కుండలో నుంచెను. ఆ కుండకూడా చాలనంతగ శఫరి వృద్ధిచెందెను. ఇంకా పెద్దస్థలము కావలెనని మీనము కోరగా రాజు దానిని ఒక సరోవరములో నుంచెను. అదియు సరిపోనంతగ పెరిగెను. సత్యవ్రతుడు దానిని చెరువులో నుంచెను. చెరువు చాలనంతగా పెరిగెను. చివరగ సముద్రములో నుంచెను.

సత్యవ్రతుడు శఫరిని సాగరములో బడవేయుచుండగా మత్స్యము రాజర్షితో "వీరుడా! ఈ సాగరమున భయంకరమగు మొసళ్ళు యున్నవి. అవి నన్ను హింసించి చంపును. అన్యాయముగా నన్ను అంబోధికి ఆహుతి చేయుచుంటివేల?" యనెను.

శఫరి అమృతమయ వాక్కుల నాలకించిన సత్యవ్రతుడు విస్మయ మొందినవాడై, నీవు మత్స్యానివి కావు. మత్స్యరూపముతో నన్ను వంచించినావు. ఒక్కరోజుననే నీవు శతయోజనముల పరిమితిగల ప్రాంతము నాక్రమించితివి. నీ వెవరు? నిన్ను నేను

గ్రహింపగలను. నీవు అవ్యయుడనైన శ్రీమన్నారాయణుడవు. పద్మ పలాశలోచనా! భక్తజన రక్షకుడవైన నీవు నన్ను ఉద్ధరించుటకే ఈ మత్స్యనారాయణ రూపమును ధరించితివి" అని ప్రణమిల్లెను.

సత్యవ్రతుని భక్తి హృదయమును గాంచి శ్రీహరి సంతసించెను. "సత్యవ్రతా! ఈ నాటినుండి ఏడవ రోజున త్రిలోకములు ప్రళయమున మునిగిపోగలవు. ఆ సమయమున నాచే పంపబడిన నావ యొకటి నీవద్దకు వచ్చును. వెంటనే నీవు సమస్త ఓషధులను, బీజములను నౌక యందుంచి, సప్తర్షుల మధ్య ఆసీనుడవు గమ్ము. నా కృపచే ప్రళయ కాలమున చక్కగా విహరించగలవు. వాయువేగమునకు నావ కదలినపుడు దాని సమీపము ననే గోచరించు నా శృంగమును వాసుకి యనెడి సర్పముచే నావతో బంధింపుము. నేను మీ నౌకను లాగుదును. నా మహిమ నీకు అప్పుడు అవగతము కాగలదు" యని పలికి మత్స్యనారాయణుడు అంతర్హితు డయ్యెను.

రాజర్షియగు సత్యవ్రతుడు శ్రీహరి చరణములనే ధ్యానింపసాగెను. ప్రళయకాలము సమీపించెను. సముద్రములు పొంగెను. విశ్వమంతయు జలమయ మయ్యెను. నౌక సమీపించెను. ఓషధులను తీసికొని నావ నధిరోహించుట జరిగెను. నారాయణ స్మరణము గావింపుమని మహర్షులు సత్యవ్రతునికి తెలిపిరి. నామస్మరణ జరుగుచుండెను. ఎచ్చట నాముండునో అచ్చటికి నామియగు నారాయణు డేతెంచును.

పోశి శీ శరీర్ ఇంద్రియాంచీ బాధా శేఖితే ఆపదా కరిల్ తుజ్।
సర్వే తుఝే హిత్ విషయ్ పోషితా హరిహర మ్హణతాం ఉద్ధరసీ॥

"దేహాన్ని పెంచితే ఇంద్రియాలు బాధిస్తాయి. దుఃఖాన్ని కలిగిస్తాయి. విషయ సుఖాలలో నీకు హితము చేకూరదు. హరి హరుల నామజపమే నిన్ను ఉద్ధరించును" అని సంత్ నామదేవ్ మహరాజ్ అభంగములో గానం చేస్తారు.

సత్యవ్రతుడు నామస్మరణము చేయుచుండెను. నారాయణుడు నాలుగు క్రోసుల పరిమితమైనదియు, ఒకే శృంగమును ధరించినదియు, బంగారు కాంతి కలదియునగు మీన రూపమును ధరించి సాగరమున ప్రవేశించెను. సత్యవ్రతుడు ఆ మత్స్యము యొక్క శృంగమునకు వాసుకి యనెడి సర్పముచే నౌకను బంధించి, సంతృప్తి చెందిన అంతః కరణతో నారాయణుని ధ్యానింపసాగెను. నారాయణుని వైభవమును స్తుతించెను. శ్రీహరి సత్యవ్రతునికి తత్త్వోపదేశము చేసెను. నారాయణుని అనుగ్రహముతో సత్యవ్రతుడు సత్యకీర్తియై సత్యస్వరూపు డాయెను.

సత్యజీవన యాత్రను సాగించు సత్పురుషుడే సత్యవ్రతుడు. కృతమాలా నదిలో తాను జలతర్పణము చేయుచుండెను. ఎడతెగని సత్కార్య ప్రవాహమే కృతమాలా నది. సత్కర్మాచరణము నందు అంతర్నిహితమై యున్న త్యాగమే జలతర్పణము.

Noble deeds that are concealed are most esteemed

"గుప్తమైన మహోన్నత కర్మలే మన్ననయోగ్యము" అని పాస్కల్ అభిప్రాయపడటము జరిగింది.

త్యాగపూరిత కర్మలాచరించు వారికి భక్తి చేరువగును. అదియే దోసిలి లోనికి ప్రవేశించిన మత్స్యము. సత్యవ్రతుడు మత్స్యమును నీటిలో వదలివేసెను. సత్కర్మాను చరణములో సద్భక్తిని దూరం చేసుకోకూడదు. తనను జలమునందు పడవేయవద్దని మత్స్యము అభ్యర్థించెను. అలాగే భక్తిని ప్రాపంచిక జీవన ప్రవాహములో జారవిడచుకొనరాదు.

సత్యవ్రతుడు మత్స్యమును కమండలము నందుంచెను. అనగా భక్తిని దేహస్థాయికి పరిమితం చేశాడని భావము. భక్తి వ్యాపకమౌతుందే గాని సంకుచితంగా ఉండదు. తదుపరి కుండయనెడి మనోస్థాయినుండి సరస్సుయనెడి బుద్ధి స్థాయికి చేరింది. దేహేంద్రియ మనోబుద్ధులు భక్తితో నిండగనే, ఇంతవరకు వ్యష్టిస్థాయిలో వ్యాపకమైన భక్తి ఇపుడు నర్వులలో సర్వేశ్వరుని దర్శిస్తూ, సేవా దృక్పథముతో చెరువు యనెడి సమాజ సేవలోకి దిగుతుంది. తదనంతరము పరిపక్వస్థితిలో పూర్ణత్వము సిద్ధించగనే విశాలమైన విశ్వమంతయు తానే యనెడి భావనతో అనంత స్వరూపముగా మారుతుంది. అదియే సాగర ప్రవేశము.

సాగర ప్రవేశము చేయు సమయమున శ్రీహరి సత్యవ్రతునితో ఏడవరోజు రాబోవు ప్రళయమును గూర్చి సందేశ మొసంగెను. ఏడవరోజు యనగా యోగస్థితిలో సప్తమ అంగమునకు చేరుకొనుట యని భావము. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులలో ధ్యానము ఏడవసోపానమై యున్నది. **"ధ్యానం నిర్విషయం మనః"** వృత్తి రాహిత్యమే ధ్యానము గనుక ప్రళయకాలమున సర్వము జల ప్రవాహము నందు లయించునటుల, మనో నిర్మిత జగత్తంతయు ధ్యానస్థితిలో ఆనంద ప్రవాహమున లయించును.

తస్మి న్నిరోధితే నూన ముపశాంతం మనో భవేత్
మనః స్పన్దోపశాన్త్యాఽయం సంసారః ప్రవిలీయతే

"మనో సంకల్పాలు నిరోధింప బడగనే మనస్సు ఉపశమించును. మనస్సు స్పందించుట, శమించుట వలన మనుజులకు భవబంధాలు తొలగుచున్నవి" యని శాండిల్యోపనిషత్తు.

ధ్యానస్థితి నిశ్చలముగా నిలువవలెను. నిశ్చల ధ్యానము నిర్మల సమాధిని అందించును. ధ్యానము చెదిరిపోయే ప్రమాదము లేకపోలేదు. అందుచేత ఇంతవరకు తాను అధ్యయనము చేసిన సద్విషయము లనెడి ఓషధులను వెంటనిడుకొని, మహర్షు లనెడి సత్సంగము చేత ప్రేరితుడై, ధ్యానమనెడి నౌకయందు ఆసీనుడై, ఆనందయాత్ర చేయవలెను. వాయు వేగమునకు నావకదలినట్లు, పూర్వవాసనా ప్రేరణచే ధ్యానము వక్రించే ప్రమాదము గలదు. సూక్ష్మరూపంలో యున్న అహంకారమే ఈ తొట్రుపాటునకు కారణము. అలాంటి క్లిష్ట సమయాలలో భగవత్కృప యనెడి శృంగమును అహంకార మనెడి వాసుకిద్వారా ధ్యానజీవన మనెడి నావకు తగిలించవలెను. ఇక ఆ క్షణమునుండి దైవకృపయే మన బ్రతుకును నడిపించును.

ఈ విధముగా విష్ణుదేవుని అవతార వైభవములు లీలా ధ్యానమునకు ఉపకరించు చున్నవి. భగవత్కథా శ్రవణము మనుజుని పావనమొనర్చి హరి సాన్నిధ్యమును ప్రసాదించును.

సర్వ మాధుర్య సారాణి సర్వాద్భుత మయాని చ
ధ్యాయన్ హరే శ్చరిత్రాణి లలితాని విముచ్యతే

"మనోహర మైనదియు, సర్వమాధుర్య సారరూప మైనదియు, సర్వాద్భుత మైనదియు నగు శ్రీహరి చరితమును ధ్యానింపుము. ముక్తి నొందుము" అని పద్మ పురాణము తెలిపినది.

"పరీక్షిన్మహారాజా! ఈ మత్స్యనారాయణుని చరితమును ఎవరు శ్రవణము చేయుదురో వారు సర్వపాప విముక్తులై, ఉత్తమగతిని పొందుదురు" అని కథాశ్రవణ ఫలమును శుకబ్రహ్మ తెలిపెను.

క॥ హరి జలచరావతారము బరువడి ప్రతిదినము జదువ బరమపదంబున్
నరు డొందు వాని కోర్కులు ధరణీశ్వర! సిద్ధిబొందు దథ్యము సుమ్మీ!

అష్టమ స్కంధము సమాప్తము

.... ఓం ....

అందనివాడా! అందుకో

నమ ఆత్మప్రదీపాయ

సాక్షిణే పరమాత్మనే

నమో గిరాం విదూరాయ

మనస శ్చేతసా మపి

ఆత్మ ప్రకాశకుడు, సాక్షిరూపుడు నగు పరమాత్మకు నమస్కారము. వాక్కునకు, మనసునకు, చిత్తవృత్తులకు లభ్యము గాని భగవానునకు ప్రణామము.

Salutations to the Supreme Being who is revealed by His own Self and stands as the witness of all ! Greetings to Him who is entirely beyond speech and mind and the faculties of mind !

ఉపోద్ఘాతము

ఇది నవమ స్కంధము

"కంఠస్తు రాజన్నవమో యదీయో"

నవమ స్కంధము భగవానుని కమనీయ కంఠస్థానమై వెల్గొందుచున్నది. పరమాత్మ సాన్నిధ్యము సులభముగా లభ్యముకాదు. భక్తుల సాన్నిధ్యము లభింపనిదే భగవానుని దర్శనము ప్రాప్తించదు.

ఈ స్కంధమున మనకు భక్తుల దర్శనము లభిస్తుంది. ఖట్వాంగ, భగీరథ, సౌభరి, హరిశ్చంద్ర, అంబరీషాదుల అనుగ్రహం లభిస్తుంది. అంతేగాదు. రమణీయమైన రామరూపము సాక్షాత్కరిస్తుంది.

నవమ స్కంధము భగవానుని కంఠస్వరూపము కాగా దశమ స్కంధము ముఖారవిందమని చెప్పబడినది. కంఠమును విప్పి నామసంకీర్తనము చేసినచో భగవంతుని ముఖపద్మమును దర్శింపగలము. నవమ స్కంధములో రామదర్శనము కలుగుతుంది. దశమ స్కంధమున శ్రీకృష్ణసందర్శనము ప్రాప్తిస్తుంది. రాముడు ధర్మ స్వరూపుడు. కృష్ణుడు ప్రేమ స్వరూపుడు. ధర్మాచరణము లేకుండా ప్రేమ సిద్ధించదు.

"ధర్మేణ పాప మపనుదతి"

"ధర్మము ద్వారా పాపము నశిస్తుంది"యని తైత్తిరీయోపనిషత్తు ప్రవచించినది.

పాపమనేది ఏమిటి? అనేక జన్మపరంపరలలో కూడగట్టుకొనిన వాసనలే పాపము. వాసనా క్షయము గానిదే మోక్షము లభించదు. గృహ ద్వారము ఛిద్రముగా యున్నచో ఆ గృహములోనికి ఎవ్వరూ ప్రవేశింపరు. హృదయ ద్వారము శుభ్రముగా లేనిచో పరమాత్మ ఎలా ప్రవేశించును? మనస్సే హృదయమందిరానికి ద్వారమై యున్నది. మనస్సు వాసనలచే కలుషితమై యుండును.

పండుగనాడు పరమాత్మ మన ఇంటికి వచ్చునని ఇంటిని శుభ్రపరచుకొందుము. ద్వారమును చక్కగా అలంకరించుకొందుము. అలాగే శ్రీకృష్ణుడు మన హృదయములో ప్రవేశింపవలెనని మనోద్వారమును శుభ్రము చేయాలి. వాసనలనెడి చెత్తను దూరం చేయాలి. అవగాహన యనెడి జలముతో శుద్ధిచేయాలి. సదాచార మనెడి ముగ్గువేయాలి. సద్గుణము లనెడి మామిడి తోరణాలతో అలంకరించాలి.

ఈ నవమ స్కంధములో నిజమైన పండుగ తెలుస్తుంది. అంతేకాదు. దండుగ ఏమిటో కూడా తెలుస్తుంది. నిండుగ పరమాత్మను హృదిలో నింపుకొనే దెలాగో అవగతమవుతుంది. బ్రతుకును జ్ఞానంతో పండించుకొనే దెలాగో స్పష్టమవుతుంది. మరి.... ఇంకేమిటి? చదవండి.

చైతన్య భాగవతము

నవమ స్కంధము

సుద్యుమ్న మహారాజు చరిత్ర

దారి తప్పి నడక సాగించువారి బాట అంధకారబంధురము. అగచాట్లకు నిలయము. ఆపదలకు ఆలవాలము. వర్తించే నేర్పులేనివారు సమవర్తి నోటిలో పడినంత వరకు దుఃఖాన్నే అనుభవిస్తుంటారు. ఇంట గెలిచి రచ్చ గెలవమని సామెత. ఇరువైపుల ఇబ్బందులే ఎదురైతే ఆ జీవికి శాంతి మిగలదు. ఇంటా బయటా ఏ తంటా లేకుండా జీవించాలంటే వ్యక్తి వెంట వెలుగు ఉండాలి. అదియే ద్యుమ్నము. ద్యుమ్నము అనగా దీప్తి నిచ్చునది అని భావము. బలము అని కూడా అర్థము. 'సు' యనెడి ఉపసర్గ చేరగనే అది సుద్యుమ్నమై బ్రతుకును సుందర మొనర్చును. జీవిని సంతోష పెట్టును.

దాంపత్య మనేది ధర్మావలంబనము కొఱకే గాని, భోగానుభవము కొఱకు గాదు. అవగాహన లేని దాంపత్యము ఆవేదనలనే అందించి, సంసారమొక దుఃఖాలయము యనెడి భావనను జనులలో కలిగించుచున్నది. భార్యాభర్త లిరువురు ఏకాభిప్రాయముతో వర్తించగలిగితే ఏ విధమైన ఇబ్బందులు తలెత్తవు. లేనిచో ఇరువురి జీవితములు అయోమయంగా తయారుగాక తప్పదు. ఈ సత్యమును సుద్యుమ్న చరిత్ర మనకు తెలుపును. అంతేగాదు. ఇంటిలో ఎలా చరించాలో తెలిస్తే చాలదు. బయట కూడా ఎలా సంచరించాలో తెలుపుతుంది. ఇంటా బయట ఓర్పుతో, నేర్పుతో జీవించ గలిగితే వ్యక్తి సుఖజీవనమును గడుపగలుగును.

"మహాత్మా! వివిధ మన్వంతరములలో భగవానుడగు నారాయణుని దివ్య విభూతులను మీ ద్వారా ఆలకించి ధన్యుడ నయ్యాను. ఇక్ష్వాకాది మహారాజులకు తండ్రియైన వైవస్వత మనువు యొక్క వంశవృక్షమును, విశేషమును తెలియగోరు చున్నాను" అని పరీక్షిత్తుడు పలుకగా ఈ సుద్యుమ్న చరితమును శుకబ్రహ్మ చెప్పుచున్నాడని సూతుడు నైమిశారణ్యంలో శౌనకాది మునులకు తెలుపుచున్నాడు.

ఆదిదేవుడగు పద్మనాభుని నుండి చతుర్ముఖబ్రహ్మ జన్మించెను. బ్రహ్మనుండి మరీచి, మరీచికి కశ్యపుడు, కశ్యపునికి వివస్వానుడు జన్మించిరి. వివస్వానునికి మనువు జన్మించెను. ఆయనకు పదిమంది పుత్రులు జన్మించిరి.

మనువు సంతాన హీనుడై యుండెను. సంతానార్థమై వశిష్ఠుడు సూర్య, వరుణులను గూర్చి యజ్ఞము చేసెను. మనువు భార్యపేరు శ్రద్ధ. శ్రద్ధ లేని వాడు యజ్ఞము చేయలేడు. శ్రద్ధ గలవానికే జ్ఞానము లభించును. కానీ, ఆ శ్రద్ధ సాత్త్విక శ్రద్ధయై యుండాలి. అచ్చట రజోగుణము చోటు చేసుకోగూడదు.

కుమారుని పొందుటకై మనువు యజ్ఞమును తలపెట్టెను. కాని యజ్ఞ సమయమున మనువు యొక్క అర్ధాంగియగు శ్రద్ధ యజ్ఞహోత వద్దకు వెళ్ళి కుమార్తె కావలెనని సంకల్పించెను. ఈ కారణము వలన మనువునకు "ఇల"యను నొక బాలిక కలిగెను. మనువు కలత చెందెను. గురుదేవుడైన వశిష్ఠుని సమీపించి, తన బాధను వివరించెను. జరిగిన వైపరీత్యమును గ్రహించిన వశిష్ఠుడు మనువు నోదార్చెను. తరుణోపాయము నాలోచింపసాగెను.

దంపతు లెప్పుడూ ఒకేమాటపై నడువ గలగాలి. అప్పుడే వారి జీవితాలలో శాంతి నిలుచును. భార్యాభర్త లిరువురు పరస్పరావగాహనతో చరించాలి. ఎవరి భావము ఉన్నతముగా యుంటే రెండవవారు ఆ భావమును గౌరవించాలి. మనువుకు భిన్నంగా శ్రద్ధ సంకల్పించింది. బాధలు ప్రారంభమయ్యాయి. "ఇల" పుట్టింది. ఇల యనగా భూమి. అవగాహన లేనివారు అచ్యుతునికి దూరులై అవనికి చేరువవుతూ ఉంటారు. భూ ప్రపంచమునకు వస్తూ పోతూ ఉంటారు. ఇల పుట్టింది. మనువు ఆంతర్యంలో అలలు ప్రారంభమయ్యాయి.

బాధలు ఎవరికైనా వస్తాయి. బాధ లొచ్చాయని బలహీనపడి బ్రతుకును నీరస పరచుకోకూడదు. బోధలతో పరిజేసుకోవాలి. గురువుల నాశ్రయించాలి. వారి ఆశీస్సులతో, బోధలతో చీకట్లను పారద్రోలి వెలుగులను నింపుకోవాలి.

నేడు చాలామంది గురువుల నాశ్రయిస్తారు. వేరే శరణ్యం లేదంటారు. కానీ వారి మనోభావాల కన్నా వేరుగా చెప్పవద్దని, బోధించవద్దని చెబుతుంటారు. ఇక గురువులను ఎందుకు ఆశ్రయించినట్లు? వారికి బోధించుటకా? లేక వారి బోధల నందుకొనుటకా?

The world is dying of want, not of good preaching but of good hearing.

ఈ ప్రపంచము శ్రోతలు లేక అలమటిస్తున్నదేగాని వక్తలు లేక కాదు" యని బ్రాడ్‌మన్ అభిప్రాయ పడినాడు.

వశిష్ఠుడు జరిగిన విషయమును మనువుకు వివరించెను. తపశ్శాలియగు వశిష్ఠుడు మనువును సంతోష పరచుటకు సిద్ధమై విష్ణు భగవానుని స్తుతించెను. ఇలకు పుంస్త్వమును ప్రసాదింపుమని ప్రార్థించెను. విష్ణుదేవు డనుగ్రహించెను. ఇల పురుషుడుగా మారెను. సుద్యుమ్నుడని పేరు గాంచెను.

మనువుకు శ్రద్ధ సహకరించలేదు. దుఃఖము ప్రారంభమాయెను. గురువు తోడు నిలువగనే దుఃఖ ముపశమించెను. ప్రతి సాధకుడు శ్రద్ధ సన్నగిల్లినపుడు గురువుల నాశ్రయించాలి. బ్రతుకు బాటను సుగమం చేసుకోవాలి.

సుద్యుమ్నుడు పెద్దవాడయ్యెను. ఒకనాడు మంత్రులతో గూడి వేటకు వెడలెను. వేటాడుతూ "సుకుమార" మనెడి వనమున ప్రవేశించెను. ప్రవేశించగనే తాను స్త్రీగా మారిపోయెను. తానెక్కి వచ్చిన మగగుఱ్ఱము కూడా ఆడగుఱ్ఱముగా మారెను. అనుచరులైన అమాత్యులు కూడా స్త్రీలుగా మారిరి.

ఈ విషయమును శుకబ్రహ్మ చెప్పగనే విస్మయ మొందిన పరీక్షిత్తుడు అలా జరుగుటకు కారణమేమని ప్రశ్నించగా, శుకుడు వివరించసాగెను.

మేరు పర్వతప్రాంతమున ఈ సుకుమార మనెడి వనము కలదు. ఈ వనము నందు మహేశ్వరుడు ఉమాదేవితో కలసి విహరించుచుండెను. ఒకనాడు వార్త లేకనే ఋషులు ఆది దంపతులను దర్శించుటకు ఆ వనమున కేగిరి. పెద్దల వద్ద కెళ్ళునపుడు సమయాల నెరిగి ప్రవర్తించాలి. నిబంధనలను తెలిసి చరించాలి. నిషిద్ధ సమయాన వెళ్ళిన మునివర్యులు సిగ్గుతో, బాధతో వెనుదిరిగిరి. హద్దుమీరి ప్రవర్తించువారు సిగ్గుపడక తప్పదు. నియమాలు అందరికీ సమానములే.

ఉమాదేవి కలత చెందెను. ఆమెను తృప్తిపరచ నెంచిన మహేశ్వరుడు "ఈ వనమున ప్రవేశించిన పురుషులు స్త్రీ లగుదురు" అని పలికెను. సిగ్గు స్త్రీలకు భూషణము. సుకుమార వనమున ప్రవేశించిన పురుషులు స్త్రీలుగా మారెదరు. రహస్య ప్రదేశములలో జొరబడువారు సిగ్గుపడక తప్పదనుట యందలి అంతరార్థము.

కొందరు "ప్రవేశము లేదు" యనెడి బోర్డును గదిముందు తగిలించి యుంటారు. అయినా కొందరు ప్రవేశిస్తూనే ఉంటారు. "సారీ" యనెడి అయోమయ లారీనెక్కి వెనుదిరుగుతారు. సంశయబాటలో, శోకమనెడి రాళ్ళగుట్టల మధ్య వ్యథచెందుతూ పయనిస్తుంటారు. చూడమని బోర్డునుకడితే, దానిని కూడా చూడకుండా రాకెట్‌లాగా లోనికి దూసుకుపోతే ఎవరు మాత్రమేమి చేయగలరు?

స్త్రీగా పరిణతి నొందిన సుద్యుమ్నుడు చెలికత్తెలుగా మారిన మంత్రులతో గూడి క్రీడింపసాగెను. చంద్రుని కుమారుడగు బుధుడు ఆమెను గాంచి ప్రేమించెను. పరిణయమాడెను. పురూరవుడు యనెడి పుత్రుని గూడా బడసెను.

కొంతకాలమునకు రమణి రూపమున యున్న సుద్యుమ్నునకు స్మృతి కలిగెను. ఆచార్యుడగు వశిష్ఠుని ప్రార్థించెను. సుద్యుమ్నుని జన్మాదిగా నెరిగిన వశిష్ఠుడు అతని

వింత జీవితమును గాంచి అచ్చెరువొంది, కరుణా హృదయుడై శంకరుని ప్రార్థించెను. సుద్యుమ్ను డొక మాసము పురుషుడుగను, ఒక మాసము స్త్రీగను యుండునట్లు అనుగ్రహించెను. సుద్యుమ్నుడు ఒక మాసము పురుషత్వమును బొంది రాజ్యమును పాలించుచూ, ఒక మాసము స్త్రీయై గృహకృత్యము లాచరించుచుండెను. ఈ బ్రతుకు ఇటు రాజుకు, అటు ప్రజలకు అసంతృప్తినే కలిగించుచుండెను.

ఈ సుద్యుమ్న మహారాజులు ఈ నాడు కూడా కొందరు బుద్ధిగా గోచరిస్తూనే యుంటారు. ద్విపాత్రాభినయం చేస్తూనే ఉంటారు. కార్యాలయాలలో శూరులై యుంటారు. గృహోన్ముఖులు కాగానే శావగ్రస్తుడైన సుద్యుమ్నుని వలె ప్రవర్తిస్తుంటారు. పైకి నవ్వుతుంటారు. లోన నగుబాట్లకు గురౌతుంటారు. ఈ గ్రహపాట్లు నుండి విముక్తి ఎలా అని ఆలోచిస్తుంటారు.

సుద్యుమ్నుడు అదే చేశాడు. తన కుమారుడైన పురూరవునికి రాజ్యము నొసగి, తపస్సు నొనరించుటకు అరణ్యములకు వెడలినాడు.

సుద్యుమ్నుడు వనములకేగెను. మనువు పుత్రార్థియై యమునాతీరమున వంద సంవత్సరములు కఠోర తపమాచరించెను. శ్రీహరి యనుగ్రహముచే మనువు పదుగురు పుత్రులకు తండ్రియాయెను. ఆ పదుగురిలో ఇక్ష్వాకుడు జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు.

ఇక్ష్వాకుని సోదరులలో పృషధ్రు డొకడు. ఇతడొక మహానుభావుడు. తెలియక చేసిన పాపమునకు శాపము నొంది, శాపానుభవములో తాపసుడై, తరించిన పరమ భాగవతోత్తముడు. ఈ మహాత్ముని దివ్యచరితమును గూడా తెలిసికొందుము.

పృషధ్రుని చరిత్రము

పృషధ్రుడు గురువుచే గోరక్షకుడుగ నియమింపబడెను. రాత్రుల యందు గోవులను చక్కగ గాయుచుండెను. ఒకనాడు జోరున వర్షము కురియుచుండెను. గోశాలలో ఒక పులి ప్రవేశించెను. వ్యాఘ్రమును జూచి భయపడిన గోమాతలు అటునిటు పరుగిడు చుండెను. ఒక గోవుపై పులి బడగా ఆ గోవు భయంకరముగ అరచెను. పృషధ్రుడు ఆవుకడకేగెను. ఆవు వెంటబడుతున్న వ్యాఘ్రమును పృషధ్రుడు మసకచీకటిలో గాంచగలిగెను. ఆకాశమున మేఘము లధికమగుటచే అంధకార మధికమయ్యెను. ఆ చీకటిలో వ్యాఘ్రమని భావించి ఖడ్గముతో పృషధ్రుడు గోవుమస్తకమును ఖండించెను. ఖడ్గము యొక్క చివరి భాగము పులికి కూడా తగిలెను. వ్యాఘ్రము పలాయన మయ్యెను.

వ్యాఘ్రమే చనిపోయెనని పృషధ్రుడు భావించెను. తెల్లవారెను. చనిపోయినది గోవని తెలిసెను. తెలియక జరిగిన అపరాధమునకు పృషధ్రుడు మిక్కిలి దుఃఖించెను. గోవధ నెరిగిన వశిష్ఠుడు పృషధ్రునిపై కోపించెను. శూద్రుడవై జన్మింపుమని శపించెను. గురుదేవుని శాపమును పృషధ్రుడు వినమ్రుడై గ్రహించెను.

కష్టాలు కొందరిని కఠినాత్ములుగా మార్చుతాయి. వెతలు మరికొందరికి వెలుగు బాటను చూపుతాయి. పృషధ్రుడు రెండవ కోవకు చెందినవాడు. గురుదేవుని శాపాన్ని వరంగా భావించాడు. మననశీలు డయ్యాడు. హరిభక్తిని పెంచుకున్నాడు. ఊర్ధ్వ రేతస్కుడైనాడు. సర్వప్రాణులకు ఆప్తుడైనాడు. ఇంద్రియములను నిగ్రహించినాడు. సంగత్వమును విడనాడినాడు. శాంతుడైనాడు. అపరిగ్రహుడైనాడు. లభించిన దానితో తృప్తి చెందువాడైనాడు. జడుని వలె, అంధుని వలె, చెవిటివాని వలె సంచరింపసాగాడు. ఒకనాడు అరణ్య మధ్యమున యోగాగ్ని ద్వారా దేహమును దగ్ధమొనర్చి, పరమాత్మ యందు లీనమైనాడు.

తెలిసినా, తెలియక పోయినా అగ్ని ఎలా కాల్చుతుందో; ఎఱిగినా, ఎఱుగక చేసినా పాపము గూడా జీవిని వదలి పెట్టదు. కానీ, ఎవరైతే పృషధ్రుని వలె విశిష్ట ప్రయత్నము లొనర్చెదరో అట్టివారు విమలచిత్తులై అమల పదమునొంది తరింతురు. పృషధ్రుడు శాపమును అనుభవించక ముందే ఆత్మవిదుడాయెను. కృషిచేయువారికే భగవత్కృప లభించును. ఇచ్చట పృషధ్రుని నుండి మనము రెండు విషయాలు నేర్చుకోవాలి. 1.ఆవేశముతో, అనాలోచితముగా పృషధ్రుడు తొందరపడి గోవధకు కారణమైనట్లు, జీవితములో మనము అలా తొందర పడకుండా యుండాలి. ప్రతిపనిని ఆలోచించి చేయాలి. పునరాలోచించి చేయువారు దోషములను చేయరు. 2. శాపగ్రస్తుడైనను ప్రయత్నము ద్వారా పృషధ్రుడు తరించినట్లు, మనము కూడా తీవ్ర ప్రయత్నముద్వారా జీవిత గమ్యమును సాధింపగలగాలి.

సుకన్యా చ్యవనుల చరిత్రము

మనువు పుత్రుడగు శర్యాతి మహారాజుకు సుకన్య యనెడి పుత్రిక గలదు. ఒకనాడు శర్యాతి తన పుత్రిక యగు సుకన్యతో గూడి చ్యవన మహర్షి ఆశ్రమమునకు వెళ్ళెను. సుకన్య చెలికత్తెలతో గూడి ఆశ్రమ ప్రదేశమును తిలకించుచుండెను. ఫల పుష్పాదులను గోయుచు దగ్గరనే యున్న ఒక పుట్టను జూచెను. ఆ పుట్ట యొక్క రంధ్రములో మిణుగురు పురుగుల వలె మెరయుచున్న జ్యోతులను గాంచెను. సుకన్య ఒక ముల్లును తీసికొని ఆ రెండు జ్యోతులను పొడిచెను. వెంటనే అచ్చోట నుండి రక్తము స్రవింప సాగెను.

శర్యాతి రాజు యొక్క సైన్యముల మలమూత్రములు నిరోధింప బడెను. శర్యాతికి ఆశ్చర్యమాయెను. తెలియక ఎవ్వరైనను మహాత్ముడగు ఈ చ్యవముని ఆశ్రమమున అపరాధ మొనర్చియుండినచో తెలుపుమని శర్యాతి అందరిని ప్రశ్నించెను. తాను చేసిన అపరాధమును సుకన్య భీతిల్లుచూ అంగీకరించెను.

శర్యాతి దుఃఖితుడాయెను. పుట్టను సమీపించి, చ్యవముని ప్రార్థించెను. ప్రసన్నుడైన మహర్షికి తన పుత్రికయగు సుకన్య నొసగెను. వెనుదిరిగి పట్టణమునకు వెళ్ళెను. కాల ప్రవాహంలో ఎప్పుడు ఏది జరుగుతుందో, ఎందుకు జరుగుతుందో పరిమితులైన వారికి

ఏమి అవగతమవుతుంది? దైవ లీలలు మానవులకు ఊహాతీతములు. సుఖ దుఃఖాలను మనమే తయారు చేసుకుంటాము. తెలియని దోషముచే కర్తృత్వమును పరమాత్మకు ఆపాదిస్తాము.

We make our fortunes and we call them fate.

"మన అదృష్టాలు మన హస్తగతమై యుండగా, వాటిని విధి నిర్ణయాలుగా మనం పిలుస్తాము" అంటాడు డిస్రేలి.

పుత్రికను వీడియుండలేక కన్యతో గూడి వనమున కేళ్ళిన శర్యాతి పుత్రికను వీడి బరువైన హృదయముతో ఇంటికేగెను. ఈ ప్రపంచములోని బంధాలన్నీ ఒకనాటికి వీడేవియే. ఊడేవియే. కూడే దేదైనా ఊడేందుకే. ముక్కుపచ్చలారని సుకన్య ముసలి మగనికి భార్యయైనది.

చ్యవనుని మనోభావముల నెఱిగి సుకన్య ప్రవర్తించుచుండెను. తన సేవలతో ఆయనను తృప్తి పరచెను. ఒకనాడు అశ్వినీ కుమారులు చ్యవనుని ఆశ్రమమును సందర్శించిరి. ఆయన వైద్య నిపుణులగు అశ్వినీకుమారులను పూజించెను. ముసలి తనముచే జీర్ణమైన శరీరము గలవాడును, వ్రేలాడు చర్మము గలవాడును అగు చ్యవనుడు తనకు యౌవనమును ప్రసాదింపుమని ప్రార్థించెను. వారందులకు అంగీకరించిరి. చ్యవనుడు సుందర దేహముగల యౌవనవంతు డాయెను. అశ్వినీ కుమారులు దివికేగిరి.

యజ్ఞముచేయ సంకల్పించిన శర్యాతి ఒకనాడు చ్యవనుని ఆశ్రమమునకు వచ్చెను. సుకన్య ప్రక్కనే భాస్కర తేజముతో భాసిల్లు పురుషుని గాంచెను. మనస్సు కలతచెందెను. పుత్రిక వైపు చూచుటకు మనస్సంగీకరించ దాయెను.

"దుష్టురాలా! ముసలివాడని మహాత్ముడైన మగని త్యజించి, విలాసునితో జీవించు చుంటివా? నీవు ఇట్టి పతనావస్థకు దిగజారెదవని నేను స్వప్నము నందైనను ఊహించలేదు. జారస్త్రీవియై నీవు దిగజారుటయే గాక వంశప్రతిష్ఠనే దిగజార్చావు;" అని సుకన్యను నిందింపసాగెను.

తండ్రి మాటల నాలకించిన సుకన్య మందహాసమును చిందిస్తూ, "తండ్రీ! నీ బిడ్డ దోషము నెరుగదు. తప్పు చేయదు. వంశ గౌరవమును పెంచునే గాని తగ్గించదు. ఈయనే మీ అల్లుడు చ్యవన మహర్షి" యని జరిగిన వృత్తాంతము నంతటి నెరింగించెను. శర్యాతి హృదయము ఆనందముతో ఉప్పొంగెను. ఆనంద బాష్పములు రాలుచుండగా పుత్రికను ప్రేమతో కౌగలించుకొనెను. చ్యవనుడు శర్యాతిచే సోమయాగమును చేయించెను. శర్యాతి తృప్తి నొందెను. శర్యాతికి ఉత్తాన బర్హి, ఆనర్తుడు, భూరిషేణుడు యను ముగ్గురు పుత్రులు కలిగిరి.

నదీ తీరమునకు ఎవ్వరైనను వెళ్ళగలరు. కానీ ఈత తెలిసినవారే యందు ఈదగలరు. గురువుల నెవ్వరైనను సమీపించవచ్చు. కానీ గురువుల చెంత కొందరే చక్కగా

మెలగగలరు. అలా మెలగగలవారే వెలుగును గాంచ గల్గుదురు. చ్యవనుని ఆశ్రమంలో హద్దుమీరి ప్రవర్తించిన సుకన్య ఆపదలను ఆలింగన మొనర్చుకొన్నది. కానీ చ్యవనుని సేవలో దోషమును దూరం చేసికొని సంతోషముతో బ్రతుకును పండించుకొన్నది. సుశిక్షితు లెన్నడైనా సుకన్యలే కాగలరు. పెద్దలకు చేయు సేవ ఎన్నడూ వృథా గాదని సుకన్య వృత్తాంతము తెలుపును.

అభివాదన శీలస్య నిత్యం వృద్ధోప సేవినః
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశోబలమ్

"గురువులకు నమస్కరించుచు, సదా వారిని సేవించువారికి ఆయుస్సు, విద్య, యశస్సు, బలము యనెడి నాలుగు విషయములు వృద్ధియగును" అని మనుధర్మశాస్త్రము.

అంబరీషోపాఖ్యానము

మనువు పుత్రుడైన నభగునికి నాభాగుడను కుమారుడు గలడు. అతడు చాలాకాలము గురుసేవ జేయుచూ గురుగృహము నందే యుండెను. అతడు ఇక తిరిగి రాడని భావించిన యతని సోదరులు పిత్రార్జితమును నాభాగునికి ఉంచక తామే పంచుకొనిరి. కొంత కాలమునకు నాభాగుడు గురుగృహము నుండి స్వగృహమునకు వచ్చెను. తన భాగమును తన కివ్వమని సోదరులను అర్థించెను. తమ తండ్రియగు నభగుడే అతడి భాగమని సోదరులు పలికిరి.

మర్మమెరుగని నాభాగుడు తండ్రిని సమీపించెను. ఆనందపూర్ణహృదయుడై "తండ్రీ! నాసోదరులు తమరిని నా భాగముగా నాకొసంగినారు. వాస్తవానికి అది నాకు భాగము కాదు. నా భాగ్యము" యనెను.

నాభాగుని హృదయ సౌందర్యమును, అమాయకత్వమును గాంచిన నభగుడు కలతచెందినవాడై, "పుత్రా! మోసమెరుగని నిన్ను మోసపుచ్చుట వారికి కడు సులభమాయెను. నీవు వారి వాక్కులను విశ్వసింపకుము. ఈ దశలో నేను నీకు భాగమును కాను; భాగ్యమును కాలేను; కేవలము భారమును మాత్రమే. కుమారా! నేను నీకొక ఉపాయమును చెప్పెదను. శ్రద్ధతో నాలకింపుము. అంగిరస గోత్రికులగు ఋషులు ఇపుడు యజ్ఞము చేయుచున్నారు. నీవు వారివద్దకు వెడలుము. వైశ్వదేవ ప్రియమైన సూక్తములను పఠింపుము. యజ్ఞసమాప్తి సమయాన వారు నీకు ధనము నిత్తురు;" యనిపలికెను.

తండ్రి చెప్పినట్లే నాభాగు డాచరించెను. యజ్ఞసమాప్తి సమయాన మిగిలిన ధనమును నాభాగునికి ఋషులు ఇచ్చిరి. ఋషులు స్వర్గమున కేగిరి. నాభాగుడు ధనమును తీసికొన బోయెను. ఇంతలో ఒక పురుషు డరుదెంచి, "ఈ యాగభూమి యందలి సంపద యంతయూ నాదే" నని పలికెను.

"ఈ ధనమును ఋషులు నాకొసంగినారు. ఇదంతయూ నాదే"యని నాభాగు డనెను. "అట్లైనచో మన సమస్యను మీ తండ్రి కెరిగింపుము. అతని నిర్ణయమును మనము పాటింతుము" యని ఆ పురుషుడనెను.

నాభాగుడు తండ్రియగు నభగుని సమీపించెను. జరిగినదంతయూ విన్నవించెను. తండ్రి నవ్వుచూ, "వత్సా! ఋషులు ఆ ద్రవ్యమును రుద్రదేవునకు భాగముగా నొసంగియున్నారు. అందుచేత నీతో ముచ్చటించిన రుద్రదేవుడే ఆ సంపదకు యజమాని యగుచున్నాడు" యని పలికెను.

తండ్రి మాటల నాలకించిన నాభాగుడు రుద్రునకు నమస్కరించెను. "మహాదేవా! దివ్యపురుషా! ఈ యజ్ఞావశిష్టమగు ధనమంతయు మీకే చెందునని మా తండ్రి చెప్పెను. నా తప్పిదమును మన్నింపుడు. నేను శిరమోడ్చి నమస్కరించుచున్నాను. ఈ ధనమును స్వీకరింపుడు" యని వినమ్రుడై ప్రార్థించెను.

"వత్సా! నాభాగా! మీ తండ్రి సత్యమునే వచించెను. నీవు కూడా సత్యమునే భాషించితివి. నా హృదయము సంతసించినది. నీకు నేను బ్రహ్మోపదేశమును చేయుచున్నాను. దానితో పాటు ఈ ధనమును కూడా నీకే ఇచ్చుచున్నాను" అని పలికి, ఆశీర్వదించి రుద్రదేవుడు అదృశ్య మాయెను.

నాభాగుడు కపట మెరుగడు. కాపట్య మెరుగడు. కాలుష్య మెరుగడు. ధర్మాను వర్తియగు వారిని ధర్మమే రక్షించును. అట్టి వారికి దైవ సహాయము లభించును. అట్టివారి వంశములో మహాత్ములు, మహాభక్తులు జనింతురు.

నాభాగునకు అంబరీషుడు పుత్రుడై జన్మించెను. అతడు భక్తాగ్రగణ్యుడు. భాగవతోత్తముడు. అపజయ మెరుగని ఋషి శాపము కూడా అంబరీషుని ముందు అపజయమును చవిచూచెను యని శ్రీశుకుడు ఆనందముతో పలికెను.

"సర్వ సంపూజ్యా! శుకదేవా! ఆహా! ఎంతటి అద్భుతము! అట్టి పరమ భాగవతుని చరితమును వినవలెనని మది కుతూహల పడుచున్నది. దయచేసి అనుగ్రహింపుడు"యని పరీక్షిత్తు పలికెను. శ్రీశుకులవారు చెప్పుట కుద్యుక్తులైరి.

అంబరీషుడు మహా భాగ్యవంతుడు. అక్షయ సంపదను కలిగియుండెను. దుర్లభమైన ఇట్టి సంపదను కలిగియున్నను సామాన్యుని వలె జీవించెను. గర్వమును దరిజేరనీయక జాగరూకుడై యుండెను. ఈ సంపద నంతటిని స్వప్నమువలె అనిత్యముగా భావించెను. జీవుని మోహమునకు గురిచేయునది ఈ సంపదలేనని గుర్తించెను. గ్రహించెను.

అంబరీషునకు పరమాత్మయగు వాసుదేవునియందు భక్తిమెండు. అంతేగాదు భగవద్భక్తులయందు అపారమైన భక్తి కలిగియుండెను. భక్తులసేవలో భగవానుని దర్శించి నంత తృప్తి ననుభవించుచుండెను.

సీ॥ చిత్తంబు మధురిపు శ్రీపాదములయంద పలుకులు హరిగుణపఠనమంద
కరములు విష్ణుమందిరమార్జనములంద, శ్రవములు మాధవ శ్రవణమంద
చూపులు గోవిందరూపవీక్షణమంద, శిరము గేశవనమస్కృతులయంద
పదము లీశ్వరగేహపరిసర్పణములంద కామంబు చక్రికైంకర్యమంద

తే॥ సంగ మచ్యుతజనతను సంగమంద ఘ్రాణ మసురారిభక్తాంఘ్రి కమలమంద
రసనఁ దులసీదళములంద రతులు పుణ్య సంగతులయంద యా రాజచంద్రమునకు.

ఈ విధముగా అంబరీషుడు జీవించుచుండెనని సహజ పండితుని అసమాన వర్ణనము.

అంబరీషుని అంతఃకరణము అచ్యుతుని యందే లగ్నమైయుండును. నారాయణ స్మరణ యందే నాలుక కదులుచుండును. ఆలయ సేవల యందు, అనంతుని అర్చన యందు కరములు చరించుచుండును. చెవులు భగవన్నామమునే వినుచుండును. దృష్టి సదా గోవిందుని యందే యుండును. శిరము పరమాత్మకు నమస్కరించుచుండును. పాదములు పవిత్రమైన ఈశ్వరాలయముల చెంత కేగుచుండును. భగవత్స్మరణ యందే కోరికలు తిరుగుచుండును. సజ్జన సంగతి యందే సంగత్వము నిలచియుండును. భక్తుల పాదపద్మములను స్పృశించి, ఆఘ్రాణించుట యందు త్వగింద్రియము, ఘ్రాణేంద్రియములు నిమగ్నమై యుండును. భగవానున కర్పించిన తులసితీర్థమును గ్రహించుట యందు నాలుక రమించుచుండెను. ఈ విధముగా నంబరీషుడు సర్వదా సర్వభావముల చేత సర్వేశ్వరుని అర్చింపసాగెను.

అంబరీషు డనెడి పదమునకు అర్థమును గ్రహించెదము. అంబర మనగా ఆకాశము. ఈశుడనగా ప్రభువని భావము. ఆకాశము అనంతము. లోపల బయట అంతటనూ ఉండునదేదియో అదియే ఆకాశము. ఎవనికి బాహ్యాభ్యంతరముల యందు పరమాత్మ దర్శనీయుడో అతడే అంబరీషుడు.

ఆత్మనోఽన్యా గతి ర్నాస్తి సర్వ మాత్మమయం జగత్

"ఆత్మకన్నా అన్యమగు గతి మరియొకటి లేదు. ప్రపంచ మంతయు పరమాత్మ స్వరూపమే" యని తేజోబిందూపనిషత్తు ప్రవచించినది.

అంబరీషుడు భక్తి యందు పూర్ణ సంతుష్టచిత్తుడాయెను. **"కరౌ హారేర్మందిర మార్జనాదిషు"** ఆయన కరము లెప్పుడూ శ్రీహరి మందిరమును శుభ్రముచేయుట యందు ఆసక్తిని కనబరచుచూ, ఆచరించుచుండెను. అంబరీషుడు రాజు. ఈ విధమైన కార్యములను చేయుటకు వేలాది సేవకులుందురు. అయిననూ తానే స్వయముగా ఈ కార్యముల నాచరించి తృప్తిచెందును.

అంబరీషుడు ఒకసారి శ్రీహరి నారాధించుచు అశ్వమేధ యజ్ఞములు చేసెను. ఈ యజ్ఞములను తన ప్రతినిధులగు వశిష్ఠుడు, అసితుడు, గౌతముడు మున్నగు వారలచే నిర్వహింప జేసినట్లు భాగవతమున యున్నది. ప్రతినిధులు యజ్ఞాది కర్మములను లోక కళ్యాణము కొఱకు ఆచరించుచుండిరి. అంబరీషుడు పుణ్యకర్మల యందు రతుడు గాక హరిభక్తి యందే, హరిస్మరణ యందే చిత్తమును లగ్నమొనర్చి యుండెను.

అంబరీషుడు భక్తుడై యుండెను. ఆయన రాజ్యము నందలి జనులందరు హరిభక్తి పరాయణులై యుండిరి. స్వర్గాది భోగముల యందు ఆసక్తి లేనివారై మోక్షమునందు ప్రీతి

గల్గియుండిరి. అంబరీషుని భక్తి ప్రతిక్షణ వర్ధమాన మగుచుండెను. గృహమునందు ఆసక్తి లేకుండెను. బంధువులయందు ప్రీతి గోచరింపదాయెను. దారా పుత్రాదుల యందు ప్రేమ అదృశ్య మాయెను. అలంకారముల యందు అభిరుచి నశించెను. ధనాదుల యందు అభిలాష అంతరించెను. నిరంతర భగవత్సేవయే ఆయనకు అత్యంత ప్రీతిపాత్ర మాయెను.

యుక్తః సంవత్సరం వీరో దధార ద్వాదశీ వ్రతమ్

ఒకసారి అంబరీషుడు సంవత్సర కాలము ద్వాదశీ వ్రతము నాచరించెను.

వ్రత సమాప్తి సమయాన అంబరీషుడు మూడు రాత్రులు ఉపవాసముండెను. యమునా నదియందు స్నానమాచరించి, శ్రీహరిని సేవించెను. సాధువులకు, బ్రాహ్మణులకు స్వర్ణ రజితములను, వస్త్ర, గో, భూదానాదులను విరివిగా దానమొనర్చెను. అంబరీషుడు నిజమైన హరిదాసు. జనులయందు జనార్దనుని దర్శించి సేవాకార్యము లొనర్చువాడే హరిదాసు యనబడును.

దం స యతే స్వామి కార్యాణి సావధానే నేతి దాసః

"భగవానుని సేవలను సావధానముగా నొనర్చువాడు దాసు" డని భావము.

భక్తులను పూజించిన పిదప వ్రతమునకు పూర్ణాహుతి జరుపుటకు అంబరీషుడు సిద్ధపడుచుండెను. ఆ సమయానికి దుర్వాసమహర్షి అతిథిగా యరుదెంచెను. అంబరీషుడు దుర్వాసుని అర్చించెను. భోజనము చేయుమని ప్రార్థించెను.

అంబరీషుని సేవలతో తృప్తిజెందిన దుర్వాసుడు తాను మాధ్యాహ్నిక కర్మముల నాచరించివత్తునని పల్కి కాళిందీ నదీ తీరమునకు వెళ్ళెను. అచ్చట దుర్వాసుడు బాహ్య స్మృతులుడిగి ధ్యానమగ్నుడాయెను.

ద్వాదశి అర్ధ ముహూర్తము మాత్రమే మిగిలి యున్నది. బ్రాహ్మణులు, సాధువులు ఆతిథ్యమును స్వీకరించుటకు అరుదెంచి యున్నారు. వారికి ఆతిథ్య మివ్వకుండా అంబరీషుడు భుజింపకూడదు. తాను భుజించినచో దుర్వాసమహర్షిని అవమానపరచి నట్లగును. ఒకవేళ భుజింపనిచో ద్వాదశి సమాప్తమై త్రయోదశి ప్రారంభమగును. అంబరీషునకు సముచిత చర్య ఏదియో తెలియదాయెను. బుద్ధి సిద్ధపడనపుడు పెద్దల వాక్యములే శిరోధార్యములు. అంబరీషుడు విప్రులకు విన్నవించెను. తుదకు జలపానము చేయుటకు నిర్ణయించుకొనెను. జలపానము భక్షణమూ, అభక్షణమూ యని రెండు అభిప్రాయము లున్నవి.

అంబరీషుడు జలపాన మొనర్చి, దుర్వాసునికై నిరీక్షించుచుండెను. దుర్వాసు డరుదెంచెను. అంబరీషు డాయనను అర్చించెను. జరిగిన విషయమును బుద్ధిశాలియగు దుర్వాసుడు క్షణములో గ్రహించెను. దుర్వాసుడు క్రుద్ధుడాయెను. అవయవములు కంపించసాగెను.

"ఓయీ అంబరీషా! మదోన్మత్తుడవై, క్రూరుడవై ధర్మచ్యుతికి ఒడిగట్టితివి. అతిథి నాహ్వానించి అవమాన పరచితివి. ఈ దోషము క్షమార్హము కానేరదు. తత్ఫలితమును ఇప్పుడే నీవనుభవింపగలవు" యని పలికి దుర్వాసుడు తన జడనందలి కేశముల నుండి కృత్యను సృష్టించి, భయంకరమగు ఆ కృత్యను అంబరీషుని పైకి వదలెను.

కృత్య ఖడ్గమును చేబూని అంబరీషుని సమీపించుచుండెను. కానీ హరిభక్త పరాయణుడైన అంబరీషుడు కదలడాయెను. పరమాశ్చర్యము! సర్వులు గాంచుచుండ శ్రీహరి భగవానుని సుదర్శనచక్రము కృత్యను ఖండించెను. దగ్ధ మొనర్చెను. సుదర్శనము దుర్వాసుని చెంత కరుదెంచుచుండెను. భయకంపితుడైన దుర్వాసుడు ప్రాణరక్షణకై పరుగులిడసాగెను. దుర్వాసునికి త్రిలోకముల యందు రక్షణ లభించలేదు. చివరగా బ్రహ్మలోకమున కేగి రక్షింపుమని బ్రహ్మదేవుని ప్రార్థించెను. బ్రహ్మదేవుడు తన నిస్సహాయతను ప్రకటించెను. తదుపరి దుర్వాసుడు కైలాసగిరి కేగి శంకరుని ప్రార్థించెను. ఈ చక్రమును తాము ప్రతిఘటింప లేమనియు, ఈ సమయాన శ్రీహరి ఒక్కడే పరమ శరణ్య మనియు శంకరుడు తెలిపెను.

నిరాశా నిస్పృహలచే చెదరగొట్టబడి విచలిత మనస్కుడైన దుర్వాసుడు చేయునది లేక వైకుంఠమును జేరెను. శ్రీహరిని శరణు జొచ్చెను. "అచ్యుతా! విశ్వభావనా! నేను నీ భక్తునకు చేసిన అపరాధమును మన్నించి రక్షింపుము. నీవు తప్ప నన్ను రక్షించు వారెవ్వరునూ లేరు" యని వినతించెను.

దుర్వాసుని దీనాలాపము నాలకించిన దీనదయాళుడు, "బ్రాహ్మణుడా! భక్తులు అన్ని విధముల నన్నే సేవించుచుందురు. అహంకార మమకారములకు దూరులై యుందురు. వారు సర్వమును నాకు సమర్పింతురు. కనుక నేను కూడా నన్ను వారి కర్పించుకొని స్వతంత్రతను త్యజించితిని.

అహం భక్త పరాధీనో హ్య స్వతంత్ర ఇవ ద్విజ
సాధు భిర్గస్త హృదయో భక్తై ర్భక్త జన ప్రియః

"ఓ ద్విజుడా! నేను భక్తాధీనుడను. అస్వతంత్రుడను. సాధువులు నా హృదయమును చేజిక్కించుకొని యున్నారు. భక్తజనప్రియులు హరిప్రియులే సుమా!

"మునివర్యా! నీవు బ్రహ్మదేవుని ఆశ్రయించితివి. కైలాసమున శంకరుని శరణుజొచ్చితివి. వారు నా యాధీనములో యుండువారు గావున నిన్ను రక్షింపలేకపోయిరి. నేను భక్తుల యాధీనమున యుండువాడను. నా ఆధీనములో యున్నవారు నిన్నెలా రక్షింప లేక పోయిరో వేరొకరి యాధీనమునందున్న నేను నిన్నెలా రక్షింపగలను?

"భక్తులు నన్నే నమ్మి యున్నారు. గృహములను త్యజించారు. దారా పుత్రాదులను విస్మరించారు. ధనమును పరిత్యజించారు. ప్రాముఖ్యమును మరిచారు. ఈవిధముగా నన్నే ఆశ్రయించిన పుణ్యాత్ములను నేనెలా విడువగలను? వారిని వెంబడించి చరించుటయే నా కర్తవ్యము.

ఆ॥ నాకు మేలుగోర నా భక్తులక కాని భక్తజనుల కేన పరమగతియు
భక్తు(డెందు జనిన(బఱతెంతు వెనువెంట గోవువెంట(దగులు క్రోడెభంగి.

"దుర్వాసా! సుశీల యగు వనిత భర్తను వశపరచుకొనినట్లు, నా భక్తులు వారి అనన్య భక్తిచే నన్ను వశపరచుకొని యున్నారు. స్వర్గాది భోగములను సైతము వాంఛింపని వారి భక్తి నన్ను సదా ఆకర్షించుచునే యుండును. వారిని వదలి నేను మనలేను. నేనే వారు. వారే నేను.

సాధవో హృదయం మహ్యం సాధూనాం హృదయ స్త్వహం
మదన్య త్తేన జానన్తి నాహం తేభ్యో మనాగపి ॥

"సాధువులు నా హృదయము. సాధువుల హృదయమును నేను. వారు నన్ను దప్ప మరెవ్వరిని ఎరుగరు. నేను వారిని దప్ప మరెవ్వరిని ఎరుగను.

"మునివర్యా! తరుణోపాయమును చెప్పుచున్నాను. ఆలకింపుము. సాధకులకు విద్య, తపస్సులు రెండును శ్రేయము నొనగూర్చును. వినయము లోపించి అహంకారముతో విర్రవీగు వ్యక్తి విషయమున ఈ రెండును విపరీత ఫలములనే అందించును.

"నీకు ఈ విపత్తు ఎవరివలన సంభవించినదో ఆతనినే శరణు వేడుము. ఆలస్యము చేయకుము. నిన్ను అంబరీషుడే రక్షింపగలడు. అంబరీషుడు శాంతించినపుడే నీకు శాంతి కలుగును" యనెను.

అంబరీషుని ఔదార్యము

భగవంతుని యాజ్ఞ మేరకు దుర్వాసుడు పరుగిడుచు అంబరీషుని చేరెను. దుఃఖ తప్తహృదయుడై అంబరీషుని చరణములపై బడెను. అంబరీషుడు కలత చెందెను. వలదని వారించెను. సుదర్శనమును ప్రార్థించెను. దుర్వాసుని దుఃఖము నుపశమింప జేసెను. సుదర్శనము అంబరీషుని ప్రార్థన నాలకించి శాంతించెను. దుర్వాస మహర్షి అంబరీషుని ప్రశంసించెను.

"రాజా! నేను నీకు అపరాధమును చేసితిని. అయినను నీవు నాపై ఔదార్యమును ప్రదర్శించితివి. ఇదియే భక్తుల వైశిష్ట్యము. భక్తుల వైభవమును నేడు కనులార గాంచితిని. భక్తవత్సలుడైన భగవానుని పొందిన భక్తులకు సాధ్యాసాధ్యములు నామ మాత్రములని గ్రహింప గలిగితిని. అంబరీష మహాశయా! నేను నీ అనుగ్రహమునకు పాత్రుడనై ప్రాణములను రక్షించుకొంటిని" యనెను.

ఇంతవరకు దుర్వాసమహర్షి రాకకై నిరీక్షిస్తుండిన అంబరీషుడు ఇంకను భుజించలేదు. అంబరీషుడు వినమ్రుడై దుర్వాసుని చరణములను పట్టుకొని భుజింపుమని ప్రార్థించెను. మహర్షి సంతృప్తితో భుజించెను. అంబరీషుని దీవించెను. తదుపరి బ్రహ్మలోకమున

కేగెను. సుదర్శన చక్రము వెంబడించగా భీతుడై పరుగిడిన దుర్వాసుడు తిరిగి వచ్చునరికి సంవత్సరకాలము పట్టెను. అంతవరకు అంబరీషుడు అన్నమును ముట్టకుండెను.

అంబరీషుడు భక్తి స్వరూపము. భక్తి పూర్ణత్వము నొందు సమయాన దుర్వాసు డరుదెంచును. దుర్వాసు డనగా దుర్వాసనయని పెద్దల అభిప్రాయము. ఈ దుర్వాసన క్రోధరూపంలో ఇచ్చట ప్రవేశించెను. కొందరి విషయములో ఇది కామము యొక్క రూపమును ధరించును. మరి కొందరి విషయములో లోభరూపమున దర్శన మిచ్చును. ఇంక కొందరి విషయములో మోహరూపమున ఏతెంచును. దుర్వాసన ఎన్ని రూపములలో ఎదురైనను దానిని భక్తుడు ఎదుర్కొన నవసరములేదు. తన దృష్టిని పరమాత్మ నుండి మరల్చకుండిన సరిపోవును.

అంబరీషుడు దుర్వాసుని ఒక్క మాట యనలేదు. మనస్సును నామము నందే నిలిపెను. నామము నంటియే నామి యుండును. నామము నుచ్చరించగనే భగవాముని దివ్యరూపము మన నేత్రముల ముందు నిలుచును. అదియే సుదర్శనము. ఈ సుదర్శనము దుర్వాసన ప్రయోగించు కృత్యములను దగ్ధమొనర్చును. అంతేగాదు. దుర్వాసనను సద్వాసనగా మార్చును. దుర్వాసుడు పరితపించుట యందు, పరివర్తన చెందుట యందు ఈ రహస్యమే తెలియుచున్నది.

అంబరీషస్య చరితం యే శృణ్వన్తి మహాత్మనః
ముక్తిం ప్రయాన్తి తే సర్వే భక్త్యా విష్ణోః ప్రసాదతః ॥

"ఎవరయితే మహాత్ముడైన అంబరీషుని చరితమును శ్రవణము చేయుదురో వారు భక్తులై, విష్ణుభగవానుని కృపకు పాత్రులై ముక్తి నొంది తరింతురు" యని శుకబ్రహ్మ పరీక్షిత్తునకు తెలిపెను. శుకాది బ్రహ్మవేత్తల చేత ప్రశంసింపబడిన అంబరీషుడు ధన్యాత్ముడు. అట్టి మహాత్ముని చరితమును పఠించువారు గూడా ధన్యజీవులే యగుదురు.

భక్తులకు అభయమే గాని భయము లేదని అంబరీషోపాఖ్యానము నిరూపించినది. భక్తులను సదా భగవంతుడే కాపాడునని కూడా నిర్ణయింపబడినది. సుఖ దుఃఖాదుల యందు భక్తులు భగవంతునే స్మరింతురనియు, తమను నిందించిన వారిని సైతము ప్రేమించే విశాల హృదయులు భక్తులని అంబరీషుని చరిత్ర నిర్దేశించినది.

సౌభరి చరిత్ర

మనువునకు ఇక్ష్వాకుడను కుమారుడు కలిగెను. ఆ వంశమునందే మాంధాత జన్మించెను. మాంధాత ఇందుమతిని పరిణయమాడెను. వారికి పురుకుత్సుడు, అంబరీషుడు, యోగియగు ముచికుందుడు పుత్రులుగ జన్మించిరి. ఏబదిమంది కుమార్తెలు కలిగిరి. వారు సౌభరి మహర్షిని పరిణయమాడిరి.

సౌభరి మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆ మహాత్ముని దర్శించుటకు జనులు తండోప తండములుగా వచ్చుచుండిరి. దానివలన సౌభరి తపస్సునకు విఘ్నము వాటిల్లె

చుండెను. సౌభరి ఆలోచించెను. జనులు ప్రవేశించుటకు అవకాశము లేని విధముగ్గా తపమాచరించుటకు యమునా నదీ జలములలో ప్రవేశించెను.

సాధనకు అనుకూలమైన ప్రదేశము అవసరము. కానీ సానుకూలమైన మనస్సు లేనపుడు కేవలము ప్రదేశముల వల్ల పొందే ప్రయోజన మేమియును ఉండదు. కొందరు సాధన లాచరించుటకు ఆశ్రమాలకు వెళ్తుంటారు. కానీ అక్కడ కూడా ప్రాపంచిక విషయాలనే ముచ్చటిస్తుంటారు. సంస్కారాలు జీవిని నీడలా వెన్నంటే ఉంటాయి.

సౌభరి యమునా జలమున ప్రవేశించెను. తపస్సును ప్రారంభించెను. నీటిలో చేపల యొక్క రతి విలాసమును గాంచి విచలితు డయ్యెను. కామవాంఛలు చిత్తమును ఛిద్ర మొనర్చెను. సౌభరి మాంధాత వద్దకు వెళ్ళి ఆయన కుమార్తెలలో ఒక యువతిని ఇవ్వమని అడిగెను.

మాంధాతకు అగమ్య గోచరమాయెను. వృద్ధుడైన సౌభరికి తన కుమార్తె నిచ్చినచో ఆమె జీవితము అంధకారబంధుర మగును. ఇవ్వనిచో సౌభరికి కోపము వచ్చును.

సోఽప్యాహ గృహ్యతాం బ్రహ్మన్ కామం కన్యా స్వయం వరే

"మునిసత్తమా! స్వయంవర మార్గమున నిన్ను వరించిన నా పుత్రికను స్వీకరింపుము"యని మాంధాత పలికెను.

మాంధాత మనోభిప్రాయమును సౌభరి గ్రహించెను. ముసలివాడు, వెంట్రుకలు ఊడినవాడు, ముడత పడిన చర్మము గలవాడు, కంపించు శిరముగలవాడు, తాపసియు నగు తనను ఏ కన్య వరించును? ఇదియే మాంధాత మనోభిప్రాయము. సౌభరి తపస్సంపన్నుడు. కామరూపధారి. వెంటనే అందమైన యువకుడాయెను. మాంధాత యొక్క ఏబదిమంది పుత్రికలు ఆయనను ప్రేమించిరి. ఆయన తనకే దక్కవలెనని వారిలో వారు పరస్పరము కలహించుకొనసాగిరి.

సౌభరి ఏబదిమంది రాజ కుమార్తెలను పరిణయమాడెను. సర్వ సుఖముల ననుభవించుచుండెను. కానీ ఇవి సుఖములా? కాదు. సుఖరూప దుఃఖములు. కనుక ఈ సుఖములు సౌభరి హృదయమునకు శాంతి నివ్వలేకపోయినవి.

సేవమానో న చాతుష్య దాజ్య స్తోకై రివానలః

నేయి పోయుట చేత అగ్ని శాంతింపనట్లు సౌభరి కూడా శాంతిని పొందలేక పోయెను.

సౌభరి ఒకనాడు ఏకాంతవాసుడై యుండెను. ఆ క్షణాన అతనిలో వివేక ముదయించెను. వైరాగ్యము స్ఫురించెను. తన తప్పిదము తెలిసి వచ్చెను. చిరకాల మాచరించిన తపస్సు జలచరముల రతిక్రీడను వీక్షించిన ఒక క్షణాన నశించెను. సౌభరిలో అంతరేక్షణ ప్రారంభమైనది. తన వలె ఎవ్వరూ. పతనము గాకూడదని సౌభరి నిర్ణయించుకొని భావితరాలకు సందేశము నొసంగెను.

సఙ్గం త్యజేత మిథున వ్రతినాం ముముక్షుః సర్వాత్మనా న విసృజే ద్బహిరిన్ద్రియాణి
ఏకశ్చరన్ రహసి చిత్త మనన్త ఈశే యుంజీత తద్వ్రతిషు సాధుషు చేత్ప్రసఙ్గః

"ముముక్షునైనవాడు కామాతురులగు వ్యక్తుల సాంగత్యమును విడువవలెను. ఇంద్రియములను బహిర్ముఖము చేయకూడదు. నిర్జన ప్రదేశమున ఏకాంతవాసియై శ్రీహరిని ధ్యానింపవలెను. సాంగత్యము చేయదలచినచో సాధు సాంగత్యమే చేయవలెను.

"నేను తపమాచరించుచు ఆనందముగా యుంటిని. మైధునరతమై యున్న మత్స్యములను గాంచి మోహ వశుడనైతిని. ఏబదిమందితో సంసారి నైతిని. ఆ ఏబది మందికి ఒకొక్కరికి నూరుగురు సంతాన మాయెను. ఇప్పుడు ఐదువేలమందిని పోషించు గృహస్థుడ నైతిని. మోహము వివేకమును నశింప జేయును. వైరాగ్యమును వక్రింప జేయును. మాయాలోలురు తరింపలేరు." ఇలా ఆలోచన చేయుచూ సౌభరి అంతర్ముఖు డాయెను. వైరాగ్య యుతుడై వానప్రస్థాశ్రమమును స్వీకరించెను. పతివ్రతలగు భార్యలు కూడా ఆయన ననుసరించిరి. సౌభరి వనము నందుండి కఠోర తపమాచరించి తరించెను. ఆయన ననుసరించిన సతులు కూడా సద్గతి నొందిరి.

దృశ్యములు ప్రమాదములు. హానికరములు. పరమాత్మను మరిపింప జేసి, చిత్తమును మురిపించి విషయానందము వైపు త్రిప్పే దృశ్యములు ప్రాణహరములు. అవి సాధనా సౌధమునే కూల్చివేయును. పునాదులను కూడా కదిలించును. మత్స్యముల విలాసము మహితాత్ముడైన సౌభరిని మాయలో పడదోసెను. ఇక సామాన్యుల విషయము చెప్పనేల?

సాధకుడు దృష్టిని అదుపులో నుంచుకోవాలి. మనస్సును భ్రమింపజేయు దృశ్యములు కంటబడినపుడు శ్యామ సుందరుని దివ్యరూపమును మనస్సులో నింపుకోవాలి. "**ఓం నమో భగవతే వాసుదేవాయ**" యనెడి మహా మంత్రమును విడువకుండా ధ్యానించాలి. లేదా మహాభక్తుల జీవిత గాథలను పఠించాలి. ఏ విధమైన ఉపాయము చేత నైనను చిత్తములో తృష్ణను తొలగించుకొని కృష్ణుని నిలుపుకోవాలి.

మాయాకార్య మిదం భేద మస్తిచే ద్బ్రహ్మ భావనమ్

"మాయా రూపమగు భేదము గోచరింపగనే బ్రహ్మమును భావన చేయవలె"నని ఉపనిషత్ప్రబోధము.

హరిశ్చంద్రోపాఖ్యానము

మాంధాత వంశములో త్రిశంకు డుద్భవించెను. త్రిశంకుని కుమారుడు హరిశ్చంద్రుడు. హరిశ్చంద్రునకు సంతానము కలుగకుండెను. అందుచేత సదా విచారగ్రస్తుడై యుండెను. ఒకనాడు నారదుని చేత ఉపదేశమును పొంది వరుణుని వద్ద కెళ్ళెను. తనకు పుత్రుడు కలుగునట్లు వరమీయమని వరుణుని ప్రార్థించెను. తనకు పుత్రుడు కలిగినచో అతడిని యజ్ఞ పశువుగా సమర్పించి, యజ్ఞమును చేయుదునని

పలికెను. వరుణుడు సంతసించి వర మొసగెను. హరిశ్చంద్రునకు రోహితుడను పుత్రుడు కలిగెను.

హరిశ్చంద్రుని వద్దకు వరుణుడు వచ్చెను. ఇచ్చిన మాటను ఫలప్రదము చేయుమని చెప్పెను. పది దినములు గడచిన పిదప పశువు యజ్ఞమునకు అర్హతను పొందునని హరిశ్చంద్రుడు తెలిపెను.

పది దినములు పూర్తియైన పిదప మఱల వరుణు డరుదెంచెను. పశువునకు దంతములు మొలిచిన గాని అది పవిత్రమై యజ్ఞార్హము కాబోదని తెలిపెను.

దంతములు వచ్చిన పిదప వరుణుడు వచ్చెను. దంతము లుత్పన్నమైనందున యజ్ఞము నాచరింపుమని చెప్పెను. అందులకు హరిశ్చంద్రుడు సమాధాన మొసగెను. తొలి దంతములు రాలిన పిదప పశువు బలికి అర్హమగు ననెను.

దంతములు రాలెను. వరుణుడు మఱల అరుదెంచెను. యజ్ఞము నాచరింపుమని చెప్పెను. "దేవా! ఈ పశువునకు తిరిగి దంతములు పుట్టినచో అది పరమ పవిత్రమై యజ్ఞార్హమగును" అని హరిశ్చంద్రుడనెను.

మఱల దంతములు పుట్టినవి. మఱల వరుణుడు మామూలే. హరిశ్చంద్రుడు కూడా మామూలే. క్షత్రియ పశువు కవచమును ధరించి రణమున పోరుటకు శక్తి కల్గినపుడు పవిత్రమని సమాధానము.

పుత్ర వాత్సల్యము బ్రతుకును అసత్యములకు నిలయముగా తయారు చేసింది. పుత్ర మోహములో పడి వరుణుని సదా మోసగించుటకు హరిశ్చంద్రుడు వెనుకాడలేదు. రోహితుడు వర్ధమానుడగు చుండెను. వరుణ హరిశ్చంద్రుల ఒడంబడిక నవగత మొనర్చుకొనెను. ధనుర్బాణములను చేబూని ప్రాణ రక్షణకై అరణ్యముల కేగెను.

హరిశ్చంద్రుడు వరుణునకు ఋణగ్రస్థు డాయెను. వరుణుని సంకల్పముచే హరిశ్చంద్రుడు ఉదర రోగమునకు గురయ్యెను. ఋణ ప్రియులగువారు వరుణునకు అప్రియులై అశాంతిని పొందెదరు. అప్పుతీర్చని వాడు ఉబ్బస వ్యాధికి లోనై బాధపడును.

హరిశ్చంద్రుని పొట్ట పెద్దదగుచుండెను. ఈ విషయము నెరిగిన రోహితుడు తండ్రిని చేరుటకు బయలు దేరెను. మధ్యలో ఇంద్రుడు అతనిని అడ్డగించి పుణ్యప్రదమైన తీర్థాటనను పూర్తి చేయుమని చెప్పెను. ఇంద్రుని యాజ్ఞను పాలించి రోహితుడు ఐదు సంవత్సరములు భూ పర్యటనము గావించి మఱల తిరిగి తండ్రిని జూచుటకు రాజధానికి వచ్చుచుండెను. మఱల ఇంద్రుడు వృద్ధ బ్రాహ్మణుని రూపమున ఏతెంచి, రోహితుని ప్రయాణమును నిరోధించి మరొక ఆరు సంవత్సరములు తండ్రికి దూరము చేసెను.

మన కర్మములే మనకు ప్రతిబంధకములని మరువరాదు. చాలా కాలము వరుణుని నిరీక్షణలో నుంచాడు హరిశ్చంద్రుడు. తత్ఫలితముగా ఈ నాడు తనయుని కొరకు నిరీక్షింపవలసి వచ్చింది. కారణము లేనిదే కార్య ముత్పన్నము కాదు. కొన్ని సమయాలలో

వినోదముతో ప్రారంభమైన ఆటలు విషాదముతో సమాప్త మౌతాయి. అబద్ధాలు అనర్థాలకు పునాదులు.

Lying is the mother of Violence

"అసత్యము హింసకు తల్లి వంటిది" యని గాంధీ మహాత్ముని ప్రబోధము.

రోహితుడు రాజధాని కరుదెంచెను. అజీగర్తుని మధ్యమ పుత్రుడైన శునశ్శేఫుని కొని వరుణ యజ్ఞమున పశువుగ సమర్పింపమని తండ్రి కిచ్చెను. హరిశ్చంద్రుడు యజ్ఞము నాచరించి వరుణుని తృప్తిపరచెను. ఉదర రోగము నుండి తాను విముక్తుడాయెను.

ఇంద్రుడు సంతృప్తిచెంది హరిశ్చంద్రునకు సువర్ణరథము నిచ్చెను. సతీ సమేతుడై హరిశ్చంద్రుడు పలికిన సత్యమునకు, చూపిన ధైర్యమునకు, చేసిన త్యాగమునకు ప్రీతి చెందిన విశ్వామిత్ర మహర్షి అతనికి అక్షయ సంపద నొసంగెను. ఆత్మధ్యాన తత్పరుడైన హరిశ్చంద్రుడు బంధ విముక్తుడై ముక్తి నొంది తరించెను.

ఆడిన మాటను తప్పిన హరిశ్చంద్రుడు ఉదర రోగస్థుడై దుఃఖము ననుభవించెను. ఆడిన మాటను నిలుపు కొనుటకై సర్వమును త్యజించిన హరిశ్చంద్రుడు సమస్తమును బొందినవాడై అక్షయ పదవి నొంది వర్ధిల్లెను.

పెద్దలకిచ్చు మాటను నిలబెట్టుకొనువారి కీర్తి నింగి కెగురును. పెద్దలను వంచించువారు క్రుంగిపోకతప్పదు. మాటలు పుణ్యాల మూటలు కావాలి. పాపపు సంచులు కాకూడదు. పెద్దలను మోసగించిన వారికి, పెద్దలతో అసత్యముల నాడు వారికి ఆరోగ్యము అంతరించును. ఈ విషయము పరమ సత్యమని నేను వక్కాణించుచున్నాను. ఆశ్రమమును ప్రారంభించిన తొలిదశలో నేను ఈ సత్యమును ముంజేతి కంకణము వలె దర్శించినాను. ఇతరులను మోసగించుట కన్నను తాను మోసపడుటయే మేలని కబీర్ నుడివిన సూక్తిలోని పరమార్థమును నేను అనుభవము ద్వారా గ్రహించినాను. సాధకు లెన్నడూ అసత్యములను పలుకరాదు. పెద్దలను మోసగించరాదు. ఇదియే హరిశ్చంద్రుని చరిత్రము ద్వారా మనము గ్రహింపదగిన గుణపాఠము.

సగర చక్రవర్తి చరిత్ర

సగరుడు చక్రవర్తి అయ్యెను. అశ్వమేధ యజ్ఞమును అత్యంత వైభవముగా చేసెను. సగరుడు విడిచిన గుఱ్ఱమును ఇంద్రుడు హరించెను. దాని నన్వేషించుటకై సగరుని పుత్రులు వెళ్ళిరి. తుదకు కపిల మహర్షి ఆశ్రమ సమీపమున వారి గుఱ్ఱమును గాంచిరి. అచ్చటికి సమీపముననే ధ్యానమగ్నుడై యున్న కపిల మునిని గాంచి గుఱ్ఱము నపహరించిన చోరు డతనే నని భావించిరి. దుర్భాషలాడుచు కపిలుని వధించుటకు ముందు కురికిరి. అరువది వేల మంది సగర పుత్రులు కేకలు వేయుచూ కపిలుని సమీపించిరి. కపిలుడు కళ్ళు తెరచెను. తమ శరీరముల యందున్న అగ్ని ప్రజ్వలింప

పోయెను. ఆ యగ్నిచే సగర పుత్రులు దగ్ధమై పోయిరి. ఇచ్చట కపిలుని క్రోధాగ్నిచే, లేదా
తేజ మనెడి యగ్నిచే వారు భస్మమైనట్లు కొందరు చెప్పుచుందురు. అది సత్యము కాదు.

న సాధు వాదో ముని కోప భర్జితా నృపేన్ద్రపుత్రా ఇతి సత్వధామని
కథం తమో రోషమయం విభావ్యతే జగత్పవిత్రాత్మని భే రజో భువః

"సగరకుమారులు కపిలమహర్షి క్రోధాగ్నిచే దగ్ధమైనట్లు కొందరు చెప్పు చుందురు. అది సముచితము కానేరదు. ప్రపంచమునే పవిత్రమొనర్చు శుద్ధ సత్త్వ రూపుడైన మహాత్మునిలో క్రోధముండునా? నిర్మలమైన అంతరిక్షమున ధూళి యుండునా?" యని వ్యాస మహర్షి భాగవతమున ప్రశ్నించి యున్నాడు.

ధన మదముతో సగర తనయులు వివేకమును కోల్పోయిరి. పూజనీయుడైన మహితాత్ముని సంహరింప యత్నించిరి. దాని ఫలితముగా వారే భస్మమైరి. మహాత్ములను దూషించు వారిని మహాత్ములు నిందింపరు. కట్టెలోని అగ్నిచేత కట్టెలు దహింప బడునట్లు, మహాత్ములపై క్రోధమును ప్రకటించు వారు తమలోని క్రోధాగ్నిచేత వారే సంహరింప బడుదురు.

తనయులు రాకపోవుటకు గల కారణము తెలియని సగరుడు అశ్వము నన్వేషించుటకు తన మనుమడగు అంశుమంతుని పంపెను. అంశుమంతుడు అన్వేషణ ప్రారంభించి కపిల మహర్షి ఆశ్రమ సమీపమున యున్న అశ్వమును గుర్తించెను. అచ్చటనే ఆసీనుడై యున్న కపిల మహర్షిని దర్శించెను. అతడు సాక్షాత్తు విష్ణుమూర్తియే నని సంస్కార వంతుడైన అంశుమంతుడు గ్రహించెను. ప్రణామము లర్పించెను.

అద్య నః సర్వభూతాత్మన్ కామ కర్మేన్ద్రియా శయః
మోహపాశో దృఢశ్ఛిన్నో భగవం స్తవ దర్శనాత్

"సర్వ భూతాంతర్వాసి యగు ఓ దేవా! కోరికలకు, కర్మలకు ఆశ్రయమై, ఛేదింపను వీలుపడని మోహమనెడి పాశము ఈ నాడు నీ దర్శనము చేత ఛిన్నమైనది" యనెను.

అంశుమానుని గుర్తించిన కపిల భగవానుడు, "అంశుమంతా! నీ తాతయగు సగరుని యజ్ఞపశువగు ఈ గుఱ్ఱమును తీసికొని పొమ్ము" యనెను.

"దేవా! మా పినతండ్రు లుద్ధరింపబడుటకు ఉపాయమున్నదా?" యని అంశు మంతుడు ప్రార్థించెను.

"అంశుమానుడా! భస్మ రూపులుగా మారిన మీ పినతండ్రుల నుద్ధరించుటకు విష్ణుపాదోదకమైన గంగకే శక్తి గలదు. అన్య జలములు నిరుపయోగములు" అని కపిలు డనెను.

అంశుమంతుడు కపిలునికి నమస్కరించి యజ్ఞాశ్వమును తీసికొని వెళ్ళెను. సగరుడు మిగిలియున్న యజ్ఞమును పూర్తిచేసెను. పిమ్మట సగర చక్రవర్తి తన రాజ్యమును అంశుమానున కప్పగించి, వాసనా శూన్యుడై, మోక్షము నొందెను.

భగవానుడైన కపిలుని సాన్నిధ్యమును పొందిన సగర తనయులు భస్మీభూతులైరి. అంశుమంతుడు చిన్నవాడైనను కపిలుని అనుగ్రహమునకు పాత్రుడాయెను.

అంశుమంతుడనగా కిరణములు గలవాడని భావము. జ్ఞానభాస్కరుడని అర్థము. జ్ఞానవంతుడే జ్ఞానిని గుర్తించును. ఆచార్యులను ఆశ్రయించినంత మాత్రాన సరిపోదు. అర్హతను కల్గియుండినపుడే ఫలితాలు సిద్ధించునని అంశుమానుని చరిత్రలో మనము గ్రహించాలి.

గంగావతరణము - భగీరథుడు

అంశుమానుడు తన కుమారునకు రాజ్యము నొసగి తాను వనముల కేగెను. తన పినతండ్రులను బ్రతికించుటకు గంగను దెచ్చుటకై కఠోర తపము నాచరించెను. కానీ గంగాదేవి ప్రసన్నము గాకనే అంశుమంతుడు మరణించెను.

అంశుమానుని పుత్రుడగు దిలీపుడు గూడ గంగకొరకై తీవ్ర తపమాచరించి, విఫల మనోరథుడై మరణించెను. అటుపిమ్మట దిలీపుని కుమారుడగు భగీరథుడు గొప్ప తపస్సు చేసెను. భగీరథుని తపస్సునకు మెచ్చి గంగాభవాని దర్శనమిచ్చింది. వరము నడుగమని ఆజ్ఞ నొసగినది.

క॥ మావారి భస్మరాసుల నీ వారిం గలిపికొనుము వెతి మావారల్
నీ వారిఁ గలయ నాకము మావారికిఁ గలుగు నిది ప్రమాణము దల్లీ!

యని భగీరథుడు ప్రణమిల్లెను. భగీరథుని మనోభీష్టమును నెరవేర్చుటకు సిద్ధపడిన గంగాభవాని తన సంశయముల రెండింటిని భగీరథుని ముందుంచినది.

"రాజా! భూలోకమున కాలిడుటకు నా మన స్సంగీకరించుట లేదు. ఏలయన మనుజులు వారి వారి కల్మషములను నా యందు ప్రక్షాళన మొనర్చుకొందురు. ఆ పాపమును నేనెలా కడిగికొందును? దీని విషయమై ఆలోచింపుము. ఇక రెండవ విషయ మేమనగా నేను ఆకాశము నుండి అవనిపై దూకునపుడు నా భారము నెవరాపగలరు? లేనిచో నేను భూమిని దూసుకొని పాతాళమున కేగుదును" అనెను.

గంగాదేవి మాటల నాలకించిన భగీరథుడు "తల్లీ! ఈ రెండు సంశయములు నీకు వలదు. దారములతో వస్త్రము నిర్మితమైనట్లు ఈ ప్రపంచము ఎవని యందు నిలిచి యున్నదో సర్వభూతాంత రాత్ముడగు రుద్రదేవుడే నీ వేగమును ధరించి భరించును. ఇక నీ మరియొక సందేహమా? వినుము.

సాధవో న్యాసినః శాన్తా బ్రహ్మిష్ఠా లోకపావనాః
హరన్త్య ఘం తేఽఙ్గసఙ్గాత్ తేష్వాస్తే హ్యఘ భిద్ధరిః

"దేవీ! త్యాగులైన సాధువులు, సర్వసంగపరిత్యాగులగు సన్యాసులు, శాంత స్వరూపులు, సదాచార సంపన్నులగు సాధువులు నీ జలమున స్నానము చేసి నీ పాపమును హరింతురు" అని చెప్పగానే గంగాదేవి భూతలమున ప్రవేశించుటకు అంగీకరించెను.

మహాత్ముల వైభవము వర్ణనాతీతము. సర్వజనుల పాపములను హరించు గంగ యొక్క పాపములను మహాత్ములు ప్రక్షాళనము చేయగలరు. అందుచేత సాధువులు గంగ కన్నను పవిత్రులై తీర్థరూపులైనారు.

తీర్థ మనగా దాటించునది యని భావము. నదిని దాటుటకు నావ ఉపకరించునట్లు, భవసాగరమును దాటుటకు మహాత్ములు నావ వలె ఉపయోగ పడుదురు. అందుచేతనే వీరు తీర్థరూపులైనారు. గంగాది పుణ్య తీర్థములలో మునకవేస్తేగాని పాపం క్షాళనకాదు. మహాత్ములు దర్శన మాత్రముననే పాపములను హరింతురు. అందుచేత మహాత్ములు తీర్థములకు తీర్థము లయ్యారు.

తీర్థీ కుర్వన్తి తీర్థాని, సుకర్మీ కుర్వన్తి కర్మాణి, సచ్ఛాస్త్రీ కుర్వన్తి శాస్త్రాణి

అని నారదమహర్షి మహాత్ముల వైభవమును నారద భక్తి సూత్రములలో వివరించుట జరిగినది.

గంగాదేవి భగీరథుని కోర్కె నంగీకరించెను. భగీరథుడు తపస్సు ద్వారా శంకరుని గూడా గంగను ధరించుటకు అంగీకరింప జేసెను. శ్రీహరి పాదపద్మ యుగళము నుండి కదలిన లోకపావని నీలకంఠుని మస్తకము మీదుగా అవనిపై అవతరించెను. భగీరథుడు రథము నెక్కి శీఘ్రముగా ముందు వెడలుచుండగా, భాగీరథి అతని ననుసరించి నడక సాగించెను. తన తాతలు భస్మమైన ప్రదేశములకు గంగాదేవిని ప్రవహింపచేశాడు భగీరథుడు. తమ తాతలైన సగర తనయులకు ఉత్తమగతులను ప్రసాదించాడు. ఈవిధంగా భగీరథుని తపో ఫలితంగా భువికేతెంచుట వలన గంగాదేవి భాగీరథియైనది.

ఇంద్ర॥ చెల్లవ్ మదివ్ విన్ను భజింతు గంగవ్ ఫుల్లాంతరంగవ్ బహుపుణ్యసంగం

గల్లోలలక్ష్మీజితకాశమల్లిం దల్లివ్ మహీకల్పలతామతల్లివ్.

అని భగీరథుడు భక్తితో గంగాదేవికి నమస్కరించెను.

అంశుమంతుడు, దిలీపుడు, భగీరథుడు ముప్పురు పురుషుల తపఃఫలముగా గంగ భువి కేతెంచెను. అనేక జన్మల ప్రయత్నముంటే గాని జ్ఞానగంగ ఉదయించదు. ముగ్గురి తపఃఫలము గంగయైనట్లు త్రికరణశుద్ధిగా చేయు కర్మలవలన జనులకు జ్ఞాన ముద యించును. అలాగే యోగత్రయము నాశ్రయించుట వలన గూడా లభించును. మూడు దశలలో చేసిన యత్నము చివరి దశలో ఫలించును.

"Think in the morning, act in the noon, eat in the evening, sleep in the night"

"ఉదయం ఆలోచించు. మధ్యాహ్నం ఆచరించు. సాయంత్రం అనుభవించు. రాత్రి నిద్రించు" అంటాడు విలియం బ్లేక్.

బాల్య దశలో విద్యార్జన సాగాలి. యౌవనములో సాధన కొనసాగాలి. వృద్ధాప్యంలో సాధ్యవస్తువు లభించాలి. నిర్యాణము నిర్వాణము కావాలి. మొదటి మూడు దశల మీద నాల్గవ దశ ఆధారపడి యుంటుంది.

ఖట్వాంగ చరితము

అటు పిమ్మట ఈ వంశములో ఖట్వాంగుడను రాజు పుట్టెను. దేవ దానవుల మధ్య జరిగిన సంగ్రామమున అతడు దేవతలకు సాయము చేసెను. అతని సేవలకు తృప్తి నొందిన దేవతలు వరమును కోరుమని ఖట్వాంగునికి తెలిపిరి. తాను ఇక యెంతకాలము జీవించునది తెలుపుమని ఖట్వాంగుడు కోరెను. ఈ విషయమును దేవతలు దివ్య దృష్టిలో జూచి, అతడొక ముహూర్త కాలము మాత్రమే జీవించునని తెలిపిరి.

సత్యము తెలిసినందుకు ఖట్వాంగుడు సంతసించెను. కళత్ర, పుత్ర, బంధుమిత్ర, సమస్త సంపదలను క్షణంలో త్యజించెను. శ్రీహరి నామామృతమును పానము చేయుచు తరించెను. భగవన్నామామృతమును పానము చేయువారికి మృత్యుభయము లేదని తెలిపెను.

ఈ ప్రపంచములోని బంధము లన్నియు కల్పితములు. అసత్యములు. ఈ బంధముల యందు మమతానురాగము లున్నంతవరకు అవి మనలను విడిచిపెట్టవు. భగవంతుని సంకీర్తనములో మనస్సు లగ్నము కాగానే సమస్తబంధములు తమంతటతామే వదలిపోవును. మానవదేహము దీర్ఘకాలము నిలుచునదికాదు. మృత్యు వేక్షణమైనను కబళించవచ్చును. నిర్మించుకున్న ఆశా సౌధాలన్నీ ఆ క్షణాన్నే కూలిపోతాయి. ఆశలు మాసిపోతాయి. ఊహాలు చెదిరి పోతాయి. కలలు భగ్నమౌతాయి. జీవితము అంతరించి పోతుంది. ఈ సత్యమును సదా మనస్సులో నుంచుకొని భగవద్భజనలో చిత్తమును లగ్న మొనర్చువారు తప్పక తరియింతురని ఖట్వాంగుని చరితము విశదపరచినది.

శ్రీ రామచంద్రుని చరిత్రము

ఖట్వాంగుడు తరించెను. ఖట్వాంగుని కుమారుడు దీర్ఘబాహువు. దీర్ఘబాహువునకు కీర్తిమంతుడగు రఘువు పుట్టెను. రఘు మహారాజు గొప్పత్యాగి. ఈ మహాత్ముని కారణంగానే సూర్యవంశమునకు రఘువంశ మని పేరు గలిగినది. రఘుమహారాజునకు అజుడు కలిగెను. అజుని పుత్రుడే దశరథుడు.

దశరథుడు పుణ్యాత్ముడు. అతడు తన పూర్వ జన్మమున బ్రాహ్మణుడై యుండెను. సదాచార సంపన్నుడై భక్తి చేయుచుండెను. నిత్యము భగవంతునకు ఆలయంలో వెయ్యి తులసీ దళములతో పూజ చేయుచుండెను. దశరథునకు ఒకనాడు జ్వరము వచ్చెను. ఆయన జ్వరాన్ని ప్రార్థిస్తాడు. తాను ఆలయానికి వెళ్ళి వచ్చిన తరువాత తనను సమీపించమని చెబుతాడు.

మనం గొప్ప సాధకులమని చెప్పుకొంటూ ఉంటాము. ఏ చిన్న అవాంతర మొచ్చినా భగవానుని అర్చించడం మానేస్తాము. భక్తికి అలసట తెలియదు. అశక్తత లేదు. దశరథుడు ఎన్ని అవాంతరా లొచ్చినను సాధనను సాగిస్తూనే యుండెడివాడు.

యో మోహా దథవాలస్యా దకృత్వా విష్ణు పూజనమ్
భుంక్తే సయాంతి నరకాన్ సూకరే ష్వభిజాయతే

"మోహముచేత గాని, సోమరితనముచేత గాని విష్ణువును పూజింపక భుజించువాడు నరకమును జేరి, ఆ తరువాత సూకరమై జన్మించును" యని వ్యాసుని ప్రబోధము. మానవ జన్మ నెత్తినను భక్తిహీనుడు జంతువై జన్మించుచుండ, భక్తి కలిగిన పిశాచాదులు మహోత్కృష్టమైన మానవ జన్మను సాధించి యున్నారు. వినండి.

దశరథునకు జ్వరం తగ్గినది. అతడు ఆలయాన్ని సందర్శించాడు. భగవానుని అర్చిస్తున్నాడు. ఇంతలో గొప్ప యార్తనాదము వినబడెను. దశరథుడు కళ్ళు తెరచి చూసెను. అచ్చట ఒక పిశాచము రోదించుచుండెను. దశరథు డాపిశాచమును సమీపించెను. దుఃఖమునకు కారణము నడిగెను.

"అయ్యా! పూర్వ జన్మలో నేను అనేక దురాచారములు చేసితిని. భర్తను కష్ట పెట్టితిని. ఆ కారణముగా ఈ జన్మలో పిశాచమునైతిని. నన్ను ఉద్ధరించండి. దుర్భరమైన ఈ దుస్థితి నుండి నన్ను కాపాడండి" యని మొరపెట్టుకొన్నది.

బ్రాహ్మణుడు దయామయుడు. పిశాచము యొక్క వ్యథ అతని హృదయాన్ని కరిగించింది. "మహాదేవా! నా పుణ్యము నంతటిని సమర్పిస్తాను. ఈ జీవికి విడుదలను ప్రసాదించండి. శాంతిని అనుగ్రహించండి" అని ప్రార్థించాడు. పరోపకారబుద్ధి గలవారిని పరమాత్మ తప్పక అనుగ్రహిస్తాడు. భగవానుడు కనికరించాడు.

"ద్విజుడా! నీ త్యాగమునకు సంతసించితిని. ఈ జీవిని పైశాచిక జన్మ నుండి విడుదల చేయుచున్నాను. నీవు ఈ జన్మలో ఈ పిశాచమునకు గొప్ప సేవ చేసినావు. రాబోవు జన్మలో నీవు దశరథ మహారాజుగా జన్మిస్తావు. నీకు సేవ చేసేందుకు ఈ పిశాచము కౌసల్య యనెడి పేరుతో నీకు భార్యగా ఉంటుంది. నీ త్యాగమునకు పరవశించిన నేను శ్రీరాముడను పేరుతో నీకు కుమారుడుగా జన్మిస్తాను" యనెను. త్యాగులకే పరమాత్మ లభ్యమౌతాడు.

త్యాగేనైకే అమృతత్వ మానశుః

"త్యాగము ద్వారానే అమృతత్వము సిద్ధించు" నని కైవల్యశ్రుతి ప్రబోధము.

భగవత్కృపకు పాత్రుడైన ఈ బ్రాహ్మణుడే దశరథు డాయెను. ఆయనకు కౌసల్య, సుమిత్ర, కైకేయి యను ముగ్గురు భార్యలు కలరు.

దశరథుడు వేదవిదుడు. ధర్మరతుడు. రాజైనను ఋషిలా జీవించినాడు. కాముకుడు గాని, లోభిగాని, క్రూరుడు గాని, అవిద్యావంతుడు గాని, నాస్తికుడు గాని అయోధ్యలో కానరాడని వాల్మీకి శ్రీమద్రామాయణంలో వర్ణించినాడు. సత్యరూపుడైన దశరథుడు అమరావతిని ఇంద్రుడు పాలించినట్లు అయోధ్యను పాలించెను.

తస్మిన్ పురవరే హృష్టా ధర్మాత్మానో బహుశ్రుతాః
నరాస్తుష్టా ధనైః స్వైః స్వైర లుబ్ధాః సత్యవాదినః

"అయోధ్యలో వసించు జనులెల్లరు సంతోషపరులు. ధర్మాత్ములు. గొప్పగా చదివినవారు. ఉన్నదానితో తృప్తి చెందువారు. ఆశలుడిగినవారు. సత్యవాదులు" అని రామాయణము నందున్నది.

ఇట్టి ప్రభావముగల దశరథునకు చాలాకాలము వరకు సంతానము కలుగలేదు. ఈ పరితాపము తీరి పుత్ర సంతానము కలుగుటకు యాగము చేయవలెనని సంకల్పించెను. గురువులను సంప్రదించెను. అమాత్యులతో చర్చించెను. అశ్వమేధ యాగము నొనరించుటకు దశరథుని కోర్కెను వశిష్ఠాది మునులెల్లరు సమ్మతించిరి.

సరయూ నదీతీరమున మనోహరమగు వసంత ఋతువులో యాగమును నిర్వహించెను. దశరథుడు ఋష్యశృంగుని ఋత్విక్కుగా వరించెను. యాగము వైభవముగా జరిగెను. వండిన భోజనరాసులు పర్వతముల వలె తెలియుచుండెను.

అహో తృప్తాః స్మ భద్రం తే ఇతి శుశ్రావ రాఘవః

"ఆహా! సంతృప్తి చెందితిమి. నీకు శుభమగు గాక!" యనెడి మాటలు వినబడు చుండెను. దశరథుడు యజ్ఞము చేయుచుండగా ఒక భూతము హోమకుండము నుండి ఆవిర్భవించెను. ఆ భూతము వెండిమూత మంచిన బంగారు పాత్రలో పాయసము నిడుకొని గోచరించెను. ప్రజాపతి పంపగా వచ్చినట్లు చెప్పెను. ఈ పాయసమును పానము చేసిన సంతానము కలుగునని చెప్పెను. దశరథుడు ధనము లభించిన పేదవాని వలె సంతోషించెను. దశరథుడు ఆ పాయసమును ముగ్గురు పత్నుల కొసంగెను. యాగమును పూర్తిచేసిన దశరథుడు విశేషముగా దానము లొనరించెను. దశరథునికి పుత్రులు కలుగుటకై ఋష్యశృంగుడు పుత్రకామేష్టిని చేయించెను. దశరథుడు తలపెట్టిన అశ్వమేధ పుత్రకామేష్టులు పూర్తియైనవి. ఋష్యశృంగుడు దశరథుని పూజల నందుకొని వెడలెను.

కౌసల్యాదేవి గర్భవతియైన నాటి నుండి నిత్యమూ జపధ్యానాదులతో కాలము గడుపుచుండెను. దశరథుడు ఒకనాడు కౌసల్యను సమీపించి, "నీకు కోరికలున్నచో తీర్చెదను చెప్పుము" అని అడిగెను. కౌసల్య దశరథునితో, "కోరికలే సమస్త దుఃఖములకు కారణములు. కోరికలు మనస్సును కలుషితం చేస్తాయి. కనుక నాకు అట్టి కోరికలు లేకుండా, రాకుండా ఉండునట్లు వరమివ్వు" మని చెబుతుంది.

దశరథుడు వశిష్ఠుని సమీపిస్తాడు. కౌసల్య మాటలోని అంతర్భావ మేమిటని ప్రశ్నిస్తాడు. "ఆమె గర్భంలో శుభలక్షణ సంపన్నుడు పెరుగుచున్నా" డని వసిష్ఠుడు చెబుతాడు.

నవమాసములు నిండుచుండెను. దశరథుడు నిద్రలో కల గాంచెను. లక్ష్మీ నారాయణులను అభిషేకించి, అర్చించినట్లు దశరథుడు కల గనెను. ఆ విషయమును వినిన వశిష్ఠుడు వారికి నారాయణుడు బిడ్డగా జన్మింప నున్నట్లు తెలిపెను.

శుభసమయ మరుదెంచినది. చైత్ర మాసమున, పునర్వసు నక్షత్రములో కూడిన నవమీ తిథియందు, సర్వలక్షణ సంపన్నుడు, సర్వలోక వందితుడగు బిడ్డను కౌసల్య ప్రసవించెను. అతడే శ్రీరాముడు.

వశిష్ఠుడు వెంటరాగా దశరథుడు పరుగిడుచువచ్చి రాముని దర్శించెను. రాముడు మందహాసమును చిందించి దశరథుని తృప్తి పరచెను. తన కొరకు ఎవ్వరు పరుగులిడుదురో వారిని పరమాత్మ కరుణించును.

దశరథుని ఆనందమునకు అవధులు లేకుండెను. "గురుదేవా! ఈ శుభ సమయమున వేదమంత్రములను పఠింపుడు"యని వశిష్ఠుని కోరెను. వశిష్ఠుడు నివ్వెరపడి నిలుచుండెను. "మహారాజా! నాకు వేదమంత్రములు స్మృతికి వచ్చుట లేదు. నేను నా పేరును కూడా మరచిపోయినాను. ఇక నేను మంత్రముల నెలా పఠింపగలను? ఈ బాలుని చూచినది మొదలు నా జ్ఞాపకాలన్నీ అదృశ్యమైనవి"యనెను.

పరమాత్మను గాంచినపుడు సర్వమును మఱచువాడే ధన్యాత్ముడు. శుద్ధ చైతన్యమును దర్శించు వానికి నామరూపము లెలా గోచరిస్తాయి? వశిష్ఠుడు వేదమును కూడా మరచెను. వేదము నారాయణుని జూపించును. నారాయణుని దర్శనము కాగానే వేదము అదృశ్యమగును. అందుచేత ఆప్తకాములు వేదములను కూడా త్యజింతురు.

యో వేదానపి సంన్యస్యతి: కేవలం అవిచ్ఛిన్నానురాగం లభతే

"ఎవడైతే వేదమును కూడా సన్యసించునో, విచ్ఛిన్నంగాని అనురాగమును భగవంతుని యందు కలిగి యుండునో అతడే ఉత్తమభక్తు" డని నారదుని అభిప్రాయము.

వశిష్ఠుడు మహాజ్ఞాని. రామదర్శనములో సర్వమును మరచెను. పరమాత్మను దర్శించునపుడు రెండవ రూపము మనస్సులో కదల కూడదు. సమస్త విషయములను మరచినపుడే పరమాత్మ మన హృదయములో ప్రవేశించును. ఆలయాలలో భగవంతుని దర్శించునపుడు ప్రక్కవారితో ముచ్చటలాడకూడదు. అన్యమైన ఆలోచనలు చేయకూడదు.

నేను పరమాత్మతో కలిసి యున్నాను అనెడి భావమును స్థిరపరచు కోవాలి. భగవద్భజనలో అన్యరాగ విస్మరణము జరగాలి. అనన్య స్మరణ కొనసాగాలి. అప్పుడే మనము భగవత్కృపకు పాత్రులము కాగలము. ధన్యుడగు వసిష్ఠుడు ప్రథమంగా శ్రీరాముని అలా దర్శించెను.

అతడే ధన్యుడు ఓ మనసా
సతతయాన సుత ధృతమైన,
సీతాపతి పాదయుగముల సతతము ధ్యానించు ॥అతడే॥

అని త్యాగరాజస్వామి రామదర్శన భాగ్యమును స్మరించు కొనినాడు.

రాముని రూపమును గాంచి సంతుష్టచిత్తురాలైన కౌసల్య, ముందు నిలబడి యున్న దాసికి ఒక రత్నాలహారము నొసగెను. "అమ్మా! నాకే రత్నాల హారము వలదు. ఆ రత్నాల మూటను రెండు క్షణాలు ఒడిలో పరుండబెట్టుకొనే భాగ్యమును ప్రసాదింపు"దని ప్రార్థించెను. అందరినీ ఆకర్షించువాడే భగవానుడు. కౌసల్య అనుగ్రహించెను. దాసి రెండు క్షణాలు దేవదాసి ఆయెను. బ్రహ్మైక్యము ననుభవించెను. అనేక జన్మల పుణ్యఫల మున్నంటేగాని ఈ భాగ్యము లభించేదు.

రాముని రూప వైభవము అంతఃపుర మంతయూ విస్తరించెను. సర్వులు రాముని గూర్చియే ప్రసంగించు కొనసాగిరి. లలిత లావణ్య మనమోహర రూపమును ఎంతగానో, మరెంతగానో వర్ణించుకొను చుండిరి.

ఎంత ముద్దో! ఎంత సొగసో! ఎవరి వల్ల వర్ణింప తగునే

యని కీర్తించిన త్యాగబ్రహ్మ ఎంత ధన్యుడో గదా!

రాముని దర్శిస్తూ కొందరు కార్యములను మరువగా, మరికొందరు ఆకలి దప్పులను మరచారు. పరమాత్మపై దృష్టి మఱలినపుడు మరొక విషయం రుచించునా? కుమ్మరి పురుగుకు బురద అంటునా? రామగత చిత్తులకు రాగము తెలియునా?

రాము డావిర్భవించెను. గంధర్వులు గానము చేయుచుండిరి. దేవ దుందుభులు మ్రోగుచుండెను. గగనము నుండి పుష్పవృష్టి కురిసెను. అప్సరసలు నాట్యము చేయుచుండిరి. రహదారులన్నియు జన సందోహముతోను, ఉత్సవాదులతోను శోభించెను.

సర్వులు ఆనందముతో పరవశించుచుండగా చంద్రలోకమున శశాంకుడు దుఃఖితుడై యుండెను. కన్నీరు గార్చుచూ చంద్రుడు విలపించుచుండెను. రాముడు మధ్యాహ్న కాలమున జన్మించెను. సాయంత్రము వరకు చంద్రుడు దుఃఖించుచునే యుండెను. రాముడు సూక్ష్మ రూపమును ధరించి చంద్రుని సమీపించెను. దుఃఖమునకు కారణ మేమిటని చంద్రుని ప్రశ్నించెను.

"దేవా! నీవు ధర్మ స్వరూపుడవు. ధర్మపాలకుడవు. అట్టి నీవు జన్మించిన ఈ శుభదినముననే ధర్మమును తప్పెడి వారున్నందులకు చింతించుచున్నాను" యనెను. ధర్మమును తప్పిన దెవరు? యని రాముడు ప్రశ్నింపగా సూర్యుడని చంద్రుడు చెప్పెను. అస్తమయ సమయమైనను అస్తమించుట లేదనియు, చంద్రోదయమునకు అవకాశమిచ్చుట లేదనియు పలికెను.

చంద్రుని మాటలకు రాముడు మందహాసమును చిందించుచూ, "చంద్రా! సూర్యుడు ధర్మము నుల్లంఘించలేదు. ఇంకా సూర్యాస్తమయ కాలము కాలేదు. నన్ను దర్శింపవలె ననెడి నీ ఆవేశములో నీకలా అనిపించు చున్నది" యనెను.

"రామా! నిన్ను ఎడబాసి యుండుట భక్తులకు సాధ్యమా? సుపుణ్య నామా! అమర వరేణ్య రామా! సనక శరణ్య ధామా! సత్కారుణ్య సార్వభౌమా! సర్వులు నీ దివ్య రూపమును గాంచుచుండ రెండు జాముల వరకు దర్శనము లేక నిరీక్షించు దుస్థితి నాకే ప్రాప్తించెను గదా!" అని దుఃఖించెను.

చంద్రుని భక్తికి సంతసిల్లిన రాముడు, "చంద్రా! శోకింపకుము. అందరికన్నా వెనుక నీకు దర్శనము లభించినందులకు ఈ నాడు చింతించుచున్నావు. శ్రీకృష్ణావతారములో నేను జన్మించినపుడు నా తల్లి దండ్రులతో పాటు నీ వొక్కడివే దర్శించునట్లు వర మొసగెదను" అనెను.

అప్పటకీ చంద్రుడు తృప్తి చెందలేదు. రోదించుచునే యుండెను. కరుణా నిధియైన రాముడు కనికరించి "చంద్రా! రోదింపకుము. నీకు మరొక అవకాశమును కూడా కల్పింతును. ఈ జన్మలో కూడా నా నామము చివర నీ నామమును తగిలించు కొందును. నన్ను అందరూ రామచంద్రుడని పిలుతురు" యని వారించెను.

శ్రీరాముడు భక్తవత్సలుడు. భక్తప్రియుడు. ఆయన కొరకు గార్చిన కన్నీరు వృథాపోదు. భగవంతుని ఎవరు భక్తితో ఆహ్వానింతురో వారికి పరమాత్మ ధనమొసగడు. పేరు ప్రఖ్యాతులొసగడు. పదవు లొసగడు. తననే తాను సమర్పించుకొనును. విషయ సుఖాల యందు చిత్తము తిరుగాడు వారిపై పరమాత్మ కృపను జూపడు. వేరే శరణ్యము లేదని పలికెడి పవిత్రాత్ములనే పరమాత్మ అనుగ్రహించును. రాముని కృపకు పాత్రుడైన చంద్రుడు ధన్యాత్ముడు. ఈ విషయమును తులసీ రామాయణములో హనుమంతుడు తెలుపును.

యుద్ధకాండము ప్రారంభమైనది. రాముడు సేనతో గూడి సుచేల పర్వతముపై దిగెను. కోమలమైన పల్లవముల చేత లక్ష్మణుడు పరుపును తయారు చేసెను. దానిపై రాము డాసీనుడాయెను. సుగ్రీవుని తొడపై తల నుంచుకొని రాముడు పరుండెను. అంగదుడు, ఆంజనేయుడు ప్రభువు పాదము లొత్తుచుండిరి.

తూర్పు దిక్కున చంద్రు డుదయించెను. రాముడు అక్కడున్న వారితో, "అదిగో! చంద్రుడరుదెంచినాడు. ఎంత శోభాయమానముగా యున్నాడో చూడండి. చంద్రునిలో ఆ నల్లని మచ్చ ఏమిటి?" అని రాము డడిగెను.

"ప్రభూ! భూమి యొక్క ఛాయయే మచ్చగా కన్పించుచున్నది" అని సుగ్రీవు డనెను. "రాహువు కొట్టిన దెబ్బకు అలా మచ్చ ఏర్పడినది" అని మరొక వానరు డనెను. "విషము చంద్రునకు సోదరుడు గనుక అతనిని తనతో పాటు యుంచుకొనుట వలన ఆ మచ్చ ఏర్పడె" నని ఇంకొకరనిరి.

"ప్రభూ! చంద్రుడు మీకు ప్రియ భక్తుడు. మీ దివ్య సుందర శ్యామలమూర్తియే అతని హృదయంలో సదా వసించుచుండును. దాని ప్రతిబింబమే ఆ మచ్చ" యని హనుమంతు డనెను. చంద్రుని వలె భక్తి తత్పరతతో రామచంద్రుని యనుగ్రహమునకు పాత్రులమై మనమూ తరించెదము గాక!

నిర్మల బుద్ధిమంతుడగు భరతుడను పుత్రుడు కైకేయి యందు పుష్యమీ నక్షత్రమున మీనలగ్నమందు జన్మించెను. మరునాడు లక్ష్మణ శత్రుఘ్నులు ఆశ్రేష నక్షత్రము నందు, కర్కటక లగ్నమున మధ్యాహ్న కాలమున పుట్టిరి. బిడ్డ లందరు జ్ఞాన సంపన్నులై, కీర్తిమంతులై వృద్ధి చెందుచుండిరి.

బాల రాముడు

దశరథ పుత్రులు దిన దిన ప్రవర్ధమానమగు చుండిరి. వారి బాల్యము అద్భుత ముగా, ఆదర్శముగా గడిచెను. రాముడు తల్లిదండ్రుల నెన్నడూ కష్టపెట్టి ఎరుగడు. సోదరులను ప్రాణ సమానంగా చూసుకొనెడివాడు.

ఒకనాడు రాముడు ఆనందంతో పరుగిడి తల్లియగు కౌసల్య వద్దకు వస్తాడు. తనయుని ఆనందానికి కారణమేమని తల్లి ప్రశ్నిస్తుంది. క్రీడల యందు తాను ఓటమిని చవి చూచినట్లు తన తమ్ముడు భరతుడు గెలిచినట్లు, ఇదియే తన ఆనందమునకు కారణ మైనట్లు తెలుపుతాడు. రాముని సోదర ప్రేమను గాంచి కౌసల్య అమితానందముతో పరవశిస్తుంది.

కొంత సేపటికి భరతుడు బిక్కమొగం వేసుకొని కౌసల్య వద్దకు వస్తాడు. ఈ విషాదానికి కారణ మేమిటని తల్లి భరతుని ప్రశ్నిస్తుంది. భరతుడు విషణ్ణ వదనుడై, "అమ్మా! నన్ను గెలిపించాలని రామన్న రోజూ ఓడిపోతుంటాడు" అంటాడు.

కౌసల్యాదేవి నేత్రాలు ఆనందంతో చెమ్మగిల్లాయి. ఆమెకే కాదు. మనందరికీ ఆ యనుభూతే కలుగుతుంది. వారు ఆదర్శ సోదరులు. రాముడు ఉదయముననే తల్లిదండ్రులకు నమస్కరించును. మాతాపితలను గౌరవించు వానిని జగత్తెల్ల ప్రేమించును.

దశరథుడు నల్వురు పుత్రులకు ఉపనయన సంస్కారము చేయించెను. వారు వశిష్ఠుని వద్ద విద్య నార్జించిరి. రాముడు దశరథ పుత్రుడైనను వశిష్ఠుని గృహమున కేగి విద్య నార్జించెను. గురువులను గౌరవించనివాడు గౌరవ పదము నొందలేడు.

కౌసల్య ధర్మస్వరూపిణి. సుగుణశీల. నిత్యము తానే రామునకు భోజనము చేసిపెట్టుచుండెను. ఆమెకు సేవకులు లేక కాదు. వంటవారు లేక కాదు. భగవానుని సేవను స్వయంగా చేయువారే ధన్యులగుదురు.

కౌసల్య రాగద్వేషములకు అతీతముగ జీవించెను. తన బిడ్డడైన రాముని అడవుల పాల్జేసిన కైకేయిపై ఇసుమంతైనను కినుక వహింపకుండెను. ధర్మజ్ఞులగు వారు ఈర్ష్యాసూయలను, కామ క్రోధాదులను దరిజేరనీయరు. కౌసల్య ఎన్నడూ ధర్మమును ఉల్లంఘించలేదు. రాముడు కానల కేగునపుడు కౌసల్య రామునితో పలికిన విషయములను గమనించినచో మనకీ సత్యము సుస్పష్టమగును.

యం పాలయసి ధర్మం త్వం ప్రీత్యా చ నియమేన చ
సవై రాఘవ శార్దూల ధర్మ స్త్వా మభిరక్షతు

"రఘుకుల వ్యాఘ్రమా! నీవు ప్రీతితో, నియమముతో ఏ ధర్మము నాచరించుచున్నావో ఆ ధర్మమే నిన్ను కాపాడును" యనెను.

ధర్మము తప్పనిదైనందున కౌసల్య రామునికి జన్మ నీయగలిగెను. బాల రాముని ముద్దు ముచ్చటలకు నోచుకొనెను. రాముని బాల క్రీడలను, చిన్నారి మోమును గాంచెడి

భాగ్యము నొందెను. ఆ భాగ్యము లభింపని ఎందరో భక్తులు తమ ప్రార్థనల ద్వారా ధ్యాన మగ్ను లైనారు.

దిగంబరం కింకిణి మేఖలోజ్జ్వలం లలాట పర్యంత విలంబి తాలకమ్

కలద్వచస్కం కమనీయ నూపుర ద్వయం శిశుం రామమహం నమామి

"దిగంబరుడు, మువ్వలుగల మొలత్రాడు గలవాడు, నుదుటి యందు వ్రేలాడు ముంగురులు గలవాడును, తియ్యని పలుకులు గలవాడును, కమనీయ యందెల యుగము గలవాడును, బాలుడైన రామునికి నమస్కరించుచున్నాను.

యాగ సంరక్షణము

ఒకనాడు దశరథుడు బంధు జన, పురోహితాదులతో కలసి పుత్రుల వివాహమును గూర్చి ముచ్చటించుచుండెను. దశరథుడు పుణ్యాత్ముడు. దశేంద్రియములను జయించినవాడై దశరథు డాయెను. సంయమి హృదయంలో సంకల్ప ముదయించగనే భగవత్కృపచే అది కార్య రూపమును ధరించును. అదియే పుణ్యము. సాధనకు ఫలము.

దశరథుడు ఆలోచించుచుండగా విశ్వామిత్ర మహర్షి అచటకు వచ్చెను. దశరథుడు ఎదురుగా వెళ్ళి వందన మాచరించుచు ఆహ్వానించెను. ఆతనిని కూర్చుండబెట్టి పూజించెను. సంతుష్టచిత్తుడై దశరథు డిలా పలికెను.

యథాఽ మృతస్య సంప్రాప్తిః యథా వర్ష మనూదకే

యథా సదృశ దారేషు పుత్ర జన్మా ప్రజస్య చ

ప్రణష్టస్య యథా లాభో యథా హర్షో మహోదయే

తథై వాగమనం మన్యే స్వాగతం తే మహామునే ॥

"ఓ మహర్షీ! మీ ఆగమనము అమృత ప్రాప్తి వంటిది. నీరు లేని చోట వర్షము కురియుట వంటిది. సంతాన హీనులకు ఉత్తమురాలైన భార్య యందు కుమారుడు జనించుట వంటిది. పోయిన వస్తువులు లభించుట వంటిది. గొప్ప కార్యములు సాధించినపుడు ఆనందించుట వంటిది. మహాత్మా! అట్టి మీకు స్వాగతము" అనెను.

అద్య మే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్

"ఈ నాడు నా జన్మ సఫలమైనది. నా జీవితము ధన్యమైనది" యనెను.

గురువు లభించిన వారి జన్మ ధన్యమౌతుంది. గురువు శిష్యులను పవిత్రం చేస్తాడు. వారి బ్రతుకులను పవిత్రంగా మారుస్తాడు. మలినమైన మనస్సును మంత్రంతో శుద్ధి చేస్తాడు. వాసనలను నిర్వీర్యం చేస్తాడు. అంధకార బంధురమైన హృదయంలో జ్ఞాన జ్యోతులను వెలిగిస్తాడు. అట్టి గురుదర్శనము లభించగనే చంద్ర దర్శనముతో సాగరమున అలలు పొంగునట్లు, శిష్యుని హృదయం ఆనంద తరంగాలతో పరవశించాలి. గురు సాన్నిధ్యములో శోకము ననుభవించు వారు గత జన్మలోని పాపాలచే బాధింపబడు

తున్నారని శాస్త్రము చెబుతుంది. ఒకవైపు హృదయ మందిరములో జ్ఞానజ్యోతులను వెలిగించాలని గురువు ప్రయత్నం చేస్తున్నా, జన్మాంతర వాసనా గాలులు ఆ జ్యోతిని ఆర్పివేస్తూనే యుంటాయి.

శుభక్షేత్ర గతశ్చాహం తవ సందర్శనా త్ప్రభో

"మీ దర్శనము లభించుట చేత నేను పుణ్య క్షేత్రములో వసించి నట్లున్నది" అని వినమ్రుడై పలికి విశ్వామిత్రుని రాక కారణమును తెలుపమని ప్రశ్నించెను.

దశరథుని మాటల నాలకించి విశ్వామిత్రుడు సంతసించి, "రాజా! చాలా సంతోషము. నేను సిద్ధ్యర్థమై చేయు యజ్ఞమునకు రాక్షసులు విఘ్నములు కల్గించు చున్నారు. నా శ్రమంతా వృథా యగుచున్నది. **"న శాప స్తత్ర ముచ్యతే"** యజ్ఞ సమయాన క్రోధముతో శపించకూడదు. కనుక నీ పుత్రుడగు రాముని నాతో పంపుము. అతడు కడు సమర్థుడు. రాక్షసులను సంహరించగలడు. పుత్ర ప్రేమచే వెనుకాడకుము. ఈ కార్యము వలన నీ కీర్తి ఈ భూ ప్రపంచమున శాశ్వతముగా నిలిచి పోగలదు" అని చెప్పసాగెను.

విశ్వామిత్రుడు గొప్ప మహర్షి. తపస్వి. యశస్వి. విశ్వమునకు మేలు చేయువా డైనందున అతడు విశ్వామిత్రు డాయెను. లేదా ప్రపంచ మంతయూ ఎవనితో మిత్రత్వమును కల్గియుండునో అతడే విశ్వామిత్రుడు. లోక కల్యాణము కొరకు జీవించు వారెవరైనా విశ్వామిత్రులే. భక్తులైన వారు ఈ సుగుణాన్ని తక్షణ కర్తవ్యంగా గ్రహించాలి. ఒకవేళ కల్యాణ మొనరించలేక పోయినచో కంటకము గాకుండా జాగ్రత్తపడాలి. లోకాన్ని బాధించువాడు, లోకముచే బాధపడువాడు భక్తుడు కాలేడు.

యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చ యః

"ఎవని వలన లోకమునకు భయములేదో, లోకము వలన ఎవడు భయము నొందడో" అట్టివాడే భక్తుడని భగవద్గీత ప్రవచించినది.

లోక కల్యాణార్థము విశ్వామిత్రుడు యాగమును నిర్వహించెను. తన యాగమును పాడుచేయు రాక్షసులను సంహరింపుమని శ్రీరాముని యర్థించెను. రాక్షసులను సంహరించు శక్తి తనకున్నను పరమాత్మ శక్తి పైననే ఆధారపడి జీవించెను. పరమాత్మ అమృతమయ దృష్టి పడనిదే సేవాకార్యములు పూర్ణ రూపములు గాలేవు. ఫల ప్రదములు గావు. యజ్ఞ జీవన మాచరించు వారలకు విఘ్నములు అనివార్యములు. పరమాత్మ నాశ్రయించి విఘ్నములను తొలగించుకోవాలి.

విశ్వామిత్రుడు యజ్ఞమును పది రోజులు నిర్వహించెను. కర్మేంద్రియ, జ్ఞానేంద్రియము లనెడి పది ఇంద్రియములలో యున్న అజ్ఞాన కాలుష్యమును ప్రక్షాళన మొనర్చుటకు యజ్ఞములను నిర్వహించాలి. ఇదియే పది రోజుల యజ్ఞము వెనుక దాగియున్న ఆధ్యాత్మిక భావ సౌందర్యము.

విశ్వామిత్రుని వచనముల నాలకించిన దశరథుడు క్రుంగిపోయెను. నిశ్చేష్టుడై నిలబడి పోయెను. తడబడు మాటలతో "మహాత్మా! క్షమింపుము. నాకు ముసలి

తనములో పుత్రులు జన్మించినారు. నేను అల్పభాగ్యము కలవాడను. నా పుత్రుల యందు నాకు ప్రేమ మెండు. వారిలో రాముడనినచో నాకు అత్యధికమైన ప్రేమ కలదు. అతడు సత్యసంధుడు. ధర్మాత్ముడు. పెద్దలయెడ గౌరవము కలవాడు. గురువుల యెడ పూజ్య భావము గలవాడు. తల్లిదండ్రుల యెడ దైవభావం గలవాడు. ప్రతిదినము రెండు పర్యాయములు తల్లిదండ్రులకు సాష్టాంగ నమస్కార మొనరించును. నా రాముడు అమాయకుడు. ముక్కుపచ్చలారని వాడు. నీటికి దూరమై చేప మనగలదేమోగాని రామునికి దూరుడనై నేను జీవించలేను. మీ యాగ సంరక్షణమునకు చతురంగ బలముతో నేను వచ్చెదను. నా బాలరాముని, నా చిట్టితండ్రిని మరచిపొమ్ము"అని దశరథుడు ప్రార్థించెను.

"రాజా! అడిగినది ఇచ్చెద నని ప్రతిజ్ఞ చేశావు. ఇచ్చినంత సేపు పట్టలేదు మాటను వెనుదీసుకోవడానికి. ఇది రఘుకుల సంప్రదాయము కాదు. ఇదే ధర్మమని నీవు భావించినచో నేను తిరిగి వెళ్ళిపోయెదను. ఇచ్చిన మాటను నిలుపుకోలేని నీవు, నీ బంధువులు క్షేమముగా నుండుడు" యనెను.

విశ్వామిత్రుని కోపానికి భూమి కంపించెను. దేవతలు సైతము భీతి చెందిరి. ఈ భయంకర వాతావరణమును గాంచిన వశిష్ఠుడు దశరథుని సమీపించెను. ధర్మమును తప్పవలదని చెప్పెను. తేజస్వి, తపస్వి యగు విశ్వామిత్రునివెంట రామునిపంపుట సముచితమని చెప్పెను. దీనివలన రామునకు శుభము చేకూరగల దనెను. వశిష్ఠుని హితవచనముల నాలకించి దశరథుడు సంతృప్తి చెందెను.

కౌసల్యాదశరథులు రాముని ఆశీర్వదించిరి. వశిష్ఠ మహర్షి మంగళకరమగు మంత్రాదులచే రాముని అభిమంత్రించెను. రాముని విశ్వామిత్రుని కొసంగెను. రాముని వెంట లక్ష్మణుడు కూడా నడిచెను. రాముడు విశ్వామిత్రుని అనుసరించగనే మలయ మారుతము చల్లగా వీచెను. పుష్ప వర్షము కురిసెను. దశరథుని ప్రాసాదములో శంఖ దుందుభి ధ్వనులు ఆకాశము నంటెను. రెండేసి అమ్ముల పొదలను, ధనుస్సును ధరించి రామలక్ష్మణులు ముని ననుసరించిరి.

యాగ సంరక్షణమునకై విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు పాదచారులై నడచుచుండిరి. సుఖ స్పర్శను గావించుచు వాయువు వీచుచుండెను. ఆ గాలికి రాముని నుదుటిపై ముంగురులు నాట్యమాడసాగెను. ఈ దివ్యమోహన రూపమును గాంచి విశ్వామిత్రుడు ఆనంద డోలికలలో మగ్నుడై పరవశించెను. ఎలాంటిదాపారవశ్యము! ఏమో! ఎవరికి తెలుసు!

అలక లల్ల లాడగ గని ఆ రాణ్మని ఎటు పొంగెనో

అని మార్గమధ్యమున శ్రీరాముని ముంగురులతో రంజిల్లు మోమును గాంచిన మునివర్యుని సంతసమును దర్శించిన త్యాగరాజస్వామి మధ్యమావతి రాగంలో తన కళాత్మక భావానికి రూపకము నొనగూర్చెను.

ఒకటిన్నర యోజనముల దూరము మహర్షి వెంట రామలక్ష్మణులు నడిచారు. సరయూనది దక్షిణ తీరాన్ని చేరారు. "రామా! ఇచ్చట ఆచమనము చేయుము. మంత్రయుత బల, అతిబల విద్యల నిచ్చెదను" అనెను. గురువు నొదలక వెంట నడచు వారికి మార్గములో సమస్త విద్యలు లభించును. అవి ఐహిక విషయములయందు బలము నిచ్చును. ఆముష్మిక విషయమున అతి బలమును, అమిత బలము నిచ్చును.

ఏత ద్విద్యా ద్వయే లబ్ధే భవితా నాస్తి తే సమః

"ఈ రెండు విద్యలను పొందిన వానికి సముడు మరియొక డుండడు" అనెను. రాముడు ఆచమనాదులను ముగించుకొని ఆ రెండు విద్యలను గ్రహించెను. ఆ రాత్రికి వారు సరయూ తీరముననే సుఖముగా నివసించిరి.

దీక్ష గ్రహించిన వాడు శిక్షితు డగును. సరయూ తీరమున వసించును. గురువుతో కలిసి నిద్రించును. నదీ తీరములు తపోభూములు. దీక్ష తీసికోగానే సరిపోదు. దీక్షతో సాధనను కొనసాగించాలి. అందుచేత రామలక్ష్మణులు సరయూ తీరమున ఆ రాత్రి నిద్రించారు.

దశరథ నృప సూను సత్త మాభ్యాం తృణ శయనేఽనుచితే సహోషితా భ్యామ్
కుశిక సుత వచో ఽను లాలితాభ్యాం సుఖమివ సా విబభౌ విభావరీ చ ॥

"దశరథ పుత్రులైన రామలక్ష్మణులు పూర్వ మెన్నడును అలవాటు లేని తృణశయనముపై కలసి శయనించిరి. విశ్వామిత్ర మహర్షి లాలన వాక్కులచే ఆ రాత్రి వారు హాయిగా నిద్రించిరి."

పట్టు పరుపులపై శయనించు రామలక్ష్మణులు గడ్డిపై పరుండినారు. గురు సాన్నిధ్యములో తృణశయనమే హంసతూలికాతల్ప మాయెను. సాధన సుఖములను కోరదు. భోగములను వాంఛింపదు. వెతల ననుభవించిన సాధకుడే వెలుగును దర్శించును. తృణముపై శయనించినా రామలక్ష్మణులు హాయిగా నిద్రించినారని వాల్మీకి తెలుపుచున్నాడు.

వారికి దోమలున్నాయనే బాధ లేదు. దోమ తెరలు లేవనే దుఃఖంలేదు. రుచికరమైన ఆహార పానీయాదులపై దృష్టిలేదు. సాధనలో తృప్తి చెందే హృదయాలు ప్రతికూలము నెరుగవు.

నాకు కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కావు. శాస్త్రాధ్యయన కాలంలో నాకు ఫ్యాను కూడా ఉండేది కాదు. కొన్ని పర్యాయాలు చెమట ఎక్కువగా పోస్తూ వుండేది. ఒక చేతిలో గ్రంథమును పట్టుకొని, వేరొక చేతితో చెమటను తుడుచుకొంటూ చదువుకొనే వాడిని. గ్రంథాలుండేవి కావు. ఉన్నవారి వద్ద కెళ్ళి యాచించే వాడిని. ఇచ్చేవారు కాదు. లభించిన వాటితోనే రాత్రింబవళ్ళు కుస్తీ పట్టేవాడిని. నిద్ర పట్టేది కాదు. అర్ధరాత్రి సమయాన కూడా ఊరుదాటి, మైలునడచి, నదీ తీరమున కూర్చొని ఆలోచించేవాడిని. ధ్యానించే వాడిని. విలపించే వాడిని. నాపై ఎవరికీ జాలి ఉండేది కాదు. అందరూ గేలి చేసేవారే. అయినా ఎదురీదాను. ఎద సౌందర్యాన్ని భగవత్కృపతో తయారు చేసుకున్నాను. పరమాత్మ

ప్రసాదించిన అనుగ్రహ ఫలాలను ఈ రోజు బుట్టకేసి పంచుతున్నాను. తృప్తి చెందు తున్నాను.

కాలం మారుతూ ఉంది. మాయా రూపాన్ని దాల్చుతూ ఉంది. ఈ రోజు అందరికీ భగవంతుడు కావాలి. సాధన మాత్రం చేయరు. రాగద్వేషాలను విడచిపెట్టరు. బాధల్ని భరించలేరు. ఆశ్రమాలకి వస్తారు. శ్రమకు ఓర్చుకోలేరు. రుచులు సరిగ లేవంటారు కొందరు. అభిరుచులు తీరలేదని మరి కొందరు. తమ అభిప్రాయాలను గౌరవించే వారు లేరని ఇంక కొందరు. కాలయాపన జరుగుటలేదని సందర్శకులతో కబుర్లు ఆడేవారు, కరెంటు లేదు, ఫ్యాను తిరగడం లేదని చెట్లక్రింద తిరిగేవారు, ఆధునిక సౌకర్యాలు లేవని అలమటించేవారు, కంచం దగ్గర కలత, మంచం దగ్గర మడత ఏం చేద్దాం! బ్రతుకంతా మడత పేచీలే. మోక్షమెలా వస్తుంది?

కేవలం బాహ్య పరిస్థితులు, స్థితి గతులను బట్టి మనిషి శాంతి ననుభవించలేడు. గురు వాక్యముతో తృప్తి చెందువాడే సుఖించ గలడు. రామలక్ష్మణులు తృణ శయనులైనా విశ్వామిత్రుని వచనములచే సుఖంగా నిద్రించారని శ్రీమద్రామాయణంలో వాల్మీకి మహర్షి చెప్పుచున్నాడు. రాత్రి గడచింది. బ్రహ్మముహూర్త కాలము సమీపిస్తున్నది. పర్ణ శయనులై యున్న రామలక్ష్మణులను గాంచిన విశ్వామిత్రుడు

కౌసల్యా సుప్రజా రామ పూర్వా సన్ధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్

"కౌసల్యాదేవి సుపుత్రుడనైన రాముడా! ప్రాత:కాల సమయమైనది. పురుష శ్రేష్ఠుడా! లెమ్ము. నిత్యోచిత కర్మము నాచరింపుము."

ప్రతి ఒక్కరు నిద్ర లేవగనే ఈ శ్లోకమును పఠించాలి. నిద్ర లేవగనే మనలోని దివ్యత్వమును మేల్కొలపాలి. సాయంత్రము వరకు ఆచరించు కర్మలలో అసురత్వము తొంగి చూడకుండా చూసుకోవాలి.

రామలక్ష్మణులు స్నానాదులాచరించారు. గాయత్రీ మంత్రమును జపించారు. తిరిగి గురువు ననుసరిస్తూ పయనమయ్యారు. కొంత దూరము పయనించి సరయూ సంగమ స్థానమునందు గంగానదిని దర్శించి నమస్కరించిరి. అచ్చట యున్న ఆశ్రమములను, మహర్షులను సందర్శించిరి. గురువువెంట నడచు వారికి భక్త సమాగమ మేర్పడును. ఈ తీరముననే శివుని కోపాగ్నిచే మన్మథుడు భస్మమైనట్లు రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు చెప్పెను. జ్ఞానగంగా తీరమున కామము లన్నియు భస్మమగును.

గురుశిష్యులు గంగను దాటిరి. అరణ్యమున ప్రవేశించిరి. ఇంతలో వారికి పెద్ద ధ్వని వినిపించెను. వెంటనే తాటకి కనిపించెను. అది రాక్షసి. అతి భయంకరముగా యుండెను. రాముడు బాణమును సంధించి తాటకిని వధించబోయి, ఆమెను వధించుటకు సంశయిస్తూ, అంగములను ఖండించుచుండెను. విశ్వామిత్రుడు రాముని హెచ్చరించెను. సంధ్యాకాలము సమీపించుచున్నదనియు, సంధ్యాకాలమున రాక్షసులకు బలము మెండుగా యుండునని తెలిపి, వెంటనే తాటకిని వధింపు మనెను. రాముడు తాటకిని వధించెను.

తాటకి యనగా కామమని భావము. రాత్రులందు కామవాంఛలు వృద్ధి యగును. అందుచేత సంధ్యా సమయమున వందనము, దీపారాధనము చేయవలెను. ప్రతి గృహము నందు సాయం సంధ్యా సమయాన దీపాలు వెలిగించాలి. ఆ సమయంలోనే దీపాలు ఆర్పి, సినిమాలకు, షాపింగులకు వెళ్ళడము కర్తవ్యంగా మారింది. అనాచార జీవనము అనర్థాన్నే తెచ్చిపెడుతుంది. గురుబోధను గ్రహించిన సాధకుడు, రాముడు తాటకినివలె, కామాన్ని వధించాలి. సంధ్యా సమయాన ధ్యానధనుస్సును చేబూని కామరాక్షసిని మట్టు బెట్టాలి.

ఆ రాత్రి వనమునందే విశ్రమించి మరునాడు ఆశ్రమమునకు వెళ్ళెదమని మహర్షి చెప్పెను. తాటక వనమున రామలక్ష్మణులు నిద్రించినారు. ఉదయమున బయలు దేరే ముందే మహర్షి సంతుష్ట చిత్తుడై రాముని ఆశీర్వదించెను. యాగ సంరక్షణకు రామలక్ష్మణులను విశ్వామిత్రుడు తీసికొని పోవుచుండెను. ఆశ్రమము చేరక మునుపే రాముడు తాటకిని వధించి గురుదేవుని హృదయమును తృప్తిపరచెను. గురువు చెప్పిన మాటను నెరవేర్చువాడే శిష్యుడు. ఊహించిన సమయము కన్నా ముందుగా చేయువాడే ఉత్తమశిష్యుడు. రాముడు అదే చేశాడు. మార్గములోనే తాటకిని మట్టు బెట్టెను. ఈ రోజుల్లో గురువులు చెప్తూనే యుంటారు. శిష్యులు మరచి పోతూనే ఉంటారు. శిష్యుల దౌర్భాగ్యమును గాంచి గురువులు ఏడుస్తుంటారు. గురువుల దుస్థితిని గాంచి శిష్యులు నవ్వుతుంటారు. కలిమహిమ ఎవ్వరినీ వదలి పెట్టదు.

మహర్షి రామునకు దివ్యాస్త్రములను ప్రసాదించెను. అంతేగాదు. అస్త్రముల ఉపసంహారమును కూడా నేర్పెను. ముువ్వురు సిద్ధాశ్రమమును చేరిరి. మహారణ్యములో చరించి, తాటకిని సంహరించిన తరువాత సిద్ధాశ్రమము వచ్చును. సాధన మార్గంలో అనేక బాధల ననుభవించి, కామమనే తాటకిని వధించిన వారికే సిద్ధత్వము లభించును.

"మునివర్యా! గురుదేవా! మీరు నేడే యజ్ఞము నారంభింపుడు. మీకు శుభమగుగాక!" అని పొడవైన చేతులను ముందుంచి రాముడు ప్రార్థించెను. ముచ్చటైన రాముని ముంజేతిని గాంచి ముని ముదమొందెను.

రాముడు ఆజానుబాహుడు. ఆయన చేతులు చాలా పొడవుగా యుండును. కఠోర సాధనలాచరించి తనను సమీపించు భక్తులు గోచరింపగనే తొందరగా వారిని తన సమీపమునకు ప్రేమతో చేర్చుకొనేందుకు రాముడు బాహువులను పొడవుగా పొందెను.

మహర్షి యజ్ఞశాలలో ప్రవేశించెను. యజ్ఞ ప్రారంభమున అగ్నికి ఆహుతు లివ్వబోయి రామలక్ష్మణులను జూచెను. ఏ సత్కార్యము నాచరింపవలె ననినను మొదట పరమాత్మను జూచే సుగుణాన్ని సాధకుడు తయారు చేసుకోవాలి. పరమాత్మకు సమర్పించనిదే అగ్నిదేవుడు కూడా స్వీకరింపడు. అందుచేతనే భారతీయ సంప్రదాయంలో వంట పూర్తియైన పిదప అన్నమును కళ్ళకద్దుకొని అగ్నికి సమర్పిస్తారు. పరమాత్మకు సమర్పించిన దానినే దేవతలు గ్రహిస్తారు.

విశ్వామిత్రుడు యజ్ఞమును చేయుచూ శ్రీరామునే దర్శింపసాగాడు. భగవానుని దర్శనమే యజ్ఞ ఫలమని మహర్షికి తెలుసు.

యజ్ఞశాల ద్వారముల వద్ద రామలక్ష్మణులు ధనుర్ధారులై నిలుచుండిరి. ఎవరయితే విశ్వామిత్రుని వలె లోకకల్యాణము కొరకు కర్మ లాచరింతురో అట్టివారి ద్వారముల వద్ద శ్రీరాముడు కావలాదారుని వలె ధనుర్బాణములను చేపట్టి నిలబడును.

యజ్ఞము చేయునపుడు ద్వారములవద్ద రాముడుండాలి. ఇంద్రియ ద్వారముల వద్ద రాముడు లేనిచో సాధన కొనసాగదు. పైగా శనిగ్రహం ప్రవేశించే అవకాశ మేర్పడును. కామ క్రోధాది రాక్షసులు లోనికి ప్రవేశింపకుండా ఇంద్రియ ద్వారముల వద్ద భగవానుని నిలపాలి.

యజ్ఞమంటపము ఒక్కసారి జ్వలించెను. వర్షాకాల మేఘముల వలె మారీచ సుబాహువులు మాయా వికారములతో ఆకాశమున అగుపించిరి. రక్తమును యజ్ఞవాటికపై వర్షింప జేసిరి. రామలక్ష్మణులు మారీచ సుబాహువులను గాంచిరి. రాక్షసులు కూడా రాజ కుమారులను దర్శించిరి.

రాముని చూడగనే మారీచుని స్వభావము మారిపోయింది. యజ్ఞమునకు విఘ్నము చేయుట మంచిది కాదనే భావన మారీచునకు కలిగెను. రాముని గాంచిన పిదప తనలో క్రోధ ముదయించుటలేదని ఆలోచింపసాగెను. మారీచుడు రాక్షసుడైనను అతని మనస్సులో ఆ క్షణాన రాముడు నిలిచెను. మారీచుని ఆకారము ఎంత వికారముగా యున్నను అతని హృదయము ఆ క్షణాన శోభాయ మానమై యుండెను. ఈ నాటి భక్తులు దర్శన సమయాలలో కూడా పేచీలు పెట్టుకొంటూ కాఠిన్యాన్ని ప్రదర్శిస్తుంటారు. రాముని దర్శింపగనే రాక్షసుడైనను మారీచుని బుద్ధి శుద్ధిపడెను. భగవంతుని దర్శించిన పిమ్మట కూడా మార్పురాని మనుజులు రాక్షసులకన్నను అధములే యగుదురు.

మారీచునిలోని మార్పును రాముడు గుర్తించెను. అందుచేత మారీచునిపై చల్లనిదియైన మానవాస్త్రమును ప్రయోగించెను. మారీచుడు చావలేదు. గిఱ్ఱున తిరుగుచు మూరు యోజనముల దూరమున పొర్లుచున్న సముద్ర జలమునందు పడెను. అటు పిమ్మట రాముడు ఆగ్నేయాస్త్రమును ప్రయోగించి సుబాహువును నేలకూల్చెను.

రాముని యుద్ధ సంబరము చూడదగినదియే గాని చెప్ప నెవరితరము? అవి వాల్మీకియే ఆశ్చర్యమును వ్యక్త మొనర్చెను. మారీచుడు గగనమున నిలిచాడు. రాముడు బాణము నెక్కుపెట్టి పైకి చూశాడు. పైకెత్తిన శిరమును బాణమును సంధించుటకై కదలించగా ఆయన ముద్దుమోముపై ముంగురులు ముచ్చటగా అల్లలాడిన వంటాడు రామానుగ్రహమునకు పాత్రుడైన త్యాగరాజస్వామి.

అలక లల్లలాడగ గని ఆ రాణ్ముని ఎటు పొంగెనో

చెలువు మీరగను మారీచుని మదమణచే వేళ ॥అలక॥

పాలబుగ్గల రాముని నుదిటిపై ఉంగరాల అలకలు కదలుచుండగా ఆ దివ్య మోహన రూపమును యజ్ఞశాల నుండి గాంచుచున్న విశ్వామిత్ర మహర్షి ఎంత ఆనందించెనోయని త్యాగయ్య పరవశించి గానం చేశాడు. మరి తాపసునితో పాటు తారక రామునిగాంచిన త్యాగబ్రహ్మ ఎంత తన్మయమొందినాడో గదా!

రాముడు రాక్షసులను వధించెను. యజ్ఞము వైభవముగా సమాప్త మాయెను. రాముని ఋషులందరు ప్రశంసించిరి. "రామా! ఈ సిద్ధాశ్రమ నామమును సార్థక మొనర్చితివి" యని విశ్వామిత్రుడు కదలిపోతూ పలికెను. రామలక్ష్మణులు సంతసించినవారై ఆ రాత్రి ఆశ్రమమునందే వసించిరి.

అహల్య శాపవిమోచనము

యజ్ఞము పూర్తియైనది. సీతా స్వయంవరానికి అరుదెంచమని జనకుని వద్దనుండి ఋషులకు ఆహ్వానాలు అందినాయి. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంట నిడుకొని మిథిలకు బయలు దేరెను. మార్గంలో ఒక చక్కని వనంలో అందమైన ఒక ఆశ్రమము గోచరించెను. అది జనశూన్యమై గన్పట్టెను.

"మునిశ్రేష్ఠా! ఇది ఆశ్రమము వలె తెలియుచున్నది. ఇందు సాధువులు గాని, మునులు గాని ఎవ్వరూ గోచరించుట లేదు. పురాతనమైన ఈ ఆశ్రమము ఎవరిది?" అనెను. విశ్వామిత్రుడు చెప్పసాగెను.

ఈ ఆశ్రమములో పూర్వము గౌతమమహర్షి ఉండెడివాడు. ఆతని భార్య అహల్య. గౌతముడు ఇంటిలోలేని సమయాన కామమోహితుడైన ఇంద్రుడు అహల్యను వాంఛించి ఆశ్రమములో ప్రవేశించెను. గౌతముని వేషములో ప్రవేశించెను. నిజం తెలిసినను దేవరాజుయనెడి ప్రీతితో అహల్య సమ్మతించెను.

గొప్పతనమును వాంఛించువారు సాధారణంగా భ్రష్టులవుతూనే యుంటారు. చక్కని శీలమును కలిగి యుండుటయే గొప్పతనమని ఎరుగరు. పెద్దలతో కలసి తిరుగుట, పెద్దలతో భాషించుట, ధనికులను గౌరవించుట ఇవి అన్నియు ఆ కోవలోకి చెందినవే. సర్వసంగ పరిత్యాగులకు కూడా ఇవి తప్పుట లేదు. కాలమహిమ!

అహల్యా దేవేంద్రులు సంతుష్ట చిత్తులైరి. ఇంద్రుడు ఆశ్రమం నుండి వెలుపలికి వచ్చెను. సమిధలను చేతపట్టుకొని గౌతముడు ఎదురాయెను. ఇంద్రుడు భయముతో వణకసాగెను. సత్యమును గ్రహించిన గౌతముడు ఇంద్రుని శపించెను. లోనికేగి అహల్యను కూడా శపించెను. "దుష్టురాలా! కొన్ని వేల సంవత్సరములు నీవు ఇచ్చటనే వసించెదవు గాక! ఎవరికీ గోచరింపకుండా పాషాణమునై, ధూళిచే కప్పబడి ఆహారాదులు లేక, వాయువునే భక్షించుచు, ఈ ఆశ్రమము నందే తపస్సు చేయుచు వసించెదవు గాక!" అని శపించెను.

అహల్య దుఃఖించెను. పశ్చాత్తాపముతో కుమిలి పోయెను. బిగ్గరగా రోదించెను. కర్మ రహస్యముల నెరిగిన గౌతముడు "దశరథ కుమారుడైన రాముడు ఈ వనములో ప్రవేశించగనే నీకు శాపవిముక్తి కలుగు" ననెను.

అహల్య యనగా మనస్సు. గౌతముడు శుద్ధ బుద్ధి. కామ వాంఛలతో కలుషితమైన మనస్సు పాషాణమగును. అహల్య యనెడి మనస్సు ఇంద్రుడనెడి ఇంద్రియములతో గూడి

భ్రష్టమగును. బుద్ధిని అనుసరింపక, ఇంద్రియముల ననుసరించి, విషయ సుఖాల
నమభవించు మనస్సుకు శాంతి మిగలదు. మనస్సు శాపగ్రస్థురాలు కాగానే బుద్ధి దారి
చూపును. అలాగే గౌతముడు అహల్యకు విమోచన మార్గమును తెలియ జేసెను.

విశ్వామిత్రుని ద్వారా అహల్య యొక్క దైన్య జీవితమును గాంచి రాముని
హృదయము ద్రవించెను. "రామా! ఈ అహల్యను తరింప చేయుము" అని ముని
యనెను. రామలక్ష్మణులు లోనికి ప్రవేశించిరి. అహల్య నుద్ధరించినాడు ఆద్యపురుషుడు.

అహల్య రామునికి నమస్కరించెను. తన భర్త ఇచ్చిన శాపము శుభమునే
చేకూర్చినదని అహల్య భావించెను. ఆ శాప ఫలముగనే ఈ నాడు రాముని పాదధూళిని
స్పృశించే భాగ్యము కలిగినదని ఆనందించెను. బండరాతి బ్రతుకులైనను పరమాత్మ
కొరకు నిరీక్షించువారు పవిత్రు లగుదురని అహల్య నిరూపించెను.

అహల్య శాపము తీరెను. రామదర్శనముచే ఆమె పవిత్రురాలయ్యెను. శాప విముక్తి
నొంది అగ్నివలె ప్రకాశించుచున్న అహల్య పాదములను స్పృశించి రామలక్ష్మణులు
నమస్కరించిరి. పవిత్రులగు వారు రామునికి అత్యంత ప్రియులు. అహల్య రాముని
పూజించెను.

అటు పిమ్మట తేజస్వియైన గౌతము డచటికి అరుదెంచెను. అహల్య నాశీర్వదించి
స్వీకరించెను. దంపతు లిరువురు రాముని పూజించిరి. గౌతముని పూజ లందుకొనిన
రాముడు లక్ష్మణ విశ్వామిత్రులతో కలిసి మిథిలకు వెళ్ళెను.

కామ సంపర్కముతో మనస్సు పాడగును. పరమాత్మ స్పర్శతో మనస్సు
శుద్ధిపడును. నామ సంబంధమే దైవ సంబంధము యని మరువరాదు. జీవితంలో
దురాచార దూరులు పరమాత్మకు అత్యంత ప్రీతి పాత్రులు. తెలియక తప్పు జరిగినను,
"హరయే నమః" యనెడి మంత్రమును వెంటనే స్మరింపవలెను. మళ్ళీ ఆ తప్పు
జరుగకుండా చూసుకోవలెను.

ఈ అహల్యా వృత్తాంతమును భయపడి అనేకులు వక్రించి చెబుతుంటారు.
హిందూ ధర్మ శాస్త్రం అలాంటి భయాలకి తావివ్వదు. సత్యమును గ్రహించడములోనే
ప్రాణ్యత ఉంది. నేను వ్రాసిన ఈ అహల్య గాథ వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణము
లోనిది. ఎవ్వరూ సందేహింప పనిలేదు. దురాచారులను సదాచారులుగా, సదాచారులను
సమదర్శన యోగులుగా మార్చేందుకే శాస్త్రాలొచ్చాయి. అభయమిచ్చే శాస్త్రాన్ని
భయంలేకుండా చెప్పడం, అందులోని తాత్త్విక దృక్పథాన్ని తెలియజేయడమే భాష్యకారులు,
వ్యాఖ్యాతలు చేయవలసిన కార్యము.

స్వయంవరము

రామలక్ష్మణులను వెంట నిడుకొని విశ్వామిత్రుడు జనకుని సభలో ప్రవేశించెను.
జనకమహారాజు మహర్షికి నమస్కరించెను. ఆయన ప్రక్కనేయున్న పురుషవ్యాఘ్రము
లిరువురిని గాంచెను.

"మహాత్మా! వీరెవరు? ఠీవిలో రాకుమారులా యున్నట్లున్నారు. వేషములో మునిబాలుర
వలె యున్నారు!" అనెను.

"రాజా! శ్రేష్ఠుడనైన నీవే ఆ విషయమును నిర్ణయింపుము" అని విశ్వామిత్రుడు
పలికెను. వెంటనే జనకుడు "మహాత్మా! వీరు సామాన్యుల వలె గన్పట్టుటలేదు. ఆ
శ్యామవర్ణమూర్తి నన్నధికముగా ఆకర్షించు చున్నాడు. అతడు ఆదిదేవుడని నా
కనిపించుచున్నది. పరమాత్మ కన్నా అన్యమైన దేదియును నన్ను ఆకర్షింప జాలదు"యని
జనకుడు పలికెను.

ఆ రాత్రి రామలక్ష్మణులతో కలిసి విశ్వామిత్రుడు ఉద్యాన వనములో విశ్రమించెను.
రామలక్ష్మణులు మహర్షికి పాదసేవ చేసిరి. మహర్షి నిద్రించిన పిదప రాముడు వెళ్ళి
పరుండెను. లక్ష్మణుడు రామునికి పాదసేవ చేసెను. రామునికి పాదము లొత్తుతూ
లక్ష్మణుడు దుఃఖించుచుండెను. "ఈ పాదసేవా భాగ్యము నాకెంత కాల ముండును?
మా వదిన రాకతో ఇవి నావి గాకపోవునేమో?" యని చింతించుచుండెను. లక్ష్మణుని
కన్నీరు రాముని దేహముపై బడెను.

"లక్ష్మణా! ఎందులకీ దుఃఖము?" అని రాము డడిగెను. లక్ష్మణుని ద్వారా
విషయము నెరిగి "నాయనా! నీవు లేనిదే నేను బ్రతుకలేను. నీ కొరకు భార్యను కూడా
నేను త్యజించగల" నని పలికి లక్ష్మణుని హృదయానికి హత్తుకొనెను.

స్వయంవర సమయమైనది. ఎవరికీ సాధ్యముగాని యా ధనుస్సును విఱచుటకు
విశ్వామిత్రుని యాజ్ఞచే రాముడు ముందుకు నడచుచుండెను. ధనుస్సు నుంచిన పెట్టె
వద్ద కెళ్ళెను. సీత తదేకంగా రాముని వీక్షించుచుండెను.

పశ్యతాం నృసహస్రాణాం బహూనాం రఘునందనః
ఆరోపయత్స ధర్మాత్మా సలీల మివ తద్ధనుః

"ధర్మాత్ముడైన శ్రీరాముడు వేలకొలది రాజులు, జనులు గాంచుచుండగా ఆ
ధనుస్సును అవలీలగా ఎక్కుపెట్టెను."

విశ్వామిత్రుడు ఆనందభరితు డాయెను. ఎక్కుపెట్టిన ధనుస్సును అలాగే పట్టి
యుంచి, ఆజ్ఞకై విశ్వామిత్రుని వైపు చూసెను. ఆ దివ్య మోహన రూపమును గాంచి ముని
పరవశించెను.

అలక లల్లలాడగ గని ఆ రాణ్ముని ఎటు పొంగెనో ॥అ॥
ముని కనుసైగ దెలిసి, శివ ధనువును విరిచే సమయ
మున త్యాగరాజ వినుతుని మోమున రంజిల్ల ॥అ॥

రఘురాముడు మునిని చూడగనే, పనిపూర్తి చేయుమని ముని కనుసైగ చేసినాడట.
అది గ్రహించి ధనుర్భంగము గావించునపుడు అల్లలాడిన అలకలతో రాముని మోము
రంజిల్లినది యని త్యాగరాజస్వామి గానం చేశాడు. అల్లలాడే అలకలు గల ఆద్య పురుషుని
మోమును ఎన్నిసార్లు జూచినను విశ్వామిత్రునికి తనివి దీరుట లేదని త్యాగయ్య

అభిప్రాయము. అలా చెప్పుకొంటూ త్యాగయ్య పునః పునః దర్శిస్తున్నాడు. మనమూ అదే చేయుదము.

రాముడు ధనుస్సును ఆకర్ణాంతము లాగి విరచినైచెను. సీత మందస్మిత వదనారవింద యాయెను. జనకుడు హర్షపూర్ణహృదయు డాయెను. జనకుడు విదేహ నగరానికి రాజు. అందుచేత విదేహుడాయెను. శిథిలమయ్యే దేహమే మిథిలా నగరము. దేహమునకు ఎవ్వడు అతీతుడో అతడే విదేహుడు. దేహాభిమానమును విడిచిన వారికే పరమాత్మయైన రామునితో సంబంధ మేర్పడును.

విశ్వామిత్రుని యాజ్ఞ బడసి జనకుడు దశరథునకు వార్త నంపుటకు నిశ్చయించెను. దూతలను అయోధ్యకు పంపెను. వారు మూడు రోజులు ప్రయాణము చేసి అయోధ్య చేరిరి.

సీతారామ కళ్యాణము

దూతలద్వారా విషయమునెరిగి దశరథుడు సంతసించెను. వశిష్ఠ వామదేవాదులతో చర్చించెను. మరునాడే మిథిలకు పయన మగునట్లు నిర్ణయించెను. మరునాడు చతురంగ బలము వెంటరాగా దశరథుడు మిథిల కేగెను. జనకుడు దశరథునికి స్వాగతము పలికెను. అందరూ సంతసించిరి.

తన సోదరుడైన లక్ష్మణునకు వివాహము లేకుండా తాను వివాహితుడగుట తన కిష్టము లేదని రాముడనెను. రామునికి లక్ష్మణునిపై ప్రేమ అలాంటిది. జనకుని రెండవ కుమార్తె యగు ఊర్మిళను లక్ష్మణున కిచ్చి వివాహము చేయునట్లు నిర్ణయించిరి. వశిష్ఠుని ఆజ్ఞచే జనకుని సోదరుడైన కుశధ్వజుని కుమార్తెలగు మాండవీ శ్రుతకీర్తులను భరత శత్రుఘ్నుల కిచ్చునట్లు నిర్ణయించిరి. నలుగురు రాజకుమారులు నలుగురు రాజ పుత్రికలను ఒకేరోజు వివాహ మాడునట్లు నిర్ణయించుట జరిగెను.

దశరథుడు నలుగురు పుత్రుల నుద్దేశించి నాలుగు లక్షల గోవులను దానము చేసెను. ఇంటిలో మంగళ కార్యముల నాచరించునపుడు ఇతరులను తృప్తిపెట్టే కార్యములను చేపట్టాలి. లక్షలాది ధనమును విందులకు ఖర్చుపెట్టి, హోటళ్లలో వివాహాది కార్యక్రమముల నిర్వహించి, చెట్టునుండి పక్షులు ఎగిరి పోవునట్లు నిర్భ్రమించుట మంచిదికాదు. భూత ప్రీతికి వివాహాది సమయాన దానాది కార్యములను నిర్వహించాలి.

వివాహమంటపము అత్యంత వైభవముగా అలంకరింపబడెను. సర్వాభరణ భూషితురాలగు వైదేహిని జనకుడు తీసికొని వచ్చి, అగ్నిదేవుని ముందు రామునకు ఎదురుగా నిలబెట్టెను. రామునితో ఇలా పలికెను.

ఇయం సీతా మమ సుతా సహధర్మ చరీ తవ
ప్రతీచ్ఛ చైనాం భద్రంతే పాణిం గృహ్ణీష్వ పాణినా ॥

"ఇదిగో! నా కుమార్తెయగు సీత. ఈమె నీకు అర్ధాంగికాగలదు. ఈమెను అంగీకరింపుము. నీకు శుభ మగుగాక! నీ చేతితో ఈమె చేతిని పట్టుకొనుము."

"భాగ్యవంతురాలగు ఈమె నిన్ను సదా నీడవలె అనుసరించి యుండగలదు" అని పలికి మంత్రతప్తమైన జలమును విడిచెను. అలాగే ఊర్మిళను లక్ష్మణునికి, మాండవిని భరతునికి, శ్రుతకీర్తిని శత్రుఘ్నునకు ఇచ్చెను. నలుగురు రాజకుమారులు నలుగురు కన్యలను గ్రహించిరి. మూడు సార్లు అగ్నికి ప్రదక్షిణమొనర్చి వివాహమాడిరి. అనంతరము విశ్వామిత్రాదులు వెడలిపోయిరి. దశరథుడు పుత్రులతో గూడి అయోధ్య చేరెను.

సీతారాముల దాంపత్యము ఆదర్శమైనది. శ్రీరాముడు సుగుణాభిరాముడు. సీత సుగుణశీల. ఆమె చల్లనితల్లి. ఉద్వేగము నెరుగని ఉల్లముగల తల్లి. ఆమె దృష్టి సదా ప్రసన్నము. ఆమె నేత్రాలు ఎప్పుడూ ఎఱ్ఱ బడలేదని వాల్మీకి వర్ణించెను. ఆంజనేయుడు మొదటి సారిగ జానకిని లంకలో దర్శించి నపుడు రామునకు జానకి, జానకికి రాముడు అన్ని విధముల సరిపోయినారని భావించెను. బాగా ఆలోచించిన తరువాత ఆంజనేయుడు ఒక అభిప్రాయమును తెలిపినాడు. ఇరువురు సమానముగనే యున్నను, జానకి యందు రామునికన్నను ఒక లక్షణము అధికముగా యున్నట్లు తెలిపెను.

తుల్య శీల వయోవృత్తాం తుల్యాభి జన రక్షణాం
రాఘవోర్హతి వైదేహీం తం చేయ మసి తేక్షణా ॥

శీల, వయో, వృత్తాభిజన లక్షణములచే సీతారాములు పరస్పరము తగియున్నారని పలుకుచూ, సీతమ్మకు **"అసి తేక్షణా"** యని అధికముగా ఒక పదమును తగిలించినాడు. ఇదియే ఆమె కన్నులలోని నల్లదనము. చల్లదనము. సీతలాంటి శాంత హృదయులను శ్రీరాముడు స్వీకరించును.

రామ పట్టాభిషేక సన్నాహము

ఒకనాడు దశరథుని కిరీటము జారుచుండెను. ఇంతలో చెవివద్ద ఒక తెల్లనివెంట్రుక దర్పణములో గోచరించెను. దశరథుడు బాగా ఆలోచించెను. పరిశుద్ధమైన ఆధ్యాత్మిక జీవనమును గడుపుమని తెల్లని వెంట్రుక సూచించుచున్నట్లు, జారిన కిరీటము రాజ్యమును త్యాగము చేయుమని చెప్పుచున్నట్లు భావించెను. సంస్కారులకు సద్భావాలే కదుల్తాయి.

శ్రీరామునికి పట్టాభిషేకము చేయవలెనని సంకల్పించి దశరథుడు వశిష్ఠునితో సంప్రదించెను. వశిష్ఠుడు సమ్మతించెను. జీవితమును రామునకు త్యాగ మొనర్చునపుడు జాగు సేయకూడదని వశిష్ఠుని యభిమతము. వశిష్ఠుని యానతిని బడసిన దశరథుడు మంత్రులను పిలిచి సన్నాహములు చేయుడని చెప్పెను.

అయోధ్యా నగరము మంగళ వాద్యములతో, అలంకరణములతో దేదీప్యమానముగ గోచరింపసాగెను. సమస్త గృహములు అందముగా అలంకరింపబడినవి. దశరథుని ప్రార్థనచే వశిష్ఠుడు రామునివద్ద కేగెను. రాముడులేచి నిలబడి నమస్కరించెను.

"రామా! నిన్ను అయోధ్యకు రాజుగ చేయదలచినాడు మీ తండ్రి దశరథుడు. పట్టాభిషేకమునకు సన్నాహములు జరుగుచున్నవి. నీవు నా సూచనలను పాటింపుము" యని వశిష్ఠుడనెను.

రాముడు విస్మయమొందెను. ఆయన మొగమున ఆనందమునకు బదులు విషాదము చోటు చేసుకొనెను. "గురుదేవా! మేము నలుగురు అన్నదమ్ములుండగా నేనే పట్టాభిషిక్తుణ్ణే ఏల కావలెను? భవ్య చరితుడగు నా తమ్ముడు భరతున కేల రాజ్యము నీయరాదు?" యనెను.

"రామా! అగ్రజుడు రాముడుండగా నేనెలా స్వీకరింతును?" యని నీ తమ్ముడు భరతుడు అనకుండునా? త్యాగుల వంశములో స్వార్థపరులు జనింతురా?" యనెను.

"అవును నేను వయస్సులో అగ్రజుడను. భరతునకు రాజ్యము నొసగినచో అతడు రాజై సర్వులకు అగ్రజుడగును. అప్పుడు మేమిరువురము సమముగా యుండెదము గదా?" యనెను.

అది రాముని ఔదార్యము. త్యాగము. అసమాన ప్రేమ. రాముని జీవితము అనుక్షణమూ ఆదర్శమే. రాముడు సౌశీల్యుడు. సౌశీల్య మనగా నేమిటో తెలిసికొందుము.

మహతః మందైః సహ నీరంధ్రేణ సంశ్లేషః సౌశీల్యమ్

"వర్ణము చేతను, సంపద చేతను, జ్ఞానము చేతను గొప్పవాడైన వ్యక్తి తన కన్నను తక్కువైన వారితో సమానముగా కలిసి జీవించుటయే సౌశీల్యము" యనబడినది. ఈ యాదర్శమును రాముడు మనకు సుస్పష్ట మొనర్చెను. దశరథుడు రాముని పిలిపించి ఇలా పలికెను.

తద్ యావదేవ మే చేతో న విముహ్యతి రాఘవ
తావ దేవా భిషి ఇ్చ స్వ చలాహి ప్రాణినాం మతిః ॥

"రామా! నా చిత్తము మోహమునకు గురికాక మునుపే నీవు యువరాజుగా అభిషిక్తుడవు కమ్ము. జీవుల చిత్తములు చంచలములు గదా!" యనెను.

రాబోయే ఆపదలు పుణ్యాత్ములకు ముందుగానే అవగతమగును. అలాగే జరిగింది. రామపట్టాభిషేక సన్నాహాల సంబరాలను గాంచి కైకేయి దాసియగు మంథర అసూయపడింది. బుద్ధిని పాడుచేసుకొన్నది. నిండు సంసారాన్ని కుండ పగుల గొట్టినట్లు పగులగొట్టినది. వరముల నడుగమని కైకేయిని ప్రేరేపించింది. కైకేయి లొంగిపోయింది.

అయోధ్యా మహారాణి కైకేయి ఎక్కడ? దాసి ఎక్కడ? పతనం ప్రారంభమైనచో పరిధు లెక్కడో గాంచలేము. మంథర అసూయా స్వరూపము. అసూయాపరుల అండ

అధోగతికి కారణమౌతుంది. కైకేయి రాజును వరము లివ్వమని కోరెను. భరతునికి పట్టాభిషేకము చేయాలి. రాముని అరణ్య వాసమునకు పంపాలి.

దశరథుడు మూర్ఛిల్లెను. రాముడు లేనిదే తాను బ్రతుకలేనని చెప్పెను. అయినను కైకేయి సమ్మతించలేదు. దశరథుడు తీవ్ర దుఃఖమునకు గురిఆయెను. తెల్లవారితే రాముడు అరణ్యములకేగాలి. దశరథుడు రోదిస్తూ ఉదయించవద్దని సూర్యుని ప్రార్థించెను.

రాముని పితృభక్తి అసమానము. అప్రమేయము. రాముడు కైకేయివద్ద కెళ్ళెను. దుఃఖవదనుడై పడియున్న తండ్రిని గాంచెను. తన తండ్రి మనోవ్యథకు కారణమేమిటని కైకేయి నడిగెను. విషయమును గ్రహించెను. తండ్రి మాటను పాలించెదనని ప్రతిజ్ఞ చేసెను. సందేహము వలదని తల్లికి చెప్పెను.

భక్ష యే యం విషం తీక్ష్ణం పతేయ మపి చార్ణవే
నియుక్తో గురుణా పిత్రా నృపేణ చ హితేన చ ॥

"దశరథుడు నాకు గురువు. తండ్రి. రాజు. హితైషి. అతని ఆజ్ఞను పాలించుటలో నేను విషపానము చేయుటకు సైతము వెనుకాడను. సాగరమున బడుటకు కూడా సంశయింపను.

కరిష్యే ప్రతిజానే చ రామో ద్విర్నాభి భాషతే

"అమ్మా! తండ్రి ఆజ్ఞను నెరవేర్చెదనని ప్రతిజ్ఞ చేయుచున్నాను" అని రాముడు పలికెను.

రాముడు కౌసల్య వద్దకేగెను. విషయమును వివరించెను. కౌసల్య దుఃఖములో క్రుంగిపోయెను. అయోధ్య అదృష్టము అయిపోయిందనియు, అరణ్యము భాగ్యవంతమైనదని కౌసల్య భావించెను. సీతాదేవి అచ్చటికి వచ్చెను. అత్తకు నమస్కరించెను. "రామా! సీతను తీసికొనిపోవలదు. ఆమెను నేను కంటికి రెప్పలా కాపాడుదును. నా బిడ్డ కష్టమును నేను సహింపగలను. పరుల పుత్రిక బాధను నేను సహింపలేను" యనెను.

సీతను వదలి వెళ్ళుటకు రాము డంగీకరించెను. కానీ సీత అంగీకరించలేదు. "నాథా! నా ప్రాణములు సదా మీయందే యుండును. మీరు అరణ్యమున కేగినచో నా ప్రాణములు కూడా మిమ్ములను నాశ్రయించుకొని వెడలును. ప్రాణములను పోగొట్టుకొనిన ఈ దేహము ఇక్కడుండి ఏమి సాధించును?" అనెను. సీతను వెంట నిడుకొని వెళ్ళుటకు రాముడంగీకరించెను.

"రామా! మీ తండ్రిని వదలి పెట్టి నేను నీతోపాటు అరణ్యములకు రాలేను. అలాగని నిన్ను విడిచి ఈ అయోధ్యలో మనలేను" యని కౌసల్య రోదింపసాగెను.

రామునితో పాటు కానల కేగుటకు లక్ష్మణుడు కూడా సిద్ధపడెను. తల్లియగు సుమిత్ర గదికి వెళ్ళి తన యభీష్టమును తెలిపెను. "రాముడే నాకు దైవము. రాముడే నాకు తండ్రి. రాముడే నా సర్వస్వము. రాముడు లేనిదే నేను బ్రతుకలేను" యని లక్ష్మణు డనెను.

సుమిత్ర లక్ష్మణుని ఆశీర్వదించెను. రాముని దశరథునిగను, జానకిని సుమిత్రగను, అరణ్యమును అయోధ్యగను భావించి జీవింపుమని లక్ష్మణునికి చెప్పెను.

"లక్ష్మణా! రామునికి పదునాలుగేండ్లు సేవచేయు నీ భాగ్యమే రామ వనవాసమునకు కారణము గాని మరొకటి కారణము కాదు" యని సుమిత్ర పలికెను.

వనవాసము

శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై అరణ్యములకు బయలుదేరు చుండెను. అయోధ్యావాసులు తాము అయోధ్యలో ఉండలేమని రోదించసాగిరి. తల్లులు, పిల్లలు ఏడ్వసాగిరి. మేము కూడా రామునితో పాటే అయోధ్యను వదలి అరణ్యముల కేగెదమని పలుకసాగిరి. రాముడు తల్లులను సమీపించెను. చేతులు జోడించి నమస్కరించెను.

సంవాసాత్ పరుషం కించి దజ్ఞానా దపి యత్ కృతమ్
తన్మే సముపజానీత సర్వాశ్చా మంత్ర యామి వః ॥

"తల్లులారా! కలిసి ఒకేచోట యుండుట వలన, అజ్ఞానము వలన నేను మిమ్ములను బాధపెట్టెడి కార్యములు ఏవైనా చేసియున్నచో, కఠోర వాక్కుల నుపయోగించి యున్నచో నన్ను క్షమింపుడు" అని పలికి తల్లుల పాదములకు సాష్టాంగ దండ ప్రణామ మాచరించెను. ఎందరు వారించుచుండినను వాటిని విననివాడై రాముడు అరణ్యముల కేగెను.

మరునాడు గంగాతీరము చేరెను. గంగలో స్నాన మాచరించెను. ఆ గంగా నదీ తటమున శృంగబేరపురమను గ్రామము కలదు. అచ్చట గుహుడనువాడు బోయలకు రాజై యుండెను. అతడు శ్రీరామునికి పరమమిత్రుడు. రాముని రాక నెరిగి గుహుడు పరుగిడి వచ్చి రాముని పాదములపై బడెను. రాముడు గుహుని కౌగలించుకొనెను.

"రామా! నీ దర్శన భాగ్యమగుచున్నదనెడి ఆనందములో పరుగిడి వచ్చితిని. ఫల పుష్పాదులను తీసికొని రావలెననెడి ధ్యాసే లేకపోయింది" యని దిగులు చెందుతాడు. గుహుని జూచి నవ్వుచూ రాముడు ఇలా చెబుతాడు.

పద్భ్యా మభిగమాచ్చైవ స్నేహ సందర్శనేన చ

"సఖుడా! నా కొరకు పాదములతో నడచి వచ్చితివి గదా! ఇంతకన్నా కావలసినది ఏమున్నది?" యనెను. రాముని ప్రేమ అలాంటిది.

విందు నారగించుటకై గుహుడు రాముని తన పట్టణానికి ఆహ్వానించినట్లు కొందరు చెబుతుంటారు. అది విని లక్ష్మణుడు నవ్వినాడట. రాముడు కొంత చనువు నీయగనే తన పూరిగుడిసె లోనికి రమ్మని గుహుడు ఆహ్వానించుచున్నాడు. పైగా పట్టణమని పలుకుచున్నాడు యని లక్ష్మణుడు భావించినాడని చెబుతారు.

"ప్రభూ! నేను మా గూడెంని పట్టణమని సంబోధించి నందుకు మీ తమ్ముడు నవ్వుచున్నాడు. గ్రామమునకు, పట్టణమునకు గల తేడా నాకు తెలియదని అతని భావము. నేను తెలిసియే పలుకుచున్నాను. రాము డెచ్చట యుండునో అదియే అయోధ్యా నగరమని నా భావము. రాముడు లేని అయోధ్యా నగరమే కుగ్రామమని నా అభిప్రాయము" అనెనట. సంతసించిన రాముడు "గుహుడా! నీ మాటలు నా హృదయమును పరవశింప జేసినవి. కానీ తండ్రి యాజ్ఞను పాలించు నేను ఈ పదునాలుగు వత్సరములు అడవుల యందే గడుపదలచినాను" యనెను.

శృంగబేరపురము నుండి చిత్రకూటమునకు వెడలునపుడు మార్గ మధ్యమున శ్రీరాముడు భరద్వాజుని ఆశ్రమమును సందర్శించెను. భరద్వాజుడు త్రికాలవేది. ఆ రాత్రి రాముడు భరద్వాజాశ్రమమున విశ్రమించెను. మరునాటి ఉదయాన రాముడు ప్రయాణమునకు సిద్ధమై భరద్వాజ మునిని సమీపించి, "మహాత్మా! మాకు మార్గమును తెలుపుడు. ఎటు పయనించవలెనో మాకు తెలియదు" అనెను. మార్గ మధ్యంలో రామునికి అనేకమంది ఋషులు ఎదురైనను దారి జూపుమని రాముడు ప్రశ్నింపలేదు. నేడు భరద్వాజుని యడిగెను.

భరద్వాజుని ఆశ్రమము త్రివేణీ సంగమము నందున్నది. త్రికాలముల నెరిగిన వారే కాలాతీతులు. కాలాతీతులైన వారు మాత్రమే కాలుని నోట బడకుండా జనులను రక్షింపగలరు. దారి జూపగలరు. అందుచేత రాముడు దారి తెలుపమని భరద్వాజునే అడిగెను.

అదియును గాక కొందరు భక్తిని బోధిస్తారు, జ్ఞానము నందించలేరు. మరి కొందరు జ్ఞానము నందించగలరు, కానీ హృదయములను కదలించే భక్తిని ప్రవచించలేరు. కొందరు కర్మలనే చెబుతుంటారు. ఎవరయితే కర్మ, భక్తి, జ్ఞాన యోగములను సమరసం చేసి బోధించగలరో వారే శ్రోతలను, శిష్యులను చక్కగా నడుపగలరు. ఈ యోగత్రయ సమ్మేళనమే త్రివేణీ సంగమం. అందుచేత రాముడు దారి చూపమని భరద్వాజుని యడిగెను.

భరద్వాజుడు రాముని ప్రశ్నకు నవ్వు నాపుకోలేకపోయెను. "రామా! అన్ని మార్గములు మీకు సుగ్రాహ్యామే! మిమ్ములను నమ్మిన భక్తులకు సమస్త మార్గములు సుగమమగుచుండ, మీరు మార్గమును జూపమని నన్నడుగుట నాకు పరమాశ్చర్యముగా యున్నది. మార్గము, గమ్యము, మీరే కదా!" యని నమస్కరించెను. అడిగినందులకు గాను దారి జూపమని నలుగురు శిష్యులను పంపెను.

అవును. జీవునికి మార్గంతెలిపే గురువు అవసరం. ఆ గురువు నలుగురిని దారి చూపమని పంపుతాడు. జీవుని దేవుని వద్దకు చేర్చేందుకు దారిచూపేవి నాల్గు వేదాలే కదూ!

చిత్రకూట నివాసము

శ్రీరాముడు చిత్రకూటమున నివాస మేర్పరచుకొనెను. చిత్ర విచిత్రములైన సంకల్పములను సాగించు చిత్తమే చిత్రకూటము. అజ్ఞాన స్వరూపమైన రావణుని వధించుటకు శ్రీరాముడు చిత్రకూటమున తపమాచరించెను. తపస్సు చేతనే అజ్ఞానము ఛేదింపబడవలెను. అజ్ఞానమును ఛేదింపవలెనన్నచో మనము కూడా చిత్తమనెడి చిత్రకూటము నందే వసించాలి.

అయోధ్యలో, రాముని వదలి దశరథుడు మనలేకపోయెను. తీవ్రముగా వ్యథచెందసాగెను. రాముని అరణ్యములకు పంపినందుకు రాత్రింబవళ్ళు దుఃఖించుచుండెను. పశ్చాత్తాపముతో అతని హృదయము కృంగిపోసాగెను. నేత్రములలో రామరూపమే నిలిచిపోయెను. బ్రతుకే బాధావలయ మాయెను. కన్నీటి ప్రవాహము ఎడతెగక పారుచుండెను. ఎవ్వరూ ఓదార్చలేక పోయిరి. హృదయములో రామస్మరణ సాగుచుండ, నేత్రములలో రామరూపము నిలిచియుండ, మనస్సులో రామ ధ్యానమును సాగించుచు పుణ్యాత్ముడగు దశరథుడు కన్నుమూసెను.

పగలంతయు ఏ పాపము నెరుగని వారు రాత్రులందు హాయిగా నిద్రిస్తారు. బ్రతుకంతా భగవంతుని స్మరించినవారు అంత్యకాలమున ఆత్మారాముని దర్శిస్తూ ప్రాణాలు త్యజిస్తారు. దశరథుడు పుణ్యాత్ముడు. రామస్మరణతో తన ప్రాణమును అనంత వాయువులలో లయింప జేసెను. బ్రతుకంతా మంగళకరంగా ఉంటే మృత్యువు కూడా మంగళకరంగానే ఉంటుంది.

దశరథుడు మరణించెను. అయోధ్య శోకనిలయ మాయెను. వసిష్ఠుడు, గౌతమాది మునివర్యులతో సంప్రదించి భరతుని రాజును చేయుటకు నిశ్చయించిరి. భరతుని పిలిపించిరి. భరతు డరుదెంచెను. దశరథుని మరణవార్త నాలకించి తీవ్రముగ దుఃఖించెను. తల్లిని తిరస్కరించెను.

కౌసల్యను సమీపించెను. ఆమె పాదములపైబడి బోరున విలపించెను. "తల్లీ! నా తల్లి చేసిన కుట్రలో నేను భాగస్వామినైనచో నాకు నరకమేప్రాప్తించుగాక" యని ధర్మాత్ముడగు భరతుడు విలపించెను.

"కుమారా! జరిగింది జరిగిపోయింది. మనమంతా విధిచేతిలో కీలు బొమ్మలము. అయోధ్యను పాలించవలసిన బృహత్కార్యము నీపై మున్నది" యని కౌసల్య పలికెను.

"అమ్మా! నీవు ఆ మాటను పలుకవద్దు. తండ్రిని పోగొట్టుకున్నాను. తండ్రి లాంటి అన్నను అడవుల పాల్జేసినాను. ఏ ముఖం పెట్టుకొని నేను రాజ్యమును పాలించేది? రాముడు లేని చోట నేను నిలువలేను. రామపాదాలే నాకు నివాసము" అని దుఃఖింపసాగెను. వశిష్ఠాదు లరుదెంచి భరతుని ఓదార్చిరి. భరతుడు కల్మషము నెరుగడని వర్యులూ భావించిరి. రాజ్యమును స్వీకరింపమని ప్రజలు కూడా ప్రాధేయపడిరి.

"నన్ను సింహాసనము నధిష్ఠింపుమని చెప్పుట మీకు సముచితము కాదు. ఎవరి నామము నుచ్చరించుట వలన అయోధ్యలో కీడు వాటిల్లెనో, ఎవని పట్టాభిషేక వార్త తండ్రిని పొట్టన బెట్టుకొని తల్లుల మంగళసూత్రములను హరించెనో, అట్టి అధముడనైన నన్ను మీరు చక్రవర్తిని చేయుదురా? నాలాంటి పాపి బ్రతికియుండుట చేతనే రామలక్ష్మణులకు అరణ్యవాసము ప్రాప్తించినది. నాకు కావలసింది రాజ్యము కాదు. రాముని పాదములు. నా కన్నీటితో రాముని పాదపద్మములను అభిషేకించినపుడే నా హృదయము అశాంతికి దూరమగును. మీకు నాపై ప్రేమయున్నచో నన్ననుసరింపుడు. రాముని వద్ద కేగి ఆయన పాదములనంటి ప్రార్థించి, రాముని తీసికొని వచ్చెదము" అని భరతుడు పలికెను.

మరునాడు భరతుడు చేతులు జోడించి నమస్కరించుచు, గురువులు, బంధువులు వెంట నడచుచుండగా శ్రీరాముని అయోధ్యకు తీసికొని వచ్చుటకు బయలుదేరెను. మార్గ మధ్యమున గుహుడు భరతుని దర్శించెను.

ధన్య స్త్వం న త్వయా తుల్యం పశ్యామి జగతీ తలే

"నీవు ధన్యుడవు. ఈ ప్రపంచములో నీతో సమానులు లేరు" యని గుహుడు భరతుని శ్లాఘించెను.

చిత్రకూటము సమీపించెను. భరతుడు రాముని దర్శించెను. వినమ్రుడై తన కన్నీటితో శ్రీరామ పాదములను కడిగెను. ధర్మరూపుడై, దర్పదూరుడై భరతుడు రాముని సమీపించినట్లు రామాయణము చెబుతున్నది.

ధర్మం పురస్కృత్య విధూయ దర్పమ్

"ధర్మమును ధరించెను. దర్పమును త్యజించెను." కన్నీటితో రాముని సమీపించెను.

భరతుని ద్వారా దశరథుని మరణవార్తను విని శ్రీరాముడు ఎంతగానో వ్యథ చెందెను. మందాకినీ నదిలో స్నానమాడి సోదరునితో కలసి తండ్రికి పిండప్రదానము చేసెను.

"భరతా! నీవు పురుష శ్రేష్ఠుడవు. మన తండ్రి యొక్క శుభకరమైన ప్రవర్తనము మనస్సులో దాల్చి, ప్రజల ప్రగతికై నీవు ప్రయత్నింపుము" అని రాముడనెను.

రాముని వచనముల నాలకించి భరతుడు విశ్చేష్టుడాయెను. "తండ్రీ! నీవు ధర్మజ్ఞుడవు. జ్యేష్ఠభ్రాతవు. నీవు యుండగా నేను రాజ్య భారమును వహించుట సముచితము కాదని నీకు తెలుసు. అయోధ్యకు రాజువి నీవే. దయయుంచి అయోధ్యను పాలించి మమ్ములను సంతోషపరచుము" అని భరతుడు పలికెను.

"నాయనా! భరతా! నీ ప్రేమ నా హృదయమును కదలించుచున్నది. నీవు నా ప్రాణము కంటెను ప్రియమైనవాడవు. (**ప్రాణైః ప్రియతరః**) నిన్ను సంతోష పరచలేక పోవుట నా దురదృష్టము. మన తండ్రికి ప్రాణము కన్నను మాటయే ప్రీతిగా యుండుట వలన వాక్పరిపాలనకై ప్రాణములను త్యజించెను. నా బిడ్డలు నా మాటను నిలబెట్టలేకపోయిరని

తండ్రి గారు స్వర్గంలో వ్యథ చెందే పరిస్థితిని మనం కల్పించకూడదు. వంశ ప్రతిష్ఠను కాపాడుట మన ధర్మము. నా మాట నాలకించి నీవు రాజ్యభారమును వహింపుము. కుసుమ కోమలమైన నీ హృదయమును నా కఠోర వాక్కులు గాయపరచునని నాకు తెలుసు. ఆపదలలో ఆదుకొనే సోదరుడవని చెప్పుచున్నాను. ఒకవైపు తండ్రి మాటను కాదనలేక మరొకవైపు ప్రాణ సమానమైన భరతుని హృదయమును గాయపరచలేక నీ యన్న అనుభవించే ఆవేదనను తిలకించి, ఆలోచింపుము" అని రాము డనెను.

రాముని ఆశ్రయించిన వారెవ్వరూ వట్టి చేతులతో తిరిగిపోలేదు. సుగ్రీవునికి రాము డభయ మొసగెను. ఋషుల నాశీర్వదించెను. కానీ ధర్మమునకు కట్టుబడి యుండుటచేత భరతుని సంతోషపరచలేక పోయెను. ధర్మమునకు పరీక్ష ఎదురైనచో రాముడు సమస్తమును త్యజించి ధర్మమునే వరించును.

భరతుని కోర్కె మేరకు రాముడు పాదుకల ననుగ్రహించెను. ఆర్తితో భరతునివలె ధ్యానించువారికి శ్రీరాముని చరణకమలములు లభించును. రాముని పాదుకలను భరతుడు శిరమున ధరించెను. భగవంతుని ఆశ్రయించిన భక్తులు శిరమునందు రామ పాదములనే ధరించి, ధ్యానించే అలవాటును కలిగి యుండాలి.

భరతుడు అయోధ్యకు చేరెను. రామ పాదుకలను సింహాసనముపై నుంచెను. తాను రాముని ప్రతినిధియని భావించెను. నందిగ్రామ మనుచోట ఆశ్రమము నేర్పరచుకొనెను. తానూ రాముని వలె జడలు ధరించెను. తాపస వేషమును వరించెను. సదా రామభక్తిలో రమించుచు, పాదుకలను సేవించుచు రాజ్య పాలనము చేయసాగెను. సమస్యలెదురైనచో రామపాదుకలకే విన్నవించుకొని, పరిష్కారములను పొంది, ఊరట చెందెడివాడు. రాముని రాకకై భరతుడు వేయి కళ్ళతో నిరీక్షించు చుండెను.

పంచవటీ నివాసము

భరతుని జ్ఞాపకాలు రాముని బాధింపసాగెను. ఎవరయితే రాముని సదా ధ్యానించు చుందురో వారిని పరమాత్మ కూడా స్మరించుచుండును. చిత్రకూటమును త్యజింపవలెనని రాముడు సంకల్పించెను. సీతారామలక్ష్మణులు చిత్రకూటమును వదలి అత్రిమహర్షి ఆశ్రమమున కరుదెంచిరి. అనసూయాదేవితో సీతాదేవి ముచ్చటించెను. అచ్చట నుండి వారు సుతీక్ష్ణుని ఆశ్రమమునకు పయనమైరి. సుతీక్ష్ణుడు రామచంద్రుని అర్చించెను. గురుదేవున కిచ్చిన మాటను నిలబెట్టుకొనుటకై రామచంద్రుని వెంట నడచి అగస్త్యునికి సుతీక్ష్ణుడు రామదర్శనము చేయించెను.

అటుపిమ్మట లక్ష్మణుడు గోదావరి తీరమున పంచవటిలో ఆశ్రమమును నిర్మించెను. పంచవటిలోనే రామునకు ఆపదలు ప్రారంభమాయెను. పంచవటిలో వసించు వారికి ఆపదలు తప్పవు. పంచేంద్రియములే పంచవటియని గ్రహించాలి. ఇంద్రియాలు ఎప్పుడూ

ప్రమాద భరితములే. మరొక భావమును కూడా ఇచ్చట గ్రహింపవచ్చును. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములే పంచవటి. ఈ కోశములలో చిక్కి యున్నంతవరకు జీవునకు బాధలు తప్పవు.

రావణాసురుని సహోదరి, కామరూపిణి యగు రాక్షసి శూర్పణఖ. శ్రీరాముని మోహిస్తుంది. తన మాయచే అందమైన రూపమును ధరించివస్తుంది. తనవాడు గాని రాముని వాంఛిస్తుంది. హితవచనముల నాలకించదు. మితిమీరి భాషిస్తుంది. రాముడు అంగీకరించలేదని సీతను వధించుటకు ప్రయత్నిస్తుంది. శూర్పణఖను వికృతముగా మార్చమని రాముడు లక్ష్మణునితో చెబుతాడు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులను ఖండిస్తాడు.

శూర్పణఖ ఎవరోకాదు. మనలోని కామమే శూర్పణఖ. కామము ఎప్పుడూ పైకి అందంగానే గోచరిస్తుంది. తనవిగాని వాటిని ఆశిస్తుంది. మంచిమాటను లక్ష్యపెట్టదు. విషయ సుఖాలయందు మితిమీరి చరిస్తుంది. బాధలకు గురియవుతుంది. సీత యనెడి మనస్సును రాము డనెడి ఆత్మకు దూరంచేస్తుంది. కామమును నిగ్రహింపవలెనన్నచో ఇంద్రియములను నిగ్రహించుటయే ఏకైక మార్గము. అందుచేతనే లక్ష్మణుడు శూర్పణఖ యొక్క ముక్కు చెవులను ఖండించెను.

కామము ప్రళయాగ్నివలె విజృంభించి సీత యనెడి చిత్తమును పాడుచేయుటకు ప్రయత్నించును. రాము డనెడి శుద్ధ బుద్ధి యొక్క ప్రేరణ వలన లక్ష్మణు డనెడి వివేకము కదలి, ముక్కు చెవులను ఖండించుట యనెడి ఇంద్రియ నిగ్రహము ద్వారా కామము నిగ్రహింప బడును. శూర్పణఖను వికృత మొనర్చుటలోని భావార్థ మిదియే. రాగాదులు నశించినపుడు సంసారము నివృత్తి యగును.

చిత్త మేవ హి సంసారో రాగాది క్లేశ దూషితమ్
తదేవ తై ర్వి నిర్ముక్తం భవాన్త ఇతి కథ్యతే

"రాగాదులచే కలుషితమైన చిత్తమే సంసారము. చిత్తము ఈ కాలుష్యము నుండి విముక్తి నొందగనే సంసారము నివృత్తి యగును" యని మహోపనిషత్తు తెలిపివది.

రాక్షస సంహారము

శూర్పణఖ ముక్కు చెవులు ఖండింప బడెను. **"కామాత్క్రోధో భిజాయతే"** కామము నుండి క్రోధము పుట్టును. కామము తీరని సమయాన క్రోధము తలఎత్తును. ఈ క్రోధమే ఖరుడను రాక్షసుడు. ఇతడు పదునలుగురు రాక్షసులను వెంటనిడుకొని రాముని పైకివచ్చెను. కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము యనెడి ఈ పదునాలుగు కరణములే ఆ పదునలుగురు రాక్షసులు. ఈ పదునలుగురిని వధించనిదే ఖరు డనెడి క్రోధము వధింప బడదు. ఈ విధముగా రాముడు ఖరుని ఖండించెను.

ఇప్పుడు త్రిశిరుడను రాక్షసుడు వచ్చెను. కామ క్రోధములను నిర్వీర్య మొనర్చిన తరువాత త్రిగుణము లనెడి త్రిశిరుని శ్రీరాముడు నిస్సార మొనర్చెను. త్రిగుణములు నిస్సారము కాగానే మాయ అదృశ్య మగును. త్రిశిరుడు నిస్సారమైన పిదప శ్రీరాముడు మాయ యనెడి దూషణుని ఖండించెను. ఈవిధంగా దండ కారణ్యము నందలి రాక్షసులను సంహరించి మునులకు శ్రీరాముడు అభయము నొసగెను.

రావణుని వధించుటకు శ్రీరాముడు అరణ్యమున తప మాచరించెను. అజ్ఞానమును తపస్సు ద్వారానే అంత మొందించాలి. అజ్ఞానము నంతమొందించే ముందు మాయా జనిత వికారము లన్నిటిని అదృశ్యం చేయాలి. రావణవధకు ముందు శ్రీరాముడు గావించిన రాక్షస సంహారము నందలి భావార్థ మిదియే.

వనే తస్మి న్నివసతా జనస్థాన నివాసినామ్
రక్షసాం నిహతా న్యాసన్ సహస్రాణి చతుర్దశ ॥

"దండ కారణ్యము నందు నివసించినపుడు శ్రీరాముడు జన స్థానములో నివసించు చుండిన పదునాలుగు వేలమంది రాక్షసులను సంహరించెను" యని శ్రీమద్రామాయణము నందున్నది. జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, అంతఃకరణ చతుష్టయ మనెడి పదునాలుగు ఇంద్రియములను జయించుటయే అందులోని అంతర్భావము.

సీతాపహరణము

ముక్కు చెవులను పోగొట్టుకొని పరాభవింపబడిన శూర్పణఖ రావణాసురుని రెచ్చగొడుతుంది. కామవాసనతో అజ్ఞానం రెచ్చిపోతుంది. రామునితో వైరము పెట్టుకోవాలని రావణుడు నిశ్చయించుకొనినాడు. మారీచుని సమీపించి సహకారము నర్థించగా, విశ్వామిత్ర యాగసంరక్షణ సమయాన రామబాణము యొక్క రుచి నెరిగిన మారీచుడు అందులకు అనంగీకారమును తెలుపుతాడు. రామునితో వైరము అనుచితమని చెబుతాడు. రావణుడు మారీచుని మాటల నాలకింపడు. దుర్దశ ఎదురయ్యే సమయాన మంచి మాటలు రుచింపవు. దుష్టకర్మల ఫలితాల ననుభవింపక తప్పదు గదా! ఖరుని వధించబోయే ముందు శ్రీరాముడు ఈ సత్యమునే చెబుతాడు.

నచిరాత్ ప్రాప్యతే లోకే పాపానాం కర్మణా ఫలమ్
సవిషాణా మివాన్నానాం భుక్తానాం క్షణ దాచర ॥

"ఆహారము నందు విషము కలిసి యున్నచో, దానిని భుజించిన పిదప వెంటనే ఫలమును అనుభవించవలసి యుండును. అలాగుననే ఈ లోకమున దుష్టకర్మల ఫలితములను అనుభవించవలసి యుండును."

తన చెల్లెలైన శూర్పణఖను కురూపిణిగా మార్చిన రాముని యొక్క భార్యను అపహరించి తెచ్చుట తక్షణ కర్తవ్యమని చెప్పెను. మరణించుటకు సిద్ధపడినవాడు

ఔషధమును నిరాకరించినట్లు, మారీచుని హిత వచనములను రావణుడు నిరాకరించెను. తనకు సహకరించనిచో మారీచుని వధించెదనని రావణుడు పలికెను. దుష్టుడైన రావణుని చేతిలో మరణించుటకన్నా శ్రీరాముని చేతిలో మరణించుటయే శ్రేయమని భావించి మారీచుడు రావణుని అనుసరించెను.

మారీచుడు జింక రూపమును ధరించెను. ఆ మృగ శరీరమంతయు బంగారు మణులు పొదిగి యున్నట్లు భాసించుచుండెను. సీత ఆ మృగమును చూసెను. దానిని వాంఛించెను. వద్దని రాముడు వారించినను సీత వినలేదు. లక్ష్మణుని కాపలా వుంచి శ్రీరాముడు బంగారు జింకను తరుముతూ వెళ్ళెను. జింక రూపములో వున్న మారీచుడు వన మధ్యమునకు వెళ్ళెను. రాముడు బాణమును సంధించి మారీచుని వధించెను. రావణుడు తెలిపిన విధముగా **"హా! సీతా! హా లక్ష్మణా!"** యని మారీచుడు కేకలిడి మరణించెను.

రామునకు ప్రమాదము సంభవించినదని సీత భావించెను. లక్ష్మణుని రాముని కొఱకు వెళ్ళమని సీత చెప్పెను. లక్ష్మణుడు వెళ్ళుటకు నిరాకరించెను. రామునకు ఏ ఆపద వాటిల్లదని చెప్పెను. సీత వినలేదు. లక్ష్మణుని తీవ్ర పద జాలముతో దూషించెను. అనివార్య మైనందున అగ్రజుని అన్వేషిస్తూ సుమిత్రా నందనుడు వెడలెను.

మారీచుడు మోహమునకు ప్రతీకము. మోహము మనలను మోసగించి జీవితారణ్యము మధ్యకు గొనిపోవును. దానిని పట్టి నిలుపుట బహుకష్టము. రామ నామ మనెడి బాణమును సూటిగా గురి పెడితే చాలు. వదలబడిన బాణము దాని ప్రాణములను తప్పక హరిస్తుంది.

మనకు గోచరించి, మనలను భ్రాంతికి గురిచేయు ఈ దృశ్యమాన ప్రపంచ మోహమే బంగారు జింక. మనస్సు దానిని వాంఛించును. లక్ష్మణు డనెడి వివేకము చెప్పెడి వాక్యములను కూడా విస్మరించెను. పర్యవసానముగా శాంతిని పోగొట్టుకొని విలపించును.

రామలక్ష్మణులు ఆశ్రమంలో లేరని తెలిసి రావణుడు సాధు వేషంలో వచ్చి సీతమ్మ నపహరించెను. ఈ దృశ్యమును జటాయువనెడి పక్షి చూసెను. జటాయువు రావణునితో భయంకరముగ పోరాడెను. రావణుడు ఖడ్గముచే జటాయువు రెక్కలను, కాళ్ళను ఖండించెను. జటాయువు క్రింద పడిపోయెను.

రామలక్ష్మణులు తిరిగి ఆశ్రమమునకు వచ్చిరి. సీత కనిపించలేదు. ఆమె కొరకు అన్వేషణ ప్రారంభించారు. రాముడు దుఃఖించుచు అన్వేషింప సాగెను. విలపించుచు విలోకించుచుండెను. దారి తప్పిన భక్తుల నుద్ధరించుటకై ప్రేమ స్వరూపుడైన భగవానుడు ఎంతగానో తపించును.

సీతను వెదకుచూ వెడుతున్న రామలక్ష్మణులకు జటాయువు కన్పించెను. జటాయువు మరణదశలో నుండెను. రావణుడు తన రెక్కలను విరిచి, సీతను గొని పోయినాడని పలికి, నోటినుండి రక్తము స్రవించు చుండగా, జటాయువు రాముని ఒడిలో కన్ను మూసినది.

జటాయువు పక్షి. సీత యొక్క జాడను శ్రీరామునికి తెలుపవలెనని నిశ్చయించెడి ప్రాణమును బలవంతముగా నిలబెట్టుకొని యుండినది. రామునికి విషయమును తెలిపి శ్రీరాముని పవిత్ర హస్తములలో మరణించినది. రాముని చేత కర్మ క్రియలను చేయించుకొని తరించినది. దశరథునికి లేని దివ్యావకాశమును పొందగలిగినది. జటాయువు యొక్క మరణమును గాంచి శ్రీరాముడు మిక్కిలి వ్యథ చెందెను.

రాజ్యాద్భ్రంశః వనేవాసః సీతా నష్టః హతో ద్విజః

ఈ దృశీయం మమాలక్ష్మీః నిర్దహే దపి పావకమ్ ॥

"రాజ్యము పోయినది. అరణ్య వాసము లభించినది. జటాయువు మరణించినది. నా దురదృష్టము వర్ణింప లేనిది. ఇది అగ్నిని కూడా దహించి వేయును" అని శ్రీరాముడు దుఃఖపడెను. పక్షి మరణమును కూడా తన దురదృష్టమే యని భావించు పుణ్యాత్ముడు శ్రీరాముడు.

శ్రీరాముడు జటాయువునకు స్వయముగా దహన సంస్కారము గావించెను. స్వర్గప్రాప్తిని కలిగించు పితృ సంబంధమైన మంత్రములను ఆ సమయమున శ్రీరాముడు శ్రద్ధతో పఠించెను. జటాయువు యొక్క అంత్యక్రియలను పూర్తిచేసిన పిదప శ్రీరాముడు లక్ష్మణునితో ఇలా పలికెను:

సర్వత్ర ఖలు దృశ్యన్తే సాధవో ధర్మ చారిణః

శ్శూరా శ్శరణ్యా స్సౌమిత్రే తిర్యగ్యోని గతేష్వపి ॥

"లక్ష్మణా! సాధువులు, ధర్మాత్ములు, శూరులు, శరణాగతులైన భక్తులు అన్ని చోట్ల కనిపింతురు. పశు పక్ష్యాదుల యందును ఉందురు" యనెను.

భక్త శబరి

రామలక్ష్మణులు తిరుగుతూ పంపాసరోవరము వద్దకు వస్తారు. దానికి సమీపంలో మతంగ మహర్షి ఆశ్రమము కలదు. అక్కడే శబరి నివసించుచుండును.

పవిత్రమైన భారతావనిలో ఐదు సరోవరా లున్నట్లు చెబుతుంటారు. గుజరాత్‌లో **బిందు సరోవరము** కలదు. ఇక్కడే కర్దమ మహర్షి ఆశ్రమముంది. దీనిని మాతృగయ అని కూడా అంటారు.

హిమాలయంలోని **మానస సరోవరం** రెండవది. కచ్ఛలో యున్న **నారాయణ సరోవరం** మూడవది. రాజస్థాన్ లోని **పుష్కర సరోవరం** నాల్గవది. దక్షిణ దేశంలోని **పంపా సరోవరం** ఐదవది. పంపా సరోవరమునకు సమీపమున శబరి ఆశ్రమము కలదు.

శబరి మహా భక్తురాలు. శ్రీరాముని సందర్శనమునకై నిరీక్షించినది. నిరాశలేని నిరీక్షణను సాగించినది. రామదర్శనము పొందినది. రామ సేవలో తరించినది. రామునికి భక్తితో ఫలముల నొసగినది. రామకృపకు పాత్రురాలైనది. తాను తరించి అన్యులకు

ఆదర్శమై నిలిచింది. పరమాత్మ కొఱకు చేయు నిరీక్షణ నిరాశను మిగల్చదని ఋజువు చేసింది. రామానుగ్రహమునకు పాత్రురాలై ముక్తి ధామ మలంకరించినది. శబరి భిల్లు జాతికి సంబంధించినది. కానీ సర్వ సంపూజ్యు రాలైనది.

భగవచ్చరణ ద్వంద్వ ధ్యానం నిర్ద్వన్ద్వ మీరితమ్

పాపినోపి ప్రసంగేన విహితం సుహితం పరమ్.

"పరమాత్ముని పాద ద్వంద్వములను ధ్యానించువారు ద్వంద్వాతీతు లగుదురు. పాపియైనను తరించును. ఇదియే పరమోత్కృష్టము" యని నారసింహ పురాణము.

రామ సుగ్రీవ మైత్రి

హనుమంతుడు మహాభక్తుడు. నవవ్యాకరణములను హృదయమున నిలుపుకొనిన ధీశాలి. రామపాదములను సేవించిన ధన్యాత్ముడు. రామకార్యము నందు సాహసోపేతమైన కార్యముల నాచరించిన ధీరపురుషుడు. రామానుగ్రహమునకు పాత్రుడైన పురాణ పురుషుడు. హనుమంతుని వంటి లక్షణములు గల వారే రామకార్యమునకు ఉపయోగ పడగలరు.

రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతము వద్దకు వచ్చిరి. హనుమంతుని ప్రథమంగా చూచిరి. హనుమంతుడు రామలక్ష్మణులకు నమస్కరించెను. ఆంజనేయుడు చక్కని వాక్పటిమ గలవాడు. ప్రథమ పరిచయములోనే హనుమంతుడు గొప్ప వేదవిదుడని రాముడు లక్ష్మణునితో చెప్పెను. హనుమంతుడు సుగ్రీవునకు మంత్రి. సుగ్రీవు డనగా మంచి కంఠము గల వాడని భావము. అనగా శ్రోత్రియుడు అని అర్థము. మొదట వేద స్వరూపమైన ఆంజనేయునితో పరిచయము కలిగినచో ఆ తరువాత శ్రోత్రియుడగు సుగ్రీవునితో సఖ్యము కుదురును. హనుమంతుని ద్వారా రామ సుగ్రీవులకు సమాగమ మాయెను.

సుగ్రీవుడు వాలి యొక్క సోదరుడు. వాలి సుగ్రీవుని భార్య నపహరించి అతనిని రాజ్యము నుండి బహిష్కరించెను. సుగ్రీవుడు ఋష్యమూక పర్వతమున నివసించుచుండెను. సుగ్రీవుని దీనావస్థను జూచి రాముడు కలత చెందెను.

శ్రీరాముడు తన వృత్తాంతమును సుగ్రీవునకు తెలిపెను. తనవలె రాముడు కూడా దుఃఖితుడై యున్నాడని సుగ్రీవుడు గ్రహించెను. ఇరువురి బాధలు ఒకేవిధంగా ఉన్నాయని భావించెను. తాను భార్యావియోగంతో బాధ పడుతున్నట్లే రాముడు కూడా బాధపడుచున్నాడు. తాను రాజ్యమును కోల్పోయినట్లే శ్రీరాముడు కూడా రాజ్యమును కోల్పోయినాడు. వాలిని వధిస్తే గాని తన సమస్యకు పరిష్కారం లభించదు. రావణుని వధిస్తే గాని రాముని సమస్యకు పరిష్కారం కుదరదు. ఇలా ఇరువురి సమస్యలు ఒకేవిధంగా యున్నందున సమానశీలము గలవారి మధ్య సఖ్యము ఏర్పడును గనుక రామునితో తన మైత్రి అనివార్యమని గ్రహించిన సుగ్రీవుడు అగ్ని సాక్షిగ మైత్రి చేసికొనెను.

సుగ్రీవుని దుఃఖమును జూచి రాముడు కలత చెందెను. జాలిపడెను. వాలిని వధించి సుగ్రీవుని సంతోషపెట్టుటకు నిర్ణయించు కొనెను. వాలిని వధింతునని ప్రతిజ్ఞ చేసెను. కానీ సుగ్రీవుడు సంతోష పడలేదు. వాలి యొక్క బల పరాక్రమము లెరుగకుండా రాముడు ప్రతిజ్ఞ చేయుచున్నాడని భావించెను. రాముడు తన బలమును ప్రదర్శించి సుగ్రీవునకు విశ్వాసమును కల్పించెను. సుగ్రీవుడు రామపాదముల నాశ్రయించెను. ఎవరయితే సుగ్రీవునివలె శ్రీరామ పాదముల నాశ్రయింతురో అట్టి వారికి ఎదురునిలిచి యున్న అడ్డంకులను శ్రీరాముడు తొలగించును.

శ్రీరాముని వెంట నిడుకొని వాలిని సంహరించుటకై సుగ్రీవుడు గుహవలెనున్న కిష్కింధా పట్టణము చేరెను. వాలిలోపల యుండెను. వాలిని బయటికి లాగుటకు సుగ్రీవుడు ప్రయత్నించెను. సుగ్రీవుడు బిగ్గరగా గర్జించెను.

ప్రతి మానవ హృదయము కామ పూర్ణమై, వ్యసన పంకిలమై యుండును. కామమును బహిర్గత మొనర్పవలె ననిన భగవన్నామమును ఎలుగెత్తి గానం చేయుటయే ఏకైక మార్గము. భగవన్నామము నుచ్చరింపగనే, సింహ గర్జనము నాలకించగనే గజము పరుగిడునట్లు, అంతవరకు హృదయంలో తిష్ఠవేసి యున్న కామము అదృశ్యమగును.

వాలి యనగా కామము అని అర్థము. భగవన్నామ సంకీర్తనమే సుగ్రీవుని గర్జనము. గుహవలె నున్న కిష్కింధాపురియే హృదయ గుహ. భగవన్నామము శ్రవణ పుటములలో ప్రవేశింపగనే కామము హృదయము నుండి బహిర్గత మగును.

సుగ్రీవుని గర్జనము వినగానే వాలి పైకి లేచెను. సుగ్రీవుని వధించుటకు బయలు దేరెను. భార్య యగు తార వాలిని వారించెను. భీరుడైన సుగ్రీవుడు ధైర్యోత్సాహములతో గర్జించుచున్నాడు. దీని వెనుక ఏదియో రహస్యముండి తీరవలెను. ఆలోచించుట మంచిదని వాలికి చెప్పెను. ఏ అండ లేనిదే సుగ్రీవునకు ఈ ధైర్యమెక్కడిది? యని ప్రశ్నించెను. వాలి ఆవేశపడుచుండెను. ఆవేశమును ఆపుకొని, ఆలోచనలను కదలించమని తార చెప్పెను.

సాధుః క్రోధమిమం వీర నదీ వేగ మివా గతమ్
శయనా దుత్థితః కాల్యం త్యజ భుక్త్వా మివ గతమ్ స్రజమ్

"ఓ వీరుడా! నదివలె పారలుచున్న ఆవేశ ప్రవాహము నడ్డగింపుము. రాత్రి ధరించిన పూలమాలను తెల్లవారగనే తీసివేయునట్లు ఈ కోపమును త్యజింపుము. నా మంచి మాటను హృదయమున ధరింపుము" అనెను.

"నాథా! నేను అంగదుని ద్వారా ఒక విషయము నాలకించితిని. ధర్మాత్ములు, దశరథాత్మజులైన రామలక్ష్మణులతో సుగ్రీవునకు సఖ్యము కుదిరినదట. ఆవేశ పడకుము. ఆలోచింపుము. వారి అండను జూపికొనియే సుగ్రీవుడు గర్జించుచున్నాడని నా యభిప్రాయము" అని తార చెప్పెను. వినాశకాలము ప్రాప్తించునపుడు హిత వచనములు స్తిమితమును కలిగించవు.

మనస్సులో వాలి యనెడి కామము ఆవేశమునకు గురియైనపుడు తార యనెడి బుద్ధి హితము చెప్పుచునే యుండును. తార మాటలను వాలి వినడు. మంచి మాటను మనస్సు వినదు.

వాలి సుగ్రీవుని తీవ్రముగా కొట్టెను. ఆ భయంకర ఘాతమునకు సెలయేళ్ళు పారినట్లు సుగ్రీవుని నోటి గుండా, ముక్కు గుండా రక్తము ప్రవహించసాగెను. సుగ్రీవుడు భయపడి, దీనుడై రాముని జూచెను. రాముడు బాణమును వదలి వాలిని సంహరించెను.

కామము జీవునిపై విరుచుక పడును. అట్టి విషమ పరిస్థితులలో సుగ్రీవుడు రాముని జూచినట్లు, జీవులు పరమాత్మ వైపు దృష్టిసారించాలి. దైవస్మరణ బ్రతుకులకు ధన్యతను చేకూర్చును. రాముని అనుగ్రహ బాణము సారించబడును. వెంటనే కామము హత మగును.

వాలి నేల రాలెను. రాముని కార్యము నాక్షేపించెను. రాముడు వాలికి ధర్మ సూక్ష్మములను తెలిపెను. వాలికి కనువిప్పు కలిగెను. రాజ్యము నుండి తరిమి గొట్టినను, భార్య నపహరించినను, మనస్సులో నుంచుకొనక శ్రీరాముని చేతిలో మరణించే భాగ్యమును కల్గించినందులకు వాలి సుగ్రీవునికి కృతజ్ఞతలను తెలిపెను. "అగ్రజా! నీవు కిష్కింధ నుండి నన్ను వెడల గొట్టనిచో నాకు రామ దర్శనమే గాకుండెడిది. దైవమును జూపు వారెవరైనను గురువులే. నీ మేలు ఎన్ని జన్మలకైనా తీర్చలేనిది" యని సుగ్రీవుడు వాలి పాదములపై బడెను. వాలి మరణించెను. ధర్మాచరణ గల వారికి క్షీణదశ రాదనియు, అధర్మపరులు క్షీణింపక తప్పదనియు రాముడు పలికెను.

రామాజ్ఞచే సుగ్రీవుడు కిష్కింధకు రాజయ్యెను. అంగదుడు యువరాజయ్యెను. "కార్తీకమాసము నందు రావణ సంహార విషయమును గూర్చి ఆలోచింపుము" యని రాముడు సుగ్రీవునితో పలికి లక్ష్మణునితో గూడి ప్రస్రవణగిరిమీది కేగెను.

సీతాన్వేషణము

సుందర కాండము ప్రారంభ మగుచున్నది. మనిషికి గుండె ఎంత ప్రధానమో, ఆలయానికి గర్భగుడి ఎంత ప్రధానమో, శ్రీమద్రామాయణమున సుందరకాండ అంత ప్రధానమైనది. అన్ని కాండలలోను ఇది అత్యంత అందమైన కాండమై యున్నది. రాముని బాల్యమును వర్ణించుటచేత మొదటి కాండమునకు బాలకాండము అను నామము కలిగెను. అయోధ్యాపురిలో జరిగిన విషయములను వివరించుటచేత రెండవ కాండము అయోధ్య కాండ మైనది. రాముని యొక్క అరణ్య వాసమును, అరణ్యములో జరిగిన విషయములను వివరించుటచేత మూడవ కాండము అరణ్యకాండ మాయెను. కిష్కింధా పురిలో జరిగిన విషయములను వివరించుట వలన నాల్గవ కాండము కిష్కింధాకాండ మాయెను. రామ రావణ యుద్ధమును వర్ణించుట చేత ఆరవ కాండము యుద్ధ కాండమైనది. మరి ఐదవ కాండమైన సుందరకాండ ఒక్కటియే అనూహ్యమైన రీతిలో నామమును ధరించినది. ఈ కాండమంతయు సౌందర్యవిలసితమే గనుక ఇది సుందరకాండ యని పిలువబడినది.

సీతమ్మ జాడను తెలిసికొని రమ్మని సుగ్రీవుడు వానరులకు ఆజ్ఞ యిచ్చెను. వానరులందరూ సముద్ర తీరమును చేరిరి. రావణు డెక్కడ యుండునో తెలియక ఆలోచించు చుండిరి. ఈలోగా జటాయువు యొక్క సోదరుడైన సంపాతి వచ్చెను. అతని ద్వారా రావణుని ఉనికిని వానరులు తెలిసికొనిరి. లంకను చేరుటకు ఉద్యుక్తులైరి. ఉత్సాహపడిరి. కానీ భయంకరమైన అలలతో గూడిన సాగరమును వీక్షింపగనే విఫల మనోరథులై నిలబడి పోయిరి. అప్పుడు జ్ఞానవృద్ధుడు, వయోవృద్ధుడైన జాంబవంతుడు హనుమంతుని సమీపించి, "ఆంజనేయా! నీవు బలవంతుడవు. బుద్ధిమంతుడవు. పరాక్రమశాలివి. సాగరమును దాటుటకు ఎందులకు సంశయించు చున్నావు? నీవు సునాయాసంగా సముద్రమును లంఘించగలవు. లెమ్ము, బయలుదేరుము.

ఋషీణాంచ ప్రసాదేన కపివృద్ధై మతేన చ
గురూణాం చ ప్రసాదేన సంప్లవత్వం మహార్ణవమ్

"ఋషుల యొక్క, వృద్ధులైన వానర శ్రేష్ఠుల యొక్క, గురువుల యొక్క దివ్యానుగ్రహముచేత ఈ సాగరమును నీవు అవలీలగ దాటగలవు" యని జాంబవంతుడు హనుమన్నతో పలికెను.

హనుమంతుడు బయలుదేరెను. మహేంద్ర పర్వతము నెక్కెను. తన దేహమును అమాంతంపెంచెను. తూర్పుదిక్కు తిరిగి తన తండ్రి యగు వాయుదేవునకు నమస్కరించెను. పెద్దల అనుమతితో, ఆశీస్సులతో చేసేకార్య క్రమాలు ఎప్పుడూ శుభమునే చేకూరుస్తాయి. ఎగురుటకు సిద్ధపడెను. తన పాదములతో కొండను నొక్కి పట్టెను. అలా నొక్కుట వలన గిరి చలించగా కొండపై పూచిన పూలు చెట్టునుండి రాలి కొండను చక్కగా అలంకరించెను. ఆ దృశ్యము చూచుటకు అతి సుందరముగా కన్పట్టసాగెను. అది పుష్పగిరియా అన్నట్లుండెను.

హనుమంతుడు ఎగురుటకు సిద్ధపడి వానర వీరులతో "రామబాణము ఎట్లు వాయు వేగముతో ముందుకు చనునో అదే వేగముతో నేను లంకనుజేరి తిరిగి వచ్చెదను" అనెను. ఇదియే హనుమంతుని శరణాగతి యందలి సౌందర్య విశేషము. రామబాణమునకు ఎదురులేదు. కారణమేమిటి? అది శరము యొక్క వైభవము కాదు. దాశరథి వైభవము. అలాగే తాను చేయు ఈ బృహత్కార్యము తన శక్తికి సంబంధించినది కాదనియు అది కేవలం రాముని యొక్క వైభవమే ననియు తెలిపినాడు. రామబాణమునకు వైఫల్యము లేనట్లు, తాను చేపట్టిన ఈ బృహత్కార్యము కూడా సఫలము గాక తప్పదని తెలుపు చున్నాడు. ఆధ్యాత్మిక మార్గంలో విశ్వాసమనేది చాలా అపూర్వమైన సుగుణము.

హనుమంతుడు ఎగిరెను. ఆంజనేయుని గమన వేగమునకు పెద్దపెద్ద చెట్లు కూలిపోయినవి. పక్షులు, జంతువులు నేల రాలినవి. హనుమంతుడు సముద్రమును దాటెను. ఇంతటి గొప్ప కర్మ నాచరించినను, శ్రమ ప్రయాసలకు ఓర్చి ఎగిరినను హనుమంతుడు ఇసుమంతైనను అలసిపోలేదు.

యోజనానాం శతం శ్రీ మాం స్తీర్త్వా ప్యుత్తమ విక్రమః
అనిః శ్వసన్ కపిస్తత్ర న గ్లాని మధిగచ్ఛతి

"శత యోజనముల వెడల్పుగల సాగరమును దాటినను మహాబలవంతుడగు ఆంజనేయుడు దీర్ఘశ్వాసను తీసికొనలేదు" యని సుందరకాండము తెలుపుచున్నది.

ఆంజనేయుడు సాగరమును దాటి లంకాపురి చేరెను. హనుమంతుడు రామాయణంలో ఆచార్యుడుగా తెలియబడుతాడు. జీవుని దేవునితో కలిపే ప్రయత్నము చేయు ఆచార్యుడే ఆంజనేయుడు. అతడు భవసాగరమును అనాయాసముగా దాటును. ఆంజనేయుడు లంకను జేరెను. కట్టుదిట్టమైన లంకానగరమును గాంచి వానరులు ఈ లంకను జయించగలరా? దేవతలకు సైతము ఇది సులభసాధ్యమైన పని కాదు యని తలచెను.

సాయంత్రము చీకట్లు ముసిరెను. హనుమంతుడు లంకలో ప్రవేశించెను. రావణుని సౌధమంతట తిరిగి సీతను వెదకెను. కానీ సీత జాడ తెలియలేదు. అయినను హనుమంతుడు నిరాశచెందలేదు. ఇదియే సాధకునికి ఉండవలసిన ఉత్తమ లక్షణము.

అజ్ఞాన దశయే నిశాసమయము. అట్టి దశలో జీవులందరు సుప్తులై ఉందురు. నిజమైన ముని అప్పుడే సత్యాన్వేషణమును సాగించును. ధ్యానమును కొనసాగించును.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ

"ఏదయితే జీవులకు రాత్రియో, అది సంయమ యోగికి పట్టపగలు వంటిది" యని గీతాచార్యుడు స్థితప్రజ్ఞ లక్షణములలో తెలిపియున్నాడు.

సీత జాడ తెలియలేదు. కానీ హనుమంతుడు నిరాశచెందలేదు. ద్విగుణీకృతమైన ఉత్సాహముతో సీతను అన్వేషింతును అని నిర్ణయించుకొనెను. సాధకుడైన వాడు ఎన్నడూ నిరాశావాది కాకూడదు.

తస్మా దనిర్వేదకరం యత్నం చేష్టేఽహ ముత్తమమ్
అదృష్టాంశ్చ విచేష్యామి దేశాన్ రావణ పాలితాన్

"నేను అధికోత్సాహముతో ఇంకనూ గొప్పదియైన ప్రయత్నమును చేయుదును. రావణుని ఈ లంకలో రహస్య ప్రదేశములను, ఇంత వరకు చూడని ప్రదేశములను, కూడా చూసెదను" అని ఆంజనేయుడు తనలో తాను చర్చించుకొనెను. సత్యాన్వేషణలో నిరాశ పనికిరాదు. సాధన ఫలప్రదము కానపుడు ప్రయత్నమును ఉత్సాహ పూరితంగా సాధకుడు తీవ్రతరం చేయాలి.

ఆంజనేయుడు సీతను అన్వేషించుచు అశోకవనమును చేరెను. అచ్చట రాక్షస స్త్రీల మధ్య ఆసీనురాలైయున్న ఒక సాధ్విని గాంచెను. నిరంతర ఉపవాసముల వలన ఆమె చాలా కృశించి యుండెను. ఆమెను చూడగనే ఈ సాధ్వియే సీతమ్మ అయి ఉండవచ్చునని హనుమంతుడు భావించెను. ఆమె రామ ధ్యానములో మునిగి యుండెను.

ఇంతలో రావణుడు అక్కడికి ఏతెంచుటను ఆంజనేయుడు గాంచెను. చెట్ల ఆకుల మధ్య దాగెను. రావణుడు సీతమ్మతో పలికిన కఠోర వాక్యములను ఆలకించెను. రావణుడు వెడలిన పిదప మధురమైన పలుకులతో శ్రీరామచరితమును హనుమంతుడు గాన మొనరించెను. సీతమ్మ తలనెత్తి భక్తి ప్రపత్తులతో కదలిపోవుచున్న హనుమంతుని జూచెను. రాముని కుశలమును హనుమంతునిద్వారా విని సీత ఎంతగానో సంతసించెను.

శ్రీరాము డొసగిన ఉంగరమును హనుమంతుడు సీత కిచ్చెను. దానిని గాంచి రాముని దర్శించినట్లే సీతమ్మ పరవశించెను. "తల్లీ! నీవు ధైర్యముగా యుండుము. శ్రీరాముడు గొప్ప వానర సైన్యమును వెంట బెట్టుకొని అతి శీఘ్రముగా ఇక్కడికి వచ్చి, రావణుని వధించి నీకు ఆనందమును కలిగించగలడు" అని పలికెను.

"హనుమా! నేను స్వతంత్రము లేని దానను. రామునికి సంపూర్ణ శరణాగతురాలను. రాముని యాజ్ఞ లేనిదే ప్రాణమును కూడా విడిచే హక్కు నాకు లేదు. అందుచేత బ్రతికియున్నానే గాని బ్రతుకులో రుచి గోచరించి కాదు" అని సీతమ్మ బాధా పూరిత విషయమును వివరించెను.

ఆంజనేయుని హృదయము మిగుల దుఃఖము నొందెను. పుత్ర సమానుడైన తన భుజముపై ఆసీనమైనచో జానకిని రాముని సన్నిధికి చేర్చగలనని హనుమంతుడు చెప్పెను. సీతమ్మ అందులకు అంగీకరించలేదు. అది రాముని కార్యమని పలికెను.

హనుమంతుడు జానకి నుండి సెలవు గైకొనుటకు సిద్ధపడి "అమ్మా! రామలక్ష్మణులకు ఏమి తెలియ జేయమందువో! తెలుపుము" అనెను. సీత దుఃఖము కట్టలు త్రెంచుకొని ప్రవహించుచుండ

కౌసల్యా లోక భర్తారం సుషువేయం మనస్వినీ
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ

"సుమనస్విని యగు కౌసల్యాదేవి జగత్ప్రభువగు ఏ శ్రీరాముని గనెనో ఆ రాముడు సుఖముగా నున్నాడా? యని నేనడిగినట్లు చెప్పుము" అని జానకి పలికెను.

రాముని సన్నిధి కేగుచున్న హనుమంతునకు జానకి చూడామణిని అందించి దానిని గుర్తుగా ఇవ్వమనెను. ఆంజనేయుడు దానిని గ్రహించి బయలుదేరి, సీతమ్మకు తన పరాక్రమమును చూపి ఓదార్పు నందించుటకు గాను అశోకవనము యొక్క బహిర్ద్వారమును పిండి గావించెను.

సీతాదేవి హనుమంతుని ద్వారా చూడామణిని పంపుటలో విశేషార్థమున్నది. చూడామణిని తలయందు ధరించుచుందురు. అట్టి చూడామణిని రామునకు పంపెను. ఆమె మస్తిష్కము నుండి కదలే ప్రతిసంకల్పము రామునిదై యున్నదని తెలుపుటయే అందులోని అంతర్భావము. ఇదియే అనన్య చింతనము. సంపూర్ణ శరణాగత భావము.

హనుమంతుడు అశోక వనమును ధ్వంస మొనర్పసాగెను. రావణునికి ఈ విషయము తెలిసెను. అనేక మంది రాక్షసులను పంపి హనుమంతుని పట్టి తెండని యాజ్ఞాపించెను. వారందరు హనుమంతుని చేత హతులైనారు. అప్పుడు తన చెంతనున్న ఐదుగురు సేనాధిపతులను పంపినాడు. వారే విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘనుడు, భాసకర్ణుడు. ఈ ఐదుగురు సేనాధిపతులను కూడా హనుమంతుడు వధించెను. ఆ తరువాత ఏడుగురు మంత్రి కుమారులను పంపగా వారిని కూడా ఆంజనేయుడు సంహరించెను. రావణుని కుమారుడగు అక్షుడు తండ్రి ఆజ్ఞను గైకొని, రథమునెక్కి యుద్ధమునకు బయలుదేరెను. హనుమంతుడు అక్షకుమారుని పట్టుకొని, గరుత్మంతుడు గొప్ప సర్పములను త్రిప్పినట్లు, అతనిని త్రిప్పి, భూమిపై పడవేయగా అక్షకుమారుడు మరణించెను.

ఈవార్త రావణుని కందెను. రావణుడు తీవ్రముగా కలత చెందెను. గొప్ప అస్త్రములను ప్రయోగించి హనుమంతుని పట్టితెమ్మని ఇంద్రజిత్తును పంపెను. ఇంద్రజిత్తు వెళ్ళి బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. బ్రహ్మాస్త్రమునకు నమస్కరించి హనుమంతుడు లొంగిపోయెను. హనుమంతుని పట్టుకొని వచ్చి రావణుని ముందు నిలబెట్టిరి. హనుమంతుని బ్రహ్మాస్త్రము కూడా ఏమిచేయలేదు. వాస్తవానికి తన ఇష్టాను సారమే హనుమంతుడు పట్టుబడెను. రావణుని చూచుటకొరకే హనుమంతుడు ప్రవర్తించెను. హనమంతుని బంధించి రావణుని ముందు నిలబెట్టిరి. హనుమంతుడు రాముని యొక్క పరాక్రమ వైభవమును రావణుని ఎదుట గానమొనరించెను. రావణుని దూషించెను. రాముని ఎదుర్కొనుశక్తి దేవతలకు కూడా లేదని నిర్ధారణ చేసెను.

అపకుర్వన్ హి రామస్య సాక్షాదపి పురందరః
న సుఖం ప్రాప్నుయా దన్యః కిం పునస్త్వ ద్విధోజనః

"రామునకు కీడు చేసిన సాక్షాత్తు దేవేంద్రుడు కూడా సుఖమును పొందలేడు. ఇక నీలాంటి అన్యుల, సామాన్యుల విషయమును వేరుగా చెప్పవలెనా?" యని హనుమంతుడు పలికెను.

హనుమంతుని వాక్యములు రావణునకు బాధను కలిగింపగా "ఈ వానరుని వధింపుడు" యని రావణుడు బిగ్గరగా కేకవేసెను. ఆ మాటల నాలకించి విభీషణుడు కలతచెంది, "సోదరా! రాక్షసరాజా! హనుమంతుడు తాను రామదూతనని చెప్పుకొనినాడు. దూతను వధించుట పాడిగాదు. ఇది నీ కీర్తిని భంగ మొనర్చును" అని చెప్పగానే విభీషణుని హితవచనములు రావణునికి ప్రియముగా గన్పట్టెను. "అట్లయినచో కపివరులకు అత్యంత ప్రీతికరమైన వాలమునకు నిప్పంటించుము" అని రావణుడు పలికెను.

రాక్షసులు ఆంజనేయుని తోకకు గుడ్డలు చుట్టి నిప్పంటించిరి. ఈ విషయమును వినిన జానకి శోకవదనురాలై తన బిడ్డడైన హనుమంతునికి ఏవిధమైన అపకారము జరుగకూడదని అగ్నిదేవుని ప్రార్థించెను. హనుమంతుడు పై కెగిరెను. మండుతున్న తోకను త్రిప్పుచూ లంకా నగరము నంతటిని దగ్ధమొనర్చెను. ఆ తరువాత సీతమ్మకు ప్రత్యక్షముగా ప్రణామము లర్పించి, శ్రీరాముని దర్శించుటకు ఆకాశమార్గాన ఉత్తర దిక్కుగా వాయు వేగముతో హనుమంతుడు బయలుదేరెను. హనుమంతుడు శ్రీరాముని సమీపించెను.

"దృష్టా సీతా" "సీత చూడబడెను"

అని ముక్తసరిగ చెప్పి సర్వులను ఆనందపరచెను. సీతమ్మ ఇచ్చిన చూడామణిని రామున కందించెను. రాముడు ఆ చూడామణిని హృదయానికి హత్తుకొని పిల్లవానివలె రోదించెను. ఈ చూడామణిని మహేంద్రుడు జనకమహారాజున కివ్వగా, దానిని వివాహ సందర్భమున సీతకు జనకమహారాజు ఇచ్చెను అని శ్రీరాముడు సుగ్రీవునితో చెప్పెను. "హనుమా ! జానకి మృదు వచనములు ఇంకా ఏవి పలికినది?" అని శ్రీరాముడు ఆంజనేయుని ప్రశ్నించెను.

"రాఘవా! సర్వదా సర్వకాలముల యందును వైదేహి మీ నామమునే నాలుకపై ధరించి యున్నది. తాను నెలరోజుల కన్నను ఎక్కువ కాలము బ్రతుక లేననియు, మిమ్ములను శీఘ్రముగా లంకాపురికి బయలుదేరి రమ్మని చెప్పినది;" అని హనుమంతుడనెను.

చిరంజీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి
క్షణం సౌమ్య న జీవేయం వినా తా మసి తేక్షణాం

"హనుమా! సీత మాసము రోజులు జీవించ గలుగునా? అయితే ఆమె చిరంజీవినియే. నేను సీతను చూడకుండా క్షణకాలము బ్రతుకలేను" అని రాముడు బిగ్గరగా రోదించెను.

సాగరుని శరణాగతి

సుగ్రీవునితో కలిసి శ్రీరాముడు సాగర తీరమును చేరెను. సముద్ర తీరమున మూడు రాత్రులు వసించి సాగరుని ధ్యానించెను. మూర్ఖత్వమును జోడించుకొనిన సాగరుడు రాముని ఎదుట ప్రత్యక్షము కాలేదు. సాగరుని ప్రవర్తన రాముని హృదయమును గాయపరచెను.

రాముడు తమ్ముడైన లక్ష్మణునితో "లక్ష్మణా! గర్వాతిశయముచే ఈ సాగరుడు మతిభ్రష్టుని వలె ప్రవర్తించుచున్నాడు. ఇతడు మన మంచితనమును బలహీనముగా భావించినాడు. గుణహీనులు ఎప్పుడూ మంచితనమును అసమర్థతగానే భావింతురు.

ప్రశమశ్చ క్షమా చైవ ఆర్జవం ప్రియ వాదితా
అసామర్థ్య ఫలా హ్యేతే నిర్గుణేషు సతాం గుణాః

"లక్ష్మణా! ప్రశమనము, క్షమ, ఆర్జవము, ప్రియ భాషణము అను ఈ నాలుగు సుగుణములను దుర్జనుల ఎదుట ప్రదర్శించినచో వారు అట్టి ప్రదర్శకుని అసమర్థునిగ గుర్తింతురు."

శ్రీరాముడు ఈవిధముగా పలికి కోదండమును ఎక్కుపెట్టెను. సూర్యుని వలె తీక్షణమైన శరమును ధనుస్సుపై నుంచి గురిచూసి లాగెను. వెంటనే సముద్రుడు వ్యక్తరూపుడాయెను. రామునిముందు ప్రత్యక్షమాయెను. రామునకు నమస్కరించెను. క్షమాపణమును కోరి, తరువాత తక్షణ కర్తవ్యమును రామునకు తెలియజేసెను.

"రామభద్రా! విశ్వకర్మ కుమారుడు నలుడనువాడు మీ సైన్యమునందు గలడు. అతడు వానిపై వారధిని నిర్మించగలడు. నేను ఆ వారధిని ధరించి భరింతును" అనెను. రాముని శరణు జొచ్చెను. శ్రీరాముడు సాగరునకు అభయ మొసగెను. నలుడు వానరుల సహాయముతో వారధిని చక్కగా నిర్మించెను. శ్రీరాముడు లంకాపురి చేరెను.

విభీషణుని శరణాగతి

రాముడు సాగరతీరం చేరాడు. రావణుడు లంకలో సభ నేర్పాటుచేశాడు. మంత్రులను సలహా అడిగినాడు. రాముని సైన్యాన్ని క్షణంలో మట్టుపెట్ట గలమని రాక్షసులు అతి భాషణము చేసినారు. విభీషణుడు లేచి నిలబడి "సోదరా! లంకాధీశా! మీరు శ్రద్ధతో నాలకింపుడు. రామునితో శతృత్వం వాంఛనీయము కాదు. రాముని ఎదిరించుట సాధ్యమైన పనికాదు. అతని భృత్యు డొక్కడు వచ్చి లంక నంతటిని చిందర వందర గావించెను. కుంభకర్ణుడు గాని, ఇంద్రజిత్తు గాని ఎవ్వరూ రాముని ఎదుట నిలువలేరు. జరిగిన తప్పిదమును గుర్తించి, పశ్చాత్తాపముతో రాముని శరణువేడుటయే తక్షణ కర్తవ్యమని నా అభిప్రాయము" అని పలికెను.

"దుష్టుడా! నా ఎదుట నా శతృవైన రాముని శ్లాఘిస్తావా? నీవు ద్రోహివి. వంచకుడవు. నిన్ను క్షమించకూడదు" అంటూ ఆగ్రహోదగ్రుడైన రావణుడు విభీషణుని బలంగా తన్నెను.

"సోదరా! నీవు జ్యేష్ఠభ్రాతవు. పితృ సమానుడవు. నీవు తన్నినందుకు బాధలేదు. భగవానుడగు రామునితో వైరము మంచిది కాదు. లంకాపురినంతటిని నాశమొనర్చే ఈ శతృత్వమును త్యజింపుము" అని విభీషణుడు పలికెను.

విభీషణుని వచనములు రావణునికి రుచింపలేదు. రావణుడు విభీషణుని అవమానించి లంక నుండి తరిమిగొట్టెను. లంకాపురి పతనము ప్రారంభమాయెను.

పుణ్యాత్ముడైన వానిని ఇంటి నుండి వెడల గొట్టిన వారికి శుభము లంతరించును. విదురుని దూరం చేసికొని దుర్యోధనుడు పతన మయ్యెను. విభీషణుని పోగొట్టుకొని రావణుడు మృతి చెందును. భక్తులను బాధించేవారి బ్రతుకులు శూన్యమై పోతాయి.

విభీషణుడు శరణార్థియై రాముని సమీపించెను. "రాముడు నన్ను భక్తునిగా అనుగ్రహించునా? రావణుని సోదరుడనని శంకించునా? రాక్షసుడనని నిరాకరించునా? రాముడు సర్వసాక్షి. సర్వాంతర్యామి. అతడు నా మనోభావముల నెరుగును. నన్ను అనుగ్రహించును" అని భావిస్తూ సాగరతీరమున కరుదెంచెను.

సుగ్రీవుడు విభీషణుని శంకిస్తాడు. ఆంజనేయుడు విశ్వాసాన్ని ప్రకటిస్తాడు. ఆశ్రయించిన వానిని తిరస్కరించడం నా ధర్మం కాదంటాడు శ్రీరాముడు. శ్రీరాముని కళ్యాణ గుణములలో ఆశ్రితజన రక్షణము అత్యుత్తమమైనది.

సకృ దేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ

"ఎవడు నన్ను శరణు బొందినవాడై "నేను నీ వాడను" అని నన్ను రక్షణ కోరునో, అట్టి వానిని సర్వప్రాణుల నుండి అభయమును అనుగ్రహింతును" అని శ్రీరాముడు సుగ్రీవునితో చెప్పెను.

విభీషణుడు ధర్మాత్ముడు. భక్తుడు. అందుచేత ఎంతమంది వలదన్నను వినకుండా శ్రీరాముడు విభీషణునికి అభయ మొసంగెను.

భగవానుడు అంతర్యామి. మన మనస్సులో జరుగు ప్రతివిషయము ఆయనకు తెలియును. ప్రపంచము త్యజించినను భక్తులను పరమాత్మ కనికరించును. ఆశీర్వదించును. విభీషణుని వంటి ఉత్తమభక్తిని ఎవరు కల్గియుందురో వారు రామానుగ్రహమునకు పాత్రులై తరింతురు.

రామ రావణ సంగ్రామము

రామాజ్ఞచే అంగదుడు రావణుని వద్దకు రాయబారిగా వెళ్ళెను. రాముని శరణు వేడుటయో, లేక రాక్షస సమూహ వినాశమో, ఈ రెండింటిలో ఏది శ్రేయమో నిర్ణయించు కొనుమని అంగదుడు చెప్పెను. దుర్బుద్ధి యగు రావణుడు అంగదుని వధించమనెను. అంగదుడు వారికి దొరకకుండా పక్షివలె ఎగిరివచ్చి శ్రీరాముని వద్ద నిలిచెను.

రామ రావణ సంగ్రామము ప్రారంభమాయెను. రావణుని సైన్యంలో అనేకమంది రాక్షసులు వధించబడిరి. ఇంద్రజిత్తు రథమును అంగదుడు శిథిల మొనర్చెను. ఇంద్రజిత్తు గొప్పవిదైన శరములను ప్రయోగించి రామలక్ష్మణులను గాయపరచెను.

కుంభకర్ణుడు రావణుని సోదరుడు. దీర్ఘతపస్సు చేసి బ్రహ్మదేవుని సాక్షాత్కరించుకొనెను. దీర్ఘనిద్ర ననుభవించునట్లు వరమును పొందెను. దురదృష్ట వంతుల కోర్కెలు బహు విచిత్రముగా యుండును.

మనలోని తమోగుణమే కుంభకర్ణుడు. తమోగుణ ప్రేరితుడు సదా నిద్రించుచునే యుండును. శ్రీరాముడు కుంభకర్ణుని వధించెను. శుద్ధసత్త్వ మనెడి రామునిచే తమోగుణ మనెడి కుంభకర్ణుడు వధింప బడవలెను.

కుంభకర్ణునితో పాటు ఇంద్రజిత్తు కూడా మరణించెను. ఇంద్రజిత్తు గొప్పవీరుడు. అట్టి వీరుని ఇంద్రియజిత్తుయైన లక్ష్మణుడు సంహరించెను. సంయమిముందు యముడుకూడా తలవంచక తప్పదు.

రామ రావణ యుద్ధము ప్రారంభమాయెను. రావణుని వధించుటకు రాముడు నిర్ణయించు కొనెను. పరమాత్మ నిర్ణయము చేసిన తరువాత ఆదుకొనే వారెవరుంటారు?

య దీంద్ర వైవస్వత భాస్కరాన్ వా స్వయంభు వైశ్వానర శంకరాన్ వా
గమిష్యసి త్వం దశధా దిశోవా తథాసి మే నాద్యగతో విమోక్ష్యసే

"రావణా! నీవు మహేంద్రుడు, యముడు, ఆదిత్యుని వద్ద కెళ్ళినను, లేదా బ్రహ్మదేవుడు, వైశ్వానరుడు, శంకరాదుల సమీపమునకు వెళ్ళినను, లేక ఏ దిక్కునకు పారిపోయినను నా నుండి నిన్ను ఎవ్వరూ కాపాడలేరు" అని రాముడు పలికెను.

రాముడు రావణునిపై బాణవర్షమును కురిపించెను. రావణుని రథమును కుప్పగూల్చెను. గుఱ్ఱములు క్రిందపడి పోయెను. ధ్వజము నేల కొరిగెను. రావణుని

రథము కూలిపోగా అతని బాణము కూడా ముక్కలై క్రిందపడెను. రావణుని కిరీటము క్రిందపడెను. ఆ సమయమున రావణుడు వాడిన సుమమువలె, అస్తమించు సూర్యునివలె గోచరించెను. నిస్సహాయ స్థితిలో నిలబడియున్న రావణుని జూచి రాముడిట్లు పలికెను.

"రావణా! నీవు యుద్ధమున అలసిపోయితివి. కనుక లంకాపురికెళ్ళి విశ్రాంతి తీసికొనుము. నూతన రథమును, ధనుస్సును తీసికొని రేపు రమ్ము. నా యొక్క పరాక్రమమును తిరిగి వీక్షింపుము" అని పలికెను.

ఆహా! ఏమి ఔదార్యము! ఇది రాముని యొక్క శీలవైభవమును చాటుతున్నది. ఇచ్చట రాముడు ఆదర్శ శత్రువుగా తెలియబడుచున్నాడు.

మరునాడు యుద్ధము ప్రారంభమాయెను. రావణుడు బాణములను తీవ్రముగా వదలెను. అయినా రాముడు చలించలేదు. రావణునిపై శర పరంపరలను గురిపించుచు రాముడు అలసి పోవుచుండుటను అగస్త్యమహర్షి గాంచెను. రాముని సమీపించెను. "రామా! అతి రహస్యమైనదియు, వైభవోపేతమైనదియు నగు స్తోత్రమును నీకు వినిపించెదను. ఆలకింపుము. ఈ స్తోత్రము శత్రువులను సంహరించుటకు ఉపయోగ పడును. అదియే ఆదిత్య హృదయము" అని చెప్పి శ్రీరామునకు ఆ స్తోత్రమును వినిపించెను.

ఆదిత్య హృదయమును పఠించగనే అలసట అదృశ్యమాయెను. ఉత్సాహము ఇనుమడించెను. సూర్యభగవానుడు శ్రీరాముని ఆశీర్వదించెను.

రామ రావణులు భయంకరముగ శరములను ప్రయోగించసాగిరి. ఇంతలో మాతలి శ్రీరాముని సమీపించెను. బ్రహ్మాస్త్రమును ప్రయోగింపుమని తెలిపెను. శ్రీరాముడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. అది భయంకరమైన రీతిలో ముందుకు దూసుకువెళ్ళి దశకంఠుని వధించి, తిరిగి వచ్చి అమ్ముల పొదిలో చేరెను. రావణుడు మరణించెను. దేవతలు పుష్ప వృష్టిని కురిపించిరి. రావణునికి ప్రేతకర్మమును చేయుటకు విభీషణుడు నిరాకరించెను. శ్రీరాముడు విభీషణునికి నచ్చజెప్పి అతనిచేత ప్రేతకర్మ జరిపించెను.

సీత రాముని వద్దకు గొని రాబడెను. రాముడు సీతను చూడలేదు. రావణుని రాజ్యంలో ఇంతకాలము వసించిన సీతను గ్రహించుట జనులకు సమ్మతము కాదేమోనని భావించెను. శ్రీరాముని విముఖతను గాంచి వైదేహి విలపించెను. ఆమెకు తరుణోపాయము తెలిసి రాదాయెను. "లక్ష్మణా! చితి రగిలింపుము" యని సీత పలికెను. పెద్దల మాటను నిరాకరించలేని లక్ష్మణుడు చితిని రగిలించెను. సీత చేతులు జోడించి అగ్నిదేవునకు నమస్కరించెను.

యథా మే హృదయం నిత్యం నావ సర్పతి రాఘవాత్
తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః

"నా హృదయము శ్రీరాముని నుండి క్షణమైనను దూరము గాకుండా యుండినది సత్యమైనచో లోక సాక్షియగు అగ్నిదేవుడు నన్ను అన్నివిధముల రక్షించుగాక!" యని అగ్నికి

ప్రశాంతముగ అగ్నిలో ప్రవేశించెను. చూస్తుండగనే అగ్నిదేవుడు నమస్కరించుచు సీతమ్మ ప్రశాంతముగ అగ్నిలో ప్రవేశించెను. చూస్తుండగనే అగ్నిదేవుడు
సీతమ్మను తన ఒడిలో కూర్చుండ బెట్టుకొని రాముని ముందు వ్యక్త మయ్యెను.

అబ్రవీత్ తు తదా రామం సాక్షీ లోకస్య పావకః
ఏషాతే రామ వైదేహీ పాపమస్యాం న విద్యతే

సర్వలోకసాక్షియగు అగ్నిదేవుడు శ్రీరామునితో ఇలాపలికెను: "రామచంద్రా! ఈమె నీ భార్యయు, జనక పుత్రిక యగు సీతాదేవి. ఏ పాపము తెలియని పుణ్యశీల" యనెను.

వెంటనే శ్రీరాముడు అమితానందభరితుడై, "సీత యొక్క మనస్సు సదా నాయందే యుండును" అని అప్రయత్నముగా అనెను.

అనన్య హృదయాం సీతాం మచ్చిత్త పరిరక్షణీమ్
అహమప్య వ గచ్ఛామి మైథిలీం జనకాత్మజామ్

"విదేహ రాజకుమారియగు సీత హృదయము సదా నా యందే యుండునని నాకు తెలియును. ఆమె అన్యవిషయ చింతనము నెరుగదని నాకు తెలియును. నా మాట ననుసరించియే జీవించుచుండును" అని రాముడు పలికెను.

సీత యొక్క శీలమును రాముడు శంకించలేదు. ఇతరులను దృష్టిలో ఉంచుకొని, సీతాదేవి ఖ్యాతిని ఇనుమడింప జేయుటకే రాముడలా ప్రవర్తించెను.

రావణుడు మరణించెను. ఇచ్చిన మాటను నిలబెట్టుకొనుచు విభీషణుని శ్రీరాముడు అభిషిక్తుని గావించెను. కుబేర వాహనమైన పుష్పక విమానముపై సుగ్రీవ విభీషణులతో కూడి రాముడు బయలు దేరెను. మార్గమధ్యమున భరద్వాజ మహర్షి ఆశ్రమమును సందర్శించెను.

సోదరుని వియోగ బాధను భరించలేక, కృశించిన దేహముతో భరతుడు దుఃఖించు చుండెను. శ్రీరాముడు సకాలమునకు విచ్చేసి, భరతుని ప్రాణములను కాపాడెను. తన నాశ్రయించు వారలను రాముడు సదా కాపాడుచునే యుండును.

అయోధ్యాపురిలో రత్నఖచిత సింహాసనముపై శ్రీరాముడు ఆసీనుడై యుండెను. భక్తుల హృదయమే అయోధ్య. సత్యము, అహింస, బ్రహ్మచర్యాది రత్నములతో ఏ భక్తుని హృదయము శోభించుచుండునో అదియే శ్రీరామచంద్రుని సింహాసనము. ప్రతి హృదయము రామునికి సింహాసనము కావాలి. సీత యనెడి మనస్సు రాము డనెడి పరమాత్మతో అయోధ్య యనెడి హృదయములో కలసి కరిగి పోవుటయే పట్టాభిషేకము.

రామ రాజ్యములో ప్రజలు ఆనందయాత్ర గడుపు చుండిరి. పంటలు సమృద్ధిగ యుండెను. వర్షములు సకాలమునకు గురియుచుండెను. అనారోగ్యముతో, రోగములతో బాధపడువారు లేకుండిరి. ధర్మము చతుష్పాదములతో చరించుచుండెను. వైధవ్యము తెలియకుండెను. సర్పభయము లేకుండెను. చోరభయము తెలియదాయెను. బాలురకు మృత్యువు ప్రాప్తించకుండెను. దీర్ఘ ఆయువుతో, సంతృప్తికరమైన సంతానముతో ప్రజలు ఆనంద యాత్రను గడుపసాగిరి.

పరశురాముని చరిత్రము

రాముని చరిత్రము ముగిసిన పిమ్మట శుకబ్రహ్మ వంశానువర్ణనము గావించి ఇప్పుడు పరశురాముని జన్మ వృత్తాంతము నెరింగించుచున్నాడు.

జమదగ్ని రేణుకల కనిష్ఠ పుత్రుడు పరశురాముడు. ఇతడు ఇరువది యొక్క సార్లు క్షత్రియ శూన్యము చేసెను. రజస్తమో గుణములతో కూడినవారు, గర్వితులు యైన క్షత్రియరాజులను పరశురాముడు వధించెను.

"మహాత్మా! క్షత్రియులను ఆ విధంగా సంహరించుటకు వారు అతనికి చేసిన అపరాధమేమి?" యని పరీక్షిత్తుడు శుకబ్రహ్మ నడిగెను. శుకబ్రహ్మ కారణమును చెప్పెను.

ఒకనాడు కార్తవీర్యార్జునుడు అరణ్యములో వేటాడుతూ జమదగ్ని ఆశ్రమమునకు వచ్చెను. జమదగ్ని చతురంగ బలముతో వచ్చిన కార్తవీర్యార్జునునికి కామధేనువు ద్వారా ఆతిథ్యము నొసగెను. తన సంపద కంటెను శ్రేష్ఠమైన ఈ కామధేనువును కార్తవీర్యార్జునుడు వాంఛించెను. గర్వితుడైన రాజు అనుచరుల ద్వారా దాని నపహరించుటకు యత్నించెను. వారు బలవంతముగా దూడతో కూడిన ధేనువును మహిష్మతీ పురమునకు తీసికొని పోయిరి.

పరశురాముడు ఆశ్రమమునకు వచ్చెను. జరిగిన విషయమును గ్రహించెను. దెబ్బ తినిన పామువలె క్రుద్ధుడయ్యెను. భయంకరమగు గొడ్డలిని, కవచమును, ధనుర్బాణములను చేబూని అర్జునుని వెంట బడెను. అర్జునుడు రాముని ఓడించుటకు పదునే డక్షౌహిణుల సేనను పంపెను. రాముడు తన దైవబలముచే ఖండించెను. క్రుద్ధుడైన అర్జునుడు తానే యుద్ధమునకు వచ్చెను. పరశురాముడు పరశువును చేబూని కార్తవీర్యార్జునుని భుజములను ఖండించెను. బాహువులు తెగి కొండ శిఖరమువలె నున్న కార్తవీర్యార్జునుని తలను ఖండించెను. ధేనువును తీసికొని పరశురాముడు ఆశ్రమమున కరుదెంచెను. జరిగిన విషయము నెరిగిన జమదగ్ని పశ్చాత్తాప హృదయుడై, "కుమారా! చాలాపొరపాటు చేసితివి. మనము క్షమాగుణము చూపవలసిన బ్రాహ్మణులము. ఇలా వధించుట సముచితము కాదు. రాజును వధించుట పాపము. ఈ పాపమును తీర్థాటనము ద్వారా, అచ్యుతుని భజించుట ద్వారా పోగొట్టుకొనుము" యని తెలిపెను.

పరశురాముడు సంవత్సరకాలము తీర్థాటన గావించి తిరిగి వచ్చెను. ఒకనాడు జమదగ్ని పత్నియగు రేణుక జలమును తెచ్చుటకై గంగకు వెడలెను. అచ్చట అప్సరసలతో జలకమాడు గంధర్వరాజగు పద్మమాలిని గాంచి మోహవశురాలయ్యెను. ఆలస్యముగా ఆశ్రమమునకు వచ్చెను. తన భార్య యొక్క పతనావస్థను గ్రహించిన జమదగ్ని క్రుద్ధుడై కుమారులను పిలిచి రేణుకను వధింపుమనెను. కానీ వారు అలా చేయలేక పోయిరి.

జమదగ్ని పరశురాముని పిలిచెను. పతితయైన తల్లిని, తన యాజ్ఞ నుల్లంఘించిన సోదరులను వధింపుమని చెప్పెను. తండ్రి యొక్క కోప, శాప వైభవముల నెఱిగిన పరశురాముడు రేణుకతో పాటు తన సోదరులను గూడా వధించెను. తనయుని కార్యమును గాంచి తృప్తిచెందిన జమదగ్ని వరమును కోరుకొమ్మని చెప్పెను. పరశురాముడు ఈ అవకాశమును వినియోగించు కొనెను. హతులైన తల్లి, సోదరులు పునర్జీవితులు కావలె ననియు, జీవించిన పిదప తాను సంహరించిన విషయము వారికి విస్మృతి కలుగవలె ననియు ప్రార్థించెను. అలాగే జరిగెను.

కార్తవీర్యార్జునుని పుత్రులు అశాంతితో అలమటించసాగిరి. తమ తండ్రి మరణము వారిని కృంగదీయుచుండెను. ఒకనాడు పరశురాముడు సోదరులతో కలసి అరణ్యమునకు వెడలి యుండెను. అర్జునుని పుత్రులు ఇది సదవకాశమని భావించి ఆశ్రమమునకు వచ్చిరి. అగ్నిహోత్రుని ముందు ఆసీనుడై యున్న ఉత్తమ శ్లోకుడగు జమదగ్నిని వధించిరి. రేణుక వారించుచున్నను వారు వినలేదు. రేణుక ఆర్తనాదము చేయుచు విలపించెను.

అర్జునుని పుత్రులు పారిపోయిరి. తండ్రి దేహమును పరశురాముడు సోదరుల కప్పగించి పరశువును చేబూని క్షత్రియులను వధించుటకు బయలుదేరెను. అర్జున పుత్రుల మస్తకములను ప్రోగు వేసెను.

పరశురాముడు ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. తన తండ్రి తలను మొండెమునకు జత చేసెను. దర్భలపై నుంచి వాయుదేవుని పూజించెను. ఇలా పరశురామునిచే పూజింపబడిన జమదగ్ని సప్తర్షి మండలమున ఋషియై వర్ధిల్లెను.

శ్రీరాముడు శివధనుస్సును ఎక్కుపెట్టి జానకిని పరిణయ మాడెను. అది తెలిసి జమదగ్ని కుమారుడైన పరశురాముడు శ్రీరామునికి ఎదురు వచ్చి నిలచెను. తన ధనుస్సును ఎక్కుపెట్ట మనెను. రామచంద్రుడు దానిని కూడా అతి తేలికగా ఎక్కుపెట్ట గలిగెను. దానితో పరశురాముడు నిర్వీర్యుడాయెను. రాముని అనంత పరాక్రమమును వీక్షించి అచ్చెరు వొందిన పరశురాముడు శ్రీరాముని స్తుతించెను.

అక్షయ్యం మధుహన్తారం జానామి త్వాం సురేశ్వరమ్
ధనుషోఽస్య పరామర్శాత్ స్వస్తి తేఽస్తు పరంతప

"రామచంద్రా! ఈ ధనుస్సును ఎక్కుపెట్టుట వలన నీవు సురేశ్వరుడవని, అవ్యయుడవని, మధుసూదనుడవని, శ్రీమహావిష్ణువని గ్రహించితిని. శత్రువులను సంహరించు ఓ రామా! నీకు నమస్కారము" యనెను.

యయాతి చరిత్రము

ఆవేశము అనర్థదాయకము. పాముకు రెండు కోఱలుండును. ఆ కోఱల యందే విషముండును. అనర్థదాయకమైన ఆవేశ సర్పమునకు కామము, క్రోధ మనెడి రెండు కోఱలుండును. ఈ రెండింటి విషయములో సాధకుడు జాగరూకుడై మెలగాలి.

క్రోధావేశమున నిహతులైన దురదృష్ట వంతులను పరశురాముని చరిత్రములో జూచితిమి. కామావేశమునకు బలైన వారిని ఈ యయాతి చరిత్రములో చూడగలము.

వృషపర్వునికి శర్మిష్ఠ యను పుత్రిక గలదు. ఆమె వేయిమంది చెలికత్తెలతో గూడి ఉద్యానవనమున విహరించు చుండెను. అచ్చట ఒక జలాశయ ముండెను. శర్మిష్ఠ చెలులతో ఆనందముగా జలకమాడుచుండెను. వీరితోపాటు గురుపుత్రిక యగు దేవయాని కూడా యుండెను. దేవయాని శుక్రాచార్యుని దుహిత.

పరస్పరము జలమును చల్లుకొనుచు వారు విహరించు చుండిరి. అదే సమయానికి పరమేశ్వరుడు పార్వతితో గూడి వృషభారూఢుడై గగనమున విహరించు చుండుటను గాంచి సిగ్గుతో భీతిచెందిన కన్యలు గట్టుమీదికి వచ్చి తొందరగా వస్త్రములను ధరించిరి.

తొందరలో దేవయాని వస్త్రములను శర్మిష్ఠ ధరించెను. దేవయానికి కోపము వచ్చెను. "యజ్ఞహవిస్సును కుక్క స్పృశించినట్లు నీవు నా వస్త్రములను స్పృశించితివి. మేము బ్రాహ్మణులము. పైగా భృగు వంశమునకు చెందినవారము. మీ తండ్రియగు వృషపర్వుడు మాకు శిష్యుడు. అయినను దుష్టబుద్ధి గలదానవై నా వస్త్రములను ధరించితివి" యని నిందించెను.

దేవయాని మాటలకు శర్మిష్ఠ క్రుద్ధురాలయ్యెను. "నీవు బిచ్చగత్తెవు. అనవసరముగా వాగకు. నీవు కుక్కవలె మా ఇంటి నాశ్రయించి బ్రతుకుచున్నావు" యని పలికి క్రోధావేశంలో ఆమె వస్త్రములను లాగికొని, దేవయానిని బావిలో పడవేసెను. శర్మిష్ఠ ఇంటికి వెళ్ళెను.

వేటకై వచ్చిన యయాతి దప్పికగొన్నవాడై బావివద్దకు వచ్చెను. దేవయాని నగ్నముగా బావిలోపడి యుండుటను గాంచి, కృపావశుడై ఆమెకు తన ఉత్తరీయము నొసగి, చేయి నందించి బావినుండి పైకి దీసెను.

"రాజా! కృతజ్ఞురాలను. నీవు నన్ను రక్షించితివి. పైగా నా చేయిని పట్టుకొంటివి. నీవు పట్టుకొనిన నా చేయి వేరే పురుషుని హస్తమును పట్టుకోదు. నన్ను అర్ధాంగిగా స్వీకరింపుము. ఇది ఈశ్వర సంకల్పము" అని దేవయాని పలికెను. యయాతి ఆమె కోర్కె నంగీకరించెను.

దేవయాని ఇంటికి వెడలెను. తనకు జరిగిన ఘోరవిపత్తును గూర్చి తండ్రి కెరిగించెను. శుక్రాచార్యుడు కోపోద్రిక్తు డయ్యెను. ఈ విషయమును తెలిసికొనిన వృష పర్వుడు శుక్రాచార్యుని పాదములపైబడి క్షమాభిక్ష నర్థించెను. దేవయావి కోర్కె నమసరించి శర్మిష్ఠ తన వేయిమంది సఖులతో దేవయానికి దాసిగా యుండునట్లు వృషపర్వుడు అంగీకరించెను.

దేవయానీ యయాతి మహారాజుల వివాహము వైభవముగా జరిగెను. శుక్రాచార్యుడు యయాతితో "నీవు శర్మిష్ఠతో సఖ్యము చేయరా" దని చెప్పెను.

దేవయానికి సంతానము కలిగెను. తాను సంతానవతి కావలెనని శర్మిష్ఠకు కోరిక కలిగెను. యయాతిని సమీపించెను. తన మనోరథమును తీర్చుమని అడిగెను.

శుక్రాచార్యుని మాట స్మృతిలో మెదలుచున్నను యయాతి శర్మిష్ఠను నిరాకరించలేదు. శర్మిష్ఠ కూడా సంతానవతి ఆయెను.

ఈ విషయము నెరిగిన దేవయాని భర్తపై కోపించి పుట్టినింటికి వెళ్ళెను. శుక్రాచార్యుడు క్రుద్ధుడాయెను. అన్యాయముగా వర్తించిన యయాతికి ముసలితనము ప్రాప్తించునట్లు శపించెను. యయాతి గురువును ప్రార్థించగా, "ఎవరైనను నీ జరను గ్రహించి వారి యౌవనమును నీకివ్వ గలిగినచో నీవు యౌవనమును పొందెదవు" అని శుక్రాచార్యుడు పలికెను.

యయాతి తన పుత్రులగు యదువు, తుర్వసుడు, ద్రుహ్యుడు, అనువును సమీపించి తన వార్థక్యమును స్వీకరించి, వారి యౌవనము నివ్వమని కోరెను. అలా ఇచ్చుటకు వారు నిరాకరించిరి.

యయాతి తన కుమారులలో చిన్నవాడు, బుద్ధిలో పెద్దవాడునగు పూరునితో తన అభీష్టమును చెప్పెను. పూరుడు ఇలా పలికెను:

"నరశ్రేష్ఠుడా! పరమేశ్వరుని పొందుటకు సాధనమైన ఈ దేహము ఎవరి వలన లభించెనో, అట్టి తండ్రికి ప్రత్యుపకారమును చేయుటకన్నా శ్రేష్ఠమైన విషయము మరియొకటుండునా? మీ కోర్కెను నా భాగ్యముగా తలచెదను. ఈ అవకాశమును వినియోగించుకొందును.

ఉత్తమ శ్చిన్తితం కుర్యాత్ ప్రోక్తకారీ తు మధ్యమః
అధమోఽశ్రద్ధయా కుర్యాదకర్తో చ్చరితం పితుః

"తండ్రి యొక్క మనోభిప్రాయమును తీర్చు పుత్రుడు ఉత్తముడు. తండ్రి మాటను పాలించు పుత్రుడు మధ్యముడు. తండ్రి మాటను అశ్రద్ధ చేయువాడు అధముడు. పాలించని వాడు తండ్రి యొక్క పురీషము వంటివాడు" అని పలికిన పూరుడు ఆనంద పూర్ణ చిత్తుడై తండ్రి యొక్క ముసలితనమును స్వీకరించెను.

పూరువు యొక్క యౌవనమును గ్రహించిన యయాతి కొన్ని వేల సంవత్సరములు విచిత్ర భోగముల ననుభవించెను. కానీ తృప్తి తీరలేదు. హృదయం శాంతించ లేదు. కామము అతి భయంకరమైనది. కామ వాంఛలు తృప్తి పడవు. కామమును నిగ్రహించుట యనునది నేయిద్వారా అగ్నిని ఆర్పుటకు చేయు ప్రయత్నము వంటిది. కామముద్వారా తృప్తి చెంద యత్నించువాడు నరకద్వారము నైపు నడచువాడే కాగలడు.

మాంసా సృక్పూయ విణ్మూత్ర స్నాయు మజ్జాస్థి సంహతౌ
దేహే చేత్ప్రీతిమా న్మూఢో భవితా నరకేఽ పి సః

"మాంసము, రక్తము, మల మూత్రములు, నరములు, మజ్జ, శల్యములు మొదలైన వాటితో గూడిన దేహము నందు ప్రీతిగల మనుజుడు నరకము నందు ప్రీతి గలవాడే యగుచున్నాడు" యని నారద పరివ్రాజకోపనిషత్తు ప్రవచించినది.

యయాతి భార్యను సమీపించి విరాగముతో ఇలా పలికెను: "దేవీ! వేయి సంవత్సరములు విషయముల ననుభవించినను నాకు తృప్తి తీరుట లేదు. తృష్ణ ప్రతి దిన

వర్ధమానమగు చున్నది. కాముకుడైన వానికి ప్రపంచములో మరి యొకటి రుచింపదు. ఇంద్రియములు ప్రమాదకరములు. అవి విపరీతముగ మోసగించును.

మాత్రా స్వస్రా దుహిత్రా వా నావివిక్తాసనో భవేత్
బలవా నిన్ద్రియ గ్రామో విద్వాంస మపి కర్షతి

"తల్లితోను, సోదరితోను, కుమార్తెతోను కలసి ఒకే ఆసనముపై కూర్చుండ రాదు. బలవంతములైన ఇంద్రియములు విద్వాంసుడైన వానిని గూడా ఆకర్షించును.

"దేవీ! అనిత్యములైన భోగములను త్యజించుటయే ఉత్తమము. అట్టివారే ఆత్మను దర్శింతురు" అని పలికి యౌవనమును తిరిగి బిడ్డడైన పూరున కిచ్చి, అతని నుండి తన ముసలితనమును గ్రహించెను. పూరుని అభిషేకించి తాను తపస్సుకై వనముల కేగెను.

ఆసేవితం వర్ష పూగాన్ షడ్వర్గం విషయేషు సః
క్షణేన ముముచే నీడం జాత పక్ష ఇవ ద్విజః

"పరీక్షిన్మహారాజా! యయాతి బహు వత్సరములు విషయముల ననుభవించెను. రెక్కలు రాగానే పక్షిపిల్ల గూడును విడచునట్లు యయాతి మహారాజు ఇంద్రియ సుఖములను క్షణములో విడచెను.

"యయాతి వనములలో చరిస్తూ, పరమాత్మను ధ్యానిస్తూ, ఆత్మైక్యము నొందెను. దేవయాని కూడా ఆలోచించెను. ఇచ్చట కుటుంబము తోడి స్నేహము అనిత్య మైనదని గ్రహించెను. భర్తతో, పుత్రులతోడి సంబంధము మాయారూపమని భావించెను. చలివేంద్రర వద్ద బాటసారులు కలియుట వంటిదని చింతించెను. తాను సర్వమును త్యజించెను. శ్రీహరి యందే మనస్సు నిలిపి తరించెను" అని పలికి శుకబ్రహ్మ రెండు నిముషములు అంతర్ముఖుడై, అటు పిమ్మట కళ్ళు తెరచి వాసుదేవ పరబ్రహ్మమును స్తుతించెను.

నమస్తుభ్యం భగవతే వాసుదేవాయ వేధసే
సర్వ భూతాధి వాసాయ శాంతాయ బృహతే నమః

"సర్వ భూతములందు వసించువాడును, శాంతుడును, పురాతనుడును, బ్రహ్మమైన వాడు నగు వాసుదేవునకు నమస్కరించుచున్నాను" యనెను.

రంతిదేవుని చరిత్రము

రంతిదేవు డొక మహారాజు. ఆయన సర్వ సంపదలను ఇతరులకు దానము చేసెను. తనకంటూ ఏమి మిగలకుండా చేసికొనెను. ధైర్యవంతుడై లభించిన దానితో తృప్తిచెందు చుండెను. వరించి వచ్చిన సంపదలను విడచి ఆపదలను వరించిన మహిమాన్వితుడు.

ఒకసారి ఆ దేశంలో తీవ్రమైన క్షామం సంభవించింది. నలభై యెనిమిది రోజుల పాటు రంతిదేవునికి ఆహారము లభించలేదు. అయినను ఆయనకు భగవంతునిపై యుండెడి అకుంఠిత విశ్వాసము సన్నగిల్లలేదు.

ఒకవాడు అనుకోకుండా ఆ దివ్యాత్మునకు నేయి, పాయసము, జలము లభించినవి. అవి గ్రహించి ప్రాణాన్ని నిలుపుకుందామని రంతిదేవుడు ఆలోచించుచుండగా ఆయన ఇంటికి ఒక అతిథి వచ్చెను.

అతిథిని నారాయణ స్వరూపముగ భావించు రంతిదేవుడు తన ఆహారములో సగ భాగమును అతనికి సమర్పించెను. అతడు భుజించి వెళ్ళెను. ఇంతలో మరియొక సేవకు డరుదెంచెను. ఆకలిగా యున్నదని పలుకగా మిగిలిన ఆహారములో సగ భాగము రంతిదేవుడు ఆ సేవకున కొసగెను.

అతి స్వల్పంగా మిగిలి యున్న ఆహారము భుజించెదమని భార్యా పుత్రులతో కలసి రంతిదేవుడు ఆసీను డయ్యెను. ఇంతలో కొన్ని కుక్కలను వెంట బెట్టుకొని ఒకవ్యక్తి వచ్చి ఆకలి దీర్పుమని అర్థించెను. ఆ మిగిలిన ఆహారమును కుక్కలతో కూడియున్న వ్యక్తి కొసగెను. ఇక జలము మాత్రమే మిగిలి యుండెను. ఆ జలమునే పానం చేసి తృప్తి చెందుటకు రంతిదేవుడు ఉద్యుక్తుడయ్యెను.

ఇంతలో చండాలు డొకడరుదెంచెను. ఆ పానీయము నిచ్చి ప్రాణములను కాపాడుమని ప్రార్థించెను. రంతిదేవుడు ఆ జలమును కూడా సమర్పించెను.

ఉ॥ అన్నములేదు కొన్నిమధురాంబువు లున్నవి, త్రావు మన్న రా
వన్న! శరీరధారులకు నాపదవచ్చిన వారియాపదల్
గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకన్న నొండు మే
లున్నదె నాకు దిక్కు పురుషోత్తముడొక్క(డచుమ్ము పుల్కసా!

"నాయనా! ఇటురమ్ము! నాకు అష్టసిద్ధులు అవసరము లేదు. ఆత్మజ్ఞానము అవసరము లేదు. సర్వ ప్రాణుల దుఃఖమును భరించుట యందే నాకు ఆనందము కలదు. సర్వులు సుఖించుటయే నా ఏకైక మనోరథము" అని పలికి, ఆదరముతో పుల్కసుని దగ్గరకు తీసికొని అతనిచేత మంచి నీటిని త్రాగించెను. సంతుష్ట చిత్తుడాయెను.

బ్రహ్మాదిదేవతలు ప్రత్యక్షమైనారు. రంతిదేవుడు నమస్కరించాడు. తమ పరీక్షలకు నెగ్గిన రంతిదేవుని ఆశీర్వదించారు. పరమ పదమును ప్రసాదించారు.

ఆ తరువాత యదువంశమును గూర్చి శుకుడు వర్ణించెను. యదువంశము మహత్తరమైనది. గొప్ప ప్రాభవము గలది. ఈ వంశమునందే భగవానుడగు శ్రీమన్నా రాయణుడు పదునారు కళలతో శ్రీకృష్ణుడుగా అవతరించును.

క॥ దుష్టజననిగ్రహంబును శిష్టజనానుగ్రహంబు సేయుటకొఱకై
యష్టమగర్భమున గుణో త్కృష్టు(డు దేవకికి విష్ణుదేవు(డు పుట్టెన్.

నవమ స్కంధము సమాప్తము

.... ఓం ....

జ్ఞానబ్రహ్మ, స్వామి సుందర చైతన్యా నందుల వారు తెలుగువారికి తెలియని వారు కారు. వక్తగా, రచయితగా, గాయకుడుగా, బోధకుడుగా, బహుముఖ ప్రజ్ఞాశాలియని భక్తుల చేత, పండితుల చేత కీర్తింపబడి, అఖిలాంధ్ర దేశములోని అనేక ముఖ్య పట్టణాలలో 125 జ్ఞాన యజ్ఞములను నిర్వహించి ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించారు.

స్వామీజీ నిర్వహించిన యజ్ఞాలు అనన్య సామాన్యమైన రీతిలో కొనసాగి లక్షలాది మందికి జ్ఞానభిక్ష నందించ గలిగినవి. వారిచేత స్థాపింప బడిన సత్సంగశాఖలు ఆరని విజ్ఞాన జ్యోతులై వెలుగుచున్నవి. 'గిరిధారి' మాసపత్రిక ద్వారా పూజ్య స్వామీజీ ప్రతిమాసము వేలాది మంది భక్తులకు వారి విశిష్ట సేవల నందించుచున్నారు. వారి అమృత గళం నుండి వెలువడిన క్యాసెట్లు ఎన్నో హృదయాలకు ఊరటను కల్పించినవి. వారి కమనీయ కలం నుండి కదలిన అసంఖ్యాకమైన గ్రంథములు మోక్షమార్గమున పయనించు ముముక్షువులకు మార్గగాములై యున్నాయి. ఎన్నో వెలువడినవి. ఇంకెన్నో వెలువడ నున్నవి. అన్నిటినీ మరపించే రీతిలో వెలువడుతున్న అపూర్వ గ్రంథ రాజమే, ఈ

చైతన్య భాగవతము.

భాగవతము కథల సంపుటి గాదనియు, శ్రీకృష్ణుడు మానవ మాత్రుడు గాడనియు, విద్వాంసులకు పరీక్షాగ్రంథ మనబడిన ఈ భాగవత ములోని ఇతి వృత్తము లన్నియు ఉపనిష త్ప్రతిపాదిత [illegible] జ్ఞానమణులనియు శ్రీ స్వామీజీ ఈ గ్రంథమున నిరూపించినారు.



చైతన్య భాగవతము

(ద్వితీయ భాగము)

జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానంద

శ్రీమద్భాగవతము మహోజ్జ్వలమైన వ్యాస మహర్షి కలము నుండి జాలువారి, మహా వైరాగ్యమూర్తి యైన శుకబ్రహ్మ గళము నుండి ప్రవహించి, మహా భక్తుడైన పరీక్షిత్తుని హృదయమున నిలిచినది. కనుక ఈ మహోత్కృష్ట గ్రంథము భక్తి, జ్ఞాన, వైరాగ్య స్వరూపముగ తెలియుచున్నది.

వ్యాసమహర్షి విరచితమును, విరోధరహిత ప్రతిపాదకమునగు ఈ భాగవత గ్రంథము పరమ పావన గ్రంథము. భాగవతము అనెడి పదములోని ఐదు అక్షరములు స్వరూపాము [illegible] తెలియుచున్నవి.

"భా" యనెడి మొదటి అక్షరము భక్తిని తెలుపుచుండ, రెండవ అక్షరమైన "గ" శబ్దము [illegible] జ్ఞానమును [illegible] చుచుండ, మూడవ అక్షరమైన "వ" శబ్దము వివేకయుక్తమైన వైరాగ్యమును సూచించుచుండ, నాల్గవ అక్షరమైన "త" శబ్దము తత్త్వాభ్యాసమగు తపమ్మును [illegible], ఐదవ అక్షరమైన "ము" శబ్దము మోక్షరూపమగు ముక్తిని [illegible] తెలుపుచున్నది. భక్తి జ్ఞాన వైరాగ్యములను వెంట [illegible] తపోధనుడై ముక్తి [illegible] భాగవతము బోధిస్తుంది.

వ్యాస భాగవతము సంస్కృత సాహిత్యముతో [illegible] భాషా నైపుణ్యము [illegible] అందులోని [illegible] [illegible]

జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానందుల వారు

ఈ చైతన్య భాగవతము ద్వారా [illegible]

[illegible]

చైతన్య భాగవతము (ద్వితీయ భాగము)

స్వామి సుందర చైతన్యానంద

తొమ్మిదవ ముద్రణము

అక్టోబరు 1998

5000 ప్రతులు

(సర్వ స్వామ్యములు [illegible] కల్చరల్ ట్రస్ట్‌వి)

ప్రతులకు:

సుందర చైతన్య ఆశ్రమం

ధవళేశ్వరం - 533 125

☎ 77378

[illegible] బైండింగ్ వర్క్స్

[illegible] ☎ [illegible]

సమర్పణం

[illegible]

పారిపోయేందుకు మూట-ముల్లె సర్దుకుంటున్న అధర్మం

కీర్తాన్ని అర్పించేందుకు మంగళశబ్దాలతో కదలివస్తున్న ధర్మం

[illegible]

[illegible]

స్పందనతో ఉప్పొంగుతున్న యమున

అదృశ్యమవుతున్న జీవుల యాతన

[illegible]

[illegible]

గలగల గాజుల సవ్వడు

కిలకిల నవ్వుల సవ్వడి - మధ్య

మంద్రస్థాయిలో ఆలపిస్తున్న మురళీరవము

[illegible]

అపులమందలో అలా అలా తిరుగుతున్న అచ్యుతుడు

కొంటెను గొడుగు చేసి గోకులాన్ని గాచిన గోవిందుడు

[illegible]

[illegible]

భువనమోహను డైన ఆ బాలగోపాలుని బుజ్జి బుజ్జి అడుగుల్ని అనుసరిస్తూ ఆనందిస్తున్న అబాలగోపాలం

కనులలో కాపురమున్న కమనీయ వేళ

[illegible]

[illegible]

మము గన్న తండ్రికి మల్లెపూదండ

మేము గన్న తండ్రికి మంగళారతులు — అంటూ

[illegible]

[illegible]

స్వామి సుందర చైతన్యానంద

విషయసూచిక

భగవాన్ మురళీకృష్ణ

సుందర చైతన్యాశ్రమం

శ్రీకృష్ణాష్టోత్తర శతనామావళి

1. ఓం శ్రీకృష్ణాయ నమః - శ్రీకృష్ణదేవునకు నమస్కారము.
2. ఓం కమలానాథాయ నమః - లక్ష్మీపతికి నమస్కారము.
3. ఓం వాసుదేవాయ నమః - వాసుదేవునకు నమస్కారము.
4. ఓం సనాతనాయ నమః - శాశ్వతుడైన వానికి నమస్కారము.
5. ఓం వసుదేవాత్మజాయ నమః - వసుదేవుని కుమారునకు నమస్కారము.
6. ఓం పుణ్యాయ నమః - పుణ్యనిలయునకు నమస్కారము.
7. ఓం లీలామానుషవిగ్రహాయ నమః - అద్భుత లీలలను ప్రదర్శించుటకై మానవాకృతిని ధరించిన వానికి నమస్కారము.
8. ఓం శ్రీవత్స కౌస్తుభధరాయ నమః - శ్రీవత్సమనెడి పుట్టుమచ్చని, కౌస్తుభమణిని ధరించిన వానికి నమస్కారము.
9. ఓం యశోదావత్సలాయ నమః - యశోదాదేవి వాత్సల్యమునకు పాత్రుడైన వానికి నమస్కారము.
10. ఓం హరయే నమః - శ్రీహరియొక్క అవతారమూర్తికి నమస్కారము.
11. ఓం చతుర్భుజాత్త చక్రాసి గదా శంఖాద్యుదాయుధాయ నమః - శంఖ చక్ర గదాది ఆయుధములను ధరించిన చతుర్భుజునకు నమస్కారము.
12. ఓం దేవకీనందనాయ నమః - దేవకీ పుత్రునికి నమస్కారము.
13. ఓం శ్రీశాయ నమః - ఐశ్వర్యములకు నాథుడైన వానికి నమస్కారము.
14. ఓం నందగోపప్రియాత్మజాయ నమః - నందగోపుని ప్రియపుత్రునకు నమస్కారము.
15. ఓం యమునావేగ సంహారిణే నమః - యమునానది ప్రవాహవేగమును నిరోధించిన వానికి నమస్కారము.
16. ఓం బలభద్ర ప్రియానుజాయ నమః - బలరాముని ప్రియసోదరునకు నమస్కారము.
17. ఓం పూతనా జీవితహరాయ నమః - పూతన ప్రాణములను హరించిన వానికి నమస్కారము.
18. ఓం శకటాసుర భంజనాయ నమః - శకటాసురుడను రాక్షసుని వధించిన వానికి నమస్కారము.
19. ఓం నందవ్రజ జనానందినే నమః - నందగోకులము నందలి పుణ్యాత్ములను ఆనందింప చేసిన వానికి నమస్కారము.
20. ఓం సచ్చిదానంద విగ్రహాయ నమః - సత్, చిత్, ఆనందములను దేహముగా గల వానికి నమస్కారము.
21. ఓం నవనీత విలిప్తాంగాయ నమః - వెన్నచే పూయబడిన దివ్య దేహము గలవానికి నమస్కారము.
22. ఓం నవనీత నటాయ నమః - వెన్నదొంగవలె నటించిన వానికి నమస్కారము.
23. ఓం అనఘాయ నమః - పాపరహితుడైన వానికి నమస్కారము.
24. ఓం నవనీత నవాహారాయ నమః - వెన్నను క్రొత్త ఆహారముగా స్వీకరించిన వానికి నమస్కారము.
25. ఓం ముచికుంద ప్రసాదకాయ నమః - ముచికుందుని బ్రోచిన వానికి నమస్కారము.

26. ఓం షోడశ స్త్రీ సహస్రేశాయ నమః - పదునారువేల గోపికలకు నాథుడైన వానికి నమస్కారము.
27. ఓం త్రిభంగినే నమః - మూడు భంగిమల నభినయించుచు నిలుచున్న వానికి నమస్కారము.
28. ఓం మధురాకృతయే నమః - మధుర భావములను కలిగించే మోహనాకారునకు నమస్కారము.
29. ఓం శుకవాగమృతాబ్ధీందవే నమః - శుకబ్రహ్మ వాక్సుధ యనే సాగరమునకు చంద్రుడయిన వానికి నమస్కారము.
30. ఓం గోవిందాయ నమః - వేదాంత వాక్యములను గ్రహించుట ద్వారా తెలియ బడు వానికి నమస్కారము.
31. ఓం యోగినాంపతయే నమః - యోగులకు ప్రభువైనవానికి నమస్కారము.
32. ఓం వత్సవాటచరాయ నమః - గోశాలయందు చరించువానికి నమస్కారము.
33. ఓం అనంతాయ నమః - అనంతుడైన వానికి నమస్కారము.
34. ఓం ధేనుకాసుర భంజనాయ నమః - ధేనుకాసురుని వధించిన వానికి నమస్కారము.
35. ఓం తృణీకృత తృణావర్తాయ నమః - తృణావర్తు డనే రాక్షసుని తృణప్రాయుంగా సంహరించిన వానికి నమస్కారము.
36. ఓం యమళార్జున భంజనాయ నమః - యమళార్జున వృక్షములను కూల్చినవానికి నమస్కారము.
37. ఓం ఉత్తాల తాల భేత్రే నమః - ఎత్తైన తాటివృక్షములను ఛేదించిన వానికి నమస్కారము.
38. ఓం తమాలశ్యామలాకృతయే నమః - తమాలవృక్షముల వలె శ్యామలవర్ణము గలవానికి నమస్కారము.
39. ఓం గోప గోపీశ్వరాయ నమః - గోపగోపీ జనములకు ప్రభువైన వానికి నమస్కారము.
40. ఓం యోగినే నమః - యోగీశ్వరునకు నమస్కారము.
41. ఓం కోటి సూర్యసమప్రభాయ నమః - కోటి సూర్యులకు సమమైన కాంతిగల వానికి నమస్కారము.
42. ఓం ఇలాపతయే నమః - ధరణీనాథునకు నమస్కారము.
43. ఓం పరంజ్యోతిషే నమః - ప్రకాశైక స్వరూపమునకు నమస్కారము.
44. ఓం యాదవేంద్రాయ నమః - యాదవకుల నాయకునకు నమస్కారము.
45. ఓం యదూద్వహాయ నమః - యదువంశము నకు శిరోభూషణమైన వానికి నమస్కారము.
46. ఓం వనమాలినే నమః - తులసిమాలను ధరించిన వానికి నమస్కారము.
47. ఓం పీతవాససే నమః - పీతాంబరమును ధరించిన వానికి నమస్కారము.
48. ఓం పారిజాతాపహారకాయ నమః - పారిజాతవృక్షమును స్వర్గమునుండి తెచ్చిన వానికి నమస్కారము.
49. ఓం గోవర్ధనా చలోద్ధర్త్రే నమః - గోవర్ధనగిరి నెత్తిన వానికి నమస్కారము.
50. ఓం గోపాలాయ నమః - గోపులను కాపాడిన వానికి నమస్కారము.
51. ఓం సర్వ పాలకాయ నమః - సర్వజీవులను పాలించు వానికి నమస్కారము.
52. ఓం అజాయ నమః - పుట్టుకలేనివానికి నమస్కారము.
53. ఓం నిరంజనాయ నమః - కల్మషరహితునకు నమస్కారము.
54. ఓం కామజనకాయ నమః - మన్మథునికి తండ్రియైన వానికి నమస్కారము.
55. ఓం కంజలోచనాయ నమః - కమలదళ నేత్రునకు నమస్కారము.

56. ఓం మధుఘ్నే నమః - 'మధు' అనే రాక్షసుని వధించిన వానికి నమస్కారము.
57. ఓం మధురానాథాయ నమః - మధురానగరికి ప్రభువైన వానికి నమస్కారము.
58. ఓం ద్వారకా నాయకాయ నమః - ద్వారకాపట్టణమునకు ప్రభువైన వానికి నమస్కారము.
59. ఓం బలినే నమః - దైవ బలంతో శోభించు వానికి నమస్కారము.
60. ఓం బృందావనాంత సంచారిణే నమః - బృందావన మంతటా సంచరించు వానికి నమస్కారము.
61. ఓం తులసీదామ భూషణాయ నమః - తులసీపత్ర మాలికచే అలంకృతుడైన వానికి నమస్కారము.
62. ఓం శమంతక మణేర్హర్త్రే నమః - శమంతకమణిని అపహరించిన వానికి నమస్కారము.
63. ఓం నరనారాయణాత్మకాయ నమః - నరనారాయణుల స్వరూపమైన వానికి నమస్కారము.
64. ఓం కుబ్జా కృష్ణాంబరధరాయ నమః - కుబ్జను గ్రహించి అనుగ్రహించిన వానికి నమస్కారము.
65. ఓం మాయినే నమః - మాయను తన అధీనమునందు ఉంచుకొన్న వానికి నమస్కారము.
66. ఓం పరమ పురుషాయ నమః - పరాత్పరుడైన పురుషోత్తమునికి నమస్కారము.
67. ఓం ముష్టికాసుర చాణూర మల్లయుద్ధ విశారదాయ నమః - మల్లయుద్ధ నిపుణులైన చాణూర ముష్టికులను జయించిన వానికి నమస్కారము.
68. ఓం సంసారవైరిణే నమః - సంసారమనెడి అజ్ఞానమునకు శత్రువైన వానికి నమస్కారము.
69. ఓం కంసారయే నమః - కంసుని అంతమొందించిన వానికి నమస్కారము.
70. ఓం మురారయే నమః - మురుని అంతమొందించిన వానికి నమస్కారము.
71. ఓం నారకాంతకాయ నమః - నరకాసురుని అంతమొందించిన వానికి నమస్కారము.
72. ఓం అనాది బ్రహ్మచారిణే నమః - ఆదిలేని బ్రహ్మచారికి నమస్కారము.
73. ఓం కృష్ణా వ్యసన కర్శకాయ నమః - ద్రౌపది బాధలను తొలగించిన వానికి నమస్కారము.
74. ఓం శిశుపాల శిరశ్ఛేత్రే నమః - శిశుపాలుని శిరస్సును ఛేదించిన వానికి నమస్కారము.
75. ఓం దుర్యోధనకులాంతకాయ నమః - దుర్యోధనుని కులమును అంతమొందించిన వానికి నమస్కారము.
76. ఓం విదురాక్రూర వరదాయ నమః - విదురునకు, అక్రూరునకు వరములొసగిన వానికి నమస్కారము.
77. ఓం విశ్వరూప ప్రదర్శకాయ నమః - విశ్వరూపమును ప్రదర్శించిన వానికి నమస్కారము.
78. ఓం సత్యవాచే నమః - సత్యవచనములు గలవానికి నమస్కారము.
79. ఓం సత్య సంకల్పాయ నమః - సత్యమైన సంకల్పములు గలవానికి నమస్కారము.
80. ఓం సత్యభామారతాయ నమః - సత్యభామ యందు ప్రత్యేక ప్రేమ గలవానికి నమస్కారము.
81. ఓం జయినే నమః - జయము గలవానికి నమస్కారము.
82. ఓం సుభద్రాపూర్వజాయ నమః - సుభద్రాదేవి కంటే ముందు పుట్టిన వానికి నమస్కారము.
83. ఓం విష్ణవే నమః - సర్వవ్యాపకుడైన వానికి నమస్కారము.

84. ఓం భీష్మముక్తి ప్రదాయకాయ నమః - భీష్మునకు మోక్షమును ప్రసాదించిన వానికి నమస్కారము.
85. ఓం జగద్గురవే నమః - జగద్గురువునకు నమస్కారము.
86. ఓం జగన్నాథాయ నమః - జగన్నాయకునకు నమస్కారము.
87. ఓం వేణునాద విశారదాయ నమః - వేణుగానముతో సమస్తమును సమ్మోహింపజేయు వానికి నమస్కారము.
88. ఓం వృషభాసుర విధ్వంసినే నమః - వృషభుడనే రాక్షసుని వధించిన వానికి నమస్కారము.
89. ఓం బాణాసుర కరాంతకాయ నమః - బాణాసురుడనే వానిని సంహరించిన వానికి నమస్కారము.
90. ఓం యుధిష్ఠిర ప్రతిష్ఠాత్రే నమః - ధర్మరాజు వైభవమునకు కారణమైనవానికి నమస్కారము.
91. ఓం బర్హి బర్హావతంసకాయ నమః - నెమలి పింఛమును ఆభరణముగా గలవానికి నమస్కారము.
92. ఓం పార్థసారథయే నమః - పార్థునికి సారథియైన వానికి నమస్కారము.
93. ఓం అవ్యక్తాయ నమః - వ్యక్తము గాని దివ్యదేహునకు నమస్కారము.
94. ఓం గీతామృత మహోదధయే నమః - భగవద్గీత యనెడి అమృతమునకు సాగరము వంటి వానికి నమస్కారము.
95. ఓం కాళీయఫణి మాణిక్య రంజిత శ్రీ పదాంబుజాయ నమః - కాళీయుని పడగలపై గల మాణిక్యములచే అలంకరించబడిన చరణ కమలములు గల వానికి నమస్కారము.
96. ఓం దామోదరాయ నమః - దామోదరునకు నమస్కారము.
97. ఓం యజ్ఞభోక్త్రే నమః - యజ్ఞఫలము ననుభవించు వానికి నమస్కారము.
98. ఓం దానవేంద్ర వినాశకాయ నమః - రాక్షస నాయకులను వధించిన వానికి నమస్కారము.
99. ఓం నారాయణాయ నమః - నారాయణునకు నమస్కారము.
100. ఓం పరబ్రహ్మణే నమః - బ్రహ్మలకు బ్రహ్మయైన వానికి నమస్కారము.
101. ఓం పన్నగాశన వాహనాయ నమః - సర్పములను భుజించు గరుడుని వాహనముగా గలవానికి నమస్కారము.
102. ఓం జలక్రీడా సమాసక్త గోపీవస్త్రాపహారకాయ నమః - జలకమాడు గోపికల వస్త్రములను అపహరించిన వానికి నమస్కారము.
103. ఓం పుణ్యశ్లోకాయ నమః - పుణ్యాత్ములచే స్తుతింపబడు వానికి నమస్కారము.
104. ఓం తీర్థపాదాయ నమః - చరణములయందు పుణ్యతీర్థము గలవానికి నమస్కారము.
105. ఓం వేదవేద్యాయ నమః - వేదములచే తెలియబడు వానికి నమస్కారము.
106. ఓం దయానిధయే నమః - కరుణకు నిధియైన వానికి నమస్కారము.
107. ఓం సర్వతీర్థాత్మకాయ నమః - సమస్త పుణ్యతీర్థముల స్వరూపమైన వానికి నమస్కారము.
108. ఓం సర్వగ్రహరూపీ పరాత్పరాయ నమః - సర్వగ్రహ రూపుడై దేవతలందరికి అధిదేవు డైన వానికి నమస్కారము.

ఓం శ్రీ కృష్ణార్పణమస్తు



జ్ఞానబ్రహ్మ
స్వామి సుందర చైతన్యానంద

10

ఉపోద్ఘాతము

ఇది దశమ స్కంధము

ముఖారవిన్దమ్ దశమమ్ ప్రఫుల్లమ్

ప్రఫుల్లమైన భగవానుని ముఖారవిందమే దశమ స్కంధము అని భావము. ఈ దశమస్కంధమే భాగవతము యొక్క వైభవమై, ఫలమై యున్నది. ఇందు కృష్ణభక్తి రసాయనము వరదలై పారినది.

సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా

భగవానునిపై నిలిపిన పరమోత్కృష్టమైన ప్రేమయే భక్తియని నారదమహర్షి భక్తి సూత్రములలో తెలిపి యున్నాడు. అమృత స్వరూపమైన భక్తి లభించగానే అన్యచింతలు అణగారిపోవును. అచ్యుతుని ధ్యానమే ఆశ్రయమగును. ఏ కర్మ నాచరించుచున్నను మాధవ చింతనామృతపాన విశేషము తప్ప రెండవ విషయము రుచించదు.

వలవరించియుఁ గృష్ణాఖ్య, తెలిసి యున్న యపుడుఁ గృష్ణాఖ్య. యేమలినభ్రీవేళ
యందు గృష్ణాఖ్య దక్కనయ్యంగములకు రాదు వేతాళ వాక్యంబు రసన తుదకు

అని పరాభక్తిని గూర్చి హరివంశము నందు ఎఱ్ఱన తెలిపెను.

పరిపూర్ణమైన భక్తిని దశమస్కంధము అందించును. దశమస్కంధము శ్రీకృష్ణ భగవానుని అమృతచరితము. శ్రీకృష్ణుని యందు లయించిన మనస్సు తరించును. దీనినే నిరోధస్వభావమని శాస్త్రములు తెలుపుతాయి. కృష్ణభక్తి నిరోధ రూపమై ఉన్నందున ప్రాపంచిక విషయవాసనలను చిత్తములో కదలనివ్వదు. కోరికలను విజృంభించనివ్వదు. నిరోధస్వభావము శాంతరూపమై ఉండును.

సా న కామయమానా నిరోధరూపత్వాత్

కృష్ణభక్తి విషయప్రపంచ వాసనను నిరోధించుట వలన కోరికలను కదలనివ్వదు. బాహ్యజగత్తులో మునిగియున్న చిత్తము అంతర్ముఖమై శ్రీకృష్ణపాదారవిందములయందు అచంచలముగా నిలిచియుండుటయే నిరోధ మనబడుతుంది. ఈ పరాభక్తిలో లోక వ్యవహారము, వేదవ్యవహారము కూడా త్యజించబడును.

నిరోధస్తు లోక వేద వ్యాపార న్యాసః

అని భక్తి సూత్రములయందు తెలుపబడినది. భగవానునియందు అనన్యభక్తి కలిగి తద్విరోధమైన విషయములయందు ఉదాసీనభావాన్ని కలిగియుండుటయే నిరోధస్వభావమని గ్రహించాలి.

దశమస్కంధము నిరోధభూమికమై ఉన్నది. మనస్సు అన్యచింతనలను వదలి అచ్యుతునిలో లయించే సంగమస్థాన మిదియే. ఏడురోజులలో ముక్తిని పొందుట ఎట్లు? అనునది పరీక్షిత్తుని ప్రశ్న. ఏడురోజులలో ఏ సాధన లాచరించగలము? కృష్ణ కథా శ్రవణము ద్వారా మనస్సును మాధవుని యందు లయింపచేయుటయే ఏకైకమార్గమని గుర్తించుటచేత శుకబ్రహ్మ భాగవత కథామృతమును పరీక్షిత్తునికి పంచిపెట్టెను.

సమస్తమును మరపించునది, "సర్వము స్మృతని దివ్య కళామయము" గా దర్శింప చేయునది శ్రీకృష్ణుని కథ. కృష్ణలీలలో తన్మయుడైన మహాత్మునిలో ప్రాపంచిక విషయ వాసనలు కదలవు. తాను జగత్తులో యున్నను, తన చిత్తము జనార్దనుని యందే ఉండుట చేత బద్ధజీవులమధ్య ఉన్ననూ తాను ముక్తుడే. ఇట్టి ముక్తిని కృష్ణ కథామృతము మనకు అందించును. ఈ కథామృతమును అందించు జ్ఞానసాగరమే దశమస్కంధము.

కృష్ణకథను తెలుపు దశమస్కంధము శ్రీశుకబ్రహ్మ ప్రారంభించ నున్నారు. పరమ పూజ్యుడు భాగవతోత్తముడు, సాక్షాత్పరబ్రహ్మ స్వరూపుడును వ్యాసనందనుడైన శుకబ్రహ్మ ఈనాడు దేదీప్యమానముగా ప్రకాశించు చుండెను. మందస్మిత సుందర వదనారవిందముతో, కోటిసూర్య సమప్రభావమై వెల్గొందు దివ్యతేజో విలసిత బ్రహ్మవర్చస్సుతో వెలిగిపోవు చుండెను. అతని హృదయగుహలో నిండియున్న ఆనందోత్సాహములు, ముఖములో కదలి పొంగువలె కనిపించుచుండెను. మునివృత్తము గోచరించనంత తృప్తి, పారవశ్యము శుకావధూతలో గన్పట్టుచుండెను. కారణమేమి? ఈ దివ్యపారవశ్యము ఎందువలన కలిగినది? ఏమీ లేదు. తాను బోధించబోయే దశమ స్కంధము తన ఇష్టదైవమైన శ్యామ సుందరుని చరితామృతమగుటయే. సదా తన హృదయంలో మెదిలే నవనీతచోరుడగు శ్రీకృష్ణుని కథామృతమగుటయే. కృష్ణకథ యనగనే శ్రీశుకుడు కరిగిపోవుచుండెను.

శ్రీకృష్ణుడు మానవమాత్రుడని గాని, ఉత్తమ మానవుడని గాని భావించకూడదు. అలాంటిభావమే ఏర్పడినచో మనమింకా సాధనలో తీవ్రకృషి సల్పవలెనని గ్రహించాలి. శ్రీకృష్ణుడు పదారు కళలతో ఆవిర్భవించిన పురుషోత్తముడు. పురాణపురుషుడు. శ్రీకృష్ణుని సాక్షాత్తు భగవత్స్వరూపముగా భాగవతం ప్రవచించింది.

కృష్ణస్తు భగవాన్ స్వయమ్

అన్నది భాగవతము. "కృష్" అనగా ఎల్లప్పుడు ఉండునది. "ణ" అనగా ఆనందము అని భావము. కృష్ణ అనగా సదానందము అని భావము. అదియే ఆత్మానందము.

కృషిర్భూ వాచకః శబ్దో ణయుతి ధృతి వాచకః

జగత్తును సృష్టింపచేయువాడు శ్రీకృష్ణుడని వ్యాసుడు తెలియచేయగా

కృషిర్భూ వాచకః శబ్దో ణశ్చ నిర్వృతి వాచకః

జగత్తును ఆనందింపచేయువాడు శ్రీకృష్ణుడని శంకరాచార్యులవారు విష్ణుసహస్రనామ భాష్యంలో తెలిపియున్నారు.

మాధుర్య కళ్యాణసౌందర్యములు పోతపోసిన విగ్రహమే శ్రీకృష్ణుడు. జడపదార్థములను సైతము కరిగించే ఆ కమనీయమూర్తి రమణీయసౌందర్యము ఎంతటివారినైనా ముగ్ధుల గావించును. కేవలాద్వైతమునందు రమించు ఆచార్యులుకూడా శ్రీకృష్ణదేవుని మనోహర రూపమును గాంచి మోహించారు.

దశమస్కంధమును బోధించుటకు ఉపక్రమించాడు శ్రీశుకుడు. కృష్ణకథను ఆలకించెడి శ్రోత నిగ్రహరూపుడై, నిరోధస్వరూపుడై ఉండాలి. పరీక్షిత్తుని పరీక్షించాలని శుకబ్రహ్మ అభిప్రాయపడినాడు. "మహారాజా! ఐదురోజుల నుండి అన్నపానీయములను సైతము విస్మరించి భాగవత కథామృతమును ఆలకించుచున్నావు. ఆసనమును కూడా మార్చలేదు. అలసియున్నావేమో? ఆహారపానీయములను సేవించి రమ్ము" అనెను. అంతట పరీక్షితుడు శుకయోగీంద్రునికి నమస్కరించుచు, "మహానుభావా! ఏ ఆకలి దప్పులవలన చిత్తము చలించి శమీకుని అవమానించి శాపమునకు గురియైతినో, ఆ ఆకలిదప్పులు ఇప్పుడు నాకు దూరముగా పోయినవి. ఇదంతయూ మీ కృపా కటాక్షమే!'

నైషాతిదుఃసహా క్షున్మాం త్యక్తోదమపి బాధతే
పిబన్తం త్వన్ముఖాంభోజచ్యుతం హరికథామృతమ్

"మునివర్యా! నేను పానీయములను కూడా త్యజించియున్నాను. మీ ముఖ పద్మమునుండి జాలువారిన హరికథామృత ధారలను పానముచేయుట వలన భరించలేని ఈ క్షుద్బాధ నన్ను కలతపెట్ట లేదు" అని పరీక్షిన్మహారాజు వినమ్రుడై తెలిపెను.

పరీక్షితుని వినమ్ర వచనముల నాలకించి శుకబ్రహ్మ తృప్తినొందెను. "నరపతీ! నీ బుద్ధి నిర్మలముగా యున్నది. వాసుదేవుని కథాశ్రవణమునందు నీకు నిష్ఠ కుదిరినది. నీలోని ఉత్సాహము నాలో ఉత్సాహమును నింపుతున్నది. కథామృతపానము చేయుటకు ఉత్తమ శ్రోతగా అర్హుడవై ఉన్న నీవు ధన్యజీవివి. నీ శ్రద్ధాభక్తుల ఫలితంగా నీకు బోధించు వాక్యములో శ్రీకృష్ణగాథను మననము చేసుకొనే మహాభాగ్యం నాకు కూడా లభించినది.

భగవత్కథాశ్రవణము నందు ఇట్టి పావనస్థితి కలుగవలెను. వక్త శ్రోత లిరువురు తన్మయత్వములో శ్రీకృష్ణలీలామృతమును పానము చేయవలెను. అప్పుడే స్వాధ్యాయము సఫలీకృతమగును.

శ్రీశుకుడు నేత్రములు మూసుకొని అంతర్యములో అచ్యుతునికి శరణాగతుడై దశమస్కంధమును బోధించుటకు ఉపక్రమించెను. దశమస్కంధమును శ్రీకృష్ణుడే స్వయముగా శ్రీశుకులవారి ద్వారా తెలిపెనని కొందరి మహాత్ముల అభిప్రాయము.

అభిప్రాయాలు సహజాలైనా అవరోధాలు కావు. అడ్డంకులు కానేరవు. కానీ సహజాలే సాధము గాలేవు. ఏమైనా వుండే యింద సౌందర్యము గోచరిస్తుంది. మరి... ఇకనేమిటి? పదపదమే...... ప్రారంభించండి.

చైతన్య భాగవతము

దశమస్కంధము

శ్రీకృష్ణుని అవతారమునకు కారణము

ద్వాపరయుగము జరుగుచున్నది. దైత్యుల హింసాకాండ హెచ్చుపెరిగింది. అధర్మం విలయతాండవం చేయసాగింది. స్వార్థం వికృతరూపాన్ని ధరించింది. అధికారదాహం అవధులు దాటింది. సాధుజీవనానికి పరిధిలేకుండా పోయింది. రాక్షస సేనావాహినిని మోయలేక భూమాత చలించిపోయింది. చరించే శక్తిలేక కూలబడింది. గోరూపమును ధరించింది. బ్రహ్మదేవుని సమీపించింది. తన దుఃఖకారణమును వివరించి చెప్పింది. బాధలు కలిగినపుడు పెద్దల నాశ్రయించువారికి శుభములే చేకూరును. బ్రహ్మ యనగా పెద్దది అని అర్థము. బ్రహ్మను ఆశ్రయించుట యనగా పెద్దల నాశ్రయించుట యని అర్థము. అదియునుగాక సృష్టికర్త బ్రహ్మదేవుడే అయినందున ఆయన అందరికన్నా అగ్రజుడై యున్నాడు.

భూదేవియొక్క దీనాలాపమును విని బ్రహ్మ ద్రవీభూతుడయ్యెను. ఆమెను ఓదార్చి, త్రినేత్రునితోను, దేవతలతోను కూడి పాలసముద్రమును చేరెను. ఆర్తుల బాధను ఆలకించి ద్రవించువారే మహాత్ములు. ఆర్తులైనవారి బాధను పోగొట్టే ప్రయత్నములో వారిని క్షీరసాగరము వద్దకు నడిపింతురు. క్షీరము తెల్లగా యుండును. తెలుపు సత్త్వగుణానికి సంకేతము. బాధలచేత చెదరగొట్టబడిన వారిలో సత్త్వగుణమును నింపే ప్రయత్నము చేయాలి. సాత్త్విక భావములను బోధించి, వారి హృదయమును తృప్తి పరచవలెను. బ్రహ్మ అదియే చేశాడు. పాలసముద్రము చెంత నిలబడి పురుషసూక్తము ద్వారా జగన్నాథుని స్తుతించెను.

జగన్నాథుడు సర్వాంతర్యామి. ఆయనకు తెలియని విషయమంటూలేదు. అనతికాలములోనే తాను భూలోకమున దేవకీ-వసుదేవులకు పుత్రుడుగా జన్మించనున్నట్లు, దేవతలనుకూడా నందగోకులమున జన్మించవలసిందిగా బ్రహ్మదేవునిద్వారా జగన్నాథుడు తెలియజేసెను. భగవద్వాణి ఎప్పుడూ మహాత్ములద్వారానే మనకు వినపడును. భూదేవి సంతసించెను. బ్రహ్మాదిదేవతలు సంతృప్తినొందిరి. భగవానుని అభయదానము ఆర్తులను ఆనందసాగరములో ముంచెత్తుతుంది.

కంసుని కాఠిన్యము

హింసకు మారుపేరు కంసుడు. ఆయన సోదరియే దేవకీదేవి. దేవకీ వసుదేవులకు వివాహము వైభవముగా జరిగెను. వధువును అత్తవారింటికి చేర్చే ప్రయత్నములో సోదరియైన దేవకిని తానే వదలివచ్చుటకు కంసుడు ఆనందముతో అంగీకరించెను.

"వసు" అనగా తేజము అని అర్థము. సంపద అనికూడా భావము. జ్ఞాన సంపదను కలిగినవాడే వసుదేవుడు. అనగా శుద్ధబుద్ధి యని అర్థము. దేవకిది నిర్మలమైన మనస్సు. మనోబుద్ధులు శుద్ధికాగానే శ్రీకృష్ణుడు హృదిలో జనించును.

సిద్ధంగాయున్న రథాన్ని దేవకీవసుదేవులు ఎక్కారు. అశ్వ, రథ, గజ, పదాదులు సారెలు తీసుకొని బారులుతీరి యున్నాయి. కంసుడు దేవకిని చేయిపట్టుకొని రథం ఎక్కించాడు. సారథి స్థానములో తానే ఆసీనుడయ్యాడు. కంసుని తండ్రియైన ఉగ్రసేనునితో సహా సర్వులూ సంభ్రమముతో తిలకిస్తున్నారు. కంసునిచేయి పగ్గాలను కదిలించింది. గుఱ్ఱాలు రథాన్ని ముందుకు లాగాయి.

అయోగ్యుడు రథానికి సారథి కాకూడదు. అయోగ్యుని సారథ్యంలో బ్రతుకురథం అధోముఖంగా నడుస్తుంది. జీవనము ఆవేదనకు ఆలవాల మవుతుంది. కంసుడనే అహంకారము జీవనరథాన్ని నడిపినపుడు గమ్యం చేరుట యనునది జరుగదు.

"చెల్లీ! మన బాంధవ్యమను సౌధము మనువది బావపై ఆధారపడింది. నీవే చెప్పుము. మరిదువుడు నాకొక మాట ఇవ్వాలి. మీరు చక్కని కుమార్తెనే కనాలి. ఆవిడను నేను కోడలుగా తెచ్చుకోవాలి. పొరపాటు నైనాసరే కొడుకునుకంటే బావను క్షమించేదిలేదని చెప్పా"లని పలికాడు. ఆ మాటలకు దేవకీవసుదేవులు పక్కున నవ్వారు.

అహంకారియగు మానవుని ప్రసంగం ఎప్పుడూ అప్రస్తుతం గాను, ఉన్మాద వాక్యధోరణిలోనే యుంటుంది. జ్ఞానులైనవారికి అవి ఎప్పుడూ నవ్వులాటగానే తెలుస్తాయి.

రథం ముందుకు సాగుతుపోతూ ఉన్నది. ఇంతలో వాతావరణము తారుమారైనది. మేఘములు గర్జించాయి. ఆకాశము ఒక్కసారి అంధకారబంధురమైనది. మెరుపులు మెరుస్తున్నాయి. ఉరుములు ఉరుముతున్నాయి. ప్రతి మెరుపుకీ చీకటిని చీల్చుకుని వెలుగుకిరణాలు జారి, కనేలోగా కనుమరుగవుతున్నాయి. ప్రతి ఉరుముకీ విద్యుల్లతల

వలె కాంతికిరణాలు విరజిమ్మబడు తున్నాయి. అనూహ్యమైన ఈ పరిస్థితి ఏమిటో అర్థంగాక కంసుడు రథాన్ని ఆపాడు. ఇంతలో అశరీరవాణి ఇలా పలికింది:

"ఓరీ! బుద్ధిహీనుడా! కంసా! ఆమె నీ సహోదరికాదు; ప్రాణహారి! ఎవరినైతే ఈనాడు నీవు రథములో కూర్చొనబెట్టుకుని చరించుచున్నావో, ఆవిడే రేపు నీ దేహాన్ని కుప్పగూల్చివేస్తుంది. ఆవిడ నీతో చేసేది వియ్యముకాదు కయ్యము. మరచిపోకు.

అస్యాస్త్వామష్టమో గర్భో హన్తాయాం వహసేఽబుధ

"ఆమె అష్టమ గర్భమే నిన్ను హరించును" అని పలికి అదృశ్యమయ్యెను. పరిస్థితులు అనుకూలించినపుడు పున్నమినాటి సాగరములా ఉప్పొంగి, పరిస్థితులు ప్రతికూలించగానే గిరిశిఖరమునుండి జారిపడు జలపాతమువలె దిగజారువారే అప్రయోజకులు. వారే అసురులు. ఆలోచనాశక్తి లేని అధములు. కంసుడు అట్టివారిలో అగ్రగణ్యుడు.

ఆకాశవాణి పలుకులు దైత్యరాజు వీనులలో మారుమ్రోగసాగాయి. ఆవేశము ఆకాశాన్నంటింది. ఖడ్గమును చేబూని కంసుడు పైకిలేచాడు. దేవకిని సమీపించాడు. ఆమె శిరోజములను పట్టుకొని రథమునుండి క్రిందికి లాగాడు. ఒక చేతితో ఆమె కేశములను పట్టుకొని, రెండవ చేతితో ఆమె శిరమును ఛేదించబోయాడు.

దుర్జను లందించే ప్రశంసలు, సన్మానాలు, ప్రేమలు ఇలాగే ఉంటాయి. ఎక్కించినంతసేపు పట్టదు దింపడానికి. "అన్నా! ఆదుకొనవలసిన నీవే ఈ అన్యాయానికి పాల్పడుతున్నావా?" అని దేవకి రోదించింది. అయినా కఠినాత్ముడగు కంసుని హృదయం కరగలేదు. వసుదేవుడు కంసుని సమీపించాడు. ప్రార్థించాడు. అబలను హతమార్చవద్దని అర్థించాడు. అనుంగుసోదరిని హతమార్చిన హంతకుడనే పేరును బడయవద్దని అభ్యర్థించాడు. ఆవేశము అందలమెక్కినపుడు ఆలోచనయే శరణ్యము. వసుదేవుడు ఆలోచించాడు. కంసుని ఓదార్చసాగాడు.

మృత్యుర్జన్మవతాం వీర దేహేన సహజాయతే.
అద్య వాబ్దశతాన్తే వా మృత్యుర్వై ప్రాణినాం ధ్రువః

"మహావీరా! పుట్టినవానికి శరీరములోపాటే మృత్యువుకూడా జనించును. ఈనాడు కాకపోయినా నూఱు సంవత్సరముల తరువాతనైనను మృత్యువు అనివార్యమైయున్నది. ఇది సత్యము. రాజా! దేహము వదలినా కర్మ మనలను విడిచిపెట్టదు. జన్మజన్మలకు వెంటాడుచునే యుండును. దేవకి నీ చెల్లెలు. పుత్రికలాంటిది. ఈమెను వధించుట మంచిదికాదు" అనెను. వసుదేవునియొక్క విమల వచనములు మలినయుతుడగు కంసుని తృప్తిపరచలేకపోయినవి. వసుదేవుడు ఆలోచించి ఒక్కమాట చెప్పెను. బుద్ధిమంతు డగువాడు విచక్షణా జ్ఞానమును ఉపయోగించుకొని ఆపదనుండి బయట పడవలెను. వసుదేవుడు అదియే చేసి చూపెను.

ప్రసన్న వదనాం భోజో నృశంసం నిరపత్రపమ్.
మనసా దూయమానేన విహసన్నిదమబ్రవీత్

ఈ దుర్భర సన్నివేశమును గాంచి మనస్సు కలతచెందుతున్నను కంసుని తృప్తిపరచుటకై ప్రసన్నవదనుడై నవ్వుతూ ఇలా చెప్పెను.

"సౌమ్యుడా! దైత్యవీరా! గగనవాణి పలుకులను హృదయగగనమున మాసిపోనీ. నీవు చింతించకుము. ఎవరివలన నీకు మృత్యువు కలుగునని భయపడుచుంటివో ఆ దేవకీ సుతులను నీ కప్పగించెద నని ప్రమాణము చేయుచున్నాను" అనెను.

సజ్జనులు తమ హృదయములలో బాధలను నింపుకొని, ప్రతికూల వాతావరణమున చరించుచున్నను తమ బాధలను వ్యక్తపరచక, నవ్వు నభినయిస్తూ దుర్జనులకు కూడా సంతసము నొసగూర్చుచుందురు. దుర్జనులగువారు అనుకూల వాతావరణమున హాయిగా సంచరించుచున్నను, తమ స్వభావజనిత దురాలోచనలతో సజ్జనుల హృదయాలను కూడా గాయపరచుచునే యుంటారు. ఆశయాలమధ్య రమించేవారికి ఆశలమధ్య చరించేవారికి, ఇదియే తేడా.

వసుదేవుని వాక్కు కంసుని కలతను రూపుమాపి, సంతసము నొసగూర్చినది. స్త్రీ హత్యను కంసుడు త్యజించెను.

కాలచక్రము ఒక్కసారి గిఱ్ఱున తిరిగింది. దేవకి బాలుని ప్రసవించింది. సాధుహృదయం ఆడినమాటను తప్పదు. వసుదేవుడు ప్రథమ సంతానాన్ని తీసుకుని కంసునివద్దకు వచ్చాడు. బిడ్డను కంసునికి అప్పగించాడు. వసుదేవుని ఋజుత్వము కంసుని విస్మయమొందించింది. త్యాగము ఎదుట ఎవరైనా తలవంచవలసినవారే. "వసుదేవా! నీ పుత్రుని తీసుకొని వెళ్ళుము. దేవకి అష్టమగర్భ సంజాతుడే నాకు శత్రువు" అని కంసుడు పలికెను. వసుదేవుడు గృహోన్ముఖు డయ్యెను. సత్యజీవనము ఎన్నడూ స్వస్థతను, ప్రశాంతమును అందించి తీరును.

ఒకనాడు నారదుడు కంసుని వద్దకు అరుదెంచి, దైత్యులను సంహరించుటకు దేవతలు పన్నాగము పన్నుతున్నారని తెలియజేసెను. దేవతలు యాదవులుగాను, శ్రీహరియే దేవకి అష్టమ గర్భసంజాతుడుగా పుట్టి తనకు కీడు చేయనున్నారని గ్రహించిన కంసుడు దేవకీవసుదేవులను చెఱసాలలో బంధించెను. వారికి కలుగు సంతానము నంతటిని అతడు వధించసాగెను. అడ్డువచ్చిన తన జనకుడగు ఉగ్రసేనుని కారాగారమున బంధించెను. "చెడురోజులు ప్రాప్తించే ముందు చెడు ఆలోచనలే వస్తాయి" అన్నాడు వృద్ధుడైన ఉగ్రసేనుడు. "అవి మీకా? మాకా?" అని వికటాట్టహాసము చేశాడు దుష్టుడైన కంసుడు.

శ్రీకృష్ణుని ఆవిర్భావము

దేవకి గర్భమునుండి ఆవిర్భవించిన ఆరుగురు శిశువులు కంసుని క్రూర ఖడ్గానికి బలి అయ్యారు. సప్తమ గర్భము ఆదిశేషుని రూపమగు సంకర్షణు దాల్చెను. అనంతదేవుని ఆకర్షించి రక్షించమని భగవానుడు యోగమాయ నాదేశించెను. వసుదేవుని భార్యయగు

రోహిణీదేవి నందగోకులమున ఉన్నదనియు, దేవకి గర్భమునందున్న సంకర్షణుని గొనిపోయి రోహిణి గర్భమున ఉంచవలసినదనియు, తాను దేవకీదేవి గర్భమున జనించుననియు, యోగమాయను నందుని సతియగు యశోద గర్భమున జనించుమనియు తెలిపెను.

విశ్వాత్ముడగు జగన్నాథుడు దేవకీ గర్భమున ప్రవేశించెను. శ్రీహరి గర్భము నందుండుటచేత చెఱసాలయంతయు దేదీప్యమానముగా వెలిగిపోవుచుండెను. దేవకీ వసుదేవులు కంటిపై రెప్పవాల్చక భగవన్నామమును పారాయణము చేయుచుండిరి. బాధల చెఱసాలలో యుండినను భగవన్నామమును ఉచ్చరించువారికే భగవానుడు పుత్రుడుగా జన్మించును.

దేవకి ముఖమునందు గోచరించు దివ్య వెలుగును గాంచి కంసుడు భీతిచెందెను. తన ప్రాణములను హరించు శ్రీనాథుడు దేవకీ గర్భమున ప్రవేశించియున్నాడని పసిగట్టెను. గర్భవతియును, అబలయగు స్త్రీని వధించుటవలన తన కీర్తికి భంగమువాటిల్లునని కంసుడు భావించెను. శ్రీహరిని సంహరించుటయే యుక్తమని భావించెను. వైరభక్తితో అంతఃపురమంతా స్వైరవిహారము చేయసాగెను.

దేవకీగర్భమున నిలిచియున్న నారాయణుని స్తుతించుటకు చతుర్ముఖ బ్రహ్మ,శివ, నారదాది మహర్షులతో కూడి భూలోకమునకు అరుదెంచెను.

సత్యవ్రతం సత్యపరం త్రిసత్యం సత్యస్య యోనిం నిహితం చ సత్యే
సత్యస్య సత్యమృత సత్యనేత్రం సత్యాత్మకం త్వాం శరణం ప్రపన్నాః

అని దేవతలు జగన్నాథుని స్తుతించారు.

శుభఘడియ సమీపించింది. రోహిణీ నక్షత్రము భ్రాజితమగుచున్న విజయ ముహూర్తము వరించింది. దిక్కులన్నియు ప్రసన్నములైనవి. మలయమారుతము ప్రశాంత పవనాలను అందించింది. నక్షత్రములు దివ్య ప్రకాశవంతములై కన్పట్టుచున్నవి. నదులు స్ఫటికమువలె స్వచ్ఛమైన జలముతో శోభించుచున్నవి. పద్మములచే సరోవరము లన్నియు హృద్యముగా గోచరించుచున్నవి. దేవతల దుందుభినాదములు కర్ణ పేయములై వినిపించుచున్నవి. కోకిలా విహంగముల సుమధుర నాదములతో వనప్రదేశము లన్నియు ప్రఫుల్లితమైనవి. సాధుహృదయాలు శాంతి సాగరములుకాగా, దేవతలు పుష్పవృష్టిని కురిపించుచుండగా తూర్పుదిక్కున ఉదయించు పూర్ణచంద్రునివలె - సర్వజీవుల హృదయాంతరవాసియగు శ్రీకృష్ణుడు పుణ్యవతియగు దేవకీదేవి గర్భమున జనించెను.

ఆత్మజ్ఞాన మావిర్భవించు విధము ఇలాగే ఉండును. కాలాతీతమైన శుభకర ఘడియ అనుభవమునకు అందును. సహస్రార మనెడు రోహిణీ నక్షత్రము భ్రాజితమగును. జ్ఞానస్ఫూర్తి యనెడి విజయముహూర్తము వరించును. ఇంద్రియము లనెడి దిక్కులు పోరును వీడి ప్రసన్నములై యుండును. శాంతియనే మలయ మారుతము ఆనంద మనెడి పవనాలను అందించును. నక్షత్రము లనెడి నేత్రములు జ్ఞానప్రకాశముతో వెలుగు చుండును. అఖండ బ్రహ్మాకార వృత్తియనెడి నదీప్రవాహము ఎడతెగక స్వచ్ఛముగా

ప్రవహించుచూ శోభించుచుండును. జ్ఞానమను అనెడి పద్మములతో హృదయ సరోవరము హార్ద్యముగా గోచరించుచుండును. ప్రణవనాద మనెడి దుందుభి ధ్వనులు వీనులకు విందు నొనగూర్చుచుండును. అనుభూతు లనెడి కోయిలల ఆనందనాదములతో అంతరంగిక వనప్రదేశము పరిపూరితమైయుండును. సాధుహృదయా లనెడి మనోబుద్ధులు శాంతిలో పవళించగా, అఖండ రసానుభూతి యనెడి పుష్పవృష్టి కురియుచుండగా ఆత్మజ్ఞాన భాస్కరుడు వెలసాల యనెడి హృదయ బందీఖానాలో నిర్మలచిత్త మనెడి దేవకికి, శుద్ధబుద్ధి యనెడి వసుదేవునికి కుమారుడుగా జన్మించును.

ప్రతి మానవ హృదయము ఒక కారాగృహమే. దేవకీవసుదేవులు నిరంతరము భగవన్నామ స్మరణలో కాలము గడిపినట్లు, ప్రతి ఒక్కరు త్రికరణశుద్ధితో భగవన్నామ స్మరణను అఖండముగా సాగించినచో అచ్యుతుడు వారి హృదిలో జ్ఞానరూపముతో ఆవిర్భవించును.

దివ్యాలంకార భూషితుడై ఆవిర్భవించిన శ్రీనాథుని పుత్ర రూపమున దర్శించి వసుదేవుడు అమితోత్సాహముతో పరవశించిపోయాడు.

సీ॥ జలధరదేహు నాజాను చతుర్బాహు సరసీరుహాక్షు విశాలవక్షుఁ
జారు గదా శంఖ చక్ర పద్మ విలాసుఁ గంఠ కౌస్తుభమణి కాంతిభాసు.
గమనీయ కటిసూత్ర కంకణ కేయూరు శ్రీవత్సలాంఛనాంచితవిహారు
మకరకుండలప్రభాయుతకుంతల లలాటు వైడూర్య మణిగణ వరకిరీటు
తే॥ బాలు బూర్ణేందు రుచిజాలు భక్తలోక పాలు సుగుణాలవాలుఁ గృపావిశాలుఁ
జూచి తిలకించి పులకించి చోద్యమంది యుబ్బి తెలరేగి వసుదేవు డుత్సహించె.

ఆనందార్ద్రిలో పరవశించి మునకలేయు వసుదేవుడు చిత్తమునందు బ్రాహ్మణులకు పదివేల గోవులను దానముచేసెను. తనకు ఆనందము కలిగిన సమయాన అప్రయత్నముగా ఇతరులకు ఆనందమును పంచవలెనని కుతూహల పడువాడే పవిత్రాత్ముడు.

శ్రీకృష్ణుని ఆవిర్భావముచే సూతికా గృహమంతయు తేజోవంతమై గోచరించును. అది గాంచిన వసుదేవుడు శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవానుడే అని గ్రహించి వెంటనే స్తుతించసాగెను.

విదితోఽసి భవాన్ సాక్షాత్పురుషః ప్రకృతేః పరః
కేవలానుభవానంద స్వరూపః సర్వబుద్ధి దృక్

"నీవు ప్రకృతికంటెను పరమైనవాడవు. పరమపురుషుడవు. పరమాత్మవు. నిత్యానందస్వరూపుడవు. ద్రష్టత్వమై యున్నవాడవు. అట్టి నిన్ను నేను తెలుసు కొంటిని."

చతుర్భుజుడై, శంఖ చక్ర గదాధరుడై దీప్తిమంతమై శోభించు పురుషోత్తముని గాంచి దేవకీకూడా స్తుతింపసాగెను. "దేవా! నీ పరతత్త్వమును అవ్యక్తమని, [illegible], బ్రహ్మమని, జ్యోతియని, నిర్గుణమని, నిర్వికారమని, సత్తారూపమని, నిర్విశేషమని వేదాదులెల్లరు స్తుతించియుండిరో అట్టి పరబ్రహ్మస్వరూపుడవు నీవే. సమస్తమునకు నీవే ప్రభునై యున్నావు. అట్టి నిన్ను నేను శరణుపొందుచున్నాను."

భగవానునియొక్క అలౌకికరూపము ఆమెకు ఆనందమును కలిగించుచుండినను, దుర్మార్గుడైన కంసునివలన అపాయము సంభవించునేమో యనెడి భయముకూడా కలుగుచుండెను. అభయ జీవనమును అభిలషించుచు ఇలా పలికెను.

జన్మతే మయ్యసౌ పాపో మావిద్యా న్మధుసూదన
సముద్విజే భవద్ధేతోః కంసాదహ మధీరధీః

మధుసూదనా! కంసునివలన నీకు అపాయము సంభవించునేమో యని నిశ్చలబుద్ధిలేని నేను భయపడుచున్నాను. నా కుమారుడుగా నీవు జన్మించితి వనెడి వార్త కంసునకు తెలియనీయకుము.

ఉపసంహర విశ్వాత్మన్ అదోరూప మలౌకికమ్
శంఖ చక్ర గదా పద్మ శ్రియా జుష్టం చతుర్భుజమ్

"విశ్వాత్మా! శంఖ చక్ర గదా పద్మములచే ప్రకాశించెడి నీ అలౌకిక చతుర్భుజ రూపమును ఉపసంహరింపుము" అని ప్రార్థించెను.

నారాయణమూర్తి దేవకి నుద్దేశించి "దేవీ! స్వాయంభువ మన్వంతరమున పూర్వ జన్మమునందు నీవు 'పృశ్ని' అను నామముతో జన్మించితివి. ఈ వసుదేవుడు సుతపుడను నామము కలిగి ప్రజాపతి యయ్యెను. ఆ జన్మలో మీరు భయంకరమైన తపమాచరించితిరి. పండ్రెండువేల సంవత్సరములు కఠోర తపమాచరించితిరి. మీ తపస్సుచేత సంతృప్తిచెందిన నేను మీకు దర్శనమొసగి, వరముకోరుడని తెలిపితిని. నావంటి పుత్రుడు కావలెనని మీరు అభిలషించితిరి. అపుడు నేను నీ గర్భమున పృశ్నిగర్భుడను నామముతో జన్మించితిని. మరు జన్మమున మీరు అదితి కశ్యపులుగా జన్మించగా, నేను మీకు వామనుడను పేరుతో జన్మించి, సంతృప్తి నందించితిని. ఈ మూడవ జన్మమునందు మీరు దేవకీ వసుదేవులుగా జన్మించగా నేను మరల ఇప్పుడు మీ అభీష్టమును సిద్ధింపచేయుటకై మీ ఇరువురికి కుమారుడుగా జన్మించితిని."

యువాం మాం పుత్రభావేన బ్రహ్మభావేన చాసకృత్
చింతయన్తౌ కృతస్నేహౌ యాస్యేథే మద్గతిం పరామ్

"మీరు నన్ను వాత్సల్యభావముతోను, బ్రహ్మ భావముతోను చింతించుచు అనురాగయుక్తులై పరమగతిని పొందగలరు" అని చెప్పి, వారు చూచుచుండగనే ఆయన మనోహరమగు శిశురూపమును దాల్చెను.

గోకులమునకు ప్రయాణము

ఆ సమయమునందే గోకులమున యోగమాయా స్వరూపమైన బాలికను యశోద ప్రసవించెను. అంత శ్రీకృష్ణుడు వసుదేవు నుద్దేశించి "నన్ను దీసుకొనివెళ్ళి నందగోకులమున యశోద ఇంటిలో ఆమె ప్రక్కన పరుండబెట్టి అచ్చట జన్మించియున్న నా సోదరియగు యోగమాయను తీసుకొని రావలసినది" అని చెప్పెను. భగవానుని ఆజ్ఞమేరకు వసుదేవుడు బయలుదేరుటకు నిర్ణయించుకొని బాలుని తన ఒడిలోనికి తీసుకొనెను.

వాంఛించదగినది భగవానుడేనని గ్రహించి శ్రేయోమార్గమున జీవించు వారికి సర్వ అభీష్టములు నెరవేరును. భగవానుడు తమ బిడ్డడు కావలె ననెడి పవిత్ర వాంఛయే మోక్షాపేక్షయై యున్నది. అందుచేత భగవానుడు ప్రతిక్షణము వారిని నడిపించుచునే యున్నాడు. తమ బ్రతుకుబాటలో భగవానుని మార్గగామిగా, మార్గదర్శిగా ఎన్నుకొనువారే ధన్యాత్ములు.

శ్రీకృష్ణుడు కారాగృహంలో జన్మించాడు. ప్రతి మానవ హృదయము అంధకార బంధురమైన కారాగృహం వలె అజ్ఞాన తిమిరముతో నిండిన దనియు, తనను ధ్యానించిన వ్యక్తికి అట్టి హృదయములో తాను గోచరించగల ననియు భగవానుడు ప్రదర్శించి ప్రవచించాడు.

భగవదాజ్ఞ ప్రకారము శ్రీకృష్ణుని గోకులమునకు చేర్చుటకు వసుదేవుడు ఉద్యుక్తుడయ్యాడు. వసుదేవుడు బాలుని బుట్టలో పెట్టుకుని శిరమున ధరించాడు. అంతే, తలుపులు వాటంతట అవే తెరువ బడినాయి.

ద్వారశ్చ సర్వాః పిహితా దురత్యయా బృహత్క పాటాయ సకీల శృంఖలైః

"ఇనుప గొలుసులచేత, తాళములచేత బంధింపబడిన పెద్దపెద్ద ద్వారములు వాటంతట అవే తెరువబడ్డాయి." కావలావారు నిద్రమత్తులో పడిపోయారు. నిజమే, శ్రీకృష్ణుని ఎవరయితే శిరముపై ధరించుచుందురో అనగా మనస్సులో నింపుకొందురో వారికి హృదయకవాటాలు అప్రయత్నంగా తెరుచుకొంటాయి. కావలావారనే ఇంద్రియాలు అదమరచి క్రియలుడిగి నిద్రిస్తాయి. భగవానుని శిరమున ధరించాలేగాని కారాగృహ ద్వారాలేకాదు కైవల్యద్వారాలు కూడా తెరుచుకుంటాయి. వసుదేవుడు పుణ్యాత్ముడు. శ్రీకృష్ణభగవానుని మోసే భాగ్యానికి నోచుకున్నాడు. కారాగృహంలో బంధింపబడియున్నను నిరంతరము కృష్ణనామామృత పానచిత్తుడైనందువనే తనకీభాగ్యము కలిగినది. నాలుకపై నారాయణ నామం కదలితే, శిరముపై నారాయణుడే నిలుస్తాడు. మోయవలసింది వాసుదేవునేగాని భవబంధాలను తగిలించే సంసారాన్ని కాదు.

మానవునికేగాక పశుపక్ష్యాదులకు కూడా భగవానుడు నాలుకను ఇచ్చాడు. పశుపక్ష్యాదుల నాలుకలు తినేందుకే ఉపకరిస్తాయి. కానీ మానవుని నాలుక అలాకాదు.

సద్విషయాలు చర్చించేందుకు, భగవన్నామమును గానం చేసేందుకు ఉపకరిస్తుంది. భగవత్ప్రసాదితమైన అట్టి నాలుకను దుర్వినియోగం చేసుకొనువాడు పాపయోనులలో పడునని శాస్త్రములు తెలియచేస్తున్నాయి.

సద్విషయ చర్చకు నోచుకోలేక కొల్లమాటలను జార్చే చపల నాలుక ఛిద్రమై ఉన్నదని భావము. భగవన్నామ స్మరణకు నోచుకోలేక దుష్టవాక్కులకు, ధూమపానమునకు అలవాటు పడిన నాలుకను నాలుకయని భావించ నవసరములేదు. అదియే నరకకూపమని పురాణములు తెలియచేస్తున్నాయి.

భక్తులారా! వసుదేవుడు పుణ్యాత్ముడు. కనుకనే కారాగృహంలో బంధింపబడియున్నను భగవన్నామమును క్షణకాలము విస్మరించక స్మరించాడు. తత్ఫలితముగా నారాయణుని శిరముపై ధరించాడు. ఆధ్యాత్మికమార్గము సంస్కారులకేగాని అహంకారులకు కాదు.

వసుదేవుడు కారాగృహమునుండి బయటకు వచ్చాడు. మేఘములు మెల్లగా వర్షింప సాగాయి. సత్పురుషుని రాక ఎప్పుడూ చల్లదనాన్నే కలిగిస్తుంది. శాంతినే అందిస్తుంది. ఆదిశేషుడు ద్వారము .దగ్గరే నిరీక్షించుచుండినాడు. వసుదేవుడు ముందుకు కదలగానే ఆదిశేషుడు వెనుక ఛత్రమువలె నిలిచి, పడగలను విప్పి, వర్షధార వసుదేవునిపై పడకుండా నిరోధించుచు అనుసరించుచుండెను. భగవానుని మనస్సుయందు నిలుపుకొని చరించు భక్తులను నడిపించుటలో పవిత్రాత్ములగు మహాత్ములు ఎప్పుడూ సహకరించుచునే యుందురు.

వసుదేవుడు యమునను సమీపించాడు. భయంకరమైన జలరాశియొక్క సడిసలన యమున సుడులు తిరుగుచు పరుగులిడు చుండెను. వసుదేవుడు సమీపించగానే యమున దారి ఇచ్చెను. భగవంతుని ధరించిన భక్తుని కాలప్రవాహము అడ్డగించదని భావము.

'యమున' చాలా పవిత్రమైనది. యముడనగా మృత్యువు. 'న' అనగా కానిది అని భావము. యమున శ్రీకృష్ణుని విభూతియైనందున అమృత రూపమైయున్నది. యమున నాశ్రయించినవారికి యమచెర యుండదు. శ్రీకృష్ణునకు యమునానది అంటే చాలాప్రీతి. సంయమము గలవారిని శ్రీకృష్ణుడు ఎప్పుడూ ప్రేమించుచునే యుండును.

రమతే యమునా పులిన వనే
విజయీ మురారి రధునా...

"విజయుడైన మురారి యమునానది తీరములో ఇసుకతిన్నెలపై గల వనప్రదేశము నందు విహరించుచున్నాడు" అని జయదేవ మహాకవి తన గీతగోవింద కావ్యములో రచించియున్నాడు. శ్రీకృష్ణుని చూడగానే యమున పొంగుతుంది. శ్రీకృష్ణుడు నీలవర్ణములో ప్రకాశించుచున్నాడని తానుకూడా నీలవర్ణమునే ధరించింది. భగవంతుని కళ్యాణగుణములను తమలో నింపుకొనేవారే భగవంతునికి ప్రీతిపాత్రులగుదురు.

యమునాదేవి దారి ఇచ్చింది. వసుదేవుడు ముందుకు నడుస్తున్నాడు. తన పడగలను ఛత్రమువలె విప్పి ఆదిశేషుడు వెంబడిస్తున్నాడు. యమున హృదయం

స్పందించింది. బాలకృష్ణుడు వసుదేవుని శిరముపై నున్న బుట్టలో యున్నాడు. ఈ దివ్యమంగళ రూపమును దర్శించే భాగ్యము మరొకసారి లభించేదికాదు. ఈ అవకాశమును వృథా చేసుకోగూడదని భావించింది. అంతే. ఇరువైపులను కరములు చాచినట్లు పైకి లేచింది. శ్రీకృష్ణుడు చిరునవ్వును చిందిస్తూ తనపాదములను ముందుంచాడు. యమునాదేవి భగవానుని పాదారవిందములను స్పృశించి పరవశించింది. యమున నదిరూపములో ఉన్నందున ఎప్పుడూ ఎత్తునుండి పల్లమునకే ప్రవహిస్తుంది. కానీ శ్రీకృష్ణుని దర్శించు నిమిత్తము పైకిలేచింది. భగవత్కృపకు పాత్రురాలైంది. భగవద్దర్శనంలో ప్లావితం కావలెనని పరితపించు సాధకుడు సహజమైన తన బలహీనతలను వీడి ఉన్నతంగా చరించాలి. ఉన్నతంగా చరించువానికే భగవత్కృప లభిస్తుంది.

వసుదేవుడు యమునను దాటాడు. శ్రీకృష్ణుని శిరముపై ధరించి వసుదేవుడు యమునానదిని దాటినట్లు, భగవానుని మనస్సులో నింపుకొని భక్తులైనవారు భవసాగరాన్ని దాటి తరించాలి.

గోకులంలో గోపాలు రందఱు నిద్రించుచుండిరి. వసుదేవుడు నందుని ఇంట ప్రవేశించి, శ్రీకృష్ణుని యశోద ప్రక్కన పడకపై పరుండబెట్టి, యోగమాయను దీసుకొని మరల వెనుదిరిగివచ్చి, కారాగృహంలో ప్రవేశించెను. దేవకి ప్రక్కన ఆ బాలికను పరుండబెట్టి, తాను పూర్వమువలె సంకెలలను తగిలించుకొని కూర్చొనెను.

అహా!...ఏమి ఈ విచిత్రము? శ్రీకృష్ణుని మోసినపుడు బంధములు విడిపోగా, మాయను మోయుగానే బంధములు తగులుకొనినవా? మనముకూడా మాయనువదలి, మాధవునే స్మరించాలి. అప్పుడే బంధ విముక్తులము కాగలము. ప్రసవవేదనలో అలసియుండుటచేత తన సంతానము బాలుడా? లేక బాలికయా? అనికూడా యశోద గుర్తించలేదు.

కంసునికి యోగమాయ సత్యము నెఱింగించుట

వసుదేవుడు మరల బంధీ అయెను. బిడ్డ ఏడ్చిన ఆక్రందన వినిపించగనే ద్వారపాలకులు నిద్రలేచిరి.

బహిరన్తః పురద్వారః సర్వాః పూర్వవదావృతాః

పురద్వారములన్నియు పూర్వమువలె లోపల బయట బంధింపబడి యుండెను. ద్వారస్థులు వెళ్ళి దేవకి ప్రసవించెనని వార్తను కంసునికి తెలిపిరి. ఆ మాట వినగానే కంసుడు భయభ్రాంతులకు గురియయ్యెను. జుట్టు వ్రేలాడుచుండ ఆవేదన చెందుతూ సూతికాగృహమునకు వచ్చెను.

దీనురాలగు దేవకి కంసునితో భయముతో తొట్రుపాటు పడెను. ఈ బిడ్డను వధించవద్దని ప్రాధేయపడెను. మేనకోడలయిన ఈ బాలికను వధించక, తనకొసంగమని

ప్రార్థించెను. నష్టపుత్రయైన తనను కరుణించుమని విలపించెను. చెల్లెలయగు తనకు శుభమును ప్రసాదించమని అభ్యర్థించెను.

ఉ॥ అన్నా! శమింపుమన్నా! తగ దల్లుడు గా డిది మేనగోడలా
మన్నన సేయుమన్నా! నిను మానినిఁ జంపుట రాచపాడి గా
దన్నా! సుకీర్తివై మనఁగదన్న మహాత్ములు వోవు త్రోవఁ బో
వన్నా! భవత్సహోదరిఁగదన్నా! నినున్ శరణంబు వేడెదన్.

అని దేవకి విలపించుచు విన్నవించుకొనెను. దేవకి విలాపము కంసుని మనస్సును మార్చలేకపోయింది. దుర్మార్గుడైన కంసుడు దేవకిని నిందించాడు. ఆమెచేతిలోని శిశువును బలవంతముగా లాగి, ఆ బిడ్డ రెండు పాదములను గట్టిగా పట్టుకొని బలముగా రాతిపై విసిరెను.

యోగమాయను కంసుడు వధించగలడా? వెంటనే ఆమె కంసుని చేతినుండి విడివడి గగనమున నిలబడి శూలము మొదలైన ఆయుధములు గల అష్టభుజ స్వరూపిణిగా గోచరించెను. "ఓరీ! మూర్ఖుడా! నీకు పూర్వశత్రువు, నిన్ను సంహరించువాడు మరియొకచోట పుట్టి పెరుగుతూనే యున్నాడు. అనవసరముగా అమాయకులైన శిశువులను వధించకు" అని చెప్పి అంతర్ధానమయ్యెను.

యోగమాయాదేవి మాటలు కంసుని హృదయమును మార్చినవి. కంసుడు పశ్చాత్తాప పడసాగాడు. దేవకీ వసుదేవులకు నమస్కరించుచు, "మీరిరువురును నన్ను క్షమించండి. నేను దుష్టుడను. బిడ్డలను నిర్దాక్షిణ్యంగా వధించిన పాపిని. నా పాపానికి నిష్కృతిలేదు. బంధువులను దూరంచేసుకొని బంధములను పెంచుకొని అంధజీవితమును ఆవిష్కరించుకొనిన అన్యాయమైన వ్యర్థజీవిని. నన్ను క్షమించండి."

క్షమధ్వం మమ దౌరాత్మ్యం సాధవో దీనవత్సలాః
ఇత్యుక్త్వా శ్రుముఖః పాదౌ శ్యాలః స్వస్రోరథాగ్రహీత్

"దీనులైనవారిపై కరుణను చిందించెడి మహాత్ములు మీరు. నా అపరాధమును క్షమించండి" అంటూ దేవకీ వసుదేవుల పాదములను పట్టుకొనెను.

యోగమాయాదేవి వాక్కులద్వారా పరివర్తన చెందిన కంసుడు దేవకీ వసుదేవులను బంధవిముక్తులను గావించెను. వారిరువురును శోక నివిర్ముక్తులైరి. కంసుడు గృహోన్ముఖుడయ్యెను.

సజ్జనులయందు పరివర్తన శాశ్వతముగా నిలుచును. దుర్జనులయందు పరివర్తన గోచరించునేగాని నిలువదు. స్థిరమైన ధ్యేయభావాలు లేనివారు అన్యభావ మారుతముచే పులివిస్తరివలె చెదరగొట్టబడుచుందురు.

ఆ రాత్రి అలా గడచిపోయెను. మరునాడు కంసుడు మంత్రిమండలిని సమావేశపరచెను. రాబోవు విపత్తును వివరించి, వారి సలహాల నర్థించెను. దుష్టభావులైన రాక్షసులు దుర్మార్గమైన నిర్ణయమును కంసుని ముందుంచిరి.

ఏవం చేత్తర్హి భోజేన్ద్ర పురగ్రామ వ్రజాదిషు
అనిర్దశాన్నిర్దశాంశ్చ హనిష్యామోఽద్య వైశిశూన్

"రాజేంద్రా! అనుజ్ఞను ప్రసాదింపుడు. మేము నేడే పుర, గ్రామ ప్రజలలో యున్న పదిదినముల లోపు, అంతకన్నా అధికవయస్సుగల శిశువులను వధించి, విపత్తును నిర్మూలించెదము" అనిరి.

"రాజా! శత్రుశేషము మంచిది గాదు. శిశువైనను శత్రువు శత్రువే. సంహరించుటయే తక్షణ కర్తవ్యము.

యథామయోఽఙ్గే సముపేక్షితో నృభి ర్న శక్యతే రూఢ పదశ్చికిత్సితుమ్
యథేన్ద్రియ గ్రామ ఉపేక్షిత స్తథా రిపుర్మహాన్ బద్ధ బలో న నా చాల్యతే

"ప్రారంభదశలో రోగమును నిర్మూలించనిచో అది వృద్ధిచెందిన పిదప నిర్మూలించను వీలుపడదు. ప్రథమముననే నిగ్రహించబడని ఇంద్రియములు ఆ తరువాత నిరోధించను వీలుపడదు. అలాగే శత్రువును మొదటనే సంహరించనిచో ఆ తరువాత నిగ్రహించను వీలులేని రీతిలో తయారగును. అట్టి స్థితిలో వానిని జయించుట దుష్కరమగును" అని పలుకుచు, విష్ణువును హృదయములయందు నిలుపుకొని యున్న తాపసులను వధించుటయే మార్గమని రాక్షస సచివులు తెలిపిరి. దుష్టులైనవారి సలహాలను కోరువాడు దుర్జనుడుగాక మరేమగును? సాధువులను, భక్తులను బాధించవలసినదిగా కంసుడు ఆజ్ఞాపించెను. రాక్షసులైన కంసుని అనుచరులు బ్రాహ్మణులను బాధించసాగిరి.

పరీక్షిన్మహారాజుకు భాగవత కథామృతమును అందించుచున్న శుకయోగీంద్రుడు ఈ దశలో ఒక సందేశమును అందించెను. సాధుహింస శ్రేయము హానిగూర్చుననియు, అది మృత్యు సదృశ ఫలము నందించుననియు తన యభిప్రాయమును తెలియజేసెను.

ఆయుః శ్రియం యశోధర్మం లోకానాశిష ఏవ చ
హన్తి శ్రేయాంసి సర్వాణి పుంసో మహదతి క్రమః

"రాజా! సాధువులను ఎవరైతే కష్టపెట్టుదురో - వారు ఆయువును, సంపదను, కీర్తిని, ధర్మమును, పుణ్యలోకములను, శ్రేయమును పోగొట్టుకొందురు" అని తెలిపెను.

సాధుహింస, సాధువులను వాంఛనీయములు గావు. నిందలెరుగని మహాత్ములను నిందించువారు ఏనాటికీ వందనీయులు కాలేరు. హింస ఎరుగని సంత్ పురుషులను హింసించువారు ఎన్నడూ పరమహంసలు కాలేరు. లోకకల్యాణార్థము జీవించేవారిని హింసించువారు లోకకంటకులే అవుతారు.

సరవర తరువర సంతజన్ చౌథా బరసే మేహా
పరమా రథకే కారనే చారా ధారీ దేహా

"సరోవరములు, వృక్షములు, సంత్ పురుషులు, మేఘాలు ఈ నలుగురు పరులకు ఉపకరించేందుకే జీవిస్తారు" అన్నాడు భక్త కబీర్‌దాస్. అట్టి పవిత్రాత్ములను హింసించుట యనెడి కార్యమువలన కంసుడు తన చితిని తానే పేర్చుకొనుచున్నాడు.

కంసుని హింసాకార్యములచేత మధురానగరము జీవన మాధుర్యాన్ని కోల్పోయింది. శ్రీకృష్ణుని దర్శన భాగ్యము చేత నందగోకులము సుందరనందన మైనది.

నంద వసుదేవుల సమాగమము

సూర్యోదయం ప్రపంచాన్ని వెలుతురులో నింపునట్లు, కృష్ణోదయం గోకులమును మంగళకరశోభతో ప్రభావితం చేసింది. శ్రీకృష్ణుడు విష్ణుమూర్తియొక్క అవతారము. పదునారు కళలతో అవతరించిన పూర్ణావతారము. మహావిష్ణువు వైకుంఠమును వీడి వ్రజభూమికి అరుదెంచుటవలన శ్రీనాథుని వదలి జీవించలేని లక్ష్మీదేవికూడా వైకుంఠమును వీడి వ్రజభూమి కరుదెంచి అంతర్లీనమైనది. సకల మంగళ మాంగల్య స్వరూపిణియైన లక్ష్మీదేవి ఆగమనంతో వ్రజభూమి వజ్రభూమిగా మారిపోయింది. నందగోకులమంతటా ఆనంద స్రోతస్సు గలగలపారింది. నందుని గని మహానందములో నిండినవారై నందుడు పరమానందముగ విందులను, పసందుగ వేడుకలను జరిపించెను. వేదవిదులను పిలిపించి స్వస్తి పుణ్యాహవాచనంబులను పలికించెను. జాతక కర్మలను చేయించెను. పితృదేవతల నర్చించెను. దానములు జేసెను. పౌరాణికులు గళమువిప్పి కృష్ణవైభవమును ప్రవచించసాగిరి. వందిమాగధులు కీర్తించసాగిరి. దుందుభులు, భేరీలు మ్రోగుచుండెను.

అందమైన పతాకములతోను, పల్లవతోరణములతోను నందగోకులమంతయు సింగారించబడి యుండెను. గోవులు, లేగదూడలు ఆనందమును వ్యక్తముచేయుచు "అంబా"యని అరిచాయి. మయూరములు పురివిప్పి నాట్యము చేయసాగాయి. యమున ఉత్సాహముతో పరవళ్ళు త్రొక్కుచున్నది. పక్షులు జతగూడి ఆనందముగా ముచ్చటించుకోసాగాయి. సంతోష సంభ్రమాలతో నందగోకులమంతా ఆనంద తాండవమును సాగించుచున్నది.

కుంకుమ, హరిద్రా చూర్ణములచేత విభూషితమైన ఆవులు, దూడలు, వృషభములు మంగళ రూపములతో కదలుచున్నవి. గోపబాలురు అందమైన దుస్తులతో, ఆభరణములతో, తలపాగలతో శోభించుచు చరించుచున్నారు. గోపికలు నందుని ఇంట పుత్రుడు జన్మించినా డనెడి వార్తనువిని, చక్కగా అలంకరించుకొని కదలి వచ్చుచున్నారు.

ఆ॥ ఏమి నోము ఫలమొ! యింత ప్రొద్దొకవార్త వింటి మబలలారొ వీను లలర
మన యశోద చిన్న మగవాని గనెనట చూచివత్తమమ్మ! ముదితలారొ

బాలుని జూచి సంతుష్టచిత్తులైన గోపికలు "చిరంజీవివై చిరకాలము ప్రభువుగనుండి ప్రజలను పాలించుము" అని దీవించిరి. వ్రజభూమి సౌందర్యము పరాకాష్ఠ నందుకొనిన పర్వదిన మిదియే.

చక్కనివాడు చిక్కినవాడు నల్లనివాడు అల్లరివాడు
చల్లనివాడు దక్కినవాడు ఏనాటి పుణ్యమో! ఏనోము ఫలమో!

అనుకొంటూ గోపాలురు, గోపభామలు అచ్చెరు వందుచుండ కంసునకు సుంకము చెల్లించుటకై నందుడు మధురానగరమునకు బయలుదేరెను.

తన ఆప్తమిత్రుడు, సోదరుడు నగు నందబాబా మధురకు వచ్చినాడని తెలియగానే వసుదేవుడు వెళ్ళి నందుని కలిసెను. ఇరువురును పరస్పరాలింగనము జేసుకొనిరి. వసుదేవుని గాంచి నందుడు పరమానందమును బొందెను.

"సోదరా! సంతానములేని నీవు ముదిమి ఈ వయస్సులో ఆ బాధనుండి విముక్తి పొందితివి. ఇది నీ భాగ్యము. మీరున్న ప్రదేశము గోవులకు అనుకూలముగా నున్నదా? అవి ఆరోగ్యముగా నున్నవి కదా?" అని వసుదేవుడు నందుని ప్రశ్నించెను.

వసుదేవుడు పుణ్యాత్ముడు. అందుచేతనే నోరులేని గోవుల క్షేమమును గూర్చి ప్రశ్నించుచున్నాడు. గోవులు సురక్షితముగా యున్న ప్రదేశమున దుర్భిక్షములు కలుగనేరవు. వసుదేవుడు మానవులపైననేగాక పశుపక్ష్యాదులపైన కూడా సమాన ప్రేమ చిందించును.

వసుదేవుని హృదయం వాత్సల్యముతో స్పందించింది. శ్రీకృష్ణుడు మదిలో మెదిలాడు. చిత్తము ద్రవించింది. నల్లనయ్య, చల్లనయ్య అయిన తన కన్నయ్యను పెంచే పుణ్యాత్ముడగు నందయ్యను చూడగానే కళ్ళు చెమ్మగిల్లాయి.

హృదయము తీవ్రముగా కదలిపోవుచుండ కదలలేని పెదవులను ప్రయత్నముతో కదలిస్తూ

భ్రాతర్మమ సుతః కచ్చిన్మాత్రా సహ భవద్వ్రజే,
తాతం భవన్తం మన్వానో భవద్భ్యాముపలాలితః

"సోదరా! నా కుమారుడు మీ దంపతులచే ప్రేమించబడి లాలించబడుచు మిమ్ము తండ్రిగా భావించుచున్నాడా? తల్లితోపాటు కుశలముగా నున్నాడా?" అని ప్రశ్నించుచుండ కంఠము గద్గదమాయెను.

కృష్ణుడు మదిలో మెదలగనే వసుదేవుని కంఠము గద్గదమయ్యెను. భగవానుని నామము చెవిని పడగానే ఎవరి కంఠము గద్గదమగునో, ఎవరి నేత్రములవెంట బాష్పములు జాలువాఱునో వారే ఉత్తమ భక్తులు.

కంఠావరోధ రోమాఞ్చాశ్రుభిః పరస్పరం
లపమానాః పావయన్తి కులాని, పృథివీం చ

"పరమ భక్తులు పరస్పరము గద్గద స్వరముతో, పులకాంకిత గాత్రులై ఆనంద బాష్పములు రాలుచుండ, భగవద్భక్తిని గూర్చి సంభాషించుకొనుచు వంశములను, లోకమును పావన మొనర్చుచున్నారు" అని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలియజేసినారు.

నయనం గల దశ్రుధారయా వదనం గద్గద రుద్ధయాగిరా
పులకై ర్నిచితం వపుః కదా తవ నామ గ్రహణే భవిష్యతి.

"హే జగన్నాథా! నీ నామమును స్మరించుచుండగా నా నేత్రములనుండి ఆనందాశ్రువులు ఎన్నడు జాలువారునో గదా? ఆనంద పారవశ్యములో కంఠము ఎన్నడు

గద్గదమగునో గదా? దేహమెన్నడు పులకాంకితమగునో గదా?" అని శ్రీకృష్ణచైతన్య మహాప్రభువు పరితపించుచు స్తుతించినాడు.

తన కుమారుని క్షేమమును ఇచ్చట వసుదేవుడు ప్రస్తావించెను. తన అంతర్యములో శ్రీకృష్ణుని భావనచేసి, బాహ్యానికి బలరాముని గూర్చియు, రోహిణిని గూర్చియు అడిగినట్లు నందునితో కుశలమడిగెను. ఈ విషయమును ఆంధ్రమున పోతనామాత్యుడు రమణీయముగా రచించెను.

క॥ నీకాంతయొద్ద నీవును, నీ కాంతయు గారవింప నిను దండ్రిగ నా
లోకించుచునీమందను నాకొడుకున్నాఁడెనంద నందాన్వితుఁడై.

వసుదేవుని పలుకులను విని నందుడు ఆతనిని తృప్తిపరచే విచిత్రము ప్రశాంతనపలుకులు పలుకసాగాడు. ఎదుటివారి దుఃఖములను పోగొట్టు వచనములను పలుకువారు ధన్యాత్ములు. ఇతరులకు వారు సంతృప్తి నిచ్చెదరు గాన వారును సదా సంతుష్టచిత్తులై యుందురు. నందుడు అనగా సంతోష భరితుడు అని భావము.

శా॥ నీకున్ దేవకికిన్ జనించిన సుతానీకంబు రోద్రోదము
న్నీకంసుడు వధించె నీసుతఁ దుదిన్ హింసింపఁ జేఁదప్పిలా
నాకాశంబున కేఁగె బాల యది దైవాధీన మానర్దశన్
శోకం బందునె తద్దుఃఖాదుడను నాసూనుండె నీసూనుఁడున్.

అని చక్కగా ఓదార్పు వచనములను పలికెను. వసుదేవుడు సంతృప్తి చెందినవాడై "సోదరా! నీవు కంసునికి పన్ను చెల్లించినావు. అల్మీయుడనైన నన్ను జూచినావు. ఇక ఇచ్చట ఉండుట నీకు ఉచితముగాదు. గోకులమున శత్రువుల వల్లనగుచే అత్యాచారములు జరుగునని నా మది శంకించుచున్నది. నీవు వెంటనే బయలుదేరుము" అని వసుదేవుడు పలికెను. వసుదేవుని మాటల నాలకించి, గోపులతోగూడి నందుడు వృషభములను బూన్చిన శకటమునందు గూర్చొని గోకులమునకు బయలుదేరెను.

వృషభమనగా ధర్మము అని అర్థము. ధర్మదృష్టి గలవాడైనందున భగవానుడు "వృషభాక్షః" అనియు ధర్మమే ప్రియముగా గలవాడైనందున "వృషప్రియః" అనియు, ధర్మ కర్మాచరణము గలవాడైనందున "వృషకర్మ" అనియు, ధర్మమే తన స్వరూపముగా గలవాడైనందున "వృషాకృతిః" అనియు విష్ణు సహస్రనామ స్తోత్రమున స్తుతించబడి యున్నాడు.

తమ జీవన శకటమునకు ఎవరు ధర్మమును వాహనముగా పెట్టుకొని చరింతురో అతడే నందుడు. జ్ఞానపుత్రుని కనే భాగ్యమునకు నోచుకొనిన పుణ్యాత్ముడు. అధర్మ మెఱుగనివాడు. ధర్మమార్గముననే చరించువాడు. ధర్మమార్గమున చరించువారికి దుఃఖములు కలుగవు. వారు సదానందులే.

భగవానునకు 'నంద' అను నామముకూడా కలదు. ప్రాపంచిక విషయములకు దూరుడైనందున భగవానుడు 'నందః' అని కీర్తించబడెను. నందుడుకూడా విషయా

నందమునకు దూరుడై చరించెను. సుంకము చెల్లించుటకు మధురకు వెళ్ళినను, విషయసుఖాలలో చరించు కంసునితో తాను ముచ్చటించక, శ్రేయోమార్గమున రమించు వసుదేవునితో ప్రసంగించెను. ఆత్మజ్ఞానపరులు నిత్యమూ ఆనంద స్వరూపులుగనే యుందురు. అట్టివారు ధర్మమును తప్పరు. కావుననే నందబాలా వృషభములను బూన్చిన శకటము నధిరోహించి గోకులమునకు వెళ్ళెను.

గోకులమున శ్రీకృష్ణుడున్నాడు. గోకులము ఎక్కడో లేదు. మానవ హృదయమే గోకులము. ధర్మవాహనారూఢులమై పయనించినచో హృదయమనెడి గోకులమున శ్రీకృష్ణుడనెడి పరమాత్మను దర్శించగలము.

బాలహంత్రి పూతన

కంసుని ఆజ్ఞానుసారము శిశువులను రాక్షసులు వధించసాగారు. కంసుని అనుచరులలో పూతన అను రాక్షసి గలదు. అది శిశుఘాతకి. బాలహంత్రి. భయంకర స్వరూపిణియగు పూతన నందగోకులము చేరినది. భువనమోహనుడు, శ్యామసుందరుడు నగు శిశువు నందుని ఇంటిలో ఉన్నట్లు పసిగట్టింది. శిశువును వధించుటకు పన్నాగమును పన్నినది.

పదిరోజుల లోపు, అంతకన్నా నెక్కువ వయస్సు గల శిశువులను సంహారించమని కంసుని ఆజ్ఞ. పదిరోజుల లోపువారు అనగా దశేంద్రియములకు దాసులు లేదా లొంగినవారు అని అర్థము. అంతకన్న నెక్కువ అనగా మనో స్థాయిలో చరించువారు అని భావము. ఇంద్రియ మనోబుద్ధులకు పరిమితమైన వ్యర్థజీవులను పూతన వధించును.

పూతన అనగా అజ్ఞానము. 'పూత' అనగా పవిత్రమైనది అని అర్థము. ఈ జగత్తులో పవిత్రమైనది ఏమున్నది? మృత్యువును ఆలింగనము చేసుకొనునది ఏదియును పవిత్రము కాబోదు. కనుక జ్ఞాన మొక్కటియే పవిత్రమై యున్నది.

బహవో జ్ఞాన తపసా పూతా మద్భావ మాగతాః

"నన్నాశ్రయించిన వారు జ్ఞానమనెడి తపస్సుచేత పవిత్రులై నా స్వరూపమునే పొందిరి" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత - 4వ అధ్యాయమైన జ్ఞానయోగమునందు తెలిపియున్నారు. కనుక పవిత్రమైన వస్తువు జ్ఞానమేనని తెలియుచున్నది.

నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే

"జ్ఞానముతో సమమైనది, పవిత్రమైనది మరియొకటి లేదని భగవద్గీత తెలుపుచున్నది. కనుక 'పూత' అనగా పవిత్రమైనది. అదియే జ్ఞానము. 'పూతన' అనగా పవిత్రము కానిది అని అర్థము. అదియే అజ్ఞానము లేక అవిద్య. పూతన కురూపి, రాక్షసి. కానీ మాయచేత అందముగా గోచరిస్తుంది. మాయచేస్తుంది. మాయం చేస్తుంది. అలాగే అజ్ఞానముకూడా

పైకి మోహనముగా గోచరిస్తుంది. చివరికి మాయలో పడదోస్తుంది. ముందు పాలు ఇచ్చి తరువాత విషాన్ని దింపే పూతన అజ్ఞాన ప్రతిరూపము.

పూతన మోహన రూపం ధరించింది. నందుని గృహమును సమీపిస్తున్నది. పూతన మనోహర రూపలావణ్యమును గాంచి గోప భామలెల్లరు సంభ్రమములో కదలిపోయారు. ఆమె సౌందర్యానికి ముగ్ధులైన గోపికలు,

అముం పతాంభోజకర రూపిణీం
గోప్యః శ్రియం ద్రష్టుమివాగతాం పతిమ్

"శ్రీకృష్ణుని దర్శించుటకై అరుదెంచిన లక్ష్మీదేవి" యని అభిప్రాయ పడినారు.

యశోద పూతనను చూసింది. ఆమె రూపలావణ్యమును గాంచి విస్మయమొందినది. అవును మరి. మాయకు లొంగనివారెవరు?

"ఎంత చక్కనయ్యని కన్నావు తల్లీ! నీ భాగ్యమే భాగ్యము! మేమూ బిడ్డలను గన్నాము. ప్రయోజన మేమున్నది? కన్నామే గాని కనులారా గనేందుకు కూడా మన స్సంగీకరించదు. ఈ 'నల్లబంగారాన్ని ఎంతచూసినా తనివి తీరడంలేదు. తల్లీ! మేము నీవంటి ఇల్లాలినే. కానీ నీలాంటి పుణ్యము నాకులేదు. అందువలనే ఈ బంగారయ్యలాంటి బిడ్డను మేము పొందలేకపోయాము" అని యశోదను పొగడసాగింది. ఆమె పొగడ్తల నాలకిస్తూ యశోద కరిగిపోసాగింది. నిజమే కదూ! పొగడ్తల మధ్య పొంగిపోని వారెవరుంటారు? పొగడ్తలు వినే అలవాటు చాలా చెడ్డది. పొగడ్తలకు అలవాటు పడినవారికి శాంతి మిగలదు. ఎవరైతే పొగడ్తలను అతిక్రమిస్తారో వారే అతీతులు కాగలరు. పొగడ్తలకు లొంగుటవలననే యశోదకు ఆపద సంభవించినది.

పూతన బహుచక్కగ మాట్లాడుతుంది. అజ్ఞాన ప్రలాపములు ఎప్పుడూ మధురంగా ఉంటాయి. ఎవరు మనలను పొగడినా వెంటనే పూతనను స్మరణకు తెచ్చుకొని, పొగడ్తలమధ్య కరగకుండా అతీతంగా కదలిపోవాలి.

"అమ్మా! నష్టజాతకురాలగు నాకు ఇలాంటి బిడ్డను కనే భాగ్యము ఎలా కలుగుతుంది? మీలాంటి పుణ్యమూర్తులకే ఈ మహాభాగ్యం కలుగుతుంది. కానీ నాదొక చిన్నవిన్నపము. శిరమొగ్గి నమస్కరించి అడుగుచున్నాను. నీ కన్నయ్యను కని పెంచే పుణ్యాన్ని నేను తెచ్చుకోలేదు. పాపినైన నాకు మీ ఔదార్యమే పుణ్యాన్ని కలిగించాలి. మీ ప్రేమే నన్ను పవిత్రురాలిని చేస్తుంది. ఈ నల్లనయ్యకు కాసిన్ని పాలిచ్చే భాగ్యాన్ని నా కనుగ్రహించండి" అని అర్థించింది.

మాయామర్మము తెలియని యశోదాదేవి మారు పలుకకుండా 'సరే' యని లోని కెళ్ళింది. అమాయకురాలగు యశోదకు తాను బిడ్డని రాక్షసికి అప్పగించి వెళుతున్నట్లు తెలియదు.

పూతన ఊయలవైపు నడుస్తున్నది. ఊయలలో వటపత్రశాయి వలె పరుండియున్న బాలకృష్ణుని దర్శించింది. వెంటనే ఊయలలో నున్న శ్యామసుందరుడు నేత్రములను మూసినాడు.

విబుధ్య తాం బాలకమారి కాగ్రహం చరాచరాత్మా స నిమీలి తేక్షణః

"చరాచరములకు ఆత్మయగు శ్రీకృష్ణుడు పూతనను శిశుఘాతినిగా తెలుసుకొని వెంటనే నేత్రములు మూసికొనెను." అవును, జ్ఞానస్వరూపుడగు శ్రీకృష్ణుడు అజ్ఞాన స్వరూపిణియైన పూతనను వీక్షించునా? అందుచే నేత్రములు మూసికొనెను. మనముకూడా ఎన్నడూ చెడును వీక్షించకూడదు. చెడు కనిపించగనే దర్శించకుండా నేత్రములను మూయవలెను.

భగవానుడు ఏది ఆచరించినను ఆ క్రియ విశేష జ్ఞానసముదాయమై యుండును. పూతనను జూచి శ్రీకృష్ణుడు నేత్రములను మూసిన ఈ సంఘటనను అనేకమంది భక్తులు అనేక విధములుగా భావించియున్నారు.

పూతన స్త్రీ. స్త్రీ అబల. అబలయైన స్త్రీని వధించుట యుక్తముకాదని శ్రీకృష్ణుడు నేత్రములను మూసినట్లు ఒక వ్యాఖ్యానకర్త అభిప్రాయపడినాడు. కాని ఈ భావము సరిపోవునా? శ్రీకృష్ణుడు అజ్ఞానమును హరించుటయే ప్రథమ కర్తవ్యముగా గలిగినవాడు. అంతేకాని ఈ విషయమునందు లింగ భేదము దర్శనీయము కానేరదు అని మరియొక వ్యాఖ్యాత అభిప్రాయపడి తానొక నూతన భావమును జోడించినాడు.

భగవంతుని చేతిలో మరణించడమనే మహద్భాగ్యము అందరికీ తేలికగా లభించదు. మరి కృష్ణునిచేతిలో మరణించబోయే పూతనకు తప్పక సుగతి కలిగియే తీరును. అయితే రాక్షసి, బాలఘాతకి యగు ఈ పూతన ఏ పుణ్యము వలన ఈ భాగ్యానికి నోచుకొనినది? అని శ్రీకృష్ణుడు పూతన యొక్క పూర్వ పుణ్యవిశేషమును తిలకించసాగాడు అని వ్యాఖ్యాత అభిప్రాయపడినాడు.

వింధ్యావళీ బలిచక్రవర్తులకు రత్నమాల అనే కుమార్తె యుండెడిది. బలినుండి దానమును గ్రహించుటకు శ్రీమహావిష్ణువు వామనమూర్తిగా అరుదెంచెను. కోటిసూర్య సమప్రభావుడై కదలివస్తున్న వామనమూర్తిని రత్నమాల గాంచెను. అతని బ్రహ్మవర్చస్సును గాంచి అచ్చెరు వొందెను. తనకు అలాంటి పుత్రుడుండిన బాగుండు ననెడి తలంపు కలిగెను. ఆ తరువాత వామనుని అభీష్టము మేరకు మూడడుగులు దానమివ్వడము, వామనుడు బలిని పాతాళానికి పంపడము జరిగినది. తన తండ్రిని పాతాళానికి పంపిన వామనుని నశింపజేయవలెనని తీవ్రంగా ఆలోచించెను. పుత్ర భావమును హృదిలో నింపుకొని పాలివ్వవలె నని స్పందించెను. శత్రుభావమును మదిలో దింపుకొని విషము నివ్వవలె నని సంకల్పించెను. చేసిన సంకల్పము ఏదీ వృథాగాదు. పరస్పర విరుద్ధమైన ఈ రెండు సంకల్పముల ఫలితముగా తాను ఈ జన్మలో పూతనయై వచ్చెను. విష, క్షీరములను రెండింటిని భగవానుని కిచ్చెను.

ఈ భావము అసలే సరిపోదని మరియొక వ్యాఖ్యాత అభిప్రాయపడెను. పూతన యొక్క పూర్వపుణ్యవిశేషమును గూర్చి స్మృతి తెచ్చుకొనుటకు భగవానుడు మహాస్థాయిలో నుండువాడా? సమస్తజ్ఞానములు, భూత భవిష్య ద్వర్తమానములు ఆయన కుక్షియందే

నిలిచియుండ స్మృతి విస్మృతులకు అక్కడ అవకాశము లేదు. పూతనయొక్క పూర్వపుణ్య విశేషమును గూర్చి భగవానుడు స్మృతి తెచ్చుకొనుచున్నా డనెడి భావము సరిపోదని అభిప్రాయపడుచు తానొక అభిప్రాయమును అందించెను.

పూతన శ్రీకృష్ణునికి విషము నిచ్చెను. విషము నందించిన పూతనకే ముక్తి నందించినచో, ప్రేమతో తనకు నవనీతము నందించి అహోరాత్రములు తనను గూర్చియే చింతించు గోపికలను ఎలా అనుగ్రహించవలె నని శ్రీకృష్ణుడు కళ్ళు మూసుకొని ఆలోచించుచున్నాడని ఆయన భావించెను.

ఈ భావముకూడా సరిపోవుటలేదని మరియొక వ్యాఖ్యాత భావించినాడు. కర్మఫల ప్రదాతయైన భగవానునకు అంతమాత్రము తెలియదా?

యోయత్కర్తా స తదజ్ఞః

"జగత్తునకు సంబంధించిన జ్ఞానము జగదీశ్వరునకు సంపూర్ణముగా యుండు"నని న్యాయశాస్త్రము తెలుపుతుంది. కనుక జీవుల కర్మఫలితములను గూర్చి నేత్రములు మూసి యోచించవలసిన అగత్యము భగవానునకు లేదని అభిప్రాయపడి తానొక భావమును వెలిబుచ్చెను.

పూతన బాలహంత్రి యగు రాక్షసి. శ్రీకృష్ణుడు భగవానుడు. భగవానుని దృష్టి ప్రసరించబడగానే పూతనలో పరివర్తన కలుగనచ్చు. బాలుని వధించవలె ననెడి తలంపు మాసిపోవునేమో? అదే జరిగినచో కథ అంతయూ తారుమారగును. అందుచేత తన నేత్రయుగ్మమునుండి కదలే దివ్యప్రకాశము పూతనపై పడకుండా శ్రీకృష్ణుడు నేత్రములను మూసెను అని అతడు అభిప్రాయపడినాడు.

పైన తెలిపిన భావము ఏమాత్రము సమంజసముగా లేదు అని ఇంకొక వ్యాఖ్యాన కర్త భావించినాడు. శ్రీకృష్ణుని దృష్టి పారించబడగానే పూతనలో పరివర్తన వచ్చునా? అయితే దుర్యోధనునిలో పరివర్తన ఎందులకు కలుగలేదు? శిశుపాలుడు ఎందులకు మారలేదు? కంసుడు ఎందుకని చలించలేదు? చెట్టుకు మాధుర్యాన్ని ఇచ్చేది వర్షము కాదు. ఆ చెట్టులోని సుగుణమే. వర్షమును గ్రహించి తాను వృద్ధిపొందుచూ వృక్షము తన సహజ లక్షణమగు తీపినో లేదా చేదునో వ్యక్తము చేయును. కాయలోని తియ్యదనానికి గాని, చేదుదనానికిగాని వర్షము కారణము కానేరదు. అలాగే మహాత్ములైనవారు భగవద్దర్శనముతో ప్రభావితులై తరించవచ్చు. అంతమాత్రాన ప్రతి ఒక్కరు అలాగే ప్రభావితు లగుదురనిగాని, తరింతురు అనిగాని చింతించుటకు వీలులేదు. కనుక శ్రీకృష్ణుడు నేత్రములు మూయుటకు గల కారణము ఇది కాబోదని అభిప్రాయపడి, తనకు తోచిన ఇంకొక భావమును తెలియజేసెను.

శ్రీమహావిష్ణువు పదునారు కళలతో ఆవిర్భవించిన ఈ కృష్ణావతారంబున ఆద్యపురుషుడగు నారాయణుడు బాలముకుందుడై యున్నాడు. బాలకృష్ణుని దివ్యరూపమును గాంచవలెనని కైలాసమున పరమశివుడు ఉత్సాహపడెను. పూతన అరుదెంచిన ఈ సమయాన శ్రీకృష్ణుడు నేత్రములను మూసెను. సంయోగముగా ధ్యాన సమయమునందు

మనము నేత్రములను మూయుచుందుము. శ్రీకృష్ణుడు నేత్రములను మూసి కైలాసపతిని ధ్యానించుచుండెను. "పరమేశ్వరా! ఈ పూతన పాలిచ్చునట్లు అరుదెంచి విషమును అందించును. నేను కృష్ణుడను. నాకు క్షీరపానమే తెలుసు. నీవు నీలకంఠుడవు. విషపానము నెఱిగినవాడవు. కనుక నీవు నాకు సహాయము చేయుము. పూతన క్షీరము నందించినచో నేను పానము చేయుదును. విషమును చిందించినచో నీవు పానము చేయవచ్చును" అని పరమేశ్వరుని పిలుచుటకు శ్రీకృష్ణుడు నేత్రములను మూసుకొనెనని ఒకడు అభిప్రాయపడినాడు.

భగవానుని దివ్యలీలలు అద్భుతములు. అనూహ్యములు. శ్రీకృష్ణుడు పూతనను గాంచి కన్నులు మూసిన ఈ సంఘటనను అనేక రీతులుగా భక్తులు భావించి, తమలోని భక్తిని పెంపొందించుకొనినారు.

పూతన శ్రీకృష్ణుని సమీపించినది. హృదయములో విషమును నింపుకొని, పైకి సౌందర్యముగా గోచరించు వారలను భగవానుడు ఎన్నడూ వీక్షించడు. అందుచేతనే నేత్రములను మూసుకొనెను. అపవిత్ర జీవనము సాగించువారు శ్రీకృష్ణుని ఆశీర్వాదమును పొందలేరు. పూతన కన్నయ్యను ఎత్తుకొని తనఒడిలోకి తీసుకొన్నది. అది వాస్తవానికి మృత్యుఒడియే. కానీ శ్రీకృష్ణుని పరిస్థితి వేఱు. అతడు జగన్నాథుడు. మృత్యువునకు మృత్యువు తానై యున్నాడు. అందుచేత పూతన శరీరము తన బాల్యక్రీడకు రంగస్థల మాయెను.

అనన్త మారోప యదఙ్క మస్తకం
యథోరగం సుప్తమబుద్ధి రజ్జు ధీః

"సర్పమును త్రాడుగా భావించి, అజ్ఞానియైన మానవుడు పామును ఒడిలో నుంచుకొనునట్లు, తనను వధించు శ్రీకృష్ణుని పూతన తన ఒడిలోకి తీసుకొనినది" అని శ్రీమద్భాగవతము తెలిపినది.

శ్రీకృష్ణుని పూతన తన ఒడిలోనికి తీసుకొన్నది. విషలిప్తమైన తన కుచములను ముందుంచి శ్రీకృష్ణునికి అందించవలె నని అభిప్రాయపడింది. పైటతొలగించింది. స్తనములను అందించింది. చప్పిచ్చు మబ్బు చంద్రుని కప్పినట్లు చెంగు కప్పింది. అంతే. ఆమె మేను పులకరించింది. మనస్సు పట్టు తప్పింది. ఇంద్రియాలు పరవశించిపోతున్నాయి. అర్థంగాని అనుభూతి హృదయాన్ని పెనవేసుకొన్నది.

ఆహా!.... పూతన జన్మసార్థక్యతను బొందినది. సఫలత నొందినది. పూతన దివ్యతేజోమయమైన అనిర్వచనీయ పారవశ్యభూమికకు చేరుచున్నది. శ్రీకృష్ణుని అధరములు పూతన కుచమొనలను స్పృశించాయి.

ఆదియందు వేదములను ప్రవచించిన పవిత్ర అధరములు పూతనను పవిత్ర మొనర్చినాయి. సమస్త విశ్వమును మోహింపజేసిన మురళీరవళిని కదలించబోయే భగవానుని పెదవులు పూతనకు అత్యుత్తమపదవి నందించుటకు చన్నులను ముట్టుకున్నాయి.

అర్జునునికి తత్త్వోపదేశమును గావించి, యావత్ప్రపంచమునకు నిత్యవెలుగులను ప్రసాదించే అధరాలు పూతనకు ముక్తిని ప్రసాదించుటకు ముందు కురికినవి. పదునారువేల గోపికల చెక్కిళ్ళపై కదిలే అధరాలు పూతన పుణ్యమా అంటూ చెంగులో దాచబడినాయి.

దేవతలు పూతన భాగ్యమును గాంచి ఈర్ష్య జెందినారు. ఆదిలక్ష్మి అసూయను కనబరచింది. గోవులు దీనంగా చూశాయి. రాధ మందహాసమును చిందించింది.

పూతనకు గగుర్పాటు కలిగింది. శరీరమంతా పారవశ్యంతో పులకరించి పోతున్నది. అనూహ్యమైన ఆనందముతో మెలికలు తిరిగిపోతున్నది. ఆనందం పరాకాష్ఠ నందుకొన్నది. నేత్రములను తెరువలేకపోయినది. క్రమేపి ప్రాణములు కదలసాగినాయి. ఉత్క్రమణోత్సవము ప్రారంభమైనది. పూతన కెవ్వుమని కేకవేసింది. స్తన్యపానముతో బాటు ప్రాణములనుకూడా శ్రీకృష్ణుడు హరించసాగాడు. పూతన భరించలేకపోయింది.

సా ముంచ ముంచాల మితి ప్రభాషిణీ
నిష్పీడ్య మానాఖిల జీవమర్మణి

ప్రాణములకు ఆశ్రయస్థానము లైన మర్మావయవము లన్నియు కదలసాగగా పూతన "విడువుము - విడువుము. చాలు - చాలు" అని కేకలు పెట్టెను.

"విడువుము-విడువుము" అని పూతన అరచుటలో గొప్ప భావమున్నది. శ్రీకృష్ణుని అధరములు ఆమె ఎదను అంటగనే పూతనకు నిజమేమిటో, తనకు నిజమైన ఆశ్రయస్థాన మేమిటో తెలిసివచ్చెను. ఇహలోక, పరలోక సుఖములేవియు శాశ్వతమైనవి కావనియు, మోక్ష మొక్కటియే శ్రేయము నొసగూర్చునది యని గ్రహించగలిగెను. ఇహలోక, పరలోక బంధములనుండి తనను విడిపించమని కోరుటయే రెండుపర్యాయములు 'విడువుము-విడువుము' అనుటలోని భావార్థము.

విచలితమైన పూతన క్రమంగా తన వికృతరూపమును వ్యక్తపరచెను. మొదలు నరికిన మహావృక్షమువలె పూతన క్రిందబడెను. ఆ శబ్దమునకు భూమి కంపించినది. వ్రజవాసులెల్లరు భయభ్రాంతులకు లోనయ్యారు.

పతమానోఽపి తద్దేహ స్త్రిగవ్యూత్యన్తరుద్రుమాన్
చూర్ణయామాస రాజేన్ద్ర మహదాసీత్త దద్భుతమ్

ఆ పూతన శరీరము పతనమగుచుండగ ఆఱు క్రోసుల దూరము భూమిపై గల వృక్షములన్నియు నుగ్గునుగ్గయ్యెను. ఆమె దేహము విస్మయమును కలిగించుచుండెను. భయంకరమైన కోఱలను గలిగియుండెను. ముక్కు రంధ్రములు గిరి లోయలవలె గోచరించుచుండెను. కుచములు కొండశిఖరములనుండి జారిన పెద్ద బండవలె తెలియుచుండెను. కుక్షి జలములేని మడుగువలె కన్పించుచుండెను.

పూతన నేల రాలింది. ప్రాణము వదలింది. ఆమె స్తనములనుండి స్రవించిన పాలు తెల్లటి మడుగులా తయారైంది. ఆమె కుచాగ్రముల నుండి స్రవించిన రక్తము తెల్లటి పాల మధ్య ధారవలె నిలిచియున్నది. కూలిన రాక్షసిపై పారాడుతూ బాలకృష్ణుడు క్రీడించసాగెను.

పూతన శరీరమును గాంచి యశోదా రోహిణీలు భయముతో కదలిపోయిరి. ఆమె శరీరముపై పారాడుతున్న ముకుందుని గాంచి అమితానంద భరితులై బాలుని తీసుకొని, ఇంటికి తీసుకువెళ్ళి గోపుచ్ఛమును త్రిప్పుచు దిష్టితీశారు. రక్షపలికారు. బిడ్డడు సురక్షితంగా ఉన్నందుకు సంతసించి, అనేక విధముల మ్రొక్కులను శపథంచేశారు. శ్రీకృష్ణునికి ఏ ఆపద రాకూడదని గోపికలు భగవానుని ప్రార్థించారు. యశోదాదేవి శ్రీకృష్ణునికి స్నానము చేయించెను. స్తన్యపానము నొసగి పరుండబెట్టెను.

ఇంతలో నందుడు మధురనుండి గోకులము వచ్చెను. అచ్చట చచ్చిపడియున్న పూతనను జూచెను. జరిగిన విషయమునంతటిని ఆలకించెను. గోకులంలో ఉత్పాతములు జరుగునని వసుదేవుడు చెప్పిన వచనములు గుర్తు తెచ్చుకొనెను. వసుదేవుడు గొప్ప తపస్వి అయియుండునని తలంచెను.

గిరితుల్యమైన పూతన శరీరమును నందుని ఆజ్ఞమేరకు గొడ్డళ్ళచే నరికి ఆ దేహఖండములను దగ్ధము చేయసాగిరి. పూతన శరీరము దగ్ధమగుచుండ దాని దేహమునుండి సువాసనలు వెదజల్లబడుచుండెను.

దహ్యమానస్య దేహస్య ధూమశ్చా గురుసౌరభః
ఉత్థితః కృష్ణ నిర్భుక్త సపద్యాహ తపాప్మనః

శ్రీకృష్ణుడు పూతన స్తనములనుండి క్షీరమును పానము చేయుటవలన దాని పాపము లన్నియు నశించెను. అందుచేత పూతన దేహము దహించబడు సమయాన ఆ దేహమునుండి సుగంధభరిత సౌరభము బయల్వెడలెను.

పూతన శ్రీకృష్ణునికి విషమును అందించి అమృతత్వమును పొందినది. భగవానునకు ఏది ఇచ్చినను తద్వారా మనకు శ్రేయమే లభించును.

తదర్పితాఖిలా చారః సన్ కామక్రోధాభిమానాదికం తస్మిన్నేవ కరణీయమ్

"భక్తుడు సమస్త కర్మములను భగవానుని యందు అర్పించి-కామము, క్రోధము, అభిమానము మొదలగు దుర్గుణములను ఆ భగవంతుని యందే లయింపజేయ వలెను" అని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలియచేస్తారు. తనలోని ఘాతుక స్వభావమును పూతన శ్రీకృష్ణుని మీదికి మరలించింది. తరించింది.

పద్భ్యాం భక్తహృది స్థాభ్యాం వన్ద్యాభ్యాం లోకవన్దితైః
అఙ్గం యస్యాః సమాక్రమ్య భగవానపి తత్ స్తనమ్
యాతు ధాన్యపి సా స్వర్గము వాప జననీ గతిమ్
కృష్ణ భుక్త స్తన క్షీరాః కిము గావోఽను మాతరః

"శ్రీకృష్ణుడు భక్త హృదయవాసి. దేవాది మహాత్ములచే పూజింపబడిన తన పాదయుగళిచే ఆయన పూతన దేహమును త్రొక్కిపట్టి ఆమె స్తన్యమును పానముచేసెను. పూతన రాక్షసి యైనను తల్లులకు లభించు స్థానమును పొందినదియై స్వర్గప్రాప్తి నొందెను. శ్రీకృష్ణుడు ఎవరి స్తన్యమును పానముచేసెనో అట్టి గోమాతలు, మాతృదేవతలు ఉత్కృష్ట

స్థానమును పొందుదురనుటలో సందేహములేదు" అని శ్రీమద్భాగవతము నందు వ్రాయబడియున్నది.

పూతనాసంహారము అనెడి ఘట్టములో అనేక అద్భుతములైన ఆధ్యాత్మిక రహస్యములు చోటుచేసుకొని యున్నవి. ఈ అధ్యాయమును నిత్యము పారాయణము చేసినచో భగవానుని యందు ఆసక్తి మెండగును.

య ఏతత్ పూతనా మోక్షం కృష్ణ స్యార్భక మద్భుతమ్
శృణుయా చ్ఛ్రద్ధయా మర్త్యః గోవిన్దే లభతే రతిమ్

"పూతనామోక్ష మను శ్రీకృష్ణుని ఈ అద్భుత బాల్యక్రీడను శ్రద్ధతో ఎవడయితే శ్రవణముచేయునో అట్టివాడు శ్రీకృష్ణునియందు ఆసక్తిని పూర్ణముగా పొందును" అని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుకు తెలియచేసెను.

పూతనను సంహరించునాటికి శ్రీకృష్ణుని వయస్సు ఆరు దినములు. ఆరవనాడు కృష్ణుడు పూతనను వధించెను. పూతన అనగా అజ్ఞానము అని గ్రహించినాము. అజ్ఞానమువలన కలిగెడి దుర్గుణములు ఆరు. అవియే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము అనెడి అరిషడ్వర్గములు. అరిషడ్వర్గముల ప్రతినిధియే పూతన. ఆరు దుర్గుణములను కలిగిన పూతనను ఆరవ దినమున వధించి, అరిషడ్వర్గములను అంతమొందించి, తరించవలె నని మనకు సందేశము నందించెను. శ్రీకృష్ణుడు షడ్గుణైశ్వర్య సంపన్నుడు. ఆరు భగవదైశ్వర్యములను సంపాదించుకుని శ్రీకృష్ణునివలె జ్ఞానస్వరూపు లైనవారు మాత్రమే షడ్వికారములకు స్థానమైన పూతన యనెడి అజ్ఞానమును సంహరించ గలుగుదురు.

యశోద పుణ్యాత్మురాలు. యశము అనగా కీర్తి లేదా వైభవము. 'ద' అనగా ఇచ్చునది అని భావము. యశోద యనగా తన నాశ్రయించు వారలకు వైభవము నొసగూర్చునది యని అర్థము. అనగా నిర్మలమైన మనస్సు అని భావము. నిర్మల మనస్కు లగువారు నిండుజీవితమును గడుపుదురు. అంతియేగాక 'ద' అనగా పోగొట్టునది లేదా అపహరించునది అని భావము. కనుక శుద్ధమనస్సు మన వైభవమునకు కారణముకాగా, అశుద్ధమనస్సు మన పతనమునకు కారణమగుచున్నది.

మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః

"బంధమోక్షములకు మనస్సే కారణమైనది" అని ఉపనిషత్తు ప్రవచించినది. మనస్సు ఆత్మకు దగ్గరై మోక్షము నందించును. దూరమై నరకమును ముందుంచును. ఆత్మకు దూరమై మనస్సు అజ్ఞానమును [illegible] నిలుపును. అలాగే యశోద శ్రీకృష్ణుని వదలి వెళ్ళినపుడే పూతన తన అజ్ఞానమును ప్రదర్శించగలిగినది. కనుక మనస్సులో సదా కృష్ణరూపమే కదలుతుండాలి. శ్రీకృష్ణుని వదలి మనస్సు దూరముగా వెళ్ళకూడదు.

"యశోదాదేవీ! ఎంతపని చేసితివి? మన కన్నయ్యను, మన నోములపంటను నీవు వదలివెళ్ళుటవలన కదా ఈ విపత్తు సంభవించినది?" అని గోపభామలు అడిగారు.

యశోద పశ్చాత్తాపముతో కుమిలిపోతూ "అమ్మలారా! అవును. మీరు చెప్పినది ముమ్మాటికీ సత్యము. నాకు బిడ్డను పెంచుట తెలియదు. ఇక శ్రీకృష్ణుని క్షణకాలముకూడా వదలిపెట్టను. మీ అందరి మంగళాశీస్సులు నాకు బిడ్డను రక్షించుటలో తోడుగా ఉంటాయి" అని మృదువచనముల బలికెను.

మనస్సు ఆత్మకు దూరమైనపుడే అజ్ఞానము ప్రవేశించును. శ్రీకృష్ణుని వదలివెళ్ళకు అని గోపభామలు యశోదాదేవికి చెప్పినారు. ఆత్మను విస్మరింపకుము అని మహాత్ములు, గురువులు మనకు తెలియచేయుదురు. యశోదవలె మనముకూడా భగవానుని క్షణకాలము కూడా విడిచి ఉండబోమని ప్రతిజ్ఞ చేయాలి. దానిని అమలుజరిపి, ఆత్మానుభూతి పొంది తరించాలి.

నందుడు అనగా శుద్ధబుద్ధియని గ్రహించినాము. నందుడు మధురకు సుంకము చెల్లించుటకు వెళ్ళినపుడే పూతన అరుదెంచెను. బుద్ధి క్రియాది వృత్తి సహితమై లియ్యని విషయ సుఖాలమధ్య (మధుర) చరించుటకు వెళ్ళినపుడే పూతన యనెడి అజ్ఞానము గోకులము యనెడి హృదయములో ప్రవేశించును. కనుక మహాబుద్ధు లెప్పుడూ శ్రీకృష్ణుని వదలిపెట్టకూడదు. మహాబుద్ధులు కృష్ణార్పణమైనచో ఆ తరువాత భగవానుడు మనకు ముక్తి ననుగ్రహించునని భగవద్గీత కూడా తెలుపుతుంది.

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః

"నీ మనస్సును నాయందు నిలుపుము. నీ బుద్ధిని నాయందు ప్రవేశపెట్టుము. ఆ తరువాత నీవు నాయందే నివసింతువు. ఇందులో సంశయములేదు" అని భగవద్గీత భక్తియోగము చెబుతుంది.

పూతన చతుర్దశినాడు మరణించి దహించబడెను. అజ్ఞానము ఎప్పుడూ చతుర్దశిలోనే వస్తుంది. చతుర్దశి అనగా పదునాలుగు అని అర్థము. కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, అంతఃకరణము అనెడి పదునాలుగు సాధనములద్వారా అజ్ఞానము విలయతాండవము చేయుచుండును. ఈ పదునాలుగు స్థాయిలలో చరించే అజ్ఞానమును అంతమొందించాలి. అప్పుడే సర్వోపద్రవములు నశించును. ఈ కారణము చేతనే శ్రీకృష్ణుడు పూతనను చతుర్దశినాడు వధించాడు.

"పూతనామోక్షము" అత్యద్భుతమైన భగవానుని లీలయై యున్నది. శ్రీకృష్ణు డాచరించిన శైశవ క్రీడలలో ఈ పూతనా సంహారము ఒక్కదానికే ఫలశ్రుతి తెలుపబడినది. భక్తులారా! నిత్యమూ పూతనామోక్షమనెడి ఈ ఘట్టమును భావయుక్తంగా పారాయణ మొనరించి, భగవదాసక్తి పొంది తరించండి.

శకట భంజనము

శ్రీకృష్ణుడు ఒకనాడు ఒత్తిగిలబడెను. దీనినే అంగపరివర్తనము అనియు, ఉత్థానమనియు కూడా అందురు. అదిగాంచి యశోద ఆనందముతో పొంగిపోయెను. అభిషేకదినము రోహిణీ నక్షత్రముతో కలసివచ్చెను. అందుకని ఈ ఉత్సవమును గొప్పగా చేయవలెనని యశోద అభిప్రాయపడెను. నందునకు తెలియజేసెను. నందుడు అమితానంద భరితుడై ఎంత అయినను వెనుకాడక ఖర్చుపెట్టి వేడుక చేయుమని తెలిపెను. భగవానుని ఉత్సవమును జరుపుటకు ఉప్పొంగే హృదయాలే భగవానునికి ప్రీతిపాత్రములై యుంటాయి.

నందగోకులమంతా ఆనాడు ఆనందోత్సాహములతో నిండియున్నది. గోపభామలంతా యశోదచే ఆహ్వానింపబడి నందుని గృహానికి అరుదెంచారు. బ్రాహ్మణులు వేదమంత్రముల నుచ్చరించుచుండగా సుమంగళులైన స్త్రీలు మంగళగీతములు పాడుచుండగా, యశోద కన్నయ్యకు మంగళస్నానం చేయించింది. పట్టు పీతాంబరమును కట్టింది. కురులను చక్కగా దువ్వింది. పూలు ముడిచింది. నెమలి పింఛమును శిరమున నిలిపింది. మెడలో స్వర్ణమాలలు వేసింది.

బ్రాహ్మణులకు విందుభోజనములను ఏర్పాటు చేశారు. విలువైన వస్త్రములను ఇచ్చారు. మేలైన గోవులను దానం చేశారు. బ్రాహ్మణోత్తములు శ్రీకృష్ణుని దీవించి, స్వస్తి పలికారు.

శ్రీకృష్ణునికి మంగళస్నానము చేయించు సందర్భములో యశోద బ్రాహ్మణులచే వేదమంత్రములను పలికించింది. భగవంతుని కొరకు మనము చేయు ప్రతి కర్మయును భగవన్నామోచ్చారణతో కలిపి యుండవలెను. అప్పుడే ఆ కర్మ దివ్యమై యుండును. భగవన్నామమును ఉచ్చరిస్తూ చేసెడి కర్మలు పవిత్రములై, వరించువారలను పవిత్రమొనర్చును.

యశోద శ్రీకృష్ణుని ఒడిలోనికి తీసుకొని పాలివ్వసాగెను.

"కృష్ణా! తొందరగా రా స్నానం చేద్దువుగాని! సూర్యోదయానికి పూర్వమే స్నానమాచరించాలి. నీవింకా లేవనే లేదు. అదిగో సూర్యుడు చూడు, ఎంతచక్కగా ప్రకాశించుచున్నాడో?" అన్నది దేవకీదేవి మధురలో.

"అమ్మా! సూర్యుడు ఉదయించాడని అబద్ధమాడుతున్నావు. సూర్యుడు ఉదయిస్తే చీకటి ఉంటుందా?" అన్నాడు కన్నయ్య.

"ఏమిటి? చీకటియా? ఎక్కడున్నది?" అన్నది దేవకీదేవి.

"ఇదిగో ఇక్కడున్నది" అని కన్నయ్య నేత్రాలు మూసుకున్నాడు. అప్పుడే వస్తున్న వసుదేవుడు ఫక్కున నవ్వాడు.

"బిడ్డకన్నా తండ్రి అల్లరియే ఎక్కువగా ఉంది" అని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ కృష్ణయ్యను తీసుకొని స్నానాలగది వైపు నడిపించింది దేవకీదేవి.

కన్నయ్యకు స్నానం చేయించింది. నూతన దుస్తులను తొడిగింది. తలదువ్వింది. పూలు ముడిచింది. పింఛమును తురిమింది. కృష్ణయ్యను ఒడిలోకి తీసుకున్నది. ముద్దెట్టుకున్నది. పాలిస్తున్నది. పరవశించిపోతున్నది.

పూలతోటలో పారిజాతవృక్షము చెంత కూర్చొని బిడ్డకు పాలిస్తున్న దేవకి, అప్పుడే వచ్చి ప్రక్కన నిలబడియున్న వసుదేవుని చూడలేదు. వసుదేవుడు దేవకి భుజముపై చేయివేశాడు. దేవకి ఉలిక్కిపడింది. పారవశ్యంనుండి బయటపడింది. కళ్ళు తెరచింది. చేతిలోయున్న శ్రీకృష్ణుని కొయ్యబొమ్మను చూపింది. వాత్సల్యప్రేమలో పరవశించిన దేవకీదేవి హృదయస్పందనము ఆమె కుచములనుండి క్షీరమును స్రవింపజేసింది. స్తనములనుండి జాలువారిన క్షీరము ఆమె కొంగును తడిపింది. స్తనములు పాలను చేపగానే కొంగుతడిసింది. కన్నయ్యకు పాలివ్వడ మనునది పగటికలయే నని అవగతంకాగానే నేత్రాలు వర్షించాయి.

"ఏమండీ! నేడు....నేడు... రోహిణి నక్షత్రం.... మన..... మన...మన...." దేవకి బోరున ఏడ్చింది. వసుదేవుడు కదలిపోసాగాడు. చలించిన హృదయంతో "దేవకీ! చింతించకు. ప్రపంచములోని చింతలను రూపుమాపేందుకు అవతరించిన చిద్విలాసుని గనిన నీవు చింతించకూడదు. కర్మసంచితమును ఎవరు కాదనగలరు? మనము చింతించకూడదు. మన హృదయాంతర్యామియైన ముకుందుడు మన ఆర్తిని తప్పక పోగొట్టును" అని ఓదార్చుచుండగా,

"ఏమండీ! నేను ఎంత పొరపాటు చేసానో తెలుసా? తలస్నానం చేయిస్తూ పిండిని కన్నయ్య నేత్రాలలో పడేశాను. కన్నయ్య నేత్రాలను ఒత్తుకుంటున్నాడు చూశారా?" అని పిచ్చిదానిలా ఏడ్చింది. వసుదేవుడు మాతృమూర్తి వియోగ దుఃఖాన్ని చూడలేకపోయాడు. పై పంచెను ముఖానికి అడ్డుగా కప్పుకుని, ప్రక్కగదిలోనికి బరువుగా కాళ్ళువేసుకుంటూ వెళ్ళినాడు.

గోకులంలో యశోద తన ఒడిలోని కన్నయ్యను చూసింది. కన్నయ్య నేత్రాలవెంట అశ్రుధార వడుస్తున్నది. యశోద కంగారు పడింది. పరీక్షించి కన్నయ్య నేత్రాల లోకి చూసింది. కంటిలో పిండినలుసు పడివుంది. "అయ్యో! నేనెంత పాపిష్టిదానిని. కంటిలో నలుసు పడిందికూడా తెలుసుకోలేకపోయాను" అంటూ గుడ్డతో ఆవిరి పట్టింది. నలుసు బయటికొచ్చింది. కన్నయ్య నెమ్మదిగా నేత్రాలు మూసినాడు. పుత్రునికి దూరమై జీవించలేక మరణయాతనకు గురియగుచున్న దేవకి బాధను గాంచినాడు. మనస్సులోనే ఆశీర్వదించాడు. తల్లిదండ్రుల మనస్సులకు స్వస్థతను అందిస్తూ నేత్రాలు మూసియున్నాడు.

భగవంతుని కొరకు పరితపించే జీవితాలు ఎంత పవిత్రమైనవి! ధనధాన్యాదులు కావలెనని, సంతానము కావలెనని కలగనేవా రుంటారుగాని, భగవానుని చింతిస్తూ స్వప్నజగత్తులో మైమరచి చరించే వారెందరుంటారు? దేవకి పుణ్యశీలి. అందుచేతనే నిరంతరము కృష్ణధ్యానంలో మైమరచి ఉండినది. తనను వీక్షించువారిని తాను సదా వీక్షించుచునే యుందునని ప్రతిజ్ఞచేసిన భగవానుడు తన తల్లియగు దేవకి భక్తిని గాంచి కదలిపోయెను. ఆమెను ఆశీర్వదించే ప్రయత్నములో కన్నులు మూసెను.

మన మాచరించు కర్మలన్నియు పరమాత్మ సంబంధమైన కర్మలు కావాలి. మనకు గోచరించు రూపములన్నియు భగవద్రూపములుగ తెలిసి రావాలి. మన మదిలో నడిచే ప్రతిసంకల్పము భగవానుని అంఘ్రియుగ్మము చెంతకే నడిచేటట్లు చూసుకోవాలి. అప్పుడే భగవత్కృపకు పాత్రులమై తరించగలము. మనము భగవంతుని దర్శించే విధంగా నేత్రములను తెరచినపుడు, భగవానుడు నేత్రములను మూసి మనలను ఆశీర్వదించు చుండును. దేవకి భక్తిపారవశ్యమును గాంచి, స్పందించిన శ్రీకృష్ణుడు కన్నులు మూయగా, యశోద బాలుడు నిద్రించినాడని భావించి, పరుండబెట్టుటకు అనువైన ప్రదేశమును అన్వేషించుచుండెను.

వ్రజవాసులైన గోపభామలను, గోపాలురను సన్మానించాలని నందయశోదలు ఈ ఉత్సవాన్ని జరుపుకుంటున్నారు. శ్రీకృష్ణుడు నిద్రపోవుటయే మంచిది. లేనిచో అతడు విలపించుచుండును. సన్మానించు కార్యక్రమమంతయు పాడగును అని యశోద భావించెను. నిద్రించుచున్నట్లు కృష్ణుడు నటించసాగాడు. అతనిని పరుండబెట్టుటకు ప్రదేశమును వెదకసాగింది. ఇంట్లో పరుండబెట్టినచో వ్రజవాసులను సన్మానించు సందడికి మేల్కొనును. మేల్కొనినచో ఈతని అల్లరిముందు మరొక కార్యముచేసే వీలుండదు అని భావించి, శ్రీకృష్ణుని తీసుకొని బయటకు వచ్చి, అక్కడున్న ఒక శకటము క్రింద పరుపువేసి నిద్రించుచున్న శ్రీకృష్ణుని పరుండబెట్టెను. ఇంటిలో నెక్కువ స్థలము నాక్రమించుచున్నవని భావించి పండ్లబుట్టలను, పెరుగుదుత్తలను, పాలు, వెన్నకుండలను తెచ్చి, ఆబండిపైపెట్టి, శ్రీకృష్ణుని ఒంటరిగా వదలిపెట్టి, ఉత్సవ కార్యక్రమమున ప్రవేశించి, వ్రజవాసులను సన్మానించే కార్యక్రమములో యశోద మనస్సును లగ్నమొనర్చెను.

ఆహా! హాస్యాస్పదము! కృష్ణోదయ సంబరాలలో శ్రీకృష్ణుని మరచిపోవుట జరిగెనా! జీవులెంతటి చపలచిత్తులు! భగవంతుని గూర్చి స్మరింపచేయుటకు పండుగలు ఏర్పాటు చేయబడ్డాయి. సాధారణముగా మనముకూడా పండుగనాడు వినోద ప్రదర్శనముల యందునో, మరోవిధమైన వ్యాసంగమునందునో కాలమును వెళ్ళబుచ్చుచుందుము. పండుగలు కేవలము వినోదము కొరకు వచ్చినవి కావు. వికాసపూరిత వినోదమే ఇచ్చుట వాంఛించ దగియున్నది. వైకుంఠ ఏకాదశినాడు జాగరణ చేసిన పుణ్యమని భావించి, నాటకాలు చూసేవారు, జూదములాడువారు అనేకులు గలరు. పండుగనాడు పరమాత్మను విస్మరించి, లౌకిక వ్యవహారాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదు.

యశోద శ్రీకృష్ణుని బండిక్రింద పరుండబెట్టి, బండిపైన పాలు, పెరుగు, వెన్నలను ఉంచింది. నిత్యమైన వస్తువును క్రింద ఉంచి, అనిత్యమైన వస్తువులను బండిపైన ఉంచింది. ఈ ప్రవర్తన శ్రీకృష్ణునికి నచ్చలేదు. తనను నమ్మినభక్తులను పరిచేయు నుద్దేశ్యముతో శ్రీకృష్ణుడు బిగ్గరగా రోదించెను. కానీ కృష్ణుని రోదనము యశోదకు వినిపించలేదు.

విషయవాసనాసక్తిలో మనస్సు మునిగినపుడు సత్యపలుకులు వినపడవు. బాహ్య శబ్దాలయందు బహిర్ముఖమై కదలే మనస్సునకు అంతర్యములో కదలే పరమాత్మ వచనములు వినపడవు. శ్రీకృష్ణుని రోదనము ఆమె చెవిని పడలేదు.

కంసుని పరివారమునందు శకటాసురుడు అనే దైత్యుడు కలడు. పూతన మరణవార్తను విని, కంసుని ఆజ్ఞచే శ్రీకృష్ణుని సంహరించుటకు అరుదెంచినాడు. బండిపై సూక్ష్మరూపంలో నిలచాడు. బండిక్రిందనున్న శ్రీకృష్ణుడు క్రీగంట చూచి విషయమును గ్రహించాడు. ఈలోగా బండి కదలసాగింది. కాడి పైకి లేచింది. కొంతదూరము బండి ముందుకు కదలిపోసాగింది. చుట్టుప్రక్కల ఆడుకొంటున్న గోపబాలురకు ఆశ్చర్యం కలిగింది. వృషభములు లేకుండా బండి కదులుట వారికి విస్మయమును కలిగించింది. చూస్తూండినారు. ఇంతలో వేగంగా బండి కృష్ణుడున్న వైపునకు వచ్చుచున్నది. బండి దగ్గరికి రాగానే చిన్నికృష్ణుడు తన సుకుమార పాదముచే బండిని గట్టిగా తన్నినాడు. అంతే. బండి ఎత్తునకు ఎగిరి తిరుగబడింది. బండిలోని పెరుగుకుండలు, వెన్నదుత్తలు, పండ్లబుట్టలు, పాలకుండలు చెల్లాచెదరై యున్నాయి. శకటము భయంకర శబ్దముతో క్రిందపడి ముక్కలు ముక్కలైంది. ఆ శబ్దానికి వ్రజవాసులంతా కదలిపోయారు. రోహిణి, యశోద, నందాదులు పరుగెత్తుకుంటూ వచ్చి చూశారు. బాలకృష్ణుడు బోర్లపడి ఆడుకుంటున్నాడు. శ్రీకృష్ణునికి దగ్గరగా బండిఇరుసంత తెగినపాదమొకటి పడియున్నది. శకటాసురుని శరీరము ముక్కలు ముక్కలుగా తెగి చెల్లాచెదరై పడియున్నది. ఇది ఎలా జరిగిందని వాకబుచేయగా దగ్గరనే ఆడుకుంటున్న గోపబాలురు జరిగిన విషయమంతటిని పూసగ్రుచ్చినట్లు తెలిపినారు.

ఊచురవ్యసిత మతీన్ గోపాన్ గోపీశ్చ బాలకాః
రుదతానేన పాదేన క్షిప్తమేతన్న సంశయః

"కృష్ణయ్య ఏడుస్తూ తన పాదముచేత ఈ బండిని తన్నాడు. బండి తల్లక్రిందులైనది" అని తెలిపినారు.

తన బిడ్డకు ఏ ఆపద జరుగనందుకు సంతసించి, భక్తిపూర్వక కృతజ్ఞతతో నందబాబా చేతులు జోడించి భగవానునికి నమస్కరించాడు. యశోద కృష్ణయ్యకు దిష్టితీసింది. రోహిణి రామెత్తు కట్టినది.

నందుడు ఉత్తమ బ్రాహ్మణులను పిలిపించి, కృష్ణయ్యకు ఆశీర్వాదము ఇప్పించెను. పవిత్రులగు బ్రాహ్మణుల వచనము ఎన్నడూ నిష్ఫలము కావని నందుని అభిప్రాయము.

యేఽసూయానృత దంభేర్ష్యా హింసా మానవర్జితాః,
న తేషాం సత్యశీలానామాశిషో విఫలాః కృతాః

అసూయ, అసత్యము, దాంభికత్వము, ఈర్ష్య, హింస, అభిమానము మున్నగు దోషములు లేనివారు, సత్యవంతులైన విప్రుల ఆశీర్వాదము ఎన్నడూ వృథాకాదు.

సువర్ణమాలా విభూషితమైన ధేనువులను బ్రాహ్మణులకు దాన మిప్పించెను. ధన మెన్నడైనా వస్తుంది. అదృష్టమనేది ఆశించినప్పుడల్లా రాదు. అదృష్టహీనులుకూడా ధనవంతులు కావచ్చు. కానీ అదృష్టవంతులే దాన మొసగగలరు. తమకున్న దానిని ఇతరులతో పంచుకొనువారికి ఎప్పుడూ సద్గతియే కలుగును. నంద యశోద లిరువురును

అదృష్టవంతులు. అందుచేతనే బ్రాహ్మణులకు, పుణ్యవతులకు, పేదలకు విలువైన దానము లొసగి సంతుష్టచిత్తులైనారు.

దానమనునది పుణ్యకార్యము. అంతఃకరణ శుద్ధికొరకు దానము లొసంగాలి. కీర్తి కాంక్షకొరకు, స్వలాభమునకు, మూఢాచారములను నిలుపుకునేందుకు దానమివ్వకూడదు. మారని పైసలను ఆలయంలో హారతిపళ్ళెములలో వేసేవారు, బ్యాంకువారు నిరాకరించిన కరెన్సీ కాగితాలను కవర్లలో ఉంచి గురువులకు దక్షిణలొసగే ప్రబుద్ధులు ఎప్పుడూ దానవరులు కాలేరు. దహనవీరులే అవుతారు. ఇలాంటి దానములు చేయుట ఎందులకు? ఎవరికొరకు? దురదృష్టము తోడునడిచేటప్పుడు ఈ ప్రశ్నలు కూడా కదలవు.

నేనూ చాలామందిని చూస్తూంటాను. "స్వామీజీ! ఆశ్రమానికి ఈ మాత్రం సాయం మాకు చేయాలని వుంది. గంగాజలాన్ని గంగానదిలో విడిచినట్లు భగవాను డనుగ్రహించిన దానిలో కొంత ఆయనకు సమర్పించి, తృప్తిచెందాలని మా ఈ ప్రయత్నము. మా పేరు ఎవరికీ తెలియనవసరంలేదు" అంటారు. ఇస్తారు. తరువాత మళ్ళీ వారే ఆశ్రమానికి వచ్చి "స్వామిజీ! మేము చేసిన చిన్నపని ఎవరికీ చెప్పవద్దని ప్రార్థించాము. కానీ అందరికీ తెలిసిపోయింది అంటారు. నేను చెబుతుంటాను. "అవును. మీ ఔదార్యము వ్యక్తముకానంటుంది. నా ఋజుత్వము దాగియుండ నంటుంది. ఏంచేస్తాం? జన్మలో కలిసివచ్చిన వాసనలు" అంటుంటాను. తాము చేసే మంచిపని భగవంతుడొక్కడికి తెలిస్తే చాలు అని ఆ పుణ్యాత్ముల భావము.

రెండవ తెగవారున్నారు. వీరి సంఖ్య నా దగ్గర చాలా తక్కువగానే ఉంటుందనుకోండి. "స్వామీజీ! మేము ఆశ్రమంలో ఈ మంచి పనిచేస్తాం. కానీ మా పేర్లు నారికేళమంతటి అక్షరములతో మేము కోరిన రంగులలో వేయించాలి. మీరు సరేనంటే మేము పని నప్పగిస్తాము" అంటుంటారు. వస్త్రము యజమానిది అయినా దర్జీపేరు చొక్కామీద దర్జాగా కనబడే ఈ రోజుల్లో వారి కోరిక అసమంజసము కాదనుకోండి. కానీ అంగీకరించే అదృష్టముకూడా నాకు ఉండాలి కదా! అందుకని అలాంటి కామకులను నేను అంగీకరించను. ఈనాడు గోడలకు బోర్డులు తగిలిస్తారు. రేపు అవగాహన కొద్దిగా ఉన్నతమై "స్వామీజీ! మేము చేసిన దానము చరాచరములందు ఉండవలెనని మేము కోరుకున్నాము. గోడలు అచరములు కదా! మీరు చరిస్తుంటారు గనుక మీ మెడలో వేయగలిగిన మోతాదులో ఒక చిన్న ఫలకమును మూర్ఛరోగికి మల్లే తగిలిద్దామని చెబితే నిరాకరించడం భావ్య మనిపించుకుంటుందా? అందుకని ఆదియందే నేను జాగ్రత్త వహిస్తుంటాను. ఇప్పటివరకు నిస్వార్థంగా అందించిన భక్తులవలననే ఆశ్రమం నడుస్తున్నది. అదియే నాకు తృప్తి, ఆనందము.

"స్వామీజీ! ఆశ్రమానికి ఆర్థిక ఇబ్బందులేమిటి? మీరు కాస్త మారాలి. కాలాన్నిబట్టి తాళం ఉండాలి. మీ దోషమేమున్నది? ఇచ్చేవారికి వారి అహంకారము తృప్తిచెందాలని వున్నది. జరగనివ్వండి. మనకు ఒరిగేదేముంది? మీరు కొద్దిగా మనసును సవరించుకొంటే ఆశ్రమాన్ని స్వర్గతుల్యం చేయవచ్చు" అని మా వాళ్ళుకూడా త్రాడును సడలించినపుడు నాకు బోధ చేస్తూంటారు.

ఈ సలహాలకి నేను సాధారణంగా సమాధానాలు ఇవ్వను. ఇదొక అస్తవ్యస్త ధోరణి. ఆశ్రమాలుండేది అహంకారమును తృప్తి పరచేందుకా? అహంకార రాక్షసిని అంతమొందించమని వేదికలపై గర్జిస్తుంటే, దానికి ఆహారమును సమకూర్చమని సలహాలిచ్చే అమాయకుల్ని గూర్చి ఏం చెప్పాలి?

దానధర్మాలు అనేవి భగవత్ప్రీత్యర్థమే చేయాలని నా అభిప్రాయము. దానము లిచ్చేందుకు మనమేమి తీసుకొని వచ్చినాము? దహనమయ్యే శరీరము తప్ప మనకూడా ఏమి వచ్చింది? అమ్మల సహకారంతోనే ఆ దేహముకూడా పెరిగింది. పుణ్యకర్మాచరణకే దేహము వచ్చినది అని గ్రహించి, చరించువారే పుణ్యాత్ములు. యశోదానందులు అలాగే దానము లొసంగినారు. భగవత్ప్రీత్యర్థమే ఈ పుణ్యకర్మ లాచరించినారు.

"శకటాసుర వధ" అనెడి ఈ లీలద్వారా శ్రీకృష్ణుడు చక్కని ఆధ్యాత్మిక సందేశమును అందించినాడు. మానవజీవితమే ఈ శకటము. ఈ బండి సత్యము అనెడి ఇరుసుపై ఆధారపడి యుండును. ప్రవృత్తి నివృత్తి అనునవి ఆ శకటము నడచుటకు ఉపకరించు చక్రములు. మన జీవన శకటమునకు సారధి పార్థసారధియే కావలెను. అప్పుడే అది గమ్యమును సురక్షితముగ చేరగలుగును.

సారధియైన శ్రీకృష్ణుని యశోద బండిక్రింద పరుండబెట్టినది. పాలు, పెరుగు, వెన్న, పండ్లు, కూరగాయల బుట్టలను, కుండలను బండిలో యుంచినది. అహంకారమును సారధిగా ఉంచినది. అందుచేతనే శకటము తల్లక్రిందులైనది. భగవానుని విస్మరించినవారి బ్రతుకు ఎప్పుడూ అలాగే తారుమారగును. ఆశలన్నీ మట్టిపాలగును. ఆస్తులన్నీ పరులపాలగును.

బండిలో సంసారమును ఉంచి, సారథిని బండిక్రింద యుంచుటవలన యశోద భయభ్రాంతులకు లోనైనది. భోగలాలసత్వమునందు ఎవరి మనసు రమించునో, వారి బ్రతుకులలో శకటాసురుడు ప్రవేశించును.

శకటాసురు డనగా భ్రాంతియని అర్థము. శకటాసురుడు శకటము నాశ్రయించినట్లు, భ్రాంతి మనలను జననమరణ చక్రములో పడవేసి త్రిప్పుతుంది. ఇదియే మాయ. ఈ మాయ భగవానుని అధీనమునందు యుండును.

ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రా రూఢాని మాయయా

"అర్జునా! ఈశ్వరుడు యంత్రము నధిష్ఠించిన వారివలెనున్న సర్వప్రాణులను తన మాయచేత త్రిప్పుచూ, సమస్తజీవుల హృదయముల యందు వెల్గొందుచున్నాడు" అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతయందు తెలుపుతాడు.

తాను ప్రబోధించబోయే భగవద్గీతలోని పై సత్యమునకు వ్యాఖ్యాన సదృశముగా శ్రీకృష్ణపరమాత్మ ఈ శకట భంజన మనెడి లీలను ప్రదర్శించి చూపెను.

మాయాధీశుడైన భగవానుని ఆశ్రయించువారు, ఆరాధించువారు మాయనుండి విడిపడి తరింతురు. మాయను నమ్ముకొనినవారు మోసపోవుదురు. ఈ సత్యమును 'శకటాసురవధ' ద్వారా భగవానుడు మనకు తెలిపినాడు.

శకటాసురుని వధించునాటికి శ్రీకృష్ణుని వయస్సు 108 రోజులని ఒక మహాత్ముడు తెలిపియున్నాడు. ఈ విషయము భాగవతమునందు లేదు.

శ్రీకృష్ణునికి సంబంధించి భాగవతంలో లేని అనేక సన్నివేశములు, బ్రహ్మ వైవర్త విష్ణుపురాణాది అనేక గ్రంథములయందు తెలుపబడి యున్నవి. ఈ విషయమును అనగా శకటాసురవధ తన 108 రోజుల వయస్సులో చేసినా డనెడి దానిని వారు ఎచ్చటనుండి గ్రహించారో నాకు తెలియదు. భగవన్నామము నుచ్చరించుటద్వారా రాక్షసప్రవృత్తి నిర్మూలించుకోవాలి అనెడి వ్యాఖ్యానము మాత్రము బహురమ్యముగా, హృద్యముగా గోచరించుచున్నది.

జపమాలకు 108 పూసలుండును. శ్రీకృష్ణుడు శకటాసురుని తన 108వ రోజున వధించెను. మాయ మన బ్రతుకులలో ప్రవేశించగనే జపమాలను చేతపట్టుకొని **"ఓం నమో భగవతే వాసుదేవాయ"** అనెడి మంత్రమును 108 సార్లు జపించగానే, 108 వ రోజున శ్రీకృష్ణుని చేతిలో శకటాసురుడు మరణించినట్లు మనచేతిలో మాయ నశించును. భక్తులైనవారు ఒక్క విషయమును సదా మననము చేసుకుంటూ ఉండాలి. ఆపదలు వచ్చినపుడు వెంటనే అచ్యుతుని అమృతనామమును హృత్పూర్వకంగా భజించాలి. భగవన్నామము ఎచ్చట నిరంతరము జరుగుచుండునో అచ్చట రాక్షస ప్రవృత్తులు, రాక్షస కృత్యములు తలెత్తవు.

తృణావర్త వధ

"ఇక సందేహములేదు. వాడే.....వాడే.....శత్రువు.... వాడ్ని హతమార్చవలసిందే" నంటూ దిక్కులు పిక్కటిల్లేలా కంసుడు అరిచాడు. దారుణ మేఘగర్జనమువలె ప్రతిధ్వనించిన ఆ ఘోషకి అనుచరులైన యావన్మంది పరుగెత్తుకుంటూ వచ్చారు. వారిలో తృణావర్తుడు కూడా ఉన్నాడు.

"ప్రభూ! అకలంక ప్రజ్ఞానిధీ! ధీరారణ్య విహార! వీర కంఠీరవా! ఎవడా శత్రువు? ఎచ్చట వాని నెలవు? సెలవీయ్యండి. ఇప్పుడే పీల్చివస్తాను" అంటూ తృణావర్తుడు పలికాడు.

"తృణావర్తా! నా సందేహము నిజమగుచున్నది. పూతన వధించబడినది. శకటాసురుడు సంహరించబడినాడు. ఆ మాయావియగు దొంగదేవుడు మనలను మోసగించుచున్నాడు. గోకులములో పెరుగుచున్న బాలకుడే ఆ మాయావి యైన దేముడని నా విశ్వాసము. అలాగానిచో మహా పరాక్రమవంతులైన పూతన, శకటాసురులను వధించగలుగునా? ఇక ఆలస్యముచేసి ప్రయోజనము లేదు" అని కాళ్ళు ముందుకు వేసెను.

తృణావర్తుడు అడ్డుపడి, "దైత్యవీరా! శాంతించుము. శిశు ఘాతుకమునకు తమరు కదలనవసరంలేదు. ఆ మాయావిని నేను హతమారుస్తాను. అతడి మరణవార్తను మీకు

అందించి, తృప్తిని కలిగిస్తాను" అంటూ కంసుని వద్ద సెలవు పుచ్చుకొని, సుడిగాలి రూపంలో నందగోకులానికి అరుదెంచినాడు.

కృష్ణయ్యకు సంవత్సరం వయస్సు దాటింది. దాటిందిగదా ఇక చాలన్నట్లు వచ్చీరాని మాటలను నచ్చేటట్లు పలకడానికి, మయూరపు నడకను అనుకరించు విధముగా తప్పటడుగులు వేస్తూ నడవడానికి తయారయ్యాడు మాధవుడు. జగన్నాటకాన్ని నడిపే సూత్రధారికి ఎన్ని నడకలో? ఎన్ని నటనలో?

గోపబాలు రందరూ కృష్ణుని చుట్టూచేరి ఆడుకుంటున్నారు. కొస్త పెద్దవారైన బాలురు ఎక్కువ పుణ్యాత్ములేమో శ్రీకృష్ణుని ఎత్తుకొని ఆడిస్తున్నారు. మిత్రులారా! నాకు చెట్టు ఎక్కాలని ఉంది ఎక్కింతురా?" అని అడిగినాడు కృష్ణయ్య. "ఓ! ఎక్కిస్తాము" అని గోపబాలురు శ్రీకృష్ణుని చెట్టువద్దకు తీసుకుని వెళ్ళినారు. శ్రీకృష్ణుడు ఆ ప్రక్కనేయున్న సరస్సులో పద్మములుండుట చూసినాడు. అందుండి ఒక తామరతూడును తీసికొన్నాడు. గోపబాలురు వీపుపై కృష్ణుని ఎక్కించుకొనినారు. ఆ తరువాత చెట్టునెక్కించారు. చెట్టు నెక్కగనే బాలురను దూరంగా వెళ్ళమని సైగచేశాడు. వారు దూరంగా వెళ్ళారు. ఈ లోగా ఒక గోపభామ శిరముపై పాలకుండ నుంచుకుని కదలివచ్చుచున్నది. అలాగే మరొక గోపెమ్మకూడా పాలకుండను శిరమున ధరించి మరియొక దిక్కునుండి వచ్చింది. ఇరువురు గోపెమ్మలు శ్రీకృష్ణుడు ఎక్కియున్న చెట్టుక్రిందికి వచ్చారు. నిలబడి ఇంటి విషయాలు చర్చించుకొంటున్నారు.

శ్రీకృష్ణుని చెంతచేరడం పూర్వజన్మ సుకృతం. చెంతన చేరిన తరువాత చింతన నశించరాదు. భగవంతుని సాన్నిధ్యములో శ్రేయమును గూర్చిన చర్చలు జరుగవలెనేగాని ప్రేయమును గూర్చిన ముచ్చటలు కొనసాగకూడదు. ప్రాపంచిక విషయములయందు వారికిగల వ్యామోహమే ఈ అనర్థ భాషణమునకు కారణము. తనను సమీపించిన వారిలో కదలిడి వ్యామోహమును శ్రీకృష్ణుడు తప్పక హరించును.

చెట్టుక్రింద నిలబడి న్యాయవాదులవలె చర్చలు సాగించుచున్న గోపభామలను శ్రీకృష్ణుడు చూసినాడు. తన చేతిలోని తామరతూడును తీసుకొని చివరను విరిచినాడు. చెట్టుకొమ్మపై బోర్లగిలా పడుకొని తామరతూడు ఒక కొనను పాలకుండలో దింపినాడు. రెండవ కొనను నోటికి తగిలించుకున్నాడు. తీరమున చలించిన సముద్రపు అలసాగరములోనికి ఎలా తిరిగి పయనించునో అలాగ పాలకుండలోని పాలన్నీ శ్రీకృష్ణ సాగరములోనికి ప్రశాంతముగా వెళ్ళినవి. చెట్టువెనుకాలే పొంచియున్న తన మిత్రమండలికి కూడా అందించాడు. కదవలు ఖాళీ అగుటవలన గోపభామలకు బరువుతగ్గినది తేలికపడినది. కుండలను దించి చూశారు. అంతా ఖాళీ...పైకి చూశారు..... కొమ్మపై కృష్ణయ్య. గోపభామలపై చిరునవ్వును చిందించాడు. నందనందనుని మందహాసము గోపభామలపై పడగానే వారు పాలకుండలతో సహా సమస్తమును మరచి ధ్యానచిత్తులైనారు.

ప్రహసితం ప్రియ ప్రేమ వీక్షణం
విహరణం చ తే ధ్యానమంగళమ్...

"నందనందనా! నీ దరహాసము, నీ ప్రేమ చూపులు, మనోరంజకమైన నీ చేష్టలు ధ్యానమంగళమై మా హృదయమును గాఢముగా పెనవేసుకుని యున్నవి" అని విరహిణులైన గోపభామలు రాసోపు అధ్యాయములలో గానం చేస్తారు.

సంసార వ్యామోహ పీడితులై ప్రాపంచిక విషయాలను చర్చించుకొనుచున్న గోపికలను శ్రీకృష్ణుడు చెట్టుపైనుండి చూసినాడు. జ్ఞానియైన వానికి సమస్తము అగుపించును. మనోబుద్ధులకు అతీతముగా నిలుచువాడే జ్ఞాని. శ్రీకృష్ణుడు చెట్టునెక్కుటలోని ఉద్దేశ్యమిదియే. తనయొక్క అతీత జ్ఞానస్థితిని తెలియజేయుటయే.

తన నాశ్రయించిన భక్తుల హృదయాలు దసహనమైన విషయములయందు విరి భ్రమించుటను శ్రీకృష్ణుడు సహించడు. వారి వ్యామోహములను తుదముట్టించి, అంతము చేయును. గోపభామల విషయములో శ్రీకృష్ణుడు అదియే చేసి చూపాడు.

గోపభామల తలలపై పాలకుండలు ఉన్నవి. పాలవిక్రయము, ధనార్జన యనెడి విషయములను చర్చించుట వలన వారు సంసారములను మోయువా రయ్యారు. కుండలలో పాలు నిండియున్నట్లు, వారి మనస్సులలో వ్యామోహము నిండియున్నది. శ్రీకృష్ణుడు తామరతూడును తీసుకొనినాడు. దాని చివర భాగాన్ని త్రుంచివేసినాడు. తామర జ్ఞానమునకు సంకేతము. చివరనున్న భాగము జ్ఞానాహంకారము. జ్ఞానాహంకారము బంధముకారని శాస్త్రనిర్ణయము. కానీ ఇతరులకు సేవ చేయువలె నదిన అది నశించరాదు. అందుచేత శ్రీకృష్ణుడు దానిని కూడా తొలగించెను. జ్ఞానమనెడి తామరతూడును గోపభామలనెడి భక్తులయొక్క కుండలనెడి మనస్సులలోనికి దించి వ్యామోహమనెడి క్షీరమును శ్రీకృష్ణుడనెడి పరమాత్మ పీల్చివేయును.

అజ్ఞాను లగువారు విచక్షణ లేనివారై గార్దభమువలె మోయలేని భారమును మోయుచుందురు. అట్టివారు శ్రీకృష్ణుని ఆశ్రయించినచో అతడు వారి హృదయములయందలి వ్యామోహమును అపహరించి, వారి బ్రతుకులను తేలికపరచును. మునిగకుండా తేలునట్లు చేయును. కొందరి బరువులను తగ్గించి తరింపజేయు శ్రీకృష్ణపరమాత్మ కొందరికి బరువును పెంచి తరింపచేయును. ఈ రెండవ సత్యమును తెలుపు దివ్యగాథయే తృణావర్త సంహారము.

తనయుని చంకన వేసుకొని తల్లి లాలించుచున్నది. కొంటె చేష్టలతో కన్నయ్య యశోదను ఉడికించుచు నవ్వించసాగినాడు. ఇంతలో ఒక విచిత్రం జరిగింది. పగటికాలమైనప్పటికీ గోకులమంతా అంధకారబంధురము కాజొచ్చింది. చీకట్లు ముసురుకున్నాయి. గాలి తీవ్రంగా వీచింది. శ్రీకృష్ణుడు బరువెక్కసాగాడు. పర్వతశృంగముతో సమాన భారము గలవాడయ్యాడు. యశోద మోయలేకపోయింది. చంక మార్చింది. అయినా లాభం లేకపోయింది. మోయలేనంత బరువయ్యాడు. ఆలసట తీర్చుకునేందుకు బిడ్డను క్రిందికి దించింది. అంతే, గోకులమంతా తీవ్రమైన సుడిగాలి వ్యాపించింది. ధూళితో నిండిపోయింది. దిక్కులు గోచరించడంలేదు. చిమ్మచీకటిలో గోకులమంతా ధూళిలో మునిగిపోయింది. క్షణక్షణానికి సుడిగాలి తీవ్రతను చూపెట్టసాగింది. యశోద బిడ్డకోసం

కళ్ళుమూసుకునే వెదకసాగింది. కృష్ణయ్య జాడ తెలియలేదు. బాధతో, భయముతో యశోద కంపించిపోయింది. విలపించసాగింది. కన్నీరు ప్రవాహంలా కారుతున్నది. "కృష్ణా! కృష్ణా!" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా రోదించుచున్నది.

ఇతి ఖర పవన చక్ర పాంశువర్షే సుతపదవీ మబలా విలక్ష్య మాతా
అతి కరుణమనుస్మర త్యశోచ ద్భువి పతితా మృత వత్సకా యథాగౌ

భయంకరమైన సుడిగాలి వుంజుకోగానే వర్షించుచున్న ధూళిలో కుమారుని జాడను తెలిసికొనలేక, తెలిసికొనే వీలులేక దూడను పోగొట్టుకొన్న గోవువలె యశోద భూమిపైకూలబడి "కృష్ణా! కృష్ణా!" యని పిలుచుచు దిక్కులను భేదించునట్లు ఏడ్వసాగెను. పాపం! ఆ సుడిగాలి కన్నయ్యను ఆకాశానికి ఎత్తుకుపోయిందని ఆమెకు తెలియదు. ఒక ముహూర్త కాలం సుడిగాలి విజృంభించింది. ఎక్కడివారు అక్కడ ప్రాణములను చిక్కబట్టుకుని నిలబడియున్నారు. చీకటి-విచ్చిపోయింది. వాయువు శాంతించింది. తల్లులందరూ తమ తమ బిడ్డలను వెదకి పట్టుకుని, గృహాలకు తీసుకొని వెళ్తున్నారు. యశోద పరిస్థితి అయోమయంగా తయారైంది. కృష్ణయ్య జాడ తెలియలేదు. అన్నిచోట్ల వెదకింది. కన్నీరు గార్చుచూ, భూమిపై బడి రోదించుచున్నది. యశోదను జూచి గోపభామలందరూ కన్నీరు గార్చసాగారు.

కృష్ణుని అపహరించి ఎత్తుకుపోయిన సుడిగాలి ఎవరోకాదు. వాడే. తృణావర్తుడనే రాక్షసుడు. శ్రీకృష్ణుని తీసుకొని గగనాన పోసాగాడు తృణావర్తుడు. బాలకృష్ణుడు బరువయ్యాడు. క్షణక్షణానికి బరువు అధికము కాజొచ్చింది. శ్రీకృష్ణుని మోయడం తృణావర్తునకు దుర్భరమనిపించింది. కదలిక కూడా కష్టమనిపించింది. కృష్ణుని వధించడము అంత తేలికైన పనికాదని తృణావర్తుడు గ్రహించాడు. వదలిపెట్టి వెళ్ళాలని నిశ్చయించుకొనినాడు. కానీ అప్పటికే శ్రీకృష్ణుడు అతని కంఠమును గట్టిగా పట్టుకొనినాడు. తృణావర్తుడు చలనశక్తిని కోల్పోయాడు. కళ్ళు బయటికొచ్చాయి. పెద్దకేకతో తృణావర్తుడు విగత ప్రాణుడై గోకులమున పడ్డాడు. దారుణంగా పడిన తృణావర్తుని భయంకర మృతదేహమును గాంచి వ్రజవాసులెల్లరు భయకంపితులైనారు. తనకేమీ తెలియనట్లు చిన్నికృష్ణయ్య తృణావర్తుని శరీరమునుండి క్రిందికి మెల్లగా దిగుతున్నాడు. శ్రీకృష్ణుని దర్శించిన నందయశోదాదులు, వ్రజవాసు లెల్లరు అమితానందభరితులైరి. బాలకృష్ణుని ఈ అద్భుతలీలను గాంచుటకు గతములో వారు చేసిన పుణ్యములను వ్రజవాసులు స్మృతికి తెచ్చుకొనుచుండిరి.

మ॥ గతజన్మంబుల నేమి నోచితిమొ యాగశ్రేణు లేమేమి సే
సితిమో యెవ్వరి కేమి పెట్టితిమొ యేచింతారతిం బ్రొద్దు పు
చ్చితిమో సత్యము లేమి పల్కితిమొ యేసిద్ధప్రదేశంబుఁ ద్రొ
క్కితిమో యిప్పుడు సూడఁగంటిమిచటం గృష్ణార్భకున్ నిర్భయున్.

అని వ్రజవాసులెల్లరు తమ తమ పుణ్యములను స్మరించుకోసాగిరి. పాపియగు వానిని ఎవరును వధించ నవసరములేదు. అతడి పాపమే అతనిని వధించును. అలాగే

పుణ్యాత్ముడగు వానిని ఆతని పుణ్యమే సదా రక్షించును అని నందుడు చింతించెను. సదా భగవదారాధన చేసిన ఫలితము విఫలము కాలేదనియు, ఇచ్చిన దానములు, చేసిన పుణ్యకార్యములు వృథాకాలేదనియు, వాటి సమిష్టి ఫలితంగా కన్నయ్య కుశలముండు నిలచియున్నాడని భావించి నందుడు కంటతడి పెట్టుకొనెను.

"కన్నా! క్షేమంగా యున్నావా? భయపడలేదుగదా!" అని తల్లియగు యశోద ప్రశ్నించింది. రోహిణి దిష్టితీసింది. "నాన్నా! ఏంజరిగింది?" అన్నది యశోద.

"అమ్మా! నువ్వు నన్ను చంకనుండి దించేశావు. వీడొచ్చి నన్ను ఎత్తుకొని ఆకాశానికి ఎగిరిపోయాడు. నేను వాడి పీకను గట్టిగా పట్టుకొన్నాను. గాలి ఆపాడు క్రిందపడిపోయాడు" అన్నాడు.

యశోదకు కళ్ళు చెమ్మగిల్లాయి. "నా తండ్రీ! ఇక నిన్నెప్పుడు దించను" అంటూ చంకన పెట్టుకుంది కన్నయ్యను.

చతుర్వేదములను తన నాభియందు నింపుకొనియున్న పరమాత్మ, తల్లిని తృప్తిపరచేందుకు వచ్చీరాని మాటలు మాట్లాడుతున్నాడు. అందుచేతనే

అనిర్వచనీయం ప్రేమస్వరూపమ్

"భగవత్ప్రేమ నిర్వచించుటకు వీలుపడనిది" అని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలియజేశారు.

పూతన, శకటాసురుల సంహారముద్వారా శ్రీకృష్ణుడు ప్రదర్శించి, ప్రవచించిన లీలా విశేషములను గ్రహించినాము. అలాగుననే ఈ తృణావర్త వధలోని ఆధ్యాత్మిక విశేషమును దర్శించెదము గాక!

తృణమనగా గడ్డి. అదియే విషయానందము. ఆవర్తుడనగా తిరుగువాడు అని భావము. తృణావర్తుడనగా ప్రాపంచిక విషయసుఖములను శాశ్వతమని భావించి, వానివెంట పరిభ్రమించువాడు అని భావము. కనుక తృణావర్తు డెవరోకాదు. కామమే తృణావర్తుడు.

కోరికలమధ్య చరించువారికి శాంతి నిలువదు. తృణావర్తుడు ఆవరించగనే గోకులమంతయూ అశాంతిలో మునిగిపోయెను. తృణావర్తుడు కామమైనందున సుడిగాలి రూపములో కదలివచ్చును. ప్రతి మానవ హృదయములో వీచే కల్లోల పవనములే కోరికలు. వాంఛా హోరుగాలి వీచునపుడు ఎవరూ సత్యమును చూడలేరు. గోకులమంతా ధూళి నిండిపోయింది. కళ్ళు తెరువలేకపోయారు. కామము ఎప్పుడూ కళ్ళను కప్పివేస్తుంది.

సుడిగాలి వీచు సమయాన యశోద శ్రీకృష్ణుని ఎత్తుకొని యుండినది. సుడిగాలి రాగానే శ్రీకృష్ణుడు బరువుకాజొచ్చాడు. మనస్సు విషయాలమీదకి మరలి నపుడు, అట్టి మనస్సు భగవంతుని పట్టి నిలుపుకోలేదు. శ్రీకృష్ణుని యశోద క్రిందికి దించింది. మనమూ అంతే. మనస్సు కోరికలచే చుట్టబడినపుడు అచ్యుతునే వదిలేస్తుంటాము. ఆచార్యుని విడిచిపెట్టేస్తుంటాము. ఇది మహాపరాధము. అనిత్యమైన కోరికలు చిత్తములో కదలినపుడు

భగవత్సంబంధమైన ఆలోచనలు అణగారిపోవుట నిజమే. సాధకుడు అప్పుడే జాగ్రత్త వహించాలి. కోరికల హోరు మనస్సులో ఒకవైపు ఉండనీ, కానీ కృష్ణనామమును విడవకుండా పట్టుకోవాలి. అలా చేసినచో సూర్యుని ముందు మంచుగడ్డ కరగిపోవునట్లు కోరికలు, అవి కల్పించే కష్టాలన్నీ కనుమరుగవుతాయి. కానీ మనము అలాచేయము. కోరికలు చుట్టుముట్టగానే కన్నయ్యను వదిలేస్తాము. యశోదకూడా అలాగే చేసింది. సుడిగాలి వీచగానే కృష్ణుని క్రిందకు దించేసింది. కామానికి నీ అంతర్యములో ఎప్పుడు అవకాశమిచ్చి, కృష్ణుని దూరం చేసుకుంటావో ఆ కామమే నీకు దూరంగా కృష్ణుని తీసుకొని వెడుతుంది. తృణావర్తుడు శ్రీకృష్ణుని ఆకాశానికి ఎగరేసుకుని పోయినాడు.

సుడిగాలి తగ్గింది. కోరికలుకూడా ఎప్పుడూ మారుతూనే ఉంటాయి. శ్రీకృష్ణునికై యశోద విలపించసాగింది. సత్యము తెలిసిరాగానే జీవులందరు దేవునికై విలపించక తప్పదు. భక్తుని రోదనమే భగవానునికి నిజమైన నీరాజనం. యశోదభక్తి పరాకాష్ఠ కెళ్ళింది. అంటే భక్తి పెరిగిపోయింది. భక్తి పెరగగానే కామము శక్తిహీన మవుతుంది. శ్రీకృష్ణుడు పెరిగిపోసాగాడు. తృణావర్తుడు శక్తి హీనుడయ్యాడు. శ్రీకృష్ణునిచేతిలో వధించబడ్డాడు. భక్తి పెరగాలేగాని భక్తి చేతిలో విషయానురక్తి చావకతప్పదు. అదియే ముక్తి. కామజయమే ముక్తిద్వారమును తెరచును. ఈ సత్యమును భగవానుడు తృణావర్త వధ యనెడి లీల ద్వారా మనకు తెలియపరుస్తాడు.

తృణావర్తుని వధించునాటికి శ్రీకృష్ణుని వయస్సు ఒక్క సంవత్సరం. సంవత్సరం దాటిన తరువాతనే తృణావర్తుడు గోకులమున కరుదెంచెను. రెండవ సంవత్సరములో కాలుపెట్టగానే కామస్వరూపమైన తృణావర్తుడు అరుదెంచెను.

రెండవవస్తువు మీదికి మనస్సు మరలినపుడే కామము హృదయములో విజృంభించును. రెండవ సంవత్సరములో శ్రీకృష్ణుడు ప్రవేశించగానే తృణావర్తుడు వచ్చుటకు ఇదియే కారణము. ఏకవస్తు చింతనము జరుగుచున్నంతసేపు కామము మనస్సులో ప్రవేశించదు. ద్వైతభ్రాంతి తలెత్తగానే కామము అంతర్యమునందు సుడిగాలి రూపములో తిష్ఠవేయును. భగవన్నామము ద్వారా భక్తిని పెంచుకొని, వాంఛానివృత్తి గావించుకొని తరించాలి.

తృణావర్త వధ జరిగిన తరువాత శ్రీకృష్ణుడు తన తల్లికి మరియొక లీలను చూపి విస్మయింపజేసెను. ఒకనాడు యశోద శ్రీకృష్ణుని ఒడిలో కూర్చొనబెట్టుకుని చన్నిచ్చి పాలు త్రాగించుచుండెను. శ్రీకృష్ణుడు తల్లిచెంత తృప్తిగా పాలు త్రాగెను. స్తన్యపానము చేయుట పూర్తికాగానే యశోద కృష్ణయ్యకు ముద్దులిడుచుండెను. లీలా ప్రదర్శనమునకు ఇది అనువైన సమయమని శ్రీకృష్ణుడు భావించెను.

యశోద కృష్ణునికి పాలిచ్చి తృప్తిపరచెను. శ్రీకృష్ణుడు ఆమెకు లీలను ప్రదర్శించి చూపి సంతృప్తిని కలిగించెను. క్షీరము మనసునకు సంకేతము. నీవు శరణాగతుడవై నీ మనస్సును శ్రీకృష్ణున కొసంగినచో ఆయన తన లీలను నీకు జూపి రక్షించును.



యశోద ముద్దులిడుచుండెను. ఇంతలో అచ్యుతుడు ఆవులించెను. యశోద శ్రీకృష్ణుని నోటిలో ఆకాశము, స్వర్గము, భూమి, సూర్యచంద్రాగ్నులు, వాయువు, సముద్రము, పర్వతములు, నదులు, వనములు, స్థావర జంగమాత్మకమగు ప్రాణులు యుండుట జూచెను.

సీ॥ జననాథ! యొకనాఁడు చన్ను సేఁపినఁ దల్లి చిన్నిముద్దుల కృష్ణు చేరఁ దిగిచి
యెత్తి పెందొడలపై నిడుకొని ముద్దాడి చన్నిచ్చి నెమ్మోము చక్కనివిరి
యల్లని నగవుతో నావులించిన బాలు వదనగహ్వరమున వారిధులు
దిశలు భూమియు వన ద్వీప శైలంబులు నేఱులు గాలియు నినుఁడు శశియు

ఆ॥ దహనుఁ డాకసంబుఁ దారలు గ్రహములు సకలలోకములుఁ జరాచరంబు
లైన భూతగణము లన్నియు నుండుటఁ జూచి కన్నుమోడ్చి చోద్యపడియె.

బాలుని నోటిలో సమస్త విశ్వంబును గాంచిన యశోదాదేవి విస్మయ మొందినదియై శరీరము గగుర్పాటు చెందుచుండగా పరవశించి నేత్రములను మూసికొనెను.

సమస్త విశ్వము తన యందున్నదియే గాని తాను విశ్వానికి పరిమితుడై ఉండుటలేదు అనెడి సత్యమును తన తల్లికి ప్రదర్శించి చూపెను.

మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః

"సమస్త ప్రాణికోట్లు నాయందున్నవేగాని నేను వానియందు లేను" అని భగవద్గీతలోని రాజవిద్యా రాజగుహ్య యోగమునందు భగవానుడు అర్జునునికి బోధించియున్నాడు. అర్జునునికి ప్రబోధించబోయే సత్యమును తల్లికి ప్రదర్శించి చూపాడు.

తృణావర్త వధ జరిగిన తరువాతనే శ్రీకృష్ణుడు తల్లికి నోటిలో విశ్వరూపమును జూపెను. కామము అంతరించిన వానికే సమస్తము భగవంతుని స్వరూపముగా గోచరించును. కామము అంతర్యములో నరలును. అంతర్యములో కామము నశించినపుడే సత్యము అనుభవమునకు అందును. సత్యానుభూతి బాహ్యమున లభించేదికాదు. అది అంతర్యానికి సంబంధించినది. అందుచేత శ్రీకృష్ణుడు తన రూపమును విశ్వమునందు చూపక, విశ్వమంతటిని తనలోనే దర్శింపజేసెను. సత్యదర్శనములో విశ్వము వేరుగా ఉండుటకు వీలులేదు. సత్యదర్శనము ఏకత్వానుభూతియే అయియున్నది. అది రెండు అర్థంగాని ఏకదశ.

యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి స భూమా

ఎచ్చట అన్యమైన దానిని దర్శించుట వీలుపడదో, అన్యమైనది వినబడదో, అన్యమైనది తెలియబడదో అదియే భూమానందము అని ఛాందోగ్యోపనిషత్తు తెలుపుతుంది.



జ్ఞానబ్రహ్మ
స్వామి సుందర చైతన్యానంద

నామకరణం

యదువంశ పురోహితుడు, మహాతపస్వి యగు గర్గమహాముని ఒకనాడు నందుని గృహమునకు అరుదెంచెను. వసుదేవుని ప్రేరణతో గర్గమహర్షి నందగోకులమునకు వచ్చెను. మహాత్ములరాక వసంతఋతువువలె ఆనందదాయక మగును. నందుడు ఆనందముతో మహర్షిని ఆహ్వానించెను. సాష్టాంగ నమస్కారమొనరించి, చేతులు జోడించి నమస్కరించి పూజించెను.

గురుసేవ భగవద్బుద్ధితో కావలెను. గురుసేవ లభించడం కన్నా మించిన భాగ్యములేదు. అహంకారుల సేవలు ఆచార్యుల హృదయాలను అసంతృప్తికి గురిచేయును. వినమ్రత గల్గి భగవద్భావనతో గురువులను సేవించాలి. గర్గమహర్షిని సేవించిన తదుపరి నందుడు ప్రీతివచనములను పలికెను.

క॥ ఊరకరారు మహాత్ములు, వా రథములయిండ్లకడకు వచ్చుటలెల్లం
గారణము మంగళములకు, నీరాకశుభంబు మాకు నిజముమహాత్మా!

అని వినమ్రతతో నందుడు నమస్కరించెను. గర్గమహర్షి మహాజ్ఞాని. జ్యోతిష శాస్త్రమును రచించెను. బ్రహ్మవేత్తయైన గర్గమహర్షిని నందుడు ఈ క్రిందివిధముగా ప్రార్థించెను.

త్వం హి బ్రహ్మవిదాం శ్రేష్ఠః సంస్కారాన్ కర్తుమర్హసి
బాలయోరనయోర్నృణాం జన్మనా బ్రాహ్మణో గురుః

"మీరు బ్రహ్మవిదులలో శ్రేష్ఠులు. ఉత్తమ బ్రాహ్మణులు. గురువులు కనుక ఈ ఇరువురు బాలురకు నామకరణ సంస్కారములను జరిపించండి" అని అర్థించెను.

"నందమహాశయా! నేను యదువంశమునకు పురోహితుడ ననియు, జగత్ప్రసిద్ధి గాంచినవాడ ననియు కంసునికి తెలియును. అదియునుగాక నీతో వసుదేవునకు స్నేహ ముండుటచేత ఈ నామకరణమును నేను చేసినచో ఈ పుత్రుడే దేవకి పుత్రుడని భావించి, కంసుడు కీడు తలపెట్టవచ్చును" అని గర్గమహాముని నందునితో పలికెను.

"మహాత్మా! మునిశ్రేష్ఠా! కంసునివలన ఈ బాలునకు అట్టి ప్రమాదము సంభవించునని మీరు శంకించినచో, ఎవ్వరికీ తెలియకుండా రహస్యముగ నామకరణము చేయవలసినది" అని ప్రార్థించెను.

ఏకాంతముగా నామకరణము చేయుటయే గర్గమహర్షికి ఇష్టము. భగవన్నామమును ఏకాంతములో జపించవలె ననుటయే అందులోని అంతరార్థము. విజ్ఞులైనవారు ఎల్లప్పుడు సాధనను రహస్యముగానే ఉంచుకొనును. సత్యసాధన చేయువారు ప్రదర్శనలను, మెప్పునిలను వాంఛించరు. గర్గమహర్షి ఇరువురు బాలురకును నామకరణము జరిపించెను.

"ఈ రోహిణీ తనయుడు మంగళకర గుణములచే శోభించుచు, బంధు జనమునకు ఆనందము నొసగూర్చును గాన ఇతడు రాముడని పిలువబడును. అధిక

బలము గలవాడగుటచేత బలరాముడు అను నామముతో లోక ప్రసిద్ధుడగును" అని గర్గమహర్షి పలికెను.

"నందుడా! నీ కుమారుడు కృష్ణ వర్ణమున శోభించుచున్నందున అతడు కృష్ణుడని పిలువబడును" అని గర్గు డనెను. "గోపులకు, గోకులమునకు సంతసము నొసగూర్చు ఈ బాలుడు మీ బ్రతుకులలో తేజమును నింపును. నందుడా! నీ కుమారుడు నారాయణునితో సమానుడు" అని పలికి ఆశీర్వదించి, గర్గముని మరలిపోయెను.

కర్తుః ప్రముదితో మునే ఆత్మానం పూర్ణమాశిషః

నందుడు సంతృప్తిపొందినవాడై తనను ఆదృష్టపూర్ణునిగా భావించు కొనెను.

జీవికి జరిగెడి సంస్కారములలో నామకరణము కూడా ఒకటి. నామకరణమునాడు బిడ్డకు నామమిడుట జరుగును. మగపిల్లలకు సరిసంఖ్య వచ్చులాగున నామమిడవలెనని ఆశ్వలాయన మహర్షి అభిప్రాయము. రెండక్షరముల నామము లౌకికసంపద నొసగూర్చునవియు, నాలుగు అక్షరములనామము ఆధ్యాత్మిక సంపద నందించునవియు ఆయన అభిప్రాయపడెను. బాలికల నామములు బేసిసంఖ్యలో ఉండవలెననియు, చివర 'అ'తోగాని, 'ఇ'తోగాని సమాప్తి కావలెనని తెలుపబడియున్నది. 'సుజాత', 'సుమతి' అనెడి నామముల వలె బేసిసంఖ్యలో నుండాలి. చివరన అ కారములోగాని ఇ కారములోగాని సమాప్తికావాలి. జన్మనక్షత్రమును బట్టికూడా నామకరణము చేయుచుండురు. అలాగే పితృదేవతల నామములను పెట్టుటకూడా కలదు. పురాతన కాలమునుండి ఇష్టదేవతల నామములను పెట్టుట జరుగుచున్నది. పిల్లలకు భగవాముని నామమును పెట్టుకొనుటవలన రోజుకి అనేకసార్లు భగవన్నామమును ఉచ్చరించే భాగ్యము కలుగునని వారి అభిప్రాయము.

చోరలీల

వ్రజమునందు శ్రీకృష్ణుడు ప్రదర్శించిన చోరలీల అద్భుతమైనది. అమూల్యమైన ఆధ్యాత్మిక సత్యములతో గూడియున్నది. నందకిశోరుని చోరలీలను తలచుకొని అద్వైత భూమికలలో నిర్వికల్పంగా నిలచియున్న మహాత్ములుకూడా కదలిపోవుచుందురు. చోరలీల అనునది ఒక దివ్యలీల. జీవత్వమును అపహరించి అమృతత్వమును ప్రసాదించే ఆనందలీల. అమృతానందలీల. ఈ లీల అవగతమైనవారు తరచుగ భావసమాధిలో ప్రవేశించుచుందురు. చోరలీలను ప్రదర్శించు సమయాన శ్రీకృష్ణుని రూప మాధుర్యము గూర్చి పోతనామాత్యుడు ఇలా పలికినాడు.

సీ॥ తనువున నంటిన ధరణీ పరాగంబు పూసిన నెఱిభూతిపూఁత గాఁగ
ముందట వెలుగొందు ముక్తాలలామంబు తొగలసంగడికాని తునక గాఁగ
ఫాలభాగంబుపైఁ బరఁగు కావిరిబొట్టు కాముని గెల్చినకన్నుఁ గాఁగ
గంఠమాలికలోని ఘననీలరత్నంబు కమనీయ మగు మెడకప్పు గాఁగ

ఆ॥ హారవల్లు లురుగహారవల్లులు గాఁగ బాలలీలఁ బ్రౌఢబాలకుండు
శివునిపగిది నొప్పె శివునికిఁ దనకును వేఱు లేమిఁ దెల్ప వెలయునట్లు.

అని బాలముకుందుని ఆంధ్ర భాగవతము వర్ణించింది. శ్రీకృష్ణునిలో పరమశివుని గాంచిన పోతన ఈ పద్యమును పరవశించి రచించినాడు. ఈ పద్యము శివకేశవులకు అభేద మని నిర్ణయించును.

నందగోకులం మోహనంగా, మనోహరంగా పగటిలో ప్రవేశించుచున్నది. "కుహూ-కుహూ" అంటూ కోయిలల సుమధుర ధ్వనులు, తుమ్మెదల ఝుమ్మనెడి సునాదములు, అంబా అంటున్న లేగదూడలు, ఆవులు; గలగల గాజుల శబ్దములతో నీటికడవలను మోసుకొస్తున్న గోపభామలు; కాళ్ళ అందెలగజ్జెలు ఘల్లుఘల్లు మనుచుండ పాలుతీసేందుకు నడిచివెడుతున్న గొల్లపడుచులు; పాటలుపాడుకుంటూ ఆవులకు మేతవేస్తున్న గోపాలురు; బావులనుండి గిలకలచప్పుడు మనోహర ప్రకృతికేళిని ప్రదర్శించుచుండ ఈ వ్రజశోభను గాంచి మురియుటకా అన్నట్లు ఉదయభానుడు ఉరకలేస్తూ నింగి నెగ్రాకు చున్నాడు. ఈ మంజుల ప్రకృతిశోభ కన్నను చిన్ని కృష్ణమ్మచేయు అల్లరి అత్యంత శోభాయమానమై మనసులను కరిగించి, హృదయాలను కదలించి, సంస్కారులను ఆనంద పారవశ్య భూమికలలోనికి గొనిపోవుచున్నది.

గోపికలు పరుగులిడుచూ యశోద కడకు వచ్చారు. "అమ్మా! యశోదాదేవీ! నీ కుమారుని అల్లరిని మేము భరించలేకపోతున్నాము. మా నిత్యకృత్యములన్నీ తారుమారగుచున్నవి. నీ బిడ్డను నీవు అదుపుచేసుకోవాలి.

వత్సాన్ ముంచన్ క్వచిద సమయే క్రోశ సంజాతహాసః

"అమ్మా యశోదా! ఆవులను పాలు పితుకుటకు ముందే దూడలను వదలివేయు చున్నాడు. అదిగాంచి గృహయజమాని కోపించిన క్రిష్ణయ్య నవ్వుతూ హేళన చేయుచున్నాడు' ' అని మొఱపెట్టుకొనిరి. యశోద విని నవ్వి ఊరకుండెను.

"కృష్ణయ్యా! వదలవలసిన సమయానికి ముందే దూడలను వదలుట తప్పుగదూ?" అని గోపికలు అడుగగా 'నా పని అలాంటిదే' నని కృష్ణయ్య నవ్వుతూ పరుగిడును.

దూడలు కట్టివేయబడి బంధములో ఉన్నవి. ఒక నియమిత కాలములో వాటి బంధములు తొలగిపోవును. జీవులుకూడా కర్మబంధములలోనే చిక్కుకొని యున్నారు. సంచిత మంతయు అనుభవించబడనిదే వారు బంధవిముక్తులు కాలేరు. దూడలు కృష్ణునిజూచి 'అంబా' యని పిలువగానే శ్రీకృష్ణుడు పరుగు పరుగునవెళ్ళి వాటి బంధనములను తొలగించి విముక్తిని ప్రసాదించును. అలాగే సంసారబద్ధులైన జీవులు "కృష్ణా! గోవిందా! మాధవా!" యని భగవన్నామము నుచ్చరించగానే హృదయాంతర్యామి యగు గోపాలుడు జీవులను బంధ వినిర్ముక్తులను గావించును. నిర్ణయకాలమునకు ముందుగానే నిర్వికల్పస్థితిని అనుగ్రహించి తరింపచేయును.

మరో గోపిక యశోదవద్దకు పరుగెత్తుకుంటూ వచ్చింది. "అమ్మా! మీ కృష్ణయ్య మా ఇండ్లలోని పాలును, పెరుగును అపహరించాడు. తాను తినడమే కాక మిత్రులకు,

వానరములకు కూడా పంచిపెట్టాడు. ఆ తరువాత మా దధి భాండములను పగులగొట్టినాడు' అని ఫిర్యాదుచేసింది.

ఈ సృష్టి భగవానునిది. మనకు జీవితమును ప్రసాదించినవాడు భగవానుడు. ఆయన దయతోనే మన జీవితములు కొనసాగుచున్నవి. భగవత్ప్రసాదముగా లభించిన సంపదను స్వార్థపరులై దాచుకొనువారు భగవానుని దృష్టిలో చోరులే. అట్టివారి సంపదను అపహరించి, ఆర్తులగు వారికి భగవానుడు పంచిపెట్టును. భగవానుడు కరుణా సముద్రుడు. సర్వజీవరాసులను సమానముగా ప్రేమించును.

మర్క్యాన్ భోక్ష్యన్ విభజతి స చేన్నాత్తి భాణ్డం భినత్తి

తాను అపహరించిన దధి, క్షీరములను కోతులకు కూడా పంచిపెట్టును. ఆపైన భాండములను పగులగొట్టును. లోభత్వముతో గూడి సంపద నంతటిని దాచుకొనువారలకు చివరికి ఇలాంటి దురవస్థయే కలుగునని తెలుపును.

మరియొక గోపిక పరుగెత్తుకుంటూ వచ్చింది. "అమ్మా! యశోదా!" అన్నది. "ఆ! ఏమిటి?" అన్నది యశోదాదేవి. బుగ్గమీద చేయివేసుకుని సిగ్గుపడుతూ ఆ గోపిక నిలుచుండిపోయింది. "ఏమిటి గోపమ్మా! ఆగిపోయావేం? చెప్పవేమి?" అంటూ ఆమె ఆ చేతిని పట్టుకొని సిగ్గుపడుతున్న గోపికను తనవైపుకు త్రిప్పుకున్నది యశోదాదేవి.

ఆ గోపిక బుగ్గకు గాయమై ఉంది. "ఏమిటే గాయము? ఎవరు చేశారు?" అన్నది యశోద. "కృష్ణయ్యే!" అన్నది ఆ గోపిక మెల్లగా.

"ఏమిటి? మా కృష్ణయ్యేనా?" అన్నది యశోద.

"అవును. మన కృష్ణయ్యే!" అన్నది గోపిక.

"అమ్మా! యశోదాదేవీ! నేను మా ఇంట్లో పూజచేసుకొంటూ పుండినాను. భగవానుడైన నారాయణమూర్తి విగ్రహము ఎదుట కూర్చొని, ఆరాధన సల్పి, నైవేద్యం పెట్టినాను. కళ్ళుమూసినాను. తెరచి చూచునరికి నైవేద్యమును చేతిలోనికి తీసుకొని కృష్ణయ్య కూర్చొనియున్నాడు. కృష్ణయ్యా! భగవానునికి సమర్పించే నైవేద్యాన్ని ఎంగిలి చేయకూడదు...తప్పు" అన్నాను.

"నేనే నారాయణమూర్తిని" అంటూ నైవేద్యాన్ని నోటిలో వేసుకున్నాడు. నేను పట్టుకోబోయాను. పరుగులిడినాడు. ఎలాగో పట్టుకున్నాను. ఇంతలో నా బుగ్గనై గాయంచేశాడు. నేను కేకవేసి అరిచేశాను. ఇది చూసిన నా భర్త కృష్ణయ్యను వెంబడించాడు. ఒకచోట నిలబడి నా భర్త దగ్గరికి రాగానే నేతిగిన్నెను అతని ముందు విసరివేశాడు. నెయ్యంతా క్రిందబోయింది. నా భర్త పాదాలు ఆ నేతిమీద పడ్డాయి. అతను జారిపడ్డాడు. కృష్ణయ్య నవ్వుతూ పరుగెత్తినాడు. నా భర్తను నడవకుండా మంచానపడేశాడు. నా బ్రతుకును నవ్వులపాలు చేశాడు" అన్నదా గోపిక.

భగవత్తత్త్వమును గ్రహించక అహంకారముతో, మూఢాచారములతో దాంభిక సాధనలు చేయువారి బ్రతుకులు వికారములే అగునని తెలుపుతాడు. అభిమానాన్ని

వెంటనిడుకుని శాశ్వతానందమును అందుకొన యత్నించువారు ఎంత చరించినా సత్యమును దక్కించుకోలేరు. పైగా సత్యమార్గములో జారి పడిపోవుదు రనియు, దుఃఖమునకు గురియగుదు రనియు తెలియజేయును.

ఒకనాడు శ్రీకృష్ణుడు తన మిత్రబృందముతో కలిసి ఒక గోపిక ఇంటిలో నవనీతమును అపహరించుటకు బయలుదేరెను. ఆ ఇంటి యజమాని లుబ్ధుడు. కృష్ణయ్య వచ్చి అపహరించునని తెలిసి ఇంటిలో వెన్న, పాలు, పెరుగు కనబడనీయక దాచివేసెను. కృష్ణయ్య వచ్చెను. ఇంటిలో ప్రవేశించెను. ఇల్లంతా అన్వేషించెను. కానీ ఏమియును లభించలేదు. శ్రీకృష్ణునికి యజమానిపై కోపము వచ్చెను. వెదుతూ వెదుతూ మంచముపై పరుండియుండిన ఆ యజమాని బిడ్డలను గిల్లి, ఏడిపించి వెడలెను.

ద్రవ్యాలాభే సగృహ కుపితో యాత్యుప క్రోశ్యతోకామ్

"నా భర్తపై కోపించి, మా శిశువులను ఏడిపించి వెడలినాడు" అని మరియొక గోపిక విన్నవించుకొనెను.

భగవంతునికి సమర్పించకుండా తానే భుజించు మానవుడు ద్రోహి యనబడును. అట్టివానిపై భగవానుడు కోపమును ప్రకటించును. ఇతరులకు సహాకారము నందించక స్వార్థపూరితమైన జీవనమును సాగించువాడు దుఃఖము పాలగును. "నీవు ఇతరులకు మేలు చేసినచో నీ కుటుంబసభ్యులు, తనయులు ఆనందయాత్రను సాగించుచుందురు. నీవు స్వార్థపరుడవై ఇతరులకు ఏమీ మిగల్చనిచో నీ బిడ్డలకు కూడా ఏమీ లేకుండా పోవును. వారు దుఃఖములకు గురియగుదురు" అని తెలుపుటయే శిశువులను ఏడిపించుటలోని అంతర్భావము.

ఇతరుల క్షేమమును ఎవరు కాంక్షించుచుందురో, వారి క్షేమమును భగవానుడు చూచుచుండును. తమ సుఖములే ప్రధానమని భావించి జీవించువారు, తమకు సంప్రాప్తమయ్యే దుఃఖములను తామే ఒంటరిగా అనుభవిస్తారు.

కృష్ణయ్య బలరామునితో కలిసి ఇంటికి వచ్చాడు. "కృష్ణా! ఏమిటీ ఫిర్యాదులు? ఎందుకిలా చేస్తున్నావు?" అని యశోద గద్దించింది.

బుల్లికృష్ణయ్య పంతులువద్ద నిలుచున్న విద్యార్థిలా రెండు చేతులు కట్టుకుని నిలుచుని, బుంగమూతి పెట్టి "అమ్మా! వాళ్ళెవరికి నిజం చెప్పే అలవాటు లేదే, వాళ్ళు చెప్పేవన్నీ అబద్ధాలే. నీకు నా మీద అధికప్రేమ యున్నందుకు వాళ్ళు బాధపడుతున్నారు. నీ మనస్సును కలతపెట్టి నానుండి నీ మనస్సును దూరంచేయాలని వారు ఇలా పన్నాగం పన్నుతున్నారు. అమ్మా! వారి మాటలు నమ్మి నన్ను దూరంచేయకే" అంటూ దుఃఖవదను డయ్యాడు.

యశోద హృదయం కరిగిపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. ఆనందం పెల్లుబికింది. కృష్ణయ్యను ఒడిలోకి తీసుకొని ముద్దాడుతూ "నాయనా! కన్నయ్యా! బాధపడకు. నేను వారి మాయమాటలు విని మోసపోయాను. నిన్ను నేను దూరంచేసుకుంటానా? చేసుకొని బ్రతుకగలనా? నాతండ్రిగదూ! నా బుజ్జి కిట్టయ్య గదూ!" అంటూ హృదయానికి

హత్తుకొని చెంగున ముసుగువేసింది. చెంగు మధ్యనుండి కృష్ణయ్య బలరామునివైపు తొంగిచూసి చిలిపి నవ్వును చిందిస్తూ కొంటెచూపును విసిరాడు.

కృష్ణయ్య వెన్నను దొంగిలించుటకు ఒక ఇంటిలో ప్రవేశించాడు. భార్యాభర్తలిరువురు ప్రాపంచిక విషయములను ముచ్చటించుకొనుచు పరుండిరి. వారు నిద్రించువరకు కృష్ణయ్య వారి ఇంటియందే దాగియుండెను. వారు నిద్రపోగానే మిత్రులను వెంటనిడుకొని ఉట్టివద్దకు చేరెను. అందులోని పాలు, పెరుగు, వెన్నలను తృప్తిగా అందరూ ఆరగించిరి. తిరిగి వెళ్ళు సమయాన అచ్చట పరుండి నిద్రించుచున్న సతీపతుల సమీపమునకు అరుదెంచి, భర్త జుట్టును భార్యకొప్పునకు ముడివేశాడు. వెడ్తూ వెడ్తూ వారి కాళ్ళు త్రొక్కాడు. నిద్రించుచున్న ఆ దంపతులిరువురు లేచారు. కృష్ణయ్యను చూశారు. పట్టుకునేందుకు పరుగెత్తబోయారు. జుట్టుపీక్కుని అరుస్తూ అక్కడే వెల్లకిలా పడ్డారు. కృష్ణయ్య నవ్వుతూ మిత్రులతో కలిసి పలాయనం చిత్తగించాడు.

భగవానుని చేరేందుకు గృహస్థాశ్రమమనేది చక్కని శకటమైయున్నది. ఇది ప్రగతికొరకు నిర్ణయించబడినదియే కాని పతనానికి నిర్దేశించబడినది కాదు. భార్యాభర్తలిరువురును కలిసి భగవంతుని ప్రార్థించాలి. జపించాలి. ధ్యానించాలి. భగవంతుని గూర్చి ముచ్చటించుకోవాలి. అంతేగాని ప్రాపంచిక విషయాలను చర్చించుకొంటూ పరుండరాదు. భగవానుని విస్మరించి, భౌతిక విషయపిపాసలో కన్ను మూయువారు బంధములో పడిపోవుదురు. అట్టి దాంపత్యం బంధము నందించునేగాని మోక్షమును ప్రసాదించదు. ఈ సత్యమును తెలుపుటకై భగవానుడు వారిరువురిని కేశములతో బంధించి వెళ్ళాడు.

బంధమనేది శరీరానికి సంబంధించినదికాదు. అది మనస్సునకు సంబంధించినది. అందుచేతనే భగవానుడు కేశములచే వారిని బంధీలుగా చేసెను. మనస్సులో పడితే సంకల్పాలు బంధములు కారాదని తెలుపుటయే అందులోని అంతరార్థము.

వివాహ సందర్భమున నూతన వధూవరుల వస్త్రములను ఒకరానిని మరియొకరానితో ముడివేయుదురు. దేహము వస్త్రముతో సమానమని భగవద్గీత-సాంఖ్యయోగము తెలుపుతుంది. వివాహముద్వారా సతీపతులకు కేవలము దేహబంధమే ఏర్పడింది. వివాహానంతరము వారి సంకల్పాలను నడుపుకొనే పద్ధతిని బట్టి మానసిక బంధము ఏర్పడుతుంది. వివాహము దేహాలను దగ్గర చేర్చింది. మనసె దగ్గరైతే దీపము అఖండముగా ప్రకాశిస్తుంది. నీరు అంటుకొంటే అన్యాయముగా ఆరిపోతుంది. దంపతులమధ్య ఉండదగినది ప్రేమయేగాని కామముగాదు. ప్రేమ బ్రతికిస్తుంది. కామం చంపేస్తుంది.

భార్యాభర్త లిరువురు పరస్పరము సహకరించుకుంటూ వారి మనసులను భగవంతునియందు లగ్నమొనర్చాలి. లేనిచో సంసారమొక గుదిబండయై నిలుస్తుంది. కామపూరిత వాంఛలతో కదలే జీవులు భగవంతుని పట్టుకోలేరు. సతీపతు లిరువురును ఒకరికి మరొకరు బరువై, భారమై, ఆటంకమై నిలుస్తారు. కృష్ణయ్యను పట్టుకోవాలని దంపతులు లేచారు. కృష్ణయ్యను పట్టుకోలేరు సరిగదా వారే జుట్టుపీక్కుని పడిపోయారు.

వారికి వారే బరువైనారు. గృహస్థాశ్రమ ప్రాశస్త్యము అర్థంగాక పిచ్చి సంసారాన్ని తయారుచేసుకొనే అయోమయ జీవులు వారి ప్రగతిని వారే నిరోధించుకుంటారు. వారి పతనాన్ని వారే నిర్ణయించుకుంటారు. ఈ విధమైన జీవన నడక సముచితమైనది కాదు. ఈ సందేశము నందించుటకే శ్రీకృష్ణుడు వెళ్తూ వెళ్తూ వారి కాళ్ళను త్రొక్కి మరీ వెళ్ళాడు. ఈ అప్రయోజకపు నడకకు స్వస్తి చెప్పి, పరమాత్మ ధ్యానంలో మనసును లగ్నమొనర్చి తరించండి అని తెలియజేశాడు.

ఒకనాడు తన బృందముతో కలిసి శ్రీకృష్ణుడు ఒక గోపిక ఇంటిలో ప్రవేశించినాడు. ఇంటిలోపలి కప్పునకు వ్రేలాడగట్టబడియున్న ఉట్టిలోని పాలకుండలను, వెన్నదుత్తలను చూశాడు. అవి బాలురకు అందనంత ఎత్తులో అమర్చబడియున్నాయి. కృష్ణయ్యకు అందకుండా ఉంచాలని ఆ గోపభామ ప్రయత్నం. గోపబాలు రందరూ నివ్వెరపోయి చూస్తున్నారు. కర్తవ్యం ఏమిటో స్ఫురించలేదు.

కృష్ణయ్యవంక చూశారు దీనంగా. కృష్ణయ్య నవ్వుతూ రాయిని చేతిలోకి తీసుకుని వ్రేలాడుతున్న కుండపై విసిరాడు. కుండకు రంధ్రము ఏర్పడింది. పాలు కారుతున్నాయి. గోపబాలురందరు ఆ క్షీరమును పానము చేయసాగారు. కుండ బ్రద్దలై వెన్న క్రింద బడుతుంటే మధ్యలో ఆ వెన్నను దోసిళ్ళలో పట్టుకొని కృష్ణయ్య గోపబాలురకు పంచినాడు. గోపెమ్మ ఈ అలజడికి నిద్రలేచి కన్నయ్యను చూసింది. అంతే. చేతిలోని వెన్నముద్దను ఆమెపై విసిరాడు. అది ఆమె మూతికి అంటుకున్నది. కృష్ణయ్య నవ్వుతూ పరుగులిడినాడు. మిత్రబృందం అనుసరించారు. అనుకరిస్తూ పరుగులిడినారు.

ఊర్ధ్వముగ వ్రేలాడదీయబడియున్న ఉట్టిలోని కుండలను బ్రద్దలుగొట్టి, పాలను అపహరించినట్లు, ఆత్మవిచారము అనే బాయిలో పై భాగమున ఉన్న మస్తకమను ఉట్టిలోని అజ్ఞానమను కుండను బ్రద్దలుకొట్టి, జ్ఞానమను క్షీరమును పానము చేయవలయు ననుటయే ఈ వినోద క్రీడలోని అంతరార్థము.

అజ్ఞానే నావృతం జ్ఞానం

"అజ్ఞానముచేత జ్ఞానము ఆవరించబడియున్న"దని గీతలోని జ్ఞానయోగమునందు తెలుపబడియున్నది. క్షీరము అను జ్ఞానము ఘటమనెడి అజ్ఞానము చేత ఆవరించ బడియున్నది. కుండను పగులగొట్టుట యనగా అజ్ఞానమును నశింపచేయుట యని అర్థము. జ్ఞానమును పొందిన ఆప్తకాముడు తాను తృప్తి చెందుటయేగాక, తాను పొందిన జ్ఞానమును పరులకి పంచవలయునని శ్రీకృష్ణుడు నవనీత వితరణద్వారా ప్రదర్శించి ప్రవచించాడు.

స తరతి స తరతి లోకాం స్తారయతి

"తాను తరించాలి. లోకమును తరింపచేయాలి". ఇదియే సనాతన ధర్మజీవన మందించు ఉజ్వల ఆశయమని నారదమహర్షి భక్తి సూత్రాలలో ధృవపరుస్తాడు.

దొంగిలించిన వెన్నను తన మిత్రులకేగాక మర్కటాది జంతువులకుకూడా భగవంతుడు పంచిపెట్టేవాడు. జ్ఞానము నందించుటలో భేదభావములు పొడసూపకూడదు. భగవానుడు కోతులకు కూడా పంచినాడు. అలాంటప్పుడు; కులతత్వాలకు, జాతిమతాలకు జ్ఞానమార్గములో తావున్నదేమో ఆలోచించండి. ఇచ్చట ప్రేమ యొక్కటియే గణనీయమైనది.

నాస్తి తేషు జాతి విద్యా రూప కుల ధన క్రియాది భేదః

"భగవద్భక్తులయందు జాతి, రూప, కుల, ధన, ఉద్యోగాది భేదములు లేవు" అని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలిపియున్నాడు.

ఉదయాన్నే గోపభామ నిద్రలేచి చూసింది. ఉట్టిలోని మట్టికుండలు పగిలి ఉన్నాయి. భూమిపై దధి క్షీరములు నిండి ఉన్నాయి. ఇదంతా కన్నయ్య పనియేనని గోపభామ గ్రహించింది. పరుగెత్తుకుంటూ యశోద దగ్గరకు వచ్చింది. జరిగిన విషయమును విపులముగా వివరించింది.

యశోద కన్నయ్యను పిలిచింది. లోనుండి బుడబుడమని వచ్చాడు. "కృష్ణా! ఇది నిజమేనా?" అంటూ గోపెమ్మ అభియోగమును వివరించిచెప్పింది. కన్నయ్య నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. "అయినా ఇంత ఘోర అభియోగమా? ఓ గోపెమ్మా! అబద్ధాలాడి మా అమ్మను నమ్మించలేవు. ఎంత కాలము నా మీద అసత్యప్రచారాలు సాగిస్తారు? నేను రాత్రంతా మా అమ్మ ప్రక్కలోనే బజ్జొని ఉన్నాను తెలుసా?" అన్నాడు.

"అవును. నా బిడ్డ రాత్రంతా నా దగ్గరే పడుకొని నిద్రపోయాడు. ఇదిగో గోపెమ్మా! ఒక్కమాట చెబుతున్నాను విను. నా బిడ్డపై ఇలాంటిఅన్యాయాలు రుద్దితే నేను సహించను" అంటూ కన్నయ్యను చంకన ఎత్తుకొని యశోద లోనికి వెడుతుంటే, కన్నయ్య వెనుదిరిగి ఆ గోపికను కన్ను గీటాడు. ఆ దివ్యరూపమును గాంచి గోపిక పరవశించి నిలబడిపోయింది.

"కన్నయ్యా! నా బాధ వెన్న పోయిందనికాదు. ఇలాంటి రూపమాధుర్యాన్ని ఆస్వాదించే అవకాశం దూరం కాకూడదని" అని చింతిస్తూ నేత్రాలవెంట ఆనందాశ్రువులను జార్చింది.

ఒకనాడు కృష్ణయ్య తన బృందముతో కలిసి ఒక గోపెమ్మ ఇంటిలో ప్రవేశించడం జరిగింది. ఉట్టిమీద పాలున్నాయి. ఉట్టి క్రింద పీటలున్నాయి. ఒకదానిపై ఒకటి ఉంచాడు. కానీ పీటలు నిలువలేదు. పడిపోసాగాయి. ఇక లాభములేదని తన బృందాన్నే ఉపయోగించు కున్నాడు. ఒకరిమీద ఒకరిని ఎక్కించాడు. తాను వారిపై మెట్లెక్కినట్లు ఎక్కి వెళ్ళాడు. ఉట్టిపైనున్న కుండను పట్టుకున్నాడు. మెల్లగా క్రిందికి దింపినాడు. కడుపారా మిత్రులందరూ ఆరగించారు. వెడుతూ వెడుతూ కాస్త వెన్న తీసుకొని నిద్రపోతున్న గోపెమ్మ మూతికి రాసి వెళ్ళాడు.

ఉట్టిలోని కుండలలో పాలుంటాయి. ఉట్టి ఎత్తున వ్రేలాడదీయబడి ఉంటుంది. సహస్రార చక్రమునందు జ్ఞానము భద్రపరచబడి ఉండును. సహస్రారచక్రము పై భాగమున యున్న మస్తకమునందు ఉంటుంది. క్రిందనుండి షట్చక్రములగుండా

పయనించి సహస్రారమును చేరినచో జ్ఞానము లభ్యమవుతుంది. ఈ యోగసాధనకు సంకేతముగా శ్రీకృష్ణుడు గోపబాలుర్పై ఎక్కుట అనే షట్చక్ర భేదనముద్వారా సహస్రారమనెడి ఉట్టిని సమీపించి అందు లభ్యమగు జ్ఞానమనెడి క్షీరమును పానము చేయుటయే శ్రీకృష్ణుడు బాలుర్పైనెక్కి ఉట్టిలోని క్షీరమును అపహరించుటలోని అంతరార్థము. క్షీరము జ్ఞానమునకు సంకేతము.

శ్రీకృష్ణుడు వెడుతూ వెడుతూ చేతిలోని వెన్నను గోపిక మూతికిరాసి మరీ వెళ్ళెను. గోపిక నిద్రలేవగానే చూసుకొనెను. మూతికి వెన్న రాసియుండెను. ఇది కృష్ణయ్య పనియేనని గ్రహించెను. యశోదకు ఫిర్యాదు చేయుటకు బయలుదేరెను.

నీవు ఇతరులకు మేలుచేసినచో నీకు మేలు జరుగును. పరులకు మంచిచేయుటకు భగవానుడు పొంచియే యుండును. అలాగాక స్వార్థములో నీవే తృప్తి చెందాలని, నీకున్న దానిని ఎవ్వరికీ అందకుండా పాలను ఉట్టిమీద ఉంచినట్లు దాచుకున్నచో అట్టివారు అనుభవించేది కూడా ఉండదు. గోపిక మూతికి వెన్నరాయబడిందేగాని ఆమె వెన్న తిన్నది లేదు. అలాగే స్వార్థజీవనము అందించే సంపద నోటివరకు వస్తుందేగాని, లోపలికి వెళ్ళదు అని కృష్ణయ్య తెలియజేస్తాడు.

గోపెమ్మ యశోదను సమీపించింది. తనమూతిని చూపెట్టింది. కృష్ణయ్య అల్లరి పెచ్చుపెరిగి పోతున్నదని తెలియజేసింది. అదుపుచేయనిచో మాకు పొదుపు జరిగేలా లేదని చెప్పినది.

క॥ ఆడంజని వీరల పెరుఁ, గోడక నీసుతుడుఁ ద్రావి యొకఇంచుక లాఁ
గోడలి మూతిం దుడిచినఁ, గోడలు ముచ్చనుచు నత్తకొట్టెలతాంగీ!

అని ఆ గోపికతో అరుదెంచిన ఇరుగు పొరుగువారు తెలిపిరి.

యశోద కృష్ణయ్యను పిలిచి అడిగింది. "అయ్యో! అయ్యో! ఇది ఏమి అన్యాయము?" అంటూ మొదలెట్టాడు.

"అమ్మా! వీరి మాటలు నీవు నమ్మకు. వీరికి నేనంటే గిట్టదు. అందుచేత నామీద అభియోగములు మోపుతున్నారు. కడుపార వెన్న తినిపించే తల్లివి నీవుండగా వీరి కొంపలలో వెన్న నపహరించవలసిన ఖర్మ నాకేల? అదియునుగాక నేను దొంగిలించినది వాస్తవమైనచో దానిని నేను తినాలిగాని ఈమె మూతికి ఎందుకురాస్తాను? అమ్మా! ఇదంతా నాటకమే. నన్ను కొట్టించేందుకు ఈ బూటకపు మాటలు అల్లుకొని వచ్చారే! అమ్మా! నన్నుకొట్టకే" అంటూ తల్లిని వాటేసుకున్నాడు.

"కన్నా! నీవు చెప్పిందంతా నిజముగానే తెలియుచున్నది. నిన్ను ఎప్పుడూ నేను కొట్టను. నాబుజ్జి కన్నయ్యకదూ!" అంటూ ముద్దెట్టుకుంటూ యశోద కన్నయ్యతో లోనికి వెళ్ళింది.

నవనీతమును దొంగిలించుటకు ఒకనాడు మరియొక గోపిక ఇంటిలోనికి శ్రీకృష్ణుడు ప్రవేశించాడు. మిత్రులందరిని బయటనే ఉండమని చెప్పి, తాను లోనికి

ఏగినాడు. వెన్నకుండను సమీపించాడు. మూత తీశాడు. చేయి పెట్టాడు. ఇంతలో ఆ ఇంటి గోపెమ్మ వచ్చి శ్రీకృష్ణుని చేయి పట్టుకున్నది.

గోపిక:- కృష్ణా! దొరికిపోయావు! ఇప్పుడేమంటావు?

కృష్ణ:- దొరకడానికి నేను పారిపోయిన దొంగనా? పోగొట్టుకొనిన బంగారమునా?

గోపిక:- మా గోకులానికి నీవు బంగారానివే. కానీ నీ శృంగారపు మాటలు కట్టిపెట్టి, నా ప్రశ్నకు సమాధానం చెప్పు. మా వెన్నకుండలో చేయి నెందుకు పెట్టావు? వెన్న నెందుకు దొంగిలిస్తున్నావు? ఇది తప్పని తెలియదా?

కృష్ణ:- ఏమో! పరోపకారము తగని పని యని నాకేం తెలుసు? నేనిప్పుడే నీ ద్వారా తెలుసుకుంటున్నాను.

గోపిక:- పరోపకారమా? ఏమిటా పరోపకారము? ఇతరుల ఇండ్లలో ప్రవేశించి వెన్న దొంగిలించడమేనా పరోపకారము?

కృష్ణ:- నేనేమి దొంగిలించలేదు. దొంగలకు అందరూ దొంగలుగానే కనిపిస్తారు.

గోపిక:- ఏమిటీ! నన్ను దొంగ అంటున్నావా?

కృష్ణ:- నీవు దొంగవని నేను అనలేదు. నన్ను చోరు డనవద్దని చెబుతున్నాను.

గోపిక:- నీవు చోరుడవు కానిచో మా వెన్నకుండలో నీకేం పని?

కృష్ణ:- నేను మీ వెన్నకుండలో చేయిపెట్టింది వెన్న తినేందుకు కాదు. చీమలను తీసివేసేందుకు.

ఆ మాటలు వినగానే గోపిక ఫక్కున నవ్వింది. కృష్ణుడు పారిపోయాడు.

మృణ్మయరూపమైన మానవ శరీరమే మృత్తికారూపమైన వెన్నకుండ. మనలోని మనస్సే కుండలోని వెన్న. వెన్నకుండలో చీమలు నిండివున్నాయి. చీమలున్న వెన్నను శ్రీకృష్ణుడు ఆరగించడు. వాసనలనెడి పిపీలికములతో నిండిన మనస్సును భగవానుడు అంగీకరించడు. తన నారాధించు భక్తుల మనస్సులనెడి వెన్నయందు నిండియున్న వాసనలనెడి చీమలను భగవానుడు తొలగించి వారిని కృతార్థులను చేయును. వాసనా రాహిత్యమే నవనీత చోరత్వము వెనుక దాగియున్న ఆధ్యాత్మిక సందేశము.

ఒకనాడు ఒక గోపెమ్మ ఇంటిలో ప్రవేశించి నేతికుండను స్వాధీన పరచుకొనెను. కుండలోని నేయినంతటిని ఖాళీచేసిన పిదప ఆ ఖాళీకుండను తెచ్చి, బ్రహ్మవారింటిలో పెట్టినాడు. నేతికుండ పోయిందని తెలిసి గోపెమ్మ అన్వేషించ నారంభించగా, ఖాళీ నేతికుండ బ్రహ్మవారింటిలో కనుపించింది. గోపెమ్మ బ్రహ్మవారిని అనుమానించింది. ఇరువురి మధ్య పెద్ద తగవు తయారైంది. ఈ తగవును చూస్తూ అల్లంతదూరాన కృష్ణయ్య గంతులేస్తూ నవ్వుచుండెను.

క॥ వారిల్లు సొచ్చి కడవలఁ, దోరంబగునెయ్యి ద్రావి తుది నాకడవల్
వీరింట నీ సుతుం డిడ, వారికి వీరికిని దొడ్డవాదయ్యె సతీ!

అని గోపికలు యశోదమ్మతో చెప్పారు.

ఆశాపాశముచే కట్టబడిన మానవులు తమకొరకు సంపదనంతా నిల్వచేసుకొందురు. పోయేవాడు ఏదీ మన వెంబడిరాదు. ఈ జీవుడు మరియొక చోట ఒంటరిగా జనించును. తాను సంపాదించిన దంతయు ఇతరులు అనుభవింతురు.

వేయిని ఖాళీచేసి ప్రక్క ఇంటిలో కృష్ణయ్య కుండను ఉంచెను. కుండ అనెడి జీవుడు నేయి అను సంపదను తయారుచేసుకొనును. కర్మతీరిన వెంటనే కుండ ప్రక్కయింటికి మార్చబడినట్లు జీవుడు వేరొక చోటికి తరలించబడును. తాను ఒంటరిగా వెళ్ళునేగాని సంపదను వెంటగొనిపోలేదు. అందుచేత మధ్యలో వెన్న అపహరించబడింది. ఆశలమర్య మేడలు తయారుచేసిన వారి బ్రతుకు జగడాలకు నిలయమవుతుంది. ఇదియే ప్రక్కింటి వారితో జరిగిన వ్యవహారము. కనుక తోడుగాని, నీడనివ్వని సంపద నిరర్థకమని భావించి, మనస్సును భగవానుని యందు నిలుపవలెనని తెలుపుటయే కుండమార్పిడి అనెడి లీలయై యున్నది.

శ్యామసుందరుని దివ్యలీలలతో నంద గోకులమంతా పరవశించి పోయింది. గోపికల మానసములన్నియు శ్రీకృష్ణ పాదారవిందముల చెంత పూజాసుమములై పోయినవి. శ్రీకృష్ణుడు తప్ప వారికి రెండవ ధ్యాస తెలియదయ్యెను. గోపికల భక్తి పరాకాష్ఠను శ్రీలీలాశుకులవారు అతిరమణీయముగ తన కృష్ణ కర్ణామృత గ్రంథమునందు రచించి యున్నారు. భగవానుడైన శ్రీకృష్ణుని కొరకై విరహాసక్తితో తపించుచూ చరించు పరమ భాగవతోత్తములే గోపికలు. అన్యచింతలెరుగని అమృత హృదయులు. ఒక క్షణము భగవానుడు స్మృతిలో మెదలకుండినచో పరమ విరహ వ్యథను అనుభవించు చుండెడివారు.

విక్రేతు కామాకిల గోపకన్యా మురారి పాదార్పిత చిత్తవృత్తిః
దధ్యాదికం మోహవశాదవో చద్గోవింద దామోదర మాధవేతి...

పెరుగు మొదలగు వానిని అమ్ముచున్న గొల్లపడుచు-మురారి పాదముల చెంత మనస్సును లగ్నమొనర్చుటచేత "పెరుగు-పెరుగు" అనుటకు బదులు "గోవిందా-మాధవా-దామోదరా"యని కేకలేయుచున్నది.

'పెరుగును కొంటారా?' అనేందుకు బదులుగా 'మాధవుని కొంటారా?' అని ఆ గొల్లపడుచు అడుగుచున్నది. ఆహా!......ఏమి ఆమె సాహసము! చతుర్దశ భువనములను తన కుక్షియందు నిలుపుకొని యున్న పరమాత్మను రెండుకాసులకు అమ్మజూపినదా? భగవానుడు అంతసులభుడా? అవును. అన్యాశ్రయములను త్యాగమొనర్చిన వారికి భగవానుడు సులభుడే.

ఒకనాడు పరమాత్మయైన శ్రీకృష్ణుడు వెన్న దొంగలించుటకై ఒక గొల్లభామ ఇంటిలో ప్రవేశించెను. ఇంతలో ఆ గొల్లభామ కృష్ణుని గాంచి, "ఏయ్! ఎవరు నీవు? మా ఇంటికేల వచ్చినావు?" అని అడిగెను.

కస్త్వం బాల బలానుజః కిమిహతే మన్మన్దిరా శఙ్కయా
యుక్తం తన్నవనీతపాత్ర వివరే హస్తం కిమర్థం న్యసేః
మాతః కఞ్చన వత్సకం మృగయితుం మాగా విషాదం క్షణా
దిత్యేవం వరవల్లవీ ప్రతివచః కృష్ణస్య పుష్ణాతునః

గోపిక:- (హే బాల త్వం కః?) హే బాలకా! ఎవరు నీవు?

కృష్ణ:- (బలానుజః) బలరాముని తమ్ముడను.

గోపిక:- (ఇహ కిం?) ఇచ్చట ఏమి పని?

కృష్ణ:- (మన్మందిరా శఙ్కయా) మా ఇల్లనుకొని వచ్చాను.

గోపిక:- (తత్ యుక్తం నవనీత పాత్రవివరే హస్తం కిమర్థం న్యసేః?)

అది మంచిదేగాని వెన్నకుండలో చేయిని ఉంచితివి ఎందులకు?

కృష్ణ:- (మాతః కఞ్చన వత్సకం మృగయితుం మాగా విషాదం క్షణా)

ఓ తల్లీ! ఒక లేగదూడను వెతుకుటకు వెన్నకుండలో చేయి పెట్టినాను. కొంచెము నీవు కలవరపడకుము.

అనిన శ్రీకృష్ణ భగవానుని దివ్యవాణి మనలను సదా రక్షించుగాక అని రచయిత పరవశించుచున్నాడు.

ప్రతివ్యక్తి శాంతి యనెడి లేగదూడను పోగొట్టుకొనియే యున్నాడు. మట్టి కుండయే స్థూల శరీరము. అందులోని వెన్నయే సూక్ష్మశరీరము. మనన ధ్యానాదులద్వారా సూక్ష్మ శరీరమున కదలాడి చూసినచో శాంతి అనుభూతిగా మిగులును. వెన్నకుండలో దూడను వెతుకుట యనెడి ఈ లీల ద్వారా భగవానుడు సందేశమును అందించును. శాంతి యనునది అంతర్యంలో లభించేదేగాని బాహ్యంలో చిక్కేది గాదని ప్రవచించును.

ఒక గోపభామ ఇంటిలో దంపతులిరువురు ఎదురెదురుగా కూర్చొని భుజించు చున్నారు. కృష్ణయ్య వచ్చాడు. ఇరువురి మధ్య విసనకఱ్ఱను అడ్డంగా ఉంచి, భర్తకు కనపడనివ్వకుండా భార్యబుగ్గపై చిటిక వేశాడు.

భుజించే సమయాలలో ప్రాపంచిక విషయాలు ముచ్చటించుకుంటూ భుజించరాదని శ్రీకృష్ణుని అభిప్రాయము. మనము తీసుకొను ఆహారముయొక్క సూక్ష్మాంశమే మనసగును. అందుచేత వంటచేసేవారు భగవన్నామము నుచ్చరిస్తూ చేయాలి. అలాగే తినేటప్పుడు కూడా నామం చెబుతూ భుజించాలి.

గోపభామ లందరూ యశోద దగ్గరికి అతి ఆవేశములో అరుదెంచారు. "నీ కుమారుడు మా ఇంటిలో పాలకుండను పగులగొట్టినాడు. ఇక లాభములేదని అతనిని త్రాటితో స్తంభానికి కట్టేసి మరీవచ్చాము. ఇప్పుడేం చెబుతావు?" అన్నది ఒక గోపిక.

ఇంతలో మరొక గోపెమ్మ వచ్చింది. "అమ్మా! యశోదా! నీ బిడ్డడు మా ఇంటిలో వెన్న దొంగిలించాడు. నీవు నమ్మడంలేదని అతనిని బంధించాము. నా భర్తను కాపలా పెట్టి మరీవచ్చాను ఏం చెబుతావు?" అన్నది.

మరొక ముదుసలి పరుగెత్తుకుంటూ వచ్చింది. "అమ్మా! యశోదా! ఇక మేము ఈ గోకులంలో ఉండలేము తల్లీ! పెరుగుకుండను అందించలేదని నీ బిడ్డడు నా కోడలి బుగ్గను గాయం చేశాడు. అతడిని పట్టి నిలబెట్టి యున్నారు. రా...చూద్దువుగాని..." అన్నది.

మరొకభామ కేకలేస్తూ వస్తున్నది. "నా బిడ్డ ఏ తప్పు ఎఱుగడు అని అంటుంది. ఇదిగో పట్టి తెచ్చుచున్నాను. ఇప్పుడేమి చెబుతుందో చూడాలి?" అంటూ వచ్చింది.

"అమ్మా! యశోదా! ఇప్పుడు చెప్పు. మా ఇంటిలో ఉట్టిపై నున్న వెన్నను నీ బిడ్డడు దించుతూ ఉంటే పట్టుకొని తీసుకునివచ్చాను. ఇదుగో! నీ బిడ్డడు ఏం చెబుతాడు? ఇప్పుడేమంటావు?" అన్నది. యశోదమ్మకు మతి చెడినట్లైంది.

"ఏడి? నా కృష్ణయ్య ఏడి?" అన్నది యశోద.

"ఇదిగో" అంటూ తన కుమారుడినే పట్టుకొని చూపుతున్నది ఆ గోపెమ్మ.

యశోదకు అర్థంకాలేదు. "ఏమిటి నీవంటున్నది? నీ కుమారుని పట్టుకొని నా బిడ్డ అంటావేమిటి?" అన్నది యశోద.

"ఏమిటి?" అంటూ ఆ గోపిక చేతిలోని పిల్లవానిని చూసింది. అతడు కన్నయ్యకాదు, ఆమె బిడ్డడే..... కన్నయ్యను పట్టుకొని వచ్చుచుండినది. మధ్యలో చెయ్యి మార్చుకున్నాడు. ఆ మార్పిడిలో కన్నయ్య స్థానంలో ఆమె కుమారుడే వచ్చి నిల్చున్నాడు.

"నీవెలా వచ్చావురా?" అన్నది గోపిక తన బిడ్డను. ఆ కుర్రాడు "మా నాయకుడు పట్టుబడితే మా పరిస్థితి ఏం కావాలి?" అని తనలో తాను గొణుగుకొంటున్నాడు.

"ఆ చెప్పేదేమిటో కాస్త బిగ్గరగా చెప్పు" అన్నదా గోపెమ్మ.

"ఇంకెందుకమ్మా! ఆ చిన్నబిడ్డను గద్దిస్తావు? నిజం తెలిసిపోయిందిగా! నా ముద్దుల పంటను జూచి మీరంతా ఓర్వలేకపోతున్నారు. నా చిన్నారి కన్నయ్యపై లేనిపోని అబద్ధాలు సృష్టిస్తున్నారు. నా బిడ్డపై ఇలాంటి అసత్య ప్రచారాలు సాగిస్తే నేను సహించను. ఉండండి వస్తాను" అంటూ లోనికెళ్లింది. కన్నయ్య ఊయలలో పడుకొని యున్నాడు. తన కాలి బొటనవ్రేలును నోట్లో వేసుకొనియున్నాడు.

యశోద హృదయం ద్రవించింది. "అమాయకుడైన నా బిడ్డపై ఇన్ని అభియోగములా?" అనుకొంటూ నోటిలోని బొటనవ్రేలును తీసి ప్రక్కనుంచి బయటకు వెళ్ళింది తన బిడ్డడే ప్రళయజలాలయందు తేలియాడిన వటపత్రశాయి అని గుర్తించలేక.

ఇంటివెలుపలికి వచ్చింది. గోపభామలను చూసింది. "ఊఁ.... ఇంకా ఇక్కడ నిలబడి యున్నారేం? చేసిన అభియోగాలు చాలదూ? ఈమె పట్టుకొచ్చినట్లు ప్రగల్భాలు పలికి చివరకు తన బిడ్డను చూపించింది. మీరంతా బంధించి వచ్చినట్లు చెబుతున్నారు. పదండి... ఊఁ..... చూస్తారేం.... పదపండి. బంధించి యున్న నా బిడ్డను చూపించండి. మీముందే వాడిని దండిస్తాను" అన్నది.

"రండి చూపిస్తాము" అంటూ గోపెమ్మలు ముందు నడుస్తున్నారు. నడుస్తున్నారేగాని అంతర్యంలో ఆవేదనతో నలిగిపోతున్నారు. "యశోద కన్నయ్యను దండిస్తానంటున్నది. కోపంవచ్చి కొడుతుందేమో? కన్నయ్యకు బాధ కలిగితే గోపికలు జీవించలేరు. అయ్యో! ఎంత తప్పు చేసాము! కన్నయ్యను బంధించకుండా ఉంటే సరిపోయి ఉండేది. బంధించినాము పో; యశోదమ్మకు చెప్పకుండా ఉంటే చాలాబాగుండేది. మా కన్నయ్యకు మేమే కష్టాలు తెచ్చి పెట్టాము. కన్నయ్యను బంధవిముక్తుని గావించు భగవాన్!

యశోదమ్మ మమ్ములను తిట్టినా ఫరవాలేదు." అంటూ లోలోన గోపికలు తలపోసు కుంటున్నారు.

స్తంభానికి కట్టివచ్చినట్లు చెప్పిన గోపభామ ఇంటికి వెళ్ళారు. స్తంభానికి ఒక వ్యక్తి కట్టబడియున్నారు. అయితే ఆ వ్యక్తి మన కన్నయ్య కాదు. ఆ గోపిక యొక్క అత్తగారు. గోపిక పరుగెత్తుకుంటూ దగ్గరికి వెళ్ళి అత్తగారిని బంధవిముక్తురాలిని చేసింది. అత్తమ్మా! ఏమిటీ అన్యాయం? నిన్ను ఎవరు బంధించారు? కన్నయ్య ఏమైనాడు?" అన్నదా గోపిక.

"చాల్లే! చెప్పొచ్చావు! అత్తగారనే గౌరవంకూడా లేకుండా నిర్దాక్షిణ్యంగా నన్ను బంధించి, ఇపుడు నలుగురి ముందు ఏమియును ఎఱుగనట్లు బంధాలు తొలగిస్తున్నావా? పైగా పసివాడైన కన్నయ్య మీద అభియోగం మోపుతావా?" అన్నది. గోపిక తెల్లబోయి చూస్తున్నది.

"సరే, ఇంకా చూస్తారేం? పదండి మీ ఇండ్లకు గూడాను" అంటూ కన్నయ్యను బంధించి భర్తను కాపలా పెట్టి వచ్చినట్లు చెప్పిన గోపిక ఇంటికి వెళ్ళారు. అచ్చట కన్నయ్యకు బదులుగా కాపలా ఉండిన ఆ గోపిక భర్తయే బంధింప బడియున్నాడు. భార్యను చూడగనే కోపోద్రిక్తుడై చివాట్లు పెడుతున్నాడు.

ఇక ముదుసలి యిల్లు మిగిలియున్నది. కోడలి బుగ్గను గాయపరచినాడనియు, అందుచేత కృష్ణయ్యను బంధించవలసి వచ్చిందని ఆమె ఫిర్యాదు. తీరా వెళ్ళి చూసారు. అక్కడ కన్నయ్య లేడు. ఆ ముదుసలి కోడలైన గోపికను యశోదామాత ప్రశ్నించింది, "మా కన్నయ్య ఎక్కడ?" అని.

'రెండు రోజులనుండి కన్నయ్య ఈ ప్రాంతానికి రాలేదు" అన్నదా గోపిక.

"మరి నీ బుగ్గపై నున్న గాయమేమిటి?" అన్నది యశోద.

ముసిముసి నవ్వులను ఒలకబోస్తూ పైటచెంగుతో ముఖాన్ని కప్పుకొని ఆ గోపిక సిగ్గుపడసాగింది.

"మీ అభియోగాలకు, అన్యాయాలకు అంతులేకుండా ఉన్నది. నా బిడ్డయైన కన్నయ్య వైభవమునుగాంచి మీరు ఓర్వలేకపోతున్నారు. ఇక మీదట అమాయకుడైన నా బిడ్డపై ఇలాంటి ఫిర్యాదులను చేసినచో నేను సహించడమంటూ ఉండదు" అని పలికి యశోదాదేవి చకచకమని నడకసాగించి ఇల్లు చేరింది.

శ్రీకృష్ణుని రమణీయ చేష్టలు ఆధ్యాత్మిక భావగర్భితాలు. అర్థంగాని వేదాంత రహస్యాలను తన బాలక్రీడలద్వారా ప్రవచించకనే ప్రదర్శించేవాడు. భక్తుల హృదయములం దుండలి నవనీతమనే ప్రేమను దొంగిలించి నవనీత చోరుడయ్యాడు. యథార్థానికి మానవ చోరుడయ్యా వెన్నదొంగ యని పేరు పడ్డాడు. చోరత్వములో ఎప్పుడూ స్వార్థమే ఉంటుంది. కానీ కృష్ణుని చోరత్వములో ఒక ప్రత్యేకత ఉంది. తాను వెన్న దొంగిలించేవాడేగాని తినేవాడుకాదు. పేదవారైన తనతోటి గోపబాలురకు పంచిపెట్టేవాడు. ఉన్నవారినుండి తీసి, లేనివారలకు సహాయం చేయాలనే సామ్యవాద సిద్ధాంతానికి ఆనాడే నాంది పలికిన విధాయక విప్లవవాది శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుని ఆటలు, మాటలు, పాటలు నందగోకులానికే నూతన శోభ నిచ్చాయి. మధుర మంజుల మోహనమూర్తియైన కన్నయ్య పర్వులకు కన్నుల పంటయై, కంటివెలుగునై నిలిచాడు. అందుచేత ఆ మనోహరమూర్తి యోగులను సైతము ఆకర్షించాడు. అతని దివ్యరూపం త్రిలోకములను పరవశింప జేసింది.

ఉపాసతామాత్మా విదః పురాణాః పరం పుమాంసం నిహితం గుహాయామ్
వయం యశోదాశిశు బాల లీలా కథా సుధా సిన్ధుషు లీలయామః

"ఆత్మధ్యానము చేయు మహాత్ములు హృదయగుహ యందలి పరమ పురుషుడైన పరమాత్మను ధ్యానించెదరుగాక! మేము మాత్రము యశోదా తనయుడైన బాలకృష్ణుని బాల్యక్రీడలనెడి కథామృతమునే పానము చేయుదుము" అని శ్రీకృష్ణ కర్ణామృతమునందు లీలాశుకులవారు తెలిపియున్నారు.

గోపభామలు కడవలతో నీళ్ళుతీసుకొని వెడుతున్నారు. దూరంనుండి శ్రీకృష్ణుడు చూసినాడు. ఒక చెట్టువెనుక దాగాడు. గోపెమ్మలు దగ్గరికి రాగానే వారి నీళ్ళకడవలపై రాళ్ళువిసిరాడు. కుండలోని నీరు కారిపోసాగింది. వారు వెనుదిరిగి చూసారు. కన్నయ్య పొంచి చూస్తున్నాడు. "కృష్ణా! ఏమిటిది?" అన్నారు....."ఏమో నాకేం తెలుసు?" అంటూ పరుగులిడినాడు.

కుండలలో నీరు నిండియున్నట్లు, మానవుని అంతఃకరణలో అహంకారము నిండియున్నది. అహంకారము కారిపోనిదే జీవికి ముక్తిలేదు అని కుండకు చిల్లివేయుట యనెడి లీలద్వారా తెలుపుతాడు.

వెన్న నపహరించుటకు తన బృందముతో కలిసి కన్నయ్య ఒక ఇంటిలో ప్రవేశించాడు. కన్నయ్య ఆ ఇంటిని పరిశీలించి చూశాడు. చక్కగా యిల్లు అలికి ముగ్గులు పెట్టియున్నారు. కన్నయ్య ఆనందముతో లోనికెళ్ళగానే ఇంటియజమాని "ఎందుకొచ్చావు మా ఇంటికి? నీవు దొంగవు" అన్నాడు.

కన్నయ్య కోపమును అభినయిస్తూ "నీవే దొంగవు. నేనే ఈ యింటి యజమానిని" అన్నాడు.

ఏవం దార్త్యాన్యుశతి కురుతే మేహనాదీని వాస్తే
స్తేయోపాయై ర్విరచిత కృతిః సుప్రతీకో యథాస్తే

"నీవు దొంగవు" అనిన యజమానితో నీవే దొంగవు. నేనే ఈ యింటి యజమానిని" అనెను. యజమాని తనను దొంగ అనినాడని కోపించిన కన్నయ్య చక్కగా అలంకరించుకొనిన ఆ ఇంటిలో మూత్రవిసర్జన గావించి వెళ్ళెను.

పండుగనాడు, శుభదినములందును ఇండ్లను అలుకుదురు. ఇండ్లు అలుకుట శుభసూచకము. పండుగ సూచితము. పండుగ లాచరించుట పరమాత్మ కొరకు. పండుగలు చేసుకుంటాము. కానీ ఆ లోఅంతయు పరమాత్మను పట్టించుకోము. విషయవాసనలతో రమించుచుందుము. పిలువగానే పరమాత్మ అరుదెంచును. విస్మరించినచో ఆ యింటిలో మూత్రమును విసర్జించును. భగవానుని విస్మరించిన వారి

బ్రతుకు మురికిగాక మరేమౌతుంది? కావలసింది బాహ్య అలంకరణలు కాదు, ఆంతరంగిక ఆర్తి. భగవంతుడు ఆర్తిని జూచునేగాని ఆస్తిని చూడడు.

పండుగలు చేసుకుంటూ పరమాత్మను మరచిపోయే వారి బ్రతుకులు మలిన పడిపోతాయి. గృహస్థు లెప్పుడుకూడా కర్తృత్వభావము కలిగియుండరాదు. తాను యజమానిననే అహంభావము ఎన్నడూ లోనికి రానివ్వకూడదు. పరమాత్మ అనుగ్రహముతో మనమంతా జీవిస్తున్నాము. ఆయన కృపయే మన బ్రతుకులను నడిపించుచున్నది. నీ గృహానికేకాదు, నీ దేహానికి కూడా యజమాని భగవానుడే. నీ స్వామి అతడే. అతడు తప్పుకొనినచో మరునాడే దేహము శవరూపమును పొందును. సర్వము భగవానుని దయతో నడుపబడుచుండ తాను యజమాని యని విఱ్ఱవీగువారు యథార్థానికి దొంగయే. అట్టివానిని భగవంతుడు వీక్షించడు. "నీవు దొంగవు. నీ ఇంటికేకాదు అన్ని క్షేత్రాలకు యజమానిని నేనే" అని హెచ్చరించును.

భగవానుని మరచినవారు, వారి గృహములను ఎంత చక్కగా అలంకరించుకొనినను అవి శవ సౌందర్యము లాంటివేనని తెలుపుటకు ఆ ఇండ్లలో మూత్ర విసర్జనము చేసి వెళ్ళును.

భగవానుడు ఇంటిలో మూత్ర విసర్జనము చేసి వెడలినాడని తెలిసి, ఆ గృహస్థుభార్య పరుగెత్తుకుంటూ వచ్చి యశోదమ్మకు చెప్పింది. మాయచేత కప్పబడిన యశోదమ్మకు కోపము తీవ్రతరమైంది. శ్రీకృష్ణుని దండించేందుకు బయలుదేరింది. ఇది గ్రహించిన కృష్ణయ్య పరుగెత్తసాగినాడు. యశోదమ్మ వెంట పరుగిడసాగింది. "కృష్ణా! ఆగు! ఆగు!" అంటూ యశోదమ్మ పరుగెత్తుచున్నది. శ్రీకృష్ణుడు ముందుకు నడుస్తూ "అమ్మా! కొట్టకే! నన్ను కొట్టకే"! అంటూ ముందుకు పరుగులిడుచున్నాడు.

అహా! పరమాశ్చర్యము! ముజ్జగములను తన కుక్షిలో నింపుకొనిన పరమాత్మను దండించేందుకు కఱ్ఱచేతపట్టుకొని మగువ తరుముచున్నది. తాను భక్తికి లొంగి పరుగులిడుచున్నాడు. అవును. భగవానుడు భక్తాధీనుడు. భక్తులకు తాను లొంగిపోవును. భక్తుల కొరకై గృహకృత్యముల నొనర్చును. భక్తులకొరకు దివ్యమెత్తును.

శ్రీకృష్ణుడు తన సుకుమారమైన హస్తములతో దోసలిపట్టి ఒక భక్తురాలి నుండి భిక్షమును అర్థిస్తున్న సన్నివేశమును గొప్ప వైష్ణవాచార్యులును, "కవి, తార్కిక సింహ" బిరుదాంకితులు నగు వేదాంత దేశికులవారు అత్యద్భుతంగా రచించారు.

ఒక బాలిక మహాభక్తురాలు. ఆ బాలిక జీవనోపాధికై పండ్లు అమ్మసాగినది. ఆ అమ్మాయివద్ద ఫలములను కొనేందుకు దోసిలిలో ధాన్యమును పట్టుకొని బాలకృష్ణుడు వచ్చుచున్నాడు.

మధ్యలో చేతిలోని ధాన్యము భూమిపై పడిపోయినది. ఇక చేయునదిలేక వట్టిచేతులతో ఆ బాలికను కృష్ణుడు సమీపించాడు.

ఆరణ్యకానాం ప్రభవః ఫలానామరణ్యజాతాని ఫలాన్య భీప్సన్
విస్త్రస ధాన్యాంజలినా కరేణ వ్యాధాత్మజం విశ్వపతిః నిషేవే

"తన హస్తములయందలి ధాన్యము కారిపోగా అరణ్యములలో నుండి కదలివచ్చిన ఉపనిషత్తులలో కీర్తించబడిన వైభవము గలవాడైన శ్రీకృష్ణపరమాత్మ ఆ పండ్లబాలికచెంత దోసిలొగ్గి పండ్లివ్వమని యాచించుచున్నాడు" అని వేదాంత దేశికులవారు యాదవాభ్యుదయము నందు తెలుపుతారు.

అహో! భక్తి ఎంత ఉత్తమమైనది? భగవంతుడు భక్తునిముందు బిచ్చగాడై నిలబడెనా? భగవానుడు భక్త సులభుడు గనుకనే యశోద కఱ్ఱచేతబట్టుకొని తరుముచున్నది.

కన్నబిడ్డ నలుగురిచేత చోరుడని పిలవబడడము యశోద భరించలేక పోయింది. తన బిడ్డను ఇతరులు అవహేళన చేయడము సహించలేకపోయింది. అనురాగము, వాత్సల్యము ఒకవైపు కదలుచున్నవి. ఆవేదన, అవమానము మరియొకవైపు క్రుంగదీయుచున్నవి. చెప్పి లాభముండదు. బుద్ధి చెప్పితీరవలసిందే. కఱ్ఱను చేతబట్టుకొన్నది. ముందు మాధవుడు - వెనుక కఱ్ఱ పట్టుకొని యశోద. పరుగుపై పరుగు - ఒకటే పరుగు. చెంగుచెంగున గంతులు - ఝంగు ఝంగున దుముకుళ్ళు. చిక్కినట్లే ఉంది; దొరికినట్లే ఉంది; అందినట్లే ఉంది. తీరాచూస్తే అల్లంతదూరాన అలసట తెలియని కొంటెచూపు.

"కృష్ణా! ఆగు! ఆగు!" అని యశోద. "అమ్మా! నన్ను కొట్టకే! నన్ను కొట్టకే" అని కన్నయ్య.

మధురలో.....

"నా బిడ్డను కొట్టకండి. నా చిన్నారి కిట్టయ్యను కొట్టకండి. నా బిడ్డ తప్పు చేసేవాడు కాదు. తప్పెరుగని నా బిడ్డపై అపవాదాలు వేయకండి" అన్యాయంగా కొట్టకండి" అని కొయ్యబొమ్మను ఒడిలో ఉంచుకొని కలవరిస్తున్నది దేవకీదేవి.

వసుదేవుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. కలవరిస్తున్న దేవకిని కదిపాడు. దేవకి కళ్ళుతెరిచింది. భర్త ప్రక్కన నిలబడి ఉన్నాడు. చేతిలో కొయ్యబొమ్మున్నది. దుఃఖాన్ని ఆపుకోలేక భోరున ఏడ్చింది.

"కన్నా! ఎక్కడున్నావు నాన్నా? నన్నెందుకిలా ఏడిపిస్తున్నావు? నా నొసటి వ్రాతను ఇంత క్రూరంగా ఎందుకు మార్చావు? అందరినీ ఆటలలో సంతసింప జేసే నీవు నన్ను ఎందుకు ఆటబొమ్మగా చేశావు? అందరితో ఆడుకుంటావే! నన్ను ఎందుకు ఆడిస్తున్నావు? ఇది నీకు పాడిగాదు తండ్రీ! దిక్కులు తెలియకుండా చేశావు. దిక్కులేని దానిని చేశావు. చిక్కులలో పడదోశావు. నేను మ్రొక్కిన మ్రొక్కుకు ఫలితం ఇదియేనా? గ్రుక్క ఆగకుండా రోదిస్తున్నాను. నా ప్రక్కన చేరాలని నీ కనిపించలేదా?

"వెన్నతినే నీవు బండగా ఎలా మారావు? అందరికీ వెన్న పంచి పెట్టే నీవు నా బ్రతుకుకు మన్ను రాస్తావా? నా జీవితాన్ని మన్ను చుట్టుతావా? కని పారేశానని భావిస్తున్నావా? నిన్ను పెంచకుండా పరుల పంచన ఉంచానని మనస్సులో కలత పడుతున్నావా? కన్నయ్యా! నేను పాపిష్ఠిదానను కాను. నిన్ను దూరం చేసుకొనేటంతటి

దుష్టురాలిని కాను. నీ తల్లి దురదృష్టవంతురాలు. బిడ్డను పెంచే అదృష్టానికి నోచుకోని అభాగ్యురాలు.

"కన్నా! ఈ దీనురాలిపై కోపగించుకోకు. ఏనాడు ఏ పాపం చేశానో! కళ్ళు వరదలై నిలిచి యున్నాయి. చావుకు కూడా నేనంటే అసహ్యం వేసింది. మృత్యువు కూడా నన్ను పరీక్షిస్తూ ఉంది. పరిహసిస్తూ ఉంది. నాలాంటి పాపికి నిష్కృతి ఉండబోదు.

"నాన్నా! కృష్ణయ్యా! ఏవీ నీ మయూరపు టడుగులు? ఏదీ నీ దివ్య ముఖారవిందము? తండ్రీ! తేనెలొలుకు నీ తియ్యటి పలుకులు ఎలా ఉంటాయి? నల్లని నాయనా! చల్లని నా తండ్రీ! అందరి హృదయాలలో ఆనంద దీపాలు వెలిగిస్తున్నావట కదా! నన్నొక్క దానినేనా చీకటిలో బంధించావు!

"కన్నయ్యా! నిన్ను పెంచే యశోదకు నా శతకోటి వందనాలు! నిన్ను నడిపించే నందయ్యకు అనంతకోటి ప్రణామములు! గోకుల రజమునైనా ఎంత బాగుండును? కృష్ణయ్యా! నిన్ను చూసి పొంగే యమునకు జన్మ జన్మలకు నేను ఊడిగం చేస్తాను. నిన్ను దర్శించి నూతన పల్లవములను పరవశించి అలంకరించుకొనే వృక్షజాలము యొక్క పుణ్యమేమి?

"తండ్రీ! కృష్ణా! కన్నా! విషమిచ్చిన పూతన యొక్క చనుబాలు త్రాగావటవే! తండ్రీ! రాక్షసులకన్నా నేను హీనమా? అవును. నేను పరమ రాక్షసిని. ఘాతకిని. మరి చూస్తావెందుకని? పూతనను సంహరించినట్లే నన్నూ సంహరించు. ఒక్కసారి పాలుత్రాగి, శాశ్వతంగా నన్ను కూల్చివేయి" అంటూ బిగ్గరగా రోదించి దేవకి పడిపోయింది.... ...."దేవకీ దేవకీ" అంటూ ముఖముపై నీళ్ళుచల్లుతున్నాడు వసుదేవుడు.

గోకులంలో.....

ఎలాగైనా నవనీతచోరుని పట్టుకోవాలనే ప్రయత్నములో యశోద పరుగిడుచున్నది. అతడు పట్టుబడటము లేదు. ఏమి చేయాలి? ఎలా? వెంబడించి పరుగిడుటయే. ఆనంద స్వరూపమైన అచ్యుతుని వెంటాడి పట్టగలరా? ప్రయత్నము ఫలించలేదు. యశోద నీరసపడి పోయింది. పరుగిడుటకు శక్తిలేదు. కఱ్ఱకూడా బరువైంది. కఱ్ఱను విడిచేసింది. అంతే. కఱ్ఱను వదలగానే కుఱ్ఱవాడు వెనుదిరిగాడు. ఎన్నంటి పరుగిడినా లభ్యంకాని వాసుదేవుడు కఱ్ఱను పారవేయగానే వెనుదిరిగివచ్చాడు. అహంకారమను కఱ్ఱను పట్టుకొని నంతవరకు అచ్యుతుడు అందడు. అహంకారమును వదలగానే తనకు తానుగా దగ్గరవుతాడు.

కఱ్ఱను యశోద వదలింది. కన్నయ్యను పట్టుకొన్నది. త్రాడు తెమ్మంటుంది. బంధములను తొలగించు బృందావన కిశోరుని త్రాడుతో బంధించాలని యత్నిస్తుంది. తెచ్చిన త్రాడు సరిపడలేదు. మరికొంచెము.... ఇంక కొంచెము.... త్రాడు పెరిగింది. ఏమి

లాభము? వ్యక్తిని ఇముడ్చుకోలేకపోయింది. ఎంతచుట్టిన రెండు అంగుళములకు త్రాడు చాలకనేయున్నది.

తదపి ద్వ్యంగుళం న్యూనం యద్యదా దత్త బంధనమ్

ఎంత త్రాడు తెచ్చినను అది రెండు అంగుళములు తక్కువ కాజొచ్చెను.

యశోదతో పాటు గోపభామలందరు విస్మయమొంది నిలబడిరి. గుమిగూడిన వారిపై నందకిశోరుడు చిరునవ్వును చిందిస్తూ "నన్ను బంధించుటకు రెండు అంగుళముల త్రాడు అడ్డునిలచియున్నది. అహంకార మమకారాదులే ఆ రెండు అంగుళములు" అని తెలియజేసెను.

ఇంతలో యశోదమ్మను మాయ ఆవరించింది. గోపభామల మాటలను విని కృష్ణుని మందలించసాగింది. "కృష్ణా! వీరి ఇండ్లయందు వెన్న వెందుకు దొంగిలించావు?"

కృష్ణ:- అమ్మా! వీరంతా నన్ను గురించి నీకు దురభిప్రాయము కలిగించడానికి ప్రయత్నిస్తున్నారు. నేను అలాంటి వేమీ ఎఱుగను.

గోపిక:- లేదు. నీవు దొంగిలించడము చూసినవారే చెప్పారు.

కృష్ణ:- ఏమో! నేను చూడలేదు.

యశోద:- కృష్ణా! నీవు దొంగవని తేలిపోయింది. నేను వారిని చూడలేదంటున్నావు. అంటే వాళ్ళను చూడకుండా దొంగిలించావనే కదా?

కృష్ణ:- అయ్యో! అయ్యో! ఏమిటమ్మా నీవంటున్నది? నేను బాలుడను. అంత పరిజ్ఞానములో నేను పలుకలేదు. వాళ్ళే దొంగిలించి తింటారు. నేను చూసినట్లయితే పట్టుకొని ఉండే వాడిని అనే భావంతో నేనన్నాను.

యశోద:- అలాగా! అయితే, ఓ సత్యవంతుడా! నీవు బాలుడవు కదా! వెన్న దొంగిలించు చోరులను ఎలా పట్టి అప్పగించగలవు?

కృష్ణ:- అదేమిటమ్మా! నేను యశోదమ్మ కుమారుణ్ణి. ఆగిపోండి అనగానే భయపడి ఆగిపోతారుగా.

అందరూ ఫక్కున నవ్వారు. యశోదమ్మ హృదయం ద్రవించింది. యశోద కృష్ణయ్యను ఎత్తుకొని ముద్దాడ సాగింది. కన్నయ్య గోపికల వైపు తిరిగి, చిరునవ్వును చిందిస్తూ, కొంటెచూపులు విసిరాడు. నన్ను పట్టుకోగలరా? పట్టించగలరా? అనెడి భావన అతని చూపులలో కదలుచున్నది. నిజమే! అచ్యుతుని ఎవరు పట్టగలరు? ఎలా పట్టగలరు? భక్తియే భగవానుని బంధించుటకు చక్కని ఉపాయము.

చిక్కడు వ్రతముల క్రతువుల జిక్కడు మరి దానశౌచ శీల తపములం
జిక్కడు యుక్తిని, భక్తిని జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ

అని పోతనామాత్యుడు రచించాడు.

ఒకనాడు యశోదాదేవి పెరుగు చిలుకుతున్నది. బాలకృష్ణుడు అరుదెంచాడు. ఆకలిగొన్న వానివలె విలపించసాగాడు.

"కృష్ణా! ఎందుకు ఏడుస్తున్నావు? ఇదిగో త్రాగుతావా గుమ్మపాలు!" అన్నది యశోద.

"నాకు గుమ్మపాలకన్నా అమ్మపాలే బాగుంటాయి" అన్నాడు కొంటె కృష్ణయ్య.

యశోద పెరుగుకుండను వదలి కన్నయ్య వద్దకు వచ్చి కూర్చున్నది. అంతే, అమాంతంగా ఆమె ఒడిలో కురికి నవ్వుతూ పవళించాడు. యశోద అమితానంద భరితురాలైనది.

సంసారమనెడి పెరుగుకుండను ముందెట్టుకొని పెరుగు యనెడి విషయ వాసనలను చిలుకుతుంటే వారిని ఉద్ధరించేవాడు శ్రీకృష్ణుడు. తనకొరకు యశోద పెరుగు కుండను వదలి వచ్చినట్లు సంసారాలను ఎవరైతే త్యాగ మొనర్చుదురో అట్టి వారిపై అనుగ్రహమనే మందహాసమును చిందించి, ఒక్కసారి వారి హృదిలో పవళించును.

కన్నయ్యను చూసి పరవశిస్తున్న దృష్టి పొయ్యిమీద పొంగుతున్న పాల మీదికి మరలింది. అంతే, శ్రీకృష్ణుని క్రింద ఉంచి ఆమె పరిగెత్తుకుంటూ వెళ్ళింది. పాలు పొంగి పొయ్యిలో పడ్డాయి. పాలు దించి పెడుతున్నది యశోదామాత.

పాలు పొంగి పొయ్యిలో పడిన ఈ సన్నివేశముపై హృదయమున ధ్యానించిన మహాభక్తులకు అనిర్వచనీయమైన అనుభూతులు కలిగాయి.

తల్లి ఒడిలో కూర్చొని స్తన్యపానము చేయుచున్న బాలకృష్ణుడు యశోదను పరీక్షించదలచి అగ్నిని ప్రేరేపించినట్లు మహాత్ములు అభిప్రాయపడినారు. తన తల్లికి శ్రేయము ప్రియమై యున్నదా? లేక ప్రియము శ్రేయమై యున్నదా? అని భావించి పరీక్షించదలచెను.

శ్రీకృష్ణుడు యశోద ఒడిలో కూర్చొని పాలు త్రాగుచుండెను. యశోదాదేవి చెంత స్తన్యపానము చేయు బాలకృష్ణుడు తనను పానము చేయుడని క్షీరము భావించెను. కృష్ణునికి ఉపకరించని జన్మము వ్యర్థమని భావించి, క్షీరము అగ్నిలో దూకినది. భగవంతునిలో ఉండవలెనని ఆశించెడి అంతఃకరణయే పవిత్రమైనది.

"కృష్ణా! నీ కొరకు నేను ఇక్కడ ఉన్నాను. అగ్ని తాపమును కూడా భరించుచున్నాను. నీవు యశోదాదేవి ఒడిలో కూర్చొని స్తన్యపానము చేయుచున్నావు. నన్ను కూడా స్వీకరింపుము" అని పాలు పొంగినవి. ఇదీ చక్కని భావనయే.

నవనీతచోరుడు యశోదాదేవి ఒడిలో దివ్యతేజముతో వెలుగు చుండెను. ఆ దివ్యాత్ముని క్షీరము దర్శించెను. అయినను తనకు అగ్ని తాపము తప్పలేదు. "శ్రీకృష్ణుని దర్శించిన తరువాత కూడా నాకు అగ్ని బాధ తప్పలేదు. ఎంతటి ఘోరమైన ప్రారబ్ధము ననుభవించు చుంటినోగదా? అట్టి నేను మరణించుటయే మేలు" అని భావించి, పాలు అగ్నిలో దూకుచున్నవి. ఇది మరియొక భావన.

పొంగేపాలను రక్షించుకొనే టందుకై తల్లి తనను వదలి వెళ్ళినది. తనకన్నా పాలమీదనే తల్లికి మనసు మళ్ళియున్నదని భావించాడు. అంతే, ఒక రాయిని తీసికొని ఉట్టిపైనున్న వెన్నకడవపై విసిరాడు. వెన్నంతా క్రిందపడసాగింది. యశోద పరుగెత్తుకుంటూ వచ్చి "ఎవరు ఈ పనిచేసినది?" అని అన్నది. కన్నయ్య పకపక నవ్వుతూ, యశోదపై ప్రేమవీక్షణాన్ని సారించి పరుగెత్తి పారిపోయాడు. యశోదకు క్షీరముపై మమకారం పెరిగింది. క్షీరసాగరశయనుని వదిలింది. పరమాత్మను వదలి ప్రపంచాన్ని పట్టుకొనేవారికి మిగిలేది చింతయేననియు, తద్వారా మనస్సు మలిన పడుతుందనియు, వెన్నకడవను పగులగొట్టి తెలుపుతాడు. మమకార రహితులమై, మాధవ ప్రియులమై ముక్తి సామ్రాజ్యమును చేజిక్కించుకొనెదము గాక!

స్తన్యపానము అనెడి ఈ లీల సామాన్యమైనది కాదు అని శ్రీధర వ్యాఖ్యానము నందున్నది. భాగవత వ్యాఖ్యాన కర్తలలో శ్రీధరస్వామి అగ్రగణ్యులు. స్తన్యపానముచేయు సందర్భమునందు యశోదాకృష్ణుల సమాగమమే జీవబ్రహ్మైక్యము అని అభిప్రాయపడెను. శ్రీకృష్ణుని ఒడిలో కూర్చొబెట్టుకొని యశోద సమస్తమును మర్చిపోయెను. ఇదియే జీవబ్రహ్మైక్యస్థితి అని శ్రీధరస్వామి అభిప్రాయపడినాడు.

నదిలో ఈదడమంటే శ్రీకృష్ణునికి ఎంతో ఇష్టము. అత్యద్భుతంగా ఈదేవాడు. నదిలో తాను ఈదుతూ గోపబాలుర వైపు చూసి నవ్వేవాడు. తాను నదిలో ఎంత గొప్పగా ఈదుతున్నాడో అలాగే జీవన నదీప్రవాహములో, అగాధమైన సంసారలోతు లున్నప్పటికీ సుఖదుఃఖ తరంగాలు పైకివచ్చి పడుచుండినను, జ్ఞానాభ్యాసమనే ఈతతో కడతేరవలయు నని తెలియజేసేవాడు.

ఒక్కొక్కసారి గోపబాలురతో పందెము వేసుకొని ఆవలిగట్టుకు ఈదేవాడు. అందరికన్నా తానే ముందుగా చేరేవాడు. నదీప్రవాహములో ఈదడమేకాదు గమ్యాన్ని చేరడము ముఖ్యమని చాటేవాడు. సాంసారిక జీవన ప్రవాహంలో ఈదడమేగాక ఈ జీవన నదిని దాటి, మోక్షతీరాన్నిచేర్చేవాడు కృష్ణుడే కాగలడని ప్రబోధించేవాడు.

తన బాల్యక్రీడల ద్వారా అద్భుతమైన ఆధ్యాత్మిక సత్యములను తెలిపేవాడు. గోపబాలురను గుఱ్ఱములుగా కూర్చుండమని చెప్పి, తాను వారి వీపుపై రౌతులా ఎక్కి నడిపించేవాడు. నీవు మోయవలసింది వ్యర్థమైన సంసారాన్ని కాదు. అనంత స్వరూపుడైన భగవానుని రూపమునే ధరించి జీవించమని ప్రదర్శిస్తూ, ప్రబోధించేవాడు.

సంసారే కిం సారం కంసారే శ్చరణ కమల పరిభజనమ్
జ్యోతిః కిమన్ధకారే యుదన్ధకారే రనుస్మరణమ్

సంసారమున మేలైనది ఏది? కంసారియొక్క చరణకమలములను భజించుటయే. సంసారమనెడి చీకటిలో పరిభ్రమించు వారికి జ్యోతి ఏది? నీలమేఘశ్యాముడైన శ్రీకృష్ణుడే జ్యోతియని శ్రీకృష్ణ కర్ణామృతమునందు తెలుపబడి యున్నది.

మృద్భక్షణము - విశ్వరూప సందర్శనము

"అమ్మా! అమ్మా! మన కృష్ణయ్య మన్ను తింటున్నాడు" అని బలరాముడు గోపబాలురతో కలిసివచ్చి యశోదామాతతో చెప్పాడు. యశోద పరుగు పరుగున వచ్చింది. కన్నయ్యను చూసింది.

యశోద శ్రీకృష్ణుని చేతులను పట్టుకున్నది. "కృష్ణా! నిజం చెప్పు. మన్ను తిన్నావా?" అని గద్దించింది. శ్రీకృష్ణుడు భయము నభినయించుచున్నాడు.

యశోదా భయ సంభ్రాన్త ప్రేక్షణాక్షమభాషత

"భయముతో కదలిపోవుచున్న బాలకృష్ణునితో యశోద ముచ్చటించుచున్నది."

క॥ మన్నేటికి భక్షించెదు? మన్నియమములేల నీవు మన్నింపవు? నీ
యన్నయు సఖులును చెప్పెద, రన్నా మన్నేలమటి పదార్థములేదే?

అని యశోద ప్రశ్నించెను.

"అమ్మా! నీ కడుపున పుట్టిన నా నుండి అసత్యవాక్కులు కదలునా? నేను నిజమే చెబుతాను. వెన్న పెట్టే తల్లివి నీవుండ మన్ను తినే ఖర్మ నాకేం? నేను మన్ను తినలేదు."

"అయితే వీరంతా నీమీద ఎందుకు ఫిర్యాదు చేయుచున్నారు?" అన్నది యశోదమ్మ.

"అమ్మా! వాళ్ళంతా అబద్ధాలు చెబుతారే! అవన్నీ నీవు నమ్మకు. వారికి నేనంటే గిట్టదు. నా మీద అన్యాయంగా వారు చాడీలు చెప్పుచున్నారు."

నాహం భక్షితవా నమ్మ సర్వే మిథ్యాభిశంసినః
యది సత్య గిరస్తర్హి సమక్షం పశ్యమే ముఖమ్....

"అమ్మా! నేను మన్ను తినలేదు. వీరంతా అబద్ధమునే చెప్పుచున్నారు. వీరు చెప్పినది నిజమని నీవు నమ్మినచో ఒక్కసారి నా నోటిని పరీక్షించి చూడుము" అనెను. ఈ విషయమును పోతన మహాకవి తన సహజ పాండిత్యముతో అద్భుతముగా రచించెను.

శా॥ అమ్మా! మన్నుదినంగ నే శిశువునో యాకొంటినో వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరి మాటలు మదిన్ న న్నీవు గొట్టంగ దా
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీయాస్య గం
ధ మ్మాఘ్రాణము చేసి నా వచనముల్ దప్పైన దండింపవే!

అని కన్నయ్య పలికెను. తల్లిని చూడమని నోరు తెరిచెను.

క॥ ఆ లలితాంగి గనుంగొనె బాలుని ముఖమందు జలధి, పర్వత, వన, భూ
గోళ, శిఖి, తరణి, శశి, దిక్పాలాది కరండమైన బ్రహ్మాండంబున్.

కన్నయ్య నోరు తెరిచాడు. యశోద దిగ్భ్రాంతి చెందింది. ఆకాశము, భూమి, అంతరిక్షము, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, గాలి, సాగరములు, పర్వతములు, నదులు, సమస్త విశ్వము గోచరించింది.

గోచరించు ఈ విశ్వమంతయు తనలోనే ఉన్నదనియు, ఉపాదాన కారణమైన తననుండి ఈ విశ్వములో ఏ వస్తువూ దూరముగా వెళ్ళలేదనియు తెలుపుతాడు.

యశోదకు అంతా అనూహ్యంగా ఉంది. కళ్ళతో చూసిన సత్యాన్ని అవగతం చేసుకోలేక తికమక పడుతున్నది.

మ॥ కలయో వైష్ణవమాయయో యితరసంకల్పార్థమో సత్యమో
తలఁపన్ నేరక యున్నదాననొ యశోదాదేవిఁ గానో పర
స్థలమో బాలకుఁ డెంత యీతనిముఖస్థంబై యజాండంబు ప్ర
జ్వలమైయుండుట కేమిహేతువో మహాశ్చర్యంబు చింతింపఁగన్.

"ఇది స్వప్నమా? లేక వైష్ణవ మాయయా? లేక నా బుద్ధి చపలత్వమా? లేక వాస్తవమా? గ్రహించలేక పోతున్నానా? యశోదాదేవిని గానా? బాలుడైన నాబిడ్డదెక్కడ? మహాద్భుతంబైన ఈ విశ్వమేమిటి?" అని ఆలోచించి చివరగా యశోద ఒక నిర్ణయానికి వచ్చెను. శ్రీకృష్ణుడు భగవానుడే యని నిశ్చయించుకొనెను.

ఆ॥ బాలమాత్రుఁడైన బాలుని ముఖమందు విశ్వమెల్ల నెట్లు వెలసియుండు?
బాలుభంగి నితఁడు భాసిల్లుఁ గాని ర్వాత్ముఁ డాది విష్ణుఁ డగుట నిజము.

ఈ నిర్ణయము ఆమెలో భక్తిని నింపెను. ఆమె హృదయములో కృష్ణుని నింపెను. అప్రయత్నముగా చేతులుజోడించింది. నమస్కరించింది. సంపూర్ణ శరణాగతురాలైనది.

ఆ॥ ఏ మహాత్మువలన నీ విశ్వమంతయుఁ గానఁబడిన బుద్ధి కంప మయ్యె
నా మహాత్ము విష్ణు నఖిలలోకాధారు నార్తులెల్లఁ బాయ నాశ్రయింతు.

నని శిరమొగ్గి నమస్కరించింది. "నేను, నా భర్త, గోవులు, గోపజనులు ఈ బాలుని నోటిలో నున్నాము. ఇతడు భగవానుడేగాని మరొకడు కాడు" అని పలికెను.

శ్రీకృష్ణభగవానుడు ఆలోచించెను. ఆయన ప్రేమమూర్తి. ఇక తన తల్లి తనను పుత్రవాత్సల్యంతో చూడక, భక్తితో ఆరాధించునని గ్రహించాడు. వెంటనే ఆమెను మాయ ఆవరించునట్లు చేసినాడు. ఇంతవరకు తాను వీక్షించిన విషయమును యశోద మరచింది.

సద్యో నష్ట స్మృతిర్గోపీ సారోప్యారోహమాత్మజమ్
ప్రవృద్ధ స్నేహకలిల హృదయాసీ ద్యథాపురా ॥

భగవానుడు మాయను కలుగ జేయగనే యశోద విశ్వరూప దర్శన స్మృతిని కోల్పోయినదియై పూర్వమువలె శ్రీకృష్ణుని తన బిడ్డవలె వీక్షించసాగెను.

శ్రీకృష్ణుడు మన్నుదినుట యనెడి ఈ మృద్భక్షణ లీలను గురించి మహా భక్తులైనవారు అనేక విధములైన అనుభూతులను పొందియున్నారు.

సాధారణముగా పసిపిల్లలు మన్ను తినుచుందురు. తాను కూడా మట్టిని తినుటవలన శ్రీకృష్ణుడు కూడా సామాన్యబాలుడే ననియు, భగవంతుడు కాడనియు ప్రజలు గ్రహింతురు. తాను భగవంతుడని ఇతరులకు తెలియకుండా ఉండుటకుగాను శ్రీకృష్ణుడు మృద్భక్షణలీలను ప్రదర్శించెనని ఒక మహాత్ముని అభిప్రాయము.

ఈ భూప్రపంచమునకు మేలుచేయవలెననియు, ఈ భూమిపై ధర్మమును స్థిరీకరింపజేయవలె నని శ్రీకృష్ణుడు ఆవిర్భవించెను. భూప్రపంచానికి మేలు చేయుటకై భూమియొక్క అంశమైన మట్టిని కొంత తాను తినెను అని ఇంకొక మహాత్ముని అభిప్రాయము.

శ్రీకృష్ణుడు పూతనను వధించు సమయాన విషమును పానము చేసెను. దానికి విరుగుడుగా మన్ను తినినాడని మరియొక మహాత్ముని అభిప్రాయము.

పరబ్రహ్మ స్వరూపమైన శ్రీకృష్ణుని విషమేమి చేయుగలదు? కనుక అది సరియైన భావన కాదని మరియొక మహాత్ముడు అభిప్రాయపడి, ఆయన తన అభిప్రాయమును ఈ విధముగా తెలిపెను.

బృందావన ధూళి పవిత్రమైనది. గోపికల పాదతాకిడిచే పవిత్రమైన బృందావన రజస్సు శిరోధార్యమై యున్నది. అట్టి పావన రజస్సును చతుర్దశ భువనములకు అందించవలె నని శ్రీకృష్ణుడు అభిప్రాయపడెను. చతుర్దశ భువనములు తన కుక్షియందే యున్నందున తాను ఒక్కడు ఆ రజస్సును మ్రింగినచో యావత్ప్రపంచమునకు అందించబడునని భావించి, మన్ను తినె నని మరియొక మహాత్ముని అభిప్రాయమై యున్నది.

తనను తల్లి విశ్వాత్మగా గుర్తించి భక్తితో కదలిపోవుచున్నదని గ్రహించిన శ్రీకృష్ణపరమాత్మ, ఆమెకు వెనుకటివలె పుత్రమోహమును కలుగజేసెను. శ్రీకృష్ణుడు తన పుత్రుడే యనెడి భావన కలుగగానే ఆమె, తాను చూసిన విశ్వరూప దృశ్యమును మరోవిధముగా భావించసాగెను.

శ్రీకృష్ణుని నోటియందు గోచరించిన కైలాస పర్వతము శ్రీకృష్ణుడు తినిన వెన్న ముద్దలని భావించెను. స్వామి నోటిలో గోచరించిన భూమి కన్నయ్య తినిన మన్ను యని తలచెను. పాల సముద్రమును జూచి అదంతయూ గోపభామల ఇండ్లలో కృష్ణయ్య అపహరించి, త్రాగిన పాలని భావించెను.

మాత్రాఽ జీర్ణధియా దృఢం చకితయా నష్టాఽస్మి దృష్టఃకయా
ధూధూ వత్స! జీవ జీవ చిరమిత్యక్తోఽవతాన్నోహరిః

ఈ విధముగా యశోదామాత భయపడినదయ్యెను. ఈ దృశ్యమును మరెవ్వరైన చూచియుండినచో కృష్ణయ్యకు దిష్టితగులునని భావించెను. అజీర్ణము చేయునని తలపోసెను.

ధూ ధూ, చిరంజీవ, చిరంజీవ

అని రక్ష పెట్టెను.

కార్పరికం పయః పిబ హరే వర్ధిష్యతే శిఖా

"కృష్ణా! గిన్నెలోని ఈ వేడిపాలను త్రాగుము. పాలు ఎక్కువ త్రాగినచో నీ జుట్టు ఎక్కువగా పెరుగును" అని యశోద చెప్పెను.

ఇత్థం బాలతయా ప్రతారణ పరాః శ్రుత్వా యశోదాగిరః
పాయాన్న స్వశిఖాం స్పృశన్ ప్రముదితః క్షీరేఽర్ధపీతే హరిః

తనను మాయ చేయుటకై తల్లి అలా పలుకుచున్నదని గ్రహించిన కృష్ణయ్య పాలగిన్నెను చేతపట్టుకొని పాలు కొద్దిగా త్రాగి, జుట్టును తడువు కొనుచు "అమ్మా! నా జుట్టు పెరిగినదా?" అని అడిగెను. ఇట్టి బాలలీలలను ప్రదర్శించిన గోపాలుడు మనలను సదా రక్షించుగాక!

పూర్వ పుణ్య విశేషము

బాలకృష్ణుని యొక్క దివ్యలీలలను గాంచి సంతసించే భాగ్యము నందయశోదారులకే కలిగినది. దేవకీవసుదేవులు శ్రీకృష్ణునికి జన్మ నొసంగినను ఆ మహానుభావుని దివ్యలీలలను గాంచి తరించే భాగ్యానికి నోచుకోలేకపోయినారు. మహాయోగులకు, దేవాదులకుకూడా లభ్యముగాని ఈ మహద్భాగ్యము నందయశోదాదులకు లభ్యమైనది. ఇట్టి భాగ్యమును పొందుటకు వారు ఎట్టిపుణ్యమును చేసికొనినారో చెప్పుమని పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రుని అడుగగా, శుకయోగీంద్రుడు నందయశోదల పూర్వజన్మ వృత్తాంతమును తెలుపుచున్నాడు.

అష్టవసువులలో ద్రోణుడు అతి ముఖ్యుడు. అతని భార్యపేరు 'ధర'. సృష్టి కర్తయగు బ్రహ్మదేవుడు వారిపై గోరక్షణ కార్యభారము నుంచెను. వారిని మానవ లోకమున పుట్టుమని ఆదేశించెను. బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము వారిరువురును మానవలోకమున జన్మించుటకు నిర్ణయించుకొని, బ్రహ్మదేవునికి నమస్కరించుచు ఒక కోరికను కోరిరి.

జాతయోర్నౌ మహాదేవే భువి విశ్వేశ్వరే హరే
భక్తిః స్యాత్పరమా లోకే య యాంజో దుర్గతిం తరేత్

"బ్రహ్మదేవా! మేము మానవలోకమున జన్మించునపుడు మాకు విశ్వేశ్వరుడగు శ్రీహరియందు ఉత్తమమైన భక్తి కలుగునట్లు దీవించుము. భక్తివలన జీవుడు మానవలోకములోని శోకములనుండి విడివడునుగదా!" అనిరి.

ధరాద్రోణులు పుణ్యాత్ములు. అందుచేతనే ఇంతటి చక్కని అభీష్టమును బ్రహ్మదేవుని ముందుంచిరి. ముందుచూపులో చరించువారు ధన్యజీవులు. వారెప్పుడూ ఇక్కట్లను అధిగమించే యుందురు. జన్మను అడుగెంచే ముందు ద్రోణదంపతులు శ్రేయోమార్గమును ఎన్నుకొనిరి. జన్మమృత్యువులు విచిత్రమైనవి. జన్మలోని గతులు ఎవరికీ అర్థంగావు. కర్మ సంచిత మున్నంతవరకూ జన్మ తప్పదు. జన్మలో వాంఛించదగినది

భగవద్భక్తి ఒక్కటియే. భక్తియే మనిషిని ఉద్ధరించును. ఉత్తీర్ణుని గావించును. భూలోకమున ప్రవేశించబోయేముందు భక్తి కావలెనని ధరాద్రోణులు అభిలషించిరి.

నిత్యమూ మనము నిద్రించుచుందుము. మృత్యువు మాత్రము ఏమున్నది? అదొక దీర్ఘనిద్రయే కదా! బాగా ఆలోచించి చూచినచో ప్రతి నిద్ర ఒక మరణమే, ప్రతి మెలుకువ జన్మమే. జన్మకొచ్చే సందర్భమున ధరాద్రోణులు భక్తిని వాంఛించారు. అలాగే ప్రతిరోజు నిద్ర లేవగానే భక్తిని ఇవ్వమని భగవానుని ప్రార్థించాలి. ఆ రోజంతా మన మనస్సు భగవంతునియందే లగ్నమై ఉండవలెనని భగవానుని ప్రార్థించాలి. భక్తం కార్యంలను భగవానుడు ఈడేర్చును. ఉత్తమభక్తి ఉత్తమగతిని అందించును.

బ్రహ్మదేవుడు ఆశీర్వదించాడు. ధరాద్రోణులే గోకులమున యశోదానందులై జన్మించారు. వారి అభీష్టము మేరకు నవనీత చోరుడైన నారాయణుడు బిడ్డగా లభించాడు. బ్రహ్మదేవుని ఆశీర్వాదమును ఫలింపచేయుటకై శ్రీకృష్ణుడే అనేక బాలలీలలను గావించుచు నంద యశోదలను వంతోష పెట్టుచుండెను.

శమ్భో స్వాగతమాస్యతా మితఇతో వామేన పద్మాసన
క్రౌఞ్చారే కుశలం సుఖం సురపతే విత్తేశ నో దృశ్యసే
ఇత్థం స్వప్న గతస్య కైటభజిత శ్రుత్వా యశోదాగిరః
కింకిం బాలక జల్పసీతి రచితం ధూధూకృతం పాతుః

"హే! శంభో! ప్రయాణము సుఖముగా జరిగినదా? హే పద్మాసనమ్మదా! బ్రహ్మా! ఎడమనైపున కూర్చొనుము. షణ్ముఖా! క్షేమమేనా? ఇంద్రుడా! ఎలావున్నావు? కుబేరా! ఎక్కడ? ఇటీవల కనిపించుటయే లేదు" అని నిద్రలో కృష్ణయ్య కలవరించుచుండగా యశోదాదేవి పరుగెత్తుకొనివచ్చి "నాయనా! కృష్ణా! ఏమిటి కలవరించుచున్నావు" అని అడిగి దిష్టి తీసెను.

బ్రహ్మ, ఇంద్ర, మహేశ్వరాదులను పిలిచి కృష్ణుడు మాట్లాడుచున్నాడనియు, ఇది ఏదియో భూతచేష్టయని పిచ్చిదైన యశోదమ్మ భావించెను. దేవతలను ఏకవచనముతో తనబిడ్డడు సంబోధించుట అశుభసూచకమని యశోద భావించెను. తన బిడ్డడు సాక్షాత్తు నారాయణుడనియు, దేవతలకు దేవుడైనవా డనియు గ్రహించలేక, అతనికి దిష్టి తీయుచూ, "థూ థూ" అని రక్ష పట్టసాగెను.

ఇట్టి మధురమైన లీలలను ప్రదర్శించుచు, గోకులవాసియైన నటవరుడు నంద యశోదలకు ఆనందము నొసగూర్చుచుండెను.

ఉలూఖల బంధనము

యశోద తనకు పాలిచ్చుటమాని ఇంటిపనిలో నిమగ్నమై యుండుటచూచి శ్రీకృష్ణుడు ఒక రాయి తీసుకొని ఉట్టిమీదయున్న పెరుగు కడవను పగలగొట్టినాడు. శ్రీకృష్ణుని విస్మరించినవారి సంపదలన్నియు మట్టిపాలేయగునని తెలుపుతాడు.

యశోదాదేవి ఇంకా తనదగ్గరకు రాలేదు. శ్రీకృష్ణుడు ఉట్టిమీదయున్న వెన్నకుండను చూసినాడు. రోటిమీద ఎక్కి నిలుచుని వెన్న నవహరించాడు. తాను తింటున్నాడు. కోతులకు పెడుతున్నాడు.

యశోదవచ్చింది. చూసింది. చేతిలో కఱ్ఱను పట్టుకొన్నది. కృష్ణయ్యను అనుసరించింది. కృష్ణయ్య పరుగిడసాగినాడు. కృష్ణయ్య చేష్టలు ఆమెకు అనూహ్యంగా గోచరించసాగాయి. వ్యక్తి చిన్నవాడేగాని చేష్టలు పెద్దలుకూడా చేయలేనివిగా యున్నవి. ఏమిచేయవలయునో యశోదకు అంతుపట్టక కృష్ణయ్యను గూర్చి ఆలోచించసాగినది.

సీ॥ బాలుఁడీతం డని భావింతు నందునా? యే పెద్దలును వేర రీ క్రమంబు।
వెఱ పెఱుంగుటకు నై వెఱపింతు నందునా? కలిగి లే కొక్కఁడు గాని లేఁడు।
వెఱపుతో నా బుద్ధి వినిపింతు నందునా? తనుదానయై బుద్ధి దప్పకుండు।
నొం డెఱుగక యుంట మండెడి నందునా? చొచ్చి చూడని చొక్క చోటు లేదు।
ఆ॥ తన్ను నెవ్వరైనఁ దలపోయఁ బాఱెడి మోజ లేదు భీతి యొకటి యెఱుగఁ
డెలమి మారకుండఁ డెక్కసక్కెములాడుఁ బట్టి శాస్తి సేయు భంగి యెట్లు?

అని తనలో తాను తలపోసుకుంటున్నది. ఏది ఏమైనను బిడ్డలకు భయమంటూ ఉండాలి అని చింతించుచూ కోలను ఝళిపిస్తూ కృష్ణుని సమీపించింది. అదిగాంచి కృష్ణయ్య రోటిమీదనుండి క్రిందికి దూకినాడు. భయపడుతూ ఆమెకు దూరంగా పరుగులిడసాగినాడు. యశోద పరుగులిడుచున్నది. కిష్టయ్య పట్టుబడ్డాడు.

సీ॥ స్తంభాదికమ్ములు దనకు నడ్డం బైన నిట్టట్టు సని పట్టనీనివాని
నీ తప్పు సైరింపు మింక దొంగిల బోన 'చే' నని మునుముట్ట నేడ్చువాని
గాటుక నెఱయుంగ గన్నులు నులుముచు వెడలు కన్నీటితో వెగచువాని
నే దెస వచ్చునో యిది యని పలుమాఱు సురుఁగుచు గ్రేగంటఁ జూచువానిఁ
ఆ॥ గూడఁ బాఱి పట్టుకొని వెఱపించుచుఁ జిన్ని వెన్నదొంగ చిక్కెననుచు
వలిగికొట్టఁ జేతులాడక పూఁబోడి కరుణతోడ బాలుఁ గట్టదలఁచి.

యశోద శ్రీకృష్ణుని త్రాటితో బంధించ యత్నించెను. ఎంత త్రాడు తెచ్చినను సరిపడదయ్యెను. ప్రయత్నించి ప్రయత్నించి యశోద అలసిపోయెను.

క॥ తజ్జనని లోఁగిటం గల, రజ్జుపరంపరల గ్రమ్మఱఁ సుతుఁగట్టన్
బొజ్జ దిరిగి రాదయ్యె జగజ్జాలములున్న బొజ్జఁ గట్టన్ వశమే?

యశోద చేయు ప్రయత్నములన్నియు విఫలము కాజొచ్చెను. భగవానుని కట్టలేకపోయెను. అయినా ప్రయత్నమును మాత్రము విడలేదు. అలాగే ప్రయత్నించసాగింది. అధికశ్రమచే ఆమె దేహము చెమటచే తడిసిపోయెను. తలలో ముడుచుకొని యుండిన

పూలమాలలు జారిపోవుచుండెను. తల్లియొక్క ఈ దీనావస్థను గని బాలకృష్ణుడు తానే బంధితుడయ్యెను. శ్రీకృష్ణుని బంధించుటకు ఎవరు నిరంతరం శ్రమింతురో వారికే కృష్ణుడు లభించును. ఇది దామోదర లీల. ఇది చాలా అద్భుతమైన లీలయని చైతన్య మహాప్రభువు అభిప్రాయపడినాడు. ఈ లీలలో ప్రదర్శించిన విషయం భక్తికి పరాకాష్ఠ అని నుడివెను. తపస్సును, జ్ఞానమును దాటిపోయిన ఈ లీల సత్యులను తరింపచేయునని తెలిపెను.

ఈ దామోదర లీలను వర్ణించుచు, శ్రీశుకుడు కొద్దికాలము నేత్రములు మూసి ధ్యాన తత్పరుడయ్యెను. నెమ్మదిగా కళ్ళుతెరచి, ఎదురుగా కూర్చొని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలకించుచున్న పరీక్షిన్మహారాజును జూచి, "రాజా! ఈ సమస్త విశ్వము ఏ దివ్యాత్మునికి వశమైయున్నదో అట్టి సర్వస్వతంత్రుడగు శ్రీనాథుడు ప్రేమకు లొంగినవాడై, తన భక్తురాలి చేతిలో బంధితుడయ్యాడు. ఈ నాడు యశోదకు కలిగిన భాగ్యము బ్రహ్మరుద్రాదులకేకాక, తన అర్ధాంగియైన లక్ష్మీదేవికి కూడా భగవానుడు ఎప్పుడునూ అనుగ్రహించలేదు" అని చెబుతూ పరవశించెను. శ్రోతలైన భక్తుల నేత్రాలలో ఆనంద బాష్పధార నిరాటంకముగా ప్రవహించినది.

భగవంతుడు భక్తసులభుడు. భక్తిలోతప్ప మరొకవిధముగా భగవంతుని బంధింప లేము. ఈ సందర్భమున పరమ అద్వైతాచార్యులై యుండియు, శ్రీకృష్ణమూర్తి ధ్యానంలో సమస్తమును మరచి పరవశించు మహాత్ముని దివ్యమయ భావమును మననము చేసుకొని మనమూ తరించెదముగాక!

యద్బంధస్య విధిత్సయాపి వివశః కీనాశ పాశైర్ధృఢమ్
బద్ధః సానుజ పుత్ర బాంధవ జనః దుర్యోధనోఽస్తం గతః
తం త్యాంయేన నిబధ్య నందదయితా బృందారకై ర్వందితా
జాతా నందమయీ ముకుంద మహతే భావాయ తస్మై నమః

"భగవంతుని బంధించాలని దుర్మార్గుడైన దుర్యోధనుడు ప్రయత్నించాడు. ఫలితమేమిటి? తానే గాకుండా తన బంధుజనులు కూడా బంధములో తగులుకొని హతులయ్యారు. మరి ఆ భగవానునే యశోద బంధించింది. ఫలితమేమిటి? సమస్త దేవతలచేత కీర్తించబడింది. అట్టి బంధితుడైన ముకుందునకు నమస్కరిస్తూ, యశోదయొక్క భక్తిభావమునకు శిరమోడ్చి నమస్కరించుచున్నాను" అని మధుసూదన సరస్వతీ స్వాముల వారు ఆనంద మందాకినీ స్తోత్రములో తెలిపియున్నారు.

ఆహా!..............ఎంతటి దివ్యభావము! బంధించాలని ఇరువురూ ప్రయత్నించారు. ఒకరు పగతో బంధించాలని యత్నించారు. మరొకరు ప్రేమతో బంధించాలని ప్రయత్నించారు. అహంకారము ఎప్పుడూ అనర్థాన్నే పొందుతుంది. ప్రేమ ఎప్పుడూ బంధించియే తీరుతుంది. ఈ దామోదరలీల యందు ప్రేమ జయమే ముఖ్యవిషయమై, కేంద్రబిందువై యున్నది.

ఈ దామోదరలీల నాకు చాల ఇష్టమైన లీల. ఈ దామోదర లీలపై ఒక పర్యాయము నేను ధ్యానించునపుడు నాకు ఒక భావము హృదయములో నిలిచిపోయినది. శ్రీకృష్ణుని యశోద మొదట బంధించలేకపోయినది. ఆ తరువాత బంధించింది. వాస్తవానికి యశోద బంధించలేదు. కృష్ణయ్యే బంధించబడినాడు. ఎందుకు బంధింప బడినాడు? తల్లియొక్క దీనావస్థను చూసి లొంగిపోయాడు. ఆమె దేహము చెమటతో తడిసి, ఆమెకురులలోని పూలదండలు జారిపోవుచుండగా శ్రీకృష్ణుడు బంధితుడయ్యెను.

బాగా ఆలోచించండి. దేహము చెమటతో తడిసి, శిరమునుండి పూలదండలు జారిపడునపుడే కృష్ణయ్యను బంధించగలము. దేహమున చెమటయున్నది. అది కారిపోవుచున్నది. అవును. మనదేహములో అభిమానము చోటు చేసుకొని యున్నది. దేహాభిమానము కారిపోయినపుడే శ్రీకృష్ణుడు మనకు హృదయములో బంధీ అవుతాడు.

అలాగే శిరమునుండి పూలు జారిపోవుచున్నవి. శిరమునకు పైభాగమున సుమములుండును. లోపల సంకల్పాలుండును. సంకల్ప నిరోధము జరుగనిదే శ్రీకృష్ణుడు లభ్యముకాడు. పూలు జారిపోవుట యనగా సంకల్ప నిరోధము జరుగుటయని భావము. ఎవరిలో దేహాభిమానము నశించి, సంకల్ప నిరోధము జరుగునో వారే శ్రీకృష్ణుని బంధించుటకు అర్హులగుదురు. ఇదియే అందులోని అంతర్భావము అని నాకు ధ్యానసమయమున మనస్సునకు అందినది.

కృష్ణయ్య బంధితుడయ్యాడు. గోపబాలురు చూసి చాలా బాధపడ్డారు. పరుగెత్తుకుంటూ వెళ్ళి ఇండ్లలో తల్లులకు చెప్పారు. గోపికలంతా గుమిగూడి వచ్చారు. కృష్ణయ్య రోటికి కట్టబడియున్నాడు. ఆ దృశ్యమును చూసి గోపికలు తీవ్రంగా కలత చెందారు. యశోదను సమీపించారు.

"అమ్మా! యశోదాదేవీ! ఏమిటీ వైపరీత్యం? సుకుమారుడైన మన కన్నయ్యను రోటికి గట్టుతావా? ఇది నీకు ధర్మమేనా? కన్నయ్య మా ఇండ్లలో పాలు, వెన్న దొంగిలించినాడు. మేము పేదవాళ్ళము. అయినా కృష్ణయ్యను ఇలా కట్టనూ లేదు. కొట్టనూలేదు. ఎంత తల్లివి అయినా ఇలాగేనా హింసించేది? కావాలంటే చెప్పు. కన్నయ్యవల్ల నీకు వాటిల్లిన నష్టమేమిటి? ఎంతపెరుగు పాడైనది? ఎంతనేయి దొర్లిపోయింది? చెప్పు. ఆ నష్టాన్ని మేము తీరుస్తాము. అంతేగాని కన్నయ్యను ఇలా బాధిస్తావా?" అని దుఃఖించసాగారు.

యశోదమ్మ మనస్సు చివుక్కుమంది. "ఏమిటీ? మీరేనా నాకు న్యాయం చెప్పవచ్చినది? చాలుచాలు పొండి. ఇప్పటివరకు నా బిడ్డపై మీరు చేయని ఫిర్యాదు లేదు. తగురుమమ్మా యంటూ ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు" అన్నది.

"అమ్మా! నిజమే! మేము కృష్ణయ్యపై ఫిర్యాదు చేసినమాట వాస్తవమే. ఫిర్యాదు చేశామేగాని బంధించమని చెప్పామా? మాకు కృష్ణయ్యే ప్రాణం. కృష్ణయ్య కష్టాన్ని మేము చూడలేము" అన్నారు.

"చూడలేకపోతే వెళ్ళిపొండి. నా బిడ్డను ఎలా తీర్చిదిద్దుకోవాలో నాకు తెలుసు" అంటూ చకచక యశోదమ్మ వెళ్ళిపోయింది.

కన్నయ్య దీనంగా ఉన్నాడు. గోపికలు బరువైన అడుగులు వేసుకుంటూ వెనుదిరిగారు. కొన్ని అడుగులు వేశారు. వెనుదిరిగి కన్నయ్యవంక చూశారు. నడుముకు త్రాడు బిగించబడి ఉంది. ఆ త్రాడు రోటికి కట్టబడి ఉంది. కృష్ణయ్య దైన్యస్థితి చూచి గోపికలు కలతతో కంట తడిపెట్టారు. ఇంతలో కన్నయ్య వారికి రెండు చేతులెత్తి దండం పెట్టినాడు. అంతే. గోపికల నేత్రాలు కుంభవర్షాన్ని కురిపించాయి. ఏడుస్తూ ఇండ్లకెళ్ళారు. కృష్ణుని ఎవరైతే బంధిస్తారో వారికి వందనము చేయుటకు కూడా కృష్ణుడు వెనుకాడడు. ఆయన ప్రేమప్రియుడు. ప్రేమమయుడు.

యశోదమ్మ లోనికెళ్ళింది. గోపికలు తమ ఇండ్లకు వెళ్ళినారు. కృష్ణయ్య త్రాటితో రోటికి కట్టబడియున్నాడు. ఎవ్వరూలేరు. కన్నయ్య అక్కడే కూర్చొని నెమ్మదిగా ధ్యానయోగివలె కండ్లుమూసెను.

శ్రీకృష్ణుడు ఎవరిని ధ్యానించును? తనను ఎవరు ధ్యానింతురో శ్రీకృష్ణుడు వారిని ధ్యానించును. కన్నయ్య ఆలోచించసాగెను. "పాపం! ఈ గోపికలు నా కొరకై బెంగ పెట్టుకొని వెళ్ళారు. వారి బాధను నేను నివృత్తి చేస్తాను" అని భావించుచుండెను.

"నా తల్లి యశోద నన్ను రోటికి కట్టి లోనికెళ్ళినది. ఏమి చేయుచున్నదో?" అని చూసెను.

నేత్రములవెంట బాష్పధారలు వర్షమువలె కురియుచుండ యశోదాదేవి రోదించుచు వంటచేయుటకు ఉపక్రమించి ఆమె కన్నీరు పడుటవలన అగ్ని రగుల్కొనకపోవుట చూచి దీనురాలై అగ్నిర్మథనము సాగించుచుండెను.

కృష్ణయ్య తన జ్ఞాననేత్రములో దేవకిని చూసెను. దేవకీదేవి కన్నయ్య కొయ్యబొమ్మను ముందుపెట్టుకొని విలపించుచుండెను. "కృష్ణా! నన్ను ఎప్పుడు విడుదలచేస్తావు? ఈ బంధములను ఎప్పుడు విడిపిస్తావు కన్నా?" అని దేవకి దుఃఖించుచుండెను.

కొయ్యబొమ్మలో కృష్ణయ్య ప్రవేశించి "నేనే బంధములో పడియున్నాను. నీ బంధనములను ఎలా విడిపించగలను?" అనెను. ఆ మాటలు వినగానే దేవకి "కృష్ణా! కృష్ణా!" అంటూ పడిపోయెను. వసుదేవుడు ఆ కేక విని అక్కడికి అరుదెంచి దేవకిని ఓదార్చెను.

"ఏమండీ! మన కన్నయ్యను ఎవరో బంధించియున్నారట! నా కన్నయ్య నాతో చెప్పినాడు" అన్నది దేవకి.

"అవును. కన్నయ్య ఎప్పుడూ బంధీయే. కన్నయ్యను బంధించేది మనుషులుకాదు. మనసులు. భక్తుల ప్రేమకు తాను బంధీయై ఉంటాడు. దేవకీ! చింతించకు. మన కన్నయ్యకు ఏ ఆపద వాటిల్లదు. ఆపదలు తొలగించే అమృతరూపునికి ఆపదలు కలుగవు. నీ ప్రేమ లేనిదానిని ఉన్నట్లు ఊహిస్తున్నది. అంతే. నామాట విను. మన కన్నయ్య తప్పకవస్తాడు. త్వరలోనే వస్తాడు. అప్పుడు నీ కలవరింతలన్నీ కన్నయ్యతో చెప్పవచ్చును" అని వసుదేవుడు చెప్పగానే దేవకీదేవి చిరునవ్వు నవ్వింది.

తల్లినవ్వును జూచి తృప్తిచెందిన కృష్ణయ్య మెల్లగ కళ్ళుతెరిచాడు. దూరంగా చెట్టుమీద ఒక చిన్నకోతి కూర్చుని ఉంది. దానిని చూసి "చూస్తున్నావేమి? ఇలా రా! చూడు ఈ నా దీనావస్థ...వెన్న తినేది మీరు. దెబ్బలు తినేది నేను" అన్నాడు కృష్ణయ్య. ఆ కోతి కంటినుండి రెండు కన్నీటిబొట్లు రాల్చింది. అది చూసి కన్నయ్య కదలిపోయాడు. లేచి నిల్చున్నాడు. ముందుకు నడువసాగాడు. రోలుకు కట్టబడి యుండుటచేత ముందుకు వెళ్ళలేక పోయాడు.

యమళార్జున భంజనము

కన్నయ్య మెల్లగా కదిలాడు. రోటిని కదిలించాడు. రోలు కదలింది. ప్రక్కకు వాలింది. దొర్లుతూ వెనకాలే వస్తూవున్నది. ఆ పెరడులో రెండు యమళార్జున వృక్షములు ఉన్నవి. ఆ రెండు మద్దిచెట్ల మధ్యకు మాధవుడు అరుదెంచినాడు. రెండు వృక్షముల మధ్యప్రదేశము గుండా తాను ప్రవేశించి, ఆ వైపునకు వెళ్ళినాడు. రోలు ప్రవేశించలేక పోయింది. రోటినికూడా లాగాలని ప్రయత్నించాడు. ఆ ప్రయత్నానికి రెండుచెట్లూ కూలిపోయాయి. వెంటనే ఆ రెండు చెట్లనుండి శోభాయమానమైన ఇరువురు వ్యక్తులు వచ్చారు. కన్నయ్యకు నమస్కరించారు. కృష్ణయ్యను స్తుతించారు. ఆశీస్సులను పొందినారు.

వీరిరువురు నలకూబర మణిగ్రీవు లనువారు. కుబేరుని పుత్రులు. ధనమదాంధులై, కన్నుమిన్ను తెలియక, పవిత్ర గంగానదిలో మగువలతోకూడి నగ్నముగ జలకమాడుచు, దారిన వెడుతున్న నారదమహర్షిని చూసికూడా సిగ్గుచెందక విచ్చలవిడిగా విహరించిరి. అదిగాంచి కలతచెందిన నారదమహర్షి వారికి గుణపాఠముచెప్ప నిశ్చయించుకొనెను.

క॥ కలవాని సుతుల మనుచును, గలకంఠులతోడఁ గూడి కానరు పరులన్
గలలో నైనను వీరికిఁ గల క్రొవ్వఁడగించి బుధుల గలుపుట యొప్పున్.

మనస్తాపమునకు గురియైన నారదమహర్షి వీరిని మద్దివృక్షములై శత వత్సరములు జీవించమని శపించిరి. పశ్చాత్తాప హృదయులైన నలకూబర మణిగ్రీవులు తమను కరుణించి క్షమించమని ప్రార్థించిరి. ప్రాధేయపడిరి. మహర్షి హృదయము ద్రవించెను. శ్రీకృష్ణుని పదస్పర్శచే పునీతులై శాపవిముక్తు లగుదురని ఆశీర్వదించెను.

క॥ ముక్తులరై నారాయణ భక్తులరై పరమసాధు భావశ్రీ సం
సక్తులరై సురలోక వ్యక్తుల రయ్యెదరు నాదు వాక్యము కతనన్.

అని మహర్షి వారిని ఆశీర్వదించెను.

పరమ భాగవతోత్తముడగు నారదమహర్షి యొక్క వాక్యము సఫలముచేయుటకై రోలును ఈడ్చుకొని యమళార్జున వృక్షములున్న చోటికి వెళ్ళి, కుబేర పుత్రులను శాపవిముక్తులను గావించెను.

యమళార్జున భంజనమనెడి ఈ లీల గొప్ప ఆధ్యాత్మిక అవగాహనతో కూడుకొని యున్నది.



నలకూబర మణిగ్రీవులకు శాపవిమోచనము

పుణ్యక్షేత్రములలోను, పుణ్యతీర్థములయందును చెడు నాచరించువారు, మహాత్ములను బాధించువారు వృక్షజన్మ మెత్తుదురు. అలాంటి పాపము భగవత్సందర్శనము ద్వారానే నివృత్తికాగలదు. సంకల్ప వికల్పాదులే ఆ రెండు వృక్షములు. వీటి శాఖలే అనంతకర్మములు. వాటిలోని ఫలములే కర్మఫలములు. సంకల్పవికల్పాదుల మధ్యనున్న నిశ్శబ్దమునందు శ్రీకృష్ణరూపము నిలిచిపోగానే సంకల్ప వికల్పాదులనే రెండువృక్షాలు కూలిపోవును. మోక్షము కరతలామలకమగును. ఇదియే యమళార్జున భంజనమనెడి లీలలోని ఆధ్యాత్మిక సందేశము.

శాపమునుండి విముక్తి నొందిన నలకూబర మణిగ్రీవులు శ్రీకృష్ణునికి నమస్కరించి, ప్రార్థించిరి.

నమః పరమ కళ్యాణ నమః పరమమఙ్గల
వాసుదేవాయ శాన్తాయ యదూనాం పతయే నమః

"పరమ కళ్యాణరూపా! నీకు నమస్కారము. పరమ మంగళస్వరూపా! నీకు నమస్కారము. యదుపతియును, వాసుదేవుడును, శాంతరూపుడైన నీకు వందనములు."

నారదమహర్షియొక్క అనుగ్రహముచేత తమకు ఈ మహాభాగ్యము లభించినదని వారు భావించిరి. వారి జన్మలు ధన్యమైనవని తృప్తిచెందిరి. భక్తియే వాంఛించదగినది, పరమోత్కృష్టమైనది యని భావించి, వెడలుటకు సంసిద్ధులై కృష్ణయ్యను ఒక వరము ననుగ్రహించమని కోరిరి.

శా॥ నీపద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడువాక్యంబులన్
నీపేరం బనిసేయుహస్తయుగముల్ నీమూర్తిపైఁ జూపులున్
నీపాదంబులపొంత మ్రొక్కుశిరముల్ నీసేవపైఁ జిత్తముల్
నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరజపత్రేక్షణా!

అని కుబేర పుత్రులు ప్రార్థించిరి.

శ్రీకృష్ణుడు వారి నాశీర్వదించుచు "కరుణామయుడగు నారదమహర్షి శాపమువలన మీరు ఈ నాడు తరించారు. అనన్యచింతనతో నన్నారాధించు వారలకు ఎప్పటికీ సంసారచెఱ యుండదు" అనెను.

కుబేర పుత్రులిరువురును ఱోటికి కట్టబడిన శ్రీకృష్ణుని చుట్టూ ప్రదక్షిణము చేసి పదేపదే నమస్కరించుచు నిష్క్రమించారు.

తాను బంధములో పడియున్నను శ్రీకృష్ణుడు ఇతరుల బంధములను తొలగించును.

బృందావన ప్రయాణము

యమళార్జున వృక్షములు కూలిపోగానే పెద్దచప్పు డాయెను. ఆకాశాన మబ్బులులేవు. గాలి లేదు. వర్షములేదు. ఈ పిడుగుపాటు శబ్దము ఏమిటో అర్థంగాక నందయశోదాదులు

పరుగెత్తుకుంటూ వచ్చారు. మద్దిచెట్లు రెండూ కూలిపోయున్నాయి. శ్రీకృష్ణుడు రోటికి కట్టబడియుండుటచేత అది శ్రీకృష్ణుని పనికాదని నిర్ణయించుకొనినారు. అంత పెద్ద వృక్షములను శ్రీకృష్ణుడు పడద్రోయుట అసంభవమని భావించారు. ఇదేదో రాక్షసమాయయై యుండవలెనని కూడా భావించసాగారు. ఇంతలో జరిగిన విషయమును వీక్షించిన గోపబాలురు అది కన్నయ్య పనియేనని సవిస్తరముగా చెప్పినారు. అయినా వారు నమ్మలేకపోయారు. ఇంతలో "ఇతడు నారాయణ సమానుడు"అని గర్గమహర్షి చెప్పిన మాట జ్ఞాపకమొచ్చి, నిజమై యుండవచ్చునేమో యని నందుడు సందేహపడెను. రోటికి కట్టబడియున్న శ్రీకృష్ణునిజూచి నందుడు నవ్వుకుంటూ వెళ్ళి బంధనములను తొలగించెను. గోపికలు, గోపబాలు రెల్లరు పరమ ఉత్సాహముతో పండుగ చేసుకొనిరి.

గోపికలు శ్రీకృష్ణుని పిలిచి "కృష్ణా! నీవు నృత్యము చేసినచో నీకు లడ్డు పెట్టెదుము" అనిరి. శ్రీకృష్ణుడాలోచించెను. నా స్నేహితులలో చాలామంది పేదవారున్నారు. వారికి లడ్డు లభించదు. అలాగే మర్కటములకు కూడా ఎవ్వరూ లడ్డు నందించరు. నేను నృత్యము చేసినచో వీరు లడ్డుపెట్టెదరు. ఆ లడ్డును వారికి పెట్టవచ్చునని అభిప్రాయ పడి గంతులేయుచుండెను. ఆహా!...శ్రీకృష్ణుడు ప్రేమావతారమూర్తి. అన్యులను తృప్తిపరచుటలోనే తన తృప్తి నిండియున్నదని సదా భావించుచుండును.

కన్నయ్య ఒకసారి వీధి గుమ్మంలో కూర్చొని నెమలికి నృత్యము నేర్పుచుండెను. ఒకగోపిక ఆ దారిన వెడుతూ "కృష్ణా! మా ఇంటిదాకా వచ్చెదవా?" అనెను.

"వచ్చినచో ఏమిత్తువు?" అని అచ్యుతుడనెను. "నీకు కావలసింది అడుగుము ఇచ్చెదను" అని గోపిక అనెను.

"నాకు ఇంత వెన్న కావలెను" అని కన్నయ్య చేతులను బారజాచెను. గోపిక ఫక్కున నవ్వి "అలాగే ఇస్తాను రా!" అన్నది.

కృష్ణయ్య ఆ గోపికవెంట నడిచివెళ్ళెను. ఏ మహానుభావుని దివ్య దర్శనానికి మహాత్ములైన వారంతా తరతరాలుగా తపస్సుచేస్తుండగా వారికి లభ్యముగాని పరమాత్మ ఈ నాడు ఒక అబలయైన గోపికవెంట వెన్న నిమిత్తం వెడుతున్నాడు. భక్తిగల వాని వెంట శ్రీకృష్ణుడు అనుసరించి నడచుచునే యుండును. భగవానుడు భక్తికి లొంగునే కాని మరియొక విధముగా లొంగేవాడు కాదు.

గోపిక:- కృష్ణయ్యా! కూర్చో...వెన్న పెడతాను. నీవు కోయిలలాగా పలుకుతావటగా? ఏదీ ఒక్కసారి వినిపించవూ......నీకు వెన్న పెడతాను.

కృష్ణ:- ఓ......వినిపిస్తాను....కుహూ.....కుహూ...(అని పలుకును.)

గోపిక:- కృష్ణయ్యా! నీవు చాలామంచివాడివి కదా! నేను వెన్న తినిపిస్తుంటాను. ఈ లోగా అదిగో అక్కడ రోలు ఒకటి ఉంది. ఇక్కడ తెచ్చిపెట్టవూ? (వెన్నపెడితే కృష్ణయ్య వెళ్ళిపోతాడు. ఏదైనా పని చెబితే చేస్తుంటాడు. ఆ దివ్యమోహన విగ్రహాన్ని వీక్షించవచ్చునని ఆ గోపిక అభిప్రాయము. రోలు ఎత్తలేడు. ప్రయత్నిస్తుంటాడు. కన్నయ్యను ఎక్కువసేపు చూడవచ్చునని ఆ గోపిక భావించింది.)

కన్నయ్య:- (రోలువద్దకువెళ్ళి ఎత్తుటకు ప్రారంభించాడు. వీలుకాలేదు. మళ్ళీ ప్రయత్నించాడు. ఈలోగా కృష్ణయ్య మొలనున్న పీతాంబరం ఊడిపోయింది.

గోపిక:- (ఫక్కున నవ్వింది.)

కన్నయ్య:- ఎందుకు నవ్వుతావు?.... నేను చిన్నవాడినేగా (అంటూ కష్టపడి రోలును తీసుకొచ్చి గోపికవద్ద ఉంచి, ఆ తరువాత వస్త్రాన్ని ధరించాడు)

దేహము వస్త్రము లాంటిదని భగవద్గీతలో చెప్పియున్నాడు. ఆ విషయాన్ని ఇక్కడ సమన్వయపరచుకోవాలి. రోలు మోయడమనేది సేవా కార్యము. పీతాంబరము ఉన్నంతవరకు కన్నయ్య ఆ బండను మోయలేకపోయినాడు. పీతాంబరము ఊడినతరువాతనే మోయగలిగాడు. దేహాభిమానము ఉన్నంతవరకు ఏ వ్యక్తీ ఎవరికీ సేవచేయలేడు. దేహాభిమానము తొలగినపుడే నిస్వార్థపూరిత సేవా కార్యక్రమములు జరుగును అని తెలుపుతాడు.

గోపిక వెన్నపెట్టింది. కృష్ణయ్య ఆ వెన్నను తెచ్చి గోపబాలురకు, కోతులకు పంచిపెట్టాడు.

ఒక అమ్మాయి పండ్లు అమ్ముచుండెను. పండ్లుకొనేందుకై కన్నయ్య ధాన్యమును చేత పట్టుకొని వెడలుచుండ, మధ్యలో ధాన్యమంతా క్రిందపోయెను. ఆ ఫలవిక్రేతి ఆయన చేతిలో పండ్లను ఉంచెను. శ్రీకృష్ణుడు నవ్వుతూ వెనుదిరిగి వెళ్ళెను. ఆ తరువాత ఆ అమ్మాయిబుట్ట రత్నములతో నిండియుండెను. నీవు భక్తితో చిన్న ఫలమిచ్చినను జగన్నాథుడు అమితముగా తృప్తి చెందును. నీనుండి సాధారణ ఫలమును గైకొని నీకు మోక్షఫలము నిచ్చును. భగవానుని కొరకు నీ వాచరించిన ఏ పనీ వృథాకాదు. అధిక ఫలముతో వచ్చి నిన్ను ఆనందాబ్ధిలో మునకలేయించును.

నంద గోకులము ఇటీవల అనేక ఉత్పాతముల ననుభవించినది. ఈ విషయమును చర్చించుటకై వృద్ధులైన గోపాలురందరు ఒకచోట చేరిరి. అందులో నందబాబా కూడా యుండెను. వారిలో జ్ఞానవంతుడు, వృద్ధుడైన ఉపానందు డనువాడు కూడా యుండెను. బలరామకృష్ణుల మేలుగోరి అతడొక హితమును తెలియజేసెను.

"ఈ గోకుల ప్రాంతము క్షేమజీవనానికి దూరమైనది. భూతాలతో దినదినానికీ భారమౌతున్నది. రాక్షసులవలన రోజురోజుకీ గండాలు ఎదురౌతున్నాయి. ఇక ఇక్కడ ఉండటం ఏమంత మంచిపని కాదు. ఆదిలో పూతనను, అప్పుడు శకటాసురుని, ఆ మధ్య తృణావర్తుని కన్నయ్య వధించె. ఇప్పుడు మద్దిచెట్ల గండమునుండి బయటపడెను. మరియొక దుర్ఘటన జరుగకముందే మనము ఈ ప్రదేశమును విడిచిపెట్టి వెళ్ళుట సముచితమని నా అభిప్రాయము. బృందావనము బహుచక్కని ప్రదేశము. అచ్చట గోవులకు సస్యము పూర్ణముగా లభించును. సుందరమైన వనప్రదేశములతో బృందావనము అద్భుతమై యుండును. మీకు ఇష్టమైనచో వెంటనే ప్రయాణము సాగించుట మంచిది. ఈ విషయమున ఆలస్యము మంచిదికాదు" అని ఉపానందుడు తెలియజేసెను.

"శుభం"....అన్నారు అందరూ. వృద్ధులను, బాలురను, స్త్రీలను, సామాగ్రిని బండ్లపైకి ఎక్కించారు. గోవులను ముందుంచారు. భేరీలను మ్రోగించుచు, సన్నాయి ఊదుతు, వేదమంత్రముల నుచ్చరించుచు పురోహితులు అనుసరించుచుండ ఆబాలగోపాలం కదలసాగింది. గోపికలు సుందరమైన బట్టలను, ఆభరణములను ధరించి, రథములయందు కూర్చొని కృష్ణమహిమలను గానము చేయుచుండిరి. రోహిణీ యశోదలు కన్నయ్య మధురవాక్కులను వినుటకు ఒక రథములో ఆసీనులైరి. ఆనందయాత్రలా సాగిన ప్రయాణము బృందావనము చేరింది.

బృన్దావనం గోవర్ధనం యమునా పులినాని చ
వీక్ష్యాసీ దుత్తమా ప్రీతి రామ మాధవ యోర్నృప

"బృందావనమును, గోవర్ధనమును, యమునాతీరమును దర్శించి, బలరామకృష్ణులు సంతుష్టులైనారు. బృందావనంలో కన్నయ్య కమనీయ లీలలు ప్రారంభమైనవి.

సీ॥ వేణువు లూఁదుచు వివిధరూపములలో గంతులు వైతురు కౌతుకమున
గురుకంబళాదుల గోవృషంబులఁ బన్ని పరవృషభము లని ప్రతిఘటింతు
రల్లులు దట్టించి యంఘ్రులముల గజ్జెలు మొరయఁ దన్నుదు రోలిఁముమ్మురముగ
బన్నిదంబులు వైచి ఫలమంజరులు గూల్చి వ్రేటులాడుదురు ప్రావీణ్యమొప్ప
తే॥ వన్యజంతుచయంబుల వాని వాని వదరు వదరుచు వంచించి పట్టఁబోరు
రంబుజాకరములఁ జల్లులాడఁ జనుదు రాకుమారులు బాల్య విహారులగుచు.

ఈ విధముగా బలరామకృష్ణులు ఆనందముగా విహరింపసాగిరి.

ఒకనాడు యమునానదీ తీరమున రామకృష్ణులు గోపబాలురతో కలసి గోవత్సములను మేపుచుండిరి. ఇది శ్రీమద్భాగవతము దశమ స్కంధమున పదునొకండవ అధ్యాయము.

ఈ అధ్యాయమున కన్నయ్య వత్సపాలకుడే. ఆ తరువాత గోపాలుడగును.

రామకృష్ణులను వధించుటకు కంసుడు పంపగా ఒక రాక్షసుడు అరుదెంచెను. యమునా తీరము పవిత్రమైనది. యమునా ప్రవాహమే జీవన ప్రవాహము. యమునా తీరమే మోక్షసాధన క్షేత్రమగు ఈ భూలోకము. ఇచ్చటికి రామకృష్ణులవంటి పుణ్యాత్ములు వస్తారు. వత్సాసురునివంటి పాపాత్ములు కూడా వస్తారు. ఉపానందుడు పుణ్యాత్ములను ప్రోత్సహించెను. కంసుడు దురాత్ములను ప్రోత్సహించి పంపును.

నందుడనగా ఆనందస్వరూపుడని భావము. ఉపానందుడు అనగా ఆనంద స్వరూపమైన ఆత్మకు సమీపమున ఉన్నవాడు అని భావము. అదియే శుద్ధబుద్ధి. మనప్రవర్తనలను విశుద్ధముగా నుంచును. బుద్ధిమంతులే బుద్ధిచెప్పినట్లు నడుచుకోగలరు.

కంసుడనగా అజ్ఞానము అని భావము. అజ్ఞాన స్వరూపుడైన కంసుని వద్ద ఉండు వత్సాసురుడు అహంకారముయొక్క ప్రతిరూపము. అహంకార అజ్ఞానముల బ్రతుకులు అన్యాయముగా [illegible] పోవును.

వత్సాసురుడు లేగదూడ రూపమును ధరించి, ఆవుల మందలో ప్రవేశించెను. క్రొత్త లేగదూడ వచ్చి మందలో కలిసియున్నదని ఎవ్వరూ గ్రహింపలేకపోయారు. బలరాముడుకూడా కనిపెట్టలేదు. ఎవ్వరూ దర్శింపలేని దానిని దర్శించువాడే శ్రీకృష్ణుడు.

కృష్ణయ్య వత్సరూపుడగు రాక్షసుని వెంట నడిచెను. కాళ్ళను కలిపి పట్టుకొనెను. తోకను గూడా పట్టుకొని త్రిప్పసాగెను. ఆ దైత్యుడు మరణించెను. వెంటనే వానిని వెలగచెట్టుపైకి విసరెను. ఈ దృశ్యమును గాంచి గోపాలురు సంతసించారు. దేవతలు భగవానునిపై పుష్పవృష్టిని కురిపించారు.

క॥ **వత్సములవగిది జగముల వత్సలతన్ మనుపుఁజాలువాడై యుండన్**
వత్సముల మేపుచుండియు వత్సాసురుఁ జంపె భక్తవత్సలుఁ డధిపా!

అని పోతనామాత్యుడు పరవశించి రచించాడు.

ఈ 'వత్సాసుర వధ' అనెడు లీలద్వారా భగవానుడు సాధకులైనవారికి బహుచక్కని ఆధ్యాత్మిక సందేశము నందించెను.

మనమెంత గొప్ప సాధకులమైనను, మనలో ఉండెడి సాత్త్విక సంకల్పములే ఉండినప్పటికిని మనకు తెలియకుండా వత్సాసురుడనే అహంకారం మెల్లగా ప్రవేశించి, అంతర్యములో చోటు చేసుకుంటుంది. అది మొదటిదశలో లేగదూడలాగే కనబడుతుంది. అరికట్టకుండా వదలిపెట్టినచో ఆబోతులాగా తయారవుతుంది. సకల అరిష్టములకు, వినాశములకు కారణమవుతుంది. కనుక ప్రతిసాధకుడు తనలో తెలియకుండా ప్రవేశించే అహంకారమును సునిశిత జ్ఞానముతో పరిశీలించి, పారద్రోలాలి. ఇదియే వత్సాసుర వధలోని ఆధ్యాత్మిక సందేశము.

బకాసుర వధ

ఒకనాడు లేగదూడలను మేపుతున్న గోపబాలురు తమతమ దూడలను నీరు త్రాగించుటకై జలాశయములవద్దకు తీసుకొని పోవుచుండిరి. ఆ దారిలో వారొక భయంకర దృశ్యమును గాంచిరి. అది ఒక భయంకరమైన కొంగరూపమున ఉండెను. తెగిపడిన పర్వతశిఖరమంత యుండెను.

ఇంతలో బకరూపధారి యైన ఆ రాక్షసుడు కృష్ణయ్యవద్దకు వచ్చెను. పట్టుకొనెను. బలరామాది బాలురు అదిచూసి నిశ్చేష్టులైనారు. చూస్తుండగానే ఆ కొంగ కన్నయ్యను మ్రింగేసింది. దాని కడుపులోకి వెళ్ళిన కృష్ణయ్య దావానలంలా మంటలు రేపాడు. అది దహనబాధను భరించలేక కృష్ణయ్యను వెడలగ్రక్కింది. కృష్ణయ్య బయటపడ్డాడు.

దాని కోపము తీవ్రమైంది. ఆ బకము కత్తివంటి తన ముక్కుతో కృష్ణయ్యను పొడవబోయింది. వెంటనే కృష్ణయ్య దాని ముక్కు పుటములను రెండుచేతులలో పట్టుకొని గోపబాలురెల్లరు విస్మయముతో వీక్షించుచుండగా ముడిలేని గడ్డిపోచవలె రెండుగా చీల్చివేసెను. ఇది గాంచి దేవతలతో సహా సర్వులు సంతోషించిరి.

ఈ విషయమును విని నందాది గోపులు ఆశ్చర్యచకితులైరి. మృత్యు ముఖమునుండి కన్నయ్య బయటపడెనని భావించిరి. రాక్షసులు కృష్ణయ్యను మట్టుపెట్టవలెనని ఎన్నివిధముల ప్రయత్నించినను చివరకు వారే హతులగుచున్నారు అని తలపోసుకొనిరి.

క॥ అవదలమేఁ(ర వావర లీ, పావనిఁ జెంది తొలఁగె నీ యర్భకునిం
బై పడినఖలులు దహనుని, పైపడు శలభములవగిదిఁబడిరి ధరిత్రిన్.

రాక్షసులు ఎంత బలవంతులైనను కన్నయ్యను వధించలేకపోయారు. పైగా అగ్నియందు ప్రవేశించు మిడుతలవలె హతులగుచున్నారు అని వ్రజవాసులు భావించారు.

బకమనగా కొంగ అని అర్థము. కొంగ దంభమును ప్రదర్శించును. "కొంగజపము" అనెడి నానుడికూడా సామాన్యముగా ప్రజలలో ప్రాచుర్యము పొందినది. దాంభికత్వము సాధనను వక్రింపచేయును. యమునాతీరము భక్తికి సంకేతస్థానము. భక్తిచేయు సమయాలలో నల్లానుడుడు అనే అహంకారము, బకాసురుడు అనే దంభము మనకు అడ్డునిలచి బాధించును. సాధకుడైనవాడు శ్రీకృష్ణునికి శరణాగతుడై ఈ రెండింటిని దాటవలెను. అప్పుడే ఆత్మానందమును పొందును. ఇదియే బకాసురవధ లోని అంతరార్థము.

అఘాసుర వధ

శ్రీకృష్ణబలరాములు గోపబాలురతో కలసి దాగుడుమూతలు అను క్రీడను సాగించెడివారు. దాగుడుమూతల క్రీడలలో శ్రీకృష్ణుని పట్టడము బహుకష్టము. అలాంటి సమయాలలో గోపబాలురు నిరాశతో నిలబడి యుందురు. శ్రీకృష్ణుడు తనంతట తానే దొరికిపోవుచుండును.

భక్తుల హృదయాలలో నివసించే భగవానుడు భక్తులకు ఎలాదూరం కాగలడు? కాని అప్పుడప్పుడు అదృశ్యమై కనబడకయుండును. అలా అదృశ్యమగుట భక్తులను ఉద్ధరించుట కొరకే. ఒకపేదవానికి విలువైన రత్నము దొరికి, మరల అది కనబడకుండా పోయినచో వాడు ఆ రత్నమును గూర్చియే చింతించులాగున భగవానుడు కూడా భక్తులకు కనుపించకుండా అదృశ్యమై వారిలోని భక్త్యావేశమును, విరహతాపమును కదిలించి తనకు అత్యంత సన్నిహితులుగ చేసుకుంటాడు. అదియే భగవానుడు జరుపు "దాగుడుమూతలు" క్రీడయందలి భావార్థము.

బాల్యోచితమైన క్రీడలద్వారా శ్రీకృష్ణుడు ఎన్నియో సందేశముల నందించుచుండెను. ఒకనాడు వనమునందే ప్రాతఃకాల భోజనముచేయ సంకల్పించి, తన మిత్రులతో కూడి పెందలకడనే బయలుదేరెను. బయలుదేరిన గోపబాలురు మార్గమధ్యమున వివిధమైన క్రీడలను ఆడుచు వనప్రదేశమును చేరిరి.

యది దూరం గతః కృష్ణో వన శోభేక్షణాయ తమ్
అహం పూర్వ మహం పూర్వమితి సంస్పృశ్య రేమిరే

బృందావన శోభను గాంచుచు ఒక్కొక్కసారి శ్రీకృష్ణుడు ముందుకు జరుగుచుండును. అదిగాంచి "కృష్ణుని నేను ముందు తాకుదును - నేను తాకుదును" అని పోటీలుపడి, పరుగులిడి, శ్రీకృష్ణుని స్పృశించి, గోపబాలురు ఆనందించెడివారు.

శ్రీకృష్ణుని తాకుట యనగా బ్రహ్మైక్యము. భగవానుని పొందవలెనని యత్నించు భక్తుడే ఉత్తమమైనవాడు. పరమాత్మను చేరుటకు భక్తుడు వదనకూడదు. పరుగులిడవలెను.

గోపబాలురు పుణ్యాత్ములు. వారి భాగ్యము వర్ణింప నలవికాదు. అనేక జన్మలనుండి యోగాభ్యాసము నభ్యసించుచు, ఏ భగవానుని యోగులు సైతము పొందలేకయున్నారో అట్టివాని సహచర్యమును నిరంతరము కల్గియుండుట వారి పుణ్య విశేషముగాక మరి ఏమగును? అందుచేతనే శ్రీమద్భాగవతము వారిని "కృత పుణ్యపుంజాః" అని కీర్తించింది.

ఉ॥ ఎన్నఁడు నైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయున్
గన్నులఁగాన రట్టి హరిఁ గౌఁగిటఁ జేర్చుచుఁ జెట్టవట్టుచున్
దన్నుచు గ్రుద్దుచున్ నగుచుఁ దద్దయుఁ బైపడి కూడియాడుచున్
మన్ననసేయు వల్లవకుమారులభాగ్యము లింత యొప్పునే!

అని పోతన పరవశించి గానమొనర్చినాడు.

గోపబాలురు శ్రీకృష్ణునితో గూడి క్రీడించుచుండగా, దేవతలు సైతము ఎవని నామము చెవిని పడగానే భీతి చెందుచుందురో-అట్టి అఘాసురుడు అచ్చటికి ఏతెంచెను. అఘాసురుడు పూతన, బకాసురుల తమ్ముడు. తన అన్నను, అక్కను వధించిన శ్రీకృష్ణుని అంతముచేయవలెనని కంసుని ప్రేరణతో వచ్చెను. అతడు యోజనము పొడవుగల సర్పరూపమును ధరించి గోపబాలురతో సహా శ్రీకృష్ణుని మ్రింగుటకు దారిన పడియుండెను. పర్వతమువంటి శరీరమును కలిగి యుండెను. అతడు నోరు తెరవగా క్రిందిభాగము భూమిపైనుండగా, పైభాగము ఆకాశము నంటినది. ఈ వింత దృశ్యమును జూచిన గోపబాలురు అమితానందముతో చప్పట్లు చరుస్తూ, గోవులతో సహా సర్పరాక్షసుని నోటిలో అమాయకంగా ప్రవేశించారు. ఈ దృశ్యమును గాంచిన శ్రీకృష్ణపరమాత్మ గోపబాలురను రక్షించుటకై తానుకూడా ప్రవేశించి అనంతుడుగా పెరిగిపోయినాడు. శ్రీకృష్ణుని అనంతదేహమును భరించలేక అఘాసురుడు మరణిస్తాడు. శ్రీకృష్ణుడు గోవులను, గోపాలురను సురక్షితంగా వనప్రదేశానికి తీసుకొని వస్తాడు.

మనలోని అసుర ప్రవృత్తికి ఆధారమైన "అహం" వృత్తియే అఘాసురుడను రాక్షసుడు. అనుక్షణము ఈ "అహం" వృత్తి భయంకరముగా నోరుతెరచుకొని మనలను కబళించడానికి సిద్ధంగా ఉంటుంది. దానిలో ప్రవేశించి తిరిగి సురక్షితంగా రావడము దుర్లభము. "కోఽహం" అనెడి ఆత్మవిచారము కృష్ణునిలా అనంతముగా పెరిగి సర్వవ్యాపకమైనచో 'అహం' అనెడి అహం వృత్తి అఘాసురునిలా మరణిస్తుంది. అహం వృత్తి అదృశ్యం కాగానే ఆత్మ దర్శనమవుతుంది.

అహమి నాశభాజ్యహ మహంతయా స్ఫురతి హృత్స్వయం పరమపూర్ణసత్

"ఎప్పుడైతే "నేను" నశిస్తుందో అప్పుడు ఉత్కృష్టమైనదియు, పూర్ణరూపమైనదియు, సత్యస్వరూపమైనదియు నగు "అహం-అహం" అను ఆత్మయే ప్రకాశించును" అని రమణమహర్షి ఉపదేశసారములో తెలుపుతారు. ఇదియే అఘాసుర వధలోని ఆధ్యాత్మిక సందేశము.

భగవానుడు అఘాసురుని వధించుట కౌమారలీలగా తెలుపబడినది. కౌమార లీల యనగా ఐదవ సంవత్సరమున చేసిన పని యని భావము. అఘాసురుని వధించునాటికి శ్రీకృష్ణుని వయస్సు అయిదు సంవత్సరములు. ఐదవ సంవత్సరము వయస్సున శ్రీకృష్ణుడు అఘాసురుని వధించెను. "అహం" వృత్తి కలిగి పంచేంద్రియములద్వారా కర్మలాచరించును. పంచేంద్రియములలో అనగా ఐదుచోట్ల "అహం" వృత్తి చావవలసి యున్నది. అందుచేత శ్రీకృష్ణుడు తన ఐదవ ఏట అఘాసురుని వధించెను. ఇది కౌమారలీల.

బృందావనమున గోపబాలురు కౌమారలీలయందు జరిగిన అఘాసుర వధను పౌగండలీలగా చెప్పుకొనుచుందురు. పౌగండలీల యనగా ఆరవ సంవత్సరమున జరిగిన లీలయని అర్థము. ఇలా చెప్పుటకు కారణమేమి? అని పరీక్షిన్మహారాజు శుకబ్రహ్మను అడుగగా శుకబ్రహ్మ మరియొక అద్భుతలీలను తెలియజేయుచున్నాడు.

ఇది ఒక విచిత్రమైన విషయము. ఒక సంవత్సరము తరువాత అఘాసుర వధ విషయమును బాలురు తమతల్లులకు తెలియజేయుచు అది ఈనాడు జరిగినట్లు వివరిస్తారు. మరి గడచిన సంవత్సరకాలము ఎందుకు చెప్పలేక పోయారు? అని పరీక్షిత్తు అడిగెను. పరీక్షితుని ప్రశ్న శుకయోగీంద్రుని సమాధిస్థితికి గొనిపోయినది. పరీక్షితుడు ఆ ప్రశ్న వేయగానే ఒక అద్భుతమయిన లీల శుక యోగీంద్రుని హృదిలో కదలెను. ఆ విషయస్మరణము వలన అంతర్ముఖుడయ్యెను. కొంతసేపటికి శుకుడు అతి కష్టముతో బాహ్యస్మృతిని పొంది, మెల్లమెల్లగా వచింపసాగెను.

బంతి చల్దులారగించుట

అఘాసురుడు మరణించాడు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. ఆ తరువాత కృష్ణయ్య తన వారందరిని యమునా తీరమునకు తీసుకొని వెళ్ళినాడు. యమునా నదిని చూచి పరవశించి తనమిత్రులతో ఇలా చెబుతున్నాడు.

అహోఽతి రమ్యం పులినం వయస్యాః స్వకేళి సంపన్మృదు లాచ్ఛ వాలుకమ్
స్ఫుటత్సరోగన్ధ హృతాలిపత్రిక ధ్వని ప్రతి ధ్వానలసద్ద్రుమాకులమ్

"మిత్రులారా! వీక్షించుడు. ఈ యమునా పులిన వనము ఎంతో రమ్యముగా నున్నది. వికసిత పద్మముల సౌరభముచే ఆకర్షింపబడిన తుమ్మెదలు, పక్షులు వీటిలో సవ్వడి చేయుచున్నవి. సైకత శ్రేణులతో గూడినదియైన ఈ తీరము క్రీడించుటకు బహు రమణీయముగా నున్నది" అనెను.

"మనము చల్దులు గుడుచుటకు ఇది అనువైన ప్రదేశము. ఇప్పటికే చాలా ప్రొద్దుపోయినది. క్షుద్బాధచే మనమంతా బాధపడుచున్నాము. లేగదూడలు ఈ పరిసర ప్రాంతములయందు పచ్చగడ్డిని మేయుచుండును" అనెను.

శా॥ **ఎండన్ ప్రుగ్గితి రాఁకటం బడితి రింకేలా విలంబింపఁగా**
రండో బాలకులార చల్ది గుడువన్ రమ్యస్థలం బిక్కడే
దండన్ లేఁగలు నీరుద్రావి యిరవందం బచ్చికల్ మేయుచుం
దండంబై విహరించుచుండఁగ నమందప్రీతి భక్షింతమే?

అని శ్రీకృష్ణుడు పిలువగా బాలురంగీకరించి వచ్చిరి. గోవత్సములను మేతకు బంపి, ఆ యమునా సైకత ప్రదేశములో శ్రీకృష్ణుని చుట్టూ కూర్చొనిరి. శ్రీకృష్ణుడు వారిని పద్మాకారమున కూర్చుండబెట్టెను. ఇది ఒక అద్భుతలీల. మహాబుద్ధులకు అందని మర్మలీల.

కృష్ణస్య విష్వక్పురు రాజిమండలై రభ్యాననాః ఫుల్లదృశో వ్రజార్భకాః
సహోపవిష్టా విపినే విరేజు శ్ఛదా యథా మ్భోరుహ కర్ణికాయాః

కమలము మధ్యమునందు ఉన్న కర్ణికకు చుట్టూ పత్రములు గోచరించునట్లు, శ్రీకృష్ణునకు చుట్టూ గోపబాలురు సన్నిహితముగా అనేక వరుసలలో కూర్చుండిరి. శ్రీకృష్ణుడు తమవైపే చూచుచున్నాడని ప్రతి ఒక్కరు భావించసాగిరి. వారు సంతుష్టచిత్తులై శోభించసాగిరి.

భగవానునకు దగ్గరగా కూర్చొనవలెనని ప్రతిబాలుడు భావించెను. ఆత్మస్థితులు కావలెనని వారు ఊహించిరి. తమవద్దనున్న పదార్థమును శ్రీకృష్ణునకే తినిపించవలెనని వారు కుతూహల పడుచుండిరి.

ఈ ప్రపంచములో మనదంటూ ఏమీలేదు. అంతా భగవత్ప్రభచేతనే కదలుచున్నది. ఏది మనకు లభించియున్నను అది భగవత్ప్రసాదముగా భావించువాడే నిజమైన భక్తుడు. నీవు కవిశేఖరుడవా? అయితే భగవానుని దివ్యగాథలను రచించు. నీవు గాయకుడివా? అయితే శ్యామసుందరుని అనంత కళ్యాణములను గానము చేయి. నీవు నాట్యాచార్యుడివా? అయితే భగవానుని ఎదుట పరవశించి నృత్యంచేయి. పరమాత్మ సేవలో,తరిగేదుండదు. పరమాత్మ విస్మృతిలో ఒరిగేదుండదు. పెరిగేదుండదు.

భగవానుని తృప్తి పరచేందుకు గోపబాలురు చల్దిమూటలను విప్పారు. శ్రీకృష్ణునివంక చూశారు. ప్రతిఒక్కరికి కృష్ణయ్య తమనే చూచుచున్నట్లు తెలియుచున్నది. నిజమే ఆయన భక్తవత్సలుడు. తనను గోరు భక్తులను విడచి వుండలేడు. తనను గాచువారిపై కృపజూపుచునే యుండును. అందరిపై సమదృష్టిని ప్రసరింపచేసెను. బాలురు అన్నపుమూటలను, వ్యంజనములను విప్పి, ముందు పెట్టుకొని శ్రీకృష్ణుని చుట్టూ కూర్చొనిరి.

యజ్ఞభోక్తయగు శ్రీమన్నారాయణుడు బాల్యక్రీడ జరుపుచు, వేణువును మొలలో బెట్టుకొని మీగడ పెరుగుతో కలిపిన బంతిచల్దులను చేతియందిడుకొని, వ్రేళ్ళసందులయందు వ్యంజనములను నిలుపుకొని, అందరికీ అభిముఖముగ నడుమన గూర్చుండి, ఛలోక్తులతో చెలికాండ్రను నవ్వించుచు, భోజన మారగించుచుండెను. దేవతలెల్లరు ఆకాశమున నిల్చుండి, ఈ లీలను పరమానందముగ గాంచుచుండిరి.

సీ॥ కడుపున దిండుగాఁ గట్టిన వలువలో లాలితవంశనాళంబుఁ జొనిపి
విమలశృంగంబును వేత్రదండంబును జాఱిరానీక డాచంక నిఱికి
మీఁగడ పెరుఁగున మేళవించిన చల్ది ముద్ద డాపలిచేత మొనయ నునిచి
చెలరేఁగి కొసరి తెచ్చిన యూరుగాయలు వ్రేళ్ళసందుల నెల్ల వెలయ నిఱికి

ఆ॥ సంగడీల నడుమఁ జక్కనఁ గూర్చుండి నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణుఁ డమరులు వెఱఁగంద శైశవంబు మెఱసి చల్ది గుడిచె.

"ఏయ్! ఇతని తల్లి చాలా మంచిది. ఆమె ప్రేమను పంచునపుడు చల్దిముద్దల వలె చల్లగా నుండును. ఆమెకు కోపము వచ్చినపుడు దొండ ఊరగాయవలె కారముగా యుండును" అని కన్నయ్య అనగానే అందరూ ఫక్కున నవ్వసాగిరి.

ఆహారము భుజించునప్పుడు మనసు ఉల్లాసముగా యుండవలెను. అప్పుడే అది చక్కగా ఒంటికి పట్టును. ఆరోగ్యము నిచ్చును. కొంతమంది అన్నమారగించునపుడే కలతల నాహ్వానింతురు. భార్య భర్తకు రుచికరమైన వంట చేసి పెట్టును. అతడు అరగించుటకు ఆసీనుడు కాగానే చీరలు తీసుకురాలేదని, సినిమాకు తోడుకొని పోలేదని వాగ్యుద్ధము ప్రారంభించును. భర్త ఆహారమును మ్రింగుచు ఆవేశము బహిర్గత మొనర్చును. అతడు కలతచెందును. ఆమె కన్నీరు కార్చును. ఇట్టి ఆహార సేవనమువలన వ్యక్తులు రోగిష్ఠులవుదురు. కనుక ఆహారమును ఆనందముగా గ్రహించాలి. అది ఎలాజరుగును? గోపబాలురలాగా మనముకూడా స్వామిని ముందుంచుకొని భుజించినపుడే. ముందుంచుకొని భుజించుట యనగా భగవన్నామము నుచ్చరించుచు భుజించుట యని అర్థము.

గోపాలురందరు కృష్ణయ్యతోకూడా చల్దు లారగించుచుండగా తృణసంపాదనకై గోవత్సములు దూరముగా వెళ్ళినవి. అది తలచి గోపాలురు భీతినొందిరి. వారి భయమును కనిపెట్టిన శ్రీకృష్ణుడు గోపాలురను ఓదార్చి, తాను గోవత్సములను మళ్ళించుకొని వచ్చెదనని చెప్పి వనములోనికి వెళ్ళెను.

చతుర్ముఖ బ్రహ్మకు ఒక వింత ఆలోచన కలిగెను. అఘాసురుని శ్రీకృష్ణుడు వధించుటను బ్రహ్మ స్వయముగా దర్శించెను. మరణించిరని భావించిన గోపాలురు తిరిగి సజీవులు అగుట బ్రహ్మ ప్రత్యక్షముగా జూచెను. ఇలాంటి మహాద్భుతాలు మరికొన్నింటిని దర్శించవలెనని బ్రహ్మకు భావన కలిగెను. అందువలన వనములో చరించుచున్న గోవత్సములను మాయంచేసి ఎవరికీ గోచరించకుండా దాచివేసెను.

శ్రీకృష్ణుడు లేగదూడలకై వనమంతటా వెదకి చూసెను. కానీ అవి కనబడలేదు. తిరిగి తిరిగి చివరకు తన చెలికాండ్రున్న యమునా సైకతశ్రేణుల వద్దకు వచ్చెను. అచ్చట వారెవ్వరూ కనిపించరైరి. లేగదూడలతోపాటు గోపాలురను కూడ బ్రహ్మ మాయము చేసెను. కన్నయ్యకు ఇదంతా చాలా వింతగా తోచింది. ఇది చతుర్ముఖ బ్రహ్మ యొక్క చర్యయేనని గ్రహించాడు. ఇది తనను వంచించుట గాదనియు, తన లీలలను గాంచుటకొరకే బ్రహ్మదేవుడు ఈ చర్య గావించినాడనియు భగవానుడు గ్రహించి; గోపాలురుగను, గోవత్సములుగను తానే అగుటకు నిర్ణయించుకొనెను.

క॥ గోపాలసుతులు లేరని, గోపికలకుఁ జెప్పనేల? గోపాలకులున్
గోపికలు నలర బాలుర, క్రేపులరూపముల నేఁ జరించెదననుచున్.

అని భావించి తాను ఆయా రూపములుగా మారెను.

మ॥ కరముల్ పాదములున్ శిరంబు లవలగ్నంబుల్ ముఖంబుల్ భుజాం
తరముల్ ముక్కులు గన్నులున్ శ్రవణముల్ దంతాదులున్ దండకాం
బర స్రగ్వేణువిషాణభూషణ వయోభాషాగుణాఖ్యాన మా
త్సరతుల్ వీద్వడకుండఁదాల్చె విభుఁడా వత్సార్భకాకారముల్.

సర్వ స్వరూపములు తానైన శ్రీకృష్ణుడు తన స్వరూపములైన గోవత్సములను, తన స్వరూపులైన గోపాలుర చేత తోలించుచు తాను తన రూపములతో గూడి వేణువు నూదుచు, క్రీడించుచు గృహముల కేతెంచెను.

గోపాలురు వేణువులూదుచుండ వీనులకు విందు నొనగూర్చునట్లుండెను. తల్లులు తమబిడ్డల వేణురవముల నాలకించుచు సంతుష్టచిత్తులై బిడ్డల నెత్తుకొని ముద్దాడసాగిరి.

చ॥ కొడుకుల వేణునాదములు గొబ్బున వీనులకుం బ్రియంబులై
ముడివడ లేచి యెత్తుకొని మూర్కొని తల్లులు గౌఁగలించుచుం
జడిగొనఁ జేపువచ్చి తమచన్నులయందు సుధాసమంబులై
వెడలెడిపాలు నిండుకొను వేడుక నిచ్చిరి తత్సుతాళికిన్.

గోపభామలు శ్రీకృష్ణుని పూర్వమువలెనే ప్రేమించసాగిరి. కానీ పూర్వము తమ బిడ్డలమీదకన్నను శ్రీకృష్ణునిపై గోపభామలకు ఎక్కువ ప్రేమ యుండెడిది. ఇప్పుడు అలాగాక శ్రీకృష్ణునివలెనే తమ బిడ్డలను కూడా చూచుకొనసాగిరి. కృష్ణయ్య పూర్వము గోపభామలయందు మాతృభావము కలిగియుండెను. ఇప్పుడు అలాగాక తాను వారి పుత్రుడనే యను భావము సదా స్థిరపడియుండెను.

ఈ విధముగ గోవత్సముల, గోపాలుర రూపములలో కృష్ణయ్య సంవత్సరకాలము జీవితమును గడిపెను. మానవలోకంలో ఒక సంవత్సరమంటే బ్రహ్మకు త్రుటికాలమని భావము. త్రుటికాలం పూర్తికాగానే మళ్ళీ చతుర్ముఖ బ్రహ్మ కన్నయ్యను చూశాడు.

ఆయన ప్రక్కనే గోపాలురు, గోవత్సములుండుట జూచి విస్మయమొందినాడు. తాను వీరందరిని మాయాశయ్య యందు నిద్రబుచ్చినాడు. వారు ఇప్పటికిని లేవనేలేదు. ఈ గోపాలురు, గోవత్సము లెచ్చటనుండి వచ్చినవి? అని విస్మయమొందినాడు.

ఏవం సమ్మోహయన్ విష్ణుం విమోహం విశ్వమోహనమ్
స్వయైవ మాయయాజోఽపి స్వయమేవ విమోహితః

బ్రహ్మ స్వయముగా మోహము లేనివాడు. కానీ విశ్వమోహనుడైన శ్రీకృష్ణుని మోహపెట్టుటకు యత్నించి, తానే మోహితుడయ్యెను అని శ్రీమద్భాగవతము ప్రవచించింది.

బ్రహ్మదేవుడు చాలాసేపు ఆలోచించాడు. నిజబాలురెవరో, కృష్ణుడు సృష్టించిన బాలురెవరో తెలుసుకొనలేకపోయెను. బ్రహ్మదేవుడు అలా ఆలోచించుచుండగనే వారంతా కృష్ణరూపములతో గోచరించిరి.

చతుర్భుజాః శంఖచక్ర గదా రాజీవ పాణయః
కిరీటినః కుండలినో హారిణో వనమాలినః

వారంతా చతుర్భుజులు. శంఖ, చక్ర, గదా, పద్మములు ధరించినవారు. కిరీటములు ధరించినవారు, చెవులకు కుండలములు ధరించినవారు, హారములు ధరించిన వారునై చక్కగా శోభించుచుండిరి.

ఆ తరువాత బ్రహ్మదేవుడు బాహ్యదృష్టిని పొందెను. మరణించిన వ్యక్తివలె అతి కష్టముతో నేత్రముల దెఱచి తనను, విశ్వమును వీక్షించెను. బ్రహ్మదేవుడు బృందావనము వైపు దృష్టి సారించగానే ఒంటి చల్దిని చేతబట్టుకొని గోవత్సములకై వెదకుచుండిన వనమాలి గోచరించెను. ఆ దృశ్యమును గాంచి పరవశించి పులకాంకితుడైన బ్రహ్మదేవుడు శ్రీకృష్ణుని పాదములపై బడి నమస్కరించెను. ఆనందబాష్పములతో బాలకృష్ణుని పవిత్రపాదద్వయమును అభిషేకించెను. అనేకసార్లు పాదములపై పడుచు లేచుచుండెను. శ్రీకృష్ణుని దివ్యముఖారవిందమును దర్శించుచు స్తుతించసాగినాడు.

సీ॥ శంపాలతికతోడి జలదంబు నైవడి మెఱుఁగుటొల్లియతోడి మేనివానిఁ
గమనీయమృదులాన్న కబళ వేత్ర విషాణ వేణుచిహ్నంబుల వెలయువానిఁ
గుంజావినిర్మిత కుండలంబులవాని శిఖిపింఛవేష్టిత శిరమువాని
వనపుష్పమాలికా వ్రాతకంఠమువాని నలినకోమల చరణములవాని
ఆ॥ కరుణ గడలుకొనిన కడగంటివాని గో పాలబాలుభంగిఁ బరఁగువాని
నగుమొగంబువాని నను గన్నతండ్రిని నిను భజింతు మ్రొక్కి నీరజాక్ష!

అని బ్రహ్మదేవుడు దేవదేవుని స్తుతించెను. తన అపరాధమును మన్నించమని పదేపదే ప్రార్థించెను.

అతః క్షమస్వాచ్యుత మే రజోభువో హ్యజానత స్త్వత్పృథగీశ మానినః
అజావలేపాంధ తమోఽంధ చక్షుష ఏషోఽనుకమ్ప్యో మయి నాథ వానితి

"నేను రజోగుణమువలన పుట్టినవాడ నగుటచేత సహజముగ అజ్ఞానముతో నున్నవాడను. నీ రూపమును తెలుసుకొనలేకపోయితిని. అందుచేత ఈ విశ్వమునకు నేనే ప్రభువునని భావించాను. అహంకారము నా నేత్రములను కప్పివైచినది. 'ఈ బ్రహ్మ నాకు దాసుడు, నా యాజ్ఞను శిరసావహించు భృత్యుడు' అని భావించి క్షమించుము" అని బ్రహ్మదేవుడు బాలకృష్ణుని చెంత మొరపెట్టుకొనెను. ప్రార్థించి బ్రహ్మ తన లోకమునకు తిరిగి వెళ్ళెను.

శ్రీకృష్ణుడు బ్రహ్మదేవుని ఆశీర్వదించి, గోవత్సములను వెంటపెట్టుకొని యమునా తీరమునకు వచ్చెను. శ్రీకృష్ణుని జూచి గోపబాలురు ఆశ్చర్యము నొందిరి. "ఇదేమిటి? నీవు ఇప్పుడేకదా వెళ్ళినావు. అప్పుడే ఎలా రాగలిగితివి కృష్ణా!" అనిరి. వారికి గడచిన ఈ సంవత్సరకాలమంతయు త్రుటికాలమువలె తోచెను.

శ్రీకృష్ణుడు వారిని తీసుకొని గృహమునకు వెడలుచు మార్గమధ్యమున పడియున్న సర్పచర్మమును వారికి చూపించెను. ఇండ్లకు చేరగానే ఈ రోజు శ్రీకృష్ణుడు ఒక పెద్ద సర్పమును చంపి తమను రక్షించినట్లు గోపాలురు చెప్పసాగిరి. కౌమారలీలను పౌగండలీలగా చెప్పుటకుగల కారణమిదియే నని శుకుడు పరీక్షిత్తునకు చెప్పెను.

ధేనుకాసుర వధ

తన బాల్యోచిత క్రీడలచే శ్రీకృష్ణుడు ఎల్లరకు సంతసము నొసగుచుండెను. ఒకనాడు ఒక గోపిక దారిన వెడుతూ కోరికె వెన్న తినిపించుచున్న కృష్ణయ్యను చూచెను. కృష్ణయ్య కొంతసేపు తనదగ్గరే ఉంటూ, తనతోనే ముచ్చటించుచుండిన ఎంతయో బాగుండునని భావించెను.

"కన్నయ్యా! నేను నీరు తెచ్చేందుకు బావి వద్దకు వెళ్తున్నాను. నీవు వస్తావా?" అన్నది.

కృష్ణ:- నేను రాను.
గోపిక:- వెన్న పెడతాను వస్తావా?
కృష్ణ:- ఓ! తప్పక వస్తాను.
(గోపిక ముందు నడచుచున్నది. కృష్ణయ్య వెనుక నడచుచున్నాడు.)
కృష్ణ:- నీ నడక చాలా బావుంది.
గోపిక:- నిజమా కృష్ణయ్యా! నిజమేనా?
కృష్ణ:- అవును నిజమే. (అంటూ నవ్వినాడు.)
గోపిక:- కృష్ణా! నీవు నన్ను హేళన చేస్తున్నావు. నాకు కోపమొచ్చిందంటే నా భర్తతో చెబుతాను

కృష్ణ:- (పక్కున నవ్వి) చెరితే నాకేమి భయము? నాకు భర్త లేడుగా?

గోపిక నవ్వును ఆపుకోలేకపోయింది. బావిదగ్గర కన్నయ్య నిలబడి ఉన్నాడు. గోపిక నీళ్ళు తోడుకుంది. నీటి కుండలను తలమీద పెట్టుకుంటూ సహాయము చేయుమని కన్నయ్యను అర్థించింది.

గోపిక:- కన్నయ్యా! నీటికడవ నెత్తికెత్తవా?

కృష్ణ:- నేను ఎత్తను. నీతోడుగా వస్తానన్నానేగాని నీకు కడవ ఎత్తుతానని చెప్పానా? అన్నాడు. (గోపిక ఎలాగో కష్టపడి కుండ నెత్తిన పెట్టుకొన్నది. ఇద్దరూ నడుస్తున్నారు. ఇల్లు చేరారు.) "కన్నయ్యా! ఈ కుండ దింపుతావా?" అన్నది గోపిక. "ఓ! తప్పక దింపుతాను" (అంటూ ఒక బల్లపైకి ఎక్కి నీటికడవలను దించినాడు.)

గోపిక:- కన్నయ్యా! బావివద్ద కడవ ఎత్తమంటే నావల్ల కాదన్నావు. ఇక్కడ దించమంటే సరే నన్నావు. ఏమిటీ విచిత్ర ధోరణి!

కృష్ణ:- విచిత్రమూలేదు; వైషమ్యమూ లేదు; న్యాయమైన పని చేయుటకు నేను ఎప్పుడూ నిరాకరించను. కానిగాని పనిని నేను ఎప్పుడూ చేయను. నేను బరువులు దించే వాడినేగాని ఎత్తేవాడను గాను" అంటూ చకచక వెళ్ళిపోయాడు.

భక్తులైనవారి బరువులు దించుటయే భక్తవత్సలుడైన కృష్ణయ్య పని.

శ్రీకృష్ణుని చెలికాండ్రలో శ్రీదాముడు, గోపాలుడు, సుబలుడు మొదలగు బాలురుండెడివారు. ఒకనాడు వారు బలరామకృష్ణులను సమీపించి, అక్కడికి కొద్దిదూరంలో తాళవనం ఒకటి ఉన్నదనియు, అందులో అధికము తాటిపండ్లు బహుమధురముగా యుండుననియు తెలిపిరి. ఆ వనములో ధేనుకుడను గార్దభరూపుడైన రాక్షసుడున్నాడనియు, అతడు ఆ పండ్లను తీసుకోనివ్వక అందరిని బాధపెట్టుచుండుననియు తెలిపిరి. సుగంధము వెదజల్లు ఆ తాటిపండ్లను ఆరగించవలె ననెడి కుతూహలము అందరికీ యున్నను, ధేనుకాసురునికి భయపడి ఎవ్వరూ ఆ వనములో ప్రవేశించుటలేదని తెలిపిరి.

ప్రయచ్ఛ తాని నః కృష్ణ గన్ధ లోభిత చేతసామ్
వాంఛాస్తి మహతీ రామ గమ్యతాం యది రోచతే

"కృష్ణా! మా మనస్సు ఆ ఫలములను ఆశించుచున్నది. ఆ వాంఛ తీవ్రతరమగుచున్నది. రామా! మీరు అంగీకరించినచో బయలుదేరుదము" అని పలికిరి.

స్నేహితుల కోర్కెలను నెరవేర్పవలయునని బలరామకృష్ణులు నిర్ణయించుకొని మిత్రులతో కూడి తాళవనమున ప్రవేశించిరి.

తాళవనమున ధేనుకాసురు డనువాడు గార్దభరూపముతో నున్నాడు. అతడు తనదికాని తాళవనమును ఆక్రమించుకొని యున్నాడు. పైగా అందులోనికి ఎవ్వరిని రానివ్వడు. స్వార్థముతో, లోభముతో గార్దభమువలె జీవించుచున్నాడు.

తనదిగాని దానిని ఎవ్వడైతే అనుభవించవలెనని కుతూహలపడునో వాడే ధేనుకాసురుడు. అనగా ఇతరుల సొమ్మును వాంఛించువాడు గాడిదయై పుట్టును.

తాళవనములో పండ్లు కుళ్ళిపోయినను ఇతరులకు పెట్టడు. అట్టివాడు రాబోవు జన్మలో గాడిదయై పుట్టును. ధనము చెడ్డదికాదు, ధనాశ చెడ్డది. ఆశకు అంతము ఉండదు. దేహము శ్మశానంలో కాలిపోవును. కాని ఆశ మాత్రము జన్మాంతరములో కూడా ప్రవేశించును. మితిమీరి ధనమును నిలువచేయు అసురుడే ధేనుకుడు. గాడిద వంటివాడు.

కొందరు ఆలయములకు ధర్మకర్తలై ఆలయ సొమ్మునంతా మ్రింగివేయుదురు. మరికొందరు సేవాసంస్థలకు, ఆశ్రమాలకు అధిపత్యం వహించి, కుబేరులవ్వాలని ప్రయత్నిస్తుంటారు. ఆ తెగ అంతయూ వచ్చే జన్మలో గార్దభములై జన్మిస్తారు. పరులకి సంబంధించిన వస్తువుపై మమకారమును పెంచుకొనువాడే ధేనుకాసురుడు.

తాళవనములోనికి రామకృష్ణులు ప్రవేశించారు. బలరాముడు బలమైన తన బాహువులచే తాటిచెట్లను ఊపి ఫలములను క్రింద పడవేయసాగినాడు. పండ్లు క్రింద పడుచుండెను. ఆ శబ్దము నాలకించి, భూమిని కంపింప జేసెడి వేగముతో ధేనుకాసురుడు అచ్చట కరుదెంచెను.

దురాత్ముడగు ఆ రాక్షసుడు వేగముగా వచ్చి వెనుక కాళ్ళతో బలరాముని రొమ్ముమీద తన్ని గాడిద వలె అరచుచు అటు నిటు పిచ్చివానివలె పరుగులిడసాగెను.

క్రూరస్వభావులు సత్యాసత్యములను పరికించరు, పరిశీలించరు. ధేనుకాసురుడు రాగానే ఏమి విచారించకనే బలరాముని తన్నెను. అదికూడా వెనుకకాళ్ళతో తన్నెను. అసురుడైనవాడికి ముందుచూపు ఉండదు. ప్రతి పనిని ముందుచూపు లేకుండానే ఆచరించును.

మళ్ళీ ధేనుకాసురుడు అరుదెంచి ఈసారికూడా వెనుకకాళ్ళతో బలరాముని తన్నజూచెను. బలదేవుడు ఆలోచించెను. ఇది ఇక ఆలస్యము చేయగూడని పనియని గ్రహించెను. వెంటనే ఆ ధేనుకుని రెండు కాళ్ళను పట్టుకొని గిరగిర త్రిప్పెను. ఆ వేగానికి రాక్షసుడు ప్రాణములను వదిలెను. చచ్చినవాడని తెలిసిన తరువాత వానిని తాటి చెట్టుపైకి విసరెను. ఆ బరువును తట్టుకోలేక ఆ తాటిచెట్టు మరియొక చెట్టుపై పడెను. ఆ చెట్టు ఇంకొక చెట్టుపై బడెను. కొద్దిసేపటిలో తాళవనమంతా బీభత్సమాయెను.

స్వార్థజీవనానికి అంత్యక్రియలు ఎప్పుడూ ఇలాగే ఉంటాయి. పరుల ధనముతో జీవించేవాడు ఈ తాళవనములో ధేనుకునివలె ఏకఛత్రాధిపత్యమును సాగిస్తుంటారు. క్షణదశ రాగానే ఒకేసారి సర్వము కూలిపోతుంది. రాలిపోతుంది. మేడలు పడిపోతాయి. ఓడలు తిరుగబడతాయి. బ్రతుకు నీడను కూడా కోల్పోతుంది.

మనము నిత్యజీవితములో ఎందరినో చూస్తుంటాము. పరుల డబ్బులో కులుకుతూ తమను మించినవారు లేరంటూ విర్రవీగి తిరుగుతుంటారు. క్షీణదశరాగానే సమస్తమును కోల్పోయి దవాదారుల వెంబడి పిచ్చిగాళ్ళవలె తిరుగుతుంటారు. మనం మానవులం. మనోబుద్ధులున్న వాళ్ళం. పశుపక్ష్యాదుల కన్నా హీనంగా జీవించకూడదు.

దేహాభిమానంతో కూడినవాడై స్వార్థజీవనమును సాగించువాడే ధేనుకాసురుడు. పశుబలముతో విర్రవీగువాడు. అట్టివాడు బలదేవుని చేతిలో వధించబడును. నీవే

బలాఢ్యుడవని, పంచప్రాణవంతుడవని భావించి, అరాచక కృత్యముల నాచరించుచుండువు. అతిబలవంతుడైన దేవుడు నిన్ను చూచుచునే యున్నాడు. అతడే బలదేవుడు. అతడు కాలాన్ని చూసి కదలివచ్చును. కనికరించకుండా కాటికి నడిపించును.

ధేనుకుని మరణవార్తను విని అతని బంధువులు ఏతెంచి, బలరాముని వధింప జూచిరి. బలరామకృష్ణు లిరువురును విజృంభించి వారినందరిని వధించిరి. ధేనుకాసురుని వధించగానే దేవతలు పుష్పవర్షమును కురిపించిరి.

ఆనాటి నుండియు తాళవనమున మనుష్యులు నిర్భయముగా సంచరించసాగిరి. గోవులు సంతోషముతో తిరుగాడసాగినవి.

బలరామకృష్ణులు మిత్రులతో కూడి వ్రజభూమికి కదలి వచ్చుచుండిరి. వారి చెలికాండ్రు ధేనుకాసురవధను స్మృతికి దెచ్చుకొని పరవశించుచు శ్రీకృష్ణుని స్తుతించసాగిరి.

కృష్ణః కమల పత్రాక్షః పుణ్యశ్రవణ కీర్తనః
స్తూయ మానోఽనుగైర్గోపైః సాగ్రజో వ్రజమా వ్రజేత్

పుణ్యశ్రవణ కీర్తనుడైన శ్రీకృష్ణుడు బలరామునితో కూడి వ్రజపురమున ప్రవేశించెను. అనుచరులైన గోపాలురు ఆనందములో శ్రీకృష్ణుని స్తుతించసాగిరి.

కాళియ మర్దనము

బృందావనమునకు కొద్దిదూరాన కాళియమడుగను సరస్సొకటున్నది. తీగలతో, చెట్లపొదలతో క్రిక్కిరిసియున్న ఆ మడుగునందు జలము బురదతో నిండి మురికిగా ఉంటుంది. అందు కాళియుడను భయంకర సర్పరాజుండెడివాడు. అతడి ఉనికిచే విషతుల్యమైన సరస్సులో గోవులకు, గోపబాలుర ప్రాణములకు ముప్పు వాటిల్లుచుండెడిది. కాళియుని గూర్చిన చింతనతో వ్రజవాసులెల్లరు భయభ్రాంతులకు గురియై జీవించెడివారు.

తనకు శరణాగతులై జీవించెడి గోపవాసుల మానసములయందు నిండియున్న భయభ్రాంతులను అంతమొందింపచేయ సంకల్పించినాడు శ్రీకృష్ణుడు.

మ॥ కటిచేలంబు బిగించి పింఛమునఁ జక్కంగొప్పు బంధించి దో
ర్తట సంస్ఫాలన మాచరించి చరణద్వంద్వంబుఁ గీలించి త
త్కుట శాఖాగ్రముమీఁదనుండి యుఱికెన్ గోపాలసింహంబు ది
క్తటముల్ మ్రోయ హ్రదంబులో గుభగుభ ధ్వానంబనూనంబుగన్.

తోటి గోపబాలురు వీక్షించుచుండగ కాళియమడుగులో దూకినాడు. బలాఢ్యుడైన కాళియుడు శ్రీకృష్ణునిపైకి పడగలెత్తి విజృంభించాడు. బాలకృష్ణుడు చలించలేదు. అకుంఠిత ధైర్యసాహసముతో కాళియుని ఎదుర్కొని పోరాడాడు. ఇరువురి మధ్య

భయంకర పోరాటముజరిగి, చివరకు కాళియుని శక్తి సన్నగిల్లింది. శ్రీకృష్ణుని దివ్యమయ శక్తి అనుభవానికి అందినది. కాళియుడు శిరమెత్తి నమస్కరించాడు. శ్రీకృష్ణుడు కాళియుని శిరముపై నిలబడి నాట్యముచేయుచూ మడుగు ఉపరితలముపైకి వచ్చెను. భయకంపిత విషాదమనస్కులై నిలబడియున్న నందయశోదలకు, గోకులవాసులకు అద్భుత దర్శన మొసంగి, ఆశీర్వదించాడు. నాగపత్నులు శ్రీకృష్ణుని స్తుతించారు. కాళియుని భాగ్యమును కొనియాడారు.

మ॥ బహుకాలంబు దపంబు పేసి వ్రతముల్ పాటించి కామించి నీ
మహనీయోజ్జ్వల పాదరేణుకణ సంస్పర్శాధికారంబు శ్రీ
మహిళారత్నము దొల్లి కాంచె నిదె వేమం బేమియున్ లేక యీ
యహి నీపాదయుగాహతిం బడసె నేఁ డత్యద్భుతం బీశ్వరా!

అని శ్లాఘించిరి. అట్టి తేజోమయ అపురూప దివ్య దర్శనమును గాంచిన వ్రజవాసుల నేత్రములవెంట ఆనంద బాష్పములు రాలాయి. దేవదేవుని ఆ లీలా వైభవ దృశ్యమును హృదయమున భావించగానే భక్తులకు నేడు కూడా ఆనందబాష్పాలు రాలుతూనే ఉంటాయి.

సంసారమే కాళియమడుగు. ఆ మడుగులోనున్న తీగలే సంసారములోని ఇక్కట్లు. అందులోని చెట్లపొదలే మనిషిని ముందుకు పోనివ్వక నిరోధించే సంసార తాపత్రయము. ఆ మడుగునందు కనిపించే బురదయే సంసారమునందలి వ్యామోహము. మడుగునందు నివసించు కాళియుడే సాంసారిక జీవన సరోవరములో దాగియున్న భ్రాంతి. కాళియుని నిర్వీర్యం చేయడమే శ్రీకృష్ణుని వైభవము. కాళియుడు శక్తి హీనుడు కాగానే అంతవరకున్న భయభ్రాంతులు దూరమవుతాయి. కాళియునిపై నిలబడి శ్రీకృష్ణుడు నాట్యము చేసినట్లే మనము కూడా భ్రాంతిని కాళ్ళక్రింద త్రొక్కి, జీవన నృత్యమును సాగించాలి. భ్రాంతిని నిస్సారంగా మార్చాలి. కోరలు తీయబడిన తరువాత కాళియుడు మడుగులో యున్నను అపాయమెలా కలుగదో, అహంకారము తొలగిన తరువాత జీవుడు సంసారము నందున్నను మోహితుడు కాడు. బాహ్యానికి మడుగులో యున్న కాళియుని మదమణచి నాడు. ప్రతిఒక్కరు తమ అంతర్యంలో నిండియున్న సంసారభ్రాంతి యనెడి కాళియుని మద మణగించమని ప్రదర్శించి, కృష్ణయ్య ప్రవచించాడు.

కృష్ణయ్య కాళియుని అనుగ్రహించెను. "కాళియుడా! గరుడుని భయముచేత నీవు రమణక ద్వీపమును వదలి ఈ మడుగు నాశ్రయించితివి. ఇకమీదట నీకు ఆ భయము ఉండనవసరంలేదు. నా పాదముద్రలు నీ శిరమున ఉండుటవలన గరుడుడు ఇక నిన్ను బాధించడు" అని చెప్పెను. కాళియుడు సంతసించెను.

పూర్వము గరుత్మంతుడు సర్పములను చంపి తినుచుండెడివాడు. సర్పములన్నియు గరుడుని సమీపించి, తమను చంపవలదనియు, దానికి బదులుగా ప్రతిమాసము పూర్ణిమనాడు ఒక సర్పమును ఆహారముగా పంపగలమని ఒడంబడికను ఏర్పరచుకొన్నారు. గరుడుడు సంతృప్తిచెందినవాడై ఆ ఒడంబడికకు కట్టుబడి ప్రవర్తిస్తుండెడివాడు. ఒక

మాసములో కద్రువ కుమారుడైన కాళియుని వంతు వచ్చినది. కాళియుడు బలాఢ్యుడు. తానే బలవంతుడననెడి గర్వముతో జీవించెడివాడు. గరుడునికి తాను ఆహారంగా వెళ్ళుటకు నిరాకరించాడు. ఈ విషయము గరుడునికి తెలిసింది. కాళియ గరుత్మంతుల మధ్య తీవ్రంగా పోరాటము జరిగినది. గరుడుని అనంత బలపరాక్రమముల ముందు కాళియుని శక్తి నిరుపయోగమైంది. ప్రాణములు దక్కుతాయనే ఆశ సన్నగిల్లింది. వెంటనే కాళియుడు పలాయనం చిత్తగించాడు. యమునా నదీజలం నిలువయుండే ఒకమడుగులో తలదాచుకున్నాడు. అదియే కాళియమడుగు. ఆ మడుగులోకి గరుడుడు ప్రవేశించలేడు. ఏ కారణముచేతనయితే గరుడుడు ఆ మడుగులోకి ప్రవేశించలేడో, ఆ కారణము తనకు తెలిసియుండుటచేత, అక్కడయితే తనకు ప్రాణభయము ఉండదని గ్రహించిన కాళియుడు తన కుటుంబముతో సహా ఆ మడుగులోకి ప్రవేశించినాడు.

గరుడుడు గతంలో ఒకనాడు ఆ మడుగులో చేపను పట్టుకొన్నాడు. ఆ దృశ్యమును గాంచిన మడుగులోని ఇతర చేపలు విషాదముతో కుమిలి పోసాగాయి. అది చూసిన సౌభరి మహర్షి ఆ చేపను తినవద్దని గరుత్మంతునికి చెప్పాడు. అయినా గరుడుడు చేపను వదలలేదు. మిగతా చేపలను రక్షించవలయునని అభిప్రాయపడిన కరుణామూర్తియగు సౌభరి మహర్షి "ఇక మీదట నీవు ఈ మడుగులో ప్రవేశించినచో మృత్యువాత పడగలవు" అని శపించాడు. ఆ విషయం కాళియునికి తెలియుటచేత వెంటనే వెళ్ళి ఆ మడుగులో తల దాచుకున్నాడు.

కరుణాసముద్రుడైన శ్రీకృష్ణుడు దరహాస వదనముతో "కాళియుడా! ఇక మీదట నీవు ఈ మడుగులో ప్రవేశించకు. నీ స్వస్థానమునకు చేరుము. నీపై గరుడునకున్న కోపము నాకు తెలియును. నీ శిరముపై నా పాదముల జాడలుండుటచేత గరుడుడు నిన్ను చంపడు" అని తెలియచేయగా కాళియుడు సంతృప్తి చెందినవాడై కుటుంబ సమేతంగా యమునా జలమునకు దూరంగా వెళ్ళిపోయాడు.

కాళియుడు మడుగులోనికి ప్రవేశించినట్లు, మనమంతా కూడా సంసారమనే మడుగులోకి ప్రవేశించియున్నాము. కాళియుని మనుగడవలన మడుగు విషతుల్యమైనట్లు, అభిమాన రాగద్వేషాది వికారచిత్తులమైన మనము గృహస్థజీవనాన్ని కాలుష్యంగా తయారు చేసుకున్నాము. కాళియుని వలె మనము కూడా ఈ సంసార మడుగును వదలిపెట్టి వెళ్ళవలసిన సమయమొకటి రానేవస్తుంది. శ్రీకృష్ణుని అడుగుజాడలు తన పడగలపై యున్నందున కాళియుడు గరుడుని వలన కలుగు ఆపదను తప్పించుకున్నట్లు; శ్రీకృష్ణ పదపంకజములను సదా మన మనస్సులో ధరించి యుండినచో, యముడి బారినుండి బయటపడి, మృత్యువును దాటి అమృతత్వమును పొందగలము.

దావానల భక్షణం

కాళియమర్దనము జరిగిననాటి రాత్రి నందాదులు యమునా తీరమునందే ఉండిపోయిరి. ఆ రాత్రి వేసవి వడగాడ్పులకు వనప్రదేశమున దావాగ్ని రగుల్కొన్నది.



కాళీయుని భాగ్యము

అర్ధరాత్రి సమయాన నలువైపులనుండి అగ్నిజ్వాలలు బయలుదేరినాయి. వ్రజవాసులెల్లరు భయభ్రాంతులకు లోనై శ్రీకృష్ణుని శరణుజొచ్చి, ప్రార్థించారు.

కII నీపాదంబులు నమ్మిన, నాపద లెక్కడివి జనుల కత్యుగ్రమహా
దీపితతాపజ్వలనము, పైపడకుండెడివిధంబు భావింపఁగదే.

ప్రాణభిక్ష పెట్టమని అర్థించారు. శ్రీకృష్ణుడు చిరునవ్వునవ్వి, ఆ దావాగ్నిని నోటితో శ్వాసపీల్చునట్లు తీసుకొని మ్రింగేశాడు.

జీవితారణ్యములో అభిమాన వేసవి అందించే రాగద్వేష వడగాల్పులకు అశాంతియనెడి దావాగ్ని రగుల్కొంటుంది. ఒక్క క్షణకాలముకూడా జీవికి స్థిరత్వము లేకుండా చేస్తుంది. అట్టికాలమే మనజీవితములో నిశాసమయము. అదియే అర్థరాత్రి సమయము. గాఢ చీకటి యనెడి నిరాశతో నిండుకున్న జీవిత దుర్దశ. అలాంటి క్లిష్టపరిస్థితిలో మన ప్రయత్నము కన్నను దైవసహాయమే ముఖ్యంగా మనల్ని రక్షిస్తుంది. భగవంతుని శరణుజొచ్చుగానే దీన దయాళుడైన భగవానుడు మనలను భయరహితులను చేసి అశాంతి యనెడి కారుచిచ్చును మ్రింగి మనకు శాంతిని ప్రసాదిస్తాడు.

ప్రలంబాసుర వధ

ఒకనాడు కంసుని భృత్యుడైన ప్రలంబుడనెడి రాక్షసుడు శ్రీకృష్ణునికి కీడుచేయుటకై బృందావనమునకు అరుదెంచెను. అతడు గతములో శ్రీకృష్ణుని చేత వధించబడిన తృణావర్తుని సోదరుడు.

అతడు గోపరూపమును ధరించి వచ్చెను. ప్రలంబుడనగా వంచకుడు అని భావము. భగవంతుని వంచనతో పట్టలేము. ప్రలంబుడు గోపబాలునివలె వచ్చి, శ్రీకృష్ణునితో కలిసి ఆడుటకు ఉపక్రమించెను.

ఈ విషయమును శ్రీకృష్ణుడు కనిపెట్టెను. గోపాలురను పిలిచి క్రీడించుటకు ఉపక్రమించెను. బాలురందరిని పిలిపి రెండు జట్ల క్రింద విభజించెను. ఒక జట్టుకు బలరాముడు నాయకుడు కాగా, మరియొక జట్టుకు కృష్ణయ్య నాయకుడయ్యెను. ఈ క్రీడలో గెలిచినవారిని ఓడినవారు భుజముపై నెక్కించుకొని మోయవలెను. బలరాముని పక్షములోని శ్రీదాముడు, వృషభుడు, బలరాముడు ఆటలో గెలిచిరి. శ్రీకృష్ణుడు ఓడిపోయెను. క్రీడ షరతు ననుసరించి శ్రీకృష్ణుడు శ్రీదాముని, భద్రసేనుడు వృషభుని, గోపరూపమున నున్న ప్రలంబుడు బలరాముని మోయుచుండిరి.

ఇంతకుమించిన అవకాశమురాదని భావించిన ప్రలంబుడు బలరాముని అపహరించి గొనిపోవుచుండెను. అది గ్రహించిన బలదేవుడు ఒక్క పిడికిలి పోటులో రక్తము గ్రక్కునట్లు కొట్టి ప్రలంబుని వధించెను.

వజ్రాయుధ... ప్రలంబుడు క్రిందపడి మరణించెను.

కం॥ హాలధరుబలుపిడికిటి వ్రేటఁ దల పగిలిన రుధిరజలము దనువివరములం
దొలఁక మొఱయిడుచు దనుజుఁడు బలరిపు పవి విహత నగము పగిదిం బడియెన్.

ప్రలంబాసురుడు మరణించగానే దేవతలు పుష్పవర్షమును కురిపించిరి.

ఆధ్యాత్మిక జీవనములో వంచన పనికిరాదు. ద్వంద్వ మనస్తత్వము దైవమును లోబరచుకోలేదు. అందుచేతనే ప్రలంబుడు శ్రీకృష్ణుని పట్టలేక పోయాడు. వంచన తెలియని వ్యక్తియే ఆత్మానుభూతి నొందును. మన బ్రతుకును వంచనయే మోయుచున్నది. బలరాముని వలెనే ఎవరయితే వంచనను వీడి చరింతురో అట్టివారు భగవత్కృపకు పాత్రులై తరింతురు.

ఒకనాడు గోపబాలురందరూ యమునాతీరమున ఆటలాడుకొనుచుండిరి. గోవత్సములు మేయుచుండెను. తృణసంపాదనకై గోవత్సములు కదలుచు కదలుచు ఆ వనమును దాటి మరియొక వనమున ప్రవేశించినవి. గోవత్సములు కనిపించుటలేదని గుర్తించిన గోపబాలురు నలువైపుల వెళ్ళిచూసిరి. కానీ గోవత్సముల, గోవుల జాడ తెలియలేదు. గోష్పదముల ననుసరించుచు గోపబాలురు ముందునకు కదలసాగిరి. ముంజారణ్యమున గోవత్సములు, గోవులు దారితప్పి ప్రవేశించియుండుటను కనుగొనిరి. గోపబాలురు తిరిగి తిరిగి అలసిపోయియుండిరి. శ్రీకృష్ణుడు గోవుల వివిధనామములతో మేఘ గంభీర రవములో పిలిచెను. అవి అంబాయని ప్రతిధ్వని నందించినవి.

ఇంతలోగా అడవులను దహించే దావాగ్ని ప్రజ్వరిల్లింది. దానికి భయంకరముగా వాయువు తోడైనది. దారుణంగా వనప్రదేశమును దగ్ధము చేయుచు కదలి వచ్చుచుండిన దావాగ్ని నలువైపులనుండి రాసాగింది. గోపబాలురు దిగ్భ్రాంతి చెందినారు. శ్రీకృష్ణుని శరణు జొచ్చినారు.

శా॥ ఓ చుట్టాలకు నాపదల్ గలుగునే నే మెల్ల నీవార మ
వ్యాపారంబు లెఱుంగ మీశుఁడవు మా కా భీలదావాగ్ని నేఁ
డే చందంబున నింక దాఁటుదుము మమ్మీక్షించి రక్షింప న
న్నా! చంద్రాళీ! విపన్నులన్ శిఖిశిఖావచ్ఛన్నులన్ ఖిన్నులన్.

వారి ప్రార్థన నాలకించిన శ్రీకృష్ణపరమాత్మ, వారికి అభయదాన మొసంగెను. "మీరు భయపడకండి. మీరు ఒక్క క్షణము నేత్రములను మూసుకోండి" అనెను. వారు అలాగే నేత్రములను మూసుకొనిరి. వెంటనే శ్రీకృష్ణుడు ఆ దావాగ్నిని అమాంతంగా మ్రింగివేశాడు.

వారు కన్నులను తెరచి చూచిరి. మహాభయంకరమైన దావానలంనుండి బయటపడినట్లు భావించిరి. శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడే యని వారికి ఆ సమయమున అనిపించింది.

కం॥ కార్చిచ్చార్చుపటుత్వము, నేర్చునెవరుఁ డొకఁడు శౌరినేడిదెకార్చి
చ్చార్చి మనలరక్షింపఁగ, నేర్చెనితండజుఁడొ హరియొ విటలాక్షుండో.

అని బాలురందరు కన్నయ్యను ప్రశంసించారు.

గోపబాలురు బదరికావనంలో గోవులను మేపుచుండిరి. మనం నివసించు ప్రదేశమే బదరికావనము. అందులో సదా దుఃఖాగ్ని రగుల్కొంటూనే ఉంటుంది. బాహ్యదృష్టిగల వారికి నిరంతరము ఆ బడబాగ్ని ప్రాణభయమును కల్పిస్తూనే ఉంటుంది. దుఃఖపూరిత బాహ్యదృశ్యాల్ని వీక్షించకుండా నేత్రాలు మూయుమని శ్రీకృష్ణుడు గోపబాలురను హెచ్చరించాడు. వారు కళ్ళు తెరవగానే భయకంపిత దృశ్యాలు అదృశ్యమై సుందర దృశ్యాలు గోచరించాయి.

మనము బాహ్య వస్తుదర్శనమును వీడి అంతర్ముఖం కావాలి. అంతర్యంలో ఆత్మదృష్టి ఏర్పడగానే దృష్టి జ్ఞానాకార మవుతుంది. దృష్టి ఎప్పుడయితే జ్ఞానాకారమయిందో వీక్షించబడే సృష్టి మంగళకరమై బ్రహ్మాకారంగా గోచరిస్తుంది. బ్రహ్మ దర్శనముతో మాయ పటాపంచ లవుతుంది.

సాయంత్రానికి గోవులను తోలుకుని వ్రజపురమునకు అరుదెంచినారు. శ్రీకృష్ణ వియోగదుఃఖముతో బాధపడుచుండిన గోపభామలు శ్రీకృష్ణ దర్శనభాగ్యముచే తృప్తిచెందిన చిత్తము గలవారైరి.

గోపికల మనస్సు శ్రీకృష్ణునిలో లయించింది. వారికి కృష్ణుని కన్నా మరోవస్తువు గోచరించదు. కృష్ణసాన్నిధ్యములో సాగర పూర్ణహృదయులై తన్మయులై ఉండటము, కృష్ణ విరహములో అతిదీనులై దుఃఖించడము; ఇంతకుమించి రెండవ విషయము వారికి తెలియదు. సర్వులను సమ్మోహింపజేసిన ఆ మోహనాకారుడు సర్వులచే వందనీయుడై ఉన్నాడు.

మన్దారమూలే మదనాభిరామం బిమ్బాధరాపూరిత వేణునాదమ్
గోగోప గోపీజన మధ్యసంస్థం గోపం భజే గోకుల పూర్ణచన్ద్రమ్

మందారవృక్షము చెంత నిలబడి మదనుని మరిపించువాడును, దొండపండువంటి పెదవిచే కదలించబడిన వేణునాదము కలవాడును; గోవులకు, గోకులవాసులకు పూర్ణచంద్రుని వంటివాడును అగు గోపరూపుడైన శ్రీకృష్ణుని భజింతును.

శరదృతు వర్ణనము

దశమ స్కంధమున ఇప్పటివరకు మనము పంతొమ్మిది అధ్యాయములను ముగించుకొన్నాము. ఇది ఇరువదియవ అధ్యాయము. ఈ అధ్యాయమునందు వర్ష శరదృతువుల శోభ వర్ణింపబడినది. ఈ అధ్యాయమును దాటగానే మనము వేణుగానము, గోపికావనములో ప్రవేశింతుము. అట్టి అమోఘభరితమైన రాసలీల ప్రవేశానికి ముందు రమణీయమైన ప్రకృతి శోభను వివరించుట జరుగుచున్నది. ఈ అధ్యాయమున కథలేదు. కథామృత మున్నది. జిజ్ఞాసువులారా! ఆస్వాదించండి.

వర్షాకాలము మానవ జీవితమునకు సందేశ పీయూషధార నందించును. సూర్యుడు ఎనిమిది మాసముల కాలము భూమినుండి నీరు అనెడి ఐశ్వర్యమును గ్రహించును. వర్షాకాలము రాగానే దానిని విడుచును. జగత్తునకు కలిగిన తాపమును తొలగించి, తృప్తి నిచ్చుటకు మేఘములు ఎలా క్రిందికి దిగుచున్నవో, అజ్ఞాన తాపముచే దుఃఖితులగుచున్న మానవాళికి; శాంతిని, సుస్థిరతను ప్రసాదించుటకు మహాత్ములు తమ స్థాయినుండి క్రిందికి దిగుతారు.

గ్రీష్మతాపమువలన పుడమితల్లి శరీరము కంపించును. మేఘములు వర్షించగనే తడిసి పుష్టి చెందును. అలాగే తాపసుల శరీరములుకూడా తపస్సు చేయుకాలమున క్షీణించి, ఫలము సిద్ధించగనే పుష్టినొందును.

నిశా ముఖేషు ఖద్యోతా స్తమసా భాన్తి న గ్రహాః
యథా పాపేన పాషణ్డా న హి వేదాః కలౌ యుగే

కలియుగమునందు నాస్తికులైన పాషండులతోపాటు నాస్తిక బోధలుకూడా ఎక్కువగా నుండును. వేదఘోష వినబడదు. అలాగే వర్షాకాల సంధ్యాసమయమునందు చీకటిపురుగులు సంచరించుచు ప్రకాశించునేగాని, గ్రహాదులు ప్రకాశించవు.

నిత్య కర్మానుష్ఠానము విడచి విశ్రాంతిని గైకొనుచున్న విప్రులు గురుదేవుని పిలుపు నాలకించి వేదాధ్యయనమును ప్రారంభించునట్లు; ఇంతవరకు శబ్దరహితంగా పడియున్న మండూకములు మేఘనాదము నాలకించి అవికూడా ధ్వని చేయసాగెను.

ఆసన్నుత్పథ గామిన్యః క్షుద్ర నద్యోఽను శుష్యతీః
పుంసో యథా స్వతంత్రస్య దేహ ద్రవిణ సంపదః

ఇంద్రియ చపలత్వముగల పురుషులయొక్క, శరీరములు, వారి ఐశ్వర్యము చెడుమార్గమున పయనించునట్లు, గ్రీష్మతాపముచే శుష్కించిన చిన్నచిన్న నదులు వర్షములచే విజృంభించినవియై కట్టలు త్రెంచుకొని ఇష్టమువచ్చినట్లు పయనించును.

హరిసేవనమువలన జీవుడు ఉత్తమగతిని పొందునట్లు, జలములుండు ప్రాంతమున నివసించెడి ప్రాణులు మాత్రమే నూతన జలముల ననుభవించి సుందరరూపమును పొందును.

భగవద్భక్తులగువారు ఎన్ని బాధలు వచ్చినను చలించకుండా యుండునట్లు, పర్వతములు కూడా తీవ్రవర్షము తమపై పడుచుండినను దుఃఖము ననుభవించుట లేదు. కృశించుటలేదు.

వేశ్యలు గుణవంతులైన పురుషులపట్ల నిత్యానురక్తులు కానట్లు, మెఱుపులు కూడా లోకహితమొనర్చు మేఘములయందు స్థిరముగా నుండుటలేదు.

తననుండి ఆవిర్భవించిన అజ్ఞానముచేత జీవుడు తానే కప్పబడియుండునట్లు, చంద్రుడుకూడా తనకాంతులచే శోభించు మేఘములచే గప్పబడియున్నాడు.

సంసారమనెడి అగ్నిలో కాల్చబడిన జీవులు; పరమ పవిత్రులైన భాగవతుల సంసర్గముచే శాంతచిత్తులైనట్లు, నెమళ్ళుకూడా మేఘముల రాకచే సంతసించినవియై ఆనందమును వ్యక్తము చేయుచున్నవి.

కలియుగమున నాస్తిక ప్రలాపములచేత సత్యమార్గము దారితప్పినట్లు, వర్షముయొక్క ప్రవాహావేగమునకు ఆనకట్టలన్నియు తెగిపోవుచున్నవి.

పురోహితుల సదుపదేశములచేత ప్రభావితులైన పాలకులు దానము లొనర్చుచు ప్రజలను ఆనందింప చేయునట్లు, గాలియనెడి పురోహితునిచే ప్రభావితమైన మేఘమనెడి పాలకుడు దానమనెడి వర్షమును అందించుచున్నాడు.

సీ॥ విశ్వమోహన మైన వేణునినాదంబు సరసగంభీర గర్జనము గాఁగ
మహనీయ నిర్మల మందహాసద్యుతి లలిత సౌదామనీ లతిక గాఁగ
దలచుట్టు బాగుగఁ దవరు పింఛపుదండ శైలభేదనశరాసనము గాఁగ
కరుణాకటాక్ష వీక్షణసుధావర్షంబు సలిలధారా ప్రవర్షంబు గాఁగ
ఆ॥ జాడ వేతెంచు గోపాల జనమునీంద్ర చాతకంబుల దురవస్థ చక్కఁజేసి
కృష్ణమేఘంబు బహుళతరకీర్తి నొప్పె విమలబృందావనాకాశ వీధియందు.

హృదయంగమమైన, మధురమైన, మనోహరమైన ఈ పద్యము మహాభక్తుడైన పోతనామాత్యుని అపూర్వరచన. వ్యాసభాగవతమున ఈ విషయ ప్రసక్తి లేదు.

వర్షాకాలం వదలింది. కరిగింది. శరత్కాలము చిగురించింది. పెరిగింది. దుర్జనులగువారి అంతఃకరణ భక్తిద్వారా శుద్ధిపడి సహజస్థితికి వచ్చునట్లు; వర్షాకాలమున కలుషితమైన జలపూర్ణ సరోవరములు, శరత్కాలమునందు పద్మముల పుట్టుకవలన నిర్మలములైనవి.

కృష్ణభక్తి నాలుగు వర్ణములవారి దుఃఖములను పోగొట్టి, శాంతి నందించునట్లు; శరత్కాలముకూడా ఆకాశమునందలి మేఘములను, జీవుల అస్వస్థతను, భూమియందలి బురదను, జలమునందలి మాలిన్యమును పోగొట్టును.

పాప వినిర్ముక్తులైన యతులు సర్వవాంఛలను త్యజించి శాంతరూపులై యుండునట్లు, మేఘములుకూడా జలరూపమైన సమస్తమును పరిత్యజించి, పరిశుద్ధముగ గోచరించు చుండెను.

గురువులు శిక్షణయోగ్యులైన శిష్యులకు జ్ఞానామృతమును పంచి, అయోగ్యులగు శిష్యులకు పంచని విధముగా; పర్వతములు కూడా కొన్నిచోట్ల శుభ్రమైన జలమును అందించుచు, కొన్నిచోట్ల అందించకుండెను.

భార్యాపుత్రులయందు అనురక్తిగల మూఢమానవులు, కరిగిపోవుచున్న ఆయుష్షును గుర్తించ ఎలా తెలియలేరో; అలాగే కొద్దిపాటి నీటియందు జీవించు చేపలు మొదలైన ప్రాణులు నీరు క్రమముగా తగ్గిపోవుచున్నదని తెలిసికొనుట లేదు.

ఇంద్రియములద్వారా ఇంద్రియ విషయాలమీదికి వెళ్ళి వృథా అయ్యే జ్ఞానమును దారి మళ్ళించి యోగులు ఆత్మవైపుకు మరల్చునట్లు; వృథాపై, ఉప్పు సముద్రములో కలిసే నదీజలమును కాలువల ద్వారా దారి మళ్ళించి, వానిని పంటపొలములకు నడిపించుచుండిరి.

యోగ్యుడైన రాజును జూచి దొంగలు తప్ప మిగిలినవారంతా సంతసించునట్లు, శరత్కాల సూర్యుని గాంచి కుముదములు తప్ప పద్మము మొదలైన జలపుష్పములు చక్కగా వికసించినవి.

అఖండ మండలో వ్యోమ్ని రరాజోడు గణైః శశీ
యథా యదుపతిః కృష్ణో వృష్ణి చక్రావృతో భువి

యదునాథుడైన శ్యామసుందరుడు భూతలమున శోభించుచున్నట్లు, గగనమున పూర్ణచంద్రుడు శోభిల్లుచున్నాడు. శ్రీకృష్ణుడు వృష్ణి వంశీయులలో పరివృతుడై ఉండెను. చంద్రుడు తారకలచే పరివృతుడై ఉండెను.

ఈ శరత్కాల శోభచే బాహ్యమునందలి వాతావరణమంతయూ శాంతిమయ గాలులచే నిండి ప్రఫుల్ల మగుచుండ, అంతర్యగగనాన ఆనంద హరివిల్లును ముద్రించే విచిత్రము నవనీతచోరుడు వేణుగానలోలు డగుచున్నాడు.

వంశీరవము

బృందావనమొక పుణ్యభూమి. గోపికల మానసములను తన ప్రేమామృతంతో తడిపిన శ్రీకృష్ణుని మధురస్మృతులతో బృందావనము రసమయ స్వరూపమై భాసించింది. శ్రీకృష్ణుని దివ్యప్రేమతో బృందావనములో ప్రతి అణువు నిత్యచైతన్య కాంతిపుంజమై, కమనీయమై హృదయాలను కరిగిస్తుంది. ఆ పుణ్యస్థలిలో రాళ్ళు మాట్లాడుతాయి. చెట్లు కథలు చెబుతాయి. గాలినుండి సంగీతము వినిపిస్తుంది. ఎటుచూసినా సందేశాల నందించే ఆ పవిత్ర ప్రేమధామం శ్రీకృష్ణపరమాత్మని రాసక్రీడా నిలయము.

రాసక్రీడా రంగస్థలిపై శ్రీకృష్ణునితో పాటు చక్కని పాత్రను పోషించి అభినయించే పుణ్యజీవి మురళీబాల. భగవానుని అధరామృతాన్ని గ్రోలుతూ సదా ఆతనితో కలిసి తిరుగుతుంటుంది. గోపికలకు మురళి అంటే ఎంత ప్రేమో అంత చిరాకు కూడా. క్షణకాలము ప్రశాంతంగా ఉండనివ్వదు. ఇంటిపనులు సాగనివ్వదు. మరోవిధంగా మనసును కదలనివ్వదు. లోకంతయూ తనగొడవే తనది. అందుకని గోపికలు మురళిని ఎంతగానో నిందించేవారు కూడా. బృందావన పుణ్యభూమిలో వసించే ఒక అజ్ఞాత కృష్ణప్రేమి మురళిని కఠినాత్మురాలిగా వర్ణించడము జరిగినది. ఆ మురళీ నాదమునుండి కదిలే ప్రతి అమరాగ స్వరతరంగము తమ హృదయాన్ని బాగుచేయులేని విధంగా ముక్కలు చేసిందని రాధ ఆరోపించింది. కృష్ణుని అండ జూసుకొని అందరిని ఏడిపించడానికి కంకణము కట్టుకున్న కఠినాత్మురాలని గోపికలు దూషించారు.

"ఓ కఠిన్య మురళీ! నీవూ, బాణము ఇరువురు ఒకతల్లినుండి ఆవిర్భవించిన కవలలు (రెండూ వెదురునుండి పుట్టినవియే గనుక). ఇరువురి గుణాలు ఒకటిగానే హింసాత్మకంగా ఉన్నాయి. అయినా మేము బాణానికే నమస్కరించుచున్నాము. నీకన్నా నీ సోదరియగు శరమే మేలు. బాణముతో ఒక్కసారి కొట్టగానే మా ప్రాణములు అక్కడికక్కడే గతించి, విరహ బాధనుండి మేము విముక్తులము కాగలము. కానీ నీవు అలాకాదు. మమ్మల్ని అనుక్షణము ఆవేదనకు గురిచేస్తూ, బ్రతుకనివ్వక చావనివ్వక మా విరహాన్ని ప్రజ్వలింపజేసి మమ్ములను అనంత దుఃఖానికి గురిచేయుచున్నావు.

"ఓ మురళీ! నీ శరీరమంతా కలుగులే. అయినప్పటికీ శ్రీకృష్ణుడు తన అధరామృతముతో నీ రంధ్రాలన్నీ నింపుతున్నాడు. నీవు కఠినమైన వెదురుకొయ్య నైనను బండలాంటి గుండెలను కూడా వెన్నలా కరిగిస్తున్నావు. శ్రీకృష్ణుడు మాచెంత మున్నపుడు నీ నుండి వచ్చే మృదుమధుర సంగీతమే మా హృదయాల కెంతో ఊరటను అందిస్తుంది. నీవు అమృతతుల్యమైన ప్రేమమూర్తి వని భావిస్తాము. కానీ శ్రీకృష్ణుడు మాకు దూరమైనపుడు మేము కృష్ణ విరహాన్ని భరించలేక తపిస్తుంటే నీవేమో శ్రీకృష్ణుని చెంతనే యుండి మమ్మల్ని ఏడిపించడానికి మధురనాదం చేస్తావు. మండే హృదయాలకు పిడుగులు చేర్చినట్లవుతుంది. అప్పుడు నీవెంతో పాషాణ హృదయురాలివని భావిస్తాము. ఓ మురళీ! నీ హృదయములో అమృతమెంత ఉందో పాషాణమంత ఉంది" అని గోపికలు వ్యథ చెందారు.

బృందావన పుణ్యభూమిలో మురళిరాక ప్రత్యేక ఆకర్షణ. శ్రీకృష్ణుని మురళీ రవమునకు హృదయాలు ద్రవించిపోతాయి. నృత్యంచేస్తున్న మయూరాలు మురళీనాదము వినబడగానే ఎవరో ఆపినట్లు ఆగిపోయేవి. గోవులు నేత్రాలపై రెప్పవాల్చకుండా చిత్తరువుల్లా నిలబడిపోయేవి. గాలి లేనిచోట్ల దీపము కదలనట్లు; చంచలమైన తమ నేత్రాలు కదలికను కోల్పోయి జింకలు స్థాణువుల్లా అచలమయ్యేవి. తల్లిపొదుగునుండి పాలుత్రాగుచున్న గోవత్సములు నోటిలోని పాలు గొంతులోకి దిగకుండా నోటిలోనేయుండ, నేత్రములవెంట బాష్పములు రాల్చుచు దీనాతిదీనంగా కదలలేకుండా యుండేవి. గలగలమని పారు యమునా నదీజలము మురళీగాన రసాస్వాదనమునకై ప్రవహించకుండా నిలిచిపోయేది. ఆకాశాన కదులుతున్న మేఘాలు తమ చలనమును నిరోధించుకుని కృష్ణునికి ఛత్రములా నిలిచియుండేవి. పక్షులు చెట్లకొమ్మలపై కూర్చుండి ఊయలకు కట్టిన బొమ్మలను పోలియుండి వింటూ శిశువులవలె చూస్తుండేవి. ఆహా! ఎంతటి మధుర రసాస్వాదనము! ఆ మురళీనాదాన్ని శ్రవణముచేసినవారి జన్మమే ధన్యము.

మురళీనాదం అమరగానం. అది ఒకకాలంలో మాత్రమే కనిపించి అదృశ్యమయ్యేది కాదు. అన్నికాలాలలో ఉంటుంది. ప్రయత్నించిన ప్రతిఒక్కరికీ వినిపిస్తుంది. మానవుని హృదయమే బృందావనము. హృదయంలో నిండియుండి అనంత నాదాలన్నింటిని కదలించే అనాహత ధ్వనియే మురళీనాదము. అదియే ప్రణవనాదము. తమ హృదయంలో కదలే మురళీనాదమునే అనాహత శబ్దము. అమోఘా శ్రవణము ఎవ్వరు శ్రవణము

చేయుదురో, వారే పరాభక్తిలో చరించిన గోపికలు. అనాహత నాదాన్ని విన్నవారు అమరులౌతారు.

ప్రణవనాదమనే మురళీగానాన్ని వినగానే, రాగద్వేషాలనే నెమళ్ళు తమవిన్యాసాలను ఆపేస్తాయి. అభిమానమనే గోవులు రెప్పవాల్చకుండానే నిలిచిపోయేవి. చంచలమైన మనస్సనే లేడి కదలికలేక ఆగిపోయేది. కోరికలనే దూడలు పాలు అనెడి ఇంద్రియ విషయాలను పానముచేయుట ఆపివేసేవి. కామాది వాసనలనే యమునాతరంగాలు అచలమై నిలిచేవి. హృదయాకాశము నావరించియున్న అజ్ఞానమనే మేఘాలు నిశ్చేష్టతనొంది చలనరహిత మయ్యేవి. కర్మలనే పక్షులు వృక్షాలపై ఆసీనమై నిష్క్రియత్వమును పొందేవి. అట్టి స్థితిలో జీవుడనే గోపిక, పరమాత్మ అనే కృష్ణునితో, హృదయమనే బృందావనములో, అనాహత శబ్దమనే మురళీనాదాన్ని శ్రవణముచేయుచూ కరిగిపోవుటయే; మురళీకృష్ణుడు మురళిద్వారా మనకు అందించే అమర సందేశము.

శరత్కాల రాత్రులయందు శ్రీకృష్ణుడు బృందావనములో గంధర్వులు కూడా మోహితులగునట్టి మనోహర వేణుగానమును మధురాతిమధురంగా ఆలపించేవాడు. ఆ దివ్య మధురనాదము చెవినిపడగానే గృహకృత్యాలలో నిమగ్నమైయున్న గోపికల హృదయాలలో నిగ్రహించుటకు వీలులేని విధంగా ప్రేమావేశము పొరలివచ్చేది. పొరేది. వెంటనే శ్రీకృష్ణుని పదసరోజముల చెంతకు పరుగులిడాలనిపించేది. శరీరములు కట్టెలవలె స్తంభించిపోయేవి. మనసు నిస్తరంగజలధిలా కదలిక లేనిదై సంకల్పరహిత మయ్యేది. నేత్రములపై రెప్పలు పడేవికావు. ఇక తమ గృహాలలో నిలువలేకపోయేవారు. రాత్రివేళ యని కూడా పంతయించక శ్రీకృష్ణ సన్నిధానమును చేరడానికి ఉరకలేసేవారు.

వంశీమోహనుని మురళీనాదము వినబడేసరికి బిడ్డలకు పాలిస్తున్న గోపికలు బిడ్డలను అక్కడనే వదిలేసి, బృందావనము వైపు పరుగు తీసేవారు. గోవులనుండి పాలు పితుకుతున్నవారు, అవనిని అక్కడే వదలి బయలుదేరేవారు. వంట తయారుచేయువారు వదలివెడితే ఆ వంట ఏమవుతుందో అనే ధ్యాసకూడా లేకుండా దౌడుతీసేవారు. భర్తలకు భోజనము వడ్డిస్తున్నవారు, వడ్డించుపాత్రను భర్త విస్తరిలోనే వదిలేసి, లేడిలా గంతులేస్తూ వెళ్ళేవారు. తలంటేస్తున్నవారు శరమును శుభ్రపరచుకోవాలనే ఆలోచనకూడా లేకుండా బృందావనానికి నడిచేవారు.

సునత చలీం బ్రజ బధూ గీత ధునికో మారగ గహా
భవన భీత భ్రమ కుంజ పుంజ కితహుఁ(అటకీ నాహిఁ

"మురళీరవమును వినిన గోపికలు ఆ ధ్వని వచ్చు మార్గాన్ని అనుసరించి వెళ్ళేవారు. గృహాలు, గోడలు, వృక్షాలు, పొదరిండ్లు వారి గమనాన్ని నిరోధించలేకపోయేవి. మురళీగానము సుధామయము. అది నిరోధించబడని మార్గము. చాలా విశాలమైనది. అమ్మలు అంతేకాదు, చాలాదగ్గరైనది కూడా. ఈ మార్గమున గోపికలే చరించగలరు. అనర్హులు" అని భక్త నందదాసు తెలిపియున్నాడు.

బృందావనం అన్న పేరును వినగానే రాధతోపాటు మన స్మృతిపథంలో కదలే, మెదలే మరొక చైతన్యదీపిక మురళి. శ్రీకృష్ణుడు సకల జీవరాసులను తన మురళీ గానమాధుర్యముతో పరవశింపచేసి వేణుగోపాలు డయ్యాడు. మురళి అంటే తనకెంత ప్రేమయో వివరించలేము. మురళిని విడచి తాను క్షణకాలం మనలేడు. భగవానుని అధరామృతాన్ని గ్రోలుతూ సదా భగవంతునితో కలిసి జీవించే ఆ మురళి ఎంత పుణ్యజీవి! మురళికి అంత భాగ్యము ఎలా కలిగింది? మురళిని పట్టుకొని బాగా పరిశీలించి చూస్తే మనకే అర్థమవుతుంది. మురళిలోపల ఏముంది? ఏమీలేదు. అంతా ఖాళీయే. "నేను ఖాళీకావడం వల్లనే భగవంతుడు నన్ను చేపట్టాడు. కానీ నేను కోరడం వలన కాదు" అని మురళి సమాధాన మిస్తుంది. ఎవరైతే "నేను" "నాది" అనే అహంకార మమకారాలను వీడి ఖాళీ అవుతారో వారు భగవంతుని చేతిలో పనిముట్టుగా మారిపోతారు. ఇదియే మోహనమురళి అందించు మహోత్కృష్ట శోభన సందేశము.

మురళి జడమైన వెదురుముక్కయే కదా! కానీ భగవానుని హస్తస్పర్శ చేత అది పునీతమై మంజులరాగము నాలపించసాగింది. మానవదేహమే మురళి. అది జడప్రాయమైనది. భగవచ్చైతన్యముతో స్పందించినపుడే మృణ్మయ రూపమైన దేహము చిన్మయముగా మారుతుంది. వేణువులో ఏడు రంధ్రాలుంటాయి. తాను ఖాళీగా యుండుటచేత భగవానుడు తన గానముతో ఆ ఏడు రంధ్రాలను స్పందింపచేస్తాడు. పంచేంద్రియములు, మనస్సు, బుద్ధి అనునవియే ఏడు రంధ్రములు. "నేను" అనెడి అహంకారమును పోగొట్టుకొని ఖాళీయైనవారే మురళివలె భగవత్కృపకు, గురుకృపకు పాత్రులై తరించగలరు. ఇదియే మంజుల వంశీ మనోహర అభిభాషణము. అందుచేతనే

వేణు ర్మధురో రేణుర్మధురః

"మురళి తీపి, శ్రీకృష్ణుని చరణధూళి తీపి" అని వల్లభాచార్యులవారు గానం చేశారు. వేణువుయొక్క అదృష్టం శ్రీకృష్ణుని రాణులకు కూడా కలగలేదు. మురళి భాగ్యం మనకు లేకపోయెనే! అని గోపికలు రోదించారు.

మ॥ ఒవరన్ వ్రేతల కించు కేమియును లేకుండంగ గోపాలకృ
ష్ణుని కెమ్మోవిసుధారసంబు గొనుచుం జోర్యంబుగామోయుచుం
దనపర్వంబులు నేత్రపర్వములుగా దర్పించెఁ బూర్వంబునన్
వనితా! యెట్టి తపంబు చేసెనొకొ యీవంశంబు వంశంబులోన్.

మరియొక గొల్లపడుచు ఇంకొక విధంగా ఆలోచించింది. దాని అదృష్టానికి చింతించి ఏమి ప్రయోజనము? గత జన్మములో మురళి చేసుకొన్న పుణ్యము మనకు లేదాయె! రాబోవు జన్మలోనైనా మురళియొక్క భాగ్యాన్ని పొందవలెననిన, ఆలస్యము చేయకుండా ఈ జన్మలోనైన జాగ్రత్తపడాలని అభిప్రాయపడింది.

క॥ కాళిందీకూలంబున వాళీ! యీ నందసుతుని యధరామృతముం
గ్రోలెడి వేణువ నను నో మేలాగున నోమునన్ను వెతిఁగింపఁగదే!

అంటూ వ్రతవిధానమును తెలుపమని తమ చెలికత్తెలను, మురళిని అడుగుచూ ఆ గొల్లపడుచు విలపించసాగినది.

తనకంటూ ఒకనైజమని, తనదంటూ ఒక వ్యక్తిత్వమును నిలుపుకొనక, సదా శ్రీకృష్ణుని శరణాగతురాలై, ఆయన ఆలపించు రాగమును వ్యక్తపరచుచు వచ్చినది. అదియే మురళిలోని ప్రత్యేకత. ఎవరయితే భగవద్వాణిని వ్యక్త మొనర్చుచుందురో వారే ధన్యజీవులు. మురళినుండి వదలివచ్చే ప్రతీ రవము నందకిశోరునిదే. అలాగే మనముకూడా మాట్లాడే ప్రతిమాట శ్యామసుందరునికి సంబంధించినది అవునో కాదో చూచుకుంటూ వుండాలి. మననుండి భగవద్వాణి వ్యక్తమైనచో శ్రీకృష్ణుడు మనలను హస్తమున ధరించును.

లోకానున్మదయన్ శ్రుతీ ర్ముఖరయన్ క్షోణీరుహాన్ హర్షయన్
శైలాన్విద్రవయన్ మృగా న్వివశయ న్గో బృన్దమానన్దయన్
గోపాన్ సంభ్రమయన్ మునీ న్ముకళయన్ సప్తస్వరాన్ జృమ్భయ
న్నోంకారార్థ ముదీరయ న్వి జయతే వంశీనినాదశ్శిశోః

"శ్రీకృష్ణుని వేణుగాన నాదము భువనములను మోహింపచేయుచున్నది. వేదములను మార్మ్రోగించుచున్నది. వృక్షములను శాంతింప చేయుచున్నది. కొండలను కరిగించుచున్నది. మృగములను పరవశింప జేయుచున్నది. గోవులను తృప్తి పరచుచున్నది. గోపాలురను ఉన్మాదులుగా చేయుచున్నది. మహర్షులను అంతర్ముఖము చేయుచున్నది. సప్తస్వరములను వెదజల్లుచున్నది. ఓంకార భావము వెలిబుచ్చుచున్నది" యని శ్రీకృష్ణ కర్ణామృతము తెలుపుతుంది.

వేణువు చక్కని ధ్వనిని అందిస్తుంది. ఆ ధ్వనిని క్షణకాలము కూడా తనలో ఉంచుకోకుండా ఖాళీ అవుతుంది. పరమాత్మప్రేరిత కర్మను ఆచరించిన పిమ్మట ఏమీ లేకుండా మరచిపోవాలి. అంతేగాని చేసిన విషయాన్ని మళ్ళీ మళ్ళీ పలుకగూడదు.

ఒక గోపిక అప్పడాలు చేయుచుండెను. ఇంతలో శ్రీకృష్ణుని మురళీరవము వినిపించెను. పరవశించిన ఆ గోపిక వంటచెఱకును పొయ్యిలో పెట్టుటకు బదులుగా అప్పడాలకట్టను పొయ్యిలో పెట్టెను. మురళి వ్యక్తులను అంతగా పరవశింపచేయును.

వేణురవము చెవిని పడనంతవరకు గోపికలు సాంసారిక జీవనమును ఏ విధముగా సాగించుచుండురు. వేణురవము వినిపించగానే విషయప్రపంచమును పూర్తిగా మరచిపోవుదురు. అనగా విషయ ప్రపంచమునకు సంబంధించిన వాసనలు వేణుగానము చెవిని పడగానే బహిర్గతమై పోయెను. వాసనలను హరింపజేయు శక్తి శ్రీకృష్ణుని వంశీరవమునందు కలదు. అదియే మురళి యొక్క గొప్పదనము.

మురళీ! అడుగు ఉన్న నీవు తప్పటడుగులు కూడా వేయలేవు. కాని మాచేత చిత్రవిచిత్రమైన అడుగులను వేయించుచూ, ఆడించుచూ, ఆట కట్టించుచూ

ఆనందింపజేయుచున్నావు. మురళీ! ధన్యురాలివై నీవు పలుకుచున్నావు. ధన్యులమై మేము వింటున్నాము.

ఒక గోపిక మురళీమాతను ప్రార్థించింది. "మురళీ! నాకొక్క వరాన్ని ప్రసాదించు. నేను వంటచేయు సమయములందు నీ రవమును వినిపించకు. నీ ధ్వని కదలగానే పొయ్యిలోని కట్టెలు కరిగిపోవుచున్నవి. నిప్పు ఆరిపోవుచున్నది. నేను వంట చేయలేకపోతున్నాను" అని పరితపించింది. ప్రార్థించింది.

ఒక గోపిక భర్తకు వడ్డిస్తోంది. బిడ్డ చంకలో ఉన్నాడు. ఉట్టిమీద నున్న నేతికుండను అందుకోవలసి వచ్చింది. బిడ్డను క్రిందికి దించి భర్తకు ఎదురుగా కూర్చోబెట్టింది. ఉట్టినుండి కుండను దించింది. భర్తకు నేయి వడ్డించింది. ఇంతలో శ్రీకృష్ణుని వేణునాదము వినిపించింది. అంతే కుండకు బదులుగా కుఱ్ఱవానిని ఉట్టిలో కూర్చుండబెట్టి చకచక యమునవైపు నడిచింది.

"కృష్ణా! మురళిని నీవు ధరించావు. మురళీధారి యని కీర్తించబడినావు. నీకన్నా ముందే ఆ పుణ్యాత్మురాలు మురళి పేరు వినబడుచున్నది. కానీ దేనికైనా పుణ్యమంటూ ఉండాలి. నిన్ను మా స్తనద్వయముపై నరుండబెట్టుకొనినను మమ్ములను గుర్తించువారు లేరు. నిన్ను పొందిన వారికన్నా నీచేత పొందబడువారు ధన్యులని తేలిపోయింది. కొండ అయితేనేమి? కంసుడైతేనేమి? నీచేత ఎన్నుకోబడిన వారే ధన్యులు" అని ఒక సుందరి వాపోయింది.

నిత్యము శ్రీకృష్ణభగవానుని అధరామృతమును గ్రోలుతూ; రేయనక, పగలనక, వాననక, ఎండనక, సర్వకాల సర్వావస్థలయందు శ్రీకృష్ణుని అధరముల మీదనో, మొలలోనో, చేతియందునో, ఒయ్యారముగా నిలచి, అయ్యారె యంటూ కులుకుచూ, వీరి కనులను హరింపజేసి చెంగావుల మధ్య నిలబడి, సింగారము తెరుగని బంగారు తల్లి మురళికి శతకోటి వందనములు.

గోపికా వస్త్రాపహరణము

వస్త్రాపహరణలీల అత్యద్భుతమైనది. జిజ్ఞాసువులారా! భక్తులారా! ఈ లీలను నిత్యము పారాయణముచేసి, దీని యందలి అంతర్భావమును గ్రహించువారికి ఉత్తరజన్మ ఉండదు.

శ్రీ కృష్ణుని వదలి ఒక్క క్షణమైనను జీవించలేని గోపికలు కాత్యాయనీ వ్రతము నాచరించవలెనని నిర్ణయించుకున్నారు. సూర్యోదయమునకు ముందే యమునకు చేరినారు. స్నానమాచరించి, అచ్చట సైకతశ్రేణులపై కూర్చొని, సైకత ప్రతిమ నాకదానిని తయారు చేసుకొని, ఆ ప్రతిమను కాత్యాయనీ దేవిగా భావించి, పూజించి, ధ్యానించసాగిరి.

కాత్యాయని మహామాయే మహాయోగిన్యధీశ్వరి
నందగోపసుతం దేవి పతిం మే కురుతే నమః

అనెడి మంత్రమును జపించుచు పూజించసాగిరి. శ్రీకృష్ణుడు వారికి పతి కావలెనని కోరుటయే అందరి భావార్థము.

క॥ ఓ కాత్యాయని భగవతి, నీకున్ మ్రొక్కెదము మేము వేఁడుమ కంపన్
మాకిందఱకును వైళము, శ్రీకృష్ణుఁడు మగఁడుఁ గాఁగఁ జేయుము తల్లీ!

అని కాత్యాయనీ దేవిని భక్తిశ్రద్ధలతో ధ్యానించుచుండెడివారు.

క॥ ఓ తల్లీ! మాకుఁ గృష్ణుడు, చేతోవిభుఁడైనవాఁడు చెలువలమెల్లన్
వేతివసంతము లాడుచు, జాతర సేసెదము భక్తి చాతురితోడన్.

అని ప్రార్థించుచు నియమనిష్ఠలతో వారము రోజులు పూజలు ఆచరించిరి. పూజాది వ్రతములన్నియు భగవత్ప్రీత్యర్థమే జరుగవలెను. గొంతెమ్మకోరికల మూటను పూజా గదిలో విప్పకూడదు. భగవానుడు నీవాడైననాడు సమస్తము నీకు హస్తగతమగును. వాంఛించదగినవాడు భగవానుడొక్కడే. క్షణము గోచరించి, క్షణములో క్షీణించే దేహమును రక్షించుకొనేందుకు గాక, నిత్యశుద్ధముక్తమైన స్వరూప పరమాత్మ సందర్శనానికి పరితపించే అంతఃకరణతో పూజలు కొనసాగించాలి. గోపికలు కాత్యాయనీ వ్రతమును అలాగే ఆచరించారు. భగవానుడే వారికి సర్వమై యుండవలెనని వాంఛిస్తూ కాత్యాయనీ వ్రతమును సాగించారు.

ఉషస్యుత్థాయ గోత్రైః స్వైరన్యోన్యాబద్ధ బాహవః,
కృష్ణముచ్చైర్జగుర్యాంత్యః కాళింద్యాం స్నాతుమన్వహమ్॥

ఆ గోపకుమారికలు నిత్యము ఉషఃకాలమున లేచి, యమునలో స్నానమాచరించుటకు వెడలుచూ పరస్పరము తమ పేర్లను పిలుచుకొనుచు నడచుచుండిరి. వారు ఒకరి చేతులను ఒకరు పట్టుకొని బిగ్గరగా కృష్ణనామమును కీర్తించుచు వెడలుచుండిరి.

స్నానము దేహమును శుభ్రపరచును. కానీ మనస్సులోని మురికి అలాగే యుండును. కృష్ణనామము చెబుతూ స్నానమునకు వెళ్ళవలెను. కృష్ణనామము చెబుతూ స్నానమాచరించవలెను. అప్పుడు దేహముతో బాటు మనసు కూడా శుద్ధిపడును.

కొందరు సినిమా పాటలు పాడుతూ, శోభావనలు తలపోయుచు స్నానము చేయుదురు. వారి స్నానానంతరము జరుగునదేమిటో తెలియునా? దేహమునుండి వీడిన మురికికన్నను మనసునజేరిన మురికి ఎక్కువగా గోచరించును.

గోపికలు కృష్ణనామామృతమును పానముచేయుచూ, స్నానమునకు వెడలెడివారు. అదియునుగాక స్నానమునకు వెడలునపుడు వారు ఒకరి చేతులను ఒకరు పట్టుకొని నడచి వెళ్ళిరి.

ఆధ్యాత్మికమార్గము అంత సులభమైనదికాదు. ఇచ్చట ఒంటరి ప్రయాణము పనికాదు. భక్తులతో కలిసి సత్సంగము ద్వారానే సద్రూపుడైన శ్యామసుందరుని చేరాలి. భవసాగరము దాటుటకు సత్పురుష సాంగత్యము చక్కని నావయై యున్నది.

గురుకే బచన అటల్ కరి మన్‌మై సాధు సమాగము కీజై

"సద్గురుని బోధ అక్షరమని గ్రహించి, సత్పురుషుల సాంగత్యమును ప్రయత్నించి పొందుము" అని సూరదాస్ గానం చేసాడు.

మహత్సంగస్తు దుర్లభోఽగమ్యోఽమోఘశ్చ

"మహాత్ముల సాంగత్యము లభించుట దుర్లభము. లభించినను సంపూర్ణముగా తెలిసికొనుట బహుకష్టము. గ్రహించగలిగినచో అమోఘము" అని నారద భక్తి సూత్రములలో తెలియజేయబడినది.

త్రిజగతి సజ్జన సంగతి రేకా భవతి భవార్ణవ తరణే నౌకా

"త్రిలోకములయందును భవసాగరమును దాటింపగల నౌక 'సజ్జన సంగతి' యే నని తెలుసుకో" అని భజగోవిందంలో శ్రీశంకరులు తెలుపుతారు.

భక్తులు పరస్పరము ఆధ్యాత్మికంగా సహకరించుకుంటూ, ఒకరికొకరు చేయూత నిచ్చుకొనుచు నడచిపోవలయునని తెలుపుటయే గోపికలు ఒకరి చేతులను మరొకరు పట్టుకొనిపోవుట లోని అంతరార్థము.

మాసము రోజులు గడచినవి. పున్నమి అరుదెంచినది. యమునను చేరారు గోపికలు. ధరించిన వస్త్రములను తీరమున ఒకచోటనుంచి నీటిలో జలకమాడసాగిరి.

శ్రీకృష్ణుడు మిత్రపరివేష్టితుడై అచ్చటికి అరుదెంచినాడు. వారాచరించిన కాత్యాయనీ వ్రతమునకు ఫలము నొసంగవలెనని సంకల్పించాడు. నదీతీరమున వృక్షచ్ఛాయలో నుంచబడిన గోపికల వస్త్రములను తీసుకొని దగ్గరనేయున్న కదంబవృక్షము నెక్కెను. వంశీమోహనుడు చెట్టుపై ఒయ్యారముగా ఆసీనుడై వేణువును ఊదుతున్నాడు. శ్రీకృష్ణుని గాంచిన గోపికలు సిగ్గుతో కదలిపోయారు. తమ శిరములనుండి పర్వములవలె జాలువారుతున్న కేశములతో, కరములతో శరీరమును కప్పుకొనదానికి ప్రయత్నించారు. ప్రయోజనము లేకపోయింది. తమ వస్త్రాలను తమ కివ్వమని శ్రీకృష్ణుని ప్రార్థించారు. "కృష్ణయ్యా! మా చీరలు మాకివ్వు...మానాన్ని కాపాడు" అని ప్రార్థించారు. శ్రీకృష్ణుడు ఏమియు విననట్లే యుండినాడు.

క॥ కొంటివి మాహృదయంబులు, గొంటివిమానంబులక్కఁ గొంటివి వలువల్
గొంటి విఁక నెట్లు సేసెదొ, కొంటెవు గద నిన్ను నెఱిఁగి కొంటిమి కృష్ణా!

శ్రీకృష్ణుడు నవ్వి ఊరుకున్నాడు. ఏమి చేయవలెనో వారి కవగతము కాలేదు. ఇవ్వకున్నచో నందునికి చెప్పెదమని బెదరించారు. శ్రీకృష్ణుడు వారివంక పరిహాసంతో చూశాడు. బెదరింపులకు వాసుదేవుడు లొంగునా?

భయపెట్టి సాధించుట కష్టమని తేలింది. పోనీ స్తుతించి చూద్దామని శ్రీకృష్ణుని శ్లాఘించసాగారు.

క॥ మా వలువ లాగదంబున, నీ వేటికిఁ బుచ్చుకొంటి నీ వల్వుఁడవే
నీ వెఱుఁగని దేమున్నది, నీవందఱలోన ధర్మ నిరతుఁడవుగదే.

అనిరి. అయినా కృష్ణుడు చీరల నివ్వలేదు.

"అబలలారా! మీరిచ్చటి కరుదెంచి మీ మీ వస్త్రములను తీసుకొనుడు. ఇది నిజము. పరిహాసముకాదు" అన్నాడు శ్రీకృష్ణుడు.

చలిని భరించ లేకున్నారు గోపికలు. అలాగని నగ్నంగా గట్టుమీదకి రాలేకపోతున్నారు. మానాన్ని సంరక్షించుకోవాలని తపనచెందే గోపికలకు శ్రీకృష్ణుడు మానాన్ని అపహరించేందుకే నిర్ణయించుకొని ఉన్నాడని అవగతమైంది.

"నేను ప్రాణం పోయినా పైకిరాను" అంది ఒక గోపిక. "ప్రాణం పోయిన తరువాత పైకి నీవు వచ్చేదేమిటి? పైకి మోసుకుపోయేవారు వేరే ఉన్నారు" అన్నది మరియొక గోపిక.

"పరిహాసం కట్టిపెట్టి కర్తవ్యం ఊహించండి" అన్నది ఇంకొక గోపిక.

"కృష్ణుడు ఎలాగూ ఇచ్చేలా లేడు. మనమే ఒకరి వెనుక ఒకరు నడచి తెచ్చుకుందాము" అన్నది మరియొక గోపిక.

"ఆ ముందు నడిచే వారెవరు?" అని అందరూ ఒకేసారి అన్నారు. "నావల్ల కాదు" అని మళ్ళీ ఒకేసారి అందరూ పలికారు.

శ్రీకృష్ణుడు వేణువు నూదుతూనే యున్నాడు. గోపికలు మళ్ళీ ప్రార్థించారు. శ్రీకృష్ణుడు వినడములేదు. ఇక ఎంతచెప్పినా లాభములేదని గ్రహించారు.

క॥ వచ్చెదము నీవు పిలిచిన నిచ్చెద మే మైన నీకు నెటు సారు మనినం
జొచ్చెదము నేఁడు వస్త్రము లిచ్చి మముం గరుణతోడ నేలుము కృష్ణా!

అని ప్రార్థించి, చివరకు దేహాభిమానమును త్యజించి, గట్టుమీదకి వచ్చారు. రెండుచేతులతో మర్మాంగమును మూసికొని గట్టుపైకి వచ్చారు.

"గోపికలారా! వ్రతము ననుష్ఠించువారైన మీరు దిగంబరముగా స్నానమాచరించుట దోషము. ఈ దోష పరిహారమునకై కాబోయే మీ భర్తకు చేతులెత్తి నమస్కరించి, వస్త్రములను గ్రహింపుడు" అనెను.

గోపికలు శ్రీకృష్ణునికే రెండు చేతులెత్తి నమస్కరించిరి. వెంటనే శ్రీకృష్ణుడు చీరల నందిస్తాడు. గోపికల వస్త్రాలను అపహరించి అర్భకులైన మానవుల మనసులలో అపార్థానికి గురయ్యాడు. తాను బోధించిన భగవద్గీతలోని రెండవ అధ్యాయములో "వాసాంసి జీర్ణాని యథా విహాయ" అనెడి శ్లోకంలో శరీరాన్ని వస్త్రముతో పోలుస్తాడు. గోపికల వసనములను అపహరించి వారిలో ఉన్న దేహాభిమానమును తొలగించాడు. విముక్తిని ప్రసాదించాడు. దేహవాసన ప్రతిబంధకము.

శ్రీకృష్ణుడు అపహరించింది వసనములు కాదు, వాసనలు. పాంచభౌతిక శరీరముపై వ్యామోహ మున్నంతవరకు ముక్తి దుస్సాధ్యమని గోపికా వస్త్రాపహరణలీల ద్వారా తెలుపుతాడు.

"గోపికలారా! దేహాభిమానమును కోల్పోయిన మీరు వ్రతఫలితము పొందినారు. నన్ను భర్తగా పొందినారు. ఇక రసస్వరూపుడనైన నాతో రాత్రిపూట మీరు రాసక్రీడను జరుపుదురు. రాసలీల కామలీలకాదు. ఆత్మానందరసలీల. అందుచేతనే మీలోని దేహవాసనను అపహరించి మిమ్ములను రాసక్రీడకు అర్హులుగా చేయుటను జరిగినది" అని శ్రీకృష్ణుడు పలికినాడు. వస్త్రాపహరణలీల తరువాతనే రాసలీల వచ్చును.

యజ్ఞఫలము

వస్త్రాపహరణ లీలయందు గోపికలను అనుగ్రహించిన పరమాత్మ ఇచ్చట విప్రుల భార్యలను ఉద్ధరించుతాడు. ఇది చాలా ఉపయుక్తమైన అధ్యాయము. అచ్యుతునిపై నుండవలసిన అనన్యభక్తిని ఈ అధ్యాయము బోధించును. సత్కర్మకన్నను, సద్భావన వలననే భగవదనుగ్రహం లభిస్తుంది. ఈ విషయము ఇచ్చట పుటకంలా మనకు చక్కగా గోచరిస్తుంది.

బృందావన సమీపమున శ్రీకృష్ణబలరాములు గోపబాలురతో కలిసి గోవులను మేపుచుండిరి. సూర్యుడు తీక్ష్ణ కిరణజాలమును గలవాడై యుండెను. గోపాలకులతో గూడి ముకుందుడు వృక్షచ్ఛాయలో నిలబడెను. ఆ సందర్భమున అచ్యుతుడు చక్కని సందేశము నందించెను. తమకు నీడనిచ్చు వృక్షములు పుణ్యవంతము లైనవని తెలిపెను.

వృక్షములు ఋషి జీవనమును, యజ్ఞ జీవనమును కలిగియున్నవి. వర్షమును, వేడిని, గాలిని సహించుచు జీవించుచున్నవి. అవి బాధ ననుభవించుచున్నను మన కష్టములను పోగొట్టి, మనకు సుఖమును అందించుచున్నవి. పరులకొరకే ఉపయోగపడు జీవితమే ధన్యము. అట్టి ధన్యజీవనము యజ్ఞజీవన మనబడుతుంది.

మ॥ అపకారంబులు సేయ నెవ్వరికి నేకాంతంబులం దుండు నా
తప శీతానిల వర్షవారణములై త్వగ్గంధనిర్యాస భ
స్మపలాశాగ్ర మరంద మూల కుసుమ చ్ఛాయాఫలశ్రేణిచే
నుపకారంబులు సేయు సర్వులకు నీ యుర్వీజముల్ గంటిరే.

యోగులవలె జీవించుచు, యోగ్యులగువారి జీవనమునకు ఉపకరించుచు, భోగమెరుగని, రోగమెరుగని యోగజీవితములను ప్రతిఫలించే వృక్షములు కఠినాత్ములకన్నను శ్రేష్ఠమై యున్నవి.

వనములో తిరుగుటవలన అలసినవారై, ఆకలితో బాధపడుచున్న గోపబాలురు బలరామకృష్ణులను సమీపించి, తమ క్షుద్బాధను నివారించుమని అర్థించిరి.

క్షుద్బాధయైనా, క్షుద్రబాధయైనా మనము తెలుపుకొనేందుకు సరియైనవాడు భగవానుడొక్కడే. రోగము కుదుటపడుటకు వైద్యుడు కారణమని భావించరాదు. వైద్యనారాయణుడే వైద్యవిద్యారా చికిత్సచేయును. భగవంతునికి శరణాగతులై జీవించు భక్తులు తమ ఇక్కట్లన్నీ పరమేశ్వరునికే నివేదింతురు. పుణ్యాత్ములగు గోపాలురు తమ ఆకలిని గూర్చి కృష్ణునికే నివేదించుకున్నారు.

"గోపాలులారా! ఇచ్చటికి సమీపముననే వేదజ్ఞులగు విప్రులు, స్వర్గమును కాంక్షించి, అంగీరస యజ్ఞమును నిర్వహించుచున్నారు. మీరచ్చటికి వెళ్ళి అన్నము వడుగవలసినది. నా నామమును కీర్తించుచు వెళ్ళి అడగండి. అప్పుడు మీరు దానమును గ్రహించుటకు అనర్హులని వారు భావించరు. మీరు సిగ్గుజెందవలసిన అవసరములేదు. వెళ్ళి అన్నమును అడుగుడు" అనెను.

ఎవని నాలుకపై భగవన్నామము కదలుచుండునో వాడు భగవంతుడే యగును. ఇచ్చేవాడు భగవంతుడే. పుచ్చుకొనేవాడు భగవంతుడే. ఇదియే సనాతనధర్మము మనకు నేర్పిన దివ్యభావము. మనము ఎవరిని ఏది అడుగుచున్నను, మనము అడుగుచున్నది భగవంతుడినే అనే భావము నిండి ఉండాలి. భగవంతుని అడిగితే అది ప్రార్థన అవుతుంది. అన్యులను అడిగితే అది యాచన అవుతుంది. మనస్సు యాచించకూడదు. ప్రార్థించ గలగాలి. భగవన్నామము నుచ్చరించుట వలననే ఈ ప్రార్థనా భావన ధృఢపడుతుంది. అందుచేత భగవన్నామమును కీర్తించుచూ వెళ్ళమని కృష్ణయ్య తెలిపినాడు.

అర్థించుటలో సిగ్గుచెందకండి అని కూడా తెలియచేశాడు. భగవదాజ్ఞను పాలించుటలో సిగ్గు చెంద నవసరములేదు. భగవంతుని వాంఛించే చాలామంది భక్తులు ఈనాడు భగవన్నామమును శ్రద్ధతో గానం చేయుటకు సిగ్గుపడుతుంటారు. వెనుకంజ వేయుచుంటారు. వాస్తవము తెలిస్తే ఈ వైఖరికి సిగ్గుపడాలి. మిత్రమా! నీ ప్రియుడు, సత్యమునైన భగవానుని నామమును గళమెత్తి గానము చేయుటకు నీవు సిగ్గుపడుతున్నావా? ఎవరో ఏమో అనుకుంటారని నీ సంస్కారాన్ని పాడుచేసుకుంటావా? నుదుటన చందన, తిలక, కుంకుమాదులు ధరించి భగవన్మార్తులుగా శోభించుటకు వీలులేకుండా అడ్డుపడుచున్నది సమాజమా? లేక సంస్కారమా? నన్ను చాలామంది అడుగుతుంటారు. స్వామీజీ! బొట్టు పెట్టుకుంటే నాతో పనిచేసే ఉద్యోగులు హేళన చేస్తుంటారు అని అంటుంటారు. నిజమే. హైందవ సమాజం ఈ నాడు అంతగా పతనమై యున్నది. సిగ్గువిడచి నోటిలో సిగరెట్టు పెట్టుకొని, కొరివిదెయ్యంలాగా నడిబజారులో కదలిపోవుట సభ్యతగా భావించే జీవులకు, తిలకధారణ అవహాస్యంగానే యుంటుంది. అందాలతో పందులు నింపుకుని, మందాలకు, కందాలకు పరిమితమైన కందరగాడిదలకు వంటన ముద్దలుగాని మంచి రుచించునా?

సనాతన ధర్మ జీవనాన్ని హేళనచేసే వ్యక్తికన్నా పరమశత్రువే లేదు. అట్టివారి స్నేహాన్ని వెంటనే విస్మరించాలి. ఇదియే ఋజుమార్గము. నీవు నమ్మే సత్యాన్ని స్థిరంగా నమ్మినప్పుడే నీకు శాంతి కలుగుతుంది. నమ్మిన సత్యాన్ని ఆచరించేటప్పుడు అన్యుల విమర్శలను లెక్కచేయ నవసరములేదు. అందుచేతనే సిగ్గుచెందకుండా వెళ్ళి బ్రాహ్మణులను అన్నము అడుగమని శ్రీకృష్ణుడు చెప్పెను.

శ్రీకృష్ణుని ఆజ్ఞ ననుసరించి గోపాలురు యజ్ఞప్రదేశానికి వెళ్ళారు. సాష్టాంగ నమస్కారములు చేశారు. తాము శ్రీకృష్ణుడు పంపగా వచ్చినవార మని తెలుపుతూ, అన్నమును పెట్టమని అర్థించారు. కాని ఆ బ్రాహ్మణులు వినియు విననట్లే యుండిరి. గోపాలురను తృప్తి పరచనైరి. గోపబాలురు వెనుదిరిగి శ్రీకృష్ణుని వద్దకు వచ్చిరి.

భగవంతుడు అతిథి రూపంలో కూడా వచ్చును. అందుచేతనే సనాతనధర్మము అతిథిని నారాయణ స్వరూపముగా భావించింది. బిచ్చగాని రూపంలో కూడా భగవానుడు వచ్చును. బిచ్చగానికి బిచ్చంపెట్టిన తరువాత తల్లులు వానికి నమస్కరించుచుందురు. ఎందుకో తెలుసా? అతడూ నారాయణుడే యని భావించుటకొరకు. బిచ్చగాడు మన ఇంటికి నిత్యము ఉదయకాలముననే వచ్చును. వాడు అడుగుచేది బిచ్చముకొరకు కాదు. మనకు సందేశమును ఇచ్చేందుకు వస్తాడు. గత జన్మలలో ఏ విధమైన దానముచేయని కారణంగా తాను బిచ్చగాడయ్యాడనే సత్యాన్ని తెలిపేందుకు వస్తాడు. నీవు తనలా కావద్దని హెచ్చరించేందుకు వస్తాడు.

వేదము నెరిగిన బ్రాహ్మణులు యజ్ఞస్వరూప భగవానుని తిరస్కరించారు. కారణమేమిటి? వారుచేసెడి అంగీరస యజ్ఞము కామ్యకర్మమై ఉండుటయే. కామ్యకర్మము లాచరించు వారికి యుక్తాయుక్త విచక్షణ జ్ఞానము నశించును. ఫలాసక్తితో చరించువారు కర్మఫల ప్రదాతనుకూడా విస్మరింతురు.

బ్రాహ్మణులు తిరస్కరించి రనెడి వార్తను గోపబాలురు శ్రీకృష్ణునికి తెలుపగా శ్రీకృష్ణుడు మందహాసమును చిందించి, కార్యసాధకులు వైఫల్యములు గాంచి ఆందోళన పడరాదని తెలిపెను.

"గోపాలులారా! ఈసారి మీరు ఆ బ్రాహ్మణుల భార్యల వద్దకు వెళ్ళి అడగండి. వారు నా యందే చిత్తము నుంచి యుందురు. మీరు అడుగగానే అన్నము పెట్టుదురు" అనెను.

శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారము గోపబాలురు విప్రసతుల కడకు వెళ్ళి అర్థించిరి. శ్రీకృష్ణుడు ఆకలితో యుండి పంపినాడని తెలిపిరి. విప్రసతులు శ్రీకృష్ణునియందే అనన్యచిత్తను నుంచి చాలాకాలముగా శ్రీకృష్ణుని దర్శించవలయునని భావించుచుండిరి. ఈ వార్తను వినగానే ఆశ్చర్యముతో, ఆనందముతో కదలిపోయిరి.

వెంటనే నాలుగు విధములైన భోజనములను పాత్రలయందు ఉంచుకొని నదులు సాగరమునకై పరుగులిడునట్లు వెడలిరి. భర్తలు, తండ్రులు, సోదరులు వెళ్ళవద్దని వారించినను వారు చెవిని పెట్టిరి. యమునాతీరము చేరిరి. కృష్ణుని దర్శించిరి.

సీ॥ ఒక చెలికానిపై నొకచేయి సాఁచి వే ఱొకచేత లీలాబ్జ మూఁచువానిఁ
గొప్పున కందని కొన్ని కుంతలములు చెక్కుల నృత్యంబు సేయువానిఁ
గుఱుచ చుంగులు విచ్చి కొమరారఁ గట్టిన పసిఁడివన్నియ గల పటమువాని
పొంకలఁ దిరిగిరా వలవడఁ జుట్టిన దట్టంపుఁ దిండెవుదండవాని

తే॥ రాజితోత్పలకర్ణ పూరములవాని మహితపల్లవపుష్ప దామములవాని
భువనమోహనవటవేష భూతివానిఁ గనిరి కాంతలు కన్నుల కఱవు దీఱ.

భగవానుని విప్రపత్నులు దర్శించినారు. దర్శన దాహముతో నున్నవారి నేత్రములు తనివితీరా శ్యామసుందరుని దర్శించి తృప్తిచెందినవి. శ్రీకృష్ణుని మూర్తివైభవమును గాంచి పరవశించారు. నేత్రములవెంట ఆనందబాష్పములు రాలినవి. అనిర్వచనీయ ప్రేమను హృదయములలో అనుభవించుచు, మూగవారివలె పలుకక అలా నిలుచుండి పోయిరి.

శ్రీకృష్ణుడు వారి ఆర్తిని, భక్తిని గ్రహించెను. ప్రథమంగా ఆశీర్వాద అభిభాషణము చేసెను.

శా॥ కాంతారత్నములార! మీ గృహములం గల్యాణమే? యేమి గా
వింతుమ్ మీ? కిటు రండు మమ్ము నిచటన్ వీక్షింప నేతెంచినా
రెంతో వేడుకతో నెఱుంగుదుము నిర్వైతుస్థితిన్ నన్ను దీ
మంతుల్ మీక్రియఁ జేరి కందురుగదా మత్సేవలన్ సర్వమున్.

"యజ్ఞపత్నులారా! మీరెంతయు శ్రమకోర్చి ఇచ్చటికి అరుదెంచినారు. అనేక ప్రతిబంధకములను ఛేదించుకుని వచ్చినారు. సత్యమును అనుభవించ గోరువారు నాయందు శ్రద్ధను వహించి, వారి చిత్తములను నాలో నిల్పుదురు. నన్ను స్మరించువారలకు శాంతి చేకూరును. నన్ను కీర్తించువారలకు సద్గతి కలుగును. నా కథామృతమును పానము చేయువారలకు ప్రారబ్ధము నశించి, కైవల్యసిద్ధి కలుగును.

"ఆత్మ ప్రియత్వము వలననే సర్వులూ ప్రియులైనారు. అట్టి ఆత్మకన్నా ప్రత్యేకంగా పొందదగిన వస్తువు మరి యొకటిలేదు. మీరు ధన్యజీవులైనారు. మీ భర్తలు యజ్ఞములను పూర్తిచేయనున్నారు. మీరచ్చటికివెళ్ళి వారి అనుగ్రహమును పొందుడు" అనెను.

ఆ మాటలను ఆలకించిన యజ్ఞపత్నులు యజ్ఞనారాయణుని వైపు తిరిగి చేతులు జోడించి నమస్కరించుచు "భగవాన్! ఇలా నీవు పలుకుట న్యాయముకాదు. నీ దివ్యధామమును చేరిన పిదప మళ్ళీ సంసారమున జీవులు ప్రవేశించరో అట్టి నీ చరణయుగళిని చేరిన మేము మళ్ళీ సంసారములలో కాలు పెట్టలేము. మేము అందరిని ఎదిరించి వచ్చినాము. నీ పాదపద్మములే మాకు గతి. మమ్ములను వెళ్ళమని చెప్పుట నీకు తగునా!

మ॥ తగునే మాధవ! యిట్టి వాఁడిపలుకుల్ ధర్మంబులే మాయెడన్
మగలున్ బిడ్డలు సోదరుల్ జనకులున్ మమ్ముంన్ నివారింప మ
చ్చిక నీయంఘ్రులు సేరినార మటనో, జేకొందురే వార లా
పగి దే మొల్లము కింకరీజనములఁగా భావించి రక్షింపవే.

"కృష్ణా! మేము సమస్తమును త్యజించివచ్చినాము. మాకు ఎవ్వరును ఆశ్రయమును ఇవ్వరు" అనిరి.

శ్రీకృష్ణుడు మందహాసమును చిందించుచు, "యజ్ఞపత్నులారా! నా సన్నిధిన ఎవ్వరును మీ యందు దోషములు చూడరు. మానవలోకమున దేహములు శాశ్వతములు కావు. అందుచేత మీరు మీ మీ చిత్తములను నాయందు అర్పణము చేసి తరించండి. (అంటూ కన్నయ్య కంటతడి పెట్టినాడు)

శ్రవణాద్దర్శనా ద్ధ్యానా న్మయి భావో ఽను కీర్తనాత్
న తథా సన్నికర్షేణ ప్రతియాత తతో గృహాన్

"యజ్ఞపత్నులారా! నా దివ్య వైభవమును శ్రవణము చేయుటవలన, నా రూపమును దర్శించుట వలన, నా ప్రతిమను ధ్యానించుట వలన, నా గుణగాన మొనరించుట వలన కలిగెడి ఆనందము నా ప్రత్యక్షమున మీకు కలుగదు. కనుక మీరు ఇండ్లకు వెడలండి" అనెను. వారు కృష్ణుని ఆజ్ఞను శిరసావహించి యజ్ఞభూమికి తరలి వచ్చుచుండిరి.

ఒక బ్రాహ్మణ స్త్రీ భర్తచేత బంధించబడి విప్రపత్నులతో కూడా యమున చెంతకు వెళ్ళలేకపోయినది.

గోపాలురు వచ్చి శ్రీకృష్ణుడు ఆకలితో యున్నట్లు చెప్పిరి. వెంటనే విప్రపత్నులు భోజనములను తీసుకొని బయలుదేరిరి. అది చూసిన ఒక బ్రాహ్మణుడు తన భార్యను లోనికి పిలిచెను.

భర్త:- ఎక్కడికి వెళ్ళుచున్నావు?
భార్య:- వెళ్ళవలసిన చోటికి - వెళ్ళదగిన చోటికి.
భర్త:- ఆ వెళ్ళదగిన చోటు ఏది? అని అడుగుతున్నాను.
భార్య:- యమునాతీరము.
భర్త:- ఎందుకని యాతన?
భార్య:- అది యాతనగాదు. అది యాతనను రూపుమాపే చేతన. కల్పనా జీవితాన్ని కరిగించివేసే కమనీయ స్పందన.
భర్త:- ఏమిటా పిచ్చివాగుడు? ఆ మాయావి శ్రీకృష్ణుని వద్దకు నీవు వెళ్ళేందుకు వీలులేదు. అతడు దొంగ. మాయావి. స్త్రీలోలుడు.
భార్య:- నిజమే. నాది పిచ్చివాగుడే! అది మామూలు పిచ్చికాదు. త్రిభువనములను మరపింపజేసే పిచ్చి. ద్వైత జీవనమును కనుమరుగుచేసే పిచ్చి! ఆ పిచ్చిపడితేగాని దాని రుచి తెలియదు. మీరు చెప్పినది వాస్తవమే. నా కృష్ణుడు దొంగే. గొప్ప భక్తుల హృదయాలను క్షణములో హరించగలడు. అతడు మాయావియే. సర్వ జీవరాశులను మోహితులను చేయు మాయను అమాంతముగా మ్రింగే మాయావి. అతడు స్త్రీలోలుడుకాదు. శ్రీ విభుడు. సిరిచేత నదా పాదములొత్తించుకొను పావనచరితుడు. (అంటూ పరవశించి కన్నులు మూసుకున్నది.)
భర్త:- నీవు అక్కడికి వెళ్ళేందుకు వీల్లేదు.

భార్య:- (మెల్లగా నేత్రములను తెరిచింది) అది నాకు సాధ్యమా? సముద్రాన్ని చేరవద్దని నదిని ఆపగలమా? మండే అగ్నిని ఊర్ధ్వముగా చరించవద్దని నిలుపగలమా? రెక్కలు వచ్చిన పక్షిని ఎగరకుండా ఆపగలమా? ఇంత కాలంగా ఎవరి అంఘ్రియుగ్మము మనములో ధ్యానించుకుంటూ జీవితాన్ని గడిపానో ఆ పరంధాముని దివ్యదర్శనం నాకు కాబోవుచున్నది. జన్మజన్మల కర్మసంచితం క్షయమయ్యే క్షణం సమీపించింది. ఇక నన్నెవ్వరూ ఆపలేరు. నాకు దేనిమీదా ఆసక్తిలేదు. సంసార బంధాలు నాకులేవు. ఆశలులేవు. నాకు అచ్యుతుని దివ్యపాదారవిందములే శరణ్యము. నా శ్యామసుందరుని వదలి నేను జీవించలేను (అంటూ ముందుకు నడువసాగింది).

భర్త:- ఆగు.....నీవు కాలు బయటపెట్టేందుకు వీలులేదు. నేను నీ భర్తను. ఆజ్ఞాపిస్తున్నాను.

భార్య:- భార్యెవరు?. భర్తెవరు? ఈ కల్పిత బంధాలు ఎంతకాలం నిలుస్తాయి? సర్వభర్త, సర్వకర్త, సర్వనియంత సర్వేశ్వరుడగు నా శ్యామసుందరుడే. నేనేగాదు. మీరుగూడా ఆ పరంధాముని ఆశ్రయించి తరించండి (అని ముందుకు నడవసాగింది).

భర్త:- ఆగు...ఆగు... ఇక నీకు మాటలతో చెప్పిలాభంలేదు (అంటూ ఆమెను లోనికి త్రోసి, తలుపువేసి, తాళం పెట్టాడు).

శ్యామసుందరా! సర్వాంతర్యామివైన నిన్ను కలిసేందుకు కవాటములు అడ్డు నిలువగలవా? కవాటాలు కట్టిలేకదా కన్నయ్యా! ఒక కట్టముక్క నీనుండి వచ్చే మధురనాదమును వినిపించుచుండ మరియొక కట్ట మనిద్దరి మధ్య అంధముగా నిలువగలదా? అందాలు చిందే అనంతరూపుడవు నీవు. అన్నిచోట్ల నిలచి అనుగ్రహించుచుండ బంధాలు మాకెక్కడివి? కృష్ణా! నేను బంధీనే...నీ భక్తితో నేను బంధీనై ఉంటాను. నేను గాని దేహము ఎక్కడుంటే ఏమి? సిద్ధైన చిత్తమును నీకు సమర్పించిన తరువాత వారంటూ ఇక్కడ ఏముంది బంధించబడటానికి? బంధముక్తులెక్కడివి? ఉన్నదంతా నీవే ...నీవే...నీవే (అంటూ క్రిందవాలింది, కన్ను మూసింది. దేహము కదలికను కోల్పోయింది. తాను కన్నయ్యలో లీనమైంది).

తత్రైకా విధృతా భర్త్రా భగవన్తం యథాశ్రుతమ్
హృదోపగుహ్య విజహౌ దేహం కర్మానుబన్ధనమ్ ....

భర్తచేత బద్ధురాలైన ఆ స్త్రీ ఇంతవరకు ఆమె ఏ భగవానుని గూర్చి ఆలకించినదో ఆ భగవానుని రూపమును హృదిలో నిలుపుకొని దేహమును త్యజించి, శ్రీకృష్ణచైతన్యములో ఐక్యమైనది.

యజ్ఞపత్నులతో మాట్లాడు సందర్భమున భగవానుడు తన సమీపమున ఉండుటకన్నా తన రూపమును ధ్యానించుకొంటూ దూరముగా నుండుటయే మేలని తెలిపెను. ఆ సందర్భమున శ్రీకృష్ణుని నేత్రములు చెమ్మగిల్లెను. బద్ధురాలైన ఆ భక్తురాలు ఆ సమయమున మరణించుటయే కన్నయ్య కదలిపోవుటకు కారణము.

భగవంతుని కరుణను దేశకాలాదులు అడ్డుకొనగలవా? భక్తురాలు స్వామి చెంతకు రాలేకపోయినది. కానీ శాశ్వతముగా రాగలిగినది. ధన్యురాలగు ఆ ఇలాగే ఉంటుందేమో! బంధాలను ఛేదించుకొని శ్రీకృష్ణుని సమీపించిన యజ్ఞపత్నులు తిరిగి భర్తలను చేరారు. బద్ధురాలైన భక్తురాలు శాశ్వతముగ ప్రభుసాన్నిధ్యమును చేరినది. యజ్ఞపత్నులు భగవానుని వదలివెళ్ళే సమయానికి ఆ భక్తురాలు ఆయన సన్నిధిని చేరగలిగింది. దైవకృప అనిర్వచనీయము.

యజ్ఞపత్ను లిచ్చిన ఆహారమును శ్రీకృష్ణుడు గోపాలురకు అందించాడు. విప్రులు యజ్ఞవేదికను సమీపించారు. వారి భార్యలకు కలిగిన భాగ్యము తమకు కలుగలేదని పశ్చాత్తాప హృదయముతో బ్రాహ్మణులు తమను తాము నిందించుకొనినారు.

చ॥ కటకట మోసపోయితిమి కాంతలపాటియు బుద్ధిలేదు నే
డిట హరిఁ గానఁబో వెఱుఁగ మేము దురాత్ముల మేము గర్మసం
ధృతులము విష్ణుదూరగుల ప్రాజ్ఞత లేల? తపంబు లేల? స
ద్వ్రతనము లేల? శీలములు యాగములుఁ మటి యేల కాల్పనే?

విప్రులు ఆలోచించారు. ఆవేదన చెందినారు. ఉపనయనము, గురుసేవ, తపస్సు, ఆత్మవిచారము, శుచియు, సంధ్యావందనాది శుభక్రియ లేవీ లేకపోయినను యజ్ఞపత్నులు భగవానుని కరుణకు పాత్రులైనారు. అవి యన్నియు ఉండినను విప్రులు శ్రేష్ఠపొందిన ఉత్తమస్థితిని పొందలేకపోయినారు. భగవానుడు భక్తిని జూచును. ప్రాపంచిక విషయవాసనాలోలు లైనందున వారు భగవానుని పొందుట పోగొట్టుకొనుట జరిగినదని విచారించిరి. భక్తి కొరవడిన దోషముచేతనే భగవానుని పొందలేకపోవుట జరిగినదని చింతించసాగారు.

క॥ జపహోమాధ్యయనంబులుఁ దపములు వ్రతములును లేని తరుణులు హరి స
త్కృపఁ బడసి, రన్ని గలిగియుఁ జపలతఁ బొందితిమి భక్తి వలువమి నకటా!

తమ కర్తవ్యమును తెలియచేయుటకే భగవానుడు ఆహారమును అర్థించినాడని భావించారు. కామ్యకర్మలు వాంఛనీయము గావనియు, భక్తియే ముక్తిదాయకమని తెలిసినారు. అన్నిని కలిగినవాడు లక్ష్యమును తెలుపుటకేగాని అన్నముకొరకు అర్థించలేదని భావించారు. ఆదిపురుషుడైన శ్రీకృష్ణుడు తమను క్షమించవలెనని హృదయాలలో ప్రార్థించారు.

తమ తమ తప్పిదములను గాంచి కలత చెందిన బ్రాహ్మణులు వెంటనే శ్రీకృష్ణుని దర్శించవలయునని సంకల్పించారు. కంసునికి తెలిసిన అపాయ సంభవించునేమో యని తలచి ఆ ప్రయత్నమును మానుకొన్నారు. పశ్చాత్తాపము చెందుటవలన అంతఃకరణ శుద్ధి చెందును. కొంతకాలము ప్రవృత్తిలో చరించిన తరువాతనే నివృత్తి రూపమైన శ్రీకృష్ణుని మార్గమును జీవులు పొందగలుగుదురు. భక్తి శ్రద్ధలతో కొంతకాలము జీవించనిదే భగవంతుని చెంతకు చేరలేరు, మరలుట జరుగదు.

ఇంద్ర యాగము

వ్రజపురమున నందాది గోపులు ఇంద్ర యజ్ఞము చేయవలెనని సంకల్పించి, సన్నాహములు చేయుచుండిరి. అంతట పరమాత్మయగు శ్రీకృష్ణుడు నందుని సమీపించెను. నందుని ప్రశ్నించెను.

"తండ్రీ! మీరు ఇంద్ర యాగము చేయ సంకల్పించారు. ఈ యజ్ఞము దేనికొఱకు చేయుచున్నారు? దీని ఫలమేమి? దేవత ఎవరు? యజ్ఞ వివరములు నాకు తెలుపుడు" అనెను.

నందుడు మౌనము వహించెను. శ్రీకృష్ణు డడిగిన ప్రశ్నలకు సమాధాన మీయలేదు. అంతట శ్రీకృష్ణుడు

సంహి గోప్యం హి సాధూనాం కృత్యం సర్వాత్మనామిహ

"ఆత్మద్రష్టలైన సాధువులు తాము ప్రపంచములో ఆచరించెడి ఏ కార్యమును దాచరు" అని అనెను.

"తండ్రీ! మీరు చేయు ఈ యజ్ఞము శాస్త్ర సమ్మతమో, కాదో తెలిసికొనగోరి అడుగుచున్నాను. దయచేసి తెలుపుడు" అనెను.

శాస్త్రము సత్యస్వరూపము. శాస్త్రవిహిత కర్మలే మానవుని పరిపూర్ణుని గావించును. శ్రీకృష్ణుడు శాస్త్రవిహిత కర్మలనే ఆచరించమని తెలుపుతాడు.

"కుమారా! వర్షము వలననే ప్రాణికోట్లన్నియు జీవించుచున్నవి. వర్షము మేఘముల వలననే కురియుచున్నది. ఇంద్రుడు పర్జన్య స్వరూపుడు. వర్షానికి కారణమైనవాడు. అందుచేత మేఘాధిపతి యైన మహేంద్రుని ధాన్యాది ద్రవ్యములతో యజ్ఞములద్వారా అర్చించుట మన ఆచారమై యున్నది" అని నందుడు చెప్పెను. వంశపారంపర్యముగా వచ్చెడి ధర్మమును విసర్జించుట పాడికాదనెను. అన్నమిడిన వేల్పును విస్మరించుట తగదనెను. అంత శ్రీకృష్ణుడు ఈ అభిప్రాయముతో భేదపడెను.

క॥ కర్మమునబుట్టు జంతువు, కర్మముననువృద్ధిఁబొందు గర్మమునఁజెడుం
గర్మమె జనులకు దేవత, కర్మమె సుఖదుఃఖములకుఁ గారణమధిపా!

"తండ్రీ! ఈ లోకమున కర్మ కారణముగనే జీవులు జనన మరణములను సుఖదుఃఖములను, శుభాశుభానుభవములను పొందుచున్నారు. కర్మఫలములను మార్చు శక్తి ఇంద్రునకు లేదు. అందుచేత ఇంద్రయాగము నిష్ఫలమై యున్నది. శత యజ్ఞము లాచరించిన వాడెవడైనను ఇంద్రపదవిని పొందవచ్చును.

"మనకు ప్రత్యక్షముగా నెవరు సహకరించుచున్నారో వారిని పూజించుటయే క్షేమకరము. మనము గోవులవలన జీవించుచున్నాము. గోవులు పర్వతములపై నాధారపడియున్నవి. కనుక ఇంద్రునకు ఇంద్రుడైన జగన్నాథుడు ఈ గోవర్ధన పర్వత

రూపమున స్థూలముగా తెలియుచున్నాడు. ఇంద్రుని పూజించుటకన్నను గోవర్ధననాథుని పూజించుటయే ఉత్తమమని నా యభిప్రాయము" అని పలికి అహంకారియైన ఇంద్రుని గర్వమును శ్రీకృష్ణుడు అణచదలచెను.

గోవర్ధననాథుడే జగన్నాథుడని తెలిపెను. తూర్పున అతడు జగన్నాథుడై, దక్షిణమున రంగనాథుడై, పడమట ద్వారకానాథుడై, ఉత్తరమున బదరీనాథుడై వెలుగొందుచున్నాడు. అట్టి గోవర్ధననాథుని ఆరాధన మీకు విశేష ఫలముల నివ్వగలదని చెప్పెను. అందరును అంగీకరించిరి. శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారము ఇంద్రయాగమునకు బదులుగా గోవర్ధన పూజ సాగించుటకు నిశ్చయించుకొనిరి.

వివిధములైన పిండివంటలను, పాలు, పెరుగు, వెన్నలను గోవర్ధన పర్వతము చెంతకు చేర్చిరి. బ్రాహ్మణులు హోమముల నారంభించిరి. బ్రాహ్మణులకు దానము లిచ్చిరి.

కుక్కలకు అన్నము లిడిరి. చండాలురకు వస్త్రము లిచ్చిరి. పతితులకు ధాన్యమొసగిరి. గోవులకు తృణమును సమర్పించిరి. గోపాలు రందరు నూతన వస్త్రములను ధరించిరి. గోవులను పూజించిరి. బ్రాహ్మణులకు నమస్కరించిరి. గోవర్ధననాథునకు ప్రదక్షిణము చేసిరి.

గోవర్ధననాథుడు సాక్షాత్తు భగవంతుడే యనెడి భావమును వారిలో కలిగించవలెనని శ్రీకృష్ణుడు భావించెను. గోపాలకు అరుదెంచి యమునా జలమును తెచ్చుట మరచిపోయిరి. అంతట శ్రీకృష్ణుడు వారితో గోవర్ధననాథునికి నమస్కరించమని చెప్పెను. సాక్షాత్తు భగవానుడైన గోవర్ధననాథుడు పర్యాప్తములను నెరవేర్చునని పలికెను. గోపాలురందరు గోవర్ధనునికి చేతులెత్తి నమస్కరించిరి. ప్రార్థించిరి. వెంటనే పర్వతమునుండి యమునా జలము ధారవలె స్రవించసాగినది. దానినే **"మానస గంగ"** యందురు. గోపాలురెల్లరు పరమానంద భరితులైరి.

శ్రీకృష్ణుడు తానొక విశిష్టరూపమును ధరించి "నేనే గోవర్ధన నాథుడను" అని పలికి గోపాలురు చేయుపూజను స్వీకరించెను.

మ॥ సకలాభీరులు చూడఁగ కృష్ణుఁ డొక నైజం బైన రూపంబుతో
నకలంకస్థితి నుండి శైల మిదె మీ కర్పింప రం డంచుఁ దా
నాకశైలాకృతిఁ దాల్చి గోపకులతో నాండోండ పూజించి గో
పకదత్తాన్నము లాహరించె విభుఁ డా ప్రత్యక్షశైలాకృతిన్.

తరువాత విశిష్ట రూపధారియైన శ్రీకృష్ణునికి వ్రజవాసులెల్లరు నమస్కరించిరి. శ్రీకృష్ణుడు కూడా తనకు తాను నమస్కరించుకొనెను. ఈ విధముగా గోవర్ధన పూజ ముగిసిన గోపాలురెల్లరు వ్రజమునకు చనిరి.

ఇచ్చట మనమొక విషయమును గ్రహించవలెను. వస్త్రాపహరణ లీల యందు సాహాయ్యము జరిగెను. గోవర్ధన లీలయందు ఉపాసక ఉపాస్యములు రెండును ఒకటే

యనెడి అభేదదృష్టి ఏర్పడినది. రాసలోనే జీవబ్రహ్మైక్య మనెడి రాసక్రీడకు ఈ గోవర్ధనపూజ చక్కని పునాదియై యున్నది. జీవభావన తొలగినపుడే బ్రహ్మభావన స్థిరపడును. గోవర్ధనలీల జీవభావమును నశింపచేయును. రాసలీల బ్రహ్మభావనను స్థిరపరచును. ఈ గోవర్ధనలీల జరుగునాటికి పరమాత్మ సప్తవర్ష ప్రాయుడై యుండెను.

ఈ సప్తమ వర్షమునందు గోవర్ధన పూజ జరిగినది. ఇది ధ్యానభూమిక. అష్టాంగయోగము నందు ఏడవది ధ్యానము. ఎనిమిదవ భూమికయైన సమాధి రాసలీలయే కాగలదు. రాసలీలలో ఉపయోగించిన భాష హృదయభాష

గోవర్ధన గిరిధారి

గోపాలకృష్ణుని సారథ్యములో గోపోత్సవాన్ని జరుపుకొన్నారు గోపాలురు. గోవర్ధననాథుని పూజ అతి వైభవముగా జరిగినది. బృందావనములో గోవర్ధనగిరి చెంత జరిగిన గోపోత్సవమును గూర్చి ఇంద్రునికి తెలిసింది. తనను కాదని శ్రీకృష్ణుని విశ్వసించి గోవర్ధననాథుని పూజను గావించారు వ్రజవాసులు. కృష్ణునిపై ఈర్ష్య. వ్రజవాసులపై క్రోధము జనించింది.

వాచాలం బాలిశం స్తబ్ధ మజ్ఞం పండిత మానినమ్
కృష్ణం మర్త్యముపాశ్రిత్య గోపా మే చక్రురప్రియమ్

"వాచాలుడు, పసిబాలుడు, అజ్ఞాని, అవినీతిపరుడు, మానవుడగు శ్రీకృష్ణుని విశ్వసించి నన్ను తిరస్కరించారు" అని ఇంద్రుడు క్రోధుడైనాడు. వ్రజపురవాసులను హింసించాలని అభిప్రాయపడినాడు. మేఘములకు ఆజ్ఞ లొసగినాడు. తానూ ఐరావతము నెక్కి వ్రజపుర మరుదెంచినాడు.

ఆకాశమును నల్లటి మేఘాలు దట్టంగా వ్యాపించాయి. అతి స్వల్పకాలంలో వాతావరణము తారుమారైంది. ఆకాశము ఒక్కసారి భయంకరముగా గర్జించింది. ఉరుములు, మెరుపుల మధ్య కుండపోతగా వర్షము కురియసాగింది. వ్రజవాసులందరు తలదాచుకొనుటకు చోటులేక అల్లాడిపోతున్నారు. గోపాలురంతా గోవిందుని శరణు కోరారు.

కృష్ణ కృష్ణ మహాభాగ త్వన్నాథం గోకులం ప్రభో
త్రాతు మర్హసి దేవాన్నః కుపితా ద్భక్త వత్సల!

"భక్తవత్సలా! మహాభాగా! శ్రీకృష్ణా! ప్రభూ! మమ్ములను రక్షింప నీవే సమర్థుండవు. పాహిమాం! ప్రభూ! పాహిమాం!" అంటూ ధ్యానించిరి.

వాస్తవ పరిస్థితిని అచ్యుతుడు అవలోకనము చేసుకొనాడు. ఇంద్రునికి గుణపాఠాన్ని బోధించి, అతని గర్వాన్ని అణచదలచినాడు. వెంటనే ఒకచేతితో గోవర్ధన పర్వతమును ఎత్తి గొడుగులా నిలబెట్టాడు. గోవులతో సహా గోపాలురందరిని గోవర్ధన పర్వతము క్రింద ఉంచాడు.

శా॥ బాలుం డీతఁడు కొండ దొడ్డది మహా భారంబు సైరింపఁగాఁ
జాలండో యని దీనిక్రింద నిలువన్ శంకింపఁగాబోల దీ
శైలాంభోనిధి జంతుసంయుతధరా చక్రంబు పైఁ బడ్డ నా
కేలల్లాడదు బంధులార! నిలుఁడీ క్రిందం బ్రమోదంబునన్.

అనగానే వ్రజవాసులెల్లరు ఛత్రముక్రింద నిలబడినట్లు కొండక్రిందికి వచ్చిరి. అనాయాసముగా చిటికెన వ్రేలుపై గిరిభారము నంతయు శ్రీకృష్ణుడు మోయుచుండెను. వర్షము ఏడురోజులు కుండపోతగా కురిసినది. లీలామానుషవిగ్రహుడైన శ్రీకృష్ణుడు ఏడురోజులు గోవర్ధన పర్వతమును ఎత్తిపట్టియే యున్నాడు. ఇంద్రునికి గర్వమణగి హృదయములో భయాందోళనలు తలెత్తసాగాయి.

కృష్ణ యోగానుభావం తం నిశామ్యేన్ద్రోఽతి విస్మితః
నిస్తమ్భో భ్రష్ట సంకల్పః స్వాన్ మేఘాన్ సంన్యవారయత్ ......

శ్రీకృష్ణునియొక్క ప్రభావమునుగాంచి విస్మితుడైన ఇంద్రుడు నిశ్చేష్టుడై, నశించిన సంకల్పము గలవాడై, మేఘములను వెనుకకు రప్పించెను. ఇంద్రుడు వెంటనే శ్రీకృష్ణదేవుని పాదాలపైబడి క్షమాభిక్షను వేడుతూ ప్రార్థించెను. శ్రీకృష్ణుడు ఇంద్రుని క్షమించి విడిచిపెట్టెను. ఇంద్రుడు క్షీరములో శ్రీకృష్ణుని పాదముల నభిషేకించెను. గోవర్ధనమున ఆ స్థలమునే "సురభికుండ్" అని అందురు.

శ్రీకృష్ణుడు గోపాలురవైపు దిరిగి

క॥ ఉడిగెను వానయు గాలియు వడి పెద్ద నదు లెల్లఁ బొలప వఱద లిగిరెఁ గొం
డడుగున నుండక వెడలుఁడు కొడుకులుఁ గోడండ్రు పశులు గోవులు మీరున్.

అని చెప్పగానే గోపులందరు వ్రజమునకేగిరి.

మనలోని ఇంద్రియములకు ప్రభువే ఇంద్రుడు. భగవంతుని పొందుటకై మనము అనుష్ఠించు ఆధ్యాత్మిక సాధనలకు అవరోధములు మెండు. గోపోత్సవమును భంగం చేయుటానికి కోపోద్రిక్తుడైన ఇంద్రుడు ప్రయత్నిస్తాడు. మన ఆధ్యాత్మిక సాధనలే గోపోత్సవము. ఆధ్యాత్మిక సాధనలను భంగం చేయడానికి ప్రకోపింపబడిన ఇంద్రియాలు ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఇంద్రియ జన్యమైన అరిషడ్వర్గములవలన కలిగెడి ఆవేశమే ఉరుములు, మెరుపులతో గూడిన గాలివాన. అట్టి విషమ సమయాల్లో మనలను ఛత్రమువలె రక్షించి కాపాడునది భగవత్కృప. భగవానుడు మనపై చూపు కృపయే గోవర్ధనగిరిని ఎత్తి నిలుపుటయందు గోచరించు అంతరార్థము.

అక్షయ విభూతి

గాలివాననుండి, పిడుగుపాట్లనుండి గోపాలురు రక్షింపబడిరి. గోవర్ధన గిరినెత్తి శ్రీకృష్ణుడు వ్రజవాసులను బ్రోచెను. ఈ సంఘటన వ్రజవాసులందరిని సంభ్రమముతో పులకింపజేసినది.

వ్రజపురమున గోపులందరు ఒకచోట సమావేశమైనారు. బాలుడైన ఈ శ్రీకృష్ణుడేమిటి? గోవర్ధనగిరిని అమాంతం అలా ఎత్తడమేమిటి? పిల్లలు పుట్టగొడుగును పెకలించునట్లు గోవర్ధనగిరిని పెకలించి; ఏనుగు పద్మమును తొండముతో పట్టునట్లు చేతివ్రేలుమీద కొండను నిలబెట్టెను. ఈ బాలుని అద్భుత లీలలు అనుభవమునకు అందుటలేదని చర్చించసాగిరి.

వారిలో ఒక వృద్ధుడు గంభీరస్వరముతో నందుని జూచి ఇలా పలికెను:

"ఈ బాలుడు మహా భయంకరమైన పూతన యనెడి రాక్షసిని అవలీలగా కుప్పగూల్చి వేసెను. మూడు మాసముల వయస్సులో శకటాసురుని వధించెను. ఒక సంవత్సర వయస్సులో నుండగా తృణావర్తుడను రాక్షసుడు సుడిగాలి రూపమున వచ్చి ఈ బాలుని అపహరించుకొని పోగా, అతడిని చంపి క్రిందపడనైచెను. ఒకనాడు వెన్న దొంగిలించెననెడి నెపముతో తల్లియగు యశోద వీనిని రోటికి కట్టివేయగా; ఇతడు మద్దిచెట్ల నడుమ ప్రవేశించి, ఆ రెండు వృక్షములను గూల్చి వేసెను. బకాసురుడను రాక్షసుని శరీరమును రెండుగా చీల్చివేసెను. వత్సాసురుడను దైత్యుడు లేగదూడ రూపమున వచ్చి మందలో ప్రవేశించగా వాని శరీరమును అవలీలగా వెలగచెట్లమీద విసరివైచి వధించెను. బలరామునితో కలిసి ధేనుకాసురుని, అతని బంధువులను వధించి, తాళవనమును సర్వులకు ఉపయోగపడునట్లు చేసెను. బలదేవునిద్వారా ప్రలంబాసురుడను వానిని జంపించి, కార్చిచ్చునుండి గోపాలురను, గోవులను రక్షించెను. ఇతడే అతి భయంకరమైన విషమును గలిగియున్న కాళీయుని మదమణచి, అతనిని హ్రదమునుండి పంపించి వేసెను.

వ్రజవాసులైన మాకు ఈ బాలునిపై చెప్పరాని, చెప్పలేని మధుర ప్రేమ నిండియున్నది.

క్వసప్తహాయనో బాలః క్వమహాద్రివి ధారణమ్
తతో నోజాయతే శంకా వ్రజనాథ తవాత్మజే ॥

"నందమహాశయా! సప్తవర్షప్రాయుడైన ఈ బాలుడెక్కడ? గోవర్ధన మంతటి పెద్ద పర్వతము నెత్తుటెక్కడ? అందుచేత మేము సందేహముతో కూడియున్నాము" అనెను.

"గోపాలులారా! నా బాలునిపై మీకున్న సందేహమును నివృత్తి చేసేందుకు ప్రయత్నించెదను. ఇతడిని గూర్చి గతంలో గర్గమహాముని నాకు చెప్పిన విషయమునే మీ కెరింగించుచున్నాను.

"ఇతడు ప్రతియుగము నందును జనించుచుండును. గతములో శుక్ల, రక్త పీతవర్ణములను ధరించియుండిన ఈ బాలుడు ఇపుడు ద్వాపరమునందు కృష్ణ వర్ణమును ధరించి యున్నాడు. ఇతడు పూర్వము వసుదేవుని ఇంటిలో జన్మించుటచేత ఇతడిని వాసుదేవుడు అనికూడా అందురు. ఇతనికి నామరూపము లెన్నియో గలవు. ఇతడివలన మనందరికీ శుభములు చేకూరును. ఇతడు అన్ని విధముల నారాయణ సమానుడై యున్నాడు. ఈ బాలుని విషయములో మీరు సంశయ రహితులై ఉండండి" అని నందుడు తెలియజేయగా, వ్రజవాసు లెల్లరు పూర్ణానంద స్వరూపులైరి.

శ్రీకృష్ణునిచేత పరాభవింపబడిన ఇంద్రుడు కామధేనువుతో కూడి ఒకనాడు వ్రజపురమున కరుదెంచెను. శ్రీకృష్ణుని దర్శించెను. గతములో శ్రీకృష్ణుని వైభవమును బ్రహ్మదేవుడు చెప్పగా వినెను. గోవర్ధన పర్వతమును ఎత్తినపుడు శ్రీకృష్ణ విభూతిని ప్రత్యక్షముగా దర్శించగలిగెను. దోసిలొగ్గి శ్రీకృష్ణునికి నమస్కరించెను. సూర్యుని ప్రకాశముతో ప్రభవించు తన కిరీటముతో శ్రీకృష్ణుని పవిత్ర పాదములను స్పృశించెను.

గర్వము నశించగా ఇంద్రుడు శ్రీకృష్ణుని పాదములను స్పృశించెను. అలాగే ఇంద్రియములు ప్రకోపమును పోగొట్టుకోగా ఆత్మయనెడి శ్రీకృష్ణుని పాదమనెడి సత్యమును స్పృశించినవియై, అసత్యమునకు దూరమగును. దేవేంద్రుడు శ్రీకృష్ణుని ప్రార్థించెను.

నమస్తుభ్యం భగవతే పురుషాయ మహాత్మనే
వాసుదేవాయ కృష్ణాయ సాత్వతాం పతయేనమః

"భగవానుడవగు శ్రీకృష్ణా! నీకు నమస్కృతులు. నీవు మహాత్ముడవు. వాసుదేవుడవు. పరమపురుషుడవు. సాత్వతుల కధిపతివి. అట్టి నీకు నమస్కారము" అని ఇంద్రుడు ప్రార్థించెను.

ఆ మాటలకు వాసుదేవుడు మందహాసమును చిందించుచు, "ఇంద్రా! క్షణికమైన స్వర్గాధిపత్యమును జూచుకొని, అహంకారముతో గూడినవాడనైన నిన్ను మేలుకొల్పుటకు దయతో ఈ యజ్ఞమును ఆపించితిని.

మామైశ్వర్య శ్రీమదాన్ధోదణ్డపాణిం న పశ్యతి
తం భ్రంశయామి సంపద్భ్యో యస్యచేచ్ఛామ్యను గ్రహమ్

"ఐశ్వర్య మదాంధుడైనవాడు నన్ను తెలిసికొనలేడు. అందుచేత నేనెవ్వరిని అనుగ్రహించ దలచితినో వారిని ఐశ్వర్యభ్రష్టులను గావించెదను."

ఐశ్వర్యము కనులను గప్పివేసి కమలనాభుని దర్శించకుండా చేయును. వెతలు హృదయమధ్యముపై వెలుగుల వెల్లనువేసి శాంతి వెన్నెలను చిందించును. అందుచేత భక్తులందరూ బాధలనే వాంఛించారు.

భగవానుడు ఇంద్రుని ఆశీర్వదించెను. ఇంద్రునితో కలసివచ్చిన కామధేనువు భగవానునకు నమస్కరించి తన క్షీరముద్వారా పరమాత్మను అభిషేకించెను. గోవిందుడని పేరు నొసంగెను.

మ॥ సురభి క్షీరములన్, సురద్విప మహా శుండా లతావీత ని
ర్జరగంగాంబువులన్ విరించజననీ సద్మావిసంఘంబుతో
సురనాథుం డభిషిక్తుఁజేసి పలికెన్ సొంపార గోవిందుఁ డం
చు రణాక్రాంతవిపక్షుఁ దోయజదళాక్షున్ సాధుసంరక్షణున్.

దేవతలు పుష్పవర్షమును కురిపించిరి. నారద తుంబురాదులు స్తుతించిరి. సుర్లోకములు ఆనందించెను. ఆవులు పాలను చేపినవి. చెట్లు మధువును వర్షించినవి. శ్రీకృష్ణుడు అభిషిక్తుడుకాగా సర్వజీవరాసులు శాంతిని పొందినవి.

వరుణుని శరణాగతి

శ్రీకృష్ణుని సహచర్య భాగ్యమును పొందిన వ్రజవాసులు ఏకాదశీ వ్రతమును శ్రద్ధగా ఆచరించుచుండిరి. సర్వవ్రతములలో ఏకాదశీ వ్రతము ప్రశస్తమైనది, పావనమైనది యని తెలుపబడియున్నది.

నందబాబా ఏకాదశీ ఉపవాసము గావించెను. ద్వాదశినాడు స్నానమాచరించుటకు బయలుదేరెను. యమునను సమీపించెను. నదిలో దిగి స్నాన మాచరించుచుండెను. అర్ధరాత్రి అసురసమయము. అట్టి సమయమున స్నాన మాచరించరాదు. నందుడు అసురసమయమున యమునలో స్నానమాచరించుట చూసి వరుణుని భృత్యుడొకడు నందుని వరుణునివద్దకు పట్టుకుపోయెను.

నందుడు కనుపించలేదని వ్రజవాసులు ఆవేదన చెందుచుండిరి. శ్రీకృష్ణుడు తన దివ్యజ్ఞానముచేత తండ్రి వరుణలోకమున ఉన్నాడని గ్రహించెను. వెంటనే వరుణలోకమున కేగెను.

శ్రీకృష్ణుని దర్శించగానే వరుణుడు అమితానంద భరితుడయ్యెను. శ్రీకృష్ణుని అర్చించెను. కీర్తించెను.

"ప్రభూ! పరంధామా! ఈనాడు నాజన్మ తరించినది. నీ దర్శన భాగ్యముచే నా చిత్తము నిర్మలమైనది. నీ అంఘ్రియుగ్మము చెంత ఎందరో తరించారు. ఇంతవరకు నాకాభాగ్యము లభించలేదు. నన్నుగూడా నీ భృత్యులలో నొకడిగ చేర్చుకొనుము.

ఉ॥ నీ విభుపాదపద్మరతు లెన్నఁడు నెవ్వరుఁ బొందలేని సెం
ద్రోవఁ జరింతు రట్టి బుధలోకక నీ వరుదెంచుటం బ్రమో
దావృత మయ్యెఁ జిత్తము గృతార్థతనొందె మనోరథంబు నీ
సేవఁ బవిత్రభావమును జెందె శరీరము నేఁడు మాధవా!

అని వరుణుడు శిరమొగ్గి నమస్కరించెను. "భగవాన్! శ్రీకృష్ణా! మందమతులైన నా భృత్యులు తెలియక నీ తండ్రి నిచటకు గొనితెచ్చినారు. నా భృత్యులు చేసిన

అపరాధమును మన్నించమని నీ భృత్యుడు ప్రార్థించు చున్నాడు. తండ్రీ! వాసుదేవా! నన్ను కరుణించి నందుని గొనిపొండు" అనెను.

శ్రీకృష్ణుడు నందుని వెంటనిడుకొని వ్రజపురమున కరుదెంచెను. అందరును సంతసించిరి. వరుణుడు శ్రీకృష్ణుని స్తుతించిన విషయమును నందుడు వ్రజవాసులెల్లరికిని తెలియజేసినాడు.

వ్రజవాసులెల్లరు శ్రీకృష్ణుని సాక్షాత్తు పరమాత్మగా భావించసాగిరి. తమకు శ్రీకృష్ణుడు తప్పక సద్గతిని ప్రసాదించునని వారు తలపోసుకొనుచుండిరి. శ్రీకృష్ణుడు వ్రజవాసుల హృదయములలో కదులుతున్న భావనను కనిపెట్టెను. తనవారైన గోపాలురకు వైకుంఠ దర్శనము నొసంగెను.

సత్యం జ్ఞాన మనన్తం యద్బ్రహ్మ జ్యోతిః సనాతనమ్
యద్ధి పశ్యన్తి మునయో గుణాపాయే సమాహితాః

అది సత్యమైనది. జ్ఞానరూపమైనది. అవధులు లేనిది. ప్రకాశైక రూపమైనది. శాశ్వతమైనది. మహర్షులు పొందిన అట్టి ఉత్తమగతిని వ్రజవాసులు దర్శించిరి. పూర్వము అక్రూరుడు ఎచ్చట బ్రహ్మజ్ఞానము నొందెనో అచ్చోటికి నందాదులను శ్రీకృష్ణుడు తీసుకొని వెళ్ళినాడు. ఆ సరోవరమునందు బ్రహ్మరూపమును సందర్శించినారు. శ్రీకృష్ణుని సంపర్కముచే బ్రహ్మ సంబంధమును బడసి తరించారు.

శ్రీకృష్ణుని వరుణలోక యాత్రలోని అంతరార్థము గ్రహించవలయును. వరుణుడనగా నెవరు?

రసనాయా వరుణః

నాలుకకు అధిష్ఠాన దేవత వరుణుడు. రసమును ఆస్వాదించునది రసనేంద్రియము గనుక రసోత్పత్తికి ఉపకరించు వరుణుడు నాలుకకు అధిష్ఠాన దేవతయై యున్నాడు.

రసనేంద్రియ నిగ్రహము అత్యంత అవసరమైనది. రాబోవు అధ్యాయము రాసక్రీడయై యున్నది. ఎవడయితే షడ్రసములను వాంఛించునో అట్టివానికి రాసరసము లభించదు. విషయానందమునందు చరించువాడు ఆత్మానందమున రమించలేడు.

నందుడు అనగా ఆనంద స్వరూపుడు. జీవుడే ఆనంద స్వరూపుడు. అట్టి జీవుడు స్నానించునెడ నదిలో అజ్ఞాన నిశీధిలో కాలిడగానే షడ్రసముల చేత ఆకర్షితుడై యుండును. అదియే వరుణలోకము.

వరుణలోకములో కాలిడిన నందుడు శ్రీకృష్ణునిచేత విడిపించబడును. ఎవని నాలుక షడ్రసములకు బానిసమై చరించుచున్నదో అట్టి నాలుకను నిగ్రహించే ప్రయత్నములో దానికి భగవన్నామరుచిని కల్పించవలెను. నామము ప్రవేశించినచో నామి ప్రవేశించినాడని భావము. భగవంతుడు, భగవన్నామము రెండూ ఒక్కటే. నామ ప్రభావముచేత నాలుక నిగ్రహించబడును. నిగ్రహించబడిన నాలుక నామములో పయనించును. జీవనము

ఏడి ఆనందరసపానము చేయుటకు ముందుకు కదలును. అదియే నందుడు వరుణలోకము నుండి వెనుకకు మరలుటలోని అంతరార్థము.

విషయరస విముఖతలో ఆత్మరసానుభూతి కలుగును. భగవంతుడు రసస్వరూపుడు. రస స్వరూపుడైన భగవంతునిలో చిత్తమును సమరసము గావించుటయే రాసక్రీడ. రాబోవు అధ్యాయము రాసక్రీడ. రసనేంద్రియమును జయించిన వారే రాసరసమును పానము చేసి రసస్వరూపులై తరించగలరు. నందుని శ్రీకృష్ణుడు వరుణ లోకమునుండి విడిపించినట్లు, జీవుని శ్రీకృష్ణనామము సంసార జీవనమునుండి విముక్తుని గావించును.

రాసక్రీడ

రాసలీల ఒక అద్భుత ఆధ్యాత్మిక క్రీడ. వికాసయుత జీవన ప్రగతియే అందు గోచరించు విలాస విన్యాసము. కామవాంఛలను దూరంచేసి ప్రేమను అంకురింపచేయడమే అందలి పరమార్థము. జీవుల హృదయముల యందలి రాగములను విరాగములుగా మార్చి, వానిని రసరాగములుగా రూపుదిద్దుటయే అందులోని నిగూఢార్థము. ఇంద్రియనిగ్రహము, అచంచల భగవద్భక్తి, నిరంతర భగవత్సేవాభిలాష గలవారే రాసలీల రహస్యములను అర్థంచేసుకోగలరు.

రాసలీలలో ఇరువురి గోపభామల మధ్య గోపాలుడు నిలచియుండును. ప్రతిగోపికకు భగవానుడు తనదగ్గరే యున్నట్లు గోచరించును. అలాంటి అనుభూతిని భగవానుడొక్కడే కలిగించగలడు. కనుకనే "కృష్ణస్తు భగవాన్ స్వయం" శ్రీకృష్ణుడు స్వయంగా భగవానుడేయని భాగవతం ఘోషించింది.

గోపికలు శ్రీకృష్ణుని ప్రేమించారు. ఒక్క క్షణంకూడా శ్రీకృష్ణుని విడిచి జీవించలేకపోయారు.

గృహకృత్యాలు మరచారు. భర్తలను త్యజించారు. ప్రాపంచిక బంధాలన్నీ త్రెంచుకున్నారు. శ్రీకృష్ణునియందు వారు చూపిన ప్రేమ సంకుచితమైనది కాదు. లైంగిక ప్రధానమైన తృష్ణ అచ్చట అభివ్యక్తం కాదు. అది పరాప్రేమ. దివ్యప్రేమ. కామవారహిత ప్రేమ. జీవాత్మ పరమాత్మల ఐక్యసంధానమే ఆ మాధుర్యప్రేమ.

రాసక్రీడకు ఆద్యంతాలులేవు. ప్రతిమనిషి అంతర్యంలో నిరంతరము సాగుతూనే యుంటుంది. రాసక్రీడలో ప్రతి గోపికచెంత మాధవుడుంటాడు. రాసక్రీడలో ఇరువురి గోపభామల మధ్య ఒక గోపాలుడుంటాడు. గోపిక స్త్రీ సంకల్పమూ స్త్రీ లింగమే. మన మనసులో జనించే సంకల్పాలే గోపికలు. ఇద్దరు గోపభామల మధ్య గోపాలుడు. రెండు సంకల్పాల మధ్య పరమాత్మ స్వరూపం. సంకల్పములను స్వాధీనపరచుకొని ఆత్మ సాక్షాత్కారమును పొందవలయునని రాసలీలద్వారా బోధిస్తారు.

యోగః చిత్తవృత్తి నిరోధః

సంకల్పాలను అరికట్టడమే యోగమని పతంజలి యోగదర్శనము.

నిస్సంకల్పో ముక్తిః

సంకల్పరాహిత్యమే మోక్షమని శాస్త్రవచనము. శ్రీకృష్ణునికి 16008 మంది భార్యల నడముకూడా అసంఖ్యాకమయిన సంకల్ప సమూహము నపహరించుటయే నని గ్రహించాలి. బృందావనంలో రాసక్రీడ జరుపునాటికి శ్రీకృష్ణుని వయస్సు ఎనిమిది సంవత్సరాలు. ఎనిమిది సంవత్సరాల వయస్సులో తాను చూపిన తాత్త్విక క్రీడా విలాసాలకు వక్రభాష్యం చేయడము మన మనోస్థాయికి ప్రతిబింబమే అవుతుంది.

రాసక్రీడలో శ్రీకృష్ణుని వయస్సు ఎనిమిది సంవత్సరాలు. అష్టాంగ యోగములో ఎనిమిదవ భూమిక సమాధి. రాసమండలిలో రసశేఖరుడైన శ్రీకృష్ణభగవానుని పొందు సమాధియేగాని అన్యముగాదు.

రసో వైసః

భగవానుడు రస స్వరూపుడని వేదము చెబుతుంది. జీవాత్మ రసస్వరూపుడైన భగవానునితో రసరూప జ్ఞానముతో కలిసిపోవుటయే రాసక్రీడ. ఈ రాసక్రీడయందు మనస్సు సంపూర్ణముగా నిరోధించబడును.

రాసక్రీడయందు గోపికలు శ్రీకృష్ణునితో కలిసి క్రీడింతురు. వారిది పరమ విరహాసక్తియని నారదమహర్షి వచించియున్నాడు. అందుచేతనే పరాభక్తిని గూర్చి వివరించినపుడు గోపికలనే ఉదాహరణముగా గ్రహింతురు.

యథా వ్రజగోపికానాం

అన్నారు నారదమహర్షి. గోపికల భక్తియే నిజమైన భక్తి.

శ్రీకృష్ణుడు ఒకనాడు గోవులను తోలుకొని వనమునకు వెళ్ళెను. సాయంత్రము తిరిగి వచ్చుచుండెను. అల్లంతదూరాన ఆవులమధ్య నెమలిపింఛము గోచరించుచుండెను. ఒక గోపిక పరుగెత్తుకుంటూ వెళ్ళి "కృష్ణయ్యా! కృష్ణయ్యా!" అనెను.

"ఏమిటా ఉత్సుకత? ఏమిటా పరుగు?" అన్నాడు శ్రీకృష్ణుడు.

"కృష్ణయ్యా! ఈ సృష్టి బాగలేదు. బ్రహ్మకు సృష్టికార్యము చేయను తెలియదు" అన్నది గోపిక. "గోపెమ్మా! ఈ సృష్టి ప్రయోజనాత్మకమైనది. బ్రహ్మ సృష్టిలో నిష్ప్రయోజనమైన వస్తువేలేదు. అయినా ఏ వస్తువు ఈ సృష్టిలో నీకు అనవసరముగా గోచరించినది?" అని అడిగాడు కృష్ణయ్య.

"కృష్ణయ్యా! చూచేందుకు బ్రహ్మదేవుడు కన్ను లిచ్చాడు. బాగుంది. మరి ఆ కన్నులపై రెప్పలెందుకు పెట్టాడు? కంటిపై రెప్ప ఉండుటచేత క్షణకాలము నిన్ను చూచుట తప్పిపోవుచున్నది. క్షణకాలము నీ దివ్య ముఖారవిందము గోచరించకుండా కనురెప్పలు అడ్డు నిలుచుచున్నవి. కంటిపై రెప్పలు లేనిచో నిన్ను తదేకముగా దర్శించెడివారమే గదా!" అన్నది గోపిక. ఇదియే అనన్య భక్తి. పరాభక్తి.

రాసక్రీడలో పాల్గొనిన గోపికలు సాధారణ స్త్రీలుకారు. మహర్షులే గోపికల రూపమున ఆవిర్భవించినారు. అనేక యుగములలో ఘోరతపము లాచరించినను వారిలోని కామవాసనలు చావకుండెను. దానిని జయించవలె నని శ్రీకృష్ణుని ప్రేమను పొందుటయే శరణ్యమని భావించి, వారు వ్రజము నందు జన్మించి, శ్రీకృష్ణునితో చెలిమిచేసి రసరాణులై, ఆత్మానంద రసమును పానముచేసిరి. శ్రీకృష్ణుని సంపర్కముచేత వారికి బ్రహ్మజ్ఞానము కలిగినది.

గోపికలకు దేహధ్యాస తెలియదు. లేదు. ఒక గోపిక ప్రమిదను చేత పట్టుకొని ప్రక్కింటికి వెళ్ళి, అక్కడ ప్రమిదలోని వత్తిని వెలిగించుచుండెను. ఇంతలో కృష్ణయ్య వచ్చుచున్నాడని ఎవరో పలికిరి. గోపిక తలను ప్రక్కకు త్రిప్పిచూసెను. శ్యామసుందరుని ముఖారవిందము గోచరించెను. అంతే. ఆ గోపిక శ్రీకృష్ణుని రెప్పవాల్చకుండా చూచుచుండెను. ఈలోగా ఆమె వ్రేలుకు అగ్ని అంటుకొని కాలిపోవుచుండెను. అయినా ఆ గోపిక కించిత్తైనను బాధపడలేదు. శ్రీకృష్ణ ధ్యానంలో ఆమె చిత్తము లయించింది. దేహధ్యాస దూరమైంది. మనసు కృష్ణచైతన్యంలో ఎప్పుడయితే లయించిపోయిందో; ఆమె దేహేంద్రియ మనోబుద్ధులను అధిగమించి సత్తా స్వరూపమైన ఆత్మలో విలీనిపోయింది. సాధారణ మోహమునందు ప్రాణులకు ఈ విధమైన అనుభూతి కలిగే వీలున్నదేమో! ఆలోచించండి.

శరద్రాత్రులు అరుదెంచినవి. గోపికల చిరకాల వాంఛను నెరవేర్చుటకై తన యోగమాయను ఆశ్రయించినవాడై శ్రీకృష్ణుడు రాసక్రీడను జరుపుటకు ఉద్యుక్తుడయ్యెను. గోపికల హృదయములను కదలించి, వారి చిత్తములను అపహరించు నుద్దేశ్యముతో శ్రీకృష్ణుడు బృందావనంలో యమునాతీరమున నిలచి వేణువు నూదెను.

మురళి పిలుపు వినబడింది. అది సామాన్యమైన పిలుపుకాదు. మోహన దివ్యనాదము. మనోహర మంజుల గానము. భరించలేని ఆనందాన్ని, నిలుపుకోలేని పారవశ్యాన్ని కల్పించే అద్భుతనాదము. అమరగానము.

మురళీరవము బృందావన కుంజ కుటీరములో మ్రోగుతున్నది. పలకరిస్తున్నది. మానవ పిలుస్తున్నది. పిచ్చివాళ్ళను చేస్తున్నది. హృదయ తంత్రులను మీటుతున్నది. మానవ వీణను స్వరమధురంగా పలికిస్తున్నది.

వెన్నెల రాత్రిని విడవ ద్దంటున్నది. మల్లెల రాత్రిని మరువవ ద్దంటున్నది. నవ్వుల రాత్రిని నిలిపివేయుమంటున్నది. వికసిత మల్లికల వింజామరలందించు సుగంధ మారుతాన్ని దూరం చేసుకోవ ద్దంటున్నది. దామోదరుని చెంతకు దాపరికంలేకుండా నడువమంటున్నది.

గోపెమ్మలు గోప్యములేకుండా గోపాలుని చెంతకు నడువసాగారు. మురళీరవ స్వాగత సునాద స్పందనకు గోపికలు అప్రయత్నముగా నడువసాగారు. వంశీరవము వినబడు సమయానికి కొందరు గోపికలు వడ్డించుచుండిరి. వడ్డన అర్ధమైంది. యమునా ఒడ్డు ఆహ్వానించింది. అంతే, చెప్పకుండా వారు కదలిపోయిరి.

ఒక గోపిక బిడ్డకు స్తన్య మిచ్చుచుండెను, స్తన్యపానము చేయుచున్న బిడ్డను అక్కడే వదిలేసి, తొలగిన చెంగును సరిచేసుకొనక, వదలిన రవికను సరిపెట్టుకోక ఉన్మాదినివలె కేరు దాటుతున్నది.

ఒక గోపిక భర్తకు సేవచేయుచుండినది. మురళి పలికింది. మురళీ సుధారవముతో హారి భర్తకాగా, భర్తను అమాంతం వదలి అందెల రవళితో అచ్యుతుని వైపు అడుగులు వేసుకుంటూ వెళ్ళింది.

ఒకతె స్నానము చేయుచుండినది. ఇంకొకతె దేహమును తుడుచుకొనుచున్నది. మరొకతె కురులను ముడుచు కొనుచున్నది. వేరొకతె కాటుకను దిద్దు కొనుచున్నది.

యమునను చేరే నాకు స్నానమేల? అని ఒకతె. అక్కడి దేహమును ఇక్కడ తుడవ నవసరమేమి? అని ఇంకొకతె. కురులను కన్నయ్య కరములే ముడవాలి అని మరొకతె. కాటుకకుర్రాడే కనులలో కాటుకను దిద్దాలి అని వేరొకతె.

తగదన్నారు తండ్రులు. పోవద్దని పతిదేవుళ్ళు. బాగులేదని బంధువులు. పోగేందుకు వీలుపడదని సోదరులు. తగదంటే తనువు లాగవు. పోవద్దంటే పారిపొమ్మని భావమంటుంది మనస్సు. బాగులేదంటే బాగుండేలా వెళ్ళమని బుద్ధి భాష్యము. పోగవద్దంటే ఆగమని భావంకాదని సంకల్పము.

కొందరు గోపభామలు వేణురవమును ఆలకించి, కదలలేక గృహమునందే ఉండిపోయారు. వారి మనసే మల్లెతోట కాగా, మాధవుడు మాలీ అయ్యాడు. మనను మాధవునిలో లయించుటచేత వారి బ్రతుకులోని అశుభములన్నియు తొలగిపోయినవి. నిర్బంధింపబడిన గోపెమ్మలు దేహములను వదలి దేవదేవునిలో ఐక్యమైరి.

మ॥ తరుణుల్ గొందఱు మూలగేహముల మద్దండించి రారాక త
ద్విరహాగ్నిం బరితాప మొందుచు మనోవీథిన్ విభున్ మాధవుం
బరిరంభంబులు సేసి జారు(డనుచున్ భావించియుం దొక్కి పొం
దిరి ముక్తిన్ గుణదేహముల్ విడిచి ప్రీతిన్ బంధనిర్ముక్తలై

నదులు భూమిని చేరినట్లు, వనితలు వాసుదేవుని చేరిరి. ఏరులు సాగరము చేరునట్లు వారలు కరుణామయుని చేరిరి. పిల్లగాలి పిలుచుచుండ, వెన్నెల వెంట నడుచుచుండ, వాలుజడలు మల్లెలతో నిండియుండ, వేణురవమును విని వన్నెకత్తెలు వెన్నుని సమీపమునకు చేరిరి.

శ్రీకృష్ణుడు గోపికలను చూసెను. వారిని సమీపించెను. మందహాసమును చిందించుచు, "గోపికలారా! క్షేమమా? మీ రాకకు కారణమేమి? ఇది రాత్రి సమయము. క్రూరజంతువులు సంచరించు భయంకర వనప్రదేశము. మీరు రాదగిన స్థలముకాదిది. వెంటనే ఇండ్లకు పొండి. భర్తలను సేవించండి. పుత్రులను చేరదీయండి. గోవత్సములను తృప్తి పరచండి" అనెను.

శ్రీకృష్ణుని పలుకులు వారి హృదయములను తీవ్రంగా గాయపరచాయి. విషాద గ్రస్తులైనారు. కళ్ళుచెదిరాయి. కన్నీళ్ళు కదిలాయి. కుచములను తడిపాయి. కంఠములు గద్గద మవుతున్నాయి.

"కృష్ణా! నీవేనా ఈ మాటలంటున్నది? దీనవత్సలా! వెన్నతినిన నీనుండి ఇంతటి కఠోరవాక్కు లెలా కదిలాయి? మా ఆశలను వమ్ముచేస్తావా? మా బ్రతుకులను బూదిచేస్తావా? నీకు దూరమై మేము జీవించగలమా? మే మెవరికొరకు బ్రతకాలి? పత్నులకు భర్తవైన నీవు మా బ్రతుకులకు కర్తవైయుండ భర్తలతో మాకు పని ఏమి? పున్నామ నరకమును తప్పించు పరమ పావనుడవు నీవు మాకు దిక్కైయుండ పుత్రులతో ఇక పని ఏమి?

"దేవా! మా కరములు పూర్వము గృహ కృత్యములను చక్కగా నిర్వర్తించుచుండినవి. వాటిని హరించిందెవరు? నీవుకాదా? మా హృదయాకాశమున భావ హరివిల్లుతో గుడికట్టి మా పతివైన కృష్ణచంద్రుని బంధించుకొనినాము. నిత్యార్చకుల మైనాము. కృష్ణా! మా అంతర్యంలో నీకు గోచరించిన దోషమేమి? మా అర్చనలో నీకు కనుపించిన మోపమేమి?

"దేవా! మేము వ్రజమునకు వెళ్ళము. వెళ్ళలేము. నీ వేణురవామృతమును పానంచేస్తూ ఇక్కడే అమరులవుతాము. లేదా మా హృదయారణ్యం నుండి బయల్వెడలే దావాగ్నిచే దహించబడి ఇక్కడే మరణిస్తాము. తరించినా, అంతరించినా నీ చెంతనే జరగాలి!" అంటూ బోరున విలపించసాగారు.

గోపికల విషాదమును గాంచి శ్రీకృష్ణుడు విచలితుడయ్యాడు. వికసిత వదన మనోహర మూర్తిలా గోచరించాడు. మందహాసమును చిందించాడు. అందానికే భాష్యము చెప్పే గోపాంగనలను సమీపించాడు.

ఒక గోపిక ప్రక్కన నిలబడి, "నీవంటే నాకు చాలాఇష్టం. ..... ఇలారా ..... అలా వెళ్ళి మాట్లాడుకుందాం" అంటూ ఒక గోపికతో నడచి, కదంబవృక్షము చెంతకు చేరినాడు.

"నీ కన్నీటిని చూడలేడు నీ కన్నయ్య ...... కబుర్లు చెప్పుకుందాం రా ......" అంటూ మరొక గోపికతో కదలి యమునా సైకత శ్రేణులపైకి నడిచాడు.

శశిముఖి! ముఖరయ మణిరశ నాగుణ మనుగుణ కంఠనిదానం
శ్రుతి యుగళే పికరుత వికలే మమ శమయ చిరాదవ పాదం ......
క్షణమధునా నారాయణం, అనుగత మను సర రాధే.....

"సఖీ! పూర్ణచంద్రుని బోలు ముఖారవిందముగల నా చెలీ! చిరకాలమునుండీ కోకిలం కుహూకారములు విని, నా వీనులకు విసుగు జనించియున్నది. ఏదీ! నీ మంజులవాణి నా వీనులకు విందు చేయుచుండ, నీ అందెలరవళి నన్ను పరవశింప జేయుచుండ, ఆనందము నాననూర్చి నాకు పసందు నాననూర్చుము" అని మరొక గోపికను స్మరించుచున్నాడు.

సముదిత మదనే రమణీ వదనే చుంబన వలితాధరే
మృగమద తిలకం లిఖిత స పులకం మృగమివ రజనీకరే
రమతే యమునా పులినవనే విజయీ మురారి రధునా .....

ఒక వనితను చుంబించుటకు అనుకూలంగా తన్నైపు త్రిప్పుకున్నాడు. శశి వదనమున గోచరించు మచ్చవలె ఆమె వదనమున కస్తూరి దిద్దుతున్నాడు. కరుణతున్న ఆమెను కవ్విస్తున్నాడు. విజయుడైన మురారి బృందావన విహారియై యమునా తీరంలోని సైకత శ్రేణులపై విహరించసాగాడు.

శ్రీకృష్ణుడు తనదగ్గరే యున్నట్లు ప్రతి గోపిక భావిస్తున్నది. రాసమండలిలో అదొక రమణీయ కథావస్తువు. కమనీయ సుధాసింధువు.

గోపికలచే పరివేష్టితుడైన మురళీధరుడు యమునాతటిపై వ్యత్యస్త పాదారవిందుడై నిలబడి తాను కదలక, పద్యాలను కదలిస్తున్నాడు. తారకల మధ్య పూర్ణచంద్రునివలె భాసించుచు, గోపికల హృదయాలను సంతృప్తి పరచుచున్నాడు. వైజయంతీమాలను ధరించి తాను గానము చేయుచుండెను. ఒక్కొక్కసారి ఆయన దివ్య మహాత్మ్యమును గోపికలు గానము చేయుచుండిరి. ఈ విధముగా శ్రీకృష్ణుడు గోపభామలతో విహరించసాగెను.

శ్యామసుందరుని పొందు లభించిన తాము ఈ లోకమునందలి స్త్రీలందరి కంటెను అదృష్టవంతులమని గోపభామలు గర్వించిరి. గర్వమును వచ్చుని గోపాలుడు దానిని పోగొట్ట నిమిత్తము అదృశ్యమయ్యాడు.

అన్తర్హితే భగవతి సహసైవ వ్రజాఙ్గనాః
అతప్యం స్తమచక్షాణాః కరిణ్య ఇవ యూథపమ్

శ్రీకృష్ణపరమాత్మ యమునా తీరమున అంతర్హితుండు కాగా గజశ్రేష్ఠునికి దూరమైన ఆడ ఏనుగులవలె వ్రజాంగనలు ఆయనను కనుగొనలేక విషాద మనస్కులైరి.

శ్రీకృష్ణుని గూర్చియే చింతించసాగిరి. అతని నడకనే అనుసరించసాగిరి. నవ్వినా, నడచినా, కనినా, కదిలినా ప్రతి విషయములోను శ్రీకృష్ణునే అనుకరించసాగిరి. బిగ్గరగా శ్రీకృష్ణుని పిలుచుచూ వనమంతా పరిభ్రమించుచుండిరి. శ్రీకృష్ణుని చూచితిరా యని వృక్షముల నడుగసాగిరి.

"ఓ చందన వృక్షములారా! మా కృష్ణచంద్రుని గాంచితిరా? మన్మథ ప్రియుడైన మాధవా! ఎందుకు మమ్ముల నిలా ఏడిపించుచున్నావు? ప్రపంచానికి ప్రాణదాతవైన నీవు మా ప్రాణములను హరించుదానవైతివా? నీ చల్లదన మేమైనది? చందన వృక్షములలో జాతినాగులుండును. ఒకవేళ ఆ వృక్షములపైన వదరినచ్చుటచేత నీవు విషపూరితమైతివా! మాధవా! మన్నించు. నిన్ను అననేల? మా హృదయమే అంత కఠినముగా నున్నది.

"ఓ యమునా! మన చెలికాడు ఏమయ్యాడు? యమునా! పలికేక, పలికేక పోతున్నావు. ఎందుకింత మౌనం? కృష్ణుడు కనుపించుటలేదని దిగులుచెందితివా? లేక అతడు నీలో దాగియుండెనా?

'అల్లకల్లోలమాయె నమ్మా! యమునాదేవి
మాయార్తుల దీర్చుమమ్మా
మల్లెలతో పూజించి మ్రొక్కేము బ్రోవుమమ్మా ॥అల్ల॥

అని గోపికలు యమునతో మొఱ బెట్టుకొన్నట్లు త్యాగరాజస్వామి నౌకాచరిత్రములో రచించారు.

"మా బ్రతుకులేమైనా ఫరవాలేదు. మాధవుడు హాయిగా ఉంటే చాలు" అంటూ కృష్ణగత చిత్తులై విలపించసాగారు.

"అశ్వత్థమా! అచ్యుతుడు అగుపించెనా? జువ్వివృక్షమా! జనార్దనుని జూచితివా? మఱ్ఱివృక్షమా! నాగమా! నవనీతచోరుడేడీ? గోవిందచరణప్రియా! తులసీమాతా! గోపాలుడెక్కడ? మాలతీ! మల్లికా! యూధికా! జాతీ! మన నాథుడేడీ? మీకు లతలుండి లాభమేమి? వంశీధరుని పట్టలేక, కట్టలేక పోయితిరా?

సీ॥ పున్నాగ కానవే పున్నాగవందితుఁ దిలకంబ కానవే తిలకనిటలు
ఘనసార కానవే ఘనసారశోభితు బంధూక కానవే బంధుమిత్రు
మన్మథకానవే మన్మథాకారుని వంశంబకానవే వంశధరునిఁ
జందన కానవే చందనశీతలుఁ గుందంబ కానవె కుందరదను
తే. నింద్రభూజము కానవే యింద్రవిభవుఁ గువలవృక్షమ కానవే కువలయేశుఁ
బ్రియకపాదప కానవే ప్రియవిహారు ననుచుఁ గృష్ణుని వెదకి రయ్యబ్జముఖులు.

"యమునా తటమున శోధించు వృక్షములారా! మిమ్మారాధించు మా హృదయములను శాంతిపరచండి. మా నాథుని రాకను తెలియజేయండి" అంటూ కదలలేక భూమిపై కూలబడ్డారు.

మమ మరణమేవ వరమతి వితథ కేతనా
కి మితి విషహామి విరహానల మచేతనా...
యామి హా కమిహాశరణం ....

"నా నాథుడు లేని ఈ చోట నేనెలా మనగలను? అచేతననై ఎలా పడియుండగలను? విరహబాధ నెలా సహించగలను? నాకు ఇక మరణమే శ్రేయము నానగూర్చును" అంటూ విలపించుచున్న గోపికా విరహమును జయదేవుడు చూపుతాడు.

నిశ్చేష్టులై భూమాత గుండెపై పడ్డారు. "తల్లీ! భూమాతా! ఓ భూదేవీ! పలుకవేమి? నీవైనా విజంచెప్పు. మా గోవిందుని పాదములు నీ హృదిపై నడచివెళ్ళినవి గదా! అవులవెంట దిరుగునవియు, భక్తుల హృదయములలో కదలక నిలిచి వెల్గునవియు, కాళీయునిపై నాట్యమాడినవియు, మా కుచద్వయముపై నర్తించిన ఆ దివ్యపాదారవిందములను గాంచితివా? అవి ఎక్కడున్నవో మాకు చెప్పవా?

"ఓ ఆకాశమా! ఓ మేఘసరమా! మా కృష్ణచంద్రుడేడీ? మయూరాలకు నడకను నేర్పే మా శిఖిపింఛమౌళిని చూచితిరా? మా గతులెలా మారిపోయినవో చూడండి. క్షణాలు

యుగాలుగా తెలుస్తున్నాయి. లోకములో వెలుగేమైనది? మాకంతా చీకటిమయంగా తెలుస్తున్నది.

"మాకు శ్యామసుందరుడే సర్వస్వము. మాలో సారభూతమైన శక్తి అతడే. అతను లేని మేము కట్టెలవంటి వారము. మా నాసికములలో వ్రేలాడే ముత్యాల సరము మా మాధవుడే. మా ఆభరణాలన్నీ అతడే. అతడే మాకు సిరియూ, సంపదమూ. విధాత కరుణించి మాకు కన్నయ్యను ప్రసాదించాడు. విధి అతన్ని మాకు దూరంచేసింది. మా నొసటివ్రాత అలాంటిది. కన్నయ్యలేని కాలమెలా గడవాలి? కాలుని వాత పడుటయే మేలు. ఓ మృత్యువా! రా! మమ్ములను కౌగలించుకో. నీ ఒడిలో మమ్మునుంచు రాలిపోనీ. నీ మడిలో మమ్ములను కదలిపోనీ. అతడి వియోగంలో మేము మరణించామనే సత్యం అతడికి తెలిస్తేచాలు. కృష్ణా! ఇక మేము బ్రతుకలేము. నీ సంకల్పములో మరణించుటకన్నా మాకు మరొకమార్గములేదు.

"కృష్ణా! గొల్లభామలము, చదువు తెలియనివారము, సంస్కారము లేనివారము. సభ్యత అర్థంగాని వారము. అందుకని మమ్ములను పరిత్యజించావా? కన్నయ్యా! లేనిది ఇవ్వలేకపోవచ్చు. ఉన్నదేదీ దాచుకోలేదు. దామోదరా! ఆవేదనలో దరి తెలియక చింతిస్తున్నాము. అమృతము దగ్గరకు అడుగులు వేసుకుంటూ వెడితే నా మోము చూడగానే పీయూషము విషంగా మారుతున్నది. ఎంతటి దురదృష్టము! కన్నయ్యా! మా దురదృష్టమే నిన్ను మాకు దూరంచేసింది. విరహాగ్నిని చల్లార్చుకొనేందుకు యమునలో కాలిడితే భరించలేని వేడితో యమునాజలం మండిపోతున్నది. కన్నయ్యా! నిన్ను సుఖపెట్టలేని మమ్మల్ని దహించి వేయాలని యమునాతల్లి చింతించుచున్నదేమో? ఇందరు నిందించుకుంటున్నా మేము బ్రతుకుతున్నాము.

"కన్నయ్యా! మా లోపమేమి? మేము చెడ్డవారమా? మంచివారము కామా? కృష్ణా! నీతో విడిపడిన మాకు మంచి ఎందుకు? మంచిగుణ మెందుకు?

త్వయిప్రసన్నే మమకిం గుణేన త్వయ్య ప్రసన్నే మమకిం గుణేన
రక్తే విరక్తేచ వరే వధూనాం నిరర్థకః కుఙ్కుమ పత్ర భఙ్గః —

"కృష్ణా! నీవు మాకు ప్రసన్నుడవైనచో సద్గుణములతో మాకు పని ఏమి? కన్నయ్యా! నీవు ప్రసన్నుడవు కానిచో సద్గుణములుండి లాభమేమి? హే నందనందనా! భర్తలు అనురాగముగా నున్నచో భార్యలకు అలంకారములతో పని ఏల? ఒకవేళ భర్తలు ప్రతికూలమైనచో అలంకారమువలన ప్రయోజనమేమి?" అని శ్రీకృష్ణకర్ణామృతము అదియొగ స్ఫూర్తితో అభిభాషించింది.

కదలలేని కాళ్ళను ఈడ్చుకుంటూ నడువసాగారు గోపికలు. ఇంతలో ప్రసన్న దృక్కులుగల లేళ్ళు గోచరించినవి. ఈ లేళ్ళయందు గోచరించు ప్రశాంతత కృష్ణ సందర్శనము వలననే కలిగిందని భావించుచు "ఓ హరిణులారా! మా మాధవుడేడీ?" అని అడుగుతున్నారు.

గోపికలు బృందావనమున పశు, పక్షి, మేఘ, సరోవర, తరులతల నడుగుచూ ముందుకు జనుచుండ శ్రీకృష్ణుని పాదముద్రలు గోచరించెను. పద్మాది చిహ్నములను చూపుచున్న ఈ పాదముద్రలు కృష్ణునివి యేనని గుర్తించారు. శ్రీకృష్ణుని పాదముద్రల ప్రక్కన స్త్రీ యొక్క పాదముద్రలను జూచి, వారు తీవ్రంగా కలతచెందిరి.

ఆమె యెవరో అదృష్టవంతురాలని భావించిరి. బహుశ శ్రీకృష్ణుడు ఆమె భుజముపై చేయివేసి, మెడచుట్టూ త్రిప్పి పట్టుకొని కలసి నడచి యుండవచ్చునని తలచిరి. స్త్రీ యొక్క పాదముద్రలను చూడగా వారి దుఃఖము కట్టలు త్రెంచుకొని ప్రవహించసాగెను. ఇందరి గోపికలకు సొమ్మయిన శ్రీకృష్ణుని ఒక్క యువతి అపహరించి, అనుభవించి, ఆనందించినది.

వారిరువురి పాదముద్రల ననుసరించి దర్శించుచూ కదలుచుండిరి. ఒకచోటికి రాగానే కృష్ణుని పాదముద్రలే గోచరించుచుండినవి. స్త్రీ పాదముల ముద్రలు కనిపించలేదు. బహుశ ఆమె పాదములకు ముళ్ళుగుచ్చుకొని యుండవచ్చును అని సంతోషపడ్డారు. ఒక్క క్షణమాలోచించారు. మరి పాదముద్రలేమైనట్లు? అయితే ఆమె నడచి వెళ్ళలేదు. శ్రీకృష్ణుడు ఆమెను ఎత్తుకొని మరీ వెళ్ళుంటాడు. ఈ భావము మదిలో కదలగానే మొదలు తెగిన మ్రానులవలె కూలబడ్డారు. "కృష్ణా! ఇంత ఘాతుకానికి ఒడిగట్టితివా?"

కొంత దూరము నడువగానే శ్రీకృష్ణుని పాదములు ఇసుకలో బాగా లోనికి దిగియుండుట జూచి "అయ్యో! ఆ స్త్రీ బరువుగా ఉన్నది కాబోలు. కృష్ణయ్య పాదములు ఎక్కువగా మగ్నములైనవి" అని శోకించారు.

ఒక పుష్పవృక్షము చెంత చూచారు. అక్కడ మరల ఇరువురి పాదముద్రలు కనిపించాయి. శ్రీకృష్ణుని పాదముద్రలు అసంపూర్ణముగా గోచరిస్తున్నాయి. ఇచ్చట శ్రీకృష్ణుడు పూలుకోసి ఆమె జడలో ముడిచాడు అని నిర్ణయించారు.

"మనలను వదలి ఆమెతో శ్రీకృష్ణుడు చరించుటవలన బహుశ ఆమెకు గర్వము అధికమై యుండవచ్చును" అన్నది ఒక గోపిక.

అలా కొంతదూరము నడువగానే దుఃఖితురాలై కూర్చొనియున్న యువతిని చూశారు. వారు ఊహించుచుండిన యువతి ఈమెయే అని క్షణంలో గ్రహించారు. ఆమెను పలుకరించారు.

ఆమె విలపించుచు శ్రీకృష్ణుని పొందిన అనిర్వచనీయానందమును తెలుపుతూ తాను నడువలేనట్లు కృష్ణునితో చెప్పుటయు, అతడు ఆమెను తనభుజముపై ఎక్కుమని చెప్పుటయు, ఆమె ఎక్కుట కుపక్రమించుటయు, వెంటనే శ్రీకృష్ణుడు అంతర్హితుడగుటయు తెలిపి, తన గర్వమునకు, అజ్ఞానానికి విలపించసాగెను. ఇదంతయు వాలకించిన గోపికలు విస్మయమొందిరి.

అహంకారులకు, గర్వమతులకు శ్యామసుందరుడు లభ్యమయ్యేవాడుకాదని గ్రహించిరి. యమునాతీరము చేరిరి. కృష్ణగతచిత్తులై శ్రీకృష్ణ నామమును గానము చేయసాగిరి. శ్రీకృష్ణుని రాకను ఆకాంక్షించుచు పరవశించి నామగానము చేసిరి. గోపికలు

చేసిన ఈ గానమే "గోపీ గీతము" అనుపేర గొప్పప్రాచుర్యము పొందినది. రాస్లో అధ్యాయము గోపీగీతమే. గోపికలు శ్రీకృష్ణుని దివ్య వైభవమును గానమొనర్చే అమరగాన సందేశము.

గోపీగీతము

శ్రీకృష్ణ చరితామృతంతో నిండిన ఆధ్యాత్మిక సాగరమే భాగవత మహాకావ్యము. ఇందులో దశమస్కంధము భాగవతసార మని మహాభక్తులు చేసిన నిర్ణయము. దశమస్కంధములోని 29 వ అధ్యాయమునుండి 33 వ అధ్యాయము వరకు గల రాసక్రీడా వైభవము దశమస్కంధసార మని ప్రతీతి. ఈ ఐదు అధ్యాయములను కలిపి రాస పంచాధ్యాయి అంటారు. ఈ రాస పంచాధ్యాయిలో శ్రీకృష్ణపరమాత్మ గోపికలతో కూడి సాగించు రాసక్రీడా వైభవము వర్ణించబడియున్నది. ఈ రాస పంచాధ్యాయిలో 31వ అధ్యాయమున గోపీ గీతము శోభించుచున్నది. శ్రీకృష్ణుని కొరకు పరితపిస్తూ యమునాతీరములో గోపికలు గానముచేసిన విరహగీతమే గోపీగీతము. ఈ గోపీగీతము రాసపంచాధ్యాయి సారమని భావించుట అతిశయోక్తి కానేరదు.

శ్రీకృష్ణుడు అదృశ్యం కాగానే గోపికలు తీవ్రవ్యథకు గురయ్యేవారు. వారి విరహాతాపము చరమస్థాయికి చేరగానే మైమరచిన మేనులతో, దివ్య పారవశ్య భక్తి తన్మయులతో వారు శ్రీకృష్ణుని మాటలను అనుకరించేవారు. శ్రీకృష్ణుని నడకను అభినయించేవారు. శ్రీకృష్ణుని లీలలను ప్రదర్శించునట్లు నటించేవారు.

ఒక గోపిక పూతనవలె విజృంభించగా, మరొక గోపిక ఆమె స్తనముల నుండి క్షీరమును గ్రోలి శ్రీకృష్ణుడు వధించిన రీతిగా వధించునట్లు నటించును. మరొక గోపిక శకటాసురుని వధించిన విధమును అభినయించుచు ఎండిపోయిన కట్టెపుల్లను ఆకాశమున కెగురునట్లు కాలితో తన్నును. ఇంకొక గోపిక గోవులను దోలు విధముగా అభినయించుచు ప్రత్యేక శబ్దములు చేయును. మరొక గోపిక కాళీయునిపై శ్రీకృష్ణుడు నాట్యము చేసిన విధముగా నృత్యముచేయుచు, నాట్య భంగిమల నభినయించును.

శ్రీకృష్ణుని సదా చింతనచేయు రాధ ఒక్కొక్కసారి తానే శ్రీకృష్ణుడను భావముతో చరించేదని బెంగాలీ భక్తుడు, కవిశేఖరుడు విద్యాపతి తెలియజేస్తాడు.

రాధ శ్రీకృష్ణుని పొందుటకై తపించేది. పరితపించేది. దుఃఖించేది. కన్నీరు కార్చుతూ విలపించేది. "కృష్ణా! కృష్ణా!" యంటూ పలవరించేది. కృష్ణ వియోగ దుఃఖము ననుభవిస్తున్న రాధ తదేకచింతనా ప్రభావముచే తానే కృష్ణుడను భావము పొంది తపించేది. మళ్ళీ దుఃఖించడానికి ప్రారంభించేది. ఈసారి కృష్ణుని కొరకు కాదు. రాధ కొరకు "రాధా! రాధా!" యంటూ విలపించేది. ఆహా! ఎంతటి ఆశ్చర్యము? రాధ కొరకు రాధ విలపించుటయా? అద్భుతము! అనిర్వచనీయ భావ సౌందర్యము! ఇలా రాధగా కొంతసేపు కృష్ణుని కొరకు విలపించేది. తాను కృష్ణుడనుకొని మరికొంతసేపు రాధకొరకు

పరితపించేది. ఎటుచూసినా దుఃఖం తప్పడం లేదు. విషాదము అంతం కావడంలేదు. అదే నిజమైన యోగము. రెండు కొనలకు నిప్పంటించిన వెదురు కొయ్యలో చేరిన కీటకము ఏ చివరికొచ్చినా అగ్నికి ఆహుతవుతున్నట్లు, రాధ ఏ రూపం ధరించినా దుఃఖానికి దూరం కావడం లేదు. గోపికల స్థితికూడా యథార్థంగా అలాంటిదే. శ్రీకృష్ణుని యందు వారికున్న ప్రగాఢ ప్రేమ, శ్రీకృష్ణుని వదలి జీవించలేని విరహవ్యథ "గోపీగీతం" లో వ్యక్తం చేయబడ్డాయి.

జయతి తేఽధికం జన్మనా వ్రజః శ్రయత ఇందిరా శశ్వదత్ర హి
దయిత దృశ్యతాం దిక్షు తావకా స్త్వయి ధృతాసవస్త్వాం విచిన్వతే 1

భావము:- ఓ ప్రియతముడా! నీవు జన్మించుటచే వ్రజభూమి మంగళకరమై శోభించుచున్నది. కనుకనే లక్ష్మీదేవి కూడా ఈ పుణ్యభూమిలోనే నిలచియున్నది. ఈ గోపికలు మాత్రము నీయందే ప్రాణములుంచి అన్ని దిక్కుల నిన్నే అన్వేషించుచున్నారు. కృష్ణా! మాకు దర్శనమిచ్చి రక్షింపుము.

వ్యాఖ్య

ఉదయభానుని అరుణ కిరణ ప్రసారమునకు అంధకారము అదృశ్యమగుట ఎల్లరకు విదితమే. అంతవరకు ఆవరించియున్న చీకటి మటుమాయమై దివ్యమయ కాంతులతో ప్రపంచమంతా ప్రస్ఫుటంగా ప్రకాశిస్తుంది. సూర్యోదయం ప్రపంచాన్ని వెలుగులతో నింపినట్లు కృష్ణోదయం వ్రజభూమిని మంగళకర శోభతో ప్రభావితం చేసిందని పరమభక్తులైన గోపికలు తెలియజేయుచున్నారు.

శ్రీకృష్ణుడు విష్ణుమూర్తియొక్క సంపూర్ణావతారము. పదునారుకళలతో అవతరించిన పూర్ణావతారము. మహావిష్ణువు వైకుంఠమును వీడి వ్రజభూమి కరుదెంచుటవలన శ్రీనాథుని వదలి జీవించలేని లక్ష్మీదేవికూడా వైకుంఠమును వీడి వ్రజభూమి కరుదెంచినది. లక్ష్మీనారాయణులు దూరంకాగానే వైకుంఠము కూడా కదలి వ్రజభూమిలో అంతర్లీనమైంది. సకల మంగళమాంగల్య స్వరూపిణియైన లక్ష్మీదేవి ఆగమనంతో వ్రజభూమి వజ్రభూమిగా మారిపోయింది. ప్రజల జీవనంలో సుఖశాంతులు చోటుచేసుకున్నాయి. పాడిపంటలు సమృద్ధిగా వృద్ధిపొందాయి. రోగాలు అదృశ్యమయ్యాయి. శోకాలు కనుమరుగయ్యాయి. ధర్మం రాజ్యపాలన చేయసాగింది. ప్రకృతి అనుకూల జీవనము గడుపసాగింది. నిత్య కల్యాణంతో ప్రజావాసుల జీవనము వెల్గొందుచున్నది. అట్టి సర్వోత్కర్ష వాతావరణంలో కూడా దీనమానసులై వ్యథచెందే విచిత్రవ్యక్తులు లేకపోలేదు.

ఎవరా దురదృష్టజాతకులు? వారే గోపికలు. గోపాలుని విడచి జీవించలేని ప్రేమజీవులు. వారు దురదృష్టజాతకులు కారు. అదృష్టముపేర చలామణి అయ్యే దురదృష్టమును అంతమొందించుటకు కంకణము కట్టుకొన్న అదృష్టశాలినులు. గోవిందుని చైతన్యము వినా గోకులమందలి భోగభాగ్యములు నిరర్థకములని, అవాంఛనీయములని

గుర్తించి జీవించిన ధన్యజీవులు. వాసుదేవుని సాన్నిధ్యంలో తమ బ్రతుకును పుణ్యధామం చేసుకున్న పవిత్రాత్ములు.

వ్రజప్రజలందరు ఆనందోత్సాహములతో అలరారుచుండ, భక్తజనులైన ఈ గోపికలు మాత్రము విచారసముద్రములో మునిగియున్నారు. తమ ప్రాణములను మధుసూదనుని యందుంచి నిరీక్షిస్తూ కృష్ణసందర్శనార్థులై అన్ని దిక్కుల అన్వేషించుచున్నారు.

గోపికల మానసములు గోపాలునివైపు మరలాయి. విషయసుఖాలయందు అందరి ప్రాణములు రమించుచుండ, గోపికల ప్రాణాలు అచ్యుతుని అనంత చైతన్యములో కలిసియున్నవి. విషయప్రపంచము విషతుల్యమని భావించిన గోపభామలు నిర్విషయానంద సాగరములో ఓలలాడుటకు ఉర్రూతలూగుచున్నారు. వారు ఆశించే పరమానందము పోతపోసిన అమృతమూర్తియే శ్రీకృష్ణపరమాత్మ. అందుచే అన్నిదిక్కుల ఆ దివ్యమంగళ విగ్రహమూర్తిని దర్శించు అభిలాషతో అన్వేషిస్తున్నారు.

దిక్కులన్నీ వెదికారు. వెదకివెదకి విసిగారు. దిక్కుతోచలేదు. "కృష్ణా! నీవే మాకుదిక్కు" అని పిలిచారు. దర్శనమిమ్మని ప్రార్థించారు.

మాలతీవృక్షాన్ని సమీపించారు. అక్కడా వెలితే కనిపించింది. యమునను సమీపించారు. అక్కడా యాతనే మిగిలింది. నెమలి నడక చూశారు. కుమిలి ఏడ్వసాగారు. వెదురుకొయ్యను చూశారు. చెదరి కలతచెందారు. వ్రజభూమి సౌందర్యమంతా వారికి వెగటుగా పరిణమించింది.

రథోత్సవ సమయంలో రథాన్ని చక్కగా అలంకరిస్తారు. అందంగా తీర్చి దిద్దుతారు. సంవత్సరముపాటు ఎవరినీ ఆకర్షించక మూలబడియున్న రథానికి ఒక్కసారి అంత భాగ్యమెలా కల్గింది? రథములో స్వామి ఆసీనుడగుటవలన కలిగింది. స్వామివలన రథానికి అలంకారము. స్వామికి దూరమైన రథానికి మిగిలేది తిరస్కారము.

స్వామితోపాటు రథము ఊరేగుతుంది. మన ఊహలు, ఉత్సాహాలు భగవంతునిపై ఉండాలేగాని రథముపై సాగవు. స్వామిని విస్మరించి, రథమును స్మరించు బుద్ధి ప్రమాదకరము. మోహ మహార్ణవము.

నందనందనుని ఉనికివలన నంద గోకులము ఆనందమయమైనది. నందగోకులమువంటి జగత్తుయొక్క సౌందర్యము జగత్తునందు వ్యాపించియున్న చైతన్యము యొక్క సౌందర్యమే.

స్వయంభాతుమశక్తం హి జడాత్మక మిదం జగత్,
చిత్సంబంధ బలే నైవ ఖలు భాతి నచాన్యథా

"ఈ ప్రపంచము జడాత్మకమగుటచేత స్వప్రకాశముకాదు. చిచ్చైతన్య సంబంధము వలననే ప్రకాశించుచున్నది" అని బ్రహ్మగీతయందు తెలుపబడినది.

చైతన్యముయొక్క ప్రభావముచే జగత్తు భాసించినను, జగత్తు యొక్క దోషములు బ్రహ్మమునందు లేవు. జగత్తు మాయాజనితము. కనుక జగత్తునందలి దోషములు బ్రహ్మమును అంటలేవు.

మాయామేఘో జగన్నీరం వర్షత్యేవ యథాతథా
చిదాకాశస్య నోహానిర్నవలాభ ఇతస్థితిః

"మేఘము నీటిని వర్షించునట్లు, మాయ జగత్తును కల్పించుచున్నది. వర్షమువలన ఆకాశమునకు హాని వృద్ధులు లేనట్లే, జగత్తువలన ఆత్మకు హాని వృద్ధులులేవు" అని శ్రీభారతీతీర్థులు కూటస్థదీప గ్రంథమున వివరించారు.

కనుక నందకిశోరునివలన నందగోకులము నిత్యమైనది. నందకిశోరుడనెడి ఆత్మను మరచి, గోకుల సౌందర్యమును జగత్తును గాంచుతూ, తద్భాగ్యమును అనుభవించుచూ కాలము గడుపు జీవితములు నిరుపయోగములు.

గోపికల అంతఃకరణయందు గోపీజనప్రియుడు తప్ప మరొక ఆలోచన పొడసూపదు. గోవర్ధనగిరిధారిని గాంచు నేత్రములే నేత్రములు. ఆ చూపే దివ్యమైనది. అదియే దివ్యదర్శనము. అట్టి దర్శనము లభించినచో బ్రతుకులు ధన్యము కనుకనే గోపభామలు "కృష్ణా! అన్నివైపుల నిన్నే అన్వేషిస్తూ జీవిస్తున్న మాకు దర్శన మొసంగి కాపాడుము" అని ప్రార్థించారు.

గోపికలకు కృష్ణప్రేమ తప్ప మరొకటి తెలియదు. వారు సదా ప్రేమ లోనే సంచరిస్తాంటారు. ప్రేమే వారికి దేహము. ప్రేమే వారికి చెలికత్తెలు. ప్రేమే వారికి గృహము. వారి ప్రేమగృహానికి కిటికీలు, తలుపులు, కప్పు అంతయు ప్రేమే. ప్రేమే ఆహారము. ప్రేమయే పానీయము. ప్రేమపడకపైనే వారు పవళించేవారు. ప్రేమ అనే దుప్పటినే కప్పుకునేవారు. ప్రేమే స్నానము. ప్రేమే వస్త్రము. ప్రేమే కానుక. ప్రేమే వనవాటిక. ప్రేమయే ధర్మము. ప్రేమయే కర్మము. ప్రేమయే త్యాగము. ప్రేమయే సర్వము. ప్రేమయే వారి ఆభరణాలు. ప్రేమయే వారి పిక్తగాలు. ప్రేమయే వారి శ్వాస. "సర్వం ప్రేమమయం జగత్" ఇదియే వారి నినాదం. నిర్విరామ జీవన విధానం.

ప్రేమ హరీకే రూప్‌హై త్యోం హరి ప్రేమస్వరూప్.
ఏక్‌హో ఇద్వైమేలస్సైజ్యోం సూరజ అరుధూప్

"భగవంతుని రూపమే ప్రేమ. ప్రేమ స్వరూపమే భగవంతుడు. యథార్థానికి అక్కడ రెండులేక పోయిననూ సూర్యుడు, సూర్యప్రకాశమువలె రెండుగా గోచరించుచున్నవి."

వియోగ దుఃఖమును భరించలేక వ్యథ చెందుతున్న గోపభామలకు శ్రీకృష్ణుని దర్శనభాగ్యం లభించలేదు. "కృష్ణా! నీకొరకే జీవించియున్న మమ్ముల నిలా పరిత్యజించుట, పరిహాసించుట క్రూరకర్మ కదా!" అంటూ తరువాత శ్లోకములో గోపికలు ప్రశ్నించుచున్నారు.

శరదుదాశయే సాధుజాతస త్సరసిజోదర శ్రీముషా దృశా 2
సురతనాథ తేఽశుల్కదాసికా వరద నిఘ్నతో నేహ కిం వధః

భావము:- ఓ సురతనాథా! వరదా! శరత్కాలపు సరస్సు నందలి పద్మశ్రీని దోచుకొను కాంతి చూపులు గలవాడవై, నిన్నే నమ్మినవారై నీకు దాస్యము చేయుచున్న ఈ గోపికలను పరిత్యజించి, బాధించుట హింసకాదా?

వ్యాఖ్య

కృష్ణ వియోగమును భరించలేని గోపికలు శ్రీకృష్ణుని చర్య న్యాయ సమ్మతముకాదని అభియోగమును మోపుతున్నారు. సదా వాసుదేవుని దివ్యదర్శనమునకు పరితపించుచున్న గోపికలను పరిత్యజించుట హింసాత్మకమైన చర్యయని తెలియజేయుచున్నారు.

"హే గోపాలా! నీవు భక్తులపాలిటి కల్పవృక్షమని విన్నాము. వరదుడవని నమ్మినాము. నిన్నాశ్రయించాము. సదా నీ నామాన్నే జపిస్తున్నాము. నీ రూపాన్నే ధ్యానిస్తున్నాము. నీ వైభవాన్నే మననం చేసుకుంటున్నాము. మధురమైన నీ అమృత వాక్కులు వినాలని, రాత్రింబవళ్ళు నిద్రాహారములు మాని నిరీక్షిస్తున్నాము. అట్టి మమ్ము మరచి జీవించుట నీకు తగదు. ఇంతటి హింసాప్రవృత్తి నీకు మంచిది కాదు.

"నీవు మమ్ములను హింసించింది శారీరకంగా కాదు. మా మానసములను ముక్కలుగా పగులగొట్టావు. మానసిక వ్యథ కన్నా శారీరక మృతియే మేలు.

"కృష్ణా! మేము ఈ భయంకర చిత్తక్షోభను భరించలేము. నీ అమృత హస్తములతో మాకు కొంచెము విషాన్ని ప్రసాదించు. నీకు దూరమై నరక జీవితము ననుభవించుటకన్నా, నీ నామాన్ని స్మరిస్తూ మరణించడమే మాకు శ్రేయోదాయకము.

"హే జగన్నాటక సూత్రధారీ! మా బాధ నీకు అర్థంకాదు. గాయపడిన హృదయ మనుభవించే ఆవేదన గాయపరచినవాడికి ఎలా తెలుస్తుంది? వియోగ దుఃఖములో కలిగే వ్యథ నీకెలా అర్థమవుతుంది? నీ ప్రేమకు లొంగి దాస్యము చేయుచున్నాము. నీపై మాకున్న ధ్యాస మమ్ములను పిచ్చివారుగ చేసింది. ఒక్కచోట కూర్చోనివ్వదు. కంటిమీద రెప్ప వాలనివ్వదు. ఆహారము రుచించదు. పరులకొరకు భుజించినా వంటబట్టదు.

"హే వరదా! మాకొక్క వరాన్ని ప్రసాదించు. నీ నామాన్ని గానం చేస్తూ, నీ దివ్యమంగళ విగ్రహాన్ని వీక్షిస్తూ మరణించే స్థితిని అనుగ్రహించు. మాకు ముక్తి అవసరంలేదు. మళ్ళీ గోకులంలోనే జన్మించేలా ఆశీర్వదించు. గోపికగాకాదు శ్రీకృష్ణుడుగా జన్మించాలి. కృష్ణా! నీవు గోపికవై పుట్టాలి. నీకు కనుమరుగై మేము జీవిస్తుంటాము. నీవు మాకోసమే వెదుకుతూ మరెందరో స్త్రీలతో సరాచకాలాడుతుంటాము. విరహతాపమును భరించలేక నీవు మావద్దకు పరుగెత్తుకుని రాగానే నీ కళ్ళముందే అదృశ్యమవుతాము. నీకు అప్పుడు తెలిసివస్తుంది విరహాగ్ని ఎలాంటిదో! విరహతాపము మనిషి నెలా క్రుంగదీస్తుందో!

"కృష్ణా! మేము గోపభామలము. చదువుసంధ్యలు తెలియని వారము. తెలివితేటలు లేనివారము. వేదాన్ని పరిశోధించలేము. వాదాన్ని ప్రయోగించలేము. మాకు తెలిసిందల్లా ప్రేమ ఒక్కటే. మా దగ్గరున్నది ప్రేమొక్కటే. ఆ ప్రేమనే సంపూర్ణంగా నీకు సమర్పించుకుంటున్నాము. మా తనువులు, మనసులు, హృదయాలు సర్వమూ నీకు సమర్పించుకున్నాము. మా జీవితాలకు గమ్యము నీవే. మా జీవన నౌకకు మార్గగామివి నీవే.

"మంచిచెడులు మాకు తెలియవు. మా ప్రవర్తన సరియైనది కాదని లోకము దూషించినా మేము బాధపడము. లోకనిందలకు మేము భయపడము. మాకున్న

భయమంతా ఒక్కటే నీవు మాకు దూరమవుతావేమోనని. నీ దివ్య చరణయుగము మాకు అలభ్యమైననాడు మేము ఈ ప్రపంచములో మిగలము.

"శ్యామసుందరా! ఎందుకు మమ్ముల నిలా శోకానికి గురిచేస్తున్నావు? నవ్వుతూ నీ దరి చేరాము. ఏడుస్తూ జీవించమని మమ్మాశీర్వదించావు. నీకు దూరమై మేము బ్రతుకలేము. మా బలహీనత తెలిసికూడా తెలియనట్లు దోబూచులాడుతున్నావు. ప్రేమ చాలా ఉత్కృష్టమైనదని ఇంతవరకు భావించాము. ప్రేమ అనెడి పదము వినిపించగానే ఇప్పుడు చెవులు మూసుకుంటున్నాము. మురళీధరా! ఎంతటి దుఃఖానుభూతిని ప్రసాదించావు? ఎంతటి కఠోర బాధను అందించావు?

ఓహో భక్తవత్సలా! నీవు కారుణ్యమూర్తి వని విని నిన్నాశ్రయించాము. గతంలో ఎందరో భక్తులను నీవు ఉద్ధరించిన తీరు విని సంబరపడ్డాము. మరి మా విషయంలో ఎందుకిలా తారుమారైనది? భగవాన్! ఇది నీ తప్పుకాదు. మా ప్రారబ్ధమే నీ మనసునలా మార్చింది. మేము విధి వంచితులము. వైపరీత్య జీవనముతో బ్రతకడానికి నిలెంచిన వ్యర్థజీవులము" అని గోపికలు పరితపించారు.

శరదృతువు రాకవలన సర్వనదులలోని, సరస్సులలోని నీటియందలి మాలిన్యము నశించును. జలము స్వచ్ఛముగ, స్ఫటికమువలె గోచరించును. శరత్కాలమున సరోవరములలోని పద్మములు శోభాయమానముగ కన్పట్టి సర్వులను ఆకర్షించును. శ్రీకృష్ణుని ముఖకమలము శరత్కాలము నందలి పద్మసౌందర్యమును గూడా మించియున్నదని, అట్టి ముఖారవిందమునకు దూరమై తాము జీవించలేమని గానం చేస్తున్నారు. పద్మము జ్ఞానమునకు చిహ్నము. శ్రీకృష్ణుని ముఖపద్మము జీవులలోని అజ్ఞానమును పారద్రోలును. అందుచేతనే "వరదా" యని సంబోధిస్తున్నారు గోపికలు. అట్టి భగవదానుభూతి కన్నా తక్కువ స్థాయిలోని ఆనందాన్ని భక్తులు అభిలషించరు. ఆనందములో రమించరు.

ధర్మార్థ కామ మోక్షేషు నేచ్ఛామమ కదాచన,
త్వత్పాద పంకజాస్వాద జీవితం దీయతామమ

"భగవాన్! చతుర్విధ పురుషార్థములలో నాకు దేనియందును అభిలాషలేదు. నీ పాదపద్మముల నారాధించు ఆనందముతో జీవించు భాగ్యమును ప్రసాదించుము" అని నారద పంచరాత్రములో తెలియజేయబడింది.

భగవానుని కొరకు ఇలా పరితపించుచున్న గోపికలు శ్రీకృష్ణుని దివ్యకృపకు పాత్రులు కావలె ననెడి సంకల్పముతో గతంలో వాసుదేవుడు భక్తజనులను కాపాడిన సంఘటనలను తరువాత శ్లోకములో తెలియజేయుచున్నారు.

విషజలాశయా ద్వ్యాళరాక్షసా ద్వర్షమారుతా ద్వైద్యుతానలాత్ 3
వృషమయాత్మజా ద్విశ్వతోభయా దృషభ తే వయం రక్షితా ముహుః

భావము:- పరమాత్మా! విషపూరితమైన కాళియహ్రదము నుండియు, వృషరూపుడైన అఘాసురుని బారినుండియు, భయంకరమైన గాలివాన నుండియు, పిడుగుపాట్లనుండియు, బడబాగ్నినుండియు, మాయాసురుని బారినుండియు మరి ఎన్నో భయంకర సంఘటనల నుండి మమ్ములను అనేకసార్లు రక్షించితివి.

వ్యాఖ్య

శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహమును వీక్షించకుండా జీవించలేని గోపభామలు కృష్ణ సందర్శనానికై వ్యథ చెందుతూ, నందకిశోరుడు గతంలో తమ నుద్ధరించిన సంఘటనల నుదహరిస్తూ అదే ప్రేమతో ఇప్పుడు కూడా దర్శనమిచ్చి కాపాడమని ప్రార్థిస్తున్నారు. విషమయమైన మడుగులోదూకి, కాళియుని మదమణచి గోపీజనములతోపాటు గోవులకు కూడా భయభ్రాంతులను దూరంచేసిన విషయమును గుర్తు చేయుచున్నారు.

"సంసార కాళియమడుగులో నివసించు భ్రాంతియనే కాళియుని మదమణచి, అహంకారమనే అఘాసురుడను రాక్షసుని సంహరించి, ఆధ్యాత్మిక సాధనలను అటంకపరచే ఇంద్రియ పిడుగుపాట్లనే గాలి వానను నీ దయయనెడి గోవర్ధన పర్వతమునెత్తి కాపాడి, అశాంతి యనెడి బడబాగ్నిని మ్రింగి మాకు శాంతిని ప్రసాదించి, బహిర్ముఖ మవుతున్న మా ఇంద్రియాలను అంతర్ముఖం చేసి ఆత్మదర్శనం కలిగించి, మాలో నిండియున్న మాయ యనెడి రాక్షసులను వధించి, నీ దివ్యదర్శనమొసంగి, రక్షించుము" యని గోపికలు శ్రీకృష్ణుని ప్రార్థించారు.

మాయ తొలగగానే అంతఃకరణ శుద్ధిపడుతుంది. ఆత్మ ఎరుక కలుగుతుంది. జీవుడు తానే ఆత్మగా మారిపోతాడు.

ఆత్మసంస్థితిః స్వాత్మదర్శనం ఆత్మ నిర్ద్వయా దాత్మనిష్ఠతా

ఆత్మ అద్వితీయము గనుక ఆత్మగా నుండుటయే ఆత్మను తెలిసికొనుట యగునని భగవాన్ రమణమహర్షి తమ ఉపదేశసార గ్రంథములో తెలియజేశారు.

గోపికలు శ్రీకృష్ణుని ఆత్మగానే ఆరాధించారు. వారిది లౌకిక దృష్టికాదు. లోగదృష్టి అంతకన్నా కాదు. ఆత్మదృష్టితోనే గోపికలు శ్రీకృష్ణుని ప్రేమించారు. ప్రేమ దృష్టితోనే స్వామిని వీక్షించారు. ఈ విషయము తరువాత శ్లోకములో స్పష్టమవుతుంది. శ్రీకృష్ణుని విషయములో గోపికలకున్న జ్ఞానము తేటతెల్లమవుతుంది.

న ఖలు గోపికానన్దనో భవాన్ అఖిలదేహినా మన్తరాత్మ దృక్
విఖనసార్థితో విశ్వగుప్తయే సఖ ఉదేయివాన్ సాత్వతాం కులే 4

భావము:- ఓ సఖుడా! నీవు యశోదా నందనుడవు కావు. అఖిల దేహాలలో అంతర్యామివై ఉన్నావు. బ్రహ్మదేవుడు ప్రార్థించగా లోకోద్ధరణకై సాత్వతకులమున జన్మించినావు.

వ్యాఖ్య

ప్రేమ జ్ఞానమునుండి అంకురిస్తుంది. అవగాహన లోపించిన ప్రేమ అనర్థదాయకము. అదొక ఆవేశజనితమైన అయోమయ ధోరణి. ఒక వ్యక్తినిగాని లేదా వస్తువునుగాని మనము ప్రేమిస్తున్నామంటే ఆ వ్యక్తికి లేదా ఆ వస్తువుకు సంబంధించిన జ్ఞానం మన కున్నదని భావము.

గోపికలు శ్రీకృష్ణుని ప్రేమించారు. ఒక క్షణకాలం కూడా కృష్ణుని విడిచి జీవించలేక పోయారు. గృహకృత్యాలు మరచారు. భర్తలను త్యజించారు. ప్రాపంచిక బంధాలన్నీ త్రెంచుకున్నారు. అయితే వారు శ్రీకృష్ణునియందు చూపిన ప్రేమ సంకుచితమైనది కాదు. లైంగిక ప్రధానమైన తృష్ణ అచ్చట అభివ్యక్తం కాదు. అది పరాప్రేమ. దివ్యప్రేమ. కామవారహిత ప్రేమ. జీవాత్మ పరమాత్మల ఐక్యసంధానమే ఆ మాధుర్య ప్రేమ.

ప్రేమైవ గోపరామాణాం కామ ఇత్యగమత్ ప్రథామ్,
ఇత్యుద్ధ వాదయోఽప్యేతే వాఞ్ఛన్తి భగవత్ప్రియాః

"గోపికల ప్రేమ కామముగా గోచరించుచున్నను యథార్థానికి అది కామముకాదు. ఆ ప్రేమకొరకు ఉద్ధవాది మహాత్ములందరూ తపించుచున్నా" రని గౌతమీయ తంత్రములో తెలియజేయబడింది.

గోపికాప్రేమ ఘట్టాలన్నీ భాగవతంలో ఉన్నాయి. భాగవతాన్ని బోధించిన శుకబ్రహ్మ అస్ఖలిత బ్రహ్మచారి. భాగవతాన్ని శ్రవణంచేసిన పరీక్షితుడు మృత్యుముఖంలో ప్రవేశించడానికి సిద్ధంగా యున్నవాడు. పరీక్షితుని మోక్షప్రాప్తికై బోధించబడిన భాగవత గ్రంథములో కామవాసనలు తలెత్తడానికి, తత్సంబంధిత విషయాలు చర్చించడానికి వీలున్నదా? మనోనైర్మల్యముగల వారికే భాగవత రహస్యాలు అర్థమవుతాయి. శ్రీకృష్ణుని గోపికలు ప్రేమించారు. అయితే దేహదృష్టితో కాదు. వారిది ఆధ్యాత్మికదృష్టియే గాని భౌతికదృష్టి కాదు. పై శ్లోకములో ఆ సత్యము ధృవపడుచున్నది.

"కృష్ణా! నీవు నంద తనయుడవు కావు. యశోదానందనుడవు కావు" అని తెలియజేస్తున్నారు. దేహస్థాయినుండి చూసినపుడు మనకు ఇతరులతో నున్న సంబంధాలు గోచరిస్తున్నాయి. కాని శ్రీకృష్ణుని గోపికలు దేహస్థాయినుండి వీక్షించలేరు. అఖిల దేహాలలో ఆధారభూతుడై వెలుగు అంతరాత్మగా కీర్తిస్తున్నారు. సాక్షి మాత్రుడుగా దర్శిస్తున్నారు.

అందరిలో భాసించు అంతరాత్మయే శ్రీకృష్ణుడని వారి భావము. తమ శరీరాలలో కూడా శ్రీకృష్ణుడే అంతర్యామిగా వెలుగొందుచున్నాడు. కనుక శ్రీకృష్ణుని కొరకు విచారపడుటలో వారు చేయునది ఆత్మవిచారమే. "అఖిల దేహినామంతరాత్మదృక్" అని గానం చేస్తున్నారు. దేహమనోబుద్ధుల స్థాయినుండి దృష్టిని అంతర్ముఖం చేసినచో అక్కడ తెలియవచ్చునది ఏమున్నది? అక్కడున్నది ద్రష్టయేగాని దృశ్యముకాదు. వస్తురహిత చైతన్యమే భాసించుచున్నది.

మాయామాత్ర మిదం ద్వైత మద్వైతం పరమార్థతః

కేవలము మాయికమైన "దృక్-దృశ్య" రూపద్వైతము పారమార్థిక దృష్టిచే దృక్ మాత్రమే శోధిస్తూ అద్వైత మగుచున్నది.

చైతన్యము జ్ఞాన స్వరూపము. ఇతరములైన జ్ఞాన సముదాయ మంతయు చైతన్యముచేతనే ప్రకాశించుచున్నది. ఇదియే శుద్ధజ్ఞానము. ఇది ఇతరములైన జ్ఞానములనే గాక అజ్ఞానమును కూడా ప్రకాశింపచేస్తున్నది. అంతేగాక "సదసద్విలక్షణ"మై ఆ రెండింటికీ అన్యముగా కూడా యున్నది. ఇట్టి దివ్యజ్ఞానము ఎల్లప్పుడూ యున్నది. ఒకప్పుడుండి మరొకప్పుడు అదృశ్యమయ్యే ప్రపంచజ్ఞానముకాదు. వస్తుగుణ జ్ఞానముకాదు. కేవల వస్తురహిత చైతన్యము కనుక నిత్యమై అఖండమై అలరారుచున్నది. సర్వమునకు సాక్షియైయున్నది. చూసేనిన్ను చూస్తున్న తనను నీవు చూడలేవు. కన్నువెనుక కన్నై సర్వమును చూచుచున్నది. చెవి వెనుక చెవియై సర్వమును వింటున్నది. మనసు వెనుక మనసై సంకల్ప వికల్పాదులను దర్శించుచున్నది. అవి ఏవీ లేని శూన్యస్థితిని కూడా చూస్తున్నది. అన్నీ తెలుసుకుంటున్నది. అంతేకాదు. అన్నింటికీ విలక్షణమైయున్నది. అదే ఆత్మ. ఈ సత్యాన్నే బృహదారణ్యకోపనిషత్ స్పష్టంగా విశదపరచింది.

న ద్రష్టేర్ద్రష్టారం పశ్యేః న శృతేః, శ్రోతారంశృణుయాత్,
న మతేర్మన్తారం మన్వీయాః న విజ్ఞాతే ర్విజ్ఞాతారం విజానీయాః
ఏషత ఆత్మా సర్వాన్తరః అతోఽన్యదార్తమ్ ॥

"చూపును చూస్తున్న తనను నీవు చూడలేవు. వినికిడిని వింటున్న తనను నీవు వినలేవు. ఆలోచనను తిలకిస్తున్న తనను గూర్చి నీవు ఆలోచించలేవు. జ్ఞానమును తెలుసుకొను జ్ఞానగమ్యమైన తనను నీవు గ్రహించలేవు. అదియే నీ ఆత్మ. అందరిలో భాసించునది. అది తప్ప అన్యమైనదంతయూ నశించునదే."

అవినాశియై అందరిలో ముచ్చటగా "వెలుగు" ఆత్మచైతన్యమే శ్రీకృష్ణుడని గోపికల అభిప్రాయము. అనుభవ జ్ఞానము. కనుక గోపికల దృష్టి కామదృష్టి కాదు. భగవాముని అనంతత్వమును గూర్చిన ఎరుక వారికి సదా యున్నది.

తత్రాపి న మహాత్మ్యజ్ఞాన విస్మృ త్యపవాదః

శ్రీకృష్ణుని కెంత సన్నిహితంగా యున్నను, ఆతని మహాత్మ్యమును గూర్చి గాని, జ్ఞానమును గూర్చిగాని గోపికలు విస్మృతిని పొందలేదని నారదమహర్షి భక్తిసూత్రాలలో ప్రవచించారు. "తద్విహీనం జారాణా మివ" అట్టి జ్ఞానములేని ప్రేమ జారస్త్రీలు తమ ప్రియులయెడ చూపు ప్రేమవంటిదని, గోపికలప్రేమ అలాంటిది కాదని, అది కేవలం పరాప్రేమయని నారదుని ప్రబోధము. విషయాసక్తి లేనిదగుటచే గోపికల ప్రేమ ఉత్కృష్టమని మహర్షులచేత స్తుతించబడినది. గోపికలు భగవదనుగ్రహమునకు పాత్రులగుటకు వారి నిష్కళంక ప్రేమయే నిదర్శనము.

విషయాన్ ధ్యాయత చిత్తం, విషయేషు విషజ్జతే
మా మనుస్మరత చిత్తం, మయ్యేవ ప్రవిలీయతే

"విషయములను ధ్యానించుచూ మనసు విషయ సుఖాలలోనే పరిభ్రమిస్తుంది. నన్నే స్మరించు మనసు నాలోనే లయిస్తుంది" అని భగవంతుడు భాగవతంలో తెలిపియున్నాడు.

నిత్యశుద్ధ ముక్తస్వరూపమైన కృష్ణచైతన్యము మానవరూపంలో ఆవిర్భవించుటకు గల కారణమును కూడా గోపికలు ఈ శ్లోకంలో తెలియజేయుచున్నారు. "లోక కళ్యాణమునకై బ్రహ్మదేవుడు ప్రార్థింపగా సాత్వతకులమున జన్మించినావు" అని కృష్ణుని జన్మరహస్యమును కీర్తించుచున్నారు.

బ్రహ్మదేవుడు సృష్టికర్త. అధర్మము పెచ్చుపెరిగి, ధర్మమునకు వినాశము కలుగు సమయాలలో దానిని నివారించి, లోకము నుద్ధరించవలసిందని బ్రహ్మదేవుడు ప్రార్థించగా సర్వవ్యాపకుడైన శ్రీకృష్ణుడు తన యోగమాయచే సాత్వతకులమున జన్మించినాడని గోపికలు కీర్తిస్తున్నారు.

గోపికలు సర్వభూతాంతరాత్మయైన శ్రీకృష్ణునికి సంపూర్ణ శరణాగతులై, తమవలె ఒకనాడు శరణాగతుడైన చతుర్ముఖ బ్రహ్మయొక్క ప్రపత్తిని కూడా తెలియజేయుచున్నారు. ప్రపత్తితో కూడిన ప్రవృత్తియే నివృత్తికి మార్గమవుతుంది. ప్రపత్తి తెలియని నివృత్తి అజ్ఞానవృత్తిగా మిగిలిపోతుంది. కనుక గోపికలు ఈ శ్లోకంలో బ్రహ్మదేవుని ప్రార్థనను కనబరుస్తూ శరణాగతిని ప్రవేశపెడుతున్నారు.

సృష్ట్యారంభమునందు ప్రళయకాలములో జలమయమైయున్న భయంకరస్వరూపాన్ని బ్రహ్మదేవుడు చూసి, భయకంపితుడై నారాయణుని శరణుజొచ్చి ప్రార్థిస్తాడు. బ్రహ్మదేవుడు నారాయణుని సమీపించి "ఉపశ్రుతోస్మి" అని శరణాగతుడయ్యాడు. "తమజం ప్రపద్యే" పుట్టుకలేని నిన్ను ఆశ్రయించాను అంటూ చతుర్ముఖ బ్రహ్మ శరణుపొందినాడు. కనుక శ్రీకృష్ణుడు పుట్టినవాడు కాదని భావము.

గజేంద్రుడు కూడా తన శక్తి సన్నగిల్లగానే నారాయణుని స్మరిస్తూ "యామి పరం పరాయణం" సర్వులకు ఆశ్రయస్థానమైన నారాయణునికి శరణాగతుడను అంటూ ప్రార్థించాడు.

సంపూర్ణ శరణాగతులైన వారి యోగక్షేమాలన్నీ భగవంతుడే స్వయంగా చూస్తాడని గీతామాత ప్రబోధము. భగవద్గీతలో కూడా అనేక చోట్ల ఈ శరణాగత తత్త్వము తెలియజేయబడింది. "మాం ప్రపద్యన్తే" అని జ్ఞానయోగము రెండవ శ్లోకంలోను, "మామేవ యే ప్రపద్యన్తే" అని విజ్ఞానయోగము పదునాల్గవ శ్లోకంలోను, "తమేవ శరణం గచ్ఛ" అని మోక్ష సన్న్యాసయోగము అరువది రెండవ శ్లోకములోను, "సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని అరువది ఆరవ శ్లోకములోను స్పష్టముగా శరణాగతి తెలియజేయబడింది.

పరమ భాగవతోత్తములైన గోపికలు కూడా శ్రీకృష్ణుని స్వరూప వైభవమును గ్రహించి, గజేంద్ర బ్రహ్మాదులవలె సంపూర్ణ శరణాగతులై తమ శరణాగత జీవనమును ధ్రువపరుస్తూ ఇట్టి శరణాగతులైన తమను రక్షించమని రాబోవు శ్లోకములో తెలియజేయుచున్నారు.

విరచితాభయం వృష్ణిధుర్య తే, చరణమీయుషాం సంసృతేర్భయాత్
కరసరోరుహం కాంత కామదం, శిరసి ధేహి నః శ్రీకరగ్రహమ్ 5

భావము:- వృష్ణికుల శ్రేష్ఠుడా! ప్రియుడా! సంసారములకు భయపడి నిన్ను ఆశ్రయించిన వారలకు అభయ మొసంగునట్టియు, సమస్త కోరికలను తీర్చునట్టియు, లక్ష్మీదేవిని చేపట్టినదియు నైన నీ దివ్యకరపద్మము మా శిరస్సులపై ఉంచుము.

వ్యాఖ్య

ప్రపంచముపై విరక్తి ఏర్పడినప్పుడే పరమాత్మపై అనురక్తి పెరుగుతుంది. విషయసుఖాలు శాశ్వతములని భావించినంతకాలము మనసు భగవానునియందు లగ్నంకాదు. అనిత్యమైన ఈ దృశ్యమాన ప్రపంచముపై రోత జనించగా గోపికలు భగవాను నాశ్రయించి, అభయ హస్తమును చూపి రక్షించమని ప్రార్థించుచున్నారు.

భగవానుని అభయ హస్తము సాంసారిక జీవన తాపత్రయములను తుదముట్టించును. మాయను అంతమొందించును. అట్టి శ్రీకృష్ణుని దివ్య కరపద్మమును తమశిరస్సుపై ఉంచమని గోపికలు ప్రార్థించుచున్నారు. సంసారమునకు భయపడి శరణుజొచ్చిన వారలను శ్రీకృష్ణుని కరపద్మము అభయమొసగి కాపాడునని తెలియజేయుచున్నారు.

నిస్సారమైన సంసారములో మానవునికి శాంతి లభించదు. దారా పుత్రాదులయందు, ధన వస్త్రాలయందు మనం ఏర్పరచుకున్న వ్యామోహమే వాటికి లేని కళాకాంతుల్ని అందిస్తున్నది. సంసారమును రక్షించుకొనుటకు మనము పడరానిపాట్లు పడుతున్నాము. నిరంతరము శ్రమిస్తూనేయున్నాము. ఈ శ్రమలన్నీ పెరిగి పెరిగి అవిరామ పరిశ్రమ లవుతున్నాయేగాని, విశ్రాంతిని కల్గించలేకున్నాయి. ప్రశాంతతను ప్రసాదించలేకున్నాయి. మన మాచరించు ప్రతి కర్మ మనలను దుఃఖసముద్రములో ముంచుతున్నదేగాని, ఆనందతీరాలను చేర్చలేకపోతున్నది. ఒకవేళ ఎక్కడైన కొన్ని క్షణాలు సుఖం లభించినట్లయితే దానిని వెంబడించి నడిచేదికూడా దుఃఖమేనని విచారణలో తేలుచున్నది.

సంసారము అనిత్యము. మనము పుట్టకముందు సంసారము లేదు. గతించిన తరువాత ఉండబోదు. ఆద్యంతములందు లేని దానిని మధ్యలో యున్నట్లు భావించటమే భ్రాంతి. అజ్ఞానములో భ్రాంతిజన్య అశాంతియే మనకు శాంతిగా గోచరిస్తున్నది. సంసార సుస్థిరమైతే సత్యమని భావిస్తున్నామో సాంసారిక జీవన వ్యామోహాలన్నీ బుడగవంటివని మరుస్తున్నాము. నిరంతరము సంసారాన్నే అంటిపెట్టుకుని జీవిస్తున్నాము. సంసార అవసరాలను తీర్చుకొనుటలో కాలాన్నంతా ఖర్చు పెడుతున్నాము. అంతేగాని సంసారమొక మానసిక క్రీడయని గ్రహించలేకపోతున్నాము.

సంసార మనునది మాయయొక్క సంతానము. స్వప్నమువలె ఇప్పుడు కనిపించి మరుక్షణం మాయమవుతుంది. అనిత్యమై మలినపూరితమైన సాంసారిక జీవనముపై

వ్యామోహము యుక్తముకాదు. ఈ సత్యమును గుర్తించనంతవరకు మానవునికి సంసారమే స్వర్గతుల్యంగా కన్పిస్తుంది.

మత్తులోనున్న త్రాగుబోతు మురికిగుంటల ప్రక్కనపడి అయోమయ రాగాన్నాలపిస్తుంటాడు. అదే స్వర్గమని అతని అభిప్రాయము. ఆ స్థితిలో అతనికి ఎవరెంత బోధించినను ఉపయోగముండదు. మత్తు తగ్గగానే ఎవరి ప్రసక్తి అవసరంలేకుండా అతడే లేచి నడక సాగిస్తాడు.

సాంసారిక మత్తులోవున్న జీవునికి సంసారమే జీవన సారమని, స్వర్గతుల్యమని భావన కలుగుతుంటుంది. విచారణయను ఔషధసేవనచే మత్తుతొలగగానే నిరర్థకమైనది సంసారమేనని గ్రహించి, భగవానుని వైపు దృష్టి మరల్చి శరణాగతుడవుతాడు. భగవంతునికి ఎప్పుడైతే శరణాగతుడయ్యాడో దీనదయాళుడైన పరమాత్మ అభయమొసగి కాపాడుతాడు. ఆదిదేవుని అభయహస్తమును దర్శించగానే అంతవరకు మనోబుద్ధులలో నిండియున్న భయాందోళనలు చెదరిపోతాయి. మానవుని హృదయములో చరించే భయరాక్షసిని అంతమొందించు దివ్యాస్త్రమే భగవానుని అభయహస్తము.

సంసారములకు భయపడి శరణుజొచ్చిన భక్తుల నుద్ధరించిన అభయహస్తమును తమకుకూడా దర్శింపజేసి బ్రోవమని గోపికలు ప్రార్థిస్తున్నారు. శరణుజొచ్చిన సంసారికులను తరింప చేయుటయే గాక సమస్తకోరికలను తీర్చునట్టిదియు కూడా భగవానుని అభయహస్తమే నని తరువాత తెలియచేస్తున్నారు.

దయాపూరితమైన భగవానుని అభయహస్తము సమస్త కోర్కెలను తీర్చుతుంది. కోరికలను తీర్చడమంటే లేకుండా చేయడమని భావము. కోరిక అజ్ఞాన జనితము. అవిద్యాజనితమైన కోరిక మనచే కర్మల నాచరింపచేస్తుంది. పరిమితమైన కర్మ అపరిమితానందాన్నివ్వలేదు. అసంపూర్ణమైన కర్మ అశాశ్వతమైన ఫలితాన్నందించి, కర్మసముద్రంలో పడదోస్తుంది.

కృతి మహోదధౌ పతన కారణం, ఫల మశాశ్వతం గతి నిరోధకం

అని భగవాన్ రమణమహర్షులవారు ఉపదేశసారములో రచించారు. కనుక కోరికలు విషతుల్యమైనవి. సంతృప్తిపడడం వాటికి తెలియదు. కోరికలను సంతృప్తి పరచడంలో జీవికి అశాంతి మిగులుతుంది. కోరికలను తీర్చుకోవడంగాక వాటిని మనసులో అంతమొందించుట వలన బ్రతుకును కడతేర్చుకోవడమవుతుంది. భగవానుని అభయహస్తము మనకాస్థితిని కల్పిస్తుంది.

శరణుజొచ్చిన సాంసారిక జీవుల నుద్ధరించి, సమస్త కోర్కెలను తీర్చు భగవానుని అభయహస్తము లక్ష్మీదేవిని చేపట్టిన అమృతహస్త మని చివరగా గోపికలు గానం చేస్తున్నారు.

లక్ష్మీదేవి యనగా ఐశ్వర్యము. ఐశ్వర్యమనగా భగవద్విభూతి. శ్రీకృష్ణుడెచ్చటయుంటే వుంటాడో అచ్చట లక్ష్మీదేవి యుంటుంది. భగవదైశ్వర్యము తాండవిస్తూ ఉంటుందని భావము.

భగవానుని అట్టి దివ్య కరపద్మమును తమ శిరముపై ఉంచమని గోపికలు ప్రార్థిస్తున్నారు. సమస్త కోరికలకు, సంకల్పములకు, ఈప్సితములకు, విషయచింతనకు శిరస్సు సంకేతము. భగవానుని కరపద్మమును శిరముపై ఉంచమని ప్రార్థించడమంటే తమ అంతఃకరణను పరిశుద్ధమొనర్చి, ఆత్మానందములో ఓలలాడునట్లు అనుగ్రహించమని భావము.

భగవానునికి శరణాగతులైన గోపికలు భగవంతుని వైభవమును కీర్తిస్తూ, తమను రక్షించమని రాబోవు శ్లోకంలో గానం చేయుచున్నారు.

వ్రజజనార్తిహన్ వీర యోషితాం నిజజనస్మయధ్వంసనస్మిత
భజ సఖే భవత్కింకరీః స్మ నో జలరుహాననం చారు దర్శయ 6

భావము:- *ఓ సఖుడా! నీవు వీరాధివీరుడవు. నీ భక్తుల గర్వమును నవ్వుతోనే హరించువాడవు. వ్రజవాసుల ఆర్తిని పోగొట్టువాడవు. కనుక నీ దాసీలమైన మా రక్షణకు రమ్ము. మంజులమైన నీ ముఖారవిందమును మాకు చూపుము.*

వ్యాఖ్య

ఈ శ్లోకములో గోపికలు శ్రీకృష్ణుని వీరాధివీరుడుగా వర్ణించి సంబోధిస్తున్నారు. వీరుడనగా పరాక్రమవంతుడు. తన పరాక్రమమును బాహ్యజగత్తులో ప్రదర్శించ శక్తిగలవాడు. సాధారణంగా వీరత్వాన్ని మనము ఇలాగే అర్థంచేసుకుంటూ ఉంటాము. జగత్తుని జయించడం గొప్పకాదు. అంతరంగిక సామ్రాజ్యమును జయించినవాడే నిజమైన వీరుడు. అంతర్యంలో చోటుచేసుకుని యున్న కామక్రోధాది శత్రువులను తుదముట్టించువాడే నిజమైన వీరుడు. ఆ విషయంలో శ్రీకృష్ణుడు సిద్ధహస్తుడు. కామక్రోధాలు తెలియనివాడు. అహంకారము అభిమానాలు అర్థంగానివాడు. రాగద్వేషాలకు లొంగనివాడు. ఈర్ష్యాసూయలు అనుభవంలో లేనివాడు.

అంతటా ఒకేవస్తువును దర్శించేవాడు. భూమానందమేగాని అల్పానందము రుచి తెలియనివాడు.

యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్య ద్విజానాతి స భూమా
అథ యత్రాన్యత్పశ్య త్యన్యచ్ఛృణో త్యన్యద్విజానాతి తదల్పం
యో వై భూమా తదమృత మథ యదల్పం తన్మర్త్యమ్

"ఎక్కడయితే అన్యమైనదానిని దర్శించలేవో, అన్యమైనదానిని వినలేవో, అన్యమైన దానిని భావించలేవో ఆ స్థితే భూమానంద స్థితి. ఎక్కడైతే అన్యమైన వానిని చూస్తున్నావో, అన్యమైన దానిని వింటున్నావో, అన్యమైన వానిని అర్థం చేసుకొనుచున్నావో అదే అల్పము. భూమానందము నిత్యమైనది. అల్పము అనిత్యమైనది" అని ఛాందోగ్యోపనిషత్ తెలియచేయుచున్నది.

నిరంతరము శ్రీకృష్ణుడు భూమానంద స్థితిలోనే యున్నాడు. కనుక తాను అందరిలా మామూలు వీరుడు కాదు. అంతఃకరణ జయించినవాడు వీరాధివీరుడని గోపికల అభిప్రాయము.

అందుచేతనే శ్రీకృష్ణుని "సఖుడా!" అని సంబోధిస్తున్నారు. సమానధర్మాలు గలవారి మధ్యనే స్నేహం నడుస్తుంది. సమానాభిరుచులు గలవారి నేస్తమే కుంటుపడకుండా కొనసాగుతుంది. శ్రీకృష్ణుడు తానెప్పుడూ చైతన్యమే అయి యున్నాడు. గోపికలు కూడా పరాచైతన్యమునే ధ్యానించుచున్నారు. గోపికలలో ఉన్నదీ చైతన్యమే, శ్రీకృష్ణుడూ చైతన్యమే. చైతన్యమనేది ఒకటేగాని రెండుగారు. గోపీచైతన్యము, కృష్ణచైతన్యము యని రెండులేవు. కనుక చైతన్యమునకు చైతన్యమే నేస్తం. చైతన్యములో రెండవ వస్తువు భాసించలేదు. కనుకనే చైతన్యవంతులైన గోపికలు చైతన్య స్వరూపుడైన కృష్ణుని "సఖుడా!" అని సంబోధిస్తున్నారు. ఉపాధులలో తేడాయేగాని, ఉపాధిరహితంగా దర్శించినపుడు మిగిలియున్నది వస్తురహిత చైతన్యమే. (Objectless awareness) "నీ భక్తుల గర్వమును నవ్వుతోడనే హరించువాడవు" అని తరువాత కీర్తిస్తున్నారు గోపికలు.

గర్వమనునది అహంకారపు అనుంగుబిడ్డ. అహంకార సంతాన జాబితాలో గర్వము పుష్టికరమైన శిశువు. గర్వము అనేక విధములుగా ఉంటుంది. కొందరికి ధనగర్వము, మరి కొందరికి విద్యాగర్వము, కొందరికి రూపగర్వము, ఇంక కొందరికి జాతిగర్వము, మరి కొందరికి గర్వములే దనెడి గర్వము. ఇలా అనేక విధములుగా మానవుని మనసుపై గర్వము నాట్యము చేస్తుంది. ఇదంతా అభావ. ఆరోపణ. "నేను రూపవంతుడను" అనగానే నీవు శరీరమని ధ్వనిస్తున్నది. "నేను విద్యావంతుడను" అనగానే నీవు మనస్సని స్ఫురిస్తున్నది. యథార్థానికి నీవు శారీరక మనోబుద్ధులు కావు. ఇంద్రియ ప్రాణాదులు కావు. నీవు వీటన్నిటిని చూస్తున్న చిన్మయ స్వరూపుడవు.

ఒకడు నావలో ప్రయాణము చేస్తుంటాడు. నావ వేగంగా నడుస్తుంటుంది. ఆ క్షణంలో అతనికి నావ కదలనట్లు, చెట్లు వెనుకకు పయనిస్తున్నట్లు గోచరమవుతుంది.

అలాగే, తాను చైతన్య స్వరూపుడైన ఆత్మయయ్యును, అధ్యాసచే తాను శరీరమని, మనసని, ఇంద్రియాలని, బుద్ధియని భ్రాంతి చెందుతున్నాడు. యథార్థానికి నీవు ఆత్మవేకాని మరొకటికాదు. నీవు ఆత్మ అయినపుడు ఉన్నదంతయు ఆత్మేగనుక నీవు వేరుగా లేవు. నీకన్నా అన్యంగా మరొకటి లేదు. నీకన్నా ఇతరములు లేనపుడు గర్వము ఎలా కలుగుతుంది? కలిగిందంటే అజ్ఞానము నీ హృదయంలో చోటు చేసుకుని యున్నదని భావము. కనుక నీవెవరివో విచారించి తెలుసుకో. అసత్యమైన "నేను" ను త్యజించి. సత్యమైన "నేను" లో కరిగిపో. అప్పుడు గర్వము మనోఫలకంపై కదలదు. "నేను" అను చైతన్యము ఎక్కడ నుండి కదలుచున్నదో తెలుసుకో.

అహమయం కుతోభవతి చిన్వతః, అయి పత త్యహం నిజవిచారణం

"నేను" అనునది ఎక్కడ పుట్టుచున్నది? అని అన్వేషణ జరిపినచో "నేను" (అహంకారము) పతనమగును. "ఇదియే ఆత్మ విచారము" అని శ్రీరమణ మహర్షులవారు ఉపదేశసార మనెడి గ్రంథములో తెలియచేశారు.

కనుక ఆత్మను దర్శించిన వ్యక్తిలో గర్వము పొడసూపదు. భక్తులు అహంకారానికి లోనుకాకూడదు. అహంకారము గల వ్యక్తి భక్తుడుకాడు. కాలేడు. ఒకవేళ భక్తునిలో సంస్కారలోపముచేత కొన్ని పొరపాట్లు కనుపించినా భగవానుని కరుణామయ దృష్టి పడుటచేత అవికూడా ఎండుటాకులవలె రాలిపోతాయి. "చిరునవ్వుతోనే భక్తుల గర్వమును హరించువాడవు" అని గోపికలు గానం చేయడంలోని అంతర్యమిదియే. "నీవు ఆత్మనైయుండి అజ్ఞానమునకు లోనై దేహముతో తాదాత్మ్యం చెంది గర్వానికి లోనయ్యావా?" యనెడి వెటకారపు మందలింపే కృష్ణుని మందహాసము. భక్తుడు వెంటనే తన తప్పును గ్రహించి సిగ్గుతో తలవంచుకుంటాడు. సవరించుకొని ఆత్మనివేదనం చేసుకుంటాడు.

"వ్రజవాసుల ఆర్తిని పోగొట్టువాడవు" అని గోపికలు కీర్తించారు.

ప్రతి జీవిలోను ఆర్తివుంది. ఆర్తి ఎందుకు? దేనికోసం? ఎవరికోసం? ఆనందంకోసం. అఖండానందానుభూతికోసం. ఆనందం ఎచ్చటనున్నది? ఆనందం ఆత్మయందే యున్నది. "ఆనందో బ్రహ్మ" అని శ్రుతివచనము. ఆత్మలో ఆనందము వున్నదని తెలుసుకోలేక ఆనందముకొరకు ఆర్తితో అన్యవస్తువులయందు అన్వేషణ సాగించువారు వ్రజవాసులు. అట్టి వ్రజవాసుల మానసములను అపహరించి వారి చిత్తములను దారి మరల్చి వారి మనసులలో తీవ్రరూపం దాల్చియున్న ఆర్తిని తన వైపుకు త్రిప్పుకున్నాడు శ్రీకృష్ణుడు. వ్రజవాసుల హృదయాలు వాసుదేవుని వైపు ఎప్పుడయితే మరలాయో అప్పుడే ఆనందానుభూతి కలిగింది. అంతవరకు వారిని ఆడించిన ఆర్తి అదృశ్యమైంది. దాని స్థానే ఆనందము భాసించింది.

గోపికలు ఈ విధంగా శ్రీకృష్ణుని కీర్తించి, చివరగా తాము శ్రీకృష్ణుని దాసీలమని, తమచెంతకు చేరి మంజులమైన తన ముఖారవిందమును చూపమని శ్రీకృష్ణదేవుని శరణు వేడుకొనుచున్నారు.

శ్రీకృష్ణుడు యజమాని. గోపికలు దాసీలు. ఇదియే గోపికల భావన. దాసీలకు కర్తృత్వముండదు. యజమాని చెప్పిన విధంగా ప్రవర్తించడము, జీవించడమే దాసీలు చేయవలసినవని. చేయదగినవని. దాసీజనులుగ శ్రీకృష్ణునికి శరణాగతులైన గోపికలు అహంకారాన్ని సమూలంగా నశింపచేసుకున్నారని భావము. అహంకారాన్ని శాశ్వతంగా తమ హృదయాలనుండి దూరంచేసి శ్రీకృష్ణుని పద సరోజములయందు సమర్పించారు. కృష్ణునికై జీవించడము, నటించడము, కృష్ణునికై గతించడము, వారికి తెలిసినదంతే. తమకు కావలసిందేమిటో కృష్ణునికే తెలుసు. ఆయన అనుగ్రహించిందే ప్రసాదము. సేవయే పరమావధిగా భావించి, జీవించే దాసీలు యజమాని సౌఖ్యాన్నే ప్రధానంగా భావించి, తదనుకూలంగా ఎలా ఆచరిస్తుంటారో అలాగే శ్రీకృష్ణునికి సేవచేయుటయందే మనసు లగ్నం చేసి సదా జగన్నాథుని దర్శిస్తూ జీవించడమే గోపికల కర్తవ్యమైంది. అందుచేతనే "మంజులమైన నీ ముఖారవిందమును మాకు చూపుము" అంటూ శ్లోకాన్ని ముగించారు.

భగవంతుడు ఎక్కడున్నాడు? భగవంతుడంటూ వుంటే అతడు అన్నిచోట్ల వుండేవాడై యుండాలి. ఒకచోట వుండి మరొకచోట లేనివాడు భగవంతుడు కాలేడు. ఈ సత్యం తెలియచేయడానికే శ్రీకృష్ణుడు ఒకేకాలంలో నాలుగుచోట్ల వెన్న దొంగిలించేవాడు.

భగవంతుడు అన్నిచోట్ల వ్యాపించియున్నపుడు నాకెందుకు దర్శనం కావడంలేదు? ధూమముచే అగ్ని, కోశముచే కత్తి, మాయచే శిశువు, మేఘముచే సూర్యుడు, మట్టిచే నిధినిక్షేపాలు కప్పబడియున్నట్లు నీ అజ్ఞానమే అడ్డుతెరగా నిలిచి భగవద్దర్శనాన్ని ఆటంక పరచుచున్నది.

అజ్ఞానం తొలగితే భగవానుని సర్వత్రా దర్శించవచ్చు. స్పృశించవచ్చు. అజ్ఞానము తొలగాలంటే జ్ఞానం రావాలి. జ్ఞానం రావాలంటే చాకలి బట్టను శుభ్రంచేసినట్లు మనం అజ్ఞానాన్ని రూపుమాపాలి. మనమంతా ఆధ్యాత్మిక రజకవృత్తిలో ప్రవేశించాలి.

అజ్ఞానమనే మురికితో అశుభ్రంగాయున్న మన జీవనవస్త్రాన్ని భగవద్భక్తి యనెడి సబ్బువేసి, ఇంద్రియనిగ్రహమనే బండకేసి ఉతికి, సమదర్శనమనే నదిలో కడిగినచో జీవనవస్త్రము శుభ్రపడి అద్వైతకాంతులతో ప్రకాశిస్తుంది.

ఈశ్వరాను గ్రహాదేవ పుంసా మద్వైత వాసనా

భగవదనుగ్రహములేనిదే అద్వైత వాసనకలుగదని దత్తాత్రేయులవారు అవధూత గీతలో తెలిపియున్నారు.

గోపికలు ఈ విషయమును చక్కగా గ్రహించబట్టే భగవదనుగ్రహమునకై ప్రార్థిస్తూ భగవానుని ముఖారవిందమును అనగా భగవదనుగ్రహమును తమపై వర్షింపచేయమని కీర్తించారు.

ప్రణతదేహినాం పాపకర్శనం తృణచరానుగం శ్రీనికేతనమ్
ఫణిఫణార్పితం తే పదాంబుజం కృణు కుచేషు నః కృన్ధి హృచ్ఛయమ్ 7

భావము:- ప్రణతులగువారి పాపములను పోగొట్టునవియు, గోవుల వెంటనడచి వెళ్ళునవియు, లక్ష్మీదేవిచేత సదా సేవించబడునవియు, కాళీయుని పడగలపై నృత్యము చేసినట్టివియును అగు నీ పాదారవిందమును మా కుచములపై నిడి మా హృదయ తాపమును తొలగింపుము.

వ్యాఖ్య

సర్వసౌందర్య సంగ్రహమైన భగవానుని శరీరములో ప్రతి అంగము పవిత్రమైనదే. దర్శింపదగినదే. "ఆనంద చిన్మయ సదుజ్జ్వల విగ్రహస్య" భగవానుని దివ్య శరీరములో ప్రతి అంగము ఆనంద చిన్మయ సదుజ్జ్వలమని బ్రహ్మసంహితలో తెలియచేయబడింది. గడచిన రెండు శ్లోకాలలో భగవానుని కరపద్మమును, ముఖారవిందమును గూర్చి కీర్తించి

గోపికలు ఈ శ్లోకములో భగవానుని పవిత్ర పాదారవింద మహిమను తెలియచేస్తూ గానం చేయుచున్నారు.

భగవానుని దివ్యపాదారవింద దర్శనముతో సమస్త పాపములు ప్రక్షాళన మగునని ఈ శ్లోకంలో గోపికలు గానం చేస్తున్నారు. శ్రీకృష్ణుని శ్రీచరణాలవెంట ఎందరో భక్తులు తరించిపోయారు. తరించిపోతున్నారు. తరించిపోతారు. తాము కూడా భగవానుని శ్రీపాదములను ధ్యానించి తరించాలని నిర్ణయించుకున్న గోపికలు ఇహపర సుఖముల నొసగే వాసుదేవుని దివ్యచరణాలను స్తుతిస్తున్నారు.

భగవానుని శ్రీచరణాలు బ్రహ్మదేవుడు కడిగిన పాదములు. పుణ్యగంగామాత ఆవిర్భవించిన దివ్యపాదములు. అహల్య పాపమును కడిగిన పాదములు. గజేంద్రుని కాపాడిన పాదములు. బలిని కృతార్థునిచేసిన పాదములు.

పదాశరత్పద్మ పలాశరోచిషా. నఖద్యుభిర్నోఽన్తరఘం విధున్వతా
ప్రదర్శయ స్వీయమపాస్త సాధ్వసం. పదం గురోమార్గ గురుస్తమోజుషాం

"హే భగవాన్! శరత్కాల పద్మముయొక్క మనోహరమైన పూలరేకుల వలె నీ పవిత్ర పాదద్వయము సౌందర్యమును విరజిమ్ముచున్నవి. అందు గోచరించే నీ శృంగార పాదనఖములు మా హృదయము నందలి అంధకారమును అదృశ్యము చేయులాగున దివ్యతేజస్సును అందించుచున్నవి. అట్టి పవిత్ర పదసరోజములను సదా మాకు దర్శింపచేయుము" అని భాగవత చతుర్థస్కంధములో పరమశివుడు ఈ ప్రార్థన చేశాడు.

ఈ పాదమేకదా యిల యెల్లఁగొలిచినది,
ఈ పాదమేకదా యిందిరా హస్తముల కీలయినది.
ఈపాదమేకదా యింతటను మ్రొక్కేదిది,
యీ పాదమే కదా యీ గగన గంగ పుట్టినది
ఈపాదమే కదా యెలమిఁ బెంపొందినది.
యీ పాదమేకదా యిన్నిటికి నెక్కుడైనది ॥ఈపాదమే॥

అని తాళ్ళపాక అన్నమాచార్యులు కీర్తించారు.

భగవానుని దివ్యపాదారవిందములకు ప్రణామము లర్పించువారి పాపములు ప్రక్షాళన మగునని శ్లోక ప్రారంభములోనే గోపికలు స్మరించుచున్నారు.

భక్తుడు భగవానునికి సాష్టాంగపడి నమస్కరించుటలో విశేషార్థమున్నది. శిరోభాగములో నిండిన తన అంతఃకరణము పూజ్య భగవానుని దివ్య చరణాలచెంత బలి యొసంగుటయే ప్రణామములోని విశిష్టత. సంకుచితమైన తన మనోబుద్ధులను ఆదిదేవుని పాదాల కంకితము చేయుటమే అందులోని పారమార్థిక అవగాహన.

"భగవాన్! దోషాలతో, ద్వేషాలతో కరుడు గట్టుకుపోయిన మనస్తత్వము నాది. నా మనోబుద్ధులను పరిశుద్ధమొనర్చి, నన్ను కృతార్థుని చేయుము. బలవత్తరమైన ఇంద్రియ పెనుగులాటచే దూరిపించబడి సంసారారణ్యంలో చెదర గొట్టబడినవాడను. ఇంద్రియ

విగ్రహమును, మహాశక్తిని ప్రసాదించుము. నేను నీకు సంపూర్ణ శరణాగతుడ నయ్యానని చెప్పడానికి కూడా నాకు ధైర్యం చాలడం లేదు. నా మనస్సు ఏ క్షణాన నన్ను పెడదారి పట్టించి మోసగిస్తుందేమో నన్న భయం నన్ను వెంటాడుతూనే యున్నది. భగవాన్! దీనుడను. కరుణించి కాపాడు" అని భక్తుడు భగవంతునికి శరణాగతుడౌతాడు.

భగవానుడు ధర్మ స్వరూపుడు. ధర్మమే ఈ సృష్టికి ఆధారము. ధర్మము నాధారము చేసుకొనియే భగవానుడు సృష్టిని పాలిస్తున్నాడు. ధర్మముపై ఆధారపడి తాను సృష్టి క్రమమునంతా వీక్షిస్తున్నాడు. ధర్మము నాచరించు వ్యక్తి సుఖ శాంతులతో జీవిస్తాడు. ధర్మము నతిక్రమించినవాడు అనంత దుఃఖానికి గురి యవుతాడు.

భగవంతుడు నిలబడుటకు ఆధారమైన పాదాలు ధర్మానికి సంకేతము. భక్తుడు భగవానుని పాదములకు ప్రణామము లర్పించడ మంటే ధర్మయుత జీవనము గడుపుటకు నిశ్చయించుకొని, తనను కాపాడమని భగవంతుని ప్రార్థించుచు శరణాగతుడై యున్నాడని భావము. భగవంతుడే ధర్మము. ధర్మమే భగవంతుడు. "ధర్మోరక్షతి రక్షితః" ధర్మమును రక్షించువాడు ధర్మముచే రక్షింపబడునని ఉపనిషద్వాక్యము. కనుక భగవాని దివ్యచరణములకు ప్రణమిల్లు వానిని ఆ పాదములే రక్షిస్తాయి. ప్రణతులగువారి పాపములను హరించి పవిత్రులుగ మార్చు శ్రీకృష్ణుని చరణకమలములను గోపికలు స్తుతించుచున్నారు.

ప్రణతులగువారి పాపములను పోగొట్టునవియే గాక, గోవులవెంట నడచి వచ్చు పాదములంటూ కీర్తించసాగారు గోపికలు.

గోవులను పాలించువాడు గోపాలుడు. వాటిని క్రమమార్గములో నడచునట్లు చూచువాడే గోవిందుడు. ప్రతిమనిషిలో కూడాను పశుస్వభావము తలదాచుకొనియున్నది. బుద్ధికలిగిన మానవుడు పశువులా సంచరించడము, ప్రవర్తించడము అనుచితము. తనలోని అసుర ప్రవృత్తిని నిర్మూలింపచేసుకోవాలి. పశుస్వభావమును దూరం చేసుకోవాలి. కామక్రోధాది అరిషడ్వర్గములను అంతం చేయాలి. ఆవేశము రాగానే ఆపుకోలేక పశువులు ప్రదర్శిస్తాయి. సహజాతములతో ప్రవర్తించే పశువులు అంతకన్నా తమ బ్రతుకులో సౌందర్యాన్ని తీసుకు రాలేవు. మనిషికి సహజాతాలతోపాటు బుద్ధికూడా యున్నది. నిత్యానిత్య వస్తువివేకం చేయగల జ్ఞానమున్నది. అందుచే ఆవేశాలను విచారణచే అంత మొందించగలడు. కోపము రాగానే పశువులవలె మనిషి బహిరంగపరచకూడదు. మౌనంగా ఉండటం అలవరచుకోవాలి. ద్వేషము రాగానే ఆలోచించి దానిని ప్రేమగా మార్చుకోవాలి. లోభాన్ని త్యాగంతో జయించాలి. సేవా భావంతో కర్మలాచరించి, స్వార్థాన్ని నిర్మూలించాలి. విజ్ఞానముండి కూడా ఉపయోగించలేని అసమర్థతతో ద్విపాద పశువులా మానవుడు సంచరించకూడదు. నైతిక జీవనం గడపాలి. ధర్మయుతంగా బ్రతకాలి.

నైతిక ప్రవర్తన సత్త్వగుణ సంపన్నులకే అలవడుతుంది. భక్తిగలవారికే సత్త్వసంపద చేకూరుతుంది. భక్తి కలగాలంటే భగవానుని పాదపద్మాలకు శరణాగతులు కావాలి. గోవులను సక్రమ మార్గంలో నడిపించి కాపాడినట్లు మనలోని పశుస్వభావములను కూడా క్రమపరచి, మన బ్రతుకులలో గోపాలుడు శాంతిని ఆవిష్కరింప చేస్తాడు. కనుకనే

గోవులవెంట నడచిన పాదములంటూ శ్రీకృష్ణుని పాదారవిందమును గోపికలు గానం చేశారు.

ప్రణతులగువారి పాపములను పోగొట్టి గోవులవెంట నడచునవియే గాక, లక్ష్మీదేవిచే సదా సేవింపబడు పాదములని తరువాత కీర్తిస్తున్నారు.

లక్ష్మీదేవి యనగా ఐశ్వర్యము. లక్ష్మీదేవి నిరంతరము విష్ణుదేవుని పాదసేవచేస్తూ వుంటుంది. క్షీరసాగరమున జనించిన మహాలక్ష్మిని తమకు కావలయునని దేవాసురులెల్లరు ప్రగాఢ వాంఛను తెలియచేశారు. ఆమె మాత్రము మహావిష్ణువునే వరించి, ఆదిదేవుని చరణకమలముల చెంతనే తన బ్రతుకును ధన్యత చేసుకొనేందుకు నిర్ణయించుకుంది.

కోరేవారికి కోరికలే మిగులుతాయి. కోరనివారికి ఆనందం అందుతుంది. ప్రపంచమంతా ఐశ్వర్యానికి అర్రులుచాచి యుంటుంది. అట్టి ఐశ్వర్యప్రదాయిని యగు లక్ష్మీదేవి విష్ణుదేవునకు పాదసేవ చేయుచున్నది. కనుక లక్ష్మీదేవిచే సదా సేవించబడుచున్న ఆదిదేవుని పాదపద్మములను సేవించువారు వాంఛారహితులై మనగలరు. అదియునుగాక స్వామిపాదములను సేవించు భక్తునికి కర్తవ్యము మిగలదు. తాను ఎప్పుడూ స్వామి పాదాలనే హృదయంలో భావించుటవలన, ఆ దివ్యపాదాలచెంత ఆసీనురాలై యున్న లక్ష్మీదేవి అనవరతము తన అవసరాలన్నీ తీర్చుతూనే యుంటుంది.

ప్రణతులగువారి పాపములను పోగొట్టి, గోవులవెంట నడచి, లక్ష్మీదేవిచే సదా సేవించబడిన పాదములంటూ కీర్తించి, చివరగా కాళియుని పడగలపై నాట్యమాడిన పవిత్రపాదములంటూ కీర్తిస్తున్నారు గోపికలు.

శ్రీకృష్ణుని పవిత్ర పదపయోజములు కాళియుని పడగపై నిలబడుటచేత భయంకరమైన గరుడుని వలన కలిగెడి ప్రాణ భయమునుండి కాళియుడు విముక్తిని పొందాడు.

ప్రణతులగువారి పాపములను పోగొట్టి, గోవులవెంట నడచి, లక్ష్మీదేవిచే సదా సేవించబడి కాళియుని పడగలపై నిలువబడిన శ్రీకృష్ణుని పాదారవిందమును తమ కుచములపై నిడి హృదయతాపమును తొలగించమని గోపికలు శ్రీకృష్ణుని ప్రార్థించుచున్నారు. భావగర్భితమైన ఆధ్యాత్మిక గ్రంథాలను అర్థంచేసుకోవాలంటే భావపూరిత అంతఃకరణ ఉండాలి. ఋషి వాఙ్మయమును చదివిచూడాలంటే, తాను తత్పరుడై యుండాలి. పుస్తకాల పురుగులు, చిల్లర మనస్తత్వాలు గల వ్యక్తులు, వితండవాదాలు చేసి, ప్రజ్ఞావంతులమని అనిపించుకోవాలనే శుష్కవేదాంతులు, ప్రేమజీవనం తెలియని శూన్యహృదయులు పరమ పవిత్రమైన భాగవత ధర్మ సారాన్ని ఆఘ్రాణించలేరు. శాస్త్ర సాగరలోతుల్ని తరచి చూడలేరు.

శ్రీకృష్ణుని పాదారవిందమును తమ కుచములపై నిడమని గోపికలు ప్రార్థించుటలో సంస్కార హీనులకు దోషం కనిపిస్తుంది. లైంగిక భావావేశము తొంగి చూస్తుంది. అర్థం చేసుకున్నవారు ఆనంద శిఖరాల నధిరోహిస్తారు. అపార్థం చేసుకున్నవారు అజ్ఞానకూపంలో పడిపోతారు.

శరీరానికి పాదము ఆధారము. వ్యక్తి జీవనవిధానము దేనిపై ఆధారపడియున్నదో అదియే అతని పాదము. తన మనుగడకు ఆధారభూతమైన అధిష్ఠానము. దొంగకు దొంగతనమే ఆధారము. చోరత్వముపై ఆధారపడి జీవించుటవలన చోరత్వమే అతని పాదము. మరి కృష్ణుడు? కృష్ణుడు ప్రేమమూర్తి. మూర్తీభవించిన ప్రేమవిగ్రహమే శ్రీకృష్ణుడు. తానే ప్రేమ. ప్రేమయే తాను. తన మనుగడ ప్రేమ మీదనే ఆధారపడియున్నది. కనుక శ్రీకృష్ణుని పాదములు ప్రేమకు సంకేతము.

భగవానుని పవిత్ర ప్రేమ పాదములను తమ కుచములపై నుంచమని ప్రార్థిస్తున్నారు గోపికలు. కుచములు అనగానే బాహ్యదృష్టితో మనసును కలుషితం చేసుకోకూడదు. పాదముల సంకేతాన్ని ఎలా అర్థంచేసుకొన్నామో, కుచముల సంకేతాన్ని కూడా అలాగే అర్థంచేసుకోవాలి. బాహ్యదృష్టికి తెలిసే కుచములే అంతర్దృష్టితో చూస్తే హృదయము. స్వామి పవిత్ర పాదములను కుచములపై నుంచమంటే తమ హృదయంలో నింపమని భావము.

ప్రతి మానవహృదయము కల్మషాలతో కాఠిన్యమై ఉంటుంది. స్వార్థంతో కర్కశమైన హృదయంలో ప్రేమరసాన్ని నింపుకుని హృదయాన్ని సుకుమారంగా తయారుచేసుకోవాలి. విశాలంగా పెంపొందించుకోవాలి.

ప్రేమమయమైన శ్రీకృష్ణుని ఉజ్జ్వల పాదారవిందమును తమ స్తనములపై నిలపమని గోపికల భావము. ఎంతటి మహత్తర భావము? ఎంతటి మనోజ్ఞ సందేశము? అందుచేతనే గోపికల భక్తి ఉత్కృష్టమని భావిస్తారు.

మధురయా గిరా వల్గువాక్యయా బుధమనోజ్ఞయా పుష్కరేక్షణ
విధికరీరిమా వీర ముహ్యతీ రధరసీధునా ప్యాయయస్వనః 8

భావము:- ఓ కమలనేత్రుడా! నీ మనోహర పదలాలిత్యముతో బుధజనుల చిత్తములను కూడా అపహరించు ఓ పరమవీరా! నీ కొరకే పరితపిస్తూ జీవిస్తున్న మాకు నీ అధరామృతము నొసంగుము.

వ్యాఖ్య

గత శ్లోకంలో భగవానుని పాదారవింద వైభవమును వివరించి, భగవానుని అధరామృత మాధుర్యమును ప్రస్తుత శ్లోకములో గోపికలు గానముచేయుచున్నారు. భగవానుని వాక్కులు చమత్కార పదలాలిత్యంతో గూడినవిగా బుధజనుల మానసములను గూడా హరింప చేయుచున్నవని గోపికలు గానము చేయుచున్నారు. ఋగ్వేదాది చతుర్వేదములు తన వాస్యవనమున ప్రతిష్ఠింపబడి, తన వాక్యే వేదాలయుండగా రూపొందిన భగవానుని శాశ్వత వాక్కులు అమృతరసము వలె శ్రవణానందకరముగా నుండును. సత్యవాక్కులైనందున భగవానుని వాక్కులు వినుటయందు

విసుగు జనించదు. ఆయన మాటలకు కాలదోషం అంటదు. భగవానుని ముఖ కమలమునుండి వెలువడిన భగవద్గీత ఇప్పటికిని నిత్యనూతనమై విరాజిల్లుటయే ఇందులకు తార్కాణము. కొన్నివేల సంవత్సరములనుండి వివిధ భాష్యాలతో, విపుల వ్యాఖ్యానాలతో దినదిన ప్రవర్ధమాన మగుటయే ఇందులకు ప్రబల నిదర్శనము.

భగవానుని వాక్కు సత్యవాక్కు. అందుచే అది వినుటకు చమత్కారముగనే ఉంటుంది. సత్యము మాటకు అందేదికాదు. మనస్సుకు చిక్కేదికాదు. సత్యమును నిర్వచించడమంటే నిరాకరించడమనే అర్థము. అందుచేత సత్యపదార్థ వివరణ విచిత్ర పంథాలో నడుస్తుంది.

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే
తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః

"అది (ఆత్మ) చలించును. అది చలించదు. అది దూరమున ఉన్నది. దగ్గరలోనూ యున్నది. అది దీనియంతటిలో కలదు. దీనియంతటికి బాహ్యమున కూడా కలదు" అని ఈశావాస్యోపనిషత్ తెలియజేయుచున్నది.

బాహ్యానికి ఈ మంత్రము విరుద్ధ భావాలతో యున్నట్లు కన్పిస్తుంది. విచారణ చేసిన పిదప సత్యము తేటతెల్లమవుతుంది. సత్యభావ ప్రకటనే చమత్కారంగా ఉంటుంది. భగవానుని అట్టి చమత్కార పూరిత అమృతవాక్కులు బుధజనుల మానసములను కూడా హరింప చేస్తున్నాయంటున్నారు గోపికలు. అందుచేతనే ఈ శ్లోకములో స్వామిని "కమలనేత్రా" యని సంబోధిస్తున్నారు. కమలము తనలో మాధుర్య మకరందమును నింపుకొని తుమ్మెదలను తృటిలో ఆకర్షిస్తుంది. అలాగే శ్రీకృష్ణుడు అమృతమును నింపుకున్న తన వాక్కుతో బుధజనులను ఆకర్షిస్తాడు.

బుధజనులు పవిత్రాత్ములు. వారి జీవనమే విచిత్రము. పావనము. అహంకారమును నాశమొందించుటతో ప్రారంభమై ఆత్మానందములో ముగుస్తుంది. వారికి ధ్యానమే ఆహారము. సంకీర్తనే పానీయము. ప్రేమయే భాషణము. మననమే భూషణము. సమదర్శనమే దృష్టి. సదానందమే నిద్ర.

అట్టి బుధజనుల మనస్సుల నపహరించిన శ్రీకృష్ణునికై పరితపిస్తూ ఉన్నారనియు, తన అధరామృతముతో వారిని తృప్తిపరచవలసిం దనియు గోపికలు శ్రీకృష్ణుని స్తుతిస్తున్నారు.

శ్రీకృష్ణుని వీడి క్షణకాలమైనా జీవించలేని తమ మనోవ్యాకులమును గోపికలు తెలియజేస్తున్నారు. గోపికలకు సర్వస్వమూ భగవానుడే. సూర్యుని నుండి కాంతి వేరుగానట్లు, నీటినుండి చల్లదనము వేరుగానట్లు, మనిషినుండి ఛాయ వేరుగానట్లు గోపికలు కృష్ణుని నుండి వేరై మనుగడను సాగించలేరు.

శ్రీకృష్ణ వియోగములో వారికి ఆహారము రుచించదు. ఆకలి అర్థంకాదు. నేత్రాలకు నిద్రలున్నాయనా యనే సందేహం కూడా చూసేవారికి కలుగుతుంది. ఎవరితోను మాట్లాడరు. ఒకవేళ మాట్లాడినా ఏమి మాట్లాడుతున్నారో తెలియదు. నవ్వలేరు. ఆ నవ్వు

రెండువిధాలైన భావస్పందనతో కదలినట్లుంది. శ్రీకృష్ణుని గత మధురానుభవ పరంపరల ప్రేరణతో సిగ్గుచెంది నవ్వినట్లు కన్పిస్తుంది. అలాంటి దివ్యానుభూతి మళ్ళీ ఎప్పుడు కలుగుతుందోయన్న నిరాశా పెనుగాలులకు చెదరిపోయిన మనస్సుచేసే వికటాట్టహాసంగానూ కన్పిస్తుంది. ప్రపంచంలో వుంటూ, ప్రపంచానికి సంబంధించని మూగజీవులు అనుక్షణము శ్రీకృష్ణుని పొందుకొరకే అలమటిస్తుంటారు. శరీరములో ప్రాణం ఎందుకు నిలిచియున్నదా యని తపిస్తుంటారు.

ఘాయలకీ గతి ఘాయల జానై కి జిన లగీహోయ్

ఎంతటి విరహవేదన? ఎంతటి ఉన్మత్తత? అవును. అది పిచ్చియే. ఆ పిచ్చిలోని మాధుర్యమేమిటో పడితేగాని తెలియదు.

గాయపడేవా డనుభవించు బాధ అలాంటి గాయం తగిలిన వాడికే చక్కగా అర్థమవుతుందని గానం చేసింది భక్త మీరాబాయి.

భగవంతుని కొరకు సదా తపించే ఆ గోపికలే గొప్ప తపస్వినులు. తపించడమే తపస్సు. భగవానుని కొరకు తపించే ధన్యజీవులకు భగవానుడు క్షణం దూరంకాడు.

తపో మే హృదయం సాక్షాదాత్మాహ తపసోఽనఘ

"తపస్సు నాకు హృదయము. నేనే తపస్సుకు ఆత్మను" అని భాగవతము ద్వితీయ స్కంధము తొమ్మిదవ అధ్యాయమునందు భగవానుడు స్వయంగా వేదగర్భుడైన బ్రహ్మదేవునికి తెలియజేశాడు.

విరహాగ్నితో పరితపిస్తున్న తమను తన అధరామృతము నందించి తృప్తి పరచవలసిందని ఈ శ్లోకములో గోపికలు కీర్తిస్తున్నారు.

భగవానుని అమృతవాక్కుద్వారా వారి అజ్ఞానము, అజ్ఞానజనిత పరితాపము అంతమై ఆత్మానందము కలుగ గలదని గోపభామల అభిప్రాయము. అగ్నిలో దాహకశక్తి యున్నట్లు, భగవానుని వాక్కులో అజ్ఞానమును అంతముచేయు వ్యాపకశక్తి యున్నది. ఆ దివ్యానుభూతిలో సర్వదుఃఖాలు సమసిపోతాయి. నిత్యానందస్థితి ప్రాప్తిస్తుంది. ఆ పరమోత్కృష్ట ఆత్మానందమును అనుభవించిన జీవుడు మళ్ళీ ప్రాపంచిక విషయ వ్యామోహములో తగుల్కొనడు. ఈ విషయాన్నే మృదుమధుర మంజుల వాగ్విలాసంతో జయదేవుడు అష్టపదిలో గానం చేస్తాడు.

వికసిత సరసిజ లలితముఖేన, స్ఫుటతి నసా మనసిజ విశిఖేన
అమృత మధుర మృదుతర వచనేన, జ్వలతి నసా మలయజ పవనేన ......
యారమితా వనమాలినా .... ॥సఖీ॥

"ఓ చెలియా! విరబూసిన కమలమువలె మనోహరమైన నేత్రములుగల శ్రీకృష్ణునితో రమించు యువతి మన్మథబాణములచే బాధ నొందదుగదా!

"ఓ సఖీ! అమృతమువలె మధురమైన మృదు వాక్యములను పలుకు శ్రీకృష్ణునితో ఏ యువతి రమించెనో, ఆవిడ మలయమారుతముచే తపించదు గదా!" అని గోపికా విరహవేదనను జయదేవుడు గీతగోవింద కావ్యములో కీర్తించాడు.

తవ కథామృతం తప్తజీవనం కవిభిరీడితం కల్మషాపహమ్
శ్రవణమంగళం శ్రీమదాతతం భువి గృణంతి తే భూరిదా జనాః 9

భావము:- నీ కథామృతము తాపత్రయమునందు క్రుంగువారలకు జీవనము కల్పించును. మహాకవులు దానిని స్తుతించుచుందురు. అది సర్వకల్మషములను హరించును. వినినంతనే వీనులకు విందు చేకూర్చును. సంపద చేకూర్చును. అది విస్తృతమైనది. భూలోకమున దానిని కీర్తించువారు సుకృతులు.

వ్యాఖ్య

నీ కథామృతము తాపత్రయమునందు క్రుంగువారలకు జీవనము కల్గించును. మహాకవులు దీనినే కీర్తించుచుందురు. ఇది సమస్త కల్మషములను హరించునది. వినినంతనే వీనులకు విందు చేయునది. అతి విస్తారమైనది. మంగళకరమైనది. భూలోకమున దీనిని కీర్తించువారు బహు సుకృతులు సుమా!

శ్రీకృష్ణుని వాగామృతమును గూర్చి గత శ్లోకములో వివరించిన గోపికలు ఈ శ్లోకములో భగవత్కథా శ్రవణ ప్రభావమును కీర్తించుచున్నారు.

భగవత్కథామృతము తాపత్రయమునందు క్రుంగువారలకు జీవనము కల్గించునని తెలియజేయుచున్నారు. తాపత్రయము మృత్యుసమానము. గనుకనే కథాశ్రవణము అమృతమై, దివ్యజీవనమును కల్గించుచున్నది. సాంసారిక తాపత్రయమునకు అజ్ఞానమే కారణము. అసత్య అవగాహన అనాచార జీవనాన్ని అందిస్తుంది. అనాచార జీవనము అనంత దుఃఖాన్ని పంచిపెడుతుంది. దుఃఖ నివృత్తి కలగాలంటే అంతఃకరణలో అవగాహన అంకురించాలి. అవగాహన భగవత్కథా శ్రవణమువల్ల కలుగుతుంది.

శ్రీకృష్ణుని కథామృతము పానము చేయడమంటే పరమపవిత్ర భాగవత గ్రంథమును అధ్యయనము చేయడమని భావము. అధ్యయనము వలన ఆదర్శ జీవనము ఏర్పడుతుంది. అనుభూతి చిగురిస్తుంది.

ఆత్మైకత్వవిద్యా ప్రతిపత్తయే సర్వం వేదాన్తా ఆరభ్యన్తే

బ్రహ్మైక్యమనే అపరోక్షజ్ఞానము కలగాలంటే ఉపనిషత్తులలోని సత్యాలను శ్రవణంచేసి సాక్షాత్కరించాలని ఆదిశంకరులవారు బ్రహ్మసూత్ర భాష్యములో తెలియజేశారు. భాగవత శ్రవణము మనకు ఏమందిస్తుంది? భాగవత సందేశాన్నందిస్తుంది. భాగవత సందేశమేమిటి? సత్యము, ప్రేమ. ప్రేమతత్త్వమే భాగవతము బోధించు కేంద్రవిషయమై పాటించడమువలన సత్య యున్నది. సత్యమును అర్థంచేసుకొని సత్యపథంలో పదక్షేప

స్వరూపులమై జీవించగలము. ప్రేమను అవగాహనకు తెచ్చుకొని, ప్రేమమార్గములో చరించడమువలన పరమ ప్రేమస్వరూపుడైన భగవానునిలో ఐక్యము కాగలము. సత్యప్రేమలు మన అంతఃకరణలో నిండియున్నపుడు హృదయంలో శాంతి స్థిరంగా నిలచి ఉంటుంది.

భాగవతము శ్రీకృష్ణుని దివ్యచరితమును మనకు తెలియచేసి, పరమ భాగవతులమై తరించాలని ఆశీర్వదిస్తుంది. అంతేకాదు. కంసాదుల అసుర ప్రవృత్తిని కూడా కనుపరచి, వాటికి దూరంగా వుండమని కూడా ఆజ్ఞాపిస్తుంది. ప్రపంచము యొక్క నిత్యత్వాన్ని అర్థం చేసుకొని ధర్మయుత జీవనమును సాగించమని హెచ్చరిస్తుంది. వైరాగ్యమును ప్రబోధిస్తుంది. సాధనను మెరుగుపరుస్తుంది. కనుక భగవత్కథా శ్రవణము తాపత్రయములను పోగొట్టి ఆనందధామము చేరుస్తుందని కీర్తిస్తున్నారు గోపికలు.

ప్రవిష్టః కర్ణరంధ్రేణ స్వానాం భావ సరోరుహమ్,
ధునోతి శమలం కృష్ణః సలిలస్య యథాశరత్

శరత్కాలము నీటిలోని మాలిన్యమును పోగొట్టునట్లు శ్రీకృష్ణుడు కర్ణ రంధ్రముద్వారా భక్తుల హృదయమున ప్రవేశించి, వారి పాపములను హరించునని భాగవతములో పరీక్షిన్మహారాజుకు తెలియచేస్తారు.

పరమ పవిత్ర భగవత్కథా మహిమను కవులు సదా కీర్తించుచుందురని గోపికలు తెలియ జేస్తున్నారు.

భగవత్కథా శ్రవణముచే పవిత్రమైన అంతఃకరణ కలిగిన మహాత్ములు భగవంతుని లీలలను గానము చేయుచూ గుణమహాత్మ్యాలను వర్ణిస్తూ కీర్తిస్తున్నారు. వ్యాసుడు, శుకుడు, నారదాది మహర్షులు సదా హరిగుణ కీర్తనాదులయందే తమ జీవితాలను ధన్యత చేసుకున్నారు. భగవద్గుణమహాత్మ్యాలను ఇతరులకు తెలియచేయుట యనెడి తైలముపోసి, తమలోని దివ్యజీవనమనెడి జ్యోతిని ఆరకుండా వెలుగునట్లు చేసుకున్నారు. ఇచ్చట మహాకవులనగా భక్తులు. భక్తులు ప్రవచిస్తున్నారని తెలుపకుండా కీర్తిస్తున్నారని గోపికలు తెలియచేస్తున్నారు. ప్రవచించడానికి, కీర్తించడానికి చాలా తేడావుంది. బుద్ధితో తర్కించి, ఆలోచించి నిర్ధారణ చేయునది ప్రవచనము. కాని కీర్తించడము వేరు. కీర్తన అన్ని సమయాలలో వ్యక్తముకాదు. పారవశ్యంతో హృదయము ఉప్పొంగినపుడే కీర్తనలు సాగుతాయి. కనుక ఇక్కడ భక్తులు నిరంతరము భగవానుని హృదయంలో భావించి, ధ్యానించి, పరవశించి యుండుటచేత అప్రయత్నముగా వారినుండి భగవద్గుణ కీర్తనము బయల్వెడలుచున్నది.

కథామృతము సకల కల్మషములను హరించునని గోపికలు తర్వాత తెలియచేస్తున్నారు. మనసులో తిష్టవేసియున్న వాసనలే కల్మషములు. కమనీయ కథాశ్రవణము మనస్సులో ఎప్పుడైతే ప్రవేశించినదో, వెలుతురు రాగానే అంధకార మదృశ్యమైనట్లు అంతవరకు మనస్సు నావరించిన కల్మషములు అదృశ్యమౌతాయి. కల్మషములనెడి కలుపు మొక్కలు మనఃక్షేత్రమునుండి ఎప్పుడైతే పెకలించబడినవో అచ్చటనే ఆధ్యాత్మిక జీవనవృక్షము మొలకెత్తి, వృద్ధిచెంది, ఆత్మానంద ఫలాన్నిస్తుంది. కనుక కథామృతపానము వలన

మానవుని మస్తిష్కంలో చోటుచేసికొనియున్న సకల పాపములు, కల్మషములు హరించిపోతాయి.

శృణ్వతాం స్వకథాః కృష్ణః పుణ్యశ్రవణ కీర్తనః,
హృద్యంతః స్థో హ్యభద్రాణి విధునోతి సుహృత్సతామ్

"పుణ్యశ్రవణ కీర్తనుడు, సత్పురుషులను రక్షించువాడు నగు శ్రీకృష్ణభగవానుడు తన కథలను శ్రవణము చేయువారి హృదయములలో నుండి పాపవాసనలను నశింప చేయును" అని భాగవతములో శౌనకాది మహర్షులడిగిన ప్రశ్నలకు సమాధానంగా సూతమహర్షి తెలియజేశారు.

ప్రారంభదశలో నున్నవారికి భగవత్కథా శ్రవణమునందు విసుగు జనించవచ్చు. అది సంస్కారలోపమువలన ఏర్పడినదని గ్రహించాలి. వారి అంతఃకరణలో చోటుచేసుకొనిన వాసనా ప్రభావమే దీనికి కారణమని గుర్తించాలి. అట్టివారు అదే దీక్షతో కొంతకాలము కథాశ్రవణము కొనసాగించినచో భగవద్భక్తి వారి మనస్సులలో గాఢంగా పెనవేసుకుంటుంది.

స తు దీర్ఘ కాల నైరంతర్య సత్కారా సేవితో దృఢభూమిః

"దీర్ఘకాలము విధేయతతో ఎడతెగని సాధన కొనసాగించినచో సాధన సఫలమగును" అని పతంజలిమహర్షి యోగసూత్రాలలో తెలియజేశారు.

వినినంతనే వీనులకు విందైనది, విస్తారమై మంగళకరమైనదని భగవత్కథామృతమును చూపి గోపికలు గానం చేశారు.

భగవత్కథాశ్రవణము తన స్వరూపమైన ఆత్మను గుర్తుకు తెస్తుంది. కనుక వీనులకు విందుగా నుంటుంది.

ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః,
సంవాద మిమ మశ్రౌషం అద్భుతం రోమహర్షణమ్

"శ్రీకృష్ణునియొక్కయు, మహాత్ముడైన అర్జునుని యొక్కయు అద్భుతమైన, గగుర్పాటును కలిగించు సంవాదమును నేను వింటిని" అని సంజయుడు భగవద్గీతలో తెలియజేసియున్నాడు.

జ్ఞానమనునది శంకరాచార్యులవారు దక్షిణామూర్తి స్తోత్రములో తెలియచేసినట్లు తత్త్వమసీతి బోధించునపుడే కలగాలి. కనుక భగవత్కథామృతము వీనులకు విందై, విస్తారమై, మంగళకరమైనదని గోపికలు కీర్తిస్తున్నారు.

భగవత్కథామృతము మంగళకరమైనది. కనుక దానికి విరుద్ధమైన అమంగళకరములు తొలగును. అంతఃకరణ శుద్ధిపడును. ఆధ్యాత్మికైశ్వర్యము విలసిల్లును.

నష్టప్రాయేష్వ భద్రేషు నిత్యం భాగవత సేవయా,
భగవత్యుత్తమ శ్లోకే భక్తిర్భవతి నైష్ఠికీ

"భాగవతుల సేవచేత, భాగవతమును శ్రవణము చేయుటచేత, కీర్తనము చేయుటచేత అమంగళములు నశించును. పురుషోత్తముడగు కృష్ణునియందు మానవునకు అచంచలమైన భక్తి కలుగును" అని భాగవతము ప్రథమ స్కంధములో తెలియజేయబడింది.

అట్టి భగవత్కథామృతమును భూలోకమున కీర్తించువారు సుకృతులని చివరగా గోపికలు గానం చేస్తున్నారు. మోక్షమును పొందుటకు భూలోకవాసులకే అర్హత కలదు. పుణ్యఫల విశేషముచే ఇంద్రాది పదవుల నధిష్ఠించినను **"క్షీణే పుణ్యేమర్త్యలోకం విశంతి"** ఆ పుణ్యం కాస్త తరిగిపోగానే భూలోకమునకు అరుదెంచవలసి యుంటుంది. మోక్షధామం చేరుటకు భూలోకమే కూడలి. అట్టి భూలోకములో అత్యంత సన్నిహిత మోక్షమార్గమైన కథామృతపానము చేయువారు ఎంతో పుణ్యాత్ములని గోపికలు ఈ శ్లోకములో తెలియజేశారు.

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయన్తః పరస్పరమ్,
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ

"నాయందే చిత్తము గలవారై, నాయందే జీవనమును నుంచినవారై, పరస్పరము బోధించుకొనుచు సదా సంతృప్తిని, ఆనందమును వివేకులు పొందుచుందురు" అని భగవానుడు భగవద్గీత - 10వ అధ్యాయము విభూతియోగములో తెలిపియున్నాడు.

ప్రహసితం ప్రియ ప్రేమవీక్షణం విహరణం చ తే ధ్యానమఙ్గలమ్
రహసి సంవిదో యా హృదిస్పృశః, కుహక నో మనః క్షోభయన్తి హి 10

భావము:- ఓ కపటవర్తనుడా! ఓ ప్రియుడా! నీ దరహాసము, నీ ప్రేమచూపులు, మనోరంజకమైన నీ క్రీడలు ధ్యానమంగళమై, నీ ప్రేమ బాసలు మా హృదయమును గాఢంగా పెనవేసుకొని యున్నవి. ఇవి మా మనస్సును క్షోభపెట్టుచున్నవి.

వ్యాఖ్య

భగవానునియందు అవిచ్ఛిన్నానురాగమును గోపికలు ఎలా ఏర్పరచుకున్నారో, భగవత్సాన్నిధ్యమునకు దూరమై ఎలా జీవించలేకపోతున్నారో ఈ శ్లోకంలో తెలియజేయుచున్నారు.

భక్తుని హృదయమునుండి బయలుదేరు ప్రేమావేశం నిరంతరం భగవానుని చరణ కమలములవద్దకే పరుగులిడుతూ ఉంటుంది. భగవద్విభూతులు, పరమాత్మ దివ్యలీలా సమన్వయ సంఘటనలు హృదయములో ధ్యానపూరితంగా ముద్రవేసియుంటాయి. సదా భగవంతుని వైపుకు ప్రవహించే వారి ప్రేమావేశాన్ని నిరోధించినచో అది ఒక్కసారిగా విస్తార హంగులతో పొరలి పారుతుంది. అదియే భక్తిలో పరాకాష్ఠ. "సింధుసరిద్వల్లభమ్" నది ఏలాగున నెడతెగని సాగరములోనికి ప్రవహించుచుండునో, అలాగున ఎడతెగని

ప్రేమాతిశయ స్థితియే భక్తి" అని ఆదిశంకరులు శివానందలహరి లో తెలియచేసియున్నారు. అట్టి పరమభక్తులకే భగవత్కృప లభిస్తుంది.

న సాధయతి మాం యోగో న సాంఖ్యం ధర్మ ఉద్ధవ
న స్వాధ్యాయ స్తప స్త్యాగో యథాభక్తి ర్మమోర్జితా ॥

"ఉద్ధవా! నన్ను పొందుటకు భక్తికి సమానమైన శక్తి యోగమునందుగాని, సాంఖ్యమునందుగాని, కర్మమునందుగాని, వేదాధ్యయనమునందుగాని, తపస్సునందు గాని, త్యాగమునందుగాని లేదు" అని శ్రీకృష్ణపరమాత్మ భాగవతంలో ఉద్ధవునికి తెలియజేశారు.

అప్రమేయమైన అట్టి శ్రీహరి భక్తి ఏర్పడిన తరువాత సదా భగవంతుని దివ్యవిభూతులను చింతిస్తూ భక్తులు జీవిస్తారు. పరాభక్తిలో చరించే గోపికలు శ్రీకృష్ణుని మనోరంజకమైన చేష్టలు తమహృదయాలపై ఎలాంటి చెదరని గాఢముద్రను వేశాయో తెలియచేస్తూ ప్రథమంగా శ్రీకృష్ణుని చిరునవ్వును గూర్చి కీర్తిస్తున్నారు.

శ్రీకృష్ణుని మందహాసము మనము సాధారణంగా అనుభవించు మానసికానందముగా భావించకూడదు. అది సదానంద స్వరూపము. అది విశుద్ధానందము. మనోబుద్ధులను అధిగమించుటచేత కలుగునది. కావున అది జ్యోతిర్మయానందము. జ్ఞానస్వరూపమై భాసిల్లుచున్నందున అది ప్రజ్ఞానఘనానందము. నిత్యమైయుండుటచే సదానందము. రెండవ అనుభూతి లేనందున అద్వితీయానందము. కర్మాచరణకు వీలు లేనందున నిష్క్రియానందము. అవధులు లేనందున నిష్కళానందము. నిర్దేశించుటకు వీలులేనందున అనిర్దేశ్యానందము. అదియే భూమానందము.

స్వప్నమునుండి మేల్కొన్నవాడికి స్వప్నప్రపంచము, అది కల్పించు దుఃఖము అదృశ్య మవుతుంది. అలాగే మనోజనితమైన జగత్తుయొక్క స్థాయినుండి మనోబుద్ధుల కతీతమైన జగదీశ్వరుని స్థాయికి చేరినవారికి నామరూపాత్మకమైన ఈ ప్రపంచముకూడా స్వప్నతుల్యమైనదే. ఆత్మవిదుడైనవాడు అనుభవించు సుఖము ఇంద్రియజన్యమైనది కాదు. వస్తు ప్రపంచమునకు సంబంధించినది కాదు. తన ఆత్మలో ఆత్మచే ఆత్మానందమును అనుభవించుటయే ఆత్మవిదుని ఆనందానుభూతి. అచ్చట రెండవ వస్తువులేదు. "నందతి నందతి నందత్యేవ" తన ఆత్మలోనే ఆనందిస్తూంటాడని భజగోవిందములో శంకరులు తెలియజేశారు.

శ్రీకృష్ణుని మందహాసమును కీర్తించిన గోపికలు నందనందనుని సందేశాత్మకమైన ప్రేమపూరిత వీక్షణములను గూర్చి గానము చేయుచున్నారు. కృష్ణుని అనురాగపూరిత చూపులు గోపికల మానసములందు శాశ్వత ముద్రవేసి, వారి మనములను క్షోభపెట్టుచున్నవని తెలియజేయుచున్నారు.

భగవానుని మందహాసము, ప్రేమ వీక్షణాలు, మనోజ్ఞమైన వర్మక్రీడలు ధ్యానించుటకు మంగళప్రదమై యున్నవని గోపికలు కీర్తిస్తున్నారు. భగవానుని దివ్యమయులీలలను గాంచుట లేదా వినుట మంగళకరమని గానము చేస్తున్నారు. అట్టి అమృతానందమును రుచి చూచినవారు క్షణకాలము కూడా భగవత్పాదారవింద దర్శనమునకు దూరమై జీవించలేరు.

న కామయే నాథ తదా వ్యహం క్వచిత్, న యత్ర యుష్మ చ్చరణామ్బు జాసవః
మహత్త మాన్తర్హృదయాన్ ముఖాచ్యుతో విధత్స్వ కర్ణాయుత మేషమే వరః

"హే జగన్నాథా! సత్యస్వరూపమైన నీలో ఐక్యమైపోవా లనెడి అభీష్టమును నేను కోరను. అచ్చట నీ పాదామృతమును పానముచేసే అవకాశము ఉండకపోవుటయే దానికి కారణము. పవిత్రులైన నీ భక్తుల అమృతవాక్కుల ద్వారా నీ పాదారవింద వైభవమును శ్రవణము చేయుటకు కనీసము పదిలక్షల చెవులను ప్రసాదించమని నిన్ను ప్రార్థించుచున్నాను" అని భాగవతము చతుర్థ స్కంధములో పృథుమహారాజు ఆదిదేవుని స్తుతించాడు.

ప్రసన్నమై గహనమైన భగవానుని విచిత్ర దివ్యలీలల ననుభవించిన గోపికలు స్వామికి దూరమై క్షణకాలము మనలేకపోతున్నారు. ఆ దివ్యానుభూతులన్నీ తమ మనోఫలకంపై కదలి హృదయశాంతిని భగ్నంచేసి, అగ్నిగుండంగా మార్చుచున్నవని గోపికలు గానం చేస్తున్నారు.

చలసి యద్వ్రజా చ్చారయన్ పశూన్ నలినసున్దరం నాథ తే పదమ్
శిలతృణాఙ్కురైః సీదతీతి నః కలిలతాం మనః కాన్త గచ్ఛతి ॥ 11

భావము:- హే ప్రభో! నీ పాదములు పద్మములవలె సున్నితమైనవి. నీవు వ్రజమునుండి గోవులను తోలుకొని బయలుదేరగానే, నలినసుందరమై, కోమలమైన నీ చిన్నిపాదములు రాళ్ళు, ముండ్లు, తృణములవలన గాయపడునేమో యని మనసులో తీవ్రంగా వ్యథచెందుచున్నాము.

వ్యాఖ్య

మంగళస్వరూపుడైన శ్రీకృష్ణుని క్షణకాలమైనను విడిచి జీవించలేని గోపికలు వ్రజభూమినుండి గోవులను తోలుకొని వనవాటిక కేగుచున్న గోపాలుని సుకుమార పాదములు కందిపోవు నని దుఃఖించుచున్నారు.

కృష్ణుని ప్రేమలో సర్వం మరచి జీవించే గోపికలకు కృష్ణధ్యానం తప్ప మరొక సంకల్ప ముండుటుండదు. తమ ఆరోగ్యంకన్నా కృష్ణుని ఆరోగ్యమే ప్రధానము. తమ అవసరాలకన్నా కృష్ణుని అవసరాలే ముఖ్యం. కృష్ణుని సంతృప్తిలోనే తమ సంతృప్తి యున్నదని భావించేవారు. తమ బ్రతుకంతనే కృష్ణసేవకు అంకితము చేశారు. కృష్ణుని

కొరకే గోపికలు బ్రతికియున్నారు. వారి భక్తికి వశవర్తుడై శ్రీకృష్ణుడే స్వయంగా భాగవతంలో గోపికల నిలా ప్రాధేయపడ్డాడు.

నపారయేహం నిరవద్య సంయుజాం, స్వసాధు కృత్యం విబుధాయు షాపివః
యామా భజన్ దర్జర గేహ శృంఖలాః, సం వృశ్చ్య తద్వః ప్రతియాతి సాధునా

ప్రియమైన ఓ గోపికలారా! సాంసారిక బంధాలన్నీ వదలుకొని మీరు నన్ను సేవించారు. మీ పవిత్రప్రేమకు బదులుగా నేను కొన్ని యుగాలు మిమ్ములను సేవించినా నా అప్పు తీరదు. మీరు విశాల హృదయముతో నన్ను విడుదల చేసినపుడే నేను ఋణ విముక్తుణ్ణి కాగలను" అని తెలియజేశాడు.

అట్టి శ్రీకృష్ణుడు అరణ్యమున కేగుచుండ అతని చిన్నారి పాదములకు ముళ్ళు, రాళ్ళు గ్రుచ్చుకొనునని గోపికలు వ్యథచెందెడివారు. తమ జీవనానికి ఆధారమైన పాదములకు ఏ మాత్రము చిన్న గాయమైనా వారు సహించలేరు. ఆ పవిత్ర అడుగుజాడల్లోనే ఇంతవరకు తమ బ్రతుకును నడిపించుకొని ధన్యజీవులైనారు. తమ పూజలన్నీ ఆ పవిత్ర పాదాలచెంతే జరిగాయి. అందుచేతనే స్వామి పాదములు పద్మమువలె సున్నితమైనవని తెలియజేయుచున్నారు. పువ్వులాంటి పాదముల పర్శించుటకు అనేక రకాలైన పూలను సేకరించేవారు. బాహ్యజగత్తులో లభించే పూలు కృష్ణునికి ప్రీతికరమైనవి కాదని ఆంతరంగిక హృదయ వనవాటికలోకి వెళ్ళి, పుష్పాలు సేకరించి స్వామి పాదాలవద్ద వుంచేవారు.

చిత్తచాంచల్యమను చామంతులను స్వామి పాదాలపై వుంచేవారు. సంశయములను సంపెంగపూలను సమర్పించేవారు. దేహభ్రాంతియను దేవదారులతో సేవించేవారు. కామంబను కనకాంబరాలను అర్పించేవారు. మనోసంకల్పములను మనోరంజనములతో పూజించేవారు. దాసత్వమనెడి దాసానిపూలతో అర్పించేవారు. గుణభేదములను గులాబీలతో అలంకరించేవారు. మలిన వాసనలనే మల్లెపూలతో అభిషేకించేవారు.

తస్మాత్ కేనాప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్

"ఏ విధంగానైనా మనసును సదా శ్రీకృష్ణునియందే నిలపాలి" అని భాగవతము తెలియజేయుచున్నది.

గోపికల ప్రేమ యుద్ధములాంటిది కాదు. ఫలితములు వారి కక్కరలేదు. ప్రేమకు ప్రేమయే ఫలితము. వారి ఆనందమంతా భగవానుని చరణకమలముల చెంత స్థిరనివాస మేర్పరచుకొని యున్నది. భగవానుడు క్షేమముగా యున్నచో ఆయన పాదముల నాశ్రయించిన వారునూ క్షేమమే. తల్లిగర్భంలో వసించు శిశువు ఆరోగ్యము, తల్లి ఆరోగ్యంపై ఆధారపడియుంటుంది. నదిలో పుష్కలంగా నీరు ప్రవహించునపుడు నదిని ఆశ్రయించియున్న పంటపొలాలకు నీటి కొరత యేముంటుంది? చెట్టుమొదట్లో నీరు పోసినచో వృక్షశాఖలన్నింటికీ నీరు అందుతుంది. భగవానుడు మంగళకరంగా ఉంటే ఆయన ప్రేమవీక్షణాలు భక్తులను సదా కాపాడగలవు.

అయితే భగవంతుడు పరిమితుడా? పెరిగి తరిగేవాడా? వదిలా యెండేవాడా? చెట్టులా వాడిపోయేవాడా? కాదు, తాను అవినాశి. పుట్టుకలేనివాడు. మరణం తెలియనివాడు. అయితే గోపిక లెందుకలా వ్యథచెందారు? అది భక్తిలో పరాకాష్ఠ. పిల్లవాడు తనతోపాటు ఆడుకోవడానికి అమ్మను పిలుస్తాడు. అమ్మ వస్తుంది. ఆమెను గుఱ్ఱంలాగా కూర్చోమంటాడు. తాను రౌతులాగా ఠీవిగా ఆమె వీపుపై కూర్చుంటాడు. ఛల్ ఛల్ అంటాడు. బిడ్డను సంతోషపరచడానికి అమ్మ గుఱ్ఱంలాగా నడుస్తుంది.

బిడ్డను ఆడించడంలో తల్లికి ఆహ్లాదము. తల్లితో ఆడుకోవడములో బిడ్డకు ఆనందము. తాను ఆడుతున్నది బిడ్డ సుఖము కొరకేనని తల్లికి తెలుసు. "అమ్మా! నీవు గుఱ్ఱం" అని కుర్రవాడు అనడములోనే అమ్మ గుఱ్ఱంకాదని ధ్వనిస్తున్నది. అమ్మ ఎప్పుడయితే గుఱ్ఱంకాదో తాను రౌతుకూడా కాదు. ఇది అన్యోన్యాశ్రయము.

కనుక ఇక్కడ గోపికలయొక్క పరిస్థితికూడా అంతే. గత శ్లోకంలో భగవానుని పాదములను తమ కుచములపై ఉంచుమని ప్రార్థించారు. అనగా ప్రేమను తమ హృదయములో నింపుటయే భావమని తెలుసుకున్నాము. ప్రేమనిండిన తమ హృదయమే సకలైశ్వర్యములకు నిలయమైన వ్రజభూమి. కృష్ణుని పాదములు సుకుమారములు గనుక, అడవికిపోయినచో అక్కడవున్న రాళ్ళు, ముళ్ళు, గడ్డి గ్రుచ్చుకొనునని గోపికలు బాధపడుటలో విశేషార్థమున్నది. స్వగతారాధన చోటుచేసుకొని యున్నది. ఆత్మానందమును దూరము చేసుకొనుటకు ఇష్టపడక వ్యథచెందడమై యున్నది. తమ హృదయమనే వ్రజభూమిలో శ్రీకృష్ణుని నళినచరణములనే ప్రేమయున్నది. ఆ ప్రేమయనెడి సుకుమార పాదము హృదయమనెడి వ్రజభూమిని వదలి ప్రపంచమనే అరణ్యములోకి ప్రవేశించినచో రాళ్ళుయనెడి ఇక్కట్లకు, ముండ్లుయనెడి తాపత్రయములకు, తృణములనెడి తుచ్ఛాశ్రయములకు గురియై వ్యథ చెందవలసి వస్తుందని అలాగాకుండా స్వస్వరూపమైన ప్రేమ స్వాత్మయందే స్వస్థతనొందియుండుట శ్రేయోదాయకమని కీర్తిస్తున్నారు.

దినపరిక్షయే నీలకుంతలై ర్వనరుహాననం బిభ్రదావృతమ్
ఘనరజస్వలం దర్శయన్ ముహుర్మనసి నః స్మరం వీర యచ్ఛసి 12

భావము:- ఓ వీరుడా! కృష్ణా! సాయంకాల సమయాన నల్లని ముంగురులు క్రమ్ముకొని గోధూళితో నిండియుండు నీ ముఖారవిందము మాటిమాటికి చూపుచూ మా యందదాగియున్న విరహతాపమును రగిలించుచున్నావు.

వ్యాఖ్య

గడచిన శ్లోకములో వనమున కేగిన శ్రీకృష్ణుని నళినచరణములు కందిపోవునని గోపికలు వ్యథచెందారు. ఈ శ్లోకములో సాయంత్రము గోవులను తోలుకొని తిరిగి గోకుల మరుదెంచుచున్న శ్రీకృష్ణుని రూపమును వర్ణించి కీర్తిస్తున్నారు. నల్లని ముంగురులు క్రమ్ముకొని గోధూళితో నిండియున్న శ్రీకృష్ణుని ముఖారవిందము వారిలో అణగియున్న విరహాగ్నిని ప్రజ్వరిల్లప చేయుచున్నదని గానము చేస్తున్నారు.

శ్రీకృష్ణుని దివ్య చరణధూళి శిరోధార్యమని భక్తులు భావించారు. భాగవతము ఘోషచేసింది. మరి గోచరణధూళి కృష్ణుని ముఖారవిందమును కప్పియున్నదని ఈ శ్లోకములో తెలియజేయబడింది. గోవులు సత్త్వగుణ ప్రధానమైన పుణ్యజీవులు. సాత్త్వికమైన భక్తుల చరణధూళిని కూడా భగవానుడు గౌరవించు ననుట ఇందలి విశేషము. ఈ విషయాన్నే జయదేవుడు తన గీతగోవింద కావ్యములో "ప్రియే చారుశీలే" అను అష్టపదియందు అద్భుతంగా వర్ణించాడు.

శ్రీకృష్ణుని మాయచేష్టలకు దుఃఖితురాలైన రాధ శ్రీకృష్ణునితో మాట్లాడలేదు. అతనివంక కనులెత్తయినా చూడలేదు. అట్టి భయానక దృశ్యాన్ని భరించలేని శ్రీకృష్ణుడు రాధను సమీపించి ప్రాధేయపడినాడట. ఎలా ప్రాధేయపడినాడో జయదేవుడు తెలియజేస్తాడు.

ప్రియే చారుశీలే - ప్రియే..... చారుశీలే......

సుస్వభావముగల ప్రియురాలా!....... రాధా!........

స్మర గరళ ఖండనం మమ శిరసి మండనం, దేహి పదపల్లవ ముదారమ్
జ్వలతి మయి దారుణో మదన కదనానలో, హరతి తదుపాహిత వికారమ్... ప్రియే...

"ఓ ప్రియురాలా! రాధా! మన్మథ తాపాగ్నిచేత నా శిరము భయంకరముగ దహింపబడుచున్నది. మన్మథవిషమును విరచునట్టి కోమలమైన నీ చరణపల్లవమును నా శిరస్సుపై యుంచుము" అని రాధాదేవిని ప్రార్థించాడట శ్రీకృష్ణుడు.

ఆహా!.... ఎంతటి మహత్తర భావగర్భిత ఆధ్యాత్మికానుభూతి? భక్తుని పాదములను భగవానుడు శిరమున దాల్చుటయా? భళి! కృష్ణ! భళి! నిన్ను నమ్మిన భక్తుల జన్మయే ధన్యము.

కనుక సాధారణంగా కనుపించే మంజుల మూర్తియైన శ్రీకృష్ణునికన్నా గోధూళిలో నిండియున్న శ్రీకృష్ణుని ముఖారవిందమే తమయం దణగియున్న విరహతాపమును రగిలించుచున్నదని గోపికలు కీర్తిస్తున్నారు. ఎందులకో? ఈ రూపమే భక్తుల నెక్కువగా ఆకర్షించింది. మరియొక ప్రార్థనా గీతికలో శ్రీకృష్ణుడు ఈ క్రింది విధముగా స్తుతించబడ్డాడు.

గోధూళి ధూసరిత కోమల గోపవేషం, గోపాల బాలక శతై రనుగమ్య మానమ్
సాయన్తనే ప్రతిగృహం పశుబంధనార్థం, గచ్ఛంత మచ్యుత శిశుం ప్రణతోఽస్మి నిత్యం ॥

సాయంత్రం సమయాన గోవులను తోలుకొనివచ్చి, వాటి స్థానములో కట్టివేయుటకు తన సహచరులైన గోపబాలురలో కలిసి గోధూళితో నిండిన దేహముతో గోపాలుని వేషములో దర్శనమిచ్చు బాలకృష్ణునికి నేను నిత్యము నమస్కరింతును.

శ్రీకృష్ణుని ముఖారవిందము గోపికల మానసములం దణగియున్న హృదయ తాపమును రగిలించుచున్నదని కీర్తిస్తున్నారు. హృదయములం దణగియున్నదంటే, ఉపశమించియున్నదని భావము. ఉపశమించిన దైన తిరిగి జనిస్తుంది. మృతి చెందినచో తిరిగి ఉద్భవించదు. గోపికల విరహము తాత్కాలికంగా ఉపశమించి యుండినది.

లయించినది గనుకనే శ్రీకృష్ణుని ముఖారవిందమును గాంచినంతనే వెలికిదూకినది. ఆ విరహతాపము స్వస్వరూపానుభూతిని పొందుటచేత, కృష్ణచైతన్యమును అనుభవించుటచేత నశిస్తుంది.

లయవినాశనే ఉభయరోధనే, లయగతం పునర్భవతి నోమృతం॥

"రెండువిధాలుగా మనసు నిరోధించబడుతుంది. మొదటిది లయము. రెండవది వినాశము. లయించిన మనసు తిరిగి పుడుతుంది. నశించిన మనసు తిరిగి మొలకెత్తదు" అని శ్రీరమణమహర్షులవారు ఉపదేశసారములో తెలియజేశారు.

స్వరూపానుభూతి కలుగకనే తాత్కాలికంగా లయించు మనసు త్రిగుణమిళితమైన ప్రకృతిచే ప్రేరేపింపబడి బహిర్ముఖ మవుతుంది. త్రిగుణముల స్థాయి నధిగమించునపుడే శుద్ధ సత్వానుభూతి ఏర్పడును. సాయంత్ర సమయాన నల్లని ముంగురులు క్రమ్ముకొని, గోధూళితో నిండియుండు శ్రీకృష్ణుని ముఖారవిందము గోపికల విరహతాపమును రెచ్చగొట్టుచున్నది. త్రిగుణాత్మక ఆకర్షణతో భగవానుడు గోపికలను వ్యథకు గురిచేయుచున్నారు.

(1) సాయంకాల సమయము (2) నల్లని ముంగురులు క్రమ్ముకొని (3) గోధూళితో నిండియుండు శ్రీకృష్ణుని ముఖారవిందమును గూర్చి వ్యథచెందుతూ గోపికలు గానం చేస్తున్నారు.

1) సాయంకాల సమయ మనునది రాత్రివేళకు ఆరంభము. అంధకారము వ్యాపించుటకు అనువైన కాలము. కనుక ఇది తమోగుణమునకు సంకేతము.

2) మనసులో రజోగుణ ప్రేరిత ఆవేశాలు చెలరేగడమే నల్లని ముంగురులు క్రమ్ముకొనుటకు గూఢార్థము. తమోగుణముచేత బద్ధుడైన జీవుడు రజోగుణముయొక్క ఒడిలో తలదాల్చుకొని ఆవేశపూరితుడౌతాడు.

3) సత్త్వగుణసంపదయే గోధూళికి అంతరార్థము. రజో తమోగుణాలతో పాటు భక్తునిలో సత్త్వగుణసంపద మెండుగా యుంటుంది.

సత్త్వ రజ స్తమోగుణాలచేత ప్రేరేపితుడైన మానవునిలో వాసనాపూరిత విరహతాపము పెరుగుచున్నది. అందుచేత మనము ఆత్మసౌందర్యాన్ని దర్శించలేకపోతున్నాము. "హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం" సత్యదేవుని ముఖము స్వర్ణపాత్రచే కప్పబడియున్నదని ముండకోపనిషత్ తెలియజేయుచున్నది. అయితే స్వర్ణపాత్రను అన్వేషించి, దర్శించి, పొందుటకు మనము వ్యథచెందుతాము. గోపికలు అలాగాక స్వర్ణపాత్రను దర్శించినను, వారు సత్యదేవుని దర్శనానికే పరితపిస్తారు. గోధూళి కృష్ణుని ముఖారవిందమును కప్పినను వారు ఆశించేది కృష్ణునేగాని, గోధూళిని కాదు. తైలధారవలె అవిచ్ఛిన్న భక్తి ఏర్పడినపుడే గుణభేదములలో దాగిన అసత్య అవగాహన అదృశ్యమై శాంతి విరాజిల్లుతుంది.

తదారజస్తమో భావాః కామలోభాదయశ్చయే,
చేత ఏతైరనావిద్ధం స్థితం సత్త్వే ప్రసీదతి

"నిక్షేపరహిత భక్తి ఉదయించగానే రజస్తమోగుణ భావములైన కామలోభాదులచే అభిభూతము కాకుండ మనస్సు శుద్ధ సత్త్వమగ్నమై ప్రసన్నమవుతుంది" అని భాగవతము తెలియజేస్తుంది. శుద్ధసత్త్వము గల మనసు నారాయణ చైతన్యములో లయిస్తుంది.

గుణానేతా నతీత్యత్రీన్ దేహీ దేహ సముద్భవాన్,
జన్మమృత్యు జరాదుఃఖై ర్విముక్తో౽ మృతమశ్నుతే

"భగవద్భక్తిని ఈ జీవుడు మూడు గుణములను అతిక్రమించినవాడై, జన్మమృత్యు జరాదుఃఖములనుండి విముక్తుడై అమృతత్వమును పొందుచున్నాడని తెలుపబడినవాడని భగవద్గీత - 14వ అధ్యాయము గుణత్రయ విభాగయోగములో తెలియజేయబడింది.

ప్రణతకామదం పద్మజార్చితం ధరణిమండనం ధ్యేయమాపది
చరణపంకజం శంతమం చ తే రమణ నః స్తనేష్వర్పయాధిహన్ 13

భావము:- *ఓ రమణుడా! నీ చరణకమలము శరణాగతులైన వారి కోర్కెలను తీర్చును. బ్రహ్మదేవుడు నిరంతరము నీ పాదములనే పూజించుచుండును. భూమాతకు నీ పాదమే భూషణమై యున్నది. ఆపదలు కలిగినపుడు నీ పాదములను ధ్యానించినచో అవి సర్వక్షేమములను సమకూర్చును. అట్టి నీ పవిత్ర చరణపంకజమును మా స్తనముల యందుంచి మా మనోక్లేశమును తొలగింపుము.*

వ్యాఖ్య

భగవానుని చరణముల వైభవమును గోపికలు ఈ శ్లోకములో గానము చేస్తున్నారు. శ్రీకృష్ణుని చరణపంకజము శరణాగతులైన వారి కోరికల దీర్చునని కీర్తిస్తున్నారు గోపికలు.

కోరిక అజ్ఞాన జనితము. మానవ హృదయములో ప్రసుప్తము దాగియున్న అసంపూర్తియే కోరికగా బయల్వెడలినది. తాను పరిపూర్ణుడై యుండి కూడా తెలియని అజ్ఞానములో అదే పరిపూర్ణత కొరకు బాహ్యజగత్తులో ప్రయత్నములు సాగిస్తున్నాడు. అదియే మానవునిలోని వెలితికి కారణము. సత్యదర్శనము లోపించుటచేత అధ్యాస ప్రారంభమైనది. త్రాడును చూడలేని అయోమయ స్థితిలో దాని స్థానే పాము జనించి అజ్ఞానమును అందించింది. అజ్ఞానజనిత ఆవేశములో మానవుడు తనను పిచ్చివానిగ తలంచుకొని ఈ ప్రపంచము నాకు పిచ్చి అనువర్తిగ మార్చేశాడు. స్వప్నప్రపంచములో కర్తృత్వం చెంది తాను భోక్తనని చాటుకుంటున్నాడు. యదార్థానికి తాను కర్తయునుగాడు, భోక్తయు గాదు. ఈ రెంటింటికి ఆధారభూతమైన సాక్షి చైతన్యమే తానై యున్నాడు.

చైతన్యమునకు రూపములేదు. కనుక అవయవములు కూడా లేవు. నిరవయవమైన దాన్ని కర్మనెలా ఆచరించగలదు? అంతటా వ్యాపించి యున్నందున దేనిని ఆశించగలదు? తనకు లేనిదేమున్నది? కనుక ఆత్మ, అనాత్మల మధ్య ఏర్పడియున్న సంబంధము భ్రమ:

కల్పితము. భ్రమలేనిదే జగత్తులేదు. భ్రమ యెంతవర కుంటుంది? సత్యదర్శనము చేసినంత వరకుంటుంది. సత్యము దర్శింపబడగానే అసత్య భ్రమ అంతరిస్తుంది. అసత్య భ్రమ అంతరించగానే అనిత్య జగత్తు అదృశ్యమవుతుంది. అనిత్య జగత్తు అదృశ్యమవగానే అఖండాత్మ అనుభూతిగా మిగుల్తుంది.

ఆత్మకు దూరమై భ్రాంతిచే అనాత్మకు దగ్గర కావడం చేత జీవభావం స్ఫురించి కోరికలు మనోఫలకంపై నాట్యము చేస్తున్నాయి. ఆత్మదర్శనము కాగానే జీవభ్రాంతియే నశిస్తుంది. కనుక తత్సంబంధమైన కోరికలుకూడా అదృశ్యమవుతాయి.

భగవానుని చరణపంకజమే సత్యాత్మ. జగత్తులో వ్యాపించి యున్నదంతా చైతన్యమే. **"పాదోస్య విశ్వభూతాని"** ఈ విశ్వమంతయు భగవంతుని ఒక పాదమేనని వేదములోని పురుషసూక్తంలో తెలియజేయుబడింది. కనుక ఈ విశ్వమును భగవంతుని పాదముగా దర్శించడము సత్యదృష్టి. జగత్తు జగత్తుగా మిథ్య. జగత్తు పరమాత్మగా లేక పరమాత్మ చరణపంకజముగా సత్యము. కనుక జగత్తుని చూసేవానికి జీవభ్రాంతి తొలగింది. ఆ స్థితిలో కోరిక లావిర్భవించే అవకాశమేలేదు. కనుక శ్రీకృష్ణుని చరణకమలము, శరణమనిన వారి సకల కోర్కెలను తీర్చునని గోపికలు గానము చేయుడములోని ఆధ్యాత్మిక సత్యమిదియే. కోరికలను తీర్చడమంటే లేకుండా చేయడమని భావము. లేకపోవడ మంటే సత్యదృష్టి కలిగి జీవించమని అర్థము. ఆధ్యాత్మికానుభూతిలో మనుగడ కొనసాగించడమని భావము. అట్టి అపూర్వ అఖండ ఆత్మానుభూతిని శ్రీకృష్ణుని చరణపంకజము అందిస్తుందని గోపికలు గానము చేస్తున్నారు.

బ్రహ్మదేవుడు సైతము నిరంతరము శ్రీకృష్ణుని పాదములను అర్చించుచుండు నని గోపికలు కీర్తిస్తున్నారు.

సృష్టిలోని జీవులు భగవానునికి శరణాగతులు కావడమేగాక, సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు కూడా శ్రీకృష్ణుని పాదములను అర్చించుచున్నా డని గోపికలు గానము చేయుచున్నారు. సృష్టిచేయుటకు వలయు శక్తిని, యుక్తిని ప్రసాదించమని సృష్ట్యారంభమునందే బ్రహ్మదేవుడు ఆదిదేవుని శరణు వేడినాడు.

క్రీడస్యమోఘ సంకల్ప ఊర్ణనాభిర్యథోర్ణుతే,
తథా తద్విషయాం దేహి మనీషాం మయి మాధవ

"అమోఘసంకల్పుడా! మాధవా! సాలెపురుగు తననుండి దారములను బయటకు విస్తరింపజేసి, దానియందే విహరించును. (సాలెగూడువిషయంలో ఉపాదాన నిమిత్త కారణములు సాలెపురుగే అయియున్నది.) అట్లే నీవు నీ మాయ నాశ్రయించి ఈ జగత్సృష్టికి కారణమై క్రీడించుచున్నావు. నాకును దానిని తెలుసుకొను జ్ఞానమును ప్రసాదించుము" అని బ్రహ్మదేవుడు ప్రార్థించియున్నాడు.

సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు కూడా ఒకనాడు సృష్టించబడినవాడే. మన జీవనకాలముతో పోల్చినపుడు, మన ప్రజ్ఞతో పరిపోల్చునపుడు బ్రహ్మదేవుడు అనంతుడుగా తెలుస్తాడు. మనకు 4,320,000,000 సంవత్సరములంటే బ్రహ్మదేవునకు 12 గంటల కాలము. అనగా అర్ధరోజని భావము. బ్రహ్మదేవునికి ఒకరోజులో అనగా 24 గంటలకాలములో

14మంది మనువులు ఆవిర్భవించి అంతరిస్తారు. మొదటి మనువును స్వయంభువ మనువని పిలుస్తారు. ప్రతిమనువు 71 యుగాలు జీవిస్తాడు. ప్రతియుగము 4,320,000 సంవత్సరముల కాలము నడుస్తుంది. ఇంతకాలము జీవించు మనువులు, అసంఖ్యాకమైన కాలపరిధిలో జీవించు బ్రహ్మదేవుడుకూడా భగవానుని పాదములను అర్చించినట్లు భాగవతము చతుర్థ స్కంధములో తెలియజేయబడి యున్నది. ఆ విషయమునే ఈ శ్లోకములో గోపికలు గానము చేస్తున్నారు. యుగయుగాలుగా జీవించే మనువులు, సృష్టిస్థితిలయాదులలో కొనసాగి జీవించు బ్రహ్మవరకు భగవానుని పాదపద్మములను అర్చిస్తున్నారు. ఇక అల్పాయుష్కులైన మన విషయము వేరుగా చెప్పాలా? స్వల్పమనుగడను కొనసాగించు మనము క్షణకాలము కూడా భగవత్పాదారవిందములకు దూరం కాకూడదని భావము.

శ్రీకృష్ణుని చరణపంకజము భూమాతకు అలంకారమై యున్నదని గోపికలు తరువాత కీర్తిస్తున్నారు. భూదేవి మనుగడకు ధర్మమే ఆధారము. భూప్రపంచములో అధర్మము పెచ్చుపెరిగి, నాస్తికత్వము విజృంభించి, అశ్లీల ప్రవర్తనతో అసుర ప్రవృత్తి గల దుర్మార్గులు ప్రపంచ సుస్థిరతకు ముప్పుతెచ్చునపుడు భూదేవి శ్రీమన్నారాయణుని శరణుజొచ్చి ప్రార్థిస్తుంది. ఆదిదేవు డవతరించి అధర్మమును రూపుమాపి, ధర్మమును భువిలో నెలకొల్పి, భూదేవిని శాంతపరుస్తాడు. భగవానుని పాదము భూమిపై నిలవగానే భూదేవికి రక్షణ కల్పింపబడినదని భావము. కనుక ధర్మమునకు సంకేతమైన భగవానుని చరణపంకజము భూదేవికి భూషణమై సుఖశాంతులను ప్రసాదించుచున్నదని గోపికలు కీర్తిస్తున్నారు.

ఆపదలలో నున్నవారు భగవానుని పాదములను ధ్యానించగానే వారా ఇక్కట్లనుండి విముక్తిపొంది క్షేమంగా యుందురని తరువాత కీర్తిస్తున్నారు.

ఆపద అనేవి మానసిక చిత్రములు. బాగా ఆలోచిస్తే ఈ జగత్తులో ఆపదలే సంపదలు, సంపదలే ఆపదలు. ఏమున్నదీ ప్రపంచంలో సంపద? ఈ జగత్తే ఆపదలకు ఆలయము. బలిపీఠమునకు నడిపించునపుడు మేకను పూలమాలలతో, మామిడి తోరణాలతో అలంకరించి మరీ నడిపిస్తారు. పాపం! అమాయకమైన ఆ జంతువుకు జరుగబోయే మరణహోమ మేమి తెలుసు? చాలా సంతోషపడుతుంది. ప్రయత్నములేకనే తనకు ఆహారము లభించినదని తన మెడచుట్టూ ఉన్న ఆకులను తింటూంటుంది. మన మీ సంసారములో సంపద పేరుతో పొందే అనుభవాలు అంతకన్నా భిన్నమైనవి కావు. పరమార్థానికి ఆపదలు, సంపదలు ఇవికావు.

విప ద్విస్మరణం విష్ణోః సంప న్నారాయణ స్మృతిః

భగవానుని మరచిపోవడమే ఆపద. జ్ఞాపక ముంచుకోవడమే సంపద. ప్రాపంచికంగా మనమెలాంటి ఆపదలలో యున్నను భగవానుని దివ్య చరణకమలములకు శరణాగతులము కాగానే బాధలన్నీ నివర్తింపబడి ఆనందాన్ననుభవిస్తాము. కనుకనే పాదములను ధ్యానించగానే ఆపదలలోనున్నవారి బాధలు తొలగుచున్నవని గోపికలు గానము చేస్తున్నారు.

శరణాగతులైన వారి కోర్కెలను తీర్చునట్టియు, బ్రహ్మదేవునిచే సదా అర్చించబడినట్టియు, భూమాతకు భూషణమైనట్టియు, ధ్యానించిన వారి ఆపదలను పోగొట్టి సర్వశుభముల నొసగూర్చునట్టివియు నైన శ్రీకృష్ణుని చరణపంకజమును తమ స్తనములపై నిడి మనోక్లేశమును 'పోగొట్టుమని గోపికలు కీర్తించుచున్నారు.

స్తనప్రదేశము హృదయమునకు సంకేతమని 7వ శ్లోక వివరణలో తెలుసుకొని యున్నాము. భగవానుని చరణపంకజము ధర్మమునకు సంకేతము. మన శరీరమంతయు పాదముల పైననే ఆధారపడి నిలబడుతుంది. అయితే భగవంతుని విరాట్స్వరూపము ధర్మమనే పాదముపై నిలబడి యుంటుంది. భక్తులకు ధర్మమేమిటి? భగవానుని పూజ్యచరణారవిందములను స్మరించి, ధ్యానించడమే భక్తులకు ధర్మము. కనుక అధర్మయుతమైన స్వభావము, అనిత్యమైన ప్రాపంచిక వ్యామోహాలు హృదయమునుండి దూరము కావాలంటే భగవంతుని ధర్మయుతమైన చరణపంకజమును హృదయంలో ప్రతిష్ఠించుకొని ధ్యానించాలి. అప్పుడే మనిషికి శాంతి కలుగుతుంది. మనసుకు ఊరట లభిస్తుంది. భగవంతుని పూజ్యపాదాలకు దూరమైన వ్యక్తి చక్రవర్తియైనను బిచ్చగాని వంటివాడే.

స్తనవిని హితమపి హారముదారం, సా మనుతే కృశ తనురివభారం
రాధికా కృష్ణా! రాధికా, తవ విరహే కేశవ! రాధికా|......

"ఓ కృష్ణా! నీ విరహమువలన రాధ మిక్కిలి కృశించినదై స్తనములపై నుంచబడిన అమూల్య హారమును కూడా నెంతో భారముగా భావించుచున్నది" అని జయదేవుడు తన గీతగోవిందమను కావ్యంలో తెలియజేస్తాడు.

స్తనములపై నున్న ఆభరణము రాధకు భారముగా తోచినదంటే ప్రాపంచిక విషయభోగాలను అరక్షణము కూడా భరించే స్థితిలో ఆమె హృదయము లేదని గ్రహించవచ్చు. అందుచేతనే శ్రీకృష్ణుని పవిత్ర పాదపంకజమును తమ స్తనములపై నుంచి, మనోక్లేశమును తొలగించమని గోపికలు గానము చేస్తున్నారు.

సురతవర్ధనం శోకనాశనం స్వరితవేణునా సుష్ఠు చుమ్బితమ్
ఇతరరాగ విస్మారణం నృణాం, వితర వీర నస్తేఽధరామృతమ్ 14

భావము:- ఓ వీరుడా! సురత వర్ధనము, శోకనాశనము, మ్రోగించబడు వేణువుచే పరిచుంబితము, అన్యరాగ విస్మారణమును అగు నీ అధరామృతమును మాకు దయచేయుము.

వ్యాఖ్య

శ్రీకృష్ణుని చరణపంకజ వైభవమును గతశ్లోకంలో కీర్తించిన గోపికలు ఈ శ్లోకంలో స్వామి అధరామృతమును గూర్చి గానము చేయుచున్నారు.

అమృతము అనగా చావులేనిది. అమృతము త్రాగినవానికి చావురాదు. గోపికలు ఈ శ్లోకములో శ్రీకృష్ణుని అధరామృతమును వాంఛించుచున్నారు. అనగా జననమరణ సంసారమునుండి బయటపడు తరుణోపాయమును అన్వేషించుచున్నారు. భవరోగమునుండి విముక్తులగుటకు శ్రీకృష్ణుని అధరామృతమే ఔషధమని గ్రహించారు. ఈ విషయాన్నే ధృవపరుస్తూ శ్రీకృష్ణ నామామృతపానమే భవరోగమును రూపుమాపు దివ్యౌషధమని అన్నమాచార్యులు ఒక కీర్తనలో గానము చేశారు.

అన్నిటికి నిది పరమౌషధము, వెన్నుని నామమే విమలౌషధము
చిత్తశాంతికిని శ్రీపతినామమే, హత్తిన నిజ దివ్యౌషధము
మొత్తపు బంధ విమోచనంబునకు, చిత్తజ గురుడే సిద్ధౌషధము ॥అన్నింటికి॥
పరిపరి విధముల భవరోగములకు హరి పాదజలమే యౌషధము
దురిత కర్మములఁ దొలగించుటకును, మురహరు పూజే ముఖ్యౌషధము ॥అన్నింటికి॥

పరమ పవిత్రమైనట్టి శ్రీకృష్ణభగవానుని అధరామృతము తమ హృదయమందలి ప్రేమావేశమును అనుక్షణము వృద్ధిచేయుచున్నదని తెలియజేస్తున్నారు. అదియే సురత వర్ధనము.

గోపికల ప్రేమను కామపరిధిలోనుండి దర్శించకూడదు. కామ్యమైన ప్రేమ కామమనబడుతుంది. కామమునుండి కామ్యము తొలగినచో అది ప్రేమయని పిలువబడుతుంది. ప్రేమ జీవింపచేస్తుంది. కామం మరణాన్నందిస్తుంది. ప్రేమ శాంతిని ప్రసాదిస్తుంది. కామము అశాంతిని ఆహ్వానిస్తుంది. అనుభవిస్తున్న కొద్దీ ఆనందాన్ని వృద్ధిచెందేటట్లు చేసేది ప్రేమ. అనుభవించగానే అసంతృప్తిని, నిరాశను కల్గించేది కామము. గోపికల ప్రేమ పరాభక్తికి సంబంధించినది. విషయాసక్తి వారిలో లేదు. విషయాసక్తులగువారు అనంత దుఃఖములలో పడియుందురు.

సుఖమల్పం బహుక్లేశో విషయ గ్రాహిణాం నృణామ్,
అనంతం బ్రహ్మనిష్ఠానా మితి వేదాంత డిండిమః

విషయాసక్తులగువారికి అల్పసుఖము, అనంతక్లేశము కలుగును. బ్రహ్మనిష్ఠులైన మహాత్ముల ఆనందము అనంతమైనదని శంకరాచార్యులవారు వేదాంత డిండిమములో తెలియజేసియున్నారు.

అనంతానందమును కల్గించు ఆత్మానందమును విషయసుఖమని భ్రమించరాదు. వేదాంత పరిభాషలో రతియంటే ఆత్మరతి యని భావము.

రతి సుఖసమయ రసాలస యాదర ముకుళిత నయన సరోజం
నిస్సహనిపతిత తనుల తనయా మధుసూదన ముదిత మనోజం

"ఓ సఖీ! నేను రత్యానందము ననుభవించు కాలమందు జడమువలె కదలికలేక యుండగా శ్రీకృష్ణుడు అధికానందముచే నేత్రములు మూసుకొని యుండెను" అని రాధ తన చెలికత్తెతో రాధామాధవుల రతిక్రీడను వర్ణించినట్లు జయదేవుడు ఒక

అన్వయదిలో తెలియజేస్తాడు. జీవబ్రహ్మైక్యానుసంధానమే దీని అంతరార్థము. ఆత్మానందమును అనుభవించు జీవులు రాధవలె అచేతనంగా పడియుందురని భావము. బ్రహ్మచైతన్యము అంతర్ముఖమై అంతర్లీనమై యుండుటయే గోపికలు కీర్తించిన సురతవర్ధనము. సురత వర్ధనమేగాక శ్రీకృష్ణుని అధరామృతము శోకమును నశింపచేయునని తరువాత గానము చేస్తున్నారు.

భ్రాంతియే శోకమునకు పునాది. సత్యదర్శనము చేయలేని వ్యక్తి ఉన్న ఒకానొక సత్యపదార్థము స్థానే అసత్యపదార్థాన్ని దర్శిస్తాడు. అదియే భ్రాంతి. అదియే అజ్ఞానము. అజ్ఞానము నాలింగనము చేసుకొన్న మానవుడు తాను దేహమని, మనోబుద్ధులని, ఇంద్రియములని, ప్రాణమని భావిస్తుంటాడు. ఇవన్నియు పరిణామశీలమైనవి. మారే ఈ సంఘాతాన్నంతా తాను తెలుసుకుంటున్నాడు. తెలుసుకొను తాను తెలియబడే వాటికన్నా అన్యమైనవాడు. కనుక తాను యథార్థానికి నిర్వికారమైనవాడు. నిరాకారమైనవాడు. నిర్విశేషమైనవాడు. నిరంజనుడు.

ఆత్మానాత్మ వివేకజ్ఞానం లేకపోవుటచేతనే భ్రాంతి ఆవరించి సంసారమును తయారుచేసి, శోకమును అందించుచున్నది. శోకము పోవాలి అంటే భ్రాంతి నిర్మూలించబడాలి. జ్ఞానమొక్కటే మార్గము.

రజ్జువులో సర్పమును చూచుటయే అజ్ఞానము. అదియే భ్రాంతి. ఇచ్చట మనము రెండువిషయాలు జాగ్రత్తగా పరిశీలించి అర్థము చేసుకోవాలి. మొదట రజ్జుజ్ఞానము లేకపోవుట. రజ్జువు అనెడి జ్ఞానము ఎప్పుడయితే నశించిందో దానిస్థానే మరొక దృశ్యము గోచరించింది. అది సర్పమే కానవసరములేదు. కొందరికి భూమి పగులుగా కనిపించవచ్చు. మరికొందరికి నీటిధారగా గోచరింపవచ్చు. ఇంక కొందరికి సర్పముగా అగుపించవచ్చు. ఇవన్నీ భ్రాంతులే. ఈ భ్రాంతులన్నీ ఏర్పడడానికి మొదటి కారణము రజ్జు జ్ఞానము లేకపోవుట. రెండవది రజ్జువుస్థానే కల్పితసర్పాన్ని దర్శించుట. ఇప్పుడు ఆ కల్పిత సర్పము, అది కల్పించు అనంత దుఃఖము దూరము కావాలంటే రజ్జుదర్శనము జరగాలి. స్వప్నంలో ఉన్నంతవరకు స్వప్నగతబాధలన్నీ దూరము కావాలంటే మనిషి మేల్కొనాలి. జాగ్రత్తు వచ్చినపుడే అది సాధ్యము. అలాగే స్వప్నానుభవాలు దూరము కావు. జాగ్రత్తు వచ్చినపుడే అది సాధ్యము. అలాగే సత్యదర్శనంతోనే అజ్ఞానము తొలగాలి. అజ్ఞానము తొలగి భ్రాంతు లణగినపుడే శోకమోహాదులు దూరమవుతాయి.

దానికి విచారణయే మార్గము. ఆత్మానాత్మ వివేకజ్ఞానమే సూటియైన మార్గము. రజ్జువులో సర్పదర్శనముచేసి సర్వానర్థములు కొనితెచ్చుకొనునట్లు సత్యాత్మలో దేహాభావం ఆరోపించి జీవత్వాన్ని తయారుచేశావు. నీవు శుద్ధమైన ఆత్మవు. అజ్ఞానంతో నీవు అశుద్ధమైన శరీరమని భావిస్తున్నావు. దానికి నీవు స్నానము చేయిస్తావు. అయినా అశుద్ధమే. సుగంధద్రవ్యలేపనాదులను పులుముతావు. అప్పుడూ అశుద్ధమే. విలువైన వస్త్రములతో కప్పుతావు. అప్పుడుకూడా అది అపరిశుద్ధమే. రక్తమాంసాదులతో మలినపూరితమైన ఈ దేహమునే పాకీవాడైన శుభ్రముచేసే పాకీవారుగా మనము మారిపోయాము.

పెంటకుప్పను పారవేయుడానికి ఎవరైనా వెనుకాడుతారా? మరి ఈ దేహమేమిటి? మలమూత్ర మాంసాదులను లోపలవుంచి, పైకి కనుపించకుండా అందమైన పొట్లంగా రూపొందించినది కాదా?

స్వప్రకాశ మధిష్ఠానం స్వయం భూయ సదాత్మనా,
బ్రహ్మాండమపి పిండాణ్డం త్యజ్యతాం మలభాణ్డవత్

అండాండ పిండాండములను మలభాండములుగా త్యజించి స్వప్రకాశమై, సకలమునకు ఆధారమైన నిత్యాత్మనై వెల్గొందమని ఆదిశంకరులు వివేకచూడామణిలో తెలియజేశారు.

కనుక దేహభ్రాంతిని వదలిపెట్టి, మనోబుద్ధుల నధిగమించి ఆత్మయందు లయించడమే జ్ఞానము. అదియే ఆత్మజ్ఞానము. **"తరతి శోక మాత్మవిత్"** ఆత్మవిదుడు శోకాన్ని దాటుతాడని ఉపనిషద్వచనము.

ఆత్మానాత్మ వివేకజ్ఞానముద్వారా అనిత్యమును త్యజించి, సత్యమును దర్శించి మనము పొందు ఆత్మజ్ఞానము శ్రీకృష్ణుని అధరామృత పానముచేత కలుగగలదని తెలియజేస్తున్నారు. అందుచేతనే **"శోకనాశనం"** శ్రీకృష్ణుని అధరామృతము శోకమును నశింపచేస్తుందని తెలియజేస్తున్నారు.

సురతవర్ధనము, శోకనాశనమైన భగవానుని అధరామృతము వేణువుచే పరిచుంబితమని తరువాత తెలియజేస్తున్నారు. భగవానుని అధరామృతమును తనివితీరా గ్రోలే వేణువు అదృష్టాన్ని కీర్తిస్తున్నారు గోపికలు.

సురతవర్ధనము, శోకనాశనము, మ్రోగించబడు వేణువుచే పరిచుంబితము అయిన అధరామృతము అన్యరాగ విస్మారణమని చివరగా గోపికలు తెలియజేస్తున్నారు. శ్రీకృష్ణుని అధరామృతపానముచేత వస్తువులపై, వ్యక్తులపై యున్న అనురాగము విస్మరింపబడునని కీర్తిస్తున్నారు.

అన్యరాగ విస్మారణమనగా నవ్యాన మనస్తత్వము అలవడినదని భావము. వస్తువుల అనిత్యత్వాన్ని, వ్యక్తులయొక్క అస్థిరత్వాన్ని అవగాహన చేసుకొని నశించిపోయే వస్తువుల, వ్యక్తుల సముదాయంతో అనురక్తిని పెంచుకొనుట భ్రాంతియని గ్రహించి నిత్యుడు, పరిపూర్ణుడైన శ్రీకృష్ణునియందు మనసు నిలుపుటకు అన్యరాగ విస్మారణము జరుగవలెను.

వస్తువులుగాని, వ్యక్తులుగాని తమంతట తాము మనల్ని బాధించలేవు. వాటిపై మనకున్న భ్రాంతియే మనలను వ్యామోహితుల్ని చేయుచున్నది. కనుక బాహ్యానికి వస్తువులను త్యాగముచేస్తే చాలదు. వాటిపై మనకున్న భ్రాంతినికూడా త్యాగము చేయాలి. మొదటిది బహిఃత్యాగ మనబడుతుంది. రెండవది అంతఃత్యాగ మనబడుతుంది. ఈ రెండింటిని త్యాగము చేయుటయే అన్యరాగ విస్మారణము. అన్యరాగ విస్మారణము జరిగిన తరువాత భగవంతునిపై అనన్యభక్తి ఏర్పడుతుంది.

అనన్య చేతాస్సతతం యోమాం స్మరతి నిత్యశః
తస్యాహం సులభః పార్థ నిత్య యుక్తస్య యోగినః

"ఇతర విషయములపై చిత్తములేనివాడై, ఎల్లప్పుడు నన్నే స్మరించుచూ, మనస్సును నిగ్రహించుకొని యుండు యోగికి నేను తేలికగా లభింతును" అని శ్రీకృష్ణుడు భగవద్గీత 8వ అధ్యాయము అక్షర పరబ్రహ్మ యోగమునందు తెలియజేసియున్నాడు.

అటతి యద్భవానహ్ని కాననం త్రుటి యుగాయతే త్వామపశ్యతామ్
కుటిలకున్తలం శ్రీ ముఖం చ తే జడ ఉదీక్షతాం పక్ష్మ కృద్దృశామ్ 15

భావము:- కృష్ణా! పగటివేళ మాకు కనబడకుండా అడవులకు పోయినపుడు మాకు క్షణమొక యుగముగా నుండెడిది. కుటిల కుంతలమై, మనోహరమైన నీ శ్రీముఖమును చూచు కన్నులకు రెప్పలు సృష్టించి, బ్రహ్మ మందమతి అనిపించుకున్నాడు.

వ్యాఖ్య

భగవానుని శ్రీముఖమును దర్శించక క్షణకాలమైనను జీవించలేని గోపికలు తమ విరహవేదనను ఈ శ్లోకములో గానము చేయుచున్నారు.

సకల కర్మలను భగవదర్పితముచేసి, సదా భగవంతునే వీక్షిస్తూ, చింతిస్తూ భగవానుడు క్షణకాలము తమకు దూరము కాగా భరించలేని వ్యథ ననుభవించడమే భక్తిలో పరాకాష్ఠ. భక్తునికి భగవంతుడే ఆనందధామము. భగవత్సంబంధమైన ఆలోచనలతో గడపిన ఘడియలే శుభఘడియలు. ఒకవేళ భగవంతుడు తమకు దూరమైనచో, నీటినుండి వేరుపడిన చేపలా, భక్తులు తీవ్రవేదనకు గురవుతారు. మళ్ళీ భగవానుని చరణకమలముల చెంత చేరితేనేగాని వారికి పరిపూర్ణశాంతి లభించదు.

నారదస్తు తదర్పితాఖిలాచారతా, తద్విస్మరణే పరమ వ్యాకులతేతి

"సర్వమును భగవంతునియందే సమర్పించియుండుట, భగవంతుని మరచినచో పరమ వ్యాకులత చెందుట భక్తి" యని నారదమహర్షి భక్తిసూత్రాలలో ప్రబోధించారు.

మనము ఒక వస్తువునుండిగాని లేదా వ్యక్తినుండిగాని తృప్తిపొందుట యనునది ఆ వ్యక్తితో లేదా వస్తువుతో మన మేర్పరచుకొనే సంబంధాలలో ఏర్పడియున్న భేదాలనుబట్టి కలుగుతుంటుంది. ఈ మన సంబంధాలు మూడు విధాలుగా ఉన్నాయి. అవియే ప్రియ, మోద, ప్రమోదాలు.

మొదటిది ప్రియము. ప్రియమనగా మనము కోరువ్యక్తికి లేదా వస్తువుకు దూరముగా యుండి ప్రేమించుట. నేనొక మామిడిపండును తినాలని భావిస్తున్నాను. నేను ఇంటిలో ఉన్నాను. పండు బజారులో ఉంది. అయినా నేను ప్రేమిస్తున్నాను. ఇది ప్రియమన బడుతుంది.

రెండవది మోదము. మోదమనగా మనము వాంఛించు వ్యక్తి లేదా వస్తువు మన దగ్గరేయుండి, దానిని చూస్తున్న కొద్దీ సంతోషము అధికమగుట. మామిడిపండును ఎదురుగా బల్లపై నుంచుకొని వీక్షించుట. ఇది మోదము. సంతృప్తినిచ్చుటలో ప్రియముకన్నా ఉత్కృష్టము.

మూడవది ప్రమోదము. ప్రమోదమనగా మనము కోరు వస్తువుతో లేదా వ్యక్తితో తాదాత్మ్యము చెందుట. బల్లపై నున్న పండును భుజించుట. ఇది ప్రమోదము. మోదముకన్నా సంతృప్తిని కల్గించుటలో పరమోత్కృష్టము.

అమెరికాలో చదువుతున్న కుమారుని తలచుకొని తల్లి తృప్తిచెందుట ప్రియమైతే, దగ్గరికి వచ్చినపుడు వీక్షించుట మోదము. ఆలింగనము చేసుకొనుట ప్రమోదము.

గోపికలకు శ్రీకృష్ణునితో యున్న సంబంధము ఈ మూడింటికన్నా అతీతము. ప్రియ, మోద, ప్రమోదాలు అనుభవిస్తున్నట్లు తెలుస్తుంది. కానీ గోపీప్రేమ అలాంటిదికాదు. అన్యదర్శనము లేని అద్వైతానుభూతి. శ్రీకృష్ణుని అనంత చైతన్యములో తమ జీవచైతన్యమును లయింపజేసి, తాదాత్మ్యము చెందుటయే అందులో గోచరించే పరమానందము.

శ్రీకృష్ణుని సన్నిధిలో గోపికలకు అట్టి పరమానంద స్థితి లభిస్తుంది. కనుకనే గోపాలునికి దూరమై గోపభామలు క్షణకాలముకూడా మనలేరు. ఒకవేళ అలా జీవించవలసి వచ్చినపుడు క్షణమొక యుగముగా గడుస్తుందని గోపికలు గానము చేస్తున్నారు. ఇలా క్షణమొక యుగముగా పగలంతా గడిపిన గోపికలు సాయంత్రమయ్యేసరికి అడవినుండి గోవులను తోలుకుని తిరిగి వచ్చుచున్న గోపాలుని కుటిల కుంతలమై, మనోహరమైన ముఖారవిందమును తదేకంగా చూడవలయునన్న కంటికి రెప్పలు అడ్డము వచ్చుచున్నవని వ్యథ చెందుతున్నారు. శ్యామసుందరుని దివ్యదర్శనము క్షణకాలము పాటు మరుగుపడుటకు కారణమైన రెప్పలను సృష్టించిన బ్రహ్మదేవుడు మందమతి యని గోపికలు కీర్తిస్తున్నారు. కంటిరెప్పలే లేనిచో తదేకంగా భగవానుని దర్శించగలమని వారి భావము.

చూచుట యనగా తెలుసుకొనుట లేక గ్రహించుట యని భావము. చూచుట యను పదము ప్రయోగింపబడినపుడు నేత్రముల ద్వారా చూచుటయేయని గ్రహించరాదు. రుచిని నాలుక తెలుసుకొనును. అయినా రుచి చూచుటయని అందుము. ఇచ్చట చూచుట యనగా తెలుసుకొనుట యని భావము. భావించుట అని అర్థము. ఇక్కడ భగవానుని చూచుటయనగా భావించుట లేదా అనుభవించుట యని భావము. భగవానుని చూచు గోపికల నేత్రములకు రెప్పలు అవరోధమై దృష్టిని నిరోధించునని చెప్పుటలో విశిష్టతయున్నది. నిరంతరము తమయందు స్వప్రకాశమై వెలుగొందు ఆత్మయనెడి శ్రీకృష్ణుని దర్శించుటకు అజ్ఞాన మనెడి కనురెప్పలు తెరలా ఏర్పడి దృష్టిని నిరోధించుచున్నవని భావము.

యథార్థానికి తెలుసుకొనుచున్న దెవరు? తెలుసుకొను ప్రజ్ఞ ఏదియై యున్నదని ఆలోచించినచో జ్ఞానస్థాన మేదియో మనము తెలిసికొనగలము. ఈ దృశ్యమాన ప్రపంచమును మనలో తెలుసుకొనుచున్న దెవరని గ్రహించడానికి ప్రారంభించిన మొదలు మనము అన్వేషణ జరుపవలసినది అంతర్యములోనే గాని బాహ్యంలోగాదు. తెలుసుకొను మూలవస్తువు ఎల్లప్పుడూ తెలుసుకొనేందుకు అనుకూలంగా అనుభవములో ఉండాలి. అట్టి మూలతత్వము శరీరము కావడానికి వీలులేదు. ఎందుకనగా శరీరమునకు

లయస్థితియున్నది. కనుక శరీరము విశ్రమించినపుడు ఆ కాలములో కలిగే అనుభవములను తాను గ్రహించలేరు. కనుక గ్రహించేది శరీరముకాదు. ఇంద్రియాలు కూడా ఉపశమించి యుండుటచే అవీగావు.

ఇంద్రియముల ద్వారా విషయమును తెలుసుకొని మనసే సకలమును గ్రహించుచున్నదని ఆధునిక శాస్త్రజ్ఞులు తెలియజేయుచున్ననూ మనసు యథార్థానికి చాలా విచిత్రమైన వస్తువు. అయినను అదికూడా గణనయంత్రములాంటిదే. గణన యంత్రము నడిపే వ్యక్తి ఇచ్చు కార్యక్రమానికి అనుగుణముగానే అది తన కార్యక్రమమును నిర్వహించును. మనసు అనేది గణనయంత్రము కూడా తనను నడిపే వ్యక్తి అందించు కార్యక్రమము ప్రకారమే నడచును. మనసునకు కార్యక్రమము నిచ్చుదాత అహంకారము. అది నడుపు కార్యక్రమము రాగద్వేష ప్రకటనము. కంప్యూటరు ఎంత చక్కగా ఉన్నను విద్యుచ్ఛక్తి లేనిదే అది పనిచేయలేదు. మనసు మరియు శరీరముకూడా గణనయంత్రమువలె యుండి చైతన్యమను విద్యుచ్ఛక్తి లేనిచో నిరుపయోగముగును. కనుక గ్రహించు శక్తికలది చైతన్యమేగాని శారీరక మనోబుద్ధులు కావని మనకు అవగతమైనది.

స్వప్రకాశమైన సూర్యునినుండి ప్రకాశమును అరువు తీసుకొని చంద్రుడు ప్రకాశించినట్లు, చైతన్య ప్రభావంతో దేహమనోబుద్ధులు నడచుచున్నవి. కనుక చైతన్యమే సకల జ్ఞాన సముదాయమునకు మూలమైయున్నది.

జ్ఞానమునకు కారణమైన జ్ఞానములో జ్ఞానముగా మిగిలియుండుటయే జ్ఞానము. అట్టి జ్ఞానమే ఆత్మదర్శనమని పిలువబడుతుంది. అదియే కృష్ణదర్శనము. అద్భుతమైన ఆ దర్శనమును నిరోధించునది అజ్ఞానము. శ్రీకృష్ణుని దర్శించు దివ్యదృష్టిని ఆటంకపరచు అజ్ఞానపు తెరయే కనురెప్ప అని గోపికల అభిప్రాయము.

రెప్పలు సృష్టించిన బ్రహ్మదేవుని మందమతిగా గోపికలు అభివర్ణిస్తున్నారు. **"తత్రాపి తదేవ అవలోకయతి"** పరాభక్తి కల్గిన తరువాత భక్తులు భగవంతునే వీక్షిస్తుంటారు. అట్టి దృష్టి కనురెప్పల వలన నిరోధింపబడు చున్నందున సృష్టికర్తను మందమతియని గోపికలు తెలియజేస్తున్నారు.

జగత్తును బ్రహ్మదేవుడు సృష్టించడముచేత మనలో జగద్వ్యాపారములు, ప్రాపంచిక విషయవృత్తులు చోటు చేసుకున్నవి. అవి సత్యాత్మను దర్శించు జ్ఞానమును అడ్డుపడునవి. త్రికాలములందు యుండి, కాలాతీతమైనది సత్యము. ఒక కాలములో భాసించి అదృశ్యమయ్యేది మిథ్య. అదియే జగత్తు. **"జాయతే గచ్ఛతి ఇతి జగత్"** ఏదైతే పుట్టి పోతూయున్నదో అదియే జగత్తు. రాకపోకలు లేనిదై, స్థిరమై యుండునది సత్యము. అదియే బ్రహ్మము. శుద్ధ చైతన్యము. అట్టి శుద్ధచైతన్యమైన శ్రీకృష్ణుని దర్శించు గోపికలను జీవుల దృష్టిని మిథ్యయనే అజ్ఞానపు అడ్డుతెర నిరోధించుటవలన అట్టి నిరోధమును కలిగించు నిరుపయోగ కనురెప్పలను సృష్టించిన బ్రహ్మదేవుని మందమతి యని గోపికలు నిందిస్తున్నారు.

పతి సుతాన్వయభ్రాతృబాంధవాన్ అతివిలంఘ్యతేఽ న్త్యచ్యుతాగతాః
గతివిదస్తవోద్గీతమోహితాః కితవ యోషితః కస్త్యజేన్నిశి 16

భావము:- ఓ అచ్యుతా! భర్తలను, బిడ్డలను, సోదరులను, బంధువులను అందరిని వదలి నీవే శరణ్యమని, నీ గీతముచే మోహితులమై ఇట్లు వచ్చితిమి. ఓ కపటుడా! ఎవ్వడైనను రాత్రివేళ విశ్వసించి దగ్గరకు వచ్చిన స్త్రీలను ఉపేక్షించునా?

వ్యాఖ్య

శరత్కాల రాత్రియందు శ్రీకృష్ణుడు బృందావనంలో గంధర్వులుకూడా మోహితులగునట్లు సుశ్రావ్యంగా మురళీగానము చేసేవాడు. ఆ దివ్య మధురనాదము చెవిని పడగానే గృహకృత్యాలలో నిమగ్నమైయున్న గోపికల హృదయాలలో నిగ్రహించుటకు వీలులేని విధంగా ప్రేమావేశము పొరలి పారేది. వెంటనే శ్రీకృష్ణుని పదపద్మముల చెంతకు పరుగులిడా లనిపించేది. శరీరములు కట్టెలవలె స్తంభించిపోయేవి. మనసు నిస్తరంగ జలధిలా కదలిక లేనిదై సంకల్పరహిత మయ్యేది. నేత్రములపై రెప్పలు పడేవికావు. ఇక తమ గృహాలలో నిలువలేకపోయేవారు. రాత్రివేళయని కూడా సంశయించక శ్రీకృష్ణ సన్నిధానమును చేరడానికి ఉరకలేసేవారు.

వంశీమోహనుని మురళీనాదము వినబడే సరికి బిడ్డలకు పాలిస్తున్న గోపికలు బిడ్డలను అక్కడే వదిలేసి బృందావనము వైపు పరుగు తీసేవారు. గోవులనుండి పాలు పితుకుతున్నవారు ఆ పనిని అక్కడే వదలి బయలుదేరేవారు. వంట తయారుచేయువారు వరిపెట్టి వెడితే ఆ వంట ఏమవుతుందనే ధ్యాసకూడా లేకుండా దౌడుతీసేవారు. భర్తకు భోజనము వడ్డిస్తున్నవారు వడ్డించుపాత్రను భర్త విస్తరిలోనే వదిలేసి లేడిలా గంతులేస్తూ వెళ్ళేవారు. భోంచేస్తున్నవారు కరమును శుభ్రపరచుకోవాలనే ఆలోచనకూడా లేకుండా బృందావనానికి నడిచేవారు.

సునత చలీం బ్రజబధూ గీత ధునికో మారగ గహా
భవన భీతఁ ద్రుమ కుంజ పుంజ కితహుఁ అటకీనాహా

"మురళీనాదాన్ని విన్న గోపికలు ఆ ధ్వని వచ్చు మార్గాన్ననుసరించి వెళ్ళేవారు. గృహాలు, గోడలు, వృక్షాలు, పొదరిండ్లు వారి గమనాన్ని నిరోధించలేకపోయేవి. మురళీగాన మార్గము సుధామయము. అంతేకాదు ఇరుకైనదికూడా. ఈ మార్గమును గోపికలే అనుసరించగలరు. అన్యులు అనర్హులు" అని భక్త నందరామ కవి తెలియజేసాడు.

అలా ఆవేశపూరితంగా వెడుతున్న గోపికలను భర్తలు, బిడ్డలు, సోదరులు, బంధువులు కలసి అడ్డగించేవారు. వెళ్ళడానికి వీలులేదని శాసించేవారు. నిందించేవారు. హింసించేవారు. అయినా వారి నిందలు, దూషణము గోపికల మనసులో ప్రవేశించలేకపోయేవి. వారిని ఆపేశక్తి ఎవ్వరికీ లేకపోయేది. అయస్కాంత ఆకర్షణ పరిధిలో ఇనుపముక్కనుంచి కదలడానికి వీలులేదని శాసిస్తే ప్రయోజన ముంటుందా? కదలకపోవడానికి సాధ్యమా ఇనుప

ముక్కకు మాత్రము శక్తి ఎక్కడనుండి వస్తుంది? అయస్కాంతమనే శ్రీకృష్ణుని ఆకర్షణా శక్తిని ఎదుర్కొని నిలిచే పటుత్వము ఇనుప ముక్కలైన గోపికలకు ఎక్కడుంది? ఎందరు అడ్డగిస్తున్నను, ఆటంకపరుస్తున్నను దూసుకుపోయే బాణములాగా ముందుకు సాగేవారు. ఇలా ప్రవర్తించడము వలన పర్యవసాన మెలా ఉంటుందో అనే ధ్యాసే వారికిలేదు. అన్యులను దృష్టిలో నుంచుకొని వారికొరకు తమ ప్రాణమైన శ్యామసుందరునికి దూరంగా గోపికలు వెళ్ళలేరు. ప్రపంచ నిందలకు తలవంచి గోపాలునికి దూరులై వారు జీవించలేరు. ఇతరుల విషయమెలా ఉన్నా, తమ భర్తలను కూడా లెక్కచేయక పోవడమేమిటి? అనే సంశయము మనకు కలుగుతుంది. గోపికలకు బృందావన సంచారియే భర్త. గోపీనాథుడే సర్వస్వము.

గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాసశ్శరణం సుహృత్,
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్

"భరించువాడు, నియామకుడు, శుభాశుభముల జూచువాడు, భోగస్థానము, రక్షకుడు, హితముచేయువాడు, సృజించువాడు, సంహరించువాడు, ఆధారము, లయస్థానము, నశింపని బీజములన్నియు నేనే" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత- 9వ అధ్యాయంలో తెలియజేశారు.

ఇలా సర్వమును త్యజించి తనవారిని, తోటివారిని లెక్కచేయకుండా, శ్రీకృష్ణుని గీతములచే మోహితులై బృందావన పుణ్యభూమికి రాత్రివేళ పరుగులిడుతూ వచ్చిన గోపికలను శ్రీకృష్ణుడు ఉపేక్షించేవాడు.

"ఓ గోపికలారా! ఈ రాత్రి సమయము మీరు నా దర్శనానికై ఇక్కడి కరుదెంచారు. చాలాసంతోషము. మీ ప్రేమకు నేను సదా ఋణపడియుంటాను. కానీ ఈ సమయములో మీరు ఇక్కడికి రావడము సబబుకాదు. ఇది రాత్రివేళ. క్రూరమృగాలు, విషజంతువులు, విషకీటకాలు సంచరించువేళ మీరు ఈ వనప్రదేశమునకు వచ్చుట యోగ్యమైన పనికాదు. తిరిగి గోకులమునకు వెళ్ళండి. స్త్రీలైన మీరు ఇలా రాత్రిపూట సంచరించుట మంచిదికాదు. మీ కొరకు మీ భర్తలు, బంధువులు, తల్లిదండ్రులు, సోదరులు అన్వేషిస్తుంటారు. వారి మనసులను ఆవేదనకు గురిచేయకండి. గృహోన్ముఖులు కండి. భర్తలను సేవించండి. బిడ్డల అవసరాలు తీర్చండి. అత్తమామలను గౌరవించండి. గోవులను పూజించండి.

భర్తలను సేవించుటకన్నా ఉత్తమమైన ధర్మములేదు. పతిని పరమేశ్వర స్వరూపముగా భావించి భార్యలు ఆరాధించాలి. ఆనంద పరచాలి. భర్తలను త్యజించి జీవించువారికి ఇహపర సుఖములు లభించవు. భర్తలను సేవించక ఇలా అరుదెంచుట వలన అపకీర్తిని పొందుతారు. ధర్మజీవనము గడుపు స్త్రీకి అవమానముకన్న మరణమే మేలు. కనుక నా మాట విని మీరు బృందావనమును వీడి వ్రజభూమికి నడక సాగించండి. ఒకవేళ మీకు నా మీదనే ప్రేమ అధికంగా యున్నచో, నన్ను వదలి జీవించలేని స్థాయిలో మీ మనస్సు వ్యథ చెందుచున్నచో దానికి నేనొక తరుణోపాయమును తెలియజేస్తాను వినండి.

ఆచరించండి. ఆనందంగా జీవించండి. మీరు మీ గృహములందే నివసించండి. సదా నా నామము స్మరిస్తూ జీవించండి. అనవరతము నా రూపమునే వీక్షిస్తూ బ్రతకండి. నిరంతరము నన్ను గూర్చి ముచ్చటించుకుంటూ మనుగడను సాగించండి. అంతేగాని నా వెంటకు రావడానికి ప్రయత్నించకండి. వెళ్ళండి" అని మధుసూదనుడు బోధించేవాడు.

శ్రీకృష్ణుని ప్రబోధము గోపికల మానసములను ముక్కలు చేసేది. హృదయములను తీవ్రంగా గాయపరచేది. మనోవ్యథకు గురియైన గోపికలు శ్రీకృష్ణుని చూచి "హే నవనీతచోరా! నీ పాదములకు సంపూర్ణ శరణాగతులైనవారము మేము. మాపై ఇలాంటి కినుక వహించుట నీకు సబబుకాదు. మమ్ములను పరిత్యజించుట, నిర్దయ వాక్యాలతో మా హృదయములను గాయపరచుట నీకు ధర్మము కాదు. నీ పాదములే శరణ్యమని నమ్మినవారము. మమ్ములను అన్యాయము చేయకు. భర్తను సేవించుట భార్యయొక్క ధర్మమని నీవు తెలియజేసిన మాట సమంజసమైనదే. అందులకు మాకు అభ్యంతరము లేదు. నిన్ను సేవిస్తూ భర్తల కనుగుణ్యముగా జీవించగలము. నీ సేవకు అంతరాయము కలుగునపుడు మేము భర్తలను సేవించలేము. యథార్థానికి నీవే మా తండ్రివి, బిడ్డవు, సోదరుడివి, బాంధవుడవు. సర్వమూ నీవే. నిన్ను వదలి జీవించలేము. ఓయీ ధూర్తుడా! చతుర్విధ పురుషార్థములయొక్క అంతిమ ఫలము నీవు కాదా? ధర్మప్రవర్తనచేత మేము పొందు ఫలము నీ పాదసన్నిధి కాదా? ఎందుకు మమ్మల్నిలా వేధిస్తున్నావు?

"కృష్ణా! తీవ్రహృదయావేదనతో మేము నీదరి చేరాము. మమ్ములను నీ పవిత్ర పాదపద్మాలకు దూరముచేయకు. తియ్యటి నీ మాటలతో మత్తెక్కించు. నీ కొంటెచూపులతో ఆనంద శిఖరాలను జేర్చు. నీ కమనీయ హాస్య వదనలాలిత్యముతో, మేములను మరపింపచేయు నీ సుశ్రావ్యగానముతో మమ్ములను పరవశింపచేయుము.

"అచ్యుతా! త్రిభువనములలో నిన్ను మోహించని వారెవ్వరు? నీ దివ్యమంగళ విగ్రహమును వీక్షించుటకు పరితపించని వారెవ్వరు? నీ మంజుల మురళీనాదమును తనివితీరా శ్రవణము చేయుటకు ఉరకలేయని వారెవ్వరు?

త్రైలోక్య సౌభాగ్యమిదంచ నిరీక్ష్యరూపం, యద్గోద్విజ ద్రుమ మృగాః పులకాన్యబిభ్రన్

"నీ త్రైలోక్య మోహన రూపమును జూచి గో-పక్షి-వృక్ష- మృగాదులకు కూడా శరీరములు గగుర్పొడిచినవి."

"మాధవా! నీ పదసరోజములకు మమ్ము దూరముచేయకు. నీ గీతములచే మోహితులమై నీ దరిచేరాము. రాత్రివేళ వాంఛించి దగ్గరకువచ్చు స్త్రీల నుపేక్షించుట నీకు తగదు" అని గానము చేశారు గోపికలు.

మానవ జీవితాకాశములో గోచరమయ్యే అజ్ఞానమే రాత్రిపూట వ్యాపించియుండు అంధకారమని అంతరార్థము. ఆత్మసామ్రాజ్యము నధిరోహించుటకు తమను నిరోధించు విషయవాసనలే బృందావన కృష్ణుని చేరుటకు పయనించిన గోపికలను ఆటంకపరచు బంధుమిత్రాదులు. రాత్రిపూట గోపికలు శ్రీకృష్ణుని చెంతకు బయలుదేరుతారు. శ్రీకృష్ణుడు వారిని ఉపేక్షిస్తాడని ఈ శ్లోకములో గోపికలు గానము చేశారు.

రాత్రులందు ప్రతియొక్కరు నిద్రిస్తారు. పగలంతయు అలసిన మనసు రాత్రిసమయాన చైతన్యంలో లయించి తిరిగి శక్తివంత మవుతుంది. ఆనందమును పొందుటకు చేయు ప్రయత్నమే నిద్ర. జాగ్రదవస్థయందు అలసిపోవుటయే నిద్రకు కారణమైయున్నది. ప్రాపంచిక విషయవాసనలతో అలసిపోయిన మనసు ఆనందధామమైన కృష్ణచైతన్యమునుండి రసాస్వాదనము చేయుటకు ప్రయత్నిస్తుంది. తనలోనున్న వెలితి పరిపూర్ణతకు ప్రయత్నించమంటుంది. తన హృదయములో చోటుచేసుకొనియున్న అజ్ఞానము జ్ఞానమును సముపార్జించమని హెచ్చరికలు చేస్తుంది. అట్టి అజ్ఞానావస్థలో యున్నకాలమే రాత్రి సమయము.

అట్టి నిశీధిలో జీవులనబడే గోపికలు దేవుడనే శ్రీకృష్ణుని హృదయమనే బృందావనములో కలియడానికి ప్రయత్నించారు. దగ్గరకు వెళ్ళారు. జాగ్రత్స్వప్నావస్థలనే గృహావ్రజాలను దాటి సుషుప్తి యనెడి బృందావనంలో ప్రవేశించారు. ఆనందమయ కోశమును దాటి తురీయమైన ఆత్మలో ఐక్యము కావడానికి ప్రయత్నించారు. ఇంతలో శ్రీకృష్ణుడు వారిని ఉపేక్షించాడు. చెంతకు రావలదని వారించాడు. తిరిగి వ్రజభూమికి అరుదెంచమని తెలియజేశాడు. తమ గృహధర్మాలను నిర్వర్తించమని ఆదేశించాడు. తాము తయారుచేసుకున్న గృహస్థ జీవనము తమ కొరకు ఎదురు చూచుచున్నదని ప్రబోధించాడు.

సుషుప్తిలో ప్రవేశించి అతిచేరువలో నున్న చైతన్యమును చేరుటకు జీవులు ప్రయత్నించగా తనలో లయించుటకు వీలులేదని ఆత్మ నిరోధించుచున్నది. తాము జాగ్రదవస్థలో తయారుచేసుకున్న విషయవాసనలు తమ కొరకు ఎదురుచూచుటయే నిరోధమునకు కారణమై యున్నది. వాసనాత్రయ వివర్జితమే మోక్షము. వాసనలుగల మనస్సు ఆత్మయందు లీనముకాదు. బలవంతముగా సుషుప్తినుండి జాగ్రదవస్థకు రంప్యబడుతుంది. అదియే నిరోధించుటయని గ్రహించాలి.

రహసి సంవిదం హృచ్ఛయోదయం ప్రహసితాననం ప్రేమవీక్షణమ్
బృహదురశ్శ్రియో వీక్ష్యధామ తే ముహురతిస్పృహా ముహ్యతే మనః 17

భావము:- ఓ ప్రియుడా! నీ సల్లాపములు, నీ దరహాసము, నీ ప్రేమ వీక్షణము, లక్ష్మీ నిలయమైన నీ విశాల వక్షస్థలము చూసి, మాటిమాటికి తీరని కోరిక పొడముచున్నది. మా మనస్సు మోహమున మునుగుచున్నది.

వ్యాఖ్య

గోపికల మానసములలో శ్రీకృష్ణునియందు తీరని కోరిక పొడచూపుటకు, వారి మనస్సు మోహమున మునుగుటకు కారణములైన భగవానుని మనోజ్ఞక్రీడలను, దరహాసమును, ప్రేమ వీక్షణమును, లక్ష్మీనిలయమైన సువిశాల వక్షస్థలమును గూర్చి గోపికలు ఈ శ్లోకములో గానము చేయుచున్నారు.

శ్రీకృష్ణుడు పల్లు మనోజ్ఞ నర్మక్రీడలు దర్శించిన వారి హృదయాలపై చెరగని ముద్రనువేసి, ఆ దృశ్యమునే సదా వీక్షించవలయుననెడి కోరికతో మనసు వ్యథచెడువట్లు చేయును. ఆయన సల్పిన క్రీడలు ఆధ్యాత్మిక భావగర్భిత సందేశాలై యుండుటయే దానికి కారణము.

గోపికల హృదయాలలో శ్రీకృష్ణునిపై తీవ్రతాపము కలుగుటకు కారణమైన నర్మక్రీడలను వివరించిన తరువాత శ్యామసుందరుని చిరునగవు రెండవ కారణముగా గోపికలు తెలియజేయుచున్నారు.

గోపస్త్రీలు యమునకు వెళ్ళుటచూసి, వారు తిరిగి వచ్చులోపల బంధింపబడియున్న గోవులను, దూడలను శ్రీకృష్ణుడు విడుదల చేసేవాడు. పాలు పితుకుటకు గోపభామలు రాగా అచ్చట గోవులు, లేగదూడలు కనిపించేవి కావు. వారు వెంటనే పలునైపుల వరుగెత్తి గోవులను బంధించి తీసుకొని వచ్చుచుండగా దారిలో చెట్టుక్రింద నిలబడి మురళి నూదుతూ దర్శనమిచ్చేవాడు. ఈ పనిని చేసినవాడు గోపాలుడే నని అనుమానించి గోపభామలు తదేకంగా చూడగా వారిపై చిరునవ్వు విసిరేవాడు. ఎందుకు తనకీ తమాషా! జీవితమే ఒక తమాషా అన్నట్లు దరహాసము చేసేవాడు. ఆవుదూడలను వదలించుట ద్వారా తన కర్తవ్యమును తెలియపరచేవాడు. సంసార భవబంధాలలో చిక్కుకొని యున్న జీవులను విడుదల చేయుటయే తన ధర్మమని చాటేవాడు.

"అమ్మా! కృష్ణయ్య మన్ను తింటున్నాడు" అని యశోదమ్మతో ఫిర్యాదు చేశాడు బలరాముడు. వెంటనే యశోదామాత శ్రీకృష్ణుని సమీపించి "కృష్ణా! మన్నుతింటున్నావా!" అని అడిగింది. "అమ్మా! నేను మన్ను తినడమేమిటి? ఎవరో గిట్టనివాళ్ళు నీకలా చెప్పివుంటారు" అన్నాడు కృష్ణయ్య. "గోపాలా! నీ మాయ మాటలకు మోసపోయే స్థితిలో నేనులేను. నిజం చెప్పు" అని గద్దించింది యశోద. "అదేంటమ్మా! వాళ్ళు చెబితే మాత్రము నీవెలా నమ్మావు? నీవు పెట్టే వెన్న తినడానికి అలవాటుపడిన నోరు మన్ను తింటుందని ఎలా భావించావమ్మా?" అని అమాయకంగా అన్నాడు. "కన్నా నీతో వాదించేందుకు నేను రాలేదు. ముందు నోరు తెరువుము" అన్నది యశోద. ప్రశాంతంగా ఆమెనైపు చూశాడు వాసుదేవుడు. మెల్లగా నోరు తెరచి చూపాడు. యశోదామాత దిగ్భ్రాంతి చెందింది. విశ్వమంతయూ ఆతని నోటియందే గోచరించుచున్నది. భూమి, ఆకాశము, అంతరిక్షము, సూర్యచంద్ర నక్షత్రాదులు, పర్వతాలు, నదులు, సప్త సముద్రాలు, అరణ్యాలు, ఎడారులు, యశోదతోపాటు చరాచర భూత ప్రపంచ మంతయు కన్పించుచున్నది. ఆ దృశ్యమును చూసి భయకంపితురాలైన యశోద కనులు మూసుకున్నది. కళ్ళు తెరిచేటప్పటికి మధ్యాహ్నకాలము కాంతి క్రిష్ణయ్య వయ్యారంగా నిలబడి ఒక చిరునవ్వు చిందించాడు. "నీ ఎదుట అతి సామాన్యంగా గోచరించే నీ బిడ్డ సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూప" మని మందహాసము ద్వారా తెలియజేశాడు. ఆనాడు శ్రీకృష్ణుడు యశోదామాతపై చిందించిన ఆ చిరునవ్వు ఆమె హృదయంపై శాశ్వతముద్రను వేసింది.

శ్రీకృష్ణుని నర్మక్రీడలు, చిరునగవును కీర్తించిన గోపికలు గోపాలుని ప్రేమ వీక్షణమును గూర్చి తరువాత గానము చేయుచున్నారు. శ్రీకృష్ణుని ప్రేమచూడ్కులను గూర్చి తెలియజేస్తున్నారు.

వీక్షణము అనగా చూచుట. చూచుటయనగా నేత్రాలతో చూచుటయని కాదు. శరణాగతులైన వారిని బ్రోచి రక్షించుట. కరుణాపూరిత దృష్టిచే వారిని కాపాడుట. భగవంతునియందు నిండియున్న దయయే ఆయన మనలను రక్షించుటకు కారణమై యున్నది. అదియే ప్రేమ వీక్షణము.

శ్రీకృష్ణునిలో ఉన్నదంతయూ ప్రేమే. తాను కేవలము ప్రేమ స్వరూపుడు. విషమిచ్చి చంపుటకు వచ్చిన పూతనకు అమృతత్వాన్ని అందించిన ప్రేమ, నిరుపేదయైన కుచేలుని పాదములు కడిగి స్వర్గసౌఖ్యాలు కోరకనే ఇచ్చిన ప్రేమ, పండ్లు అమ్మే స్త్రీ నుండి పండ్లు పుచ్చుకొని బదులుగా రత్నమాణిక్యాల నందించిన ప్రేమ, గుఱ్ఱాలను తన స్వహస్తాలతో కడిగి శుభ్రము చేసిన ప్రేమ వర్ణించడానికి వీలులేక నిలచిపోయాయి. శ్రీకృష్ణుని ప్రేమ చూడ్కులు ఎవరిపై పడినవో వారంతా తరించారు. తరిస్తున్నారు. తరించిపోనున్నారు. తన హస్తస్పర్శచే త్రివక్రయైన కుబ్జ సర్వాంగసుందరంగా మారింది. తనకు శరణాగతురాలైన ద్రౌపది దుర్యోధనుని నిండుకొలువులో మానభంగమునుండి రక్షింపబడినది. ఇదంతయు శ్రీకృష్ణుని ప్రేమ వీక్షణము వలని విశిష్టతయే.

లక్ష్మీనిలయమైన శ్రీకృష్ణునియొక్క విశాల వక్షస్థలమును గూర్చి చివరగా ఈ శ్లోకములో గోపికలు గానము చేస్తున్నారు.

వక్షస్థలము హృదయానికి సంకేతము. భగవానుని వక్షస్థలము విశాలమైనదని చెప్పుటలో శ్రీకృష్ణుని విశాల హృదయమును గూర్చి వర్ణించుట ప్రధానమైనది. శ్రీకృష్ణుడు విష్ణుమూర్తియొక్క సంపూర్ణావతారము. అవతారము అనగా క్రిందికి దిగుటయని అర్థము. జీవుని దేవుని స్థాయికి గొనిపోవుటకు దేవుడు జీవుని స్థాయికి దిగుటయే అవతార విశేషము. శ్రీకృష్ణుని అవతారములో విశాల హృదయము, జీవకారుణ్యము నిండియున్నది. శ్రీకృష్ణుడు ప్రేమమూర్తి. దీనులను రక్షించుటయందే తన జీవితమంతయూ గడిచింది. తాను సదా వినమ్రుడు. తాను యోగేశ్వరుడై యుండికూడా అర్జునుని రథచోదకుడుగా వెళ్ళడానికి నిరాకరించని ప్రేమమయుడు. రాజసూయ యాగమునకు పోజనైన వారి పాదములను స్వయంగా కడిగిన నిష్కామ కర్మయోగి. అట్టి శ్రీకృష్ణుని విశాల వక్షస్థలము లక్ష్మీనివాసస్థానము అని గోపికలు కీర్తిస్తున్నారు. లక్ష్మి అనగా ఐశ్వర్యమని భావము. ఎవని హృదయమైతే విశాలమవుతుందో వారి హృదయములో ఆధ్యాత్మిక ఐశ్వర్యము అనగా ఆత్మజ్ఞానము భాసిస్తుందని భావము.

శ్రీకృష్ణుని నర్మక్రీడలు, చిరునగవు, ప్రేమ వీక్షణము, శ్రీనిలయమైన విశాల వక్షస్థలము గోపికల మానసములలో తీవ్రకోరికను కల్గించి మనసును మోహములో ముంచుచున్నవని గోపికలు ఈ శ్లోకంలో గానం చేస్తున్నారు.

వ్రజవనౌకసాం వ్యక్తిరఙ్గ తే వృజినహన్త్ర్యలం విశ్వమంగళమ్
త్యజ మనాక్చ నస్త్వత్ స్పృహాత్మనాం స్వజనహృద్రుజాం యన్నిషూదనమ్ 18

భావము:- కృష్ణా! నీ సాక్షాత్కారము వ్రజవాసుల దుఃఖమును హరించునదియై యున్నది. విశ్వమంగళకరమై యున్నది. మేము నీయందే స్పృహ గలిగియున్నారము. నిన్ను శరణుజొచ్చిన మా యొక్క హృదయ తాపములను పోగొట్టుము.

వ్యాఖ్య

దుఃఖమును ఏ వ్యక్తీ క్షణకాలము భరించలేడు. అయినను సదా దుఃఖము లోనే మునిగియుంటాడు. తనలో ఎన్నో కోరికలున్నాయి. తపనలున్నాయి. వేరువేరు వాంఛలు అంతఃకరణను ఛిద్రంచేస్తున్నాయి. అసంఖ్యాకమైన వాసనలు మనోఫలకంపై నాట్యం చేస్తున్నాయి. ఇవే క్లేశములు. మానవుని నిరంతరము శోకానికి ఆహుతిచేసే విషసర్పాలు.

భరించలేని ఈ దుఃఖమయ పెనుగాలుల నుండి బయటపడాలని ప్రతివ్యక్తి ప్రయత్నిస్తున్నాడు. విడుదలను పొందుటకు సదా యత్నిస్తూనే యున్నాడు. ఈ విడుదలయే మోక్షము. ప్రతివ్యక్తి ఏదో ఒక సమయంలో ఈ మోక్షేచ్ఛను తీవ్రంగా కల్గియుంటాడు. కానీ ఆ ముముక్షుత్వము ఎక్కువకాలం నిలువదు. ఇంద్రియములచే బలవత్తరముగా ఆకర్షింపబడి మిథ్యాజగత్తు అందించే మతాబులకాంతి లాంటి సుఖాలలో తేలియాడుకుంటుంది. అయినను ఆ కోరిక అంతటిలో ఆగదు. మళ్ళీ తలెత్తుతూనే యుంటుంది. దాని వెనుక విచారము చోటుచేసుకుని యుండుటయే కారణము.

వర్షధారనుండి వస్తున్న ప్రతి నీటిబిందువు తనలో ఒక వెలితిని, వియోగాన్ని పొందియే యున్నది. తాను ఎక్కడనుండి కదలినదో ఆ చోటుకు తాను దూరమై కొనసాగుతున్నదనే బాధ యున్నది. తిరిగి ఆ చోటును చేరడానికి తీవ్రప్రయత్నము చేయుచున్నదై యున్నది. తాను ఒక్క నీటిబిందువైనను, అసంఖ్యాకమైన నీటిబిందువులతో కలసి వర్షధారగా క్రిందికి దిగి, చెట్లగుండా, పుట్టలమీదుగా, రాళ్ళను దాటుకుంటూ, ఇసుకను తోసుకుంటూ చివరికి తన స్వరూపమైన నదిలో కలసిపోవుచున్నది. అదియే తనకు శాంతిధామం. అంతవరకు పడ్డ బాధలకు తిరోగమనం. అయితే శాంతిధామమైన నదిని చేరినంతవరకు పొంగివస్తున్న సుఖదుఃఖాలను, హెచ్చుతగ్గులను సహిస్తూ, భరిస్తూ నడక సాగించాలి. అలా నడక సాగించునపుడు కూడా తనకు ప్రశాంతత కలగాలంటే తాను నదియనెడి భావముండాలి. అంతేగాని విలపిస్తున్న నీటిబిందువు తానని భావించకూడదు. అలా భావించడము వలన దుఃఖము దూరముకాదు.

అలాగే జీవులందరూ చైతన్యమునుండే ఆవిర్భవించారు. అందుచేత చైతన్యమును చేరేవరకు గాని సుఖం లభించదు. ఇలా చైతన్యము కొరకు అడుగులు వేసే దారిలో ఎన్నో అడ్డంకులు, బాధలు, యాతనలు. వాటిని సహిస్తూ నడక సాగించాలి. నీటి బిందువు నదిని

చేరి, శాంతిని పొందినట్లు జీవులు చైతన్యమును చేరి, ప్రశాంతత ననుభవించాలి. ప్రశాంతతను పొందే లోపల కలుగు సంసారిక బాధలు మనిషికి జీవత్వాన్ని ఆపాదిస్తున్నాయి. తాను జీవుడు కాదని, సకలమునకు ఆధారమైన చైతన్యమే తానని భావిస్తూ యాత్ర సాగించినంత వరకు క్లేశములు దరికిరావు. జీవభావంతో నడక సాగించువానిని సర్వక్లేశములు చుట్టుముట్టి యుంటాయి.

కనుక సంసారమనేది మనసులోనే యున్నది. భగవాన్ రమణమహర్షులవారిని ఒకభక్తుడు ప్రశ్నించాడు: "భగవాన్! సన్యాసి సామాజిక ప్రపంచములో నివసించవచ్చునా?" అని అడిగాడు. మహర్షి చిరునవ్వు నవ్వి "తను సన్యాసియని భావించినంతవరకు తాను సన్యాసికాడు. నేను సంసారినని చింతించనంత వరకు సంసారియు సంసారికాడు. పైపెచ్చు అతడే నిజమైన సన్యాసి" అన్నారు.

కనుక బంధమోక్షాలకు మనసేకారణము. సమస్త క్లేశములు మనసులోనే యుండును. ఆత్మదర్శనం కలగగానే మనసు నశించును. మనసు నశించగానే మనోజనిత వికారములు, క్లేశములు అదృశ్యమవుతాయి. అందుచేతనే శ్రీకృష్ణుని సాక్షాత్కారము సమస్త క్లేశహారమని గోపికలు తెలియజేయుచున్నారు.

సమస్త క్లేశహారమైన శ్రీకృష్ణుని సాక్షాత్కారము విశ్వమంగళప్రద మని తరువాత తెలియచేయుచున్నారు.

విశ్వనాథుని వ్యక్త చైతన్యమే విశ్వము. విశ్వమునందున్న విశ్వాత్మయే చైతన్యము. చైతన్యమునుండియే విశ్వము తయారైనది. విశ్వము చైతన్యము కన్నా అన్యముకాదు. విశ్వమునకు ఉపాదాన నిమిత్త కారణాలు చైతన్యమే అయియున్నది. విశ్వమును విశ్వనాథుని శరీరముగా దర్శించడమే మంగళప్రదము. విశ్వము విశ్వముగా మిథ్య విశ్వము విశ్వేశ్వరుడుగా సత్యము.

జగదీశ్వరుని ప్రేమించేవాడు జగత్తును ప్రేమించగలడు. భగవంతుని ప్రేమించి, విశ్వమును ద్వేషించేవాడు యథార్థానికి భగవంతుని ప్రేమించడంలేదని భావము. మనము ప్రపంచాన్ని ప్రేమించలేక పోతున్నాము. కారణం మనకు పరమాత్మయెడల భక్తిలేదు. ఇది నిశ్చయము. జగదీశ్వరుడే జగద్రూపముగా యున్నప్పుడు జగత్తును ద్వేషించడమంటే జగదీశ్వరుని ద్వేషించుటయునే భావము.

మనము ప్రేమించేది ప్రపంచాన్ని కాదు. ప్రపంచమందించే సుఖాలను మాత్రమే. ప్రపంచము సుఖాల నందించినంతవరకు దానిని ప్రేమిస్తాము. అదే ప్రపంచము దుఃఖాలను కల్గించగానే దానిని విమర్శిస్తు నిలుస్తాము. ప్రపంచము భగవంతునికన్నా అన్యముకాదని, జగత్తులో నిండియున్నదంతా జగదీశ్వరుని చైతన్యమేనని గ్రహించునప్పుడే మనము ప్రపంచాన్ని నిజంగా ప్రేమించగలము.

ఇట్టి దృష్టి విశ్వ మంగళప్రదము. ఇది సృష్టి సందర్శనము వలన కల్గుతుంది. అంతటా వాసుదేవుని అనంత చైతన్యమునుగూర్చి ఎప్పుడయితే తెలుసుకున్నామో

నిండియున్నదికూడా ఆ చైతన్యమేనని గ్రహించి సంతృప్తి చెందుతాము. అట్టి సమదర్శనము కల్గించు శ్రీకృష్ణుని సాక్షాత్కారము విశ్వ మంగళప్రదమని తెలియచేస్తున్నారు.

సమస్త క్లేశహరము, సర్వ మంగళప్రదమగు శ్రీకృష్ణుని సాక్షాత్కారము వ్రజ జన హృదయతాపహారమని తరువాత గోపికలు గానం చేస్తున్నారు.

వ్రజ సమ తీరథోపు నహీధామ్
యాత్రజమే పరమేశ్వర హుతో
సుధరే సుందర నామ్

"వ్రజపురముతో సమానమగు స్థానము వేఱొకటి లేదు. ఈ వ్రజపురమున వెల్లరు పరమేశ్వరుని సుందర నామమును స్మరించి తరించిరి" అని భక్త నాగరిదాసు గానం చేశాడు.

శ్రీకృష్ణుడు వ్రజ జనవల్లభుడు. వ్రజ జనభూషణుడు. వ్రజపురమున వెలసిన శృంగార మూర్తి. గోపభామల మాధుర్యదీప్తి. వ్రజవాసులు శ్రీకృష్ణుని వదలి క్షణకాలం జీవించలేరు. శ్రవణ, స్పర్శ, దర్శనాలాప విశేషణాదులతో భగవానునితో గూడి కాలము గడుపుటయే వారి జీవనపరమావధి. శ్రీకృష్ణుడు దగ్గరకు రాగానే అమితానంద భరితులయ్యేవారు. కృష్ణుడు దూరంకాగానే ఏడ్చేవారు. శ్రీకృష్ణుని పిలుచుచు కేకలేసేవారు. కృష్ణుని మురళీవాదం వినపడగానే గానం చేసేవారు. నృత్యం చేసేవారు.

హస త్య థో రోదితి రౌతిగాయ త్యున్మాద వన్నృత్యతి లోక బాహ్యః

"శ్రీహరి పొందులో రుచి తెలిసిన వ్యక్తి నవ్వును, ఏడ్చును, అఱచును, పాడును, ఉన్మత్తునివలె లోకబాహ్యుడై నృత్యమొనరించును" అని భాగవతము భక్తుని హృదయ పారవశ్యమును గూర్చి కీర్తించినది.

అట్టి వ్రజవాసుల పవిత్ర హృదయతాపము, పారవశ్యస్థితిని అనుగ్రహించమని చైతన్యమహాప్రభువు, మీరా, తుకారామాది భక్తులు పరితపించారు.

నయనం గలదశ్రుధారయా, వదనం గద్గద రుద్ధయా గిరా
పులకైర్నిచితం వపుః కదా, తవనామగ్రహణే భవిష్యతి

"హే ప్రభూ! నీ నామమును స్మరించుచుండగా నా నేత్రముల నుండి ఆనందాశ్రువులు ఎప్పుడు జాలువారునో కదా! ఆనందపారవశ్యంలో కంఠము ఎప్పుడు గద్గదమగునో కదా! నా శరీర మెప్పుడు పులకాంకితమగునో కదా!" అని శ్రీకృష్ణచైతన్య మహాప్రభువు పరితపించారు.

అట్టి పరమభక్తులైన వ్రజవాసుల హృదయ పరితాపమును శ్రీకృష్ణ సాక్షాత్కారము హరించునని గోపికలు గానం చేయుచున్నారు. భక్తుల హృదయపరితాపము శ్రీకృష్ణ సాక్షాత్కార సందర్శనము వలననే తొలగునని తెలియ జేయుచూ అట్టి అపురూప అద్భుత సాక్షాత్కారమును శరణాగతులైన మా కొనంగి, మా జన్మముల చరితార్థము చేయుమని గోపికలు శ్రీకృష్ణదేవుని గూర్చి గానం చేయుచున్నారు.

యత్తే సుజాత చరణాంబురుహం స్తనేషు భీతాః శనైః ప్రియ దధీమహి కర్కశేషు
తేనాటవీమటసి తద్వ్యథతే న కిం స్విత్ కూర్పాదిభిర్భ్రమతి ధీర్భవదాయుషాం నః 19

భావము:- ఓ ప్రియుడా! అతి సుకుమారమైన నీ చరణారవిందమును కఠినమైన మా స్తనములయందు మెల్లమెల్లగా నిడుకొందుము. అట్టి సుకుమార పాదాలతో నీవు అరణ్యములో సంచరించుచుంటివి. ఎచ్చట ఏ కఠిన పాషాణ, కంటక తరులతా గుల్మాదికములకు కంది, అవి బాధపడునోయని మా మనస్సు ఓరక వ్యథపడుచున్నది.

వ్యాఖ్య

అతి సుకుమారమైన శ్రీకృష్ణుని చరణారవింద వైభవమును గూర్చి ఈ శ్లోకంలో గోపికలు కీర్తించుచున్నారు. శ్రీకృష్ణుని పాదములు తామర పుష్పములను బోలియుండునని తెలియజేయుచున్నారు. తామర పుష్పాలలో పరిమళము, మకరందము రెండును యుండును. భగవానుని పాదములనుండియే గంగ ఆవిర్భవించినది. ఆ యాకాశ గంగయే మకరందము. శ్రీహరి పాదములు సచ్చిదానంద ప్రదములు. సచ్చిదానందమే పరిమళము.

భగవానుని పాదములనుండి ఆవిర్భవించిన గంగాదేవి నిత్యత్వానికి, శుద్ధత్వానికి ప్రతీకము. కనుక భగవానుని పవిత్ర పదసరోజముల నాశ్రయించినవారు పరిశుద్ధులై, నిత్యులై తృప్తిచెందెదరని భావము.

ఇక రెండవది పరిమళము. సచ్చిదానందమే పరిమళమని ఆదిశంకరులవారు షట్పదీస్తోత్రములో తెలియజేసియున్నారు. ఎప్పుడూ ఉండటము "సత్", అన్నీ తెలియడము "చిత్", ఎల్లప్పుడు హాయిగా యుండుటయే "ఆనందము." ఈ మూడు ఆత్మలక్షణాలు. ఆత్మకు మరియొక పేరు సచ్చిదానందము.

శ్రీకృష్ణుని సుకుమార పాదములు పవిత్రతకు, ఆత్మకు సంకేతములు. ఆనందము ఆత్మయందే యున్నదని గ్రహించినవాడు క్షణకాలమైనను శ్రీచరణాలకు దూరంకాడు.

ధౌతాత్మా పురుషః కృష్ణ పాదమూలం నముంచతి
ముక్తసర్వ పరిక్లేశః పాంథః స్వశరణం యథా॥"

"సర్వవిధ క్లేశములనుండి విముక్తుడైన బాటసారి తన గృహమును విడువనట్లు పాపరహితుడగు మానవుడు శ్రీకృష్ణపాదమూలమును విడువడు" అని శ్రీచరణ వైభవమును భాగవతము కీర్తించుచున్నది.

అట్టి సుకుమారమైన శ్రీకృష్ణుని పాదములను కఠినమైన తమ స్తనముల యందు మెల్లగా నిడుకొందుమని కీర్తించుచున్నారు గోపికలు.

స్తనప్రదేశము హృదయమునకు సంకేతము. భగవానుని పాదములు ఆత్మకు [illegible]. కనుక స్తనములపై పాదముల నుంచుకొనుట యనగా హృదయమునందు [illegible] అత్మైక్యము చెందుటయని భావము. ఐతే తమ స్తనములు కర్కశమైనవని. అందుచే

సుకుమారమైన శ్రీకృష్ణుని చరణ పంకజములను తమ హృదయములపై మెల్లగా నిడుకొందుమని గోపికలు గానం చేస్తున్నారు.

అజ్ఞానముచే ఆవరింపబడిన మానవుడు అభిమాన అవివేకాది అనిత్య భావాంతరంగుడై, రాగద్వేషాది సంకుల చిత్తుడై కర్మచక్రమున పరిభ్రమించుచున్నాడు. నానావరణములతో కల్మషమైన మానవ హృదయము కఠిన పాషాణము లాంటిది. అంధకార బంధురమైన పాషాణహృదిలో భగవంతుని పాదజ్యోతిని ప్రకాశింప జేసుకొనవలెను. అజ్ఞానాంధకారము అదృశ్యమై పోవును. అట్టి జ్యోతిని మెల్లగా ప్రకాశింప జేసుకోవాలి. అందుచేతనే గోపికలు స్వామి పాదములను నెమ్మదిగా తమ స్తనములయందు నిడుకొందుమని కీర్తించుచున్నారు.

శుష్కపాండిత్యాలకు, తర్కవివాదాలకు భగవానుడు లభ్యంకాడు. అలా తర్కించేవాని మనుగడకు కూడా ఆత్మయే ఆధారమై యున్నది [illegible] దేవుని నిరసించి, నిరాకరించ గలడేమో గాని నిరాకరించే తనను [illegible]. అట్టి ఆత్మ సాక్షాత్కారము, అనుభవరూపము కనుక ఆత్మను కర్మతో గాని, మేధస్సుతో గాని పొందలేము. అనుభవమునకు సంబంధించిన విషయము గనుక అతి జాగ్రత్తగా గ్రహించాలి. వివాదాలు చేసేవారికి మిగిలేది వడగాపులే, అంతఃకరణను శుద్ధిచేసుకుని, ప్రశాంతంగా అనుష్ఠానం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఆధ్యాత్మిక రంగములో ఆవేశము అనర్థదాయకం. అనాసక్తి భావమే క్షేమదాయకం. అందుచేతనే [illegible] శ్రీకృష్ణుని దివ్యపాదారవిందమును మెలమెల్లగా తమ స్తనముల యందు నిడుకొందుమని గోపికలు కీర్తించుచున్నారు.

శనైశ్శనైరుపరమేద్బుద్ధ్యా ధృతి గృహీతయా,
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్

"మనస్సును ఆత్మయందుండునట్లుగాజేసి, దేనినీ చింతనము చేయక ధైర్యముచే గ్రహింపబడిన బుద్ధిచేతనే మెలమెల్లగా ఉపరతిని పొందవలయును" అని శ్రీకృష్ణపరమాత్మ గీతా 6వ అధ్యాయంలో తెలియచేసారు.

ఇలా పొందిన ఆత్మానుభవమును స్థిరపరచుకోవాలి. మనస్సు ఎలా ఆత్మయందు స్థిరమై యుండునట్లు చూసుకోవాలి. మనస్సు ఎప్పుడూ బహిర్ముఖమవుతూనే యుంటుంది. బహిర్ముఖమయ్యే మనసు బాధలకు గురియవుతుంది. అరణ్యములో సంచరించు శ్రీకృష్ణుని కోమల పాదారవిందము కంటక తరులతా గుల్మాదికములకు కందిపోవునేమో యని గోపికలు చింతించుటలోని అంతరార్థ మిదియే. బాహ్యజగత్తు కంటకములకు నిలయము. ఆటంకములకు ఆలయము.

ఈ ప్రపంచమొక భోగశాల. అంతేకాదు, రోగాలకు నిలయము [illegible] రోగాలొస్తే చికిత్స వైద్యశాల. ఇచట మనుషులు [illegible]లతో నిండిన మాయాపరి[illegible] [illegible] వదలిపెట్టని [illegible].

విసుగు విరామం లేకుండా దుఃఖానుభవములను పంచే ఈ ప్రపంచములో తగులుకొని వ్యథ నొందకుండా సదా ఆత్మయందు స్థిరమై యుండాలి.

శ్రీకృష్ణుని విరహబాధను భరించలేక తమ ఆవేదన నంతా ఈ గోపీగీతం ద్వారా తెలియజేసిన గోపికలు ఈ చివరి శ్లోకంలో తమ స్తనములయందు శ్రీకృష్ణుని పాదపంకజము నుంచుకొని తృప్తిచెంద దలచియున్నారు. తమ హృదయమును సంపూర్ణముగా శ్రీకృష్ణుని చరణకమలములకు సమర్పించినారని భావము. భగవంతునిపై వారికున్న పరమోత్కృష్టమైన భక్తికి ఇది నిదర్శనము.

శ్రీకృష్ణుని దివ్యదర్శనమునకై పరితపించుచు పరమభక్తులైన గోపికలు కీర్తించిన గోపీగీతం ఇంతటితో సమాప్తమైనది.

ఉపసంహృతి

గోపికల విరహతాపాన్ని, భగవానుని వదలి క్షణమైనను జీవించలేని గోపికల పరాభక్తిని అర్థంచేసుకొన్న శ్రీకృష్ణభగవానుడు వారిమధ్య ప్రత్యక్షమవుతాడు. శ్యామసుందరుని గాంచిన గోపికల హృదయాలు నిండుచంద్రుని పండువెన్నెలను చూసి పొంగులిడు సాగరములవలె పరవశించి పొంగుతాయి.

ఒకగోపిక పరుగెత్తుకుంటూవచ్చి తన రెండుచేతులతో స్వామి హస్తమును గట్టిగా పట్టుకొని ముద్దు పెట్టుకుంటుంది. మరొక గోపిక స్వామి మరొక హస్తమును పట్టుకొని నిమురుతూ హృదయములో భక్తి పొంగిపొరలుచుండ స్వామి హస్తముతో తన నేత్రాలను కప్పుకుంటుంది. మరొక గోపిక ఆనందంతో పరుగెత్తి స్వామి పాదాలపై బడి, మృదువైన స్వామి చరణకమలములను హృదయానికి హత్తుకుంటుంది. మరొక గోపిక అడుగు ముందుకువేయ నశక్తురాలై స్వామి ముఖారవిందమును దర్శిస్తూ నిలబడిపోతుంది.

శ్రీకృష్ణుని దివ్య దర్శనానుభూతిలో గోపికల మానసములయందు నిండి యున్న విషాదమంతయు పటాపంచలయినది. గోపికలందరు స్వామి చుట్టు గుమిగూడి, స్వామి దివ్యపాదారవిందములకు పూజ సల్పిరి. "కృష్ణా! ఇక మమ్మల్ని విడిచివెళ్ళకు. నిన్ను వదలి మేము జీవించలేము" అని గోపికలు ప్రార్థించారు.

శ్రీకృష్ణభగవానుడు దరహాసవదనుడై "పుణ్యజీవులైన ఓ గోపికలారా! భక్తుల హృదయాలలో వసించు నేను భక్తులకెలా దూరం కాగలను? కానీ అప్పుడప్పుడు అదృశ్యమవుతుంటాను. భక్తోద్ధరణకే అలా చేస్తాను. ఒక పేదవానికి విలువైన రత్నములు దొరికి మళ్ళీ అవి కనబడకుండా పోయినచో వాడు ఆ రత్నములను గూర్చి చింతించులాగున, నేనుకూడా భక్తులకు కనుపించకుండా అదృశ్యమై వారిలోని భక్త్యావేశమును, విరహతాపమును కదలించి నాకు అత్యంత సన్నిహితులుగా చేసుకుంటాను. అదే నేను జరుపు "దాగుడుమూతలు క్రీడయందలి అంతరార్థము" అని గోపికలను ఓదార్చి, వారి హృదయములు ఉప్పొంగునట్లు రాసక్రీడ జరుపుటకు ప్రారంభించాడు.

అఙ్గనా మఙ్గనా మన్తరే మాధవో, మాధవం మాధవం చాన్తరేణాఙ్గనా
ఇత్థమా కల్పితే మణ్డలే మధ్యగః, సఞ్జగౌ వేణునా దేవకీ నన్దనః

"ఇద్దరు గోపభామల మధ్య శ్రీకృష్ణుడును, తన రెండు రూపాలమధ్య వొక్కొక్క గోపభామినియు మండలముగా తీరి నిలిచి, వారి నడుమగూడా తాను వేరొక్కడై నిలచి శ్రీకృష్ణుడు చక్కగా గానము చేసె" నని లీలాశుకులవారు శ్రీరాసక్రీడాష్టకంలో తెలియజేసి యున్నారు.

శ్రీకృష్ణుని దివ్య లీలామృతసారమును పానము చేయు జనులెల్లరు అమృతత్వమును పొంది తరించెద రనుట నిర్వివాదాంశము. శ్రీకృష్ణ పదసరోజములను చిత్తమున నిడుకొని కీర్తించి, ధ్యానించి, తరించెదరుగాక!

సుదర్శనుని శాపవిమోచనము

అది శివరాత్రి పర్వదినము. నందాది గోపులు శివజాగరణలో కాలమును సద్వినియోగ పరచుకొనుటకు అంబికావనమును చేరారు. సరస్వతీనదిలో స్నానమాచరించినారు. పార్వతీ పరమేశ్వరులను ఆరాధించారు.

మహాదేవుడగు పరమశివుడు ప్రసన్నుడు కావలెనని వాంఛించిరి. బ్రాహ్మణులకు గోవులను, సువర్ణములను, వస్త్రములను ఒసంగిరి. వ్రతధారులైన నందాది గోపులు జలోపవాసము చేయుచు ఆ రాత్రి యంతయు సరస్వతీ నదీతీరమునందే కాలమును గడిపిరి.

నిండుజీవితాన్ని ప్రసాదించేందుకు కదలివచ్చునవియే పండుగలు. పండుగనాడు పరమాత్మ ధ్యానమునందే కాలమును వెళ్ళబుచ్చవలెను. అందుచేతనే నందాదిగోపులు సరస్వతీ నదీతీరము చేరిరి.

పండుగనాడు కుటుంబీకు లందరు ఇంటికి చేరి, సంబరములు జరుపుకొనవలెనని లౌకిక ఆచారము. కానీ పండుగనాడు ఇండ్లను వదలి ఆశ్రమ ప్రాంతములందుగాని, నదీతీరములందుగాని, పుణ్యక్షేత్రములయందుగాని కాలమును సద్వినియోగ పరచుకోవాలి. గృహములందు ప్రశాంతవాతావరణము లభించుట బహు దుర్లభము. నదీతీరములయందు సాత్విక వాతావరణము నిండియుండుట వలన జప ధ్యానాదులు సక్రమముగా జరుగును. అందుచేతనే నందాదులు శివరాత్రి పర్వదినాన సరస్వతీ నదీతీరమును చేరిరి.

మహాదేవుడు ప్రసన్నుడు అగుగాక యని సంకల్పించిరి. దైవారాధన యందు ఇది గమనించదగిన విషయము. ప్రాపంచిక విషయ భోగములకొరకు భగవంతుని ధ్యానించరాదు. అవి యన్నియు క్షణికములు, అనిత్యములు. భగవత్సేవ భగవంతుని పొందేందుకే అయి యుండాలి. పరమాత్మ ప్రసన్నుడైన వానికి లేనిదంటూ ఉండదు. పరమాత్మ అనుగ్రహముతో కైవల్యము సిద్ధించును. భగవదనుగ్రహం ఎలా కలుగుతుంది? భక్తిద్వారానే కలుగుతుంది.

మనము భక్తులను తృప్తి పరచినపుడే భగవంతుడు మనలను తృప్తిపరచును. అందుచేత నందుడు బ్రాహ్మణులకు విరివిగా దానములొసంగెను.

ఆ రాత్రి నందాదులు సరస్వతీ నదీతీరమునందే కాలమును గడిపిరి. అర్ధరాత్రి సమయాన ఆకలిగొన్న ఒక మహాసర్పము అరుదెంచి, నిద్రించుచున్న నందుని పట్టుకొన్నది.

శివజాగరణలో తమోగుణ ప్రధానమైన నిద్ర ఆవరించకూడదు. నందుడు నిద్రించి గొప్ప తప్పు చేసినవా డాయెను. చాలామంది ఆధ్యాత్మిక ఉపన్యాసములను వినవలెనని వచ్చుదురు. అడుగిడగానే ఎచ్చట స్తంభమున్నదా యని అన్వేషించుచుందురు. స్తంభము నానుకొని కూర్చుందురు. ఆ తరువాత సరేసరి.

భగవన్నామము గానముచేయు ప్రదేశములయందు ఎవరయితే నిద్రించుచుందురో అట్టివారు కాలసర్పముచే మ్రింగబడుదురు. అప్పుడు నందుడు భయముతో విచలితుడగుచుండెను. గోపాలురు అది చూచి మండుచున్న కట్టెలతో సర్పమును గొట్టసాగిరి. అయినను నందమహారాజును ఆ సర్పము విడిచిపెట్టలేదు. సామాన్య మానవులగు ఈ గోపాలురు ప్రయత్నించినను తనను రక్షించలేరని నందుడు గ్రహించెను. శ్రీకృష్ణుడే తనకు శరణ్యమని భావించెను.

స చుక్రోశాహినాగ్రస్తః కృష్ణ కృష్ణ మహానయమ్
సర్పోమాం గ్రసతే తాత ప్రపన్నం పరిమోచయ....

సర్పము చేత పట్టుబడిన నందమహారాజు "కృష్ణా! కృష్ణా! " నేను మహాసర్పగ్రస్తుడనై యున్నాను. నిన్ను శరణుజొచ్చుచున్నాను. నన్ను ఉద్ధరింపుము" అనెను.

అది విని శ్రీకృష్ణుడరుదెంచెను. తన ఎడమ పాదముతో ఆ సర్పమును తన్నెను. నందమహారాజు విడువబడెను. ఆ సర్పము సర్పదేహమును విడచి గంధర్వుని రూపమును పొందెను.

సత్త్వగుణప్రధానుడై భగవన్నామమును గానము చేయవలసిన సమయమున, తమోగుణముచే ఆవరించబడి నిద్రించినవాడు కాలసర్పము వాతబడును. అట్టి వారిని బంధుజను లెవ్వరు ఉద్ధరించలేరు. కృష్ణనామమే జీవుని కాలుని బారినుండి తప్పించి రక్షించును. నందబాబా శ్రీకృష్ణునికి శరణాగతుడై "కృష్ణా! కృష్ణా!" అని పిలువగానే శ్రీకృష్ణుడు వచ్చి రక్షించెను.

ఇది నందుని గాథయని భావించరాదు. ఇది మనందరి కథయే. ఈ సత్యము నెరిగి సదా భగవన్నామామృతపాన చిత్తులమై తరించాలి.

శ్రీకృష్ణుని పాదస్పర్శచే పునీతమైన సర్పము గంధర్వ రూపమును పొందెను. శ్రీకృష్ణునకు నమస్కరించెను. అంతట శ్రీకృష్ణుడు ఆ గంధర్వునితో "ఇంత శోభాయమానుడవగు నీకు సర్పజన్మ ఎలావచ్చినది?" అని ప్రశ్నించెను. ఆ గంధర్వరాజ శ్రీకృష్ణునికి సమాధాన మొసంగెను.

"దివ్యాత్మా! నేను సుదర్శనుడనువాడను. విద్యాధరుడను. ఒకనాడు విమానమునెక్కి ఆకాశమున విహరించుచుంటిని. ఆ [illegible] అంగిరస గోత్రీయులు, కురూపులు నైన మహర్షులను జూచితిని. గూనిగల [illegible] మహర్షికూడా వారిలో యుండెను. అతనిని చూడగానే నేను నవ్వును ఆపుకోలేక పోతిని. అతనిని పరిహసించితిని. నేను రూపవంతుడను అనెడి గర్వమే నాచే అలాంటి దుష్కృత్యమును చేయించినది. ఆ మహర్షి హృదయం కలత చెందినది. "ఓరీ! దురాత్మా! ఏ రూప సౌందర్యము కారణముగా నీవు మహాత్ముల హృదయాలను కలతపెట్టితివో ఆ రూపము నీకు దూరమై, ఏ రూపమును చూడగానే జనులు భయముతో దూరముగా వెళ్ళుదురో, లేదా కొట్టి చంపుదురో అట్టి సర్పజన్మ నీకు లభించును" అని శపించెను. మహాత్ముల శాపమును ఎవరు వారించగలరు? అందుచేత నేను ఆ మహానుభావుని పాదాలపై బడి విలపించితిని. నా విలాపమును గాంచిన మహర్షికి నాపై జాలి కలిగెను. "అచిరకాలమున మాధవుడు జన్మించును. ఆతని పవిత్రపాదముచే తన్నబడి, నీవు శాపవిమోచనము పొందెదవు" అనెను. "పరమాత్మా! ఆ మహాత్ముని శాపమే నన్ను ఉద్ధరించినది. నీ దివ్యమంగళ విగ్రహమును గాంచు భాగ్యమును కల్పించినది" అనెను.

ప్రపన్నోఽస్మి మహాయోగిన్ మహాపురుష సత్పతే
అను జానీహి మాం దేవ సర్వలోకేశ్వరేశ్వర!

"యోగీశ్వరా! మహాపురుషా! సత్పతీ! నేను నీకు ప్రపన్నుడను. సర్వలోకేశ్వరేశ్వరా! నిష్క్రమించుటకు నాకు అనుమతి నిమ్ము!" అనెను. శ్రీకృష్ణుని అనుమతిని పొందెను. అనుగ్రహమును బడసెను. ఆనందముతో అంతర్హితుడయ్యెను.

సుదర్శనుని శాపవిషయము మనకు అర్థమయినదా? కదా! మహాత్ములను నిందించువారు సర్పములై జన్మింతురు. దేహభ్రాంతికి లోనైనవారు విషసర్పములై దుఃఖపూరిత జన్మను ననుభవింతురు.

కానీ ఈ ఘట్టమునందు గమనించదగిన అత్యంత రమణీయమైన విషయమున్నది. ఈ ఘట్టములో ఇరువురు వ్యక్తులు ముఖ్యులు. మొదటివాడు మహాత్ములను నిందించిన సుదర్శనుడు. రెండవ వ్యక్తి బ్రాహ్మణులను శివరాత్రి పర్వదినాన సత్కరించిన నందుడు. మహాత్ములను నిందించుటవలన, పరిహసించుట వలన కలిగిన పాపము మహాత్ములను పూజించుటవలన, కీర్తించుటవలన ప్రక్షాళనమగును. అందుచేతనే

లభ్యతేఽపి తత్కృపయైవ

"మహాత్ముల సహచర్య భాగ్యము భగవత్కృపవలననే కలుగును" అని నారదమహర్షి తెలియజేసినాడు.

నందబాబా హృదయం శాంతించెను. గోపాలురందరూ సంతసించిరి. నందాదులు అంబికావనమున మూడురాత్రులు వసించి, వ్రజపురము చేరిరి.

శంఖచూడుడు

యమునాతీరమున మనోహర మనోజ్ఞమూర్తియైన శ్యామసుందరుడు మోహన వంశీరవమును గానమొనర్చుచుండెను. ఆ మంజులగానము గోపికల వీనులలో ప్రవేశించెను. వారిని సమ్మోహితులను చేసెను. పరవశింపజేసెను. వేణుగానము గోపికలను ఉన్మత్తులుగా చేయును.

మున్‌వైరాగి భాయో సున మురళీ కీ తన్

"శ్యామసుందరుని మురళీరవము నాలకించిన నాచిత్తము పిచ్చిదై పోయింది" అని నందదాసు గానంచేశాడు.

నామ సమేతం కృత సంకేతం వాదయతే మృదువేణుమ్

పేరుపెట్టి పిలుచుచున్నట్లు, తన సంకేత స్థలమును తెలియజేయుచున్నట్లు శ్రీకృష్ణుడు యమునాతీరమున మురళీనాదము చేయుచున్నాడు అని గానం చేశాడు జయదేవ మహాకవి.

వంశీరవమును విని వ్రజాంగన లందరు యమునా తీరమును చేరిరి. శ్రీకృష్ణుని చుట్టుముచేరి పరమాత్మ కళ్యాణ గుణములను గానము చేయసాగిరి. ఆ తరువాత శ్రీకృష్ణుడు మురళీగానము సాగించెను. శ్రీకృష్ణుని మురళీగానమును విని గోపికలు మూర్ఛితులైరి.

గోప్యస్తద్గీత మాకర్ణ్య మూర్ఛితా నావిదన్నృప
స్రంసద్దుకూల మాత్మానం స్రస్తకేశస్రజం తతః

"ఆ మంజుల గానమును ఆలకించి గోపికలు మూర్ఛితులైరి. ఆ కారణముగా వారు ధరించిన వస్త్రములు తొలగిపోయినవి. కేశములనుండి పూలు జారినవి."

ఇదియే భగవద్భక్తిలో పరాకాష్ఠ. భగవద్గుణ శ్రవణము నందును, కీర్తనమునందును అట్టి పారవశ్యము కలుగవలెను. అప్పుడే మనస్సు కృష్ణకథలో రమించినదని భావము. గోపికలు అట్టి పారవశ్యమును అనుభవించిరి.

అదే సమయానికి కుబేరునియొక్క అనుచరుడు శంఖచూడు డనువాడు అక్కడికివచ్చెను. బలరామకృష్ణుల రక్షణలోయున్న గోపాంగనలను జూచి మతిచలించి, వారిని బలవంతముగా లాగికొని పోవుచుండెను. గోపాంగనలు బిగ్గరగా విలపింపసాగిరి. అంతట ఆ గోపికలు "కృష్ణా! రామా!" అంటూ ఏడ్వసాగిరి.

క్రోశన్తం కృష్ణ రామేతి విలోక్య స్వపరిగ్రహణమ్

ఆపదలు వచ్చినపుడు అచ్యుతుని తలచుకొనవలెను. సుఖాలలో పరమాత్మ స్ఫురణకు అందదు. కనీసం కష్టాలలోనైనా భగవానుని స్మరించుదురని భగవానుడు

బాధలను, వ్యాధులను అందించును. కానీ బాధలలో కూడా అసంస్కారులు "అబ్బ....అయ్యో!" అందురేగాని కృష్ణా! రామా! అని అనరు. గోపికలు ఉత్తమ సంస్కారులు గనుక భగవన్నామము నుచ్చరించగలిగిరి.

మాభైష్ట త్యభయారావౌ శాలహస్తౌ తరస్వినౌ

"మాభైష్ట" మీరు భయపడకండి అని అభయవాక్కు నందించుచు, బలరామకృష్ణులు సాలవృక్షములను పట్టుకుని పరుగిడిరి. శంఖచూడుడు బలరామకృష్ణులను జూచి పారిపోసాగెను. బలరాముడు గోపాంగనలవద్ద రక్షకుడుగా నుండగా శ్రీకృష్ణుడు శంఖచూడుని అనుసరించి పరుగిడెను. పట్టుకొని వధించెను. వాని శిరమున ప్రకాశించు మణిని తెచ్చి, బలరామునికి కానుకగా సమర్పించెను.

శంఖచూడుడు కుబేరుని అనుచరుడు. అనగా సిరిగలవాడు. సిరిచేరిన వారికి దుర్గుణముల చెలి తప్పదు. ధనగర్వముచే కన్నులు గానక శంఖచూడుడు గోపాంగనలను తీసుకొనిపోయెను. కాంచనము చేరినచోట కాంతదృష్టి కలిగే అవకాశము కలదు.

కామినీ కాంచనములకు దాసుడైనవాడు పక్షులను కూడా శంఖచూడునివలె బాధించును. అట్టివారు చివరకు వినాశమునే పొందుదురు.

ధనము చెడ్డదికాదు. ధనాశ చెడ్డది. కాంచనము సత్కర్మల కొరకు వినియోగపడవలెనే గాని దుష్కర్మలకు నాందివచనం పలుకకూడదు.

ధనాశకు లోనై దుష్కర్మలాచరించిన శంఖచూడుని శ్రీహరి వధించెను. వాని శిరముపై నున్న మణిని బలరాముని కిచ్చెను.

ధనబలముతో విఱ్ఱవీగువాడు ధనమును శిరోధార్యముగా భావించును. ధనము శిరమున ఉండదగినది కాదు. హస్తమున ఉండదగినది. శివుడు గంగను శిరమున ధరించెను. జ్ఞానము ఎప్పుడూ శిరముపైననే ఉండాలి. మాధవుని పాదములచెంత లక్ష్మీదేవి కూర్చుని పాదములు ఒత్తుచుండును. జ్ఞానమెప్పుడూ శిరమునందే యుండాలి. ధర్మమార్గమును చరించుటను తెలియజేయు పాదములచెంత సిరి యుండెను.

అందుచేత సంపద యనునది శిరోధార్యమైన విషయమని భావించువారు దుర్మతులగుదురు. సంపద ధరించదగినది కాదు, దాన మొనర్చదగినది అని తెలియజేయుటకు శంఖచూడుని శిరముపైనున్న మణిని బలదేవుని హస్తమునందు శ్రీకృష్ణుడు ఉంచెను.

ధనబలముచే విఱ్ఱవీగువాడు దురాత్ముడైన శంఖచూడుడు. దైవబలముచే దివ్యకృత్యముల నాచరించువాడు మహాత్ముడైన బలదేవుడు. దైవమునే బలముగా కలిగినవాడు. ఏ సంపద దురాత్ముల శిరములపై నిలిచి కార్యాచరణకు కారణమగునో, ఆ సంపదే మహాత్ముల హస్తములయందు భూషణమై శోభించును.

అరిష్టాసురుని అంతమొందించుట

ఒకనాడు అరిష్టుడను రాక్షసుడు వ్రజమున కరుదెంచెను. అతడు వృషభరూపమున యుండెను. వ్రజపురమున ఆలమందలపై బడి బీభత్సం చేయసాగెను. అతడు వేయు అంకె విని కొందరు మృతరూపులై నేలబడిరి.

సీ॥ ఎవ్వనిమూఁపుర మీక్షించి మేఘంబు లద్రిశృంగం బని యాశ్రయించు
నెవ్వనిఱంకె కర్ణేంద్రియంబులు సోఁక గర్భపాతం బగు గర్భిణులకు
నెవ్వనిపదహతి నెగయు పరాగంబు లంధకారారాతి నావరించు
నెవ్వఁడు గొమ్ముల నెదిరించి చిమ్మినఁ బృథ్వీధరంబులు పెల్లగిల్లు

తే॥ అట్టి వృషభాసురేంద్రుఁ డహంకరించి వాలలత యెత్తి మెడ లంకెవైచి వేఁగ
గాలు ద్రవ్వుచు నిశిత శృంగముల సాఁచి మంద బెగడంగ గవిసె నమందుఁ డగుచు.

పశువులు ఆ అంకెవిని పారిపోయివచ్చి శ్రీకృష్ణుని పాదపద్మములను ఆశ్రయించినవి. కాపాడమని ప్రార్థించినవి. శ్రీకృష్ణుడు వ్రజవాసులెల్లరకు అభయము నొసంగెను. వెంటనే వృషభాసురుని సమీపించెను. "ఓరీ దుష్టుడా! అరిష్టాసురా! నేటితో నీ కథ ముగిసింది" అనగానే ఉగ్రాకారుడైన అరిష్టుడు తోకను పైకెత్తి ఊపుతూ, గిట్టలతో భూమిని త్రొక్కుచూ, శ్రీకృష్ణుని మీదికి ఉరికెను.

గృహీత్వా శృఙ్గయోస్తం వా అష్టాదశ పదాని సః
ప్రత్యపోవాహ భగవాన్ గజః ప్రతిగజం యథా|

అరిష్టాసురుని రెండు కొమ్ములను శ్రీకృష్ణపరమాత్మ పట్టుకొని ఏనుగు మరియొక ఏనుగును దూరముగా నెట్టునట్లు పదునెనిమిది అడుగులు వెనుకకు నెట్టెను. క్రోధోద్రిక్తుడైన అరిష్టుడు మరల దగ్గరగా అంకె వేయుచు శ్రీకృష్ణుని మీదికి వచ్చెను. అతడు సమీపమునకు రాగానే శ్రీకృష్ణుడు అతని రెండుకొమ్ములను గట్టిగా పట్టుకొని క్రిందపడవేసెను. కొమ్ములను ఒడిసి పట్టి కంఠమును నిరచెను. ఆ తరువాత అతని రెండు కొమ్ములను పీకి, వానితే గొట్టి చంపెను. అరిష్టాసురుడు మరణించెను. దేవతలు పుష్పవృష్టిని కురిపించిరి. శ్రీకృష్ణుని కీర్తించిరి. శ్రీకృష్ణుడు అరిష్టాసురుని వధించి బలరాము, గోపభామలతో కలిసి వ్రజమున కరుదెంచెను. వ్రజవాసులందరు శ్రీకృష్ణుని స్తుతించిరి.

అరిష్టమనగా అశుభము. అరిష్టాసురు డనగా అశుభమైన అవిద్యయని భావము. వ్రజపురము సుఖశాంతులతో విరాజిల్లుచుండెను. అలాగే ప్రతిమానవ హృదయము ప్రశాంతతతో నిండియుండును. వ్రజపురమున అరిష్టాసురుడు ప్రవేశించునట్లు, ప్రతి మానవ హృదయములోను అవిద్యయనెడి అరిష్టాసురుడు ప్రవేశించును. అరిష్టాసురుడు

ప్రవేశించగనే వ్రజపురము భయభ్రాంతులకు లోనగును. అలాగే మానవ హృదయము అవిద్యావ్యాప్తమైనపుడు మానవ జీవితము కూడా భయభ్రాంతులకు లోనగును.

అరిష్టాసురుని శ్రీకృష్ణుడు వధించి, వ్రజవాసులకు ఆనందమును కలిగించినట్లు, మనలోని అవిద్యను అంతమొందించి, హృదయములో శాంతిని ఆవిష్కరింపజేయవలెను.

అరిష్టాసురుడు శ్రీకృష్ణునిపైకి ఉరకగానే శ్రీకృష్ణుడు వృషభరూపుడైన అరిష్టాసురుని రెండు కొమ్ములను పట్టుకొని పదునెనిమిది అడుగులు వెనుకకు నెట్టెను. అవిద్య పదునెనిమిది స్థానములలో నిలచియుండును. అవియే కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, పంచప్రాణములు, మనస్సు, బుద్ధి, అహంకారము అనునవి. ఈ పదునెనిమిది స్థానములలో నిలచియున్న అవిద్యను వెనుకకు మరలించవలెను.

అవిద్య అంత తేలికగా నశించదు. అరిష్టాసురుడు మరల శ్రీకృష్ణుని పైకి ఉరికెను. శ్రీకృష్ణుడు వాని రెండుకొమ్ములను పీకి వానితే కొట్టి అరిష్టాసురుని వధించెను. అలాగే అవిద్యకుకూడా ఆవరణ, విక్షేపము అనురెండు శక్తులు శృంగములవలె మన్నవి. మొదటిది సత్యమును కప్పివేయగా, రెండవది అసత్యమును కల్పించి దర్శింపజేయును. రెండు కొమ్ములను పీకివేయుట అనగా ఆవరణ, విక్షేపములను తొలగించుట యని భావము. శృంగములు తొలగగానే అరిష్టుడు మరణించినట్లు, ఆవరణ విక్షేపాదులు తొలగగానే అవిద్య అంతరించును. అరిష్టాసురవధ ద్వారా మనలోని అరిష్టరూపమైన అవిద్యను అంతమొందించి తరించవలయు నని శ్రీకృష్ణుడు తెలియజేసెను.

కంసుని భీతావహము

అది కంసుని మందిరము. కాలుగాలిన పిల్లిలా, గట్టువదలిన చేపలా కంసుడు ఏదో అయిపోతున్నాడు. అటు ఇటు కుక్కలా వేగంగా తిరుగుతున్నాడు. ఏదో అనూహ్యమైన భీతుల్లో భయం హృదయాన్ని తొలిచేస్తున్నది. మందిరమంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడనుండో కుక్క ఏడుస్తున్న అరుపు వినిపిస్తున్నది. దూరంనుంచి నక్కయొక్క అకాల కూతలు వినబడుతున్నాయి.

నాట్యగత్తెలు సమీపించారు. కంసుని బీభత్సాన్ని చూసి బిత్తరపోయి నిలబడ్డారు. "ఏం చూస్తారేం?" అన్నాడు. వారు సుడిగాలిలా తిరుగుతూ భయంతో నృత్యంచేయ నారంభించారు. నర్తకీలు నాట్యమాడుతున్నారు. వాద్యకారులు ధ్వని నమకూర్చుతున్నారు. అదంతా శ్మశాన సంగీతంలా కంసునికి వినిపిస్తున్నది. "ఆపండి...వెళ్ళండి" అని గర్జించాడు.

తన సేవకుడొకడు అరుదెంచాడు. అతడిని చూసి "కృష్ణుడెవరో నీకు తెలుసా? అతడి పేరును విన్నావా?" అని అడిగాడు కంసుడు. "విన్నాను... అతడు మన పూతనను

వధించినాడట. కాళియుని మదమణచాడట. అఘాసురుని అంతమొందించి, గోవర్ధనగిరిని అమాంతం పైకి ఎత్తినాడట" అనుచుండగా కంసుడు వెనుదిరిగి అతని చెంప ఛెడేలుమనిపించాడు. సేవకుడు ఆ దెబ్బకు తెగిన మ్రానులా క్రిందబడ్డాడు. "దౌర్భాగ్యుడా! నా తిండి తిని వాడి బండి ఎక్కుతావా? కుర్రకుంక గోవర్ధనగిరి నెత్తుటయా? ఖబడ్దార్.... ఇకవాడి పేరు ఎత్తావో, నీ పేరు ఈ లోకంలో వినబడదు. జాగ్రత్త......పో."

మధుపాత్రను చేబూని మగువొకతె అరుదెంచింది. ఆ అందాల బొమ్మ చేతినుండి మధుపాత్రను అందుకున్నాడు. నోటివద్ద ఉంచుకోబోయాడు. అంతే, మధుపాత్రలో కృష్ణుడు నిండియున్నాడు. బిగ్గరగా కేకవేసి, ఆ మధుపాత్రను క్రిందికి విసిరాడు. మధువంతా ఒలికిపోయింది. పారుతున్న మధువులో ప్రతి మధుబిందువునుండి కృష్ణుడు గోచరిస్తున్నాడు. మధువు కదులుతుంటే విషనాగులు చరిస్తున్నట్లు కంసునికి గోచరిస్తున్నది.

ఇదంతా కంసునికి అర్థం కావడంలేదు. ఒకవైపు ద్వేషం మరియొకవైపు క్రోధం.... రెండూ కలిసి అతడ్ని పిచ్చివాణ్ణి చేస్తున్నాయి. ఇంతలో పట్టపురాణి అరుదెంచింది. కంసుని ఓదార్చింది. భోజన మారగించమని ప్రాధేయపడింది. సానుకూల పలుకులను వినిపిస్తూ భోజనమును వడ్డించింది. కంసుడు పళ్ళెముకేసి చూసాడు. అందులో వడ్డించబడియున్న ఆహారమంతా పుఱ్ఱెలుగా, ఎముకలుగా కనబడుతుంది. నీరు రక్తంలా గోచరిస్తున్నది. పాత్రను కాలితో తన్నాడు. వెనుదిరిగి తాను మందిరానికి వచ్చాడు. నాగుబామువలె బుసలు కొడుతున్నాడు.

"శుభమస్తు" అంటూ నారదుడు ప్రవేశించాడు. త్రిలోక సంచారి యగు నారదునికి కంసుడు శిరమోడ్చి నమస్కరించాడు. తన ఆవేదనను నివేదించాడు. శ్రీకృష్ణునిగూర్చి ప్రశ్నించాడు.

యశోదయాః సుతాం కన్యాం దేవక్యాః కృష్ణమేవచ
రామం చ రోహిణీ పుత్రం వసుదేవేన బిభ్యతా
న్యస్తౌ స్వమిత్రే నన్దే వైయాభ్యాం తే పురుషాహతాః

"హే కంస భూపతీ! దేవకి అష్టమ గర్భమున జనించిన పుత్రిక యశోద పుత్రికయే. బలరాముడు దేవకియొక్క సప్తమ సంతానము. అతడే రోహిణికి పుత్రుడాయెను. యశోదాదేవి పుత్రుడుగా బృందావనంలో పెరుగుచున్న కృష్ణుడు దేవకి పుత్రుడే. నీ భయముచే ఈ ఇరువురు బాలురను వసుదేవుడు నందునకిచ్చెను. ఆ ఇరువురు బాలురే నీ అనుచరులను సంహరించినవారు" అని నారదుడు చల్లగా చెప్పెను.

నారదుని మాటల నాలకించగనే వసుదేవుని సంహరించాలని కంసునికి అనిపించెను. వెంటనే కంసుడు కత్తి దూసెను. నారదుడు వారించెను. "రాజా! వసుదేవుని వధించుటవలన నీ కార్యము సఫలీకృతము కానేరదు. పైగా నీకు చెడ్డపేరు వచ్చును. నీకు కృష్ణుడే శత్రువు. నీవు సంహరించ వలసినది కృష్ణునేగాని వసుదేవుని కాదు."

నారదునిచే వారితుడైన కంసుడు తరుణోపాయ మాలోచించి, దేవకీ వసుదేవులను బంధించి చెఱసాలలో పడవేసెను. నారదుడు అంతర్హితుడయ్యెను. కంసుడు తన మంత్రి మండలిని పిలిపించెను. తక్షణ కర్తవ్యమును గూర్చి సమాలోచనలు జరిపెను. వారిలో 'కేశి' యను రాక్షసుడుండెను. వ్రజపురమునకు వెళ్ళి, శ్రీకృష్ణుని వధించమని కంసుడు కేశితో చెప్పెను. చాణూర ముష్టికులనెడి మల్లయోధులతో, "మహావీరులైన చాణూరముష్టికులారా! బృందావనమున బలరామకృష్ణులు నివసించుచున్నారు. వారు దేవకీ వసుదేవుల బిడ్డలు. వారు నన్ను చంపవలె నని ఆలోచించుచున్నారు. వారిని ఇచ్చటికి పిలిపింతును. మీరు మల్లయుద్ధములో వారిని వధించాలి" అనెను.

ఆ తరువాత మావటివానిని పిలిపించెను. "ఓ మావటివాడా! మల్లయుద్ధభూమికి అరుదెంచు దారిలో ద్వారమువద్ద కువలయాపీడ మను మదపుటేనుగు నుంచుము. బలరామకృష్ణులు అరుదెంచగానే వారిరువురిని వధింపుము" అనెను.

ఆ తరువాత యాదవశ్రేష్ఠుడగు అక్రూరుని పిలిపించెను. సాదరపూర్వకంగా ఆహ్వానించెను. అతడిని చేతులు పట్టుకొని ప్రార్థించెను.

"ఓ అక్రూరా! నాకు నీ అవసరము కలిగినది. నీవలె నన్ను ప్రేమించువారులేరు. నందపురమున బలరామకృష్ణులు ఉన్నారు. వారిని ఎలాగైనా ఇచ్చటికి కొనిరావలెను. ఇచ్చట జరుగు ధనుర్యజ్ఞమునకు వారిని ఆహ్వానించి, వెంటనిడుకొని రావలెను. నీవు అక్రూరుడవు. అనగా క్రూరత్వము తెలియనివాడవు. నిన్ను అందరూ నమ్ముదురు. నాకు ఈ మిత్రోచిత కార్యమును చేసిపెట్టుము" అనెను.

శా. అక్రూరత్వముతోడ నీవు మనఁగా నక్రూర నామంబు ని
ర్వక్రత్వంబునఁ జెల్లె మైత్రి పలుకన్ వచ్చున్ నిమంజేరి నీ
వక్రోధుండవు మందలోన బలకృష్ణాభీరు లవ్మర్ద్యవా
క్క్రీడారతు లై చరింతు రఁట యోజం దెచ్చి యొప్పింపవే.

అని అక్రూరునితో చెప్పెను. కంసుడు మృత్యువునకు ఆహ్వానము పంపుచున్నాడు. "ఎప్పుడు చనిపోవుదుమో గదా" అని చింతించువారు వాస్తవానికి చావుకు దగ్గరగువారే యగుచున్నారు. ఆలోచించవలసింది మరణ మెప్పుడొస్తుందనిగాదు, మరణించేలోగా మళ్ళీ మరణించకుండా ఉండే ఉపాయమేమిటో ఆలోచించాలి.

కంసుడు తనలో తాను చింతించుకొనసాగెను. "అక్రూరుడు వారిని తప్పక తీసుకొని వచ్చును. వారు రాగానే మదపుటేనుగుచేత వారిని చంపించుదును. లేదా మల్లయోధులచే వధింతును. తరువాత వారి వంశీయులను మట్టుపెట్టుదును. ఆ తరువాత రాజ్యాభిలాషగల నా తండ్రిని, అతని సోదరుని వధింతును. ఆపై అజాత శత్రువునై ప్రకాశింతును" అని తనలో తాను ఆలోచించుకొనుచుండెను.

అక్రూరుడనగా క్రూరము లేనివాడు. కంసుని పలుకులను అక్రూరుడు ఆలకించెను. వాని దుష్టబుద్ధిని, దాని పర్యవసానమును గాంచగలిగెను. సముచిత రీతిన కంసునికి సలహా నొసంగెను.

రాజన్ మనీషితం సధ్రక్ తవస్వాదవద్యమార్జనమ్
సిద్ధ్య సిద్ధ్యోః సమం కుర్యాద్దైవం హి ఫలసాధనమ్

"కంసమహారాజా! నీవు మృత్యు నివారణోపాయమును చక్కగా ఆలోచించ గలిగితివి. కానీ ఫలము దైవాధీనము. కనుక నీ కోరిక సిద్ధించినను, సిద్ధించక పోయినను నీవు సమబుద్ధితో మెలగుట మంచిది" అని తెలిపెను.

"హర్షవిషాదములు సమముగా భావించి, నీవు నాకు అప్పగించిన కార్యమును నెరవేర్చుటకు ప్రయత్నింతును" అని అక్రూరుడనెను.

క॥ పంపినఁ బోనివాఁడనె నృపాలక! మానవులెన్నఁ దమ్ము మా
హింపరు దైవయోగముల నించుక గావరు తోఁచినట్లు ని
ష్కంపగతిం జరింతు రది గాదనవచ్చునె? యీశ్వరేచ్ఛఁ ద
ప్పింపగరాదు నీ పగతుబిడ్డలఁ దెచ్చెదఁ బోయివచ్చెదన్.

కేశి సంహారము

కంసుని అనుచరులలో ఒకడైన కేశియను రాక్షసుడు అశ్వరూపము ధరించి, శ్రీకృష్ణుని వధించుటకై వ్రజమున ప్రవేశించెను. అశ్వరూపము బహు విశాలముగ నుండెను. తన పాదఘట్టనలతో నేలను త్రవ్వుచు, భయంకరముగా సకిలించుచు వచ్చెను.

శ్రీకృష్ణుని అన్వేషించుచు వచ్చుచున్న కేశిని శ్రీకృష్ణుడు సమీపించెను. సింహనాదము చేసెను. కేశికూడా సింహనాదము చేయుచు ముందుకు వచ్చి శ్రీకృష్ణునిపైకి ఉరికెను. భయంకరముగ నోరు తెఱచుకొని ముందుకువచ్చెను. శ్రీకృష్ణుని తన వెనుకకాళ్ళతో తన్నుటకు ప్రయత్నించెను. శ్రీకృష్ణుడు తప్పించుకొనెను. వాని రెండు కాళ్ళను గట్టిగా పట్టుకొని గిఱ్ఱున చక్రమువలె త్రిప్పి, గరుడుడు విలాసముగా సర్పమును విసిరివేయునట్లు, వానిని నాలుగువందల మూరల దూరము విసిరివేసెను.

కేశి ఎలాగో పైకిలేచి భయంకరముగా నోరుతెఱచి, మళ్ళీ శ్రీకృష్ణుని వైపునకు పరుగెత్తెను. శ్రీకృష్ణుడు మందహాసమును చిందించుచు కన్నములోనికి సర్పము ప్రవేశించునట్లు, తెఱువబడియున్న వాని నోటిలోనికి తన ఎడమచేతిని పోనిచ్చెను. శ్రీకృష్ణుని చేయిని నములుటకై కేశి ప్రయత్నించెను. కాని అది లోహమువలె నుండెను. శ్రీకృష్ణుని చేయి ప్రయత్నించి నములుటవలన కేశియొక్క దంతములు ఊడిపోయెను. శ్రీకృష్ణుని చేయి పెరుగుచుండెను. చేయి బాగా విశాలమయ్యెను. కేశి రాక్షసునికి ప్రాణత్రయము వదలుటకూడా కష్టమాయెను.

ప్రస్విన్న గాత్రః పరివృత్తలోచనః పపాత లణ్డం విసృజన్ క్షితౌ వ్యసుః

'కేశి దేహము చెమటపట్టెను. కన్నులు బయటకు వచ్చెను. మలమూత్రములను విసర్జించుచు, ప్రాణములు వదలి నేలకూలెను. అతని దేహము దోసకాయవలె బ్రద్దలయ్యెను. శ్రీకృష్ణుడు తన చేతిని బయటకు తీసికొనెను. కేశి ఇలా మరణించెను.

ఈ సందర్భమున శుకయోగీంద్రుడు పరీక్షిత్తునకు ఒకమాట చెప్పెను. "రాజా! భయంకరమైన శత్రువును అతి సులభముగా వధించినను శ్రీకృష్ణుడు గర్వమును పొందలేదు. అతి సామాన్యముగా నుండెను" అనెను.

శ్రీకృష్ణుడు పురుషోత్తముడు. సమ్యక్ జ్ఞానముకలవాడు. పొంగేవాడు, కృంగేవాడు కాదు. నిశ్చల జ్ఞానస్వరూపుడు.

కేశి దైత్యుడు. అశ్వరూపమున వచ్చెను. దేహమనే రథమునకు పూన్చిన ఐదు గుఱ్ఱములే పంచేంద్రియములని కఠోపనిషత్ తెలియజేసినది. కనుక కేశియనగా ఇంద్రియక్లేశము అని భావము. ఇంద్రియములను జయించుట బహుకష్టము. అవి కేశి దైత్యునివలె జ్ఞానమును మ్రింగుటకు నోరు తెఱచియేయుండును. దానిని వధించవలెనన్నచో శ్రీకృష్ణుని చేయి దాని నోటిలోనికి ప్రవేశించుటయే మార్గము. ఇచ్చట హస్తము అనగా అభయహస్తము అని భావము. కనుక ఈశ్వరానుగ్రహము లభ్యమైనపుడే ఇంద్రియక్లేశము అనెడి కేశి సంహరించబడును. ఇదియే కేశి సంహారములోని అంతర్భావము.

కేశి దైత్యుడు మరణించెను. దేవతలు పుష్పవర్షమును కురిపించిరి. శ్రీకృష్ణుని దర్శనమును వాంఛించి, పరమ భాగవతోత్తముడైన నారదమహర్షి వ్రజమున కరుదెంచెను. శ్రీకృష్ణుని దర్శించెను. శ్రీకృష్ణుని దివ్యరూపమును గాంచి పరవశించిన నారదుడు భగవానుని ఇలా స్తుతించెను.

సీ॥ జగతీశ యోగీశ సర్వభూతాధార సకలసంపూర్ణ యీశ్వర మహాత్మ
కాష్ఠగతజ్యోతి కైవడి నిఖిలభూతము లందు నాఁకడ్డై తనరు దీవు
సద్గూఢుఁడవు గుహాశయుడవు సాక్షివి నీ యంతవాఁడవై నీవు మాయఁ
గూడి కల్పింతువు గుణములు వానిచేఁ బుట్టించి రక్షించి పొలియఁ జేయు
ఆ॥ దీ ప్రపంచ మెల్ల నిట్టి నీ విప్పుడు రాజమూర్తులయిన రాక్షసులను
సంహరించి భూమి చక్రంబు రక్షింప నవతరించినాఁడ వయ్య కృష్ణ!

అని స్తుతించి, భవిష్యత్తులో శ్రీకృష్ణుడు చేయబోవు దివ్యకర్మల వర్ణించి వినిపించెను. ఆ తరువాత నమస్కరించి, శ్రీకృష్ణనామ గానలోలుడై కదలిపోయెను.

భగవన్నామమునకు, భగవానునికి తేడాలేదు. నామము నుచ్చరించువారు భగవత్సాన్నిధ్యమునే పొందియున్నారు. జీవిత చక్రము తిరుగుచున్నను, త్రికరణములతోను శ్రీకృష్ణుని దివ్యనామమును పలుకుతూ చరించవలెను. ఇదియే మహాత్ముడైన నారదుడు లోకమునకు అందించు సందేశము.

వ్యోమాసుర సంహారము

ఒకనాడు గోపబాలురు కొండ సమీపమునకు జని "దొంగదాచుట" అనెడి ఆటను ఆడనారంభించిరి. ఈ క్రీడయందు కొందఱు గోపబాలురు దొంగలుగ నుందురు. కొందఱు గోపబాలురు రక్షకులుగా నుందురు. కొందఱు గొఱ్ఱెలవలె నుందురు.

కొందఱు గొఱియల మంచును గొందఱు పాలకు లమంచు గుటిలత్వమునం
గొందఱు దొంగల మనుచును జెంది కుమారకులు క్రీడ నేసిరి తమలోన్.

ఇలా గోపబాలురు ఆడుచుండిరి. అది కనిపెట్టి మయుడను రాక్షసుని కుమారుడగు వ్యోముడనువాడు గోపాల వేషధారియై గోపబాలురలో కలిసిపోయెను. తాను దొంగపాత్ర నభినయించుచు గోపాలురను ఒక్కొక్కరిని తీసుకొని వెళ్ళి, పర్వతగుహాయందు దాచి, రాతితో దాని ద్వారమును మూయుచుండెను. ఇలా అందరిని అపహరించి దాచివేసెను. ఇక నలుగు రైదుగురు మాత్రమే మిగిలియుండిరి.

శ్రీకృష్ణుడు ఈ విషయమును పసిగట్టెను. సింహము తోడేలును పట్టుకొనునట్లు శ్రీకృష్ణుడు వ్యోమాసురుని పట్టుకొనెను. వెంటనే అతడు పర్వత మంతటి దేహమును ధరించెను. కాని శ్రీకృష్ణుని పట్టును విడిపించుకొనలేకపోయెను. అంతే, శ్రీకృష్ణుడు వానిని తీవ్రముగా బాధించి నేలపై కూలద్రోసెను.

పశ్యతాం దివి దేవానాం పశుమార మమారయత్

దేవతలు దివినుండి వీక్షించుచుండగా పశువును వధించినట్లు వ్యోమాసురుని వధించెను. ఆ తరువాత కొండప్రాంతమున మూతవేయబడియున్న బాయిని తొలగించి, గోపాలురను బయటకు దీసి రక్షించెను. వ్రజవాసు లెల్లరు శ్రీకృష్ణుని స్తుతించిరి.

ప్రతిమనిషి జీవితములో ఈ "దొంగదాచుట" అనెడి క్రీడ జరుగుచునే యుండును. ప్రతిమనిషిలో అనేక సుగుణములుండును. మనసొక మాయలమారి. అదియే వ్యోమాసురుడు. దైత్యుడు గోపవేషము ధరించివచ్చినట్లు, ఈ మనసు కామరూపమును ధరించి మనలో కదలును. కామము చరించగానే క్రోధము మనిషిని ఆవరించును. ఇలా అరిషడ్వర్గములు ఒకదాని వెంబడి ఒకటి వచ్చి మనలో తిష్ఠవేయును. మనలోని సుగుణములనెడి గొఱ్ఱెలను దూరముగా తీసుకొనిపోయి, హృదయమనెడి కొండలోనికి గొనిపోయి, మాయ యనెడి బండను అడ్డముగా నిలుపును. బుద్ధియనెడి రక్షకుడు జాగరూకతతో ఉండకపోవుటయే ఈ అనర్థమునకు కారణము.

మనసు కామరూపమును ధరించి మనలోని సుగుణములనెడి గొఱ్ఱెలను దూరము చేసినది. ఇంక కొన్ని మాత్రమే మిగిలియున్నవి. ఇది తెలిసి రక్షకుడనెడి బుద్ధి విలపించును. భక్తుని విలాపము భగవంతుని బంధించును. ఎవరయితే భగవంతుని కొరకు విలపించుచుందురో అట్టివారిని భగవంతుడు కరుణించి కాపాడును.

భగవత్కృప అట్టివారిపై వర్షించును. ఆ దయయే వారిని ఉద్ధరించును. మనోనాశమును కలిగించును. అప్పుడు వ్యోమాసురునివలె మనసు ఆకాశమంతగును. ఆకాశమంత అగుట యనగా "అహం" వృత్తి విస్తృతమగుట యని భావము. వ్యోమాసురుడు ఆకాశమంత పెరిగినను శ్రీకృష్ణుని పట్టును విడిపించుకొనలేకపోయెను. ఆత్మ విచారణ ధృవపడగానే "అహం" వృత్తి ఎంత విస్తారమైనను వినాశము హొందక తప్పదు. "అహం" నశించగానే మాయ యనెడి బండమూత తొలగించబడును. సుగుణములన్నియు వచ్చి చేరును. కళ్యాణ గుణములు ఎవరిలో ఎక్కువగా నిండియుండునో వారు భగవద్దర్శనము పొంది తరింతురు. ఇదియే "దొంగదాచుట" అనెడి క్రీడ.

అక్రూరుని ఆగమనం

కృష్ణుని మధురకు తోడ్కొని రమ్మని అక్రూరునితో కంసుడు చెప్పెను. అక్రూరుడు ఆ రాత్రి మధురయందే ఉండి మధురభావ పల్లకీలో ఆసీనుడై స్వప్నగగనమున విహరించెను. శ్రీకృష్ణుని సందర్శన భాగ్యమును తలుచుకొని గగుర్పాటు చెందుచుండెను. రాత్రి అంతయు నిద్రలేకపోయెను. శ్రీకృష్ణుని మధురభాషణమును, ప్రేమను ఊహించుకొనుచుండెను. ఒకవేళ కొద్దికాలము నిద్రపట్టినచో ఆ కలలో బాలకృష్ణుడు కనిపించును. ఆనందముతో ఉలిక్కిపడి అక్రూరుడు లేచును.

స్వప్నము భగవత్సంబంధమైనది అయినచో అట్టి స్వాప్నికుడు పుణ్యాత్ముడని భావము. జాగ్రదవస్థలో మనము సాగించిన సంకల్పముల ప్రతిరూపమే స్వప్నము. ఎవని మనస్సు నిత్యమూ భగవంతుణ్ణే స్మరించుచుండునో అట్టి వ్యక్తియే ధన్యజీవి యగును.

ఉదయముననే అక్రూరుడు రథము నధిరోహించెను. భక్తితో శ్రీకృష్ణునికి నమస్కరించెను. రథము కదలుచుండెను. అంతకన్నా వేగముగా అక్రూరుని ఆలోచనలు కదలుచుండెను. తానెక్కిన రథము కంసునిదైనను, ప్రయాణము కృష్ణుని సమీపమునకు సాగుచున్నదని భావించి తృప్తి నొందును. దేహమనెడి రథము అజ్ఞానమునకు సంబంధించినదే అయినను అట్టి దేహము ద్వారా సత్కర్మలు జరిగినపుడు ఆ జీవన ప్రయాణము సాఫల్యమును సంతరించుకొని సహజానందమును పొందును.

అక్రూరుని రథము ముందునకు సాగుచుండెను. భక్తుడైన అక్రూరుని హృదయం కృష్ణప్రేమతో నిండియుండెను. శ్రీకృష్ణుని దర్శించబోవుచున్నానని భావించి, పరవశించుచుండెను. గగుర్పాటు నొందుచుండెను. నేత్రముల వెంట బాష్పములు రాలుచుండెను.

కిం మయా చరితం భద్రం కిం తప్తం పరమం తపః
కిం వాథా ప్యర్హతే దత్తం యద్ద్రక్ష్యామ్యద్య కేశవమ్ ....

నే నేవిధమైన పుణ్యకర్మ నాచరించితినో కదా! ఏ విధమైన తప మాచరించితినో కదా! ఎవరికి దాన మొసరించితినో కదా! ఏ సత్కర్మయొక్క ఫలమో, ఈనాడు నాకు శ్రీకృష్ణ సందర్శన భాగ్యము కలుగబోతున్నది.

ఉ॥ ఎట్టితపంబు సేయఁబడె నెట్టి చరిత్రము లబ్ధమయ్యెనో
యెట్టిధనంబు లర్థులకు నీఁబడెనో తొలిబామునందు నా
యట్టి వివేకహీనునకు నాదిమునీంద్రులు యోగదృష్టులుం
బట్టఁగ లేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిఁజూడఁ గల్గెడిన్.

"ఆహా! ఏమి నాభాగ్యము? ఈ నాడు శ్రీకృష్ణుని సందర్శించు భాగ్యము నాకు కలుగబోవుచున్నది. నా అమంగళము లన్నియు నశించినవి. నేను అధముడను. అయినా కృష్ణ దర్శనమునకు నోచుకొనినాను. ప్రవాహమున కొట్టుకొనిపోవు గడ్డిపోచలో ఒకటి మలుపు తిరిగి తీరమును చేరినట్లు నేను శ్రీకృష్ణ పాదాబ్జములను చేరుచున్నాను" అని చింతించసాగెను.

భగవంతుని పొందుట ఒక్కటియే నిజమైన భాగ్యము అని ఎవరు సదా చింతించుచుందురో వారే నిజమైన భాగ్యశాలురు. అక్రూరుడు మదిలో కంసునికి కూడా నమస్కరించుకొనుచున్నాడు. "ఆహా! కంసుడు చాలా పెద్దవాడు. కానీ నాకు ఎవ్వరూ చేయలేనంత మంచిని చేసెను. కంసుడు చేసిన సహాయానికి నేనెప్పుడూ ఋణపడియే యుంటాను. గురువు దేవుని చూపును. కంసుడు నాకు శ్రీకృష్ణదేవుని చూపుతున్నాడు. కంసుడు నా గురుదేవుడు" అనుకొంటూ హృదయస్పందనము నొంది రథము దిగి, కంసునికి చేతులుజోడించి నమస్కరించి, ఆ తరువాత మళ్ళీ రథము నెక్కెను.

ఎవరయితే మనను భగవంతుని సందర్శించుటకు సహకరింతురో వారి యెడల పూజ్యభావము, కృతజ్ఞతాభావము కలిగియుండవలెను. కంసుడు పెద్దవాడైనను, భగవద్దర్శనమునకు తనకు సహకరించినందున అక్రూరుడు కృతజ్ఞతతో తలవంచి నమస్కరించుచున్నాడు. నేటి ఆధునాతన శిష్యవర్గము జ్ఞానప్రదాతయైన గురువుగారి గుండెను పిండిన తరువాతగాని శాంతించరు. గురుసేవ ముక్తిని ప్రసాదిస్తుంది. గురుద్రోహము నరకమును ముందుంచుతుంది.

"శ్రీకృష్ణుని చరణకమలములను దర్శించుటవలన నా పాపములన్నీ నశించును. ఈ పావన చరణములచెంత గతంలో ఎందరో తరించారు. నేను కూడా అలా తరించే శుభఘడియ సమీపించినది" అని అక్రూరుడు తలపోయుచుండెను.

ఉ॥ సూరులు దొల్లి యేవిభుని శోభితపాదనఖప్రభావళిం
జేరి భవాంధకారముల జిక్కక దాఁటుదు రట్టి దేవరన్
వైరముతోడనైన బిలువన్ నమఁ బంచి శుభంబు సేసె ని
ష్కారణ మైన ప్రేమ నిదె కంసునిఁబోలు సఖుండు గల్గునే?

ఇలా అక్రూరుడు ఆలోచించుచుండగా మృగములు వచ్చి తన చుట్టు ప్రదక్షిణము చేసినవి. అక్రూరుడు దీనిని శుభసూచకముగా భావించెను. తన అభీష్టము తప్పక నెరవేరునని సంతృప్తి చెందెను.

ఏ వ్యక్తి భగవంతుని దర్శించబోవునో, ఎవనికి పరమాత్మ దర్శనము లభించనున్నదో అట్టివాని చుట్టూ జింకలు ప్రదక్షిణము చేయును. జింక చంచలమైన కనులు గలది. స్థిరత్వము లేనిది. మనలోని సంకల్పాలుకూడా చంచలములై స్థిరత్వము లేనివియై యుండును. పరమాత్మ దర్శనము కాబోయేముందు సంకల్ప నిరోధము జరుగును. మృగములు అక్రూరుని చుట్టు ప్రదక్షిణము చేసినట్లు, సంకల్ప సమూహము నిష్క్రియమై నిలచియున్న నీచుట్టూ తిరిగి, నిన్ను కదలించలేక, నీకు నమస్కరించి నిష్క్రమించును.

"నేను ఈ నాడు శ్రీహరిని తప్పక దర్శింతును. నాకు రామకృష్ణులు గోచరించగనే నేను రథము దిగి వారి పాదపద్మములకు నమస్కరించి శరణు కొల్చెద. అంతేకాదు, ఆ మహాత్మునితో కూడా కలసి చరించిన పుణ్యాత్ములగు గోపాలురకుకూడా నమస్కరించెదను. నేను నమస్కరించిన శుభసమయాన శ్రీకృష్ణుడు నా శిరముపై తన అభయ హస్తమును ఉంచునా?" అని తలపోయుచు కంటతడి పెట్టుకొనెను.

"నేను కంసుడు పంపగా వచ్చినవాడను. కృష్ణా! దుష్టుడను కాను. నేను కంసుని దూతనని నన్ను పరిత్యజించవు కదూ! ప్రభూ! నీ పాదపద్మయుగళిని దర్శించవలెనన్న తీవ్రాకాంక్ష తప్ప మరేదీ నా హృదయమున కదలదు. కృష్ణా! నీవు పరమాత్మవు. నీకు తెలియనిదంటూ లేదు. నిర్మలదృష్టిగల నీకు సర్వమూ గోచరించును. నీవు నన్ను పరిత్యజించవు" అని చింతించెను.

అక్రూరుడు భావజగత్తులో పడిపోయెను. కృష్ణుడు నన్ను "నాన్నా" అని పిలుచును. నేను "కుమారా!" అని కౌగలించుకొందును. మైమరచి ఉందును. "నాన్నా! నాకు ఆకలిగా నున్నది. క్షీరమునివ్వరా?" అని అడుగును. "ఇచ్చెదను వత్సా!" అంటూ స్వర్ణపాత్రలో పాలు తెచ్చి నా కృష్ణునకు ఇచ్చెదను. అతడు ముద్దుముద్దుగా త్రాగుచుండును. నేను [illegible] చూచుచుందును. నేను యమునలో స్నానమాచరించుటకు బయలుదేరెదను. "నాన్నా! నీవు వెళ్ళితే నే ఒప్పుకోను" అని మారాం పెట్టును. నన్ను వదలి ఉండలేని శ్రీకృష్ణుని విడచి ఉండలేక నేను స్నానమును మాని వానిచెంతనే యుందును. అప్పుడు శ్రీకృష్ణుడు నవ్వుతూ వచ్చి "మా నాన్న మంచివాడు" అంటూ లడ్డు తెచ్చి నోటిలో పెట్టును. "కుమారా! పవిత్ర గంగామాతను పావనమొనర్చు నీ దివ్యదర్శనప్రాప్తి కలిగిన తరువాత నాకు స్నానముతో పనియేల? అని స్నానమును మానెదను" అనుకుంటూ భరించలేని పారవశ్యము హృది నలుముకొనగా, వెక్కివెక్కి ఏడ్వసాగెను.

దారిలో ప్రయాణము చేయుచున్నంతసేపు అక్రూరుడు శ్రీకృష్ణుని గూర్చియే ఆలోచించుచుండెను. ప్రతి భక్తుడూ ఈ విషయమును స్మృతి యందుంచుకోవాలి. మనము వేసే ప్రతి అడుగులోను భగవత్స్మరణను కొనసాగిస్తుండాలి. అక్రూరునివలె భగవంతుని గూర్చిన ధ్యానమును సదా సాగించుచుండాలి. కొందరు దారిన పోవుచున్నపుడు వ్యర్థమైన విషయములను చర్చించుకుంటూ నడచి వెళ్ళుచుందురు. కొందరు ఏదో కార్యములను ఆలోచించుచునో, పేకమేడలను నిర్మించుకుంటూనో నడచి వెళ్ళుచుందురు. భక్తుడు అలాగాక భగవంతుని గూర్చియే ఆలోచించుచుండును.

రథము వ్రజపురమును సమీపించుచుండెను. అక్రూరుని దృష్టి దారిపై బడినది. అచ్చట ఒక దృశ్యము అతనిని పరవశింపజేసినది. రథము నాపాడు. క్రిందికి దిగి చూచాడు. చిన్నిచిన్ని పాదముద్రలు పడి ఉన్నాయి. శంఖము, పద్మము, ధ్వజము మొదలగు చిహ్నములు అచ్చట గోచరించుచున్నవి. అక్రూరుడు కదలిపోయాడు. ఆ పాదముద్రలకు సాష్టాంగ దండప్రణామ మాచరించాడు. "నాకృష్ణుడు ఈ ప్రదేశములన్నీ తిరిగి యుండవచ్చును. లేనిచో ఈ పాదముద్ర లెలా వచ్చినవి?" అని ఆలోచించసాగెను. "అయినా కృష్ణయ్య పాదరక్షలు లేకుండా చరించుచున్నాడు. శ్రీకృష్ణుని దివ్య పాదస్పర్శచే ఈ ప్రాంతమంతయు పునీతమైనది. శ్రీకృష్ణుడు నడిచివెళ్ళే ఈ పుణ్య ప్రదేశమున నేను రథముపై కూర్చుని చరించుట దోషము" అని భావించి, రథము ప్రక్కన నడచుచుండెను. కొంచెము దూరము వెళ్ళెను. మళ్ళీ అవనిమాతకు అలంకారమొనర్చుచు శ్రీకృష్ణుని పాదముద్రలు కనుపించినవి. ఈసారి అక్రూరునికి దివ్యపారవశ్యము కలిగెను,

తద్దర్శనాహ్లాద వివృద్ధ సంభ్రమః ప్రేమ్ణోర్ధ్వరోమాశ్రుకలా కులేక్షణః
రథా దవస్కన్ద్య సతేష్వ చేష్టత ప్రభోరముష్యాంఘ్రి రజాంస్యహో ఇతి ॥

భగవానుని పవిత్రపాదపద్మములను దర్శించగానే అక్రూరునిలో ఆనందము, ఆశ్చర్యము వృద్ధినొందెను. శరీరము రోమహర్షణ మాయెను. కన్నీటితో దృష్టి కదలిపోయెను. వెంటనే ఆ ధూళిని చూసి, "ఆహా! ఈ ధూళి శ్రీకృష్ణుని చరణధూళి. ఇది పవిత్రమైన ధూళి" అంటూ దానియందు పడి పొర్లాడెను.

ఈ విధముగా మహాత్ముడైన అక్రూరుడు పవిత్రాభావయుక్తుడై, సంయతచిత్తుడై వ్రజమున కరుదెంచెను. ఒకచోట గోశాలయందు బలరామకృష్ణులను అక్రూరుడు దర్శించెను. వెంటనే రథమునుండి దుమికెను. రామకృష్ణుల పాదములచెంత దండమువలె పడిపోయెను.

మ॥ కనె నక్రూరుఁడు పద్మనేత్రులను రంగద్గాత్రులన్ ధేను దో
హనవాటీగతుల స్వలంకృతుల నుద్యద్భాసులం బీత నీ
లనవీనోజ్జ్వలవాసులం గుసుమమాలాధారులన్ ధీరులన్
వనితాకాములఁ గృష్ణరాముల జగ ద్వంద్యక్రమోద్దాములన్.

పరమాత్మ దర్శనమువలన కలిగిన ప్రేమోన్మాదములో అక్రూరుడు కదలిపోయెను. నేత్రములవెంట బాష్పములు రాలుచుండెను. శరీరము గగుర్పాటు నొందుచుండెను. "నేను అక్రూరుడను" అని కూడా పలుకలేకపోయెను. ఆశ్రితజనవత్సలుడగు శ్రీకృష్ణుడు అక్రూరుని పట్టి లేపి ఆలింగనమును చేసుకొనెను. బలరామకృష్ణు లిరువురును కలసి ఆయన చేతులను పట్టుకొనిరి.

"చిన్నాన్నా! బాగున్నావా?" అని మాధవుడనెను. ఆ ప్రేమపలుకు చెవిని పడగానే అక్రూరుడు పరవశించిపోయెను. నోటినుండి మాట కదలకపోగా, బాగున్నట్లు తలూపెను. రామకృష్ణులు అక్రూరుని ఇంటికి తీసుకొనిపోయిరి. ఆయన పాదములను స్వయముగా ఒత్తిరి. పరదీర్ఘకామునట్లు పరిచర్యలొనర్చిరి.

భుజించిన పిదప అక్రూర నందాదులు ముచ్చటించుకొనసాగిరి. "అక్రూరా! క్రూరుడైన కంసుడెలా ఉన్నాడు? కసాయివానిచే పోషింపబడు గొఱ్ఱెలవలె మీరెన్నికష్టముల ననుభవించుచున్నారో గదా!" అనెను. నందుడు ప్రేమపలుకుల నందించుచుండ అక్రూరుడు ప్రయాణ అలసటను పోగొట్టుకొనెను.

సాయంత్రము భోజనమైన తరువాత అక్రూరుని చెంతకు రామకృష్ణులు అరుదెంచిరి. అక్రూరుని రాకకు కారణమును అడిగిరి. అక్రూరుడు చేతులు జోడించి నమస్కరించుచు, శ్రీకృష్ణునితో ఇలా చెప్పెను: "పురుషోత్తమా! నీకు తెలియనిది ఏమున్నది? కంసుని దురాగతములు పెచ్చుపెరిగినవి. వసుదేవుని సంహరించుటకుకూడా కంసుడు వెనుకాడలేదు. కానీ నారదమహర్షి సలహా ననుసరించి చంపుటమాని, కారాగృహమున బంధించెను. మీరు యశోదా తనయులు కారనియు, దేవకీ పుత్రులే ననియు కంసునికి తెలిసిపోయినది. మిమ్ములను సంహరించవలెనని పన్నాగము పన్నుచున్నాడు. మిమ్ములను వెంటబెట్టుకొని రమ్మని నన్ను దూతగా పంపినాడు. అచ్చట మిమ్ములను కువలయాపీడము మదపుటేనుగు ద్వారా త్రొక్కించిగాని లేదా చాణూర ముష్టికాసురులచే మల్లయుద్ధమున చంపించిగాని తన పగ దీర్చుకొనవలెనని కంసుడు అభిప్రాయపడియున్నాడు" అని క్రూరము తెలియని అక్రూరుడు సత్యవచనములను పలికెను. ఈ మాటల నాలకించిన రామకృష్ణులు మందహాసమును చిందించి, నందునికి తెలియజేసిరి. నందుడు గోపాలురను పిలిచి ధనుర్యాగమును వీక్షించుటకు మధురకు ప్రయాణము గమ్మని తెలియజేసెను.

ఈ వార్త తెలియగానే యశోద అమితముగా దుఃఖించుచుండెను. నరకవేదన ననుభవించుచుండెను. నందబాబాను చేరి తన బాధను తెలుపసాగెను.

"ఆహా! ఏమిటి? ఇతడు అక్రూరుడా! కాదు కాదు. ఇతడు క్రూరుడే. లేనిచో మెల్లమెల్లగా వచ్చి మరణవార్త నందించునా? కన్నయ్య లేని వ్రజపురమున నేనెలా ఉండగలను? కృష్ణయ్య లేనిచో, బృందావనమంతా చిన్నబోతుంది. గోవులు ఆహారమునుకూడా ముట్టవు. కావలిస్తే మీరు వెళ్ళండి. నా కన్నయ్యను తీసుకువెళ్ళేందుకు నేను ఒప్పుకోను. అవసరమనిపిస్తే బలరాముని తీసుకువెళ్ళండి. నా చేతులతో ఎవరికి బువ్వపెట్టాలి? ఎవరికి వెన్న తినిపించాలి? అమితానందము నొసగూర్చు నా కన్నయ్యను వదలి నేను ఒక క్షణముకూడా బ్రతుకలేను. అసలు ఈ వార్త నిజమా? కలయా? నా కృష్ణనేమిటి? నన్ను వదలిపెట్టి వెళ్ళుట ఏమిటి?

"రెండు రోజుల క్రితము నాకొక దుస్స్వప్నము వచ్చినది. నా కన్నయ్య నన్ను వదలి వెళ్తున్నట్లు కల వచ్చినది. అది నిజమగునా ఏమి? అదియే నిజమైనచో నేను బ్రతుకలేను. కృష్ణా! నన్ను కూడా నీ వెంట తీసుకుపో. ఒకవేళ స్త్రీనైన నేను వెంట రాకూడనిచో, నా ప్రాణాన్నైనా వెంట తీసుకొని వెళ్ళు. నీ తీయటి మాటలతో తీపెక్కిన నా ప్రాణం నిన్ను వదలి వేరుబ్రతుకును అనుభవించలేదు కన్నా!" అంటూ విలపిస్తూ క్రింద పడిపోయెను.

యశోదను చూసి నందుడు కదలిపోయెను. "యశోదా! అనవసరంగా ఆవేదన చెందుతున్నావు. కన్నయ్యకు పదిసంవత్సరాలు దాటాయి. మనమూ పెద్దవాళ్ళ మయ్యాము.

ఎంతకాలము నీవు కృష్ణయ్యను నీ ఒడిలో పెంచుకోగలవు? రెక్కలువచ్చిన పక్షిపిల్ల ఎంతకాలము గూటికి పరిమితమవుతుంది? కృష్ణయ్య వ్రజపురమునకు రాజయ్యే లక్షణాలన్నీ కలిగియున్నాడు. ఒక్కసారి కన్నయ్యకు మధుర చూపెడితే బాగుండునని నేనూ భావించాను. ఊహించని విధంగా ఈ అవకాశము వచ్చినది. నాలుగైదు రోజులలో తిరిగి రాగలము. అంతవరకు నీవు ప్రశాంతంగా ఉండాలి" అన్నాడు.

"ఏమండీ! మన కన్నయ్యకు చాలా సిగ్గు. ఆకలిగా ఉన్నను ఎవరినీ అడుగడు. అతనికి ఎవ్వరు తినిపింతురు?" అని ఏడ్వసాగెను.

మధురలో....

"కృష్ణా! కృష్ణా! కృష్ణా!" అంటూ నిద్రించుచున్న దేవకి ఉలిక్కిపడి లేచింది.

"దేవకీ! దేవకీ! ఏం జరిగింది?" అని అడిగాడు వసుదేవుడు.

"ఏమండీ! జరిగిందేదో జరిగిపోయింది. అదంతా మరచిపోండి. నా కన్నయ్య నా కలలో కనుపించాడు. జరుగబోయే దంతయూ చెప్పినాడు. ఏమండీ! మనకు చాలా మంచిరోజులు వస్తున్నాయి. కృష్ణయ్య మధురకు వస్తున్నట్లు, మనలను బంధ విముక్తులను చేస్తున్నట్లు నాకు శుభస్వప్నం వచ్చింది. కన్నయ్య నావంక చూచి, "అమ్మా! నే వస్తున్నానే! ఈ నాటితో మీ కష్టాలన్నీ గట్టెక్కుతాయి! అని చెప్పాడు" అంటూ దేవకి ఆనంద బాష్పాలు రాల్చింది. తలెత్తి చూసింది. వసుదేవుడు నిశ్చేష్టుడై నిలబడియున్నాడు. "అలా ఉన్నారేమిటండీ?" అన్నది దేవకీదేవి.

"దేవకీ! నీవు అదృష్టవంతురాలివి. మధురస్వప్నాలు కనే భాగ్యానికి నోచుకున్నావు" అంటూ వసుదేవుడు తలదించుకున్నాడు.

వ్రజపురంలో ....

అక్రూరుడు వచ్చింది శ్రీకృష్ణుని మధురకు గొనిపోవుటకే ననెడి వార్త గోపికలకు చేరింది. వారి ముఖప్రకాశము కనుమరుగైనది. ఆనందము అదృశ్యమైనది. కొందరు విరహముతో కుంచుకపోసాగిరి. కొందరు గోపికలు శ్రీకృష్ణుని చేష్టలను చర్చించుకొనుచుండ, కొందరు అతని చిరునగవును గుర్తుకు తెచ్చుకొనుచుండ, కొందరు అతని దివ్యకర్మములను స్మరించుకొనుచుండ వ్రజభూమి అంతయు విరహాజనులతో గూడినదియై శోకమయమై గన్పట్టుచుండెను.

మ॥ హరినవ్వుల్ హరిమాటలున్ హరిమనోజ్ఞాలాపముల్ లీలలున్
హరివేడ్కల్ హరిమన్ననల్ హరికరాబ్జాలంబనాహ్వానముల్
హరిణీలోచన లందఱున్ మఱి యుపాయం బెట్లొకో యంచు లో
వెరియన్ ముచ్చటలాడిరంత గము లై యేకాంతగేహంబులన్.

గోపికల విరహవేదన

మధురానగరానికి శ్రీకృష్ణుడు వెళ్ళడం తప్పదు. ఈ విషయం గోపికలకు తెలిసిపోయింది. కృష్ణుని వదలి వారు జీవించగలరా? శ్రీకృష్ణవిరహమును భరించగలరా? కృష్ణగతచిత్తులైన గోపికలు కృష్ణుని వెళ్ళనివ్వకూడదని నిర్ణయించుకున్నారు. సహకరించమని మరులను ప్రార్థించారు. వృక్షములకు వినతి వందించారు. అంబరమును అర్థించారు. పారే యమునను ప్రార్థించారు.

"హే విరించీ! బ్రహ్మదేవుడా! కలిసినంతసేపు పట్టదు నీకు విడదీయడానికి. నీకే కఠినహృదయమేల కలిగినది? ప్రేమికులను కలుపుతావు. వెంటనే నిర్దాక్షిణ్యంగా వేరుచేస్తావు. ఆదిపురుషుడవైన నీవు ఇలాంటి బాల్యక్రీడలాడుటతగునా?

"హే విద్యాపతీ! నీవు మాకు నేత్రము లొసంగినావు. మేము వాటిని సద్వినియోగ పరచుకున్నాము. నీ సృష్టి రహస్యాలన్నీ మా కన్నయ్య కన్నులలోనే చూడగలిగాము. నీవు క్రూరుడివి. నీవే అక్రూరుని రూపంలో వచ్చి మా నయనాలను పాడుచేసినావు.

శా॥ అక్రూరుం డని పేరు పెట్టుకొని నేఁ డస్మన్మనోవల్లభుం
జక్రిన్ మాకడఁ బాపికొంచు నరుగం జర్చించి యేతెంచినాఁ
డక్రూరుం డిట క్రూరుఁ డీతఁడు నిజం బక్రూరుఁడౌనేని ని
ర్వక్రత్వంబునఁ గృష్ణుఁబెట్టి తన త్రోవంలో విచారింపఁడే?

బ్రహ్మను నిందించిన తరువాత తమలో తాము గోపికలు ఇలా మాట్లాడుకొనసాగిరి:

"చెలులారా! మన బ్రతుకెలా మారిపోయినది? భర్తలను, పుత్రులను, బంధుజనులను విస్మరించాము. శ్రీకృష్ణునే స్మరించాము. ఆయనకు దాసులమయ్యాము. కారుణ్యమూర్తియని భావించాము. ఇంత కఠినాత్ముడని ఊహించలేకపోతిమి గదా! ప్రాణసమానంగా ప్రేమించు మనలను వదలి చనుటకు అతనికి హృదయమెలా ఒప్పినదో గదా! ప్రేమలు అంతటి బుద్బుదములా! కటకటా! ప్రేమలో ఇంత మోసమున్నదా?" అన్నదొక గోపిక.

మరియొక గోపిక "అందులో విచిత్రమేమున్నది? క్రొత్త ఒక వింతయే కదా! పిచ్చివారమైనందున మనము ఇలా పాడు అయితిమి" అనెను.

ఇంకొక గోపిక "ప్రపంచమున ఒక దిక్కున సూర్యప్రకాశముండగా మరియొక దిక్కున చీకటి యుండును. ఈ గతులు నిత్యము మారుచుండును. ఇంతవరకు వ్రజపురమున శోభించిన వెలుగు ఇక రేపటినుండి మధురలో వెలుగుతుంది. మధురానగరమునందలి స్త్రీలు అదృష్ట భామినులు. శ్రీకృష్ణుని దివ్యముఖారవింద దర్శనమును గాంచుటకు నోచుకున్నారు" అనెను.

వేరొక గోపిక "మధురానగరము పెద్ద పట్టణము. మన వ్రజపురమువలె పల్లెటూరు కాదు. అచ్చటనున్న భామినులు నాగరికులై యుందురు. చమత్కృతి

నేర్చియుందురు. వారి ప్రేమలోపడి కృష్ణుడు మనలను మఱచిననూ మరువవచ్చును. అట్టి తఱి మనము జన్మించు టెందులకు?"

క॥ పురపతుల విలోకనములు, పరపాలాపములు నర్మ సంభోగములున్
మరగిహరిమనలవొల్లఁడు, పరువరులోయమ్మ నూతనప్రియులుగదే!

"పట్టణవాసులైన మధురానగర స్త్రీల స్నేహ మాధుర్యమును అనుభవించిన పిదప విరక్తరాస్యులైన మన పొందు శ్రీకృష్ణునికి రుచించునా?" అని దుఃఖించెను.

మరొకగోపిక అక్రూరుని నిందించసాగెను.

మైతద్విధస్యా కరుణస్య నామభూ దక్రూర ఇత్యేత దతీవ దారుణః
యోఽసావ నాశ్వాస్య సుదుఃఖితం జనం ప్రియాత్ప్రియం నేష్యతి పారమధ్వనః

"అక్రూరుడు దయలేనివానివలె గన్పట్టుచున్నాడు. క్రూరమైన ఈ వ్యక్తికి అక్రూరుడను నామము సరిపడలేదు. మనము ఇలా దుఃఖించుచున్నను పట్టించుకోక మనకు దూరముగా శ్రీకృష్ణుని తీసికొనిపోవుచున్నాడు."

మరొక గోపిక ఇలా అన్నది: "మన వచనములన్నియు అరణ్యరోదనములే. వాయువు మనకు అనుకూలముగా వీచుటలేదు. కఠినాత్ముడగు కృష్ణుడు బయలు దేరుచున్నాడు. అంతకంటెను కఠినాత్ములైన గోపాలురు వెంబడించి పోవుచున్నారు. వారికంటెను కఠినాత్ముడైన అక్రూరుడు తీసికొనిపోవుచున్నాడు. మన విషయములో దేవుడుకూడా కఠినుడయ్యాడు. అందరికంటెను మనము కఠినాత్ములము గనుకనే ఇంకా బ్రతికియున్నాము" అంటూ బోరున ఏడ్వసాగింది.

మ॥ ఉదిదల్ సిగ్గులు మాని కన్గవల నీ రొండొండ వర్షింపగా
వివశత్వంబులతోఁ గపోలతటసంవిన్యస్తహస్తాబ్జలై
పవనోద్ధూతలతాభలై మముఁ గృపం బాలింపు గోవింద మా
ధవ దామోదర యంచు నేడ్చిరి సుజాతంబైన గీతంబులన్!

మధురకు ప్రయాణము

వ్రజవాసుల నేత్రాలు కన్నీటితో నిండిపోయాయి. కన్నయ్యకు దూరమై ఎలా బ్రతకాలి? అందరి మనసులలో ఇదే ప్రశ్న. సూర్యోదయమైనది. అక్రూర మహాశయుడు సంధ్యావందనాది కర్మలను పూర్తిచేసుకున్నాడు.

ప్రయాణానికి సిద్ధమయ్యారు రామకృష్ణులూ, నందాది గోపులును. యశోద కడుపునిండా దుఃఖాన్ని నింపుకొని కృష్ణయ్యను సమీపించింది.

"కన్నయ్యా! వెళ్తున్నావా?" అన్నది. అవునన్నట్లు తలూపాడు శ్రీకృష్ణుడు.

"నిన్ను వదలి నేనుండగలనా కన్నా?" అంటూ కృష్ణయ్యను ముద్దెట్టుకొని యశోద బోరున విలపించింది.

"నేను త్వరగానే తిరిగి వస్తానుగా" అన్నాడు కృష్ణయ్య నుత్తరరీగా.

"నాయనా! పాపిష్టిదానిని. నిన్ను రోటికి బంధించాను. నేను మూర్ఖురాలిని. పరుల మాటలునమ్మి నిన్ను కొట్టాను. కుమారా! అవన్నీ మనసులో ఉంచుకోకు!" అని ఏడ్వసాగింది.

"అమ్మా! నీవు ఏమి చెప్పినను నేను తప్పక విందును. కానీ నీవు రోటికి నన్ను కట్టిన విషయమును మాత్రము నేను మరువను, మరువలేను. అది సామాన్యమైన బంధముగాదు. ప్రేమ బంధనము. దానిని నేనెన్నడూ మరువను. నా హృదయంలో శాశ్వతముగా దాచుకొందును" అనెను.

అక్రూరుడు తెచ్చిన రథములో కృష్ణయ్య ఆసీనుడాయెను. నందుడు మొదలైన గోపాలురు నేతికుండలను కంసునకు కానుకలుగా తమబండ్లపై నుంచుకొని శ్రీకృష్ణుని రథము ననుసరించుచు బయలుదేరిరి.

రథము వీధిమలుపు తిరుగబోయి ఆగిపోయింది. పెద్ద అవరోధము ముందు నిలచి రథమును అడ్డగించింది. గోపికలు పెద్దసంఖ్యలో వచ్చి అడ్డునిలచియున్నారు. గోవులు, దూడలు, పావురములు, మయూరాలు, రామచిలుకలు వచ్చి దారికి అడ్డంగానిలిచాయి. "కృష్ణా! కృష్ణా! మమ్ములను వదలివెళ్ళుట నీకు ధర్మమా?" అంటూ విలపించసాగిరి.

సారథి స్థానములో ఆసీనమైయున్న అక్రూరుడు దిగ్భ్రాంతి చెందెను. శ్రీకృష్ణుడు మెల్లగా రథము దిగి వారిని సమీపించెను.

"గోపికలారా! నేను బృందావనమునకు దూరముగా వెళ్ళను, వెళ్ళలేను. బాహ్యవియోగములో మీరు వ్యథచెందుతున్నారు. అంతరంగిక సంయోగము నెరిగి ఆనందించండి. మీ హృదయములే నాకు నివాసము. దుఃఖించకండి. నేను త్వరలోనే తిరిగి వస్తాను" అని చెప్పి, మళ్ళీ రథమెక్కాడు. రథం ముందుకు దూసుకుపోయినది. కదిలే రథాన్ని కనుచూపుమేరకు చూచుచు కదలలేని గోపికల హృదయాలు మంచుగడ్డలా గడ్డకట్టాయి. బొమ్మలవలె నిశ్చేష్టులై ఉండిపోయారు గోపికలు.

అక్రూర, రామకృష్ణులున్న రథము వాయువేగమున చరించి, పరమపావనియైన యమునను సమీపించింది. శ్రీకృష్ణుడు రథమును దిగెను. నీరు త్రాగెను. బలదేవునితో కూడి మళ్ళీ రథము నధిరోహించెను.

బలరామకృష్ణులను రథమునందే ఉంచి, తాను స్నాన మాచరించుటకై అక్రూరుడు యమునను సమీపించెను. స్నాన మాచరించుచుండెను. ఒక మునకవేసెను. యమునా జలములో బలరామకృష్ణులు కలసి దర్శనమొసంగిరి.

అక్రూరునికి అంతా అయోమయంగా ఉంది. బలరామకృష్ణులు రథములోనే ఉన్నారు. మరి యమునా హ్రదములో ఎలా గోచరించారు? వెంటనే దృష్టిని రథమునైపు

సారించాడు. బలరామకృష్ణులు రథములో ఆసీనులై యుండినారు. ఇదేమిటి? రామకృష్ణులు రథములోనే యున్నారు. మరి జలములో తనకు గోచరించినది మాయయేనా? అని ఆలోచించసాగాడు. మళ్ళీ మునిగి చూడవలెనని సంకల్పించాడు.

శా॥ కంటిన్ మున్నురథంబుపై జలములోఁ గంటిం దుదిం గ్రమ్మఱం
గంటిం దొంటి రథంబుమీద నిదె యీ కళ్యాణచారిత్రు లే
వెంటం దోఁచిరి రెండుదిక్కుల? మనోవిభ్రాంతియో? వీటిలో
నంటాశ్చర్యముచూతునంచు మఱియు న్స్నాహించిమగ్నాంగుడై.

అని చింతించుచు అక్రూర మహాశయుడు మళ్ళీ మునకవేసెను. ఈసారి అనంతశయనుడగు నారాయణుడు లక్ష్మీసమేతుడై, దేవగణములో గూడినవాడై, నారద తుంబురాదులచే స్తుతించబడువాడై దర్శన మొసంగెను.

ఉ॥ పోషితబాంధవుండు యదుపుంగవుడుఁ డా జలమందుఁ గాంచె స
ద్భాషు సహస్రమస్తకవిభాసితభూషు నహీశు భూమిభృ
ద్వేషుఁ గృపాభిలాషుఁ బ్రతివీరచమూవిజిగీషు నిత్య సం
తోషు నరోషు నిర్దళితదోషు నవేకవిశేషు శేషునిన్.

ఈ దివ్యదర్శన భాగ్యములో కృష్ణగత చిత్తుడైన అక్రూరుడు సంభ్రమముతో చేష్టలుడిగి నిలబడిపోయెను. కొద్దిసేపు అలాగే ఉండి, ఆ తరువాత తేరుకొని రథమును సమీపించి, శ్రీకృష్ణునికి నమస్కరించెను.

"అక్రూర మహాశయా! నది సమీపములో ఉన్ననూ మీరు చాలా ఆలస్యముగా అరుదెంచినారు. కారణమేమిటి? నదీతీరమున తమకు వింతదృశ్యము లేమైనా కనబడినవా?" అని కృష్ణయ్య అడిగెను.

"వేదవేద్యా! విశ్వరూపా! శ్రీకృష్ణా! వింతలు నదిలో లేవు. నీలో ఉన్నాయి. విశ్వాత్మనైన నీకన్నా అన్యంగా ఏ వింతలు ఉండగలవు ప్రభూ!" అనెను.

క॥ నీలోన లేనిచోద్యము, లే లోకములందుఁ జెప్ప రీశ్వర నీటన్
నేలన్ వింగిని నున్న వె, నీలోఁ జోద్యంబులెల్ల నెగడు మహాత్మా!

అని అక్రూరుడు స్తుతించెను. రథమును తానే నడుపుచు సాయంత్రానికి బలరామకృష్ణులను తీసుకొని మధురకు చేరెను. మధురానగరమునకు సమీపమున నున్న ఒక వనముచెంత నందాది గోపాలురు శ్రీకృష్ణుని కొరకై నిరీక్షించుచుండిరి. శ్రీకృష్ణుడు రథము దిగెను. అక్రూరుని సమీపించెను. అక్రూరుని రథముతో కూడా ముందుగా మధురలో ప్రవేశించమని తెలిపెను. తాను ఆ వనమునందు కొంతసేపు విశ్రమించి వచ్చునట్లు తెలిపెను.

శ్రీకృష్ణుని మధురవాక్కుల నాలకించిన అక్రూరుడు చేతులెత్తి నమస్కరించుచు,



నాహం భవద్భ్యాం రహితః ప్రవేక్ష్యే మధురాం ప్రభో
త్యక్తుం నార్హసి మాం నాథ భక్తం తే భక్తవత్సల

"హే ప్రభూ! నేను మిమ్ములను వదలి ఒంటరిగా మధురకు వెళ్ళలేను. భక్తవత్సలా! దేవా! మీ భృత్యుడనైన నన్ను త్యజించకండి" అని ప్రార్థించెను.

"శ్రీకృష్ణా! బలదేవునితో కలసి మొదట మిమ్ము మాయింటికి రమ్మని ఆహ్వానిస్తున్నాను. ప్రభూ! మమ్ములను అనుగ్రహించండి. నీ దివ్య పాదరేణువులు ఏ గృహమున బడునో ఆ గృహము వైకుంఠమే యగును. బ్రహ్మకడిగిన నీ పవిత్ర చరణ యుగళిని అర్పించే మహాభాగ్యమును మాకు ప్రసాదించుము. లక్ష్మీదేవిచే సదా సేవించబడు నీ చరణకమలములను సేవించు భాగ్యమును మాకు ప్రసాదించుము. ఏ పాదపంకజములను శిరమున దాల్చి బలిచక్రవర్తి శాశ్వత అమృతపదవిని అలంకరించెనో అట్టి కారుణ్య చరణములను పూజించు అదృష్టమును మా కరములకు కలుగనిమ్ము!

దేవ దేవ జగన్నాథ పుణ్యశ్రవణ కీర్తన
యదూత్తమః శ్లోక నారాయణ నమోఽస్తుతే

"దేవదేవా! జగన్నాథా! పుణ్యశ్రవణ కీర్తనా! యదుకుల తిలకా! ఉత్తమశ్లోకా! నారాయణా! నీకు నా వందనములు" అని అక్రూరుడు శ్రీకృష్ణుని స్తుతించెను.

"అక్రూరా! ఆత్మీయుడవైన నీ ఇంటికి పూజ్యుడగు బలరామునితో గూడి నేను తప్పక వచ్చెదను. ముందుగా లోకకంటకుడైన కంసుని పరిమార్చి, ఆ తదుపరి నీ గృహమునకు అరుదెంచుదును" అనెను. నిజమే గదా! అజ్ఞానము అంతరించిన పిదపగాని శ్రీకృష్ణుడు మన హృదయమనెడి గృహములో ప్రవేశించడు. శ్రీకృష్ణుని పలుకుల నాలకించిన అక్రూరుడు నిరాశచెందినవాడై, మధురకు ఏతెంచి, కంసుని దర్శించి, బలరామకృష్ణుల రాక నెరింగించి, అక్కడనుండి తన గృహమునకు వెడలెను.

మధుర ప్రవేశము

గోపీజన పరివేష్టితుడైన వనమాలి మధురానగరములోనికి ప్రవేశించెను. ఈ విషయము మధురానగర స్త్రీలకు తెలిసెను. శ్రీకృష్ణుని దర్శించవలెననెడి ఉత్సాహములో వారు వస్త్రములను విపరీత రీతుల్లో ధరించారు. కంకణ కుండలాదులను ఒకదానిని ధరించి మరొకదానిని మరచిపోయిరి. అనగా శ్రీకృష్ణుని విషయము తప్ప రెండవ విషయము శ్రవణము చేయలేకపోయిరి అని భావము. కొందరు స్త్రీలు కాటుకను ఒకకంటిలో మాత్రమే ధరించిరి. శ్రీకృష్ణుని దర్శనము లభించవలెనన్నచో ద్వైతభ్రాంతి అడుగంటవలెను. ఏకవస్తు చింతనమే వాంఛనీయము అని అర్థము.

కొందరు స్త్రీలు భోజనము నారగించుచు, కృష్ణ దరుదెంచె ననెడి వార్త వినిన తక్షణమే భోజనములను వదలిపెట్టి పరుగులిడిరి. ఇంతవరకు అనుభవించుచుండిన ప్రాపంచిక విషయసుఖాలను పరిత్యజించిరి అని దాని భావము. నిద్రలోవు కొందరు

లేచివచ్చిరి. అనగా తమోగుణ సంపన్నులగువారు తమస్సును వీడిరి. కొందరు స్తన్యపానము చేయు శిశువులను విడిచిపెట్టి వచ్చిరి. అనగా తమ కన్నబిడ్డలపై కూడా మమకారమును వదలుకొనిరి.

మధురవాసులెల్లరు మాధుర్యమూర్తియైన మధుసూదనుని దర్శించిరి. నిత్య సుందర సముజ్జ్వల విగ్రహుడైన శ్యామసుందరుని దర్శించి అమితానందము నొందిరి. తమలో తాము ఆ పుర స్త్రీలు ఇలా భాషించుకొనిరి.

ఊచుః పౌరా అహో గోప్యస్తపః కిమచరన్ మహత్
యాహ్యేతా వను పశ్యన్తి నరలోక మహోత్సవౌ ॥

"ఆహా! బృందావన గోపికలు ఎంత పుణ్యవతులో గదా! నిత్యము ఈ రామకృష్ణుల దివ్య రూపములను దర్శించుచుందురు" అని చింతించసాగిరి.

తన ప్రేమచూడ్కులచేత మధురానగర స్త్రీల మానసములను అమృతమయముగా చేసిన శ్రీకృష్ణుడు దారిలో గుడ్డలమూటలను ఎత్తుకొని వచ్చుచున్న చాకలివానిని గాంచెను. ఆ రజకుని చేరబిలిచి సముచితమైన వస్త్రములను ఇవ్వమని అడిగెను. "మాకు వస్త్రముల నొసగుము; నీకు శుభములు చేకూరును" అనెను. సమస్త జీవరాసులను తన కరుణాదృష్టిచే బ్రోచు ముకుందుడు రజకుని యాచించుచున్నాడు. స్వయముగా భగవానుడే వచ్చి అడుగుచున్నను, ఇచ్చెడి భాగ్యమునకు ఆ రజకుడు నోచుకోలేదు.

"మూర్ఖులారా! గ్రామీణ జీవితానికి అలవాటుపడి, అడవులయందు పశువులను మేపు మీకు ఈ వస్త్రముల విలువ తెలియకపోవచ్చు. ఈ వస్త్రములు చాలా విలువైనవి. వీటిని ధరించుటకు కంసభూపతియే అర్హుడు. హుండి........హుండి. అసలు ఇలాంటి వస్త్రములను ఎక్కడైనా, ఎప్పుడైనా జూచితిరా? ఇటువంటి పిచ్చికోర్కెలను ఇకమీదట నా ముందు వెలిబుచ్చినచో మీరు బ్రతికియుండలేరు. జాగ్రత్త" అనెను.

రజకుని మాటలచే విస్మితుడైన బలరాముడు శ్రీకృష్ణుని జూచెను. దుర్మార్గుడగు చాకలివానిని వదలిపెట్టరాదని సైగచేయుచూ, వధించమని హెచ్చరించెను. శ్రీకృష్ణుడు బలరాముని సమీపించి. "సోదరా! ఈ చాకలివాడు వాచాలుడు. వీడి నాలుక మంచిదికాదు. దానికన్నా నాగుబాముయే మేలు. వాగుడు, త్రాగుడు అనెడి రెండు దుర్గుణాలు వీడి సొమ్ములు.

రామావతారంలో త్రాగుడుకు అలవాటుపడి వాగాడు. సీతను అరణ్యాలపాలు చేసాడు. ఈ జన్మలో వాగుడుకు అలవాటుపడ్డాడు. అందరిని తూలనాడుతున్నాడు. ఇక వీడిని ఈ ప్రపంచమునందు ఉంచి లాభములేదు" అంటూ చేతితో ఒక్కదెబ్బ వేయగా రజకుడు క్రిందబడి మరణించెను.

చూచితిరా! భగవానుడు మంచివారికి మంచివాడు. చెడ్డవారికి చెడ్డవాడు. మన భగవానునియందు మంచి చెడులనేవి ఉండవు. ఆయన ద్వంద్వాతీతుడు. మన ప్రవర్తనయే మనకు ఫలితముల నందించుచుండును.

శ్రీకృష్ణుడు మధురలో ప్రవేశించెను. పురస్త్రీలందరు భక్తితో ఆయనను సమీపించారు. స్తుతించారు. ధన్యత చెందారు. స్వామి కృపావీక్షణములచే తరించినవారై, పరమసుఖమును పొందినారు. కాని, రజకుడు అప్రయోజకుడై భగవానుని చేతిలో మరణించాడు. నిరంతరము భగవత్సేవలో రమించువారే ధన్యజీవులు.

రజకుడు మరణించెను. విలువైన ఆ వస్త్రములను తీసి, శ్రీకృష్ణుడు తన స్నేహితుల కొసంగెను. వారు ధరించిరి. అక్కడనుండి ముందునకు నడువసాగిరి.

మార్గములో ఒక సాలెవాడు శ్రీకృష్ణుని దర్శించెను. వెంటనే తన యొద్దనున్న మృదునైన దివ్యవస్త్రములచే శ్రీకృష్ణుని సన్మానించి, అలంకరించెను. ఆ సాలెవాని భక్తికి కరిగినవాడైన భగవానుడు అతనికి దివ్యైశ్వర్యముల నొసంగి ఆశీర్వదించెను.

బలరామకృష్ణులు ముందుకు నడువసాగిరి. శ్రీకృష్ణుని స్మృతిపథంలో ఒకవ్యక్తి తళుక్కున మెరసెను. అతడే సుదాముడనెడి భక్తుడు. పుష్పకైంకర్యవృత్తి నాచరించు తోటమాలి. భక్తుడైన ఆ తోటమాలిని అనుగ్రహించవలెనని శ్రీకృష్ణుడు సంకల్పించాడు. అతని గృహమునకు నడచినాడు.

శుభచరితుడగువానిని జూచుటకు భగవంతుడు పిలువకనే అరుదెంచును. ఆశించినంతమాత్రాన భగవానుడు లభించడు. అర్హత కలిగినవానినే పరమాత్మ సమీపించును.

శ్రీకృష్ణుడు సుదాముని చేరెను. సంతుష్టచిత్తుడైన సుదాముడు శ్రీకృష్ణునికి సాష్టాంగ దండప్రణామము నాచరించెను. "పరమాత్మా! శ్రీకృష్ణా! మీరాకచే నా గృహము పావనమైనది. పితృ, ఋషి, దేవ గణములు నా యెడల సంతృప్తి చెందినారు. విశ్వకళ్యాణార్థమై అవతరించిన మీరు మా జీవితాలను తరింపచేసారు. భగవాన్! నేను మీ భృత్యుడను. నేను చేయవలసిన సేవలను ఆజ్ఞాపించి తెలుపుడు" అనెను.

ఉ॥ పావన మయ్యె నా కులము పండెఁ దపంబు గృహంబు లక్ష్మికిన్
సేవిత మయ్యె నిష్టములు పేకుతె విశ్వనిదానమూర్తులై
భూవలయంబు గావ నిటు పుట్టిన మీరలు రాకఁ జేసి నే
నేవిధ మాచరింతుఁ బనులెయ్యవి బంట నెఱుంగఁ జెప్పరే.

అని కరమోడ్చి నమస్కరించెను. ఇలా పలికి సుదాముడు బలరామకృష్ణులకు దివ్య గంధమాలలను సమర్పించెను. ఆ మాలలను అలంకరించుకొని, శరణాగతుడగు సుదామునికి రామకృష్ణులు వరము తీయబోయిరి.

భక్తుడైన సుదాముడు ఈ విషయమును గ్రహించెను. భగవంతుడు తనకు వరము లీయనున్నాడని గ్రహించి ఇలా పలికెను.

సోఽవవ్రేఽచలాం భక్తిం తస్మిన్నే వాఖిలాత్మని
తద్భక్తేషు చ సౌహార్దం భూతేషు చ దయాంపరామ్ ॥

"భగవాన్! నీ యందు నాకు అచంచల భక్తిని, నీ భక్తులయొక్క సాంగత్యమును, సర్వభూతముల యందును అపారకరుణను ప్రసాదింపుము" అని ప్రార్థించెను.

క॥ నీ పాదకమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును, దాపసమందార నాకు దయసేయఁగదే!

అని పరవశించి గానమొనర్చెను.

ఆహా! మాలాకారుడైన సుదాముడు ఎంతటి పుణ్యాత్ముడో గదా! భౌతిక విషయసుఖాలను వాంఛించకుండా శాశ్వతానందము నొసగూర్చు శ్రేయములను కోరెను. అఖిలాంధ్రావనిలో ఈ పద్యము ప్రతి ఒక్కరి నాలుకపై కదలాడుచునే యుండును. శ్రీకృష్ణ పదారవింద చిత్తులైన భక్తులందరూ నిత్యమూ ఈ పద్యమును ప్రభాత సమయమున తప్పక పఠించాలి. స్మరించాలి.

భగవత్సేవ, సాధుసాంగత్యము, కరుణాహృదయము ఈ మూడు లభ్యమైనవానికి సర్వమూ సమకూరును. పుణ్యాత్ముడైన సుదాముడు ఈ మూడింటికీ నోచుకొనియున్న సుకృతాత్ముడు. అందుచేతనే పిలువకపోయినను, శ్రీకృష్ణుడు సుదాముని అనుగ్రహించుటకు అతని గృహమునకు అరుదెంచినాడు.

శబరి ఆహ్వానమును పంపకపోయినను పంపాసరోవర తీరప్రాంతముల యందలి మహర్షుల ఆహ్వానములను త్రోసిపుచ్చి, శ్రీరాముడు శబరి ఆశ్రమము చెంతకు వచ్చి ఆతిథ్యమును స్వీకరించెను. అర్హత కలిగిన వారిని అచ్యుతుడు ఆశీర్వదించును. సుదాముడు మాలాకారుడు. కుసుమమాలలను బాహ్యమున తయారుచేయుచు, సుగుణ మాలలను అంతర్యములో తయారుచేసుకొనినాడు.

భగవంతుడు పాండిత్యమును చూడడు. సిరిని చూడడు. బాహ్యాడంబరములను చూడడు. భక్తిని జూచును. పరమయోగులైన వారికి లభించని అదృష్టము సుదామునకు లభించెను. అహంకారరహితులై, మమకార వినిర్ముక్తులై, సర్వజీవులపై ప్రేమను చిందించుచూ, నిరంతరము హరి పదాబ్జములయందే చిత్తమును లగ్నమొనర్చి చరించువారు హరిభక్తిని పొంది, హరికృపకు పాత్రులై, హరి సాన్నిధ్యమును పొంది, హరిరూపులై తరింతురు.

మధురానగర వీధులలో బలరామకృష్ణులు చూడముచ్చటగా, ఏనుగు గున్నలవలె కదలుచున్నారు. వారివెంట గోపాలురు బహుసొంపైన దుస్తులను ధరించి, విజయఘోషల నందిస్తూ వెంబడిస్తున్నారు. కొందరు సంభ్రమముతో తిలకిస్తున్నారు. కొందరు భక్తితో తలవంచి నమస్కరిస్తున్నారు. కొందరు ఆ మహాత్ముడు నడచు దారులలో పూలు జల్లుతున్నారు. "అసురుల నెందరినో హతమార్చిన ఘనుడు ఇతడేనట. నేటితో కంసుని పాలకానికి తెరపడుతుంది" అని చెప్పుకుంటున్నారు. మధురానగరిలో ముగుదలందరు గుమిగూడి తొంగి తొంగి చూస్తున్నారు.

సీ॥ వీఁ డటే రక్కసి విగతజీవఁగ జన్నుఁ బాలుద్రావిన మేటి బాలకుండు
వీఁ డటే నందుని వెలఁదికి జగమెల్ల ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు
వీఁ డటే మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దావరీఁడు
వీఁ డటే యొలయించి వ్రేతలమానంబు సూఱలాడిన లోకసుందరుండు
తే॥ వీఁడు లేకున్న పుర మటవీస్థలంబు వీనిఁ బొందని జన్మంబు విగతఫలము
వీనిఁ బలుకని వచనంబు విహగరుతము వీనిఁ జూడని చూడ్కులు వృథలు వృథలు.

కంసదాసి కుబ్జ

రాజులకు రాజైన శ్రీకృష్ణుడు రాజమార్గంలో రమణీయంగా నడచుచుండెను. త్రోవలో త్రివక్ర యను స్త్రీ చందనము నింపిన పాత్రను చేతపట్టుకొని నడచుచుండెను. శ్రీకృష్ణుడు ఆమెను జూచెను. చల్లగా నవ్వెను.

క॥ ఎవ్వరిదానవు లేమ, యెవ్వరికిం గోరి కొనుచు నేఁగెదు నీ పే
రెవ్వతె మాకిమ్మన్నియు, నివ్వటిలెడు చక్కనగుచు నీరజనేత్రా!

"ఈ చందనాదులను ఎవ్వరికొరకు తీసుకొని వెడలుచున్నావు? ఈ చందనమును మా కొసగుము. నీకు శుభము చేకూరును" అనెను.

"సుందరా! నన్ను కుబ్జ అంటారు. నా శరీరము మూడు వంకరలుగా యున్నందున నన్ను త్రివక్ర అందురు. నేను కంసమహారాజు దాసిని. లేపన విద్యయందు నైపుణ్యము కలదానను. కంసునికి నేనంటే చాలా ప్రీతి. లేపన విద్యయందు నాకుగల నేర్పరితనమే అతనిని ఆకర్షించినది. ఈ సుగంధము కంసుని కొరకు తీసుకొని వెడలుచున్నాను. దీనిని ధరించి అనుభవించుటకు మీకన్నా అర్హులెవరున్నారు? కనుక మీరు ధరింపుడు" అనెను.

ఉ॥ చక్కనివాఁడ వాఁడు సరసంబుల నొంపకు మెల్లవారికిం
జక్కఁదనంబు లెక్కడివి చారుశరీర త్రివక్ర యండ్రు నే
నిక్కము కంసుదాసిని వినిర్మలలేపనవిద్యదాన నన్
మెక్కొలి రాజు మెచ్చుఁ దగ మీరు విలేపనముల్ ధరింపరే.

అని పలికి పాత్రలోని చందనమును తీసుకొని రామకృష్ణులకు అనులేపనము చేసెను. చందన లేపనముచేత రామకృష్ణు లిరువురు అధికశోభతో ప్రకాశించుచుండిరి. ఆమె చందనమును అనులేపనము చేసి శోభను పెంచిన కుబ్జయొక్క శోభను శ్రీకృష్ణుడు వృద్ధిచేయనెంచెను. భగవంతుని ఎవరు సంతృప్తి పొందింతురో వారిని భగవంతుడు సంతృప్తి పరచును.

పద్భ్యా మాక్రమ్య ప్రపదే ద్వ్యఙ్గుల్యుత్తాన పాణినా
ప్రగృహ్య చిబుకేఽధ్యాత్మముదనీనమదచ్యుతః

ఆమె రెండుపాదములను తన పాదములతో నొక్కిపట్టి, చేతివ్రేళ్ళతో గడ్డమును పట్టుకొని పైకెత్తినాడు. ముకుందుని స్పర్శను పొందిన కుబ్జ, విశాలమైన నితంబములు, కుచములు గల అపురూప సౌందర్యవతిగా మారిపోయెను. కుబ్జ తనను తాను చూసుకుని తృప్తి నొందెను. సంతృప్తినొందిన హృదయముతో తన యింటికి రమ్మని కృష్ణుని ఆహ్వానించెను.

క॥ వేంచేయుము నాయింటికిఁ, బంచశరాకార యనుచుఁ బైకొంగాక
ర్షించి హరిఁ దిగిచెఁ గామిని, పంచాశుగబాణజాల భగ్నహృదయయై.

అపర చతుర వచోనిధియైన శ్రీకృష్ణుడు కుబ్జతో "ఓ కోమలాంగీ! వేసవిలో పయనించు బాటసారులకు సరోవరము పరమ ఆనందదాయక మగునట్లు నీ గృహము మావంటి బాటసారులకు అందమైన ఆశ్రయస్థానమై యున్నది. అట్టి గృహమును దర్శించవలెనని ఆసక్తి ఎక్కువగుచున్నది. అయినా నే వచ్చిన పని పూర్తి అయిన పిదప నీ ఇంటికి వచ్చెదను" అనెను.

మానవుని చిత్తమే కుబ్జ. ఆమె కంసుని దాసి. చిత్తము సదా అజ్ఞానమునే సేవించుచుండును. కుబ్జ మూడు వక్రములు గలిగి త్రివక్ర అనిపించుకొనినది. మన మనస్సుకూడా సత్త్వరజస్తమో గుణములనెడి వక్రములతో కూడియున్నది. అజ్ఞానమును సేవించినంతకాలము వక్రములు తొలగవు. కంసుడనెడి అజ్ఞానమును సేవించు మనసనెడి కుబ్జ, జ్ఞానమనెడి కృష్ణుని సేవించుటకు ప్రయత్నించెను. అజ్ఞాన పరిధిలో చరించు చున్నంత కాలము బ్రతుకు వక్రించియే యుండును.

కుబ్జ కృష్ణుని దర్శించెను. మనసును అర్పించెను. చందనమును అందించెను. వందనమును సమర్పించెను. శ్రీకృష్ణునికి చందన మన్నను, వందన మన్నను బహు ఇష్టము. వందనము శరణాగతికి ప్రతిరూపము. శరణాగతులైన భక్తులను శ్రీకృష్ణుడు శీఘ్రముగా ఉద్ధరించును. త్రివక్రయై వికారరూపిణిగా గోచరించుచుండిన కుబ్జ కృష్ణసేవలో అతిలోకసుందరిలా మారిపోయినది. ప్రణతులగు వారినందరిని శ్రీకృష్ణుడు శోభతో నింపును.

భగవంతుడు కుబ్జ నెలా సంస్కరించెనో శరణాగతులగువారి నందరిని అలాగే ఉద్ధరించును. కుబ్జ పాదములపై తన పాదమునుంచి త్రొక్కిపట్టెను. మనసు అక్రమ మార్గమున చరించుచుండును. అది సరియైనది కాదని తెలుపుతూ భగవానుడు తన పాదముచే త్రొక్కిపట్టి మనసుయొక్క చలనమును నిరోధించును. భగవంతుని పాదము సత్యస్వరూపము. కనుక సత్యజీవనమును కలిగి, తద్వారా అసత్యపు నడకను అణచవలెనని తెలుపుటయే కుబ్జ పాదములను తన పాదముచే త్రొక్కిపట్టుటయందలి అంతర్యము.

తన పాదముచే కుబ్జయొక్క పాదములను త్రొక్కిపట్టిన శ్రీకృష్ణుడు తన చేతివ్రేళ్ళతో గడ్డమును పట్టుకొని పైకెత్తెను. మానవుని బుద్ధి ఎప్పుడూ అధోముఖంగానే

చరించుచూ, ప్రాపంచిక విషయములమధ్యనే రమించుచుండును. దృష్టిని ఊర్ధ్వముగా భగవానునివైపు త్రిప్పినపుడే ఆత్మానుభూతి కలుగును. అందుచేత తన చేతివేళ్ళతో కుబ్జయొక్క గడ్డమును పైకి ఎత్తి దృష్టిని ఊర్ధ్వముగా నిలిపెను. నడక సత్యమార్గమున ఉంచి, దృష్టి భగవానునిపై ఎవరు నిలుపుదురో వారు సర్వ వక్రములనుండి విడివడి, వక్రగతులను సరిచేసుకొని, శాంతరూపులై శోభించగలరు. ఇదియే కుబ్జ వృత్తాంతముద్వారా మనము గ్రహించదగిన ఆధ్యాత్మిక సందేశము.

కృష్ణుడు ముందునకు నడచుచుండెను. ఆ దివ్యాత్ముని చూచిన జనులు సమ్మోహితులగుచుండిరి. విస్మితులగుచుండిరి. ధనుర్యాగము జరుగు స్థలము వెదుకుచూ బలరామకృష్ణులు కదలివచ్చుచుండిరి. యాగప్రదేశమునకు వచ్చిరి. అత్యంత ఆకర్షణీయముగా, ఆశ్చర్యముగా ఇంద్రధనుస్సువలె గోచరించుచున్న ధనుస్సును కృష్ణుడు చూచెను. శ్రీకృష్ణుడు ముందుకు నడిచెను. ధనుస్సును స్పృశించకూడదని కావలివారు వారించుచుండిరి. అయినను శ్రీకృష్ణుడు వినలేదు. ధనుస్సును సమీపించెను. ఎడమచేతితో దానిని పైకి ఎత్తెను. దానికి ఎక్కుపెట్టెను. సర్వజనులు వీక్షించుచుండ మదపుటేనుగు చెఱకుగడను విరచునట్లు విరచెను. ఆ వెంటనే భయంకరమైన శబ్దము ధ్వనించెను. భూమంతయు దద్దరిల్లినట్లాయెను.

అంతఃపురమున నిదురిస్తున్న కంసుడు ఉలిక్కిపడి లేచాడు. భటులద్వారా జరిగిన సంగతి తెలుసుకున్నాడు. హృదయమంతా భయాందోళనలతో నిండిపోయింది. పిచ్చివాడిలా అంతఃపురమంతా పరిభ్రమిస్తున్నాడు. ఎటుచూసినా దుశ్శకునాలే కన్పిస్తున్నాయి.

కంసునికి జాగ్రత్స్వప్నముల రెండింటియందును అశుభసూచకములగు దర్శనములే కలుగుచుండెను. నీటిలో తన ప్రతిబింబమును దర్శించ యత్నించగా ఆ ప్రతిబింబమునకు శిరము లేకుండెను. చెట్లు స్వర్ణకాంతిలో గోచరించెను. బురదలో నడువగా పాదముద్రలు గోచరించకుండుట మొదలగునవి జాగ్రదవస్థలో తెలిసెను.

కంసుడు ఈ నరకయాతనను అనుభవించలేక, మధువు త్రాగి నేత్రములు మూసికొనెను. నిద్రపట్టింది. వెంటనే స్వప్నము కదిలింది. స్వప్నములో కంసుడు శవమును ఆలింగనము చేసుకొనెను. గర్దభము నధిరోహించెను. తైలలిప్తుడైన వ్యక్తి దిగంబరుడై చరించుచుండెను. విషపానము చేయుచున్నట్లుండెను. అశుభకరమైన ఈ లక్షణము లన్నిటిని గాంచి, కంసుడు అమితముగ వ్యథ చెందెను. మరణభీతి అధికమైంది. అశాంతియే ఆకృతిగా రూపుదాల్చింది.

శ్రీకృష్ణుడు యాగస్థలంలో ధనుస్సును విరచివేయగానే కంసుని సైన్యము రామకృష్ణులను వధించుటకు ముందుకురికింది. వెంటనే విరిగిపోయిన ధనుస్సుయొక్క రెండు ముక్కలను బలరామకృష్ణులు చేతపట్టుకొని వారిని తీవ్రముగా బాధించి వధించిరి. ఆ తరువాత మధురాపురిని తిరిగి చూసిరి. సంతసము నొందిరి. మధురవాసులెల్లరు ఈ బాలుర అద్భుత పరాక్రమములను జూచి వీరిని దైవస్వరూపులని భావించిరి. సూర్యుడు అస్తమించెను. రామకృష్ణులు గోపబాలురతో కలిసి ఊరుబయట నందాదులయొక్క శిబిరములుండు చోటికి వచ్చిరి.

సూర్యోదయ మయ్యెను. కంసుని హృదయములో భయ ముదయించెను. "మల్లక్రీడోత్సవము"ను ఏర్పాటు చేయుమని కంసుడు ఆజ్ఞాపించెను. చూస్తుండగనే మల్లక్రీడ రణభూమి అత్యంత శోభాయమానంగా అలంకరించబడినది. పురజనులు ఒకవైపు ఆసీనులైరి. బ్రాహ్మణులు, రాజులు తమకు నిర్ణయించిన ఆసనములలో ఆసీనులైరి.

కంసుడు సింహాసనముపై ఆసీనుడయ్యెను. అమాత్యులు చుట్టూ నిలబడిరి. కంసుడు సింహాసనము మీద యున్నను గ్రామసింహమువలె భయకంపితుడై యుండెను. కృష్ణసింహము ఏ క్షణాన అరుదెంచునో యని భయపడుచుండెను. కంసుని పక్షాన ఉన్న మల్లవీరులందరు రంగప్రవేశము చేసిరి.

చాణూరో ముష్టికః కూటః శలస్తోశల ఏవ చ
త ఆసేదు రుపస్థానం వల్గు వాద్య ప్రహర్షితాః

చాణూరుడు, ముష్టికుడు, కూటుడు, శలుడు, తోశలుడు మున్నగు మల్లయోధులు రంగభూమిపైకి వచ్చి ఆసీనులైరి.

నందాది గోపాలురు అరుదెంచిరి. తాము తెచ్చిన కానుకలను సమర్పించిరి. వారందరు ఒకచోట ఆసీనులైరి.

కువలయాపీడం కూలిపోయింది.

బలరామకృష్ణులు మల్లక్రీడోత్సవాన్ని తిలకించేందుకు బయలుదేరారు. మల్లరంగ ద్వారము చేరేసరికి అక్కడ కువలయాపీడమను మత్తగజం నిలబడి యున్నది. దాని ప్రక్కనే మావటివాడు నిలబడియున్నాడు. శ్రీకృష్ణునికి పరిస్థితి అంతా అర్థమైంది. వదుము దిగించాడు. ముంగురులను సరిజేసుకొన్నాడు.

ఉవాచ హస్తిపం వాచా మేఘనాద గభీరయా

మేఘ గర్జనవలె మావటివానితో ఇలా పలికెను.

"ఓ మావటివాడా! మా దారికి అడ్డురాకుము! లేదా నీదారి గోదారియే. దూరముగా తొలగుము. త్వరితముగా వెళ్ళుము. లేదా నీ దంతావళంతో బాటు నీవుకూడా యమపురికి చేరక తప్పదు" అని అన్నారు కృష్ణయ్య.

శా॥ ఓరీ కుంజరపాల! మాదెసకు నీ యుద్యన్మదేభేంద్రమున్
బ్రేరేపం బనిలేదు త్రిప్పుమరలం బ్రేరేచితేన్ నిన్నుఁ గం
ఠీరోగ్రాశనితుల్య ముష్టిహతులన్ భేదించి నేఁ దంతకుం
బేరం బుత్తు మహోత్తరద్విపములతో సిద్ధంబు యుద్ధంబునన్.

కృష్ణయ్య మాటలు నాలకించిన మావటివాడు కోపోద్రిక్తుడాయెను. కుపితుడైన హస్తిని శ్రీకృష్ణునిపైకి పరిగెత్తించెను. ఆ మదపుటేనుగు కృష్ణయ్యకు ఎదురుగా వచ్చి

తొండముతో ఆయనను పట్టుకొనబోయెను. కృష్ణయ్య తప్పించుకొని దానిని ఒకగ్రుద్దు గ్రుద్దెను. అది పట్టుకోబోగా దాని కాళ్ళ నడుమనుండి వెళ్ళి దాని క్రిందనే దాగెను. కృష్ణయ్య కువలయాపీడకు కనుపించలేదు. అందుచేత కృష్ణయ్యను వెదుకుచూ గింగరములా తిరుగసాగినది. ఎలాగో చివరికి వాసన పట్టింది. ముందు కురికింది. వెంటనే వెనుదిరిగి కృష్ణయ్యను తొండముతో పట్టుకొన్నది. అతి చాకచక్యముతో కృష్ణయ్య కువలయమును ఏడిపించుకొని దూరముగా చనినాడు. ఈసారి కృష్ణయ్య దాని వెనుకకు పరుగెత్తి వాలమును పట్టుకొని, గరుడుడు సర్పమును లాగునట్లు కువలయాపీడమును నూరు మూరల దూరము లాగెను. పిల్లలు లేగదూడయొక్క తోకను పట్టుకొని దానితోపాటు తిరుగుచుండు విధముగా కృష్ణయ్య దాని తోకను పట్టుకొని అది ఎడమవైపునకు తిరిగిన తాను కుడివైపునకు తిరుగుచు, అది కుడివైపుకు తిరిగిన తాను ఎడమవైపుకు తిరుగుచు దానిని ఏడిపించెను. తాను పరుగెత్తును. గజము వెంబడించును. పరుగిడలేనట్లు కృష్ణయ్య పడిపోవును. అది దగ్గరికి రాగానే లేచి పరుగెత్తును.

కృష్ణయ్య క్రిందబడెను. ఇదియే అదనుగా భావించి, దంతములతో ఏనుగు శ్రీకృష్ణుని చంపజూచెను. శ్రీకృష్ణుడు ప్రక్కకు పొరలెను. కువలయాపీడయొక్క దంతములు భూమికి గ్రుచ్చుకొనెను. ఏనుగు భరించలేని బాధ ననుభవించెను. ఇక కృష్ణయ్య ఆలస్యము చేయక చంపదలచెను. తనకు అభిముఖముగ వచ్చుచున్న ఏనుగును చేతితో పట్టుకొనెను. దాని తొండమును పట్టుకొని నేలపడద్రోసెను. నేలమీద కూలబడిన కువలయాపీడను కృష్ణయ్య సింహమువలె తన పాదముచే అదిమిపట్టి, దాని దంతమును పెరికి, దానితోనే పొడిచి పొడిచి చంపెను. కువలయాపీడం చచ్చిపోయెను.

గజదంతములను రామకృష్ణులు ఆయుధములవలె ధరించి, మల్లయుద్ధరంగమున ప్రవేశించిరి. అజ్ఞానమనెడి కంసుడు వధించబడేముందు దాంభికత్వము, మదము నశించాలి. అజ్ఞాని రాజ్యములో ద్వారము దగ్గరే దాంభికత్వము ఎదురవుతుంది. దానిని వధించి, సాధకుడు లోనికెళ్ళి అజ్ఞానమును నశింపచేయాలి.

శ్రీకృష్ణుడు మల్లయుద్ధ భూమిలో ప్రవేశించాడు. తన దేహమంతయు ఏనుగు రక్తబిందువులు చిమ్మబడియుండెను. శ్రీకృష్ణుడు అత్యంత శోభాయమానముగా కన్పట్టుచుండెను.

మల్లానామశ నిర్నృణాం నరవరః స్త్రీణాం స్మరోమూర్తి మాన్
గోపానాం స్వజనోఽసతాం క్షితిభుజాం శాస్తాస్వపిత్రోః శిశుః
మృత్యు ర్భోజపతేర్విరాడ విదుషాం తత్త్వం పరం యోగినామ్
వృష్ణీనాం పరదేవతేతి విదితో రఙ్గం గతః సాగ్రజః

"శ్రీకృష్ణుడు మల్లయోధులకు పిడుగువలె కన్పించెను. మానవులకు శ్రేష్ఠుడుగా కన్పట్టెను. స్త్రీలకు మన్మథుడుగా గోచరించెను. గోపబాలురకు బంధువుగా తెలియవచ్చెను. పాలకులకు నియంతగా తెలియబడెను. మాతాపితృ సమానులైన వృద్ధులకు బిడ్డవలె గోచరించెను. కంసునకు మృత్యువుగా గన్పట్టెను. అజ్ఞానులకు వికృతముగా గోచరించెను.

యోగులైనవారికి పరమాత్మ స్వరూపుడుగా తెలిసెను. వృష్ణి వంశీయులకు పరమ దేవతారూపుడుగా గన్పట్టిన శ్రీకృష్ణపరమాత్మ బలదేవునితోకూడి రంగస్థల ప్రవేశము చేసెను.

రసో వైసః

"భగవానుడు రసస్వరూపుడు" అని వేదము ప్రవచించినది. నవరసముల నొలకబోయుచు నవనీతచోరుడు కంస సభలో ప్రవేశించినాడు. కృష్ణదర్శనముతో నీరసపడిన కంసునికి నవరసములను ఏకకాలమున అభినయించుచు, అభివ్యక్తి మొనర్చుచు పిడుగుపాటువలె విజృంభించుచు గన్పించెను. ఇచ్చట రంగస్థల ప్రవేశము చేయు సందర్భమున శ్రీకృష్ణుడు ఒక్కొక్కరికి ఒక్కొక్కవిధముగా గోచరించెను. దీనిని బాగా పరిశీలించినచో నవరసములను నల్లనయ్య ఎలా వ్యక్తమొనర్చెనో తెలియగలదు.

మల్లయోధులైన వారికి పిడుగువలె గోచరించి, భగవానుడు **రౌద్రరసమును** అభినయించెను. సామాన్య మానవులకు శ్రేష్ఠుడుగా గోచరించి, **అద్భుత రసానుభూతిని** కల్పించెను. స్త్రీలకు మన్మథుడుగా గోచరించి, విలాస లోచనములను అందముగా త్రిప్పుచూ **శృంగారరసమును** పోషించెను. గోపబాలురు ఆయనను బంధువుగా భావించుటచేత సహజ భలోక్తులను, నవ్వును కనబరచు కృష్ణుని జూచి నవ్వుకొనుచు **హాస్యరసము** ననుభవించిరి. శాసకులైన రాజులను శాసించు శాసనకర్తగా కనబడి, **వీరరసానుభూతి** చిందించెను. మాతృపితృ సమానులైన పెద్దలకు బిడ్డగా కన్పట్టుటచేత వారు **కరుణరసమును** అనుభవించిరి. కంసునికి మృత్యురూపముగా తెలిసినందున **భయానక రసానుభూతి** కలిగెను. అజ్ఞానులగు మానవులు ఆయన దేహముపైనున్న రక్తపు మరకలను జూచి **బీభత్స రసానుభూతిని** పొందిరి. వృష్ణివంశీయులకు దైవస్వరూపముగా తెలియుటవలన **భక్తి రసము** కూడా అనుభవించబడినది. ఈ విధముగా భగవానుడైన శ్యామసుందరుడు నవరసముల నొలకబోయుచు రంగస్థల ప్రవేశము చేసెను.

రామకృష్ణులను వీక్షించగానే కంసుడు నీరసపడిపోయెను. కువలయాపీడమును వధించిన రీతిని జూచి వీరు అజేయులని మనసులో నిర్ణయించుకొనెను. దేదీప్యమానముగా వెలిగిపోతున్న రామకృష్ణులను గాంచి, సంతుష్టచిత్తులైన జనులు సభలో ఇలా అభిభాషించుకొనుచుండిరి.

సీ॥ చంపె రక్కసిఁ బట్టి చక్రవాకునిఁ గూల్చెఁ బడద్రొబ్బె మద్దుల బకునిఁ జీరె
నఘదైత్యుఁ బొరిగొనె నడరి వత్సకుఁ ద్రుంచె గిరి యెత్తె దేవేంద్రుఁ గ్రిందుపఱచెఁ
గాలియు మర్దించె గహనానలముఁ ద్రావె గేశి సంతకుపురి ద్రేవ కవిచె
మయుపుత్రుఁ బరిమార్చె మటియును దానవ భటుల వారించి గోపకులఁ గాచె
తే॥ గోపకాంతల మనములఁ గోర్కిఁ దీర్చె నీ సరోరుహలోచనుం డీ శుభాంగుఁ
డీ మహోమహుఁ డీ దిగ్గజేంద్రవిభుఁడు మనుజమాత్రుఁడె తలపోయ మాధవుండు.

అని సంభాషించుకొనుచుండిరి.

చాణూర ముష్టికుల సంహారము

రంగప్రవేశము గావించిన రామకృష్ణులను జూచి చాణూరుడను మల్లయోధుడు ఇలా పలికెను: "హే బలరామకృష్ణులారా! మీరు ఇరువురు మల్లయుద్ధమున నైపుణ్యము గలవారని గొప్పవీరులుకూడా అంగీకరించిరి. మీ యుద్ధకౌశల్యమును గాంచవలెనని కుతూహలపడి రాజుగారు మిమ్ములను ఇచ్చటికి ఆహ్వానించారు. రాజును సంతృప్తిపరచుట ప్రజలయొక్క ధర్మము. కనుక మనమందరమును రాజుగారికి తృప్తిని, ఆనందమును కలిగించెడి కర్మములను ఆచరించవలెను" అనెను.

చాణూరుని పలుకులలోని కుటిలత్వమును శ్రీకృష్ణుడు పసిగట్టెను. శ్రీకృష్ణుడు అతి చాతుర్యముతో మాటలాడసాగెను. "అవును, మీరు చెప్పుచున్నది వాస్తవము. మల్లయుద్ధము నాకు అత్యంత ప్రీతికరము. పైగా రాజును సంతృప్తిపరచగలిగినచో మాకు రాజుగారి అనుగ్రహము లభించును. కానీ మేము బాలురము. కనుక మాతో సరిపడు మల్లురతో పోరాడగలము. అది ధర్మయుద్ధమని కూడా అనిపించుకొనును. మల్లయుద్ధములో అధర్మము అవాంఛనీయముగదా" అని కృష్ణయ్య పలికెను.

కృష్ణయ్య పలుకులను ఆలకించిన చాణూరుడు "కృష్ణా! నీవు, బలరాముడు బాలురు గారు. వయస్సులో చిన్నవారైనను శక్తిలో బహు గొప్పవారై యున్నారు. వేయి యేనుగుల శక్తి గల కువలయాపీడమను గజమును నీవు అవలీలగా చంపగలిగితివి. కనుక నీవు నాతోను, బలరాముడు ముష్టికునితోను యుద్ధము చేయవలసియుండును" అని పలికెను. వారితో పోరుటకు బలరామకృష్ణులు అంగీకరించిరి. చాణూరుడు సంతసించెను. తన ప్రతాపమును చెప్పుకొనుటకు ప్రయత్నించెను.

క॥ ప్రల్లద మేటికి గోపక, బల్లిదుఁడను లోకమందుఁ బ్రఖ్యాతుఁడ నా
చల్లడము క్రిందఁ దూఱని, మల్లులులేరెందు ధరణిమండలమందున్.

అని చాణూరుడు ఆత్మస్తుతి గావించుకొనినాడు.

చాణూరుడు ప్రగల్భములు పలుకుచుండ ముష్టికుడు రంగస్థలమున ప్రవేశించెను. సింహగర్జన చేసెను.

మల్లయుద్ధం ప్రారంభమైనది. కృష్ణుడు చాణూరునితోను, బలదేవుడు ముష్టికునితోను యుద్ధము చేయసాగిరి. ముష్టికుడు, చాణూరుడు ఇరువురును కొండంత దేహములను కలిగియుండిరి.

చేతులు కలిపిరి. పాదములను పరస్పరం మెలి త్రిప్పుకొనిరి. ఒకరినొకరు లాగుకొనసాగిరి. బిగించిన పిడికిళ్ళతో కొట్టుకొనసాగిరి. జానువులతో, శిరములతో ఢీకొనసాగిరి.

పరిభ్రామణ విక్షేప పరిరంభావ పాతనైః
ఉత్సర్పణాప సర్పణైశ్చాన్యోన్యం ప్రత్యరుధ్యతామ్

ఈ విధముగా వారు పరిభ్రమణములు, విక్షేపములు, పరిరంభణములు, అధఃక్షేపములు, ఉత్సర్పణములు, అపసర్పణములు మున్నగు అనేక పద్ధతులద్వారా పరస్పరము బాధించుకొనుచుండిరి. పరస్పరము జయించవలె ననెడి అభిలాషతో మిక్కిలి శ్రమించుచుండిరి.

ఈ మల్లయుద్ధమును ప్రజలు మెచ్చలేకపోయిరి. విబుధులు నచ్చలేకపోయిరి. ఇది సమ ఉజ్జీలమధ్య పోరుగాదని భావించిరి. ఇది అన్యాయ సమరమని నిర్ణయించిరి. అధర్మ సంగ్రామమని తమలో తాము భావించుకొనిరి. బలవంతులకు, బలహీనులకు జరిగెడి అక్రమపోరాటము అని భావించిరి.

"ఆహా! ఇది ఏమి అన్యాయము? ఈ సభలోని వారందరు అన్యాయముగా ప్రవర్తించుచున్నారు. బలవంతులకు, బలహీనులకు మధ్య జరుగు సమరమును హృదయము లేనివారై వీక్షించుచున్నారు. రాజును ఎదిరించి చెప్పలేక పోతున్నారు. కఠినదేహులైన చాణూరముష్టికులెక్కడ? సుకుమారులైన ఈ రామకృష్ణులెక్కడ? ఇది ధర్మమును కోల్పోయిన సభ. ఇచ్చట మనము ఉండతగినవారము కాము" అని కూడా ప్రజలు పలుకసాగారు.

మధురానగర స్త్రీలు ఈ సమరమును గాంచుచు "శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవానుడే. ఈ నాడు మా పుణ్యముల పంటగా కృష్ణుడు మాకుదర్శన మొసంగినాడు. కానీ మాకన్నను గోపికలే గొప్పపుణ్యము చేసినారు. శ్రీకృష్ణుని మనోజ్ఞమైన క్రీడలను వారు దర్శించగా, మేము ఈ బీభత్స సన్నివేశమును గాంచుచున్నాము" అని పలుకసాగిరి.

జనులు మాటలాడుకొను సంభాషణమును ఆలకించి దేవకీవసుదేవులు అమితముగా బాధపడిరి.

కృష్ణయ్య శరీరతాకిడికి చాణూరుడు హీనదేహు డగుచుండెను. అలసిపోవుచుండెను. ఆవేదన చెందుచున్నట్లు ముఖములో గోచరించుచున్నది. చాణూరుడు కోపోద్రిక్తుడై గరుడునివలె విజృంభించి, శ్రీకృష్ణునిపైబడి, అతని వక్షస్థలమును బలముగా గ్రుద్దెను.

ఆ దెబ్బకు కన్నయ్య చలించలేదు. పుష్పఘాతమునకు గురియైన యేనుగువలె కదలకయుండెను. ఇక చాణూరుని సంహరించవలెనని శ్రీకృష్ణుడు అభిప్రాయపడెను. వాని రెండుచేతులను పట్టుకొని గిరగిర త్రిప్పి నేలపై విసరివేసెను. చాణూరుడు క్రిందపడి మరణించెను.

కృష్ణయ్య చేతిలో చాణూరుడు మరణించుచుండగా, బలరాముడు పిడికిలి బిగించి ముష్టికుని తీవ్రముగా కొట్టెను. ఆ దెబ్బకు ముష్టికుడు కంపించుచు క్రిందపడి, ప్రాణములు విడిచెను. చాణూరముష్టికులు మరణించగనే కూటుడను మల్లుడు రంగప్రవేశము చేసెను. వానిని బలరాముడు వధించెను. ఆ తరువాత శలుడు, తోశలుడు వచ్చిరి. వారిరువురిని క్రింద పడవైచి తన పాదములతో వారి శిరములను త్రొక్కి పట్టగా వారు ముక్కలుగా శిరములు పగిలినవారై మరణించిరి.

మానవజీవన పోరాటమే మల్లయుద్ధభూమి. అందులో ప్రవేశించిన చాణూరముష్టికులే మనము జయించవలసిన కామక్రోధాదులు. ప్రేమచేత కామమును జయించాలి. అందుచేతనే చాణూరుని శ్రీకృష్ణుడు వధించెను. దైవబలముచే క్రోధమును జయించాలి. ఆ కారణముచేతనే బలరాముడు ముష్టికుని వధించెను. కామక్రోధములనెడి చాణూరముష్టికులను ఎవడయితే వధించునో, అట్టివాడు ఆ తరువాత కంసుడనెడి అజ్ఞానమును హతమార్చును.

ఆధ్యాత్మిక సాధకునకు కామమొక భయంకరమైన శత్రువు. నయముగాని వ్యాధి. కామమును జయించనివానికి ప్రగతి కుదరదు. కామక్రోధములను జయించినవాడు జీవన్ముక్తుడగును.

శక్నోతిహైవయ స్సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్
కామక్రోధోద్భవం వేగం సంయుక్తః స సుఖీనరః

"ఎవడు ఈ శరీరమునందే దేహమును చాలించుటకు పూర్వమే కామక్రోధములవలన కలిగిన సంక్షోభమును అరికట్టకలుగుచున్నాడో వాడే యోగియై, సుఖియై యున్నాడు" అని భగవద్గీతలోని కర్మసన్న్యాసయోగము తెలుపుచున్నది.

చాణూరుడు శ్రీకృష్ణునితో పోరు సలుపునపుడు మేఘగర్జన చేసి బెదిరించసాగెను. అంతట శ్రీకృష్ణుడు "నీవు నన్ను ఏమీ చేయలేవు. మా అమ్మ నాకు పాలు, పెరుగు చిన్ననాడే బాగా తినిపించింది. నిన్ను నేను తప్పక వధించగలను" అనెను. కామము ఆహారమువలన కూడా వశపడును. మితిమీరి భుజించరాదు. మనము తీసుకొను ఆహారము సాత్త్వికమైనదియై యుండాలి.

చాణూరుడు ఎంతగా వాగుచున్నను శ్రీకృష్ణుడు చలించలేదు. కామమును నిగ్రహించుటలో మౌనముకూడా బాగా సహకరించును. కామక్రోధాదులనెడి చాణూరముష్టికులు వధించబడిరి. ఇప్పుడు శ్రీకృష్ణుడు కంసుడనెడి అజ్ఞానమును సంహరించును.

చాణూరముష్టికులు మరణించిరి. వారి మరణము కంసునితప్ప సర్వులను సంతృప్తిపరచినది. కంసుడు కోడెత్రాచులా తయారయ్యాడు. బలరామకృష్ణులను తరిమివేయుమని పిచ్చికేకలు పెడుతున్నాడు. నందుని బంధించమంటున్నాడు. గోపాలుర సంపదలను అపహరించ మంటున్నాడు.

ఉ॥ వల్లవబాలురన్ నగరివాకిటికిన్ వెడలంగ ద్రొబ్బుఁ డీ
గొల్లల ముట్టికోల్ గొనుఁడు క్రూరుని నందునిఁ గట్టుఁ డుర్వికిం
జెల్లముగాఁగ నేఁడు వసుదేవునిఁ జంపుఁడు తండ్రిగాఁడు వీఁ
డెల్లవిధంబులం బరుల కిష్టుఁడు గావకుఁ డుగ్రసేనునిన్.

అని గర్జించెను. "కృష్ణుని తండ్రియగు వసుదేవుని, అనుకూల శత్రువైన వాడిని సంహరించుడు" అని అరచెను.

శ్రీకృష్ణుడు కంసుని సమీపించెను. తనకు చేరువవుతున్న శ్రీకృష్ణుని గాంచిన కంసుడు మృత్యువే తన వద్దకు వచ్చుచున్నదని భావించెను. శ్రీకృష్ణుని వధించుటకు ఖడ్గమును చేబూనెను. శ్రీకృష్ణుని సంహరించ యత్నించుచుండిన కంసుడు గగనమున గ్రద్దవలె కృష్ణునికి అటుఇటు తిరుగుచుండ, శ్రీకృష్ణుడు గరుడుడు సర్పమును పట్టుకొనునట్లు కంసుని పట్టుకొనెను.

శ్రీకృష్ణుడు కంసునిపై బడెను. కంసుని కిరీటము క్రిందబడెను. కంసుడు నేలపై బడెను. రెక్కలు తెగిన పక్షిలా కూలబడిన కంసుని వక్షస్థలముపై కృష్ణయ్య కూర్చొనివాడు. పిడికిలి బిగించాడు. "పంద్రెండు సంవత్సరాలుగా నీ ప్రతిరూపాలను హతమార్చసాగావు. ఈ నాడు నిన్నే వధిస్తాను" అంటూ ఒక దెబ్బవేశాడు. అంతే. కంసుడు రక్తమును కక్కి మరణించాడు. జనులందరు ఆనందముతో హాహాకారములు చేశారు. దేవతలు పుష్పవర్షమును కురిపించారు.

కంసుడు మరణించగానే ఆయన తమ్ములైన కంకుడు, న్యగ్రోధుడు అనువారలు కృష్ణునిపైకి ఉరికిరి. వారిని బలభద్రుడు వధించెను. ఈ వార్తను వినిన కంసుని భార్యలు విలపిస్తూ అక్కడికి అరుదెంచిరి. భర్త మృతదేహమును కౌగలించుకొని అమితముగా దుఃఖించిరి. శ్రీకృష్ణుడు వారిని ఓదార్చెను. కంసాదులకు అంత్యక్రియలు జరిపించెను.

బలరామకృష్ణులు దేవకీవసుదేవులను బంధవిముక్తుల గావించిరి. వారి పాదములకు నమస్కరించిరి. శ్రీకృష్ణుడు పరమాత్మయేనని బాగుగా తెలిసియుండుటచేత దేవకీ వసుదేవులు శ్రీకృష్ణుని ఆలింగనము చేసికొనలేరు. వందనము చేయుచూ నిలబడిరి. శ్రీకృష్ణుడు వారిని మాయ ఆవరించునట్లుచేసెను. వెంటనే వారు శ్రీకృష్ణుని తనయుడుగా భావించిరి.

"అమ్మా!నాన్నా!" అని శ్రీకృష్ణుడు పిలచెను. దేవకి బిడ్డను అమాంతం కౌగలించు కొనెను.

"తల్లిదండ్రులారా! మేము దురదృష్టవంతులము. తల్లిదండ్రులవద్ద పెరిగే భాగ్యానికి నోచుకోనివారము. తల్లిదండ్రులచెంత పెరిగిన బాలురకు ఉన్న అనుభూతులు మాకు అలభ్యమాయెను. తల్లిదండ్రుల ఋణము తీరేదికాదు. తల్లిదండ్రులను సుఖపెట్టని వానికి క్షేమము చేకూరదు.

క॥ చెల్లుబడి గలిగియెవ్వఁడు, తల్లికిఁదండ్రికిని దేహధనముల వృత్తుల్
చెల్లింపఁడట్టికష్టుడు, ప్రల్లదుఁడామీఁద నాత్మపలలాశియగున్.

"దురాత్ముడగు ఈ కంసుని భయముచే మేము నందగోకులంలో ఉండుట చేత జననీ తల్లిదండ్రులైన మీకు సేవ చేయలేకపోయితిమి. మీరు మమ్ములను క్షమింపుడు. జనకులకు సేవలొనర్చనివాడు మరణించినవానితో సమానము."

క॥ జననీ జనకుల వృద్ధులఁ దనయుల గురు విప్ర సాధు దారాదుల నే
జనుఁడు ఘనుఁ డయ్యుఁ బ్రోవక ననరును జీవన్మృతుండు వాఁడు ధరిత్రిన్.

అని కృష్ణయ్య అనెను. దేవకీవసుదేవులు బిడ్డలను ఒడిలోకి తీసుకొని తృప్తిచెందిరి. దుఃఖించిరి. అశ్రువులను కురిపించిరి. శ్రీకృష్ణుడు జననీజనకులను ఓదార్చి మాతామహుడగు ఉగ్రసేనుని యాదవులకు రాజుని జేసెను.

శ్రీకృష్ణుడు నందుని సమీపించెను. "తండ్రీ! మా తల్లి యశోదమ్మకు నా ప్రణామములు తెలియజేయుడు. నాకు మీరే తల్లిదండ్రులు. మీ ప్రేమలోనే నేను పెరిగాను. బిడ్డలమైన మాకు తొలిగా వాత్సల్యభిక్ష పెట్టినది మీరే. మీ ఋణము మేము తీర్చుకోలేము. నా తల్లి యశోదమ్మ వెన్నలాంటి హృదయముగలది. వెన్నపెట్టి నన్ను పోషించింది. తల్లిప్రేమ నందుకొని తల్లికి సేవచేయకుండా మధురకు వచ్చిన దురదృష్టవంతుడను. నన్ను క్షమించమని చెప్పు. ఆమె ప్రేమను తీర్చగలిగే శక్తి నాకు లేదని చెప్పండి. ఎవరడిగినా, నాతల్లిదండ్రులు యశోదానందులేనని చెబుతాను. తండ్రీ నేను ఎక్కడుండినా, ఎన్ని రాజ్యాలేలినా నా తల్లి రోటికి బంధించిన ఆ ప్రేమబంధనమును మరచిపోనని చెప్పండి. బృందావనమే నా హృదయమని తెలుపండి.

"నాన్నా! గోపికలందరూ తమ ప్రాణాలకన్నా నన్ను ఎక్కువగా ప్రేమించారు. వారి బిడ్డలకన్నా నన్నే ఎక్కువగా సేవించారు. వారి ఋణం తీర్చుకొనే శక్తి నాలో లేదు. ఋణం తీర్చలేని నేను చేతులెత్తి నమస్కరించానని చెప్పండి.

"నాన్నా! గోవులను,గోవత్సములను శ్రద్ధతో, భక్తితో పోషించమని గోపాలురకు చెప్పండి. తృణపూర్ణములైన ప్రదేశములకు గోవులను మళ్ళించమని నా మాటగా చెప్పండి. గంగిగోవు నా కొరకు బెంగపెట్టుకొని ఉంటుంది. త్వరలోనే రాగలనని చెప్పండి.

"నాన్నా! బాలుడనైనందున తెలిసియో, తెలియకనో మిమ్మల్నందరిని బాధించి ఉంటానేమో! నన్ను క్షమించండి. నా వలన కలిగిన బాధల్ని జ్ఞాపకం ఉంచుకోకండి.

"తండ్రీ! నిస్వార్థపరులైన మీ ఒడిలో పెరిగిన మీ బిడ్డడు స్వార్థము లేకుండా జీవించి, మీకు మంచిపేరు తెస్తాడని శిరమోడ్చి నమస్కరించి తెలుపుతున్నాను. మీ అమృత హస్తాలద్వారా వెన్న నారగించిన మీ తనయుడు కఠినజీవనము తెలియనివాడై సుస్థిరంగా జీవించగలడని నమ్మండి. త్వరలో వ్రజపురమునకు రాగలను. నన్ను ఆశీర్వదించండి" అని నందుని పాదాలపైబడి కృష్ణయ్య సాష్టాంగ నమస్కారము చేసెను.

నందుడు కృష్ణయ్యను లేవదీసి, కౌగలించుకొని "తండ్రీ! కన్నయ్యా! క్షణమైనా నిన్ను మరువకుండా మేము జీవించే ఒక్కవరాన్ని ప్రసాదించు చాలు" అని [illegible]లేకపోయెను. మాటలు కదిలించలేని నందలాలా మెల్లమెల్లగా అడుగులను కదిలించి వ్రజపురమువైపు నడిచెను.

ఎంతవారికైనా ఎడబాటు తప్పదా? మాయని మమతలు తీరని ఋణాలై మిగిలిపోతాయా? కలసివచ్చిన అదృష్టాలు కొందరికి చేరువగా నిలువవు. చేరువైన అదృష్టాలు చెదరి బాధను కల్గిస్తాయి. ఋణానుబంధాలు ఇంతేనేమో! కన్నదెవరు? పెంచినదెవరు? ఆడించినదెవరు? ఆటలాడినదెవరు? దొంగెవరు? రాజెవరు? అసత్యాలు పలికిందెవరు? పలికించిందెవరు? చంపిందెవరు? చంపించిందెవరు? అనురాగమెవరిది? అదృష్టమెవరిది? తల్లి ఎవరు? తండ్రి ఎవరు? జన్మించినదెవరు? జన్మ ఎవరికి?

కన్నయ్యా! ఇవన్నీ నీకే తెలియాలి!
కన్నది ఎవరైనా, మమ్మల్ని కనికరించవలసినది నీవే!
కరుణామయా! కారుణ్యాలయా! పాహిమాం ప్రభూ!పాహిమాం!
పతితపావనా! పావనచరణా! రక్షమాం ప్రభూ! రక్షమాం!

జై బృందావన విహారిలాల్‌కి జై

ఉపనయనము-గురుకులవాసము

ఆనందముతో నిండియున్న వసుదేవుడు బలరామకృష్ణులకు ఉపనయన సంస్కారము జరుపుటకు సన్నాహములు చేయించెను. గర్గమహర్షిని ఆహ్వానించెను. విప్రోత్తములను రప్పించెను. వారి నందరిని సేవించెను. అర్చించెను. ఘనముగా సత్కరించెను. శ్రేష్ఠులైన వారిని సంతృప్తి పరచువారికి భగవానుడు శ్రేష్ఠత్వము ననుగ్రహించును.

వసుదేవుని మనస్సులో మెరుపులా ఒక ఆలోచన ఉదయించెను. వసుదేవుడు రెండు క్షణము లాలోచించెను. శ్రీకృష్ణుడు జన్మించిన శుభసమయాన వసుదేవుడు చెరసాల యందు బంధింపబడి యుండెను. పుత్రుడుదయించె ననెడి సంతోషముతో వసుదేవుడు బ్రాహ్మణులకు మనసులో గోదానము చేసెను. ఆ నాటి ఆ విషయమును మనస్సులో స్మృతికి తెచ్చుకొని, ఈ నాడు దానిని ఆచరించుటకు సంసిద్ధుడయ్యెను. ఆడిన మాటను కూడా మహాత్ములు విస్మరించరు.

యాః కృష్ణ రామ జన్మర్క్షే మనోదత్తా మహామతిః
తాశ్చాద దాదనుస్మృత్య కంసేనా ధర్మతో హృతాః

తన గోవులను దుర్మార్గుడగు కంసుడు అపహరించుటచేత ఆ నాడు మనసులో చేసిన గోదానమును ఇవ్వలేక పోయెను. ఈ నాడు విఫల మనోరథమును నెరవేర్చు కొనుటకై ధేనువులను బ్రాహ్మణులకొసంగెను.

గర్గమహర్షి పూర్ణ సంతుష్టహృదయుడై బలరామకృష్ణులకు ఉపనయన సంస్కారమును గావించెను. గర్గమహాముని పరమాత్మకు పదేపదే అంతర్యములో నమస్కరించుకొనెను. అద్భుతరూపుడగు శ్రీకృష్ణునకు ఆ నాడు గోకులమున నామకరణము చేయుభాగ్యము

ఈ నాడు మధురలో ఉపనయన సంస్కారమును జరిపించు భాగ్యము తనకు గలుగుట కేవలము భగవత్కృపయే నని భావించి, గర్గమహర్షి పులకాంకిత దేహుడై పునఃపునః భగవానునకు మనస్సులో వందన మిడుచుండెను.

భగవత్కృప తోడైనపుడే మనము పుణ్యకార్యమును చేయగలుగుదుము. ప్రతి పుణ్యకార్యము నాచరించునపుడు పరమాత్మను ధ్యానించాలి. అలాగే పుణ్యకర్మాచరణము ముగిసిన పిదప ప్రశాంతచిత్తముతో పరమాత్మను స్మరించాలి. అప్పుడే పుణ్యకర్మలు మోక్షధామమునకు బాటను నిర్మించును. సత్కర్మ లాచరించిన పిదప అహంకారముతో విఱ్ఱవీగువారు పతన మగుదురు.

గర్గమహర్షి గోకులములో శ్రీకృష్ణునికి నామకరణ మొనరించెను. మధురలో ఉపనయనము జరిపించెను. భక్తిశ్రద్ధలతో నామకరణము జరిపించు వారికి ఉపనయన మహోత్సవములో పాల్గొనే అవకాశము లభించును.

గర్గమహర్షి గోకులమునకు వెళ్ళి నందుని ఇంటియందున్న పరమాత్మకు నామకరణము చేసెను. భగవన్నామమును గాన మొనర్చుటయే ఇచ్చట నామకరణ మహోత్సవము. అది గోకులమునందే జరుగును. గోవు సాత్త్వికమైనది. మన చిత్తము సత్త్వసంపదతో కూడి యుండునపుడే మనము భగవన్నామమును ఆలపించగలము.

నామము విన్న నామి వద్దకు నడిపించును. నామస్మరణ చేయువాడు నారాయణుని సమీపించును. అదియే ఉపనయనము. "నయనం" అనగా నేత్రము. "ఉప" అనగా దగ్గరగా నుండుట యని భావము. మన దృష్టి భగవంతునికి చేరువుగా నుండుటయే ఉపనయనము. ఈ ఉపనయన మహోత్సవము మధురలో జరుగును. మధురాధిపతి యగు మాధవుని ధరించిన హృదయమే మధురానగరము. సత్త్వసంపద కలిగిన మనస్సనెడి గోకులంలో నామకరణము జరుగగానే మధురాతి మధురమైన పరమాత్మను కలిగిన హృదయమనే మధురానగరములో ఉపనయన సంస్కారములో పాల్గొను భాగ్యము లభించును. నామము నిర్విరామంగా మనస్సులో నడచినచో హృదయములో నున్న నారాయణుని సమీపించగలము.

ఉపనయన సంస్కారము ద్వారా రామకృష్ణులు ద్విజత్వమును పొందిరి. బ్రహ్మచర్య వ్రతము నవలంబించి గురుకుల వాసమునకు బయలుదేరిరి. రామకృష్ణులు కాశీనగరమును చేరిరి. ఆ తీరసమీపమున అవంతీపురమున నివసించుచున్న మహానుభావుడగు సాందీపని మహర్షిని సమీపించిరి.

శా. ఉర్విన్ మానవు లెవ్వరైన గురువాక్యోద్యుక్తులై కాని త
ద్విద్యారంభము సేయఁబోల దనుచున్ బోధించుచందంబునన్
సర్వజ్ఞత్వముతో జగద్గురువులై సంపూర్ణులై యుండియుం
గుర్వంగీకరణంబు సేయఁ జని రా గోవిందుఁడున్ రాముఁడున్.

సర్వజ్ఞులై, సర్వశాస్త్రములను, సమస్త విద్యలను కుక్షియందు నింపుకొనియున్న బలరామకృష్ణులు విద్యార్జనకై గురుకులవాసము చేయుటకు బయలు దేరినారు. ఇదియే శ్రేష్ఠాచరణ క్రమము. గురుబోధను గ్రహించనిదే వ్యక్తి పూర్ణపురుషుడు కాలేడు. గురువులేని విద్య గురుతు లేనిదని పెద్దలు చెప్పుచుందురు. ఆచార్య సేవనములో అంతఃకరణ శుద్ధిపడును. సద్గురు సాన్నిధ్యములోనే వ్యక్తి ఆప్తకాము డగునని తెలియజేయుటకే బలరామకృష్ణులు సాందీపని మహర్షిని సమీపించినారు.

వెలిగే దీపమే మరియొక దీపమును వెలిగించ గలదు. సముజ్జ్వల దీపకాంతియే సాందీపని. సూర్యతేజము అంధకారమును పారద్రోలునట్లు, జ్ఞానజ్యోతి అజ్ఞానాంధకారమును ఛేదించును. గురువు సాందీపని అయినపుడే శిష్యుడు తరించగలడు.

పెక్కు పుస్తకములను చిక్కు మస్తకములో తగిలించుకొని వెక్కి వెక్కి విలపించు శిశువువలె శాస్త్రమును అరణ్యరోదనముగా వినిపించు బోధకుల వలన అజ్ఞానావరణ భంగము కాదు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడై, అంతర్యములో విజ్ఞాన వెలుగులను కలిగియున్న గురువే సమ్యక్ జ్ఞానమును అందించగలడు. అతడే సాందీపని.

బలరామకృష్ణులు గురువును దేవునిలా భావించి సేవించిరి. వారి సేవలకు, సముచిత ప్రవర్తనకు సాందీపని సంతసించినవాడై వారికి సమస్తవిద్యలను ఉపదేశించసాగెను. బలరామకృష్ణులు అనిందిత ఆచరణతో గురువును సంతృప్తిపరచినట్లు వ్యాసభాగవతములో నందున్నది.* (10-45-32)

గురుదేవుని మనస్సును నొప్పించకుండా జీవించువారే నిజమైన శిష్యులు. అమృతమయమైన జ్ఞానమును అందించు గురుదేవుని అంతర్యమును విషతుల్యముగా మార్చు పాషండులు శిష్యులగుదురా? నింద లెరుగని ఆచరణ గలవారే నిజమైన శిష్యులు. ఆదర్శవంతమైన శిష్యులుగా బలరామకృష్ణులు తాము ఆచరించి, ఇతరులకు మార్గదర్శకులైనారు.

సాందీపని బలరామకృష్ణులకు సమస్త వేదములను, ధనుర్వేదమును, ధర్మశాస్త్రములను, తర్కశాస్త్రమును, రాజనీతిని సంపూర్ణముగా తెలియజేసెను. ఏకసంతాగ్రాహులై గురువు బోధించిన విషయమును విస్మృతికి తావివ్వక స్మృతిలో నిలుపుకొనిరి. అరువది నాలుగు కళలను అరువదినాలుగు దినములలో నేర్చిరి.

క॥ అరువది నాలుగు విద్యలు, నరువదినాలుగు దినంబు లంతనవారల్
నెఱవాదు లైనకతమున, నెఱినొక్కొకనాఁటినినికి నేర్చిరిలేశా!

అరువది నాలుగు విద్యలను అరువది నాలుగు దినములలో సాందీపని వద్ద బలరామకృష్ణులు నేర్చిరి. అనగా ఏ రోజు చెప్పిన విద్యను ఆరోజే గ్రహించిరని భావము. ఒకసారి బోధించిన విషయమును రెండవసారి విన నవసరము లేకుండా నిక్షిప్తం చేసికొనిరని అర్థము. శ్రవణములోనే మనన నిదిధ్యాసలను నింపుకొనిన పుణ్యశీలురు.

గురుదేవుని వద్దనుండి సమస్త విద్యల నభ్యసించిన రామకృష్ణులు గురుదేవునకు దక్షిణను సమర్పించవలెనని అభిప్రాయపడినారు. గురుదేవుని సమీపించినారు. తమ అభీష్టమును తెలియపరచినారు.

సాందీపని మారుపలుకలేదు. ఆప్తకాముడైన ఆ మహర్షికి ఆశలుండునా? అభీష్టము లుండునా? అందుచేత అర్ధాంగిని సమీపించి, ఆమెతో ఈ విషయమును చర్చించినారు. ప్రభాసక్షేత్రమున సాగరమున మునిగిపోయిన తన పుత్రుని తెచ్చి ఇవ్వమని గురుపత్ని అడిగెను. శిష్యుల అద్భుత మహిమలను, అపారశక్తి యుక్తులను తెలిసియుండుటయే ఈ కోర్కెను కోరుటలోని అంతర్భావము.

బలరామకృష్ణులు రథము నెక్కి సాగర తీరమున ప్రభాసక్షేత్రమును చేరిరి. బలరామకృష్ణులు సాగరుని చేరగానే అమితానందభరితుడైన సాగరుడు అర్చనా ద్రవ్యములను చేబూని పరుగెత్తుకొని వచ్చి ముందునిలిచెను. "పురాణ పురుషా! పరంధామా! వారిధి దాటి వచ్చి నీదివ్య ముఖారవిందమును దర్శించు భాగ్యమునకు నోచుకొని నన్ను కృతార్థుని చేయుటకు ఇచ్చట కరుదెంచితిరా? నా జన్మ ధన్యమైనది" అని నమస్కరించెను.

"సాగరుడా! నీ భక్తికి సంతసించితిని. కానీ ఈ ప్రభాసక్షేత్రమున నీవు మా గురుపుత్రుని కెరటములు జాచి దోచుకుంటివి. మేము అతని కొరకు వచ్చినాము. అతనిని వెంటనే మాకొసంగుము" అని శ్రీకృష్ణుడనెను.

"ఆదిదేవా! జగన్నాథా! క్షమింపుము. నేను మీ గురుపుత్రుని అపహరించ లేదు. నాలో పంచజనుడను రాక్షసుడు నివసించుచున్నాడు. అతడే మీ గురుపుత్రుని అపహరించి నాడు" అని సాగరుడు పలికెను.

శ్రీకృష్ణుడు సాగరుని మాటల నాలకించి, ఆలస్యము చేయకుండా సాగరములోనికి ప్రవేశించెను. పంచజనుని సంహరించెను. వాని పొట్టను చీల్చిచూచెను. కానీ అయ్యసురుని కుక్షిలో గురుపుత్రుడు గోచరించలేదు. పంచజనుని దేహమునుండి పుట్టిన శంఖమును తీసుకొని శ్రీకృష్ణుడు తిరిగి సముద్రతీరమునకు వచ్చెను. పంచజనుని దేహమునుండి వచ్చినదైనందున ఆ శంఖమునకు **పాంచజన్యమని** పేరు.

శ్రీకృష్ణుడు బలరామునితో కలిసి యమధర్మరాజును కలియుటకు సంయమనీ పురమునకు బయలుదేరెను. అక్కడికి వెళ్ళి పాంచజన్యమును పూరించెను. ఆ దివ్య నాదమును ఆలకించి, యముడు పరుగు పరుగున ఏతెంచి శ్రీకృష్ణుని దర్శించి, స్తుతించి, అర్చించెను. "ఆదిదేవా! ఈ భృత్యుడు తమకు చేయవలసిన సేవ ఏమిటో సెలవండి" అని వినమ్రుడై యముడు ప్రార్థించెను.

"యమధర్మరాజా! ధర్మబద్ధుడవై నీవు యమపురికి తీసుకొని వచ్చిన మా గురుపుత్రుని మాకు ఇవ్వవలసినది" అని శ్రీకృష్ణుడనెను. భగవత్సంకల్పమునకు అడ్డుండునా? యమధర్మరాజు గురుపుత్రుని తెచ్చి, శ్రీకృష్ణునకు అప్పగించి కైమోడ్చి నమస్కరించెను. గురుపుత్రుని వెంటనిడుకొని, బలరామకృష్ణులు సాందీపని

మునిచెంతకు వచ్చిరి. బాలుని అప్పగించిరి. గురుపత్ని సంతసించెను. "గురుదేవా! మరేదైనా కావలసినచో ఆజ్ఞాపించుడు" అని పరమాత్మ వినమ్రవచనములను పలికెను.

శిష్యులను గాంచి పరవశిస్తున్న సాందీపనిమహర్షి రామకృష్ణులను ప్రశంసించెను.

కో ను యుష్మ ద్విధ గురోః కామానా మవశిష్యతే

"నాయనా! మీవంటి వారికి ఆచార్యుడైన వానికి ఇంకా కోరికలు మిగిలి యుండునా?" అనెను.

పరమాత్మ లభ్యమైనవారికి వాంఛలు మిగలవు. వారు ఆప్తకాము లగుదురు. సర్వజ్ఞులగుదురు. సత్యమార్గమున చరించు గురువులు దేనినీ వాంఛించరు. కోరికల కొలనులో స్నానమాచరించువానికి జ్ఞానోదయము కలుగదు. ఆదర్శజీవియైన ఆచార్యునకు ఒక్కకోరికయే యుండును. సర్వజీవులు సుఖశాంతులతో మనగలగాలని అతడు నిత్యమూ ప్రార్థించును. అట్టి జీవనానికి ఉపకరించు వేదములు సదా విభ్రాజమానమై ఉండవలెనని ఆకాంక్షించును. తాను ఏ విధముగా నిస్వార్థబుద్ధితో జ్ఞానమును శిష్యునకు అందించునో, అలాగే తన శిష్యుడు కూడా ఆచార్యుడై, గురుమార్గంలోనే త్యాగబుద్ధితో జ్ఞానదానము చేయవలెనని అభిలషించును. బలరామకృష్ణులు గురువు వద్దనుండి సెలవు పుచ్చుకొనుచుండగా సాందీపనిమహర్షి ఒకమాట పలికెను.

ఛందాంస్య యాత యామాని భవన్త్విహ పరత్ర చ

"ఇహపరలోకము లందు వేదములు సదా ప్రకాశించు చుండవలెను" అనెను. ఆ మాట వినగానే శ్రీకృష్ణబలరాములు సాందీపనిమహర్షికి శిరమోడ్చి నమస్కరించి, మధురకు ప్రయాణము సాగించిరి.

తాను బోధించిన జ్ఞానమును పదుగురికి పంచమని సాందీపని శిష్యులను కోరెను. గురుదేవుని అభీష్టమును నెరవేర్చి, ఆచార్యుని తృప్తిపరచువారే నిజశిష్యులు. ఆచార్యుని ఆజ్ఞానుసారము శ్రీకృష్ణపరమాత్మ కురుక్షేత్రములో ఏమీ ఆశించకుండా అర్జునునికి జ్ఞానబోధ చేసెను.

బలరామకృష్ణులు రథము నధిరోహించి, మధురానగరమునకు తిరిగి వచ్చిరి. మధురాపురివాసులు అమితానందమును పొందిరి. పోగొట్టుకొనిన విశిష్టధనమును తిరిగి పొందినంతగా సంతోషించిరి.

గోకుల జ్ఞాపకాలతో గోవిందుడు

అది మధురానగరము. అంతఃపురము. ఏకాంతంలో ఏదో ఆలోచిస్తున్నాడు శ్రీకృష్ణుడు. అర్థంగాని అవ్యక్తావేదన ముఖములో గోచరిస్తున్నది. గతస్మృతులతో నిండియున్న హృదయం వేదనలకు ఆలయమా అన్నట్లుంది. దూరమైన ప్రేమ మదిని కదలించి వేస్తున్నది. దగ్గరైన ఐశ్వర్యము హృదయాన్ని కదలించలేక నిస్సారంగా నిలబడియున్నది. కృష్ణయ్య వింగినే దర్శిస్తూ నిలుచుని యున్నాడు.

గోకులంలో.....

యశోద గుమ్మంవద్ద తెగిపడిన వృక్షశాఖ వలె పడియున్నది. చిన్నబోయిన ముఖాలు కలిగిన మయూరములు మెల్లగా నడుస్తూ యశోదను సమీపించాయి. అర్థంత దూరాన దెప్పవాల్చకుండా దీనంగా చూస్తున్నాయి గోమాతలు. శుక పికములు రవముల వాకి రోదిస్తున్నాయి.

"కృష్ణా! కృష్ణా! ఎలా ఉన్నావు కన్నయ్యా? సాగరమువలె మా హృదయంనుండి పొంగుతున్న బాధాతరంగాలు సున్నితమైన నీ హృదిని స్పృశించుట లేదా? కన్నా! అమ్మను అంతలొందరగా మరచి పోయావా? గోపాలా! నిన్నుగన్న ఈ తల్లి గోద్రాలుగా బ్రతుక వలసిందేనా? నీవులేని ఈ వ్రజపురము ఎలా చిన్నబోయినదో ఒక్కసారి వచ్చిచూడవా? కృష్ణా! నీ విరహములో బ్రతుకులను అతిదారుణముగా కొనసాగిస్తున్న గోకుల దురదృష్ట వంతులను నీవు కరుణించే శుభఘడియ ఎప్పుడు? కన్నా! ఆటుచూడు. నీ ప్రేమలో పెరిగిన గోమాతలు శ్వాసించను కూడా శక్తిలేక బరువుగా గాలిని పీల్చుకుంటున్నాయి. వాని సర్వము యొక్క కాటువలన తీవ్రబాధకు గురియగు వారు నేలపై పడి దొర్లునట్లు, నీ విరహంలో గోపికలు విలపిస్తున్నారు. కన్నయ్యా! నీవు మాకు దూరమగుటచే భగవంతుడు కూడా మా మొర నాలకించుట లేదు. మా దేహముల నుండి ప్రాణములను తొలగించమని, మా బ్రతుకులకు శాశ్వతముగా తెరవి దించమని ఎన్నిసార్లు ప్రార్థించినను అతడు మా మొర నాలకించుటలేదు.

"కన్నా! నీవు వెళ్ళిన నాటినుండి గోపబాలుర ముఖాలపై మందహాసము గోచరించలేదు. గోవులు మేతను గ్రహించుటలేదు. బహిర్గతమయ్యే కల్యముల ద్వారా తమ బాధను వ్యక్తం చేస్తున్నాయి. కృష్ణా! నీవు కూర్చుని పాలుతీసే ప్రదేశములను గోవులు వాసన చూస్తూ దుఃఖిస్తున్నాయి. దుఃఖభారమును మోయలేక గాలివానకు కూలిపోతున్న వృక్షములవలె నేలపై కూలుతున్నాయి.

"గోపాలా! నందమహాశయునిలో ఆనందము అదృశ్యమైనది. వీటికి దూరమైన నీలా ఆ దివ్యాత్మైని అంతర్యం ఆలజడితో నిండియున్నది. తండ్రీ! బృందావన శోభ అంతయు కనుమరుగవుచున్నది. చెట్లు చిగురించుట మానివేశాయి. పుష్పపూర్ణమైన చెట్లు కన్నయ్య లేనపుడు మీరెందుకని బలవంతముగా ఊగి పూలను రాలుస్తున్నాయి. కృష్ణా! నీ విహారస్థలమైన యమునాతీరమును ఇప్పుడే దర్శించి వచ్చాను. కన్నా! యమునలో నడి తగ్గిపోయింది. నిండు జలముతో యమున నయనించుట లేదు. నీరు ఇంకిపోయింది..... కాదు..... కాదు..... యమునా జలమంతా మా నేత్రాలలో నిండిపోయింది కన్నా! పాపం..... అందుకే యమున పలుచబడిపోయింది" అంటూ పలుకలేక యశోద దుఃఖించింది.

నందబాబా అరుదెంచాడు. యశోదను పట్టుకొని మెల్లగా లేపినాడు. కుమిలిపోతున్న వదనమును

అమృతముకన్నా ఖరీదై యుండేవి. వలచినంతమాత్రాన లేని అదృష్టం వస్తుందా? వగచినంతమాత్రాన ఉన్న దురదృష్టం పోతుందా? దేవకీవసుదేవులు పుణ్యాత్ములు. వారి భాగ్యం మనకెలా వస్తుంది? మనము ఇకమీదట ఆ పుణ్యదంపతులను పూజిస్తాము. రాబోయే జన్మకైనా వారి కృపచే మనము కూడా పుణ్యాత్ములమై కన్నయ్యకు సమీపంగా జీవిస్తాము" అని కన్నీటిబొట్లు రాల్చుతూ పలికాడు నందబాబా.....

"పుణ్యపురుషా! నేను కన్నయ్యను వదలి బ్రతుకలేను.... ఇక ఈ బొందిలో ప్రాణాలు నిలువ నంటున్నాయి. చెప్పండి..... నా చిన్నారి కిట్టయ్యను అరణ్యాలకు ఎందుకు పంపారు? గోవులను మేపమని ఎందుకు చెప్పారు? మనము ఇలా బాధించబట్టే కన్నయ్య మనలను వదలిపెట్టి మధురకు వెళ్ళాడు. మనలను మరచిపోయాడు" అంటూ బోరున విలపించింది యశోదమ్మ.

"యశోదా! వాత్సల్యంలో కదలిపోతున్న నీకు వాస్తవాలు తెలియుటలేదు. గోవులంటే కన్నయ్యకు ప్రాణం.... గోవులను మేపమని నేను చెప్పడమేమిటి? గోమాతలు తృప్తి చెందుటయే నాకు సంతృప్తి అని కన్నయ్య ఎన్నోసార్లు చెప్పేవాడు. ఇంతెందుకు? అటుచూడు, గోవులు ఎలా చిక్కిపోయి ఉన్నవో? నా మాట విను. కృష్ణయ్య తప్పక వస్తాడు. మన నేత్రాలకు ఆనందాన్ని కలిగిస్తాడు. మన హృదయాలను తృప్తి పరుస్తాడు. మనబాధల నన్నింటినీ ఒక్కక్షణంలో దూరం చేస్తాడు" అన్నాడు నందబాబా....

"నిజమా?..... ఈ మాట నిజమా? నా కన్నయ్య తప్పక వస్తాడా? నన్ను చూస్తాడా? నాతో మాట్లాడుతాడా? అంతవరకు నేను బ్రతికి ఉంటానా? ఈ లోగా నా నేత్రాలలో కాంతి ఆరిపోదుకదూ! అవును..... నా కన్నయ్య వస్తాడు. నేను లాల పోస్తాను. పాలు ఇస్తాను. ఆడిస్తాను. ఆడుతాను. వేడివేడిగా గోరుముద్దలు తినిపిస్తాను. నోటిలో ముద్దలుంచుతూ బుగ్గపై ముద్దులు పెడతాను. కన్నా! నన్ను వదలి ఇంతకాలం ఎలా ఉండగలిగావు? రోటికి నిన్ను బంధించిన కఠినాత్మురాలిని. కన్నయ్యా! ఆ విషయాన్ని నీవింకా మరచిపోలేదా? ఈ దీనురాలిపై నీకు కృప కలుగలేదా?" అని రోదిస్తూ క్రింద పడిపోయింది.

మధురలో....

ఆలోచనా తరంగాలలో తేలియాడుతూ, నింగిని వీక్షిస్తున్న శ్రీకృష్ణుడు, "అమ్మా! అమ్మా!" అంటూ అప్రయత్నంగా పిలిచాడు. అంతవరకు శ్రీకృష్ణుని పరధ్యానమును పరిశీలిస్తున్న ఉద్ధవుడు ముందుకు వచ్చి, శ్రీకృష్ణుని పట్టుకొనినాడు. శ్రీకృష్ణుడు ఉద్ధవుని చూసినాడు. పరాకులో పలవరించినట్లు అర్థమైంది. "ఉద్ధవా! వచ్చినావా? నీరాక నా హృదయాన్ని ఆనందముతో నింపగలదని నా విశ్వాసము" అన్నాడు శ్రీకృష్ణుడు.

"కృష్ణా! నీవు సచ్చిదానంద స్వరూపుడవు. పూర్ణానంద రూపుడవు. నా రాక నీకు ఆనందము నొసగుట హాస్యాస్పదము. కాని కొన్ని రోజులుగా నేను చూస్తూనే ఉన్నాను.

నీలో ఏదోబాధ అవ్యక్తంగా ఉన్నట్లు తెలియుచున్నది. అది ఏమిటో ఈ భృత్యునికి తెలుపండి. మీ సేవలో తరించే భాగ్యాన్ని ప్రసాదించండి" అన్నాడు ఉద్ధవుడు.

"ఉద్ధవా! నేను మధురలో జీవిస్తున్నాను. కానీ మధురజీవనానికి దూరమయ్యాను. గోకుల మాధుర్యానికి దూరుడనయ్యాను. నంపదకు చేరువయ్యాను. ప్రేమకు దూరమయ్యాను. వ్రజపురమున నేను పొందిన ప్రేమ మధురలో లభించుట లేదు. నాకు దూరమై గోకులవాసులు జీవించ లేకపోతున్నారు.

"ఉద్ధవా! గోకులము ఒక ప్రదేశము కాదు. అది ప్రేమ రసార్ణవం. వారి ప్రేమను మరచి నేను జీవించలేక పోతున్నాను. స్నాన మాచరించుట కుపక్రమించగనే యమునా జలమును ప్రేమతో నాపై చల్లెడి నా స్నేహితులు స్మృతిలో మెదులుతున్నారు. వస్త్రములను ధరించే సమయంలో నా వంశీరవము నాలకించి దూరమయ్యే చీరకొంగులను కూడా సరిచేసుకోకుండా శరములవలె దూసుకొని వచ్చెడి గోపకాంతలు నా మదిలో కదులుతున్నారు. అన్న మారగించుటకు ఆసీనము కాగానే "నా కన్నయ్య భోంచేస్తేగాని నేను భోంచేయను" అని మొండి పట్టుదలతో భీష్మించుకొని కూర్చొనే నా పిచ్చితల్లి యశోద నా హృదిలో దర్శన మిస్తున్నది. ఉద్ధవా! రాత్రింబవళ్ళు రమణీయమైన రాసమండలమే నా చుట్టూ తిరుగుతున్నది.

గచ్ఛోద్ధవ వ్రజం సౌమ్య పిత్రోర్నౌ ప్రీతిమావహ

"ఓ సౌమ్యుడా! ఉద్ధవుడా! నీవు నాకు ఒక సహాయము చేయుము. తక్షణమే నీవు వ్రజపురమునకు వెడలుము. వ్యథ చెందుతున్న నా తల్లిదండ్రులను ఓదార్చుము. వారి మనస్సులు తృప్తి చెందునట్లు భాషించుము. నా సందేశముతో వారి చేతములను వికసింప జేయుము. వారిని పూర్ణహృదయుల గావింపుము" అని ఉద్ధవుని చేతులను శ్రీకృష్ణుడు స్పృశించెను.

ఉద్ధవుని ఆగమనం

"ఉద్ధవా! నీవు గోకులమునకు వెళ్ళుము. వ్యథ చెందుతున్న నా తల్లిదండ్రులను సంతోషపరచుము. గోవులను ఓదార్చుము. గోపికల దుఃఖమును బోగొట్టుము. వారిని నేను మరువలేనని చెప్పుము. నన్ను సదా స్మరించే గోపికలను విస్మరించడం నా చేతగాని పనియని చెప్పుము" అని శ్రీకృష్ణుడు పలికి, ఉద్ధవుని రథము నెక్కించెను.

రథము ముందునకు సాగుచుండగా, ఉద్ధవుని మనస్సు వెనుకకు పరుగిడెను. శ్రీకృష్ణునిపై ఉద్ధవుని ఆలోచనలు కేంద్రీకరింపబడి యుండెను. గోకులము, నందయశోదాదులను తలచి గోపాలుడలా వ్యథచెందుటకు కారణమేమి? అని ఉద్ధవుని మనస్సు సతమత మగుచుండెను.

ఉద్ధవుని మార్గము జ్ఞానమార్గము. గోపికల పరాభక్తి, ప్రేమమయ దృష్టి ఉద్ధవునికి అనుభవము గాకుండెను. ప్రేమలేని భక్తి కుంటిది. భక్తిలేని జ్ఞానము గ్రుడ్డిది. భక్తి జ్ఞానముల

అపూర్వ సమ్మేళనమే వ్యక్తిని పూర్ణపురుషునిగా మార్చును. గోపికలు భక్తులు. ఉద్ధవుడు జ్ఞాని. ఉద్ధవుని జ్ఞానమును గోపికలు జీర్ణించుకోవాలి. గోపికల భక్తిని ఉద్ధవుడు కలిగించుకోవాలి. ఈ కారణముగానే పరమాత్మ ఉద్ధవుని గోకులమునకు పంపినాడు.

ఆదిత్యుడు అస్తాచలమున ప్రవేశించుచుండగా ఉద్ధవుడు నందగోకులమును చేరెను. ఉద్ధవుని రాకను గూర్చి వినినవాడై నందుడు శీఘ్రముగా ఉద్ధవుని చేరెను. ఆహ్వానించుచు ఆలింగన మొనర్చుకొనెను.

తమాగతం సమాగమ్య కృష్ణస్యానుచరం ప్రియమ్
నన్దః ప్రీతః పరిష్వజ్య వాసుదేవధియార్చయత్

కృష్ణునికి ప్రియుడైన ఉద్ధవుడు సాక్షాత్తు కృష్ణుడు యనెడి భావనతో నందుడు అతనిని ఆలింగనము చేసుకొని, అర్చించెను. నందుడు స్వయంగా ఉద్ధవునికి సేవలొనర్చెను. ఉత్తమ భోజనమిడెను. భుజించి శయనించగా పాద సంవాహనాదుల నొనర్చెను. "మహాత్మా! ఉద్ధవా! నా మిత్రుడగు వసుదేవుడు సుఖముగా నున్నాడా? కంస వధానంతరము సర్వులు మధురలో సుఖించుచున్నారా? కృష్ణుడెలా ఉన్నాడు? మమ్ములను స్మృతియందుంచుకొనుచున్నాడా? గోపులను, గోపాలురను, బృందావనమును, గోవర్ధనగిరిని తలంచుకొనుచుండునా?

శా॥ అన్నా! భద్రమె తల్లిదండ్రుల మముఁ హర్షించి చింతించునే?
తమ్ముం బాసిన గోపగోపికల మిత్రవ్రాతముఁ గోగణం
బు న్నిత్యంబుఁ దలంచునే? వననదీభూముల్ ప్రసంగించునే?
వెన్నుం డెన్నఁడు వచ్చునయ్య యిట మా వ్రేపల్లెకు న్నుద్ధవా!

అని నందుడు ఉద్ధవుని ప్రశ్నించెను. పరమాత్ముని ఆగమనమునకు నిరీక్షించువారే నిర్మల భక్తులు. నిర్మలభక్తి నిర్మలాత్ములైన సత్పురుషులను ముందుగా మన జీవితములలో ప్రవేశపెట్టును. వారి బోధలో మనకు భగవంతుని దర్శనమగును. నందయశోదల నిర్మల భక్తి ఉద్ధవుని నందగోకులమునకు నడిపించినది.

స్మరతాం కృష్ణ వీర్యాణి లీలా పాఙ్గ నిరీక్షితమ్
హసితం భాషితం చాఙ్గ సర్వానః శిథిలాః క్రియాః
సరిచ్ఛైల వనోద్దేశాన్ ముకుందపద భూషితాన్
ఆక్రీడానీక్ష్య మాణానాం మనోయాతి తదాత్మతామ్

"ఉద్ధవా! శ్రీకృష్ణుని లీలాచరితమును, మందహాసమును, భాషణమును స్మరించు కొనగానే భోజనాది క్రియలు శైథిల్యము నొందుచున్నవి. శ్రీకృష్ణుని పవిత్ర పద చిహ్నములను కలిగియున్న నదులను, గిరులను, వనప్రదేశములను, క్రీడా స్థలములను వీక్షించగనే మా చిత్తములు కృష్ణమయములై తన్మయమగుచున్నవి. పరితపించుచున్నవి" అని పలుకుచున్న నందమహాశయుడు ప్రేమవిహ్వలుడై, కంఠము మూగబోవ, అశ్రుపూర్ణ

నయనములతో మౌనమును వహించెను. ఈ ప్రేమమయ సంఘటనను రచించు పవిత్ర సమయాన మహానుభావుడైన ఏకనాథస్వామి సమాధి మగ్నుడైనాడని చెబుతారు.

నందుని పుత్రప్రేమను గాంచి ఉద్ధవుడు చలించెను. నందబాబా పలికిన మాటల నాలకించిన యశోదామాత అప్రయత్నముగా అశ్రువులను రాల్చెను. పుత్రప్రేమ ఆమె హృదయమును తీవ్రముగా స్పందింపజేయగా, పరవశించిన యశోదమ్మ స్తనములనుండి క్షీరము స్రవించెను. నందయశోదలకు శ్రీకృష్ణునిపై గల ఉత్కృష్టమైన ప్రేమను గాంచి సంతుష్ట చిత్తుడైన ఉద్ధవుడు వారితో ఇట్లనెను.

యువాం శ్లాఘ్య తమౌ నూనం దేహినా మిహ మానద
నారాయణేఽఖిల గురౌ యత్కృతా మతిరీదృశీ ।

"సాక్షాత్తు నారాయణుడగు శ్రీకృష్ణుని యందు ఇట్టి పరాభక్తిని కలిగి యుండుటచేత మీరు లోకవంద్యులగుదురు" అనెను.

ఉద్ధవుని అమృతమయ వచనముల నాలకించిన యశోదామాత కృష్ణగత చిత్తయై "మహాత్మా! ఉద్ధవ మహాశయా! కృష్ణయ్యకు దూరమై మేము జీవించగలమా? కృష్ణయ్యలేని బ్రతుకును నిస్సారముగా ఎంతకాలము కొనసాగించాలి?

ఉద్ధో దేఖల్ హో జైసే బ్రజబాస్
లేత ఉసాంస్ నైన్ జల్ పూరిత్ సుమిర సుమిర అవినాశీ।
భూలి న ఉరత్ యశోదా జననీ మనో భుజంగమ డాస్।
ఘూటతి నహీఁ ప్రాణ క్యోం అటకే కరిన ప్రేమ్‌కీ ఫాంస్।

"ఉద్ధవా! వ్రజవాసుల స్థితిని గమనించు.

"అవినాశి యగు కన్నయ్యను స్మరిస్తూ, అశ్రుపూర్ణమైన నయనములతో, ఎంత కరుణగా శ్వాసను పీల్చుకొనుచున్నారో చూడు.

"పాము కాటుకు గురియైన వ్యక్తి విచలితమైనట్లు ఈ యశోద విషాదముతో ఎలా విలవిల్లాడుచున్నదో చూడు.

"ఉద్ధవ మహాత్మా! ప్రాణాలను దూరం చేయమని ప్రార్థేయ పడుచున్నను అందులకు అంగీకరించక సృష్టికర్త మమ్ముల నెందుకిలా బాధించుచున్నాడో అవగతమగుట లేదు" అని దుఃఖిస్తూ నిలువలేక యశోదామాత నేలపై పడినట్లు మహాత్ముడైన సూరదాస్ హృదయాలు ద్రవించేలా పలుకుతాడు.

"పుణ్యాత్ములారా! మీరు వ్యథచెందకండి. మీ కిచ్చిన మాటను శ్రీకృష్ణుడు నెరవేర్చును. అతడు వ్రజమున కరుదెంచి మీకు సుఖసంతోషముల నొసగూర్చును.

మా ఖిద్యతం మహాభాగౌ ద్రక్ష్యథః కృష్ణమన్తికే
అన్తర్హృది సభూతానా మాస్తే జ్యోతిరివైధసి

"పుణ్యజీవులారా! మీరు దుఃఖింప వలదు. మీరు త్వరలోనే శ్రీకృష్ణుని దర్శింపగలరు. కట్టెల మధ్య అగ్ని యుండులాగున ఆయన జీవుల హృదయనివాసియై యున్నాడు" అని ఉద్ధవుడనెను.

భక్తి పూర్ణ హృదయులై శ్రీకృష్ణుని కొరకు ఎవ్వరు పరితపింతురో వారి మధ్యకు శ్రీకృష్ణుడు త్వరితముగ వచ్చును. పరమాత్మ హృదయనివాసి యైనందున భక్తుల హృదయముల యందలి ఆర్తిని గుర్తించినవాడై వారిని అనుగ్రహించి ఆశీర్వదించును. ఉద్ధవుని మాటలలోని అంతర్య మిదియే.

ఉద్ధవ గోపికా సమాగమము

నందఉద్ధవులు సంభాషించుకొనుచు నిద్రించిరి. కృష్ణనామమును కీర్తించుచు ఉద్ధవుడు సుఖముగా నిద్రించెను. బ్రహ్మముహూర్త కాలము అరుదెంచినది. పుణ్యవతులగు గోపికలు నిద్రనుండి మేల్కొనిరి. దీపములను వెలిగించిరి. వాస్తుభూమి నలంకరించిరి. పెరుగు చిలుకుట యందు నిమగ్నమైరి.

భక్తుల దినచర్య పై విధంగా ప్రారంభం కావాలి. నిద్రలేవగానే గోపికలు దీపములను వెలిగించినారు. హృదయ ప్రమిదలో జ్ఞానదీపమును వెలిగించుకోవాలి. ఆ దివ్యప్రకాశముతో రోజంతయూ శోభించేలా జీవించాలి. కృష్ణనామమును పలుకుతూ గోపికలు నిద్రనుండి మేల్కొనెదరు. నామజ్యోతియే జ్ఞానజ్యోతి. వాస్తుభూమి నలంకరించిరి. ఇదియే కర్మాచరణమునందు అంకిత భావము. తదుపరి పదుగురికి ఉపకరించెడి పెరుగును చిలుకుటకు ప్రారంభించిరి. ఈ చర్య పరోపకారబుద్ధితో కూడిన నిష్కామసేవయై యున్నది.

ఉద్గాయతీనాం అరవిన్దలోచనం వ్రజాఙ్గనానాం దివ మస్పృశ ద్ధ్వనిః
దధ్నశ్చ నిర్మన్థన శబ్దమిశ్రితో నిరస్యతే యేన దిశామ మఙ్గలమ్

"గోపికలు కమలలోచనుడగు శ్రీకృష్ణుని కళ్యాణగుణములను ఉచ్చైస్స్వరముతో కీర్తించసాగిరి. వారి ఆ ధ్వని పెరుగు చిలుకుట వలన కలిగెడి శబ్దముతో గలసి గగనమును తాకుచుండెను. ఆ కారణముగా ఆకాశము నందలి అశుభములు అదృశ్యములైనవి" అని వేదవ్యాసులవారు దశమస్కంధము నందు తెలిపినారు.

కరచరణాదులు కర్మలయందు కదలు చున్నను, ఎలుగెత్తి శ్రీకృష్ణుని కీర్తించువారే నిజమైన భక్తులు. దేహేంద్రియాదులు దధి మథనక్రియ యందు లగ్నమై యుండెను. హృదయపు లోతులనుండి వెల్లుబికిన శ్రీకృష్ణశబ్దము దధిమథన ధ్వనితో కలసి ఆకాశమును తాకగా గగనము నందలి అమంగళములు అదృశ్యమైనవి. అత్యంత రమణీయమైన ఆధ్యాత్మిక రహస్య మిందు ఇమిడి యున్నది.

కరచరణాదుల ద్వారా ఆచరింపబడెడి కర్మము, హృదయములోని రాగము రెండును ఒకే విధమైన శబ్దమును కలిగింప గలిగినచో అట్టి శబ్దము నైనన్ను

అమంగళమును తొలగించును. చిత్తము, చేష్ట రెండును భగవత్సంబంధ మైనవియై ఏకశ్రుతిలో నడచినపుడు అట్టి అమరజీవనము నైనన్ను అనగా మనస్సులోని దుష్టభావములనెడి అమంగళములను తొలగించును.

సూర్యుడుదయించెను. సుప్రభాతమాయెను. నందుని ఇంటిముందు నిలబడియున్న సువర్ణమయ రథమును గాంచినారు గోపికలు.

కస్యాయ మితి చాబ్రువన్

"ఈ రథము ఎవ్వరిది?" అని గోపికలు ఆలోచింపసాగిరి. ఈ విధమైన రథమును గతములో వీక్షించి యుంటిమి. ఆనాడు శ్రీకృష్ణుని మధురకు గొనిపోవుటకు ఇలాంటి రథమునందే వచ్చినాడు అక్రూరుడు. పేరుకు అతడు అక్రూరుడే గాని వాస్తవానికి ఎంత క్రూరుడో గదా? అతడే మరల వచ్చియుండునా?

"కమలలోచనుడైన మన శ్రీకృష్ణుని గతములో మధురకు తీసుకొనిపోయి కంసునికి సంతృప్తిని కలిగించినాడు ఈ అక్రూరుడు. అయితే ఇప్పుడు మన మాంసమును తీసుకొనిపోయి చనిపోయిన కంసునకు పిండప్రదాన మొనర్చుటకు వచ్చినాడేమో?" గోపికలు ఇలా మాట్లాడుకొనుచుండిరి. ఇంతలో స్నానాదులను పూర్తి చేసుకొని ఉద్ధవుడు అచ్చటికి అరుదెంచెను. గోపికలు ఉద్ధవుని దర్శించిరి.

గోపికలు శ్రీకృష్ణుని గూర్చి తలపోయుచుండిరి. దాని ఫలితముగా వారికి భక్తుడైన ఉద్ధవుని దర్శనము లభించెను. భగవంతుని తలచువారి చెంతకు భక్తులు మొదట వత్తురు.

శుకబ్రహ్మ చెప్పుచున్నాడు: "పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుని అనుచరుడగు ఉద్ధవుని గాంచి గోపికలు విభ్రాంతి చెందిరి. "మనోహర కాంతిగల ఈ దివ్యాత్ముడు ఎవరు?" అని తమలో తాము గోపికలు ముచ్చటించుకొనుచు ఏకాంతమున గూర్చుండియున్న భక్తుడగు ఉద్ధవుని సమీపించిరి. వినమ్రతను కనబరచిరి. శ్రీకృష్ణుని వార్తాహరుడుగా గుర్తించిరి. నమస్కరించిరి. ఇలా పలికిరి.

జానీ మస్త్వాం యదుపతేః పార్షదం సముపాగతమ్
భర్త్రేహ ప్రేషితః పిత్రోర్భవాన్ ప్రియ చికీర్షయా

"మహాత్మా! ఈ వ్రజపురమున కరుదెంచిన మిమ్ములను శ్రీకృష్ణుని పార్షదునిగా మేము భావించినాము. తన తల్లిదండ్రులైన యశోదానందులకు ఆనందము గూర్చుటకై శ్రీకృష్ణుడు నిన్ను పంపినాడా?" అని వినయముగ పలికిరి.

"మహాత్మా! నందయశోదలు తప్ప శ్రీకృష్ణుని ప్రేమను పొందుటకు ఈ వ్రజపురమున ఎవ్వరును అర్హులు కారు. ఆత్మీయుల నైననే కదా ఎవ్వరికైనా ప్రేమ యుండును. ఆత్మీయులయందు గాక ఇతరులపై మాపు ప్రేమ శాశ్వతమైనది కాదుగదా! అని

పుంభిః స్త్రీషు కృతా యద్వత్ సుమనస్స్వివ షట్పదైః

"పురుషులు స్త్రీలయందును, భ్రమరములు పుష్పములయందును జూపు ఆసక్తి వంటిది. అవసర మున్నంతవరకే స్నేహము నిలుచును. అవసరము తీరగానే నశించును. మేము శ్రీకృష్ణునికి ఆత్మీయులము గాము కదా! నందాదులపై నున్న ప్రేమ మాపై శ్రీకృష్ణున కెలా కలుగును?

"వేశ్యలు ధనహీనులైన పురుషులను పరిత్యజింతురు. ప్రజలు అసమర్థుడగు రాజును వదలి వేయుదురు. విద్యాభ్యాసము పూర్తయిన పిదప విద్యార్థులు గురువులను విడిచి పెట్టెదరు. దక్షిణ గ్రహించగనే పురోహితులు యజమానిని వదలివేయుదురు. మహాత్మా! కృష్ణుడు కూడా మమ్మల్ని అలాగే వదలి పెట్టినాడు.

ఖగా వీతఫలం వృక్షం భుక్త్వా చాతిథయో గృహమ్
దగ్ధం మృగా స్తథారణ్యం జారా భుక్త్వా రతాంస్త్రియమ్

"పక్షులు పండ్లు లేని చెట్లను వదలినట్లు, అతిథులు భోజనానంతరము అన్నదాత గృహమును విడుచునట్లు, దావానలముచే దగ్ధమైన అరణ్యమును మృగములు వదలి పోవునట్లు, జారులు అనుభవించిన పిదప స్త్రీలను వదలివేయుదురు" అని గోపికలు ఏడ్వసాగిరి.

ఉద్ధవుడు గోపికలను గాంచి అమితానంద భరితుడయ్యెను. కృష్ణగతచిత్తులైన గోపికల పరాభక్తిని గాంచి పులకాంకితుడయ్యెను. శ్రీకృష్ణుని బాల్య క్రీడలను తలపోయుచు గద్గద కంఠములతో పరవశిస్తూ కృష్ణ లీలా రహస్యములను వివరించుచున్న గోపకాంతలను జూచి, ఉద్ధవుని హృదయము ద్రవించెను. ఇంతలో ఒక భ్రమరము కనుపించెను. దానిని కృష్ణుని దూతగా భావించి గోపికలు మాటలాడుట కుపక్రమించిరి.

భ్రమరగీతలు

భ్రమర మనగా తుమ్మెద. తుమ్మెదలు పద్మములను ప్రేమాతిశయముతో ఆశ్రయించును. గోపికల యొక్క ముఖ పద్మములను గాంచి ఒక భ్రమరము ఆకర్షింపబడి దరిజేరెను. ఆ భ్రమరముతో గోపికలు పలికిన నిష్ఠుర వచనములే భ్రమరగీతలు. ఈ భ్రమరగీతల యందు గోపిక పలికెడి నిష్ఠుర వచనములు కొన్ని ఉద్ధవునకు, మరికొన్ని శ్రీకృష్ణునకు సంబంధించి యుండును.

మధుప కితవబన్ధో మా స్పృశాంఘ్రి సపత్న్యాః
కుచ విలులిత మాలా కుంకుమశ్మశ్రుభిర్నః
వహతు మధుపతి స్తన్మానినీనాం ప్రసాదం
యదు సదసి విడంబం యస్య దూతస్త్వమీదృక్

"ఓ భ్రమరమా! దుర్జన మిత్రా! నీవు మా పాదాబ్జములను స్పృశింపకుము. మా సవతుల స్తనముల మధ్య శ్రీకృష్ణుని మెడలోని పుష్పహారము నలిగిపోయినది. ఆ కుంకుమలు నీ మీసములయందు తెలియుచున్నవి. మధురాధిపతి యగు శ్రీకృష్ణుడు ఆ

స్త్రీలకు ముదమును గలుగజేయునిమ్ము. నీవు ఆయనకు దూతవై కూడా ఇట్టి సంభోగ చిహ్నములు ధరించి యుంటివి. యదుసభలో ఇది నవ్వులాటయే కాగలదు."

"మధుపమా! దుర్జన మిత్రా! మా పాదాబ్జములను స్పృశింపకుము."

తన పాదము వెంట తిరుగుచున్న భ్రమరమును జూచిన గోపిక పై విధముగా పలుకుచున్నది. మధుపమును కపటిగ గోపిక నిందించుచున్నది. భ్రమరము దుర్జన మిత్రుడట. శ్రీకృష్ణుడు నల్లగా యుండును. భ్రమరము కూడా నల్లగానే యున్నది. అందుచేత భ్రమరమును శ్రీకృష్ణుని బంధువుగా గుర్తించి దుర్జన మిత్రుడని నిష్ఠుర వచనములను పలుకుచున్నది. ఇచ్చట గోపిక నిందించు భ్రమరము ఉద్ధవుడే. శ్రీకృష్ణునికి మిత్రుడు, బంధువు తానై యున్నాడు.

"శ్రీకృష్ణుడు మోసగాడు. మమ్ములను పరిత్యజించి నూతన యువతులతో మధురలో క్రీడించుచున్నాడు. వారిని ఆలింగన మొనర్చుకొనుట వలన ఆయన వనమాల నలిగిపోయినది. ఓ భ్రమరమా! ఆ చిహ్నములు నీ మీసములపైనున్నవి.

శ్రీకృష్ణ సమాగమమునందు జ్ఞానమే దివ్యపరిమళ మగును. ఆ జ్ఞాన పరిమళమును ఆఘ్రాణించుట వలన ఉద్ధవుడు జ్ఞాన వచనములను పలుకుచున్నాడు. భ్రమరముయొక్క మీసములపై సురత చిహ్నము లనగా ఉద్ధవుని నోట వెలువడుచున్న జ్ఞాన వచనములని భావము.

"శ్రీకృష్ణుడు మమ్ములను మరచినాడు. మధురలోని మగువలనే సంతోష పరచ నిమ్ము. శ్రీకృష్ణుని ఈ మోసపు నాటకము మధురలో హాస్యాస్పదమగును. ఆయన మిత్రుడైన నీవూ తప్పక చులకన యగుదువు."

తనకు దూరమైన భాగ్యము మధురలోని మగువలను వరించినందులకు వ్యథచెందుతూ భ్రమరమును నిందించు నెపముతో గోపిక ఉద్ధవు నెత్తిపొడుచు చున్నది.

సకృదధర సుధాం స్వాం మోహినీం పాయయిత్వా
సుమనస ఇవ సద్యస్తత్యజేఽస్మాన్ భవాదృక్
పరిచరతి కథం తత్పాదపద్మం తు పద్మా
హ్యపి బత హృతచేతా హ్యుత్తమ శ్లోక జల్పైః

"ఓ భ్రమరమా! నీవు సుమములను వదలి అన్యప్రదేశములకు చనునట్లు, శ్రీకృష్ణుడుకూడా ప్రేమను పెంచెడి అతని యధరామృతమును ఒక్కసారి మాకిచ్చి, ఆశ్రయులమైన మమ్ము పరిత్యజించినాడు. మరి అట్టివాని పాదపద్మములను ఐశ్వర్యవంతురాలగు లక్ష్మీదేవి ఎందులకు సేవించుచున్నదో మాకు తెలియదు. బహుశః తేనెలొలుకు అతని అసత్యవాక్యాల నాలకించి ఆమె ఆకర్షితయై యుండవచ్చును.

"ఓ మధుపమా! పుష్పముల యందలి తేనెలను గ్రోలుచూ వాటిని త్యజించి మరొక చోటికి వెడలుట నీకు నైజము. నీ మిత్రుడైన శ్రీకృష్ణునకు కూడా ఈ అలవాటే గలదు. ఆశ్రయులమైన మమ్ము సంతృప్తి పరచుచూ ఒక్కసారి మమ్ములను పరిత్యజించి

మధురలో మగువలతో కులుకుతున్నాడు. మీరిరువురు ఆప్తమిత్రులు. అధర్మ జీవనమును పరస్పరము పంచుకొనినారు. మోసగించి మటలుటయే మీ నైజము.

"అట్టి కపటియగు శ్రీకృష్ణుని చరణకమలములను శ్రీదేవి ఎలా సేవించుచున్నది? ఆమె జ్ఞానమేమైనది? ఆ! ఏముంది అయ్యేందుకు? మాయ మాటలు నమ్మి మోసపోయి ఉంటుంది. తేనె పలుకులు విని విశ్వసించి యుంటుంది. అతని కపట వర్తనము తెలిసినచో ఆమె అతనిని సేవించునా? పరిత్యజించకుండునా? మమ్ములను మోసగించినట్లే ఆమెను కూడా మోసగించి యుండును.

"ఇప్పుడు మేము తెలివి గలవారము. అతని మాయలు మాకు తెలిసిపోయినవి. అతని మోసము మాకు అవగతమైనది. మేము ఇక మోసమునకు గురికాము. అతని మాయావలలో తగులుకోము. లక్ష్మీదేవివలె మేము వివేకము లేనివారము కాము.

శ్రీకృష్ణుడు ఎవరిని సమీపించునో వారి వివేకము మూగబోవును. గోపికల వద్ద ఉండినపుడు ఈ విధమైన వివేకము వారిలో కదలలేదు. ఇప్పుడు దూరులైన పిదప కలిగినది. శ్రీహరి పాదపద్మములను సేవించు సమయాన లక్ష్మీదేవి నిజముగా వివేకశూన్యురాలే.

వివేకము మనస్సులో స్ఫురించును. శ్రీకృష్ణుడు సాక్షాత్తు పరమాత్మ. ఆత్మ దర్శనములో మనస్సు చలించలేదు. మనస్సు చలించనపుడు మనోజనిత వివేకము ఎలా కదలుతుంది? ఇదియే ఒకనాటి గోపికల, నేటి శ్రీదేవి యొక్క విచక్షణారహిత స్థితి. ఇదియే ఉపనిషత్తులు నిర్వచించిన అస్పర్శయోగము. ఈ యోగమును తెలిసి పలుకువారే మహాజ్ఞానులైన గోపికలు.

బ్రహ్మ విదాం అస్పర్శయోగ ఇత్యేవం ప్రసిద్ధ ఇత్యర్థః

"బ్రహ్మవిదులైన వారు దీనిని అస్పర్శయోగమని చక్కగా తెలియుదురు" అని శ్రీశంకర భగవత్పాదులు తమ ఉపనిషద్భాష్యంలో తెలిపియున్నారు.

కిమిహ బహు షడఙ్ఘ్రే గాయసి త్వం యదూనా
మధిపతి మగృహాణా మగ్రతో నః పురాణమ్
విజయ సఖ సఖీనాం గీయతాం తత్ప్రసఙ్గః
క్షపిత కుచ రుజస్తే కల్పయ న్తీష్టమిష్టాః

"ఓ మధుపమా! షట్పదములు గలదానా! నిరాశ్రయులమైన మాకడ పురాతనమైన కృష్ణకథను సవిస్తరముగా గాన మొనర్చెదవేల? శ్రీకృష్ణుని నూతన ప్రియురాండ్ర కడకేగి కృష్ణకథను గాన మొనర్చుము. ఆయనను ఆలింగనము చేసికొనుటచే ఎవ్వరి కుచముల బాధ ఉపశమించెనో అట్టి వధువులు నీ వాంఛలను తీర్చెదరు.

"ఓ భ్రమరమా! నీవు కృష్ణుని చరితమును గానము చేయుచున్నావు. పదంగాని వేదములను పలుకుచున్నావు. ఓ షట్పదీ! మేము శ్రీకృష్ణుని ప్రాణముకన్నను అధికముగా ప్రేమించిన భక్తులమేగాని నీలాగ జ్ఞానులము కాము."

భక్తులు నిత్యతృప్తులు. నిరాశ్రయులు. అందుచేత ఇల్లులేని వారము, నిరాశ్రయులము అని గోపికలు పలుకుచున్నారు. భగవద్గీతలోని భక్తియోగమునందు భక్తుని లక్షణములను వివరిస్తూ "అనికేతః" అని కూడా పరమాత్మ తెలియజేసెను. కనుక గోపికలు పరమభక్తురాలై యున్నారు. శ్రీకృష్ణుడు పరమాత్మ యని తెలిసియే భక్తి చేయుచున్నారు. కనుకనే భ్రమరము గానము చేయు కృష్ణకథ పురాతనమైనదని తెలుపుచున్నారు.

తుమ్మెదలు ఝుమ్మని నాదము చేయును. ఆ శబ్దమును మనము ఆలకించగలమే గాని అందులోని భావమును గ్రహింపలేము. అలాగే ఉద్ధవుని మాటలు కూడా భ్రమర నాదమువలె యున్నవని గోపిక పలుకుచున్నది. భక్తులైన తమకు కృష్ణుని మరచి ఉద్ధవుడు ప్రబోధించెడి వేదాంత వచనములు రుచించుట లేదని తెలుపుట ఇచ్చట గమనార్హము.

"ఓ భ్రమరమా! శ్రీకృష్ణుని నూతన సతుల కడకేగి కృష్ణకథను గాన మొనర్చుము. ఆయనచే తృప్తిచెందినవారు నిన్ను తృప్తిపరచగలరు."

మధురానగరము నందలి శ్రీకృష్ణుని సతుల భాగ్యమును గోపిక కీర్తించుచున్నది. దరిద్రుని చెంత భోగ్య విశేషములను ప్రస్తావించి సాధించే ప్రయోజన మేమున్నది? శ్రీకృష్ణుని పోగొట్టుకొనిన తాము దిక్కులేని, దిక్కుతెలియని స్థితిలో నున్నట్లు గోపిక భావించుచున్నది.

మధురలోని పుణ్యస్త్రీలు శ్రీకృష్ణకథను ఆలకించుటకు అర్హులు. వినిపించుటకు భ్రమరమూ అర్హురాలే. కీర్తించు వారికి అభీష్టములు తీరవలెను గదా! శ్రీకృష్ణ గతచిత్తులైన మధురలోని వనితలు శ్రీకృష్ణుని ఆలింగన మొనర్చుకొనుట యనెడి ధ్యానముద్వారా స్తనము అనెడి హృదయమును శాంతింపజేసికొని యున్నారు. వారు పరమ భాగ్యవంతులు. అట్టివారు తుమ్మెదయొక్క కోర్కెలను తీర్చగలరు. కనుక వారి యొద్దకు వెళ్ళి గానము చేయుమని భ్రమరమునకు తెలుపుచూ ఉద్ధవుని ఎత్తి పొడుచుచున్నారు.

దివి భువిచ రసాయాం కాఃస్త్రియ స్తద్దురాపాః
కపట రుచిరహాస భ్రూ విజృంభస్య యాః స్యుః
చరణ రజ ఉపాస్తే యస్య భూతి ర్వయం కా
అపి చ కృపణ పక్షే హ్యుత్తమ శ్లోక శబ్దః

దివియందును, భువియందును, రసాతలము నందును ఆయనకు లభించని స్త్రీలెవరు? సాక్షాత్తు శ్రీదేవియే కపట రుచిరహాస భ్రూ విజృంభణ శీలుడగు శ్రీకృష్ణుని చరణధూళిని సదా సేవించుచుండును. అలాంటప్పుడు మేము అతనికెలా ప్రియురాండ్ర మగుదుము? దీనులగువారు అట్టి వానిని ఉత్తమశ్లోకుడని కీర్తించుచుందురు. మేము అలా కీర్తింపము."

శ్రీకృష్ణుని నూతన సతుల కడకేగి కృష్ణకథను గానము చేయుమని గడచిన శ్లోకములో గోపిక నిష్ఠుర వచనములను పలికెను. అయినను భ్రమరము నాదమును కొనసాగించుచూ గోపిక చుట్టూ పరిభ్రమించు చుండెను. ఆ భ్రమర నాదములో గోపికకు

ఏదో సందేశము వినిపించు చుండెను. శ్రద్ధగా ఆ నాదమును గోపిక ఆలకించెను. "కృష్ణగత చిత్తులైన ఓ గోపికలారా! నా మాటల నాలకింపుడు. ఆవేశములో అచ్యుతుని అపార్థము చేసికొనుచున్నారు. అతనిని నిందింపకుడు. ఆయన చిత్తము మీ మీదనే యున్నది. మీకు సంతసమును చేకూర్చుటకు నన్ను ఆదేశించి పంపినాడు" అని భ్రమరము పలుకుచున్నట్లు ఆ నాదముయొక్క అర్థముగా గోపిక భావించెను. ఆ విధమైన భావము గోపికను మరింతగా కృంగదీసినది.

"సమస్త లోకములందును అతనికి లభించని స్త్రీ లెవరు?" అంటున్నది గోపిక. శ్రీకృష్ణుడు మానవమాత్రుడు కాడు. సాక్షాత్తు పరమాత్మయే. అందుచేత ఆయనకు ఏ లోకము నందైనను అలభ్య మనునది లేదు. కనుకనే సర్వమంగళ ప్రదాయిని యగు లక్ష్మీదేవి కూడా ఆయన చరణధూళిని సేవించుచున్నది. ఈ కారణము చేతనే అందరూ అతనిని ఉత్తమ శ్లోకుడని కీర్తించుచున్నారు అంటున్నది గోపిక. అలా కీర్తించు వారిని కృపణులని నిందించుచున్నది. తాము శ్రీకృష్ణుని అలా కీర్తించరట.

ఆత్మ నెరుగని వానిని కృపణుడని బృహదారణ్య కోపనిషత్తు ప్రవచించినది. శ్రీకృష్ణుడు తమ కన్నా అన్యునిగా భావించి అతనిని ఉత్తమ శ్లోకుడని అన్యులు కీర్తించుచున్నారు. అలా కీర్తించువారికి శ్రీకృష్ణుడు తమ ఆత్మయేనని తెలియదు. అందుచేత వారు కృపణులు. కాని గోపికలు శ్రీకృష్ణుని "అంతరాత్మ దృక్" గా నెరిగినవారు కనుక శ్రీకృష్ణుని అన్యునిగా భావింపలేరు. అందుచేత ద్వైతస్ఫూర్తి నిచ్చే గీతములను పాడలేరు. స్తుతులను చేయలేరు. వారిది అద్వైత భక్తి. అన్యమెరుగని భక్తి. అలౌక అద్భుత ప్రేమ శక్తి.

కనుక శ్రీకృష్ణుని యందు తాదాత్మ్యం చెందియున్న గోపికల చెంత నీరస తత్త్వోపదేశములను సాగించుట నిరర్థకమని భ్రమరమునకు బోధించునట్లు ఉద్ధవునికి తెలుపుట జరుగుచున్నది.

విసృజ శిరసి పాదం వేద్మ్యహం చాటుకారై
రనునయ విదుషస్తేఽభ్యేత్య దౌత్యైర్ముకున్దాత్
స్వకృత ఇహ విసృష్టా పత్యపత్యాన్యలోకా
వ్యసృజదకృత చేతాః కిం ను సన్ధేయ మస్మిన్

"ఓ మధుపమా! నీ శిరము నుంచిన మా చరణములను విడిచిపెట్టుము. నీవు శ్రీకృష్ణునిద్వారా ప్రేమ పాఠములను నేర్చిన దానవు. దూతలు పలుక వలసిన తియ్యని పలుకులను పలుకుట యందు నేర్పరివైతివి. అతని కొరకు మేము పతులను, పుత్రులను, పరలోకమును కైతము త్యజించితిమి. ఈ స్థితిలో చపలచిత్తుడగు ఆ పురుషుడు మమ్ములను త్యజించినాడు. అట్టివాని నాశ్రయించి సాధించునది ఏమున్నది?"

శ్రీకృష్ణుని ఉత్తమ శ్లోకుడని కృపణులు కీర్తించుదురేగాని తాము కీర్తించలేమని గోపిక పలుకగానే భ్రమరము వెళ్ళి ఆ గోపిక పాదములపై బడినది. క్షమించమని మధుపము ప్రార్థించుచున్నట్లు భావించి గోపిక ఈ విధముగా పలుకసాగెను.

"ఓ భ్రమరమా! నీ శిరమునందు ధరించిన మా చరణములను విడువుము" అనుచున్నది గోపిక.

భక్తుల పాదధూళి శిరోధార్యమే కదా! అట్టి పవిత్ర చరణధూళిని స్వామి శ్రీకృష్ణుడే పరవశించి గానమొనర్చినట్లు శ్రీ జయదేవ మహాకవి తమ గీత గోవింద కావ్యములో తెలుపుతారు.

స్మర గరళ ఖండనం మమ శిరసి మండనం దేహి పద పల్లవ ముదారమ్
జ్వలతి మయి దారుణో మదన కదనానలో హరతు తదుపాహిత వికారమ్

"రాధా! నా శిరస్సు నీ ముందు వంచుతున్నాను. చిగురుటాకుల వంటి నీ చరణములను నా శిరముపై నుంచుము. అది మదనుని విరహాగ్నిని చల్లార్పగలదు." అని శ్రీకృష్ణుడే రాధను ప్రార్థించినాడు గదా!

మరి భ్రమరము గోపిక చరణధూళిని ఎలా దూరము చేసుకోగలదు? అందుచేత గోపిక చెప్పుచున్నను భ్రమరము ఆ చరణములను వీడలేదు. ఈ మంకుపట్టును మోసపు కృత్యముగా గోపిక భావించుచున్నది.

"ఓ మధుపమా! మోసపు మాటలు పలికే కృష్ణునికి చెలికాడవై అతని మోసపు భాషణమును, అనునయ ప్రదర్శనమును అలవరచుకొంటివి. మాకు నీ విషయ మంతయు అవగతమైనది.

"మేము అతని కొరకు సర్వులను, సమస్తమును పరిత్యజించినాము. కాని అతడు మమ్ములను త్యజించినాడు. అట్టి వానితో స్నేహమెలా కుదురును?"

పరమాత్మ కొరకు పరలోకమును కూడా గోపభామలు పరిత్యజించినారు. అట్టి వారికి స్వరూపానుభూతిని కల్పించి తాను దూరమైనాడు శ్రీకృష్ణుడు. ఇదియే కదా అన్యమెరుగని ఆత్మానుభూతి. అద్వయ సత్యస్వరూప అద్వైతానుభూతి.

మృగయురివ కపీన్ద్రం వివ్యధే లుబ్ధధర్మా
స్త్రియ మకృత విరూపాం స్త్రీజితః కామయానామ్
బలిమపి బలిమత్త్వావేష్టయ ద్ధ్వాంక్షవద్య
స్తదల మసిత సఖ్యైర్దుస్త్యజ స్తత్కథార్థః

కఠిన హృదయుడైన శ్రీకృష్ణుడు వ్యాధునివలె కపిరాజుని వధించెను. సతికి వశుడై కామునిచే పీడింపబడి అరుదెంచిన స్త్రీయొక్క ముక్కు చెవులను కోసెను. బలిచక్రవర్తి సమర్పించిన పూజలందుకొని అతనిని కాకివలె బంధించెను. అట్టి నల్లని వానితో మాకు ఉపయోగము యుండదు. కాని ఎందులకో వాని కథామృతమును త్యజించుట కష్టతరమగుచున్నది.

శ్రీకృష్ణుడు కఠినహృదయుడు డైనందుననే వానిని త్యజించినట్లు గోపిక భావించుచున్నది. శ్రీకృష్ణుని కాఠిన్యమును తెలియజేయు కొన్ని సన్నివేశములను వివరించుచున్నది.

శ్రీకృష్ణుడు రామావతారమున కపిరాజగు వాలిని వధించెను. ధర్మ యుద్ధమున ఎదురొడ్డి పోరాడక బోయవానివలె వెనుకనుండి చంపెను. ఇది కాఠిన్యము కాదా? అని గోపిక ప్రశ్నించుచున్నది.

భార్యను సంతోషపరచుటకు రామావతారమున కామపీడితయై వచ్చిన శూర్పణఖ యొక్క ముక్కు చెవులను గోసెను. ఇది కర్కశ ప్రవృత్తి కాదా? అంటున్నది గోపిక.

వామనావతారమున బలిని మోసగించి, దానమును గ్రహించి దానవ రాజును పాతాళమునకు పంపెను. ఇది కుటిలత్వముకాదా? అని ప్రశ్నిస్తున్నది కుపితయైన గోపిక.

అట్టి శ్రీకృష్ణుని వలన తమకు ఏమి ప్రయోజనము అంటున్నది. అయినను అతని కథా విశేషములను తాము త్యజింప లేకున్నట్లు తెలుపుచున్నది.

శ్రీకృష్ణుని యొక్క గడచిన అవతార విశేషములను వర్ణించుచున్నందున శ్రీకృష్ణుడు సాక్షాత్తు పరమాత్మయే నని గోపికలకు తెలుసు. అందుచేతనే ఆ దివ్యాత్ముని కథా విశేషములను త్యజింపలేకున్నారు. కానీ పరమాత్మకు దూరమై జీవించలేక పరమాత్మను కఠినాత్ముడని నిందించుచున్నారు. ఒక వైపు భగవానుని దివ్య వైభవమును వర్ణించుచూ, మరియొకవైపు నిందారోపణ చేయుట యనునది భక్తిలో పరాకాష్ఠ యని గుర్తించవలెను.

ఈ చక్కని శ్లోకమును పరమ భాగవతోత్తముడైన పోతనామాత్యుడు తమ సహజ పాండిత్యముతో ఆంధ్ర భాగవతము నందు ఎలా చెప్పెరో చూచెదము.

శా॥ వాలిం జంపెను వేఁటకాని పగిదిన్ వంచించి దైత్యాముజన్
లోలంబట్టి విరూపఁ జేసెను, బలిన్ లోభంబుతోఁగట్టి యీ
త్రైలోక్యంబు మొఱంగి పుచ్చుకొనియెన్ ధర్మజ్ఞుఁడే మాధవుం
డేలా షట్పద! యొగ్గు మావలన నీ కెగ్గింపఁగా నేటికిన్.

యదను చరిత లీలా కర్ణ పీయూషవిప్రుట్
సకృదదన విధూత ద్వన్ద్వ ధర్మా వినష్టాః
సపది గృహ కుటుమ్బం దీన ముత్సృజ్య దీనా
బహవ ఇహ విహఙ్గా భిక్షు చర్యాం చరన్తి ॥

శ్రీకృష్ణ కథామృతముయొక్క ఒక్క బొట్టునైన చెవులతో ఆస్వాదించిన మహాత్ములు రాగద్వేషము అనెడి ద్వంద్వములనుండి విడివడినవారై, భోగాసక్తిని త్యజించి, దుఃఖరూపమైన సంసారమును, బంధుజనులను పరిత్యజించి, జీవించుట కొరకు భిక్షావృత్తి నవలంబించి, కొన్ని పక్షులవలె జీవించుచున్నారు. అట్టి పవిత్రమైన కృష్ణకథను మేము మరువలేకున్నాము.

కృష్ణకథ అమృతమయము. ఆనందరూపము. అమృతానంద రసపూర్ణమైన అట్టి కృష్ణకథను ఒక్కసారి శ్రవణము చేయుగనే మనస్సు తృష్ణను వీడి నిర్మలమగుచుండును. కృష్ణకథా వైభవమును మహాభక్త తుకారాంజీ మరాఠీలో ఈ విధంగా గాన మొనరించినాడు.

కథా త్రివేణీ సంగమ దేవ భక్త ఆణీ నామ తెథేంచె ఉత్తమ చరణ రజ వందితాం
జళతీ దోషాం చె డోంగర శుద్ధపణేంకే నారీనర గాతీ ఏకతీ నాచత తో పవిత్ర హరికథా

భగవంతుని యొక్క కథ, భక్తుల యొక్క దివ్యోన్మాద స్థితి, భగవన్నామ వైభవము- ఈ మూడు విషయములపై ఎచ్చట చర్చలు జరుగుచుండునో అదియే త్రివేణీ సంగమము.

భగవత్కథ గానము చేయబడు స్థలము మహోన్నతమైనది. ఆ పవిత్రప్రదేశము భక్తుల చరణధూళిని ధరించును.

హరికథ సమస్తదోషములను హరించును. సర్వులను పరిశుద్ధమొనర్చును. వర్ణించ నలవిగాని హరికథ పరమ పవిత్రము.

రమణీయమైన కృష్ణకథ రాగద్వేషములను తటస్థ పరచును. ద్వంద్వాల నధిగమింప చేయును. దుఃఖరూపమగు సంసార బంధములను ఛేదించును. మాయా తెరలను, మోసపు మమతలను తొలగించి తరింపజేయును. మాయా కుటుంబము మరుగై, ప్రేమ కుటీరంలో జీవించే అవకాశమును కథామృతము కలిగించును. మహాభక్తుడైన చండీదాసు రాధాకృష్ణుల లీలావైభవమును వర్ణించు సందర్భమున ఈ క్రింది విధంగా బెంగాలీలో గానం చేస్తారు.

పీరితి నగరే వసతి కరిబ పీరితి బాంధిబ ఘర
పీరితి దేఖియా పడసి కరిబ తా బిన్ సకలి పర

"నేను ప్రేమస్థలిలో ప్రేమసదనమును నిర్మించుకున్నాను. ప్రేమే నాకు ఇరుగై, పొరుగై, సర్వమై నిలిచింది."

కృష్ణకథ ప్రేమమయము. అట్టి కథ నాలకించిన భక్తులు ప్రేమస్వరూపులగుచున్నారు. అమృత రూపులగుచున్నారు. అందుచేతనే పట్టుచిక్కిన కృష్ణకథ నంటబట్టినచో దానిని వదలి జీవించ శక్యముగాదు. అదియే గోపిక ఈ శ్లోకమున వ్యక్తపరచు అంతరంగికానుభూతి.

వయమృత మివ జిహ్మ వ్యాహృతం శ్రద్ధధానాః
కులిక రుత మివాజ్ఞాః కృష్ణ వధ్వో హరిణ్యః
దదృశురసకృదేతత్ తన్నఖ స్పర్శ తీవ్ర
స్మరరుజ ఉపమన్త్రిన్ భణ్యతామన్యవార్తా

"ఓ మధుపమా! దూతా! జింకలు బోయవాని గానమునందు ఆసక్తి కలిగి ఆ తరువాత వాని శరఘాతమునకు గురియై దుఃఖించునట్లు మేము కూడా శ్రీకృష్ణుని మధురమయ వాక్కులు సత్యములని విశ్వసించి. అనేకసార్లు అతని గోళ్ళతాకిడిచే ఉత్పన్నమైన తీవ్ర కామవేదనను అనుభవించినాము. అందుచేత అతని మాటలను విడచి అన్యప్రసంగములను చేయుము."

కృష్ణుని పొందులో అనుభవించిన ఆనందస్థితి ఈ నాటి వియోగ కాలమున గోపికల చిత్తములను చెదర గొట్టుచున్నది. భరించలేని విరహవేదన వారి హృదయములను కలియ బెట్టుచున్నది. కలత పెట్టుచున్నది. యమునాతీరము ఎడారివలె గోచరించుచున్నది. వర్షపు నీటికై తపించు చాతకములవలె, చంద్రుని వెన్నెలకై పరితపించు చకోరములవలె వారి మానసములు దుఃఖతప్తములై యున్నవి.

విరాళితో నడిచే ప్రతినిమిషము వారి బ్రతుకులలో తొలగించ వీలుపడని విస్మృహను నింపుతున్నది. గాయపడిన హరిణులవలె వ్యథ చెందుతూ గోపికలు మరణ బాధ ననుభవించుచున్నారు. చంద్రుడు వేడిని విరజిమ్మునట్లు, వృక్షములు ఛాయకు బదులు అగ్నిని వర్షింపజేయునట్లు వ్యథ చెందుతున్నారు.

అబ్ సోయీ యమునార కూలే, గోప గోపీ నాహి బూలే

"ఒకనాడు ఎంతో బిగ్గరగా ఘోషించెడి గోపగోపీజనము ఈ నాడు యమునా తీరమున శబ్దము ఉడిగి శోషించిన వారివలె యున్నారు" అని మహాభక్తుడు విద్యాపతి గోపీప్రేమను గూర్చి వివరించినాడు."

"ఓ భ్రమరమా! అతని ప్రసక్తిని మా వద్ద విరమించుము. బాధాకరమైన నీ బోధలను ఆపుము. మా ప్రాణములు కొంతకాలము నిలుచుటకు ఇదియే మార్గముగా తెలియుచున్నది. కృష్ణుని విశ్వసించుట కన్నను ప్రాణములను పరిత్యజించుటయే నయం. గతంలో మా ప్రేమను తిలకించిన అతడు మాలోని విరహాగ్నిని రగుల్చుటకు నిన్ను దూతగా పంపినాడు. నీవు నిర్దాక్షిణ్యంగా అతని స్మరణచే మమ్ములను దహించి వేస్తున్నావు. దయచేసి వెళ్ళుము. అతని మాటను మాకు వినిపించకుము. అతని నామమును మా ఎదుట స్మరింపకుము. వెళ్ళుము. లేనిచో అన్య ప్రసంగములను చేయుము" అని గోపిక బాధను వ్యక్తము చేసెను. భ్రమరము దూరముగా వెళ్ళెను. దూత దూరమయ్యెనని గోపికలు భావించిరి. వెళ్ళిన దూత మళ్ళీ తిరిగి సమీపించెను.

ప్రియ సఖ పునరాగాః ప్రేయసా ప్రేషితః కిం
వరయ కిమనురున్ధే మాననీయోఽసి మేఽఙ్గ
నయసి కథ మిహాస్మాన్ దుస్త్యజ ద్వంద్వ పార్శ్వం
సతత మురసి సౌమ్య శ్రీర్వధూః సాకమాస్తే ॥

వెడలిన మధుపము తిరిగిరాగా గోపిక లిట్లు పలికిరి. "ఓ కృష్ణ ప్రియుడా! మా ప్రియుడు పంపగా నీవు మరల తిరిగి వచ్చితివా? అయితే నీవు మాననీయుడవు. తెలుపుము. ఎవరి మహాదశ్య భాగ్యమును విస్మరించను వీలుపడక యున్నదో అట్టివాని కడకు మమ్ముల నెట్లు గొనిపోవుదువో తెలుపుము. శ్రీదేవి సదా అతని వక్షస్థలమున విరాజిల్లుచున్నది."

భ్రమరము వెడలినట్లే వెడలి తిరిగి వారి వద్దకే వచ్చినది. ఆ మధుపము శ్రీకృష్ణుని కడకు వెళ్ళి అతడు పంపగా మరల వచ్చినట్లు భావించి గోపికలు సంతసించుచున్నారు.

ప్రియుడు ప్రేమతో మరల దూతను పంపినాడని ఆనందించుచున్నారు. అందుచేత మధుపము మాననీయుడని శ్లాఘించుచున్నారు.

"భ్రమరమా! మా కఠిన వచనములను మా ప్రియునితో చెప్పితివా? మా బాధను గుర్తించి అతడు నిన్ను మరల మా వద్దకు పంపెనా? అదియే నిజమైనచో నీ అభీష్టమును తెలియజేయుము. మమ్ములనేమి చేయుమందువు? ఒకనాడు మేము శ్రీకృష్ణుని అంటిపెట్టుకొని యున్నవారమే. విధి వక్రించుట వలన నేడు ఆయనకు దూరమై భరింప శక్యముగాని దుఃఖము ననుభవించుచున్నాము. ఒకనాటి మా భాగ్యము ఈ నాడు శ్రీదేవిని వరించింది. మమ్ములను అతని దివ్యసన్నిధికి చేర్చువా?" అని గోపికలు ప్రేమోన్మాద చిత్తులై వ్యథ చెందుచున్నారు.

"ఓ మధుపమా! కృష్ణుని బంధించాలని భావించామే గాని మేము బంధితులమౌతామని ఊహించలేకపోయాము. రమ్ము. సమీపమున కూరుచుండుము. కృష్ణుని ప్రియవాక్యులను మా వీనులలో వదలి పెట్టుము. మేము వాటిని హృదయములో జాగ్రత్తగా పదిలపరచు కొందుము."

"మా హృదయవీణ మూగబోలేదు. ప్రేమభావతంత్రులచే దానిని చక్కగా బిగించి యున్నాము. ఇక దానిని మా ప్రియతముడైన కృష్ణుని అమృత హస్తములయందు ఉంచుటయే ఆలస్యము. అతని మృదు మధుర నఖములు మా హృదయ తంత్రులను మీటే దెప్పుడు? అందుండి జీవనరాగము వినిపించే దెప్పుడు? మోడువారిన మా ప్రేమలత చిగురించే దెప్పుడు? చెప్పు.... దూతా! చెప్పుము."

విరహవేదనతో విహ్వలులైన గోపభామల నేత్రములనుండి అశ్రువులు ప్రవహించుచుండెను. వారి ముఖపద్మమున జాలువారే అశ్రువులను గాంచి పద్మమునుండి జాలువారే మకరందమని భావించిన భ్రమరము ఆసక్తితో వారిని సమీపించెను. సమీపించిన భ్రమరమును గాంచి గోపికలు చివరగా ఇలా పలికిరి.

అపి బత మధుపుర్యా మార్యపుత్రోఽధునాస్తే
స్మరతి స పితృగేహాన్ సౌమ్య బన్ధూంశ్చ గోపాన్
క్వచిదపి స కథా నః కింకరీణాం గృణీతే
భుజమగురు సుగన్ధం మూర్ధ్న్యధాస్యత్కదా ను

"ఓ సౌమ్యుడా! ఆర్యపుత్రుడగు శ్రీకృష్ణుడు గురుకులము నుండి తిరిగి ఏతెంచినాడా? ప్రస్తుతము మధురాపురి యందే వసించుచున్నాడా? ఓ దూతా! అతడు తండ్రి గృహమును, గోపాలురను స్మరించుచున్నాడా? ఈ దాసీజనమును గూర్చి ఎప్పుడైనను తలచునా? అతడు వ్రజపురమున కెప్పుడు ఏతెంచును? అగరు వాసనగల అతని బాహువులను మా శిరమున ఎప్పుడు నిలుపును?"

"ఓ దూతా! శ్రీకృష్ణుడే మా ప్రాణము. శ్రీకృష్ణుడే మాకు సర్వము. మా హృదయములు అతని వెంట పరుగిడి పోయినవి. అతని ముఖ సౌందర్య మనెడి వలలో

చిక్కుకొని తిరిగి రాలేక అచ్చటనే ఉండిపోయినవి. హృదయాలు లేనివార మగుటచేత శ్రీకృష్ణుడు లేని బండబ్రతుకును నిర్జీవముగా సాగించు చున్నాము."

"మా కన్నయ్య గురుకుల వాసమునుండి వచ్చెనా? విద్య పూర్తయినదా? మధుర యందే యున్నాడా? పగలు ఆహారము లేక, రాత్రులు నిద్ర లేక మేము సదా అతనినే స్మరించుచున్నాము. అతడు మమ్ములను తలపోయునా?"

"నందయశోదలు దిగులుతో క్షణమొక యుగంలా గడుపుతున్నారు. ఆహార నిద్రాదులు దూరమైనవి. ప్రాణ మెందులకు దూరము కాదు? యని యశోదామాత విలపించుచున్నది. వారిని శ్రీకృష్ణుడు స్మరించునా? అతడు వ్రజపురమునకు ఎప్పుడు ఏతెంచును?" అని గోపికలు మధుపమును ప్రశ్నించుచున్నారు.

"మమ్ములను కృష్ణుని వద్దకు చేర్చవా?" అని గడచిన శ్లోకమున అర్థించిన గోపికలు "అతడు మావద్దకు ఎప్పుడు వచ్చును?" అని ఈ శ్లోకమున అభ్యర్థించుచున్నారు. శ్రీకృష్ణుడు సచ్చిదానంద రూపుడు. సర్వాంతర్యామి. అతడు ఎక్కడ ప్రత్యేకంగా యున్నాడు వెళ్ళేందుకు? హృదయంలో దర్శనీయమైతే మనతోనే యున్నాడు. హృదయంలో అదృశ్యమైతే ఉండి లేనట్లే యుంటాడు. కనుక తమ హృదయాలలో పరమాత్మ ఎప్పుడు దర్శనీయుడగును? అని గోపికలు వ్యథ చెందుతున్నారు. భ్రమర గీతము సమాప్తమైనది. శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుతో పలుకుతున్నాడు.

"రాజా! గోపికల యొక్క దివ్యోన్మాద ప్రేమను ప్రత్యక్షముగా దర్శించిన ఉద్ధవుని హృదయం స్పందించింది. ఆనందముతో ద్రవించింది. పారవశ్యముతో పులకరించింది. శ్రీకృష్ణుని సందేశమును వారికి వినిపించి వారిని ఓదార్చుటకు ఉద్ధవుడు ప్రయత్నించు చున్నాడు."

మహాభక్తుడైన ఉద్ధవుడు గోపికలను సమీపించినాడు. మధుమయ వచనములతో, "ఓ పుణ్యజీవులారా! సదా కృష్ణగతచిత్తులైన మీరు ధన్యజీవులు. లోకపూజితులు. మునులకు సైతము దుర్లభమగు భక్తిని పరమాత్మ యందు ప్రవర్తింప జేసినారు. మీరు సమస్తమును త్యజించి సర్వాధారుడగు శ్రీకృష్ణుని వరించినారు. మీ దివ్యప్రేమను, విరహోపేక్షను నేను కూడా దర్శించి, తరించే భాగ్యమును ప్రసాదించినారు. అది నాపై మీరు కురిపించిన అనురాగామృత వృష్టిగా నేను భావించుచున్నాను. ఓ గోపికలారా! మీకు అత్యంత ప్రీతిని కలిగించు శ్రీకృష్ణుని దివ్యసందేశమును నేను తెచ్చినాను. అది వినిపించెదను. ఆలకింపుడు. భగవానుడు మీతో ఈ విధముగా పలుకుతున్నాడు" అనెను.

"ఓ గోపికలారా! నేను సర్వాత్మకుడను. నాతో మీకు వియోగము ఎలా సంభవము? సమస్త కార్యములకు ప్రధానకారణము నేనై యున్నాను. చరాచర భూతముల యందు పంచభూతములు వసించి యున్నట్లు సర్వగతుడనైన నేను దేహేంద్రియ ప్రాణ మనో బుద్ధులకు ఆశ్రయుడనై యున్నాను. ఆత్మయందు ఆత్మచేత జీవులను నేను పుట్టింతును. రక్షింతును. లయింపజేతును. స్వప్నము నందలి అనుభవములను జాగ్రదవస్థ యందు విస్మరించులాగున, మనస్సు నందలి సర్వానుభవములను స్వప్నతుల్యమని భావించి

మనస్సును నిగ్రహింపుము. సమస్త సాధనలు, శాస్త్రములు మనోనిరోధము కొఱకేనని గ్రహింపుడు. మీ మనస్సు నాయందు స్థిరముగా నిలుచుటకే నేను మీకు దూరముగా మన్నాను.

యత్త్వహం భవతీనాం వై దూరే వర్తే ప్రియో దృశామ్
మనసః సన్నికర్షార్థం మదను ధ్యానకామ్యయా

"నేను మీకు అత్యంత ప్రియుడ నయ్యును మీకు దూరముగా నుంటిని. మీ ధ్యానము సదా నా మీదనే యుండుటకు అలా చేసితిని. ఆ నిరతమైన ధ్యానము ద్వారా చిత్తమునకు సన్నికర్షత ఏర్పడును."

"మీరు మనస్సు నందలి సమస్త వికారములను త్యజించి నిరంతరము నన్నే స్మరించుచున్నారు. త్వరలోనే మీరు నన్ను తప్పక పొందగలరు" అని భగవంతుడు సందేశము పంపించెను. మాధవస్మరణము వలన ముక్తి స్వరూపము లభ్యమగునని విదితమైనది.

"రాజా! శ్రీకృష్ణుని సందేశమును ఉద్ధవుడు గోపికలకు వినిపించగా సంతుష్ట చిత్తులైన గోపికలు ఉద్ధవుని గూర్చి ప్రేమతో ఈ విధముగా పలికిరి" అని శ్రీశుకులవారు పరీక్షిన్మహారాజుతో చెప్పిరి.

గోపికలు ఉద్ధవునిపై ప్రేమ దృష్టిని ప్రసరింపజేసిరి. "సౌమ్యుడా! మహాత్మా! దుర్మార్గుడగు కంసుడు హతుడయ్యెను. మన ప్రియతముడగు శ్రీకృష్ణుడు ఆత్మీయులతో ఆనందముగా వసించుచున్నాడా?" అని కొందరు గోపిక లడిగిరి.

"అయ్యో! శ్రీకృష్ణుడు మాపై జూపిన ప్రేమను మధురాపురి యందలి మగువలపై కూడా చూపుచున్నాడా? వారి మధ్య ఆనంద జీవనమును సాగించుచు ఈ పల్లెటూరి భామలను మరచెనా?" అని మరికొందరు గోపభామలు ప్రశ్నించిరి.

"సౌమ్యుడా! గోపస్త్రీలమైన మేము ఆయనతో కలసి రాత్రులందు రాసమండలమున వర్తించిన విషయములను స్మరించుచుండునా? మమ్ముల ననుగ్రహించుటకు శ్రీకృష్ణుడు వ్రజపురమునకు ఎప్పుడువచ్చును?" అని ఇంక కొందరు ప్రశ్నించిరి.

హే నాథ హే రమానాథ వ్రజనాథార్తినాశన
మగ్నముద్ధర గోవింద గోకులం వృజినార్ణవాత్

"హే ప్రభూ! లక్ష్మీపతీ! వ్రజనాథా! దుఃఖనాశకా! దుఃఖసాగరమున మగ్నమై యున్న వ్రజపురమును ఉద్ధరింపుము" అని గోపిక లందరు కీర్తించిరి.

ఉద్ధవుడు చెప్పిన కృష్ణ సందేశమును విని సంతుష్టచిత్తులైన గోపికలు అతనిని పూజించిరి. ఈ విధముగా గోపికల శోకమును పోగొట్టి, కొంతకాలము అక్కడే యుండి ఉద్ధవుడు కృష్ణ కథను చర్చించుచుండెను. గోపికలను ఆనందపరచుచుండెను. గోపికల యొక్క పరమాత్మప్రసక్తమైన ప్రేమను గాంచిన ఉద్ధవుడు వారిని ఆదర్శవంతులుగా భావించి, నమస్కరించెను.

వన్దే నన్ద వ్రజస్త్రీణాం పాదరేణు మభీక్ష్ణశః
యాసాం హరికథోద్గీతం పునాతి భువనత్రయమ్

"వ్రజపురము నందలి గోపికల పాదధూళికి నేను సదా నమస్కరించుచుందును. వారి కృష్ణకథాగీతము ముల్లోకములను పావన మొనర్చును" అని ఉద్ధవుడు కీర్తించెను.

పుణ్యాత్ముడగు ఉద్ధవుడు గోపికల, గోపాలుర, యశోదానందుల కడ సెలవు పుచ్చుకొని మధురాపురిని చేరుటకు బయలు దేరెను. రథము నధిరోహించెను. నందాది గోపులు రథమును సమీపించి, ఉద్ధవునికి నమస్కరించి, అశ్రుపూరిత నయనములతో ప్రేమ వచనములను పలికిరి.

మనసో వృత్తయో నః స్యుః కృష్ణ పాదాంబు జాశ్రయాః
వాచోఽభి ధాయినీ ర్నామ్నాం కాయస్తత్ప్రహ్వణాదిషు

"మహాత్మా! మా సంకల్పము లన్నియు శ్రీకృష్ణుని పాదపద్మములనే ఆశ్రయించుగాక! మా వాక్కు కృష్ణనామమునే సదా గాన మొనర్చుగాక! దేహము ఆయనకు ప్రణామము లొనర్చుగాక!" అని ప్రార్థించిరి.

"పరీక్షిన్మహారాజా! వ్రజపురవాసుల పూర్ణభక్తిని గాంచి, సంతసించిన ఉద్ధవుడు హ్లాదమానందముతో మధురానగరమునకు బయలుదేరెను" అని శ్రీశుకులు తెలియజేసిరి.

కామ్యభక్తి - నిష్కామ్య భక్తి

భగవంతుని కొరకు చేయు ఏ సంకల్పమూ వృథా కాదు. పరమాత్మను ఆశ్రయించు బుద్ధి పవిత్రమైనది. కొందరు కోరికల నీడేర్చుకొను ముద్దేశ్యముతో భగవంతుని ఆశ్రయిస్తారు. కోరికలు తీరితేచాలు, భగవంతుని మరచిపోతారు. వాంఛలు తీరకపోతే భగవంతుడే లేడని కూడా పలుకుతూ ఉంటారు. వీరిది ప్రాపంచిక దృష్టి. తమ కోర్కెలను తీర్చమని పరమాత్మను ఎప్పుడూ పిలుస్తూ ఉంటారు. మన పనులు చేసి పెట్టేందుకు పరమాత్మ మన నౌకరుయా? అని కూడా వారు ఆలోచించరు. వీరిది కామ్యభక్తి.

రెండవ కోవకు చెందిన వారు నిష్కామ భక్తులు. అవగాహన కలిగిన వారు. ప్రేయస్సును విస్మరించినవారు. శ్రేయస్సును వాంఛించువారు. ప్రపంచ భోగము లన్నియు అనిత్యములని ఎరిగి ఒక్క పరమాత్మనే సదా వాంఛించువారు. ఎవ్వరు ఏ విధముగా నాశ్రయింతురో భగవానుడు వారిని ఆ విధముగా అనుగ్రహించును.

యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహం

"ఎవరు నన్ను ఎలా భజింతురో వారిని నేను అలాగే అనుగ్రహించుచున్నాను" అని భగవానుడు భగవద్గీత యందు తెలిపి యున్నాడు.

ఈ అధ్యాయము నందు కామ్యభక్తికి ప్రతీకముగా కుబ్జయు, నిష్కామ్య భక్తికి ప్రతీకముగా అక్రూరుడును గోచరిస్తారు. శ్రీకృష్ణుడు ఇరువురిని అనుగ్రహిస్తాడు.

ఉద్ధవుడు మధురానగరము చేరెను. శ్రీకృష్ణుని సదనమునకు వచ్చెను. ఉద్ధవుని ద్వారా వ్రజపుర విశేషములను శ్రీకృష్ణుడు తెలిసికొనెను. తననే ఆశ్రయించుకొని జీవించు భక్తులను పరమాత్మ సదా వీక్షించుచునే యుండును. అనన్య చింతనములో భక్తులుండగా, యోగక్షేమములను వహించుట యందు భగవానుని చిత్తము లగ్నమై యుండును.

శ్రీకృష్ణుడు ఉద్ధవుని వెంటబెట్టుకొని సైరంధ్రియగు కుబ్జ గృహమున కేగెను. గతములో ఇచ్చినమాటను సఫల మొనర్చుటకు బయలుదేరెను. కుబ్జ ఇంటిని అందముగా అలంకరించి, శ్రీకృష్ణుని కొరకు ఎదురు చూచుచుండెను. తన చెలియలతో గూడి శ్రీకృష్ణునికి కుబ్జ స్వాగతము పలికెను. శ్రీకృష్ణుని పూజించెను.

కుబ్జ ఉద్ధవుని కూడా గౌరవించెను. ఆయనకు కూడా ఉచితాసనము నొసగెను.

తథోద్ధవః సాధు తయాఽభి పూజితో న్యషీదదుర్వ్యా మభిమృశ్య చాసనమ్

కుబ్జచే సన్మానితుడైన ఉద్ధవుడు ఆమె యొసంగిన ఆసనమును స్పృశించి, నేలపై ఆసీనుడాయెను.

ఉద్ధవుని అకుంఠిత భక్తి, వినయస్ఫూర్తి ఇచ్చట తెలియుచున్నది. కుబ్జ యొసంగిన ఆసనమును స్పృశించి, ఆమె ఆహ్వానమును గౌరవించెను. పరమాత్మయైన శ్రీకృష్ణుని ఎదుట ఉచితాసనముపై ఆసీనుడు కాలేక నేలపై కూర్చొనెను. భగవంతునిముందు, గురువు కడ సింహాసనము లెక్కుటకు ప్రయత్నించకూడదు. వారి సన్నిధి మన జీవన పెన్నిధి. ఆ పవిత్ర పాదపద్మముల చెంత మన అహంకారమును త్యాగము చేయవలెనే గాని దానిని వృద్ధిపరచుకోకూడదు. పెద్దల సమక్షములో ఆసనము నధిరోహించుట అపచారము.

కుబ్జ తనను తాను అందముగా అలంకరించుకొనినది. స్నానాదులు ముగించుకొనినది. అనులేపన ద్రవ్యములను అలదుకొనినది. సుందరమైన వస్త్రములను ధరించినది. ఆభరణములను అలంకరించుకొనినది. ముంచుకొచ్చిన సిగ్గును ముంగురులలో దాచుకొని మెల్లగా హంసవలె నడుస్తూ శ్రీకృష్ణుని సమీపించినది. సిగ్గుతో తలవంచి యున్న కుబ్జను శ్రీకృష్ణుడు సమీపమునకు తీసుకొనెను. ఆమెతో క్రీడించెను. కుబ్జ మనోవ్యాకులమును తొలగొట్టుకొని సంతసించెను.

ఇదియే ప్రేయస్సు. కాలాధీనమైన క్షణికానందము. ఇచ్చట శ్రేయస్సు శూన్యమైనది. ఇది కామ్యభక్తియే గాని నిష్కామ్యభక్తి కానేరదు. కామధేనువు లభించినపుడు కాకరకాయలు కోరువారు ఎంత దౌర్భాగ్యులో కదా!

సైవం కైవల్యనాథం తం ప్రాప్య దుష్ప్రాప్య మీశ్వరమ్
అఙ్గరాగార్పణే నాహో దుర్భగేదమయాచత

"అంగరాగ ప్రదాన మను పుణ్యముచే దుర్లభమగు కైవల్యనాథుని పొందిన కుబ్జ దురదృష్టమువలన ప్రేయస్సునే కోరినది."

అహో ఏమి దౌర్భాగ్యము! గోపికలు పూర్ణదృష్టి గలవారు. అందుచేత వారి భక్తి కామరహితమైనది. కుబ్జ కామ్యభక్తి గలది. అందుచేత పురుషోత్తముని పొంది కూడా కామతృప్తిని కోరినదేగాని, పరమ పురుషార్థమగు మోక్షమును వాంఛించలేకపోయినది.

దురారాధ్యం సమారాధ్య విష్ణుం సర్వేశ్వరేశ్వరమ్
యో వృణీతే మనోగ్రాహ్య మసత్వాత్కు మనీష్యసౌ

"సర్వేశ్వరేశ్వరుడు, దురారాధ్యుడు నగు విష్ణుమూర్తిని సేవించి, ఆయనను లౌకిక విషయముల ననుగ్రహించమని కోరువాడు నీచుడు. అతడు దుష్టుడే" యని ఈ సందర్భమున భాగవతము పలికినది.

అక్రూరుని ఆశీర్వదించుట

భగవంతుని కరుణచే భక్తుని హృదయము సంతసించును. పవిత్రుడైన భక్తుని భగవానుడు విస్మరించడు. కుబ్జను సంతోషపెట్టిన శ్రీకృష్ణుని మదిలో అక్రూరుడు మెదలెను. అక్రూరుని గృహమును సందర్శించవలె నని శ్రీకృష్ణుడు భావించి, ఉద్ధవ బలరాములతో కలసి అక్రూరుని గృహమున కేగెను. శ్రీకృష్ణుడు అక్రూరుని గృహమున కేగుటకు కారణమేమి?

కించ చికీర్షన్ ప్రాగాదక్రూర ప్రియ కామ్యయా

"అక్రూరునకు సంతుష్టిని కలిగించుటకు, అతని ద్వారా కొంత పనిని సాగించుటకు వెళ్ళెను" అనినది వ్యాస భాగవతము.

నిష్కామ భక్తిలో చరించువానిని ఆశీర్వదించుటకు భగవానుడు స్వయముగా అరుదెంచును. కానీ అట్టి భక్తుడు ఇతరులను ఉద్ధరించు స్వభావము గలవాడై యుండవలెను. అప్పుడే అతడు భగవత్ప్రేమకు అర్హుడగును.

"తాము తరిస్తూ లోకమును తరింపజేయువారే ధన్యజీవులు" అని నారదమహర్షి భక్తి సూత్రములలో తెలిపెను. కనుక మనలో పుష్టి భక్తి కలిగి, అన్యుల నుద్ధరించవలె ననెడి సేవాభావము కదలినపుడు శ్రీకృష్ణుడు మనవద్దకు కూడా వచ్చును. తానే తరించవలెనని స్వార్థముతో చరించువారికి కృష్ణదర్శనము దుర్లభము.

అరుదెంచుచున్న బలరామ కృష్ణులను అక్రూరుడు గాంచెను. ఎదురేగి ఆహ్వానించెను. అంజలి సమర్పించి తన్మయతతో ప్రణమిల్లెను. ఆసనములపై కూర్చుండ బెట్టి పూజించెను. తలవంచి నమస్కరించెను. పాదములను వొత్తెను.

"మహానుభావులారా! మీరు నా గృహమున కేతెంచినారు. ఈ దీనుని పావనుని జేసినారు. మీరు జగత్కారణమైన పురుషోత్తములు. పంచభూతములు పంచీకరణము జెంది అనేక రూపములలో గూడిన వస్తువులుగా తెలియునట్లు, సర్వజ్ఞుడవైన నీవు విలాసము కొరకు మానవ, పశుపక్ష్యాదుల దేహముల యందు అనేక దశలలో వివిధ రూపములతో తెలియుచున్నావు. సృష్టి స్థితి లయాదులు నీలో జరుగుచున్నను, అల వలన

సముద్రమునకు వికారము కలుగనట్లు నీవు నిర్వికారుడవై యున్నావు. నీ దేహము లీలావిలాసము. అందుచేత నీకు ప్రారబ్ధాదికర్మలు, జన్మలులేవు. నీవు ధర్మరక్షణ కొరకు అవిర్భవించినవాడవు.

మహానుభావా! నీ పాదపద్మములను స్పృశించిన గంగామాత ముల్లోకములను పావన మొనర్చుచున్నది. అట్టి జగన్నాథుడవగు నీవు నా గృహంబునకు వచ్చి నన్ను పవిత్ర మొనర్చితివి. నీకొరకు చేయుభక్తి ఎన్నడూ వృథా గాదు. భక్తుడైన వానికి సర్వశుభములను చేకూర్చుటయేగాక వృద్ధిక్షయాలు లేని నీ పూర్ణ స్వరూపమును కూడా అనుగ్రహింతువు. తండ్రీ! బ్రహ్మాది దేవతలకు నీ దర్శనము అలభ్యము. అట్టి నీవు నన్ను కరుణించి మా ఇంటికి అరుదెంచితివి. ఈ మాయారూపమగు సంసార బంధములను తొలగించి, మమ్ములను కృతార్థులను గావింపుము" అని అక్రూరుడు ప్రార్థించెను. అక్రూరుడు పుణ్యాత్ముడు. ఐహిక వాంఛలు లేనివాడు. అందుచేతనే శ్రీకృష్ణుడు ఆ దివ్యాత్ముని గృహమును పావన మొనర్చెను.

అక్రూరుని వినమ్ర వచనముల నాలకించిన ఆదిదేవుడు అత్యంత ప్రియమైన అనుగ్రహభాషణము ద్వారా అక్రూరుని సంతృప్తి పరచెను.

త్వం నో గురుః పితృవ్యశ్చ శ్లాఘ్యో బంధుశ్చ నిత్యదా
వయంస్తురక్ష్యాః పోష్యాశ్చ అనుకంప్యాః ప్రజాహివః

"అక్రూర మహాశయా! నీవు మాకు గురుడవు. పినతండ్రివి. శ్లాఘ్యుడవు. బంధువువు. మేము నీ దయకు సదా పాత్రులము. నీచే పోషింపబడి రక్షింపబడువారము" అని శ్రీకృష్ణుడు పలికెను.

నిష్కాములగు భక్తులను గాంచి పరమాత్మ కూడా పరవశించును. అక్రూరుడు ఉత్తమ సాధువు. పరమ భాగవతోత్తముడు. సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మ నుండియే యోగ్యతాపత్రమును బొందిన పుణ్యాత్ముడు.

భవద్విధా మహాభాగా నిషేవ్యా అర్హసత్తమాః
శ్రేయస్కామైర్నృభిర్నిత్యం దేవాః స్వార్థా న సాధవః

"నీ వంటి మహాత్ములు ఎల్లరకును పూజనీయులే. దేవతలు తమ కార్యములను నెరవేర్చుకొనుట యందే మనస్సును లగ్నమొనర్చుదురు. కానీ సాధువులు అన్యసేవా పరాయణులై యుందురు" అనెను.

దేవతలకు లభించని శ్రేష్ఠత్వము సాధువులకు లభించింది. అందుచేతనే దేవతలకు దుర్లభమగు భగవానుడు నిరంతరము సాధుహృదయ నివాసియై యుండును. స్వార్థము గొప్పవారిని కూడా తక్కువ చేయును. త్యాగము చిన్నవారికి సైతము శ్రేష్ఠత్వము నందించును. ఈ సత్యము పోతనామాత్యుని అమృతకలము నుండి ఎలా జాలువారినో గాంచెదము.

చ॥ కొలుతురు మర్త్య లిప్తములు గోరి శిలామయదేవసంఘమున్
జలమయ తీర్థసంఘమును సంతతము న్నటువారు గొల్వఁగా
వలదవరాదుగాక భగవత్పరభక్తులరైన మీక్రియన్
పొలయక దేవతీర్థములు చూచినయంతనె కోర్కు లిచ్చునే?

"అక్రూర మహాశయా! నీవు మాకు అత్యంత ప్రియుడవు. శ్రేయోభిలాషివి. మాకొక సహాయము నొనరింపుము. పాండవులు నివసించు హస్తినాపురమున కేగి ధృతరాష్ట్రునితెంత వారెలా జీవించుచున్నారో గ్రహింపుము. పాండురాజు గతించెను. ధృతరాష్ట్రుడు కుంతీదేవిని, పాండవులను హస్తినాపురమునకు తీసుకొని వచ్చినట్లు వినియుంటిమి. ధృతరాష్ట్రుడు చెడుబుద్ధి కలవాడు. దుర్మార్గులగు పుత్రుల ఆశ్రయములో నుండువాడు. అందుచేత పాండవులను సమదృష్టిలో వీక్షింపడు. కనుక నీవు వెళ్ళి అతని ప్రవర్తన పాండవుల విషయములో ఎలా వున్నదో గ్రహింపుము. ఆ విషయముల నెరిగి మేము వారికి శ్రేయము లొనగూర్తుము" అని శ్రీకృష్ణుడు పలికెను.

నిష్కామభక్తులైన వారినే భగవంతుడు అనుగ్రహించును. అంతేకాదు, వారి ద్వారా భక్తుల నుద్ధరించు కార్యములను చేపట్టును. ఈ భాగ్యము పుణ్యాత్ముడగు అక్రూరునకు లభించినది. కుబ్జకు లభ్యముకానిది. త్యాగమయమైన నిష్కామ్యభక్తియే భగవంతుని హృదయమును కదలించును. కుటిలత్వము, క్రూరత్వము నెరుగని అక్రూరునకు సహస్రకోటి వందనము లర్పిస్తూ దివ్యమైన కృష్ణకథామృతమును పానము చేసెదము. తరువాత వినండి.

హస్తినాపురంలో అక్రూరుడు

అక్రూరుడు హస్తినాపురమునకు వెడలెను. అచ్చట బంధువులను, ఆప్తులను, ఆచార్యులను జూచెను. కుశలముల నడిగి సంతసించెను. శ్రీకృష్ణుని యాజ్ఞను మననము చేసి, దుష్టబుద్ధియగు ధృతరాష్ట్రుని ప్రవర్తనను గమనించుచు కొన్ని మాసములు హస్తినాపురమునందే గడిపెను.

తేజస్సు, ఓజస్సు, బల వీర్యాదులను కలిగిన పాండవుల సద్గుణములను, ప్రజానురాగమును గాంచి ఖిన్నుడైన దుర్యోధనుడు తన పరివారము ద్వారా పాండవుల నెలా ఇక్కట్లకు గురిచేయుచున్నది అక్రూరుడు స్వయముగా గాంచెను. గతములో పాండవులపై చేసిన విషప్రయోగమును గూర్చి విదురుడు, కుంతీదేవి చెప్పగా వాలకించెను.

అక్రూరుని గాంచిన కుంతీదేవి అశ్రువుల నాపుకొనలేక పోయెను. గద్గద స్వరములో అక్రూరుని పలుకరించెను. "సౌమ్యుడా! సోదరా! మా మాతాపితలు, సోదరులు, సోదరీమణులు, బిడ్డలు, సఖులు అందరూ క్షేమమేనా? నా జన్మభూమి యందు నన్ను

స్మరించుచుందురా? మాకు సర్వాధారుడు, భక్తవత్సలుడు, మేనల్లుడు నగు శ్రీకృష్ణుడు మమ్ములను జ్ఞాపకము చేయుచుండునా? మమ్ముల ననుగ్రహించునా?

సపత్న మధ్యే శోచన్తీం వృకాణాం హరిణీమివ
సాన్త్వయిష్యతి మాం వాక్యైః పితృహీనాంశ్చ బాలకాన్

"సోదరా! నేను దిక్కు తెలియక దుఃఖించుచున్నాను. తోడేళ్ళ మధ్యనున్న లేడివలె శత్రువుల నడుమ బ్రతుకుచున్నాను. నా బిడ్డలు తండ్రిలేనివారయ్యారు. మమ్ములను శ్రీకృష్ణుడు ఓదార్చునా?" అని దుఃఖము పొంగుచుండగా, ప్రవహించుచున్న కన్నీటిని ఆపుకోలేక పావనచరిత యగు కుంతీదేవి నేత్రములను మూసికొని ధ్యానమందరుని స్తుతించుచూ ధ్యానించెను.

కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన
ప్రపన్నాం పాహి గోవింద శిశుభిశ్చావసీదతీమ్

"శ్రీకృష్ణా! యోగేశ్వరా! విశ్వాత్మా! విశ్వపాలకా! పిల్లలతో కూడి శోకము ననుభవించుచున్న ఈ దీనురాలిని రక్షింపుము" అని పలికెను.

దుఃఖము వచ్చినపుడు దైవానుగ్రహమును వాంఛిస్తూ భగవంతుని కీర్తించవలెను. భగవంతుని కీర్తించు చిత్తములో చింతలకు తావులేదు. బాధామయ పరిస్థితులలో ఆత్మనింద, పరనింద, దీర్ఘాలోచన, విట్టూర్పులవంటి దుశ్చర్యలను మాని, నిర్మల చిత్తముతో కుంతీదేవి వలె పరమాత్మను ధ్యానించు సుగుణమును ప్రతిరక్షుడు అలవరచుకొనవలెను.

కన్నీటిలో కదలిపోతున్న కుంతీదేవిని అక్రూరుడు, విదురుడు ఓదార్చిరి. ధర్మాత్ములగు పాండవులకు ఏ కీడు వాటిల్లదనియు, వారు త్వరలోనే శుభములను పొందెదరనియు పలికిరి.

అక్రూరుడు మధురకు వెడలుటకు నిశ్చయించుకొనెను. ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళి సంభాషించెను.

"ధృతరాష్ట్రా! నీ సహోదరుడగు పాండురాజు మరణించిన పిదప నీవు రాజ్య సింహాసనము నధిష్టించితివి. రాజధర్మమును చక్కగా పాలించుచు, ప్రజలకు సుఖము చేకూర్చుచూ, ఆత్మీయులను సమదృష్టితో వీక్షించుచున్నచో శుభమును పొందగలవు. కీర్తి పొందగలవు. దీనికి విరుద్ధముగా ప్రవర్తించినచో ఇహపరములకు చెడిపోదువు.

తస్మాత్సమత్వే వర్తస్వ పాణ్డవే ష్వాత్మజేషు చ

"ఈ కారణముచే పాండవులను, కౌరవులను సమభావములో వీక్షింపుము."

"రాజా! ఈ లోకమున మన మనుగడ శాశ్వతముకాదు. మన దేహములే మనతో ఉండవు. ఇక బంధువుల బాంధవ్య మేపాటిది? ప్రతిజీవి ఈ ప్రపంచమునకు ఒంటరిగనే వచ్చును. ఒంటరిగనే నిష్క్రమించును.

ఏకోఽ ను భుజ్క్తే సుకృతమేక ఏవ చ దుష్కృతమ్

"ఎవరి పాపపుణ్యముల ఫలములను వారు ఒంటరిగనే అనుభవింతురు. చేపపిల్లలు తమ తల్లిదండ్రులకు ఆహారమైన జలమునే పానము చేయునట్లు పుత్రాదులు కూడా తల్లిదండ్రుల ఆర్జన పైననే ఆధారపడి యుందురు. మానవుడు అధర్మమార్గాలలో చరించి, ధనము నార్జించి తనవా రనబడేవారిని పోషించును. ధనహీనుడైనపుడు ఆ బంధువులే అతనిని త్యజించి వెళ్ళుదురు. అట్టి పరిస్థితులలో పాపమే జీవితశేషమై మిగులును. కనుక ధృతరాష్ట్ర మహారాజా! ఈ సంసారము స్వప్న ప్రపంచమువలె మాయా స్వరూపమని, అనిత్యమని భావించి నిగ్రహవంతుడవై మెలగుము. సమదృష్టితో వర్తింపుము" అని అక్రూరుడు పలికెను.

అక్రూరుని వాక్యముల నాలకించిన ధృతరాష్ట్రుడు, "అక్రూరా! నీవు చక్కని ఉపదేశము గావించితివి. కానీ రోగపీడితునకు ఆహారము విషమై గోచరించునట్లు నీ వాక్కులు నన్ను తృప్తి పరచుటలేదు. నన్ను పుత్రవాత్సల్యమనెడి జాడ్యము పట్టి పీడించు చున్నది. నీ వచనములు శ్రేయోదాయకములని తెలియుచున్నను అవి నా మనస్సులో స్థిరముగా నిలువలేక పోతున్నవి. మేఘమునందలి మెఱుపువలె అదృశ్యమగుచున్నవి. ధర్మసంస్థాపనార్థమై యదుకులమున జన్మించిన భగవానుడగు శ్రీకృష్ణుని లీలను వర్ణింప నెవరితరము? నేను అతనికి వందన మిడుచున్నాను" అనెను.

అహా! ఏమి ధృతరాష్ట్రుని దౌర్భాగ్యము? అక్రూరు డంతటి మహాత్ముడు చేరువైనపుడు కూడా బ్రతుకును బాగుచేసుకొనుటకు ఇష్టపడుటలేదు. అక్రూరుని సహవాసము కన్నను దుర్యోధనుని సాంగత్యమే శ్రేయ మనిపించెను. అందుచేత చెడు సంసర్గము సర్వదా అనర్థదాయకము. సత్యము తెలియుచున్నను ఆచరించలేని నిస్సార నిర్వీర్య వ్యక్తులను తయారు చేయునది దుస్సంగమే.

ధృతరాష్ట్రుని వచనములను ఆలకించి, అక్రూరుడు తనలో తాను నవ్వుకొనెను. మంచిని తెలిసి ఆచరించలేని మందభాగ్యులందరూ ధృతరాష్ట్రులే.

అక్రూరమహాశయుడు బంధువుల అనుమతి బడసి మధురకు తిరిగి పయనమాయెను. హస్తినాపురమున తాను గ్రహించిన విషయములన్నియు యదుకుల నాథునకు సవివరముగా తెలిపెను.

శ్రీకృష్ణుడు పరమాత్మ. సర్వాంతర్యామి. ఆయనకు తెలియని విషయమంటూ ఈ ప్రపంచములో లేదు. అయినను భక్తుడైన అక్రూరుని సేవల నందుకొన నిచ్ఛగించి, అక్రూరుని హస్తినాపురమునకు పంపెను. భగవంతుడు ఎవ్వరిని అనుగ్రహింప నిచ్ఛగించునో అట్టి వారికే ఈ మహదవకాశములు లభించును. అక్రూరుడు అదృష్టవంతుడు. వందనీయుడు.

ద్వారకా నగర నిర్మాణము

కంసుడు మరణించెను. కంసుని భార్యలగు అస్తి ప్రాప్తి యను ఇరువురు శోకములో తండ్రియగు జరాసంధుని వద్దకు వెళ్ళిరి. తమకు జరిగిన అన్యాయమును వివరించి చెప్పిరి. యాదవుల వలన తమ భర్త మరణించెనని పలికిరి. తమ వైధవ్యమునకు యాదవులే కారణమని తెలిపిరి.

జరాసంధుడు మగధదేశమునకు రాజు. తన పుత్రికల వైధవ్యమునకు కారణమైన యాదవ కులమును నశింపజేయవలెనని సంకల్పించి, ప్రయత్నములు చేయసాగెను.

కంసుడు అజ్ఞానము. అజ్ఞానమునకు అస్తి ప్రాప్తులే భార్యలు. తనకు ప్రస్తుతము ఉన్నది "అస్తి". కలుగవలసినది "ప్రాప్తి". అనుక్షణము తనకేమున్నది? ఏమి రానున్నది? అనెడి దురాశలో చరించు వైఖరియే అజ్ఞానము. అదియే కంసుడు. అస్తిప్రాప్తులు వ్యక్తికి సౌఖ్యాన్నిచ్చునా? అవి ఎప్పుడూ దుఃఖరూపములే. మరి అట్టి అస్తి ప్రాప్తులు విడవకుండా ఎలా ఉండగలరు?

జరాసంధుడు ఆలోచించెను. ఇరువది మూడు అక్షౌహిణుల సేనను వెంటబెట్టుకొని యాదవ పట్టణమైన మధురానగరముపై దండెత్తెను.

భక్తులారా! పరమ పవిత్రమైన భాగవత పురాణములోని పావన చరిత్రమగు దశమ స్కంధమున ప్రస్తుతము నడుస్తున్న అధ్యాయము ఏబదియవ అధ్యాయము. ఈ అధ్యాయముతో దశమ స్కంధము యొక్క ఉత్తరార్థము అనగా రెండవ భాగము ప్రారంభమగుచున్నది. ఇచ్చట జరాసంధుడు ప్రవేశించినాడు.

మానవ జీవితము నూరేళ్ళపంట యని పెద్దలు నుడువుదురు. "శతాయుష్మంతు దీర్ఘాయుష్మాన్!" అని చిరంజీవులను ఆశీర్వదించుట కూడా మన సంప్రదాయము నందు కలదు. యాభై సంవత్సరములు పూర్తికాగానే మనము జీవితములో ఉత్తరార్థమున ప్రవేశించినామని భావము. ఇప్పుడు జరాసంధుడు ముట్టడించును.

"జరా" అనగా ముసలితనము. ఈ వృద్ధాప్య సంధిలో తెలియువాడే జరాసంధుడు. యాభై సంవత్సరములు పూర్తికాగానే మనము ముసలివారమయ్యామని భావము. జరాసంధుడు మధురపై దండయాత్ర చేసెను. మధుర మనగా తియ్యనిది అని భావము. ఇంద్రియ భోగములతో తియ్యని ఆనందమును అనుభవించు శరీరమే మధురానగరము. దశమ స్కంధ ఉత్తరార్థమున జరాసంధుడు మధురపై దండెత్తినట్లు, జీవిత ఉత్తరార్థమున ముసలితనము మన శరీరముపై దండెత్తును.

జరాసంధుడు మధురను ముట్టడించాడు. సైన్యము ఉప్పొంగుచున్న సాగరమువలె ఉన్నది. యాదవులు భయభ్రాంతులకు లోనయ్యారు. శ్రీకృష్ణుడు విషయము నంతటినీ ఆలోకించాడు. తక్షణ కర్తవ్యము నాలోచించెను. జరాసంధుని వధించకుండా అతని సకల సైన్యమును సంహరించవలెనని సంకల్పించెను. భగవానుని లీలలు అమోఘములు.

శ్రీకృష్ణుడు ఆలోచించుచుండగా అచ్చటికి అప్రయత్నముగా రెండు దివ్యమైన రథములు అరుదెంచెను. అస్త్రశస్త్రములు కూడా లభించెను. జరాసంధుని సైన్యము నాశనము చేయమని శ్రీకృష్ణుడు బలరామునితో చెప్పెను. శ్రీకృష్ణుడు కూడా రథము నధిరోహించెను. శత్రుసేనలను సమీపించి, పాంచజన్యమును పూరించెను. జరాసంధుడు కృష్ణుని జూచెను.

"ఓయీ! కృష్ణా! పురుషాధమా! నీవు బాలుడవు. నీతో యుద్ధము చేయుట నాలాంటి వీరునికి సముచితము కాదు. నీవు పైగా హంతకుడవు. పిరికివాడివి. కనుక నాతో పోరుటకు నీవు అనర్హుడవు. బలరామా! నీవు ధైర్యవంతుడవై నాతో యుద్ధము చేయుము. లేదా నీ శరీరమును ముక్కలు జేసెదను. వీరుడవై స్వర్గము నలంకరించుము. సమరములో నన్ను సంహరింపుము" అని జరాసంధుడు పలికెను.

"రాజా! జరాసంధా! ఆత్మస్తుతి వీరుల లక్షణము కాదు. వీరత్వము ప్రదర్శించ దగినదే గాని పలవరింప దగినది గాదు. నీవు బలహీనుడవు. మృత్యువుచే ఆహ్వానించ బడిన వాడవు. నీ మాటలు మాకు అనుచితములు" అని శ్రీకృష్ణుడు జవాబిచ్చెను.

వాయువు మేఘముల చేత సూర్యుని కప్పివేయునట్లు, జరాసంధుడు తన సైన్యముతో బలరామకృష్ణులను ఆవరించెను. శ్రీకృష్ణుడు శరమును తన ధనుస్సు నెక్కు పెట్టెను. జరాసంధుని చతురంగ బలమును సంహరింప సాగెను. ఏనుగుల కుంభస్థలములు పగిలిపోయెను. అశ్వములు కొన్ని చావగా కొన్ని అంగ విహీనములై పడెను. సారథులు గతించిరి. సైన్యము శిథిలావయవములతో నేల కొరిగెను. అచ్చట రక్తము నదివలె ప్రవహించు చుండెను.

ఎఱ్ఱని నదియా యున్నట్లు తెలియు ఆ రక్తప్రవాహములో తెగిపడిన భుజములు సర్పముల వలె కదులుచుండెను. తలలు తాబేళ్ళవలె తేలుచుండెను. అశ్వములు మకరములవలె గోచరించెను. విరిగిన చేతులు, తొడలు మీనములవలె గోచరించెను. సేనల తలవెంట్రుకలు నదిలోని నాచువలె తెలియుచుండగా, చేతుల నుండి జారిపోయిన ధనుస్సులు తరంగముల వలె కన్పించెను. చర్మములు సుడులవలె తెలిసెను. ఈ విధముగా జరాసంధుని సైన్యమంతయు నాశనమాయెను.

క్షయం ప్రణీతం వసుదేవ పుత్రయో ర్విక్రీడితం తజ్జగదీశయోః పరమ్

"ఇంత భయంకరమైన కర్మమును బలరామకృష్ణులు క్రీడామాత్రముగా సాగించిరి" అని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుకు తెలిపెను. బలరాముడు జరాసంధుని బంధించుచుండెను. శ్రీకృష్ణుడు వద్దని వారించి, జరాసంధుని వదలిపెట్టెను. జరాసంధుడు దుఃఖితుడై మగధ చేరెను.

బలరామకృష్ణులు నగరములో ప్రవేశించగనే హర్షపూర్ణచిత్తులైన ప్రజలు వారికి ఘనస్వాగతములు పలికిరి.

జరాసంధుడు అంతటితో ఆగలేదు. భూభారమగు సైన్యముతో పదునేడు పర్యాయములు మథురపై దండెత్తి పరాజయము పొందెను. పదునెనిమిదవ పర్యాయము దండెత్తుటకు సిద్ధపడుచుండెను. అదే సమయానికి శ్రీకృష్ణుడు తన కంటె గొప్ప వీరుడని వినిన కాలయవనుడను వీరుడు మూడుకోట్ల సైన్యముతో మథురపై దండెత్తెను.

శ్రీకృష్ణుడాలోచించెను. కాలయవనునితో తాను యుద్ధము చేయుచుండగా జరాసంధుడు ఏతెంచి తనవారిని సంహరించును. ముందుగా దీనికి తరుణోపాయమును వెదకవలెనని సంకల్పించెను. సముద్రములో విస్మయమొందించు నగరము నొకదానిని నిర్మించెను. అదియే ద్వారకా నగరము. బంధుజనములను, యాదవుల నందరిని అచ్చటికి తరలించెను.

శ్రీకృష్ణుడు కాలయవనునికి గోచరించెను. యాదవుల వలన తాను మరణించ కుండునట్లు కాలయవనుడు వరములను పొందియున్నాడు. అందుచేత శ్రీకృష్ణుడు కాలయవనునితో పోరాడలేదు. యుక్తి నుపయోగించి పరుగిడసాగెను. కాలయవనుడు శ్రీకృష్ణుని వెంబడించి తరుముచుండెను. శ్రీకృష్ణుడు చిక్కినట్లే అగుపించును. కానీ జారిపోవును. కాలయవనుడు కృష్ణుని పట్టుకొనలేక పోయెను. ఈ విధముగా పరుగిడి శ్రీకృష్ణుడు ప్రవర్షణ పర్వతము నెక్కి ఒక గుహలో ప్రవేశించెను. అచ్చట ఒక సాధువు నిద్రించుచుండెను. శ్రీకృష్ణుడు మెల్లగా ఒక మూల దాగెను. కాలయవనుడు గుహలో ప్రవేశించెను. శ్రీకృష్ణుడే సాధువేష ధారియై శయనించు చున్నాడని భావించి కాలితో దన్నెను.

ఆ సాధుపురుషుడు మేల్కొని కాలయవనుని గాంచెను. కోపోద్రిక్తుడైన ఆ మహాత్ముని దేహమునుండి అగ్ని బయల్వెడలి కాలయవనుని దహించెను. చూచుచుండగనే కాలయవనుడు భస్మమాయెను.

మానవ శరీరమే మథురానగరమని గ్రహించితిమి. దానిపై ఉత్తరార్థమున జరాసంధుడనే వృద్ధాప్యము దాడిచేయును. వృద్ధాప్యము తరువాత వచ్చునది కాలుడు లేదా మృత్యువు. అదియే కాలయవనుడు. కాలరూప సుడిగుండములో పడిన వారెవ్వరు తిరిగిరారు. కాలరూపుని ఎవ్వరూ ఎదిరించలేరు. మరి మృత్యువును జయించు మార్గమే లేదా? ఉన్నది. శ్రీకృష్ణుని వలె ప్రవర్షణపర్వతము మీదకి పరుగెత్తుకొని వెళ్ళుటయే. మనలో వర్షించెడి భక్తియే ప్రవర్షణము. భక్తి మృత్యువుని జయించి, ముక్తిని ప్రసాదించును. భక్తి యనెడి పర్వతమునెక్కి, శ్రీకృష్ణుడు గుహలో ప్రవేశించినట్లు, మనము హృదయగుహలో ప్రవేశించవలెను. అప్పుడే కాలుని జయించి అమృతత్వమును పొందగలము.

కాలయవనుడు భస్మమాయెను. మరి అక్కడ శయనించియున్న పురుషుడెవ్వరు? అతని జన్మాదు లేమిటి? ఎక్కడ? తెలుపమని పరీక్షిన్మహారాజు అర్థించగా శుకబ్రహ్మ అతని గూర్చి చెప్పుచున్నారు.

ముచికుందుడు

ఆ మహాపురుషుడే ముచికుందుడు. ఇక్ష్వాకు వంశమున జన్మించిన మాంధాత మహారాజు కుమారుడు. దేవతలను సైతము రక్షించినవాడు. గొప్పభక్తుడు.

ముచికుందుడు వాసుదేవుని దర్శించెను. నమస్కరించెను. అర్చించి, భాషించెను. కాలయవనుని భస్మము చేయగానే ముచికుందునకు శ్రీకృష్ణుని దర్శన మాయెను. ఎవ్వడు కాలుని జయించునో అట్టివాడు కాలాతీతుడైన పరమాత్మను దర్శించును.

"ముచికుందా! నీ చూపుచే కాలయవనుడు భస్మమాయెను. నీవు నన్నుగూర్చి తపమొనరించితివి. ఏమి వరము అభిలషణీయమో తెలుపుము. అనుగ్రహించెదను" అని శ్రీకృష్ణుడనెను.

ముచికుందుడు శ్రీకృష్ణునితో, "మహానుభావా! మాయావలలో చిక్కిన మానవుడు పరంధాముడవైన నిన్ను గుర్తింపలేకున్నాడు. దుఃఖరూప సంసార సుడిగుండమున పడి సేవలేక యున్నాడు. దుర్లభమైన మానవజన్మను పొంది నీ పాదసేవకు నోచుకోలేక వ్యర్థ జీవితమును గడుపుచున్నాడు. నేనుకూడా అలాంటి వ్యర్థ జీవితమునే గడిపితిని.

క॥ తరుణీ పుత్ర ధనాదుల, మరిగి మహారాజ్యవిభవ మదమత్తుడనై
నరతనులబ్ధుఁడనగుచు, కరయఁగ బహుకాలమీశ యాలడిబోయెన్.

"ప్రభూ! కర్మ సుడిగుండములో పడి శ్రద్ధలేని వాడనై విషయాసక్తుడనైతిని. తంత్రీ! ఒకనాడు సువర్ణ భూషితుడై తిరుగునపుడు ఏ వ్యక్తి దేహము రాజుగా పిలువబడునో, ఆ దేహమే కాలగతిలో శ్మశానవాటికలో బూడిదయని పిలువబడుచున్నది. మాధవా! శ్రేష్ఠ జనిపించుకొనిన పురుషుడు కూడా స్త్రీలయందు అభిరుచి గలవాడై గృహమునందు క్రీడామృగమువలె సంచరించుచున్నాడు.

"అచ్యుతా! అట్టి పశుప్రాయుడైన మానవుడు తరించు సమయ మాసన్నమైనపుడు అతనికి సత్సంగము లభించును. సత్సంగము సద్భక్తిని ప్రసాదించును. సద్భక్తిచే ఆకర్షింపబడిన నీవు ముక్తి నొసంగెదవు.

"ముకుందా! నాకు ఏ వరములు వద్దు. నీ పాదసేవాభాగ్యమును కల్పించిన చాలును. ముక్తినిచ్చే నిన్ను వరములు కోరి బంధములను కొనితెచ్చుకొను వారెవ్వరు? నన్ను కరుణించి రక్షింపుము" అని ముచికుందుడు ప్రార్థించెను.

ముచికుందుని ప్రార్థన నాలకించి పరమాత్మ సంతసించెను. "ముచికుందా! సార్వభౌమా! నీ చిత్తము నిర్మలముగా యున్నది. అందుచేత నేను నిన్ను ప్రలోభ పెట్టినను నీ బుద్ధి వరములను కోరలేదు. నీ భక్తి నిరాటంకముగా సాగును గాక!

ఉ॥ మంచిది నీదుబుద్ధి నృపమండన! నీవు పరార్థ మెట్లు వ
ర్తించిననైనఁ గోరికల దిక్కునఁ జిక్కవు, మేలు, నిర్మలో
దంచితవృత్తి నన్ గొలుచు ధన్యులబుద్ధులు నిట్లు, నీకు ని
శ్శృంచలభక్తి గల్గెడిని సర్వము నేలుము, మాన వేటికన్?

"రాజా! పూర్వము క్షత్రియ ధర్మపాలనలో వేటకు వెళ్ళి చాలా ప్రాణులను హింసించితివి. ఇప్పుడు నన్నాశ్రయించితివి. నిశ్చల భక్తితో ఆ పాపములను పోగొట్టుకొనుము. రాబోవు జన్మమున నీవు "సర్వభూతహితేరతుడ" వగుదువు. బ్రాహ్మణుడవై జన్మించి, నన్ను పొందెదవు" అనెను.

ముచికుందుడు యౌవనము నంతను విలాసముల యందు గడిపెను. అందుచేత భక్తిని చేయగలిగెనే గాని ముక్తిని పొందలేకపోయెను. సూర్యోదయమునకు ముందుగా తీసిన వెన్నయే శ్రేష్ఠమని చెప్పుదురు. యౌవనమునందు కలుగు భక్తియే శివ మర్దరించును.

ముక్తి లభించకున్నను చేసిన భక్తి వృథా కాదు. ముచికుందుడు వామదేవుని అనుగ్రహమునకు పాత్రుడయ్యెను. ద్వాపరయుగమున రాజసముతో చరించిన క్షత్రియ దేహము కలియుగమున శుద్ధ సాత్త్వికమైన బ్రాహ్మణ దేహమునొంది, భగవత్సేవ నొంది ముక్తిని పొందెను. ముచికుంద మహారాజే కలియుగంలో జూనాగఢ్‌లో అవతరించిన భక్త నరసీమెహతా మహాశయుడని పెద్దలు చెప్పుదురు.

ముచికుంద వరద గోవింద! గోవింద.

రుక్మిణీ సందేశము

ముచికుందుడు శ్రీకృష్ణునకు ప్రణామము లర్పించి గుహనుండి బయల్వెడలెను. తాను ఎటుచూసినను మానవులు, పశుపక్ష్యాదులు, లతలు, వృక్షములు అల్పప్రమాణముగా నుండుట గాంచి కలియుగము ప్రవేశించెనని గ్రహించి ఉత్తర దిక్కుగా పయనమై బదరికాశ్రమమును చేరెను. అచ్చట ఆయన ద్వంద్వములను సహించుచూ, శాంతరూపుడై శ్రీహరిని గూర్చి తపస్సు చేయసాగెను.

ఈ దృశ్యమాన జగత్తులో అల్పప్రమాణముగా ఏది గోచరించినను కలిప్రవేశించినట్లు లక్ష్యము చేసికొనవలెను. భక్తుడు సర్వమును హరిమయముగా గాంచవలెను. అల్పత్వము గోచరింప కూడదు. అల్పత్వము గోచరించినచో అది కలి ప్రభావము అని తెలుసుకొనవలెను. కలి మనలను ఆవరించినపుడు ముచికుందుడు తపము నాచరించినట్లు మనము కూడా శ్రీహరిని భక్తి చేయవలెను.

మధుర యందలి సంపదను తీసుకొని శ్రీకృష్ణుడు ద్వారకకు మరలుచుండెను. అత్తటి జరాసంధుడు సైన్యమును వెంటబెట్టుకొని వచ్చెను. బలరామకృష్ణులు అతని సేనను జూచి భీరులవలె పరుగిడసాగిరి. నిజముగా వారు భయపడి పరుగిడుచున్నట్లు భ్రమించిన జరాసంధుడు ఆనందముతో వారి ననుసరించెను. రామకృష్ణులు పరుగిడి ప్రవర్షణ పర్వతము నధిరోహించిరి.

ప్రవర్షణాఖ్యం భగవాన్ నిత్యదా యత్ర వర్షతి

అచ్చట ఇంద్రుడు నిత్యము జలమును వర్షించుచుండును అని భాగవతము పలికినది. విషయాసక్తమైన ఇంద్రియములు భక్తిలో మునిగి భక్తిని వర్షించుటయే ప్రవర్షణ పర్వతమని గ్రహించాలి. జరాసంధుడు ముసలితనమునకు ప్రతీకము గనుక వృద్ధాప్యమునకు చిక్కకుండా మనము పయనించాలి. అందుచేతనే బలరామకృష్ణులు పరుగిడి ప్రవర్షణ పర్వతము నెక్కిరి. అయినను వృద్ధాప్యము వదలిపెట్టదు. జరాసంధుడు వారివెంట పరుగిడెను. పర్వతము నంతటిని గాలించెను. కానీ బలరామకృష్ణులు కనుపించలేదు. భక్తిలో చరించువారు కాలునికి వశమగుదురా?

జరాసంధుడు ఆలోచించెను. ప్రవర్షణ పర్వతమునకు నిప్పు పెట్టించెను. పర్వతము దగ్ధమగుచుండెను. పర్వతము కాలిపోవుచుండగా బలరామకృష్ణులు పదునొకండు యోజనముల ఎత్తయిన ఆ పర్వతమునుండి దూకి పారిపోయి ద్వారకకు చేరిరి.

భక్తులను వృద్ధాప్యము వెంటాడినను వారిని చలింపజేయలేదు. బాధలకు గురిజేయలేదు. జరాసంధుడు ప్రవర్షణ పర్వతమును దగ్ధము చేసినట్లు, వృద్ధాప్యము దేహమును దహింపజేయును. పర్వతము దహించినను రామకృష్ణులు దహింపబడరు. వారు పదునొకండు యోజనముల ఎత్తైన పర్వతమునుండి దూకి ద్వారకకు వెడలిరి. అలాగే కాలము మన దేహములను దహించినను. పర్వతమున దాగిన రామకృష్ణులు మరణించనట్లు, దేహమున దాగిన జీవుడు మృతి చెందడు.

దేహీ నిత్య మవధ్యోఽయం దేహేసర్వస్య భారత

"సమస్త ప్రాణుల దేహమునందున్న దేహి యనబడు ఆత్మ జంపబడదు" అని శ్రీకృష్ణపరమాత్మ గీతలోని సాంఖ్యయోగము నందు తెలిపియున్నాడు.

ఈ సత్యమును తెలియుటయే భక్తి. భక్తిచేయు పవిత్రాత్ములే భక్తులు. వారు కాలుని వాతపడరు. పదునొకండు యోజనముల ఎత్తయిన పర్వతము నుండి దుమికి ద్వారకకు పారిపోవుదురు. అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు, ఒక మనస్సు కలిసి పదునొకండు యని భావము. దేహము కాలుని వాతపడినను ఇంద్రియ మనోబుద్ధుల సంఘాతమునుండి విడివడినవారై ద్వారకకు చేరుదురు. "ద్వార" అనగా ద్వారము యని భావము. "క" అనగా బ్రహ్మమని అర్థము. ద్వారక యనగా బ్రహ్మద్వారము అని అర్థము. అదియే మోక్షము. మహాభక్తులైన వారికే అది లభించును. భక్తిగల హృదయము పరమాత్మ కన్నను అన్యమైన దానిని ఆశించదు. అభిలషించదు. భక్తుల గాథలు చిరస్మరణీయములు. శోక నివారణోపాయములు. మోక్షదాయకములు. అట్టి భక్తుల గాథల కోవకు చెందిన మంగళ ప్రదాయిని రుక్మిణీమాత గాథను గ్రహించెడి

తరుణము ఆసన్నమైనది. భక్తులారా! స్థిరచిత్తులై చదవండి. శ్రవణ మంగళమగు చరిత్రను అధ్యయనం చేసి తరించండి.

క॥ భూషణములు సెవులకు బుధ తోషణము లనేక జన్మ దురితౌఘ విని
శ్శోషణములు మంగళతర ఘోషణములు గరుడగమను గుణభాషణముల్.

అని ఈ సందర్భమున శ్రీ పోతనామాత్యుడు ప్రవచించెను.

విదర్భ దేశమున భీష్మకుడను రాజుండెను. అతనికి ఆరుగురు సంతానము. వారిలో రుక్మియనువాడు జ్యేష్ఠుడు. మిగిలినవారు వరుసగా రుక్మరథుడు, రుక్మబాహువు, రుక్మకేశుడు, రుక్మమాలి యను నల్వురు పుత్రులు, రుక్మిణి యను పేరు గల పుత్రిక.

రుక్మిణి బంధువుల ద్వారా శ్రీకృష్ణుని వైభవమును వినినది. కుతూహలపడి ఆయననే భర్తగా పొందవలెనని సంకల్పించింది. శ్రీకృష్ణ వైభవమును మనకు వినిపించువారే నిజ బంధువులు. వారు కులరీత్యా సంక్రమించిన చుట్టాలుగారు. గురుకుల సంప్రదాయమును లభించిన ఆచార్యులు లేదా భక్తులు. అట్టి పుణ్యాత్ముల ద్వారా భగవంతుని గూర్చి శ్రవణము చేయవలెను. శ్రవణమును చక్కగా చేయగలిగినవారే రుక్మిణిదేవి వలె పరమాత్మను భర్తగా పొందగలరు.

రుక్మిణి అభీష్టానుసారము ఆమెను శ్రీకృష్ణున కిచ్చి వివాహము చేయుటకు బంధుజనులు ఇష్టపడిరి. కానీ జ్యేష్ఠభ్రాత యగు రుక్మికి ఇష్టము లేకుండెను. ఆమెకు సరియైన వరుడు శిశుపాలుడే యని అతని నమ్మకము.

గురువు అనెడి బంధువులు జీవుడను రుక్మిణిని దేవుడగు వాసుదేవున కిచ్చి వివాహము చేయవలెనని సంకల్పింతురు. అయినను ముందు పుట్టిన రుక్మియనెడి జన్మసంస్కారము రుక్మిణి యనెడి జీవుని శిశుపాలుడు అనెడి అజ్ఞానము వాత పడవేయ చూచును.

అన్నయగు రుక్మి శిశుపాలునకు కబురంపెను. మూడు సంవత్సరముల లోపు పిల్లలను శిశువులందురు. అనగా గుణత్రయము, అవస్థాత్రయము, కాలత్రయము అను త్రిపుటి యందు ఎవ్వడు బంధీయై యున్నాడో వాడే శిశుపాలుడు. అజ్ఞానమునకు మారుపేరు.

రుక్మి శిశుపాలునికి వార్త పంపెననెడి విషయము తెలియగనే రుక్మిణి తీవ్రముగా వ్యథ చెందెను. వెంటనే సుదేవుడను బ్రాహ్మణుని పిలిపించెను. విశ్వసనీయుడైన ఆ ద్విజుని ద్వారా శ్రీకృష్ణునికి వినతి పత్రమును పంపెను.

ఉ॥ అన్నతలంపు దా నెఱిగి యన్నవనీరజగంధి లోన వా
పన్నతనొంది యొప్పుఁడగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి గర్వసం
పన్నుఁడు రుక్మి నేఁడు నను జైద్యున కిచ్చెదనంచు నున్నవాఁ
డెన్నివిధంబులం జని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే.

అని రుక్మిణీదేవి బ్రాహ్మణుని ప్రార్థించెను.

అభిలషించును. అవ్య
భక్తి కలిగినచో హృదయము పరమాత్మ సంగమమునే
పాంగత్యములను వాంఛించదు. మరి భక్తుని ఆర్తి భగవంతునకు చేర్చు వారెవరు? భక్తుని.
భగవంతుని ఏకం చేసెడి వారెవరు? అతడే సుదేవుడు అను బ్రాహ్మణుడు. బ్రహ్మజ్ఞానము
గల గురుదేవుడే సుదేవుడు. అట్టివాడు జీవునికి దేవునికి మధ్య వారధియై నిలుచును.

బ్రాహ్మణుడు బయలుదేరి ద్వారకకు వచ్చెను. శ్రీకృష్ణుని కలిసికొనెను. స్వర్ణ
సింహాసనము నందు ఆసీనుడైన శ్రీకృష్ణుడు బ్రాహ్మణుని చూడగనే వినమ్రతతో లేచి,
దేవతలు తన నారాధించునట్లు శ్రీకృష్ణుడు బ్రాహ్మణుని పాదములను కడిగి అర్చించెను.
దేవతలు శ్రీకృష్ణుని అర్చింతురు. అట్టి పరమాత్మ యగు శ్రీకృష్ణుడు బ్రాహ్మణుని
పాదములను కడిగి గురువుయొక్క శ్రేష్ఠత్వ మెలాంటిదో లోకమునకు చాటిచెప్పెను.

బ్రాహ్మణుడు భుజించి విశ్రమించు సమయాన శ్రీకృష్ణుడు ఆయనకు పాద
సంవాహన మొనర్చెను.

"ఓ విప్రుడా! నీ అనుష్ఠానము చక్కగా సాగుతున్నదా? ధర్మభ్రష్టుడుగాని
బ్రాహ్మణుడు సర్వదా సుఖించును.

విప్రాన్ స్వలాభ సన్తుష్టాన్ సాధూన్ భూత సుహృత్తమాన్
నిరహంకారిణః శాన్తాన్ నమస్యే శిరసాసకృత్

ఆత్మలాభముచే సంతృప్తి నొందినవారు, సాధువులు, సర్వభూత హితులు,
అహంకారము లేనివారు, శాంతస్వభావులగు బ్రాహ్మణులకు నేను సదా శిరమువంచి
నమస్కరించు చుందును" అని శ్రీకృష్ణుడనెను.

సీ॥ జగతిసురేశ్వర! సంతోషచిత్తుండ వై యున్న నీధర్మ మలిసులభము
వృద్ధసమ్మత మిది విత్త మెయ్యది యైనఁ బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు
తన ధర్మమున మందుఁ దరలఁ డా ధర్మంబు గోరిక లతనికిఁ గురియుచుండు
సంతోషి గాఁడేని శుక్రుఁడైన నశించు నిర్ధనుం డైనను నిద్ర వోవు

ఆ॥ సంతసించెవేని సర్వభూతసువృత్త ములకుఁ బ్రాప్తలాభముదితమాన
సులకు శాంతులకును సుజనులకును గర్వ హీనులకును వినతు లే నొనర్తు

అని పోతనార్యుని అమోఘ అనువాదము.

"ఓ ద్విజవరా! నీవు ఏ ప్రదేశము నుండి వచ్చితివి? ఏ కార్య నిమిత్తమై అరు
దెంచితివి? అది రహస్యము గానిచో నాకు చెప్పుము. నేను చేయదగిన కార్యమును
తెలుపుము" అని జగద్రక్షకుడగు శ్రీకృష్ణుడు బ్రాహ్మణునితో పలికెను. ఆ మాటలు విని
బ్రాహ్మణుడు రుక్మిణీదేవి ఇచ్చిన పత్రమును విప్పి, శ్రీకృష్ణుని అనుమతితో దానిలోని
విషయమును చదివెను.

రుక్మిణీ సందేశమును విప్రుడు శ్రీకృష్ణునకు తెలిపినట్లు, జీవులవిషయమును
గురుదేవుడు దేవున కెరిగించును. అందుచేత గురువు సాక్షాత్తు పరబ్రహ్మ యని కీర్తింప

రుక్మిణీదేవి లేఖ

ప్రియాత్మ స్వరూపులారా! రుక్మిణీదేవి శ్రీకృష్ణునకు వ్రాసిన ఈ పత్రములో
అమోఘములైన ఆధ్యాత్మిక రహస్యములు చర్చింపబడి యున్నవి. ఏడు శ్లోకములలో
రుక్మిణీతల్లి తన మనోరథమును శ్రీకృష్ణుని ముందుంచెను. ఇవి నిత్యము పారాయణము
చేయదగిన శ్లోకములు. సహజ పాండిత్యముగల పోతనామాత్యుడు ఈ శ్లోకములకు
అద్భుతమైన అనువాదము నొనరించినారు. ఈ పద్యములు భక్తి సమన్వితమైన
విషయపూర్ణములు. అందుచేత వ్యాసులవారి శ్లోకముల క్రిందనే పోతనామాత్యుని
పద్యములను కూడా ఇచ్చి, వ్యాఖ్యానించ దలచినాము. భక్తి శ్రద్ధలతో పఠించండి.

శ్రుత్వాగుణాన్ భువన సుందర శృణ్వతాం తే
నిర్విశ్య కర్ణ వివరైర్హరతోఽ జ్గతాపమ్
రూపం దృశాం దృశిమతా మఖిలార్థలాభం
త్వయ్యచ్యుతా విశతి చిత్తమపత్రపం మే (1)

భువన సుందరా! అచ్యుతా! దివ్యమైన నీ చరితము శ్రోతల వీనులలో ప్రవేశించి
దేహ తాపమును పోగొట్టును. నీ భవ్య సౌందర్యము నేత్రాలుండి చూడగలిగిన వారికి సర్వ
శుభములను కూర్చుననియు నీ సద్గుణ వైభవమును గూర్చి ఇతరులు పలుకగా
నాలకించితిని. నా చిత్తము లజ్జావిహీనమై నీ యందు పరమాసక్తితో యున్నది.

ఇది ప్రథమ శ్లోకము. కొండను అద్దము నందు చూపినట్లు, తన హృదయము
నంతా రుక్మిణీదేవి ఈ ఏడు శ్లోకములలో ఇమిడ్చినది. కళ్యాణ సందర్భమున "సప్తపది"
యనెడి పేరుతో వధూవరులు కలిసి వేసే ఏడడుగులను గుర్తుచేస్తూ తనను
పరిణయమాడి ఉద్ధరింపుమని తెలుపుతూ ఏడు శ్లోకములను రచించినది.

శ్రీకృష్ణుడు అష్టమ గర్భ సంజాతుడు. ఏడు శ్లోకములలో పూర్తిచేసి అష్టమశ్లోకము
తన వద్ద లేదనియు, అష్టమినాడు ఆవిర్భవించిన ఉత్తమ శ్లోకుడే తనకు సర్వస్వమై
నిలచినాడని తెలుపుతూ ఏడు శ్లోకములు రచించినది.

యోగమునందు సప్తాంగములను దాటిన పిదప అష్టమస్థితి సిద్ధిమైన సమాధి.
అదియే శ్రీకృష్ణుడు. కనుక తాను వాంఛించునది సమాధి స్వరూపుడైన శ్రీకృష్ణునే అని
తెలుపుతూ ఏడుశ్లోకములను రచించినది.

ఏ కార్యము నైనను ఇంద్రియ మనోబుద్ధుల ద్వారానే మనము ఆచరించగలము.
జ్ఞానేంద్రియములు ఐదు, మనస్సు, బుద్ధి కలసి ఏడు అయినవి. వీటిని సంపూర్ణముగా
శ్రీకృష్ణునికి సమర్పించుటయే ఏడు శ్లోకములను వ్రాయుటలోని భావము.

ఏడు జన్మల బంధ ముండినపుడే భార్యా భర్తలయ్యే అవకాశము ఏర్పడుతుందని
పెద్దలు చెబుతుంటారు. మనమధ్య బంధము ఏడుజన్మల నాటిదైయున్నది అని

ఈ జగత్తు సూర్యకాంతి వలన తెలియుచున్నది. సూర్యకాంతి యందు సప్తవర్ణము లున్నవి. సప్తవర్ణములకు ఆధారుడై సప్తాశ్వములను పూన్చిన రథముపై ఆసీనుడైన సూర్యుని వెలుగునకు నీవు కారణమైన వాడవు. సూర్యమండలాంతర్వర్తి యగు నారాయణుడవు నీవేయని తెలుపుటకై ఏడు శ్లోకములను వ్రాసెను.

శ్రీకృష్ణుడు సామగానలోలుడు. సామవేదమునందు తెలియు స,రి,గ,మ,ప,ద,ని యనెడి సప్తస్వరములలో సదా రమించువాడు శ్రీకృష్ణుడు. ఈ సప్తస్వర దివ్యవైభవమును నాదబ్రహ్మోపాసకులైన శ్రీ త్యాగరాజస్వామి జగన్మోహిని రాగమునందు "శోభిల్లు సప్తస్వర" అను కీర్తనలో రచించెను.

శోభిల్లు సప్తస్వర సుందరుల భజించవే మనసా ॥ శో ॥
నాభి హృత్కంఠ రసన నాసాదుల యందు ॥ శో ॥

అని మన శరీరము నందు నాభి, హృది, కంఠము, నాలుక, నాసము లనెడి పంచ స్థానముల యందు చరించు నాద సుందరుల వైభవమును కీర్తించుట జరిగినది. మరి ఈ సప్తస్వరములకు అనాహత నాదమే ప్రణవము. ప్రణవ స్వరూపుడే శ్రీకృష్ణుడు. ఈ సప్తస్వరముల అధిష్ఠానమైన శ్రీకృష్ణుని కనుగొనుటయే సంగీత శాస్త్ర ప్రయోజనము. ఈ సత్యమును "స్వరరాగ సుధారసయుత భక్తి" అనెడి కీర్తనమునందు శంకరాభరణ రాగములో అద్భుతముగా త్యాగరాజు కీర్తించారు.

స్వరరాగ సుధారసయుత భక్తి స్వర్గాప వర్గమురా ఓ మనసా! ॥స్వర॥
కోలాహల సప్తస్వర గృహముల గురుతే మోక్షమురా ఓ మనసా! ॥స్వర॥

"మూలాధారమైన అనాహత నాదము నెరుగుటే సప్తస్వర గృహముల గురుతు" యని అమోఘముగా ప్రవచించినారు. కనుక అట్టి నాదమునే తనువుగా గలిగిన నాదబ్రహ్మ యగు శ్రీకృష్ణుని, సప్తస్వరముల కాధారమైన ప్రణవరూపుని ప్రార్థించుచున్నట్లు తెలుపుతూ రుక్మిణీతల్లి ఏడు శ్లోకములను రచించెను.

భక్తులారా! మాతయగు రుక్మిణి జగన్నాథునకు ఏడు శ్లోకములలో శుభ సందేశము పంపినది. అలా ఏడు శ్లోకములలో వ్రాయుటకు గల ఏడు కారణములను నేను మీకు చూపినాను. నా జడమతికి ఏడు కారణాలు దొరికినవి. బుధజనులకు ఏడువందలో లేదా ఏడువేలో గోచరించినా ఆశ్చర్యం లేదు. ఏది ఏమైనా కీడుని వదలి, ఏడుపును దూరం చేసుకొని, వేడుకగా వెలుగుటయే ఈ ఏడు శ్లోకముల దివ్యఫలము.

ప్రథమ శ్లోకమునందు శ్రీకృష్ణుని "భువన సుందరా!" అని రుక్మిణీదేవి సంబోధించినది. అనగా చతుర్దశ భువనముల యందలి సౌందర్యము శ్రీకృష్ణుని నుండి కదలిన అంశయేనని తెలుపుతూ, అట్టి జగత్సౌందర్యముపై తనకు ఏ విధమైన భ్రాంతి లేదని పలుకుచున్నది. ప్రపంచ సౌందర్యముపై ప్రేమ గలవారు పరమాత్మను పొందలేరు. పరమాత్మపై మనసు మరలిన వారికి ప్రపంచము రుచించదు.

శ్రీకృష్ణుని సౌందర్యమునే గాక ఆయన అనంత కళ్యాణ గుణములను కూడా ఆలకించినట్లు రుక్మిణీదేవి చెప్పుచున్నది. సిద్ధాంత రహిత ఆచరణము రాద్ధాంతములను

తెచ్చిపెట్టునే గాని రమణీయస్థితిని ప్రసాదించదు. శ్రవణము చక్కగా చేసినపుడే భగవానునిపై భక్తి స్థిరముగా నిలుచును. ఈ ప్రస్తుత శ్లోకమునకు పోతనామాత్యుని అమృతమయ అనువాదమును చూచెదము.

సీ॥ ఏ నీ గుణములు కర్ణేంద్రియంబుల సోఁక దేహతాపంబులు దీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల కఖిలార్థలాభంబు గలుగుచుండు
నే నీ చరణసేవ లేప్రొద్దు చేసిన భువనోన్నతత్వంబుఁ బొందఁగలుగు
నే నీ లసన్నామ మేప్రొద్దు భక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు
తే॥ నట్టి నీయందు నాచిత్త మనవరతము వచ్చియున్నది నీ యాన వాపలేదు
కరుణఁ జూడుము కంసారి ఖలవిదారి శ్రీయుతాకార మానినీ చిత్తచోర!

ఈ ప్రథమ శ్లోకముగాని, లేదా పద్యమును గాని అవివాహితులగు బాలికలు నిత్యము పఠించినచో భగవంతుడు లాంటి భర్త లభ్యమగునని చాలామంది పెద్దల అభిప్రాయము. అభిప్రాయమేల? అది వారి అనుభవమే కావచ్చును.

ఈ మొదటి శ్లోకమును పూర్తిచేయుచు తాను సిగ్గును విడచినదియై శ్రీకృష్ణుని వాంఛించుచున్నట్లు రుక్మిణీదేవి పలికినది. మరి అట్టి లజ్జా విహీనురాలైన స్త్రీని ఏ విధముగా పరిణయ మాడవలెనని శ్రీకృష్ణుడు సందేహించునేమో యని భావించి, దానికి కారణము రెండవ శ్లోకమున తెలుపుచున్నది.

కా త్వా ముకున్ద మహతీ కుల శీల రూప
విద్యా వయో ద్రవిణధామభి రాత్మ తుల్యమ్
ధీరా పతిం కులవతీ న వృణీత కన్యా
కాలే నృసింహ నరలోక మనోభిరామమ్ (2)

ముకుందా! లజ్జావిహీనముగు ఈ నా కార్యమును నీవు మరోవిధముగా భావింపకుము. ఎందులకనగా రూపము నందును, జ్ఞానము నందును, వయస్సు నందును, ఐశ్వర్యము నందును సాటిలేని మేటి స్వరూపుడవు, నరలోక మనోభిరాముడవు నగు నిన్ను సద్వంశమున జనించినదియు, ఉదార చరితయు, ధైర్య సంపద కలిగిన ఏ కన్య పతిగా పొంద నభిలషింపక యుండును?

రుక్మిణీదేవి సిగ్గును విడచి ఈ విధముగా ఉత్తరము వ్రాయుటలో తన తప్పు ఏ మాత్రము లేదనియు, శ్రీకృష్ణుని సద్గుణములే ఆమెను లజ్జావిహీనగా యొనర్చినవని తెలుపుచున్నది.

ఈ శ్లోకమునందు శ్రీకృష్ణుని రూప విద్యా వయో ధన విషయములయందు సరిసమానుడనియు, తాను సద్వంశ జాతయని, ఉదారగుణశీల యని చెప్పుట జరిగినది. ఈ లక్షణములను పరిశీలించినచో వధూవరులు చక్కనిపోలిక గలిగి యున్నారు. కనుక ఈ జోడు చక్కని జోడియే నని తెలుపుచున్నదా? నిజమే కదూ! వారికి వారిగానిచో ఎవరు సరి? సరిసరి, ఇక పోతనార్యుని పద్య కుసుమమును ఆఘ్రాణించెదము గాక!

శా॥ ధన్యున్ లోకమనోభిరాము(గులవిద్యారూపతారుణ్య సౌ
జన్య శ్రీ బల దాన శౌర్య కరుణాసంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు కోరదే మును రమాకాంతాలలామంబు రా
జన్యానేకపసింహ! నావలననే జన్మించెనే మోహముల్?

సరి తోడు సరియైన జోడని తెలుపుతూ వెంటనే వచ్చి తనను పొందమని కృష్ణుని ప్రార్థించుచున్నది. ఆలస్యము వలన ఎదురయ్యే అపాయములను మూడవ శ్లోకమున వివరించుచున్నది.

తన్మే భవాన్ ఖలువృతః ప్రతిరఙ్గ జాయా
మాత్మార్పిత భవతోత్ర విభో విధేహి
మా వీరభాగ మభిమర్శతు చైద్య ఆరా
ద్గోమాయువ న్మృగపతే ర్బలి మాంబుజాక్ష ॥ (3)

ప్రభూ! కమలలోచనా! అందుచేతనే నేను నిన్ను పతిగా ఎన్నుకొంటిని. ఆత్మ సమర్పణము గావించుకొంటిని. నీవు ఇచ్చటికి వచ్చి నన్ను పత్నిగా స్వీకరింపుము. సింహపుపాలి సొమ్మును గోమాయువు (నక్క) అపహరించునట్లు నీ దాసనైన నన్ను శిశుపాలుడు స్పృశింపకుండు గాక!

షడ్గుణైశ్వర్య సంపన్ను డగుటచేతనే శ్రీకృష్ణుని తాను భర్తగా స్వీకరించినట్లు తెలిపినది. తాను సంపూర్ణముగా శరణాగతమైనట్లు పలికినది. కనుక శ్రీకృష్ణుని వచ్చి తనను పత్నిగా స్వీకరించమని ప్రార్థించుచున్నది.

శ్రీకృష్ణుని మనము ప్రార్థించునపుడే అతడు మనల ననుగ్రహించును. అనుక్షణము శ్రీకృష్ణుని ప్రేమతో పిలిచే అలవాటును కలిగియున్నచో ఒక క్షణాన అతడు మన హృదయములో ప్రవేశించి తిష్ఠ వేయును. ఒక్కసారి ప్రవేశించినచో ఇక నిష్క్రమించుట యనునది ఉండదు.

శీఘ్రముగా వచ్చి తనను గ్రహింపుమని రుక్మిణీదేవి తెలిపినది. భగవంతుని పొందుటకు ఆలస్యము చేయరాదు. ఇచ్చట ఆలస్యము నిజముగా విషమే.

కొందరు భోజనవేళకు బోనునుండి బయటపడిన పులిలా పరుగిడుచుందురు. కొందరు చలన చిత్రములను దర్శించుటకు పొంగివచ్చే వరదలా దూసుకు పోతుంటారు. కానీ బ్రహ్మముహూర్తమున లేచి ధ్యానము చేయవలె నన్నను లేదా ఆలయానికో, ఆశ్రమానికో వెళ్ళవలయు నన్నను కాలము సరిపోవుట లేదని కబుర్లు చెబుతుంటారు.

భగవంతుని పొందేందుకు తీవ్రముగా ప్రయత్నించువారే కృతకృత్యులగుదురు. తొందరగా పరమాత్మను పొంద నిచ్ఛగించి, పరితపించువారి ముందు భగవానుడు నిలబడి ఆశీర్వదించును. కబీర్ ని కనికరించలేదా? గోరా కుంభార్ ను అనుగ్రహించలేదా? పురందాసుకు దూపు నివ్వలేదా? నామదేవుని నడిపించలేదా? భక్తిలో ఆర్తియే ప్రధానమైనది.

ఒకవేళ శ్రీకృష్ణుడు ఆలస్యము చేసినచో పరిస్థితి ఏర్పడింతుమని రుక్మిణీదేవి చెప్పుచున్నది. సింహము పాలి సొమ్మును శృగాలము అపహరించునట్లు, శ్రీకృష్ణుని సొమ్మయిన తాను అపహరింపబడవచ్చు నని తెలుపుచున్నది.

ఇచ్చట శిశుపాలుని నామమును ఆమె ప్రస్తావించ లేదు. ఈ విషయమును గమనించాలి. తులసి వనములో గంజాయి మొక్క యుండకూడదు. భగవన్నామము నుచ్చరించు భక్తులు దుర్జనులను గూర్చి భాషించకూడదు. అందుకనే శిశుపాలుని నక్కతో పోల్చి చెప్పినది. నక్కవలె శిశుపాలుడు మోసగాడని భావము. ఈ శ్లోకమునకు పోతనామాత్యుని అనువాద రత్నమును తిలకించెదము గాక!

ఉ॥ శ్రీయుతమూర్తి! యోపురుష సింహము! సింహముపాలి సొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తు(డు చైద్యు(డు నీపదాంబుజ
ధ్యాయినినైన నన్ను వడి(దా(గొనిపోయెద నంచు నున్న వా
డా యధమాధముం డెఱు(గ(డద్భుతమైన భవత్ప్రతాపమున్.

రుక్మిణి శ్రీకృష్ణుని అనంతకళ్యాణ గుణములను శ్రవణం చేసి, ఆకర్షితయై మోహించినది. ప్రేమించినది. గాఢముగా ఆ దివ్యాత్ముని వాంఛించినది. అభ్యర్థించిన వారికందరికీ శ్రీకృష్ణుడు లభ్యమగునా? అర్హత ఉండవలెనుగదా! అవును, అప్పుడే భగవత్ప్రాప్తి లభించును. రుక్మిణీదేవి శ్రీకృష్ణుని పొందుటకు అర్హురాలై యున్నది. ఏ కార్యము లాచరించిన పరమాత్మ సంతసించి అనుగ్రహించునో అట్టి పుణ్యకర్మలను ఆమె గతములో ఆచరించియున్నది. అసంఖ్యాక పుణ్యకర్మల ఫలమే శ్రీకృష్ణుడై యున్నాడు. ఈ విషయమును నాల్గవ శ్లోకమున చెప్పుచున్నది.

పూర్తేష్ట దత్త నియమ వ్రత దేవ విప్ర
గుర్వర్చనాది భిరలం భగవాన్ పరేశః
ఆరాధితో యది గదాగ్రజ ఏత్యపాణిం
గృహ్ణాతు మే న దమఘోష సుతాదయోఽన్యే (4)

నేను పూర్వజన్మలలో ఇష్టాపూర్తి కర్మములు, యజ్ఞాది సత్కర్మలు, దానములు, పుణ్యక్షేత్ర సందర్శనములు, ఉపవాసాది వ్రతములు, దేవతల, బ్రాహ్మణుల, పెద్దల సేవలు మున్నగువాని ద్వారా భగవంతుని సేవించియున్నచో శ్రీకృష్ణుడు నన్ను చేపట్టును గాక! దమఘోష సుతాదులు నన్ను పరిగ్రహింప కుందురు గాక!

పుణ్యకర్మల నాచరింపని వారు పరమాత్మను పొందలేరు. కళ్యాణమయ జీవితమును లభించుటకు పరమాత్మయే న్యాయముగా అరుదెంచును. తాను గతంలో చేసిన పుణ్యకర్మములకు ఫలితంగా శ్రీకృష్ణుడు లభించునని విశ్వసించి, ఆ కర్మము లేమిలో తెలుపుచున్నది.

ఇష్టాపూర్తి కర్మము లనగా మానవసేవా కార్యక్రమములు; బావులు త్రవ్వించుట, చెరువులు త్రవ్వించుట, ఆలయములు నిర్మించుట, వనములు నిర్మించుట, పేదలకు

ధనధాన్యాదులను దానము చేయుట. అలాగే అగ్ని హోత్రాది సత్కర్మలు, సువర్ణాది దానములు, పుణ్యక్షేత్రములను దర్శించి, పుణ్యతీర్థములలో మునకవేయుట ఇత్యాది కర్మలు తాను ఆచరించి యున్నచో శ్రీకృష్ణుడు వన్ను చేపట్టుగాక అంటున్నది రుక్మిణీదేవి. అనగా ఇట్టి మంగళకర కార్యములు నిర్వర్తించు పుణ్యాత్ములను పరమాత్మ తప్పక అనుగ్రహించును.

తులసీమాతపూజ చేయనిదే ఆమె మంచినీళ్ళు కూడా ముట్టేది కాదట. ఈ నాడు ఎక్కువ శాతము తల్లులు నాగరికత పేరున ఆచారములన్నీ మంట గలుపుతున్నారు. వీరిని దారి తప్పించే టందులకు వార్తాపత్రికలు, చలనచిత్రములు, ఆవేశపూరిత అనర్థ ప్రసంగాలు చేసే అల్పమేధస్కులు ఉండనే ఉన్నారు. స్నానాదులు లేకుండా వంటలు చేసే మహిళామ తల్లులు, గృహములో పాదరక్షలతో సంచరించేవారు, కాఫీ ఫలహారాదుల పూర్తిచేసుకొని పూజలు చేయువారు ఎక్కువై పోయారు. ఇలాంటి గృహాలలో సంపద చేరవచ్చునేమో గాని లక్ష్మి నిలువదు. సంతృప్తినిచ్చు ఐశ్వర్యమే లక్ష్మీదేవి. దుఃఖమును బాపలేని సిరి ఎవరి నుద్ధరిస్తుంది? స్త్రీలు నియమ జీవనమును సాగించుచున్నచో ఆ ఇల్లు స్వర్గధామమై వెల్గొందుతుంది. అందుచేతనే స్త్రీని గృహలక్ష్మి అన్నారు.

రుక్మిణీదేవి పరమ పవిత్రురాలు. పుణ్యశీల. అందుచేతనే శ్రీకృష్ణుని వరించగలిగింది. దమఘోషుని సుతుడు మొదలైనవారు తనను పరిగ్రహించ కూడదని వాంఛిస్తున్నది. దమఘోషుని కుమారుడే శిశుపాలుడు. అతని నామము నుచ్చరించలేక అతని తండ్రిని ఉదహరించినది.

ఈ శ్లోకమునకు మహాభక్తాగ్ర గణ్యులైన పోతన మహాకవి మధుర పద్యమును చవి చూచెదము గాక!

మ॥ వ్రతముల్ దేవగురుద్విజన్మబుధసేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితినేనిన్ వసుదేవనందనుఁడు నా చి తేశుఁ డౌఁగాక ని
ర్జితు లై పోదురుగాక సంగరములోఁ జైదీశముఖ్యాధముల్.

తాను ఆచరించిన పుణ్యకర్మలు ఫలప్రదమైనచో శ్రీకృష్ణుడే తన భర్త కావలెనని ప్రార్థించి, మరి శ్రీకృష్ణుడు తక్షణము చేయవలసిన కార్యమును ఐదవ శ్లోకమున తెలియజేయుచున్నది.

శ్వో భావిని త్వమజితో ద్వహనే విదర్భాన్
గుప్త స్సమేత్య పృతనా పతిభిః పరీతః
నిర్మథ్య చైద్య మగధేన్ద్ర బలం ప్రసహ్య
మాం రాక్షసేన విధినోద్వహ వీర్యశుల్కామ్ ॥ ౮

1. అజేయుడా! నా వివాహము రేపటి దినమున జరుగును. నీవు విదర్భ దేశమునకు ఒంటరిగా నరుదెంచి, అజ్ఞాతముగా కళ్యాణ సమయమున ప్రవేశించి, నీ సేనాపతులచే

పరివేష్టితుడవై చేదిదేశపు రాజును, మగధదేశపు రాజును ఓడించి నన్ను రాక్షసవిధిని నీ దానిని చేసికొనుము.

ఆమె వివాహ సమయమున సైన్యములో ఏతెంచి, శత్రువులను సంహరించి తనను గ్రహింపవలసినదిగా రుక్మిణీదేవి ప్రార్థించుచున్నది. చేదిదేశపు రాజును, మగధదేశపు రాజును జయింపమని పలుకుతున్నది. శిశుపాల జరాసంధులు దుష్టులు. వారి నామములను పలుకుట కిష్టపడక రాజ్యముల పేరు చెప్పినది. ఇచ్చట తనను రాక్షసవిధిని చేపట్టుమని సూచించినది.

వివాహ విధానములను ఎనిమిది విధములుగా మన శాస్త్రములు నిర్ణయించినవి. అందులో రాక్షస విధి యొకటి. ఈ అష్టవిధ వివాహములను సంక్షిప్తముగా తెలిపెదను, గ్రహింపుడు.

1. ఆర్షవిధి:- ఈ ఆర్షవిధి ననుసరించి వరుడు వివాహమునకు ముందుగా వధువు తండ్రికి రెండు ఆవులను బహూకరించవలెను.

ఆదాయార్షస్తు గో ద్వయమ్

అని యాజ్ఞవల్క్య స్మృతియు మరియు పరాశర స్మృతియు తెలియజేసినవి.

2. అసురవిధి:- అసురవిధి ననుసరించి వధువుతండ్రి వరుని వద్దనుండి గొప్పగా ధనమును స్వీకరించును. ఇది కన్యాశుల్కము.

అసురో ద్రవిణా దానమ్

అని యాజ్ఞవల్క్య, మనుస్మృతులు తెలిపినవి.

3. బ్రహ్మవిధి:- బ్రహ్మవిధి ననుసరించి వధువు తండ్రి తనశక్తి ననుసరించి వధువును అలంకరించి కన్యాదాన మొనర్చును.

బహూత్మే వివాహ ఆహూయ దీయతే శక్త్యలంకృతా

అని యాజ్ఞవల్క్య మనుస్మృతులు పలికినవి.

4. పైశాచవిధి:- ఈ పైశాచ విధి ననుసరించి నిద్రించునపుడుగాని, మత్తులో నుండినపుడుగాని, దేహస్మృతి లేని సమయమున గాని కన్యను అపహరించుట.

సుప్తాం మత్తాం ప్రమత్తాం వా రహో యత్రోప గచ్ఛతి

అని మనుస్మృతి తెలిపినది.

5. దైవవిధి:- యజ్ఞ నిర్వహణ సమయమున దానిని నిర్వహించు ఋత్విక్కునకు కన్య నొసంగుటను దైవవిధి యందురు.

యజ్ఞస్థ ఋత్విజే దైవః

అని యాజ్ఞవల్క్య స్మృతి ప్రమాణము.

6. గాంధర్వవిధి:- ఏ విధమైన కర్మకాండయు లేక, బంధువులను కూడా సంప్రదించక, కేవలం వధూవరులు పరస్పరము అవగాహనలో వివాహము చేసుకొనుట గాంధర్వవిధి యందురు.

గాంధర్వః సమయాన్మిథః

అని యాజ్ఞవల్క్య స్మృతి ప్రమాణము.

7. రాక్షసవిధి:- ప్రత్యర్థులైన వారిని జయించి కన్యకను గొనిపోవుట రాక్షసవిధి యనబడును.

రాక్షసో యుద్ధ హరణాత్

అని యాజ్ఞవల్క్య స్మృతి ప్రమాణము.

8. ప్రాజాపత్యవిధి:- వరుని నుండి ఏ విధమైన బహుమానమును లేదా శుల్కమును గ్రహించకుండా, వధూవరులిరువురు ధర్మమున చరించునట్లు మాటగైకొని వివాహమును జరిపించుట ప్రాజాపత్య విధి యనబడును.

సహోభౌ చరతాం ధర్మమితి వాచానుభాష్య చ కన్యాప్రదానం

అని మనుస్మృతి యందును, యాజ్ఞవల్క్య స్మృతియందును కలదు.

పైన తెలిపిన అష్టవిధ వివాహవిధులయందు ఏడవదియైన రాక్షసవిధి ననుసరించి తనను గ్రహింపవలసిన దని రుక్మిణీదేవి శ్రీకృష్ణుని ప్రార్థించినది. ఈ శ్లోకమునకు పోతనగారి అనువాదమును వీక్షించెదము గాక!

ఉ॥ అంకిలి సెప్పలేదు చతురంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ! నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొనిపొమ్ము వచ్చెదన్.

మరి శత్రువులైన శిశుపాల జరాసంధులను జయించు సమయాన రుక్మిణీ బంధువులు కూడా ఎదురొడ్డి పోరాడెదరు గదా! మరి వారు కూడా సంహరింపబడెదరు గదా! స్వజన నాశము రుక్మిణికి మహావ్యథను కలిగించును గదా! అని శ్రీకృష్ణుడాలోచించవచ్చును. దానికి తరుణోపాయమును కూడా ఆమెయే ఆరవ శ్లోకమున తెలుపుచున్నది.

అన్తః పురాన్తర చరీమనిహత్య బన్ధూన్
త్వాముద్వహే కథమితి ప్రవదా మ్యుపాయమ్
పూర్వే ద్యురస్తి మహతీ కులదేవ యాత్రా
యస్యాం బహిర్నవ వధూ ర్గిరిజాముపేయాత్ (6)

నీ బంధువులను చంపక అంతఃపురము నందున్న నిన్ను ఏవిధముగా గొనిపోవుదును? అని నీవు సంకోచించినచో దానికి ఉపాయమును తెలుపుచున్నాను. వివాహమునకు ముందురోజు గొప్ప ఊరేగింపుతో మా కులదేవత వద్దకు వెడలు ఆచారమున్నది. ఆ సందర్భమున వధువు ఊరిబయట గల పార్వతీదేవి ఆలయమునకు అరుదెంచును.

రుక్మిణీదేవిని శ్రీకృష్ణుడు అపహరించు సందర్భమున రుక్మిణీ బంధువులు శ్రీకృష్ణుని తప్పక ప్రతిఘటించెదరు. ఆ పోరాటములో రక్తపాతమయ్యే ప్రమాదము

కలదు. మరి రక్తపాతము లేకుండా అంతఃపుర స్త్రీని అపహరించుటెట్లు? అని శ్రీకృష్ణుడు ఆలోచించునేమో యని భావించిన రుక్మిణీదేవి ఉపాయమును తెలిపినది. కులదేవతను దర్శించు ఆచారము ననుసరించి ఊరి బయటనున్న పార్వతీదేవి ఆలయానికి తాను వచ్చుననియు, ఆ సమయమున ఏతెంచి తనను గ్రహింపుమనియు తెలిపెను. ఈ శ్లోకమునకు పోతనార్యుని అనువాదమును గాంచెదము.

సీ॥ లోపలిసౌధంబులోన వర్తింపంగఁ దేవచ్చునే నిన్నుఁ దెత్తునేని
గావలివారలఁ గలబంధువులఁ జంపి కాని తేరా దని కమలనయన!
భావించితేని యుపాయంబు సెప్పెద వాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ బెండ్లికి మును పడఁ బెండ్లికూఁతు
తే॥ నెలమి మావారు పంపుదు రేను వట్టి పురము వెలువడి యేతెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నాసమయమందు వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత!

శ్రీకృష్ణుని సహచర్య భాగ్యము లభించనిచో ఉపవాసాది వ్రతముల ద్వారా శరీరమును కృశింపజేసి కొనెదను. వందలాది జన్మలెత్తి నిన్నే చింతించు చుందును. మరొక పురుషుని వివాహ మాడుట జరుగదని చివరగా రుక్మిణీదేవి తెలియజేసెను.

యస్యాఙ్ఘ్రిపంకజ స్నపనం మహాన్తో
వాంఛన్త్యు మాపతి రివాత్మ తమోపహత్యై
యర్హ్యమ్బు జాక్షన లభేయ భవత్ప్రసాదం
జహ్యామసూన్ వ్రతకృశాన్ శతజన్మభిఃస్యాత్ (7)

కమల నయనా! మహాత్ములైన శంకరాదులు కూడా వారి తమస్సును పోగొట్టుకొనుటకు నీ చరణకమల ప్రక్షాళన జలమును వాంఛించుచుందురు. అట్టి నీ కృపను నేను పొందనిచో ఉపవాసాదులతో కృశించుచు శతజన్మల యందైనను నిన్నే స్మరించుచు ప్రాణములను త్యజింతును.

సాధకుని కుండవలసిన దృఢ దీక్షను ఈ శ్లోకమున రుక్మిణీదేవి కనబరచినది. పూర్ణ శరణాగతితో తన పవిత్ర వ్రతమును ముగించినది. ఇదియే సాధనలో చివరి సోపానము. ఈ శ్లోకముయొక్క భావమును పోతనామాత్యుని పద్యములో దర్శించెదము గాక!

మ॥ ఘను లాత్మీయతమోనివృత్తికొఱకై గౌరీశుమర్యాద ని
న్ననిపాదాంబుజతోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ మూఁడుజన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!

ఈ ఏడు శ్లోకముల ఉత్తరమును దూతయగు సుదేవు డను బ్రాహ్మణుడు శ్రీకృష్ణునకు చదివి వినిపించెను. "యదునాథా! రహస్యమైన ఈ శుభసందేశమును తెచ్చితిని. ఈ విషయమున తమ సముచిత నిర్ణయమేలా యుండునో అద్దానిని ఆలస్యము లేకుండా సాగింపుడు" అనెను.

రుక్మిణీ హరణము

రుక్మిణీదేవి పంపిన శుభ సందేశమును విని సంతుష్టచిత్తుడైన శ్రీకృష్ణుడు సుదేవుని చేయిపట్టుకొని "ద్విజవరా! నా మనస్సు కూడా రుక్మిణి యందు లగ్నమై యున్నది. రాత్రివేళ నిద్ర పట్టుటలేదు. ఆమె సోదరుడు రుక్మి మా వివాహమునకు అంతరాయము కల్గించుచున్నాడని నే నెఱుగుదును. జనులు కట్టెలను కాల్చి అగ్నిని గ్రహించులాగున నేను అధములైన రాజులను వధించి, రుక్మిణిని గ్రహింతును" అని పలికి తన సారథియగు దారుకుని పిలిచి రథమును సిద్ధము చేయుమని ఆజ్ఞాపించెను.

సుదేవునితో కలిసి శ్రీకృష్ణుడు రథమునెక్కి విదర్భకు పయనమాయెను. కుండిన నగర మంతయు చక్కగా శోభించుచుండెను. రుక్మిణీదేవి చక్కగా అలంకరింపబడెను. శాంతి హోమములు జరుగుచుండెను. దానములు సాగుచుండెను. ఒకవైపు శిశుపాలునకు శుభకర్మలు జరుగుచుండెను.

జరాసంధ, దంతవక్త్రాది రాజులెందరో వివాహమునకు విచ్చేసినారు. శ్రీకృష్ణుడు వచ్చి రుక్మిణిని అపహరింప జూచినచో తామంతా అతనిని ప్రతిఘటించి, యుద్ధము చేసి ఆమెను శిశుపాలున కిప్పించుటకు నిర్ణయించుకొనినారు.

రుక్మిణీ హరణార్థము శ్రీకృష్ణుడు ఒంటరిగా కుండినపురమునకు ఏగుచున్నాడని గ్రహించిన బలరాముడు ముందుచూపుతో సైన్యమును వెంటబెట్టుకొని విదర్భకు బయలుదేరెను.

వెళ్ళిన సుదేవుడు తిరిగిరాలేదు. రుక్మిణి దుఃఖవదనురాలయ్యెను. తన దురదృష్టమును నిందించుకొనుచుండెను. అశ్రుపూరిత నయనాలతో దిగులు చెందుచుండగా ఆమె ఎడమతొడ, బాహువు, నేత్రము శుభసూచకముగా అదరెను. ఇంతలో సుదేవుడు రుక్మిణిని సమీపించి, శ్రీకృష్ణుని ప్రతిజ్ఞను వినిపించెను.

హర్షపూర్ణచిత్తురాలైన రుక్మిణి పరవశించిన హృదయముతో "నేను ప్రస్తుతము ఈ అమోఘవార్త నందించిన మీకు నమస్కారము కన్నా మరొకటివ్వలేను" అని పలికి వందన మాచరించెను.

పరమాత్మను జూపిన గురువునకు ఏమి ఇవ్వగలము? మన భక్తినే ఇవ్వగలము. రుక్మిణి కూడా అదియే చేసి చూపెను.

రామకృష్ణులు లేతెంచిరని గ్రహించిన విదర్భరాజగు భీష్మకుడు మంగళ వాద్యములతో ఎదురేగి ఆహ్వానించెను. అతిథిసత్కారముల గావించెను. కుండినపురవాసులు శ్రీకృష్ణుని దర్శించి, రుక్మిణికి సరియైన వరుడు ఇతడే యని భావించిరి. వారిరువురు భార్యాభర్త లగునట్లు ఆశీర్వదించమని దేవతలను ప్రార్థించిరి.

పార్వతీదేవి మందిరమునకు రుక్మిణీదేవి బయలుదేరెను. చెలికత్తెలు, అస్త్రములను ధరించిన వీరసైనికులు వెంట నడచుచుండగా రుక్మిణీదేవి దేవిదర్శనార్థము ఏగుచుండెను.

పద్భ్యాం వినిర్యయౌ ద్రష్టుం భవాన్యాః పాదపల్లవమ్

శ్రీకృష్ణుని పాదపద్మములను హృదయమున ధ్యానించుచు రుక్మిణీదేవి నడుచుచుండెను.

భగవంతుని దర్శనార్థమై ఇంటినుండి బయలుదేరినపుడు ఆలయము చేరునంతవరకు నామస్మరణతోను, రూప ధ్యానముతోను ఉండాలి. పిచ్చి మాటలు, వృథా ఊహాలతో గడపరాదు. అలా చేయువారు ఆలయములో భగవంతుని దర్శించినను అర్థిని పొందలేరు.

రుక్మిణీదేవి ఆలయమును సమీపించెను. శాంతభావముతో దేవి కడకు వెళ్ళెను. దేవిని దర్శించెను. వందన మాచరించెను. అశ్రుపూర్ణ నయనాలతో దేవిని ఈ విధముగా ప్రార్థించెను.

ఉ॥ నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁగదమ్మ మేటి పె
ద్దమ్మ దయాంబురాశివిగదమ్మ హరిం బతిఁజేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నఁడును నాశములేదుగదమ్మ యీశ్వరీ!

అని ప్రార్థించెను. దేవి నారాధించెను. ఆశీస్సులను గైకొనెను. మందిరము నుండి బయల్వెడలెను. మందిరమునుండి వెలుపలికి రాగానే ఆమెను గాంచిన రాజులు మోహమునకు గురియైరి. ఆమె వారిని జూచెను. జగన్మాత యొక్క దృష్టిని భరించలేక మోహించిన రాజులు మూర్ఛితులైరి.

శ్రీకృష్ణుడు అరుదెంచెను. రథమును ముందుకు నడిపెను. రథము నెక్కుటకు ప్రయత్నించు రుక్మిణికి చేయి నందించెను. అందరు చూచుచుండగనే రుక్మిణిని హరించెను.

రుక్మిణీదేవి పూజను ముగించగనే శ్రీకృష్ణుడు అరుదెంచి దర్శనమిచ్చెను. ధ్యానస్థితియందే మనకు దైవదర్శనము లభించును. మన భక్తి పూర్ణరూపమును ధరించిన సమయాన కృష్ణుడు రుక్మిణి యొద్దకు అరుదెంచునట్లు పరమాత్మయే మనల ననుగ్రహించుటకు అరుదెంచును. శ్రీకృష్ణుడు చేయి నందించి రుక్మిణిని గ్రహించెను. భగవంతుని అభయ హస్తము భక్తుల నుద్ధరించును.

తోడేళ్ళ మధ్యనుండి తన భాగమును హరించు సింహమువలె శ్రీకృష్ణుడు రుక్మిణిని హరించి, రథముపై నెక్కించుకొని, రాజ సమూహముల నోడించి, బలరామాదులతో గూడి మెల్లగా బయలుదేరెను.

జరాసంధాది శత్రువులు తమకు జరిగిన పరాభవమునకు ఆక్రోశించిరి. వారందరు ఈ విధముగా పలికిరి.

అహో ధిగస్మాన్ యశ ఆత్త ధన్వనాం గోపైర్హృతం కేసరిణాం మృగైరివ

"ఆహా! ఏమిటి? ఈ వాడు యాదవులు యశోవంతులమైన మనలను ఓడించిరి. సింహములవంటి మన యశస్సును మృగములవంటి యాదవులు అపహరించిరి" అనిరి.

కీర్తిమంతుడు ప్రగతిని ప్రకటించుటకు కూడా ఇష్టపడడు. అయోగ్యుడు బలహీనతను కూడా బలముగా భావించి ఆత్మస్తుతిలో అన్యాయ మగును.

ఈ రాజులందరు క్రోధోద్రిక్తులై సైన్యమును వెంటనిడుకొని శ్రీకృష్ణుని వెంబడించిరి. బలరామునితో గూడి యాదవులు రాజమండలి నెదుర్కొనిరి. జరాసంధాది యోధులు పర్వతములపై మేఘములు వర్షమును కురిపించునట్లు, యాదవ సైన్యముపై శరవర్షమును గురిపించిరి. ఇది గాంచిన రుక్మిణి భయముతో వణకసాగెను. శ్రీకృష్ణుని గాంచెను.

"వామలోచనా! నీవు భయమును వీడుము. మన సైన్యములు త్వరలోనే శత్రు సైన్యములను సంహరింపగలవు" అనెను.

యాదవులు విజృంభించిరి. శత్రుసైన్యము తునకలై క్రింద పడసాగెను. ఈ భయంకర సమరమును గాంచి భీతిచెందిన జరాసంధాదులు విముఖులై తిరిగి వెళ్ళిరి.

నిరుత్సాహముతో క్రుంగిపోతున్న శిశుపాలుని కడకు పరాజితులైన రాజులు వెళ్ళి అతనిని ఓదార్చిరి. సుఖదుఃఖములు దైవాధీనములనియు, కొయ్యబొమ్మ ఇంద్రజాలకుని ఇచ్ఛ ననుసరించి నృత్యము చేయునట్లు, జీవులు ఈశ్వరాజ్ఞ ననుసరించి చరించుచుందురు అని జరాసంధుడు పలికెను.

కృష్ణద్వేషి యైన రుక్మి శ్రీకృష్ణుని సంహరించి తన సోదరియగు రుక్మిణిని విడిపించుటకు సేనలను వెంటనిడుకొని బయలుదేరెను. కృష్ణుని సమీపించి రుక్మి ఇలా పలికెను.

కుత్ర యాసి స్వసారం మే ముషిత్వా ధ్వాజవద్ధవిః
హరిష్యేఽద్య మదం మన్ద మాయినః కూట యోధినః

"మూఢుడా! యజ్ఞవాటిక యందు కాకి హవిస్సును గొనిపోయినట్లు నీవు నా సహోదరి నపహరించినావు. ఆగుము. ఎచ్చట కేగుచున్నావు? మాయావీ! నీ గర్వము నణచెదను. నా బాణములచే కూలి నేల పడకముందే నా సోదరిని వదలి పెట్టుము" అనెను.

ఆ మాటల నాలకించిన కృష్ణుడు శరప్రయోగము చేసి రుక్మియొక్క ధనుస్సును ఖండించెను. ఇరువురి మధ్య తీవ్రముగా బాణములు సంధింపబడెను. రుక్మియొక్క అస్త్రముల నన్నింటిని శ్రీకృష్ణుడు ఖండింపగా కోపోద్రిక్తుడైన రుక్మి పురుగు దీపము నైపునకు పరుగిడినట్లు, శ్రీకృష్ణుని చంపుటకు ఉరికెను.

శ్రీకృష్ణుడు రుక్మిని వధించుటకు ప్రయత్నించగా రుక్మిణి భర్త పాదములపై బడి తన సోదరుని వధించవద్దని ప్రార్థించెను.

శ్రీకృష్ణుడు రుక్మిని వధించుట మాని అతనిని గుడ్డతో బంధించి, కత్తితో కొర్రిగా మీసములను, తలని గొరిగి వికృతరూపుగా జేసెను. పరమాత్మను దూషించువారు వికృతస్వరూపు లగుదురు. రుక్మి యొక్క సేనలను యాదవ వీరులు ఏనుగులు కమలములను త్రొక్కివేయునట్లు అణచివేసిరి. ఈ విధముగా రాజమండలి నోడించి రుక్మిణిని గొనితెచ్చి, శ్రీకృష్ణుడు వివాహము చేసికొనెను.

రుక్మిణీ కళ్యాణ సందర్భమున ప్రతి ఇంటియందును యాదవులు గొప్ప వేడుకలను చేసికొనిరి. రత్నమయ తోరణములతోను, పూలతోను ద్వారకానగరము అందముగా అలంకరింపబడెను. ద్వారము లన్నియు అరటిచెట్ల చేత చక్కగా అలంకరింపబడి యుండెను. రుక్మిణీ కళ్యాణ విషయము సర్వత్ర తెలిసెను. అందరూ సంతసించిరి. ద్వారకయందు పరమాత్మయైన శ్రీకృష్ణునితో మహాలక్ష్మియైన రుక్మిణిదేవి యొక్క వివాహము అత్యంత వైభవముగా జరిగెను. జనులందరు పూర్ణహృదయులై తిలకించిరి.

ప్రద్యుమ్నకుమార చరిత్రము

రుక్మిణీదేవి గర్భమును ధరించెను. పూర్వము రుద్రుని కోపాగ్నికి భస్మమైన మన్మథుడు శరీరమును ధరించుటకై శ్రీకృష్ణు నాశ్రయించుచూ రుక్మిణీ గర్భమున ప్రవేశించెను. జన్మించి ప్రద్యుమ్న నామధేయము దాల్చెను.

ప్రద్యుమ్నుడు జన్మించి పదిరోజులు గాకముందే ఈ బాలుడు తన శత్రువనుచు భావించిన శంబరుడను రాక్షసుడు బాలుని అపహరించి సముద్రమున పడవైచి వెళ్ళెను. గొప్పది యగు చేప ఆ బాలుని మ్రింగెను. ఆ చేప ఒకనాడు మత్స్యకారుల వలలో చిక్కుకొనెను.

జాలరులు పెద్దదియైన ఆ చేపను శంబరాసురునికి కానుకగా సమర్పించిరి. వంటశాలలో దానిని ఖండించగా దాని కుక్షినుండి ఒక బాలుడు బయట పడెను. అచ్చట పాకశాలలో వంటచేయు మాయావతి అను మగువకు ఈ బాలుని ఇచ్చిరి.

ఆమె ఈ బాలుని గ్రహించుటకు సంశయించుచుండగా నారదమహర్షి అరుదెంచి ఆ బాలకుని వృత్తాంతము నంతటిని మాయావతికి వివరించెను.

మాయావతి ఎవరోకాదు. ఆమెయే మన్మథుని భార్యయగు రతీదేవి. భర్త భస్మమైన పిదప అతని పునరావిర్భావమునకై నిరీక్షిస్తూ శంబరుని పాకశాలలో వంట చేయుదానిగా నుండెను. ఈ పిల్లవాడు తన భర్తయేనని తెలిసిన రతీదేవి చాలా సంతసించినదియై బిడ్డను అమితముగా ప్రేమించుచుండెను.

ఆ పిల్లవాడు యౌవన వంతుడాయెను. బహుసుందరముగా గోచరించు ఆ యువకుని మాయావతి మోహించెను. తాను మాతృభావముతో చూచుచున్న మాయావతి కామభావములను వ్యక్తమొనర్చుట గాంచిన ప్రద్యుమ్నుడు అది తగదని, తప్పని ఆమెను వారించెను.

మాయావతి ప్రద్యుమ్నునికి అతని జన్మవృత్తాంతము నంతయు తెలిపెను. తామిరువురు రతీమన్మథు లనెడి విషయమును గుర్తుచేసెను. దుష్టుడగు శంబరాసురుని వధించమని చెప్పి, మహామాయ యను విద్య నొసంగెను. ప్రద్యుమ్నుడు శంబరాసురునితో యుద్ధముచేసి అతనిని వధించెను.

మాయావతితో గూడి ప్రద్యుమ్నుడు ద్వారకకు తరలి వచ్చెను. ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణునివలె గోచరించుచుండెను. రుక్మిణీదేవి కుమారుని గాంచి పరవశించినది. ఆమె స్తనములనుండి క్షీరము స్రవించెను. నారదమహర్షి అక్కడికి అరుదెంచి జరిగిన విషయము నంతటిని వివరించి చెప్పెను. దేవకీ వసుదేవులతో గూడి వాసుదేవుడు కూడా అచ్చటి కరుదెంచెను. అందరూ ఆనందించి, ప్రద్యుమ్నుని అభినందించిరి.

ప్రద్యుమ్నుని రూపము శ్రీకృష్ణుని రూపమువలె నుండుటగాంచి అతనిని జూచి శ్రీకృష్ణుడే యని భావించి మగువలు మోహము నొందెడివారు.

శంబరాసురుడు వాంఛకు ప్రతీకము. ప్రద్యుమ్నుడు త్యాగమునకు ప్రతీకము. ప్రద్యుమ్నునకు రతీదేవితో సంబంధము కలిగెను. ఆత్మయందు రమించవలెనెడి తీవ్ర అనురాగమే రతి. రతి సంబంధము వలన జీవునిలోని వాంఛయనెడి శంబరాసురుడు మరణించి త్యాగమనెడి ప్రద్యుమ్నుడు కృష్ణుడనెడి పరమాత్మను కలియును. ఇదియే ప్రద్యుమ్న కుమార చరిత్రము.

జాంబవతీ సత్యభామలు

ఒకనాడు ఆదిత్య తేజో విరాజితుడైన ఒక వ్యక్తి ద్వారకకు వచ్చుచుండెను. దేదీప్యమానముగ వెలిగిపోతూ అరుదెంచుచున్న ఆ వ్యక్తిని గాంచిన ద్వారకావాసులు శ్రీకృష్ణుని వద్దకు పరుగిడిరి.

నారాయణ నమస్తేఽస్తు శంఖ చక్ర గదాధర
దామోదరారవిన్దాక్ష గోవింద యదునందన

అని నమస్కరించిరి.

నారాయణ దామోదర నీరజదళ నేత్ర నిఖిలేశ గదా
ధారణ గోవింద నమస్కారము యదుపుత్ర నిత్యకల్యాణ నిధీ!

అని పోతనామాత్యుని అనువాదము. ఈ విధముగా శ్రీకృష్ణుని ప్రార్థించి, "దేవా! నిన్ను దర్శించుటకు సూర్యదేవుడు అరుదెంచుచున్నాడు" అని పలికిరి. వారి మాటల నాలకించిన శ్రీకృష్ణుడు నవ్వుచూ "అరుదెంచుచున్న ఆ వ్యక్తి సూర్యుడు కాదు. శమంతకమణిచే విరాజిల్లు సత్రాజిత్తు" యనెను.

సూర్యుడు తన భక్తుడైన సత్రాజిత్తునకు శమంతకమణి నొసంగెను. దానిని కంఠమునందు సత్రాజిత్తు ధరించి యుండుటచే ప్రకాశమానుడై యుండెను. ఆ మణి ఎచ్చట పూజింపబడుచుండునో అచ్చట దారిద్ర్యము, అశుభములు, సర్పభయము, వ్యాధులు ఇత్యాదులుండవు. అది నిత్యము ఎనిమిది బారువుల బంగారము నిచ్చును.

ఒకనాడు శ్రీకృష్ణుడు ఆ మణిని యదురాజున కిమ్మని సత్రాజిత్తు నడిగెను. సత్రాజిత్తు అందుల కంగీకరించలేదు. ఈ విధమైన తిరస్కారము వలన కలిగెడి దుష్ప్రయోజనమును అతడెరుగడు.

మన సంపదలన్నియు భగవత్ప్రసాదములే. కాని వాటిని భగవంతున కిచ్చుటకు మానవు డిష్టపడడు. భగవంతుని తిరస్కరించి స్వార్థముతో జీవించువాడు ఇక్కట్లకు తప్పక గురియగును.

ఒకనాడు సత్రాజిత్తు సోదరుడైన ప్రసేనుడు శమంతకమణిని కంఠమున ధరించి వేటకేగెను. అరణ్యములో ఒక సింహము గుర్రముతో పాటు అతనిని వధించెను. అతని కంఠమున ప్రకాశిస్తున్న మణిని గ్రహించి సింహము పర్వతగుహలోనికి ప్రవేశించెను. అచ్చట వసించుచున్న భల్లూకరాజగు జాంబవంతుడు ఆ సింహమును వధించి, మణిని గ్రహించి తన పుత్రిక కిచ్చెను.

ప్రసేనుని జాడ తెలియక సత్రాజిత్తు వ్యథచెందెను. మణిని అపహరించుటకు శ్రీకృష్ణుడే తన తమ్ముని వధించెనని పలికెను. ఈ వార్త జనులలో చర్చా విషయముగా సాగుచుండెను.

కాలము అతి విచిత్రమైనది. అది అనూహ్యమైన సమస్యలను తెచ్చి పెట్టును. నిర్దోషులు దోషులుగా ముద్రవేయబడుదురు. అట్టి విషమసమయాలలో ఆవేశపడకుండా వివేకముతో ఆలోచించే అలవాటును కలిగియుండాలి.

ఈ అపవాదును పోగొట్టుకొనుటకు శ్రీకృష్ణుడు పురవాసులతో కలిసి ప్రసేనుని అన్వేషించుటకు బయలుదేరి వెళ్ళెను. అరణ్యములో ప్రసేనుని గుర్రము చచ్చిపడి యుండుటను శ్రీకృష్ణుడు చూచెను. పిమ్మట చచ్చిపడియున్న సింహమును గాంచెను.

పురజనులను బయటనుంచి శ్రీకృష్ణుడు ఒంటరిగా గుహలోకి ప్రవేశించెను. జాంబవంతుడు శ్రీకృష్ణు నెరుగనివాడై ఆయనతో యుద్ధమునకు దిగెను. ద్వంద్వ యుద్ధము ప్రారంభమాయెను. వీరిరువురు పదునెనిమిది దినములు భయంకరముగా పోరాడిరి.

శ్రీకృష్ణుని దెబ్బలను జాంబవంతుడు సహింపలేకపోయెను. శ్రీకృష్ణుని వైభవమును గాంచి వివేకము నొందినవాడై ఇలా పలికెను.

జానే త్వాం సర్వభూతానాం ప్రాణ ఓజః సహోబలమ్
విష్ణుం పురాణ పురుషం ప్రభవిష్ణు మధీశ్వరమ్

"దేవా! సర్వభూతములకు ప్రాణము, ఓజస్సు, తేజస్సు నీవే. సనాతనుడైన పురుషుడవు, ప్రభావము గలవాడవు, సర్వాంతర్యామివి, సర్వాధీశుడవగు నీవు సాక్షాత్తు విష్ణుదేవుడే యని నేను భావించుచున్నాను.

"పూర్వము రావణుని వధించిన శ్రీరాముడవు నీవే" అని జాంబవంతుడు పలుకగా, సంతృప్తిచెందిన శ్రీకృష్ణుడు తన భక్తుడైన జాంబవంతుని ఆశీర్వదించెను. తాను వచ్చిన పని తెలియజేసెను. జాంబవంతుడు శమంతకమణిని శ్రీకృష్ణున కొసంగెను. దానితోపాటు తనకుమార్తె యగు జాంబవతిని కూడా సమర్పించెను.

శ్రీకృష్ణుడు ద్వారక కరుదెంచెను. సత్రాజిత్తును పిలిచి జరిగిన విషయము నంతటిని వివరించి చెప్పి శమంతకమణిని అతని కొసంగెను. తనపై మోపబడిన కళంకమును శ్రీకృష్ణుడు పోగొట్టుకొనెను. సత్రాజిత్తు మణిని గ్రహించి గృహమున కేగెను.

సత్రాజిత్తు అశాంతచిత్తు డాయెను. శ్రీకృష్ణునిపై నిందారోపణ చేసినందులకు సిగ్గుపడసాగెను. జను లతనిని అసహ్యించు కొనసాగిరి. కృష్ణునిపై నిందారోపణలు చేసినందులకు నిందించసాగిరి. సత్రాజిత్తు వ్యాకులచిత్తుడై వ్యథ చెందసాగెను.

తొందరపాటుచే మహాత్ములను నిందించరాదు. అలాంటి నిందారోపణలు తాత్కాలికముగా ఆనందము నిచ్చి, శాశ్వత దుఃఖమును ముందుంచును. మహాత్ములను నిందించుటయే మహాపాపమని గ్రహించాలి. మహాత్ములకు చేసిన అపరాధమును వారిని సంతోషపరచియే పోగొట్టుకొనవలెను. శ్రీకృష్ణుని అనుగ్రహమునకై సత్రాజిత్తు చిత్తము ఆరాటపడుచుండెను.

సత్రాజిత్తు ఆలోచించెను. శ్రీకృష్ణుని ప్రసన్నుని గావించు కొనుటకు ఒక చక్కని ఉపాయము నాలోచించెను. శ్రీకృష్ణుని సమీపించి, శమంతకమణితో పాటు సద్గుణ సౌందర్యరాశి యగు తన కుమార్తె సత్యభామను కూడా గ్రహింపుమని ప్రార్థించవలెనని సంకల్పించెను.

ఆ॥ మణినిఁ గూఁతు నిచ్చి మాధవు పదములు పట్టుకొంటినేని బ్రతుకు గలదు
సంతసించు నతఁడు సరుసాయ మగు నిది సత్య మితరవృత్తిఁ జక్కబడదు.

అని భావించి శ్రీకృష్ణు నాశ్రయించి. తన మనోరథమును తెలిపెను. శ్రీకృష్ణుడు అంగీకరించెను. సత్యభామను వివాహమాడెను. కాని శమంతకమణిని గ్రహింపక దానిని సత్రాజిత్తునకే ఇచ్చివేసెను.

క॥ మణియిచ్చినాఁడు వావర, మణినీకునుమాకుఁగలవు మణులుకుమారీ
మణిచాలునంచుఁగృష్ణుఁడు, మణిసత్రాజిత్తునకును మరలఁగనిచ్చెన్.

"రాజా! నేను మణిని వాంఛించుటలేదు. దానిని సూర్యుని భక్తుడనైన నీవే యుంచుకొనుము" అనెను. వాంఛలు తెలియని పరమాత్మ మనమునుండి కొన్ని సమయాలలో ఏదైనను వాంఛింపవచ్చును. మన త్యాగమును పరీక్షించుటకే అలా చేయును. భగవానుని సంపదను భగవానునకే సమర్పించువారు కివ్వక దాచుకొనువారు కృపణు డగును. ఆయన కృపకు పాత్రుడగును.

శతధన్వుని వధించుట

కుంతీదేవితో సహా పాండవులు లక్క ఇంటిలో మరణించినట్లు శ్రీకృష్ణునకు వార్త తెలిసినది. అది వినగానే బలరామునితో గూడి శ్రీకృష్ణుడు హస్తినాపురము చేరెను.

పాండవులు మరణించలేదనియు, వారు బిలము ద్వారా వెళ్ళిపోయినట్లు దివ్యాత్ముడగు వాసుదేవుడు గ్రహించెను.

శ్రీకృష్ణుడు హస్తినాపురమున యుండెను. అప్పుడు శతధన్వుడు అక్రూర కృతవర్మలను కలిసెను. పూర్వము సత్రాజిత్తు సత్యభామను శతధన్వున కిచ్చి వివాహము చేయుదునని చెప్పియుండెను. కాని పరిస్థితుల ప్రాబల్యముచే సత్యభామను శ్రీకృష్ణున కివ్వడము జరిగినది. శతధన్వుడు దుష్టుడు. అతడు అక్రూర కృతవర్మలను కలిసెను. అక్రూరుడు మహాభక్తుడు. అయినను శతధన్వుని సాంగత్యముచే అతని బుద్ధి పాడయ్యెను. దుష్టసంగ మునే సర్వదా త్యజింప దగినదియే యని గ్రహించాలి.

అక్రూర కృతవర్మాణౌ మణిః కస్మాన్న గృహ్యతే

"సత్రాజిత్తు వద్దయున్న మణిని నీవేల గ్రహింపరాదు?" అని అక్రూర కృతవర్మలు పలికిరి. వారి పలుకుల నాలకించిన శతధన్వుడు వెళ్ళి నిద్రించుచున్న సత్రాజిత్తుని వధించెను. అంతఃపుర స్త్రీలు జూచి విలపించుచుండగా శతధన్వుడు శమంతకమణిని తీసుకొనిపోయెను.

తండ్రి మరణవార్త సత్యభామను తీవ్రవ్యథకు గురిచేసినది. అనంతరము తైలపాత్ర యందు తండ్రి యొక్క మృతదేహము నుంచి ఆమె హస్తినాపురమున కేగి శ్రీకృష్ణునికి జరిగిన విషయమును వివరించినది.

శ్రీకృష్ణు డామె నోదార్చి బలదేవునితో గూడి ద్వారక కరుదెంచెను. శతధన్వుని వధించి, మణిని గ్రహింపవలెనని ఆలోచించెను.

శ్రీకృష్ణుని నిర్ణయము శతధన్వునికి తెలిసిపోయినది. అతడు భయ విహ్వలుడై కృతవర్మ కడకేగెను. తనను రక్షింపుమని కోరెను. శతధన్వుని మాటల నాలకించిన కృతవర్మ అతనితో ఇట్లనెను.

నాహ మీశ్వరయోః కుర్యాం హేలనం రామకృష్ణయోః
కోను క్షేమాయ కల్పేత తయోర్వృజిన మాచరన్
కంసః సహానుగోపీతో యుద్ద్వేషా, త్త్యాజితః శ్రియా
జరాసన్ధః సప్తదశ సంయుగా ద్విరథో గతః

"నేను ఈశ్వర రూపులగు బలరామకృష్ణులతో విద్వేషమును కల్పించుకొనను. వారిని ద్వేషించి, మునుపు కంసుడు భ్రష్టుడై మరణించెను. జరాసంధుడు పదునేడు పర్యాయములు పోరునసలిపి రథమును కూడా పోగొట్టుకొనెను. వారికి చెడు చేసిన [illegible] ఎవరు బాగుపడిరి?" అనెను.

కృతవర్మ సమాధానముతో నిరాశచెందిన శతధన్వుడు అక్రూరుని సమీపించి, తనకు సహాయమును వాంఛించెను. అక్రూరుడు కూడా అందుల కంగీకరించలేదు. శ్రీకృష్ణునితో కోరి ఎవ్వరును శత్రుత్వమును కొని తెచ్చుకోరు యనెను.

సీ॥ ఎవ్వఁడు విశ్వంబు నెల్ల నలీలుఁడై పుట్టించు రక్షించుఁ బొలియఁజేయు
నెవ్వనిచేష్టల నెఱుఁగరు బ్రహ్మాదు లెవ్వనిమాయ మోహించు భువన
మేడేండ్లపాపఁడై యేవిభుఁ డొకచేత గోరక్షణమునకై కొండ నెత్తె
నెవ్వఁడు కూటస్థుఁ డీశ్వరుఁ డద్భుత కర్ముఁ డనంతుఁడు కర్మసాక్షి
తే॥ యట్టి ఘనునకు శౌరికి ననవరతము మ్రొక్కెదముగాక విద్వేషమునకు నేను
వెఱతు మొల్లము నీపొందు నేఁగఁ బొమ్ము చాలు బరివేలువచ్చె నీ సఖ్యమునను.

అని అక్రూరుడు పలికెను.

శ్రీకృష్ణుడు హస్తినాపురమునకు వెళ్ళిన సమాయన దుష్టుడగు శతధన్వునితో అక్రూరునకు స్నేహము కుదిరెను. దుర్జన సహవాసము బుద్ధిని పాడుచేయును. ఆ ప్రభావము వలన శతధన్వుని రాగములో శృతి కలిపి అతనిని శమంతకమణి నపహరించుటకు పురికొల్పుట జరిగినది. కానీ శ్రీకృష్ణుడు తిరిగి మధురకు రాగానే అక్రూరుని మది శుద్ధిపడినది. చేసిన తప్పిదమునకు పశ్చాత్తాపపడెను.

హృదయ మనెడి ద్వారకలో పరమాత్మ యున్నంతవరకు దుష్టత్వమనెడి శతధన్వుడు మనలను సమీపించలేడు. పరమాత్మకు దూరమైనచో ఏ క్షణమైనను పాపము దరిచేరవచ్చును. కనుక సదా హరి చింతనము నందే చిత్తము రమించుచుండవలె నని ఈ సందర్భమున అక్రూరుని పాత్ర మనకు తెలియజేయుచున్నది.

అక్రూరుని మాటల నాలకించిన శతధన్వుడు ఉన్మత్తునివలె మిగిలెను. చెడు కార్యములకు మనలను పురికొల్పువారు వాటి ఫలితములైన ఆపదలు సంభవించినపుడు మనలను రక్షింతురా? అందుచేత వివేకియగు మానవుడు భగవంతుని ఆరాధించుచు, తన బుద్ధిపైననే ఆధారపడి జీవనయాత్రను సాగించవలెను.

శతధన్వుడు ఆలోచించెను. శమంతకము తనకు కంఠాభరణము కాదనియు, కంఠచ్ఛేదమునకు హేతువు కాగలదనియు గ్రహించి, రహస్యముగా ఆ మణిని అక్రూరుని గృహము నందుంచి, నూరు యోజనముల వేగముతో పరుగిడు అశ్వమునెక్కి పారిపోయెను.

శతసంవత్సరములు జీవించవలెనని కలలుగనే మానవుడే శతయోజనములు పరుగిడే శతధన్వుడు. ఇచ్చట శరీరమే అశ్వము. మన ఊహాలు వాస్తవాలు గుఱ్ఱముపై పయనించు శతధన్వుడు. ఇచ్చట శరీరమే అశ్వము. మన ఊహాలు వాస్తవాలు అవుతాయా? పారిపోయే శతధన్వుని వెంట మృత్యువు కూడా పరుగిడుచున్నదని అతనికి తెలియదు.

బలరామకృష్ణులు రథమునెక్కి, శతధన్వుని వెంబడించిరి. మిథిలానగర సమీపమున శ్రీకృష్ణుడు శతధన్వుని శిరమును ఖండించెను. అతని కడ శమంతకమణిని వెదికెను. కాని ఈ మణి అతని వద్ద లభించకుండెను.

శ్రీకృష్ణుడు బలరాముని సమీపించి, "శతధన్వుని వద్ద మణి లభించలేదు. నేను అనవసరముగా అతనిని సంహరించితిని" అని చెప్పెను.

బలరాముడు శ్రీకృష్ణునితో "అతడు ఆ మణిని ఎవరి యొద్దనైన దాచి యుండవచ్చును. నీవు ఆ అన్వేషణలో ద్వారకకు వెళ్ళుము. నేను మిథిలానగరమునకు వెళ్ళి రాజగు జనకుని దర్శించి వచ్చెదను" అనెను.

బలరాముడు మిథిలలో జనకుని దర్శించెను. జనకుని ప్రేమాభిమానములను గాంచి సంతుష్టిచెందిన బలరాముడు కొన్ని సంవత్సరములు మిథిల యందే యుండెను. దుర్యోధనుడు ఈ సమయము నందే బలరాముని వద్ద గదాయుద్ధమును నేర్చెను.

శ్రీకృష్ణుడు ద్వారకకు అరుదెంచెను. సత్రాజిత్తునకు అంత్యక్రియలను జరిపించెను. శమంతకమణి శతధన్వుని కడ లభించలేదని సత్యభామతో పలికి, ఆ మణిని గూర్చి ఆలోచించుచుండెను.

శతధన్వుడు మరణించినట్లు అతనిని ప్రోత్సహించిన అక్రూర కృతవర్మలకు తెలిసెను. వారు భయపడి ద్వారకను విడిచి వెళ్ళిరి.

అక్రూర కృతవర్మలు ఇరువురు కూడా శ్రీకృష్ణుని భక్తులే. మరి అట్టివారు శతధన్వుని ప్రోత్సహించి సత్రాజిత్తు మరణమునకు ఎందులకు కారణమైరి? అనెడి సంశయము మనలను ఈ సందర్భమున పట్టుకొనును. దీనికి కారణము ఒక్కటే. సత్రాజిత్తు తన తమ్ముని శ్రీకృష్ణుడు వధించి శమంతక మణిని గ్రహించెను అని ప్రచారము చేసియున్నాడు. శ్రీకృష్ణునికి కళంకమును ఆపాదించినాడు. అందుచేత కృష్ణభక్తులైన అక్రూర కృతవర్మలు సత్రాజిత్తుపై దుష్టభావమును కలిగియుండిరి. శతధన్వుడు అనువుగా లభించగనే సత్రాజిత్తును వధించమని ప్రోత్సహించినారు.

సత్రాజిత్తు శ్రీకృష్ణునిపై దుష్ప్రచార మొనరించినాడు. అట్టి శ్రీకృష్ణుడే అతనిని క్షమించి, అతనితో బంధుత్వమునుగలుపుకొని, సత్రాజిత్తు పుత్రికయగు సత్యభామను తన భార్యగా స్వీకరించెను. శ్రీకృష్ణునికి లేని ద్వేషము అక్రూర కృతవర్మలకు ఎందులకు?

ఈర్ష్య ద్వేషములు ఎప్పుడూ దుఃఖములనే అందించును. క్షమా గుణమును సాధకుడు పొందవలెను. లేనిచో అక్రూర కృతవర్మలవలె పరమాత్మకు దూరముగా వెళ్ళవలసి వస్తుంది.

అక్రూరుడు ద్వారకను విడచి వెళ్ళెను. ద్వారకానగర వాసులకు దేహబాధలు, మానసిక వ్యధలు, ప్రకృతి వైపరీత్యములు సంభవించినవి. అక్రూరుడు లేకపోవుటచేతనే ఈ బాధలన్నియు కలుగు చున్నవని నగరవాసులు అభిప్రాయపడిరి. వారి అభిప్రాయము సరికాదనియు, ఈ రుగ్మతలన్నియు శమంతకమణిని పోగొట్టుకొనుట వలన ఏర్పడిన రుగ్మతలని శ్రీకృష్ణునికి తెలుసు. అయినను నగరవాసుల మాటలకు గౌరవము నొసగి అక్రూరుని తిరిగి ద్వారకకు పిలిపించెను.

శ్రీకృష్ణుడు అక్రూరుని పూజించెను. శ్రీకృష్ణుడు అక్రూరునితో, "అక్రూర మహాశయా! సత్రాజిత్తు సంతానము లేనివా డగుటచేత కుమార్తెయగు సత్యభామ పుత్రులే అతనికి

పిండప్రదానము గావించినారు. కనుక ఋణమును దీర్చుటకు, సంపదను అనుభవించుటకు వారే అర్హులు. ఇది శాస్త్ర సమ్మతము.

"అక్రూరా! శతధన్వుడు నీ యొద్ద యుంచిన శమంతకమణిని గూర్చి ముందుగనే మాకు తెలియును. అయినను అన్యులు ఉంచుకొనుటకు దుస్తరమైన ఆ మణిని నీ యొద్దనే యుంచుకొనుము. కానీ ఆ మణిని నేను అపహరించినట్లు కొందరు అభిప్రాయ పడుచున్నారు. నీవు ఆ మణిని వారికి జూపి వారి హృదయములను నిష్కళంకముగా, నిర్మలముగా మార్చుము" అనెను.

వస్త్రఖండము నందు చుట్టబడి యున్నను సూర్యునివలె ప్రకాశించుచున్న ఆ మణిని తెచ్చి శ్రీకృష్ణున కొసంగెను. శ్రీకృష్ణుడు ఆ మణిని బంధువులకు జూపి, అభిమాన వినిర్ముక్తుడై మణిని మరల అక్రూరున కొసంగెను.

కం॥ చక్రాయుధుఁడీక్రియఁ దన, యక్రూరత్వంబు జనులకందఱకును వి
ర్వక్రముగఁదెలిపిక్రమ్మఱ, నక్రూరునికిచ్చెమణిఁ గృపాకలితుండై.

ఈ అధ్యాయమును ముగించు సందర్భమున వ్యాసభగవానుడు ఫలశ్రుతి వందించినాడు. దోషరహితుడైన శ్రీకృష్ణుని వీరత్వమును, మంగళప్రదము, పాపనాశకమునైన ఈ "శమంతకమణి అపహరణము-శతధన్వుని వధ" యనెడి వృత్తాంతమును చదివినను, వినినను, స్మరించినను మానవుడు దోషము నుండి, కళంకము నుండి విడివడును అని పలికెను.

శ్రీకృష్ణుని అష్టభార్యలు

పాండవులు అజ్ఞాతవాసమును పూర్తి చేసిరి. వారిని గాంచుటకై యాదవులతో కూడి శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకు అరుదెంచెను.

పాండవులు శ్రీకృష్ణుని గాంచి పొంగిపోయిరి. పాదములకు నమస్కరించిరి. ప్రేమాలింగనము గావించుకొనిరి. శ్రీకృష్ణుడు ధర్మరాజ భీములకు నమస్కరించెను. నకుల సహదేవుల ప్రణామములను గైకొనెను. అర్జునుని ఆలింగనము చేసుకొనెను.

సిగ్గుతో తలవంచినదై ద్రౌపది శ్రీకృష్ణునకు నమస్కరించెను. శ్రీకృష్ణుడు కుంతీదేవి వద్దకు వెళ్ళి ఆమెకు నమస్కరించెను. ఉభయులు కుశలములను ప్రశ్నించుకొనిరి.

దుర్యోధనుడు పెట్టిన బాధలను స్మృతికి తెచ్చుకొని, శ్రీకృష్ణునికి వివరించెను. నేత్రములు అశ్రుపూర్ణములు కాగా రుద్ధమైన కంఠముతో కుంతీదేవి ఇలా పలికెను:

"కృష్ణా! మా క్షేమముగోరి నీవు అక్రూరుని హస్తినాపురమునకు పంపినపుడు మాకు శుభము చేకూరినది. అనాథులైన మేము సనాథులమయ్యాము.

నతేఽస్తి స్వపర భ్రాన్తి ర్విశ్వస్య సుహృదాత్మనః
తథాపి స్మరతాం శశ్వత్ క్లేశాన్ హంసి హృది స్థితః

"కృష్ణా! నీవు విశ్వమునకు నేత్రముగుటచేత నీకు స్వపర భేదములు లేవు. అయినను సర్వదా ధ్యానించువారల హృదయమున స్థిరముగా యుండి వారి దుఃఖములను పోగొట్టుచుందువు" అని కుంతీదేవి అనుభవముతో గూడిన వచనములను పలికినది.

ధర్మరాజు శ్రీకృష్ణునికి నమస్కరించుచు ఈవిధముగా పలికెను.

ఉ॥ పట్టఁగలేరు నిన్నుఁ దమభావములందు సనందనాదు లే
పట్టున నైన నట్టి గుణభద్రచరిత్రుడ నీవు నేఁడు మా
చుట్టమవంచు వచ్చెదవు చూచెద నల్పులమైన మమ్ము నే
మెట్టి తపంబు సేసితి మధీశ్వర పూర్వశరీరవేళలన్.

ఈ విధముగా శ్రీకృష్ణుడు స్తుతింపబడినవాడై ఇంద్రప్రస్థ పురవాసులకు ఆనందము నొసగూర్చుచూ వర్షాకాలమంతయు అచ్చటనే గడిపెను.

ఒకనాడు అర్జునుడు శ్రీకృష్ణుని వెంటబెట్టుకొని రథము నెక్కి వేటకై అరణ్యమున కేగెను. అచ్చట అనేక మృగములను సంహరించెను. ఆ తరువాత శ్రీకృష్ణార్జునులు యమునానది కడకేగి స్నాన మాచరించిరి. ఆ తీరమునందు తిరుగుచున్న ఒక కన్యను జూచి, ఆమెను గూర్చి తెలిసికొని రమ్మని కృష్ణుడు అర్జునుని పంపెను. సౌందర్యరాశియగు ఆ సుగుణను అర్జునుడు సమీపించి వివరముల నడిగెను.

ఆమె అర్జునుని వంక జూచి, "అయ్యా! నేను కాళిందిని. సూర్యుని పుత్రికను. శ్రీహరిని పతిగా బొందగోరి తపము నాచరించుచున్నాను. నేను విష్ణువును తప్ప మరెవ్వరిని పరిణయ మాడను. ఈ యమునా జలములో మా తండ్రి నిర్మించిన భవనము నందు శ్రీహరికై నిరీక్షించుచూ వసించుచున్నాను" అనెను.

అర్జునుడు ఆమె మాటలను శ్రీకృష్ణుని కెరింగించెను. వెంటనే శ్రీకృష్ణుడామెను రథముపై నెక్కించుకొని ధర్మరాజు వద్దకు వచ్చెను.

శ్రీకృష్ణుడు విశ్వకర్మచే పాండవులకు సుందరమైన పట్టణమును నిర్మింపజేసెను. అగ్నిదేవునకు ఆహారముగా ఖాండవవనము నొసంగెను. అర్జునునికి శ్రీకృష్ణుడు సారథి యయ్యెను.

అగ్నిదేవుడు సంతృప్తి చెందినవాడై అర్జునునకు గాండీవ మను ధనుస్సును, నాలుగు శ్వేతాశ్వములను, రథమును, అక్షయతూణీరములను, కవచము నొసంగెను. ఖాండవ వన దహనసమయమున మయుడను రాక్షసుడు శ్రీకృష్ణునిచే రక్షింపబడెను. అతడు పాండవులకు నిర్మించి ఇచ్చినదియే మయసభ యనబడినది. ఈ సభయందే సత్యాసత్యముల నెఱుగలేని దుర్యోధనుడు పరాభవింపబడెను.

శ్రీకృష్ణుడు తరువాత బంధువుల అనుమతిని బొంది యాదవులచే పరివేష్టితుడై ద్వారకాపురి కేగెను. అచ్చట శ్రీకృష్ణుడు కాళిందిని వివాహమాడెను. సర్వులు ఆనంద భరితులైరి.

అవంతీరాజు తన సోదరి యగు మిత్రవిందయొక్క స్వయంవరమును ఘనముగా ఏర్పాటు చేసెను. రాజు లందరిని ఆహ్వానించెను. అవంతీరాజులు దుర్యోధనునికి అనుకూలురు. అందుచేత శ్రీకృష్ణుని వరించరాదనిరి. మిత్రవింద శ్రీకృష్ణునియందే ఆసక్తి గల్గియుండెను. శ్రీకృష్ణుడు రాజులందరు చూచుచుండగనే మిత్రవిందను అపహరించెను.

అయోధ్యానగరమును నాగ్నజిత్తు అను రాజు పాలించుచుండెను. ఆయన కుమార్తె పేరు నాగ్నజితి. నాగ్నజిత్తుని వద్ద క్రూరస్వభావముగల ఏడు ఆబోతు లుండెను. వాటిని జయించినవానికి తన కుమార్తె నిచ్చెదనని ప్రకటించెను. ఆ విషయమును విని యాదవులను వెంటనిడుకొని శ్రీకృష్ణుడు బయలు దేరెను.

నాగ్నజిత్తు శ్రీకృష్ణుని ఆహ్వానించి అర్చించెను. నాగ్నజితి శ్రీకృష్ణుని గాంచి "ఇతడే నా భర్తయగుగాక" అని భావించెను. ఆమె మనస్సును గ్రహించిన శ్రీకృష్ణుడు నాగ్నజితిని పరిణయమాడగోరి, తాను ఏడురూపములను ధరించినవాడై ఆ ఏడు ఆబోతులను ఓడించెను.

నాగ్నజిత్తు సంతసించినవాడై శ్రీకృష్ణునికి తన పుత్రిక నొసంగెను. శ్రీకృష్ణుడు నాగ్నజితిని పరిణయమాడెను. వరశుల్కముగా గొప్పసంపదను నాగ్నజిత్తు శ్రీకృష్ణున కొసంగెను. శ్రీకృష్ణుడు నాగ్నజితితో కూడినవాడై సైన్యము వెంటరాగా ద్వారకకు బయలుదేరెను.

శ్రీకృష్ణుడు నాగ్నజితిని గొనిపోవుచున్నాడని వినిన కొందరు రాజులు ఏకమై మార్గమధ్యమున శ్రీకృష్ణుని ఎదుర్కొనిరి. సింహము మృగములను వధించునట్లు అర్జునుడు ఆ రాజులను హతమార్చెను. నాగ్నజితి కృష్ణులు ద్వారక చేరిరి.

శ్రీకృష్ణుని మేనత్త యగు శ్రుతకీర్తి పుత్రికయైన భద్రను శ్రీకృష్ణుడు పరిణయమాడెను. అలాగే గరుత్మంతుడు స్వర్గమునుండి అమృతమును తెచ్చినట్లు శ్రీకృష్ణుడు మద్రరాజ పుత్రికయగు లక్ష్మణను పరిణయమాడెను. ఈవిధముగా శ్రీకృష్ణునకు రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్ష్మణ యను అష్టభార్య లేర్పడిరి.

సృష్టిలోని అష్టవిధ ప్రకృతులే శ్రీకృష్ణుని అష్టవిధ భార్యలు. ప్రకృతిని తన యాధీనమున నుంచుకొనువాడు శ్రీకృష్ణుడు కాగలడు.

భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా

"భూమి,నీరు,నిప్పు,గాలి,ఆకాశము,మనస్సు,బుద్ధి,అహంకారము అని నా ప్రకృతి ఎనిమిది విధములుగా యున్నవి" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత - విజ్ఞానయోగము నందు తెలిపియున్నారు.

కనుక ఈ అష్టవిధ ప్రకృతులకు నాథుడు శ్రీకృష్ణుడే గనుక ఆయనకు ఎనిమిదిమంది భార్య లేర్పడిరి.

నరకాసుర వధ

పూర్వము ప్రాగ్జ్యోతిష పురమును నరకుడనే రాక్షసుడు పాలించుచుండెను. అతడు సురలోకమును ముట్టడించి అదితియొక్క కుండలములను, వరుణుని ఛత్రమును, అమరుల విహారస్థలమైన మణిపర్వతమును వశపరచుకొనెను. నరకుని ఈ దురంతములను మహేంద్రుడు శ్రీకృష్ణునకు వివరించి చెప్పెను.

నరకాసురుని వధించుటకు శ్రీకృష్ణుడు గరుడ వాహనారూఢుడై బయలుదేరు చుండగా సత్యభామ యరుదెంచి, "ప్రభూ! రాక్షస సమూహములను నీవు చెండాడుటను వినియుంటినే గాని ఎప్పుడును గాంచలేదు. చూడవలెనని ముచ్చట పడుచుంటిని. ప్రాణనాథా! నన్ను కరుణించి నీ వెంట గొనిపొమ్ము. నీ ప్రతాపమును గాంచిన నేను తిరిగి వచ్చి నా సపత్నుల కావిషయముల నెరింగించెదను" అనెను.

రణరంగము విహార స్థలము కాదనియు, అది అత్యంత భయంకరముగా నుండుననియు తెలిపి, ఆ ప్రయత్నమును విరమించుకోమని శ్రీకృష్ణుడు సత్యభామకు తెలిపెను. అయినను ఆమె అంగీకరించ దాయెను. చేయునదిలేక సత్యభామను వెంటనిడుకొని నరకాసురుని వధించుటకు శ్రీకృష్ణుడు బయలుదేరి ప్రాగ్జ్యోతిషపురము చేరెను. పాంచజన్యమును పూరించెను. ఆ ధ్వనిని విని నీటిలో పరుండియున్న మురుడను రాక్షసుడు జలమునుండి లేచి, త్రిశూలమును తీసుకొని, ఐదు ముఖములతో సర్పము గరుత్మంతుని వైపునకు వెడలునట్లు శ్రీకృష్ణుని వైపునకు వెళ్ళెను.

మ॥ గద వ్రేసెన్ మురదానవుండు హరిపైఁ గంసారియుం దద్గదన్
గదచేఁ ద్రుంచి సహస్రభాగములుగాఁ గల్పించె నాలోన వాఁ
డెదురై హస్తములెత్తికొంచు వడి రా వీక్షించి లీలాసమ
గ్రదశన్ వానిశిరంబులైదును వడిన్ ఖండించెఁ జక్రాహతిన్.

ఈ విధముగా మురాసురుడు మరణింపగా, తండ్రి మరణముచే క్రుంగిన తామ్రుడు, అంతరిక్షుడు, శ్రవణుడు, విభావసు, వసువు, నభస్వంతుడు, అరుణుడు అను మురాసురుని ఏడుగురు కుమారులు శ్రీకృష్ణునితో యుద్ధము చేయుట కరుదెంచిరి. శ్రీకృష్ణుడు వారిని కూడా వధించెను. తన అనుచరులందరు అలా మరణించుటను తెలిసి నరకాసురుడు ఏనుగుపై నెక్కి స్వయముగా పోరుటకు సమరరంగమునకు అరుదెంచెను.

పాఠక మహాశయులకు ఒక మనవి. ఈ సందర్భమున నరకాసురునితో సత్యభామ యుద్ధము చేసినట్లు మనము తరచుగా వింటూ ఉంటాము. సత్యభామ నరకునితో యుద్ధము చేసినట్లు వ్యాస విరచితమైన సంస్కృత భాగవతమునందు లేదు. పోతన మహాశయుడు హరివంశము నుండి ఈ ఇతివృత్తమును గ్రహించి, అత్యంత వైభవముగా [illegible] చొప్పించినాడు. పోతనామాత్యుని ఈ ప్రయోగమును ముందుగా వివరించి [illegible] మూలము ననుసరించి కథను తెలిపెదను. గ్రహింపగలరు.

నరకాసురుని గాంచగానే సత్యభామ క్రోధోద్రిక్తయై, రోషముతో శరం విడిచెను. శ్రీకృష్ణుడు ఆశ్చర్యముతో సత్యభామను గాంచి

క॥ లేమా దనుజుల గెలువఁగ, లేమా నీవేల కదఁగి లేచితి విటు రా
లే మాను మాన వేనా, లేమా విల్లందికొనుము లీలం గేలన్.

అంటూ తన బాణము నామెకు అందించెను. శ్రీకృష్ణు డందించిన బాణము నందు కొనిన సత్యభామ శృంగార వీర రౌద్ర రసాలను కలియబోసుకొని శోభించ సాగినది. ఇచ్చట అతి రమ్యమైన పోతనామాత్యుని కవితా మాధుర్యమును చవిచూడుడు.

సీ॥ వీణెఁ జక్కఁగఁ బట్ట నెర వెఱుంగని కొమ్మ బాణాసనం బెట్లు పట్టనేర్చె
మ్రాకువఁ దీగెఁ గూర్పంగనేరని లేమ గుణము వే క్రియ ధనుఃకోటి గూర్చె
సరవి ముత్యము గ్రువ్వఁజాలని యబల యే నిపుణత సంధించె విశిఖశరము
చిలుకకుఁ బద్యంబు చెప్పనేరని తన్వి యస్త్రమంత్రము లెన్నఁ డభ్యసించెఁ
ఆ॥ బలుకు మనినఁ బెక్కు పలుకని ముగుద యే గతి నొనర్చె సింహగర్జనములు
వనఁగ మెఱసెఁ ద్రిజగదభిరామ గుణధామ చారుసత్యభామ సత్యభామ.

సత్యభామ భయంకరముగా పోరుచుండగా నరకాసురుని సైన్యము తీవ్రముగా నష్టపోయినది. శ్రీకృష్ణు డదిగాంచి సత్యభామను శ్లాఘించెను.

క॥ కొమ్మా దానవనాథుని కొ మ్మాహవమునకుఁ దొలఁగె గురువిజయము నై
కొమ్మా మెచ్చితి నిచ్చెదఁ గొ మ్మాభరణములు నీవు గోరిన వెల్లన్.

అని శ్రీకృష్ణుడు పలికెను. ఇది గాంచిన నరకాసురుడు పరుషవాక్యములతో శ్రీకృష్ణుని ఉద్రేక పరచెను.

క॥ మగువ మగవారిముందట మగతనములు సూప, రణము మానుట నీకున్
మగతనము గాదు, దనుజులు మగువల దెసఁ జనరు, మగల మగ లగుట హరీ!

అని నరకాసురుడు శ్రీకృష్ణు నుద్దేశించి పలికెను. శ్రీకృష్ణుడు యుద్ధమునకు సిద్ధమాయెను. నరకుడు, అతని సేనలు ప్రయోగించు అస్త్రములను ముక్కలు చేసెను. చివరగా నరకుడు శూలమును చేబూని శ్రీకృష్ణుని వధించ బోవగా శ్రీకృష్ణుడు, నరకుడు దానిని ప్రయోగింపక ముందే చక్రము నుపయోగించి అతని శిరమును ఖండించెను. దేవతలది గాంచి శ్రీకృష్ణునిపై పుష్పవృష్టిని కురిపించిరి. నరకాసురుడు మరణించగనే భూమాత అదితి యొక్క కుండలములను, వరుణుని ఛత్రమును, మణిపర్వతమును, వైజయంతిని, వనమాలను శ్రీకృష్ణునకు సమర్పించి, తదుపరి చేతులు జోడించి, అచ్యుతుని ఇలా ప్రార్థించినది.

సీ॥ అంభోజనాభున కంభోజనేత్రున కంభోజమాలాసమన్వితునకు
నంభోజపదున కనంతశక్తికి వాసు దేవునకును దేవదేవునకును
భక్తులు గోరిన భంగి వేరూపైనఁ బొందువానికి నాది పురుషునకును
నఖిలనిదానమై యాపూర్ణవిజ్ఞానుఁ డైనవానికిఁ బరమాత్మునకును
ఆ॥ ధాతఁ గన్న మేటి తండ్రికి నజునికి, నీకు వందనంబు నే నొనర్తు
నఖిలభూతరూప నిరుపమ యూశ పరావరాత్మ మహిత యమితచరిత!

అని భూదేవి శ్రీకృష్ణుని స్తుతించెను. ఆ నాడే మనము దీపావళి పండుగను జరుపుకొనుచుందుము.

అచ్యుతుడు భూదేవి నాశీర్వదించి, నరకాసురుని గృహమును తిలకించెను. నరకాసురుడు గొనితెచ్చి బంధించిన పదునారువేల యువతులను గాంచెను. ఆ స్త్రీలు శ్రీకృష్ణుని గాంచి అతడు దైవము పంపిన భర్తగా భావించిరి. అతడు తమకు భర్త కావలెనని భగవంతుని ప్రార్థించిరి. వారి నందరిని అచ్యుతుడు పరిగ్రహించి ద్వారకకు పంపెను. వారితోపాటు నరకాసురుని ఐశ్వర్యమును, అశ్వరథాదులను కూడా పంపెను.

శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై సురలోకమున కేగి అదితికి కుండలముల నొసంగెను. ఇంద్రుడు, శచీదేవి శ్రీకృష్ణుని పూజించిరి. ఆ తరువాత నందనవనంలో ప్రవేశించిరి. అక్కడయున్న పారిజాత వృక్షమును సత్యభామ వాంఛించెను. శ్రీకృష్ణుడు ఆ వృక్షమును పెకలించి ద్వారకకు పంపే ప్రయత్నములో యుండగా దేవతలు, ఇంద్రుడు ప్రతిఘటించిరి. శ్రీకృష్ణుడు వారి నోడించి సత్యభామ కోర్కెను నెరవేర్చెను. సత్యభామ ఇంటికడ వనములో దానిని నాటించెను.

యయాచ ఆనమ్య కిరీట కోటిభిః, పాదౌ స్పృశన్నచ్యుత మర్థ సాధనమ్
సిద్ధార్థ ఏతేన విగృహ్యతే మహాన్, అహో సురాణాం చ తమో ధిగాఢ్యతామ్ ॥

"నరకాసురుని వధించమని ఇంద్రుడు ప్రథమంగా తన కిరీటముతో శ్రీకృష్ణుని దివ్యచరణములను స్పృశించి ప్రార్థించెను. పని పూర్తికాగా బుద్ధిగల వాడయ్యును ఆ పరమాత్మతో కయ్యమునకు సిద్ధమాయెను. ఇట్టి తామసిక ప్రవృత్తి దేవతలను కూడా వదలదా?" అని ఈ సందర్భమున వ్యాసభగవానుడు చమత్కరించెను.

సంపద మనిషిని అంధునిగా మార్చును. ఐశ్వర్యమద మావరించినపుడు మనుజుడు భగవంతుని కూడా లక్ష్యపెట్టడు.

పారిజాత వృక్షమును ద్వారకకు గొనితెచ్చిన శ్రీకృష్ణుడు నరకాసురుని వద్దనుండి గొనితెచ్చిన పదునారువేల నారీమణులను ఒకేకాలమున వేరు వేరు గృహములలో పదునారువేల రూపములను ధరించి పరిణయ మాడెను. వారందరిని శ్రీకృష్ణుడు సమానముగా వీక్షించుచుండెను.

లక్ష్మీ స్వరూపిణులగు ఆ భామలు శ్రీకృష్ణుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించు చుండిరి. వారికి అనేకమంది దాసీజన మున్నను స్వయముగా వారే శ్రీకృష్ణునకు సమస్త సేవ లొనర్చుచుండిరి.

రుక్మిణీకృష్ణుల ప్రణయ రహస్యములు

ఒకనాడు శ్రీకృష్ణుడు రుక్మిణీదేవి మందిరమున శయనించి యుండెను. సఖులతో కూడి రుక్మిణీదేవి చామరములను విసరుచు అచ్యుతునికి సేవ చేయుచుండెను. శ్రీకృష్ణుడు పరమాత్మ. అతనిది అభేద దృష్టి. సఖులందరిని సమాన ప్రేమతో వీక్షించును. కానీ కృష్ణమాయ వర్ణింప శక్యము కానిది. సఖులలో ప్రతి ఒక్కరు శ్రీకృష్ణుడు తన వద్దనే యున్నట్లు తృప్తి చెందెడివారు.

శా॥ నన్నే పాయఁడు రాత్రులన్ దివములన్ నన్నే కృపంజెందెడిన్
నన్నే రొద్దుఁగజూచు వల్లభలలో నాథుండు నా యింటనే
యున్నాడంచు బదారువేలు దమలో మోహించి సేవించి రా
యున్నల్ గాఢపతివ్రతాత్వపరిచర్యాభక్తియోగంబులన్.

ఈ విధమైన అభిప్రాయము సఖులందరికీ యుండెడిది. కానీ రుక్మిణీదేవిలో నాను పట్టపురాణి ననెడి అహంకారము కలిగెను. భగవంతునికి సేవచేయు సందర్భములలో ఇలాంటి ఆలోచనలు అనర్థదాయకములు. భగవత్సేవలో చిత్తము సంపూర్ణముగా నిమగ్నమై యుండవలెను.

కొందరు పూజాగదిలో కూర్చొని, చైటనున్న ఇతరుల గుర్తింపును అభిలషిస్తూ మంత్రములను గొంతుపోయేటట్లు ఉచ్చరిస్తుంటారు. మరికొందరు నామసంకీర్తన చేయుచూ అన్యులు తమను ప్రశంసించుచున్నారా లేదా యని బిచ్చగాడు గృహిణి వంక భిక్షమును వాంఛిస్తూ చూసినట్లు చూచుచుందురు. కొందరు ఇంటిముందు వరండాలో కూర్చొని పారాయణ సాగిస్తుంటారు. కానీ వారి చిత్తము బజారులో పచార్లు చేస్తుంటుంది. ఈ విధమైన భక్తి నిరర్థకము. నిరుపయోగము.

రుక్మిణీదేవి మనస్సులో చరించే వికారములను శ్రీకృష్ణుడు గ్రహించినాడు. ఆమెకు కనువిప్పు కల్గించ సంకల్పించాడు. రుక్మిణీదేవితో ఈ క్రింది విధముగా పలికినాడు:

“రాకుమారీ! నిన్ను జూచినచో నాకు జాలిగాయున్నది. గొప్ప ఐశ్వర్య వంతులు, ప్రతిభావంతులు, సౌందర్యవంతులగు ఎందరో రాజులు నిన్ను పరిణయమాడుటకు పూర్వము ప్రయత్నించిరి. నీ సోదరుడగు రుక్మి మరియు నీ బంధువులు శిశుపాలాది మహారాజులతో నీ వివాహమును జరిపించవలె నని సంకల్పించిరి. అలాంటి వారందరినీ విడచి నీకు ఏ విధముగాను సరిపోని నన్ను ఎలా వరించితివి?

నీవు రాజపుత్రికవు. నేను యాదవుడను. నీవు ఎఱ్ఱగా నుందువు. నేను నల్లనివాడను. జరాసంధునికి భయపడి మేము సాగరమున వసించుచున్నాము. అలాంటి మా వలన నీ

కేమి సుఖపడగలదు? ఐశ్వర్యము నందును, అందము నందును, వంశము నందును, ఆర్థికము నందును నేను నీకు సాటి యగువాడను గాను. రుక్మిణీ! నీవు అవివేకముతో ఆలోచించినదానవై నన్ను వరించితివి. భిక్షకులచే స్తుతించబడువారము, గుణహీనులమైన మమ్ము భర్తగా పొందితివి.

“ఇప్పటికైనను మించి పోయింది లేదు. నీకు తగిన క్షత్రియ వరుని ప్రేమించి భర్తగా స్వీకరింపుము. దానివలన నీకు ఇహపర శుభములు కలుగును. నీ వారందరు నన్ను ద్వేషించు చున్నారు. అట్టి నావలన నీవేమి సుఖపడగలవు?” అని శ్రీకృష్ణుడు పలికెను.

ఏతావదుక్త్వా భగవానాత్మానం వల్లభామివ
మన్యమానామ విశ్లేషాత్ తద్దర్పఘ్న ఉపారమత్

తాను సపత్నుల కంటెను భర్తకు ఎక్కువగా ప్రియమైనది యని రుక్మిణీ దర్పముతో నుండెను. ఆమె గర్వము నణచుటకు భగవానుడు ఈ విధముగా పలికెను అని శ్రీశుకులవారు పరీక్షిన్మహారాజుతో చెప్పెను.

శ్రీకృష్ణుని మాటల నాలకించిన రుక్మిణి భయాందోళనలకు గురి అయ్యెను. శ్రీకృష్ణుడు తనను వదలి పెట్టునేమో యని దిగులు చెందినదియై దుఃఖించుచుండెను. నేత్రముల వెంట బాష్పములు రాలుచుండెను.

సీ॥ కాటుక నెఱయంగఁ గన్నీరు వరదలై కుచకుంభయుగళ కుంకుమము దడియ
నిడుపక వెడలెడు వేఁడినిట్టూర్పుల లాలితాధరకిసలయము గందఁ
దెలువంబు వెటి దప్పి చిన్నఁబోవుచు నున్న పదారవిందంబు వాఁడుఁగోఁ
మారుతాహతిఁ దూలు మహిత కల్పకవల్లి వడువున మేన్ వడవడ వడంకఁ
తే॥ చిత్తమెఱియంగఁ జెక్కిటఁ జేయి సేర్చి కౌతుకం బేది పదతలాగ్రమున నేల
వ్రాసి పెంపుచు మో మరవాంచి వగలఁ బొందె మవ్వంబు గందిన పువ్వుఁ బోలె

ఆమె చేతినుండి చామరము జారి క్రిందపడెను. దేహము కట్టెవలె స్తంభించెను. గాలికిపడిన అరటిచెట్టువలె ఆమె క్రిందపడి మూర్ఛనందెను.

అది గాంచి శ్రీకృష్ణుని హృదయము ద్రవించెను. ఆమెను లేవనెత్తి ఆమె ముఖమును తుడిచి, ఆమెను ఆలింగన మొనర్చుకొని ఇలా పలికెను:

“రుక్మిణీ! నాపై కోపగింపకుము. నీ అనన్య ప్రేమానురాగములు నాకు తెలియును. కానీ నీ ప్రేమను నీ పలుకుల ద్వారా వినగోరి నేను ఆ విధముగా భాషించి పరిహసించితిని’ అనెను. ఆ మాటల నాలకించిన రుక్మిణి మనస్సు కుదుటపడెను. చిరునవ్వును చిందించుచూ రుక్మిణి శ్రీకృష్ణునితో ఈ విధముగా పలికెను:

“కమల నయనా! మీరు పలికినట్లుగా నేను మీకు యోగ్యురాలను కాను. నీవు సర్వేశ్వరుడవు. గుణరహితుడవు. నేను గుణసహితను. సామాన్య మానవ మాత్రురాలను.

"రాజుల భయముచే నీవు అగాధమగు సముద్రములో వసించు చున్నట్లు పలికితివి. అదియును యథార్థమే. శుద్ధచైతన్య రూపుడవైన నీవు విషయప్రపంచము నందు ఆసక్తి లేనివాడవై జీవుల హృదయగుహ యనెడి అగాధ సాగరమునందు వసించుచున్నావు.

"నైగా రాజసింహాసనములను మేము త్యజించితిమి అని పలికినావు. అది కూడా వాస్తవమే. అనిత్యమైన ఈ లౌకిక సంపదలను నిన్ను శరణుగోరిన భక్తులే త్యజించు చుండగా నీవు త్యజించుటలో విచిత్ర మేమున్నది?

"జగన్నాథా! నిన్ను ధ్యానించుటకై అంగరాజు, పృథుమహారాజు, భరతుడు, యయాతి, గయుడు మున్నగు రాజులు రాజ్యములను త్యజించి వనముల కేగిరి గదా! నీ చరణ వైభవము ముందు సమస్త సంపదలు తుచ్ఛములని గ్రహించుటచే కదా వారి చర్యకు కారణమైనది.

మ॥ విమల జ్ఞాననిరూఢులైన జనముల్ వీక్షింప మీపాద కం
జ మరందస్ఫుట దివ్యసౌరభము నాస్వాదించి నిర్వాణ రూ
పము సత్పూరుషవాగుదీరితము శోభా శ్రీనివాసంబు నా
మిము సేవింపక మానవాధముని దుర్మేధాత్మ సేవింతురే!

"ప్రభూ! అందుచేతనే నీ పాదపద్మములను నేను ఆశ్రయించితిని. జన్మ జన్మలకు మీ చరణపంకజములే నాకు శరణ్యమగు గాక! నేను మీకు రాణినిగాను, మీకు దాసిని మాత్రమే" యనెను.

బుధజనులారా! ఇక్కడ ఒక్క విషయమును మనము శ్రద్ధగా గ్రహింపవలెను. మొదట రుక్మిణి దర్పములో వర్తించినపుడు "నేను నీకు తగని వాడను" అని శ్రీకృష్ణుడు పలికెను. ఇప్పుడు ఆమె అహంకారము అదృశ్యము కాగానే, "స్వామి! నేను మీకు తగినదానను గాను" అని రుక్మిణి పలికెను.

అహంకారమే సర్వ అనర్థములకు నెలవని తెలియుచున్నది గదా! అహంకారము నశించినపుడే భగవత్కృపకు పాత్రులము కాగలము. అహంకారము ఆధ్యాత్మికాభివృద్ధికి అవరోధము.

రుక్మిణి వచనముల నాలకించి సంతృప్తి చెందిన వాసుదేవుడు ఆమెతో "సాధ్వీ! నీ నుండి ఈ విధమైన పలుకులను వినగోరియే నేనలా ప్రవర్తించితిని. నా విషయము పట్ల నీవు పలికిన దంతయు వాస్తవమే. నీవు పతివ్రతామణివి. నిర్మల ధర్మ వివేకశీలవు.

ఉపలబ్ధం పతిప్రేమ పాతివ్రత్యం చ తేఽనఘే
యద్వాక్యైశ్చాల్య మానాయా న ధీర్మయ్యపకర్షితా!

"సుశీలా! నేను నా వచనములచే నీ మనస్సు చలింపచేయ బూనినను నీ బుద్ధి నా నుండి దూరము కాలేదు. నీ పతిప్రేమ, పాతివ్రత్యధర్మము ఇచ్చుట చక్కగా తెలియుచున్నవి.

"రుక్మిణీ! సర్వేశ్వరుడవగు నన్ను అర్చించుచు విషయసుఖముల వాంఛించువారు మందభాగ్యులు. వారు ఉత్తమ జన్మములనే పొందలేరు. ఇక ముక్తి విషయము వేరుగా చెప్పవలెనా!

"నీవు నన్ను అతి గాఢముగా ప్రాణతుల్యముగా ప్రేమించితివి. నా వద్దకు దూతను పంపితివి. నేను వచ్చుట ఆలస్యము కాగా నీ దేహమునే త్యజించుటకు సిద్ధపడితివి సాధ్వీ! ఇట్టి నీ అమోఘమైన ప్రేమకు నేను ఋణపడి యున్నాను" అని శ్రీకృష్ణుడు పలికెను.

గృహస్థాశ్రమము నందు భార్యాభర్తలు అన్యోన్య దివ్యప్రేమను కలిగి యుండవలసినదియే గాని విషయాసక్తిని కలిగియుండరాదు. పరమాత్మను పొందుటకు గృహస్థాశ్రమము చక్కని రాజమార్గమై యున్నది. దానిని సద్వినియోగము గావించుకొనుట గృహస్థుల ముఖ్యకర్తవ్యమై యున్నది.

విషయాసక్తులు, అహంకారులు పరమాత్మను పొందలేరు. నిర్విషయానంద చిత్తులు, నిరహంకారులను పరమాత్మయే వెంబడించి అనుగ్రహించును.

అనిరుద్ధుని వివాహము - రుక్మి మరణము

శ్రీకృష్ణుని పత్నులు ఒక్కొక్కరు సుగుణవంతులైన పదుగురు పుత్రులను గనిరి. శ్రీకృష్ణుడు పత్ను లందరిపై సమానమైన ప్రేమనే చూపుచూ మోహరహితుడై యుండెను. కృష్ణుని పుత్రులకు పుత్రులు, పౌత్రులు కలిగిరి.

రుక్మిణి సోదరుడైన రుక్మికి రుక్మవతి యనెడి పుత్రిక యుండెను. రుక్మిణి కుమారుడైన ప్రద్యుమ్నుడు ఆమెచే వరింపబడి, తనపై యుద్ధము చేయుటకు అరుదెంచిన రాజులను ఓడించి, ఆమెను అపహరించెను.

రుక్మికి శ్రీకృష్ణునిపై శత్రుభావమున్నను సోదరియగు రుక్మిణిని సంతోష పరచుటకు రుక్మవతిని ప్రద్యుమ్నున కిచ్చెను. ప్రద్యుమ్నుని వలన రుక్మవతికి ఒక పిల్లవాడు కలిగెను. అతడే అనిరుద్ధుడు.

అనిరుద్ధుడు పెరిగి పెద్దవాడయ్యెను. తన సోదరికి ఆనందము నొసగూర్చుటకు రుక్మి తన మనుమరాలిని అనిరుద్ధున కిచ్చెను. భోజకట మహానగరమున వివాహము వైభవముగా జరిగెను.

వివాహానంతరము కళింగ రాజుల ప్రోత్సాహముతో రుక్మి బలరామునితో పాచిక లాడుట కుపక్రమించెను. ఆటలో బలరాముడు ఓడిపోవుచుండెను. రాజులందరు బలరాముని హేళన చేయసాగిరి. అది బలరాముడు భరించలేకపోయెను.

తరువాత బలరాముడు గెలిచెను. రుక్మి ఓడిపోయెను. కానీ రుక్మి వితండమును సాగించుచూ విజయము తనదే నని ప్రకటించెను. ఇంతలో బలరాముడే గెలిచినట్లు ఆకాశవాణి అమరవాణిని వినిపించెను.

రుక్మి ఆకాశవాణి పలుకులను లక్ష్యపెట్టలేదు. బలరాముని యెగతాళి చేయసాగెను. "మీరు గోపాలురు. గోవులను మేపుట యందే మీకు నైపుణ్యముండును. పాచికలాడుట, బాణములను ప్రయోగించుట మున్నగు కార్యములు రాజులకే సాధ్యములు" అని రుక్మి బలరాముని హేళన చేయుచుండగా కళింగ రాజులు శ్రుతి కలిపి నవ్వసాగిరి. ఈ అవమానమును భరించలేని బలరాముడు గొడ్డలిని చేబూని రుక్మిని కళ్యాణ మండపము వద్దనే వధించెను. పరిహసించిన కళింగరాజు పారిపోవుచుండెను. అతనిని పట్టుకొని దంతములను తొలగించెను.

క॥ భూవర పద్మాక్షుఁడు దన బావ హతుం డగుట గనియుఁ బలుకక యుండెన్
భావమున రుక్మిణీబల దేవుల కే మనఁగ నెగ్గుదేఁగునొ యనుచున్.

తరువాత శ్రీకృష్ణుడు, బలరాముడు యాదవులతోగూడి వధూవరులను వెంటబెట్టుకొని భోజకట నగరము నుండి ద్వారకకు బయలుదేరి వెళ్ళిరి.

ద్యూతము ఎవ్వరికిని శ్రేయస్కరము కాదు. అదియునుగాక అవహేళన చేయుట అనర్థదాయక మనియు, పరులను మోసగించుట వలన మోసపడుసది మనమే నని గ్రహించాలి. అసత్యపరుల బ్రతుకులు ఎప్పుడైనా అధ్వానములే.

ఉషాపరిణయం

మహాత్ముడగు బలిచక్రవర్తికి నూరుగురు పుత్రులు గలరు. వారిలో బాణాసురుడు పెద్దవాడు. అతడు గొప్ప శివభక్తుడు. అతడు శోణిత పురమును పాలించుచుండెను.

ఒకనాడు బాణాసురుడు శివదర్శనమునకై కైలాసమున కేగెను. ఆ సమయానికి శివుడు ఆనందతాండవ నృత్యమును చేయుచుండెను. అదిగాంచి తన వేయి చేతులతో వివిధ వాయిద్యములను మ్రోగించి శివుని సంతృప్తి పరచెను. సంతుష్టి చెందిన శంకరుడు ఏమి వరము కావలెనో చెప్పుమనెను. అంతట బాణాసురుడు

ఉ॥ దేవ మదీయవాంఛితము 'తేటపడ న్నిటు విన్నవించెదన్
నీవును వద్రివందనయు నెమ్మని నాపురికోటవాకిటం
గావలియుండి నన్నుఁ గృప గావుము భక్తఫలప్రదాత యో
భావభవారి నీ చరణపద్మము లెప్పుడు నాశ్రయించెదన్.

పరమేశ్వరుని తన నగరమునకు రక్షణము కల్పిస్తూ తనతోనే యుండవలెనని కోరెను. పరమశివుడు ఉమాసహితుడై శివగణములతో గూడి శోణిత పురమును చేరెను.

ఒకనాడు బాణాసురుడు శివుని సమీపించి "మహేశ్వరా! వందనములు. ఈ ముల్లోకము లందును నీవు తప్ప నన్నెదిరించు వారెవ్వరు లేరు. కానీ నీవు నా కొసంగిన ఈ సహస్ర హస్తములు నాకు చాలా భారముగా యున్నవి" అనెను.

ఆ మాటల నాలకించిన పరమశివుడు కుపితుడై బాణాసురునితో

మ॥ వినుమూఢహృదయ నీ కే తనమెప్పు డకారణంబధారుణిపైఁగూ
లును నపుడ నీభుజావలి, తునియఁగ నాయంతవానితోనని గల్గున్

"మూఢుడా! ఏ సమయమున ఏ కేతనము విరిగిపోవునో ఆనాడు నాతో సమానుడైన పురుషునితో నీకు సమరము సంభవించును. దానితో నీ గర్వమంతయు అణగిపోవును" అని పలికెను. బాణాసురుడు ఆ సమయమునకై నిరీక్షించుచుండెను.

బాణాసురునికి "ఉష" యనెడి పుత్రిక గలదు. ఆమె ఒకనాడు స్వప్నమున ప్రద్యుమ్నుని కుమారుడైన అనిరుద్ధుని గాంచెను. ఆ కారణంగా ఆమె మనస్సు అతని మీద లగ్నమాయెను.

ఒకనాడు "హా, ప్రియుడా! ఎచ్చట నుంటివి?" అని కలవరిస్తూ ఉష మేల్కొనెను. ఆ సమయానికి పరివృతులైయున్న సఖులను గాంచి సిగ్గు చెందెను.

బాణాసురుని మంత్రియగు కుంభాండుని కుమార్తె చిత్రలేఖకూడా ఆ సఖులలో ప్రముఖురాలై యుండెను.

"రాజకుమారీ! నేను ఇంతవరకు ఏ పురుషునితోను నీ స్నేహమును గాంచలేదు. ఇప్పుడు నీవు కలవరించిన పురుషుడెవరు?" అని చిత్రలేఖ ఉషను ప్రశ్నించినది.

ఉష చిత్రలేఖ నుద్దేశించి, "సఖీ! నేను స్వప్నమున మనోహరుడగు ఒక పురుషుని గాంచితిని. అతనిపై నా మనస్సు మరులు గొనినది. అతడు నాకు స్వప్నమున అధరామృతమును మాత్రమే యొసంగి వెళ్ళినాడు. నన్ను బాధాప్రపంచానికి ఆహుతి చేసినాడు" అని పలికినది.

రాజకుమారి మనస్సు నెరింగిన చిత్రలేఖ ఆమెను బాధ పడవద్దని వారించి, ఎందరో పురుషుల చిత్రపటములను చిత్రించి చూపించినది. అందులో అనిరుద్ధుని చిత్రపటము కూడా గోచరించినది. దానిని చూడగనే ఉష సిగ్గుతో తలదించుకొనినది.

చిత్రలేఖ యోగబల సంపన్నురాలు. ఉషను కలవరపరచిన పురుషుడు శ్రీకృష్ణుని మనుమడగు అనిరుద్ధుడు అని గ్రహించినది. అతనిని గొనితెచ్చుటకు ఆకాశమార్గమున ద్వారకకు వెడలినది. నిద్రించుచున్న అనిరుద్ధుని యోగబలముచే అమాంతంగా ఎత్తుకొని వచ్చి, రాజకుమారి యగు ఉషకు చూపినది. ఆనాటినుండి తన రహస్యమందిరమున అనిరుద్ధునితో కలసి ఉష విహరించుచుండెను. ఉషయొక్క పొందులో అనిరుద్ధుడు దివారాత్రములను కూడా మరచెను.

ఉషయొక్క దేహమున తెలియు సురత చిహ్నములను గాంచిన అంతఃపుర రక్షకులు ఆమె ప్రవర్తనను శంకించినవారై, ఆ విషయమును బాణాసురునితో చెప్పిరి. కలతచెందిన మనస్సుతో బాణాసురుడు ఉషయుండు గదికెళ్ళి చూసెను. అచ్చట అనిరుద్ధుడు ఉషతో పాచికలాడుటను గాంచెను.

బాణాసురుని భటులు అనిరుద్ధుని బంధించుటకు వచ్చుచుండిరి. అతడు భటులను దండధరునివలె ఎదుర్కొని వధించెను. అనిరుద్ధుని చేతిలో చాలామంది భటులు హతులైరి. మిగిలినవారు భయపడి పారిపోయిరి.

ఇది గాంచిన బాణాసురుడు తీవ్రకోపమునకు గురియైనాడు. అనిరుద్ధుని నాగపాశముతో బంధించినాడు. ఈ విషయమును గాంచి ఉష కన్నీరుమున్నీరుగా ఏడ్వసాగెను.

అనిరుద్ధుని జాడతెలియక ద్వారకలో యాదవులందరు తీవ్రముగా వ్యధ చెందుచుండిరి. ఆ సమయమునకు నారదమహర్షి అచ్చటి కరుదెంచి, జరిగిన విషయము నంతటిని వివరించెను.

అనిరుద్ధుడు బంధింపబడియున్నా డనే వార్త చెవిని పడగానే యాదవసైన్యమును వెంటబెట్టుకొని బలరామకృష్ణులు శోణితపురమునకు బయలుదేరిరి. నలువైపుల నుండి శోణితపురమును ముట్టడించిరి.

బాణాసురుడు సైన్యమును వెంటబెట్టుకొని ఎదురొడ్డుటకు బయలుదేరెను. నగర రక్షకుడుగా యున్న మహేశ్వరుడు నందీశ్వరునిపై నెక్కి, సుబ్రహ్మణ్యస్వామి, శివగణములు వెంటనడువగా యుద్ధమునకై బయలుదేరెను.

శ్రీకృష్ణుడు ఈశ్వరునితోను, ప్రద్యుమ్నుడు కార్తికేయునితోను యుద్ధము చేయసాగిరి. బలదేవుడు కుంభాండునితోను, సాత్యకి బాణునితోను పోరసాగిరి. యక్ష, సుర, సిద్ధ, గంధర్వాదులు ఆకసమున విమానములపై వేడుకగా వీక్షించసాగిరి.

వాసుదేవుడు శార్ఙమను ధనుస్సు నుండి విడువబడిన శరములచే శివసేనను తీవ్రముగా బాధించుచుండెను. శివుడు ప్రయోగించు బాణములకు చెదరక శ్రీకృష్ణుడు వానిని త్రిప్పికొట్టుచుండెను. బ్రహ్మాస్త్రమును బ్రహ్మాస్త్రముతోను, వాయువ్యాస్త్రమును పర్వతాస్త్రముతోను, ఆగ్నేయాస్త్రమును పర్జన్యాస్త్రముతోను, పాశుపతాస్త్రమును నారాయణాస్త్రముతోను ఎదుర్కొని వాటిని శాంతింప జేసెను. తరువాత జృంభణాస్త్రమును ప్రయోగించి శంకరుని మోహపరచి, బాణాసురుని సైన్యమును నాశనము గావించెను.

ప్రద్యుమ్నుని శరఘాతములకు తట్టుకొనలేక కార్తికేయుడు మయూరము నెక్కి రణరంగము నుండి పారిపోయెను. బలదేవునితో పోరలేక కుంభాండ కూపకర్ణులు రణరంగమున పడిరి.

తన సైన్యములు మృతిచెందుట జూచి కలతచెందిన బాణాసురుడు సాత్యకిని వదలి శ్రీకృష్ణుని వైపు పరుగిడెను. వేయిచేతులు గల బాణాసురుడు ఒకేసారి ఐదువందల ధనుస్సుల నెక్కుపెట్టి ఒక్కొక్క ధనుస్సు నుండి రెండు రెండుశరముల చొప్పున వదిలెను.

శ్రీకృష్ణుడు వెంటనే ఐదువందల ధనుస్సులను భగ్నమొనర్చెను. సారథిని వధించెను. అశ్వములను కూల్చివేసెను. రథమును శిథిల మొనర్చెను. శ్రీకృష్ణుడు పాంచజన్యమును పూరించెను.

బాణాసురుని తల్లియగు కోటర తన పుత్రుడు వధింపబడునేమో యని దిగులు చెందినదై, తల విరబోసుకొని వివస్త్రయై రణరంగమునకు వచ్చి పుత్రుని రక్షించుటకై శ్రీకృష్ణునికి ఎదురుగా నిలిచెను. నగ్నస్త్రీని చూచుట ధర్మముకాదని శ్రీకృష్ణుడు తలను ప్రక్కకు త్రిప్పుకొనెను. ఇదియే అదనుగా భావించిన బాణాసురుడు పరుగిడి నగరము లోనికి వెడలెను.

కొంతసమయ మాగి మరల బాణాసురుడు శ్రీకృష్ణునికడకు వచ్చి యుద్ధము చేయసాగెను. వివిధములైన అస్త్రములను శ్రీకృష్ణునిపై వర్షింపజేసెను. శ్రీకృష్ణుడు సుదర్శనచక్రము నుపయోగించి బాణాసురుని భుజములను వృక్షశాఖల వలె రాల్చెను. బాణాసురుని పరిస్థితి వీక్షించిన శంకరుడు వాసుదేవుని సమీపించి ఇట్లనెను:

"దేవా! నీవు సాక్షాత్తు పరబ్రహ్మవై యున్నావు. ధర్మరక్షణ కొరకు, విశ్వశాంతి కొరకు నీవు అవతరించితివి. నీవు తురీయుడవు. స్వప్రకాశుడవు.

అయం మమేష్టో దయితోఽనువర్తీ మయాభయం దత్త మముష్య దేవ
సంపాద్యతాం తద్భవతః ప్రసాదో యథా హితే దైత్య పతౌ ప్రసాదః

"దేవా! ఈ బాణాసురుడు నాకు ప్రియుడు. నా భక్తుడు. అందువలన రాక్షస రాజగు ప్రహ్లాదుని నీవు ఎలా అనుగ్రహించితివో, అలాగే వీనిని గూడా అనుగ్రహింపుము" అని ప్రార్థించెను.

"శంకరా! నేను నీ మాటను నెరవేర్చెదను. నేను ఇతనిని సంహరింపను. వీని అహంకారమును అణచుటకే నేను ఇతని భుజములను ఖండించితిని. ప్రస్తుతము ఇతనికి నాలుగు చేతులు మాత్రమే మిగిలియున్నవి. ఈ దైత్యుడు జరామరణ రహితుడై, నిర్భయుడై, నీ భక్తుల కోవలో చేరును" అని పలికెను.

బాణాసురుడు శిరము వంచి శ్రీకృష్ణునకు నమస్కరించెను. ఉషా అనిరుద్ధులను శ్రీకృష్ణునితోకూడా ద్వారకకు పంపెను.

ఉష అనగా జీవుడు. ఉష అనగా ఉషస్సు అని అర్థము. సూర్యోదయమునకు ఐదు ఘడియల ముందు ఉషఃకాలము అనబడును. ఉషఃకాలము ఐదుఘడియలు దాటగనే ఉదయకాలము వచ్చును. అదియే సూర్యోదయము.

పంచకోశములు అను ఐదు అవరోధములను దాటగనే జీవునిలో జ్ఞానోదయమగును.

అనిరుద్ధుడు అనగా అడ్డగింపబడనివాడు అని అర్థము. సర్వస్వతంత్రుడు అని భావము. అనిరుద్ధుని ఉష స్వప్నములో దర్శించినట్లు, దేవుని జీవుడు అంతర్యములో దర్శించుకొనును.

జీవబ్రహ్మలను ఏకము చేయు మహితాత్ముడే సద్గురువు. అతడు సాధకుని మనస్సులోని ఆర్తతను తీర్చును. అట్టి గురువే చిత్రలేఖ. లేఖ ద్వారా విషయములను ఎవరైన తెలుసుకొనునట్లు గురువు ద్వారా భగవానుని వైభవములను తెలిసికొందుము. విచిత్రమైన రీతులలో పరమాత్మను హృదయములో నింపునదియే గురువనెడి

చిత్రలేఖ. అందుచేత తనదైన ఒక అపూర్వ పద్ధతిలో చిత్రలేఖ యనెడి గురువు పరమాత్మ యనెడి అనిరుద్ధుని జీవుడనెడి ఉషకు అందించెను.

శిష్యుని ఉద్ధరించుటకు గురుదేవునకు అనేక మార్గములుండును. కొందరు గురువులు స్పర్శ లేదా బోధ ద్వారాను, మరి కొందరు దృష్టి ద్వారాను, ఇంక కొందరు సంకల్పము ద్వారాను శిష్యులను తరింపజేయుదురు.

కోడి గ్రుడ్లపై నెక్కి కూర్చుని పొదుగును. చేప తన గ్రుడ్లను వీక్షించినచో అవి పిల్లలగును. కానీ తాబేలు తన గ్రుడ్లను గూర్చి సహజాత ప్రేరితమై సంకల్పించగనే అవి పిల్లలగును. ఈ విధముగా శాస్త్రము గురు సనుగ్రహము పనిచేయు విధము తెలియజేసినది.

అందుచేత గురువనే చిత్రలేఖ తనదైన ఒక పద్ధతిలో అనిరుద్ధుడగు పరమాత్మను ఉషయనెడి జీవునకు అందించుట జరిగినది. ఉష అనిరుద్ధుని తన రహస్యమందిరమున దర్శించుచుండెను. జీవుడు కూడా పరమాత్మను రహస్య ప్రదేశమైన తన హృదయము నందే దర్శింపవలెను.

సాధకుడు పరమాత్మలో హృదయమునందు రమించుచుండును. కాని విషయవాసనలు ఆ స్థితిని సహించవు. సాధనను ఆటంక పరచును. ఆత్మానందమును ఆటంకపరచు విషయవాసనలే నగర రక్షకులు. వారు బాణాసురుడనే భ్రాంతిని కొనితెచ్చి జీవుని ఆనందమును భంగపరుచుదురు.

దూరమైన అనిరుద్ధుని కొరకై ఉష తీవ్రముగా విలపించెను. హృదయములో పరమాత్మ అదృశ్యంకాగానే సాధకుడు తీవ్రముగా వ్యథ చెందును. ఇదియే పరమ విరహాసక్తి యనెడి ఉత్తమభక్తి. ఈ భక్తి కదలినచో దైవానుగ్రహం తోడై సాధకుని ఆశీర్వదించి బ్రహ్మానుభూతిని అందించును. శ్రీకృష్ణుని అనుగ్రహముచే ఉషాఅనిరుద్ధులు ఒకటైరి. దైవానుగ్రహము భ్రాంతియనెడి వేయిచేతుల బాణాసురుని చెదరగొట్టి జీవుడనెడి ఉషకు బ్రహ్మయనెడి అనిరుద్ధునకు సమాగమము నేర్పరుచును. ఇదియే ఉషా అనిరుద్ధుల వివాహము వెనుక దాగియున్న ఆధ్యాత్మిక శిల్ప సౌందర్యము.

ధియం హి లీయతే బ్రహ్మ సోఽమృతత్వాయ కల్పతే

"ఎవని బుద్ధి పరబ్రహ్మము నందు లయించునో అతడు అమృతత్వమును పొందును" అని బ్రహ్మవిద్యోపనిషత్తు పలికినది.

నృగమహారాజు చరిత్రము

ఇక్ష్వాకు తనయుడైన నృగమహారాజు గొప్ప ధర్మాత్ముడు. అతడెన్నో గో, భూ, సువర్ణ, గృహదానములను చేసెను. దానశీలురను ప్రస్తావించునపుడు నృగరాజును కూడా చెప్పుచుందురు.

నృగరాజు చేసిన గోదాన విశేషము భాగవతము నందు స్పష్టముగా తెలుపబడినది.

యావత్యః సికతా భూమే ర్యావత్యో దివి తారకాః
యావత్యో వర్ష ధారాశ్చ తావతీరదదం స్మ గాః

"భూమియందు ఎన్ని ఇసుకరేణువు లున్నవో, ఆకాశమునందు ఎన్ని నక్షత్రము లున్నవో, గగనమున ఎన్ని వర్షధారలున్నవో అన్ని గోవులను నేను దానము చేయుగలిగితిని" అని నృగమహారాజుయే చెప్పియున్నాడు.

ఒకనాడు ఒక బ్రాహ్మణుడు దాన మడుగగా నృగమహారాజు అతనికి కొన్ని ధేనువులను దాన మొసంగెను. ఆ ధేనువులనుండి కొంతకాలమునకు ఒక ధేనువు పారిపోయి వచ్చి, రాజుగారి ధేనువులలో కలిసినది. ఈ విషయము రాజుగారికి తెలియదు. ఆ ధేనువుని మరియొక బ్రాహ్మణునికి రాజుగారు దాన మొసంగెను.

బ్రాహ్మణుడు ఆ గోవును తీసుకొని వెడలుచుండగా పూర్వము దానమును గ్రహించిన బ్రాహ్మణుడు తన ధేనువును గుర్తుపట్టి "ఇది నాది" యనెను. "కాదు, ఇది నాదియే. నృగమహారాజు నాకు దాన మొసంగినాడు" అని రెండవవాడు పలికెను. వారిరువురు వాదులాడుకొని న్యాయనిర్ణయమునకై నృగమహారాజు వద్దకు వచ్చిరి.

పుణ్యాత్ముడైన నృగమహారాజు తెలియక చేసిన తప్పిదమునకు ఎంతగానో కలత చెందెను. నృగమహారాజు బ్రాహ్మణులకు చేతులెత్తి నమస్కరించెను. తాను తెలియక ఈ తప్పిదము చేసితినని చెప్పి, ఆ ధేనువుకు బదులుగా లక్ష గోవుల నిచ్చెదనని మొదటివానితో అనెను. అతడు క్రుద్ధుడై, పౌరుషములో "నాకు వలదు" అని చెప్పి వెళ్ళిపోయెను.

రాజుగారు రెండవ బ్రాహ్మణునితో, "అయ్యా! మీకు లక్ష ధేనువుల నిచ్చెదను. మీరు ఆ గోవుని త్యజింపుడు" అని అభ్యర్థించెను. అతడు కూడా అంగీకరించక వెడలిపోయెను. పౌరుషమునకు బానిసలైన బ్రాహ్మణులు పుణ్య పురుషుడైన నృగమహారాజును బాధించిరి. తెలియక చేసిన తప్పిదమునకు రాజెంతగానో వ్యథ చెందెను.

పంతాలు, పట్టింపులు గలవారు తమ బ్రతుకులను పాడుచేసుకొనుటయేగాక అన్యుల హృదయాలను కూడా కలత పెట్టుదురు. అమృత ఘడియలను విషతుల్యముగా మార్చుకొందురు. అందుచేత ఆధ్యాత్మిక సాధకులు పంతాలకు పోరాదు. పౌరుషములను విడనాడవలెను.

అద్వేష్టా సర్వభూతానాం

అనెడి గీతావాక్యమును సదా మననము చేయుచుండవలెను.

కొంతకాలమునకు నృగమహారాజు మరణించెను. యమభటులు వచ్చి అతనిని యమపురికి గొనిపోయిరి. యమధర్మరాజు నృగమహారాజుని చూచి ఇలా పలికెను.

మ॥ మహోజేంద్రోత్తమ వంశపావన జగన్మాన్యక్రియాచార నీ
ఘనదాన క్రతు ధర్మముల్ త్రిభువనఖ్యాతంబులై చెల్లెడిన్
మును దుష్కర్మఫలంబునొంది పిదపం బుణ్యానుబంధంబులై
చను సౌఖ్యంబులబొందు పద్మజనియాజ్ఞం ద్రోవగావచ్చునే?

"రాజా! నీవు చేసిన అనంతకోటి దానధర్మముల పుణ్యఫలితముగా ఉత్తమమైన ఫలములను నీవు పొందబోవుచున్నావు. కొద్దిగా యున్న పాపశేషమును ముందుగా అనుభవించుము" అని యమధర్మరాజు నృగమహారాజుతో పలికెను.

నృగమహారాజు ధర్మ నిర్ణయమును శిరసా వహించెను. పాపఫలము ననుభవించుటకు భూమిపై పతనమైన నృగరాజు ఊసరవెల్లి రూపమును ధరించి ఒక పాడుపడిన నూతిలో పడియుండెను.

ఒకనాడు ప్రద్యుమ్నుడు, సాంబుడు విహారార్థము ఉపవనమునకు వెళ్ళిరి. అచ్చట నీరులేని బావిలో పడియున్న ఊసరవెల్లిని గాంచిరి. దానిని బయటకు తీయుటకు ప్రయత్నించిరి. కానీ వారివల్ల ఆ పని కాలేదు. అప్పుడు శ్రీకృష్ణ దచ్చటికి వచ్చి ఆ ఊసరవెల్లిని పైకి తీసెను. శ్రీకృష్ణుని దివ్య కరస్పర్శచే ఆ ఊసరవెల్లి దేవరూపమును ధరించి శోభించెను.

ఊసరవెల్లి రూపమును పోగొట్టుకొని దేవరూపమును పొందిన ఆ వ్యక్తితో "నీ వెవరవు? ఈ రూపము నేల పొందితివి?" అని ప్రశ్నించెను.

నృగమహారాజు శ్రీకృష్ణునితో "కేశవా! నేను నీ దాసుడను. నీ దర్శనమునకై పరితపించువాడను. నీ అనుగ్రహముచే నాకు పూర్వస్మృతి నశించలేదు.

దేవదేవ జగన్నాథ గోవింద పురుషోత్తమ
నారాయణ హృషీకేశ పుణ్యశ్లోకాచ్యుతావ్యయ ।
అను జానీహి మాంకృష్ణ యాన్తం దేవగతిం ప్రభో
యత్ర క్వాపి సతశ్చేతో భూయాన్మే త్వత్పదాస్పదమ్ ॥

"దేవదేవా! జగత్పతీ! గోవిందా! పురుషోత్తమా! నారాయణా! హృషీకేశా! పుణ్యశ్లోకా! అచ్యుతా! అవ్యయా! ప్రభూ! శ్రీకృష్ణా! నేను దివికి తరలి పోవుచున్నాను. నాకు అనుజ్ఞ నొసంగుము. నే నెచ్చట యున్నను నా చిత్తము నీ చరణకమలముల చెంతనే యుండును.

నమస్తే సర్వభావాయ బ్రహ్మణేఽనన్త శక్తయే
కృష్ణాయ వాసుదేవాయ యోగానాం పతయేనమః

"కృష్ణా! నీవు అనంతశక్తి రూపుడవు. సర్వజీవుల ఉద్గమస్థానమై యున్నావు. యోగులకు ప్రభువైన వాడవు. అట్టి వాసుదేవుడవైన నీకు సర్వభావముల నమస్కరించుచున్నాను.

ఈ సందర్భమున చక్కని ప్రాచుర్యము పొందిన పోతనామాత్యుని పద్యమును కూడా మననము చేసికొందుము.

ఆ॥ కృష్ణ! వాసుదేవ! కేశవ! పరమాత్మ! యప్రమేయ! వరద! హరి! ముకుంద! లందఁగంటి.
నిన్నుఁ జూడఁ గంటి నీకృప గనుఁగొంటి నఖిలసౌఖ్యపదవు

అని శ్రీకృష్ణుని ప్రార్థించి, జగన్నాథుడగు శ్రీకృష్ణునకు ప్రదక్షిణ మొనరించి, కిరీటము ధరించిన తన శిరముచే ఆయన చరణములను స్పృశించి, అనుమతిపొంది, సర్వులు వీక్షించుచుండగనే విమానము నెక్కి వందన మాచరించుచూ వెళ్ళెను.

జై జై నృగమహారాజ్ కీ.

నృగమహారాజు ధర్మాత్ముడు, పుణ్యాత్ముడు, మహాభక్తుడు. అయినను తెలియక చేసిన నేరానికి కూడా ప్రతిఫలము ననుభవించెను. దీని విషయములో లోతుగా చర్చించవలసిన పనిలేదు. మహాత్ముడైన నృగమహారాజు విషయమే అలా ఉన్నచో మన విషయమేమిటి? అని ఆలోచించి సాధువులను, జ్ఞానులను బాధించకుండా జీవించడము నేర్చుకోవాలి.

నృగమహారాజు స్వర్గమునకు వెడలిన తరువాత తనచుట్టూ యున్న రాజకుమారులకు శ్రీకృష్ణుడు ధర్మబోధ చేసెను.

"రాకుమారులారా! బ్రాహ్మణ సిరిని అపహరించుట మహాపాపము. ఆ పాపము వలన మూడు తరముల వారు నష్టపోవుదురు. బంధువులారా! బ్రాహ్మణుని మీరు కష్టపెట్టకుడు. బ్రాహ్మణునికి నమస్కరించుడు.

హి న స్తే విషముత్తారం వహ్ని రద్భిః ప్రశామ్యతి,
కూలం సమూలం దహతి బ్రహ్మ స్వారణి పావకః

"భుజించిన వానినే విషము చంపును. జలము అగ్నినే చల్లార్చును. కానీ బ్రాహ్మణ ధన మనెడి కాష్ఠము నుండి పుట్టిన అగ్ని వంశమునే సమూలముగా నశింపజేయును" అని పలికెను.

ఆత్మ బంధువులారా! ఇచ్చట బ్రాహ్మణుడనగా పౌరోహిత్యము చేయువాడని, జాతకములు చెప్పువాడని లేదా కళాశాల వారిచ్చు యోగ్యతా పత్రములో సూచింపబడిన వాడని మీరు భావింపవలదు. శ్రీకృష్ణుడు ఇక్కడ ఉదహరించినది వారిని గూర్చి కాదు. కళాశాల యోగ్యతా పత్రములు ఎంప్లాయిమెంటు ఆఫీసు చుట్టూ తిరిగేందుకు పనికొస్తాయి. అవి శ్రీకృష్ణుని ప్రశంస అందుకొనేవి కావు.

బ్రాహ్మణు డనగా బ్రహ్మజ్ఞానము కలవాడని భావము. లేదా బ్రహ్మజ్ఞానము కొరకు ప్రయత్నించు సాధకుడని కూడా అన్వయించు కోవచ్చు. తప్పులేదు. అట్టివారి సిరి నపహరించిన, లేదా వారిని బాధించిన అది తీరని దోషమని స్వామి తెలుపుచున్నారు.

ఇంతటితో ఆగలేదు. దేవాలయాల ఆస్తి పాస్తులను అపహరించువారు, హుండీలను మాయం చేయువారు, ఆశ్రమాలను దోచుకొనేవారు ఇలాంటివారంతా నరకములో చేరువారే. తాత్కాలికంగా సుఖించినా శాశ్వతముగా శోకము ననుభవించువారే కాగలరు.

గోకులంలో బలరాముడు

భగవానుడగు బలరాముడు బంధుజనమును వీక్షించదలచి గోకులమునకు వెళ్ళెను. బలరాముడు గోకులంలో కాలుపెట్టగనే గోకుల మంతయు ఆనందములో నిండిపోయినది.

గోపాలురు, గోపికలు వచ్చి బలరాముని ఆలింగనము చేసుకొనిరి. తమ పాదములకు నమస్కరించిన బలరాముని నందయశోదాది పెద్దలు ఆశీర్వదించారు.

తరువాత గోపికలు వచ్చి బలరాముని పలుకరించిరి. ఒక గోపిక "రామా! శ్రీకృష్ణుడు క్షేమముగా యున్నాడా?

కచ్చిదా స్తే సుఖం కృష్ణః పురస్త్రీ జనవల్లభః

"పురస్త్రీల వల్లభుడగు శ్రీకృష్ణుడు సుఖముగా యున్నాడా? అతడు తల్లిదండ్రులను, బంధువులను స్మరించుచుండునా? మమ్ములను గూర్చి తలంచుకొనునా? రామా! ఎవని కొరకు మేము సర్వులను త్యజించితిమో, అట్టి కృష్ణుడు మమ్ములను తృణప్రాయముగా త్యజించి వెడలినాడు. మరల వచ్చెదనని చెప్పినాడు. అందువలన అమాయకులమైన మేము ఆయన ప్రయాణమునకు ఆటంకమును కలిగించలేదు."

క॥ జననీజనకుల సమజులఁ, దనుజుల బంధువుల మిత్ర తతుల విడిచి నె
మ్మనమున నొందుదలంపక, తమనమ్మినవారి విడువఁ దగునే హరికిన్?
అని పలికెను.

మఱియొక గోపిక, "చిత్త చాంచల్యము గలవాడు, కృతజ్ఞత లేనివాడు యగు ఈ కృష్ణుని బుద్ధిమంతులగు పురస్త్రీలు ఎలా విశ్వసించిరి?" అనెను.

మఱియొక గోపిక ఇలా పలికినది.

కిం న స్తత్కథయా గోప్యః కథాః కథయ తాపరాః
యాత్యస్మాభిర్వినా కాలో యది తస్య తథైవ చ

"అతని మాటలను పలుకుట వలన మనకేమి ప్రయోజనము? అన్యవిషయములను చర్చింపుడు. మనలను వదలి అతడు జీవించ గలిగినపుడు, అతడిని వదలి మనము జీవించలేమా?" అనెను.

ఈ విధముగా పలుకుతున్న గోపికలు శ్రీకృష్ణుని దివ్యచేష్టలను స్మరించుచు దుఃఖించసాగిరి. బలరాముడు వారిని ఓదార్చెను. రాత్రి సమయమున పూర్వస్మృతులను గుర్తుచేయుచు గోపికలతో గూడి బలరాముడు విహరించసాగెను. రెండు మాసములు బలరాముడు గోకులమునందే యుండి గోపభామల వ్యథను కొంత తొలగించెను.

భగవంతుని స్మరించు భక్తులు ధన్యజీవులు. భగవంతుని వెంటనే పొందలేకున్నను భగవత్స్మరణ వలన భక్తుల సహచర్య భాగ్యము లభించును. భక్తుల సమాగమమున భగవంతుడే యుండును. కనుక హృదయములు శాంతించును.

గోపికలు పరమ భక్తులు. వారు శ్రీకృష్ణునికై పరితపించుచుండిరి. దాని ఫలితముగా వారికి బలరాముని సాంగత్యము లభించెను. బలరాముని సాంగత్యము వారి హృదయాలలోని కృష్ణభక్తిని వృద్ధి పఱచెను. అందుచేతనే భక్తుల సహచర్య భాగ్యమును కల్పించమని ఎందరో సాధువులు ప్రార్థించి యున్నారు. భక్తులు లభించినచో భగవంతుడు

లభించినాడనియే భావము. అందుచేతనే భక్తిని పరమోత్కృష్ట మైనదిగా మహా పురుషులు తెలియజేసినారు.

న ధనం న జనం న సుందరీం కవితాం వా జగదీశ కామయే,
మమ జన్మని జన్మనీశ్వరే భవతాద్ భక్తి రహైతుకీ త్వయి

"ఓ భగవాన్! నాకు ధనము వలదు. జనము వలదు. కవిత్వము వలదు. జన్మ జన్మలకు నిన్ను భక్తిచేయు ఒక్కవరమును నా కొసంగిన చాలును" అని చైతన్య మహాప్రభువు ప్రార్థించి యున్నారు.

పౌండ్రక వాసుదేవుడు

కరూశ దేశమును పౌండ్రకు డను రాజు పాలించుచుండెను. అతడు పరమ మూర్ఖుడు. ధనము కొరకు స్తుతించే స్తోత్రపాఠకుల ఘోషలను విని నమ్మెడి మందభాగ్యుడు.

ఒకనాడు స్తోత్రపాఠకులు, బంధువులు అతనిని సమీపించి, ధర్మ సంస్థాపన కొరకు వాసుదేవుడుగా పౌండ్రకుడే అవతరించినట్లు తెలియజేసిరి. అతడే జగన్నాథుడని పొగడిరి. ఆ పొగడ్తలు నిజమని పౌండ్రకుడు విశ్వసించెను.

ధృతం చ ప్రాహిణో త్కృష్ణః కృష్ణాయావ్యక్త వర్త్మనే
ద్వారకాయాం యథా బాలో నృపో బాలకృతోఽబుధః

క్రీడలయందు బాలురు ఒక పిల్లవానిని రాజని పిలుతురు. ఆ పిల్లవాడు రాజైనట్లే భావించును. అలాగే అజ్ఞానియగు బాలుని వలె పౌండ్రకుడు ద్వారకకు శ్రీకృష్ణుని కడకు దూతను పంపెను.

దూత ద్వారకకు వచ్చెను. రాజసభలో ఆసీనుడై యున్న కృష్ణునికి పౌండ్రకుని సందేశమును వినిపించెను.

"శ్రీకృష్ణా! నేను ధర్మరక్షణమునకై అవతరించిన వాసుదేవుడను. రెండవ వాసుదేవుడు లేడు. కనుక నీవు వాసుదేవు డనని చెప్పుకొనుట చౌర్యము. ఆ నామమును త్యజింపుము.

"గొల్లవాడా! నా చిహ్నములను ధరించి తిరిగినంత మాత్రాన నీవు నావలె కాలేవు. నక్క సింహము కాగలుగునా? నీ చేష్టలు నీకు ఎలాగూ మంచిని చేకూర్చవు. కాని అవి నాకు తలవంపులు తెచ్చుచున్నవి. ఇప్పటికైనా మించిపోయినది లేదు. తప్పిదమును తెలిసికొని నన్నాశ్రయింపుము. లేనిచో నేను నీతో యుద్ధము చేసి నిన్ను వధించుట తథ్యము" అని దూత పౌండ్రకుని వచనములను చదివి వినిపించెను.

ఈ వాక్యముల నాలకించి, ఉగ్రసేనాది మహారాజులు పెద్దగా నవ్విరి. శ్రీకృష్ణుడు పౌండ్రకునకు దూత ద్వారా ఈ క్రింది విధముగా తెలియజేసెను.

ఉత్పక్ష్యే మూఢ చిహ్నాని యైస్త్వ మేవం వికత్థసే

"ఓరీ మూర్ఖుడా! వాసుదేవుని చిహ్నములను ధరించి, నిన్ను నీవు స్తుతించు కొనుచున్నావు. నీ చిహ్నముల నన్నింటిని నేనే విడిపింతును.

మ॥ వినరా మీనృపుఁ డున్న చిహ్నములు నే నే వచ్చి ఘోరాజిలో
దనమీఁదన్ సైనసైన కంకముఖ గృధ్రవ్రాతముల్ మూఁగఁగా
వనిలో దర్పము దూలి కూలి వికలం బై సారమేయాళిక
వ్వనయంబున్ శరణంబవయ్యె దను మేవన్నట్లుగా వానితోన్.

ఓరీ మందమతీ! యుద్ధములో శయనించే సమయము నీకు ఆసన్నమైనది. నాచే కొట్టబడిన ముఖమును కాకులు, గద్దలు చుట్టుముట్టి యుండగా శునకములకు ఆహారమయ్యెదవు" అని చెప్పి పంపెను.

దూత పౌండ్రకునికి శ్రీకృష్ణుని మాటలను వినిపించెను. ఇంతలో శ్రీకృష్ణుడు రథారూఢుడై కాశీనగరమును చేరెను. పౌండ్రకునికి ఈ విషయము తెలిసెను. అతడు కూడా రెండు అక్షౌహిణుల సైన్యమును వెంటబెట్టుకొని బయలుదేరెను. పౌండ్రకునికి సహాయము చేయుటకు కాశీరాజు కూడా పౌండ్రకుని అనుసరించెను.

శ్రీకృష్ణుని వేషమును ధరించిన పౌండ్రకుడు గొప్ప నటునివలె సమర రంగమున కాలిడెను. తన చిహ్నములను ధరించిన పౌండ్రకుని జూచి శ్రీకృష్ణుడు పెద్దగా నవ్వెను.

పౌండ్రకుని సైన్యములు శ్రీకృష్ణుని ముట్టడించినవి. శ్రీకృష్ణుడు వారిని తీవ్రముగా బాధించసాగెను. అశ్వగజరథాదులు తీవ్రముగా దెబ్బతిని ఛిన్నాభిన్నమైనవి.

అప్పుడు శ్రీకృష్ణుడు పౌండ్రకునితో "ఓయీ పౌండ్రకా! నా చిహ్నములను త్యజింపమని నీవు నీ దూత ద్వారా నాకు కబురుపెట్టితివి. మరి ఇప్పుడు నీ చిహ్నములు త్యజింపబడుచున్నవి. జాగరూకుడవై యుండుము."

మ॥ మనుజేంద్రాధమ! పౌండ్రభూపసుత! నీ మానంబు తీరంబు నేఁ
డనిలో మాపుదు వెద్దు క్రొవ్వి పెలుచ న్నాఁబోతుపై ఱంకెవై
చిన చందంబున దూతచేత నను నాక్షేపించి పల్కన్న పే
రున జిహ్వాంబులునీపయిన్ విడుతు సర్పుల్ పర్వ నేఁడాజిలోన్.

అని దూషించి, శ్రీకృష్ణుడు తీవ్రమైన శరములచే పౌండ్రకుని రథమును ముక్కలు జేసెను. ఇంద్రుడు పర్వత శిఖరమును వజ్రాయుధముతో ఛేదించునట్లు పౌండ్రకుని శిరమును సుదర్శనముతో శ్రీకృష్ణుడు ఖండించెను. పౌండ్రకుడు మరణించెను. వెంటనే శ్రీకృష్ణుడు కాశీరాజుపై బాణమును వదిలెను. వాయువువలన పద్మకోశము దూరముగా వెళ్ళి పడునట్లు కాశీరాజు దేహమునుండి శిరము వేరై దూరముగా పడెను. తిరిగి విజయముతో శ్రీకృష్ణుడు ద్వారక కరుదెంచెను.

సిద్ధైర్గీయమాన కథామృతః

అప్పుడు సిద్ధులగువారు శ్రీకృష్ణుని వైభవమును తెలుపు కథామృతమును గాన మొనరించిరి.

సదా శ్రీవారినే స్మరించుచున్నందున పౌండ్రకునకు కూడా సద్గతి లభించెను. ఇది వైరభక్తి సర్వులు అనుసరించుటకు వీలుకానిది.

కాశీరాజు మరణవార్త తెలిసి కాశీపురవాసులు అమితముగా దుఃఖించిరి. పిత్రాంతకుని హతమార్చెదనని శపథం బూని కాశీరాజు కుమారుడగు సుదక్షిణుడు ఘోరముగా తపమాచరించెను. మహాదేవుని ఆరాధించెను.

మహాదేవుడు సంతృప్తిచెందినవాడై, దర్శనము నొసంగి వరము కోరుకొమ్మని చెప్పెను. తన తండ్రిని వధించినవానిని సంహరించుటను కోరెను. అందులకు "అగ్నిదేవుని సేవింపుము. అతడు తప్పక నీ శత్రువులను సంహరించును" అని మహేశ్వరుడు సమాధాన మిచ్చెను.

సుదక్షిణుడు యజ్ఞముచేసి అగ్నిని ప్రార్థించెను. భయంకరమగు రూపముతో అగ్ని బయల్వెడలి ద్వారకానగరము వైపు వెళ్ళెను. ఆ అగ్నిని గాంచి ద్వారకప్రజలు భయవిహ్వలురై శ్రీకృష్ణునికి తెలియజేసిరి. శ్రీకృష్ణుడు ద్వారకా వాసులతో,

శరణ్యః సంప్రహస్యాహ మాభైష్టేత్యవితాస్మ్యహమ్

"నేను మిమ్ములను కాపాడెదను. భయపడవలదు" అని చెప్పెను.

సుదర్శన చక్రమును శ్రీకృష్ణుడు ప్రయోగించెను. సుదర్శనము నెదుర్కొనలేని అగ్ని తిరిగి వెళ్ళి, కాశీరాజు తనయుడగు సుదక్షిణుని దగ్ధమొనర్చెను. ఈ విధముగా పౌండ్రకుడు, కాశీరాజు, సుదక్షిణుడు ముగ్గురు హతులైరి.

ఈ ముగ్గురు కేవలం ద్వాపరయుగమునకు మాత్రమే పరిమితమైన వారు గారు. నేడు ప్రతికాలము నందును, ప్రతిదేశము నందును గోచరించుచుందురు. పొగడ్తలకు పొంగిపోయి ఆత్మస్తుతికి పాల్పడే వారందరూ పౌండ్రక వాసుదేవులే. నలుగురు మూర్ఖులు చుట్టూచేరి స్తుతించగనే సాక్షాత్తు దేవుడైనట్లు భంగిమలను ప్రదర్శించే దొంగస్వాములు ఎప్పుడూ ఉంటారు. అట్టివారికి పౌండ్రకునికి పట్టిన గతే పడుతుంది.

దుర్మార్గులైన అట్టి మిథ్యాచారులను ప్రోత్సహించువారు కూడా దుర్గతినే పొందుదురు. పౌండ్రకునికి సహాయ మొనరించిన కాశీరాజు కూడా నేల కూలెను. స్వయముగా కాశీరాజు ఏ దోషము చేయకున్నను దుష్టుడగు వానికి సహాయ మొనరించుట చేత అలాంటి దుస్థితి ఏర్పడెను. కనుక మంచివారికి సహాయ మొనర్చుట ఎంత శ్రేయస్కరమో, చెడ్డవారికి సహకరించకుండా యుండుట అంతే శ్రేయస్కరమని గ్రహించాలి.

అలాగే మంచివారికి చెడుచేయ సంకల్పించువారు విధ్వంసముగా చెడిపోవుదురు. ఈ విషయమును సుదక్షిణుని పాత్ర నిరూపించును. సుదక్షిణుడు అభిచార విధానము

ననుసరించి దక్షిణాగ్నిని సేవించెను. అగ్నిదేవుని ద్వారకానగరము వైపు ప్రయోగించెను. కానీ సుదర్శనమును ఎదుర్కొనలేని అగ్ని తిరిగివచ్చి సుదక్షిణుని, ఋత్విక్కులను, కాశీపురమును దగ్ధమొనర్చెను. ఇతరులకు కీడుచేయ సంకల్పించిన వేరొకరికి సుదక్షిణుడు లాగే పతనమాయెను. ఆధ్యాత్మిక సాధకులెప్పుడూ 1. ఆత్మస్తుతికి పాల్పడరాదు. 2 చెడును ప్రోత్సహించరాదు. 3. సజ్జనులను హింసించే ప్రయత్నములు చేయరాదు.

ద్వివిదుని వధ

నరకాసురునికి వానరమిత్రు డొకడుండెను. అతనిపేరు మైందుడు. వాని ద్వివిదుడు అను సోదరు డుండెను. అతడు గొప్ప పరాక్రమవంతుడు. తన మిత్రుడైన నరకాసురుని వధించిన శ్రీకృష్ణునిపై పగ తీర్చుకొనవలె నని సంకల్పించి, శ్రీకృష్ణునకు చెందిన ప్రదేశములను ధ్వంసము చేయుచూ దగ్ధము చేయుచుండెను. మహర్షుల ఆశ్రమ ప్రదేశములను పాడు చేయుచుండెను. ఆశ్రమ వృక్షములను పెకలించుచు యాగశాలల యందు మూత్ర విసర్జనము చేయుచుండెను. స్త్రీలను వేధించుచుండెను. సత్పురుషులను బాధించుచుండెను. ఈ విధముగా రైవతపర్వతము వద్దకు రాగానే అక్కడ బలరాముని గాంచెను.

ద్వివిదుడు గంతులు వేయుచు బలరాముని యెగతాళి చేసెను. గోప స్త్రీలను కించపరచెను. వికృతచేష్టలతో విడ్డూరముగా ప్రవర్తించెను. క్రుద్ధుడైన బలరాముడు రాళ్ళతో ద్వివిదుని కొట్టెను. ద్వివిదుడు ఇంకను విజృంభించి స్త్రీలను అవమానించ సాగెను. గోపభామలు తీవ్రవ్యథకు గురియైరి. ఇక వానిని సహింపరాదని, సంహరించుటయే ఏకైకమార్గమని గుర్తించిన బలరాముడు నాగలిని చేతపట్టెను.

మహాబలుడైన ద్వివిదుడు మద్దిచెట్లను పెకలించి బలరాముని శిరముపై విసిరెను. బలరాముడు తప్పించుకొని, ద్వివిదుని తీవ్రముగా గాయపరచెను. ఈ విధముగా కొంతసేపు సమరము సాగిన తరువాత బలరాముని సమీపమున కేతెంచి, పిడికిలి బిగించి ద్వివిదుడు బలరాముని వక్షస్థలముపై కొట్టెను.

బలరాముడు కుపితుడై ద్వివిదుని కంఠమునందును, బాహుమూలముల యందును కొట్టి వధించెను. అతడు నెత్తురు క్రక్కుచూ నేలపై బడెను. దేవతలు గగనము నుండి బలదేవునిపై పుష్పవృష్టిని కురిపించిరి.

నరకమున పడద్రోయు అజ్ఞానమే నరకాసురుడు. వానికి మైందుడను మిత్రుడుండెను. మైదు యనగా మాయ. మైందుడనగా మాయా స్వరూపుడని అర్థము. మాయకు తోడై యుండువాడే మైందుని సోదరుడగు ద్వివిదుడు. ద్వివిదుడు అనగా రెండు రీతులలో ప్రవర్తించువాడు. అహంకార మమకారములే ద్వివిదుని ప్రవర్తనా రీతులు. తాను గొప్పబలవంతుడ ననే అహంకారము, నరకాసురునిపై యుండెడి మమకారము ద్వివిదుని ద్విపాత్రాభినయము.

అహంకార మమకారాదులు ద్వివిదునివలె వికృత చేష్టలను చేయును. అవి అంత తేలికగా సంహరించ బడునవి కావు. ద్వివిదుని బలదేవుడే సంహరించగలడు. దైవబలమే బలదేవుడు. దైవబలమును పొందినవారు ద్వివిదుడనే అహంకార మమకారాదులను సంహరించగలరు.

అహంకార మమకారము లనునవి మాటలద్వారాను, చేష్టలద్వారాను వ్యక్తమగుచుండును. మాటలను, చేష్టలను క్రమబద్ధపరచినపుడే ఆ రెండును నశించును. అందుచేతనే బలదేవుడు కంఠముమీదను, బాహువుల మూలము మీదను కొట్టగనే ద్వివిదుడు మరణించెను. మనము కూడా దైవము నాశ్రయించి, దైవబలమును పొంది, అహంకార మమకారములను వధించి తరించవలెను. ఇదియే ద్వివిదుని వధ లోని అంతరార్థము.

బలరాముని ఆగ్రహం - సాంబుని వివాహం

శ్రీకృష్ణునికి అనేకమంది పుత్రులు గలరు. వారిలో రుక్మిణీ పుత్రుడగు ప్రద్యుమ్నుడు, జాంబవతీ తనయుడగు సాంబుడు ముఖ్యులు.

దుర్యోధనునికి లక్ష్మణ యను పుత్రిక గలదు. ఆమెను స్వయంవరము నుండి సాంబుడు హరించెను. కౌరవులకు ఈ విషయము తెలిసెను. ఇది సహింపరాని నేరమని వారు భావించిరి. సాంబుని పట్టుకొనుటకు భీష్ముడు, కర్ణుడు, శల్యుడు, దుర్యోధనుడు ఇత్యాది వీరులందరు బయలుదేరిరి. సాంబుని రథమును అడ్డగించిరి.

సాంబుడు సాహసోపేతుడై వారిని ఎదుర్కొనెను. సైన్యమును తీవ్రముగా బాధించెను. కానీ అంతమందిని ఒక్కడు ఎదిరించి పోరుట కష్టతరమాయెను. నలుగురు వీరులు సాంబుని ముట్టడించి, అతని రథమునకు అమర్చిన నాలుగు గుఱ్ఱములను వధించిరి. రథమును శిథిల మొనర్చిరి. సారథిని మట్టుపెట్టిరి. ధనుస్సును విరిచివైచిరి.

సాంబుడు నిరాయుధుడయ్యెను. వెంటనే అతనిని బంధించి గొనిపోయిరి. ఈ విషయము నారదుని ద్వారా యాదవులకు తెలిసెను. యాదవులు క్రుద్ధులైరి. కౌరవులతో యుద్ధము చేయుటకు ఉగ్రసేనుడు అనుమతి నొసంగెను. యాదవ వీరులు యుద్ధమునకు సిద్ధమగు చుండిరి.

ఈ విషయము బలరామునికి తెలిసెను. కౌరవులతో సమరమునకు అతడు ఇష్టుడు గాకుండెను. వద్దని వారించి, తాను యాదవ పెద్దలతో, పురోహితులతో గూడా హస్తినాపురమునకు వెళ్ళెను. నక్షత్రముల మధ్య చంద్రునివలె పురోహితుల మధ్య బలరాముడు విరాజిల్లుచుండెను.

బలరాముడు హస్తినాపురమునకు వచ్చి నగరమునకు వెలుపలనున్న ఒక ఉద్యాన వనమునందు విడిది చేసెను. ధృతరాష్ట్రుని అభిప్రాయము నెరుగుటకై ఉద్ధవుని కౌరవసభకు పంపెను.

బలదేవుని ఆగమనవార్త నాలకించిన కౌరవులు సంతుష్టచిత్తులై బలదేవుని దర్శించి ఆయనను విధి ననుసరించి పూజించిరి. ఉభయులు కుశలములను ప్రశ్నించుకొనిన పిదప బలరాముడు ఉగ్రసేనుని ఆదేశమును నిర్భయముగా కౌరవులకు తెలియజేసెను.

"మీరు అనేకమంది వీరులు ఏకమై నిస్సహాయ స్థితిలో నిలిచియుండిన ధర్మాత్ముని బంధించినారు. ఈ విషయమును మేమెరింగియు బంధువులతో వివాదము మంచిదిగాదని నిశ్చయించుకొని శాంతపడితిమి. ఈ విషయమును మీరు అవగాహన మొనర్చుకొని సాంబుని వదలి పెట్టుడు" అని ఉగ్రసేనుని ఆదేశమును బలరాముడు తెలియజేసెను.

ఈ మాటలు కౌరవులను కోపమునకు గురిచేసినవి. బలరామునికి కౌరవులు ఈ విధముగా సమాధాన మొసంగిరి:

"ఇది సహింపరాని విషయముగా తోచుచున్నది. యాదవులు కౌరవుల నాదేశించుట ఆశ్చర్యకరముగా తెలియుచున్నది.

ఆరురుక్షత్యుపానద్వై శిరో ముకుటసేవితమ్

"పాదరక్షలు కిరీటముల వలె శిరమున నిలుచుటకు ప్రయత్నించి నట్లున్నది.

"కుంతీదేవి వివాహము వలన యాదవులు మనకు బంధువులైనారు. ఆ అవకాశము నుపయోగించుకొని మాతో కలసి కూర్చొనుట, భుజించుట, శయనించుటకు అలవాటు పడినారు. ఆ తరువాత మనమండి రాజ సింహాసనమును పొందినారు. ఇప్పుడు మనతో సమానులుగా వ్యవహరిస్తున్నారు. రాజముకుటమును మన దయపై ఆధారపడి ధరించుటను మరచినారు.

"పాలుపోసిన వారినే పాము కాటువేయునట్లు మన అనుగ్రహముచే ఇంతటి వారైన యాదవులు మనలనే ఆదేశించుచున్నారు. కనుక వీరిక రాజచిహ్నములను ధరించుటకు అనర్హులు" అని పలికి కౌరవులు నగరమున ప్రవేశించిరి.

కౌరవుల కఠిన వచనముల నాలకించిన బలదేవుడు క్రుద్ధుడయ్యెను. కౌరవుల అజ్ఞానమును గాంచి, తనలో తాను నవ్వుకొనుచూ ఈ విధముగా పలికెను.

నూనం నానా మదోన్నద్ధాః శాంతిం నేచ్ఛన్త్యసాధవః
తేషాం హి ప్రశమో దణ్డః పశూనాం లగుడో యథా!

"సంపదచే మదించి యున్న కౌరవులు శాంతిని అభిలషింపరు. పశువులకు దండమే శరణ్యమైనట్లు ఈ పశుప్రాయులకు దండనమే సముచితము" అనెను.

కుపితుడైన బలరాముడు "ఆహా! ఏమీ వీరిగర్వము? సమరమునకు సిద్ధపడుచున్న యాదవవీరులను, శ్రీకృష్ణుని శాంతింపజేసి వీరికి మేలు చేయుటకు నేను ఇచ్చటికి అరుదెంచితిని. దుర్మార్గులగు ఈ కౌరవులు అనర్గళ ప్రలాపములను సాగించుచున్నారు. ఉగ్రసేనుని వీరు చులకనచేసి మాట్లాడినారు. దేవతలచేత అర్చింపబడి, లక్ష్మీదేవియొక్క సేవలనందుకొను శ్రీకృష్ణుడు కిరీటమును ధరించుటకు అర్హుడు కాడని వారు పలుకుచున్నారు."

సీ॥ ఏ దేవుభృత్యులై యింద్రాది దిక్పాల వరులు భజింతురు వరుసతోడ
నే దేవుమందిరం బేపారు దేవతా తరు సభావిభవమందరతఁ జెంది
యే దేవు పదయుగం బేప్రొద్దు సేవించు నఖిలజగన్మాత యైన లక్ష్మి
యే దేవు చారు సమిద్ధకళాంశసం భవులము పద్మజభవులు నేము
తే॥ నట్టి దేవుండు దుష్ట సంహారకుండు హరి ముకుందుఁడు పంపుసేయంగ నావ్వ
నుగ్రసేనునిరాజ్యసమగ్రగరిమ యంతయును దాక యిచ్చినదఁట తలంప!

అని కౌరవుల దుష్కృత్యమును గూర్చి బలరాముడు చింతించెను. "వీరి అనుచిత ప్రలాపములను ఎవరు సహింపగలరు? వీరికి బుద్ధి చెప్పుటయే తక్షణ కర్తవ్యము" అని బలదేవుడు భావించెను.

తే॥ శ్రీమదాంధులు సామంబుచేతఁ జక్కఁ బడుదురే? యెందు బోయఁడు పసులఁదోలు
పగిది నుగ్ర భుజావిజృంభణసముగ్ర ముసలహలాటోప మవిలోపఁ జూపకున్న

అని భావించినాడు. తన నాగలి నుపయోగించి హస్తినాపురమును పెకలించి, సాంబుని మినహా సర్వులతో కూడిన నగరమును గంగలో పడవైచుటకు నిశ్చయించుకొని యత్నమునకు దిగెను.

అది గాంచిన కౌరవులు దిగ్భ్రాంతి చెందిరి. భయార్తులైరి. ప్రాణ రక్షణార్థమై లక్ష్మణ సాంబులను ముందిడుకొని, నమస్కరించుచు బలరాముని వద్దకు వచ్చిరి. బలదేవునితో ఇలా వినమ్ర వచనములను పలికిరి.

రామ రామాఖిలాధార ప్రభావం న విదామ తే
మూఢానాం నః కుబుద్ధీనాం క్షన్తుమర్హస్యతిక్రమమ్

"రామా! మేము నీ శక్తి నెఱుగలేకపోతిమి. కనుక విజ్ఞానములేని ఈ దుష్టులాచరించిన అపరాధములను మన్నింపుము."

నమస్తే సర్వ భూతాత్మన్ సర్వశక్తి ధరావ్యయ
విశ్వకర్మన్ నమస్తేఽస్తు త్వాం వయం శరణంగతాః

"ఓ సర్వాంతర్యామీ! సర్వ శక్తి మంతుడా! అక్షయ స్వరూపుడా! విశ్వాధారా! నీకు నమస్కరించుచున్నాము. నిన్ను శరణు వేడుకొనుచున్నాము. మళ్ళీ నీకు నమస్కరించుచున్నాము" అని నమ్రతతో కౌరవులు బలరాముని వేడుకొనిరి.

భయముతో విహ్వలురైయున్న కౌరవులకు బలరాముడు అభయ ప్రదాన మొసంగెను.

ప్రసాదితః సుప్రసన్నో మాభైష్టేత్యభయం దదౌ

శరణాగతులైన కౌరవులను గాంచి సుప్రసన్నుడైన బలదేవుడు 'మీరు భయపడకుడు' అని అభయమొసంగెను.

దుర్యోధనుడు లక్ష్మణ సాంబులతోపాటు విశేష ధనరాశులను, అశ్వములను, రథములను దాసీజనమును ఇచ్చి బలరామునికి నమస్కరించెను. సాంబుని, లక్ష్మణను తీసుకొని బలరాముడు ద్వారకకు చేరెను.

తరువాత హస్తినాపురములో జరిగిన వృత్తాంతము నంతటిని ఆయన యాదవ వీరులకు తెలియజేసెను.

బలరాముడు నాగలి నుపయోగించి పెకలించిన హస్తినాపురము ఈ నాటికీ దక్షిణ దిక్కున ఉన్నతమై యుండుట గాంచవచ్చును అని శుకబ్రహ్మ పరీక్షిత్తునితో పలికెను.

అనుచిత ప్రలాపములు సముచితములు కానేరవు. సాధుజనులను గాయపరచే నిందా వాక్యములను పలుకరాదు. అవి వ్యక్తి వినాశనమునకే గాక తన నాశ్రయించుకొని యున్న బంధుజనమునకు కూడా ముప్పు వాటిల్లజేయును. సముచిత పలుకులు పామరవ్య జీవనమునకు పునాదుల వంటివి. ఆవేశము నంతరింప జేసుకొని ఆలోచనను వృద్ధి చేసుకొనవలెను. ఒక మంచి ఆలోచన మంచి బ్రతుకు నిస్తుంది. ఒక మంచి పలుకు జీవితములో పరిపూర్ణమైన శాంతి నిస్తుంది.

నారదమహర్షి - కృష్ణలీల

శ్రీకృష్ణుడు నరకాసురుని వధించి పదునారువేల భామినులను వివాహమాడెను. ఇంతమంది స్త్రీలతో శ్రీకృష్ణుడెలా కాపురము చేయుచున్నాడో చూడవలె నని నారద మహర్షికి అనిపించెను. ఈ వింత సంసారమును గాంచుటకు నారదుడు ద్వారకకు వచ్చెను.

ఇదొక విచిత్రమైన విషయము. బ్రహ్మచారి యైన నారదుడు సాంసారిక జీవనమును చూడవలె నని అభిలషించుటయే ఒక సంసారమును తయారు చేసుకొనుట అయినది. ఏం చేస్తాం? మాయ ఎవ్వరినీ వదలిపెట్టదు.

కొందరు సన్యాసులు వివిధమైన కబురులేకుండా, ఆహ్వానం అందుకోకుండా గృహస్థుల ఇండ్లకు తిరుగుతూ ఉంటారు. మీ బాధలు తొలగించేందుకే మేమున్నాము అని చెబుతుంటారు. ఇది సరియైన పద్ధతికాదు. ఆహ్వానించని చోటికి సన్యాసి వెళ్ళకూడదు. సన్యాసి పని బాధల కత్తిరింపు కాదు, బోధల అతికింపు. బోధలు అందినచోట బాధలెలా ఉంటాయి? ప్రాపంచిక విషయాలను, సాంసారిక విషయాలను దర్శించేందుకు, ముచ్చటించేందుకు సాధకుడు విముఖుడై యుండాలి.

సంసార మేవ నిస్సారం దృష్ట్వా సారదిదృక్షయా
ప్రవ్రజన్త్య కృతోద్వాహాః పరం వైరాగ్య మాశ్రితాః

"సంసారమును నిస్సారమైన దానినిగా గుర్తించి, సారభూతమైన తత్త్వము నెరుగ నిచ్ఛగించి, తీవ్రవైరాగ్యమును పొందిన అవివాహితులు సన్యాసమును స్వీకరింతురు"

అని నారదమహర్షి స్వయముగా మునులకు నారదపరివ్రాజకోపనిషత్తు నందు తెలిపి యున్నాడు.

పై మంత్రమును చెప్పిన నారదుడు కృష్ణుని సంసారమును చూడ గోరుటేల? అదియే భ్రాంతి. సాధకుడు ప్రయత్నముతో తొలగొట్టుకొనవలసిన విషయము.

సాధకులారా! మహాత్ముల జీవితాలలో ఇలాంటి సంఘటనలు గోచరిస్తుంటాయి. శాస్త్రానికి అక్కడ అర్థ్యభావాలు వారుగారు. మనకు తెలుపుటకే వారు అలా ప్రవర్తిస్తుంటారు.

నారదుడు అంతఃపురమున ప్రవేశించెను. అచ్చట శ్రేష్ఠమైన ఒక గృహమును దర్శించెను. అది రుక్మిణీదేవి గృహము. పదునారువేల భామలు పరివృతలై యుండగా రుక్మిణీదేవి వింజామరను చేబూని శ్రీకృష్ణునికి సేవచేయుచుండెను.

శ్రీకృష్ణుడు నారదమహర్షిని జూచి లేచెను. ఆయనను నమస్కరించెను. ఆహ్వానించెను. తన ఆసనముపై కూర్చుండ బెట్టుకొనెను. శ్రీకృష్ణుడు సర్వలోకపూజితుడ దయ్యును. నారదమహర్షి పాదములను కడిగి ఆ జలమును తన శిరముపై చల్లుకొనెను. పాదములను పూజించెను. తరువాత చేతులు జోడించి నమస్కరించుచు, "స్వామీ! మేము మీకు చేయుగల సేవలను తెలుపుడు" అనెను.

గృహస్థులకు ఆదర్శమును చూపేందుకు శ్రీకృష్ణుడు ఆ విధముగా ప్రవర్తించెను. నిజగృహస్థుడు తాను జీవించుటయే గాక అన్యులు అనుకరింప దగిన రీతిలో ఆదర్శ జీవనమును సాగింపవలెను. శ్రీకృష్ణుడు గృహస్థులకు చక్కని ఆదర్శమును తెలియజేసెను. అతిథిని సాక్షాత్తు నారాయణ స్వరూపముగా భావింపుమని తెలిపెను.

శ్రీకృష్ణుని మాటల నాలకించిన నారదుడు, "జగన్నాథా! నీవు సాక్షాత్తు పరమాత్మవు. అందరి హృదయములలో వసించువాడవు. ధర్మరక్షణ కొరకు పూర్ణావతారము నెత్తితివి.

తే॥ అఖిలలోకైక పతివి దయార్ద్రమతివి విశ్వసంరక్షకుండవు శాశ్వతుఁడవు
వెలయు వేదవిదుఁడైన గావింతు నమట యార్తబంధుండ విది నీకు వద్యుతంబె

"ఈ నాడు నీ పాద పద్మములను దర్శించి నేను ధన్యుడ నైతిని. ఆ దివ్యచరణము లను శాశ్వతముగా హృదయములో నిలుపుకొనగలిగెడి భక్తిని నాకు ప్రసాదింపుము" అని పలికెను.

అనంతరము శ్రీకృష్ణుని నుండి సెలవు పుచ్చుకొని రెండవ గృహములోనికి వెళ్ళెను. అచ్చట శ్రీకృష్ణుడు తన సతితోను, ఉద్ధవునితోను కూడి పాచిక లాడుచుండెను. శ్రీకృష్ణుడు నారదునిగాంచి, లేచి నిలబడి వందన మాచరించెను. "దేవా! తమరు ఎప్పుడు వచ్చితిరి?" అని ప్రశ్నించగా, నారదునకు ఏమి చెప్పవలెనో తెలియక తంబూరను చంకన పెట్టుకొని బుడబుడ మని బయటికి వెడలెను.

ఏమిటీ వింతనాటకము? మొదటి గృహంలో అలా ఉండి, రెండవ గృహములో పాచికలాడుట ఏమిటి? అని నారదు డాలోచింపసాగెను. జీవితమే ఒక చదరంగమని శ్రీకృష్ణుడు నారదునికి రెండవ ఇంటిలో రమ్యముగా తెలిపెను.

నారదుడు మూడవ ఇంటికేగెను. అచ్చట శ్రీకృష్ణుడు బిడ్డలను లాలించుచుండెను. నారదునిచూడగనే "దేవా! ఎప్పుడు వచ్చితిరి? మీకు మేము చేయదగిన సేవలేమిటి?" అని శ్రీకృష్ణుడు పలికెను. నారదుడు మారు పలుకకుండా బయల్వెడలెను. సర్వజీవులు శ్రీకృష్ణుని బిడ్డలే. వారిని లాలించి పాలించువాడు జగన్నాథుడే యనెడి విషయమును మూడవ ఇంటిలో నారదునకు ముచ్చటగా తెలియజేసెను.

అచ్చటనుండి నారదుడు అయోమయ స్థితిలో నాల్గవ ఇంటిలోనికి ప్రవేశించెను. అచ్చట శ్రీకృష్ణుడు స్నానమునకు వెడలుచుండెను. మహర్షిని గాంచి నమస్కరించెను. నారదుడు కృష్ణునివంక చూడకుండా బయటికి వచ్చెను. భక్తి జలములో మునుగుటకు సదా ప్రయత్నించుచుండుము అని నాల్గవ ఇంటిలో వాచ్యముగా ప్రవచించెను.

అయిదవ ఇంటిలో ప్రవేశించగా శ్రీకృష్ణుడచ్చట హోమము చేయుచుండెను.

బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం యజ్ఞేనైవోప జుహ్వతి

"కొందరు మహాత్ములు ఆత్మైకభావనచే బ్రహ్మమనెడి అగ్నియందు హోమము చేయుచున్నారు" అని గీత జ్ఞానయోగములో పలికిన శ్రీకృష్ణుడు ఐదవ ఇంటిలో ఐచ్ఛికముగా ఆదర్శజీవనమును చూపించెను.

ఆరవ ఇంటిలో పంచ యజ్ఞముల నిర్వహించుచు, పంచేంద్రియములను నిగ్రహించనిదే భగవద్వైభవము అవగతము కాదని ఆదర్శమును పలికెను.

నారదుడు ఏడవ ఇంటి కేగెను. అచ్చట శ్రీకృష్ణుడు బ్రాహ్మణులకు భోజనము పెట్టుచుండెను. యతులను సేవించనిదే మతులు స్థిరపడవని ఏడవ ఇంటిలో వెల్లడి తెలియజేసెను.

ఎనిమిదవ ఇంటిలో శ్రీకృష్ణుడు వారు భుజించగా మిగిలిన పదార్థములు భుజించుచుండెను. సాధుజనుల ఉచ్ఛిష్టము పరమోత్కృష్టమని ఎనిమిదవ ఇంటిలో విప్పి చెప్పెను. ఇచ్చట ఉచ్ఛిష్టము అంటే ఎంగిలి అనికాదు. వారి నోటినుండి ఉచ్చరింపబడిన పలుకులు అని భావము. తినుట అంటే గ్రహించుట యని అర్థము.

తొమ్మిదవ ఇంటిలో సంధ్యానిరతుడై గాయత్రిని జపించుచుండెను. తొమ్మిది అంకె వాస్తవానికి సంధ్యాస్థితియే. పది వచ్చినచో రెండు అంకెలు చేరి ద్వైతమారంభమగును. ఈ సంధ్యాస్థితిలో గాయత్రిజపము నాచరించి అద్వైతస్థితిలో నిలిచియుండుమని తొమ్మిదవ ఇంటిలో తొక్కట లేకుండా పలికెను.

నారదుడు పదియవ ఇంటిలో ప్రవేశించెను. అచ్చట శ్రీకృష్ణుడు ఖడ్గమును డాలును పట్టుకొని తిరుగుచుండెను. నారదుడు భయపడి పరుగిడెను. మానవుడు పది ఇంద్రియములకు దాసుడు. ఇంద్రియములను నిగ్రహించనిదే ముక్తి లభించదు. కావున దశేంద్రియములను జయించి ఆప్తకాములు కావలె నని పదియవ ఇంటిలో పరిపూర్ణముగా ప్రవచించెను.

పదునొకండవ గృహములో ప్రవేశించెను. అచ్చట శ్రీకృష్ణుడు అశ్వమును, గజమును, రథమును అధిరోహించి చరించుచుండెను. అశ్వము చపలబుద్ధి కనుక అది మనస్సునకు సంకేతము. గజము మదమునకు ప్రతీకము. రథము శరీరమునకు సంకేతము. మనస్సును, దేహమును నిగ్రహించి మదముగనిన వ్యక్తి ముందడుగు వేయునని పదునొకండవ ఇంటిలో విజ్ఞాన వస్నిరు చల్లెను.

పన్నెండవ ఇంటిలో ఉద్ధవాది మంత్రులతో సమాలోచనలు సాగించుచుండెను. ఉద్ధరించెడి ఉపనిషద్విషయములను సదా చింతించుచుండవలె నని పన్నెండవ ఇంటిలో సన్నగిల నందించెను.

నారదునకు భూమితోపాటు సమస్తలోకములు తిరుగుచున్న ట్లనిపించెను. అనన్యమగు భక్తితో అచ్యుతుని ప్రార్థించెను. శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై

బ్రహ్మన్ ధర్మస్య వ క్తాహం కర్తా తదనుమోదితా
తచ్ఛిక్షయన్ లోకమిమ మాస్థితః పుత్ర మా ఖిదః ॥

"మహాత్మా! నేను ధర్మమును వచించెదను. ఆచరించెదను. నిర్ణయించెదను. ధర్మమును నా ప్రవర్తనము ద్వారా భువిలో ప్రచారము చేయుటకు అవతరించితిని. కనుక నా యోగమాయను దర్శించి, నీవు భ్రాంతి చెందకుము" అని నారదునితో పలికెను.

ఆ మాటల నాలకించిన నారదుడు జగన్నాథుడగు శ్రీకృష్ణునకు వందన మాచరించి ఈ క్రింది విధముగా పలికెను.

అనుజానీహి మాం దేవ లోకాంస్తే యశసాప్లుతాన్
పర్యటామి తవోద్గాయన్ లీలా భువన పావనీః

"భగవాన్! త్రిభువనములను పావనమొనర్చు లీలలను నోరార కీర్తించుచు నేను సంచరించ గలను. నాకు అనుమతి నొసంగుము" అనెను.

పదునారువేల ఇండ్లలో పదునారువేల కృష్ణులున్నట్లు భ్రమ చెందరాదదు. అన్ని గృహముల యందు వెలియు కృష్ణుడు ఒక్కడే యని నారదుడు భావించెను.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత

"సమస్త క్షేత్రములలో వెలయు క్షేత్రజ్ఞుడను నేనే యని ఎఱుంగుము" అని శ్రీకృష్ణుడు గీతయందు తెలిపి యున్నాడు. ఇక్కడ క్షేత్రములు అని బహువచనమును నియోగించి క్షేత్రజ్ఞుని ఏకవచనములో సంబోధించుటలోని భావమిదియే.

ఏక ఏవహి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః
ఏకధా బహుధా చైవ దృశ్యతే జల చంద్రవత్

"భూతములకు ఆత్మ ఒక్కటియే. అది సర్వభూతములయందు గలదు. ఆ ఆత్మ జలమునందు చంద్రుని వలె ఒకటిగాను, అనేకముగాను తెలియుచున్నది" అని అమృత బిందూపనిషత్తు తెలిపినది.

జలపూర్ణములైన కుండలలో చంద్రుడు ప్రతిబింబించును. ఒక్కొక్క చంద్రుడు ప్రత్యేకముగా లేడు. కుంభము అనేకము లైనను శశి యొక్కడే. అలాగే పదునారువేల గృహములలో ప్రభవించిన శ్రీకృష్ణుడొక్కడే. అతడు అద్వయుడు, అప్రమేయ స్వరూపుడు. ఇదియే నారదుని దివ్యానుభవము.

నారదమహర్షి గాంచిన శ్రీకృష్ణుని దివ్య లీలావైభవమును పోతనామాత్యుడు తెనిగించిన అనితర సాధ్యమైన తీరును తిలకించెదము గాక!

సీ॥ సకలార్థసంవేది యొకయింటిలోపల జెలితోడ ముచ్చటల్ సెప్పుచుండు
విపులయశోనిధి వేఱొక్కయింటిలో సరసిజాననఁ గూడి సరసమాడు
బుండరీకదళాక్షుఁ డొండొకయింటిలోఁ దరుణికి హారవల్లరులు గ్రుచ్చు
గరుణాపయోనిధి మఱియొక యింటిలోఁ జెలిగూడి విడియము సేయుచుండు

తే॥ వికచకమలనయనుఁ డొకయింటిలో నవ్వు
బ్రవిమలాత్ముఁ డొకటఁ బాడుచుండు
యోగజనవిధేయుఁ డొకయింట సుఖగోష్ఠి
పలుపు ననఘుఁ డొకటఁ జెలఁగుచుండు.

భగవానుని దినచర్య

బ్రహ్మచారి గాని, సన్యాసి గాని సంసారమును తిలకించవలె నని భావించరాదు. శారీరక బ్రహ్మచర్యము కన్నను మానసిక బ్రహ్మచర్యము అత్యంత శ్రేయోదాయకమైనది. సంసారమునకు సంబంధించి, విషయవాసనలకు సంబంధించి ఏ విధమైన సంకల్పము కదలనివాడే నిజమైన బ్రహ్మచారి లేదా సన్యాసి యగును. ఈ విషయమును గడచిన అధ్యాయమున తిలకించితిమి. ప్రస్తుత అధ్యాయమునందు ఆదర్శగృహస్థు ఎలా ఉండవలెనో గాంచెదము. శ్రీకృష్ణభగవానుడు ఆచరించి చూపెను.

బ్రాహ్మే ముహూర్తే ఉత్థాయ వార్యుప స్పృశ్య మాధవః
ధధౌ ప్రసన్నకరణ ఆత్మానం తమసః పరమ్

శ్రీకృష్ణుడు బ్రాహ్మముహూర్తమున నిద్రలేచును. ఆచమనాదులు పూర్తి గావించుకొని నిర్మలమైన మనస్సుతో అద్వయమైన ఆత్మను ధ్యానము చేయును.

బ్రాహ్మముహూర్తములో నిద్రలేచు వారికే బ్రహ్మజ్ఞానము లభించును. శ్రీకృష్ణుడు నిత్యము బ్రాహ్మముహూర్తముననే నిద్రలేచెడివాడు. ఈ రోజులలో సన్యాసులు, బ్రహ్మచారులు కూడా చాలామంది బ్రహ్మముహూర్తములో లేచేందుకు బద్ధకిస్తుంటారు. అలాంటివారు ఆధ్యాత్మిక రంగానికి అనర్హులు. నిద్ర తామస లక్షణము. తామస లక్షణము గలవారు తాపసు లెలా కాగలరు?

నిద్రలేచినంత మాత్రాన సరిపోదు. వెంటనే పరమాత్మను ధ్యానము చేయాలి. నిద్రలో మనస్సు లయించి యుండును. నిద్రలేవగనే మనస్సు ప్రశాంతముగా యుండును. ఉదయమునే ప్రశాంత చిత్తముతో ధ్యానమును కొనసాగించిన, సాయంత్రమువరకు మన మనస్సు ధ్యానపూరితముగనే యుండును.

ధ్యానానంతరము శ్రీకృష్ణుడు నిర్మల జలమునందు స్నానము చేయును. సంధ్యావందనాది కర్మముల నాచరించును. ఆ తరువాత అగ్నిని ప్రతిష్ఠించి హోమాదికర్మముల నుపక్రమించును. గాయత్రీమంత్రమును మౌనముగా జపించును. మౌనజపము శ్రేష్ఠమైనది.

పూజ ఉత్తమమైనది. పూజకన్న వైఖరి జపము, వైఖరి జపము కన్నను ఉపాంశువు, ఉపాంశువు కన్నను మౌనజపము శ్రేష్ఠమని శాస్త్రము తెలుపుచున్నది.

తరువాత శ్రీకృష్ణుడు దేవతలకు, పితృదేవతలకు, ఋషులకు, వృద్ధులకు తర్పణముల నొసంగును. బ్రాహ్మణులను సేవించును. వారికి పట్టు వస్త్రములను, జింక చర్మములను, సువర్ణమును, ధేనువులను దాన మొసంగును. ఈ కార్యములన్నియు పూర్తియైన పిదపనే శ్రీకృష్ణుడు తన దేహము నలంకరించుకొనును.

ఆ తరువాత శ్రీకృష్ణుడు ఘృతమును, దర్పణములను, ధేనువులను, వృషభములను, ద్విజులను, దేవతలను దర్శించును. జనుల కోర్కెలను దీర్చి తృప్తి నొందును. అప్పుడు సారథి రథమును తెచ్చి ఆయన ఎదుట నిలుపును. అప్పుడు శ్రీకృష్ణుడు సాత్యకితోను, ఉద్ధవునితోను గూడి రథము నధిరోహించును.

గృహీత్వా పాణినా పాణీ సారథేస్త ముధారుహత్

శ్రీకృష్ణుడు తన చేతులతో సారథి చేతిని పట్టుకొని రథము నెక్కును.

ఆహా! కృష్ణప్రేమకు సాటియైనది ఈ ప్రపంచమున మరియొకటి లేదు. జగన్నాథుడైన శ్రీకృష్ణుడు తన సారథి చేయి పట్టుకొని రథము నెక్కును. ఆ సారథి పొందిన ఆనందమును మనము వర్ణించగలమా? ఈనాడు తన డ్రైవరు భుజముపై చేయి వేసే అధికారిని లేదా యజమానిని చూడగలుగుచున్నామా? ఆదర్శాలు అందరూ వల్లించగలరు. ఆచరణలో కొందరే నిలువగలరు.

శ్రీకృష్ణుడు సుధర్మయను సభలోకి ప్రవేశించును. ఆ సభలోకి ప్రవేశించిన వారికి ఆకలి దప్పికలు, శోకమోహాదులు, జరామరణము లుండవని భాగవతము పలికినది. నిజమే కదా! సుధర్మము అనగా చక్కని ధర్మము. అదియే ఆత్మధర్మము. ఆ సభాధ్యక్షుడు శ్రీకృష్ణుడే. ఆత్మానుభూతి నొందినవారికి జరామృత్యువు లెలా కల్గుతాయి?

శ్రీకృష్ణుడు సభలో యుండగా ఒక పురుషుడు ప్రవేశించెను. అతడు శ్రీకృష్ణునికి నమస్కరించి, జరాసంధుడు ఇరువదివేలమంది రాజులను బంధించి బాధపెట్టు విషయమును తెలియజేసెను.

కంజ విలోచన దానవ, భంజన యోగీంద్ర విమల భావలస ద్బో
ధాంజన దీప్తి నిదర్శన, రంజిత శుభమూర్తి కృష్ణ రాజీవాక్షా!

అని శ్రీకృష్ణుని స్తుతించి, జరాసంధుని చేత బంధింపబడి యున్న రాజులు విన్నవించిన విషయమును ఎరింగించెను.

"హే భగవాన్! నీ దివ్య పాదములను సేవించువారు సమస్త సంతాపముల నుండి విముక్తి పొందుచున్నారు. మేము నిన్నే శరణుజొచ్చి యున్నారము. ఈ జరాసంధుని బారినుండి రక్షింపుము. మా బంధములను తొలగింపుము. సింహము మేకను బంధించినట్లు అతడు మమ్ములను బంధించి యున్నాడు. దేవా! మమ్ము కరుణించి రక్షింపుము" అని బంధితులైన రాజులు శ్రీకృష్ణుని ప్రార్థించిరి.

ఈ విషయమును దూత శ్రీకృష్ణునకు తెలుపుచుండగా నారదమహర్షి అరుదెంచెను. శ్రీకృష్ణుడు నారదునకు నమస్కరించెను. నారదు డాసీనుడాయెను. అంతట శ్రీకృష్ణుడు నారదునితో, "మహానుభావా! ఈశ్వర సృష్టిలో మీకు తెలియని విషయము లేదు. ప్రస్తుతము పాండవు లేమి చేయుచుండిరో తెలుపుడు" అనెను.

నారదుడు శ్రీకృష్ణుని మాటల నాలకించి "జగన్నాథా! నీవు సర్వజ్ఞుడవు. అందుచేత పాండవుల విషయమును ఎఱింగియే యున్నావు. అయినను నీ యాజ్ఞను శిరోధార్యముగా భావించి, నేను పాండవులను గూర్చి నీకు వివరింతును" అనెను.

"ప్రభూ! యుధిష్ఠిరుడు రాజసూయ యజ్ఞమును నిర్వహింప నున్నాడు. ఆ విధముగా నిన్ను ఆరాధించవలయు నని అతని అభిమతము. నీవు ఆశీర్వదించవలసి యుండును. ఆ యజ్ఞమున నిన్ను దర్శించుటకై దివివాసులు, భువిరాజులు అక్కడకు చేరగలరు.

క॥ నీపేరు వినిన వాడివినఁ, బాపంబులు దూలిపోవు పరాక్ష జగ
ద్దీపక నీదర్శనమున, నేపారవె భక్తజనుల కిహపరసుఖముల్?
అని నారదుడు శ్రీకృష్ణుని కీర్తించెను.

శ్రీకృష్ణుడు ఉద్ధవు నుద్దేశించి, "ఉద్ధవా! నీవు చక్కని ఆలోచనలు చేయగలవాడవు. పైగా మాకు హితుడవు. ఇప్పుడు జరాసంధునిపై విజయము, రాజసూయయజ్ఞము అను ఈ రెండు కార్యములు మన ఎదుట నిలిచియున్నవి. ఈ రెండింటిలో మనము తక్షణ మాచరించదగిన కార్యమెయ్యది? నీవు చెప్పిన దానిని ఆచరించెదము" అని పలికెను.

శ్రీకృష్ణుని వచనముల నాలకించిన ఉద్ధవుడు, "స్వామీ! యుధిష్ఠిరునకు సహాయ మొనరించుట ఎంత కర్తవ్యమో, శరణు అనిన రాజులను విడిపించుట కూడా అంతటి కర్తవ్యమే అయి యున్నది. యుధిష్ఠిరుని రాజసూయయాగమునకు మీరు వెడలినచో అచ్చట జరాసంధుడు పరాభవింపబడవచ్చును. దాని ఫలితముగా రాజులు విడుదల బొందవచ్చును. రెండు ప్రయోజనములను సాధించే అవకాశ మేర్పడును. ఇది నా అభిమతము" అని పలికెను.

ఉద్ధవుని సలహాకు సర్వులు సంతసించిరి. శ్రీకృష్ణుడు బంధుజన పరివారముతో బయలుదేరి ఇంద్రప్రస్థమును చేరెను. శ్రీకృష్ణు డరుదెంచుచున్నా డనెడి వార్త తెలిసి శ్రీకృష్ణునికి యుధిష్ఠిరుడు ఎదురొచ్చి ఘనముగా ఆహ్వానించెను.

చిరాద్దృష్టం ప్రియతమం సస్వజేఽథ పునః పునః

చాలాకాలము తరువాత శ్రీకృష్ణుని చూచే భాగ్యము కలిగినది. అందువలన యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని పదేపదే ఆలింగన మొనర్చుకొనెను.

శ్రీకృష్ణుని ఆలింగన మొనర్చుకొనుట వలన యుధిష్ఠిరునకు పరమశాంతి లభించెను. నేత్రములు ఆనంద బాష్పములతో నిండిపోయినవి. శరీరము పులకరించెను. లోకవ్యవహారములు మరచి పోయెను.

భగవంతుని ఆలింగనము చేసుకొనినచో వ్యాకులము శాంతింపబడెను. ఆలయంలో భగవంతుని దర్శింతుము. అదికూడా ఆలింగనమే. అంటే నేత్రములతో కౌగలించుకొంటి మని అర్థము. భగవంతుని కడ, గురువులకడ ఆసీనులై దుఃఖము ననుభవించువారు పాపులై యుంటారు.

యుధిష్ఠిరుడు పుణ్యాత్ముడు. అందుచేత పరమాత్ముని కడ బాష్పములను నింపించెను. అదియును గాక లోకవ్యవహారము లన్నియు మరచెను. ఇదొక విశిష్టమైన ధ్యానము. భగవంతుని స్మరించునపుడు గాని, దర్శించునపుడు గాని ఎవరికి లోకవ్యవహారములు స్ఫురించవో వారే ధన్యజీవులు. ప్రపంచాన్ని మరచి, పరమాత్మను వలచి బ్రతుకువారే నిజమైన భక్తులు.

భీముడు, అర్జునుడు, నకులసహదేవులు కూడా శ్రీకృష్ణుని ఆలింగన మొనర్చుకొని సంతృప్తి చెందిరి. సూతాది మహర్షులు స్తుతించుచుండగా, బ్రాహ్మణులు వేదమంత్రములను పఠించుచుండగా శ్రీకృష్ణుడు నగరములోనికి ప్రవేశించెను.

నగరమంతయు అందముగా అలంకరించబడి యుండెను. శ్రీకృష్ణుని దర్శించుటకు నగరవాసులు బారులుతీరి నిలబడి యుండిరి. వారందరినీ తన చల్లనిచూపులతో ఆనంద పరచెను. శ్రీకృష్ణుడు రాజగృహమున ప్రవేశించెను. ద్రౌపదితో కూడా అరుదెంచిన కుంతీదేవి మేనల్లుడైన శ్రీకృష్ణుని ఆలింగన మొనర్చుకొనెను. శ్రీకృష్ణుడు కుంతీదేవికి నమస్కరించెను. ద్రౌపది సుభద్రలు శ్రీకృష్ణునకు నమస్కరించిరి. బంధువుల చిత్తములకు ఆనందమును చేకూర్చుచూ శ్రీకృష్ణుడు కొన్ని మాసములు ఇంద్రప్రస్థమునందే యుండెను.

రాజసూయ యాగము - జరాసంధ వధ

ఒకనాడు పూర్ణరూపమును ధరించియున్న సభలో ధర్మరాజ శ్రీకృష్ణునితో ఈ విధముగా పలికెను.

క్రతు రాజేన గోవింద రాజసూయేన పావనీః,
యక్ష్యే విభూతీ ర్భవత స్తత్వం పాదయ నః ప్రభో

"గోవిందా! నేను రాజసూయ యజ్ఞముద్వారా లోకపావనులైన దేవతల నారాధించ దలచితిని. ఈ కార్యము పూర్ణస్థితి నొందునట్లు నన్నాశీర్వదింపుము" అనెను.

ఉ॥ ఎవ్వరు నీపదాంబుజము లెప్పుడుఁ గొల్తురు భక్తినిష్ఠులై
యెవ్వరు నిన్నుఁ బ్రేమ నుతియింతురు భూరివివేకశాలులై
యవ్విమలాత్ము లందుదు రుదంచితశోభననిత్యసౌఖ్యముల్
నివ్వటిలంగఁ గృష్ణ! నిను నేర్చి భజించిన రిత్తవోవునే?

"కృష్ణా! ఈ రాజసూయ యజ్ఞసమయమున జనులు నీ పాదాంబుజములను దర్శించు భాగ్యమునకు నోచుకొందురు. భక్తులు కానివారు మోహమును వీడి భక్తులయ్యెదరు."

యుధిష్ఠిరుని మాటల నాలకించిన శ్రీకృష్ణుడు "మహారాజా! నీ సంకల్పము పరమోత్కృష్టమైనది. దానివలన నీ వైభవము విస్తృత మగును. ఈ యజ్ఞము సర్వులకు శుభదాయకమైనది.

విజిత్య నృపతీన్ సర్వాన్ కృత్వా చ జగతీం వశే

"నీవు రాజుల నందరిని జయించి, భూమండలమును వశపరచుకొని యజ్ఞ ద్రవ్యములను సేకరించి యాగము నొనర్చుము.

"ధర్మరాజా! నీవు జితేంద్రియుడవై నన్ను కూడా వశపరచుకొంటివి. నా యందు ఆసక్తి గలవానికి తేజము, ఐశ్వర్యము, కీర్తి మొదలగునవి సమృద్ధిగా యుండును. వానిని తిరస్కరించు శక్తి ఏ దేవతకును ఉండదు" అనెను.

ఎవ్వరు జితేంద్రియులో వారే శ్రీకృష్ణుని యందు చిత్తమును స్థిరముగా నుంచగలరు. చిత్తమును స్థిరముగా భగవంతుని యందు నిలుపగలిగిన వారికి భగవత్కృప లభించును.

ధర్మరాజు భగవానుని వచనములతో పూర్ణహృదయుడైనాడు. యజ్ఞము వైభవోపేతంగా నెరవేరుతుందనే విశ్వాసము దృఢంగా ఏర్పడింది. ఆ విశ్వాసముతోనే రాజులను జయించుటకు సహదేవుని దక్షిణదిశకు, నకులుని పశ్చిమదిశకు, అర్జునుని ఉత్తరదిశకు, భీముని తూర్పుదిశకు పంపెను.

అనేక దేశములయం దున్న రాజులను ఓడించి, విశేషముగా ధనరాసులను ప్రోగుచేసి పాండుతనయులు అగ్రజుడైన ధర్మరాజునకు సమర్పించి, సంతృప్తిని కలుగజేసిరి. కాని ఈ మగధరాజగు జరాసంధుడు మాత్రము యుధిష్ఠిరుని ఆధిక్యతను అంగీకరించలేదు. ఈ విషయమును అర్జునుని ద్వారా ఆలకించిన ధర్మరాజు మిక్కిలి వ్యథ చెందుచుండెను.

శ్రీకృష్ణుడు ధర్మరాజును శాంతపరచెను. జరాసంధుని వధించే ఉపాయము తనకు తెలుసునని చెప్పెను. శ్రీకృష్ణుడు, భీమసేనుడు, అర్జునుడు ముగ్గురు బ్రాహ్మణ వేషములను ధరించి, జరాసంధుని వధించుటకు గిరివ్రజమునకు వెళ్ళిరి.

ఒకనాడు జరాసంధుని చేరి, "రాజా! మేము దూరదేశమునుండి వచ్చిన వారము. బ్రాహ్మణులమైన మేము నీ అతిథులము. మా అభీష్టములను నెరవేర్చుము. నీకు శుభములు చేకూరగలవు.

కిం దుర్భరం తితిక్షూణాం కిమకార్యమసాధుభిః
కిం న దేయం వదాన్యానాం కః పరః సమదర్శినామ్

"ఈ లోకమున తితిక్ష గలవారు దేనినైనను సహింపగలరు. అసాధువులకు అకార్యమేదియును లేదు. వదాన్యులైనవారు ఇవ్వలేనిదంటూ ఉండదు. సమదర్శనము చేయు పుణ్యాత్ములకు అన్యులెవ్వరూ లేరు.

"రాజా! ఈ దేహము అస్థిరము. మన మనుగడ అశాశ్వతము. ఈ సత్యమును తెలిసి సత్కార్యముల నాచరించి, యశస్సును పొందవలెను. లేనిచో శోకము అనుభవించవలసి యుండును.

కం॥ పరికింపఁగ దేహం బ, స్థిరమని నిజబుద్ధిఁ దలఁచి చిరతరకీర్తి
స్ఫురణం బ్రస్తుతి కెక్కని, పురుషుఁడు జీవన్మృతుండు భూరివివేకా!

"రాజా! రంతిదేవుడు, హరిశ్చంద్రుడు, బలిచక్రవర్తి మున్నగువారు గతంలో పుణ్యకార్యములను నిర్వర్తించి, శాశ్వతకీర్తి పొందియున్నారు."

జరాసంధుడు బ్రాహ్మణ భక్తుడు. శ్రీకృష్ణుని మాటల నాతడు ఆలకించెను. బ్రాహ్మణవేషములో వచ్చిన ముగ్గురిని పరికించి చూచెను.

వారి రూపములను, కంఠస్వరములను, బాణములను సంధించుట వలన కాయలు కాచియున్న వారి హస్తములను పరిశీలించెను. వీరు బ్రాహ్మణులు కానియు, క్షత్రియులే యని నిర్ణయించుకొనెను. ఏదైనను వారి కోర్కెను తీర్చుటయే ధర్మమని భావించెను.

దదాని భిక్షితం తేభ్య ఆత్మానమపి దుస్త్యజమ్

వారు కోరినచో తన శరీరము నిచ్చుటకు కూడా సిద్ధపడెను. ఇలా నిర్ణయించుకొనిన జరాసంధుడు విప్రవేష ధారులతో,

కం॥ భూరిగుణులార మీమది, కోరిక యెఱింగింపు డేమి కోరిననైనన్
ధీరత నొసగుటయే కా, దారయ నాశిరము ద్రుంచి యైనను నిత్తున్.

అని పలికెను.

శ్రీకృష్ణుడు వెంటనే జరాసంధుని జూచి, "రాజా! మేము క్షత్రియులము. ద్వంద్వ యుద్ధము చేయవలె ననెడి అభిలాషతో నీవద్దకు వచ్చితిమి. ఇతడు కుంతీ తనయుడైన భీమసేనుడు. ఇతడు అతని తమ్ముడైన అర్జునుడు. నేను నీకు శత్రువునైన కృష్ణుడను."

కృష్ణుని మాటల నాలకించిన జరాసంధుడు, "కృష్ణా! గతంలో మనము అనేకసార్లు పోరాడియున్నాము. నా శక్తి నీకు తెలియనిది కాదు. నన్ను ఎదిరించలేక నీవు మథురా నగరమును విడిచి సాగరంలో తల దాచుకున్నవాడవు. నీవు భీరుడవు. అట్టి నీవు వీరుడనైన నాతో యుద్ధము చేయుటకు అనర్హుడవు.

"ఇకపోతే అర్జునుడు. ఇతడు కూడా బలహీనుడే. పైగా చిన్నవాడు కనుక నాతో యుద్ధము చేయుటకు అయోగ్యుడే.

"కృష్ణా! భీముడొక్కడే నాకు సరిసమైనవాడు. గదాయుద్ధంలో భీమునితో పోరాడుటకు నేను సిద్ధమే అని పలికి భీమునకు ఒక గదనిచ్చి తానొక గదను తీసికొనెను.

గదాయుద్ధము ప్రారంభమైనది. వారిరువురు పరస్పరము తీవ్రముగా పోరుచుండిరి. వారి గదల తాకిడికి ఏర్పడిన శబ్దము రెండు పర్వతములు ఢీకొనినట్లు ఉండెను. ఒక్కొక్కసారి రెండు సింహములు పోరుచున్నట్లు ఉండేది. ఒక్కొక్క పర్యాయము రెండు ఏనుగులు కలియబడ్డట్లు గోచరించేది. ఇలా పోరుటలో ఇరువురి గదలు నుగ్గయిపోయినవి. ఆ వెంటనే వారు ముష్టి యుద్ధమునకు దిగినారు.

ఉ॥ వ్రక్కలు చెక్కులున్ మెదలు పాణితలంబులచేఁ బగుల్చుచున్
ముక్కులు నక్కులుం జెవులు ముష్టిహతిన్ నలియంగఁ గుద్దుచున్
డొక్కలుఁ బిక్కలున్ ఘనకఠోర పదాహతి నొంచుచున్ వెలుల్
దక్కక స్రుక్క కొండొరులఁ దార్కొని పేర్కొని పోరి రుగ్రతన్.

ఈ విధముగా వారిరువురు పోరుచుండిరి. వారు పగలంతయు పోరాడెదరు. రాత్రులయందు మిత్రులవలె నుందురు. ఈ విధముగా ఈ ఇరువురి వీరుల మధ్య ఇరువదియేడు దినములు యుద్ధము సాగెను. ఇరువదియెనిమిదవ దినమున భీముడు శ్రీకృష్ణుని సమీపించి,

న శక్తోఽహం జరాసంధం నిర్జేతుం యుధి మాధవ

"కృష్ణా! నేను యుద్ధమున జరాసంధుని జయింపజాలను" అనెను.

జరాసంధుని జననమరణ రహస్యముల నెరిగిన శ్రీకృష్ణుడు ఆలోచించెను. ఉపాయమును కనుగొనెను. అప్పుడు ఒక చెట్టుకొమ్మను తీసికొని దానిని రెండుగా చీల్చి భీమునకు ఉపాయము సందించెను. శ్రీకృష్ణుని భావమును భీమసేనుడు గ్రహించెను. జరాసంధుని పాదములను పట్టుకొని నేలపై పడవేసెను. ఆ తరువాత మరపురాని చెట్టుకొమ్మను చీల్చునట్లు భీముడు జరాసంధుని వధించుటకు నిశ్చయించుకొనెను. తన పాదముతో జరాసంధుని ఒక కాలును త్రొక్కిపట్టెను. జరాసంధుని రెండవ పాదమును గట్టిగపట్టుకొని గుదము నుండి క్రమముగా పైకి చీల్చివేసెను. రెండు ఖండములైనది మరణించిన జరాసంధుని గాంచి బంధువులంతా దుఃఖించిరి. కృష్ణార్జునులు భీమసేనుని కౌగలించుకొని సంతృప్తిచెందిరి.

అనంతరము జరాసంధుని పుత్రుడైన సహదేవుడను వానిని మగధకు అధిపతిని చేసిన శ్రీకృష్ణుడు జరాసంధుడు బంధించిన ఇరువదివేల రాజులను చెఱసాల నుండి విడిపించెను. రాజులందరు శ్రీకృష్ణునికి పాదాభివందనము గావించినారు.

ఆ॥ వరద పద్మనాభ హరి కృష్ణ గోవింద దాసదుఃఖనాశ వాసుదేవ
యవ్యయాప్రమేయ యనిశంబుఁ గావింతు మిందిరేశ నీకు వందనములు

అని ప్రార్థించిన రాజులు శ్రీకృష్ణునితో

"ముకుందా! జీవితలక్ష్య మేమిటో తెలియక మేము ఇంతవరకు భ్రాంతులమై వ్యర్థమైనర్యుకొనినాము. అనిత్య ప్రపంచ ఎడారిలో సంసార ఎండమావులను జలపానము అనుకొని పరుగిడి అలసిపోయినాము. ఈ ప్రాంపిక విషయ సుఖాలు అశాశ్వతములని ఇప్పుడు మాకు అవగతమైనది. ఆశలు అడుగంటి పోయినాయి. మమ్ములను నీ భక్తకోటిలో చేర్చుకొని ఉద్ధరించుము" అని ప్రార్థించగా శ్రీకృష్ణుడా రాజమండలిని ఆశీర్వదించెను.

జరాసంధుడు అనగా ముసలితనమని గ్రహించియున్నాము. వృద్ధాప్యము అతిభయంకరమైనది. భీముడు జరాసంధునితో యుద్ధము చేయుచుండెను.

నారాయణరూపుడైన శ్రీకృష్ణుడు పరమాత్మగా తెలియుచున్నాడు. నరుని అవతారమైన అర్జునుడు జీవునిరూపముగా తెలియుచున్నాడు. వీరిరువురు సాక్షిమాత్రులే. ఆత్మకు జరామరణాలు లేవు. అందుచేత జరాసంధునితో భీముడు యుద్ధమునకు తల పడెను.

భీముడు వాయుదేవుని కుమారుడు. అనగా ప్రాణమునకు సంకేతము. ముసలితనము జీవాత్మను, పరమాత్మను ఏమియు చేయలేదు. ఒక్క ప్రాణమునే బాధించ గలుగును. ఈ కారణము చేతనే జరాసంధుడు కృష్ణార్జునులను వదలి భీమునే ద్వంద్వ యుద్ధమునకు ఎన్నుకొనెను.

వృద్ధాప్యమును భరించలేక ప్రాణము అల్లాడిపోవును. అలాగే భీముడు జరాసంధుని తట్టుకొనలేక పోయెను. ఇలాంటి విషమ సమయములయందు మనకు భగవానుని అనుగ్రహము తోడుగా నిలువవలెను.

భీముడు శ్రీకృష్ణుని సమీపించి తన అశక్తతను తెలియజేసెను. అలాగే మనము కూడా వృద్ధాప్యములోనే గాకుండా ఎప్పుడైనను కష్టము వచ్చినచో దీనదయాళుడైన పరమాత్మకు చెప్పుకొనే ఒక పరలవాటును ఏర్పరచుకోవాలి.

శ్రీకృష్ణుడు భీముని వారించెను. ఉపాయము ఆలోచించెను. యుద్ధము చేయునపుడు తనవైపే చూడమని భీమునికి చెప్పి యుద్ధమునకు పంపెను.

మనము జీవన సమరంలో అంధులవలె పోరాడు చుందుము. ఒకవైపు ఓటమి ఎదురౌతున్నను మూర్ఖులవలె పోరుచుందుము. భగవంతుని వీక్షిస్తూ పోరాడ గలగాలి. భగవంతుని మరచి చరించునది పశుబలము. భగవంతుని స్మరించుకొంటూ ఆచరించునది దైవబలము. పశుబలము పాశముతో బంధించును. దైవబలము కనికరించి ఆశీర్వదించును.

శ్రీకృష్ణుని దివ్యవచనములను చెవులదాల్చి ఉత్సాహం భీమసేనుడు జరాసంధునితో యుద్ధమునకు తలపడెను. భీకరపోరాటము మధ్య శ్రీకృష్ణుని వీక్షించెను. వెంటనే శ్రీకృష్ణుడు చెట్టుకొమ్మ నొకదానిని తీసికొని దానిని రెండుగా చీల్చి పడవైచెను. దాని ననుసరించి భీముడు జరాసంధుని రెండుగా చీల్చివైచెను.

మర్త్యుడు చీల్చదమే సంధిలో దృష్టినుంచుట యని అర్థము. రెండు సంకల్పముల మధ్య సంధి సమయంలో అనుభవమునకు అందునదియే బ్రహ్మజ్ఞానము. అట్టి జరామరణములు ముట్టలేవు. అవియే మృతిచెందును. జరాసంధుడు అలాగే మృతిచెందెను. ఇది ధ్యానము కూడా తెలియని స్థితి. దీనినే సమాధి యందురు.

ధ్యాన విస్మృతిః సమాధిః

"ధ్యాన విస్మృతియే సమాధి" యని మండలబ్రాహ్మణోపనిషత్తు ప్రవచించినది.

శిశుపాల వధ

జరాసంధుడు సంహారింపబడెను. ఆ వివరములను, విషయములను తెలిసికొని ధర్మరాజు సంతుష్ట చిత్తుడాయెను. శ్రీకృష్ణునితో ఈ విధముగా పలికెను:

"కృష్ణా! నీవు అద్వితీయుడవు. పరమాత్మవు. నిన్ను అర్చించు సేవకులు భేద బుద్ధిలేనివా రైనందున వారు ధన్యులు.

న వైతే౽జిత భక్తానాం మమాహమితి మాధవ
త్వాం తవేతి చ నానాధీః పశూనా మివ వైకృతీ

"ఓ అజేయుడా! మాధవా! అవివేకుల యందు భేదబుద్ధి చెలియులాగున నీ భృత్యులలో "నేను-నాది" యనెడి భేదబుద్ధి గోచరించదు.

సీ॥ కమలాక్ష సర్వలోకములకు గురుఁడవై తేజరిల్లెడు భవదీయమూర్తి
యంశాంశసంభవు లగు లోకపాలురు నీయాజ్ఞఁ దలమోచి నిఖిలభువన
పరిపాలనిపుణులై భాసిల్లుచున్నవా రట్టి నీ కొక నృపు నాజ్ఞసేయు
టరయ నీ మాయగా కది నిక్కమే యేక మై యద్వితీయమై యవ్యయంబు

తే॥ నైన నీ తేజమున కొక హాని గలదె? చిన్మయాకార నీపాదసేవకులకు
నాత్మ పర భేదబుద్ధి యెందైన గలదె? పుండరీకాక్ష గోవింద భువనరక్ష

ఈ విధముగా పలికి శ్రీకృష్ణుని అనుమతిని పొంది, ఉత్తములైన బ్రాహ్మణులను ఋత్విజులుగా వరించి, ధర్మరాజు రాజసూయ మహాయజ్ఞ నిర్వహణ కుపక్రమించెను.

హస్తినాపురము నుండి ధృతరాష్ట్రుడు, విదురుడు, భీష్మ ద్రోణులు, కృపాచార్యులు అశేష జనవాహినితో గూడి రాజసూయ యాగమునకు అరుదెంచిరి.

ఋత్విజులైన మహాత్ములు బంగారు నాగలితో యజ్ఞస్థలిని దున్ని, అచట ధర్మరాజుని యజ్ఞ దీక్షితునిగ నొనర్చిరి. యాగవైభవము అనూహ్యమై నిలిచింది.

మహోత్సవం సమాప్తిరోజున యాజకులను, పెద్దలను అర్చించడానికి యుధిష్ఠిరుడు నిర్ణయించుకొనెను. ఆ సమయంలో అగ్రపూజకు అర్హులెవరా యని ధర్మరాజు ఆలోచించు చుండెను. కానీ నిర్ణయించలేకపోయెను. అప్పుడు సహదేవుడు ఇలా పలికెను

అర్హతి హ్యచ్యుతః శ్రైష్ఠ్యం భగవాన్ సాత్వతాం పతిః
ఏష వై దేవతాః సర్వా దేశకాల ధనాదయః

"ఈ సభలో అగ్రపూజ నందుకొనుటకు అచ్యుతుడే అర్హుడు. ఇతడు సర్వదేవతా స్వరూపుడు. దేశకాల సంపదల రూపములో శోభించువాడు."

ఉ॥ ఈ పురుషోత్తమున్ జగదధీశు ననంతుని సర్వశక్తుఁ జి
ద్రూపకు నగ్రపూజ బరితోషితుఁ జేయ సమస్తలోకముల్
నే పరితుష్టిఁ బొందుఁ బృథివీవర! కావున నీవు కృష్ణునన్
శ్రీపతి బూజసేయుము మెదసేయుక మాటలు వేయు నేటికిన్?

అని సహదేవుడు ధర్మరాజుతో పలికెను. ఆ మాటల నాలకించిన సజ్జనులు

సాధు సాధ్వితి సత్తమాః

"మేలు మేలు" అని పలికిరి. వారి ఆమోదమును శిరోధార్యముగా భావించి, ధర్మరాజు శ్రీకృష్ణుని అర్చించెను.

సతీ సమేతుడై, సోదర, బంధు, మిత్ర, అమాత్యులతో కూడినవాడై శ్రీకృష్ణుని చరణపంకజములను ప్రక్షాళనమొనర్చి ఆ జలమును శిరమున చల్లుకొనెను. ఈ సమయమున ధర్మజుని హృదయము సంతృప్తిని చెందగా, దివ్య పారవశ్యంలో ఆనందాశ్రువులు ప్రవహించుచుండెను. ఆ పరిస్థితి మధ్య ధర్మరాజు శ్రీకృష్ణుని చక్కగా దర్శించలేకపోయెను. ఇదియే భక్తిలో పరాకాష్ఠ. రాధ కూడా శ్రీకృష్ణునితో తన అనుభవమును ఈ విధముగానే వర్ణించి చెబుతుంది.

శ్యామ! సఖీ నీకే దేఖే నాహి
చిత్‌వత్ హీ లోచన్ భరి ఆయే బార్ బార్ పఛితాయీ

"చెలీ! శ్యామసుందరుని దర్శించగనే ఆనంద బాష్పములతో నా నేత్రాలు నిండి పోయేవి. నేను అతనిని దర్శించలేక పోయెడిదానను" అని రాధాదేవి చెలికత్తెతో చెప్పినట్లు మహాత్ముడైన సూరదాసు వర్ణిస్తాడు.

ధర్మరాజు అత్యంత వైభవముతో శ్రీకృష్ణుని అర్చించగనే, ఆనంద పరవశులై గాంచిన సభ్యులు

నమో జయేతి నేముస్తం నిపేతుః పుష్పవృష్టయః

"నమస్తే.. నమస్తే" అనియు, "జయము-జయము" అనియు పలుకుచూ శ్రీకృష్ణునిపై పుష్పవర్షమును కురిపించిరి.

ఈ వైభవమును గాంచి ఈర్ష్య చెందిన శిశుపాలుడు కుపితుడై, లేచి నిలబడి ఈ విధముగా పలికెను:

"సభికులారా! ఇది భరింపరాని విషయముగా తోచుచున్నది. బాలుడైన సహదేవుని మాటలకు విలువనిచ్చి, ఇందరు మహాత్ములు, విద్వాంసులు, పెద్దలు, బ్రాహ్మణులు ఈ సభలో నుండగా యాదవునికి అగ్రపూజ చేయుట ఘోరముగా తెలియుచున్నది. అతడు కులరహితుడు, అధర్మపరుడు, గుణహీనుడు, స్వేచ్ఛావర్తి. అతడు అగ్రపూజ ఎలా గ్రహింపగలడు? ఇది చూడగా యజ్ఞవాటిక యందు పురోడాశమును కాకి గ్రహించినట్లున్నది" అని క్రుద్ధుడైన శిశుపాలుడు వ్యర్థ ప్రసంగమును చేయుచుండెను. ఈ సందర్భమున శిశుపాలుని మాటలను ఒక్క సీసపద్యమున పోతనామాత్యుడు చక్కగా పొందు పరచినాడు.

సీ॥ గురు దేవ శూన్యుండు కుల గోత్ర రహితుండు దల్లిదండ్రు లెవ్వరో దలఁప గాన
ముప్పొలఁ బొరలెడు వాదిమధ్యావసా నంబులం దరయ మానంబు లేదు
బహురూపియై పెక్కు భంగుల వర్తించు వావివర్తనములు వరుస లేవు
పరికింప విగతసంబంధుండు దలపోయ మా నిమిత్తంబున మానవయ్యె

తే॥ బరఁగ మున్ను యయాతిశాపమునఁ జేసి వాని కెక్కడ యీ యదువంశ మెల్ల
బ్రహ్మ తేజంబునెల్ల గోల్పడిన యితడు బ్రహ్మఋషి సేవ్యుఁ డగునె గోపాలకుండు.

అని శిశుపాలుడు కఠోర వచనములను పలికెను. ఈ విధముగా శిశుపాలుడు వాగుటను ఆలకించిన సభ్యులు శ్రీహరిని దూషించుటను వినలేక శిశుపాలుని నిందిస్తు సభనుండి నిష్క్రమించిరి.

నిన్దాం భగవతః శృణ్వన్ తత్పరస్య జనస్య వా
తతో నాపైతి యః సోపి యాత్యధః సుకృతాచ్యుతః

"భగవానుని గూర్చిగాని, ఆయన భక్తులను గూర్చిగాని ఎవరైనను నిందించినచో, ఆ మాటల నాలకించిన వారుకూడా నిందించినవారై నరకమున పడిపోవుదురు" అని ఈ సందర్భమున వ్యాసమహర్షి ప్రవచించెను.

శిశుపాలుని వచనములకు శ్రీకృష్ణుడు ఏమియును చలించలేదు. శునక శబ్దమును హస్తి గుర్తించని విధముగా శ్రీకృష్ణుడు ప్రశాంతముగా నుండెను.

నోవాచ కించి ద్భగవాన్ యథా సింహః శివారుతమ్

నక్కల అరుపులకు సింహము జవాబు నొసంగని విధముగా శ్రీకృష్ణుడు మిన్న కుండెను.

కృష్ణ నిందను భరింపలేని మత్స్య కేకయ సృంజయులు సహదేవుని నాయకత్వమును స్వీకరించిన వారై, ఆయుధములను చేబూని శిశుపాలుని సమీపించినారు. శిశుపాలుడు వారిని కూడా నిందించుచూ, తన సహచరులతో కూడి యుద్ధమునకు సిద్ధమయ్యాడు. యజ్ఞసీమ సమరభూమిగా మారుతుందేమో అనే భయముకూడా చాలామందిలో కలిగింది.

శ్రీకృష్ణుడు ఆసనము నుండి లేచినాడు. అసహనపు పలుకులను వద్దని వారించినాడు. శిశుపాలుని పాపము పండినది. శ్రీకృష్ణుడు శిశుపాలుని శీఘ్రముగా శిక్షించినాడు. సుదర్శన చక్రమును ప్రయోగించినాడు. శిశుపాలుని శిరము ఖండించబడినది. భయభ్రాంతులకు గురియైన శిశుపాలుని అనుచరులు అటు ఇటు పరుగిడుచుండిరి. శిశుపాలుని దేహము నుండి లేచిన ఆత్మజ్యోతి శ్రీకృష్ణుని యందు ప్రవేశించెను. శిశుపాలుడు ధన్యుడాయెను.

మూడు జన్మలనుండి పెంచుకొనిన భగవద్విరోధము వలన సదా పరమాత్మనే శిశుపాలుడు చింతించుచుండెను. భ్రమరకీటకన్యాయము చందమున శిశుపాలునకు సద్గతి లభించెను.

శిశుపాలుడు ఎవరోకాదు. మల, ఆవరణ, విక్షేపాదు లనెడి దోషత్రయముతో కూడుకొనినవాడు. మూడు సంవత్సరముల లోపు పిల్లలను శిశువులందురు. మూడు బాల్యములకు లోబడియుండుట వలన అతడు శిశుపాలుడైనాడు.

లయ విక్షేప రహితః మనః కృత్వా సునిశ్చలమ్
యదా యాత్య మనీభావం తదా తత్పరమం పదమ్

"లయ విక్షేపాదులను మనస్సు నుండి తొలగించి, మనస్సును నిశ్చలమొనర్చి ఎవరు ధ్యానతత్పరు డగునో అతడు పరమాత్మను పొందుచున్నాడు" అని మైత్రాయణ్యుపనిషత్తు పలికినది.

ఈ దోషములు నివారింపబడి లోపము చేకూరనప్పుడే భగవద్దర్శనము లభించగలదు. అట్టి దర్శనమే సుదర్శనము. అదియే శ్రీకృష్ణుడు ప్రయోగించిన సుదర్శన చక్రము. అది జీవుని దుర్గుణము తొలగించి పరమాత్మలో ఐక్యమగునట్లు చేయును. శిశుపాలుడు ఆ విధముగానే పరమాత్మలో ప్రవేశించి తరించెను.

విగత రాగ భయక్రోధాది సర్వ దోషైః సర్వదా మునిభిః అయమాత్మా దృష్టః

"అనురాగము, భయము, క్రోధము మొదలైన సమస్త దోషములనుండి విడివడిన మునులు ఆత్మను దర్శించుచున్నారు" అని శ్రీశంకరులు తమ ఉపనిషద్భాష్యంలో తెలిపియున్నారు.

వీత రాగ భయక్రోధః స్థిత ధీ ర్ముని రుచ్యతే

"అనురాగము, భయము, క్రోధము నుండి ఎవని బుద్ధి విడివడి, స్థిరపడి యున్నదో అట్టి స్థితప్రజ్ఞుడే ముని అని ఎఱుంగుము" అని శ్రీకృష్ణపరమాత్మ గీత-సాంఖ్యయోగము నందు తెలిపియున్నాడు.

శిశుపాలుడు కేశవునిలో ఐక్యమయ్యెను. శిశుపాలుని వధతో యాగము సమాప్తమైనది. మల, ఆవరణ, విక్షేపాదులు తొలగుటతో మన సాధన కూడా సమాప్త మౌతుంది.

కొన్ని మాసములు శ్రీకృష్ణుడు ధర్మరాజాదులతో కూడి ఇంద్రప్రస్థము నందే యుండెను. శ్రీకృష్ణుని వదలి ఉండలేని పాండవులకు నచ్చజెప్పి, వారిని ఓదార్చి ఆ తరువాత ద్వారకకు వెడలెను.

రాజసూయ యజ్ఞ వైభవమును సర్వులు కీర్తించిరి. శ్లాఘించిరి. ధర్మద్వేషియైన ఒక్క దుర్యోధనుడు సహించలేక పోయెను. ధర్మరాజు యొక్క ఐశ్వర్యమును గాంచి ఈర్ష్యాలోలుడాయెను. మత్సరగ్రస్తుడు ఎక్కడా సుఖించలేడు. ఇక్క చెవులు వెదకువాడు దుర్జనుడు దోషములనే దర్శించును.

య ఇదం కీర్తయే ద్విష్ణోః కర్మ చైద్యవ ధాధికమ్
రాజమోక్షం వితానాం చ సర్వపాపైః ప్రముచ్యతే

"ఈ రాజసూయము, శిశుపాల సంహారములను స్మరించువారు సర్వకిల్బిషముల నుండి తరించుదురు" అని వ్యాసభగవానుడు ఫలశ్రుతి నందించినాడు.

దుర్యోధనుని దురదృష్టము

సర్వులు ఆనందించుచుండిన సభలో సంతాపముతో కుమిలిపోయిన దురదృష్టవంతుడు దుర్యోధనుడు. దౌర్భాగ్యుల జీవితాలు ఎప్పుడూ అలాగే యుండును. కనుక ఎప్పుడూ క్రోధ ఈర్ష్యాదుల నుండి వ్యక్తి విడివడి యుండవలెను.

రాజసూయము సమాప్తమైనది. వైభవముగా అవభృథ స్నానాదులు కూడా పూర్తి అయినవి. మృదంగ ధ్వనులతో, పణవ గోముఖ వాద్యములతో, నర్తకీమణుల నృత్యములతో, గాయక సమూహము మధురగానములను వినిపించుచుండగా ఇంద్రప్రస్థము స్వర్గమువలె శోభిల్లెను.

విచ్చేసిన రాజులందరు సెలవు తీసుకొని పయనమైనారు. ఆ సమయమున వేదఘోష మిన్ను ముట్టెను. దేవతలు పుష్పవర్షమును కురిపించిరి. ఋత్విజులు దీక్షాంత కర్మలను నిర్వర్తించిరి. ధర్మరాజు ద్రౌపదితో కూడి గంగాస్నానము చేసెను. అమృతపాన మనెడి మధురానుభూతి ఒక్కసారి కలిగినచో, పదేపదే అట్టి అనుభూతిని హృదయము వాంఛించునట్లు, రాజసూయమును తిలకించినవారు పునః పునః తద్వైభవమును కీర్తించసాగిరి.

ఈ విధముగా భగవంతుని అనుగ్రహముచే ధర్మరాజు చక్కగా రాజసూయ యజ్ఞమును పరిసమాప్తి గావించెను. రాజులందరు వెడలినను తన బంధువులను, హితులను కొంతకాలము ఇంద్రప్రస్థము నందే ఉండవలసినదని యుధిష్ఠిరుడు ప్రార్థించగా వారు అందులకు అంగీకరించి ఉండిపోయిరి. అట్టివారిలో మహాత్ముడైన మాధవునితోపాటు దురాత్ముడైన దుర్యోధనుడు కూడా యుండెను.

దుర్యోధనుడు ధర్మరాజు అంతఃపురమును గాంచి అసూయతో కూడినవాడై విచలిత మనస్కు డయ్యెను. అసూయాపరుడు ఎన్నడూ పరుల అదృష్టమును గాంచి సంతసించలేడు. సంతాపమే అతని సంపదగా యుండును.

ఒకనాడు మయునిచే నిర్మించబడిన దివ్యసభ యందు ధర్మరాజు తమ్ములతో గూడి బంగారు సింహాసనముపై ఆసీనుడై యుండెను. అప్పుడు ద్వారపాలకులు వద్దని వారించుచున్నను వినకుండా దుర్యోధనుడు ఆ మయసభలో ప్రవేశించెను.

ఆ సభను గాంచి దుర్యోధనుడు దిగ్భ్రాంతి చెందెను. ఒక్కొక్కచోట నీరు భ్రమించి పట్టువస్త్రమును ఎత్తిపట్టుకొనెను. నీరున్నచోట లేదని తలచి నడచి జలమునందు పడిపోయెను. సత్యమును అసత్యముగాను, అసత్యమును సత్యముగాను భ్రమించు వారందరు దుర్యోధనులే. ఇదియే మోహము.

దుర్యోధనుడు నీటిలో పడిపోయెను. అది గాంచిన సేవకులందరు నవ్వసాగిరి. అలా నవ్వుట మంచిదిగాదని ధర్మరాజు వారించుచుండెను. అయినను వారి నవ్వులను ఆపలేకపోయెను. అభిమానముగల దుర్యోధనుని హృదయము కలతచెంది ముక్కలయ్యెను. అది గొప్ప అవమానముగా దుర్యోధనుడు భావించెను. ఇక ఇంద్రప్రస్థమున నిలువలేక హస్తినాపురమునకు బయలుదేరి వెళ్ళెను.

సాల్వ సంహారము

రుక్మిణీ స్వయంవరమునకు అరుదెంచి భంగపడిన రాజులలో సాల్వుడు ఒకడు. రుక్మిణిని హరించిన శ్రీకృష్ణునిపై సాల్వుడు ఈర్ష్యపడెను. శ్రీకృష్ణునిచే పరాభవించబడిన సాల్వుడు

అ యాదవాం క్ష్మాం కరిష్యే పౌరుషం మమ పశ్యత

"నేను ఈ పృథివిని యాదవ శూన్యముగా చేయుదును. నా ప్రభావమును వీక్షింపుడు" అని ప్రతిజ్ఞ చేసెను.

ఈ ప్రతిజ్ఞ నెరవేరుటకు సాల్వుడు ఘోర తపమాచరించెను. ఒక పిడికెడు మట్టిని మాత్రమే నిత్యము భుజించుచూ తపమాచరించెను. శంకరుని ప్రార్థించసాగెను.

పరమశివుడు సాల్వునకు దర్శన మొసగెను. వరమును కోరుమని పలికెను. అప్పుడు సాల్వుడు దేవతలకు, రాక్షసులకు, మనుజులకు, గంధర్వులకు అసాధ్యమైనదియు, యాదవులకు భీతిని కలిగించునదియు నగు ఒక విమానమును గోరెను. శివుడు మయుని ద్వారా అట్టి దానిని సాల్వున కిచ్చెను. అదియే లోహమయమైన సౌభకము.

తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనుటకు, శ్రీకృష్ణుని సంహరించుటకు సౌభకము నెక్కి సైన్యముతో గూడి ద్వారకకు వెడలెను. ద్వారకలోని పురద్వారములను, ఉద్యానవనములను నాశనము చేసెను. ద్వారకపై బాణవృష్టిని కురిపించుచుండెను.

ఆ సమయమున శ్రీకృష్ణుడు ద్వారకయందు లేడు. ప్రద్యుమ్నుడు నగరవాసులను ధైర్యవంతులుగా జేసి సాల్వుని ఎదుర్కొనుటకు సైన్యముతో బయలుదేరి వచ్చెను. దేవదానవ సంగ్రామము వలె యదు సాల్వ సేనలమధ్య భయంకర పోరాటము కొనసాగెను. ప్రద్యుమ్నుడు సాల్వుని మాయను ఛేదించెను. వాని సైన్యమును తీవ్రముగా బాధించెను. సాల్వుడు మూర్ఛితు డయ్యెను.

సాల్వుని సేనలో ద్యుమానుడు అను మంత్రి గలడు. అతడు వెళ్ళి లోహపుగదతో ప్రద్యుమ్నుని గొట్టి భయంకరముగా సింహనాదము జేసెను. వెంటనే సారధి ప్రద్యుమ్నుని రథమును వేరొక చోటికి గొనిపోయెను.

కొంతసేపటికి ప్రద్యుమ్నుడు తేరుకొని సైకి లేచి "సూతుడా! ఎంత ఘోరకార్యము చేసితివి. యుద్ధరంగము నుండి నన్ను దూరముగా తీసికొని వచ్చి, నన్ను అపఖ్యాతి పాలు జేసితివి. నీవలన యుద్ధరంగము నుండి పారిపోయిన అపకీర్తి నాకు సిద్ధించినది. యాదవ వంశమున ఎవ్వరూ యుద్ధమునుండి ఇప్పటి వరకు పారిపోలేదు. నా తండ్రులు, మహావీరులగు బలరామకృష్ణులకు నా మొగము నెలా చూపెను?" అని సారధితో పలికెను.

ప్రద్యుమ్నుని మాటల నాలకించిన సారధి,

"ప్రభూ! మీ రథమునకు సారథినైన నేను ధర్మమును తప్పలేదు. యుద్ధ నియమము అనెడి ధర్మము ననుసరించియే నేనలా ప్రవర్తించితిని.

ధర్మం విజానతా యుష్మన్ కృతమే తన్మయా విభో
సూతః కృచ్ఛ్రగతం రక్షేత్రథినం సారథి రథీ!

"ప్రభూ! చిరంజీవీ! సారధి అపాయమునకు గురియైనచో రథికుడు, రథికుడు ఆపదకు గురియైనపుడు సారథియు కాపాడవలె ననెడి నియమము కలదు. అది తెలిసియే నే నాకార్యమును చేసితిని" అనెను.

ప్రద్యుమ్నుడు మూర్ఛనుండి లేచిన పిదప స్నానమాచరించి, కవచమును ధరించెను. ధనుస్సును చేబూని రథమునెక్కి, ద్యుమని కడకు తీసుకొని పొమ్మని సారథికి చెప్పెను. సారధి రథమును ద్యుమని వద్దకు గొనిపోయెను. మందస్మిత వదనారవిందుడైన ప్రద్యుమ్నుడు వరుసగా ఎనిమిది శరములను ప్రయోగించెను. నాలుగు బాణములతో నాలుగు అశ్వములను గూల్చెను. ఒక బాణముతో సారథిని వధించెను. ఒక బాణముతో ధనుస్సును విరగగొట్టెను. ఒక శరముతో పతాకమును ఛేదించెను. చివరి బాణముతో ద్యుమని శిరమును ఖండించెను.

ఈ విధముగా సాగుచున్న భయంకర సమరము యాదవ సాళ్వ సైనికుల మధ్య ఇరువదియేడు రోజులు సాగినది.

ఇంద్రప్రస్థమున వసించుచున్న శ్రీకృష్ణునకు దుశ్శకునములు గోచరించెను. వెంటనే ధర్మరాజాది బంధువుల అనుమతిని గైకొని ద్వారకకు బయలుదేరెను. ద్వారకను చేరి విషయమును గ్రహించెను. నగర రక్షణ భారమును బలరామునిపై నుంచి శ్రీకృష్ణుడు రథము నెక్కి మాయావి యగు సాల్వుని కడకేగెను.

శ్రీకృష్ణుని సాల్వుడు గాంచెను. వెంటనే ప్రద్యుమ్ననిపై గొప్ప ధ్వనితో కూడిన శక్తిని ప్రయోగించెను. గగనమున మహాతేజముతో కదలి వచ్చుచున్న శక్తిని గాంచిన శ్రీకృష్ణుడు బాణములను ప్రయోగించి దానిని ముక్కలు జేసెను. పిమ్మట శ్రీకృష్ణుడు సాల్వుని ఎదుర్కొని పదునారు బాణములను ప్రయోగించెను.

సాల్వుడు శార్ఙమను ధనుస్సును పట్టుకొని యున్న శ్రీకృష్ణుని ఎడమచేతిని కొట్టెను. శ్రీకృష్ణుని చేతినుండి ధనుస్సు క్రింద పడిపోయెను. వెంటనే సాల్వుడు సింహనాదము చేయుచు

"ఓయీ! మూర్ఖుడా! కృష్ణా! నీవు దుర్మతివై శిశుపాలుడు వివాహము చేసికొనబోవు యువతిని దొంగవలె హరించితివి. రాజసూయ యజ్ఞములో శిశుపాలుని సంహరించితివి. ఇప్పుడు నీ మద మణగును. నిన్ను తీక్ష్ణ శరములతో గొట్టి యమపురి కంపెదను.

చ॥ వలివదలాక్ష మత్సఖుఁడు నాఁ దగు చైద్యుఁడు గోరివచ్చి కో
మలి ననీతిమైఁ దగవు మాలి హరించితి వంతలోక ద
ర్పులమున ధర్మనందను సభాస్థలి నేమఱియున్నవాని న
చ్ఛలమునఁ జంపి తట్టి కలుషంబున నేఁడు రణాంగణంబునన్.

అని సాల్వుడు శ్రీకృష్ణునితో పలికెను.

సాల్వుని మాటల నాలకించిన శ్రీకృష్ణుడు, "ఓరీ! దౌర్భాగ్యుడా! ఆత్మస్తుతికి పాల్పడితివా! నిన్ను పొగడుకొనుటలో తృప్తిచెందుచున్న నీవు నీ ముందు నిలచియున్న మృత్యువుని గాంచలేక యున్నావు.

పౌరుషం దర్శయన్తి స్మ శూరా న బహుభాషిణః

"శూరులు తమ పౌరుషమును ప్రదర్శింతురే గాని భాషణమును ప్రకటింపరు" అని పలికి గదతో సాల్వుని భుజములను, రొమ్మును విదీర్ణ మొనర్చెను. ఇంతలో సాల్వుడు అదృశ్యమయ్యెను.

ఇంతలోగా ఒకవ్యక్తి కృష్ణుని సమీపించి దేవకీమాత పంపుటచే తాను వచ్చినట్లు చెప్పెను.

కృష్ణ కృష్ణ మహాబాహో పితా తే పితృవత్సల:
బద్ధ్వాపనీతః శాల్వేన సౌనికేనయథాపశుః

"కృష్ణా! కసాయివాడు పశువుని బంధించి గొనిపోవునట్లు సాల్వుడు నీ తండ్రియగు వసుదేవుని బంధించి గొనిపోయెను" అనెను.

దూత మాటల నాలకించిన శ్రీకృష్ణుడు వ్యధచెందెను. ఇంతలో సాల్వుడు వసుదేవుని గొనితెచ్చి "ఓరీ! కృష్ణా! మూర్ఖుడా! నీకు జన్మనిచ్చిన నీ తండ్రియగు వసుదేవుని వధించుచున్నాను. చూడుము" అని పలికి వసుదేవుని శిరమును ఖండించి వెంటనే సౌభకములో ప్రవేశించెను.

శ్రీకృష్ణుడు ఒక్క క్షణము విభ్రాంతుడాయెను. మరుక్షణమే అది సాల్వుని మాయయని గ్రహించెను. వెంటనే దూతయు, వసుదేవుని కళేబరము రెండునూ అదృశ్యమయ్యెను.

శ్రీకృష్ణుడు వెంటనే విజృంభించెను. సాల్వునిపై శరవర్షమును కురిపించెను. కవచమును ధ్వంసమొనర్చెను. ధనుస్సును విరిచివైచెను. గదాఘాతములతో సౌభకమును ధ్వంసమొనర్చెను. సాల్వుడు గదను చేపట్టి శ్రీకృష్ణుని మీద పడెను. శ్రీకృష్ణుడు సాల్వుని హస్తమును ఛేదించెను. ఆ తరువాత వజ్రాయుధము ద్వారా ఇంద్రుడు వృత్రాసురుని వధించినట్లు, సుదర్శనచక్రము ద్వారా శ్రీకృష్ణుడు సాల్వుని మస్తకమును ఖండించెను. దేవతలు పుష్పవృష్టిని కురిపించిరి.

సాల్వుడు అనగా నిస్సారమైనవాడు అని అర్థము. ప్రపంచము పంచవిషయ వాసనలకు సాల్వుడు ప్రతీకము. అందుచేతనే సాల్వుడు మట్టి తినుచూ తపమాచరించెను. సాల్వుడు సౌభకమను మాయా విమానము నెక్కి చరించుచుండును. విషయవాసనలు కూడా మాయపై నాధారపడియే నిలిచియుండును.

ప్రద్యుమ్నుడు అనగా అలౌకిక ప్రేమ గలవాడు. ప్రద్యుమ్నుడు మన్మథుడే యని మరువరాదు. అతనిది లౌకిక ప్రేమ కాదు. అందుచేత వస్తుప్రపంచమునకు సంబంధించిన విషయవాసన యనెడి సాల్వుడు అతనిని వధించ లేకపోయెను.

అప్పుడు ద్యుముడు ప్రద్యుమ్నుని మూర్ఛితుని గావించెను. ద్యుముడు స్వర్గమునకు ప్రతీకము. ఇహలోకమున పరాభవింపబడని వారిని పరలోక భోగములు మూర్ఛితుని గావించును. అనగా మోహమును కలిగించును.

మూర్ఛనుండి లేచిన తరువాత ప్రద్యుమ్నుడు స్నానమాచరించెను. ఆ తరువాతనే ద్యుముని వధించెను. భక్తి యనెడి జలములో స్నానమాచరించిన వారే ఇహపరభోగాసక్తి నుండి విడివడి విజేయు లగుదురు.

శ్రీకృష్ణుడు అరుదెంచగనే సాల్వుని మాయ హరింపబడెను. సాల్వుడు వధించబడెను. పరమాత్మ దర్శనములో మాయానాటకమునకు తెరపడి వాసనాక్షయ మగును. మోక్షము లభించును. ఇదియే సాల్వుని వధలోని ఆధ్యాత్మిక సమన్వయ సందేశము.

దంతవక్త్ర విదూరథుల సంహారము

జరాసంధుడు హతుడయ్యెను. శిశుపాలుడు మరణించెను. సాల్వభూపతి నేలకొరిగెను. వీరి మరణానికి కారకుడైన శ్రీకృష్ణుని వధించవలె నని వారి స్నేహితుడగు దంతవక్త్రుడు ఒక గదను తీసికొని శ్రీకృష్ణుని మీదికి వచ్చెను.

దంతవక్త్రుడు శ్రీకృష్ణునితో, "కృష్ణా! మూర్ఖుడా! ఈ నాడు నీవు నా కంటపడితివి. ఎంతయో మేలు జరిగినట్లే అయినది. నీవు నాకు బంధువువైనను నా మిత్రుల మరణానికి కారణమైన వాడవు. వజ్రాయుధమువంటి గదతో ఇప్పుడే నిన్ను సంహరింతును.

తర్హ్యానృణ్యముపై మ్యజ్ఞ మిత్రాణాం మిత్రవత్సలః
బన్ధు రూప మరిం హత్వా వ్యాధిం దేహచరం యథా

నీ బంధుజనులలో నున్న నీవు శరీరము నందున్న వ్యాధివంటి వాడవు. శత్రువైన నిన్ను వధించి పరలోకమున నందున్న నా మిత్రుల ఋణమును తీర్చుకొందును" అని దుర్వచనములు పలుకుచు, మావటివాడు అంకుశముతో ఏనుగు మస్తకముపై గొట్టులాగున, గదతో పరమాత్మ శిరముపై గొట్టి సింహనాదము గావించెను.

శ్రీకృష్ణుడు వెంటనే తన గదను తీసుకొని దంతవక్త్రుని రొమ్ముపై గొట్టెను. వెంటనే గిలగిల తన్నుకొనుచు, నోటినుండి రక్తమును క్రమ్మరిస్తు వృక్షశాఖవలె నేలకొరిగి కన్నుమూసెను.

తతస్సూక్ష్మతరం జ్యోతిః కృష్ణమావిశ దద్భుతమ్

అంతట అతని దేహము నుండి సూక్ష్మతరమైన వెలుగు బయల్వెడలెను. అది శ్రీకృష్ణుని యందు ప్రవేశించి అంతర్హిత మయ్యెను.

దంతవక్త్రుడు వధించబడె ననెడి వార్త తెలియగానే, అతని సోదరుడు విదూరథుడు శ్రీకృష్ణుని వధించుటకు, మిడుత దీపమునైపునకు పరుగిడునట్లు కత్తిని, డాలును ధరించి వచ్చెను. విదూరథుని గాంచగనే శ్రీకృష్ణుడు సమయమును వృథాచేయకుండా సుదర్శన చక్రమును ప్రయోగించెను. వెంటనే విదూరథుని శిరము నేలకొరిగెను. అందరూ వారిని స్తుతించిరి.

క॥ వర ముని యోగి సురాసుర గరుడోరగ సిద్ధ సాధ్య గంధర్వ ఖచ
శ్వర కిన్నర కింపురుషులు హరిమహిమ నుతించి రద్భుతానందములన్.

వక్రభాష్యములు చేయువాడే దంతవక్త్రుడు. పశుపక్ష్యాదులు భాషించలేవు. మనిషి యొక్కడే భాషింపగలడు. భగవానుని స్తుతించుటకు మనకు భాష ఇవ్వబడినది. అది తెలియలేక కొందరు పరమాత్మను నిందించుచుందురు. అట్టి వారందరు దంతవక్త్రులే లేదా దంతవక్రులే. అట్టివారి కర్మ పరిపక్వమునకు రాగానే పరమాత్మచే బుద్ధి చెప్పబడినవారై కైవల్యము పొందెదరు.

దుష్టవాక్కు దంతవక్త్రుడు కాగా, దుష్టకర్మకు విదూరథుడు ప్రతీకము. చెడు తలచువాడు చెడిపోవును. కనుక విదూరథునివలె విద్రోహపు నడకను ప్రదర్శింపక మనము ఋజుమార్గములో నడుపుకొని తరించవలెను.

బలరాముని తీర్థయాత్ర

పాండవులతో యుద్ధము చేయబూనిన కౌరవుల సంకల్పము బలరామునకు అసహ్యమైనది. ఉభయులు తనకు అత్యంత ప్రియులే. అందుచేత యుద్ధములో పాల్గొనుటకు ఇచ్చగించని బలరాముడు తీర్థయాత్రలకు బయలుదేరి వెళ్ళెను. సంకట పరిస్థితులలో పుణ్యక్షేత్ర, తీర్థక్షేత్ర, సాధు దర్శనములు వాంఛనీయములని శాస్త్రములు తెలుపుచున్నవి.

ఆయన ప్రథమంగా ప్రభాస తీర్థమును దర్శించెను. దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణము అర్పించెను. సరస్వతీనదిని సమీపించెను. బ్రహ్మతీర్థమును, చక్రతీర్థమును, గంగా యమునాది తీర్థము లన్నింటిని సందర్శించెను. తరువాత నైమిశారణ్యమున ప్రవేశించెను. దీర్ఘకాలికమగు యజ్ఞము సాధించుచున్న మునులందరు లేచి, బలరాముని ఆహ్వానించి అర్చించిరి. సేవించెను. ఆ

అచ్చట ఉన్నతాసనముపై ఆసీనుడైయున్న రోమహర్షణుని గర్వితమతిగా ఎంచి బలరాముడు కృద్ధుడై అతనిని వధించెను. తన భావము సరియైనది కాదని తరువాత ఋషులు చెప్పగా గ్రహించి చింతించెను. దానివలన బ్రహ్మహత్యా దోషము అంటినది. చేసిన తప్పిదమునకు పశ్చాత్తాపమొందిన వాడయి బలరాముడు రోమహర్షణుని కుమారునకు చిరంజీవత్వము నొసంగెను. బ్రహ్మహత్య వలన ఏర్పడిన పాపమును పోగొట్టుకొనేముందు మహర్షుల వాంఛలు తీర్చవలెనని సంకల్పించెను.

"మహర్షులారా! మీ వాంఛితములను తీర్చవలయునని సంకల్పించు చున్నాను. నాకా అవకాశము నొసంగి నన్ను ధన్యుని చేయుడు" అని బలరాముడు ఋషివర్యులను ప్రార్థించెను. అంతట ఆ మునులు బలదేవునితో

ఇల్వలస్య సుతో ఘోరో బల్వల నామ దానవః
సదూషయతి నః సత్రమేత్య పర్వణి పర్వణి

"బలదేవా! ఇల్వలుని పుత్రుడైన బల్వలుడను రాక్షసుడుగలడు. అతడు భయంకరుడైన అసురుడు. ప్రతి పర్వదినము నందును వచ్చి మలమూత్రాదులను విసర్జించి, మా పవిత్ర యజ్ఞములను పాడుచేయుచున్నాడు. వానిని వధింపుడు. ఇదియే మాకు గొప్ప సేవ కాగలదు" యని పలికిరి.

పర్వదినములు ఏతెంచెను. ఋషులు యజ్ఞ నిర్వహణయందు నిమగ్నులై యుండిరి. చూచుచుండగనే భయంకరమైన వాయువు వీచసాగెను. దానితోపాటు దుర్గంధము వ్యాపించెను. యజ్ఞశాలయందు మాలిన్యములు పడసాగెను. బలరాముడు పరీక్షించుచుండగా బల్వలుడు శూలమును ధరించి ఆకసమున కనబడెను.

బలరాముడు హలాయుధమును చేబూని బల్వలుని క్రిందికిలాగి కుపితుడై వాని తలపై కొట్టెను. ఆ ఘాతమునకు బల్వలుని శిరము బ్రద్దలాయెను. రక్తము కారుచుండగా భయంకర ధ్వనిచేసి నేలకొరిగెను. ఋషులు సంతసించిరి.

బలరాముడు మునుల అనుమతిని పొంది బయలుదేరి, కౌశికీ నదికి వెళ్ళి స్నానమాచరించి, అక్కడనుండి సరయూనది యొక్క ఉద్గమస్థానమును చేరెను. తరువాత గోమతి, గండకీ నదుల నుండి గోదావరి, భీమరథి నదులను దర్శించెను. అచ్చటనుండి వేంకటాచలమును, కాంచీపురమును, కావేరిని దర్శించెను. శ్రీరంగమును దర్శించి, రామేశ్వరమునకు వెడలెను. అక్కడ నుండి మార్గమధ్యమున గోచరించు పుణ్యక్షేత్రములను దర్శించుచు కన్యాకుమారి చేరి, అచ్చట జగజ్జననిని సేవించెను.

తీర్థాటన సందర్భమున ఆయనను కలిసిన విప్రులు కొందరు కురుపాండవ యుద్ధము జరిగిన దనియు, క్షత్రియులందరు సంహరింపబడినారు అనెడి వార్తను తెలిపిరి. ఈ విషయమును విని భూదేవికి భారము తొలగినట్లు బలదేవుడు భావించెను.

కురుక్షేత్రమున భీమ దుర్యోధనులు గదాయుద్ధము చేయుచున్నారని విని దానిని ఆపుటకు అరుదెంచెను. ధర్మరాజు, నకుల సహదేవులు, కృష్ణార్జునులు ఆయనకు వందన మిడిరి.

గదాయుద్ధములో మునిగియున్న భీమ దుర్యోధనులను జూచి బలదేవుడు ఇలా పలికెను.

యువాం తుల్య బలౌ వీరౌ హే రాజన్ హే వృకోదర
ఏకం ప్రాణాధికం మన్యే ఉతైకం శిక్షయాధికమ్

"సుయోధనా! వృకోదర భీమా! మీ ఇరువురును సామాన్యులు గారు. సమాన యుద్ధనైపుణ్యము గలవారు. కనుక సమాన పరాక్రమము గల మీలో ఏ ఒక్కరికీ జయము లభించునని గాని, అపజయము లభించునని గాని నేను భావించుటలేదు. నా మాటవిని యుద్ధమును విరమింపుడు" అనెను.

బలరాముని వాక్కులను వారు లక్ష్యపెట్టలేదు. బలరాముడు ఆలోచించెను. ఈ యుద్ధము దైవనిర్ణయమని భావించెను. బయలుదేరి ద్వారకకు వెళ్ళెను. ఉగ్రసేనాది బంధువులను దర్శించి, భాషించి, తృప్తి చెందెను. ఆ పిమ్మట బలరాముడు నైమిశారణ్యమున కేగి యజ్ఞములు చేసెను. అచ్చట ఆసీనులైన ఋషులకు బలదేవుడు ఆత్మస్వరూపమును తెలుపజేయు జ్ఞానమును బోధించెను.

కుచేలోపాఖ్యానము

శ్రీకృష్ణ పదాంబుజముల యందు సదారమించు జితేంద్రియ భ్రమరమే శ్రీశుకబ్రహ్మ. భగవానుని అనంత దివ్యలీలలను మహాత్ముడైన శుకబ్రహ్మ ద్వారా వినే భాగ్యమునకు నోచుకున్న పుణ్యాత్ముడే పరీక్షిన్మహారాజు. దివ్యమైన శ్యామసుందరుని మనోహర చరితమును ఒక్కసారి శ్రవణము చేసినవారు, అట్టి శ్రవణ మంగళమైన కథామృతమును పదేపదే పానము చేయకుండా ఉండలేరు.

పరీక్షిన్మహారాజు శుకబ్రహ్మకు నమస్కరించి "మహాత్మా! వందనములు. ఇంతవరకు పరమాత్మయగు గోవిందుని అనంతకల్యాణ గుణములను, లీలలను మీ పవిత్ర వాగ్ద్వారా వినే భాగ్యమునకు నోచుకున్నాను. కాని మళ్ళీ మళ్ళీ వినాలని కుతూహలముగా ఉన్నది. శ్రీకృష్ణుని ఇతర లీలలను నేను విన గోరుచున్నాను. దేహేంద్రియ మనోబుద్ధులను సంపూర్ణముగా విష్ణుసేవయందు లగ్న మొనర్చినవాడే సదా జీవితము ధన్యమగును.

చ॥ హరిభజియించు హస్తములు హస్తము, లచ్యుత(గోరి మ్రొక్కు శి
చ్ఛిరము శిరంబు, చక్రధరు(జేరినచిత్తము చిత్త మిందిరా
వరు(గనుదృష్టి దృష్టి, మురవైరి నుతించిన వాణి వాణి, యు
క్షరుకథ లానుకర్ణములు కర్ణములై విలసిల్లు(బో భువిన్.

"శ్రీహరి సేవలో నిమగ్నమగు హస్తములే హస్తములు. గోవిందునకు మ్రొక్కెడి శిరమే శిరము. చక్రధరుని యందు లగ్నమైన చిత్తమే చిత్తము. మురారిని దర్శించు నేత్రములే నేత్రములు. కేశవుని స్తుతించు నాలుకే నాలుక. అచ్యుతుని కథలను శ్రవణము చేయు చెవులే చెవులు" అని పలికెను.

ఈవిధముగా ఇంద్రియ మనోబుద్ధులు వర్తించినచో వాటి మనుగడయే విలక్షణమని పరీక్షిత్తు నిర్ణయించినాడు. ఈ విధముగా నిరంతర మాధవ నామామృత పానవిత్తుడై విలసిల్లు భాగవతోత్తముని శ్రీకృష్ణపరమాత్మ కనికరించి రక్షించిన అద్భుతమయ సంఘటనను వివరించి చెప్పుమని పరీక్షిన్మహారాజ ప్రార్థించెను.

క॥ హరిపాదతీర్థసేవా పరు(డై విలసిల్లునట్టి భాగవతుని వి
స్ఫురితాంగము లంగము లా పరమేశ్వరు వెలు(గ వాకు(బలుకు మునీంద్రా!

అని పరీక్షిత్తు ప్రార్థించగా మహాత్ముడైన శుకబ్రహ్మ జితేంద్రియుడు, మహాభక్తుడు నగు కుచేలుని గూర్చి చెప్పసాగెను. వ్యాసభాగవతమునందు కుచేలుని సుదాము డందురు.

కృష్ణ స్యాసీత్సఖా, కశ్చి ద్బ్రాహ్మణో బ్రహ్మవిత్తమః
విరక్త ఇంద్రియార్థేషు ప్రశాన్తాత్మా జితేన్ద్రియః

ఇంద్రియ విషయముల యందు ఆసక్తి లేనివాడు, జితేంద్రియుడు, ప్రశాంత మూర్తి, బ్రహ్మవిదుడు నగు మనుజుడు శ్రీకృష్ణునకు స్నేహితుడై యుండెను.

మనస్సు దేనియందు లగ్నమగునో దానితో సఖ్యమును కలిగియున్నదని భావము. అనిత్యమైన వస్తువులతో, అశాశ్వతమైన వ్యక్తులతో స్నేహమును కలిగించుకొని దానినుండి ఉత్పన్నమయ్యే సుఖదుఃఖాలను అనుభవించే టందులకే మానవుని మస్తిష్కము అలవాటు పడింది. కానీ నిత్యుడు, శాశ్వతుడునైన పరమాత్మతో స్నేహమును కుదుర్చుకొనగల భాగ్యవంతు లెందరుంటారు? అది ఎందరికి సాధ్యం? ఏ గుహుడో, సుగ్రీవుడో, విభీషణుడో, అర్జునుడో ఇలా ఎందరున్నారు చెప్పుకొనేందుకు? అట్టివారి కోవకు చెందిన భక్తుడు, భాగవతోత్తముడు మన కుచేలుడు. కుటిలము తెలియనివాడు. కుత్సితము అర్థముగానివాడు. కుచేలము అనగా చినిగిన వస్త్రము అని అర్థము. అట్టి చినిగిన వస్త్రమును ధరించినవాడు కుచేలుడు.

ఈ ప్రపంచములో చినిగిన వస్త్రమును ధరించని వారెవ్వరు? కాని ఈ సత్యం ఎందరికి వంటబట్టినది? శిథిలమయ్యే దేహమే జీర్ణవస్త్రము. ఎంతగా పోషించినా క్షీణించి ఒకనాటికి వల్లకాటికే! అశాశ్వతమయ్యే శిథిల దేహము. ఈ సత్యమును తెలిసి జీవించు మహాత్ముడే కుచేలుడు.

జరాశోక సమావిష్టం రోగాయతన మాతురమ్
రజస్వల మనిత్యం చ భూతావాస మిమం త్యజేత్

"జరా దుఃఖాదులతో కూడినదియు, రోగముల వాత పడునదియు, రజోగుణముతో మిశ్రితమైన అనిత్యమగు శరీరమునందు మమకారమును త్యజింపుము" అని నారద పరివ్రాజకోపనిషత్తు ప్రవచించినది.

ఈ సత్యము నెరిగి గృహస్థాశ్రమమున ఆదర్శ జీవితమును కుచేలుడు గడుపుచుండెను. అతనితో పాటు అతని భార్య కూడా ఆదర్శ జీవనమును సాగించుచుండెను. కుచేలుడు నిరుపేద. కానీ నిర్భాగ్యుడు కాదు. సదా మాధవ నామామృత పానవిత్తుడై యుండెను. ఆకలి ననుభవిస్తూ ఆత్మధ్యానములో రమించు చుండెడివాడు. ఆయన అర్ధాంగి కూడా భర్త అడుగు జాడలలోనే జీవితమును కొనసాగించుచుండెను.

యదృచ్ఛయోపపన్నేన వర్తమానో గృహాశ్రమీ
తస్య భార్యా కుచైలస్య క్షుత్ క్షామా చ తథా విధా

"అతడు అప్రయత్నముగా లభించిన దానితో జీవితమును సాగించుచుండెను. గృహస్థాశ్రమమున ఆదర్శుడై యుండెను. అతని భార్య కూడా విశీర్ణమైన వస్త్రములనే ధరించి యుండెను. ఆకలిచే నడలిపోయిన దేహమును కలిగియుండెను."

కుచేలుని భార్య ఆదర్శమహిళ, సుగుణశీల. ఆకలి తీరేపాటి తిండిని సమకూర్చ లేకపోయినా, దేహమును కప్పుకొనేందుకు సరిపడే బట్టను అందించ లేకపోయినను భర్తపై ఏ మాత్రము కినుక వహించని ఉత్తమురాలు. అన్నియును సమృద్ధిగా యుండినపుడు భర్తకు సేవచేయుట గొప్పకాదు.. దారిద్ర్యములో దొర్లుతున్న సమయంలో కూడా హాయినిచ్చే అనురాగపు జల్లులను కురిపిస్తూ ఆనందింపజేయు అర్ధాంగియే గృహలక్ష్మి యనబడును.

ఒకనాడు ఆ తల్లి కుచేలుని జూచినది. లోనున్న ఆకలి విజృంభించి బొమికలను ముందుకు త్రోయుచున్నదా అన్నట్లు గోచరించే భర్తయొక్క ఆకలి కడుపును చూసి కలత చెందినది. తన ఆకలి తనకు తెలిసిరావడము లేదు. కానీ భర్త ఆకలి ఆమెను క్రుంగదీయు చున్నది. తినేందుకు ఇంటిలో ఏమియును లేదు. అమ్మేందుకు ఒంటిపై ఏమియును గోచరించదు. భరించలేని బాధ ఆమె హృదయాన్ని పిండుతున్నది. కర్తవ్యము తెలిసిరాలేదు. దేహమనే గూటిలో ప్రాణమనే చిలుక ఇంకా ఎగిరిపోలేదు అని తెలుపుటకా యన్నట్లు మధ్యమధ్యన కాళ్ళు కదుపుతూ ఆకలితో గువ్వవలె పడియున్న భర్తయగు కుచేలుని గాంచి, కలవరపడుతున్న చిత్తముతో భర్తను సమీపించినది.

సీ॥ లలిత పతివ్రతా తిలకంబు వంశాభి జాత్య తద్భార్య దుస్సహదరిద్ర
పీడచేఁ గడునొచ్చి పెదవులు దడుపుచు శిశువు లాఁకటిచిచ్చుచేఁ గృశించి
మలమల మాఁడుచు మానసం బెరియంగఁ బట్టెఁ డోరెము మాకుఁ బెట్టు మనుచుఁ
బత్రభాజనధృత పాణులైన తమఁ జేరి వేఁడిన పినులు సూఁడినట్ల

తే॥ లైన నాకనాఁడు వగచి నిజాధినాథుఁ జేరి యిట్లని పలికెనో జీవితేశ!
తట్టుముట్టాడు నిట్టి పేదటికి మిట్లు నొంప దీని కుపాయ మూహింపనైరి.

ఒక వైపు ఆకలితో అలమటిస్తున్న భర్తను గాంచి పరితపించుచున్నది. ఆరిపోవుచున్న పెదవులను నీటితో తడుపుకొనుచూ పిల్లలు ఏతెంచి, ఆకలిని భరింపలేక రోదించసాగిరి. పిడికెడన్నము నివ్వమని ప్రాధేయపడసాగిరి. ఆకలిని భరింపలేని ఆ పసికందులు తల్లిని చుట్టుముట్టి ఏడ్వసాగిరి.

భర్తను సమీపించినదియై "మహాత్మా! ద్వారక యందు వసించుచున్న భగవానుడగు శ్రీకృష్ణుడు నీకు మిత్రుడు. అతడు బ్రాహ్మణులకు మేలు చేయువాడు. శరణాగత వత్సలుడు. నీవు సాధుప్రియుడైన శ్రీకృష్ణుని కడకు వెడలుము. అతడు నిన్ను కృప జూచును. సిరి నొసంగి మన బ్రతుకులను సరిచేయును" అనెను.

తే॥ బాలసఖుఁ డైన యప్పద్మపత్రనేత్రుఁ గాన వేఁగి దారిద్ర్యాంధకారమగ్ను
లైన మము నుద్ధరింపుము హరికృపా క టాక్ష రవిదీప్తి వడసి మహాత్మ! నీవు.

ఆమె మాటలు వినిన కుచేలుడు "ఏమిటీ? ద్వారకానాథుడైన శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళి లౌకిక భోగము లివ్వమని నన్ను కోరమందువా? ఆయన పరమాత్మ. ఆ దివ్యాత్ముని ధ్యానించుటయే కాని యాచించుట నాకు తెలియదు" అనెను.

భర్తమాటల నాలకించిన భార్య "మిమ్ములను యాచించమని నేను చెప్పటలేదు. బిడ్డలు ఆకలితో అలమటిస్తున్నారు. కనీసం ఒక్కపూట, అదియును సగము కడుపు కూడా నింపలేకపోతున్నాను. "అమ్మా! ఆకలి" అని వారంటుంటే నా కడుపు తరుక్కుపోతున్నది. వాళ్ళని కన్నది ఆకలితో మాడ్చేందుకేనా? అని వ్యథ చెందుతున్నాను.

"ఈ వ్యథ నంతా తెలిపి మీకు బాధ కలిగించి ఇంకా పాపము మూటగట్టు కొనుచున్నాను. కానీ తప్పడములేదు. పిల్లల ఆకలి ఆక్రందనలు మూగబోయిన నా నోటిని మాట్లాడిస్తున్నాయి.

"ద్వారకానాథుడు భక్తవత్సలుడు. ఆశ్రితులను ఆదరించే దివ్యాత్ముడు. పైగా ఆయన మీ చిన్ననాటి మిత్రుడు. మిత్రులంటే కృష్ణయ్యకు ప్రేమ మెండు యని మీరు అనేకసార్లు నాతో చెప్పియున్నారు. మీరు తిననిదే ఆయన తినేవాడు కాదని అనేకసార్లు పారవశ్యంలో మీరు నాతో చెప్పియున్నారు. మనలను ఆదుకొనదగిన మహిమాన్వితుడు ఆయన ఒక్కడే. కనుక సంశయింపకుడు."

మ॥ వరదుఁడు సాధుభక్తజన వత్సలుఁ డార్తశరణ్యుఁ డిందిరా
వరుఁడు దయాపయోధి భగవంతుఁడు కృష్ణుఁడు దాఁ గుశస్థలీ
పురమున యాదవప్రకరముల్ భజియింపఁగ నున్నవాఁడు నీ
వరిగిన నిన్నుఁ జూచి విభుఁ డప్పుడ యిచ్చు సమానసంపదల్

అని భర్తతో పలికెను.

భార్య మాటల నాలకించిన కుచేలుడు, "శ్రీకృష్ణుడు ద్వారకానాథుడే కాదు. ఆయన సర్వ భూతాంతరాత్ముడు. మన ఇక్కట్లు ఆయనకు తెలియనివి కావు. ప్రారబ్ధము నక్కరైనను అనుభవించవలసినదే. నేను సదా ఆయన చింతనముచేతనే కాలము గడుపుచున్నాను. మరి ఈ స్థితిలో నేను ద్వారకకు ఎందుకు వెళ్ళాలి? శ్రీకృష్ణుని ద్వారకకు పరిమిత మొనర్చుటకా?" యనెను.

కుచేలుని వైరాగ్యపూరిత జ్ఞానవచనముల నాలకించిన ఆ తల్లి "చూడండి. ఆలయానికి వెళ్ళి అనంతుడైన పరమాత్ముని దర్శించుట లేదా? అంతమాత్రాన ఆయన అనంతత్వమునకు భంగము వాటిల్లుచున్నదా? అలాగే ద్వారకలో మీ ప్రియమిత్రుడైన శ్రీకృష్ణుని దర్శింపవచ్చును.

"బాల్య స్నేహితులై యుండియు ద్వారకాధిపతియైన వాసుదేవుని మీరు ఇంతవరకు దర్శించలేదు. మన ఇక్కట్లకు అదికూడా కారణమేమో యనెడి శంక నా హృదయమును కలత పెట్టుచున్నది. మీరు శ్రీకృష్ణుని ఏదీ అర్థించ నవసరము లేదు. మీరు ఆయనను దర్శించిన చాలును. భగవద్దర్శన ఫలమే మన బ్రతుకువానకు దిక్కానిస్తుంది నిలుస్తుంది.

మ॥ కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టాత్ముఁ డైనట్టి దు
ర్బలుఁ డాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబు లుల్లంబులోఁ
దలఁప న్నంతన మెచ్చి యార్తిహరుఁడై తన్నైన నిచ్చున్ మని
శ్చలభక్తిన్ భజియించువారి కిడఁడే సంపద్విశేషవ్రజముల్?

"శ్రీహరిని స్మరించినంతనే ఆట్టివారికి తన దివ్య చరణకమలముల సేవ నొసంగును. అంతేకాదు, చివరకు తన్ను గూడా అర్పించుకొనును. మీరు ఆ దివ్యాత్ముని దర్శించిన చాలును. మన ఇక్కట్లు దూరమగునని నా అంతర్యము సాక్షి చెప్పుచున్నది" అనెను.

అంతట కుచేలుడు శ్రీకృష్ణుని దర్శింపవలెనని నిర్ణయించుకొనెను. మరి రిక్త హస్తములతో పరమాత్మ వద్దకు చనుట ఎట్లు? అని సంశయించుచుండెను.

కుచేలుని భార్య ప్రక్కఇంటికి వెళ్ళి అర్థించి అటుకులు. కానీ ఈ వాడు అర్థించవలెనని అభిప్రాయపడింది. తన స్వార్థానికి అడుగుట లేదు. ఈశ్వర ప్రీత్యర్థం అని అర్థించుచున్నది.

సర్వసంగ పరిత్యాగులైన సాధువులు లోకకల్యాణార్థం జీవిస్తుంటారు. వారికి గృహస్థులు సహాయము చేయుచుందురు. సాధువుల హస్తములు భాగీరథీ కెరటాలు.

అందులో పడిన ప్రతి పైసా పుణ్యగంగలో పడ్డట్లే అవుతుంది. కొందరు వ్యక్తులు పాపమును మూటగట్టు కొనేందుకు కొన్ని వృథా ప్రసంగములు చేస్తుంటారు. సాధువులకు ధనమెందులకు? సాధువులు ధనమును యాచించుట ఎందులకు? అని తుచ్ఛవచనములు పలుకుతుంటారు. సాధువులు గ్రహించే డబ్బు వారి కొరకు కాదు. భూత శ్రేణి భూతనాథుని తృప్తి పరచేందుకు. సాధువులు తమకొరకు ఎప్పుడూ యాచించరు. మంగళకర కార్యముల నాచరించి సమాజాభ్యుదయమును సాధించుటకు అలా చేస్తుంటారు.

దౌర్భాగ్యుల తుచ్ఛ వచనములకు చిడియపడిన కొందరు సాధువులు తాము తమ చేతితో ధనమును ముట్టమని పలుకుతూ ఒక శిష్యుని ప్రక్కన పెట్టుకొని, "అతని కేది కివ్వండి" అంటూంటారు. ఆ తరువాత శిష్యుడెక్కడ కాజేస్తాడో యని గిటకలు మ్రింగుతూ నీళ్ళు త్రాగుతుంటారు.

అవగాహన లేనిచోట అనర్థాలే ప్రాప్తిస్తుంటాయి. పంచని తెలియని మందిరంలో కుంచుకు పోవలసిన పని ఏమున్నది? ఈ విషయములో నా అవగాహన వేరు. ఎవ్వరు నాకు దక్షిణ సమర్పించినా నేను రెండు చేతులు కలిపి దోసిలి పడుతాను. ఇచ్చేవక్తి శ్యామసుందరుడే అని భావిస్తాను. నేనొక పనిముట్టుగా నిలిచి పైసా వృథాగాకుండ సద్వినియోగ మయ్యేలా పూర్ణ కృషి చేస్తాను.

డబ్బును ముట్టడం పాపమా? డబ్బుని వాంఛించడము పాపముకాదా? ముట్టడము పాపమా? ఈ విధమైన ద్వంద్వ మనస్తత్వమును భగవంతుడు హర్షించడు. ద్వంద్వ మనస్తత్వము గలవారికి సద్గతి లభించదు. ఉంటే రామకృష్ణ పరమహంసలాగా డబ్బును ముట్టకుండా సమాధిలో జీవించు. లేదా వివేకానందవలె చేయిచాచి యాచించి, అర్థించి, ఆదర్శ జీవనము ద్వారా లోకకళ్యాణమును సాగించు. ఈ రెండే సరియైన మార్గములు.

కుచేలుని భార్య చుట్టుప్రక్కల నున్న భక్తుల ఇండ్లకు వెళ్ళి నాలుగు పిడికెళ్ళ అటుకులను యాచించి తెచ్చింది. వాటిని వస్త్రఖండములో మూటగట్టి భర్త కొసంగినది. శ్రీకృష్ణునకు కానుకగా సమర్పించమని చెప్పింది. చినిగిపోయిన పంచెను కట్టుకొని, కట్టుమ చేతపట్టుకొని, భుజమున అటుకుల మూటను వ్రేలాడదీసుకొని

యజ్ఞేశాచ్యుత గోవింద మాధవానంత కేశవ
కృష్ణ విష్ణో హృషీకేశ వాసుదేవ నమోస్తుతే...

అని సంకీర్తన చేసుకుంటూ మెల్లమెల్లగా నడక సాగించాడు.

కుచేలుడు ఆహారము తీసుకొని చాలా రోజులైంది. నీరసంతో నడచి వెళ్ళాడు. ఎండ తీవ్రముగా యుంది. తన భర్త ఎలా కష్టపడతాడో యని చింతించిన ఆ సాధ్వీమణి సూర్యభగవానుని దర్శించి, చేతులెత్తి నమస్కరించినది.

"భిక్షువు తల్లే దివాకరా! నీవే నా భర్తకు దిక్కు" అని ప్రార్థించినది. ఆకసము మేఘావృతమైనది. ఆ మబ్బుల చాటున దాగినాడు భాస్కరుడు. వాతావరణము చల్లబడింది. భక్తుల సంకల్పములోనే దర్వి, చల్లని రెండూ పెట్టబడతాయి.

కుచేలుడు నాలుగుమైళ్ళు నడిచాడు. నడక సాగటంలేదు. నీరసం కలిసి వచ్చున్నందున నడక సాగకుంటున్నది. అడుగు వేయలేని బలహీనత ఏర్పడింది.

"కృష్ణా! నన్ను నీ దగ్గరకు ఎప్పుడు చేర్చుకుంటావు? నాకు నీ దర్శన భాగ్యము కలిగేదెప్పుడు?" అని పలుకుచూ అలసిపోయిన కుచేలుడు ఒక వృక్షఛాయలో విశ్రమించాడు. అతని నేత్రాలను మగాడుమున్నది. ప్రాణము ఇంద్రియములనుంచి హృదయస్థానంలో నిలచిపోయింది. కుచేలుడు అదమరచి నిద్రించుచున్నాడు.

నిద్రపోతున్న భక్తుని భద్రమైన భగవంతుడు వీక్షించినాడు. నడువలేని అశక్తతతో పడుండియున్న కుచేలుని మధురకు తీసుకొనివచ్చి, నగర పొలిమేరలో విడువమని శ్రీకృష్ణుడు గరుత్మంతునికి చెప్పెను. భగవంతునికి వాహనమైన పుణ్యానికి భక్తునికి కూడా వాహనమయ్యే భాగ్యం కలిగిందని పొంగిపోయాడు గరుత్మంతుడు.

కుచేలుని నిజస్థలము పోరుబందరు పట్టణము. పోరుబందరు పొలిమేరలలో పడుండియున్న వానిని గరుత్మంతుడు ద్వారకానగర ప్రవేశమునందు ఒక చెట్టుక్రింద పడుండబెట్టి వెళ్ళి, శ్రీకృష్ణున కావిషయమును తెలిపెను. శ్రీకృష్ణుడు ఏమియూ తెలియనట్లు ఉండెను. కానీ అంతరంగమున కుచేలుని గాంచుటకు ఆతురత పడుచుండెను. భగవానుని లీలలు, మాయలు ఎవరికి అవగత మవుతాయి? అందుచేతనే

బాగాయె నయ్యా నీ మాయలెంతో బ్రహ్మకైనఁ గొనియాడ తరమా ॥బా॥
ఈ గారడము నొనరించుచును నేఁ గాదనుచు బల్కేదియును ॥బా॥

అని శ్రీ త్యాగరాజస్వామి చంద్రజ్యోతి రాగములో ఒక చక్కని కీర్తనను గానం చేసినారు.

బడలిక తీరింది. కుచేలుడు నిద్రలేచినాడు. దారిని పోవువారిని పిలిచి "నాయనా! ద్వారకాపురి ఎంతదూరము? ఎలా వెళ్ళాలి?" అని అడిగెను. వారు విస్మయమొందుచు "అదేమిటి? ఇదియే ద్వారకా నగరము" అనిరి.

కుచేలుడు నిద్రించిన సమయమును మరచినాడు. ద్వారక ఇంత దగ్గరయేనా? అని ఆశ్చర్యపడినాడు. అచ్యుతుని అమృతహస్తము తనను నడిపించినదని గ్రహించలేక పోయినాడు. గరుత్మంతుని సహాయముతో వచ్చినట్లు అతనికి తెలియదు. దైవసహాయం ఎప్పుడూ అలాగే ఉంటుంది. భగవత్కృప ప్రకటనలకు, ప్రదర్శనలకు సంబంధించినది కాదు. నీకు తెలియకుండానే నీకు అందునదియే భగవత్ప్రసాదము.

కుచేలుడు శ్రీకృష్ణుని కొరకు నడువసాగెను. శ్రీకృష్ణుని సంకల్పము కుచేలుని కన్నా ముందే నడచి ఎదురేగెను. రక్షించెను.

ద్వారకా నగరములో ప్రవేశించినాడు కుచేలుడు. శ్రీకృష్ణుని మందిరమును అన్వేషింప బూనినాడు. ఇంతలో ఒక బ్రాహ్మణుడు ఎదురుపడి "ఏదో అన్వేషిస్తున్నారు.

"ఎక్కడికి వెళ్ళాలి? ఎవరి గృహం కావాలి?" అని అడిగినాడు. అయునకు సమాధానముగా
పలుకుచు, చేతులెత్తి నమస్కరిస్తూ కుచేలుడు

సీ॥ ఇందీవరశ్యాము వందితసుత్రాముఁ గరుణాలవాలు భాసురకపోలుఁ
కౌస్తుభాలంకారుఁ గామితమందారు సురచిరలావణ్యు సురశరణ్యు
హార్యక్షనిభమధ్యు నఖిలలోకారాధ్యు ఘనచక్రహస్తు జగత్ప్రశస్తు
బన్నగశయను నబ్జాతనయను ఖగకులాధిపయాను గౌశేయపరిధాను
నిరుపమాకారు దుగ్ధసాగరవిహారు

తే॥ మకరకుండలసద్భాషు మంజుభాషు
భూరిగుణసాంద్రు యదుకులాంబోధిచంద్రు విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణుఁ గృష్ణు.

అని పలికెను.

కుచేలుని మాటలు ఆ బ్రాహ్మణునికి విస్మయము కలిగించాయి. ద్వారకాధిపతి కృష్ణుడేమిటి? ఈ బక్క బ్రాహ్మణునికి దర్శన మొసగు టేమిటి? అని భావించాడు.

"అయ్యా! వరంధాముడైన శ్రీకృష్ణుని భవనమునకు దారి ఎయ్యది?" అని మరొకరిని అడిగినాడు కుచేలుడు.

"కృష్ణుని మందిరముతో నీకు పని ఏమిటి? అని ఆ వ్యక్తి ఎదురుప్రశ్న వేసినాడు.

"కృష్ణుని మందిరముతో నీకు పని ఏమిటి?" "శ్రీకృష్ణుడు నా మిత్రుడు. స్నేహితుని సందర్శించేందుకు వచ్చాను" అన్నాడు కుచేలుడు.

"ఏమిటీ? నీవు శ్రీకృష్ణునికి మిత్రుడవా? బాగానే ఉంది." అంటూ అతడు మారు పలుకకుండా తన దారిన వెళ్ళిపోయినాడు. ఈ పేద బ్రాహ్మణుడు శ్రీకృష్ణునికి మిత్రుడేమిటి? బహుశ ఈ బ్రాహ్మణునికి మతి చలించి ఉండొచ్చు అని భావిస్తున్నారు ద్వారకానగర వాసులు.

కుచేలుడు ఇలా అడుగుతూ అతి సుందరమైన శ్యామసుందరుని మందిరము వద్దకు వచ్చినాడు. ద్వారమువద్దకు రాగానే, ద్వారపాలకులు ఆటంక పరచినారు. లోనికి వెళ్ళేందుకు వీలులేదని తెలిపినారు.

"అయ్యా! నాపేరు కుచేలుడు. నేను శ్రీకృష్ణుని మిత్రుడను" అని కుచేలుడు పలికెను.

కుచేలుని మాటలను ద్వారపాలకులు కూడా విశ్వసించలేదు. పేదవాడైన ఈ బ్రాహ్మణుడు యాచనకై వచ్చినాడని భావించినారు. అది వీలుకాదని తెలిపినారు.

"నాయనా! నేను యాచించుటకు రాలేదు. నాకు కావలసింది దర్శనమే గాని దానముకాదు. నేను ఇక్కడనే ఉండెదను. మీరు లోనికివెళ్ళి కుచేలుడు కృష్ణ దర్శనమునకు నిరీక్షించుచున్నాడని తెలుపుడు. ప్రభువును దర్శించేటందులకు భృత్యుడు వాకిట నిలబడియున్నాడని చెప్పుడు" అనెను.

ద్వారపాలకు డొకడు మందిరమున ప్రవేశించెను. శ్రీకృష్ణుని సమీపించెను. "ప్రభూ! ఒక బ్రాహ్మణుడు మీ దర్శనార్థము వచ్చియున్నాడు. బిచ్చగానివలె యున్నాడు. వనువు వంగియున్నది. చినిగిన బట్టలు మాసియున్నవి. అతని పేరు కుచేలుడట" అనెను.

కుచేలుడనెడి మాట చెవినిపడగానే శ్రీకృష్ణుడు పరుగిడెను. "కుచేలా! కుచేలా!" అంటూ శ్రీకృష్ణుడు పరుగిడు చుండెను. శ్రీకృష్ణుని ఈ వింతప్రవర్తన ఆయున సతులకు ఆశ్చర్యమును కలిగించెను. ఎవరు వచ్చినది? నిత్యము శ్రీకృష్ణుని దర్శించుటకు ఎందరో వచ్చుచుందురు. కాని గతంలో ఎప్పుడూ శ్రీకృష్ణుడు ఈ విధమైన ఉత్సాహమును చూపలేదు అని భావించుకొంటూ వారు కూడా ఆ వచ్చిన వ్యక్తిని గాంచుటకు అరుదెంచిరి.

ద్వారమువద్ద కుచేలుడు నిలబడి యుండెను. కాళ్ళకు చెప్పులు లేవు. తలపై గొడుగులేదు. శరీరముపై వానినంత గుడ్డలేదు. ఎముకలు ముందుకు రాగా నేత్రాలు లోతుకుపోయి ఉన్నవి. ఏ ఆడంబరములేక చేతులు జోడించి నమస్కరించుచు కుచేలుడు నిలబడి యుండెను.

"మిత్రమా! వచ్చినావా? నా హృదయమును సంతోషపెట్టుటకు అరుదెంచినావా? నన్ను ఉద్ధరించుటకు విచ్చేసినావా?" అంటూ నేత్రములవెంట ఆనంద బాష్పములు రాలుచుండగా శ్రీకృష్ణుడు కుచేలుని కౌగలించుకొనెను.

"మిత్రమా! కుచేలా! నిన్ను దర్శించుటకు నేనే రావలయు ననుకొంటిని. కాని అవసరమైనది. నీవే నాకొరకు వచ్చినావు" అని శ్రీకృష్ణుడు ఆనంద బాష్పములను రాల్చెను. రుక్మిణీదేవి జలమును తీసుకురాగా శ్రీకృష్ణుడు కుచేలుని పాదములను ప్రక్షాళన మొనర్చెను. ఆ జలమును శిరమున చల్లుకొనెను. ఆయన పాదరక్షలు లేకుండా నడచి వచ్చుట వలన కాలులో విరిగిన ముల్లును కూడా తీసివేసెను.

"కృష్ణయ్యా! నీవు ద్వారకాధిపతివి. నేను పేద బ్రాహ్మణుడను. నీవు నా పాదమును పట్టుకొని ముల్లు తీయుట ఉచితముగా లేదు" అని కుచేలుడు పలికెను.

"కుచేలా! ఎంతమాట పలికితివి? నేను ద్వారకాధిపతినని నీ హృదయమున నా స్థానము తొలగింతువా? ధనము చేరివుండవచ్చును. అంతేగాని జ్ఞానము జారిపోలేదు. కుచేలా! నేను ఎప్పటికీ నీ స్నేహితుడనే. నీ సేవకుడనే" అనెను.

శ్రీకృష్ణుని అమృతమయ అనురాగపు వచనములు కుచేలుని హృదయమును కరిగించినవి. ఇరువురి నేత్రాలు ఆనందముతో అశ్రుపూర్ణము లయ్యెను. మళ్ళీ మళ్ళీ పరస్పరము ఆలింగన మొనర్చుకొనుచుండిరి.

కృష్ణుడు కుచేలుని వెంటబెట్టుకొని రుక్మిణీదేవి మందిరమున ప్రవేశించెను. తన పర్యంకమున కుచేలుని కూర్చుండబెట్టెను. రుక్మిణీదేవి కుచేలునకు చామరముతో వీచుచు సేవచేసెను. శ్రీనాథుడు ఎవ్వరిని కృపజూడునో వారిని శ్రీదేవి తప్పక సేవించును.

చినిగిన బట్టలతో బిచ్చగానివలె గోచరించుచున్న కుచేలుడు శ్రీకృష్ణుని ద్వారా సేవ అందుకొనుటను గాంచి, అంతఃపురస్త్రీలు దిగ్భ్రాంతి చెందిరి. ఇతడె లాంటి పుణ్యము చేసెనో గదా! అని తలపోయుచుండిరి.

ఉ॥ ఏమితపంబు సేసెనొకొ యీ ధరణీదివిజోత్తముండు తొల్
బామున యోగివిస్ఫుర దుపాస్యకుఁడై తనరారు నీ జగ
త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించియున్నవాఁ,
డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్?

ఆ తరువాత ఇరువురు మిత్రులు ఒకరినొకరు హస్తములను పట్టుకొని కూర్చుండిరి. ఆహా! కుచేలుడు గదా ధన్యాత్ముడు. తన కరమును పరమాత్మ అమృత హస్తమునందుంచి సంతృప్తి చెందినవాడు. ఇదియే ఆత్మైక్యము.

శ్రీకృష్ణుడు కుచేలునితో "నేస్తమా! గురువు వద్దనుండి మనము వెళ్ళిన తరువాత నీవు తగిన భార్యను గ్రహించితివా?

"గృహస్థుడ వైనను నీ మది కలత చెందలేదు. నీవు ప్రసన్నముగా యున్నావు. అలంకారాదుల యందు కూడా నీకు ప్రీతి గోచరించుటలేదని తెలియుచున్నది.

"మిత్రమా! మన చిన్ననాటి రోజులను నీవు స్మరించుచుందువా? ఒకనాడు గురు పత్ని కట్టెలను తెచ్చుటకై మనలను అరణ్యమునకు పంపెను. ఆనాడు గొప్ప గాలివాన వచ్చెను. భయంకరముగా మేఘములు ఉరిమెను. సూర్యాస్తమయమునయు మైనందున దిక్కులు చీకటిమయ మయ్యెను. ఏమియు గోచరించకుండెను. ఒకవైపు గాలివాన, మరియొకవైపు గాఢమైన అంధకారము. మార్గము తెలియని వారమై ఆ రాత్రంతయు ఆ అరణ్యమునందే గడిపితిమి. అది నీకు జ్ఞాపకమున్నది కదా?" అని శ్రీకృష్ణుడు కుచేలుని జూచెను. ఆ మాటలకు కుచేలుడు సిగ్గు చెందుచుండెను.

కుచేలుడు ఇలా సిగ్గు చెందుటకు కారణము లేకపోలేదు. ఆనాడు గాలివానలో ఒక చెట్టు క్రింద కృష్ణ కుచేలు లిద్దరు రాత్రంతయు కాలమును గడిపిరి. ఆ సమయమున కుచేలుని వద్ద సెనగలుండెను. కృష్ణునికి తెలియకుండా నోటిలో వేసుకొని తినుచుండెను. కృష్ణుడు అది గ్రహించెను. "కుచేలా! ఏమి తినుచుంటివి?" అని ప్రశ్నించెను.

కుచేలుడు ముందు వెనుక లాలోచించకుండా, "ఏమియును తినుటలేదు. చలిగా నున్నందున దంతములు కొట్టుకొనుచున్నవి" అని జవాబిచ్చెను. నిజము చెప్పినచో కృష్ణునికి పెట్టవలసివస్తుం దని అతని అభిప్రాయము. భగవంతునికి అర్పించకుండా భుజించువాడు దరిద్రుడగును. కుచేలుని దారిద్ర్యమునకు ఇదియే కారణము. శ్రీకృష్ణుడు గాలివాన నాటి విషయమును ప్రస్తావించగనే ఆనాటి తన మూర్ఖత్వము స్మృతికిరాగా సిగ్గు జనించెను. వెంటనే కుచేలుడు మనస్సులో శ్రీకృష్ణునికి వందనమిడుకొనెను. "భగవాన్! బాల్యచేష్టల యందలి దోషమును దర్శింపకుము" అని ప్రార్థించెను. సర్వాంతర్యామియైన శ్రీకృష్ణుడు నవ్వుకొని మళ్ళీ బాల్యదశ ముచ్చట్లను ప్రారంభించెను.

"కుచేలా! ఆ రాత్రంతయు మనము పరస్పరము ఒకరి చేయిని మరి యొకరు పట్టుకొని గడిపితిమి. తెల్లవారినది. మనము ఆశ్రమమునకు తిరిగి రాకపోవుట గనిన మన

సాందీపని గురుదేవులు మనల నన్వేషించుచు వచ్చి. వర్షములో తడిసియున్న మనలను చూచి చాలా బాధపడెను కదా!

"కుచేలా! ఆనాడు మనలను గాంచిన గురుదేవుని హృదయము ద్రవించెను. ఆనాడు గురువులు పలికిన వచనములను నీవు మరచితివా? నేను ఆ వచనములను సదా స్మరించుచునే యుందును.

కటకట యిట్లు మాకొఱకుఁ గాఁ జనుదెంచి మహాటవిన్ సము
త్కట పరిపీడ నొందితిరి గావున శిష్యులు మాఋణంబుఁ దీఁ
ర్చుట కిది కారణంబు సమకూరెడిఁ బో యిటమీఁద మీకు వి
స్ఫుట ధనబంధు దారబహుపుత్రవిభూతి జయాయురున్నతుల్.

"నాయనలారా! జీవులకు దేహములు అత్యంత ప్రియములు. మీరు మా కొరకు శరీరములను లెక్కచేయక అనేక బాధల ననుభవించితిరి. మీ గురుభక్తి ప్రశంసనీయము" అని గురుదేవులు పలికెను.

"కుచేలా! నీకు జ్ఞాపకమున్నదా? గురుదేవులు చివరగా ఇలాపలికినారు."....

ఏత దేవహి సచ్ఛిష్యైః కర్తవ్యం గురునిష్కృతమ్
యద్వై విశుద్ధ భావేన సర్వార్థాత్మార్పణం గురౌ

గురువు కొరకై, గురువునకు సేవ చేయుట కొరకై, అత్యంత ప్రియమైన దేహమును ...తో సమర్పించి, ఉత్తమ శిష్యులు గురువునకు సేవచేయుదురు.

తుష్టోఽహం భో ద్విజశ్రేష్ఠాః సత్యాః సన్తు మనోరథాః

"నేను మీ పట్ల సంతుష్టుడ నైతిని. మీ అభీష్టములు నెరవేరును గాక" అని మనలను ఆశీర్వదించెను.

"కుచేలా! గురుదేవుని అనుగ్రహముచే మనము సంతృప్తిచెందిన వారమై యున్నాము. నీవు ఆ విషయము లన్నియు స్మరించుచుందువా?" అని శ్రీకృష్ణుడు పలికెను.

శ్రీకృష్ణుని వచనముల నాలకించిన కుచేలుడు హర్షపూర్ణచిత్తుడై ఇలా పలికెను.

కి మస్మాభిరని ర్వృత్తం దేవదేవ జగద్గురో
భవతా సత్యకామేన యేషాం వాసో గురావభూత్

"జగద్గురూ! దేవదేవా! భక్తుల అభీష్టములను దీర్చు నీవంటి దివ్యాత్మునితో గురుకులవాసమున కలిసి వసించుటచేత నా జీవితము కొలత తెలియని దాయెను.

యస్య చన్దో మయం బ్రహ్మ దేహ ఆవపనం విభో
శ్రేయసాం తస్య గురుషు వాసోఽత్యన్త విడమ్బనమ్

"దేవా! చతుర్విధ పురుషార్థముల నొసగూర్చెడి వేదములు నీ దివ్యదేహమై యున్నవి. అట్టి నీవు విద్యాభ్యాసమునకై గురుకులమున కరుదెంచుట గొప్ప విచిత్రము. ఇది నీవు ఇతరులకు ఆదర్శమును చూపుటకే" అని పలికెను.

"పరీక్షిన్మహారాజా! సత్పురుషులకు ఆశ్రయస్థానమైన శ్రీకృష్ణుడు పేద బ్రాహ్మణుడైన కుచేలునితో ఈ విధముగా నవ్వుతూ భాషించుచుండెను. పెద్దగా నవ్వుచుండెను. ప్రేమదృష్టులను అతనిపై సారించుచుండెను. అది మరువలేని మహోజ్జ్వల సన్నివేశము" అని శుకబ్రహ్మ పలికి, ఆనంద పూర్ణుడై నేత్రములను మూసి భావసమాధి మగ్నుడయ్యెను.

అంతఃపుర స్త్రీలు ఈ దృశ్యమును గాంచి, పరమాశ్చర్యమును పొందిరి. ఈ బ్రాహ్మణుడు నిరుపేదవాడు. ఇతడి భాగ్యమే భాగ్యము. ఇంతటి భాగ్యవంతుడు త్రిభువనము లందును ఉండబోడు అని తలపోసుకొనుచుండిరి.

పరమాత్మ గొప్పతనమును చూడదు. గొప్పమనస్సున్నదా? లేదా? అనియే చూచును. కుచేలుడు నిర్మల హృదయుడు. వాంఛారహితుడు. పరమభక్తుడు. అందుచేతనే అన్యులెవ్వరూ పొందలేని భాగ్యమును పొందెను.

భగవంతుని సన్నిధిలో కుచేలుడు సర్వమును మరచిపోయెను. ఇదియే భక్తికి పరాకాష్ఠ.

కుచేలుని ఐశ్వర్యము

మరునాడు మిత్రులిరువురు కూర్చొని సంభాషించుకొను చుండిరి. శ్రీకృష్ణుడు అనేక ప్రశ్నలు వేసెను. కుచేలుడు తన కుటుంబ వివరము లన్నియు శ్రీకృష్ణునకు తెలిపెను. కానీ తన దారిద్ర్యమును గూర్చి ఒక్కమాట కూడా చెప్పలేదు.

"కుచేలా! స్నేహ సందర్శనార్థమై అరుదెంచితివి. నీవు నాకేమి కానుక దెచ్చితివి? దానిని దర్శింప కుతూహలపడు చుంటిని. నా భక్తులు ఇచ్చినది స్వల్పమైనను అదియే నాకు పదివేలుగా తెలియును. భక్తుడు గానివాడు, దుష్టుడైన వాడు హేమాద్రి సమానమగు పదార్థము నిచ్చినను అది నాకు సమ్మతము కానేరదు.

పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః

"ఎవడు భక్తితో పత్రమునైనను, పుష్పమునైనను, పండునైనను, జలమునైనను నాకు సమర్పించునో అట్టి పరిశుద్ధాత్ముడు భక్తి పూర్వకముగా సమర్పించిన ఆ పత్ర ఫలాదులను నేను ఆరగించుచున్నాను" అని పలికెను.

ఈ శ్లోకమును తన శిష్యుడైన కుచేలునికి చెప్పెను. ఈ శ్లోకమునే అక్షరము కూడా మార్పుచేయకుండా తనకు ప్రియుడైన అర్జునునికి భగవద్గీత - రాజవిద్యా రాజగుహ్య యోగమునందు తెలిపెను. పవిత్రమైన ఈ శ్లోకమునకు పోతనామాత్యుని అనువాదమును కూడా తిలకించి, సంతసించెదము.

క. **దళమైనఁ బుష్పమైనను ఫలమైనను సలిల మైనఁ బాయని భక్తిం**
గొలిచిన జను లర్పించిన నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్.

ద్రౌపది పత్రము నిచ్చి తరించెను. గజేంద్రుడు పుష్పమును సమర్పించి కృతకృత్యుడాయెను. శబరి ఫలముల నందించి ముక్తి నొందెను. రంతిదేవుడు జలము నొసంగి సద్గతి నొందెను. మరి కుచేలు డిప్పుడేమొసంగునో చూచెదము.

శ్రీకృష్ణుని పలుకుల నాలకించిన కుచేలుడు లజ్జావనతుడై తలవంచుకొనెను. అంతర్యామియగు అచ్యుతునకు అటుకుల నెలా సమర్పింపవలెనా? అని సంశయగ్రస్తుడాయెను.

కుచేలుని ఆగమనమునకు కారణమును శ్రీకృష్ణుడు తన దివ్యదృష్టిచే గాంచెను. భక్తుడు, మిత్రుడునైన కుచేలుడు సంపద కొరకు నన్నెప్పుడూ ఆశ్రయించలేదు. ఇప్పుడు కూడా సాధ్వీమణియగు భార్య మనస్సును నొప్పించలేక నా వద్దకు అరుదెంచినాడు. ఇతనిని నేను సంతృప్తి పరచెదను. ఇంద్రాదులు పొందలేని సంపదల నొసంగెదను అని శ్రీకృష్ణుడు అభిప్రాయపడెను.

శ్రీకృష్ణుడు కుచేలుని చూసి "పలుకవేమి? ఏమియును తీసుకొని రాలేదా? మా వదిన నాకు ఏమియును ఇవ్వలేదా?" అనెను.

శ్రీకృష్ణుని ప్రేమపూరిత వచనములకు కుచేలుని హృదయము ద్రవీభూతమయ్యెను. నిరుపేదనైన నేను ఏమి ఇవ్వగలను? అన్నట్లు దీనముగా చూచెను.

ఇంతలో శ్రీకృష్ణుడు కుచేలుని గాంచి

కిమిద మితి పృథుక తండులాన్

"ఇది ఏమిటి?" అని పలుకుచూ వస్త్రమునందు మూటగట్టియున్న అటుకులను అందుకొనెను.

భగవంతుడు ముందుగా మననుండి ఏమియు గ్రహించనిచో మనకేమియూ అనుగ్రహించడని భావము. శ్రీకృష్ణుడు కుచేలుని గాంచి "కుచేలా! ఈ అటుకులు నాకు చాలా ప్రియమైనవి. ఇవి నాకు చాలా తృప్తి నిచ్చును" అని పలికెను. కుచేలునికి అక్షయ సంపద నివ్వగోరి పిడికెడు అటుకులను గ్రహించెను. భుజించెను. జగన్నాథుడు భుజించగనే జగత్తంతయు పరితృప్తి నొందెను. ఈ పిడికెడు అటుకులను భుజించిన దాని ఫలితముగా కుచేలుని గృహమునకు విశేష సంపదలను అందించెను.

శ్రీకృష్ణుడు రెండవ పిడికెడు తీసుకొనబోగా సాధ్వీమతల్లి యగు రుక్మిణీదేవి ఆయన చేతిని పట్టుకొనెను. ఒక్క పిడికెడు అటుకులను భుజించినందుకు ఈ బ్రాహ్మణునకు ఇహపర సౌఖ్యముల నొసంగెను. రెండవ పిడికెడు భుజించినచో తనను కూడా కుచేలుని సేవకు పంపునేమో యని ఆమె భావించెను. తినవద్దని వారించెను.

క॥ మురహరుఁడు పిడికెఁ డటుకులు గర మొప్పఁగ నారగించి కౌతుహలియై
మఱియును బిడికెఁడు గొనఁ ద త్కర మప్పుడు పట్టి కమల కరకమలములన్,

శ్రీకృష్ణుని వారించుచు చేతులను పట్టుకొనిన శ్రీదేవి.

క॥ సాం పారఁగ నితనికి బహు సంపద లందింప నివియు చాలును వీఁక భ
క్షింపఁగ వలవదు త్రిజగ త్సంపత్కర దేవదేవ సర్వాత్మ హరీ!

శ్రీకృష్ణుడు రెండవ పిడికెడును త్యజించెను. ఆ రాత్రి భుజించి పరుండి, మరునాడు కుచేలుడు ప్రయాణమునకు సిద్ధమాయెను. శ్రీకృష్ణుడు కుచేలుని అనుసరించి కొలది దూరము వెంట నడిచెను. నమస్కరించి తిరిగి వచ్చెను.

స చా లబ్ధ్వా ధనం కృష్ణాన్న తు యాచితవాన్ స్వయమ్

కుచేలుడు శ్రీకృష్ణుని వద్దనుండి ఏ మాత్రము ధనమును పొందలేదు. తానేమియు కోరనూలేదు.

శ్రీకృష్ణుడు కుచేలునకు సర్వసంపదల నొసగూర్చెను. మిత్రుడైన కుచేలుని నుదుట తిలకమును దిద్దునపుడు అతడి నొసటన తెలియు బ్రహ్మరాతను శ్రీకృష్ణుడు చదివెను. అచ్చట "శ్రీక్షయ" అని ఉండెను. పరమాత్మ తన అమృత హస్తముతో దానిని తిరిగి వ్రాసెను. అది "యక్షశ్రీః" ఆయెను. కుచేలునకు అక్షయ సంపదలు చేకూరెను. ఈ విషయమును శ్రీకృష్ణుడు కుచేలునకు తెలుపలేదు. కుచేలుడు తన దారిద్ర్యమును శ్రీకృష్ణునకు చెప్పలేదు. అందుచేత శ్రీకృష్ణుడు కూడా తానొసంగిన సంపదను గూర్చి కుచేలునకు తెలుపలేదు.

భగవత్కృప తోడైనచో సర్వసంపదలు నారికేళములో నీరు నిండినట్లు లభించును. పరమాత్మదృష్టి పడనిచో సర్వసంపదలు కూడా కరి మ్రింగిన వెలగపండువలె క్షణములో అదృశ్యము అగును.

కుచేలుడు స్వార్థరహితుడు. అతడు 'శ్రీ' నిగాక శ్రీనాథునే కోరుకొనెను. భగవానుడు వానికి రెండింటిని సమకూర్చెను. పరమాత్మ కుచేలుని కౌగలించుకొనగా రుక్మిణీదేవి చామరమును చేతపట్టుకొని కుచేలునకు విసరుటలోని అంతర్యామిదియే.

శ్రీకృష్ణుడు కుచేలుని సాగనంపెను. కుచేలుడు త్రోవలో కృష్ణప్రేమను తలచుకొని పరవశించుచుండెను. ఆనందముతో కదలిపోవుచుండెను.

క॥ నాపుణ్యమరయ నెట్టిదొ యా పుణ్యనిధిం బ్రశాంతు నచ్యుతు నఖిల
వ్యాపకు బ్రహ్మణ్యునిఁ జ క్రోపకుఁ బురుషోత్తమునిఁ బరుం గనుఁగొంటిన్.

తాను భౌతికముగా దరిద్రుడైనను వాస్తవానికి ఏదో కొద్దిగా పుణ్యముండబట్టియే ఇంత సన్నిహితముగా శ్రీకృష్ణునితో చరించే భాగ్యము కలిగింది.

క్వాహం దరిద్రః పాపీయాన్ క్వ కృష్ణః శ్రీనికేతనః

"పాపిని, దరిద్రుడ నైన నేనెక్కడ? శ్రీధరుడైన శ్రీకృష్ణ డెక్కడ? అధముడనైన నన్ను అతడు ఆలింగనము చేసుకొనినాడు. అంతియే కాదు. రుక్మిణీదేవి పరుండు శయ్యపై నన్ను కూర్చుండబెట్టినాడు. రుక్మిణీమాతయే స్వయముగా నా ప్రక్కన నిలబడి చామరముతో సేవ చేసెను. శ్రీకృష్ణుడు నన్ను దేవునివలె పూజించెను.

సీ॥ పరికింపఁ గృపణస్వభావుండ నైనట్టి యే నెద! నిఖిలావనీశ్వరి యగు
యిందిరాదేవికి నెనయుంగ నిత్య ని వాసుఁడై యొప్పు వసుదేవుఁ
డేడ! నన్నర్థిమైఁ దోడఁబుట్టినవాని నైపడి గాఁగిటఁ గదియఁ జేర్చి
దైవంబుగా నన్ను భావించి నిజతల్ప మున నుంచి సత్క్రియల్ పూని నడపి
తే॥ చారు నిజవధూకరసరోజాతకలిత చామరానిలమున గత శ్రమునిఁ జేసి
శ్రీకుచాలిప్తచందనాంచితకరాబ్జ తలములను వద్దులొత్తె వత్సలత మెఱసి.

"ఈ విధముగా ఆదిదంపతులు నాకు సేవ చేసిరి. కానీ సంపదను వాంఛించి నా భార్య నన్ను శ్రీకృష్ణుని వద్దకు పంపినది. శ్రీకృష్ణుడు నాకేమియును ఇవ్వలేదు. దానికి కారణమును నే నూహింపగలను. ధనము నొసగినచో అహంకారము పొందినవాడనై మరల అతనిని స్మరింపనని భావించి యుండును. అపుడు వాంఛింప దగినది శ్రీహరి పాదసేవనమే గాని సంపద కాదుగదా!

అధనో౽యం ధనం ప్రాప్య మాద్యన్న చైర్న మాం స్మరేత్
ఇతి కారుణికో నూనం ధనం మే౽భూరి నాదదాత్

"నావంటి నిర్భాగ్యుడు సంపదను పొంది శ్రీకృష్ణుని విస్మరించునేమో యని భావించి, పరమ కరుణానిధియైన శ్రీకృష్ణుడు నాకు ధనము నొసగలేదు" అని భావించెను.

కుచేలుడు త్రోవలో శ్రీకృష్ణుని స్మరించుచునే నడక సాగించుచుండెను. భగవానుడైన శ్రీహరి నామస్మరణముతో జీవన నడకను సాగించు అద్భుత జీవనరీతిని ప్రతిభక్తుడు అలవరచుకొనవలెను.

కుచేలుడు స్వగ్రామము చేరెను. స్వగృహము కడకేగెను. ఆశ్చర్యము! అచ్చట తన గృహము లేదు. దానిస్థానే గొప్ప అందమైన భవనము గోచరించుచుండెను. అచ్చట గోచరించే ఉద్యానవనములను, సరోవరములను, అమూల్య ఆభరణములను ధరించి సేవలుచేయు పరిచారికులను గాంచి విస్మితుడాయెను. తాను దారి తప్పినట్లు భ్రాంతి చెందెను.

సీ॥ కమనీయ పద్మరాగ స్తంభకంబులుఁ గొమరారు పటికంపుఁ గుడ్యములును
మరకతనవరత్నమయకవాటంబులుఁ గీలిత హరినీల జాలకములు
దీపిత చంద్రకాంతోపలవేదులు నంచిత వివిధపదార్థములును
దగు హంసతూలికా తల్పంబులును హేమ లాలిత శయనస్థలములుఁ దనరు

తే॥ సమధికోత్తుంగ భద్రపీఠములు సిరులు మానితోన్నత చతురంతయానములును
వలయు సద్వస్తుపరిపూర్ణ వాటికలును గలిగి చెలువొందు మందిరం బెలమి నొప్పె.

కుచేలుడు ఆ భవనప్రాంగణమునకు చేరుకోగానే దేవతలవలె భాసించే స్త్రీ పురుషులు ఎదురొచ్చి వాద్యములు మ్రోగుచుండగా అతనికి స్వాగత మిచ్చిరి.

కుచేలుని భార్య భర్త రాక నెరింగి లక్ష్మీదేవివలె వెల్గొందుచూ లోపలినుండి వచ్చెను. ఆమెను గాంచి కుచేలుడు విస్మయమును చెందెను. అపుడు రత్నస్తంభములు గలిగి ఇంద్రభవనము వలె శోభించుచున్న గృహములోని కేగెను. అచ్చట గోచరించుచున్న అమూల్య విచిత్ర వస్తువులను జూచి, "దరిద్రుడనైన నాకు ఇదంతయు లభించుట శ్రీకృష్ణుని కృపావిశేషమే" యని భావించెను.

"ఆహా! నా సఖుడు, దైవము, ప్రాణనాథుడైన శ్రీకృష్ణుడు నాకు లక్షల సంపద నొసంగెను. ఆయన ప్రత్యక్షముగా ధనము నీయక మేఘమువలె పరోక్షముగా సమకూర్చెను. పిడికెడు అటుకులను నా నుండి గ్రహించి, స్వర్గభోగములను నాకు అనుగ్రహించెను. భగవానునికి ప్రీతితో ఏ కొద్దిపాటి వస్తువును సమర్పించినను అది విశేష ఫలితమును అందించును. అచ్యుతుడు స్వల్పమును గ్రహించి అధికము నొసంగును. నాకు జన్మజన్మలకు ఆ దివ్యాత్ముని, ఆయనను అర్చించు వారిని సేవించే భాగ్యము లభించిన చాలును. ధనాది భోగములను గాక సదా నేను ఆయన ధ్యానమునే వాంఛింతును.

"హే కృష్ణా! ఈ భోగములయందు నాకు ఆసక్తి లేకుండా, మునుపటి వలె అకుంఠిత భక్తితో నిన్ను సేవించు భాగ్యమునే ప్రసాదించుము" అని కుచేలుడు శ్రీకృష్ణుని చేతులు జోడించి ప్రార్థించెను. కుచేలుని భార్యకూడా శ్రీకృష్ణదేవుని ఆ విధముగనే ప్రార్థించెను.

తస్య వై దేవదేవస్య హరే ర్యజ్ఞపతేః ప్రభోః
బ్రాహ్మణాః ప్రభవో దైవం న తేభ్యో విద్యతే పరమ్

"పరీక్షిన్మహారాజా! దేవదేవుడు, ప్రభువునగు శ్రీకృష్ణునకు, బ్రహ్మజ్ఞానము నాశించు సాధువులే ప్రభువులు. వారికంటే గొప్పదైన దైవము లేదు అని శ్రీకృష్ణుని అభిప్రాయము" అని శుకబ్రహ్మ తెలియజేసెను.

కుచేలుడు శ్రీకృష్ణునకు సఖుడు. శ్రీకృష్ణుడు ఒక్క కుచేలునికే కాదు జీవులందరికీ సఖుడే.

శరణం సుహృత్

అని భగవద్గీత పరమాత్మను కీర్తించినది. ప్రపంచములో గోచరించు స్నేహములు స్వార్థముతో కూడుకొని యున్నవి. కానీ పరమాత్మ స్వార్థము తెలియని స్నేహితుడు.

ఇహమునందు మాత్రమే స్నేహితులు మనకు సహకరింప గలరు. కానీ పరమాత్మ యనెడి సఖుడు పరమునందు కూడా శ్రేయము నొసగూర్చును.

వాసుదేవుని అనుగ్రహంతో వైకుంఠముగా మారిన కుచేలుని గృహము

ఈ ప్రపంచములో ప్రాణతుల్యమైన మిత్రులైనను సహాయము చేయువలసి వచ్చినచో తమ కంటెను కొంత మిగుల్చుకొని ఆ తరువాత మనకు సహాయము చేయుదురు. కానీ పరమాత్మ అట్లా కాదు. తననే తాను సమర్పించుకొనును.

సాధారణముగా ఆప్తులైన మిత్రులు సహాయము చేయుదురు. కానీ పరమాత్మ మనస్సు కరిగి చేయి నందించును.

స్నేహితులు ధనము నొసగ గలరు. కానీ దానిని కాపాడలేరు. కానీ పరమాత్మ వచ్చినచో రక్షణభారమును కూడా తానే వహించును.

కనుక సదా భగవంతుని స్మరిస్తూ జీవించే అలవాటును చేసుకోవాలి. ద్వారకలో కుచేలుడు భోగములన్నియు పొందుటకు లభించెను. తన భక్తుడు తనవలె పూర్ణుడై యుండవలెనని పరమాత్మ భావించును. అందుచేతనే ముక్తిని వాంఛింపకుండా భక్తులు భక్తినే వాంఛించినారు.

నకో బ్రహ్మజ్ఞాన ఆత్మస్థితి భావ మీ భక్త తూం దేవ ఐసేం కరి

"నాకు బ్రహ్మజ్ఞానము అవసరము లేదు. ఆత్మస్థితి నాకు వలదు. నీవు భగవంతుడివిగా యుంటూ నేను భక్తునిగా మిగిలితే నాకు అదియే చాలును" అని ఒక భక్తుని హృదయం ద్రవించినది.

విరహాసక్తితో కుమిలిపోతున్న రాధాదేవి ఉద్ధవునితో ఇలాగే చెబుతుంది.

ఉద్ధో జో కోయీ యా తను ఫేర్ బనావై
తఊ న నష్టనష్టన తజ మధుకర బౌర్ కుఛుమన్ ఆవై
యా తనుకీ కాయీ త్వచా కార్‌కే సుందర్ దుందుభి సాజై
వివిధ ఉతంగ్ తాన్ రంగ్ సె శ్యామ శ్యామ కహి బాజై

"ఉద్ధవా! ఈ శరీరము మళ్ళీ జన్మించ గలిగినచో నేనొక్కటే ప్రార్థన చేయుచున్నాను. నా మనస్సు నందనందనుని తప్ప మరియొకరిని ప్రేమించకూడదు. ఈ దేహముపై నున్న చర్మముతో మృదంగమును తయారు చేయాలి. దానిని మ్రోగించగనే అది శ్రావ్యముగా "శ్యామ-శ్యామ" యని పలుకుతుంది" అని రాధాదేవి ఉద్ధవునితో చెప్పినట్లు పరమభక్తుడైన సూరదాస్ పరవశించి రచించినాడు.

భక్తి పరమోత్కృష్టమైనది. భగవంతుని లొంగదీయునది అదియే. అట్టి పరమ భక్తిశక్తిని కలిగిన కుచేలదంపతులు పరమాత్మ విశేషసంపద లొసంగినను భ్రమ చెందక విరక్తిలో భోగములమధ్య చరిస్తూ, భగవత్ప్రాప్తిని పొంది తరించిరి.

సూర్యగ్రహణం - బంధు సమాగమం

బలరామకృష్ణులు ద్వారక యందుండిరి. ఆ సమయమున సంపూర్ణ సూర్యగ్రహణము వచ్చెను. ఆ సందర్భమున శ్యమంతక పంచక క్షేత్రమునకు పాప పరిహారార్థము

జనులరుదెంచుచుందురు. క్షత్రియ సంహారము వలన కలిగిన పాపమును పోగొట్టుకొనుటకు పరశురాముడు ఈ క్షేత్రమునందే యజ్ఞము నాచరించెను. కురుక్షేత్రమునే శ్యమంత పంచకక్షేత్రమని యందురు.

అక్రూర, వసుదేవ, ఉగ్రసేన, సాంబ, ప్రద్యుమ్నాదులతో గూడి బలరామకృష్ణులు కూడా కురుక్షేత్రమునకు అరుదెంచిరి. గ్రహణ సమయములయందు పుణ్య తీర్థములను దర్శించి, స్నాన మాచరించి పాపములను పోగొట్టుకొనుచుందురు.

బుద్ధికి మాలిన్య మంటుటయే గ్రహణము. గ్రహణకాలమున సూర్యుని తేజము బహిర్గతము కానట్లు, బుద్ధి మాలిన్యముతో గూడినపుడు జ్ఞానప్రకాశము వ్యక్తము కాదు. తీర్థయాత్రలు చేసి పుణ్యతీర్థములలో స్నానమాచరించుట వలన పాపములు క్షీణ మగును. సత్పురుషులను దర్శించి, వారు ప్రబోధించెడి భక్తియనెడి గంగలో మునకలేయుట వలన బుద్ధిలోని మలినవాసనలు నశించును.

యాదవు లందరు కురుక్షేత్రమున స్నాన మాచరించిరి. ఉపవాసముండి, గ్రహణ సమయమున బ్రాహ్మణులకు వస్త్రములను, ధేనువులను, కానుకలను అర్పించిరి.

భక్తియనెడి స్నానము నాచరించిన పిదప ఉపవాస ముండవలెను. అనగా ఇంద్రియ విషయములను అనుభవించకుండా ఉండవలెను. ఆ తదుపరి బ్రాహ్మణులను తృప్తిపరచవలెను. అలాగే భక్తుడు సర్వభూతహితుడై యుండాలి. భక్తిని చేయుచు, ఇంద్రియములను నిగ్రహించుచు సర్వులలో ఈశ్వరుని దర్శింప గలిగినచో బుద్ధిలోని మాలిన్యమనెడి గ్రహణము వలన కలిగెడి దోషములు నివృత్తి యగును. ఇదంతయు నిష్కామ్యముగా జరుగవలెనే గాని కామ్యకర్మలు కాకూడదు.

రామహ్రదేషు విధివ త్పునరాప్లుత్య వృష్ణయః
దదుః స్వన్నం ద్విజాగ్రేభ్యః కృష్ణేనో భక్తిరస్త్వితి

ఆ తరువాత రామహ్రదముల యందు స్నాన మాచరించిన యాదవులు "శ్రీకృష్ణుని యందు మాకు భక్తి కలుగుగాక" అనెడి వాంఛను మదిలో నిడుకొని బ్రాహ్మణులకు రుచికరమగు భోజనము పెట్టిరి.

సాధుదర్శనముతో మనస్సు నిర్మలమగును. సాధుసేవలో హృదయము పరవశించును. అయితే ఈ సేవనము వెనుక మనోభావము పరమాత్మ ప్రీతియై యుండాలి. శ్రీకృష్ణుని యందు భక్తి కలుగవలె నని భావించియే యాదవులు బ్రాహ్మణులకు అన్నసంతర్పణ గావించిరి. అలాగే భగవ దనుగ్రహమును వాంఛించి, గురువులకు లేదా సాధువులకు సేవచేయాలి. అంతేగాని సాధురక్షణార్థం పుణ్యకర్మలు చేశామని భావింపరాదు. అట్టివారు ఇక్కట్లకు గురి యగుదురు.

ఆ సమయానికి ఇతర రాజ్యముల నుండి వచ్చిన రాజులను, బంధువులను కూడా వారు గాంచిరి. నందాది గోపులు కూడా స్నానార్థమై అక్కడికి విచ్చేసిరి. కృష్ణ వశ చిత్తులైన గోపికలు కూడా అరుదెంచిరి. వారు పరస్పరము వందనము లాచరించుకొని కుశల మడిగి సంతసించిరి. బంధుసమాగమము ఆనందదాయకముగా నుండెను.

వారు శ్రీకృష్ణుని గూర్చి ముచ్చటించు కొనుచుండిరి. కుంతీదేవి కూడా వచ్చెను. ఆమె ఈ సందర్భమున తల్లిదండ్రులను, సోదరులను, చిరంజీవులను గాంచి ఆనందించినది.

కుంతీదేవి వసుదేవుని సమీపించి ఇలా పలికినది: "సోదరా! నేను అభాగ్యురాలినని భావించుచున్నాను. విఫల మనోరథురాల నయ్యాను. నీలాంటి శిష్టసుజనులైన ఆత్మీయులు కూడా విపత్కాలమున మమ్ములను విచారించలేదు.

సుహృదో జ్ఞాతయః పుత్ర భ్రాతరః పితరావపి
నానుస్మరన్తి స్వజనం యస్యదైవ మదక్షిణమ్

"సోదరా! దైవము ప్రతికూలించినపుడు మిత్రులు, బంధువులు, పుత్రులు, సోదరులు, తండ్రులు ఎవ్వరును దరిచేర రనిపిస్తున్నది" అనెను.

కుంతి మాటల నాలకించిన వసుదేవుడు, "సోదరీ! మనము సామాన్య మానవులము. దైవముచేతిలో కీలుబొమ్మలము. మాలో దోషమును చూడకుము. కంసుని దురాగతములను తట్టుకోలేక మేము కూడా చెల్లాచెదరై యుంటిమి. నిలకడలేక తిరుగుచుంటిమి. కంస వధానంతరము మరల స్వస్థానములకు చేరితిమి" అనెను.

యశోదానందులు కూడా అచ్చటి కేతెంచిరి. వసుదేవుడు నందుని కౌగలించుకొనెను. యశోద ఇద్దరు బిడ్డలను ప్రక్కన కూర్చుండ బెట్టుకొని పూర్ణానందము నొందెను. బలరామకృష్ణులు నందయశోదలకు అభివాదము లొనర్చిరి. ప్రేమతో వారిని కౌగలించుకొనిరి. కంఠము పెగలక కన్నీళ్లతో నిలిచిపోయిరి.

ఆ తరువాత దేవకి, రోహిణి ఇరువురు యశోదను కౌగలించుకొనిరి. ఆనందములో పరవశించిరి. ఆమె చేసిన సహాయమును స్మృతికి తెచ్చుకొంటూ, "యశోదాదేవీ! ఈ ప్రపంచమున మేము మహేంద్రుని ఐశ్వర్యమును పొందినను మీ ఋణమును తీర్చుకొనలేము. బలరామకృష్ణులను మీరు కంటికి రెప్పలా కాపాడినారు. తల్లిదండ్రులకు దూరమైన ఆ బిడ్డలు మీ వలన నిర్భయముగా జీవించ గలిగినారు" అని బాష్పపూర్ణ నయనములతో పలికిరి.

"పరీక్షిన్మహారాజా! ఈ విధముగా బంధువులందరు పరస్పరము స్పందించి ఆనంద డోలికలలో ఊగుచుండగా పరమపవిత్రులైన గోపికలు శ్రీకృష్ణుని గాంచిరి" అని శుకబ్రహ్మ చెప్పుచున్నాడు.

గోపికలు శ్రీకృష్ణుని గాంచినారు. వెంటనే వారి నేత్రములు వర్షాకాల మేఘము లయ్యాయి. శ్రీకృష్ణుని తదేకముగా దర్శించాలని వారు ఉబలాట పడుతుండగా కంటిపై రెప్పలు పడుచుండెను. ఆ కనురెప్పలను సృష్టించిన బ్రహ్మదేవుని గోపికలు నిందించసాగిరి.

గోప్యశ్చ కృష్ణ ముపలభ్య చిరాదభీష్టం
యత్ప్రేక్షణే దృశిషు పక్ష్మకృతం శపన్తి

శ్రీకృష్ణుని దర్శనమును క్షణకాలము అడ్డగించుచున్న ఈ కనురెప్పలను సృజించిన బ్రహ్మదేవుని దూషించుచుండిరి.

శ్రీకృష్ణుడు గోపికలను సమీపించి, ప్రేమతో వారిని ఆలింగన మొనర్చుకొని, వారిని ప్రేమతో పలుకరించుచు.

"సఖులారా! మా వారిని దుష్టులనుండి రక్షించుటకై మేము మిమ్ము వదలియుంటిమి. శత్రువులను వధించుటయందే ఇంతవరకు కాలమును వినియోగించితిమి. అందుచేత చాలాకాలము మిమ్ములను గాంచుటకు వీలుపడలేదు. మీరు మమ్ములను అపార్థము చేసికొంటిరా? కృతజ్ఞత లేనివార మని భావించితిరా? ఇదంతయూ దైవేచ్ఛ. ఈ విషయమున మా దోషము ఇసుమంతైనను లేదు.

నూనం భూతాని భగవాన్ యునక్తి వియునక్తి చ

"వాస్తవానికి భగవానుడే జీవులను కలుపుచుండును. విడదీయుచుండును. మేఘములను కలుపునది, విడదీయునది వాయువేగదా! ప్రాణుల విషయములో కూడ భగవానుడు అంతియే.

"కానీ నా యందు భక్తి కలిగినవారు అమృతత్వమును పొందుదురు. నేను దూరమగుటచే మీకు నాయందు ప్రేమ అధికమైనది. ఇది శుభదాయకము. నేను సర్వత్రా నిండియుండుటచే మీరు నాకు దూరముగా లేరు."

శ్రీకృష్ణుని వచనములచే తృప్తిచెందిన గోపికల మానసములు పూర్ణముగా శ్రీకృష్ణునియందే లగ్నమైనవి.

"శ్రీకృష్ణా! దివ్యమైన నీ చరణకమలములను బ్రహ్మాదిదేవతలు కూడ సదా ధ్యానించుచుందురు. సంసారమగ్నులైన జీవులు తరించుటకు అవియే శరణ్యములై యున్నవి. అట్టి నీపాదపద్మములు సదా మా మనస్సులలో నిశ్చలముగా యుండుగాక" యని ప్రార్థించిరి.

శ్రీకృష్ణుని సతులతో ద్రౌపది భాషించుట

శ్రీకృష్ణుని పత్నులగు రుక్మిణి, భద్ర, జాంబవతి, నాగ్నజితి, సత్యభామ, కాళింది, శైబ్య, లక్ష్మణ మొదలగువారు కూర్చొని ముచ్చటించుకొనుచుండిరి. అప్పటికి ద్రౌపది విచ్చేసెను. "ఓ కృష్ణ సతులారా! శ్రీకృష్ణుడు తన లీలలను ప్రదర్శించుచూ మిమ్ములను ఎలా పరిణయమాడెనో నాకు తెలుపుడు" అని అడిగెను.

రుక్మిణి పలికెను:- జరాసంధుడు, మా సోదరుడగు రుక్మి నన్ను శిశుపాలున కిచ్చి వివాహ మొనరింప ప్రయత్నించుచుండగా, సింహము తన ఆహారమును గొనిపోవునట్లు శ్రీకృష్ణుడు నన్ను హరించెను. అతని చరణములే మాకు సదా సేవ్యములు.

సత్యభామ పలికెను:- సింహము మా పినతండ్రిని వధించెను. మా తండ్రి శ్రీకృష్ణునిపై నేరము మోపెను. ఈ కళంకమును పోగొట్టుకొనుటకై శ్రీకృష్ణుడు

జాంబవంతుని ఓడించి శమంతకమణిని తెచ్చి మా తండ్రి కిచ్చెను. అప్పుడు చేసిన తప్పిదమునకు బాధపడిన మా తండ్రి నన్ను ఈ దివ్యాత్మున కిచ్చెను.

జాంబవతి పలికెను:- నా తండ్రి శ్రీకృష్ణునితో ఇరువది ఏడు దినములు యుద్ధము చేసెను. చివరకు ఈయన సీతాపతియే నని గ్రహించినవాడై ఆయన పాదములనంటి ప్రార్థించెను. శమంతకమణితో పాటు నన్నుగూడా కానుకగా ఒసంగెను. ఆనాటి నుండి నేను ఆయన దాసినైతిని.

కాళింది పలికెను:- నేను శ్రీకృష్ణుని భర్తగా పొందవలె నని భావించి, తప మాచరించుచుంటిని. ఈ విషయమును గ్రహించిన ఈ దివ్యాత్ముడు అర్జునుని వెంటబెట్టుకొని వచ్చి నన్ను స్వీకరించెను.

భద్ర పలికెను:- నా సోదరులను, శత్రురాజులను ఓడించి స్వయంవర మండపము నుండియే నన్ను తీసుకొనిపోయెను. నాకు జన్మజన్మలకు ఆ మహాత్ముని చరణ పంకజములను సేవించు భాగ్యము కలిగిన చాలును.

నాగ్నజితి పలికెను:- నా తండ్రి రాజులశక్తిని పరీక్షించుటకై గొప్పశక్తిగల ఏడు వృషభములను తెప్పించి, వాటిని బంధించినవారికే నన్ను ఇచ్చునట్లు ప్రకటించెను. శ్రీకృష్ణుడు సులభముగా వాటిని బంధించి, నన్ను తన దాసినిగా చేసికొనెను. నేను సదా ఆతనినే ధ్యానించుచుందును.

మిత్రవింద పలికెను:- నా మేనమామ పుత్రుడగు శ్రీకృష్ణునే నేను సదా స్మరించుచుంటిని. నా తండ్రి మా ఇరువురికి వివాహము గావించెను. ఆయన పాదపద్మ సేవనము మోక్షప్రదాయకము అని నా ప్రగాఢ విశ్వాసము.

లక్ష్మణ పలికెను:- దేవర్షి నారదుని వలన శ్రీకృష్ణుని దివ్య వైభవములను శ్రవణము చేసితిని. శ్రీకృష్ణుని యందు ప్రీతి మెండుకాగా, నా మనస్సును ఆయన యందే లగ్నమొనర్చి ఆ దివ్యాత్ముని పొందితిని.

ఆత్మా రామస్య తస్యేమా వయం వై గృహదాసికాః
సర్వ సఙ్గ నివృత్త్యాద్ధా తపసా చ బభూవిమ

"మేము ఎనమండుగురము సర్వ విషయములను త్యజించిన వారమై పురుషోత్తముడైన శ్రీకృష్ణుని గృహమున దాసీలుగా యున్నాము" అని శ్రీకృష్ణుని అష్ట భార్యలు పలికిరి.

ఇతర పత్నులు ద్రౌపదితో, "అమ్మా! నరకాసురుడు రాజపుత్రికలమైన మమ్ములను బంధించి యుండెను. శ్రీకృష్ణుడు ఆ నరకాసురుని వధించి, మమ్ములను విడుదల చేసెను. ఆ క్షణము నుండి మేము అనుక్షణము ఆయన పాదపద్మములను సేవించుచుండుట గ్రహించి, మమ్ము పరిణయమాడి మా బ్రతుకులకు ధన్యత చేకూర్చెను.

"మేము సార్వభౌమాది పదవులనుగాని, అణిమాది సిద్ధులనుగాని, చివరికి బ్రహ్మపదవిని కూడ వాంఛించుట లేదు. శ్రీదేవి కుచకుంకుమ గంధ యుక్తమగు శ్రీకృష్ణుని చరణధూళిని శిరమున ధరించవలయు ననియే వాంఛించు చున్నాము."

శ్రీకృష్ణుని పాదధూళి శిరమున ధరించినవారు తప్పక ధన్యాత్ములగుదురు. శ్రీకృష్ణుని చరణములు సత్యమునకు సంకేతము. ఎవరు తమ హృదిస్థమునందు సదా భాసించు సత్యమునే దర్శించుచుందురో వారు తప్పక ముక్తపురుషులు అయ్యెదరని భావము.

వసుదేవుని మహాధ్వరము

కురుక్షేత్రమున శ్రీకృష్ణభగవానుని దర్శించుటకు వ్యాస, నారద, విశ్వామిత్ర, వశిష్ఠ, గౌతమ, కశ్యప, అత్రి, మార్కండేయ, అగస్త్య, యాజ్ఞవల్క్య, వామదేవాది ఋషులు అరుదెంచిరి.

అందరూలేచి గౌరవ సూచకంగా నిలబడి మునులకు వందనమిడిరి. రామకృష్ణులు కూడా మునులను అర్చించిరి. వారితో శ్రీకృష్ణుడు ఇలా పలికెను:

"ఈనాడు మేము సార్థకజన్ముల మైతిమి. దేవతలకు దుర్లభమైన యోగీశ్వరుల దర్శనము నేడు మాకు లభించినది. మహర్షుల కృప వలననే ఈ భాగ్యము కలిగినది.

"ఈలోకమున జలములు తీర్థములనియు, శిలలు దేవతలనియు చెప్పబడుచుండును. వాస్తవానికి ఈ మాటలు నిజముకావు. తీర్థములు, విగ్రహములు మనుజులను తరింప చేయుటకు కాలవ్యవధి పట్టును. మీలాంటి సాధువులు దర్శన సమయముననే జనులను తరింపజేయుదురు. కనుక మీరే సత్యతీర్థములు. నిత్యదేవతలు" అని శ్రీకృష్ణుడు పలుకగా మహర్షులు మౌనము వహించిరి.

ఆదిదేవుడైన శ్రీకృష్ణుడు ఇతరులకు ఆదర్శమగుటకు మాయా వచనములను భాషించుచున్నాడని గ్రహించిన మహర్షులు ఇలా పలికిరి:

"కృష్ణా! ఆదిదేవా! నీవు నీ స్వరూపమును మరుగుపరచి సామాన్యునివలె పలుకుచున్నావు. నీవు నిష్క్రియుడవు. అద్వయుడవు. సృష్టి స్థితి లయములను సాగించువాడవు. నీ లీలలు అచింత్యములు.

అద్యనో జన్మ సాఫల్యం విద్యాయాస్తప సో దృశః
త్వయా సఙ్గమ్య సద్గత్యా యదన్తః శ్రేయసాం పరః

"శ్రీకృష్ణా! దుర్లభమగు నీ దర్శనమును నేడు మేము పొందుటచే మా విద్య, తపస్సు, దృష్టి, జన్మము సఫలత నొందినవి. సర్వశుభములకు నీవు శుభకరుడవై యున్నావు."

మహర్షులు ఇలా పలికి శ్రీకృష్ణ ధృతరాష్ట్ర ధర్మరాజాదుల అనుమతిపొంది తమతమ ఆశ్రమములకు ఏగుటకు సిద్ధమైరి. ఆ సమయమున వసుదేవుడు మహర్షుల వద్దకు వెళ్ళి, వారి పాదములకు నమస్కరించెను. వినమ్రుడై ఇలా పలికెను:

"మహర్షులారా! ఈ లోకమున కర్మబంధములను ఛేదించుటకు కర్మలు ఎలా కారణములగు చున్నవి? ఈ విషయమును తెలుపుడు" అనెను.

వసుదేవుని మాటల నాలకించిన నారదుడు తీవ్రముగా స్పందించెను. వసుదేవుని భ్రాంతిమయ పలుకులను గాంచి ఆశ్చర్యపొందెను. సాక్షాత్తు పరబ్రహ్మమైన శ్రీకృష్ణ భగవానుని పుత్రునిగా పొందే భాగ్యమునకు నోచుకొని తత్త్వము నుపదేశించమని మునులను ప్రార్థించుచున్నాడు. ఆహా!... ఇదియేకదా మాయ! ఈ సందర్భమున దేవర్షియగు నారదుడు ఆసక్తిదాయకమైన కొన్ని విషయములను ఋషులకు చెప్పెను.

నారదుడు మహర్షుల నుద్దేశించి పలుకుతూ, "మునులారా! ఈ వసుదేవుడు శ్రీకృష్ణుని పరమాత్మయని యెఱుగక సామాన్యుడని భావించి, తత్త్వము నుపదేశించమని మనలను కోరుచున్నాడు. ఈ విషయమున మీరు ఆశ్చర్యపడ నవసరములేదు. ఈ లోకపుతీరు అంతే.

"ఈ లోకమున మహా గొప్పదైన ఏ వస్తువైనను సమీపమున నుండినచో దానిని గౌరవింపరు. గంగాతీరమున వసించు ప్రజలు పుణ్యముల నార్జించుటకు అన్యతీర్థముల కేగుచుందురు" అనెను.

నారదముని పలుకుల నాలకించిన మునులు వసుదేవునితో ఇలా పలికిరి: "వసుదేవా! మనుజులు సమస్త యజ్ఞములద్వారా యజ్ఞపతియగు శ్రీహరి నారాధింపవలెనని శాస్త్రములు చాటుచున్నవి. కర్మద్వారా కర్మ బంధములను ఛేదించు మార్గమిదియేనని గ్రహింపుము.

"ధర్మమార్గమున చరిస్తూ, న్యాయార్జితముతో జీవిస్తూ, జగదీశ్వరుడగు నారాయణుని ధ్యానించుటయే గృహస్థులకు శ్రేయము నొసగూర్చు మార్గము.

త్వం త్వద్య ముక్తో ద్వాభ్యాం వై ఋషి పిత్రోర్మహామతే
యజ్ఞైర్దేవర్ణ మున్ముచ్య నిఋణోఽశరణో భవ

"ఓ మహామతీ! వసుదేవా! నీవు అధ్యయనముద్వారా ఋషి ఋణమునుండి, సంతానోత్పత్తి ద్వారా పితృఋణమునుండి విముక్తుడ వైతివి. ఇప్పుడు యజ్ఞముద్వారా దేవ ఋణమును కూడా తీర్చినవాడవై ఆ తరువాత గృహమునుండి విడివడి వానప్రస్థుడవు కమ్ము.

"నీవు గొప్ప భక్తుడవు. భగవత్సేవ చక్కగా ఆచరించిన ధన్యుడవు. అందుచేతనే అనితరసాధ్య మగు ఫలమును ఈ జన్మమున పొందియున్నావు.

వసుదేవ భవాన్ నూనం భక్త్యా పరమయా హరిమ్
జగతా మీశ్వరం ప్రార్చః స యద్వాం పుత్రతాం గతః

"వసుదేవా! నీవు ఉత్తమమైన భక్తితో శ్రీహరిని ఆరాధించితివి. కనుక ఆ జగదీశ్వరుడు ఇప్పుడు నీకు పుత్రుడై జన్మించెను." అని మునులు పలికిరి.

మహర్షుల వచనముల నాలకించి వసుదేవుడు సంతసించెను. కురుక్షేత్రముననే యజ్ఞమును నిర్వహించునట్లు నిర్ణయించెను. మహర్షులకు నమస్కరించి వారినే ఋత్విజులుగా వరించెను.

"పరీక్షిన్మహారాజా! శాస్త్రవిధి ననుసరించి మునులు కురుక్షేత్రమునందే వసుదేవునిచే యజ్ఞముల చేయించిరి" అని శుకబ్రహ్మ చెప్పుచుండెను.

యజ్ఞదీక్షా సమయము ఆసన్నమాయెను. యాదవులు స్నానము లాచరించి, వస్త్రములను, ఆభరణములను ధరించిరి. వారి పత్నులు కూడా అలంకారభూషితులై యజ్ఞస్థలి కరుదెంచిరి. వివిధ మంగళ వాయిద్యములు మ్రోగుచుండెను. నర్తకీలు నృత్యములు చేయుచుండిరి. గంధర్వులు గానము చేయుచుండిరి.

వసుదేవుడు నేత్రములకు కాటుక పెట్టుకొని, దేహమున వెన్న రాసుకొని రాణులతో గూడినవాడై నక్షత్రముల మధ్య శోభించు చంద్రునివలె విరాజిల్లుచూ యుండెను. ఋత్విజులాయనను అభిషిక్తుని గావించిరి. యజ్ఞము మహా వైభవోపేతముగా సమాప్తి చెందెను.

యజ్ఞము పరిసమాప్తి కాగానే ఋషులు, రాజులు దక్షిణలను, కానుకలను స్వీకరించి వారివారి స్వదేశములకు, స్వగృహములకు వెళ్ళిరి. వసుదేవుడు పొంగుచున్న ఆనందముతో నందమహాశయుని చేతులు పట్టుకొని ఇలా పలికెను:

"సోదరా! స్నేహము అతి విలువైనది. ఇది మనుజులకు భగవంతుడొసగిన వరము. ఇది గొప్ప వీరులకు, యోగులకు కూడా దుర్లభమైనది.

"నీవు సజ్జన శ్రేష్ఠుడవు. కృతజ్ఞత కుంటుపడిన మావంటి వారి పట్ల నీవు చూపిన స్నేహము చిరస్మరణీయము. ప్రాతఃస్మరణీయము. అది ప్రత్యుపకారమును వాంఛించినది కాదు. అందుచేత దానికి నశింపు ఉండదు.

"పూర్వము కంసుని రాజ్యమున అసమర్థులమై యుండుటచే మీకు ఏవిధమైన ఉపకారమును చేయలేక పోతిమి. ఇప్పుడు ఐశ్వర్య మదముచే కన్నుగానక మీకు సేవ లందించలేకపోతిమి" అని పలికి వసుదేవుడు అశ్రుధారలను కార్చెను.

కృష్ణ వసుదేవుల ప్రేమల నారగించుచు నందుడు మూడు మాసములు వారితోనే యుండెను. అనంతరము వారొసంగిన కానుకల నందుకొని, శ్రీకృష్ణునికి దూరముగా వెళ్ళలేని చిత్తములను బరువుగా కూడగట్టుకొని నందుడు, గోపాలురు, గోపికలు మధురకు వెళ్ళిరి. వర్షాకాలము అరుదెంచుచుండెను. యాదవులు కూడా ద్వారకకు వెడలిరి.

వసుదేవునకు బ్రహ్మజ్ఞానము

యజ్ఞోత్సవమును పూర్తి చేసుకొని యాదవులతో కూడి వసుదేవుడు ద్వారక కరుదెంచెను. కొన్నిరోజులు గడిచినవి. వసుదేవుని మనస్సు ఎందులకో క్షోభకు గురియాయెను. మునులు పలికిన వచనములు చెవులలో ప్రతిధ్వనించుచున్నవి. నారదుని వాక్కులు హృదయమును కలలొపెట్ట సాగినవి.

ఒకే సమయమునకు బలరామకృష్ణులు వసుదేవుని సమీపించినారు. తండ్రికి పాదాభివందన మొనరించినారు. వసుదేవుడు పుత్రు లిరువురిని అభినందించుచూ, ఆశీర్వదించి ఇలా పలికెను:

"కృష్ణా! మహాయోగీ! సంకర్షణా! సనాతనా! ఈ జగత్తునకు కారణరూపులైన ప్రకృతి పురుషులకు కూడా కారణరూపులైన అధిష్ఠాన పరబ్రహ్మమే మీరిరువురు అని నేను భావించుచున్నాను. ప్రకృతి పురుషులుకూడా మీ యొక్క కార్యములే అని తలంచుచున్నాను. ఈ జగత్తును పోషించు అంతర్యామి మీరే అని విశ్వసించుచున్నాను.

"చంద్రునికాంతి, సూర్యప్రకాశము, అగ్నితేజము, విద్యుత్తుయొక్క స్ఫురణ అన్నియు మీ విభూతులే.

యదృచ్ఛయా నృతాం ప్రాప్య సుకల్పామిహ దుర్లభామ్
స్వార్థేప్రమత్తస్య వయోగతం త్వన్మాయ యేశ్వరః

"ఈశ్వరా! ఏ అదృష్టము చేతనో ఈ లోకమున దుర్లభమగు మనుజ జన్మను పొంది, నీ మాయా ప్రభావముచే స్వవిషయమున శ్రద్ధ లేకపోవుటచేత నా ఆయువు వ్యర్థమై పోయినది.

యువాం న నః సుతౌ సాక్షాత్ప్రధాన పురుషేశ్వరౌ

"మీరిరువురు వాస్తవానికి నా పుత్రులు కారు. ప్రకృతి పురుషులకు కారణమైన ఈశ్వరులే.

తత్తే గతోఽస్మ్యరణమద్య పదారవింద మాపన్న సంసృతి భయాపహ మార్తబన్ధో
ఏతావతాల మలమిన్ద్రియ లాలసేన మర్త్యాత్మ దృక్త్వయి పరే యదపత్య బుద్ధిః

"ఆర్తుల బ్రోచే శ్రీకృష్ణా! అందుచేత శరణాగతులైనవారి సంసార భారమును, భయమును నివృత్తిచేయు నీ చరణకమలములను నేను ఆశ్రయించితిని. దేహాత్మ భావములో చలించిపోవు నేను ఇంద్రియ లాలసత్వమునకు వశుడనై మిమ్ములను నా కుమారులని భ్రమించితిని. నాకు మీయందు అట్టి పుత్రభావము తొలగునట్లు ఆశీర్వదింపుడు" అని వసుదేవుడు పలికెను.

వసుదేవుని మాటల నాలకించిన శ్రీకృష్ణుడు పెద్దగా నవ్వెను. వినయముతో కూడినవాడై ఈ విధముగా పలికెను.

"తండ్రీ! పుత్రుడనైన నన్ను లక్ష్యభూతునిగా చేసి నీవు చక్కగా వేదాంత వచనములను పలికితివి. అందుచేత అవన్నియు సత్యములే కాగలవు.

"యదుశ్రేష్ఠా! నేను, పూజ్యుడగు బలదేవుడు, నీవు, ఈ ద్వారకావాసులు, ఈ చరాచర జగత్తు అంతయును బ్రహ్మముగ దర్శించుటయే యుక్తము" అని శ్రీకృష్ణుడనెను.

ఇచ్చట శ్రీకృష్ణుడు ఆత్మగను, బలరాముడు బుద్ధిగను, వసుదేవుడు మనస్సుగను, ద్వారకావాసులు వృత్తులుగను, చరాచర జగత్తు విషయప్రపంచముగను గుర్తించవలెను.

ఇవన్నియు భగవానునికన్నను అన్యములు గావని శ్రీకృష్ణుడు అద్వైతజ్ఞానము బోధించుచున్నాడు.

జగజ్జాల పదార్థాత్మా సర్వఏవాహ మక్షయః

"గోచరించు జగత్తునందలి సమస్త పదార్థములు నేనే. అక్షయ రూపుడను నేనే" అని మహోపనిషత్తు జ్ఞానస్థితిని గూర్చి ప్రవచించినది.

శ్రీకృష్ణుడు వసుదేవునితో, "తండ్రీ! పరమాత్మ ప్రకాశైక స్వరూపుడు, నిత్యుడు, గుణరహితుడు, అద్వితీయుడు అయ్యును తాను కల్పించిన గుణముల ద్వారా దేహాదులయందు భిన్న రూపములతో గోచరించుచున్నాడు" అనెను.

దేహములు కల్పితములు అనియు, దేహభ్రాంతి త్యజింపదగినదియే నని తండ్రికి బోధించి ఆత్మయొక్క అమరత్వమును వసుదేవునకు తెలియజేసెను.

ఘటావభాసకో భానుః ఘటనాశే న నశ్యతి
దేహావభాసకః సాక్షీ దేహనాశే న నశ్యతి

"ఘటమును ప్రదీపింపజేయు సూర్యుడు ఘటము నశించుటవలన తాను నాశము పొందుటలేదు. అలాగే దేహమును ప్రకాశింపజేయు ఆత్మారాముడు దేహము నశించినంత మాత్రాన నశించుటలేదు" అని ఆత్మబోధోపనిషత్తు తెలిపినది. అందుచేతనే

విషం బ్రహ్మాతిరిక్తం స్యాత్ అమృతం బ్రహ్మ మాత్రకమ్

"బ్రహ్మముకన్నను అన్యమైనది విషము. బ్రహ్మమే అమృతము" అని గారుడోపనిషత్తు ప్రవచించినది.

శ్రీకృష్ణుడు బోధించిన జ్ఞానమును వసుదేవుడు జీర్ణించుకొని, భేదబుద్ధిని పోగొట్టుకొని, సంతుష్టచిత్తుడై మౌనముగా నుండెను.

దేవకీదేవి కోర్కెను దీర్చుట

తండ్రి కోర్కెను దీర్చిన శ్రీకృష్ణుడు తల్లియగు దేవకీదేవిని సమీపించి, ఆమె కోర్కెను వెల్లడి చేయుమని ప్రార్థించెను.

బలరామకృష్ణులు తమ గురువైన సాందీపనిమహర్షికి మృతుడైన పుత్రుని గొనితెచ్చి గురుదక్షిణగా సమర్పించినట్లు ఆమె గతంలో వినియున్నది. ఆ విషయము ఇప్పుడు ఆమె స్మృతికి వచ్చినది. కంసుని వలన మృతులైన తన పుత్రులను తిరిగి బ్రతికించి ఇవ్వమని అడిగినది.

రామ రామాప్రమేయాత్మన్ కృష్ణ యోగేశ్వరేశ్వర
వేదాహం వాం విశ్వసృజామి ఈశ్వరావాది పూరుషా

"అప్రమేయాత్ముడగు ఓ బలరామా! యోగేశ్వరేశ్వరుడగు ఓ కృష్ణా! విశ్వమును సృజించు బ్రహ్మాది దేవతలకు మీరు నియంతలని నేను భావించుచున్నాను" అనెను.

శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడని పలుకుతూ మృతపుత్రులను సజీవులనుచేసి మానమని దేవకి అడుగుచున్నది. ఇదియే మాయ.

ఒకసారి శ్రీకృష్ణుడు యశోదను సమీపించి, "అమ్మా! నీకు ఏమి కావలెనో అడుగుము, ఇచ్చెదను" అనెను.

"కృష్ణా! నీకు క్షణము దూరముగాకుండా జీవించునట్లు అనుగ్రహింపుము" అని యశోద పలికెను.

విధివ్రాత తలక్రిందు లైనపుడు ప్రేయస్సు శ్రేయస్సుగాను, శ్రేయస్సు ప్రేయస్సుగాను గోచరిస్తుంది. బ్రహ్మజ్ఞానమును బడసి వసుదేవుడు సంతుష్టచిత్తుడు కాగా, ఐహిక వాంఛలతో దేవకీదేవి కలత చెందుతున్నది. పరమాత్మ దగ్గర యున్నను పడిగాపులు తప్పుటలేదు. వాంఛలు మోక్షానికి అవరోధములు. అవి భక్తిని కలుషిత మొనర్చును. జ్ఞానమును కుంటుపరచును.

వసుదేవుడు బ్రహ్మజ్ఞానమును ప్రసాదించమని అర్థించగా దేవకి మృతపుత్రులను మాకమని అడిగింది. ఇచ్చేది కల్పవృక్షమే అయినను మన కల్పనను బట్టియే అందుకోవడం జరుగుతుంది.

మాతృదేవి కోర్కెను దీర్చవలెనని సంకల్పించిన బలరామకృష్ణులు తమ యోగమాయ నాశ్రయించి పాతాళలోకమున ప్రవేశించిరి. అక్కడ దైత్యరాజగు బలి వీరి నాహ్వానించెను. ఉచితాసనములపై కూర్చుండబెట్టి అర్చించెను. వారి పాదోదకమును శిరమున జల్లుకొనెను. పూర్ణభక్తితో పరవశించినవాడై వారి చరణకమలములను వక్షఃస్థలము నందును, శిరమునందును మాటిమాటికి నుంచుకొనుచు ఆనందాశ్రువులను రాల్చుచుండెను.

నమోఽనన్తాయ బృహతే నమః కృష్ణాయ వేధసే
సాంఖ్యయోగ వితానాయ బ్రహ్మణే పరమాత్మనే

"అనంతుడైనవానికి, సాంఖ్యయోగప్రదాతకు, సర్వాంతర్యామియు, సాక్షాత్తు పరబ్రహ్మము నైన శ్రీకృష్ణునకు వందన మాచరించుచున్నాను" అని బలి ప్రార్థించెను.

"కృష్ణా! ఈనాడు నా జీవితములో మరపురాని సుదినము. నీ దర్శన భాగ్యము సులభతరమైనది కాదు. దుష్ప్రాప్యమైనది. అట్టి దర్శనము నీ కృపచే ఈనాడు నాకు లభించినది. ప్రభూ! నా జన్మ ధన్యమైనది" అని బలిచక్రవర్తి పలికెను.

"దైత్యరాజా! మా తల్లియగు దేవకీదేవి పుత్రులను కంసుడు వధించెను. తన పుత్రులను గాంచవలెనని మా తల్లి అభిలాషపడి మమ్ములను కోరెను. ఆమెను తృప్తి పరచవలయునని మేము భావించితిమి. వారిప్పుడు నీవద్ద యున్నారు. వారిని ఇప్పుడు మేము తీసుకువెళ్ళి మా తల్లికి చూపి ఆమె శోకమును నివారించెదము. ఆ తరువాత వారు శాపవిముక్తులై దేవలోకమునకు వెడలగలరు" అని పలికెను. భగవానుని కోర్కెను దీర్చెడి భాగ్యము గలిగినందులకు బలి పొంగిపోతూ, దేవకీదేవి మృతపుత్రులను రామకృష్ణులకు అప్పగించెను.

స్మరుడు, ఉద్గీథుడు, పరిష్వంగుడు, పతంగుడు, క్షుద్రభృత్తు, ఘృణి అను నీ యార్వురిని తీసుకొని తల్లికి చూపిరి. ఆ బాలురను జూచి దేవకి ఆనందభరితురాలయ్యెను. వారిని కౌగలించుకొనెను. ఆమె స్తనములు స్రవించసాగెను. శ్రీకృష్ణుని దేహస్పర్శ వలన పునీతులైన ఆ యారుగురు దేవకీవసుదేవులకు, బలరామకృష్ణులకు నమస్కరించి దేవలోకమునకేగిరి. ఇది అంతయు శ్రీకృష్ణుని లీలయే నని అప్పుడు దేవకి గ్రహించెను.

సుభద్రా పరిణయము

తీర్థయాత్రలు చేయుచున్న అర్జునుడు ఒక సమయమున ప్రభాస తీర్థమునకు వెడలెను. అచ్చట తన మేనమామ కుమార్తె యగు సుభద్రను బలరాముడు దుర్యోధనున కిచ్చి వివాహము చేయవలెనని సంకల్పించె నని వినెను. ఈ వివాహమునకు వసుదేవాదులు సముఖముగా లేరనికూడా వినెను. అర్జునుడు సుభద్రను అపహరించవలెనని అభిప్రాయపడెను. త్రిదండిసన్యాస వేషమును ధరించి ద్వారకకు వెళ్ళెను.

బలరామ వసుదేవాదులు అతనిని గుర్తించరైరి. అర్జునుడు వర్షాకాల మంతయును ద్వారకయందే గడిపెను.

ఒకనాడు సన్యాసి వేషమును ధరించియున్న అర్జునుని తన గృహమున ఆతిథ్యమును స్వీకరింపుమని ఆహ్వానించెను. అర్జునుడు వెళ్ళి భిక్షను గ్రహించెను. ఆ సమయమున అతడు అచ్చట సుభద్రను గాంచి విచలితమనస్కు డయ్యెను. సుభద్ర కూడా అర్జునుని గాంచెను. అతనిని గాఢముగా ప్రేమించెను.

ఉ॥ ఆ తరుణీశిరోమణియు నర్జును నర్జునచారుకీర్తి వి
ఖ్యాతుని నింద్రనందను నకల్మషమానసుఁ గామినీమనో
జాతునిఁ జూచి పుష్పశర సాయకజర్జరితాంతరంగ యై
భీతిలియుండె సిగ్గు ముఱిపెంబును మోహముఁ దేటచూపులన్.

అర్జునుడు సదా ఆమెను గూర్చియే చింతించుచుండెను. చిత్తవిభ్రమమునకు లోనైనవాడై ఆమెను అపహరించుటకు మార్గముల నన్వేషించుచుండెను.

ఒకనాడు సుభద్ర రథము నధిరోహించి దుర్గము బయల్వెడలగా అది గాంచిన కిరీటి దేవకీవసుదేవుల యొక్క, శ్రీకృష్ణుని యొక్క అనుమతిని బడసిన వాడై సుభద్రను హరించెను. సుభద్రాహరణమును గాంచిన యాదవవీరులు అర్జునునిపైకి దాడిచేయగా అతడు వారిని పరాజితులను గావించి, సుభద్రను గొనిపోయెను.

సుభద్రాహరణము బలరామునికి తెలిసినది. బలరాముడు క్రుద్ధుడాయెను. అప్పుడు శ్రీకృష్ణుడు, బంధువులు ఆయనకు నచ్చచెప్పి శాంతపరచిరి. సంతుష్టచిత్తుడైన బలరాముడు వధూవరులకు విశేషకానుకల నిచ్చి ఆశీర్వదించి పంపెను.

భక్తులారా! శ్రీకృష్ణుని దివ్య చరితమనెడి ఈ దశమ స్కంధము సమాప్తము కాబోవుచున్నది. గ్రంథాంతమునందు ఈ సుభద్రా పరిణయము ప్రస్తావించబడినది. కృష్ణ కథను మనము శ్రవణము చేసినందుకు చిత్రమైన మన బ్రతుకుల స్వరూపము మారాలి. భద్రజీవితము మనకు ప్రసాదించబడాలి. జీవితము కళ్యాణమయం కావాలి. వ్యక్తి కళ్యాణశోభతో వెల్గొందినపుడు సమాజము కూడా కళ్యాణ వైభవముతో శోభిస్తుంది. భద్రమనగా శుభమని భావము. "శుభమస్తు" అంటూ గ్రంథమును సమాప్తి చేయుటయే చివరలో సుభద్రా పరిణయమును ప్రస్తావించుటలో గమనించదగిన విషయమై యున్నది.

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమా క్షభిర్య జత్రాః

"ఓ దేవతలారా! మా చెవులతో శుభకరమగు దానినే ఆలకించెదము గాక! ఓ పూజనీయులారా! మా నేత్రములతో శుభప్రదమగు దానినే దర్శింతుముగాక!"

ఈ విధముగా మన ఋషులు శాంతి పాఠమును చదివెడివారు. శుభమగు దానిని శ్రవణముచేయుడము, శుభమగు దానిని దర్శించడము లేదా ఆచరించడము ఇదియే మన విశిష్ట సంప్రదాయము.

మరి శుభమగు వస్తువు యెయ్యది? శుభమనగా మంగళకరమైనది యని భావము. అదియే శివ మనబడినది. కనుక శివుని కన్నను అన్యమైన దంతయు త్యజింపదగినదియే. ధ్యానింపదగినవాడు పరమాత్మ ఒక్కడే.

శివ ఏకో ధ్యేయః శివంకరః సర్వమ్ అన్యత్ పరిత్యజ్య

"అన్యమైన సమస్తమును విడిచి శివంకరుడు అనగా మోక్షప్రదాతయగు శివునే ధ్యానింపవలెను" అని అథర్వశిఖోపనిషత్తు తెలిపినది.

ఈ పవిత్రమైన గ్రంథము సుభద్రా పరిణయముతో సమాప్త మగుచున్నది. అలాగే కృష్ణకథను ఆలకించిన కృష్ణభక్తుల జీవితములన్నియు భద్రమైన జ్ఞానముతోనే పరిసమాప్తి నొందాలి.

కనుక సుభద్ర యనగా ఆత్మజ్ఞానము అని అర్థము. అర్జునుడు నరుని అవతారము. అనగా జీవుడని భావము. జీవునికి ఆత్మజ్ఞానము కలగాలి. అంతవరకు అతడు చిత్త విభ్రమమునందే యుండును. ఆత్మజ్ఞానము కలుగవలె నన్నచో అన్యరాగ విస్మరణము జరుగవలెను. మనస్సులో సమస్త సంకల్పములు అణగారి పోవాలి. భద్రమగు ఆత్మజ్ఞాన ప్రసక్తి మినహా రెండవ విషయము మనస్సులో మెదలకూడదు. కదలకూడదు. అదియే సన్యాసము.

దూరయాత్రాం ప్రయత్నేన వర్జయే దాత్మచింతకః
సదోపనిషదం విద్యా మభ్యసే న్ముక్తి హైతుకీమ్

"సన్యాసియగువాడు దూరయాత్రలను ప్రయత్నముతో విస్మరించవలెను. సదా ఆత్మను గూర్చియే చింతించుచుండవలెను. మోక్షదాయకమైన వేదాంతమునే సదా అభ్యసించవలెను" అని నారద పరివ్రాజకోపనిషత్తు ప్రవచించినది.

ఇచ్చట దూరయాత్ర అనగా దురాలోచనలు లేదా ప్రాపంచిక విషయములు అని భావము. అన్య విషయములను చింతించక సదా ఆత్మ ధ్యానమువందే కాలపాగువాడు సన్యాసి యనబడును. అట్టివాడు ఎల్లప్పుడు భద్రరూపమైన ఆత్మవిద్యనే ధ్యానిస్తూ ఉండవలెను.

సుభద్రను పొంద నిచ్చగించిన అర్జునుడు సన్యాసి అయ్యెను. సన్యాసి కాని వానికి సుభద్ర లేక ఆత్మజ్ఞానము లభించదు. సన్యాసము యనగా కాషాయములు ధరించి కషాయములు మ్రింగడము కాదు.

సమ్యక్ న్యాసః ఇతి సన్యాసః

సరియైన త్యాగమే సన్యాసము అనబడినది. త్యాగి కానివాడు భద్రజీవితమును పొందలేడు.

సుభద్రను పొందుటకు అర్జునుడు తనపై దాడిచేసిన యాదవులను ఓడించ వలసివచ్చెను. అలాగే ఆత్మజ్ఞానమును పొంద నిచ్చగించు సాధకులు తమపై దాడిచేయు ఇంద్రియమనస్సులను జయింపవలెను. ఇదియే సుభద్రా పరిణయము అను సన్నివేశమునందు భద్రపరచబడిన జ్ఞానము.

భద్ర జీవితమును పొందియున్న దివ్యాత్ములను దర్శించుటకు, అనుగ్రహించుటకు, ఆశీర్వదించుటకు పరమాత్మయే స్వయముగా వచ్చును. ఈ విషయమును తరువాత "బహుళాశ్వుడు-శ్రుతదేవుడు" అనెడి భక్తుల మద్దరించెడి ఘట్టముద్వారా విశదమగును.

బహుళాశ్వుడు - శ్రుతదేవుడు

మిథిలానగరమును బహుళాశ్వుడు యనెడి రాజు పరిపాలించు చుండెను. అతడు అహంకారరహితుడు. కృష్ణభక్తుడు. సదా కృష్ణ నామామృతపానచిత్తుడై తృప్తి చెందెడి పుణ్యాత్ముడు.

ఆ పట్టణము నందే శ్రుతదేవుడు అను విప్రోత్తము డుండెడివాడు. అతడు విషయసుఖముల యందు ఆశయు, ఆసక్తియు లేనివాడు. అనాయాచితముగా లభించిన దానిలో కుటుంబమును పోషించుకొనుచూ అనాయాస జీవనమును సాగించు చుండెడివాడు. అతడు కూడా గొప్ప కృష్ణభక్తుడు.

వీరిరువురిని అనుగ్రహించవలె నని శ్రీకృష్ణుడు భావించెను. రథమును తీసుకురమ్మని దారుకునికి చెప్పెను. నారద, వామదేవ, అత్రి, వ్యాస, భార్గవాది మునులతో గూడి శ్రీకృష్ణుడు ఆనాడు శబరి కడ కేగినట్లు వెడలెను.

"పరీక్షిన్మహారాజా! వారిలో ఆనాడు నేను కూడా యుంటిని" అని పలికి శుకబ్రహ్మ నేత్రములను మూసికొనెను. భగవదనుభూతి ఆయన దృష్టిని హృదయములోనికి గొనిపోయినది.

మిథిలా నగరమునకు విచ్చేసిన శ్రీకృష్ణుని, మునులను బహుళాశ్వుడు ఆహ్వానించెను. పరవళ్ళుత్రొక్కుతున్న ఆనందావేశ భరితుడై శ్రీకృష్ణునికి సేవలు చేసెను. మునిగణమును అర్చించెను.

ఆ తరువాత భక్తుడైన శ్రుతదేవుడు శ్రీకృష్ణుని దర్శించెను. అశ్రుపూర్ణ నయనాలతో శ్రీకృష్ణుని పాదములపై బడి ఆ దివ్యచరణ కమలములను తన అశ్రువులతో అభిషేక మొనర్చెను.

శ్రీకృష్ణుడు అనుగ్రహ చూడ్కులను ప్రసరింపజేసెను. తన ఇంటికి అరుదెంచి ఆతిథ్యము స్వీకరింపుమని శ్రుతదేవుడు ప్రార్థించెను. శ్రీకృష్ణుడు అతని కోర్కెను మన్నించెను. శ్రుతదేవుడు వెళ్ళి అన్ని ఏర్పాట్లు గావించుకొని మరల తిరిగి వచ్చెను.

ఆ సమయానికి బహుళాశ్వుడు శ్రీకృష్ణునితో భాషించుచుండెను. మునిజన పరివేష్టితుడై తన రాజగృహమునందు ఆతిథ్యము స్వీకరించవలసినదిగా రాజైన బహుళాశ్వుడు శ్రీకృష్ణుని ప్రార్థించెను. శ్రీకృష్ణుడు బహుళాశ్వుని అభీష్టమును అనుగ్రహించెను.

శ్రుతదేవుడు సంశయగ్రస్తు డాయెను. తన ఇంటికి వచ్చెదనని శ్రీకృష్ణుడు తెలిపియున్నాడు. బహుళాశ్వుని విందు స్వీకరించునట్లు ఇప్పుడు పలుకుచున్నాడు. మరి ఎవరి ననుగ్రహించును? అని ఆలోచింపసాగెను. అయినా బహుళాశ్వుడు రాజు. అందుచేత ఏమియు పలుకకుండా కాలము ననుసరిస్తూ అక్కడే ఉండిపోయెను.

విందుసమయ మాయెను. రాజైన బహుళాశ్వుడు శ్రీకృష్ణుని మంగళ నాదాలతో ఘనముగా ఆహ్వానించెను. మునిజనములతోకూడి శ్రీకృష్ణుడు రాజభవనమున కేగెను. అతనికి ఉచితాసన మొసంగబడెను. ఉపవిష్టులైన మునులకు బహుళాశ్వుడు నమస్కరించెను. శ్రీకృష్ణుని పాదపద్మములను కడిగి పవిత్ర పాదోదకమును శిరమున జల్లుకొనెను.

శ్రీకృష్ణుడు విందారగించెను. ఆ తరువాత శ్రీకృష్ణుడు శయనించగా బహుళాశ్వుడు పాదసేవ చేయుచుండెను. బహుళాశ్వుని భాగ్యమును ప్రత్యక్షముగా గాంచిన శ్రుతదేవుడు బహుళాశ్వుని అంతరంగమున కీర్తించుకొనుచుండెను.

శ్రుతదేవుని కుమారుడు పరుగులిడుచూ రాజభవనమునకు వచ్చెను. తండ్రిని దూరముగా పిలచి శ్రీకృష్ణుడు మునిజనులతో గూడి ఆతిథ్యమును స్వీకరించుటకై తమ ఇంటికి వచ్చినాడని పలికెను.

పిల్లవాని మాటలు శ్రుతదేవునకు అవగతము కాలేదు. శ్రీకృష్ణుడు బహుళాశ్వుని శయ్యామందిరమున పవ్వళించి యుండగా తన ఇంటికి ఎట్లు అరుదెంచును? అని ఆశ్చర్యపడుతూ పిల్లవాని వెంట నడచి వెళ్ళెను.

శ్రుతదేవుని ఇంటిలో దర్భాసనముపై శ్రీకృష్ణుడు ఆసీనుడై యుండగా మహర్షి గణము నిలబడి యుండిరి.

శ్రీకృష్ణుని అపారమైన ప్రేమకు శ్రుతదేవుడు పరవశించెను. నేత్రముల వెంట బాష్పములు రాలుచుండగా శ్రీకృష్ణునికి నమస్కరించి ఇలా పలికెను.

కిం దేవ కరవామహే
సత్యం శాధి స్వభృత్యాన్ నః కిం దేవ కరవామహే
ఏతదన్తో నృణాం క్లేశో యద్భవానక్షి గోచరః

"దేవా! నీ దర్శన మాత్రముననే మనుజులు తమ దుఃఖములను పోగొట్టుకొను చున్నారు. నీ సేవకుడనైన నేను చేయదగిన కార్యమును శాసింపుడు" అని శ్రుతదేవుడు ప్రార్థించెను.

శ్రుతదేవుని మాటల నాలకించిన మాధవుడు నవ్వుచూ ఇలా పలికెను:

"శ్రుతదేవా! మహాత్ము లైనవారు తమ పాదరేణువులతో ముల్లోకములను పావన మొనర్చుచున్నారు. నిన్ను అనుగ్రహించుటకు వారు ఇప్పుడు నా వెంట వచ్చియున్నారు.

తస్మాద్బ్రహ్మ ఋషీ నేతాన్ బ్రహ్మన్ మచ్ఛ్రద్ధయార్చయ

"కనుక నీవు ఏ శ్రద్ధతో నన్ను పూజింతునో అదే శ్రద్ధతో వీరిని కూడా పూజింపుము."

న బ్రాహ్మణాన్మే దయితం రూపమేత చ్చతుర్భుజమ్
సర్వవేద మయో విప్రః సర్వదేవ మయో హ్యహమ్

"చతుర్భుజుడ నైన నేను భక్తులకంటే ప్రియమైనవాడను గాను. మహాత్ములు వేదమయులు. నేను వేదస్వరూపుడను."

క॥ నామది విప్రులపై గల, ప్రేమము నా తనువునందుఁ బెట్టని కతనన్
భూమీసురు లర్హులు నీ, వీమునులం బూజసేయు మిద్ధచరిత్రా!

అని భక్తులపై తనకున్న ప్రేమను శ్రుతదేవునికి వివరించుచుండెను.

శ్రుతదేవుడు ఆనందభరితు డయ్యెను. శ్రీకృష్ణుని పాదములను ప్రక్షాళన మొనర్చెను. ఆ పవిత్ర పాదోదకమును తన కుటుంబ సభ్యుల శిరములపై జల్లెను. మహర్షులను సేవించెను. అర్చించెను. అమితానందమును బొందుచూ మహర్షి జన పరివేష్టితుడైన శ్రీకృష్ణునకు ఆతిథ్యమును సమర్పించెను. శ్రీకృష్ణుడు ఆ పేద బ్రాహ్మణుని ఆతిథ్యమును ప్రేమతో స్వీకరించుచుండెను.

ఒక బ్రాహ్మణుడు అవసర నిమిత్తము రాజుగారైన బహుళాశ్వుని వద్దకు వచ్చెను. ప్రసంగవశాత్తు తాను శ్రీకృష్ణుని శ్రుతదేవుని గృహమునందు దర్శించినట్లు చెప్పెను. ఆ మాటలు వినిన బహుళాశ్వుడు విస్మితుడై తన గృహమునందే విశ్రమించుచున్న శ్రీకృష్ణుని గూర్చి పలికెను. కానీ శ్రీకృష్ణుడు అప్పుడు శ్రుతదేవుని గృహమునందే యున్నట్లు విప్రుడు పలుకగా సత్యమును గ్రహించు నుద్దేశ్యముతో బహుళాశ్వుడు శ్రుతదేవుని ఇంటికి వెళ్ళెను.

శ్రుతదేవుని ఇంటియందు శ్రీకృష్ణుడు ఒక సాధారణ మంచముపై కూరుండి యుండగా శ్రుతదేవుడు పాదసంవాహనము చేయుచుండెను. మునిజనులు ఆసీనులై

యుండిరి. శ్రుతదేవుని సతీమణి శ్రీకృష్ణునకు చామరము వీచుచుండెను. పుత్రులు ఋషివర్యులకు సేవ చేయుచుండిరి.

శ్రుతదేవుడు శ్రీకృష్ణుని దర్శించుచూ ఇలా పలికెను.

శృణ్వతాం గదతాం శశ్వ దర్చతాం త్వాభి వన్దతామ్
నృణాం సంవద తామన్తర్హృది భాస్య మలాత్మనామ్

"భగవాన్! నీవు సదా నిన్ను గూర్చి శ్రవణము చేయువారు, పూజించువారు, నమస్కరించువారు, మాలిన్యములను పోగొట్టుకొనినవారును అగు మనుజుల హృదయములలో వసించుచుందువు" అనెను.

బహుళాశ్వుడు ఈ విధమైన దర్శనమును, అమృతమయ భాషణమును గాంచి పులకాంకితుడయ్యెను. శ్రీకృష్ణుని దివ్యవిభూతిని ప్రత్యక్షముగా గాంచెను. నేత్రముల వెంట బాష్పధారలు కారుచుండెను.

బహుళాశ్వుడు శ్రీకృష్ణునకు నమస్కరించుచు "దేవా! ప్రేమస్వరూపా! సర్వులకు చైతన్యమును కలిగించు నీవు సాక్షాత్తు పరంజ్యోతివి. నిష్కించనులగు భక్తజనమును నీవు సదా కృపాదృష్టిచే బ్రోచుచుందువు. ఏకాంత భక్తులే నీకు ప్రియులు. నీ పాదములను సదా సేవించెడి లక్ష్మీదేవి కన్నను, నీ కుమారుడైన బ్రహ్మదేవుని కన్నను నీకు భక్తులే అత్యంత ప్రియులు. నీ పాదాంబుజములను ధ్యానించు మేము ధన్యాత్ముల మైతిమి" అనెను.

చ॥ హరిపదపద్మయుగ్మము నిజాంకతలంబునఁజేర్చి యొత్తుచుం
బురుషవరేణ్య! యీ నిఖిల భూతగణావళియాత్మలందు ను
స్థిరమతిఁ గర్మసాక్షివి సుధీవర! నీపదభక్తకోటితో
నరయు సుమాధినాథ చతురాస్యులుఁ బోల రటందు వెప్పుడున్.

"రాజా! ఈ విధముగా బహుళాశ్వ శ్రుతదేవులను ఇరువురు భక్తులు శ్రీకృష్ణునికి ఏకాంత భక్తులై తరించిరి" అని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుకు చెప్పెను.

శ్వవృత్తి యనగా సేవయని అర్థము. బహుళాశ్వుడు అనగా వివిధములైన సేవలతో భగవానుని తృప్తి పరచువాడు అని భావము. నవవిధ భక్తియుతుడై పరమాత్మను సదా సేవించువాడు అని అర్థము.

శ్రుతదేవుడు అనగా పరమాత్మను గూర్చి శ్రవణము చేయు నాసక్తి గలవాడని భావము. వీరిరువురిని జూచుటకు పరమాత్మ మునిజనులతో గూడి స్వయముగా అరుదెంచును. కనుక ప్రతిఒక్కరు బహుళాశ్వశ్రుతదేవులు కావాలి.

శాస్త్రమును చక్కగా శ్రవణము చేసి శ్రుతదేవులు లైనవారిని, అలాగే శ్రవణము చేసినదానిని ఆచరించు బహుళాశ్వులు లైనవారిని పరమాత్మ అనుగ్రహించును.

భగవద్గుణ శ్రవణ కీర్తనాత్

భగవానుని అనంత కళ్యాణ గుణములను శ్రవణము చేయుట ద్వారాను, అలాగే కీర్తించుట అనగా ఆచరించుట ద్వారాను పరమాత్మను పొందవలయు నని నారదమహర్షి కూడా భక్తిసూత్రములలో తెలిపియున్నాడు.

పరమాత్మ దేశకాల పరిధిలోనివాడు గాదనియు, ఆయన నిత్య స్వరూపుడనియు, సర్వాంతర్యామి యనియు శ్రీకృష్ణుడు బహుళాశ్వ శ్రుతదేవులకు ప్రత్యక్షానుభవమును కలిగించెను. పరమాత్మ ఎవరిని అనుగ్రహించి వారి హృదయకమలములలో ప్రవేశించునో అట్టివారికి తన సర్వవ్యాపకత్వస్థితిని తెలియజేసి సమదర్శనమును ప్రసాదించును. ఇదియే శ్రుతదేవ బహుళాశ్వుల వృత్తాంతము ద్వారా మనము గ్రహింపవలసిన తాత్త్విక సందేశము. అటువంటి భక్తిని మనము అలవరచుకొనవలెను.

భక్త్యావినా బ్రహ్మజ్ఞానం కదాపి న జాయతే

"భక్తి లేనిచో బ్రహ్మజ్ఞానము లభించుట యుండదు" అని త్రిపాద్విభూతి మహా నారాయణోపనిషత్తు పలికినది.

శ్రుతి గీతలు

పవిత్ర భాగవతగ్రంథము నందలి శ్రీకృష్ణుని దివ్యగాథ యనెడి ఈ దశమ స్కంధమునందు మనకు త్రివిధములైన గీతలు తెలియుచున్నవి. మొదటిది **గోపికాగీతలు**, రెండవది **భ్రమరగీతలు**, మూడవది **శ్రుతిగీతలు**. మొదటి రెండు గీతలు శృంగార రసపూరిత భక్తివిషయములై యున్నవి. చివరిది యగు శ్రుతిగీతలు నిరవధిక పరబ్రహ్మ స్వరూపమును నిర్ణయించు జ్ఞాన విషయములై యున్నవి. సృష్ట్యాదియందు వేదములు దేవతారూపమును ధరించి ఆదిదేవుడైన నారాయణునికి సుప్రభాతము పలికినవి. ఆ దివ్యవచనములే శ్రుతిగీతలు. ఇందు నారద నారాయణ ఋషుల సంవాదము కలదు.

మహాభక్తుడగు నారదమహర్షి ఒకనాడు నారాయణమహర్షి ఆశ్రమమునకు అరుదెంచెను. ఆ సమయమునకు నారాయణ ఋషి మునిజన పరివేష్టితుడై యుండెను. నారదుడు నారాయణ ఋషికి, మునివరులకు నమస్కరించెను. ఇచ్చట నారదునకు నారాయణ ఋషి బ్రహ్మజ్ఞానమును బోధించెను. శ్రుతులు దేవతారూపమును ధరించి నారాయణుని ఎలా స్తుతించిరో నారాయణఋషితోపాటు సనందనాది ఋషులు కూడా ప్రవచించిరి. శ్రుతులు నారాయణమూర్తిని ఇలా ప్రార్థించి పలికినవి.

"భగవాన్! కుండలు మట్టినుండియే ఆవిర్భవించి మట్టియందే లీనమగునట్లు, సమస్త విశ్వము యొక్క సృష్టి లయాదులు పరబ్రహ్మమునందే జరుగుచున్నవి. బ్రహ్మమువైన నీవే సనాతనుడవు. నిన్ను సేవించు జనులు రాగద్వేషాదుల నుండి విడివడినవారై, జరామృత్యువులను దాటినవారై తరించుచున్నారు.

చ॥ భరితనిదాఘతప్తుఁడగు పాంథుడు శీతలవారిఁ గ్రుంకి దు
ష్కర మగు తాపముం దొరఁగునైనడి సంపరణోగ్రతాపముల్
వెరవునఁ బాయుచుండుదురు నిన్ను భజించు మహాత్మకుల్ జరా
మరణమహోగుణంబులఁ గ్రమంబునఁ బాయుట చెప్ప నేటికిన్?

"ప్రభూ! నీ యందు భక్తిగల జీవులు ధన్యులగుచున్నారు.

"హే భగవాన్! ఋషి సంప్రదాయమునందు కొందరు మణిపూరక చక్రము నందున్న బ్రహ్మమును ఉపాసించుచున్నారు. మరికొందరు సర్వ నాడులకు ఉద్గమ స్థానమైన సూక్ష్మవస్తువుపై ధ్యానించుచున్నారు. సహస్రారమును చేరిన మనుజుడు మరల పతితుడు కానేరడు.

"మహాత్మా! ఆత్మజ్ఞానము నందించుట కొరకై నీవు అవతారముల నెత్తితివి. ఈ సత్యమును గ్రహించి ఎవ్వరు అట్టి జ్ఞానసాగరమును భక్తితో సతింతురో వారు ముక్తపురుషు లయ్యెదరు. వారు ముక్తిని వాంఛింప నవసరములేదు.

సీ॥ అనఘ దుర్గమ మైన యాత్మతత్త్వంబుఁ బ్ర వర్తించుకొఱకు దివ్యంబులైన
యంచిత రామకృష్ణాద్యవతారముల్ భజియించియున్న నీ భవ్యచరిత
మను సుధాంభోనిధి నవగాహనము సేసి విశ్రాంతచిత్తులై వెలయుచుండి
మోక్షంబు బుద్ధి నపేక్షింప నొల్లరు మఱియుఁ గొందఱు భవచ్చరణపంక
ఆ॥ జములఁ దగిలి పుణ్యతములైన హంసల నడువు నొంది భాగవతజనముల
నొనరువారు ప్రకట యోగిజన ప్రాప్య మైన ముక్తిఁ గోర రాత్మలందు.

"ప్రభూ! కణాదుని అనుసరించు వైశేషికులు జగత్తుయొక్క పుట్టుకను అంగీకరింతురు. గౌతముని అనుసరించు నైయాయికులు ఇరువది విధములైన దుఃఖనాశమునే మోక్షమని భావింతురు. కపిలుని అనుయాయులైన సాంఖ్యులు అద్వయమైన ఆత్మవస్తువునందు భేదమును దర్శింతురు. జైమినీ అనుయాయులగు మీమాంసకులు కర్మలయొక్క, కర్మఫలముల యొక్క నిత్యత్వమును సత్యమని భావింతురు. ఈ విధములైన సిద్ధాంతము లన్నియు భ్రమ జనితములేగాని సత్యము గానేరవు. త్రిగుణాతీతుడవైన నీలో త్రిగుణయుతమైన అజ్ఞానము దర్శనీయము కానేరదు."

నారాయణఋషి నారదునితో ఈ విధముగా పలికెను: "నారదా! ఈ విధమైన ఆత్మతత్త్వమును మునులు అధ్యయనము చేసి తరించిరి. ఆత్మజ్ఞానమును పొంది ఆప్తకాములైరి.

త్వం చైత ద్బ్రహ్మదాయాద శ్రద్ధయాత్మాను శాసనమ్
ధార యంశ్చర గాం కామం కామానాం భర్జనం నృణామ్

"నారదా! నీవుకూడా అజ్ఞానమును నివృత్తి చేయు ఈ పరతత్త్వమును అధ్యయనము చేసి ఈ అవనియందు స్వేచ్ఛాపర్యటనము గావింపుము" అనెను.

నారాయణఋషి వచనముల నాలకించిన నారదుడు ఈ విధముగా పలికెను.

నమస్తస్మై భగవతేకృష్ణాయామల కీర్తయే
యో ధత్తే సర్వభూతానా మభవాయో శతీః కలాః

"సర్వజీవులను ముక్తులను జేయుట కొరకు శుభకరములగు దివ్యరూపములను ధరించిన శ్రీకృష్ణపరమాత్మకు నా నమస్కారములు" అని ప్రార్థించిన నారదమహర్షి మహర్షులకు నమస్కరించి వారి నుండి సెలవు గైకొని వ్యాసుని ఆశ్రమమునకు ఏతెంచెను.

నారదుడు వ్యాసుని సమీపించి నారాయణఋషి వద్ద పొందిన జ్ఞానమును వినిపించెను. అద్వైత జ్ఞానము ఈ విధముగా యున్నది. మరి శివకేశవుల భేదమేమిటి? తరువాత అధ్యాయ విషయము అదియే.

వృకాసురుని వృత్తాంతము

పరీక్షిత్తు శుకునికి నమస్కరించి, "మహానుభావా! సాధారణముగా భోగరహితుడైన పరమశివుని ఆరాధించువారు ఐశ్వర్యవంతు లగుచున్నారు. సర్వభోగముల కాశ్రయుడైన నారాయణుని ఉపాసించువారు భోగహీను లగుచున్నట్లు తెలియుచున్నది. దీనికి కారణ మెయ్యది?" యని ప్రశ్నించెను.

శుకుడు పరీక్షిత్తుని సంశయమును నివృత్తి చేయుచున్నాడు. "రాజా! నీ పితామహుడగు ధర్మరాజు రాజసూయయజ్ఞ సమయమున ఈ విధమైన ప్రశ్ననే అడిగెను. అప్పుడు శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానమును చెప్పెదను వినుము" అనెను.

"ధర్మరాజా! నేను ఎవరిపై అనుగ్రహమును ప్రసరింతునో వారియొక్క ఐశ్వర్యమును మొదట హరింతును. అతడు భార్య, పుత్ర, బంధుజనములచే ఈసడింపబడి దుఃఖితుడగును. అప్పుడతడు బంధువుల నాధారముగా జేసుకొని సంపదను పొందుటకు ప్రయత్నించును. నేను అతని ప్రయత్నములను చెదరగొట్టుచుందును. అప్పుడావ్యక్తి వైరాగ్యమును బొందినవాడై నా భక్తుల నాశ్రయించును. అప్పుడు వానిపై నేను కృప జూపెదను. నా దయకు పాత్రుడైన అట్టి మనుజుడు సత్యరూపమైన బ్రహ్మము తన యాత్మయే నని తెలిసికొని, సద్గతిని పొంది బంధములనుండి విముక్తి నొందును" అని శ్రీకృష్ణుడు పలికెను.

"పరీక్షిన్మహారాజా! ఈ విధముగా విష్ణుతత్త్వమును మీ తాతగారైన ధర్మరాజు శ్రీకృష్ణుని నుండి గ్రహించుట జరిగెను. కానీ ఇక్కడ ఒక విషయమును గ్రహింపవలెను. అనుగ్రహ శాపాలను ప్రసాదించుట యందు త్రిమూర్తులు సమర్థులే. అయినను బ్రహ్మ శివులు శీఘ్రముగా దర్శన మొసంగెదరు. విష్ణుమూర్తి దర్శనము అంత సులభసాధ్యము

కాదు. ఈ సందర్భమున ఆసక్తికరమైన విషయము నొకదానిని తెలిపెదను వినుము" అని శ్రీశుకులవారు వృకాసురుని వృత్తాంతమును తెలియజేసెను.

ఒకనాడు వృకాసురుడు అను రాక్షసుడు మార్గమధ్యమున నారదుని జూచెను. "త్రిమూర్తులలో శీఘ్రముగా అనుగ్రహింతువా రెవ్వరు?" అని నారదుని ప్రశ్నించెను.

"అయ్యా! శంకరు దయితే త్వరగా అనుగ్రహింతును. రావణుడు శివుని అనుగ్రహమును పొంది ఆయన కైలాసగిరినే కదలించెను. బాణాసురుడు శివానుగ్రహమునకు పాత్రుడై కైలాసపురమునే పాలించుట కుద్యుక్తుడయ్యెను" అని నారదుడు పలికెను.

నారదుని ఉపదేశముచే ప్రభావితుడైన వృకాసురుడు కేదార క్షేత్రమును చేరెను. ఉగ్రతపము నాచరించెను. తన దేహమునుండి మాంసమును తీసి అగ్నియందు ఆహుతి నిచ్చెను. అయినను శంకరుడు ప్రత్యక్షము కాలేదు.

ఆరు దినములు గడిచెను. ఏడవరోజు కేదారతీర్థ జలములో తన శిరోజములను తడిపి, కత్తిని తీసికొని తన మస్తకమును ఖండించుకొన ప్రయత్నించెను.

అప్పుడు శంకరుడు ప్రత్యక్షమై అతనిని ఆ ఘోరవిపత్తు నుండి తప్పించెను. శంకరుని కరస్పర్శచే అతడు మరల పూర్ణుడాయెను. చక్కని దేహమును పొందెను.

శివుడు వృకాసురుని అనుగ్రహించెను. ఏదైనను వరమును కోరుకొనుమని చెప్పెను. వెంటనే వృకాసురుడు పరమశివునికి నమస్కరించి ఇలా పలికెను.

తే॥ వందనం బాచరించి యో యిందుమకుట ఫాలలోచన వరద! మత్పాణితలము
నేను నెవ్వనితలమీఁద నిడిన వాని మస్తకము నూఱు వ్రయ్యలై మడియ నీవె.

"హే పరమశివా! నేను ఎవని తలపై నా హస్తము నుంచెదనో వాడు వెంటనే మరణము నొందునట్లు వరము ననుగ్రహింపుము" అనెను.

శివుడు ఆ మాటల నాలకించి కొన్ని క్షణములు విషాదవదనుడై ఆ తరువాత సర్పమునకు అమృతము నందించునట్లు "తథాస్తు" అనెను.

వరములు పొందిన వృకాసురుడు దానిని ఒకసారి ప్రయోగించి దృఢపరచు కొనవలెనని భావించినవాడై తన హస్తమును శివుని శిరము పైననే ఉంచుటకు ప్రయత్నించెను. శంకరుడు భయపడెను.

వృకాసురుడు సమీపించుచుండగా శంకరుడు భయపడి పరుగిడెను.

శంకరుని బ్రహ్మాదిదేవత లెవ్వరూ రక్షింపలేక పోయిరి. చివరగా విష్ణుమూర్తి దగ్గరకు శివుడు పరుగిడుచుండగా అది ముందుగనే గ్రహించిన శ్రీహరి తన యోగమాయచే బ్రహ్మచారిగా మారెను. జింకచర్మము చేత, దండముచేత శోభించుచు దర్భలను హస్తమునందిడుకొని వృకాసురుని ఎదురుగా వచ్చి శిష్యునివలె అభినయించుచు అభివాదనము చేసెను. బ్రహ్మచారి వేషమును ధరించియున్న శ్రీహరి వృకాసురునితో ఇలా పలికెను:

"ప్రభూ! నీవు చాలా అలసినట్లు కనబడుచుంటివి. నీవు అరుదెంచిన కార్యమెయ్యది? ఇంతదూరము ఎందులకు వచ్చితివి? కొంతకాలము ఇచ్చట విశ్రమింపుము. దేహము అత్యంత అవసరమైనది. దానిని జాగ్రత్తగ రక్షించుకొనుచుండవలెను. మీరొచ్చిన కార్యమేదియో అది నేను వినదగిన దైనచో నాకు వినిపింపుము. నా సహాయము కూడా అవసరమైనచో గ్రహింపవచ్చును" అని బ్రహ్మచారి పలికెను:

శ్రీహరి యియ్యని పలుకులను పలుకగా ఆ మాటలకు భ్రమించిన వృకాసురుడు జరిగిన విషయము నంతటిని తెలియజేసెను. శివుని పట్టుకొనవలె నని చెప్పెను.

"వృకాసురా! చాలా పొరబడితివి. శంకరుని మాయమాటలను విని నీవు మోసపోతివి. దక్షుని యొక్క శాపఫలముగా పిశాచవృత్తిని బొంది, భూత పిశాచాదులకు అధిపతియైన ఆతని మాటలపై మాకు విశ్వాసము లేదు. అతడు నిన్ను నమ్మించి అసత్యవచనములను పలికినాడు. విషయము బహిర్గతమైనచో నీవలన ప్రమాదమని భావించి పరుగిడినాడు. అతను నీకు వర మీయలేరు. నీవు నామాటలు నమ్మనిచో నీ తలపై చేయి నుంచుకొనుము. ఏమియును జరుగదు. వెంటనే వెళ్ళి శంకరుని శిక్షింపుము" అని బ్రహ్మచారి వేషములో యున్న శ్రీహరి పలికెను.

శ్రీహరి వాక్కుల నాలకించిన వృకాసురుడు మతిచెడి తన హస్తమును శిరముపై నుంచుకొనెను. వెంటనే శిరము పగిలి వృకాసురుడు నేలకొరిగెను. దుర్మార్గుడగు వృకాసురుడు మృతిచెందగా దేవతలు సంతసించినవారై పుష్పవృష్టిని కురిపించిరి.

క॥ పాడిరి గంధర్వోత్తము, లాడిరి దివి నప్సరసలు నన్యోన్యముగన్
కూడిరిగ్రహములుభయముల, వీడిరిమునికోటులంత విమలచరిత్రా!

వృకాసురుడు మరణించెను. శ్రీహరి శంకరుని సమీపించి "పురుషోత్తమా! పరమశివా! దుష్టుడైన వృకాసురుడు తన దురితముల వలననే దుర్మరణమును బొందినాడు. భగవంతా! మహాత్ములకు చెడు చేయ సంకల్పించువాడు ఎప్పుడును శుభమును పొందలేడు. మరి సాక్షాత్తు జగద్గురువైన నీకు కీడు చేయ సంకల్పించిన ఆ వృకాసురునికి ఎలా సద్గతి లభించును?" అనెను.

శివునకు అపాయము సంభవించగా శ్రీహరి బ్రహ్మచారి రూపమును ధరించి వెళ్ళి రక్షించెను. ఆ శ్రీహరియే శివుని సమీపించి, "భగవాన్! పరమేశ్వరా!" అని స్తుతించి పలుకుచుండుటను గాంచితిమి. దీనిని బట్టి శివకేశవుల మధ్య భేదమును దర్శించుట సముచితము గాదని తెలియుచున్నది కదా! శివకేశవులకు మధ్య భేదమును దర్శించువారు, ప్రవచించువారు, నిర్ణయించువారు దుర్గతిని బొందెదరు.

త్రిమూర్తులు

పూర్వము సరస్వతీ నదీతీరమున మహర్షులు ఒక గొప్ప యజ్ఞమును చేసిరి. అక్కడ ప్రసంగవశాత్తు త్రిమూర్తులలో ఎవరు శ్రేష్ఠులు అనెడి సంశయము బయలుదేరెను. ఈ

విషయమును నిర్ణయించ సంకల్పించిన ఋషులు బ్రహ్మసుతుడైన భృగువును తత్కార్యమునకు నియమించిరి.

భృగువు మొదట బ్రహ్మను పరీక్షించదలచి బ్రహ్మలోకమున కేగెను. బ్రహ్మదేవుడు భృగువును చూసెను. కానీ భృగువు బ్రహ్మకు నమస్కరించలేదు. బ్రహ్మదేవుడు భృగువు ప్రవర్తనను గాంచి కోపోద్రిక్తు డయ్యెను. జలము యొక్క పుట్టుకకు అగ్నియే కారణము. అట్టి అగ్ని జలముచే చల్లబడునట్లు, పుత్రవాత్సల్యమను జలముచే బ్రహ్మయొక్క కోపాగ్ని చల్లబడెను.

తరువాత భృగువు కైలాసమున కేగెను. భృగువును చూడగనే సంతోషించిన మహేశ్వరుడు ఆసనము నుండి లేచి భృగువును సమీపించెను. ఆలింగనము చేసికొన బోయెను. ఇంతలో భృగువు "నీవు దురాచారుడవు" అని పలికి ఆలింగనమును నిరాకరించెను. ఆ మాటలకు క్రుద్ధుడైన మహేశ్వరుడు విగ్రహమును కోల్పోయి త్రిశూలమును చేపట్టి భృగువును వధించ బోయెను. పార్వతీదేవి శివుని పాదములపై బడి చంపవద్దని కోరెను. శివుని శాంతింపజేసెను.

భృగువు అనంతరము వైకుంఠమున కేగెను. ఆ సమయానికి శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవి అంకముపై శిరము పెట్టుకొని విశ్రమించి యుండెను. భృగువు శ్రీహరియొక్క వక్షఃస్థలమున కాలితో తన్నెను. భక్తప్రియుడగు నారాయణుడు లక్ష్మీదేవితో గూడి ఆయనకు నమస్కరించెను.

"ఋషిశ్రేష్ఠా! నీ ప్రయాణము హాయిగా జరిగినదా? మహాత్మా! ఈ ఆసనమున కొంతసేపు ఆసీనుడవు కమ్ము. దివ్యాత్మా! మీ రాక నెరుగక మీ విషయమున అపరాధము చేసితిని. క్షంతవ్యుడను" అని నారాయణుడు పలికెను.

సీ॥ పాలుపొందు వైకుంఠ పురమున కర్థితోఁ జని యందు సమధికైశ్వర్య మొప్పఁ
గమలాంకపర్యంక గతుఁడై సుఖించు న క్కౌస్తుభభూషు వక్షస్స్థలంబుఁ
దనపాదమున బిట్టు దన్నెఁ దన్నినఁ బాన్పు డిగి వచ్చి మునిఁజూచి నగధరుండు
పదముల కెరఁగి యో పరమతపోధన! యాగతి నీవచ్చు టెఱుఁగలేక

తే॥ యున్న నాతప్పు మన్నించి నన్నుఁ గరుణఁ జూచి యీ దివ్యమణిమయ స్ఫూర్తిఁ దనరు
రుచిరసింహాసనమునఁ గూర్చుండు దివ్య తాపసోత్తమ! యభయప్రదాన నిపుణ!

"మునివర్యా! నీ పాదజలము సకల తీర్థములను పవిత్ర మొనర్చును. అట్టి పవిత్ర జలముద్వారా నన్ను, ఈ వైకుంఠమును, వైకుంఠవాసులను పవిత్రులను గావింపుము. భగవాన్! నీపాద స్పర్శచే నా వక్షఃస్థలము పునీత మగుట వలన లక్ష్మీదేవి అచ్చట స్థిరముగా యుండగలదు" అని నారాయణుడు పలికెను.

"మునీంద్రా! భవదీయ పాదాబ్జహతి మద్భుజాంతరంబునకు భూషణంబయ్యె. భవదాగమనంబు మాబోటివారికి శుభావహంబు గాదె! నేను ధన్యుండనైతి" అని

మృదుమధురాలాపంబుల సమనయించిన సమ్మునివరుండు లక్ష్మీనాథు సంభాషణములకు జిత్తంబునం బరమానందంబు నొంది, యమ్ముకుందు ననంత కళ్యాణ గుణనిధి వళినందించి యానందబాష్పధారా సిక్త కపోలుం డగుచు దద్భక్తి పారవశ్యంబున నొందు వలుకనేరక యతనిచేత నామంత్రణంబు వడసి, మరలి సరస్వతీ తీరంబున మున్న మునుల సన్నిధికిం జనుదెంచెను యని పోతనార్యుని సహజ పాండిత్యము.

భృగువు సరస్వతీ తీరమునకు వచ్చెను. మునులకు జరిగిన విషయము నంతటిని వివరించెను. అప్పుడు మునివర్యులందరు కలిసి విష్ణుదేవుడే త్రిమూర్తులలో ఉత్తముడని నిర్ణయించిరి.

క్రోధమును జయించినవాడు భగవంతుడే కాగలడని ఈ సంఘటన వెనుకనున్న అంతర్భావము. కనుక భగవంతుని పొందగోరు సాధకులు క్రోధరాక్షసిని జయించవలెను.

అర్జున ప్రతిజ్ఞ

ద్వారక యందు ఒక బ్రాహ్మణుడుండెను. అతని భార్య బిడ్డను ప్రసవించగనే ఆ బిడ్డ చనిపోవుచుండెను. బిడ్డచనిపోగానే బ్రాహ్మణుడు రాజద్వారము కడ నిలబడి రాజును నిందించును. లోభియు, ఇంద్రియలోలుడు, కుటిలుడైన రాజు యొక్క ప్రవర్తన వలననే దేశమున ఇలాంటి ఆపదలు సంభవించు నని ఆ బ్రాహ్మణుడు నిందించసాగెను.

ఈ విధముగా తొమ్మిదిమంది బిడ్డలు మరణించిరి. విప్రుని తొమ్మిదవ పుత్రుడు చనిపోయినపుడు ఆ బ్రాహ్మణుడు రాజభవన ద్వారముకడ రాజును దుర్భాష లాడుచుండెను. ఆ సమయమునకు అక్కడ అర్జునుడుండెను. బ్రాహ్మణుని నిందావాక్యము నాలకించెను. అర్జునుడు బ్రాహ్మణునితో

"ద్విజశ్రేష్ఠా! నేను నీ సంతానమును రక్షింపగలను. ఒకవేళ నేను రక్షింపలేనిచో అగ్నిలో ప్రవేశించి ఆత్మార్పణ గావించుకొందును" అనెను.

"సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధాదులే రక్షింపలేకపోయిరి. ఇక నీవు రక్షించుట సాధ్యమగునా? మాకు నీ మాటలయందు నమ్మకము లేదు" అని విప్రుడనెను.

"ఓ ద్విజుడా! నేను అర్జునుడను. శివుని మెప్పించిన వాడను. అవసరమైతే యముని ఓడించి నీ సంతానమును రక్షించెదను" అని అర్జునుడు పలికెను.

బ్రాహ్మణుడు సంతసించి గృహమునకు వెడలెను. తరువాత భార్యకు ప్రసవ సమయ మాసన్న మాయెను. బ్రాహ్మణుడు అర్జునుని వద్దకు పరుగులిడి తన సంతానమును కాపాడుమని ప్రార్థించెను.

అర్జునుడు పవిత్ర జలముతో ఆచమనముచేసి, పరమేశ్వరునికి నమస్కరించి, గాండీవమును తీసికొనెను. పురిటింటిచుట్టు బాణములతో గూడువలె నిర్మించెను.

బ్రాహ్మణ పత్ని ప్రసవించెను. పిల్లవాడు ఉదయించెను. ఆ పిల్లవాడు రోదించుచూ సశరీరముతో ఆకాశమార్గమున అంతర్హితుడయ్యెను.

బిడ్డ అదృశ్యము కాగానే బాధాతప్తుడైన బ్రాహ్మణుడు కృష్ణుని సన్నిధిలోనే అర్జునుని తీవ్రముగా దూషించెను.

మౌఢ్యం పశ్యత యే యోఽహం శ్రద్ధధే క్లీబ కత్థనమ్

"ఆహా! నేనెంత మూర్ఖుడను. నపుంసకుడైన అర్జునుని మాటలను నమ్మితిని. ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, బలరాముడు, స్వయముగా శ్రీకృష్ణుడే సఫలులు కాలేని ఈ కార్యమును మరెవరు సాధించగలరు? ఈ అర్జునుడు అహంకారి. ఆత్మస్తుతి పరాయణుడు. అసత్యవాది. నన్ను నమ్మించి వంచన చేసినాడు. వీని గాండీవము నిష్ప్రయోజన మగుగాక!"

క॥ ఎక్కడి పాండుతనూభవుఁ డెక్కడి విలుకాఁడు వీని కెక్కడిసత్యం
బెక్కడి గాండీవము దన కెక్కడి దివ్యాస్త్రసమితి యేమనవచ్చున్.

అని బ్రాహ్మణుడు అర్జునుని నిందించసాగెను. ఈ నిందావాక్యముల నాలకించిన పార్థుడు విప్రుని మృతపుత్రుని దెచ్చుటకు సంయమనీ పురమునకు వెళ్ళెను. కాని ఆ బాలుడు అక్కడ లేడని యమధర్మరాజు చెప్పెను. అక్కడ నుండి ఇంద్రలోకమునకు, అగ్ని లోకమునకు, చంద్ర లోకమునకు, వాయు లోకమునకు, వరుణ లోకమునకు, రసాతలమునకు, స్వర్గమునకు మరియు ఇతరలోకములకు వెళ్ళి చూచెను. కానీ పిల్లవాడు ఎక్కడా గోచరించలేదు. అర్జునుడు తిరిగి వచ్చెను. ప్రతిజ్ఞ నెరవేరనందుకు చింతించి అగ్నియందు ప్రవేశించుటకు సిద్ధమాయెను.

అప్పుడు శ్రీకృష్ణుడు ఏతెంచి అతనిని నివారించెను. అర్జునుని ఓదార్చుతూ ఇలా పలికెను.

దర్శయే ద్విజ సూనూం స్తే మావజ్ఞాత్మాన మాత్మనా!
యే తేనః కీర్తిం విమలాం మనుష్యాః స్థాపయిష్యన్తి

"అర్జునా! ఈ బ్రాహ్మణుని పుత్రుని నేను నీకు చూపగలను. నిన్ను నీవు కించ పరచుకో వలదు. ఎవ్వరు మనలను నేడు నిందించుచున్నారో వారే తరువాత, రేపు మనలను కీర్తిమంతులుగా నిలుపగలరు" అని పలికి తన రథముపై అర్జునుని కూర్చుండబెట్టుకొని బయలుదేరెను.

శ్రీకృష్ణుడు సప్తపర్వతములను, సప్తసముద్రములతో గూడిన సప్తద్వీపములను దాటి, భయంకరమగు అంధకారమున ప్రవేశించెను. ఆ చీకటిలో గుఱ్ఱములు రథమును లాగలేకపోయినవి. వెంటనే కోటిసూర్య సమప్రభావమగు సుదర్శన చక్రమును ముందు నడిపెను. శ్రీకృష్ణుడు దివ్యమైన మణులతో పొదగబడి వేల స్తంభములచే శోభిల్లు మహాకాళ పురమును చేరెను. అక్కడ సహస్ర మస్తకముల యందలి మణులచే భవ్యముగా ప్రకాశించుచున్న ఆదిశేషుని దర్శించెను. ఆయనపై సమస్త లోకాధీశ్వరుడగు పరమాత్మ ఆసీనుడై యుండెను. ఆ దివ్యపురుషుని గాంచి కృష్ణార్జునులు నమస్కరించిరి.

"కృష్ణార్జునులారా! నేను మిమ్ములను దర్శింపగోరియే ఆ బ్రాహ్మణ పుత్రులను ఇక్కడికి తెచ్చితిని. మీరు నా స్వరూపులే. ధర్మ సంస్థాపనార్థము మీరు పుడమిపై అవతరించితిరి. ఆ కార్యమును త్వరగా పూర్తిచేసి నాలో ఐక్యము కండి" అనెను.

కృష్ణార్జునులు "అలాగే" నని పలికి, బ్రాహ్మణ బాలురను తీసికొని మధురకు వచ్చిరి. వారిని కృష్ణార్జునులు బ్రాహ్మణునకు అర్పించిరి.

అర్జునునికి కనువిప్పు కలిగెను. ఎంత వీరులైనను, ధీరులైనను, కీర్తి మంతులైనను పరమాత్మ సహకారము లేనిదే ఏదియును సాధింపలేరు. అహంకారము అనర్థదాయకమై అగచాట్లను తెచ్చి పెట్టును. ఆత్మార్పణబుద్ధితో అచ్యుతుని యందు మనస్సు నుంచినవారు సదా రక్షితులై యుందురు.

భగవానుడైన శ్రీకృష్ణుడు ఈవిధమైన అనేక లీలలను ప్రదర్శించెను. గొప్ప యజ్ఞములను నిర్వహించెను. ఇంద్రుడు అంతటను వర్షమును కురిపించునట్లు శ్రీకృష్ణుడు భక్తుల హృదయములను సంతృప్తి పరచెను.

మ॥ హరి సర్వేశు(డనంతు(డాద్యు(డభవుం డామ్నాయసంవేది భూ
సురముఖ్యప్రజలన్ సమస్తధనవస్తుశ్రేణి నొప్పార(గా
బరిరక్షించుచు ధర్మమున్ నిలుపుచుం బాపాత్ములం ద్రుంచుచుం
బరమోత్సాహ మెలర్ప భూరిశుభ విభ్రాజిష్ణు(డై ద్వారకన్.

అర్జునుడు లాంటి సజ్జనులను బ్రోచి, కంసునివంటి దుర్జనులను వధించి, ధర్మరాజులాంటి మహాత్ములద్వారా ధర్మమును చతుష్పాదములతో నడిపించి, దివ్యావతార పురుషుడని శ్రీకృష్ణుడు సర్వులచే స్తుతించబడినాడు.

మహిషీ గీతము (ఉపసంహృతి)

"పరీక్షిన్మహారాజా! సమస్త సంపదలలో శ్రీకృష్ణుడు ద్వారకయందు శోభించుచుండెను. పదునారువేల భార్యల అప్రమేయ ప్రేమానురాగములకు భాజనుడై ఆనందముగా విహరించుచుండెను. ఆయన లీలా విశేషములను గంధర్వులు గానము చేయుచుండిరి. ఆయన తన నడకచే కొందరి నాకర్షించును. ప్రేమభాషణములచే మరి కొందరిని వశపరచుకొనును. పరిహాస వాక్కులచే కొందరి చిత్తములను హరించును. మధురమైన హాస్య భాషణముచే ఇంక కొందరిని తన వైపుకు లాగుకొని ఆనందించును. క్రీడలద్వారా కొందరిని, ఆలింగనము ద్వారా ఇంక కొందరిని ఆకర్షించును. ఈ విధముగా అనిర్వచనీయమైన ఆనందమును అనుభవించెడి శ్రీకృష్ణుని భార్యలు పారవశ్యములో ఏవో ఏవో మాట్లాడెడివారు. రాజా! వినుము" అని శుకబ్రహ్మ పలికెను.

లకుముకిపిట్ట రాత్రివేళ కూయుచుండును. అది విని ఒక మహిషి "ఓ కురరీ! శ్రీకృష్ణుడు రాత్రివేళ నిద్రించును. నీవు నిద్ర లేనిదానివై బాధపడుచుంటివి. మావలె నీ చిత్తముకూడా వ్యథ చెందుచున్నదా?" అనెను. (విరహాభక్తిలో నిద్ర అసూహ్యము).

"ఓ సాగరుడా! ఎందుకు అలా ఘోషించుచుంటివి? శ్రీకృష్ణుడు మా యొక్క కుంకుమాది చిహ్నములను హరించునట్లు, నీయొక్క లక్ష్మీకౌస్తుభమును హరించెనా?" అని మరొక భార్య పలికెను. (అవును. శ్రీకృష్ణుడు చిత్తముల నపహరించిన తరువాతనే భక్తుల ననుగ్రహించును.)

"ఓ మలయ మారుతమా! మేము నీకు ఏమి అపరాధము చేసితిమి? శ్రీకృష్ణుని విరహ బాణములచే మా చిత్తము తూట్లు పడియున్నది. నీవా రంధ్రముల ద్వారా మదనుని మా హృదిలోకి పంపుతున్నావు" అన్నది ఇంకొక భార్య. (శ్రీకృష్ణుని దివ్యస్పర్శకు నోచుకొనినచో అన్నివైపుల నుండి నీకు సందేశాలే అందుతాయి).

"ఓ మేఘుడా! నీవు శ్రీకృష్ణునితో ఎందులకు సఖ్యము చేసితివి? పద్మ పలాశ లోచనుడగు శ్రీకృష్ణుని విరహమును భరించలేక మావలెనే కన్నీటిధారను కురిపించు చున్నావు" అంటూ ఒక మహిషి. (శ్రీకృష్ణుని విరహములో "అహం" మిగలకుండా కారిపోతుంది. కారిపోవాలి.)

"ఓ పర్వతమా! నీవు భాషింపవు. చలింపవు. నీవు ఏదో అగాధమైన విషయమును ఆలోచించునట్లు తెలియుచున్నది. ఉన్నత స్తనములవలె తెలియుచున్న నీ శృంగములపై శ్రీకృష్ణుని చరణకమలములను ధరింప దలచితివా ఏమి? సావధానముతో ఆలోచించు. నీకుకూడా మాకు పట్టిన గతియే పట్టును" అన్నదొక భామిని. (నిరంజనుని ధ్యానములో లభించునది నిష్క్రియత్వస్థితియే.)

"ఓ కోకిలా! రమ్ము! ఈ రమణీయ కంఠధ్వని నీ కెక్కడిది? మా కృష్ణునికడ అపహరించినావు కదూ! చెప్పు. నీకు సేవ చేయుటకు మా సంసిద్ధతను వ్యక్తము చేయుచున్నాము" అన్నది మరొక భార్య. (మహాత్ముల పలుకులు మాధవుని హృదయములో నిలుపును. సాధుసేవనమే ముక్తికి మార్గమైయున్నది.)

"ఓ హంసా! నీకు స్వాగతము. నీకు క్షీరము నొసంగెదము. కృష్ణుని గూర్చి చెప్పుము. అయినా మేము ఆయన నెందులకు సేవింపవలెను? ఆయనతో పాటు ఎప్పుడూ లక్ష్మీదేవియే ఉన్నది. నీవు వెళ్ళు. ఆమె లేకుండా కృష్ణుని కొనితెమ్ము!" అన్నది మరొక మహిషి. (నిజభక్తులు సంపదలను లక్ష్యపెట్టరు. భోగములను వాంఛింపరు. భగవంతుడే శరణమని నమ్ముదురు. ఆతనినే వాంఛింతురు.) ఈ విధముగా రమణీమణులు రాసవిభుని సహచర్య భాగ్యమును పొంది తరించిరి. యాదవులు సర్వావస్థలయందు శ్రీకృష్ణుని విస్మరించక తరించిరి.

శయ్యాసనాట నాలాప క్రీడా స్నానాది కర్మసు
నవిదుః సన్తమాత్మానాం వృష్ణయః కృష్ణ చేతసః

"కృష్ణునియందే మనస్సును లగ్నమొనర్చిన యాదవులు శయనించుట, ఆసీనమగుట, సంచరించుట, సంభాషించుట, క్రీడించుట, స్నానమాచరించుట మున్నగు కర్మలలో తమను తాము మరచిరి.

"పరీక్షిన్మహారాజా! 'కృష్ణకథ' యనెడి గంగ విష్ణువు పాదముల నుండి ఆవిర్భవించిన గంగాభవాని మహిమను తగ్గించినది. ఈ కృష్ణకథ యనెడి సుధారసమును

గ్రోలినవారు మహిలో మహితాత్ములై శోభించగలరు. ఆత్మవిదులై శోభిల్లగలరు" అని శుకబ్రహ్మ పదేపదే శ్రీకృష్ణ నామమును పలుకుచూ పారవశ్యములో అంతర్ముఖుడాయెను.

మ॥ మనుజేంద్రోత్తమ! యేను నీకుఁ ద్రిజగన్మాంగళ్యమై యొప్పఁజె
ప్పిన యీకృష్ణకథాసుధారసము సంప్రీతాత్ములై భక్తిఁ గ్రో
లిన పుణ్యాత్ములు గాంతు రిందు సుఖముల్ నిర్ధూతసర్వాఘులై
యనయంబుం దుదిఁగాంతు రచ్యుతపదంబైనట్టి కైవల్యమున్.

దశమ స్కంధము సమాప్తము

...... ఓం ......

గ్రోలినవారు మహిలో మహితాత్ములై శోభించగలరు. ఆత్మవిదులై శోభిల్లగలరు" అని శుకబ్రహ్మ పదేపదే శ్రీకృష్ణ నామమును పలుకుచూ పారవశ్యముతో అంతర్ముఖుడాయెను.

మ॥ మనుజేంద్రోత్తమ! యేను నీకుఁ ద్రిజగన్మాంగల్యమై యొప్పఁజె
ప్పిన యీకృష్ణకథాసుధారసము సంప్రీతాత్ములై భక్తిఁ గ్రో
లిన పుణ్యాత్ములు గాంతు రిందు సుఖముల్ నిర్ధూతసర్వాఘులై
యనయంబుం దుదిఁగాంతు రచ్యుతపదంబైనట్టి కైవల్యమున్.

దశమ స్కంధము సమాప్తము

.... ఓం ....

ఉపోద్ఘాతము

ఇది ఏకాదశ స్కంధము.

"ఏకాదశో యస్య లలాట పట్టం"

ఏకాదశ స్కంధము భగవానుని లలాటస్థానమై శోభించు చున్నది. ఈ స్కంధమున సాధనలు ప్రదర్శింపబడినవి. సాధకునికి ఉపయుక్తమైన ఎన్నియో సాధన విషయములను ఈ స్కంధము ప్రవచించును. సాధన కుదిరిన సాధకుడు రోదనకు దూరమగును. సాధ్య రూపుడగు పరమాత్మను పొంది తరించును.

ముక్తి ఎవరికి? ఆత్మకా? అది నిత్యముక్తము గనుక సాధనకు సుదూరము. లేక దేహమునకా? అది జడము గనుక అనిత్యము. ముక్తికి నిరుపయోగము. మరి ముక్తి ఎవరికి? బంధము ఎవరికి తెలియునో వారికే ముక్తి. బంధము మనస్సునకే గనుక ముక్తి గూడా మనస్సుకు సంబంధించినదియే. మనస్సును ఈవిధముగా ముక్తికి సిద్ధపరచునదియే సాధన.

తేజస్సు లోపల యున్నది. దాని నన్వేషిస్తూ మనస్సు బయటికి పరుగిడుచున్నది. బహిర్ముఖమయ్యే మనస్సును అంతర్ముఖం చేసే ప్రయత్నమే సాధన. సాధనచేయు పుణ్యాత్ముడు సాధకుడు. సాధ్యరూపుడైన పరమాత్మను పొంది తరించిన ముక్తపురుషుడు ధన్యాత్ముడు.

ఈ స్కంధము వైరాగ్యమును బోధిస్తూ ప్రారంభమున నడక సాగించును. విషయవాసనాయుతమైన మనస్సు పరమాత్మ ధ్యానమున కుపకరించదు. అట్టి మనస్సును పరిశుద్ధ మొనర్చుటకు వైరాగ్యము చక్కగా ఉపకరించును. ముఖ్యంగా అవధూతోపాఖ్యానము ఈ స్కంధమున అతి రమణీయమైన ఆధ్యాత్మిక విషయము. శ్రీకృష్ణపరమాత్మ అవతార సమాప్తి సమయాన మహాత్ముడైన ఉద్ధవునకు బోధించిన "ఉద్ధవగీత" అమోఘమైనది. ఇది సాధకులకు కల్పవృక్షమువలె సాయపడును.

మాయ భయంకరమైనది. విచిత్రమైనది. మాయను దాటినవాడే మాధవుని బొందగలడు. మాయను దాటుట ఎలాగో ఈ స్కంధము చక్కగా బోధించును. కర్మ, భక్తి జ్ఞాన, యోగ, సంకీర్తనాదులను రసవత్తరముగ వర్ణించును. సత్సంగ వైభవమును కీర్తించును. దుస్సంగ ప్రాభవమును వివరించును. నిస్సంగుడై జీవించు టెలాగో ప్రవచించును. జగత్తంతయు జగదీశ్వర స్వరూపమని నిర్ణయించును. నిరూపించును. ఈ స్కంధము వాస్తవానికి సాధకుని బ్రతుకును అందముగ తీర్చిదిద్దును.

వికారాలను వదలించుకుందాము. అహంకారమునుండి విడివడుతాము. మమకారము నుండి బయటపడుతాము. సంసార హాహాకారములను త్యజించి సాకారుని అర్చిస్తాము. నిరాకారుని చేరి తరిస్తాము. నిరంజనమై భాసిస్తాము.

మరి..... ఇంకేమిటి? సాధనలో సాగడమే...... కొనసాగడమే. కదలండి......

చైతన్య భాగవతము

ఏకాదశ స్కంధము

ముసలోద్భవం

కాలము ఎవ్వరినీ కనికరించదు. కాలములో చరించు మనుజుడు కాలుని నోట బడక తప్పదు. మృత్యువు కూడా మంగళకరమే. జననము శుభకర మైనపుడు మరణము అశుభ మెలా అవుతుంది? చక్కెరబొమ్మ ఆద్యంతము అందు మధురమే అయినట్లు, జీవితము అన్ని దశలలోను శుభప్రదమే.

మరణించుట అశుభమని చాలా మంది భావిస్తూంటారు. శుభకరుడగు శివుడు లయకర్త యైనపుడు మరణము అశుభ మెలా అవుతుంది? శివుడు మంగళస్వరూపుడు. ఆయన వాసస్థలమైన శ్మశానము కూడా మంగళ స్వరూపమే.

రంగస్థలము రమణీయంగా ఉంది. నటుని నటనా పటిమ అద్భుతంగా ఉంది. మరి అట్టి నటునికి రూపమును మార్చి ప్రవేశపెడుతున్న ఆహార్యగది అమోఘము కాకపోతుందా?

గ్రీన్‌రూమ్‌లో నటుడు రూపాన్ని మార్చుకొంటాడు. ఆ తరువాత రంగస్థలము పై తన నటన నభినయిస్తాడు. ఆకృతి నిచ్చేది ఆహార్యమే. జీవునికి రూపు రేఖలను దిద్దునది శ్మశానమే. కనుక నల్లకాడు వందనీయ మైనదియే.

జనించిన వారందరు మరణించకుండా యుండినచో ఈ ప్రపంచము నిజంగా అమంగళమే అయ్యేది. నశించుట వలననే నవ్యత నిలిచి ఉంది. మరణము వలననే మనుగడ మిగిలి ఉంది. నిలకడ జరుగుతుంది. పుట్టిన పాములన్నీ చిరంజీవు లైతే, తేళ్ళన్నీ

జీవన్ముక్తులైతే మన బ్రతుకెలా ఉండేదో? సృష్టిలో కదలిన వారంతా నిలచి యుండినచో మన కీనాడు కదిలేందుకు చోటు కూడా మిగిలుండేది కాదు.

పరమాత్మ విరచితమైన ఈ విశ్వములో మలుపు లన్నీ వలపులే. మంగళ రూపములే. జన్మము ఈశ్వర ప్రసారము. మరణము కూడా అంతే. ఈ సత్యమును తెలిసినవాడు మాధవుడు. తెలియనివాడు మానవుడు.

పరమాత్మ మూర్తిత్రయ రూపుడై సృష్టి స్థితి లయాదులను కొనసాగించుచుండును. బ్రహ్మ సృష్టించును. విష్ణువు పోషించును. రుద్రుడు లయింప జేయును. ఈ మూడు కార్యములు ఆనంద రూపుడైన జగదీశ్వరునిచే జరుపబడు చున్నవి. ఈ సత్యమును గ్రహించిన వారికి ఆనందము దూరము కాదు.

జీవులందరు పుట్టుకను గాంచి సంతోషిస్తారు. పెరుగుతూ ఉంటే ఆనందిస్తారు. కానీ క్షీణించుటను, కృశించుటను, నశించుటను గాంచి శోకిస్తారు. భగవంతుడు లయంలో కూడా ఆనందరూపుడే.

లోభి సంపాదనలో సంతసిస్తాడు. సంపాదన పెరుగుతుంటే ఉత్సాహవంతు డవుతాడు. కానీ వినియోగ మనేసరికి విహ్వలు డవుతాడు. నీరస పడుతాడు. కనుకనే అతడు కృపణు డయ్యాడు.

అమృతత్వస్య తు నా శాస్తి విత్తే నేతి

ధనము చేత అమృతత్వము లభించునా? ఈ విధమైన ఆశ వ్యర్థమని బృహదారణ్యకోపనిషత్తు ప్రవచించినది.

ఆర్థికము చంచలము. మరి ఆయుష్షు? అదీ చంచలమే. విత్తముపై చిత్తము నుంచు లోభి కృపణు డని పిలువ బడినాడు. ఆయుష్షు స్థిరమని విశ్వసించు జీవుడు కూడా కృపణుడే నని ఉపనిషత్తు పలికింది. అనిత్యమైన వాటిని నిత్యముగా భావించు వారికి సుఖ శాంతులు మిగలవు.

కృపణాః ఫల హేతవః

కర్మవలయంలో చిక్కి ఫలితములకై పడిగాపులు గాచు అభాగ్యజీవులను కృపణులుగా గీతామాత వర్ణించినది.

సత్యగ్రాహి మృత్యువును అమంగళ మని భావించడు. కాలము కూడా భగవానుని చిద్విలాసమే. కాలము అశుభము కాదు. కానీ కాలాన్ని అధిగమించిన వారికి శుభమంటే ఏమిటో తెలుస్తుంది. శుభకరుడైన పరమాత్మ అభయహస్తము కాలము నెలా ఆడించు చున్నది అవగత మవుతుంది.

మహాత్ముడగు శుకబ్రహ్మ చెప్పుచున్నాడు: "పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుడు యాదవ సమేతుడై దానవులను సంహరించాడు. భూమాత బరువును తగ్గించాడు. కురు పాండవ సంగ్రామము వలన కూడా భూదేవిని శాంతింప జేశాడు. లోకరీతిని బట్టి భూభారము తగ్గినట్లు తెలియుచున్నను తన దృష్టిలో భూభారము పూర్తిగా తగ్గలేదని శ్రీకృష్ణుడు

భావించెను. అజేయులగు యాదవులు ఇంకనూ మిగిలియే యున్నారు. వీరి నెవ్వరూ గెలువ జాలరు అని భావించెను.

నైవాన్యతః పరీభవోఽస్య భవేత్కథంచి న్మత్సంశ్రయస్య విభవన్న హనస్య నిత్యమ్

"నన్ను ఆశ్రయించుకొని యున్న ఈ యదువంశము అభేద్యమై, విశృంఖలమై యున్నది. దేవతలు కూడా వీరిని గెలువజాలరు" అని తలచెను.

శ్రీకృష్ణుని ఆశ్రయించుకొని యున్న యదువంశము అజేయమై యున్నది. శ్రీకృష్ణుడు పరమాత్మ. పరమాత్మ నాశ్రయించుకొని చరించు మనస్సు వాస్తవానికి అజేయమే. మనస్సును జయించుట దుష్కరము. ఇంద్రియములను నిగ్రహించినంత మాత్రాన మనస్సు నిగ్రహింప బడుతుందని చెప్పలేము. ఈ కారణము చేతనే దేవతలు కూడా వారిని గెలువజాలరు అంటున్నాడు శ్రీకృష్ణుడు. దేవతలు ఇంద్రియాలకు అధినేతలు. దమము కలిగినంత మాత్రాన శమము లభిస్తుందని చెప్పలేము. మనసున్నంత వరకు బ్రతుకుకు భారము తగ్గదు. అందుచేత యాదవులు కూడా నశింపవలె నని శ్రీకృష్ణుడు భావించెను.

అజేయులైన యాదవు లెలా నశిస్తారు? వారిలో వారికి కలిగే పరస్పర సంఘర్షణా జనిత కలహమే వారి వినాశమునకు కారణము కావాలి. కట్టెలోని అగ్ని కట్టెనే దహించి వేయునట్లు యాదవులలో జనించిన కలహము యదువంశమునే నాశన మొనర్చును. యాదవ వంశనాశము వలన భూభారము తగ్గును.

చిత్తే త్యక్తే లయం యాతి ద్వైతమే తచ్చ సర్వతః
శిష్యతే పరమం శాన్త మేక మచ్ఛ మనామయమ్

"మనస్సు లయించగానే ద్వైతరూపమైన ప్రపంచముతో సహా సమస్తమూ లయించును. శాంతమై, అద్వయమై, అనామయమైన సత్యస్వరూపము శేషించి ప్రకాశించును" అని అన్నపూర్ణోపనిషత్తు ప్రవచించినది.

అమనస్త్వం మనోయాతు "మనస్సు అమనస్కమును పొందునుగాక" అని ఋషులు సంకల్పించి యున్నారు. అలాగే శ్రీకృష్ణుడు యాదవకుల వినాశమును వాంఛించెను. అంతేకాదు. బ్రాహ్మణ శాపమనెడి మిషతో యాదవవంశమును నాశము చేసినట్లు శుకబ్రహ్మ పరీక్షిత్తునకు తెలిపెను.

శుకబ్రహ్మ అమృతవచనముల నాలకించిన పరీక్షిత్తు దోసిలొగ్గి వినమ్రతతో "దివ్యాత్మా! యాదవులు కృష్ణగత చిత్తులు. బ్రాహ్మణ భక్తులు. వదాన్యులు. వృద్ధ జన సేవా పరాయణులు. అట్టి వారికి బ్రాహ్మణ శాప మెందులకు కలిగినది? ఎలాకలిగినది? దయతో తెలుపుడు" అనెను.

యాదవులకు బ్రాహ్మణ శాపము కలిగిన విధమును శ్రీశుకుల వారు వివరించ సాగిరి. శ్రీకృష్ణుడు శుభకరము లగు కర్మలను చేయుచు ద్వారకలో విలసిల్లుచుండెను. ఒకనాడు కృష్ణ దర్శనాభిలాషులైన విశ్వామిత్ర, అసిత, కణ్వ, దుర్వాస, భృగు, అంగిరస,

కశ్యప, వామదేవ, అత్రి, వసిష్ఠ, నారదాది మునులు ద్వారకకు వచ్చి, శ్రీకృష్ణుని దర్శించిరి. కృష్ణుని సేవల నందుకొని తృప్తిచెందిన మునులు పరమాత్మతో ఇలా పలికిరి:

క॥ జనములు నిను సేవింపని దినములు వ్యర్థంబులగుచుఁ దిరుగుచునుండున్
ధనువులు విలుకడ గావఁట వనములలో నున్న నైన వనరుహనాభా!

కావలలో వసించినా కాయములు నిలువవు. కాష్ఠానికి ఆపాటి గాకపోవు. నశించే దేహాలపై పెట్టుకొన్న ఆశలు ప్రక్కకు నెట్టుకోదగినవియే గాని ఆకట్టుకోదగినవి కావు. శ్రీహరి పాదసేవనమే బ్రతుకుకు ధన్యత నొనర్చును. హరి భజనకు నోచుకోని జనుల జన్మములు వృథాయని మునులు పలికిరి.

క॥ తరణంబులు భవజలధికి, హరణంబులు దురితలతల కాగమముల కా
భరణంబు లార్తజనులకు, శరణంబులు నీదు దివ్య చరణంబు లిలన్.

దురితములను హరి పాదసేవనము పరిమార్చును. భవజలధిని దాటించును. ఆర్తులైన వారికి ఆభరణములై, శరణములై నిల్చునవి శ్రీహరి చరణకమలములే యని వారు ప్రస్తుతించిరి. కృష్ణ సందర్శనముచే సంతుష్ట చిత్తులైన ఆ మునులు ద్వారకకు అతి చేరువలో యున్న పిండారక క్షేత్రమున కరిగిరి. అక్కడ కొంత కాలము వసించిరి.

ఒకనాడు కౌమారావస్థలో యున్న కొందరు యాదవకుమారులు ఆటలాడుకొనుచు, జాంబవతీ కుమారుడగు సాంబునకు స్త్రీ వేషమును ధరింపజేసి ఆ మహర్షుల వద్దకు తీసికొని వెడలిరి. నమ్రతను నటిస్తూ, మునుల పాదముల నంటి ప్రణమిల్లుతూ, "మునివరులారా! ఈ స్త్రీ నీలోత్పలాక్షి. గర్భవతి. ఈమె ఒక విషయమును అడుగ నిచ్చగించి సిగ్గుపడినదియై మా ద్వారా ప్రశ్నించు చున్నది. ఈమెకు ప్రసవకాలము సమీపించుచున్నది. ఈమె పుత్రుని కనునా? లేక పుత్రికను ప్రసవించునా? తెలుపు" డని యడిగిరి.

పవిత్రాత్ములగు మహర్షులను పరిహసించుటయా? పరమాత్మ రూపులైన పుణ్య పురుషులతో పరియాచక మాడుటయా? ఇది మహాపచారం. దురితములకు నాందియైన దురాచారం. దురదృష్టానికి మూలకారణం. వినాశానికి ముఖ్యకారణం. యాదవకుమారుల అసభ్య ప్రవర్తన మునులలో క్రోధమును రగిల్చినది. మునులు యాదవబాలుర నుద్దేశించి,

జనయిష్యతి వో మందా ముసలం కుల నాశనమ్

"మందభాగ్యులారా! మూఢులారా! ఈమె నుండి మీ యాదవకులము నశించుటకు కారణమగు ముసలము ఆవిర్భవించును" అని పలికిరి.

మునిశాపభీతు లైన యాదవకుమారులు సాంబుని యుదరమునకు కట్టిన వస్త్రమును తొలగించగా వారికి లోహమయమగు రోకలి యొకటి గోచరించెను. ముసల మనగా రోకలియని భావము.

మతి చెడగా, మదము చేరగా మంద భాగ్యులైన యాదవబాలురు పవిత్రులగు మునులను పరిహసించి శాపగ్రస్తులైనారు. చేయునది లేక ఆ ముసలమును తీసికొని గృహోన్ముఖు లయ్యారు.

మహాత్ములను బాధించు వారిని మాధవుడు కూడా కనికరించడు. భగవానుని శాపమును మునులు పోగొట్టగలరు. కానీ మునులిచ్చిన శాపము వలన కలిగెడి శనిని ముకుందుడు కూడా తొలగించలేడు. సాధుతాపము ఘోరపాపము నందించును.

క॥ ధరణీసురశాపమునకు హరిహర బ్రహ్మాదులైన నడ్డము గలరే?
నరు లనఁగ నెంతవారలు గర మరుదుగఁ బూర్వజన్మ కర్మముఁ ద్రోవన్?

అని పోతనామాత్యుడు విశ్లేషించి వివరించాడు.

శాపభీతులైన శాపగ్రస్తులు ఆ ముసలమును రాజసభలోనికి తీసికెళ్ళి ఉగ్రసేనునికి చూపించినారు. విషయమును వివరించినారు. తరుణోపాయమేమిటో బోధపడని ఉగ్రసేనుడు ఆ ముసలమును పొడిచేసి సాగరములో విలీన మొనర్పుమని ఆనతిచ్చెను. రాజు ఆజ్ఞను యాదవకుమారులు అమలు పరచినారు. చివరగా ఒక చిన్న ఉక్కుముక్క మిగిలిపోయింది. ఆ లోహపు ముక్కను కూడా సాగరములో పడవైచినారు. ఆ లోహపు తునకను ఒక మీనము మ్రింగినది. సాగరములో కలిసిన ఇనుపరజను కెరటముల తాకిడికి తీరమునుచేరి తుంగగడ్డిగా మొలచినది. సాగరములో విసరివేయబడిన ఉక్కుతునకను మత్స్యము మ్రింగినది.

జాలరులు సముద్రములో చేపలను పట్టుచుండగా ఇతర చేపలతో కలిసి ఈ చేపకూడా పట్టుబడినది. దాని పొట్టలో లోహపుముక్క లభించినది. "జర" యనెడి బోయవాడు ఆ లోహఖండమును తన బాణమునకు చివరన అమర్చుకొనెను. ఈ విధముగా విప్రుల శాపమునకు యాదవబాలురు గురైనారు. యదువంశ నాశనము దగ్గరగుచున్నది. యతి హృదయతాపము యాదవ కులమునే అంతమొందించినది.

భగవాన్ జ్ఞాత సర్వార్థ ఈశ్వరోఽపి తదన్యథా
కర్తు నైచ్ఛ ద్విప్రశాపం కాలరూప్య న్వమోదత:

"శ్రీకృష్ణుడు సమస్తము నెరిగిన ఈశ్వరుడు. ప్రతీకారము చేయుటకు సమర్థుడైనను విప్రశాపమును తొలగించుటకు ఇష్టపడలేదు. కాలరూపుడైన పరమాత్మ విప్రుల శాపమును ఆమోదించెను"

కనుక సాధువులను నిందించరాదు. పరిహసించరాదు. పరిహాసము చేయరాదు. సాధు పరితాపము సర్వానర్థముల నందించును. సాధునింద వలన కలిగే దుఃఖమును భగవానుడు కూడా తొలగించలేడు.

భాగవతస్వరూపము

కృష్ణసేవాసక్తి గలిగి, శ్రీకృష్ణ దర్శనలాలసుడైన నారదమహర్షి ఎక్కువ కాలము ద్వారక యందే వసించుచుండెను. ఒకనాడు నారదుడు వసుదేవుని గృహమున

కరుణించెను. వసుదేవుడు నారదుని పూజించెను. సుఖాసీనుడై యున్న నారదునితో ఇలా పలికెను: "దేవా! తల్లిదండ్రుల ఆగమనము బిడ్డలకు శుభప్రదము. భక్తులరాక దీనులైన వారికి మంగళకరము. మీ రాక సర్వప్రాణులకు శుభమైయున్నది. మీ రాకచే మేము ధన్యులమైతిమి. కానీ శ్రద్ధాసక్తులైన మానవులు ఏ ధర్మముల నాలకించిన సర్వభయముల నుండి ముక్తులగుదురో అట్టి భాగవత ధర్మములను మీనుండి వినగోరుచున్నాను. సర్వోపద్రవ యుతమగు ఈ సంసారము నుండి విడివడి తరించు మార్గమును బోధించుము" అని వసుదేవుడు నారదుని ప్రార్థించెను.

"వసుదేవా! ప్రపంచమునకు కళ్యాణప్రదమగు భాగవత ధర్మములను నీ వడిగితివి. నీవు ఉత్తమ సంకల్పమును గావించినావు. ఈ భాగవత ధర్మములను ఎవరు వినెదరో, పఠించెదరో, ధ్యానించెదరో, ఆమోదించెదరో అట్టివారు సమస్త పాతకముల నుండి విడివడి పవిత్రులగుదురు.

త్వయా పరమ కళ్యాణః పుణ్య శ్రవణ కీర్తనః
స్మారితో భగవా నద్య దేవో నారాయణో మమ

పరమ కళ్యాణ రూపుడు, పుణ్య శ్రవణ కీర్తనుడు నగు శ్రీమన్నారాయణుని నీవు నాకు జ్ఞాపకము చేసితివి" అని నారదుడు పలికెను.

మహాత్ముల యొక్క దర్శన భాగ్యము లభించుట దుర్లభము. దుర్లభమైన సాధు దర్శనమును సద్వినియోగ మొనర్చుకొను వారే సత్పురుషు లగుదురు. సాధు పురుషులగుదురు. మహాత్ములు అద్దమువలె నిర్మలమై యుందురు. అద్దము నీ రూపమునే ప్రతిబింబించునట్లు, సాధు మహాత్ములు నీ మనోభావాలనే ప్రతిఫలింప జేయుచుందురు. నీవు దేనిని అభిలషింతువో దానినే వారు అనుగ్రహింతురు. ప్రాపంచిక విషయములను నీవు ప్రస్తావించినచో వారు అట్టి విషయములనే అందిస్తారు. భగవద్విషయములను చర్చించినచో దివ్యానుగ్రహభాషణము చేయుదురు. స్వాతిచినుకును ముత్తెపుచిప్పయే వినియోగించుకొనును. సాధుమహాత్ముని ఉత్తమ భక్తుడే ఉపయోగించు కొనును.

నారదుని దర్శనముచే తృప్తిచెందిన వసుదేవుడు సంసార భయము నుండి విడిపించు భగవన్మహిమను నారదుని నుండి వినగోరి ప్రశ్నించెను. వసుదేవుని ప్రశ్నతో నారదుడు సంతుష్టచిత్తు డాయెను. తనకు నారాయణుని వసుదేవుడు గుర్తు చేసినాడని మహర్షి పొంగిపోయెను. వసుదేవు డడిగిన ప్రశ్నకు సమాధాన మొసంగుచూ గతంలో మహాత్ముడు, విదేహరాజగు నిమికి, ఋషభుని పుత్రులకును జరిగిన సంవాదము చెప్పుట కుపక్రమించెను.

స్వాయంభువ మనువునకు కుమారుడు ప్రియవ్రతుడు. ఆయనకు అగ్నీధ్రుడు, అతనికి నాభి, నాభికి ఋషభుడు అను వారు పుత్రులై జన్మించినారు. ఋషభునకు నందమంది పుత్రులు జనించిరి. వారిలో భరతుడు శ్రేష్ఠుడు. గొప్ప విష్ణుభక్తుడు. అతనికి

పూర్వము అజనాభ మనెడి నామము కలిగిన దేశము భరతుని తదనంతరము భారతదేశమని ప్రసిద్ధి చెందెను.

భరతుని సోదరులలో తొమ్మండుగురు జంబూద్వీపములోని నవఖండములకు ప్రభువు లైనారు. ఎనుబది ఒక్కరు కర్మమార్గ ప్రవర్తకులైనారు. మిగిలిన తొమ్మండుగురు పుణ్యశీలురు, దిగంబరులు, ఆత్మవిద్యా తత్పరులగు సన్యాసులైనారు. వారు కవి, హవి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు, ద్రుమిళుడు, చమసుడు, కరభాజనుడు అను నామములతో విఖ్యాతి నొందిరి.

వారు విశ్వమంతటిని తమ స్వరూపముగనే భావింతురు. దేని యందును ఆసక్తిని కనబరచరు. స్వేచ్ఛా విహారులగు ఈ దివ్య శ్రమణులు ఒకనాడు నిమి చక్రవర్తి చేయు యజ్ఞమునకు విచ్చేసినారు.

పరమ భాగవతోత్తములైన ఆ మునులను నిమి సాదరముగా ఆహ్వానించెను. భక్తితో పూజించెను. భక్తుల సేవలో సంతుష్ట చిత్తుడైన నిమి ఇలా పలికెను: "మహర్షులారా! లోకముల నంతటిని పావనమొనర్చు మీ దర్శన భాగ్యము ఈ నాడు నాకు లభించినది. మీరు విష్ణుదేవుని పార్షదులే యని నా విశ్వాసము. అట్టి మీతో ఈ నాడు సంగమ మేర్పడుట మాకు పరమానందదాయకమై యున్నది.

సంసారేఽస్మిన్ క్షణార్ధోఽపి సత్సంగః శేవధి ర్నృణామ్

సంసార మగ్నులై యున్న మాకు అర్ధ క్షణ మైనను సత్సంగము పెన్నిధియే యగును.

"మహాత్ములారా! ఏ ధర్మముల నాచరించుట చేత నారాయణుడు సంతృప్తి చెందినవాడై తన్ను గూడా సమర్పించుకొనునో అట్టి భాగవత ధర్మములను అర్హుడనైనచో నాకు బోధింపుము" అనెను.

"వసుదేవా! నీవు నన్ను ఏ ప్రశ్న నడిగితివో ఆ ప్రశ్ననే నిమి మహారాజు ఋషభ నందనులను అడిగెను. వారు చెప్పిన సమాధానములను తెలిపెదను, ఆలకింపుడు" అని నారదు డనెను.

నిమి అడిగిన ప్రశ్నలకు ఋషభుని కుమారులు తొమ్మండుగురు సమాధానము లొసంగుదురు. ప్రథమంగా కవి యను ఋషి ఇలా చెప్ప దొడగెను.

"నిమి మహారాజా! దేహాదులైన అనిత్య విషయములయందు ఆత్మబుద్ధిని కలిగి యుండుటచేత సర్వ దుఃఖములను పొందు చున్నాడు. అట్టి మనుజుడు శ్రీహరి పాద పద్మముల నర్చించినచో ముక్తు డగుచున్నాడు. అభయు డగుచున్నాడు. భగవానుని పొందుటకు సులభమగు ఉపాయములను భగవానుడు తెలిపియున్నాడు. వాటినే భాగవత ధర్మము లందురు. అందులో మొదటిది అర్పణ భావము.

కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వానుసృతస్వభావాత్
కరోతి యద్యత్సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయే త్తత్

మానవుడు విధి విహితము లేదా స్వభావానుసారముగా శరీరముచే, మనస్సుచే, వాక్కుచే, ఇంద్రియములచే, బుద్ధిచే చేసిన సమస్త కర్మములను అన్నింటిని శ్రీమన్నారాయణునకు సమర్పింపవలెను.

క॥ కరణ త్రయంబుచేతను నరుఁ డే కర్మంబు చేయు నయ్యై వేళన్
హరి కర్పణ మని పలుకుట పరువడి సుజ్ఞాన మండ్రు పరమమునీంద్రుల్.

అని పోతనామాత్యుని అద్భుతానువాదము.

నిత్యజీవితములో మన మాచరించు సమస్త కర్మల యందు పరమాత్మను భావనము చేసికొని జీవించాలి. అందమైన వస్తువులు గోచరించినను, ఆనందము నిచ్చు భోగ్య విషయములు సమీపములో యున్నను ఎవ్వని చిత్తము వాటి పైకి మరలదో అట్టి పుణ్యాత్మునికి అర్పణబుద్ధి సిద్ధించినదని భావము. అర్పణబుద్ధి ఎవరికి సిద్ధించునో వారు అనన్యభక్తితో భగవాను నారాధింతురు.

భగవత్ప్రీతిని పొందగోరు మనుజుడు వివేకమును బొంది, తద్వారా మనస్సును నిగ్రహింప వలెను. భగవద్గుణ శ్రవణ కీర్తనాదుల యందు మనస్సును లగ్న మొనర్చి ఆసక్తి లేనివాడై చరింప వలెను. ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, భూమి, చంద్ర సూర్యాదులు, ప్రాణులు, దిక్కులు, నదులు, వృక్షములు, సాగరములు మొదలగునవి అన్నియు పరమాత్మ శరీరమని భాగవతులు భావించి నమస్కరింప వలెను.

సీ॥ సంతతంబును గృష్ణ సంకీర్తనంబులు వీనుల కింపుగా వినఁగవలయు
హర్షంబుతోడుత హరినామకథనంబు పాటల నాటలఁ బరఁగవలయు
నారాయణునిదివ్య నామాక్షరంబులు హృద్వీథి సతతంబు నెన్నవలయుఁ
గంజాక్షులీలలు కాంతారములనైన భక్తియుక్తంబుగాఁ బాడవలయు
తే॥ వెఱ్ఱిమాడ్కిని లీలతో విశ్వమయుని వొడువుచును లోకబాహ్యత నొందవలయు
నింతయును విష్ణుమయ మని యెఱుఁగవలయు భేద మొనరింపవలవదు మేదినీశ!

భుజించు వానికి ప్రతి అన్నపు ముద్ద తుష్టిని, పుష్టిని, క్షున్నివృత్తిని వెంటనే గలుగజేయునట్లు, శ్రీహరిని శరణుజొచ్చిన వానికి భజన సమయమున ప్రేమ రూపమగు భక్తి, భగవానుని స్వరూపానుభూతి, అన్యవిషయముల యందు వైరాగ్యస్ఫూర్తి అనెడి మూడు విషయములు వెంటనే జనించును. ఆ తరువాత అట్టి శరణాగత పురుషునికి పరమశాంతి లభించును."

"ఈ విధముగ ఋషభ కుమారులలో ప్రథమంగా కవియను మహాత్ముడు నిమి మహారాజునకు శరణాగత వైభవమును వివరించెను. నిమి అడిగిన రెండవ ప్రశ్నకు హవి యనెడి రెండవ మహాత్ముడు సమాధానము నొసంగెను. ఆ విషయమును కూడా వివరించెదను వినుము" అని నారదుడు వసుదేవునితో చెప్పెను.

"మహాత్ములారా! భగవద్భక్తుని గూర్చి వివరింపుడు. అతని ధర్మమెయ్యది? అతని స్వభావ మెట్టిది? అతడెలా చరించును? ఏమి వచించును? వాని లక్షణము లెట్టివి?" అని నిమి మహారాజు ప్రశ్నించగా భాగవతులను గూర్చి హవి యను ముని వివరించెను.

ఎవడు సర్వభూతములయందు బ్రహ్మభావమును, ఆత్మభావమును ఉంచునో లేదా గాంచునో, భగవానుని యందును, ఆత్మయందును సర్వభూతములను గాంచునో వాడు భాగవతశ్రేష్ఠుడు.

ఎవడు భగవంతునిపై ప్రేమను, భగవద్భక్తులతో సఖ్యమును, మూఢులపై దయను, శత్రువుల యందు ఉదాసీనతను కలిగియుండునో వాడు భాగవతమధ్యముడు.

ఎవడు భగవత్ప్రీత్యర్థం పరమాత్మ ప్రతిమనే పూజించుచు ఆయన భక్తులను గాని, లేదా అన్యులను గాని సేవింపడో వాడు ప్రాకృత భక్తుడు, లేదా ప్రారంభ భక్తుడు.

శ్రీహరి చరణకమలముల కన్నను అన్యముగా వాంఛించ దగిన సారవస్తు వేదియును లేదని గ్రహించి, సదా పరమాత్మ పాదపద్మములను విస్మరించక స్మరించే పుణ్యాత్ముడు భాగవతోత్తముడు.

చంద్రు డుదయించిన సిదప భానుని కిరణజనిత తాపమదృశ్య మగునట్లు, శ్రీహరి పాద సేవనమునకు నోచుకొన్న భాగ్యవంతులకు ఎట్టి సంతాపము కలుగ నేరదు. అట్టి సంతాప రహిత సంతుష్ట చిత్తము గలవాడు భాగవతోత్తముడు.

క॥ వర్ణాశ్రమధర్మంబుల, నిర్ణయకర్మములఁ జెడక నిఖిలజగత్సం
పూర్ణుఁ డుహరియనువాతఁడె, వర్ణింపఁగ భాగవతుఁడు వసుధాధీశా!

జన్మ కర్మాదుల చేతను, వర్ణాశ్రమ జాతుల చేతను, ఈ శరీరమున ఏ మహాత్మునికి అహంకారము జనించదో అతడే భాగవతోత్తముడు.

శరణాగతిని గూర్చి కవి వివరించగా, భాగవతులను గూర్చి హవి విశదపరచెను. ఋషభ నందనులలో మరియొకడగు అంతరిక్షుడు మాయా స్వరూపమును గూర్చి నిమి అడిగిన ప్రశ్నకు సమాధాన మొసంగు చున్నాడు.

మాయావివరణము

"మహామునులారా! విష్ణుమాయ బ్రహ్మాదులకు గూడా దాటశక్యము గానిదియై యున్నది గదా! దయచేసి అట్టి మాయను గూర్చి నాకు సవిస్తరముగా తెలుపుడు" అని నిమిమహారాజు అడుగగా అతనికి అంతరిక్షుడు మాయను గూర్చి వివరించెను.

జీవుల కర్మానుభవమునకై మాయ నాధారముగాగొని పంచభూత నిర్మితములగు దేహములను సృష్టించెను. తానాదేహములందు ప్రవిష్టుడై వెల్గొందెను. ఏకమైన జీవుడుగను, అనేకములైన ఇంద్రియములుగను తనను తానే విభజించుకొని విషయానుభవమును పొందుచుండెను.

అంతర్యామి యగు పరమేశ్వరుని చైతన్యముచే ప్రకాశించు ఇంద్రియముల ద్వారా ఇంద్రియ విషయముల ననుభవించుచు, ఈ దేహమును ఆత్మగా భావించి ఈ దేహమునందు ఆసక్తిగలవా డగుచున్నాడు.

ఆసక్తి ప్రేరితుడైన జీవుడు కర్మేంద్రియముల ద్వారా అనేక కర్మల నాచరించుచు, ఆయా కర్మ ఫలములను అనుభవించుచు, వాటి కొరకు ముందు ముందు నూతన

శరీరములను ధరించుచున్నాడు. ఈ విధముగా జీవుడు జనన మరణములను బొందుచున్నాడు.

మాయను గూర్చి వివరించిన అంతరిక్షుడు ఆ తరువాత దేనిని వినుటకు నిమి మహారాజు ఆసక్తుడో తెలుపమనగా, బ్రహ్మాదులకు దాట శక్యముగాని విష్ణుమాయను దాటు ఉపాయమును ఉపదేశింపమని అర్థించెను. మాయను దాటు సుపాయమును ఋషభుని కుమారులలో మరొకడైన ప్రబుద్ధుడు వివరించుచున్నాడు.

మాయను మాయం చేయుట

ప్రతిమనిషి జీవితములో సుఖమునే అభిలషించును. దుఃఖమును అవాంఛనీయముగా జూచును. కానీ కర్మాచరణమున దుఃఖము నందించు కర్మములనే ఆచరించుచుండును. విత్తాదుల యందు చిత్తమును లగ్న మొనర్చును. గృహ పుత్రాదులు శాశ్వతమని భావించును. ఇవి అన్నియు కాలమున ఆవిర్భవించి కాలములో అంతరించును. అనిత్యమైన ఈ విషయములు నిత్య సుఖము నెలా ప్రసాదింపగలవు?

ఇహలోకసుఖము లెలా అనిత్యములో స్వర్గలోక సుఖములు కూడా అనిత్యములే. రాగద్వేషములు, ఈర్ష్యాసూయలు అచ్చట కూడా గోచరించును. కర్మార్జితముగా ఈ లోకమున కాలములో లభించు కర్మఫలము ఎలా అనిత్యమో, అలాగే కర్మార్జితముగా పరలోకమున లభించు ఫలము గూడా నశ్వరమే. కనుక మనుజుడు కర్మ వలయమున చిక్కుబడక జ్ఞానము ద్వారా మోక్షము నొంది తరించవలెను. అట్టి జ్ఞానమును రాగద్వేష రహితుడైన సద్గురువు నుండి పొందవలెను.

తస్మాత్సద్గురు కటాక్ష లేశ విశేషేణ సర్వ సిద్ధయ స్సిధ్యన్తి, సర్వ బంధాః
ప్రవినశ్యన్తి, శ్రేయో విఘ్నా స్సర్వే ప్రలయం యాన్తి, సర్వాణి శ్రేయాంసి స్వయమే వాయన్తి.

"గురుదేవుని యొక్క లేశమాత్ర మైన కృపావిశేషముచేత సర్వసిద్ధులు సిద్ధించును. సర్వ బంధములు నశించును. శ్రేయమునొందు ప్రయత్నములో ఎదురయ్యే బహువిఘ్నము లన్నియు తొలగిపోవును. సమస్త శుభములు వాటంత టవియే అరుదెంచును" అని గురుదేవుని మహిమను త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తు ప్రవచించినది.

గురువును పరమాత్మ స్వరూపముగా భావించి సేవింపవలెను. దేహపుత్రాదుల యందలి ఆసక్తిని త్యజింపవలెను. శౌచము, తపస్సు, ఓర్పు, మౌనము, స్వాధ్యాయము, సరళత్వము, బ్రహ్మచర్యము, అహింస, ద్వంద్వాతీత జీవనము మున్నగు వానిని పొందవలెను.

ఏకాంతప్రదేశము నందు ఆసీనుడై, సంసారము నందలి దోషములను గూర్చి చింతింపవలెను. శ్రీహరి అవతార విశేషములను, లీలలను, గుణములను శ్రవణము చేయుచుండవలెను. పరమాత్మను కీర్తింపవలెను. ధ్యానింపవలెను. భగవత్ప్రీతికరము లగు కర్మముల నాచరింపవలెను. సర్వ కర్మములను భగవానునికి సమర్పించి,

అహంకారము నుండి విడిపడవలెను. ఈ విధముగా ఎవరు శ్రీహరి నాశ్రయింతురో వారు తప్పక మాయను దాటుదురు.

ఎవరైతే వాక్కును దుర్వినియోగ మొనర్చెదరో అట్టి వారు పరమాత్మకు దూరు లగుదురు. వాక్కును నామ సంకీర్తనము ద్వారా పవిత్ర మొనర్చు కోవాలి. వాఙ్నియమమును పాటించాలి. కీర్తన ద్వారా పరమాత్మను త్వరగా పొందవచ్చును.

త న్నామ సంకీర్తయ న్విష్ణు సాయుజ్యం గచ్ఛతి

"భగవన్నామ సంకీర్తనమును చేయువాడు విష్ణు సాయుజ్యమును బడయు చున్నాడు" యని కృష్ణోపనిషత్తు ప్రవచించినది.

నీవు ఒంటరిగా యున్నచో నీకు జంటగా మాయ నిలుచును. అందుచేత మాయను దాట నిచ్ఛగించువారు భగవద్భక్తులతో గూడి పరమాత్మను కీర్తింప వలెను. భాషింప వలెను. దివ్యశాంతి ననుభవింపవలెను.

హరికథలో ఎవని మనస్సు లయించునో వానిని మాయ ముట్టలేదు. పాపములంటలేవు. గంగానది పాపములను హరించును. హరికథ ప్రారంభము కాగానే గంగ విలువ తగ్గినది. హరినామము గంగను కూడా పవిత్ర మొనర్చును. హరికథాప్రసంగ మెచ్చట జరుగుచుండునో అదియే త్రివేణీసంగమ మని సంత్ తుకారాం మహరాజ్ ఒక అభంగములో తెలిపెను.

కథా త్రివేణీ సంగమ దేవ భక్త ఆణీ నామ, తేథీంచె ఉత్తమ చరణ రజ వందితా ॥
జళతీ దోషాంచె డోంగర శుద్ధహోతీ నారీనర, గాతీ ఏకతీ సాదర జె పవిత్ర హరికథా!

హరికథా ప్రసంగము ఎచ్చట జరుగుచుండునో అదియే త్రివేణీ సంగమ స్థానము. ఈ పుణ్య ప్రదేశమున గంగ, యమున, సరస్వతుల వలె దేవుడు, భక్తుడు, భగవన్నామము అను మూడును లభించును.

హరికథ పాప పర్వతములను దహించి వేయును. సర్వులను శుద్ధి పరచును. వినువారిని, వినిపించు వారిని హరికథ పావన మొనర్చును."

భగవద్భక్తులు ప్రేమమయులై యుండాలి. భక్తుడు ద్వేషమును కలిగియున్నచో అతడు పరమాత్మనే అవమానించినవా డగుచున్నాడు. ప్రాపంచిక వాసనలు భక్తునియందు నిలువకూడదు. భగవన్నామ ముచ్చరించునపుడు ప్రేమాతిశయముచే దేహము పులకరించు చుండవలెను. ఈ విధముగా భాగవత ధర్మములను పాటించు పుణ్య పురుషుడు తప్పక మాయను దాటును.

క॥ హరిదాసుల మిత్రత్వము మురరిపుకథ లెన్నికొనుచు మోదముతోడన్
భరితాశ్రుపులకితుం డై పురుషుఁడు హరిమాయ గెల్చు భూపవరేణ్యా!

అని భాగవత ధర్మము యొక్క ఫలశ్రుతిని ప్రబుద్ధుడు వివరించినట్లు పోతన ప్రవచించెను.

నారాయణ స్వరూపము

ప్రబుద్ధుని ప్రవచనము నాలకించిన నిమి నారాయణ శబ్ద ప్రతిపాద్య వస్తువగు పరబ్రహ్మ తత్త్వమును తెలుపుమని అడుగగా ఋషభ నందనులలో మరియొకరైన పిప్పలాయనుడు నారాయణతత్త్వమును వివరించుచున్నాడు.

ఎవడు ఈ సృష్టి, స్థితి, లయములకు కారణమయ్యును అకారణముగ తెలియుచున్నాడో అతడే నారాయణుడు. అవస్థాత్రయమునకు ఆధారుడై సమాధిదశ యందు సద్రూప చైతన్యముగా తెలియుచున్నాడో అతడే నారాయణుడు. ఏ దివ్యశక్తిచే దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ప్రవర్తిల్లు చున్నవో అతడే నారాయణుడు.

నిష్కళంకో, నిరంజనో, నిర్వికల్పో నిరాఖ్యాత శ్శుద్ధో దేవ ఏకో నారాయణః
నద్వితీయోఽస్తి కశ్చిత్.

"నారాయణుడు నిష్కళంకుడు. నిరంజనుడు. నిర్వికల్పుడు. అనిర్వచనీయుడు. శుద్ధమైనవాడు. దేవుడు. అద్వయుడు. అతని కన్నను వేరుగా మరొకడు లేడు" అని నారాయణోపనిషత్తు తెలిపినది.

అగ్నినుండి ఆవిర్భవించిన అగ్నిరవ్వలు అగ్నిని దీప్తిమంతము గావించనట్లు వాక్కు, నేత్రములు, బుద్ధి, ప్రాణములు, ఇంద్రియములు నారాయణ తత్త్వమును ప్రకాశింప చేయలేవు. ఈ నారాయణ తత్త్వమే స్థూల సూక్ష్మములైన సమస్త వస్తువులయందు ప్రకాశించు చున్నది.

నారాయణ స్వరూపమునకు పుట్టుక లేదు. కనుక గిట్టుట ఉండదు. అలాంటిది పెరిగే ప్రసక్తే లేదు. తరిగే శక్తి కలిగియుండదు. అది జ్ఞాన స్వరూపము. అంతఃకరణ చైతన్యములో భేదములు గోచరించుచున్నను, అట్టి అంతఃకరణ కాధారమైన నారాయణ చైతన్యము నందు భేదములు అమాహ్యములై యున్నవి. సర్వవిషయములు, సమస్త జగత్తు బ్రహ్మచైతన్యమునందు ఓతప్రోతమై యున్నది.

నారాయణుని సేవించు భక్తుడు పరమ ప్రేమమయుడగును. ఈ ప్రేమమయభక్తి కామము మొదలైన అరిషడ్వర్గములను అంతఃకరణలో అంత మొందించును. తత్ఫలితముగా అంతఃకరణ శుద్ధిపడును. నిర్మలమైన అంతఃకరణము నందు నిరంజన స్వరూపము భాసిల్లును.

తస్మిన్ విశుద్ధ ఉపలభ్యత ఆత్మ తత్త్వం సాక్షాద్యథామల దృశోః సవితృ ప్రకాశః

"నిర్మలమైన నేత్రములకు సూర్యుని ప్రకాశము సుస్పష్టముగా తెలియులాగున విశుద్ధమైన అంతఃకరణములో నారాయణ స్వరూపము సాక్షాత్కరించును".

కర్మ బంధహేతువు గదా! మరి ఏ విధమైన కర్మము నాచరించుట వలన జీవునకు కర్మ బంధములు తొలగును? అంతఃకరణ శుద్ధిపడును? నైష్కర్మ్యము సిద్ధించును? ఈ

విషయములను గూడా నిమి మహారాజా తెలిసికొన నిచ్చగించెను. ఈ విషయమును ఋషభకుమారులలో ఒకడైన ఆవిర్హోత్రుడు వివరించుచున్నాడు.

కర్మయోగ ప్రాశస్త్యము

కర్మమనగా నేదియో, అకర్మ, వికర్మాదు లేవియో, వాటిని వేదము ద్వారానే తెలియ వలెను. వేదము అపౌరుషేయము. అందుచేత సర్వులకు సులభగ్రాహ్యము గానేరదు. పండితులు కూడా మోహము నొందుచుందురు.

కిం కర్మ కిమ కర్మేతి కవయోఽప్యత్ర మోహితా అని గీతా ప్రబోధము.

నైష్కర్మ్యస్థితిని ప్రతిపాదించిన వేదమాత కర్మల నెందులకు ప్రవేశ పెట్టినది? యని తర్కించుకొనుచు మోహము నొందుచుందురు. కర్మను నివృత్తి చేయుటకే వేదము కర్మలను ప్రవేశపెట్టినది యనెడి రహస్యమును గ్రహింపలేరు.

పరోక్ష వాదో వేదోఽయం బాలానామనుశాసనమ్
కర్మ మోక్షాయ కర్మాణి విధత్తే హ్యగదం యథా

వేదము పరోక్ష వాదాత్మకము. కర్మ నివృత్తికై కర్మలను ప్రవేశ పెట్టును. తండ్రి పిల్లలకు తీపి పదార్థములను చూపి మందును పానము చేయించినట్లు, అజ్ఞానుల కొరకు వేదము కర్మఫలములను ఆశగా చూపి కర్మలయందు ఆయా జీవులు ప్రవర్తిల్లునట్లు చేయుచున్నది.

ఇంద్రియ నిగ్రహము లేనివాడు, వేద ధర్మము నమసరించలేడు. కర్మానుష్ఠానము లేకపోవుట చేత జనన మరణ సంసారములో తగుల్కొనును. వేదము నందలి ఫలాసక్తితో కూడిన కర్మకాండ యంతయు కేవలము కర్మయోగము నందు ఆసక్తిని కలుగ జేయుటకే నని గ్రహించాలి.

ఆసక్తి లేకుండా కర్మల నాచరించు పుణ్యపురుషుడు కర్మల యందు అకర్మను దర్శించును. కర్మానుష్ఠానము బంధము కానేరదు. ఫలాసక్తియే బంధమును కలిగించును. సర్వకర్మములను ఈశ్వరార్పణము గావించి, వేదోక్త విధి ననుసరించి శ్రీహరి నర్చించు వాడు కర్మవలయము నుండి విడివడును.

య ఆశు హృదయ గ్రంథిం నిర్జిహీర్షు రథాత్మనః
విధినోపచరే ద్దేవం తంత్రోక్తేన చ కేశవమ్

ఎవడు అజ్ఞానముడిని విడగొట్టవలె నని భావించునో వాడు తంత్రోక్త పద్ధతిని, వేదోక్త పద్ధతి ననుసరించి శ్రీహరిని అర్చింపవలెను.

అవ్యయుడైన అచ్యుతుని ప్రత్యక్షముగా మనస్సు దర్శించి అర్చించలేదు గనుక అర్చామూర్తులను పూజింపవలెను. ప్రతిగృహమును ఆలయముగా తయారు చేసుకోవాలి. భగవానుని అర్పించనిదే అన్యకార్యముల నాచరింపరాదు. ఆయనకు నైవేద్య మిడిన పిదపనే భక్తుడు ఆహారమును భుజించాలి.

మన మీనాడు అనుభవించు సమస్తమును పరమాత్మ మన కొసంగినదియే. భగవానుడు ప్రసాదించిన దానిని తిరిగి ఆయనకు అర్పించకుండా ఆరగించువాడు దోషియగును. భగవానునకు నైవేద్యమును సమర్పించుటకు ముందుగా ఆయనను అర్చింపవలెను. వేదోక్త పద్ధతి ననుసరించి సాగెడి ఈ అర్చన తంత్రోక్త పద్ధతిని కూడా అనుసరించి యుండవలెను. యంత్రమును ప్రతిష్ఠించి, మంత్రము నుచ్చరించుచూ, తంత్రమును కొనసాగించవలెను. విష్ణుమూర్తి నారాధించువారు యంత్రము నందు అంబిక, శివ, సూర్య, గణపతులను కూడా ప్రతిష్ఠించాలి. కానీ వీరందరూ నారాయణ స్వరూపులే యనెడి భావనను కలిగి యుండాలి.



విష్ణుదేవుని ప్రధానముగా స్వీకరించి మధ్య నుంచినచో ఈశాన్యమున శివుడుండాలి. ఆగ్నేయమున గణపతి, నైరుతిన సూర్యుడు, వాయువ్యమున అంబికను ప్రతిష్ఠింప వలెను. ఈ విధమైన తంత్ర విషయమున పొరపాటు జరుగ కూడదు. ఇష్టదైవమును అర్చించుటకు వేదము నందు మంత్రములు తెలుపి యున్నవి. వానిని దోష రహితముగా అర్చింప వలెను.

ఆత్మానం తన్మయం ధ్యాయ న్మూర్తిం సంపూజ యేద్ధరే
శేష మాదాయ శిరసా స్వధామ్న్యు ద్వాస్య సత్కృతమ్

"ఆత్మను పరమాత్మగా భావించుచు శ్రీహరిని చక్కగా పూజించవలెను. పిమ్మట నిర్మాల్యమును శిరస్సు నందుంచుకొని, శ్రీహరిని హృదయమున నిలుపుకొని, పూజావిధిని పూర్తి చేయవలెను" అని ఆవిర్హోత్రుడు నిమికి తెలియజేసెను.

అవతార లీలలు

శ్రీహరి పూజనమును గూర్చి ఆవిర్హోత్రుడు వివరించగా ఆలకించి సంతసించిన నిమి మహారాజు శ్రీహరి అవతార విశేషముల నాలకించుటకు కుతూహలపడి వాటిని వివరించమని అడిగెను. ఈ విషయమును ద్రుమిళుడు వివరించెను.

శ్రీహరి అనంత కళ్యాణగుణ సంపన్నుడు. అప్రమేయుడు. శ్రీహరి గుణములను లెక్కింప నెవరికి సాధ్యము? అలా ప్రయత్నించువాడు అజ్ఞుడే గాని విజ్ఞుడు కానేరడు.

క॥ **తారల నెన్నగవచ్చును, భూరేణుల లెక్కవెట్టఁ బోలును ధాత్రిన్**
నారాయణగుణకథనము, లారయ వర్ణింపలేరు హరబ్రహ్మాదుల్.

అని పోతనామాత్యుడు అనువాదామృతము నందించెను.

నారాయణుడు తన మాయచే ప్రపంచమును నిర్మించి, అందు అంతర్యామిగా ప్రవేశించెను. ఇతడే సృష్టికాలమున రజోగుణము ద్వారా బ్రహ్మరూపమును, స్థితి

కాలమున సత్త్వగుణము ద్వారా విష్ణు రూపమును, లయకాలమున తమోగుణము ద్వారా రుద్రరూపమును ధరించెను.

దక్షుని పుత్రికయగు మూర్తి యను నామె ధర్ముని పెండ్లి యాడెను. ఆమె గర్భము నుండి మహాత్ములగు నర నారాయణులను వారలు ఆవిర్భవించిరి. ప్రశాంత ఋషివరులగు ఆ మహాత్ములు బదరికాశ్రమమున తప మాచరించుచుండిరి. వారాచరించు తపస్సు ఇంద్రపదవి కొరకని మహేంద్రుడు శంకించెను. వారి తపస్సును భగ్నము చేయ సంకల్పించి మన్మథునికి ఆ కార్యము నప్పగించెను. అప్సరసలను వెంట నిడుకొని మన్మథుడు బదరికాశ్రమము చేరెను. నరనారాయణులను స్త్రీల కటాక్ష శరములచే గాయ పరచుటకు ఆరంభించెను.

నారాయణ ఋషి వాస్తవమును గ్రహించెను. మదనుని ప్రయత్నము లన్నియు విఫల మాయెను. భయపడుచున్న మన్మథుని, అప్సరసల నుద్దేశించి నారాయణ ఋషి ఇలాపలికెను: "మదనా! పరాక్రమ శీలుడా! మీరెవ్వరూ భీతి చెందవలదు. మా ఆతిథ్యమును స్వీకరింపుడు" అనెను.

క॥ **జంభారిపంపునను మీ, రంభోరుహవదనలార యరుదెంచితి రా**
శుంభద్విహారవాంఛా, రంభంబునఁ దిరుగఁడనిన లజ్జించి చెవన్.

నారాయణ ఋషి పలుకుల నాలకించి మదనాదులు లజ్జావనతులైరి. తప్పిదమును మన్నింపమని వేడుకొనిరి. నారాయణ ఋషి ద్వారా స్వర్గరాజ్యమునకు భూషణముగా ఊర్వశిని పొందిరి. స్వర్గమునకు వెళ్ళి ఇంద్రుని ఎదుట నారాయణ ఋషి వైభవమును కీర్తించిరి. మహేంద్రుడు కూడా విస్మితుడయ్యెను.

సాధకు లగువారు పరమాత్మ కొరకు సాధన నాచరించుచుండ, మహేంద్రుని వలె అసూయ గల్గి ఎందరో విఘ్నములు కలిగించుచుందురు. నిజ సాధకులను విఘ్నములు కదలించలేవు. విఘ్నములు కలిగించు వారిపై క్రోధము కలిగినచో సాధన కుంటుపడును. అక్రోధులైన సాధకులే అక్షరరూపు లగుదురు.

భగవ దవతారమూర్తు లైన నరనారాయణుల వైభవమును వివరించిన ద్రుమిళుడు శ్రీహరి కళావతారములను విశేషముగా కొనియాడుచున్నాడు.

విష్ణుమూర్తి జగత్కల్యాణమును వాంఛించి అనేక కళావతారముల నెత్తెను. హంస, దత్తాత్రేయ, సనకాది మునులు, ద్రుమిళుని తండ్రిగారైన ఋషభుడు మొదలైన రూపముల ద్వారా ఆత్మజ్ఞానము నుపదేశించెను. హయగ్రీవావతార మెత్తి మధువను రాక్షసుని సంహరించి, వేదములను వెలికి తీసెను.

ప్రళయ కాలమున ఆయనయే మత్స్యావతారమును ధరించి, భూదేవి నుద్ధరించి, మనువును రక్షించెను. వరాహావతారమున పృథివిని జలముల నుండి పైకి తీసెను. హిరణ్యాక్షుని సంహరించెను. కూర్మావతారమెత్తి మందరపర్వతమును వీపుపై ధరించెను. శ్రీహరి రూపముతో మకరిని ఖండించి గజేంద్రుని రక్షించెను. నృసింహుడై ప్రభవించి

హిరణ్యకశ్యపుని వధించి ప్రహ్లాదుని రక్షించెను. అతడే వామనుడై జనించి బలిమండి భూమిని హరించెను. అతడే పరశురాముడై ఇరువదియొక్క మారులు భూమండలమును క్షత్రియహీన మొనర్చెను. శ్రీరాముడై రావణుని వధించెను. శ్రీకృష్ణుడై అసమాన లీలలను ప్రదర్శించెను. అతడే కలియుగాంతమున కల్కిరూపమున అవతరించి క్షుద్రులైన శూద్రరాజులను సంహరించును. ఇవి యన్నియు భగవల్లీలలుగా కీర్తింప బడినవి.

భగవల్లీలలను ద్రుమిళుడు వివరించెను. ఈ విషయములు ఆలకించిన నిమి మహారాజుకు ఒక సందేహము కలిగెను. ఈ లోకములో దురదృష్టవంతులై, భక్తి హీనులై చాలామంది శ్రీహరిని భజించుట లేదు. వారి గతి ఎలా యుండును? అని ప్రశ్నించగా ద్రుమిళుని సోదరుడగు చమసుడు భక్తిహీనుల గతిని వివరించుచున్నాడు.

భక్తిహీనుల గతి అధోగతియే

జనులకు ఆధారమైన జనార్దనుని ఎవరు మరచిపోవుదురో వారు పతన మగుదురు. చాలామంది స్త్రీలు, శ్రామికులు హరికథాశ్రవణమునకు దూరులగుచున్నారు. భక్తులైన వారు అట్టి వారికి హరికథను వినిపించవలెను.

శ్రీహరి పాదపద్మములను సేవించు భాగ్యము కలిగినవారు కూడా స్వర్గాది కర్మఫలము లందు ఆసక్తిని కలిగి పరమాత్మకు దూరులగుచున్నారు. భక్తి లేని మరికొందరు రజోగుణముతో నిండినవారై కాముకులై యుందురు. కామము సర్వ ఇడుములకు కారణమని గ్రహింపలేరు. క్రోధస్వభావులై యుందురు. ప్రపంచము యొక్క నశ్వరస్థితిని గ్రహించలేని వారలు గాన దాంభికులై యుందురు. అభిమానముతో విర్రవీగుచుందురు. అంతేగాదు, నిజభక్తులైన పుణ్యాత్ములను పరిహసించుచుందురు.

భక్తిహీనులైన జనులు గానుగకు కట్టిన ఎద్దువలె సంసారమున పరిభ్రమించుచుందురు. స్త్రీసేవాసక్తులై దాంపత్య సుఖముల ననుభవించుచుందురు. సాంసారిక విషయములనే చర్చించుకొనుచుందురు. దాన ధర్మములు చేయరు. ఐశ్వర్య మున్నదని గర్వపడు చుందురే గాని అది ఎవరి వలన కలిగినదో గుర్తించరు. ఎంతవరకు అవి తోడుగా నిలుచునో గ్రహింపరు. విష్ణుకథలను వారు ఆలకింపరు. లోక వ్యవహారాలను ముచ్చటించుకొనుచుందురు.

తే॥ మృదుల పక్వాన్నభోజనములను మాని జీవహింసకుఁ జనువానిఁ జెందు నఘము
హరి నుతింపక స్త్రీలోలుఁ డైనవాఁడు నరకవాసుండు నగుచుండు ననవరతము.

స్త్రీ లోలత్వము మనుజుల సహజధర్మమై యున్నది. మోక్షమార్గ ప్రతిబంధకమగు ఈ కార్యము త్యజింప వీలుగాని రీతిలో యున్నచో వివాహము ద్వారా దానిని క్రమ పద్ధతిలో నుంచుకొని, ఆ తరువాత పూర్ణముగా త్యజింపవలెను. సాధన సమయమున స్త్రీని మాతృమూర్తిగా భావింపవలెను. ప్రతి స్త్రీ యందును జగన్మాతను దర్శింపవలెను.

భక్తిహీనులు ధనమునం దాసక్తిగలవారై పరమపురుషార్థమును గూర్చి ఆలోచింపక ధనసంపాదనకే కాలము నంతటిని వ్యయము చేయుచుందురు. పశువులను చంపి మాంసభక్షణము చేయుచుందురు. నీవు గతములో ఆచరించిన కర్మల యొక్క ఫలితములను నేడు అనుభవించుచున్నావు. నేడు చేయు కర్మలను రేపు అనుభవింపక తప్పదు. జీవహింస చేసి మాంసభక్షణము చేయువారు జన్మాంతరములో ఆ పశువులచే తినబడెదరు.

భక్తిహీనులు దేహాభిమానము గలవారై పరులను ద్వేషించుచు కష్టపెట్టుచుందురు. పరులలో నున్నది పరమాత్మయే ననియు, అన్యులను ద్వేషించిన పరమాత్మను ద్వేషించినట్లే యగు ననెడి వాస్తవమును గుర్తించరు. వీరు ధర్మార్థ కామములందు ఆసక్తి గలిగి యుందురే గాని మోక్షాసక్తిని బడయ జాలరు. అట్టివారు ఆత్మఘాతకులై నరకమును పొందుచున్నారు.

భక్తిహీనులైన మరికొందరు సకాములై యజ్ఞయాగాదుల ద్వారా తృప్తిచెంద యత్నించుచుందురు. సౌత్రామణి ఇత్యాది యజ్ఞములను నిర్వహించి మాంసభక్షణము, సురాపానము మొదలైన అనుచిత కార్యములందు నిమగ్నులై, విశుద్ధమైన ధర్మము నేమాత్రము నెరుగరు. అట్టివారు ముందు ముందు నరకగాము లగుచున్నారు. మధు మాంసాదులను యజ్ఞ వాటికలో ఆరగించమని, అనుభవించమని శాస్త్రము చెప్పుట లేదు.

యద్ఘ్రాణ భక్షో విహిత స్సురాయా స్తథా పశోరాలభనం న హింసా
ఏవం వ్యవాయః ప్రజయా న రత్యా ఇమం విశుద్ధం న విదుః స్వధర్మమ్॥

సౌత్రామణి మొదలగు యజ్ఞములందు సురను వాసన జూడమని శాస్త్రము చెప్పుచున్నది గాని పానము చేయమని చెప్పుటలేదు. అలాగే గోవును తాకమని వేదము ప్రవచించుచున్నదే గాని చంపమని చెప్పుటలేదు. భార్యతో సంగమించుట సంతానము కొఱకే గాని కామభోగము కొఱకు గానేరదు. కానీ ఈ ధర్మములను భక్తిహీనులైన కర్మవాదు లెరుగరు.

కర్మయే సాధనమని భావించి, భక్తి లేనివారై అసత్కర్మల నాచరించు ఈ మనుజు లెల్లరు చివరకు భ్రష్టులై నరకబాధల ననుభవింతురు. అంత్యకాలమున ప్రియములని భావించిన గృహములను, పుత్రులను, బంధువులను, స్త్రీలను అందరిని అనివార్యముగా వదలుకొని నరకగాము లగుదురు.

హరిభక్తికి నోచుకోని మనుజులకు మిగులునది అధోగతియే. దుష్ట ప్రవర్తన దుర్గతినే ప్రసాదించును. ఈ విధముగా భక్తిహీనుల గతిని చమసుడు తెలుపగా ఆలకించిన నిమిచక్రవర్తి శ్రీహరిని అర్చించు భక్తులు ఆచరించు పూజావిధిని తెలుపమని అడుగగా ఋషభనందనులలో చివరివాడగు కరభాజనుడు భగవత్పూజావిధిని తెలుపుచున్నాడు.

నాలుగు యుగము లందును భక్తులు శ్రీహరిని పూజించి తరించిరి. కృతయుగము నందు శ్రీహరి బ్రహ్మచారి వేషమును ధరించి అవతరించును. ఆ దివ్యాత్ముని మనుజులు

శమ దమాదులు కలిగినవారై ధ్యానించి తరింతురు. త్రేతాయుగమున విష్ణువు ఎఱ్ఱని కాంతి గలవాడై స్రుక్స్రువాదులను, యజ్ఞోపకరణములను చిహ్నములుగా ధరించి అవతరించును. ఆ పురాణ పురుషుని వేదవిహిత కర్మల ద్వారా జను లారాధింతురు. ద్వాపరయుగమున శ్రీకృష్ణ రూపముతో అవతరించగా, జనులు ఆ పరమేశ్వరుని వైదిక తాంత్రిక విధులతో అర్చింతురు. పదే పదే నమస్కరించి తృప్తి చెందుచుందురు.

నమస్తే వాసుదేవాయ నమః సంకర్షణాయచ
ప్రద్యుమ్నాయ నిరుద్ధాయ తుభ్యం భగవతే నమః

అని నమస్కరించు చుందురు.

కలియుగమునందు ఇంద్రనీలమణి వలె ప్రకాశించు కృష్ణవర్ణము గలవాడును అగు శ్రీకృష్ణుని నామ గుణ లీలాది అర్చనలచే బూజింతురు. ఆ పరమేశ్వరుని పాదపద్మములనే సదా అర్చించుచుందురు.

"ఓ పరమ పురుషా! ధ్యాన యోగ్యమై, భక్తుల యభీష్టములను తీర్చుటలో కామధేనువు వంటివియై, శివాది దేవతలచే నమస్కరింప బడినవి యైన నీ చరణ కమలములకు ప్రణమిల్లు చున్నాను. నీ చరణారవిందములు అసమాన తేజో విరాజితములు. పితృవాక్పరిపాలనకై రాజ్యమును వదలి కానలలో దిరిగినవి. జానకిని తృప్తిపరచుటకై బాగుగా తెలిసి యుండియు నీ సుకుమార చరణకమలములు మాయా మృగము వెంట పరుగిడినవి. అట్టి నీ పాదయుగళి నన్ను పావన మొనర్చును" అని ప్రార్థించుచుండును. చతుర్విధ సేవల ద్వారా పరమాత్మ నర్చించుచుండును.

1. స్థాన సేవనము:- భగవానుని ఆలయమును శుభ్రముచేయుట, అలంకరించుట, పూలతోటను పెంచుట ఇత్యాది సేవలు స్థానసేవనము క్రిందికి వచ్చును.

2. అంగ సేవనము:- విగ్రహములను శుభ్రపరచుట, ఆభరణములతో రూపముల నలంకరించుట, నైవేద్యమును అర్పించుట, విశేషసేవల నందించుట అంగసేవన మగును.

3. భావ సేవనము:- పరమాత్మయే సర్వమని సదా భావించుచుండుట, తల్లి, తండ్రి, బంధువు, మిత్రుడు, ధనము, దైవము, సమస్తము పరమాత్మయే నని సదా విశ్వసించి జీవించుట భావసేవన మగును.

4. ఆత్మ సేవనము:- పరమాత్మ తన కన్నను వేరుగాదని భావించి ఆత్మనివేదనాసక్తితో స్వామిని సేవించుట ఆత్మసేవన మగును.

ఈ విధముగా చతుర్విధ సేవలచే పరమాత్మను తృప్తిపరచుచు నామసంకీర్తన యందు హృదయమును సంతృప్తిపరచుకొనవలెను.

సాంసారిక సుడిగుండమున తగుల్కొని సుఖదుఃఖ తరంగముల తాడనముచే దుఃఖితులై యున్న జనులకు నామ సంకీర్తనము తీరమును జేర్చు దివ్య నావయై యున్నది.

కృతాదిషు ప్రజా రాజన్ కలా విచ్ఛన్తి సంభవమ్

నామ సంకీర్తనము ద్వారా తరించే అవకాశ మున్నందుననే కృతయుగము నందలి జనులు కూడా కలియుగమున పుట్టవలె నని అభిలషించుచుందురు.

భగవన్నామమును పలుకు జనులు పుణ్యాత్ములు. పుణ్యముండిన వాడే హరినామము నుచ్చరింప గలుగును. హరినామము సర్వ పాపములను హరించును. నామయోగిని, నాదయోగిని నారాయణుడు త్యజింపడు. నామమహిమ వర్ణనాతీతము. నామ వైభవమును నారాయణుడు కూడా వర్ణింప లేడని సంత్ తులసీదాస్ మహాశయుడు రామచరిత మానసములో తెలుపుతాడు.

కహౌం కహాం లగినామ బడాయీ రామ నసకహి నామ గుణగాయీ॥

తన నామము యొక్క వైభవమును రాముడే చెప్పలేని స్థితిలో యుండగా అట్టి దాని వైభవమును ఎవరు వర్ణింపగలరు?

భగవన్నామమును భక్తితో కీర్తించినచో సింహమును జూచి మృగములు పారిపోవునట్లు సర్వపాపములు పలాయనమగుచున్నవి. జన్మాంతర పాపములన్నియు నశించిపోవుచున్నవి.

నారాయణో నామ నరో నరాణాం ప్రసిద్ధ చోరః కథితః పృథివ్యాం
అనేక జన్మార్జిత పాప సంచితం హర త్యశేషం స్మృతమాత్ర ఏవ

"నారాయణుడు గొప్పచోరుడు. ఎవరైతే అతని నామము నుచ్చరింతురో అట్టివారు అనేకజన్మలలో ఆచరించిన పాపములను అతడు హరించుకొని పోవుచున్నాడు" అని వామన పురాణము తెలిపినది.

ప్రతిఒక్కరు నామ సంకీర్తనములో తృప్తి చెందాలి. నామ జపములో సంతృప్తిని పొందాలి. నామ స్మరణలో పరవశించాలి. నామ లేఖనములో మైమరచిపోవాలి. నామ ధ్యానములో తద్రూపులు కావాలి. నామశ్రవణములో తన్మయులు కావాలి.

"వసుదేవా! ఈ విధముగా నిమి చక్రవర్తి ఋషభనందనులగు తొమ్మండుగురు మునులు చెప్పిన భాగవత ధర్మములను భక్తితో శ్రవణము చేసెను. సంతుష్టచిత్తుడై వారిని పూజించెను. మహాత్ములగు మునివరులు నిమి నాశీర్వదించి అందరు చూచుచుండగనే అంతర్హితులైరి. వసుదేవా! నీవు కూడా నిష్కాముడవై, భాగవత ధర్మముల నాచరించి ఉత్తమపదమును బొందుము.

"పరమేశ్వరుడగు శ్రీకృష్ణుడు మీకు తనయుడుగా జన్మించెను. మీ కీర్తి జగద్విదితమై యున్నది. మీరు ధన్య జీవులు.

దర్శనాలింగనాలాపైః శయనాసన భోజనైః
ఆత్మావాం పావితః కృష్ణే పుత్రస్నేహం ప్రకుర్వతోః

"వసుదేవా! మీరిరువురు కృష్ణునియందు ప్రేమ గలవారై ఆ దివ్యాత్ముని దర్శించినారు. ఆలింగనము గావించుకొనినారు. ఆయనతో భాషించినారు. కలిసి నిద్రించినారు. కూర్చొని దర్శించినారు. సమీపమున ఆసీనులై భుజించినారు.

"శ్రీకృష్ణుడు అవ్యయుడు. అప్రమేయుడు. సర్వాత్ముడు. అతని యందు "మా కుమారు" డనెడి అపత్యబుద్ధి నుంచకుడు. ఆయన ధర్మ రక్షణమునకై అవతరించిన వైకుంఠవాసుడు. ఆయన కీర్తి లోకవ్యాప్తమై యున్నది.

"వసుదేవా! శిశుపాలుడు, పౌండ్రకుడు, సాల్వుడు మొదలైనవారు కృష్ణుని ద్వేషించి ఆయనపై పగ బూనినారు. సదా కృష్ణుని గమనమును, అందమును గూర్చి ఏదేకముగా చింతించుచున్నవారై తత్ఫలితముగా ఆ భగవానుని సారూప్యమును పొందినారు. క్రోధాతురులైన వారే కృష్ణస్మరణతో కృష్ణ సారూప్యమును పొందినపుడు ప్రేమించి, సేవించు కృష్ణగత చిత్తులైన భక్తులు కృష్ణ సాయుజ్యమును పొందకుందురా"?

సీ॥ కమలాక్షపదభక్తి కథనముల్ వసుదేవ విని యఘంబులఁ బాపి వెలసి తీవు
భువనప్రసిద్ధిగాఁ బొలుపొందు సత్కీర్తి కైవల్యలక్ష్మియుఁ గలుగు మీఁద
నారాయణుండు నీ నందనుం డను మోహ మెడలించి విష్ణుగా నెఱిఁగి కొలువు
మతఁడు నీతనయుఁ డై యవతరించుటఁ జేసి సిద్ధించె దేహసంశుద్ధి నీకు

తే॥ వరస సల్లాప సౌహార్ద్ర సౌష్ఠవమునఁ బావనం బయ్యె శిశుపాల పౌండ్ర నరక
ముర జరాసంధ యవనులు మురముతోడ వాసుదేవునిఁ జెందిరి వైరు లయ్యు.

ఈ విధముగా నారదమహర్షి ప్రబోధము నాలకించిన దేవకీవసుదేవులు మోహమును వదలినవారై, కృష్ణగతచిత్తులై తన్మయులైరి.

శుకుడు పరీక్షిత్తునితో చెప్పుచున్నాడు: "మహారాజా! మహాత్ముడగు వసుదేవుడు, అదృష్టవంతురాలగు దేవకి దేవర్షియగు నారదుని ప్రబోధము నాలకించి ధన్యులైరి. ఈ ఇతిహాసమును ఎవరు భక్తిశ్రద్ధలతో ఆలకింతురో వారు మోహ వినిర్ముక్తులై మోక్ష గాములై తరింతురు."

దేవతలు దేవదేవుని దర్శించుట

లీలామానుష విగ్రహుడగు ఆదిదేవుడైన శ్రీకృష్ణుని దర్శించుటకు దేవత లందరు ద్వారకా నగరమునకు విచ్చేసిరి. బ్రహ్మదేవుడు తన కుమారులగు సనకాది మునుల తోడను, ఇంద్రాది దేవతల తోడను, మరీచ్యాది ప్రజాపతుల తోడను బయలుదేరి రాగా, భూతగణములతో కూడినవాడై శంకరు డరుదెంచెను.

ద్వారకా నగరము అలౌకిక మగు తేజముతో ప్రకాశించుచుండెను. ద్వారకలో ప్రవేశించిన దేవతలు అద్భుత దర్శనుడగు శ్రీకృష్ణుని దర్శించిరి. దివ్యమైన పుష్పములతో తయారైన మాలలతో శ్రీకృష్ణుని అలంకరించిరి. అనంతరము భావగర్భిత, సారపూర్ణ వాక్కులతో శ్రీకృష్ణుని స్తుతించిరి.

"దేవాది దేవా! వాసుదేవా! ముక్తిని బడయుగోరు మునులు సదా తమ హృత్పద్మముల యందు నిలుపుకొని ధ్యానించెడి నీ దివ్య చరణకమలములను ఈ నాడు మేము తనివితీర సేవించుచున్నాము. నీవు సృష్ట్యాది కార్యములను నిర్వర్తించుచున్నను, వాని నంటక అసంగుడవై యున్నావు. ప్రభూ! నీవు భక్త వత్సలుడవు. భక్తులు సమర్పించిన వనమాల వాడిపోయినను నీవు ధరించియే యున్నావు. దానిని గాంచి లక్ష్మీదేవి ఈర్ష్య పడుచున్నది. ఆమె నీ హృదయమున వసించుచున్నను ఈ వనమాల సవతి వలె దాపురించినదని శ్రీదేవి బాధ పడుచున్నది. అయినను భక్తులు అర్పించిన వనమాలను నీవు వదలుట లేదు.

విభ్వస్తవా మృత కథో దవహాస్త్రి లోక్యాః పాదావనేజ సరితః శమలాని హస్తుమ్
ఆనుశ్రవం శ్రుతిభి రంఘ్రిజ మంగ సంగై స్తీర్థద్వయం శుచిషద స్తుఉపస్పృశన్తి

"దేవా! ముల్లోకముల యందలి పాపములను నాశము చేయుటకు నీవు రెండు పవిత్ర నదులను ప్రవహింప చేసితివి. ఒకటి అమృతమయమైన నీ విభూతులతో నిండిన కథానది. రెండవది నీ పాదపద్మముల నుండి జనించిన గంగానది. సత్పురుషులైన వారు శ్రవణేంద్రియములచే కథానది లోను, దేహేంద్రియములచే గంగానది లోను మునకలేసి తమ పాపములను పోగొట్టుకొనుచున్నారు" అని శంకర, బ్రహ్మాది దేవతలు నారాయణుని స్తుతించిరి.

దేవతలు వారి వారి లోకములకు వెడల దలచిరి. బ్రహ్మదేవుడు ఆకాశమున నిలబడి ఈ విధముగా ప్రార్థించెను: "ప్రభూ! భూభారమును తొలగించమని తొలుత నిన్ను నేను వేడితిని. నీవు ఉదయించి ఆ కార్యమును నెరవేర్చినావు. ధర్మ సముద్ధరణము గావించినావు. అసమాన లీలల నెన్నింటినో ప్రదర్శించినావు. నీ దివ్య లీలలను శ్రవణ కీర్తనాదుల ద్వారా అనుభవమునకు తెచ్చుకొను కలియుగ మానవులు తప్పక తరింతురు.

యదువంశేఽవతీర్ణస్య భవతః పురుషోత్తమ శరచ్ఛతం
వ్యతీయాయ పంచవింశాధికం ప్రభో!

"పురుషోత్తమా! నీవు ఈ యాదవవంశమున అవతరించి, నూట ఇరువది యైదు సంవత్సరములైనది.

"నీవు చేయవలసిన కార్యమంతయు పూర్తయినది. ఇప్పుడు చేయదగిన కార్యమేమి యును లేదు. విప్రశాపముచే నీ వంశము నష్టప్రాయ మయ్యెను. ప్రభూ! నీకు ఉచితమని తోచినచో నీవు నీ పరమధామమునకు వెడలుము. నీ సేవకుల మైన మమ్ము, మా లోకములను కాపాడుము."

తే॥ అఖిలలోకేశసర్వేశ! యభవ! నీవు నుదయమందుట భూభార ముడుపుకొఱకు
బంచవింశోత్తర శతాబ్ద పరిమితంబు నయ్యె విచ్చేయు వైకుంఠ హర్మ్యమునకు.

బ్రహ్మదేవుని ప్రార్థనల నాలకించిన భగవానుడగు శ్రీకృష్ణు డిట్లనెను: "బ్రహ్మదేవా! నీవు సత్యమునే పలికితివి. మీరు కోరినట్లు నేను అవతరించి మీ కార్యముల నన్నిటిని

నెరవేర్చితివి. భూభారమును తొలగించితివి. ప్రస్తుతము ఈ యదువంశము మదించి యున్నది. ఈ యాదవ వంశమును సంహరించకుండా నేను నా ధామమున కేగితినేని ఈ యదుకులము లోకనాశమునకు కారణమగును. ఓ బ్రహ్మదేవా! విప్రశాపము కార్య రూపమును ధరింప నారంభించినది. యాదవకుల నాశము ఆరంభమైనది. ఈ కులము పూర్తిగా నశింపగనే నేను బయలుదేరి, నీ లోకము మీదుగా వైకుంఠమున కేగెదను" అని శ్రీకృష్ణుడు పలుకగా బ్రహ్మదేవు డాయనకు నమస్కరించి, దేవతలతో కలిసి తన ధామమునకు వెడలెను.

ప్రభాస క్షేత్రమునకు ప్రయాణము

ద్వారకలో గొప్ప అపశకునములు శ్రీకృష్ణునికి కంటబడెను. అవి గాంచి భీతిల్లిన పెద్దలైన యాదవులు శ్రీకృష్ణుని సమీపించిరి. వారిని గాంచి భగవాను డిట్లు పలికెను: "పెద్దలారా! ఎటుచూచినను ద్వారకలో గొప్ప యుత్పాతములు గోచరించుచున్నవి. విప్రులు మన వంశమున కిచ్చిన శాపము అనివార్యమై యున్నది. మనమిక ఇచ్చట నుండుట భావ్యముకాదు. పుణ్యతీర్థమైన ప్రభాసతీర్థమునకు బయలుదేరి పోవుదము.

"పూర్వము దక్షుని శాపమువలన చంద్రుడు క్షయరోగపీడితు డయ్యెను. అతడు ప్రభాసతీర్థమున స్నాన మాచరించి శాపవిముక్తు డయ్యెను. మనము కూడా అలాగే చేయుట శ్రేష్ఠము. దేవ, పితృ తర్పణములను విడిచి, విప్రులకు విందుచేయుదము. శ్రద్ధతో దానధర్మముల నాచరించి పాప విముక్తుల మయ్యెదము. ఓడద్వారా సముద్రమును దాటిన మనుజునివలె వారి దయవలన ఈ ఆపద నుండి బయట పడుదము" అనెను.

క॥ నారాయణువచనములక, పౌరంబగు సమ్మదమున బలములతోడన్

ధారసుతమిత్రయుతులై, వారణహయసమితితోడ వడివేగిరొగిన్.

శ్రీశుకుడు పరీక్షిత్తువితో ఇలా చెప్పుచున్నాడు: "రాజా! శ్రీకృష్ణుని యాజ్ఞానుసారము యాదవు లెల్లరు ప్రభాస క్షేత్రమునకు వెడలుటకు నిశ్చయించుకొనిరి. రథములను సిద్ధపఱచుకొనిరి. ఇంతలో శ్రీకృష్ణ సేవకుడు, ప్రేమికుడు నగు ఉద్ధవు డరుదెంచెను. ప్రయాణమునకు సిద్ధమగుచున్న యాదవులను గాంచెను. భగవానుని ఆజ్ఞ నాలకించెను. శ్రీకృష్ణుని కడకేగి ఆయన దివ్యచరణములపై శిరమునుంచి నమస్కరించెను. చేతులు జోడించి నమస్కరించి పలుకసాగెను."

మహాభక్తుడైన ఉద్ధవుడు జగన్నాయకుడైన శ్రీకృష్ణునకు చేతులు జోడించి నమస్కరించుచూ, "యోగేశ్వరా! నీవు దేవ దేవుడవు. నీ లీలలను శ్రవణము చేసినవారు, కీర్తించినవారు తప్పక తరింప గలరు. నీవు సర్వశక్తి స్వరూపుడవు. నీవు తలచిన విప్రశాపమును తొలగించుట దుస్సాధ్యము కానేరదు. నీవు అలా చేయుట లేదు.

యదువంశమును సంహరించి, ఈ లోకమును విడచి పెట్టుటకు నీవు సిద్ధపడుతున్నట్లు తెలియుచున్నది.

నాహం తవాంఘ్రి కమలం క్షణార్థ మపి కేశవ
త్యక్తుం సముత్సహే నాథ స్వధామనయ మామపి

"కేశవా! నిన్ను వదలి అరక్షణమైనను నేనుండజాలను. నీ చరణకమలములకు దూరమై నేను జీవించలేను. నాథా! అందువలన నన్ను కూడా నీ ధామమునకు గొనిపొమ్ము.

"కృష్ణా! నీతో కలిసి పరుండితిమి. నీతో తిరిగితిమి. నీతో కలిసి నిలబడితిమి. కూర్చొంటిమి. క్రీడించితిమి. భుజించితిమి. భాషించితిమి. అట్టి నిన్ను వదలి ఎలా జీవించగలము?

"ప్రభూ! నీవు ధరించిన మాలను మేము ధరించితిమి. నీవు పూసుకొనిన చందనమును పూసికొంటిమి. నీవు విడచిన వస్త్రమును ధరించితిమి. నీవు తిని మిగిల్చిన ఉచ్ఛిష్టమును భుజించితిమి. సదా నీ కథలనే మేము కీర్తించు చుందుము. దీనశరణ్యా! మాకు నీవే దిక్కై యున్నావు. అన్యు లెవ్వరును లేరు" అని విన్నవించెను.

క॥ జ్ఞానమున నుద్ధవుఁడు దన, మానసమునవెఱఁగి శ్రీరమాధిపహరియో

దీనజనకల్పభూజ సు, ధీనాయక మాకు నీవె దిక్కని పొగడెన్.

"పరీక్షిన్మహారాజా! దేవకీ సుతుడగు శ్రీకృష్ణ భగవానుని ఉద్ధవుడిట్లు ప్రార్థింపగా, ప్రియుడు, భృత్యుడునైన ఉద్ధవుని గాంచి వాసుదేవుడు పలుక సాగెను" అని శుకుడు పలికెను.

శ్రీకృష్ణుడు పలుక సాగెను: "ఉద్ధవా! నీవు చెప్పిన దంతయూ సత్యమే. నేటికి సరిగ ఏడవనాడు సముద్రము ఈ పట్టణమును ముంచివేయ గలదు. నేను ఈ లోకమును పరిత్యజింతును. నేను నిష్క్రమించగనే సర్వ శుభములు నశించి పోవును. కొలది దినములలోనే కలియుగము ప్రవేశించును. కలియుగ మానవులు అధర్మపరులై యుందురు. అట్టివారి మధ్య నీవు నివసింపలేవు.

"ఉద్ధవా! ఈ ప్రపంచమునకు మనము ఎవ్వరితోను కలిసి రాలేదు. కనుక కలిసి వెళ్ళేదీ ఉండదు. చుట్టరికాలన్నీ గిట్టే వరకే. పుట్టుకకు పూర్వము లేనివి గిట్టిన పిదప ఉండవు. నా మాట వినుము. స్వజనులను విడనాడుము. బంధువులను త్యజింపుము. మిత్రులను వదలుము. ఆత్మీయులు ఆనందధామానికి అడ్డుగోడలని మరువకుము. నాయందు అనన్యప్రేమ నుంచుము. నాకు నీ సంపద లవసరము లేదు. నీ మనస్సే నాకు కావాలి.

"ఈ జగత్తు మాయారూపమని గ్రహించు. మనోకల్పితమని గుర్తించు. ఇంద్రియాలను వశపరచుకొనుము. సంకల్పాలను నిరోధింపుము. దోషబుద్ధి ప్రమాదకరము. నిర్దోషము ప్రమోదము నందించును" అని పలికెను.

శ్రీకృష్ణుని దివ్యవచనముల నాలకించిన ఉద్ధవుడు ఇలా పలికెను: "భగవాన్! నీవు యోగులకు ప్రభువువై యున్నావు. మా సుఖమును కోరి సన్యాస యోగము నుపదేశించినావు.

అనంతా! విషయవాసనా మగ్నులైన నరులు వాంఛలను అంత తేలికగా త్యజింప గలుగుదురా? నేను మూఢుడను. మాయాకల్పిత మగు భ్రాంతికి లోనై "నేను-నాది" యనెడి అహంకార మమకారముల యందు చిక్కియున్నాను. అట్టి నేను నీవు బోధించిన త్యాగమును ఎలా సాధించగలను? ఈ విషయమున నన్ను శాసింపుము. నేను నిన్ను శరణుజొచ్చియున్నాను."

శ్రీకృష్ణుడు ఉద్ధవుని వచనముల నాలకించి "ఉద్ధవా! వివేకముచే మనుజుడు తన్ను తాను ఉద్ధరించుకొనవలెను. మానవజన్మను ప్రసాదించి భగవానుడు నీకు ఎంతయో నుపకారము చేసినాడు. నీకు నీవే గురువువు కావాలి.

"ఆత్మనో గురు రాత్మైవ" ఆత్మకు ఆత్మయే గురువు. ఉద్ధవా! నేను అనేక దేహములను సృజించినాను. అన్నిటికంటెను మానవదేహ మనిన నాకు మిక్కిలి ప్రియము. మానవుడు భగవంతుని అన్వేషించి సాధించ గలుగును. ఉద్ధవా! ఈ విషయమున యదురాజునకు, అవధూతయగు దత్తాత్రేయులకు జరిగిన సంవాదము అద్భుతముగా యుండును. దానిని తెలిపెదను, సావధాన చిత్తముతో నాలకింపుము" అని చెప్పి యదురాజునకు, దత్తాత్రేయులకు మధ్య జరిగిన సంవాదమును తెలిపెను.

అవధూతోపాఖ్యానము

యదుమహారాజ అవధూతయగు బ్రాహ్మణుని సమీపించి, శిరమోడ్చి నమస్కరించి ఇలా పలికెను: "బ్రాహ్మణుడా! ఈ ప్రపంచములోని జనులు అనేక విషయములను వాంఛించి కర్మల నాచరించుచున్నారు. నీవు ఏదియును కోరుటలేదు. దేనిని చేయుటలేదు. నీవు ఏ సత్కర్మ నాచరించినట్లు కూడా తెలియుటలేదు. మరి లోక విలక్షణమైన బుద్ధి నీకెట్లు కలిగినది? ఏ జ్ఞానము కలిగి యుండుటచేత చింతావివర్జితుడవై ఈ ప్రపంచములో బాలునివలె నిర్భయంగా సంచరించుచున్నావు?

జనేషు దహ్య మానేషు కామ లోభ దవాగ్నినా
న తప్యసేఽగ్నినా ముక్తో గంగాంభః స్థ ఇవద్విపః

"కామ లోభము లనెడి దావాగ్నిచే ప్రపంచములోని జనులు సదా దహింపబడు చున్నను నీవు అగ్నిసంతాపము లేనివాడవై గంగాజలమున నిలిచియున్న ఏనుగువలె సంతాపము లేక యున్నావు.

"ఈ విధమైన దివ్యానందము నీకెట్లు కలిగినది? దయఉంచి నాకు తెలుపుడు" అని యదుమహారాజు ప్రశ్నించగా, ఆ బ్రాహ్మణుడు ఇట్లు చెప్పసాగెను.

తన బుద్ధి నాధారముగా గొని ఎందరో గురువుల నాశ్రయించి వారినుండి జ్ఞానమును పొందినట్లు తెలుపుతూ ఆ గురువుల నామములను, వారినుండి గ్రహించిన జ్ఞానమును బ్రాహ్మణుడు యదుమహారాజుకు చెప్పెను.

అవధూత బ్రాహ్మణుని ఇరువది నలుగురు గురువులు:-

(1) పృథివి (2) వాయువు (3) ఆకాశము (4) జలము (5) అగ్ని (6) చంద్రుడు (7) సూర్యుడు (8) పావురము (9) అజగరము (10) సముద్రము (11) పతంగము (12) భ్రమరము (13) మక్షికము (14) ఏనుగు (15) హరిణము (16) చేప (17) పింగళ (18) కురరము (19) బాలుడు (20) కన్య (21) శరకృత్తు (22) సర్పము(23) ఊర్ణనాభి (24) భ్రమర కీటకము.

1. పృథివి:-

శశ్వత్పదార్థ సర్వేహః పరార్థైకాంత సంభవః
సాధు శ్శిక్షేత భూ భృత్తోఽ నగశిష్యః ॥

సాధువు పరోపకారము, పరాధీనత యను రెండు లక్షణములను కలిగి యుండవలెను. పర్వతము నుండి పరోపకారమును, వృక్షమునుండి పరాధీనతను అవధూత నేర్చుకొనెను. పర్వతము తృణమును, వృక్షములను, సెలయేళ్ళను కలిగి వాటిద్వారా ఇతరులకు మేలుచేయు చుండును. ఇదియే పరోపకారము. అలాగే వృక్షము తనను ఖండించి గొనిపోయినను మారుపలుకక పరాధీనమై యుండును. పర్వతరూపము, వృక్షరూపము గలదియైన పృథివి నుండి ఈ రెండు గుణములను నేర్చెను. ప్రాణులు త్రొక్కుచున్నను భూమి సహించియుండును. ఇది గాంచి భూమినుండి క్షమాగుణమును కూడా పొందెను.

2. వాయువు:-

పార్థివేష్విహ దేహేషు ప్రవిష్ట స్తద్గుణాశ్రయః
గుణైర్నయుజ్యతే యోగీ గంధైర్వాయు రివాత్మ దృక్ ॥

వాయువు గంధముచే లిప్తము గానట్లు సాధువు దేహమున ప్రవేశించి బాల్య యౌవనాది దశలను గాంచుచున్నను వానియందు ఆసక్తి లేనివాడై యుండును.

గాలివలన అనాసక్తి, అసంగత్వమను గుణములను నేర్చెను.

3. ఆకాశము :-

అన్తర్హితశ్చ స్థిర జంగమేషు బ్రహ్మాత్మ భావేన సమన్వయేన
వ్యాప్త్యా వ్యవచ్ఛేద మసంగ మాత్మనో మునిర్నభస్త్వం వితతస్య భావయేత్ ॥

దేహముతో కూడియున్నను ముని దేహాదికముతో సంగముగాని, పరిచ్ఛేదము గాని తెలియనివాడై ఆకాశమువలె అసంగుడై యున్నాడు. వాయువుచే ప్రేరేపింపబడిన మేఘాదులచే ఆకాశమెట్లు స్పృశింపబడదో అలాగే దేహాదులచే ఆత్మ లిప్తము కానేరదు.

ఆకాశము ద్వారా సర్వవ్యాపక స్థితిని, అసంగమును నేర్చెను.

4. జలము :-

స్వచ్ఛః ప్రకృతితః స్నిగ్ధో మాధుర్య స్తీర్థ భూర్నృణామ్
మునిః పునాత్యపాం మిత్ర మీక్షోప స్పర్శ కీర్తనైః ॥

జలము నిర్మలముగా నుండును. చల్లగా నుండును. మధురముగా నుండును. అలాగే ముని యైనవాడు జలమువలె పరిశుద్ధముగా నుండవలెను. చల్లని అనురాగమును కలిగి యుండవలెను. మధురభాషియై యుండవలెను. తన నాశ్రయించు మానవులను దర్శన, స్పర్శన, కీర్తనాదుల ద్వారా పవిత్రులను చేయవలెను.

జలము ద్వారా నిర్మలత్వమును, శీతలత్వమును, మధుర భాషణమును నేర్చెను.

5. అగ్ని :-

తేజస్వీ తపసా దీప్తో దుర్ధర్షోదర భాజనః
సర్వ భక్షో౽పి యుక్తాత్మా నాదత్తే మల మగ్ని వత్ ॥

అన్ని విధములైన వస్తువులను భక్షించినను అగ్నికి ఏ విధమైన మాలిన్యము అంటదు. అలాగే తేజోవంతుడు, తపస్సంపన్నుడు, దుర్ధర్షుడు, అపరిగ్రహశీలుడగు ముని ఎట్టి మాలిన్యమును పొందడు. అగ్ని కొన్నిచోట్ల వ్యక్తమై, మరికొన్ని చోట్ల నిగూఢముగా నుండును. అలాగే మననశీలుడు శుభకరులగు వారికి వ్యక్తమగుచుండును. అగ్ని కట్టెలను గాల్చును. కానీ దారువు నందలి పొడుగు, పొట్టి, లావు, సన్నము మొదలగు ఆకారములతో కనిపించుచున్నను వాస్తవానికి అగ్నియందు ఆ లక్షణములు లేవు. అలాగే సర్వవ్యాపి యగు పరమాత్మ దేహాదుల యందు గోచరించుచున్నది.

అభోక్తృత్వము, అపరిచ్ఛిన్నములను అగ్ని ద్వారా నేర్చెను.

6. చంద్రుడు :-

విసర్గాద్యాః శ్మశానాంతా భావా దేహస్య నాత్మనః
కలానామివ చంద్రస్య కాలే నావ్యక్త వర్త్మనా ॥

ఊహకు అందని కాలప్రభావముచే ఏర్పడు వృద్ధిక్షయములు కళలకే గాని చంద్రునకు లేనట్లు షడ్వికారములు దేహమునకే గాని ఆత్మకు లేవు.

చంద్రుని ద్వారా అవికార్య సత్తా స్వరూపము యొక్క స్థిరత్వమును నేర్చెను.

7. సూర్యుడు :-

గుణై ర్గుణా నుపాదత్తే యథా కాలం విముంచతి
న తేషు యుజ్యతే యోగీ గోభిర్గా ఇవ గోపతిః ॥

సూర్యుడు తన కిరణజాలముచే జలముల నాకర్షించి, వాటిని అంటకయే మేఘ రూపమున నిలుపును. సమయ మాసన్న మైనపుడు కురిపించును. అలాగే యోగి ఇంద్రియములచే వస్తువులను గ్రహించును. యాచకులు వచ్చినంతనే వాటిని దానము చేయును. వాటి యందు ఆసక్తి లేనివాడై యుండును.

జలములందు ప్రతిఫలించి నపుడు సూర్యుడు అనేకము లైనట్లు గోచరించినను వాస్తవానికి సూర్యుడొక్కడే. అలాగే అభిన్నమైన ఆత్మ దేహాదుల యందు అనేకములుగా గోచరించుచున్నను అద్వయమై వెల్గొందుచున్నది.

సూర్యునిద్వారా ఉపకారమును నేర్చెను. నిరుపాధిక సత్యమును దర్శించెను.

8. కపోతము :-

నాతిస్నేహః ప్రసంగో వా కర్తవ్యః క్వాపి కేనచిత్
కుర్వన్ విందేత సంతాపం కపోత ఇవ దీనధీః ॥

ఎప్పుడు గాని ఎవ్వనితో గాని అతి స్నేహము, అతి ప్రసంగము చేయరాదు. అట్లు చేయువాడు వివేకశూన్యమైన కపోతము వలె దీనమానసుడై సంతాపగ్రస్తు డగును.

ఒక అరణ్యములో పావుర మొకటి గూడును నిర్మించుకొని భార్యాపిల్లలతో జీవించుచుండెను. భార్యా పిల్లలయందు ఆ కపోతము అతి ప్రేమను కలిగి తనను వారితో బంధించుకొని యుండెను.

ఒకనాడు పావురముల జంట తమ సంతానమునకు ఆహారమును గొని తెచ్చుటకై వెళ్ళెను. ఈ లోగా బోయవాడు పన్నిన వలలో కపోతసంతానము తగులుకొనెను. కపోతముల జంట తిరిగివచ్చి ఈ దారుణ పరిస్థితిని గాంచి తీవ్ర సంతాపము నొందెను.

సంతానముపై యున్న ప్రేమతో కపోతి దుఃఖితయై బిడ్డలకు దగ్గరగా జని వలలో చిక్కుకొనెను. భార్యా పిల్లల యందలి అతి స్నేహ జనిత మమకారముచే కట్టబడి మగ పావురము కూడా విలపించుచు తాను గూడ వలలో పడెను. ఆ బోయవాడు ఆనందముతో వాటిని పట్టుకొని గృహోన్ముఖు డయ్యెను.

కుటుంబ పోషణము నందే ఆసక్తిగల పురుషుడు దీనుడై, ఆలు బిడ్డలతో గూడ క్లేశముల యందు చిక్కుకొని నాశము పొందును. గృహస్థ ధర్మము నందే ఎవడు ఆసక్తుడై యుండునో అట్టివానిని ఆరూఢచ్యుతు డని పండితులు చెప్పుదురు. అనగా శ్రేయోమార్గమును పొందికూడా భ్రష్టుడైనవా డని భావము.

అసక్తి రనభిష్వఙ్గః పుత్రదార గృహాదిషు

"పుత్ర, భార్య, గృహాదుల యందు ఆసక్తి లేకుండా, ప్రీతి లేకుండా జీవించాలి" యని జ్ఞానమును గూర్చి భగవద్గీత కూడా ప్రవచించినది.

కపోతము ద్వారా అనాసక్తిని, అనభిష్వంగమును నేర్చెను.

9. అజగరము :-

గ్రాసం సుమృష్టం విరసం మహాన్తం స్తోక మేవ వా
యదృచ్ఛయైవా పతితం గ్రసే దాజగరో౽క్రియః ॥

కొండచిలువ అప్రయత్నముగ లభించిన ఆహారము రుచిగ నున్నను, రుచి విహీన మైనను, ఎక్కువైనను, తక్కువైనను ఎట్లున్నను స్వీకరించును. అలాగే యోగి అప్రయత్నముగ లభించిన కబళముతో తృప్తినొందవలెను.

ఒకవేళ ఆహారము లభింపనిచో అది దైవశాసన మని భావించి, అజగరమువలె చేష్టలుడిగి యుండవలెను.

అజగరము ద్వారా ప్రారబ్ధ కర్మానుభవమునందు సంతృప్తి నొందుటను గ్రహించెను.

10. సముద్రము :-

సముద్ర కామో హీనో వా నారాయణ పరో మునిః
నో త్సర్పేత న శుష్యేత సరిద్భిరివ సాగరః ॥

వర్షఋతువునందు నదీజలము అన్నియు వచ్చి సాగరమున కలియును. అయినను సాగరుడు వృద్ధినొందడు. గ్రీష్మఋతువున క్షీణించడు. అలాగే ముని కలిమిలో పొంగిపోక, లేమిలో క్రుంగిపోక స్థిరుడై యుండవలెను.

సముద్రము ద్వారా సుఖదుఃఖముల యందు నుండవలసిన సమస్థితిని నేర్చెను.

11. పతంగము :-

దృష్ట్వా స్త్రియం దేవ మాయాం తద్భావై రజితేన్ద్రియః
ప్రలోభితః పతత్యన్ధే తమస్యగ్నౌ పతంగవత్ ॥

జ్వలించుచున్న అగ్నిని గాంచి అది ఏదో అపూర్వ భక్ష్యమని భావించి మిడుత అగ్నిని ముట్టుకొని కాలి భస్మమగును. అలాగే పురుషుడు స్త్రీని గాంచి, ఇంద్రియ ప్రలోభమునకు గురియై, ఆ కాంతయందు ఆసక్తుడై నరకమున బడి దుఃఖించుచున్నాడు.

పతంగము ద్వారా మోహము నరకతుల్య మని గ్రహించెను.

12. భ్రమరము :-

అణుభ్యశ్చ మహద్భ్యశ్చ శాస్త్రేభ్యః కుశలో నరః
సర్వతః సారమాదద్యాత్ పుష్పేభ్య ఇవ షట్పదః ॥

తుమ్మెద చిన్న పుష్పములు, పెద్ద పుష్పములు అన్నిటి నుండి సారమును గ్రహించును. అలాగే వివేకి చిన్నవియు, పెద్దవియు నగు శాస్త్రములన్నిటి నుండి సారభూతమైన విషయమును గ్రహింపవలెను.

గృహస్థులకు ఎట్టి కష్టమును కలుగజేయకుండా యతిపురుషుడు స్వల్పముగా ఆహారమును గ్రహింపవలెను. ఒక గృహస్థుని పైననే ఆధారపడక నాలుగిండ్లకు తిరిగి, లభించిన ఆహారముతో భ్రమరము వలె జీవింపవలెను.

ఒకే పద్మమునందు ఆహారము పూర్ణముగా లభించవలె నని భావించిన మధుకరము ఆ పద్మము నందే నిలిచియుండగా, సూర్యాస్తమయ సమయాన కమలము ముకుళించగనే భ్రమరము బంధింపబడును. అలాగే ఒకే ఇంటిపై ఆధారపడి జీవించు సాధువు బద్ధుడగును.

భ్రమరము ద్వారా సారమును గ్రహించుట, ఆసక్తిని విడనాడుటను నేర్చెను.

13. మక్షికము :-

సాయంతనం శ్వస్తనం వా న సంగృహ్ణీత భిక్షుకః
మక్షికా ఇవ సంగృహ్ణన్ సహ తేన వినశ్యతి ॥

తేనెటీగ పుష్పముల నుండి మధువును సంగ్రహించి ఒకచోట నిలువ చేయును. దాని ఫలితముగ తేనెతో పాటు ప్రాణమును కూడా కోల్పోవును. అలాగే సన్యాసి ఈ ఆహారము సాయంత్రమునకు, ఈ ఆహారము ఉదయమునకు అని దాచుకోకూడదు. పొట్టనిండువరకే ఆహారమును గ్రహించాలి.

మక్షికము ద్వారా సంగ్రహబుద్ధి ప్రమాదకరమని గ్రహించెను.

14. గజము :-

పదాపి యువతీం భిక్షు ర్నస్పృశే ద్దారవీ మపి
స్పృశన్ కరీవ బధ్యేత కరిణ్యా అంగసంగతః ॥

సన్యాసి కఱ్ఱతో చేయబడిన స్త్రీ మూర్తిని పాదముచే కూడా స్పృశించరాదు. లేని ఆడ యేనుగు యొక్క సంగత్వము వలన మగ ఏనుగు బంధింప బడినట్లు బంధింపబడును. ఏనుగు ద్వారా స్త్రీ సంబంధము అనుచిత మని గ్రహించెను.

15. హరిణము :-

గ్రామ్య గీతం న శృణు యాద్యతి ర్వనచరః క్వచిత్
శిక్షేత హరిణాద్బద్ధా న్మృగయో ర్గీత మోహితాత్ ॥

సంగీతము నందలి ప్రీతిచే జింక ప్రాణములను కోల్పోవును. కనుక వనవాసియగు సన్యాసి సంగీతశ్రవణము అందు ప్రీతి నుంచరాదు.

హరిణము ద్వారా సన్యాసి గీత నృత్యాదివిషయములు త్యజింపవలె నని నేర్చెను.

16. మీనము :-

జిహ్వయాఽతి ప్రమాథిన్యా జనో రస విమోహితః
మృత్యు మృచ్ఛత్య సద్బుద్ధి ర్మీనస్తు బడిశైర్యథా ॥

గాలమునకు గ్రుచ్చబడిన ఎఱను తినబోయి చేప ప్రాణములను పోగొట్టుకొనును. అలాగే జిహ్వేంద్రియమునకు లోబడిన మానవుడు మరణమును బొందుచున్నాడు.

మత్స్యము ద్వారా రసేంద్రియమును జయింపవలె నని గ్రహించెను.

17. పింగళ :-

ఆశాహి పరమం దుఃఖం నైరాశ్యం పరమం సుఖమ్
యథా సంఛిద్య కాన్తాశాం సుఖం సుష్వాప పింగళా ॥

నిజముగా ఆశయే పరమ దుఃఖము. నిరాశయే పరమ సుఖము. పింగళ యను వేశ్య పురుషులపై ఆశను త్యజించి సుఖముగా నిద్రించినది.

పింగళ యను వేశ్య మిథిలానగరమున యుండెను. ఆమె విటుల ద్వారా విత్తమును సంపాదించుకొనుచు విలాసవంతురాలై యుండెను. ఒకనాడు ధనికుడైన పురుషుడు తన ఇంటికి రావలెనని నిరీక్షించుచుండెను. కానీ అర్ధరాత్రి వరకు ఎవ్వరును రాలేదు. ఆమె నిరీక్షణ నిరాశను కలిగించెను. ఈ నైరాశ్యము వైరాగ్యమును ఉత్పన్నము చేసెను.

ఆమె తన బ్రతుకును తాను అసహ్యించుకొనెను. నిందనీయమైన తన బ్రతుకును తానే ఏవగించుకొనెను. రాత్రంతయు జాగరణ చేసి తుచ్ఛులైన మానవుల కొఱకు నిరీక్షించుట కంటే జగదీశ్వరుని కొరకు నిరీక్షించుట శ్రేయమని భావించెను. విషయ భోగములపై నున్న ఆసక్తిని విడచెను. ధనాశను త్యజించెను. చిత్తశాంతిని పొందెను. హాయిగా నిద్రించెను.

పింగళ ద్వారా ఆశ దుఃఖరూప మనియు, నిరాశ సుఖరూప మనియు గ్రహించెను.

18. కురరము :-

సామిషం కురరం జఘ్ను ర్బలినోఽ న్యే నిరామిషాః
తదా మిషం పరిత్యజ్య స సుఖం సమవిన్దత ॥

కురరపక్షి ఒకనాడు మాంసపుముక్కను నోట కరుచుకొని పరుగిడుచుండెను. అది గాంచి బలము గలిగిన మరికొన్ని కురర పక్షులు దానిపై దాడి చేసినవి. తిరిగి తిరిగి అలసిపోయిన కురర పక్షి చేయునది లేక ఆ మాంసపు ముక్కను విడచిపెట్టెను. వెంటనే దానిపై దాడి చేయుచుండిన పక్షులు మాంసఖండము వద్దకు వెళ్ళగా వదలిన పక్షి విశ్రాంతి పొంది సుఖించెను.

సుఖ మనేది విడచుటలో యున్నదే గాని పట్టుకొనుటలో లేదని కురర పక్షి ద్వారా గ్రహించెను.

19. బాలుడు :-

ద్వావేవ చిన్తయా ముక్తౌ పరమానన్ద ఆప్లుతౌ
యో విముగ్ధో జడో బాలో యో గుణేభ్యః పరంగతః ॥

ఈ ప్రపంచములో చింతలేనివారు, శాంతిగలవారు ఇరువురే గలరు. వారిలో ఒకడు అజ్ఞుడగు బాలుడు. రెండవవాడు గుణాతీతుడగు పురుషుడు.

బాలుని ద్వారా అమాయకత్వమును, నిర్దోషిత్వమును నేర్చెను.

20. కుమారి :-

వాసే బహూనాం కలహో భవే ద్వార్తా ద్వయోరపి
ఏక ఏవ చరే త్తస్మా త్కుమార్యా ఇవ కంకణః ॥

అనేకమంది ఒక చోటచేరిన కలహ ముద్భవించును. ఇరువురున్నచో అనేక విధములైన విషయచర్చ జరుగును. అందువలన కుమారి చేతియందలి కంకణము వలె ఒంటరిగ తిరుగుట ఉత్తమము.

పేదరాలైన ఒక కన్యను చూసి వివాహమును నిశ్చయించుటకు పెండ్లివారొచ్చిరి. ఇంటిలో వారికి ఆతిథ్యమిచ్చుటకు బియ్యములేనందున ఆమె రోకలితో ధాన్యమును దంచుట కుపక్రమించెను. ఆమె చేతియందలి గాజులు శబ్దము చేయసాగినవి. తన దారిద్ర్యము వెల్లడి యగునని భావించి, ఆమె ఒక్కొక్క గాజును పగులు గొట్టినది. చివరగా చేతికి రెండుగాజులు మాత్రమే మిగిలెను. ఆ రెండుగాజులు కూడా శబ్దము చేయసాగినవి. చివరగా చేతికి ఒక్కొక్క గాజునే ఆమె ధరించినది. ఆ తరువాత శబ్దము లేకపోయెను.

కన్య ద్వారా ఏకాంతవాసము, అద్వైతము శ్రేష్ఠమని గ్రహించెను.

21. ఇషుకారుడు :-

తదైవ మాత్మన్య వరుద్ధ చిత్తో నవేద కించి ద్బహిరన్తరం వా
యథేషుకారో నృపతిం వ్రజన్త మిషౌ గతాత్మా న దదర్శ పార్శ్వే ॥

బాణములను తయారుచేయు కమ్మరివాడు తన కార్యములో నిమగ్నుడై, తన ప్రక్కనుండి గొప్ప సైన్యముతో వెడలుచున్న రాజును కూడ గుర్తించలేదు. యోగియైనవాడు ఇషుకారుని వలె చిత్తమును నియమించిన వాడై, అన్యమైన విషయములను గుర్తింపక చరించవలెను.

ఇషుకారుని ద్వారా చిత్తైకాగ్రతను నేర్చెను.

22. సర్పము :-

గృహారంభో హి దుఃఖాయ విఫలశ్చా ధ్రువాత్మనః
సర్పః పరకృతం వేశ్మ ప్రవిశ్య సుఖ మేధతే ॥

నశించే దేహమునకై గృహమును నిర్మించుట నిరుపయోగము. చీమలు పెట్టిన పుట్టలలో పాములు వసించునట్లు, యోగివరులు నిర్మించిన గృహముల యందు గాని, పరమాత్మ నిర్మించిన కొండలయందు గాని వసించుట ఉత్తమము.

సన్యాసి సర్పము వలె ఏకాంతముగ జీవింపవలెను. ఒకే ప్రదేశమున యుండరాదు. సర్పము ద్వారా నిరాశ్రయత్వమును నేర్చెను.

23. సాలెపురుగు :-

యథోర్ణనాభి ర్హృదయా దూర్ణం సంతత్య వక్త్రతః
తయా విహృత్య భూయస్తాం గ్రసత్యేవం మహేశ్వరః ॥

సాలెపురుగు కుక్షి నుండి ముఖము ద్వారా దారమును తీసి, ఆ దారము నందే చరించును. మరల దానినే మ్రింగును. అలాగే ఈ సృష్టిని పరమాత్మ తన నుండే కల్పించును. తనలోనే కలుపుకొనును.

పాలెపురుగు ద్వారా సృష్టి రచన నెరింగెను.

24. భ్రమర కీటకము :-

కీటః పేశస్కృతం ధ్యాయన్ కుడ్యాం తేన ప్రవేశితః
యాతి తత్సాత్మతాం రాజన్ పూర్వ రూపమసం త్యజన్ ॥

భ్రమరము ఒక కీటకమును తెచ్చి తానుండు ప్రదేశమున ఉంచును. భయపడిన ఆ కీటకము భ్రమరమును గూర్చియే చింతించుచు తన మొదటి శరీరమును త్యజింపకనె భ్రమరరూపమును పొందును.

భ్రమరము ద్వారా భగవంతుని చింతించువాడు భగవంతుడే యగునని గ్రహించెను.

తన ఇరువది నలుగురు గురువులను గూర్చి యదుమహారాజుకు తెలిపి, తన దేహము ద్వారా తెలిసికొనిన కొన్ని విషయములను అవధూత యగు బ్రాహ్మణుడు వివరించు చున్నాడు:

"ఈ దేహము పరిణామ శీలము. దుఃఖ స్వరూపము. ఈ దేహము వైరాగ్యమును కలిగించునని భావించి, నేను దీనిని గురువుగా స్వీకరించితిని. దీనిని చివరగ కుక్కలు, నక్కలు భుజించును. అందుచేత ఈ దేహమునందు నాకు ఆసక్తి లేదు. దీనిని తత్త్వ విచారము వరకే నే నుపయోగించుకొందును.

"బహుభార్యలకు మగడైన వానిని ఒక్కొక్క భార్య తన వైపునకే అతనిని ఆకర్షించు కొనునట్లు, ఇంద్రియములు జీవుని ఆ విధముగ తమ వైపునకు ఆకర్షించుకొనుచున్నవి.

"మానవజన్మ ఉత్తమ మైనది. విషయ సుఖానుభవము పశ్వాది యోనుల యందును లభించును. పరమపురుషార్థమగు మోక్షమునకై ప్రయత్నించు శక్తి ఒక్క మానవుడికే గలదు" అనెను.

క॥ దేహము నిత్యము గా దని మోహముఁ దెగ గోసి సిద్ధమునివర్తనుఁడై
గేహము వెలువడి వరుఁ డుత్సాహమునం జెందు ముక్తిసంపద ననఘా!

శ్రీకృష్ణుడు ఉద్ధవునికి చెప్పుచున్నాడు : "ఉద్ధవా! గొప్ప జ్ఞానియగు దత్తాత్రేయుడు యదుమహారాజునకు ఈ విధముగా బోధించెను. యదుమహారాజు అనేక విధముల దత్తాత్రేయుని పూజించెను. దత్తాత్రేయుడు ప్రసన్నుడై వెడలెను" అని చెప్పి లౌకిక, పారలౌకిక భోగముల యొక్క సారహీనస్థితిని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు వివరించెను.

నిస్సార భోగములు

విషయాసక్తులగు పురుషులు విషయములను సత్యములని నమ్మి వానిని పొందుటకు యత్నింతురు. అవి విపరీత ఫలము నిచ్చునని గ్రహించు విశుద్ధమనస్కుడు నిష్కాముడై యుండును.

స్వప్నమున అనేక భోగముల ననుభవింతుము. నిద్రనుండి లేవగానే అవి యన్నియు అసత్యములని తేలును. స్వప్నము నందలి భోగ్య విషయములు ఎవరికి గ్రాహ్యమైనవి? మనస్సునకే గదా! స్వప్నములో మనస్సునకు తెలిసిన విషయములు అనిత్యము లైనపుడు ఆ మనస్సునకే జాగ్రదవస్థలో తెలిసిన విషయములు ఎలా సత్యములగును?

మనుజుడు ముందుగా మనస్సును శుద్ధి చేసుకొనవలెను. దీనినే సమకార్య మందురు. శుద్ధదర్పణములో వస్తువు ప్రతిఫలించినట్లు శుద్ధమనస్సులో ఆత్మ ప్రతిఫలించును. భగవానునికి శరణాగతులై కామ్యకర్మలను వదలి ఎవరయితే నిష్కామ భావముతో కర్మల నాచరింతురో అట్టివారి మనస్సు శుద్ధిపడును.

మనస్సు విషయములతో స్నేహము చేయు అలవాటును కలిగి యుండును. అట్టి మనస్సు సదా ఈశ్వరుని గూర్చి చింతించునట్లు చూడవలెను. ఈశ్వరుని చింతించని మనస్సు చింతలకు దూరము కాలేదు.

సాధకుడు ఎంత ప్రయత్నించుచున్నను మనస్సును నిగ్రహించుట అంత సాధ్యమైన పని కానేరదు. అందుచేత సాధకుడు గురువు నాశ్రయింప వలెను. గురువు సాక్షాత్తు భగవంతుడే యను భావము కలిగి యుండవలెను.

అప్యుత్పన్న మనా త్వతతం యదా నమ నుతే మనః
గురుశాస్త్ర ప్రమాణైస్తు నిర్ణీతం తావదాచర

"మనస్సులో వాసనలు నిలిచి యున్నంత వరకు పరమాత్మను దర్శింప లేవు. కావున గురువుల నాశ్రయించి, వారు నిర్ణయించిన వానిని శ్రద్ధతో ఆచరింపవలెను" అని ఉపనిషత్ప్రబోధము.

గురువు లభించినంత మాత్రాన సరిపోదు. గురుసేవలో తృప్తిచెందే అంతఃకరణ శిష్యునకు తయారుకావాలి. అభిమానాహంకారములను త్యజించిన వాడే గురుసేవలో తృప్తి చెందును. గురువును పొందిన పుణ్యాత్ముడు సత్యవ్రతుడై యుండాలి. అసత్యము పలుక కూడదు. గురువుపై అనన్యభక్తి కలిగి యుండాలి. అసూయారహితుడై యుండాలి. వ్యర్థ భాషణమును విరమించాలి. అనిత్యములైన భార్యాపుత్రాదులు, గృహము, పొలము, బంధువులు, ధనము మున్నగు విషయముల యందు తటస్థుడై యుండవలెను.

శ్రీకృష్ణుడు ఉద్ధవునికి తెలుపుచున్నాడు. ఉద్ధవుడు సావధాన చిత్తుడై ఆలకించు చున్నాడు. ఎవరికి భక్తిశ్రద్ధలు పూర్ణముగా యుండునో అట్టి వారు పూర్ణావధానముతో గురుబోధను ఆలకించ గలరు.

కాష్ఠాదులను దహించుచు వానిని ప్రకాశింపజేయు అగ్ని దాహ్యము, ప్రకాశ యోగ్యమునగు దారువుల కంటె వేఱుగా యున్నట్లు, ఆత్మ స్థూల సూక్ష్మములనెడి రెండు దేహముల కంటెను విలక్షణమై యున్నది. అయినను, ఈ సత్యము నెరుగని జీవుడు భ్రమ వలన జగద్భ్రాంతికి లోనగుచున్నాడు.

పంకిల మగ్నమైన పాదములను నీటితో శుభ్రము చేసికొనునట్లు, భ్రాంతికి లోనైన మనస్సును ఆత్మవిచారము ద్వారా శుద్ధిచేసుకోవాలి. ఆత్మజ్ఞానము జగద్భ్రాంతిని నివారించును.

ఆచార్యోఽ రణి రాద్య స్స్యాదన్తే వాస్యుత్తరాణి తత్సంధానం ప్రవచనం విద్యాసన్ధిః సుఖావహః

ఆచార్యుడు క్రింది అరణి కాగా, శిష్యుడు పై అరణి ఆయెను. ఉపదేశము ఆ రెండింటి మధ్య నుండు మంథనకాష్ఠ మాయెను. ఈ విధముగా జరుగు జ్ఞాన నిర్మథ నాఖ్యానము వలన ఉత్పన్నమయ్యే జ్ఞానాగ్ని అజ్ఞానమును దగ్ధమొనర్చును.

మాయ విచిత్రమైనది. దీనిని విద్వాంసులు కూడా దాట నశక్తులై యున్నారు. భోగ్య వస్తువులు సారవంతములని తెలియుచున్నంత కాలము జీవి భ్రాంతికి లోనైయున్నా డనియే భావము. వధ్య స్థానమునకు పయనించే మనుజునకు భోగ్యవస్తువులు రుచించునా? మృత్యువు నిరీక్షించుచున్నదని గ్రహించిన సాధకుడు భోగ్యవస్తువులకై పరితపించడు.

దోషరహితమైన విషయములే జీవునకు నిత్యానందము నొసంగును. మానవ లోకములో నున్నట్లే స్వర్గలోకముల యందు కూడా అసూయ, ద్వేషము, స్పర్థలు, నాశములు గన్పట్టుచున్నవి. కనుక స్వర్గసుఖములు కూడా దుఃఖరూపములై పరిత్యజించ దగియున్నవి.

నిర్విఘ్నముగ సాగిన యజ్ఞముల ఫలముగ స్వర్గభోగములను మనుజుడు అను భవించును. పుణ్యకర్మల వలన ఆర్జించిన స్వర్గభోగములను, దేవతలవలె అనుభవించును. దివ్యమైన విమానముపై విహరించును. అప్సరసల మధ్య సంచరించును. గంధర్వాదులచే కీర్తింపబడును. ఈ ఆనందము శాశ్వతమని భ్రమించునే గాని పుణ్యము క్షీణించగనే పతనావస్థ తప్పదని గుర్తింపడు.

పొలములో ధాన్యమును పండించినట్లు, మానవ దేహ మనెడి క్షేత్రములో జ్ఞానమనెడి పంటను పండించుకోవాలి. ఇంద్రియలోలు డైన జీవునకు సుఖములేదు. కర్మ సుడిగుండములో తగులుకొనరాదు.

ఉద్ధవుడు శ్రీకృష్ణుని ప్రశ్నించుచున్నాడు: "దేవా! ముక్తి యనునది గుణసహి తునకు కలుగునా? లేక గుణరహితునకు కలుగునా? గుణసహితునకు ముక్తి కలుగు నన్నచో, దేహాది గుణయుతుడైన వాడు గుణముల వలన ఏర్పడు సుఖదుఃఖాలచే ఏల బద్ధుడు గాకుండును? అలాగాకుండా ముక్తి గుణరహితునకే యున్నచో, గుణములచే ఆవరింపబడనివాడు బద్ధు డెలా యగును? బంధమే లేనివానికి ముక్తి ఎలా సాసగును?

కథం వర్తేత విహరేత్ కైర్వా జ్ఞాయేత లక్షణైః

"దేవా! ముక్తుడైనవాడు ఎట్లు వర్తించును? ఎలా విహరించును? ఏ లక్షణముల ద్వారా తెలియబడును?

ఏత దచ్యుత మే బ్రూహి ప్రశ్నం ప్రశ్న విదాం వర నిత్యముక్తో నిత్యబద్ధ ఏక ఏవేతిమేభ్రమః

"కృష్ణా! ప్రశ్నలయొక్క స్వరూపము నెరిగిన వారిలో నీవు శ్రేష్ఠుడవు. నా ఈ ప్రశ్నకు సమాధానము ననుగ్రహింపుము. ఒకే యాత్మ నిత్యముక్తుడు, నిత్యబద్ధుడు ఎలా అగును? ఈ విషయమున నాకు గల భ్రమను తొలగింపుము" అనెను.

బద్ధజీవులు - ముక్తజీవులు

"ఉద్ధవా! ఆత్మకు బంధమోక్షములు లేవు. అది నిత్యముక్తము. మాయా నిర్మిత ములైన ఉపాధుల వలన ఆత్మకు బంధమున్నట్లు భ్రమ కలుగుచున్నది. ఉపాధి తొలగినపుడు ఆత్మ ముక్తమైనదని భావించుట జరుగుచున్నది. వాస్తవానికి ఆత్మ బంధ మోక్షాలకు అతీతము. నా అధీనములో యున్న మాయయే ఈ బంధమోక్షముల నాటకానికి సూత్రధారియు, పాత్రధారియునై యున్నది" అని శ్రీకృష్ణుడు తత్త్వసారము నెరింగించుట కుపక్రమించెను.

మనోనిర్మితమైన స్వప్నగత విషయములు మనస్సు కన్నా భిన్నము కానట్లు, దేహమునకు సంబంధించిన శోకమోహాదులు, సుఖదుఃఖాదులు దేహాదులకు కారణమైన మాయకన్నా అన్యము కానేరవు. ఈ ద్వంద్వములు వాస్తవానికి కల వలె అసత్యములే.

అనాదులైన విద్యావిద్యలు భగవంతుని అధీనములో యున్నవి. బంధమోక్షములకు ఇవియే కారణములుగా తెలియుచున్నవి.

బన్ధోఽస్యా విద్యయానాది ర్విద్యయాచ తథేతరః

అనాదులైన జీవులకు అవిద్యవలన బంధము, విద్యవలన మోక్షము కలుగును.

"బద్ధులగు జీవులు దుఃఖము ననుభవించుచుండగా, ముక్తులైనవారు నిత్య సుఖము ననుభవించుచున్నారు. వీరిరువురును ఒకే దేహమునం దున్నారు. వారి వైలక్షణ్యమును తెలిపెద నాలకింపుడు" అని శ్రీకృష్ణుడు చెప్పసాగెను.

దేహమనెడి వృక్షములో హృదయమనెడి గూడు కలదు. అందులో జీవేశ్వరు లనెడి రెండు పక్షులు నివసించుచుండును. వృక్షము నాశ్రయించి యున్న పక్షులు వృక్షము కన్నను వేరై యున్నట్లు, దేహము నాశ్రయించి యున్న ఈ జీవేశ్వరులు దేహవిలక్షణులై యున్నారు. జీవరూపుడగు పక్షి ఆ వృక్షము యొక్క ఫలముల ననుభవించుచుండగా, రెండవదియగు ఈశ్వర రూపపక్షి ఫలముల ననుభవింపక నిత్యానందరూపుడై యున్నాడు.

ఈశ్వరునికి తన స్వరూపము, జీవుని స్వరూపము తెలియును. జీవునికి తన స్వరూపము, ఈశ్వరస్వరూపము తెలియవు. అవిద్యాప్రభావమునకు లోనైన జీవుడు అనాదిగా బద్ధుడు. విద్యచే ప్రభావితుడై యున్న ఈశ్వరుడు అనాదిగా ముక్తుడు.

ముక్తుడైన పురుషుడు ప్రారబ్ధాధీనుడై దేహము నందున్నను, స్వప్నము నుండి మేల్కొనిన వానివలె దేహమునందు లేనివాని వలె యుండును. స్వప్నము నుండి మేల్కొనిన వానికి స్వప్నగత విషయములు అసత్యమని ఎలా తెలియునో, ముక్తపురుషునకు ఈ దేహాదులు, వాటికి సంబంధించిన సుఖదుఃఖములు అనిత్యములు అని తెలియును. మేల్కొనిన వానికి స్వప్నము నందలి విషయములతో సంబంధము లేనట్లు ముక్తుడైన దివ్యాత్మునకు దేహాదులతో సంబంధము ఉండదు.

బద్ధుడైన జీవుడు స్వరూపతః ముక్తుడే అయినను, మాయా ప్రభావితుడై, స్వప్నమును దర్శించు స్వప్నద్రష్టవలె, దేహముతో తాదాత్మ్యము చెంది సుఖదుఃఖముల ననుభవించుచుండును.

కర్తృత్వమే మనిషికి బంధము కాగా, కర్తృత్వ రాహిత్యము మోక్షము నందించుచున్నది. "నేను కర్త" ననుటయే బంధము. "నేను అకర్త" ననుటయే మోక్షము. బంధము కర్మాధీనము కాదు. భావాధీనము. భావము ఎవరికి శుద్ధిపడునో వారే నిర్మలరూపు లగుదురు. నిరంజనరూపు లగుదురు.

ఆకాశము అంతటా నిండియున్నను దేనిచేతను లిప్తముకాదు. సూర్యుడు జలమున ప్రతి ఫలించినను దానిచే అంటబడడు. వాయువు అంతట వీచుచున్నను సంగత్వము లేనిదియై యున్నది. విద్వాంసుడగు పురుషుడు ప్రకృతి యందున్నను దానిచేత బద్ధుడు కానేరడు.

వైరాగ్యవంతుడే ప్రకృతిని జయింప గలుగును. అట్టి వానిలో గుణదోషములు గోచరింపవు. తనను నిందించిన వారిపై విద్వాంసునకు క్రోధముండదు. స్తుతించు వారిపై ప్రేమ యుండదు. అతడు లౌకిక వ్యవహార విముఖుడు. ఈ స్థితిని పొందుటకు అనేక సాధనము లున్నవి. శుభప్రదములగు సాధన లన్నిటిలో భక్తియే శ్రేష్ఠమైనది.

శాస్త్ర విజ్ఞానమును చాలా మంది కలిగియుందురు. కాని భక్తిలేని దోషము వలన భగవ త్తత్వమును తెలియజాలరు. అట్టివారి శ్రమయంతయు గొడ్డుటావును పోషించినట్లు నిరుపయోగ మగును.

గాం దుగ్ధదోహా మసతీం చ భార్యాం దేహం పరాధీన మసత్ప్రజాం చ
విత్తం త్వ తీర్థీకృత మంగ వాచం హీనాం మయా రక్షతి దుఃఖ దుఃఖీ ॥

క్షీరము నీయని గోవు, అంకు నేర్పిన స్త్రీ, పరాధీన శరీరము, దుష్టుడైన పుత్రుడు, అపాత్ర దానము, భగవానుని స్తుతించని వాక్కు వ్యర్థములు. వీటిని కలిగి యున్నవాడు దుఃఖముల మీద దుఃఖముల ననుభవించును.

భగవంతుని యందు మనస్సును లగ్నమొనర్చుటకు భక్తియే ఉత్తమమైన సాధనము. భగవ ల్లీలావర్ణనము లేనిదే మనస్సు తృప్తి చెందదు. వేదాంతము భక్తియుత మైనపుడే రాణించును.

వేదాంతమును అధ్యయనము చేసిన చాలామందిని నేను చూసినాను. కానీ వారిలో కొందరు భగవంతునిపై విశ్వాసమును కోల్పోవగా, మరి కొందరు ఆ వేదాంతమును పొట్టకూటికై విక్రయించుకొనుచున్నారు. దీనికి కారణమేమిటో తెలుసా? వారిలో భక్తి లేకపోవుటయే. భగవద్గుణ శ్రవణ కీర్తనాదుల యందు ఆసక్తి లేకపోవుటయే.

కలి నహి యోగ యజ్ఞ విజ్ఞానా ఏక ఆధార రామ గుణగానా

"కలియుగములో శ్రీరాముని గుణగానము కంటెను మరియొక ఆధార మేదియును లేదు" అని సంత్ తులసీదాస్ గానము చేసెను.

భగవంతుని యందు అనన్యమైన ప్రేమభక్తి కలుగవలె నన్నచో ఏమి చేయవలెనో శ్రీకృష్ణుడు ఉద్ధవునికి తెలుపుచున్నాడు.

శ్రద్ధాలు ర్మత్కథాః శృణ్వన్ సుభద్రా లోక పావనీః
గాయన్ననుస్మరన్ కర్మ జన్మ చాభినయన్ ముహుః॥

"శ్రద్ధగలవాడవై నా కథల నాలకింపుము. నా అవతార విశేషములను గాన మొనర్పుము. నన్ను స్మరింపుము. నన్నభినయింపుము."

ఈ విధముగా జీవించుచున్నను దృఢమైన భక్తి కలుగవలె నన్నచో సత్సంగము అవసరమని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పెను. సత్సంగము నందు మనస్సు ఎవరికి శుద్ధిపడునో వారే ధ్యానము చేయుగలుగుదురు.

సత్సంగమహిమ వర్ణనాతీతము. అక్షరజ్ఞానము లేనివారై, శాస్త్రములు నేర్వకున్నను కేవలం సత్సంగము వలననే చాలామంది భక్తులు తరించినారు. పురుషులతో తిరిగితే పురుషుడవే కాగలవు. కానీ పురుషోత్తముడవు కాలేవు. పుణ్య పురుషులైన వారితో సంబంధము కలిగిన తప్పక నీవు తరించగలవు. ఇదియే సత్సంగము.

ముజ నకో తుజముక్తి సంతాచియ సంగతి

"హే పాండురంగా! నాకు నీవు ముక్తి నొసగ పనిలేదు. మహాత్ముల సాంగత్యమును కల్పించిన చాలును" అని సంత్ తుకారాం సెలవిచ్చాడు.

లవ మాత్ర సాధుసంగే సర్వసిద్ధి హమ్

"సత్సంగము కొద్దిగా లభించినను సర్వసిద్ధులు ప్రాప్తించును" అని చైతన్యమహాప్రభువు తెలిపినాడు.

పుణ్యపురుషుడగు సాధు సత్తముడు పురాణ పురుషుడగు పరమాత్మతో సఖ్యమును కలిగియుండును. అట్టి పుణ్యపురుషుని సఖ్యము మనకు లభించినచో పరమాత్మతో సంబంధము లభించినట్లే. ఇట్టి దివ్యసంబంధమును మన కొసగునది సత్సంగము. సత్సంగము సమస్త దోషములను పోగొట్టును. సత్సంగ సమయమున మనస్సు సంసారమును మఱచును. చెడు భావములను విస్మరించును. కొంతకాలమైనను మనస్సునకు ఈమాత్రము స్వస్థత కలిగించినచో అట్టి మనస్సు వినిర్మలమై, ధ్యానమునకు యోగ్యమగును. ఇది యంతయు సత్సంగము వలననే మనకు సంప్రాప్త మగును. కనుక సత్సంగము నెన్నడూ విడువరాదు. మరువరాదు. దూడ గోవును వదలనట్లు, భక్తుడు సత్సంగమును విడువకుండా పట్టుకొనవలెను.

సాధు మహిమ

ఉద్ధవుడు పరంధాముడగు శ్రీకృష్ణుని ప్రశ్నించుచున్నాడు: "దేవా! నీ గుణ గానములో తృప్తిచెందు సాధువు లనేకులు గలరు. కానీ ఎవరిని నీవు సాధువులని

గుర్తించెదవు? నీ యందు ఎట్టి భక్తిని సాధువు లాచరించి చూపవలెను? ప్రణతుడనైన నాకు ఈ విషయములను విశద పరచుము" అనెను.

కృపాలు రకృత ద్రోహ స్తితిక్షు స్సర్వ దేహినామ్

సత్యసారో౽నవద్యాత్మా సమః సర్వోపకారకః

"ఉద్ధవా! నా భక్తుడు దయామూర్తి, ఎవరికీ ద్రోహము చేయడు. క్షమాగుణము గలిగి యుండును. సత్యమే జీవిత సారముగ కలిగి యుండును. కల్మష మెరుగక యుండును. సమదర్శియై సర్వులకు ఉపకారము చేయుచుండును" అని సాధు మహిమను శ్రీకృష్ణుడు వర్ణింప సాగెను.

కామ వాసనలతో ఎవని బుద్ధి కలుషితము కాదో అతడే సాధువు. సాధకు డైనవాడు మనస్సులో పాపవాసన లేకుండా జీవించాలి. పాపవర్తనము కన్నను పాపవాసనయే ప్రమాదకరము. మనస్సులోని వాసనలే దేహము ద్వారా కర్మలుగా వ్యక్త మగుచుండును.

భక్తుడు మధురస్వభావము కలిగి యుండును. సదా మననశీలుడై యుండును. ఆకలిదప్పులను జయించి యుండును. శోకమోహాదులను దాటి యుండును. ఇతరులు తనను గౌరవించవలె నని భావింపడు. తానందరిని గౌరవించును.

భక్తి ఇతరులలో భగవంతుని దర్శింపజేయును. భక్తి లేని వ్యక్తి తాను అన్యులకు భగవంతుడుగా కనపడవలె నని యత్నించుచుండును. అందించే గుణము ఆనందము. అందుకునే గుణము బంధము.

భక్తుడు సర్వులకు మిత్రుడై మెలుగును. కృపామూర్తియై వెలుగును. పవిత్రుడై విరాజిల్లును. శాంతుడై భాసించును. భక్తులు కాగోరువారు కొన్ని కళ్యాణ గుణములను నేర్చుకొనవలెను. కొన్ని నియమాలను పాటించవలెను.

మల్లింగ మద్భక్త జన దర్శన స్పర్శ నార్చనమ్

పరిచర్యాస్తుతిః ప్రహ్వగుణ కర్మాను కీర్తనమ్

"ఉద్ధవా! నా మూర్తులను, నా భక్తులను దర్శింపవలెను. స్పృశింపవలెను. అర్చింపవలెను. స్తుతింపవలెను. సేవింపవలెను. నా గుణకర్మలను కీర్తింపవలెను.

మత్కథా శ్రవణే శ్రద్ధా మదను ధ్యాన ముద్ధవ

సర్వ లాభోప హరణం దాస్యేనాత్మ నివేదనమ్

"ఉద్ధవా! నా కథల నాలకించుట యందు శ్రద్ధ చూపవలెను. నన్ను సదా ధ్యానించు చుండవలెను. లభించిన దాని నంతటిని నాకు సమర్పింపుము. దాస్యభావముతో నిన్ను నాకు సమర్పించుకొనుము.

ఈ విధముగా భక్తి నలవరచుకొను పద్ధతిని గూర్చి శ్రీకృష్ణుడు అనర్గళంగా ప్రవచించ సాగెను.

భగవత్కథా శ్రవణము ద్వారా మనస్సును పరమాత్మ యందు లగ్న మొనర్పవలెను. పర్వదినాలలో విశేషముగా భగవద్భజన కొనసాగవలెను.

పరమాత్మను సదా మనస్సునకు జ్ఞాపకము చేయుట కొరకే పర్వదినము లేర్పడినవి. పండుగలలో మితిమీరి భుజించడము, చలన చిత్రములు వీక్షించడము చేయరాదు. ఆలయాలలో ఉత్సవములను నిర్వహించుట ఉత్తమము. కానీ ఆయా నిర్వహణలలో కీర్తికాంక్ష ఉండకూడదు. ఆధిక్యతను కనబరచు భావమును త్యజించాలి. సేవా భావముతో, భక్తి భావముతో ఆచరించాలి.

ఆలయ ప్రదేశాలను భక్తులు శుభ్రము చేయాలి. భగవంతుని ఆలయాలను నీవు శుభ్రము చేసినచో, నీ అంతఃకరణము పరమాత్మ శుభ్రము చేయును. దైవకార్యమునందు అభిమానాహంకారాదులు ఉండకూడదు. భగవత్సేవలను గోప్యముగా నుంచుకోవాలి. వెల్లడిచేయు బుద్ధి ప్రమాదకరము.

అపి దీపావలోకం మే నోపయుంజ్యా న్నివేదితమ్

"నాకు సమర్పించిన దీపకాంతులలో నీ కార్యముల నాచరింపకూడదు."

భక్తి హీనులగు కొందరు స్వామి కార్యములలో స్వకార్యములను నెరవేర్చుకొను చుందురు. ఆలయ మర్యాదలు, ఆలయ హుండీలు ఇత్యాది విషయములలో కడు జాగరూకులై వాటిని తమ స్వార్థానికి వినియోగించుకొనుచుందురు. అట్టివారు నరకము ననుభవింతురు.

భగవంతునికి సమర్పించనిదే ఏదియును స్వీకరింపరాదు. ఇదియే అర్పణబుద్ధి, సమర్పణబుద్ధి. భగవత్కృప వలననే మనకు సర్వమూ సిద్ధించుచున్నవి. ప్రదాతను మరచి భుజించున దేదియును ప్రసాదము గానేరదు.

యద్యదిష్ట తమం లోకే యచ్చాతిప్రియ మాత్మనః

"లోకములో నీకు అత్యంత ప్రియమైన, ఇష్టమైన వస్తువును నాకు సమర్పింపుము" అని భగవానుడు ఉద్ధవునకు తెలిపెను. ఈ విధమైన సమర్పణ అనంత ఫలము నిచ్చును.

ప్రాయేణ భక్తి యోగేన సత్సంగేన వినోద్ధవ

నోపాయో విద్యతే సమ్యక్ ప్రాయణం హి సతామహమ్ ॥

"ఉద్ధవా! సత్సంగమువలనను, భక్తి యోగము చేతను తప్ప మరొక ఉపాయముచేత మనుజుడు సంసారము నుండి తరింపలేడు. నేను సాధు సమాశ్రయుడను.

"ఉద్ధవా! నీవు నాకు సేవకుడవు, సుహృదుడవు. అందువలన అత్యంత రహస్యమైన విషయమును నీకు చెప్పబోవుచున్నాను. వినుము" అనెను.

సజ్జన సాంగత్యము - కర్మత్యాగము

మనస్సులో పలు విధములైన రుచులు, ఆసక్తులు తిష్ఠవేసి యుండును. వాటి నన్నిటిని మరపించి, మనస్సును శుద్ధి చేయునది సత్సంగము. సత్సంగ మనుగ్రహించు ఫలితమును ఏ యోగమును అనుగ్రహించలేదు. వేదములను చదువనివారు, మహాత్ముల

సేవకు నోచుకోనివారు, తపోనిష్ఠ తెలియని ఎందరో పుణ్యాత్ములు కేవలము సత్సంగము వలననే భగవానుని పొందినట్లు తెలుపుచూ, అట్టివారిలో శ్రేష్ఠులగు గోపికలను గూర్చి శ్రీకృష్ణుడు ఉద్ధవునికి తెలుపుచున్నాడు.

"ఉద్ధవా! వ్రజపురము నందలి గోవులు, మృగములు, వృక్షములు, లతలు, నాగులు మొదలైన మందచిత్తములు గూడా సత్సంగమహిమచే నన్ను పొంద గలిగినవి. గోపికలు నన్ను పొందిన రీతిన సాంఖ్యయోగాదుల నభ్యసించు యోగులు, వ్రత దానాదుల నాచరించు మనీషులు కూడా నన్ను పొందలేరు" అనుచూ గోపికల గాఢమైన ప్రేమను వివరింపసాగెను.

అక్రూరుడు బలరామ కృష్ణులను మధురకు గొనిపోవునపుడు గోపికలు తీవ్రముగా వ్యథ చెందిరి. కృష్ణ సమాగమము తప్ప వారికి ఏదియును రుచింపలేదు.

తాస్తాః క్షపాః ప్రేష్ఠతమేన నీతా మయైవ బృందావన గోచరేణ
క్షణార్ధ వత్తాః పునరంగ తాసాం హీనామయా కల్పసమా బభూవుః ॥

"ఉద్ధవా! పూర్వము గోపికలు బృందావనములో నాతో గూడి యుండినపుడు ఎన్నియో రాత్రులను అర్ధక్షణముగా గడిపినారు. నేను లేని కాలములో ఆ రాత్రులే వారికి కల్పమువలె దీర్ఘముగా తోచినవి."

సమాధిలో ప్రవేశించిన మునులవలె, సాగరమున ప్రవేశించిన నదులవలె గోపికలు కృష్ణుని యందు మనస్సును లీనమొనర్చి సర్వమును మరచినారు. కొందరు గోపికలకు శ్రీకృష్ణుడు పరమాత్మ యని తెలియును. కొందరికి తెలియదు. తెలియని వారు కేవలము కృష్ణుని మోహించియే అతనిని సమీపించినారు. సంగప్రభావము చేత వారు కృష్ణుని మహిమ నెరిగినవారై మనస్సును కృష్ణునియందే లగ్నమొనర్చి, సుదుర్లభమైన కృష్ణ సాయుజ్యమును పొందినారు. నిర్భయులైనారు.

జనులు ఏదో ఒక విధమైన భయముచే కలత చెందుచుందురు. కృష్ణ సమాగమ చిత్తులైనవారికి భయముండదు. శ్రీకృష్ణుడు సదా వారితోనే ఉన్నట్లు వారికి భావన కలుగుచుండును. నిరంతరము కృష్ణునితో కలసి జీవించు మనస్సును పొందిన పుణ్యాత్ములు సర్వులలో కూడ శ్రీకృష్ణునే దర్శించి ధ్యానింతురు.

సమస్తము నందును, సర్వప్రాణుల యందును ఈశ్వర చైతన్యమును దర్శించు విషయమున ఉద్ధవునకు సందేహము లుండెను. సృష్టి స్వరూపమును వివరించి, కర్మ త్యాగమును విశదపరచుట ద్వారా ఉద్ధవుని సంశయములను కూడా శ్రీకృష్ణుడు నివారించుచున్నాడు.

ఒక్క బీజము క్షేత్రమున పడి వివిధములైన శాఖా పత్ర పుష్ప ఫల శోభితమై అనేక విధముల గోచరించునట్లు, సర్వప్రాణుల కాధారమైన పరమాత్మ బీజమువలె అవ్యక్తుడై అద్వయుడై యుండి, తన మాయాశక్తి ద్వారా వాగింద్రియాది వికారములతో అనేక విధములుగ వ్యక్త మగుచున్నాడు.

వస్త్రము తంతువులతో గూడియున్నట్లు ఈ జగత్తంతయు పరమేశ్వరుని యందు ఓతప్రోతమై యున్నది. సంసారవృక్షము అనాదియై, కర్మరూపమై యున్నది. ఇది భోగములనెడి పుష్పములను, ముక్తియనెడి ఫలము నిచ్చునదియై యున్నది.

ఈ సంసార వృక్షమునకు పాపపుణ్యములను రెండు బీజములు గలవు. అసంఖ్యాక వాసనా సమూహామే దీనికి మూలము. త్రిగుణములే కాండము. పంచభూతములు దీనికి కొమ్మలు కాగా, పదునొకండు ఇంద్రియములు రెమ్మలై యున్నవి. వాత, పిత్త శ్లేష్మములను మూడు పట్టలు లేదా బెరళ్ళు గలదియై యున్నది. సుఖ దుఃఖములనెడి రెండు విధములైన ఫలములు గలదియై యున్నది. ఈ విశాలవృక్షము సూర్యమండలము వరకు వ్యాపించి యున్నది.

కామ్యకర్మల యందాసక్తులై, కాముకులైన గృహస్థులు ఈ వృక్షము నందలి దుఃఖరూప ఫలమును భుజించుచున్నారు. వివేకము కలిగిన సన్యాసులు సుఖరూప ఫలముల ననుభవించుచున్నారు. పరమాత్మ ఏకమే అయినను మాయాశక్తి చేత అనేకముగా గన్పట్టుచున్నాడు. ఈ విషయమును వందనీయులు, ఆరాధ్యులైన గురువుల ద్వారా తెలిసికొనిన వాడు వేదార్థ మెరిగినవా డగుచున్నాడు.

"ఉద్ధవా! నీవు కూడా గురువులను సేవించి, అనన్యమైన ఏకాంత భక్తిని పొందుము. జ్ఞానమనెడి కుఠారముచే అజ్ఞానమును ధ్వంసము చేయుము. సారరూపుడైన పరమాత్మను పొందుము. సాధనలను త్యజింపుము" అని శ్రీకృష్ణుడు తత్త్వమును బోధించెను.

హంసోపదేశము

సంసారమును స్మరించు మనస్సు సారరూపుడైన పరమాత్మను స్మరింపలేదు. గుణములే జీవుని సంసారమునకు బంధించుచున్నవి. సత్వ రజస్తమస్సులనెడి త్రిగుణములు బుద్ధి లక్షణములే గాని ఆత్మ లక్షణములు గానేరవు. మనుజునిలో భక్తి లోపించుటకు సత్వగుణము లేకపోవుటయే కారణమై యున్నది.

సత్వాద్ధర్మో భవే ద్వృద్ధాత్ పుంసో మద్భక్తి లక్షణః

సత్వగుణము వృద్ధినొందిన వానికి భగవద్భక్తి కలుగును.

సత్వగుణమును మనుజుడు పెంపొందించు కొనవలెను. సత్వవృత్తి ద్వారా రజస్తమో గుణములను జయింపవలెను. ఉపశాంతి రూపమగు సత్వముచే సాత్విక వృత్తులను కూడా జయింప వలెను. గుణములు జ్ఞాన ప్రతిబంధకములు. సత్వగుణము బంగారు సంకెలవలె ఉపయుక్తమై యున్నది.

సాత్వికమైన పదార్థముల నెవడు సేవించునో అట్టివానికి సత్వగుణము వృద్ధి చెందును. సత్వగుణ సంపన్నుడు ధర్మశీలు డగును. రజోగుణము వలన జీవుడు విషయ భోగాసక్తుడగును. తమోగుణము మనుజునిలో అజ్ఞానచీకటిని పెంపొందించును. సత్వగుణము

వృద్ధి చెందినచో రజస్తమో గుణములు వాటంతటవియే నశించును. అధర్మము నశించి మనుజునిలో ధర్మము వృద్ధియగును. సత్త్వగుణయుతములైన విషయములు ప్రశంసనీయములు. రజోగుణయుతములైన విషయములు ఉపేక్షణీయములు. తమోగుణ యుతమైన విషయములు గర్హనీయములు.

ఆత్మజ్ఞానము లభించువరకు జీవుడు సత్త్వగుణాభివృద్ధికై ప్రయత్నింపవలెను. దీని వలన వ్యక్తిలో ధర్మము వృద్ధిచెంది జ్ఞానోదయము కాగలదు. ఆ తరువాత ఉపాధి వినిర్ముక్తుడై జీవుడు జ్ఞానముతో శోభిల్లును.

వేణు సంఘర్షజో వహ్నిః దగ్ధ్వా శామ్యతి తద్వనమ్
ఏవం గుణవత్య యజో దేహః శామ్యతి తత్క్రియః ॥

వెదురుచెట్ల ఒరిపిడి వలన ఉద్భవించిన అగ్ని తన కాశ్రయస్థానమైన వనమును దగ్ధమొనర్చి తాను స్వయముగా శాంతించునట్లు, గుణ వ్యత్యాసముల వలన పుట్టిన దేహము తనలో అగ్నివలె పుట్టిన జ్ఞానము ద్వారా గుణములను నశింపజేసి తానుకూడా శమించుచున్నది.

సాత్త్వికవృత్తులు సుఖప్రదములు కాగా, రాజసిక, తామసిక వృత్తులు దుఃఖ రూపములై యున్నవి. ఆపదలకు కారణములని బాగుగ నెఱిగియు కుక్క, గాడిద, మేక మున్నగు జంతువులవలె దుఃఖములను భరించుచు మఱల ఆ విషయములనే మనుజు లెందులకు ఆచరించుచున్నారు? అని ఉద్ధవుడు భగవానుని ప్రశ్నించుచున్నాడు. ఈ విషయమున కలుగు సంశయములను శ్రీకృష్ణుడు నివృత్తి చేయుచున్నాడు.

వివేకశూన్యుడైన మానవునికి దేహమే తాననెడి ప్రమాదకరమైన బుద్ధి కలుగును. ఇట్టి దేహాత్మభావన వలన సత్త్వ ప్రధానమైన మనస్సును రజోగుణము ఆవరించును. రజోగుణముతో కూడిన మనస్సులో సంకల్ప వికల్పములు బయలు దేరును. ఈ ప్రపంచము సౌందర్య మందిరములా దర్శన మిచ్చును. స్త్రీ అన్న పానాది విచిత్ర భోగములు సముచితములై గన్పట్టును. ఈ విధమైన విషయ చింతనము కామమును కదలించును.

కామలోలుడు ఇంద్రియములకు వశుడగును. రజోగుణము వృద్ధి నొందుటచేత మోహభ్రాంతికి గురియగును. ఆ తరువాత కర్మవలయంలో చిక్కుకొనును. కామ్య కర్మలు దుఃఖప్రధానములని తెలిసియు తిరుగ వానినే మఱల మఱల ఆచరించును.

స్వ సంకల్పిత తన్మాత్రాజా లాభ్యన్తర వర్తి చ
పరాం వివశతా మేతి శృంఖలా బద్ధ సింహవత్ ॥

"తాను నిర్మించుకొనిన విషయము లనెడి వలలో చిక్కిన మానవుడు సంకెళ్ళచే బద్ధమైయున్న సింహము వలె పరాధీనుడై యున్నాడు" అని మహోపనిషత్తు వివేకహీనుని దుస్థితిని వివరించినది.

విషయములు శక్తివంతము లైనచో వివేకశూన్యుని వలె వివేకవంతుని కూడా భ్రమింప చేయవలెను. వ్యక్తిలోని అవివేకము వస్తువులకు, విషయాలకు విశేష సౌందర్యము నందించుచున్నది. వివేకియైన మానవుడు రజస్తమోగుణ యుతమైన మనస్సు ఆకర్షించు

చున్నను, అద్దానిని నిగ్రహించి, కర్మల యందలి దోషములను గాంచుచు, విషయముల యందు ఆసక్తిలేక చరించుచుండును.

"ఉద్ధవా! సాధకు డైనవాడు జాగరూకుడై యుండాలి. సోమరితనమును త్యజించాలి. శ్వాసను, ఆసనమును చక్కగా నిలుప గలగాలి. ఏకాగ్రతను కలిగి యుండాలి. సర్వాకర్షణల నుండి మనస్సును నిగ్రహించి నాయందు సమర్పించాలి. ఇదియే యోగమని నా శిష్యులగు సనక సనందనాది మునులు తెలిపియున్నారు" అని శ్రీకృష్ణుడు ముగించెను.

"కృష్ణా! సనకాదులు నీ శిష్యులని చెప్పుచున్నావు. మరి ఈ యోగమును వారికి నీవు ఎప్పుడు బోధించితివి? ఏ రూపముతో బోధించితివి? ఏ కాలమున బోధించితివి? ఆ విషయములను తెలిసికొన నిచ్ఛగించుచున్నాను" అని ఉద్ధవు డడిగెను. ఉద్ధవునికి శ్రీకృష్ణుడు తత్సంబంధమైన హంసేతిహాసమును బోధించుచున్నాడు.

బ్రహ్మమానసపుత్రులగు సనకాదులు ఒకనాడు తండ్రియగు బ్రహ్మదేవుని వద్దకేగి యోగము నందలి ఉత్తమమగు స్థితిని చెప్పవలసినదిగా కోరిరి.

"మానవుని మనస్సు సహజముగ విషయములచే ఆకర్షింపబడును. అలాగే విషయములు కూడా వాసనారూపమున మనస్సులో ప్రవేశించును. ఈ ఉభయ బంధములను నాశము చేయుట ఎట్లు?" అని సనకాదులు బ్రహ్మదేవుని ప్రశ్నించిరి.

బ్రహ్మదేవుడు స్వయంభువుయే అయినను, సృష్టికార్యము నందు విక్షిప్తచిత్తుడై నందున వారి ప్రశ్నలకు సమాధానము తీయలేకపోయెను. వెంటనే చతుర్ముఖుడు చతుర్భుజుడైన నారాయణుని చింతించెను. వెంటనే నారాయణుడు హంసరూపమును దాల్చి బ్రహ్మ ఎదుట ప్రత్యక్ష మాయెను.

సనకాది మునులు బ్రహ్మదేవుని ముందిడుకొని ముందడుగు వేసిరి. హంసకు నమస్కరించి "నీ వెవ్వడవు?" అని ప్రశ్నించిరి. అలా ప్రశ్నించిన మునులకు తాను హంసరూపముతో ఒసంగిన సమాధానమును శ్రీకృష్ణుడు ఉద్ధవునితో చెప్పుచున్నాడు.

శ్రీకృష్ణుడు సనకాదులతో ఇట్లు పలికెను: "బ్రాహ్మణులారా! మీరు ఇప్పు డడిగిన ప్రశ్న ఆత్మకు సంబంధించినదియా? లేక ఉపాధి యనబడు దేహమునకు సంబంధించి నదియా? ఆత్మను గూర్చిన దైనచో ఆత్మ అభిన్నము. అందు నానాత్వము అనూహ్యము. ఒకవేళ నేను మీకు సమాధాన మీయ దలచినచో దేని నాశ్రయించి చెప్పాలి?

"నీవెవరు?" అని మీ రడుగుట నాకు సముచితముగ లేదు. అభిన్నమైన ఆత్మలో ప్రత్యేకముగా చెప్పుటకు వ్యక్తిత్వ మెక్కడున్నది? ఒకవేళ దేహస్థాయి ననుసరించి భిన్నత్వమును ప్రతిపాదించెద మనిన దేహములన్నియు పాంచభౌతికములే. అలా చూచినచో దేహాదులు కూడ అభిన్నములే. అంతియే కాదు. ప్రపంచములో మనస్సుచేత, వాక్కుచేత, దృష్టిచేత తెలియబడు విషయములు కూడా ఆత్మ స్వరూపములే. ఈ సత్యములను తత్త్వవిచారము ద్వారా తెలిసికొనుడు" అని పలుకుచూ హంసరూపధారి యగు నారాయణుడు తత్త్వసారమును సనకాదులకు తెలిపెను.

మనుజుల చిత్తము విషయముల యందును, విషయములు చిత్తము నందును పరస్పరము ప్రవిష్టములై యున్నవి. ఈ రెండును బ్రహ్మరూపుడగు జీవునకు ఉపాధులే గాని స్వరూపములు గానేరవు.

విషయ చింతనము వలన చిత్తము విషయాసక్త మగుచుండును. వాస్తవానికి విషయములు చిత్త జనితములే. కనుక స్వరూపానుభూతి నొందగోరు ముముక్షువు చిత్త విషయముల రెండింటిని తెప్పగ త్యజింప వలెను. అవస్థాత్రయము కూడా వృత్తి సహితమే గనుక అదియును త్యజింప దగినదియే.

భోగముల ననుభవింపవలె ననెడి ఇచ్ఛయే జీవునకు బంధనములను తగిలించినది. విషయభోగము లన్నియు తుచ్ఛములని గ్రహించాలి. సంసారము అనిత్యమని భావించాలి. ఈ అనిత్య బంధములను తగిలించుకొని తల్లడిల్లుట కంటెను, వదిలించుకొని తరించుట శ్రేష్ఠతమము.

ధనాని భూమౌ పశవశ్చ గోష్ఠే భార్యా గృహద్వారి సుతా శ్మశానే
దేహ శ్చితాయాం పరలోక మార్గే ధర్మానుగో గచ్ఛతి జీవ ఏకః॥

మరణానంతరము ధనము భూమియందే యుండును. పశువులు శాలయందే యుండును. భార్య ఇంటివాకిలి వరకు రాగా, పుత్రులు శ్మశానము వరకు వత్తురు. దేహము చితివరకు వచ్చును. ధర్మ మొక్కటియే ఆ తరువాత జీవు ననుసరించి నడచును.

భేద జ్ఞానమువలన తెలియు జాగ్రత్ప్రపంచము స్వప్నము కన్నను అతీతమైనది కానేరదు. దేహాదులు అనిత్యములు. అట్టి దేహాదులకు కారణమైన కర్మలు, అట్టి కర్మల ఫలితముగా తెలియవచ్చు ఇహ స్వర్గ ఫలభోగము లన్నియు అనిత్యములే. స్వప్న తుల్యములే. ఉపాధులు కలిగిన అవస్థాత్రయము ఒక దానితో మరి యొకటి భేద పడుచున్నందున అవి ఏవియును అభిన్నమైన ఆత్మ కానేరవు.

గుణసహితమైన జాగ్రదాది అవస్థలు అవిద్యచేత కల్పింపబడినవి. అవిద్యను విద్యయే నశింప జేయును. కనుక సాధకుడైనవాడు జ్ఞానమనెడి ఖడ్గమును చేబూని సర్వానర్థముల కాధారమైన అహంకారమును నశింపజేయవలెను.

ఈ ప్రపంచము అనిత్యము. మనో కల్పితము. చంచలము. కొఱవిని గిరగిర త్రిప్పుట వలన ఏర్పడు అలాత చక్రమువలె భ్రాంతి రూపము. బ్రహ్మము అద్వయ సత్తా స్వరూపము. భేద మనునది భ్రాంతి రూపముగా తెలియుచున్నది. ఇది తెలిసినవాడే సిద్ధపురుషుడు. మత్తు పానీయముచేత ఉన్మత్తుడైనవాడు తన శరీరముపై నున్న వస్త్రమును గూర్చిన ఎఱుకలేనివా డగునట్లు, సిద్ధుడగువాడు దేహ విషయమునందు ఎఱుకలేనివాడై యుండును. ప్రారబ్ధాధీనమై దేహము చరించుచుండును.

సనక సనందనాది మునులకు ఈ విధముగా తత్త్వోపదేశము గావించిన పిదప శ్రీకృష్ణుడిలా పలుకుచున్నాడు:

"బ్రాహ్మణులారా! సాంఖ్య యోగములోని రహస్యవిషయము లన్నియు మీకు వివరించితిని. నేను విష్ణుదేవుడను. మీకు తత్త్వము నుపదేశించుటకే హంసరూపము నెత్తి వచ్చితిని" అనెను.

పరమాత్మ బోధతో సంశయరహితులైన సనకాదులు శ్రీహరిని అర్చించిరి. ఆయన మహిమలను వర్ణించిరి. బ్రహ్మదేవుడు చూస్తుండగనే శ్రీనారాయణుడు అంతర్హితుడై విష్ణులోకమునకు వెళ్ళెను.

భక్తి వైభవము

సులభమైన భక్తియోగ మహిమను వర్ణించుట సులభ సాధ్యముకాదు. ఎంత వర్ణించినను తక్కువగనే యుండును. అనన్యచిత్తులైన భక్తులు అనాయాసముగా జ్ఞానమును పొందెదరు. భక్తిద్వారా పరమాత్మను అందరిలో దర్శించే భాగ్యమునకు భక్తుడు నోచుకొనును.

"ఉద్ధవా! భక్తులు నాకు అత్యంత ప్రియులు. వారు నన్ను తప్ప అన్యమైన వాటిని అభిలషించరు. సమచిత్తులై యుందురు. శమ దమ యుక్తులై యుందురు. శాంత రూపులై యుందురు. నీవు కూడా అట్టివాడివే. నీపై నా కున్న ప్రేమ శ్రీదేవిపై కూడా లేదు.

న తథా మే ప్రియతమ ఆత్మయోని ర్న శంకరః
న చ సంకర్షణో న శ్రీ ర్నైవాత్మా చ యథా భవాన్ ॥

"నీవు నాకు ప్రియతముడ వైనట్లుగ నా కుమారుడగు బ్రహ్మ, నా స్వరూపమగు శంకరుడు, సోదరుడగు బలరాముడు, భార్యయగు శ్రీదేవి; ఇంత ఏల? చివరకు నా మంగళరూపము కూడా నాకు ప్రియములు గావు,"

భక్తులపై భగవానుని కున్న ప్రేమ వర్ణనాతీతము. మహాభక్తుడైన ఉద్ధవుడు శ్రీకృష్ణుని అమృతమయమైన పై వచనముల నాలకించి పులకాంకితు డయ్యెను. భగవత్ప్రేమను గాంచి తన్మయు డయ్యెను. శ్రీకృష్ణుడు పవిత్రులైన భక్తుల వైభవములను ఆగకుండా కీర్తించుచున్నాడు.

నిరపేక్షం మునిం శాన్తం నిర్వైరం సమదర్శనమ్
అను వ్రజామ్యహం నిత్యం పూయే యే త్యంఘ్రి రేణుభిః ॥

"ఉద్ధవా! నేను నిరంతరము విషయముల యందు ఆసక్తి లేనివాడు, మనన శీలుడు, శాంతుడు, నిర్వైరుడు, సర్వత్ర సమదర్శనము చేయువాడు నగు భక్తుని అనుసరించుచుందును. భక్తుల పాదధూళి ద్వారా బ్రహ్మాండములను పావనము చేయుదును.

"భక్తులు అనన్య మనస్కులై నన్నే అర్చించుచుందురు. విషయ వాసనలకు లొంగక నన్నే ధ్యానించుచుందురు. భక్తికి నేను వశుడనైనంతగ యోగము, సాంఖ్యము, ధర్మము,

తపస్సు, దానాదులు వశము చేసికొనజాలవు. అనన్యభక్తి ప్రభావము చేతనే నేను వారికి లభ్య మగుచున్నాను."

భక్తిః పునాతి మన్నిష్ఠా శ్వపాకానపి సంభవాత్

"అనన్యభక్తి చండాలురను కూడా పవిత్ర మొనర్చును."

పుణ్యాత్ములైన కొందరు సత్యమునే పలుకుచుందురు. కొందరు ప్రాణులయెడ దయ కలిగియుందురు. కొందరు తపస్సు చేయుచుందురు. మరి కొందరు దానము లిచ్చుచుండగా, ఇంక కొందరు జ్ఞానాభిలాషులై యుందురు. కానీ భగవంతునియందు భక్తిలేనిచో ఇవి ఏవియును మనస్సును పవిత్ర మొనర్పలేవు. జ్వలించు అగ్ని కట్టెలను భస్మము చేయునట్లు, భక్తి సమస్త పాపములను భస్మ మొనర్చుచున్నది. అగ్నిచే సంతప్తమైన స్వర్ణము మాలిన్యమును పోగొట్టుకొని శుద్ధి పడినట్లు, మానవుల చిత్తము కూడా భక్తిచే పవిత్రమై, వాసనలను పోగొట్టుకొని శాంతించును. అట్టి శాంతభక్తులను భగవంతుడు క్షణకాలము కూడా విడువడు.

తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి

"భక్తులకు నేను దూరముగాను. అలాగే భక్తులు నాకు దూరముగా నుండరు" అని శ్రీకృష్ణుడు భగవద్గీత - ఆత్మసంయమయోగము నందు తెలిపియున్నాడు.

"భక్తి పరమోత్కృష్ట మైనది. కాటుక వలన నేత్రములలోని దోషములు నశించి సూక్ష్మమైన వస్తువులనుగాంచు శక్తి కలుగునట్లు, పరమపవిత్రమగు భక్తి మనస్సులోని మాలిన్యములను తొలగించి, మనస్సును శుద్ధిపరచి సూక్ష్మ రూపుడైన పరమాత్మను దర్శించునట్లు చేయును. కనుక మనస్సు సదా పరమాత్మనే స్మరించునట్లు భక్తుడు జాగరూకుడై యుండవలెను. విషయములను ధ్యానించు మనస్సు విషయ మగ్నమై యుండును. పరమాత్మను ధ్యానించు చిత్తము పరమాత్మ యందే లయించును.

"పువ్వు వికసించగనే దాని పరిమళము వెదజల్ల బడునట్లు భక్తి విరబూయగానే దాని లక్షణములు ప్రస్ఫుటముగా వ్యక్తమగును. భక్తి గల దివ్యాత్మునకు భగవద్గుణకీర్తనల యందు చిత్తము ద్రవించి దేహము పులకాంకిత మగును. కంఠము గద్గద మగును. అశ్రువులు రాలుచుండును.

మద్భక్తి యుక్తో భువనం పునాతి

"ఉద్ధవా! అట్టి నా భక్తుడు ముల్లోకములను పావన మొనర్చును."

"భగవద్భక్తి ప్రేమ మయము. భక్తి యనెడి దీపము ప్రేమ యనెడి తైలములో దేదీప్యమానంగా వెలుగును. కామ మనెడి జలముతో ఆరిపోవును. భక్తుని హృదయములో కామ పిశాచము ప్రవేశింపకూడదు. కనుక భక్తుడు స్త్రీ సాంగత్యమును త్యజింప వలెను. స్త్రీ సాంగత్యము వలన ఏర్పడు క్లేశములు మరి ఏ దుర్గుణము వలనను కలుగవు. స్త్రీల సాంగత్యమునే కాదు, వారితో సాంగత్యము గలవారి స్నేహము కూడా మంచిది కా"దని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పుచున్నాడు.

స్త్రీణాం స్త్రీ సంగినాం సంగం త్యక్త్వా దూరత ఆత్మవాన్

"భక్తుడైనవాడు స్త్రీ సాంగత్యమును, వారితో సఖ్య మొనర్చు వారి సాంగత్యమును వదలి దూరముగా నుండవలెను" అని శ్రీకృష్ణుడు చెప్పగా విని సంతసించిన ఉద్ధవుడు ధ్యానయోగమును గూర్చి తెలుపవలసినదిగా శ్రీకృష్ణుని ప్రార్థించెను. పరంధాముడగు శ్యామసుందరుడు ధ్యానయోగమహిమను వివరించుటకు పూనుకొనినాడు.

ధ్యాన వైభవము

హెచ్చుతగ్గులు లేని ఆసనమందు ధ్యానయోగి సుఖముగ ఆసీనుడు కావలెను. శరీరమును సమముగా యుంచి, చేతులను ఒడిలో యుంచుకొనవలెను. దృష్టిని నాసాగ్రము నందు నిలుపవలెను. ప్రాణాయామమును క్రమముగ చేయవలెను.

మూలాధారము నుండి తామర నాలిపోగు వలె శిరస్సు వరకు విచ్ఛిన్నం గాకుండా యున్న హృదయము నందలి ఘంటానాదము వంటి ఓంకారమును పంద్రెండు అంగుళముల వరకు ప్రాణవాయువుతో గూడ పైకి తీసుకొని వెళ్ళి ఆ ఓంకారమును స్వరముతో కలుపవలెను. ఈ విధముగా ప్రతిరోజు మూడు కాలము లందు ఓంకారముతో గూడ ప్రాణాయామము నభ్యసించిన ఒక్కమాసము రోజులలో ప్రాణక్రియ స్వాధీన మగును.

ఆ తరువాత దేహాంతర్గతమైన పద్మరూప హృదయము నందు శ్రీకృష్ణుని ధ్యానింప వలెను. భగవానుని సుప్రసన్నమైన సర్వావయవముల యందు మనస్సును లగ్న మొనర్పవలెను. మనస్సును నిగ్రహించి ధ్యానమూర్తి మీదనే ఉంచవలెను.

ఇంద్రియాణీన్ద్రియార్థేభ్యో మనసాఽఽకృష్య తన్మనః
బుద్ధ్యా సారథినా ధీరః ప్రణయే న్మయి సర్వతః ॥

"ఇంద్రియములను మనస్సు ద్వారా ఆయా ఇంద్రియ విషయముల నుండి మరల్చి బుద్ధి యను సారథి ద్వారా 'సర్వాంగ శోభితుడనగు నా యందు దృఢముగా లగ్నము చేయవలెను."

ఆ తరువాత పరమాత్ముని సర్వాంగముల యందు లగ్నమై యున్న చిత్తమును ఉపసంహరించి మందస్మితమగు వదనారవిందమునే ధ్యానింపవలెను. అలా స్థిరపడిన చిత్తమును మరల ఉపసంహరించి దహరాకాశము నందుంచ వలెను. ఆ తరువాత దానినుండి కూడా ఆకర్షించి శుద్ధ బ్రహ్మమునందు ఉంచవలెను.

భగవంతుని సర్వాంగములను చింతించుట ధారణ యగును. వదనారవింద మనెడి ఒకే అంగమును ధ్యానించుటను ధ్యానమందురు. ధ్యానము నందు మనస్సు సంకల్పములకు దూరమగును. నిర్విషయచిత్తము ధ్యానచిత్తమని భావము. ఈ స్థితిలో ధ్యానమును సాగించు ధ్యాత ధ్యేయరూపుడగు పరమాత్మతో ఏకమగును. సర్వమును మరచి

మనస్సును భగవానుని యందుంచును. ఆ తరువాత తాను పరమాత్మ యందే యుండును. తనలో పరమాత్మ యుండును. అద్వయ చైతన్యము అనుభూతానుభవముగా మారును.

ఏవం సమాహిత మతిః మామే వాత్మాన మాత్మని
విచష్టే మయి సర్వాత్మన్ జ్యోతి ర్జ్యోతిషి సంయుతమ్

"ఈ విధముగా చిత్తమును నియమించిన పురుషుడు జ్యోతి యందు గూడిన జ్యోతివలె తన యందు ఆత్మ రూపుడనైన నన్ను గాంచును, నాయందు తనను గాంచుచుండును."

ఈ విధముగా ఎవరు తీక్ష్ణమైన ధ్యానమును సాగించుచుందురో అట్టివారు ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికము లనెడి మూడు విధములైన భ్రాంతులనుండి విడివడుదురు. ద్రష్ట దృశ్య దర్శనాది త్రిపుటి అంతరించగా శాశ్వతమైన పరమ శాంతిని పొంది తరించెదరు.

"ఉద్ధవా! జితేంద్రియుడు, స్థిరచిత్తుడగు యోగి తన మనస్సును నా యందే నిలుపును. అట్టివానికి అణిమాది సిద్ధులు అనాయాచితముగ ప్రాప్తించును."

అష్టసిద్ధులు - అంతరాయములు

"కృష్ణా! నీవు కర్మఫల ప్రదాతవు. యోగఫలము నిచ్చునది కూడా నీవే. అచ్యుతా! ఏ యోగముచే ఏ విధమైన సిద్ధికలుగును? సిద్ధులెన్ని? యోగులకు సిద్ధుల నిచ్చు నీ నుండి ఆయా విషయములను వినగోరుచున్నాను" అని ఉద్ధవుడు శ్రీకృష్ణునితో పలికెను. ముఖ్యమైన అష్టసిద్ధులను, అముఖ్యమైన దశసిద్ధులను గూర్చి శ్రీకృష్ణుడు వివరించుచున్నాడు.

"ఉద్ధవా! ధ్యానయోగ సిద్ధిని పొందిన జ్ఞానులు, సిద్ధులు పదునెనిమిది విధములని వివరించిరి. వానిలో అష్టసిద్ధులు నాయందే యున్నవి. మిగిలిన పది విధములగు గౌణ సిద్ధులు సత్త్వ గుణోత్కర్షకు హేతువులై యున్నవి" అని పలుకుచూ శ్రీకృష్ణుడు వాటిని గూర్చి విపులముగా వివరించెను. అష్టసిద్ధులను మొదట వివరించుచున్నాడు.

1. అణిమ :-

మిక్కిలి సూక్ష్మ రూపమును బొందుటను "అణిమ" అందురు. పంచభూతములకాధారమైన తన్మాత్ర లనెడి సూక్ష్మ భూతముల యందు ఎవడు చిత్తము నుంచునో వాడు అణిమ సిద్ధిని పొందును.

2. మహిమ :-

మిక్కిలి స్థూల రూపమును బొందుటను "మహిమ"యందురు. సమిష్టి బుద్ధి నుపాధిగా కలిగి యున్న ఈశ్వరుని యందు మనస్సును స్థిరముగా యుంచి ఉపాసించువాడు మహిమ సిద్ధిని పొందును.

3. లఘిమ :-

మిక్కిలి తేలిక రూపమును బొందుటను "లఘిమ" యందురు. వాయువు మున్నగు భూతముల పరమాణువులను ఉపాధిగా పొందియున్న ఈశ్వరుని యందు చిత్తము నుంచిన యోగి లఘిమ సిద్ధిని పొందుచున్నాడు.

4. ప్రాప్తి :-

ఇంద్రియములతో ఇంద్రి యాధిష్ఠాన దేవతలను దర్శించుట "ప్రాప్తి" యగును. అనగా నేత్రేంద్రియము ద్వారా దానికి అధిష్ఠాన దేవత యగు ఆదిత్యుని దర్శించ గలుగుట యని భావము. సాత్త్వికాహంకారమును ఉపాధిగా గల ఈశ్వరుని యందు స్థిరముగా చిత్తము నుంచిన యోగి ప్రాప్తి సిద్ధిని పొందుచున్నాడు.

5. ప్రాకామ్య :-

లౌకిక, పారలౌకిక పదార్థములను దర్శించి, అనుభవించు సామర్థ్యమును "ప్రాకామ్య" మందురు. క్రియాశక్తి ప్రధానమగు మహత్తత్త్వమును ఉపాధిగా గల ఈశ్వరుని యందు బుద్ధి నుంచిన యోగి ప్రాకామ్య సిద్ధిని బొందుచున్నాడు.

6. ఈశిత్వ :-

మాయ నుపాధిగా కలిగిన ఈశ్వరుని యొక్క అంశలగు జ్ఞాన వీర్యాదులను ప్రకోపింప జేయుట "ఈశిత్వ" మనబడును. మాయను నియమించు ఈశ్వరుని యందు మనస్సును నిలిపిన యోగి అంతఃకరణాదులను ప్రేరేపించు ఈశిత్వ సిద్ధిని బొందుచున్నాడు.

7. వశిత్వ :-

విషయ భోగ విరక్తి "వశిత్వ" మనబడును. షడ్గుణైశ్వర్య సంపన్ను డగు నారాయణుని యందు మనస్సు నిల్పిన యోగి వశిత్వ సిద్ధిని బొందుచున్నాడు.

8. కామావసాయత :-

సమస్త కోరికలు ఉపశమించుటను "కామావసాయత" మందురు. నిర్విశేష బ్రహ్మము నందు మనస్సు నుంచిన యోగి కామావసాయత యను సిద్ధిని బొందుచున్నాడు. ఈ విధములైన నా ఈ అష్టసిద్ధులు స్వాభావికములు, నిరతిశయము లని చెప్పబడినవి.

గౌణ సిద్ధులు అనగా గుణముల వలన పుట్టిన సిద్ధులు దశ విధములుగ యున్నవి. అవి (1) ఆకలి దప్పులు లేకుండుట (2) దూర ప్రదేశము నందున్న విషయముల నాలకించుట (3) దూరదృశ్యములను గాంచుట (4) దేహము మనోవేగముతో కోరిన ప్రదేశమునకు వెడలుట (5) కోరిన రూపమును ధరించుట (6) అన్య దేహాదులలో ప్రవేశించుట (7) దేవతల క్రీడా విలాసములను తిలకించుట (8) సంకల్పములను సిద్ధించుకొనుట (9) అడ్డులేని ఆదేశమును కలిగియుండుట (10) కోరినపుడు దేహమును త్యజించుట - ఈ పదియును గుణజాత సిద్ధులని పిలువబడినవి.

క్షుద్ర సిద్ధులు ఐదు విధములుగా యున్నవి. అవి (1) త్రికాలజ్ఞత్వము (2) శీతోష్ణ సహిష్ణుత్వము (3) అన్యుల మనస్సు నెరుగుట (4) అగ్ని, సూర్యుడు, జలము, విషము మున్నగు వాని ప్రభావముల నాపుట (5) అపజయము నెఱుగ కుండుట - ఈ ఐదును క్షుద్రసిద్ధులని పిలువబడినవి.

ఈ విధములగు యోగ సాధనలచే నన్నుపాసించువారు ఆయా సిద్ధులను పొంద గలుగుదురు. భక్తుడైన వానికి సిద్ధుల యందును, వానిని ప్రదర్శించువాని యందును ఆసక్తి యుండదు. ఇంద్రియములను జయించి, మనస్సును భగవంతుని యందే యుంచిన భక్తులకు సర్వ సిద్ధులు అనాయాచితముగనే లభ్యమగును.

ఒకనాడు జ్ఞానదేవ, నామదేవులు తీర్థయాత్రలకై బయలుదేరి వెళ్ళు చుండిరి. మార్గ మధ్యమున యోగిపుంగవు డగు జ్ఞానదేవునకు నామదేవుని గూర్చిన ఒక సంశయము మనస్సులో కదలెను. నామదేవునకు సిద్ధత్వము ప్రాప్తించినదా? లేదా? యనెడి శంక కలిగెను. పరీక్షించి చూడవలెనని అభిలాష కూడా కలిగెను.

జ్ఞానదేవుడు తన యోగశక్తి ప్రభావముచే నామదేవునిలో ప్రాణశక్తిని కదలించి పిపాసను ప్రకోపింప జేసెను. అదే సమయానికి అరణ్యములో దిగుటకు వీలులేని మంచి నీటి బావిని కూడా నిర్మించెను. తనకు కూడా దాహముగా నున్నదని పలికి నామదేవుని ఆ బావి వద్దకు నడిపించెను.

ఆ బావిలోని నీటిని పానము చేయుట ఎలాగో వారికి అవగతము కాలేదు. యోగ శక్తి సమన్వితుడైన జ్ఞానదేవుడు శుక రూపమును ధరించి బావిలోని కురికి, నీటిని పానము చేసి, సంతుష్టచిత్తుడై గట్టు మీదికి చేరెను.

"నామదేవా! చూసితివా యోగమహిమ! నీవు కూడా యోగమును నేర్చి యుండినచో ఈ నాడు దప్పికను నా లాగే తీర్చుకొని యుండెడివాడవు. నీ కాల మంతయు భక్తి యందే సాగిపోయెను" అని జ్ఞానదేవుడు పలికెను.

"మహాత్మా! నాకు ఆ విషయముల యందు ఆసక్తి లేదని మీకు తెలుసు. దేవా! నారుపోసిన వాడు నీరు పోయక మానునా? దప్పికనిచ్చిన వాడే నీటిని సమకూర్చును. అంతయూ పాండురంగని కృప" యని పలుకుచూ, పరవశించిన హృదయముతో పాండురంగని దివ్య నామమును కీర్తించుచు నాట్యమాడసాగెను.

బావిలోని నీరు పైకి ఉబుకసాగెను. క్షణకాలములో నీరు పైకి వచ్చి గట్టు దాకెను. పరమభక్తుడగు నామదేవుడు దోసిటితో నీటిని తీసికొని పానము చేసెను. ఈ వింత దృశ్యమును గాంచుచున్న జ్ఞానదేవుల వారినిగాంచి, వినమ్రుడై నమస్కరించుచు నామదేవుడు ఇలా పలికెను: "మహాత్మా! తమరు యోగి పుంగవులు. యోగమహిమచే చిలుక రూపమును ధరించి, కూపమున ప్రవేశించి, నీటిని పానం చేయగలిగినారు. ఈ నామదేవునకు యోగము తెలియదు. భగవద్భియోగములో తపించే, పరితపించే ఆవేదనయే, ఆర్తియే తెలియును. యోగము నాశ్రయించిన మీరు ప్రయత్నము ద్వారా

సిద్ధిని పొందినారు. యోగేశ్వరుడైన పరంధాముని ఆశ్రయించిన వారికి సర్వసిద్ధులు అప్రయత్నముగనే సిద్ధించును" అనెను.

యల్లబ్ధ్వా పుమాన్ సిద్ధో భవతి అమృతో భవతి తృప్తో భవతి

"అట్టి పరాభక్తిని పొందిన పురుషుడు సిద్ధు డగుచున్నాడు. అమృతు డగుచున్నాడు. తృప్తుడగుచున్నాడు" అని నారద భక్తి సూత్రములలో తెలుప బడినది.

సిద్ధత్వ మనగా అణిమాది సిద్ధులు గావేరవు. నిజభక్తునకు అలాంటి సిద్ధుల యందు అభిరుచి యుండదు. చౌకబారు గారడీ ప్రదర్శనల యందు ఆసక్తి యుండదు. సిద్ధత్వమనగా వచ్చిన కార్యము సిద్ధించినది యని భావము. మనుజుడు ఈ ప్రపంచమునకు ఎందులకు అరుదెంచినాడు? భగవత్సాక్షాత్కారము కొరకే గాని అన్య ఫలముల నాశించి కాదు. అట్టి భగవత్కార్యము ఫలించినదని, సిద్ధించినదని అర్థము. అంతేగాక నిజభక్తుడు పైన చెప్పిన యోగసిద్ధు లన్నియు తన సాధనలకు అంతరాయములని కూడా భావించును.

అంతరాయాన్ వదన్త్యేతా యుంజతో యోగ ముత్తమమ్
మయా సంపద్య మానస్య కాలక్షపణ హేతవః ॥

"శ్రేష్ఠతమమైన భక్తియోగము ద్వారా నన్ను పొందగోరు యోగికి ఈ సిద్ధులు విఘ్న కరములగును. ఇవి కాలమును గడుపుకొనుటకు మాత్రమే ఉపకరించునని పెద్దలు చెప్పుదురు."

"ఉద్ధవా! నేను సర్వసిద్ధులకు కారణమై యున్నాను. ప్రభువునై యున్నాను. కనుక సిద్ధులను వాంఛించు యోగుల కన్నను సిద్ధత్వమును ప్రసాదించు నన్ను భజించు భక్తులే ధన్యులగుదురు" అని శ్రీకృష్ణుడు యోగమహిమ వివరణమును సమాప్తి చేసెను.

విభూతి సందర్శనము

శ్రీకృష్ణుని ద్వారా యోగ విజ్ఞానమును శ్రవణము చేసిన పిదప భగవ ద్విభూతులను తెలిసికొనవలయు నని ఉద్ధవునకు అభిలాష కలిగెను. శ్రీకృష్ణుని ఉద్ధవుడు ఇలా అడిగెను: "భగవాన్! నీవు అనంతుడవు. సృష్టి స్థితి లయములకు కారణభూతుడవు. మహర్షులు నిన్ను ఏయే రూపములతో అర్చించిరో, ఏయే భూతముల యందు నిన్ను దర్శించి ఉపాసించిరో, అట్టి నీ రూపములను, విభూతులను గూర్చి నాకు వివరింపుము. "**నమామి తే తీర్థ పదాంఘ్రి పద్మమ్**" సమస్త తీర్థములకు ఆశ్రయమైన నీ పాదపద్మములకు నమస్క రించుచున్నాను" అనెను.

"ఉద్ధవా! ప్రశ్నించుటలో నీవు శ్రేష్ఠుడవు. కురుక్షేత్రములో అర్జునుడు నన్నీ ప్రశ్ననే అడిగెను. నేను పరమగతిని. సూత్రాత్ముడను. నా విభూతులను నీకు తెలిపెదను. వినుము.

"ఉద్ధవా! వేదవిదులలో నేను హిరణ్యగర్భుడను. మంత్రములలో ఓంకారమును, అక్షరములలో అకారమును, దేవతలలో ఇంద్రుడను, బ్రహ్మర్షులలో భృగువును, రాజర్షులలో మనువును, దేవర్షులలో నారదుడను, ధేనువులలో కామధేనువును.

"సిద్ధులలో నేను కపిలుడను. పక్షులలో గరుడుడను. దైత్యులలో ప్రహ్లాదుడను, గజములలో ఐరావతమును. దీప్తిమంతములైన వారిలో సూర్యుడను. మనుజులలో రాజును. నదులలో నేను గంగను. జలాశయములలో సముద్రమును. దుర్గమ స్థానములలో హిమాలయమును. వృక్షములలో అశ్వత్థమును.

"పురోహితులలో వశిష్ఠుడను. వ్రతములలో అహింసా వ్రతమును. అష్టాంగ యోగములలో సమాధిని. బ్రహ్మచారులలో సనత్కుమారుడను. ఋతువులలో వసంత ఋతువును. మాసములలో మార్గశిర్షమును.

"యుగములలో కృతయుగమును. పండితులలో శుక్రాచార్యుడను. భగవద్భక్తులలో ఉద్ధవుడను. కిం పురుషులలో హనుమంతుడను. రత్నములలో పద్మరాగమును. వీరులలో అర్జునుడను. విద్యాధరులలో సుదర్శనుడను.

"ఉద్ధవా! లెక్కించుటకు ప్రారంభించినచో ఈ ప్రపంచములోని పరమాణువు లన్నింటి నైనను లెక్కింపవచ్చును. కానీ నా విభూతులను లెక్కించుట ఎవ్వరికిని సాధ్యముకాదు. ఉద్ధవా! నీవు అడిగితివి గాన సంక్షిప్తముగా కొన్ని విభూతులను తెలిపితిని. వాస్తవానికి ఇవి సత్యస్వరూపములు కావు. మనోవికారములే. వీటి యందు మనస్సును నిలుపకుము.

"ఉద్ధవా! నీవు వాక్కును నిరోధింపుము. మనస్సును నిగ్రహింపుము. ప్రాణమును నియమింపుము. ఇంద్రియములను అరికట్టుము. బుద్ధిని సంయమనము చేయుము. వీటివలన నీవు మరల సంసారమునందు ప్రవేశింపకుందువు. ఈ విధముగా నీవు నిగ్రహింప గలిగినచో తప్పక కృతకృత్యుడ వయ్యెదవు" అని శ్రీకృష్ణుడు విభూతివర్ణనమును సమాప్తి చేసెను.

వర్ణాశ్రమ ధర్మములు

"ప్రభూ! నీవు ఇంతవరకు తెలిపిన భక్తి లక్షణమగు ధర్మమును ఎవడు ఎట్లు ఆచరింప గలుగునో తెలిపెడి వర్ణాశ్రమ ధర్మములను వివరింపుము", అని ఉద్ధవు డడుగగా పరుల కుపకరించునవి, మోక్షప్రద మైనవి యగు భాగవత ధర్మములను శ్రీకృష్ణుడు ఉపదేశించెను.

"ఉద్ధవా! కృత యుగము నందు వర్ణాశ్రమములు లేవు. "హంస" యనెడి వర్ణ మొక్కటియే యుండెను. పుట్టుకతోనే ప్రతి మనుజుడు అనన్య భక్తియుతుడై ఉండెడివాడు. జనులు కృతకృత్యు లయ్యెడివారు. అందుచేత ఆ యుగమునకు కృతయుగమని పేరు

వచ్చినది. ఈ యుగమున ఓంకార మొక్కటే వేదముగా నుండెను. యజ్ఞయాగాది కర్మ లేవియును అపుడు ఉండెడివి కావు" అని శ్రీకృష్ణుడు ధారావాహికంగా చెప్పసాగెను.

త్రేతాయు గారంభమున పరమాత్మ నుండి వేదము లావిర్భవించెను. యజ్ఞములు ప్రారంభమాయెను. ఈ యుగమున విరాట్పురుషుని ముఖము నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు ఆవిర్భవించిరి. ఈ విధముగా వర్ణము లేర్పడెను.

విరాట్పురుషుని జఘన ప్రదేశము నుండి గృహస్థాశ్రమము, హృదయమునుండి బ్రహ్మచర్యాశ్రమము, వక్షఃస్థలము నుండి వానప్రస్థాశ్రమము, శిరము నుండి సన్యాసా శ్రమము లావిర్భవించినవి. ఈ విధముగా ఆశ్రమము లేర్పడినవి.

శమోదమ స్తప శ్శౌచం సంతోషః క్షాన్తి రార్జవమ్
మద్భక్తిశ్చ దయా సత్యం బ్రహ్మ ప్రకృతయ స్త్విమాః ॥

శమము, దమము, తపస్సు, శౌచము, సంతోషము, క్షమ, ఋజుత్వము, నాయందు భక్తి, కరుణ, సత్యము. ఇవి అన్నియు బ్రాహ్మణుని స్వభావములని గ్రహింప వలెను.

తేజో బలం ధృతి శ్శౌర్యం తితి క్షౌదార్య ముద్యమః
స్థైర్యం బ్రహ్మణ్య మైశ్వర్యం క్షత్ర ప్రకృతయ స్త్విమాః ॥

తేజస్సు, బలము, ధైర్యము, శౌర్యము, తితిక్ష, ఔదార్యము, ఉద్యమము, స్థైర్యము, బ్రహ్మణ్యత, ఐశ్వర్యము. ఇవి క్షత్రియుని స్వభావములని గ్రహింపవలెను.

ఆస్తిక్యం దాననిష్ఠా చ అదంభో బ్రహ్మ సేవనమ్
అతుష్టి రర్థోపచయైః వైశ్య ప్రకృతయ స్త్విమాః ॥

ఆస్తిక్యము, దానశీలత, అదంభిత్వము, బ్రాహ్మణసేవ, ధనాది సంపదలచే తృప్తి లేకుండుట. ఇవి వైశ్యుని స్వభావములు.

శుశ్రూషణం ద్విజగవాం దేవానాం చాప్య మాయయా
తత్ర లబ్ధేన సంతోషః శూద్ర ప్రకృతయ స్త్విమాః ॥

విప్రులకు, ఆవులకు, దేవతలకు నిష్కపట భావముతో సేవ చేయుట, దానిచే లభించిన దానితో తృప్తి చెందుట యనునవి శూద్రుని స్వభావములు.

అశౌచ మనృతం స్తేయం నాస్తిక్యం శుష్క విగ్రహః
కామః క్రోధశ్చ తర్షశ్చ స్వభావోఽ న్త్యవ సాయినామ్ ॥

అశౌచము, అసత్యము, దొంగతనము, నాస్తికత్వము, అకారణ కలహము, కామము, క్రోధము, పేరాశ. ఇవి అంత్యజుని స్వభావములు.

బ్రహ్మచర్యాశ్రమము

బ్రహ్మచర్యమును స్వీకరించువాడు గర్భాదానాది సంస్కారములను క్రమముగా స్వీకరించి, ద్వితీయ జన్మమగు ఉపనయనమును పొంది, ఆచార్యునిచే ఆమంత్రితుడై, ఇంద్రియములను నిగ్రహించినవాడై, వేదము నభ్యసింపవలెను. బ్రహ్మచారి విధులన్నియు తెలిసి, వాటిని పాటింపవలెను.

బ్రహ్మచారి ఆచార్యుని బాధించరాదు. సర్వదేవతారూపు డైన ఆచార్యునిలో దోషములను చూడరాదు. గురువు వెడలునపుడు ఆయనకు వెనుక నడువవలెను. భృత్యునివలె నడువవలెను. విశ్రాంతి సమయమున గురువు దగ్గర ఆసీనుడై పాదసేవ చేయవలెను. ఆసీను డైనపుడు చేతులు జోడించి నమస్కరించుచు గురువు ఆదేశములకై ఎదురు చూచువాడై యుండాలి.

బ్రహ్మచారి పాటింపవలసిన విధులను శ్రీకృష్ణుడు మహాత్ముడైన ఉద్ధవునకు తెలుపుచున్నాడు.

బ్రహ్మచారి స్త్రీలతో ఎక్కువగా భాషించరాదు. పొరపాటున కూడా వారిని తాకరాదు. పరిహాసమును పరిత్యజించాలి. ఈ విధముగా చరించు బ్రాహ్మణుడు అగ్నివలె ప్రకాశించును. ఈ కర్మానుష్ఠానము వలన అంతఃకరణ శుద్ధిపొంది, భక్తి కలవాడగును. ఆచారవంతుడే ఆత్మవిద్యను పొందగలుగును.

బ్రహ్మచర్యాశ్రమము కూడలి వంటిది. అక్కడ నుండి సకాముడైనచో గృహస్థాశ్రమము లోనికి వెళ్ళవచ్చును. లేదా నిష్కాముడైనచో వానప్రస్థాశ్రమము లోనికి వెళ్ళవచ్చును. లేదా నిష్కామసన్న్యాసమును స్వీకరింపవచ్చును.

గృహస్థాశ్రమము

గృహస్థాశ్రమములో ప్రవేశింపగోరువాడు వయస్సులో తనకంటె చిన్నది యగు కులీనురాలును వివాహము చేసికొనవలెను. అభిలాషతో తక్కువ కులములోని స్త్రీని వివాహము చేసికొనవచ్చును(వర్ణాంతర వివాహము).

"ఉద్ధవా! తాను ధర్మబద్ధముగా జీవించుచు, భక్తులకు లేదా ఆర్తులకు, బాధితులకు సహాయము చేయుచుండవలెను. అట్టి వానిని సముద్రములో మునిగిపోవు వానిని నావ రక్షించునట్లు నేను రక్షింతును" అని శ్రీకృష్ణు డనెను.

గృహస్థుడు సంసారిగా ఉండాలి. కానీ సంసారమును మోయరాదు. అనాసక్తుడై జీవించవలెను. సదా భక్తితత్పరుడై యుండవలెను. ఇహలోక సుఖములు, స్వర్గలోక భోగములు అనిత్యములని తెలియవలెను. స్వజన బాంధవ్యము స్వప్నతుల్యమని భావించి జీవించవలెను.

పుత్ర దారాప్త బంధూనాం సంగమః పాంథ సంగమః
అనుదేహం వియంత్యేతే స్వప్నో నిద్రానుగో యథా ॥

పుత్రులు, భార్య, ఆప్తులు, బంధువుల తోడి సమాగమము బాటసారుల తోడి సమాగమము వంటిది. మేల్కొని నపుడు స్వప్నదృశ్యము లెలా అదృశ్యము లగునో అలాగే కుటుంబీకుల సంబంధము గూడ దేహమున్నంత వరకే తెలిసి ఆ తరువాత నశించును.

ఈ విధముగా గృహజీవనమును అవగత మొనర్చుకొని ఇంటిలో అతిథివలె జీవించవలెను. అహంకార, మమకారములు లేనివాడై యుండవలెను. అట్టివాడు బంధములలో చిక్కుకోడు. గృహస్థుడు గృహమునందే నిలిచి భక్తి చేయవచ్చును. పుత్రవంతు డైనచో సన్న్యాసమును స్వీకరింపవచ్చును.

అహో మే పితరౌ వృద్ధౌ భార్యా బాలాత్మజాఽఽత్మజాః
అనాథా మామృతే దీనాః కథం జీవన్తి దుఃఖితాః ॥

"నా తల్లిదండ్రులు వృద్ధులు. నా భార్య చిన్నపిల్లల తల్లి. పుత్రులు నన్నాశ్రయించు కొని యున్న దీనులు. దిక్కులేనివారు. నేను లేకున్న వారెట్లు జీవింతురు?"

ఈవిధమైన అప్రస్తుత ప్రసంగము చేయు గృహస్థుడు వ్యర్థుడు. గృహాసక్త చిత్తుడు. అహంకారయుతుడు. జీవిత లక్ష్యము లేనివాడు. గర్వితుడు. వచ్చిన పనిని మరచి తుచ్ఛమైన విషయాలతో ముచ్చిక నేర్పరచుకొనినవాడు.

సర్వుల నుద్ధరించుటకు పరమేశ్వరు డున్నాడు. ఇంటిలో ఉండినా, వీధిలో యుండినా అహంకారరహితుడై కర్తృత్వ భోక్తృత్వ అభిమానాలకు దూరుడై జీవించు విధానమును గృహస్థుడు అలవరచుకొనవలెను.

వానప్రస్థాశ్రమము

ఇది తృతీయాశ్రమము. తురీయమునకు చివరి సోపానము. గృహస్థాశ్రమమును పూర్తి చేసుకొనిన మనుజుడు తపము నాచరించు ఆసక్తితో అడవుల కేగుటయే వానప్రస్థాశ్రమము. వానప్రస్థాశ్రమమున ప్రవేశింపవలె నని భావించు వ్యక్తి సతీసమేతుడై వెడలవలెను. ఒకవేళ సతి ఇచ్ఛగించనిచో ఆమెను పుత్రుల రక్షణలో నుంచవలెను. లేదా ఆమెకంటూ ప్రత్యేక జీవనము నేర్పాటు చేయవలెను.

అపక్వాహారములను భుజించుచు అరణ్యముల యందు వసింపవలెను. విలువైన దుస్తులను ధరింపరాదు. కేశములను, నఖములను తొలగించరాదు. మూడువేళల స్నాన మాచరింపవలెను. భూమిపై పరుండవలెను. సంపదలను పరిత్యజించవలెను. నిష్కాముడై కర్మల నాచరింపవలెను. కఠోరతప మాచరింపవలెను.

వానప్రస్థుడు పై చెప్పిన రీతుల జీవితమును కొనసాగించి, పూర్ణ వైరాగ్యవంతు డైనపుడు సన్న్యాసమును స్వీకరింప వచ్చును. అది కూడా నిరపేక్షుడై నిర్వర్తించాలి.

జనులు ఉద్విగ్నహృదయులైరి. దుఃఖాతిశయముచే మూర్ఛిల్లిరి. మూర్ఛ నుండి మేల్కొనిన పిదప కృష్ణవియోగ దుఃఖముచే కలతచెందినవారై త్వరత్వరగా సముద్రతీరమును చేరిరి.

బలరామకృష్ణులు కనబడ నందున దేవకి, రోహిణీ, వసుదేవాదులు స్మృతిని కోల్పోయి మూర్ఛిల్లిరి. కృష్ణవియోగ దుఃఖభారమును మోయలేక ప్రాణములను విడిచిరి. అప్పటికి చేరిన యాదవ స్త్రీ లందరు తమ పతుల దేహములను ఆలింగనము చేసికొని చితుల నధిరోహించిరి. బలరాముని భార్యలు ఆయన దేహమును, వసుదేవ పత్నులు వసుదేవుని దేహమును, శ్రీకృష్ణుని కోడండ్రు ఆయన కొడుకుల దేహములను ఆలింగనము చేసికొని చితుల నధిరోహించిరి. రుక్మిణీదేవి మొదలగు శ్రీకృష్ణ సతులు శ్రీకృష్ణుని యందే చిత్తమును నిలిపిన వారై అగ్నిలో ప్రవేశించిరి.

ఈ భయానక సన్నివేశమును గాంచి అర్జునుడు దుఃఖతప్త హృదయుడాయెను. కురుక్షేత్రమున శ్రీకృష్ణుడు బోధించిన ఉపదేశమును స్మృతికి తెచ్చుకొని తన్ను తాను ఓదార్చుకొనెను. సంతతిలేక మరణించిన వారికి అర్జునుడు పిండోదకాది క్రియలు గావించెను.

శ్రీకృష్ణుడు ద్వారకను వదలగానే ఆయన నివసించిన ప్రదేశమును మాత్రము వదలి మిగిలిన ద్వారకానగరమును సంతటిని క్షణకాలములో సముద్రుడు ముంచి వేసెను. భక్తులను రక్షించుటకై శ్రీకృష్ణపరమాత్మ ద్వారకయందు తన మందిరములో నేటికీ దర్శన మొసంగుచునే యున్నాడు. ద్వారకానాథుని దర్శించి సేవించిన వారికి మోక్ష ద్వారములు తెరువబడును.

మృతులు గాక మిగిలిన స్త్రీలను, బాలురను, వృద్ధులను అర్జునుడు ఇంద్రప్రస్థమున ఉంచెను. అనిరుద్ధుని కుమారుడగు వజ్రుని రాజును జేసెను.

య ఏత ద్దేవ దేవస్య విష్ణోః కర్మాణి జన్మ చ
కీర్తయే చ్ఛ్రద్ధయా మర్త్యః సర్వ పాపైః ప్రముచ్యతే

దేవదేవుడైన శ్రీకృష్ణ భగవానుని అవతార లీలలను, జన్మ విశేషములను మిక్కిలి భక్తిశ్రద్ధలతో కీర్తించువారు సర్వోపద్రవముల నుండి విడివడుదురు. ముక్తిని పొందగలరు.

ఏకాదశ స్కంధము సమాప్తము

.... ఓం ....

ఉపోద్ఘాతము

ఇది ద్వాదశ స్కంధము

శిరోఽపి తు ద్వాదశ ఏవ భాతి

ద్వాదశ స్కంధము భగవానుని మస్తకమై యున్నది. ఇందులో ఆశ్రయలీల గలదు. కలియుగమున ప్రదర్శింపబడే కల్మషముల నన్నింటిని ఈ స్కంధము ముంజేతి కంకణము వలె వివరిస్తుంది. ఈ స్కంధమును చదువునపుడు భాగవతము నేటికాలమున రచించితిరా? యనెడి సంశయము కలుగును. త్రికాలముల నెరిగిన వ్యాసభగవానుడు నేటి పరిస్థితులను ఆనాడే దర్శించి ఏనాటికీ వాడని జ్ఞాన ప్రసూనములను మన కందించినారు. ఈ స్కంధమున కలి నివారణార్థం భగవానుడు కల్క్యవతారమును ఎక్కడ, ఎప్పుడు, ఎందుకు, ఎలా ధరించునో చక్కగా వివరించెను.

కలిమలము తొలగుటకు కీర్తనయే మార్గమని ఈ స్కంధమున మనకు తెలియును. భగవానుని కీర్తి మన హృదయములో ఆవిష్కరింపచేయునది కీర్తన ఒక్కటియే. ఆర్తితో కీర్తించువారు భగవద్దీప్తిని బొంది తరింతురు యని నిరూపించును.

గంగాతీర్థము పవిత్రమైనది. జీవుల శ్రమలను తొలగించి, పాపములను హరించు పావన నదీమతల్లిగా పేరొందినది. కానీ కృష్ణకథ యనెడి జ్ఞానగంగ ఉద్భవించగనే గంగానది యొక్క ప్రాశస్త్యము తగ్గిపోయినదని మహాత్ములు భావించారు. గంగాదేవి పాపములను పోగొట్టును. పుణ్యమును అందించును. కానీ మోక్షమును ప్రసాదించలేదు. కృష్ణకథ యొక్కటియే మోక్షమును ప్రసాదించును. కృష్ణనామము సర్వతీర్థమయమని మహాత్ముల అభిప్రాయము. అనుభవము.

జన్హవీ జాన్హవీ జ్యాతాయీః ఉత్తమ్ హరావయా శ్రమ్ భావికాంచే
తుకామ్హణే ఆమ్హీ ఝూలోః పుణ్యవంత్ సేవిలే అమృత్ నామతీర్థ్

"హే పాండురంగా! భక్తుల శ్రమను హరించే పావనగంగ నీ చరణముల నుండి చరించింది. నామతీర్థమును సేవించి మేము పుణ్యవంతులమైనాము;" యని తుకారాం గానం చేశారు.

ముక్తి మార్గంలో దారిబత్తెముగా కీర్తనామృతము సిద్ధపరచబడి ఉంది. ఆశ్రయరూపుడైన పరమాత్మను చేరేందుకు శుభఘడియ సమీపించింది.

మరి.........ఇంకేమిటి? ఆనంద యాత్రలో భగవానుని జేకొడుతూ ఓడలా సాగిపోవుటయే........

చైతన్య భాగవతము

ద్వాదశ స్కంధము

ఈ ద్వాదశస్కంధము నందు పదమూడు అధ్యాయములు గలవు. ఇందు మొదటి ఆరు అధ్యాయములు శుకబ్రహ్మ పరీక్షిత్తునకు చెప్పగా మిగిలిన ఏడు అధ్యాయములు శౌనకాది మునులకు సూతమహర్షి చెప్పెను.

ఉక్తస్త్రయో దశాధ్యాయై ర్ద్వాదశే త్వాశ్రయ స్మృతః

పదమూడు అధ్యాయములు కలిగిన ఈ ద్వాదశ స్కంధములో ఆశ్రయలీల వర్ణింపబడినది.

యదుకుల నాయకుడగు శ్రీకృష్ణుడు వైకుంఠ ప్రయాణలీల గావించిన పిదప అవనిపై ఏవి రాజులు పాలించిరో తెలుపుడని పరీక్షిత్తు శుకబ్రహ్మను అడిగెను. శుకమహర్షి వివరించ సాగెను.

బృహద్రథుని వంశములోని చివరివాడగు పురంజయుడు రాజగును. అతని మంత్రి శునకుడు. అతడు తన ప్రభువైన పురంజయుని చంపి, తన కుమారుడగు ప్రద్యోతుని రాజును చేసెను. ప్రద్యోతుని కుమారుడు పాలకుడు.

పాలకుని కుమారుడు విశాఖయూపుడు. అతని కుమారుడు జనకుడు. జనకుని పుత్రుడు నందివర్థుడు. నందివర్థుని పుత్రుడు శిశునాభుడు. అతని కుమారుడు కాకవర్ణుడు. కాకవర్ణుని కుమారుడు క్షేమధన్వుడు. అతని పుత్రుడు క్షేత్రజ్ఞుడు. క్షేత్రజ్ఞుని సుతుడు క్షత్రధర్మజుడు. ఈ విధముగా రాజుల పరంపర వంశతటిని ద్వాదశ స్కంధము ప్రథమాధ్యాయమున శ్రీశుకుడు వివరించును. ఈ పరంపరలో ఈనాడు మనము

చరిత్రలో చదువుకొనుచున్న మౌర్యరాజుల పేర్లను కూడా తెలుపుట గమనింప దగియున్నది. చంద్రగుప్తుడు, అశోకుడు అను నామములను కూడా ఉదహరించును.

కలి మహిమ

కలియుగములోని రాజులు దుష్టులై దేశమును అస్తవ్యస్తముగా తయారు చేయుదురు. బ్రాహ్మణులు ఉపనయనరహితులై యుందురు. కర్మభ్రష్టులై యుందురు. మ్లేచ్ఛులు రాజ్యమేలుదురు.

రాజులు అసత్యపరులై యుందురు. అధర్మపరులై యుందురు. క్రోధము గలవారై యుందురు. పరస్త్రీలను వాంఛింతురు. పరధనమును కాంక్షింతురు. గోవులను వధింతురు. అధిక హర్ష విషాదములతో వర్తించుచుందురు. అల్పాయుష్కులై యుందురు. మ్లేచ్ఛులు ప్రజలను నశింపజేయుదురు.

ప్రజలు రాజులను గూర్చి, వారి శీలమును, ఆచారములను గూర్చి వాదించు కొనుచుందురు. పరస్పరము కలహించుకొనుచుందురు. రాజుల ఆగ్రహమునకు గురియై నశించుచుందురు. ధర్మము నశించును. సత్యము కనుమరుగవును. దయ అగోచరమగును. గొప్పతన మంతయు ధనము మీదనే ఆధారపడి యుండును. ధర్మము, న్యాయము అనునవి బలము గలవాని సొమ్ములై యుండును. ధనమున్నచో ఉత్తముడగును. బలమున్నచో గుణవంతుడగును.

క్రయ విక్రయాదుల యందు వాక్చాతుర్యమే ప్రధానమగును. ధర్మమడుగంటును. స్త్రీ పురుషులు కామాతురతతో వర్తించుటయే గాని, ఆచార వ్యవహారముల నెరుగరు. బ్రాహ్మణుడు యజ్ఞోపవీతమునే బ్రాహ్మణ్యమని భావించును గాని, సంధ్యావందనాది కార్యములను త్యజించియుండును.

శాస్త్రీయ విధులు లేకనే వివాహములు జరుగును. ధనమునకు ప్రాధాన్యమే గాని గుణమునకు ప్రాధాన్యత యుండదు. కడుపు నింపుకొనుటయే ప్రధాన కర్తవ్యము గాని ధర్మాచరణము గాదని భావింతురు. అధర్మపరుడైనను తనదే ధర్మమని బిగ్గరగ వాదించును. అట్టివానిని అందరు సమర్థించుదురు. సత్యవాదిని గుర్తించరు.

మంచి చేసినను కీర్తి కొరకే చేయుచుందురు. ఈ విధముగా రాజ్యమంతయు చెడ్డవారితో నిండి యుండును. క్షామము లెక్కువగా యుండును. క్షేమము కొరవడి ప్రజలు వలసబోవు చుందురు. వ్యాధుల చేత పీడింపబడుచుందురు. అల్పాయుష్కులై యుందురు. వేదమార్గము దారి తప్పును. పరిపాలించువారు దోపిడి చేయుచుందురు. ప్రజలు దొంగతనము చేయుచుందురు. అసత్యమును పలుకుచుందురు. హింసాప్రవృత్తి కలిగి యుందురు. వారి సోదరిని వీరు, వీరి సోదరిని వారు వివాహ మాడుదురు. ఈ విధముగా ప్రజలు ధర్మభ్రష్టులై, దుష్టకార్యముల నాచరించువారు కాగా ధర్మరక్షణము గావించుటకు భగవానుడు సత్త్వగుణముతో అవతరించును.

శంబల యనెడి గ్రామములో బ్రాహ్మణుడైన విష్ణుయశస్సు డను వాని ఇంటిలో కల్కి అవతరించును. దేవదత్తమను గుఱ్ఱము నెక్కి వచ్చును. దుష్టులైన రాజులను వధించును. భగవానుడు కల్కిగా అవతరించినపుడు కృతయుగము వచ్చును. పుష్యమీనక్షత్రము నందు ఒకేరాశిలో సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి కలసి యుండిన అది కృతయుగ మనబడును.

విష్ణోర్భగవతో భానుః కృష్ణాఖ్యోఽసౌ దివం గతః
తదా విశత్కలి ర్లోకం యత్పాపే రమతే మనః

"కృష్ణ భగవానుడు మానవలోకమును వదిలి వైకుంఠమును చేరగనే కలియుగము ప్రవేశించినది. ఈ కలియుగమున పాపము చేయుటకే మనసు ఉత్సాహమును చూపుచుండును" అని శుకమహర్షి చెప్పుచున్నాడు.

"పరీక్షిన్మహారాజా! రాజ్యములు శాశ్వతములు గావు. ఎందరో రాజులు ఈ భూమిని పరిపాలించారు. ఈ భూమి నుండి నిష్క్రమించారు కూడాను. దేహము నిత్యమని భ్రమించి చెడు మార్గమును చరించువారు చెడిపోవుదురు. నరకప్రాయు లగుదురు.

"నా తండ్రుల నుండి రాజ్యము నాకు సంక్రమించినది. నా రాజ్యము నా పుత్రునకే చెందాలి యనెడి మమతను రాజులు కలియుగములో కలిగియుందురు. ఆత్మ నెరుగని కారణమున దేహమునే ఆత్మగా భావించిన ఈ రాజులు భూమియంతయు తమదే యని భావింతురు. చివరగ ధరిత్రిని, దేహమును రెండిటిని త్యజించి నిష్క్రమింతురు. రాజా! ఎందరో రాజులు ఈ ధాత్రిని పాలించారు. పౌరుషమునే ప్రధానముగా కలిగినవారైనందున ఈ నాడు వారి కథలే మిగిలినవి. వారు మాత్రము మిగలలేదు" అని శుకమహర్షి తెలిపిరి.

కాలము ఎవ్వరినీ కనికరించదు. మంచిచెడులే మనతో కలసి ప్రయాణిస్తాయి. శీలవంతులే పుణ్యవంతులై మనగలరు. సన్మార్గమే సదా అనుసరణీయ మార్గము.

క॥ ధర్మము సత్యము గీర్తియు, నిర్మలదయ విష్ణుభక్తి నిరుపమభువ న
త్కర్మమహింసావ్రతమును, నర్మిలిగలవారెపుణ్యు లవనీనాథా!

అని పుణ్యశీలురను గూర్చి కీర్తించెను. పుణ్య మాచరించని వారు బ్రతుకులో నాణ్యత తెలియనివారై నామమాత్రముగా మిగిలిపోవుదురు.

తే॥ ఈ జగం బేలు తొల్లింటి రాజవరులు కాలవశమున నాయువుల్ గోలుపోయి
నామమాత్రావశిష్టు లై వారు గాన మంపవలవదు మమతను బెంపుతోడ.

అని శుకమహర్షి పరీక్షిత్తునకు ప్రబోధించెను.

కలిలో కలిమిలేములు

భూమిని జయింపవలె నని భూపురు లాలోచించుచుందురు. భూమిని రాజులు జయింపవచ్చు. కానీ ఆ భూమితో పాటు వారు జీవింపగలరా? చావు చేతిలో లట

బొమ్మలవంటివారగు ఈ రాజులు తనను జయించుటకు శ్రమించుచున్నారు అని భూమి పరిహాసము చేయుచున్నదని శుకమహర్షి పరీక్షిత్తునితో చెప్పుచున్నాడు.

"ఈ భూమి నాది" యని ప్రతి రాజు పలుకును. నాది యని పలికినవాడు ఈ ప్రపంచంలో ఎంతకాలముండును? అంతమున అవని గర్భములోనే తలదాచుకొనును. ఈ సత్యమును వివేకవంతులైన రాజులు కూడా గ్రహించుట లేదు యని భూదేవి పరిహాసించుచున్నది. ఎంతో కాలము సమరమొనర్చి ప్రపంచము సంతటిని గెలువ జూతురే గాని సమీపమున యున్న మృత్యువును గూర్చి ఆలోచించరు.

"రాజ్యమును జయించుట గొప్ప గాదు. శత్రువులను గెలుచుట కీర్తి కాదు. ఇంద్రియములను జయించుటయే నిజమైన యశస్సు. ఇంద్రియములే వాస్తవానికి మనుజునికి శత్రువులు. దూరంగా యున్న శత్రువుల కన్నా ఎప్పుడూ మనతోనే యున్న ఇంద్రియము అనెడి శత్రువులే ప్రమాదకరమై యున్నారు. ఇంద్రియములను జయించిన వానికే అనంతమైన ఫలము లభించును.

కియదాత్మ జయస్యై తన్ముక్తి రాత్మ జయే ఫలమ్

"ఇంద్రియ జయమునకు ఫలము మోక్షమే" యని శుకమహర్షి చెప్పుచున్నాడు.

"ఎందరో రాజులు "**యథాగతం గతాః**" ఎలా వచ్చారో అలాగే వెళ్ళారు. అయినను మిగిలియున్నవారు సత్యమును గ్రహించుట లేదు. రాజ్యకాంక్ష మమకారమును పెంచును. తండ్రీకొడుకులను శత్రువులుగా మార్చును. అన్నదమ్ముల మధ్య వైరుధ్యములను సృష్టించును. ఈ విధంగా ఎవరికీ చెందని భూమి కొరకు పరస్పరము కలహించుకొని మృతిచెందుచుందురు. మరణము గల ఈ రాజు లెల్లరు మరణ మెరుగని నన్ను వాంఛించి, అకృతార్థులుగా మారుచున్నారు. కథావశేషులై మిగులుచున్నారు.

"రాజా! ఇంతవరకు భూదేవి తెలిపిన సత్య విషయములను నీకు తెలిపితిని. దీనినే భూమిగీత యందురు. ఇచ్చట తెలిపిన రాజుల విషయమును తెలుసుకొనుట వలన పరమార్థము ఇసుమంతైనను లభించదు. నీలో వైరాగ్య జ్ఞానములు వృద్ధి నొందునని భావించుటయే ఈ భూమి గీతను చెప్పుటలోని ప్రధానాశయమై యున్నది. మమకారమును నశింప చేయుటయే ముఖ్య కర్తవ్యముగా భావించదగినది. సమస్త అశుభములు దూరమైనపుడే శ్రీకృష్ణుని యందు చిత్తము సంపూర్ణముగా లగ్నమగును" అని శుకబ్రహ్మ చెప్పెను.

సగర మాంధాతాది షట్చక్రవర్తులను, హిరణ్యకశిపు వృత్ర రావణాది రాక్షసులును ధరణీ మమత్వమును మనమున దాల్చి, దానికై శ్రమించి చివరికి శ్మశానమున విశ్రమించిరే గాని ఏమియును సాధించలేక పోయిరి. ఈ మమత్వము అన్నియునూ మిథ్యా భూతములని విశ్వసించి, తదుపరి పరిత్యజించి హరి నామామృత పానముచేసి తరించుటయే ఏకైకమార్గమని శుకమహర్షి తెలిపెను.

తే॥ ఉత్తమశ్లోకుఁడన నెవ్వఁ డున్నవాఁడు సన్నుతుం డగు నెవ్వఁడు సకలదిశల
నట్టి పరమేశ్వరుని జిత్తమందు నిలిపి తద్గుణంబులు వర్ణింపు ధరణినాథ!

"పుణ్యచరితా! మునిశ్రేష్ఠా! ఈ కలిదోషములను ఏ ఉపాయముతో నశింప జేయగలరో నాకు తెలుపుము. యుగములు, యుగ ధర్మములను గూర్చి కూడా బోధింపుము. ప్రళయము, కల్ప మనవేమియో, వాటి ప్రమాణ మేపాటిదో వివరింపుము. కాలగతిని కూడా విశదపరచుము" అని పరీక్షిత్తు శుకబ్రహ్మ నడిగెను.

శుకమహర్షి చెప్పుచున్నాడు: "కృతయుగము నందు ధర్మము చతుష్పాదములతో చరించును. జనులందరు ఈ కృతయుగములో సత్యము, దయ, తపస్సు, దానము అనెడి నాలుగు పాదములను ధరించియుందురు. నిత్యసంతుష్టులై యుందురు. కరుణామయులై యుందురు. ఇంద్రియ నిగ్రహము కలిగి యుందురు. ధ్యాననిష్ఠులై యుందురు. సమదృష్టి కలిగి యుందురు.

"త్రేతాయుగమున జనులు ఈ నాలుగు పాదములను ధరించి యుందురు. కానీ ప్రతిపాదము నందును నాల్గవ వంతును త్యజించి మూడువంతుల ధర్మమునే ఆచరించుచుందురు. మూడువంతుల సత్యమునకు అసత్యమును నాల్గవవంతుగా కలిపి చరింతురు. మూడువంతుల దయకు హింసను నాల్గవ వంతుగా చేయుదురు. మూడువంతుల తపస్సునకు అసంతోషమును నాల్గవ వంతుగాను, మూడువంతుల దానమునకు విరోధమును నాల్గవ వంతుగా కలిపి ఆచరించుచుందురు.

"ద్వాపర యుగమున ధర్మ లక్షణములైన సత్య దయ తపో దానాదులతో, అధర్మ లక్షణములైన అసత్య, హింస, అసంతోష, విరోధములు సమానముగా వచ్చి కలియును. ధర్మము సగము, అధర్మము సగము కలిసి యుండును. కలియుగమునందు అధర్మ లక్షణములు మూడువంతులు నిండగా ధర్మలక్షణములు నాల్గవ వంతు నిలిచియుండును. కాలక్రమేణ ఆ నాల్గవ వంతుకూడా నశించును.

"కలియుగమున ప్రజలు లోభగుణము కలిగియుందురు. దురాచారపరులై యుందురు. నిర్దయులై యుందురు. అకారణ వైరులై యుందురు. ఆశాపరులై యుందురు.

"కృతయుగము సత్త్వగుణ ప్రధానమై యుండును. త్రేతాయుగము రజోగుణ ప్రధానమై యుండును. ద్వాపర యుగము రజస్తమోగుణ ప్రధానమై యుండును. కలియుగము తమోగుణ ప్రధానమై యుండును.

"కలిప్రభావము వర్ణింప శక్యము గానిదియై యున్నది. కలి ప్రభావము వలన మందమతులు, మంద భాగ్యులు, మితిమీరి భుజించువారు, కాముకులు, స్వేచ్ఛావిహారము గల స్త్రీలు ఎక్కువగా తెలియుచుందురు.

"దొంగతనము పెచ్చు పెరుగును. నాస్తికులు పరమ పవిత్రములైన వేదములను దూషింతురు. పాలకులు ప్రజలను పీడింతురు. బ్రాహ్మణాది వర్ణముల వారు కూడా జిహ్వేంద్రియ, గుహ్యేంద్రియములకు దాసులై యుందురు. బ్రహ్మచారులు ఆచార శూన్యులై యుందురు. గృహస్థులు భిక్ష ఇచ్చుట మరచి భిక్షాటన చేయుచుందురు. వాన ప్రస్థులు పట్టణములలో వసించు చుండగా సన్యాసులు ధనాశాపరులై యుందురు. స్త్రీలు

పొట్టివారుగా నుందురు. అతి సంతానమునకు అలవాటుపడి యుందురు. పరుష వాక్కులను పలుకుచుందురు. సిగ్గు వీడి యుందురు.

"సేవకులు యజమానిని త్యజించు చుందురు. అనావృష్టితో జనులు అలమటించు చుందురు. ధనమునకై స్వజనులను కూడా వధింతురు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించరు. భగవంతునికి నమస్కరించుటకు వెనుకాడుచుందురు.

"రాజా! ఈ కలియుగము ఈ విధమైన దోషములతో కూడి యున్నను సర్వజనులకు ఉపయుక్తమగు ఒక గొప్ప లక్షణమును కలిగియున్నది. కలిదోష నివారణము కూడా కలియుగము నందే లభించును. కలిదోషముల నన్నిటిని కృష్ణ నామము హరించును" అని నామ వైభవమును శుకమహర్షి పరవశించి గాన మొనర్చెను.

నామ మహిమ

నామవైభవము వర్ణనా తీతము. నామము నాశ్రయించిన వారు నామిని పొందగలరు. ఇదియే కలియుగములోని నిజ ఐశ్వర్యము. కలియుగములో నామ సంకీర్తనము తోనే తరించ వచ్చునని శాస్త్రములు ఘోషిస్తున్నవి. మహాత్ములు ప్రవచిస్తున్నారు.

కీర్తనము అనగా కీర్తిని ప్రకటించునది అని భావము. భగవంతుని గుణములను, లీలలను గానము చేయుటయే కీర్తనము. సమ్యక్ + కీర్తనము = సంకీర్తనము. సరిగ కీర్తించుటయే సంకీర్తనము అనబడును. భగవంతుని భావపూరితముగ కీర్తించవలెను. భక్తితో కీర్తించవలెను. ప్రేమతో పరవశించుచు గాన మొనర్ప వలెను. "**బలా త్కృషయ తీతి నామ**" బలవంతముగ భగవానుని లొంగదీయునది భగవన్నామము.

నామమును కీర్తించు నామయోగి ధన్యజీవి. నామము నాలుకపై కదలుచుండగా నామి యైన భగవానుడు హృదయములో నాట్యము చేయుచుండును. కీర్తనా ప్రభావమునకు జాతినాగులు కూడా పడగలు విప్పి నిలబడును. మనము నామము చేయగానే కాళీయునిపై శ్రీకృష్ణుడు నాట్య మొనర్చినట్లు, దోషములనెడి కోరలను కలిగిన అజ్ఞాన మనెడి కాళీయుని పాదముతో త్రొక్కిపట్టి బాలకృష్ణుడు నాట్యము చేయును. ఇదియే కాళీయ మర్దనము. హృదయములో కృష్ణుడున్నపుడు కల్మషము లెలా ఉండగలవు?

యథా హేమ్ని స్థితో వహ్నిః దుర్వర్ణం హన్తి ధాతుజం
ఏవ మాత్మ గతో విష్ణు ర్యోగినా మశుభాశయమ్

"స్వర్ణము నందున్న అగ్ని ఆ స్వర్ణములో అన్యములైన లోహముల వలన కలిగిన మాలిన్యమును పోగొట్టునట్లు, భక్తుల హృదయముల యందు నిలిచిన శ్రీమన్నారాయణుడు ఆ హృదయము నందలి అశుభ వాసనలను తొలగించును" అని శుకబ్రహ్మ చెప్పుచున్నాడు.

వాచ్యమైన భగవానునకు, వాచకమైన భగవన్నామమునకు భేదము లేదని శాస్త్రములు తెలుపుచున్నవి. అయినను భగవానుని కన్నను భగవన్నామమే శ్రేష్ఠమని మహాత్ములు

సంకీర్తనా వైభవము

అభిప్రాయ పడినారు. భగవంతుని విషయములో మనము అపరాధములు చేసినచో అట్టి దోషములను భగవన్నామము హరింప జేయుచున్నది. అందుచేత నామము నామి కన్నను శ్రేష్ఠమై యున్నది.

కృష్ణేతి మంగళం నామ యస్య వాచి ప్రవర్తతే
భస్మీ భవంతి రాజేంద్ర మహాపాతక కోటయః

"రాజేంద్రా! ఎవని నాలుకపై శ్రీకృష్ణుని నామము కదలు చుండునో అట్టివాడు ఆచరించిన కోటి మహాపాతకములు భస్మీపటల మగును" అని విష్ణుధర్మోత్తర పురాణము తెలిపినది.

భక్తులైనవారు కీర్తనలో తృప్తిని పొందాలి. కాలమంతా సంపాదన కొరకు వెచ్చించినా అలసినపుడు వ్యక్తి నిద్రించును. మరి ఆ నిద్రా సమయాన్ని కూడా సంపాదన కొరకు ఎందుకు ఖర్చు పెట్టడు? నిద్ర అవసరం. దానిని త్యజించలేడు. దేహానికి నిద్ర ఎలా అవసరమో జీవికి భగవత్స్మరణ అంత అవసరము. కీర్తన ఆహార నిద్రాదుల వలె అవసరమై యున్నదని గ్రహించాలి.

నామసంకీర్తనకు కాల నిర్ణయము లేదు. నియమిత ప్రదేశమంటూ ఉండదు. సర్వకాల సర్వావస్థల యందు నామమును జపించవచ్చును. మనస్సు విషయాలను జ్ఞాపకము చేయగలదు. మనస్సే మరచి పోగలదు కూడాను. కీర్తన భగవంతుని మనముకు జ్ఞాపకము చేయును. మనస్సును మాధవ చైతన్యములో ఓలలాడునట్లు చేయును. కీర్తన అభ్యాసంగా మారాలి.

ప్రతిరోజూ స్నానము చేయునపుడు మొదటి చెంబుతో నీటిని తీసికోగానే **"ఓం నమో భగవతే వాసుదేవాయ"** అని కీర్తించి ఆ తరువాత నీటిని పోసికొనే అలవాటు చేసుకోవాలి. ఈ విధంగా కొన్నిరోజులు నడచినచో ఆ తరువాత స్నానము చేయుటకు వెళ్ళగానే నామము అప్రయత్నముగా కదలును. అయితే ఈ నామసాధన యాంత్రికము గాకుండా చూసుకోవాలి. పంచదార కలిపినపుడే పిండి మధురముగా తయారగును. ప్రేమ నిండినపుడే కీర్తన ఫలప్రద మగును. భగవన్నామమును గానమొనర్చునపుడు ఇది నా ప్రాణనాథుడైన శ్యామసుందరుని దివ్యనామమని పరవశిస్తూ కీర్తించాలి. అప్పుడే కీర్తన సద్యః ఫలితముల నందించును. సర్వ పాపములను హరింపజేయును.

పాపానలస్య దీప్తస్య మా కుర్వన్తు భయం నరాః
గోవింద నామమేఘౌత్థై ర్నశ్యతే నీర బిందుభిః

"మానవులారా! పాపమనెడి అగ్ని యొక్క ప్రకాశమును గాంచి భీతి చెందకుడు. గోవిందనామ మను మేఘము నుండి వర్షించిన అమృతబిందువులు పాపాగ్ని శిఖలను ఆర్పగలవు" అని గరుడపురాణము పలికినది.

భగవానుడు నామవశుడు. దారము మన చేతిలో నున్నచో గాలిపటము మనకు వశమైయున్నట్లు, భగవన్నామము మన నాలుకపై కదలినచో పరమాత్మ మన వశుడై యుండును.

ప్రతి కార్యమును నామముతో ప్రారంభించే అలవాటును సాధకులు ఏర్పరచుకోవాలి. వ్యాపారస్థుడు డబ్బును లెక్కించుచుండును. అలాగే బ్యాంకు ఉద్యోగి ధనమును లెక్కించుచుండును. ప్రతి డబ్బుకట్టను లెక్కించుటకు ప్రారంభించగనే ముందుగా నామము నుచ్చరించవలెను. తల్లులు నామము నుచ్చరించి వంట ప్రారంభించాలి. నామముతో ఒక కార్యమును ఆరంభించినచో అట్టి కార్యము మధ్యలో కూడా నామమే కదలుచుండును. ఈ విధంగా బ్రతుకును నామమయంగా చేసికోవాలి.

కృతే యద్ధ్యాయతో విష్ణుం త్రేతాయాం యజతో మఖైః
ద్వాపరే పరిచర్యాయాం కలౌ త ద్ధరి కీర్తనాత్

"కృతయుగమున విష్ణువును ధ్యానించువారికి, త్రేతాయుగమున యజ్ఞము చేయువారికి, ద్వాపరయుగమున పరిచర్యచేయు వారికి ఎట్టిఫలితము కలుగునో కలియుగమున హరికీర్తనము చేయువారికి అట్టి ఫలము లభించును" అని శుకమహర్షి పరీక్షిత్తునకు చెప్పెను.

హరిబోల్ హరిబోల్ హరిబోలో భాయీ కలి మే గతి నాహీఁ నామ బినా భాయీ

"సోదరా! ఈ కలియుగమున నామము కంటెను వేరొకగతి లేదు. కనుక హరి హరి యని పరమాత్మని కీర్తింపుము" అని చైతన్యమహాప్రభువు చెప్పెను.

కలి నహి యోగ యజ్ఞ విజ్ఞానా ఏక అధార రామ గుణ గానా

"యోగము,యజ్ఞము,విజ్ఞాన మనునవి కలియుగమునకు ఉపకరించవు. శ్రీరాముని గుణగానము కంటెను కలియుగమునకు మరొక ఆధారము లేదు" అని తులసీదాస్ తెలిపెను.

కీర్తన హాయిగా సాగాలి. భక్తితో సాగిపోవాలి. నామము కూడా వినిపించని రీతిలో మృదంగ తాళాదులను ఉపయోగించ కూడదు. అట్టిది రణ సంకీర్తన యగునే గాని గుణ సంకీర్తన కానేరదు. రణ సంకీర్తన పాపపు ఋణమును తీర్పలేదు. గుణ సంకీర్తన పరమాత్మనే ఋణగ్రస్తునిగా చేయును.

గీత్వాతు మమ నామాని విచరే న్మమ సన్నిధౌ ఇతి
బ్రవీమి తే సత్యం క్రీతోఽహం తస్య చార్జున

"ఎవడు నిరంతరము నా నామమును గానము చేయుచు నా సన్నిధి యందే యుండునో అట్టివానికి నేను ఋణపడి యుందును. ఇది సత్యము" అని ఆది పురాణములో ఆదిదేవుడగు అచ్యుతుడు భక్తుడైన అర్జునునకు చెప్పెను.

భోజనము చేయునపుడు మధ్య మధ్యన నామము చేయుచుండవలెను. ఈ విధముగా నామమును కీర్తించుచు భోజనమారగించిన, అట్టి మనుజుడు చేసినది భోజనము కాదు. భజనయే కాగలదు. నామముతో పాటు భావము మిళిత మైనపుడు అది నాదానుసంధానమగును. నారద తుంబురాది మహాత్ములు నాదానుసంధానములో తన్మయులైరి. కనుక కలియుగము దోషయుతమని భావింప నక్కరలేదు. ఇంటిలోని

చెత్తను చీపురుతో దూరం చేయునట్లు, ఒంటిలోని మురికిని నీటితో శుభ్రము చేయునట్లు, కలిదోషములను నామముతో శుద్ధి చేయవచ్చును.

క॥ మూఁడవయుగమున నెంతయు వేడుక హరికీర్తనంబు వెలయుఁగ ధ్యానం
బాడుచుఁ దృష్ణాతురులై క్రీడింతురు కలిని దలఁచి కృతమతు లగుచున్.

అని పోతనామాత్యుని పవిత్ర భాగవతప్రవచనము.

సృష్టి లయములు

కలిదోష నివారణమును, సృష్టి ప్రళయాలను గూర్చి పరీక్షిత్తు అడుగగా హరినామ సంకీర్తనము కలిదోషములను హరించునని శుకమహర్షి తెలిపెను. ఇక సృష్టి ప్రళయాలను వివరించుచున్నాడు.

కల్పమనగా సృష్టికాలము. ప్రళయమనగా ప్రపంచము జలమయమై యుండుట యని భావము. కల్పము రెండు విధములు (1) దైనందిన కల్పము. (2) మహా కల్పము. నాలుగు యుగములు వేయిసార్లు తిరిగినపుడు బ్రహ్మకు ఒక దినమగును. ఈ కాలములో భూమిని పదునలుగురు మనువులు పరిపాలింతురు. ఈ కాలమునే కల్పమందురు.

ప్రళయము నాలుగు విధములు: (1) నైమిత్తికము (2) ప్రాకృతికము (3)ఆత్యంతికము (4) నిత్యము.

(1) నైమిత్తిక ప్రళయము:- నాలుగు యుగసహస్రముల కాలము బ్రహ్మకు పగలు కాగా, అంతేకాలము బ్రహ్మకు రాత్రి యగును. బ్రహ్మ యొక్క రాత్రి సమయమున మూడులోకములు ప్రళయమును అనుభవించును. ఇదియే నైమిత్తిక ప్రళయము. ఈ ప్రళయ కాలమున సమస్త ప్రపంచమును తనలో నిముడ్చుకొని నారాయణుడు ఆదిశేషునిపై పరుండి యోగనిద్రలో యుండును.

(2) ప్రాకృతిక ప్రళయము:- బ్రహ్మదేవునకు పగలు రాత్రి దాటినంతనే మహ దహంకారములు, పంచ భూతములు, సప్త ప్రకృతులు ప్రళయమునకు గురియగును. దీనినే ప్రాకృతిక ప్రళయ మందురు. ప్రాకృతిక ప్రళయ కాలమున మేఘములు వంద సంవత్సరములు భూమిపై వర్షింపవు. ఆహారము లేనివారై ప్రజలు ఒకరినొకరు చంపుకొనుచు నాశమొందెదరు. ఆ తరువాత అగ్నిసూర్యుల జ్వాలలచే బ్రహ్మాండ మంతయు అగ్నిముద్ద వలె కాలుచు గోచరించును. ఆ తరువాత వాయువు వీచును. వాయువు వీచగనే మేఘములు ఆగకుండా నూరు సంవత్సరములు వర్షించును. ఆ తరువాత ప్రపంచ మంతయు జలమయ మగును. ఈ విధముగా ఒక్కొక్క స్థూలభూతము కారణమైన సూక్ష్మ భూతములలో విలీనమగును. సమస్తము ప్రధానము నందు లయమగును. ఇదియే ప్రాకృతిక ప్రళయము.

(3) ఆత్యంతిక ప్రళయము:- ఆత్యంతిక లయమనగా మోక్షము అని భావము. ఇచ్చట సకల ప్రపంచము బ్రహ్మమునందు లీనమగును. ప్రపంచము ఆత్మవలె సత్యమైనచో లయించుట ఎలా సాధ్యపడును? కనుక రజ్జువు నందు సర్పమువలె పరమాత్మ యందు ప్రపంచము గోచరించు చున్నది. రజ్జువును దర్శింపగనే సర్పము లయించునట్లు పరమాత్మను దర్శించగనే ప్రపంచము అదృశ్యమగును.

బుద్ధి కూడా దృశ్యమే గనుక అదియును అసత్యమే. బుద్ధి అసత్యమని తెలియగనే అట్టి బుద్ధికి తెలియు అవస్థాత్రయము కూడా అసత్యమని తేలును.

సత్యవస్తువు నందు నానాత్వము అనూహ్యము. ఉపాధిభేదమే ఆత్మలో అనేకత్వమును ఆరోపించినది. ఇచ్చట అహంకారము ఆవిర్భవించుచున్నది. ఆత్మజ్ఞానము చేత అహంకారము నశించును.

ఘనో యదార్క ప్రభవో విదీర్యతే చక్షు స్స్వరూపం రవి మీక్షతే తదా
యదా హ్యహంకార ఉపాధి రాత్మనో జిజ్ఞాసయా నశ్యతి తర్హ్యను స్మరేత్

"సూర్యుని వలన ఏర్పడిన మేఘము ఎపుడు విచ్ఛిన్నమగు చున్నదో అపుడు నేత్రము తన స్వరూపమైన సూర్యుని గాంచుచున్నది. అలాగే జీవునకు ఆత్మవిచారముచే ఉపాధియగు అహంకారము ఎపుడు నశించు చున్నదో అపుడు బ్రహ్మము అనుభవమునకు అందుచున్నది."

(4) నిత్యప్రళయము:- జీవులకు ప్రతిక్షణము సృష్టి లయాలు జరుగుచునే ఉన్నవి. కానీ ఈ సత్యమును సూక్ష్మదర్శులైన వారే గ్రహించగలరు. ఈ క్షణము నశించి మరొక క్షణము పుట్టుచున్నది. నశించిన క్షణము లయము అనిపించుకోగా పుట్టిన క్షణము ఉత్పత్తి యనిపించుకొనుచున్నది.

భిన్న కుంభోదక వత్ దేహః ప్రతిక్షణం వినాశీ

రంధ్రము పడిన నీటి కుండలోని నీరు అనుక్షణము కారిపోవునట్లు, దేహము ప్రతిక్షణము నాశము నొందుచున్నది. దీపము ప్రతిక్షణము వెలుగుచు ఆరిపోవునట్లు, నది ప్రతిక్షణము ప్రవహిస్తూ ఇంకి పోవునట్లు, దేహము కదలుచూ కనుమరు గవుచున్నది. ఇదియే నిత్య ప్రళయము.

"రాజా! చతుర్విధములైన ప్రళయములను నీకు తెలిపితిని. కాలగమనము ఇలా ఉండునని గ్రహింపుము. నారాయణుని దివ్యలీలలను నీకు సంగ్రహముగ వివరించితిని. ఈ విషయమును పూర్వము నారాయణ ఋషి నారదునికి చెప్పెను. నారదుడు వ్యాసునికి చెప్పెను. వ్యాసభగవానుడు ఈ పవిత్ర భాగవత సంహితను నాకు చెప్పెను. నారాయణుని దివ్యలీలలను పూర్తిగా వివరించుట బ్రహ్మదేవు నకు కూడా సాధ్యము కాదు" అని పలికి శుకుడు భక్తితో నారాయణునకు నమస్కరించెను.

మృత్యుభయ నివారణము

శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో ఇలా పలికెను! "రాజా! నీ దేహమునకు మృత్యువు సమీపించు చున్నది. మరణ సమయము ఆసన్న మగుచున్నది. పరమాత్మను హృదయములో ధ్యానింపుము. తుచ్ఛమైన మరణ భయమును పారద్రోలుము" అని చెప్పసాగెను.

"నీవు కాలానికి పరిమితుడవు కావు. కాలములో పుట్టిన దేహము కాలములో అంతరించును. నీవు గతములో లేకుండా ఇప్పుడు వచ్చినవాడవు కావు. భవిష్యత్తులో లేకుండా పోయేవాడవు కావు. అనిత్యమైన దేహ ధర్మమును తనయందారోపించు కొనువారు మృత్యువాత పడునట్లు దుఃఖించు చుందురు. ఇది అవివేకము. అట్టి దానిని నీవు పరిత్యజింపుము" అని శుకబ్రహ్మ చెప్పెను.

ఉ॥ ఏనమృతుండనౌదునని యింతభయంబు మనంబు లోపలన్
మానుము సంభవంబుగల మానవకోట్లకుఁ జావు నిత్యమౌఁ
గాన హరిందలంపు మిఁక గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్.

ఘటము పరిమితము. ఆకాశము అనంతము. ఉపాధిభేదము వలన ఘటాకాశము అని పిలుతురు. ఘటము పగిలిపోగానే ఘటాకాశము మహాకాశములో కలిసిపోయినది. కలిసిపోయినది యనుటకు ఒకప్పుడు విడిపోయి యుండెనా? అనంతమైన ఆకాశము ముక్కలగుట సాధ్యమా?

ఘటము పుట్టినది గనుక పగిలిపోయినది. ఆకాశము ఆరంభము నెరుగదు గనుక అంతమునూ ఎరుగదు. పుట్టిన దేహము నశించును. కానీ ఆత్మ నాశము నెరుగదు. ఘటాకాశము మహాకాశములో విలీనమైనట్లు, ఆత్మ పరమాత్మయందు విలీనమగును.

ఆత్మకు దేహ గుణ కర్మములను కల్పించునది మనస్సే. ఈ మనస్సు మాయా జనితము. మాయ వలననే జీవునకు సంసార మేర్పడుచున్నది. వాస్తవానికి ఆత్మకు సంసారము లేదు. ఆత్మ వృద్ధిక్షయముల నెరుగదు. కనుక మనస్సును ఆత్మయందు లయింప చేయవలెను. కారణమైన మనస్సు లయించగనే కార్యమైన జగత్తు లయించును.

తన్మనో విలయం యాతి తద్విష్ణోః పరమం పదమ్

"మనస్సు ఎచ్చట లయించు చున్నదో అదియే విష్ణువు యొక్క మహోత్కృష్టమైన స్థానము" అని ఉపనిషత్తు పలికినది.

అగ్ని యున్నచో పొగ గోచరించును. అగ్ని లేనిచో పొగ యుండదు. మాయోపాధి లేనిచో జగత్తు లేనిదే యగుచున్నది. కనుక సత్యరూపుడైన విష్ణువందే మనస్సును లగ్నము చేయుము.

అనాత్మతాం పరిత్యజ్య నిర్వికారో జగత్స్థితౌ ఏకనిష్ఠత యాంతస్థ సంవిన్మాత్ర పరోభవ

"అనేకత్వముతో గూడిన అనాత్మ భావమును త్యజించి, జగత్తు విషయము నందు ఏ విధమైన వికారములు లేనివాడనై, ఏకనిష్ఠతో హృదయము నందలి సద్రూప చైతన్యము నీవే యని ఎఱుగుము" అని వరాహోపనిషత్తు ప్రవచించినది.

"రాజా! ఇట్టి బ్రహ్మభావనలో నిలిచిపొమ్ము. తక్షకుడు నిన్నేమియును చేయజాలడు. చైతన్యమునకు మృత్యువెలా సంభవము?"

చోదితో విప్రవాక్యేన న త్వాం ధక్ష్యతి తక్షకః
మృత్యవో నోప సర్పంతి మృత్యూనాం మృత్యు మీశ్వరమ్

శృంగి శాపముచే పురికొల్పబడిన తక్షకుడు నిన్ను దహింపజేయ లేడు. మృత్యువుకు ప్రభువైనవానిని మృత్యువెలా సమీపించగలదు?

"పరీక్షిన్మహారాజా! ఆత్మజ్ఞానములో యున్న నీవు ఈ ప్రపంచమును; నాలుకలు చాపుచు విషాగ్నులచే నీ పాదమును కఱచుచున్న తక్షకుని, నీ శరీరమును ఆత్మకంటె వేఱుగా జూడవు" అని శుకమహర్షి చెప్పెను.

"నాయనా! రాజా! విశ్వరూపుడైన శ్రీహరిలీలలను గూర్చి నీ వడిగిన వన్నియు చెప్పితిని. ఇంకను ఏమి వినగోరు చున్నావో తెలుపుము. వాటిని కూడా చెప్పెదను" అని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుతో చెప్పెను.

నైమిశారణ్యమున సూతమహర్షి శౌనకాది మునులకు ఇలా చెప్పుచున్నాడు: "సమదర్శన యోగి యగు శుకయోగి చెప్పిన శ్రీహరి దివ్యమహిమల నాలకించి, సంతృప్తి చెందిన పరీక్షిన్మహారాజు శుకబ్రహ్మ పాదములపై బడి నమస్కరించెను."

పరీక్షిత్తుడు శుకయోగీంద్రుని సమీపించెను. శిరమొడ్చి గురుదేవుని పాదములకు పదే పదే నమస్కరించెను. చేతులు జోడించి నమస్కరించుచూ;

"మహాత్మా! కరుణామయా! ప్రత్యక్షముగా హరిగాథలను మీరు నాకు బోధించి నన్ను తరింప జేసినారు. ఆత్మవిదు లైన మీకు అజ్ఞానులైన సంసారుల మీదున్న దయ నిరుపమానము. మీ నుండి భగవత్కథను ఆలకించుట చేత నాకు మృత్యుభయము తీరినది. తక్షకాదులు నా హృదయములో ఇక భీతిని కల్పించలేరు. అభయరూపమైన కైవల్యస్థితిని మీరు నాకు చూపినారు. నేను అట్టి స్థితిలో ప్రవేశించినాను.

"తండ్రీ! నాకు అనుజ్ఞ నొసగుము. శ్రోత్రాదీంద్రియములను నిగ్రహించి, మనోబుద్ధులను నియమించి, కామాది సంకులము నుండి విడివడిన చిత్తమును పరమాత్మ యందు ప్రవేశింప జేసెదను. ఆత్మజ్ఞానము చేత నా అజ్ఞానము నశించినది.

అజ్ఞానం చ నిరస్తం మే జ్ఞాన విజ్ఞాన నిష్ఠయా భవతా దర్శితం క్షేమం పరం భగవతః పదమ్

"ఆత్మజ్ఞాన నిష్ఠచే నా అజ్ఞానము నశించినది. మీ కృపవలన క్షేమకరమైన ఉత్కృష్ట పదమును దర్శించుట జరిగినది."

శుకమహర్షి పరీక్షిత్తునకు కథనే చెప్పలేదు. పరమాత్మని దర్శనమును చేయించినారు. జ్ఞానమును ప్రసాదించువాడే నిజ గురువు. అతడే సద్గురువు. శ్రీకృష్ణుని బోధ నాలకించిన అర్జునుడు మోహము నశించిన దనియు, స్మృతి కలిగిన దనియు పలికెను. శుకమహర్షి నుండి భాగవతధర్మము నాలకించిన పరీక్షిత్తుడు కూడా అజ్ఞానము నశించిన దనియు, జ్ఞానము దర్శింపబడిన దనియు పలికెను. జ్ఞానబోధకు ఇదియే ఉత్తమ ఫలము. గురువు సత్యమును శిష్యునిచేత దర్శింప చేయగలగాలి. శిష్యుడు అందులకు అర్హుడై తదనుగుణముగ చరించి, గురు ఋణమును తీర్చుకోవాలి. గురువు అందించిన జ్ఞానముతో జీవించినపుడే గురువు సంతసించును. గురు ఋణమును తీర్చుకొనుటకు ఇదియే ఏకైక తరుణోపాయము.

"రాజా! నేను వెడలుచున్నాను. నీకు మరేదైనా అభిలాష యుండినచో తీర్చగలను. ఏది కోరినను ఇవ్వగలను. నిస్సంకోచముగ అడుగుము" అని శుకమహర్షి పలికెను.

"దేవా! మీ బోధ నాలో కోర్కెలను కదల నివ్వదు. నిరోధరూపమైన భక్తిని నాకు మీరు ప్రసాదించినారు. నా జన్మ చరితార్థమైనది. నాకు ఏ వాంఛలు లేవు. కానీ హృదయములో ఒక్క కోర్కె మిగిలియున్నది. ప్రయత్నము ద్వారా లభించని మీ చరణ కమలములను మనసారా పూజింపవలె నని యున్నది. మీరు వర్షింప చేసిన జ్ఞానజలముతో నిండిన నా హృదయసాగరము నుండి లేచి పడుతున్న ఆనందబాష్ప కెరటాలతో మీ దివ్య పాదారవిందములను అభిషేకించవలె నని మనస్సు ఉరకలేయు చున్నది. కరుణతో కనికరింపుడు" అని పరీక్షిత్తుడు ప్రార్థించెను.

శుకబ్రహ్మ అనుగ్రహించెను. శుకయోగీంద్రుని పాదపద్మములను సేవించి, పరీక్షిత్తుడు సంతుష్టచిత్తు డాయెను: గురుదేవుడైన శుకునకు పరీక్షిత్తుడు నమస్కరించెను. శుకబ్రహ్మ తన అమృతహస్తముతో పరీక్షిత్తుని శిరస్సును స్పృశించెను. ఆ దివ్యస్పర్శచే పరీక్షిత్తుడు అంతర్ముఖు డాయెను. బ్రహ్మముతో ఏకమయ్యెను. ఋషులతో కలసి శుకమహర్షి వెడలి పోయెను.

పరీక్షిత్తుడు సమాధి మగ్ను డాయెను. బుద్ధిని ఆత్మ యందుంచెను. ప్రాణములను లీన మొనర్చెను. చెట్టు మొదలు వలె కదలికలేనివా డాయెను. గంగాతీరమున దర్భాసనముపై ఆసీనుడై యున్న పరీక్షిన్మహారాజు సాక్షాత్తు పరబ్రహ్మమై ప్రకాశింప సాగెను.

రాజును చంపుటకు తక్షకుడు బయలుదేరి వచ్చుచుండెను. మార్గమున తక్షకునకు కాశ్యపుడను బ్రాహ్మణుడు కనిపించెను. పరీక్షిత్తునకు విష చికిత్సచేసి ధనము నార్జింపవలె నని భావించి, ఆ బ్రాహ్మణుడు వచ్చుచున్నాడని తక్షకుడు గ్రహించెను. అతని శక్తిని పరీక్షింప గోరిన తక్షకుడు సమీపముననే యున్న ఒక పెద్ద చెట్టును కాటువేసెను. వెంటనే అది భస్మమాయెను. వెంటనే ఆ బ్రాహ్మణుడు ఆ చెట్టును బ్రతికించెను. యథాప్రకారము పచ్చగ యుండునట్లు చేసెను. అది గాంచిన తక్షకుడు అతనికి వలసినంత ధన మొసంగి పంపించెను. తక్షకుడు బ్రాహ్మణ వేషధారియై గంగాతీరమునకు వచ్చెను.

పరీక్షిత్తుడు నేత్రములు మూసి పరమాత్మ యందు లీనమై యుండెను. మృత్యువు రాకముందే తాను అమృతరూపు డాయెను.

ఇహ చేద శకద్బోద్ధుం ప్రాక్శరీరస్య విస్రసః
తతః సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే ॥

"దేహము పతనము గాక మునుపే ఎవ్వరు ఆత్మను గ్రహించునో అతడు సర్వోపద్రవములనుండి విముక్తుడగు చున్నాడు. ఇది గ్రహించని వాడు మరల మరల శరీరమును ధరించును" అని కఠోపనిషత్తు ప్రవచించినది.

తక్షకుడు రాకముందే పరీక్షిత్తు దేహాత్మభావమును విడిచినవా డాయెను. దేహ విలక్షణుడైన రాజును ఎలా కాటు వేయవలెనో, మృత్యువు నధిగమించిన వానిని ఎలా చంపవలెనో తక్షకునికి అవగతము కాలేదు. కొయ్య మొద్దువలె నిలిచి యున్న దేహమును తక్షకుడు కాటు వేసెను. ఆ విషాగ్నిచే రాజుయొక్క శరీరము భస్మమాయెను. ఇది కేవలము తండ్రి విషయములో పుత్రుడు చేయు కార్యమువలె నున్నదని సూతమహర్షి అభిప్రాయపడెను. తండ్రి దేహమును పుత్రుడు దహించునట్లు పరీక్షిత్తుని దేహమును తక్షకుడు దహించెను.

పరీక్షిత్తుడు భస్మమాయెను. భూమిపై, ఆకాశములో, దిక్కులలో గొప్ప హాహాకారములు చెలరేగెను. దేవతలు దుందుభులు మ్రోగించిరి. గంధర్వులు గానము చేసిరి. పుష్పవృష్టి కురిసినది. దేవతలు ఆనందించిరి. అభినందించిరి.

తక్షకుని విషాగ్నిచే తన తండ్రియగు పరీక్షిత్తుడు భస్మమాయె ననెడి విషయము మహారాజగు జనమేజయునకు తెలిసెను. వెంటనే అతడు విప్రులను రావించెను. సర్ప యాగమును ఆరంభించెను. యాగము నందు భయంకరముగ మండుచున్న అగ్నిలో సర్పము లన్నియు వచ్చి పడుచుండెను. భస్మ మగుచుండెను. ఈ భయంకర పరిస్థితిని గాంచి కలతచెందిన తక్షకుడు ఇంద్రుని శరణు జొచ్చెను.

సర్పములన్నియు వచ్చి అగ్నిలో పడుచుండెను. కానీ తక్షకుడు మాత్రము రాలేదు. కారణ మేమిటని జనమేజయుడు బ్రాహ్మణుని ప్రశ్నించెను. ఇంద్రుడు రక్షించుట చేత తక్షకుడు వచ్చి అగ్నిలో పడుట లేదని బ్రాహ్మణులు రాజుకు తెలిపిరి. విశాల బుద్ధిగల జనమేజయుడు ఇంద్రునితో కూడా తక్షకుని ఆహ్వానించమని బ్రాహ్మణులకు చెప్పెను. ఇంద్రునితో కలసి తక్షకుడు అగ్నిలో పడునట్లు విప్రులు యాగభూమిలో ఆహ్వానించిరి. వెంటనే ఇంద్రుని విమానము కూడా కదలెను. ఇంద్రుడు తీవ్రముగా కలత చెందెను.

తక్షకునితో కలసి అగ్నిలో పడుటకు అరుదెంచుచున్న ఇంద్రుని జూచిన అంగిరసుని కుమారుడగు బృహస్పతి జనమేజయునితో ఇలా చెప్పెను; "జనమేజయ మహారాజా! సర్పరాజగు తక్షకుని నీవు వధించుట సముచిత కార్యము కానేరదు. జీవులకు చావు బ్రతుకులు, పరలోక ప్రాప్తి యనునవి తమ కర్మల కారణముగనే వచ్చును. సుఖ దుఃఖములకు ఇతరులు కారణమని భావించుట తగదు. నీ తండ్రి యగు పరీక్షిత్తుని మరణమునకు తక్షకుడు కారణమని భావింపకుము. జీవులు మరణింతురు. మరణమునకు ఏదో ఒక మిష ఉండాలి. పాములు, చోరులు, అగ్ని, జలము, ఆకలి దప్పులు, రోగాదులు

మరణమునకు మిషగా మిగిలియున్నవి. వాటికి ఈ విషయమున స్వేచ్ఛలేదు. కనుక సర్ప సర్పములను దహింపచేయు ఈ సర్పయాగమును ఇంతటితో ఆపుము" అని చెప్పెను.

చ॥ మృతియును జీవనంబు నివి మేదినిలోపల జీవకోటికిన్
సతతము సంభవించు సహజం బిది చోర హుతాశ సర్ప సం
హతులను దప్పి వాఁకటను బంచతనొందెడునట్టి జీవుఁ డా
పదలనుగుంది పూర్వమగు పాపఫలంబు భుజించునెప్పుడున్.

బృహస్పతి హితవచనముల నాలకించిన జనమేజయుడు సర్పయాగమును విరమించెను. బృహస్పతిని పూజించెను. దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. రాజు నగరమున కేగెను.

ఇతరులలో దోషముల నారోపించు బుద్ధి ప్రమాదకరము. మన మనస్సులోని వికారమే అన్యులలో దోషములను గాంచును. పరనిందను, వైరమును వర్జించి భగవంతుని పాదపద్మములను భజించు భక్తుడు విష్ణుపదమును చేరునని సూతుడు శౌనకాది మునులకు తెలిపెను. పరమ పావన గ్రంథరాజమగు శ్రీమద్భాగవతమును సమాప్తి చేయుచు త్రిజగద్గురువునకు సూతుడు నమస్కరించుచున్నాడు.

నమో భగవతే తస్మై కృష్ణాయాకుంఠ మేధసే
యత్పాదాంబురుహ ధ్యానాత్ సంహితా మధ్యగామిమామ్

"ఎవని చరణకమల ధ్యానము వలన ఈ భాగవత సంహితను అధ్యయనము చేసితినో అట్టి అప్రతిహత మేధస్సు గల శ్రీకృష్ణునకు నమస్కరించుచున్నాను.

కార్యాంతమున పరమాత్మను స్మరించువానిలో అహంకారము జనింపదు. భగవత్కృప కతడు పాత్రు డగును. సర్వకార్యములు భగవదాధీనములు. కార్యారంభము నందును, కార్యాంతము నందును పరమాత్మను ధ్యానించు వారికి విఘ్నము లంతరించును. శుభములు చేకూరును.

సూతుడు భాగవతమును సమాప్తి చేయుచు శ్రీకృష్ణునకు నమస్కరించెను. నమస్కారమనగా అహంకారము పరమాత్మకు అర్పణ చేయుట యని భావము. "**నమ ఇతి ద్వే అక్షరే**" నమ యనునవి రెండక్షరములు. "**మ**" యనగా నహంకారము, "**న**" యనగా లేదు యని భావము.

"**నమః**" యనెడి పదము నందు మరొక భావమును గూడా గాంచ వచ్చును "**మః**" యనగా నా కొఱకు యని భావము. "**నమః**" యనగా నా కొఱకు కాదు యని పరమాత్మకు నివేదించుట కాగలదు. సర్వకార్యములను భగవత్ప్రీత్యర్థం ఆచరించుటయే అందులోని పరమార్థము.

ఈ విధముగా ఆదిదేవునకు నమస్కరించిన సూతుడు శౌనకునిచే ప్రశ్నింపబడి వేదశాఖా భేదములను వివరించుచున్నాడు.

వేదావిర్భావము - వేదవిభాగము

భాగవతము నాలకించిన శౌనకుడు వేద విభాగములను కూడా తెలియగోరి పైలాది మహర్షులు విభజించిన వేదశాఖలను గూర్చి తెలుపమని సూతుని ప్రార్థించెను. వేదము యొక్క ఆవిర్భావమును, శాఖలను గూర్చి సూతుడు చెప్పసాగెను.

సత్యలోకమున సమాధి మగ్నుడై యున్న బ్రహ్మదేవునకు హృదయాకాశమున నాదము వినిపించెను. ఈ నాదము వలననే ఓంకార ముత్పన్న మాయెను. చెవులు మూసికొని బాహ్య శబ్దములను నిరోధింప గలిగినచో మనము కూడా ఆ నాదము నాలకింప వచ్చును. ఈ నాదము నుపాసించువారు విఘ్నత్రయమును ఛేదించి మోక్షమును బొందుదురు.

నాద లోలుడై బ్రహ్మానంద మందవే మనసా ॥నాద॥

అని త్యాగరాజస్వామి కీర్తించినాడు.

హృదయాకాశమున నాదము సముద్ర ఘోష వలె నిరంతరము సాగుచుండును. ఈ నాదమునే వ్యవహార యోగ్య మొనరించుచు ఇంద్రాది దేవతలు అకారాది స్వర రూపము నొందించిరని చెప్పుదురు. ఈ ప్రక్రియలో మొదట ఆవిర్భవించినది ప్రణవము.

దైవీం వాచమజన యన్త దేవాః తాం విశ్వరూపాః పశవో వదన్తి

"దేవతలు దైవీ వాక్కును సృజింపగా ప్రపంచము నందలి జీవులు వాటిని పలుకుచున్నారు" యని వేదము తెలిపినది.

బ్రహ్మము వాచ్యము. ప్రణవము వాచకము. ఈ ప్రణవము నుండియే ప్రపంచము ఆవిర్భవించినది. అందుచేతనే **"సర్వమోంకార ఏవ"** సర్వమూ ఓంకారమేనని మాండూక్య శ్రుతి వివరించినది. త్రివర్ణ సంయుతమైన ఈ ఓంకారము నుండి త్రిగుణములు, త్రిలోకములు, అవస్థాత్రయము ఉత్పన్నమైనవి. బ్రహ్మదేవుడు చతుర్వేదములను కూడా సృజించెను. మరీచ్యాదులకు ఆయనయే వేదములను బోధించెను. మరీచ్యాదులు ఆయా విషయములను తమ పుత్రులకు బోధించిరి. ఈ వేదములు గురు శిష్య పరంపరానుగతిగ నాలుగు యుగములందును అధ్యయనము చేయబడినవి. కాలవశమున అల్పాయుష్కులు, అల్పబుద్ధులు, అల్పబలులు నైన మానవులను గాంచిన వ్యాస ప్రముఖులు ద్వాపర యుగాంతమున సౌలభ్యము కొఱకు వేదములను విభజించిరి.

గనులలో కలసి యున్న మణులను పద్మరాగాదులుగ విభజించునట్లు వేదములను నాలుగు సంహితలుగ విభజించెను. గొప్ప బుద్ధిశాలి యగు వ్యాసభగవానుడు నలుగురు శిష్యులను పిలిచి, ఒక్కొక్కరికి ఒక్కొక్క సంహితను చెప్పెను. ఋక్సంహితను పైలునకు, నిగద యనెడి యజుస్సంహితను వైశంపాయనునకు, ఛందోగ మనెడి సామ సంహితను జైమినికి, అథర్వాంగిరస మనెడి అథర్వ సంహితను సుమంతునికి చెప్పెను.

తనకు చెప్పిన ఋక్సంహితను పైలుడు రెండు భాగములు చేసి తన శిష్యులగు ఇంద్ర ప్రమితునికి, బాష్కలునికి చెప్పెను. బాష్కలుడు తనకు చెప్పిన దానిని నాలుగు

భాగములుగ విభజించి బోధ్యునికి, యాజ్ఞవల్క్యునికి, పరాశరునికి, అగ్నిమిత్రునికి బోధించెను.

మహామతి యగు ఇంద్ర ప్రమితి కూడా తనకు చెప్పిన దానిని మాండూకేయ ఋషికి చెప్పెను. మాండూకేయుడు దేవమిత్రునికి చెప్పగా, దేవమిత్రుడు సౌభరి మొదలగు వారికి చెప్పెను.

మాండూకేయుని పుత్రుడగు శాకల్యుడు తనకు చెప్పిన సంహితను ఐదు విధములుగా విభజించి వాత్స్య, మౌద్గల్య, శాలీయ, గోఖల్య, శిశిరులకు బోధించెను. శాకల్యుని శిష్యుడైన జాతుకర్ణుడు తన సంహితను బలక, పైంగ, వైతాళ, విరజులను నల్వురు శిష్యులకు బోధించెను. బాష్కలుని కుమారుడు ఋక్శాఖల నుండి మంత్రములను సంగ్రహించి, వాలఖిల్య మను సంహితను రచించెను. దీనిని శిష్యులగు బాలాయని, గార్గి, కాసారుడు నను వారు గ్రహించిరి. ఈ విధముగా ఋగ్వేదము అధ్యయనము చేయబడినది. ఇక యజుర్వేదమును గూర్చి తెలిసికొందుము.

తమ గురువు గారైన వైశంపాయనునికి బ్రహ్మహత్య వలన సంభవించిన పాతకమును తొలగించుటకై అనువగు వ్రతముల నాచరించుట చేత చరకులు యజుర్వేదజ్ఞులైరి. ఆ సమయమున యాజ్ఞవల్క్యుడు తన గురువగు వైశంపాయనుని సమీపించి, "గురుదేవా! అల్పసారులగు ఈ బ్రాహ్మణు లాచరించు వ్రతము వలన ఏమి ప్రయోజనము కలుగును? నేను కష్టసాధ్యమైన వ్రతము నాచరించెదను" అని పలికెను.

యాజ్ఞవల్క్యుని మాటల నాలకించిన వైశంపాయనుడు కుపితుడయ్యెను. బ్రాహ్మణ్యద్వేషి యగు శిష్యుని వలన తనకు ప్రయోజనము లేదని పలికి, తన నుండి గ్రహించిన జ్ఞానమును పరిత్యజింపుమని చెప్పెను. వెంటనే యాజ్ఞవల్క్యుడు తాను అధ్యయనము చేసిన యజుర్వేద మంత్రములను వెడలగ్రక్కి అక్కడ నుండి వెడలిపోయెను. ఆ విధముగా యాజ్ఞవల్క్యుడు పరిత్యజించిన యజుర్వేద మంత్రములను సంగ్రహించుటకు కుతూహల పడిన మునివర్యులు తిత్తిరి పక్షుల రూపములను ధరించి స్వీకరించిరి. అందుచేతనే యజుర్వేద శాఖలు తైత్తిరీయ నామముతో ప్రాచుర్యము నొందినవి.

యాజ్ఞవల్క్యుడు ఆలోచించెను. వైశంపాయనునికి వ్యాసుడు తెలియ జెప్పని వేదశాఖలను అధ్యయనము చేయవలెనని సంకల్పించెను. సూర్యదేవుని సమీపించి ప్రార్థించెను. సూర్యుడు అశ్వరూపమును ధరించి ఒరు లెరుగని వేదమంత్రములను యాజ్ఞవల్క్యుని కుపదేశించెను.

ఈ విధముగా ఆదిత్యు డనుగ్రహించిన యజుర్మంత్రములను యాజ్ఞవల్క్యుడు 15 భాగములుగా విభజించెను. కాణ్వుడు, మాధ్యందినుడు మున్నగు ఋషులు ఈ శాఖలను గ్రహించిరి. ఇవియే వాజసనేయ శాఖలు. యజుర్వేదము ఈ విధముగా అధ్యయనము చేయబడినది.

సామ వేదమును వ్యాసుని నుండి గ్రహించిన జైమిని మహర్షి అద్దానిని రెండుగా విభజించి, ఒక శాఖను తన కుమారుడగు సుమంతునకు, రెండవ శాఖను సుమంతుని కుమారుడు, తన మనుమడగు సుత్వానునకు ఉపదేశించెను.

సామ సంహితను సహస్ర శాఖలుగా విభజించెను.

జైమిని శిష్యుడగు సుకర్మ కూడా సామ సంహితను సహస్ర శాఖలుగా విభజించెను. అతని నుండి హిరణ్యనాభుడు, పౌష్యంజి, అవంత్యు డను ముగ్గురు శిష్యులు గ్రహించిరి. ఈ ముగ్గురు శిష్యులకు ఐదువందల మంది శిష్య లుండిరి. వీరిని ఉదీచ్య లందురు. పౌష్యంజి శిష్యులైన లోకాక్షి, లాంగలుడు, కుల్యుడు, కుశీదుడు అను నల్వురు ఒక్కొక్కరు పదివేల శాఖలను గ్రహించిరి. హిరణ్యనాభుని శిష్యుడైన కృతు డనువాడు తన శిష్యులకు ఇరువది నాలుగు సంహితలను బోధించగా, అవంత్యుడు తన శిష్యులకు మిగిలిన శాఖల నందించెను.

వ్యాసుని వద్ద నుండి అథర్వ వేదమును గ్రహించిన సుమంతుడు అద్దానిని తన శిష్యుడైన కబంధునకు బోధించెను. కబంధుడు దానిని రెండుగా విభజించి పథ్యునికి, వేద దర్శునికి బోధించెను. వేదదర్శునికి శౌక్లాయని, బ్రహ్మబలి, మోదోషుడు, పిప్పలాయనుడు అను నల్వురు శిష్యులు గలరు. పథ్యునికి కుముదుడు, శునకుడు, జాబలి యను శిష్యులు గలరు.

పథ్యుని శిష్యుడైన శునకునికి బభ్రువు, సైంధవాయనుడు యను శిష్యులు గలరు. శునకుడు విభజించిన రెండు శాఖలను వీరిరువురు గ్రహించిరి. సైంధవాయనుడు తన శిష్యులగు సావర్ణాదులకు బోధించెను. ఈ అథర్వ వేదమును అధ్యయనము చేసినవారిలో నక్షత్ర కల్పుడు, శాంతి కల్పుడు, కశ్యపుడు, అంగీరసుడు అనువారలు గూడా కలరు.

వేదజ్ఞులను గూర్చి తెలిసికొంటిమి. అలాగే పురాణముల నెరిగిన పౌరాణికులు గూడా కలరు. వారే త్రయ్యారుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు యను ఈ ఆరుగురు పురాణ కర్తలు.

"శౌనకా! నేను ఈ ఆరుగురికీ శిష్యుడనై ఆరు సంహితల నధ్యయనము చేసితిని. కాశ్యపుడు, నేను, సావర్ణి, అకృతవ్రణుడను నల్వురము వ్యాస పుత్రుడైన శుకమహర్షి నుండి మూల సంహితలను అధ్యయనము చేసితిమి. ఈ విధముగా వ్యాస భగవానుడు ద్వాపర యుగాంతమున వేద పురాణ శాఖలను విస్తరించెను. ఇవియే శిష్య ప్రశిష్య క్రమమున ప్రవర్ధమాన మైనవి.

మార్కండేయుని అఖండ తపస్సు

సూతుని ఉపదేశముచేత పరవశుడైన శౌనకుడు సూతుని ప్రస్తుతించెను. వినమ్రుడై నమస్కరించుచూ, "సాధుపురుషా! అంతము లేని అంధకార రూప సంసారము నుండి జీవుల నుద్ధరించు వాగ్మివరా! నీవు చిరంజీవిగా యుండుము" అని అప్రయత్నముగా పలికెను. అపార జ్ఞాన సాగరుడైన సూతుని అమోఘ వచనముల నాలకించిన పిదప, ఆనంద పారవశ్యంలో హృదయము వివశమై యుండ, కృతజ్ఞతను కనుబరచే యత్నములో కన్నులు మేఘనిలయాలు కాగా, గద్గద కంఠముతో "సూత జీవ చిరం సాధో!" యనెను.

"జీవ చిరం" యనెడి మాటను పలుకగనే శౌనకుని చిత్తము స్మృతి పుటలలో చరింపసాగెను. చిరంజీవిగా సూతుని జీవించమని పలుకగనే గతంలో చిరంజీవిగా శోభించుచున్న మార్కండేయుడు స్మృతిలో కదలెను. దానితో పాటు కొన్ని సంశయ మేఘాలు కూడా హృదయాకాశము నావరించెను. తన సందేహ నివృత్తిని గావింపగోరి శౌనకుడు సూతుని భక్తిశ్రద్ధలతో ప్రశ్నించెను.

"మహాత్మా! మనుజులు మార్కండేయఋషి చిరంజీవి యని చెప్పుచుందురు. ప్రళయకాలమున తానొక్కడే ప్రళయ జలముల యందు సంచరించుచు మర్రియాకు పై దేలుచుండిన అద్భుత అనమానుడగు అందమైన బాలుని దర్శించెనని చెప్పుచుందురు. ఈ విషయమున నాకు గల సంశయము మీ బోధ వలననే నివృత్తి కాగలదని నా ప్రగాఢ విశ్వాసము. కనుక మార్కండేయమహర్షిని గూర్చి బోధింపుము" యని శౌనకుడు ప్రార్థించెను.

శౌనకుని ప్రార్థన నాలకించిన సూతుడు మహాతపస్వి, తేజస్వియగు మార్కండేయ ఋషి వైభవమును వివరించుట కుపక్రమించెను.

మార్కండేయుడు ఉపనయన సంస్కారము నొందిన పిదప తన జనకుని ద్వారా వేదముల నభ్యసించెను. ధర్మముతో శోభిల్లెను. తపస్సుతో వర్ధిల్లెను. అతడు నైష్ఠిక బ్రహ్మచారి. శాంతరూపుడై గన్పట్టెడి వాడు. జడధారియై, దండ కమండలాదులతో నెల్లొందు చుండెడివాడు. సదా జపధ్యానాదులతో కాలము గడిపెడివాడు. మౌనియై యుండెడివాడు.

బ్రహ్మమునందు సదా చరింప నాసక్తి గలవాడే బ్రహ్మచారి యగును. బ్రహ్మచారికి వేషము ముఖ్యము కాదు. ప్రాపంచిక విషయాభిలాష లేనివాడు గనుక సదా మౌనియై యుండును. అధిక ప్రసంగి ఆచారవంతుడు కాలేడు.

ఉదయ సాయంత్ర సమయాలలో మార్కండేయుడు మధుకరమెత్తి, ఆ భోజనమును గురువు అనుమతించినచో భుజించును. లేదా ఆనాటికి ఆనందముగా ఉపవసించును. ఇలా తపస్స్వాధ్యాయ రతుడై, వేల సంవత్సరములు అకుంఠిత దీక్షతో విష్ణువు నారాధించి, మృత్యువును జయించెను.

మార్కండేయుడు కఠోరతపమాచరించుచుండ ఇంద్రుడు తపోభంగము చేయ సంకల్పించెను. తపస్సును భగ్న మొనర్చుటకు లోభ మదములను, గంధర్వ అప్సరసలను, మన్మథ వసంతాదులను పంపెను. వారందరు మార్కండేయుని ఆశ్రమమును సమీపించిరి.

మార్కండేయుని ఆశ్రమము ప్రసిద్ధ వృక్షములతో గూడి, పవిత్ర పక్షి సమూహములతో, స్వచ్ఛమైన సరోవరములతో శోభించుచుండెను. హిమగిరి సెలయేళ్ళను ప్రసాదించు చుండ, వాయువు పుష్పసుగంధమును అందించుచున్నది. మార్కండేయుడు హోమకర్మ నాచరించెను. అగ్ని నుపాసించుచున్న ఆ యతివరేణ్యుడు అగ్నిహోత్రము వలె ప్రకాశించుచుండెను. ఇంద్రుని భృత్యులు మార్కండేయుని గాంచిరి.

అప్సరసలు మనోహర నృత్యముల నారంభించిరి. గంధర్వులు గానము చేయసాగిరి. మన్మథుడు తన పంచ బాణములను ధనస్సున సంధించెను. వసంతుడు, మారుతము మార్కండేయుని చలింప చేయుటకు యత్నించిరి. మన్మథుడు శరములను ప్రయోగించెను. కానీ వీరి ప్రయత్నము లన్నియు విఫల మాయెను.

సర్వం తత్రా భవ న్మోఘ మనీశస్య యథోద్యమః

"నాస్తికుని ఉద్యమము వ్యర్థమగునట్లు, వీరి ప్రయత్నము లన్నియు వ్యర్థమాయెను" యని ఈ సందర్భమున వ్యాస భగవానుడు నాస్తికులను దుయ్యబట్టెను.

బాలురు నిద్రించు పామును మేల్కొలిపి, ఆ తరువాత భయపడి దౌడు తీయునట్లు, ఇంద్రుని సేవకులు మార్కండేయునికి అపకారము జేయ నారంభించి, చివరికి పీడితులై పలాయన మయ్యారు.

మార్కండేయుని మనస్సు కలత చెందలేదు. ఆ దివ్యాత్మునిలో ఇసుమంతైనను అహంకారము కదలలేదు. మూర్ఖులు మహాత్ముని నిందించవచ్చు, బాధించవచ్చు. కానీ అట్టి మూర్ఖులను కూడా మహాత్ముడు ప్రేమించును. అది సాధు పురుషుని స్వధర్మము. సాధువులు, సత్పురుషులు ఎన్నడూ స్వధర్మమును విస్మరించరు.

వాడిన మోముతో మన్మథుడు మహేంద్రుని జేరెను. మార్కండేయుని మహిమ నెరిగి ఇంద్రుడు అచ్చెరు వొందెను. తపస్స్వాధ్యాయ సంయమి యైన మార్కండేయుని అనుగ్రహింప నెంచిన శ్రీమహావిష్ణువు నరనారాయణ స్వరూపముతో దర్శనమిచ్చెను. నరనారాయణులను గాంచి, మార్కండేయుడు సాష్టాంగ దండప్రణామ మాచరించెను.

ప్రకాశైక స్వరూపులైన నరనారాయణులను మార్కండేయుడు ఆహ్వానించెను. పీఠము నొసంగెను. పాదములను కడిగెను. గంధము పూసెను. ధూప, దీప, పుష్పాదులతో అర్చించెను. పూజ్యతములైన ఆ మహాత్ములను స్తుతింపసాగెను.

"భగవంతా! నీవు అనంత రూపుడవు. సర్వరూపుడవు. సారరూపుడవు. మూడు లోకములను తరింప చేయుటకు ఈ రెండు రూపములను ధరించితివా! ఈ విశ్వమును సృజించువాడవు, సంహరించువాడవు నీవే. దుఃఖ సాగరమునబడి అలమటించుచున్న జీవులకు నీ చరణములే శరణ్యములు. నీ సేవలందే మానవులకు సర్వాభీష్టములు సిద్ధించును. విక్షిప్త బుద్ధిగల మనుజుడు నీ విభూతిని గాంచలేకున్నాడు. దివ్యరూపధారి యగు నిన్నే నేను శరణుజొచ్చి యున్నాను. నీకే నమస్కరించుచున్నాను" యనెను.

ధీమతుడగు మార్కండేయుని భక్తి వచనముల నాలకించిన నరసఖుడగు నారాయణుడు ఇట్లు పలికెను, "బ్రహ్మర్షివర్యా! నీవు మనస్సును నిగ్రహించి, అచంచల భక్తి యుతుడవై, తీవ్ర తపమాచరించి, నా విషయమున సిద్ధిని బొందితివి. నీ సాధనకు నేను స్పందించితిని. నిన్ను సంతృప్తి పరచ నెంచితిని. నీ అభీష్టమును తెలుపుము. అనుగ్రహించెదను" అనెను.

మార్కండేయుడు నారాయణునితో "తండ్రీ! నీవు శరణాగత వత్సలుడవు. నీ దర్శన భాగ్యమునకు మించిన దేమి గలదు? ఈ నాడు నా కోర్కెలన్నియు నీడేరినవి.

అన్యులకు అలభ్యము గాని నీ చరణకమలాలు నేడు నాకు లభించినవి. నిరంతరము ఈ దివ్య దర్శనమునే నేను వాంఛింతును. ఇదియే నా యభీష్టము. అయినను నీవు ప్రోత్సహించు చున్నందున కాదనలేక వరమడుగుచున్నాను. మహిమాన్వితుడా! ఏకమైన సత్యము నందు భేదమును చూపెట్టెడి నీ మాయను దర్శింప కుతూహల పడుచున్నాను.

తే ॥ జగము రక్షింప జీవులఁ జంప మునుపఁ గర్తవై సర్వమయుఁడవై కానిపింతు
వెచట నీమాయఁ దెలియంగ నెవ్వఁ డోపు విశ్వసన్నుత విశ్వేశ వేదరూప!

యని ప్రార్థించెను. నారాయణుడు నవ్వుచూ "అట్లేయగు గాక!" యని పలికి, బదరి కాశ్రమమున కేగెను.

మార్కండేయుడు విష్ణుమాయను దర్శించుట

మార్కండేయుడు సదా శ్రీహరినే ధ్యానించుచు, పూజించుచు, సూర్య చంద్రుల యందు, జల భూముల యందు, ఆకాశ సాగరము లందు శ్రీహరినే దర్శించుచుండెను. ప్రశాంతచిత్తుడై, ప్రసన్నవదనుడై ప్రవర్తించు చుండెను.

ఒకనాడు సంధ్యవేళ పుష్పభద్రా నదీతీరమున సంధ్యా వందనము చేయుచుండగా భయంకరమగు పెనుగాలి వీచెను. ఆ వాయువు నాశ్రయించుకొని మేఘములు గర్జించుచు కదల సాగెను. కొద్ది సేపట్లో రథచక్రము వలె తిరుగుచూ వర్షపు నీటిధారలు కురియ సాగెను. ఈ లోగా సాగరములు భయంకర కెరటములతో ప్రచండ వాయువుల మధ్య ఘోషింపసాగినవి. గంభీరధ్వనులతో సుడిగుండములు పరిభ్రమింప సాగినవి. క్షణమాత్రాన విశ్వ మంతయూ ప్రళయ జలాలతో నిండిపోయెను. త్రిలోకములు నీట మునిగినవి. దిక్కు తోచక, దారి తెలియక మార్కండేయ మహర్షి మందుని వలె, అంధుని వలె భీతితో నిలిచి యుండెను.

అలల తాకిడికి చెదరగొట్ట బడుచు, అంతులేని చీకటిలో అంతయూ జలమయం కాగా, చింతాక్రాంతుడై పరిభ్రమించుచు తిరిగి తిరిగి అలసిపోయెను. అంతట తన దివ్య తేజస్సు చేత అంధకారము నదృశ్యము చేయు నొక బాలుడు మఱ్ఱియాకు దొప్పయందు పరుండి యుండుటను మార్కండేయుడు గాంచెను.

ఆ శిశువు నీల మేఘశ్యామ దేహుడై గన్పట్టెను. అతని ముఖారవిందము దివ్య తేజము లీనుచుండెను. మందహాసమును చిందించు చుండెను. అందమైన వేళ్ళు గల చేతులతో తన పాదమును నోటిలో ఉంచుకొని చప్పరించుచుండెను. అతని మోమును గాంచగనే మార్కండేయునికి బడలిక తీరెను. ఆనందము మెండాయెను. ఆ పిల్లవానిని పలుకరించుటకు సమీపమున కేగి పరిచయము చేసికొనుటకై యత్నించెను. ఇంతలో ఆ బాలుని ఉచ్ఛ్వాస వాయువుచే నాకర్షింపబడి దోమవలె ఆ బాలుని శరీరములో ప్రవేశించెను. అచట ఈ ప్రపంచము ప్రళయమునకు పూర్వ మెట్లుండెనో అట్లుండుటను గాంచెను. ఆశ్చర్యము నొందెను.

మార్కండేయుడు ఆ బాలుని దేహములో భూమిని జూచెను. ఆకాశమును వీక్షించెను. సాగరములను దర్శించెను. దేవాసురులను, క్రిమి కీటకాదులను, పశుపక్ష్యాదులను, విహంగ మానవాదులను, గ్రామములను, దేశములను, హిమాలయమును, పుష్పభద్రా నదిని, తన ఆశ్రమమును సమస్తమును చూచెను. అలా దర్శించుచున్న మార్కండేయ మహర్షి ఆ బాలుడు నిశ్వాసము వదలగనే బహిర్గతుడై ప్రళయ జలమున పడెను.

మఱ్ఱియాకు దొన్నపై పరుండి యున్న చిరునగవుల చిన్నారి బాలుని గాంచి, మురిపెమొందిన వాడై, ఆ బాలుని ఆలింగన మొనర్చుకొనుటకై సమీపమున కేగెను. ఇంతలో ఆ బాలుడు అంతర్ధాన మయ్యెను. అతనితో పాటు ప్రళయ జలముకూడా అదృశ్య మయ్యెను. మార్కండేయుడు పూర్వము వలె తనను తన ఆశ్రమములో నున్నట్లు గాంచగలిగెను.

ఉన్నదొక్కటియే. అది ఆత్మయే గాని అన్యము కానేరదు. బుద్ధికి అనేకములు గోచరించును. ఈ దృష్టి ప్రళయము వలె భయంకరమైనది. అట్టి బుద్ధి, మహర్షి బాలుని గాంచినట్లు, ఆత్మను ఆశ్చర్యముతో గాంచును. సమీపించగనే ఆత్మ కన్నా తాను అన్యము గానందున ఆత్మతో ఐక్యమగును. ఆత్మానుభవములో ఏకత్వమే ఉండును గాన అన్నియు దాని యందే గోచరించును. ఈ సత్యమును గ్రహించలేక జనులందరు బాహ్య జగత్తులో ఆనందము నన్వేషిస్తూ నడక సాగించుచుందురు. ఈ నడక మంచిది కాదనియు, జీవు డాశించు నిత్యానందము అంతర్గతమే గాని బాహ్యమున దుర్లభమనియు తెలుపుటకై వటపత్రశాయి యగు బాలుడు తన చరణమును నోటి యందుంచుకొనెను.

బాలుని సమీపించిన మహర్షి బాలుని స్వరూపముగా మారిపోయెను. దీనినే ఆత్మ ప్రత్యయము అందురు. కనుక ఏ దృశ్యములు అజ్ఞాన రూపములై బాహ్యమున బంధించు చున్నవో వాటిని త్యజించుటయే కర్తవ్యము గాని జ్ఞాన సముపార్జనము గాదు.

తస్మాత్ అవిద్యాధ్యారోపిత నిరాకరణ మాత్రం బ్రహ్మణి కర్తవ్యమ్! న
తు బ్రహ్మ విజ్ఞానే యత్నః! అత్యన్త ప్రసిద్ధ త్వాత్

"పరమాత్మను తెలిసికొనుటకు అవిద్య, అధ్యారోపితములను నిరాకరించుటయే మార్గము గాని బ్రహ్మకు సంబంధించిన జ్ఞానమును పొందుటకు ప్రయత్న మనవసరము లే"దని ఆదిశంకరులు తమ గీతాభాష్యములో తెలిపియున్నారు.

సమిష్టి యని పిలువబడిన దంతయూ వ్యష్టి కన్నను అన్యము గాదనెడి అనుభవమును మార్కండేయ మహర్షి మాయను దర్శించుట ద్వారా పొందగలిగెను. పరమాత్మ కన్నా అన్యమైన దంతయూ మాయయే నని గ్రహించెను.

శ్రీహరి దివ్య వైభవమును, మాయా విలాసమును పదే పదే నెమరు వేసికొంటూ మార్కండేయుడు ఆశ్చర్య చకితు డగుచుండెను. కదలే సంకల్పాలు ఈ విస్మయ బాటలో కదలలేక ఆగిపోవుచుండెను. అట్టి సమయాన సమాధి మగ్నుడైన మార్కండేయుడు నిరవధిక సత్తా స్వరూపమైన దివ్యానందము ననుభవించుచుండెను.

సమమైన బుద్ధియే సమాధి. సమబుద్ధి గలవాని చెంతకు సర్వశుభములు నడచి వచ్చును. మార్కండేయుడు సమాధి మగ్నుడై యుండెను. అదే సమయానికి ప్రమథ గణములతోను, పార్వతీదేవి తోను గూడినవాడై పరమేశ్వరుడు వృషభారూఢుడై గగనమున సంచరించుచు మార్కండేయుని గాంచెను.

మహేశ్వరుడు మార్కండేయునికి వరము లిచ్చుట

ఆకాశమున సంచరించుచున్న ఆదిదేవి మార్కండేయుని గాంచెను. వెంటనే పశుపతి వైపు తిరిగి "దేవా! నిగ్రహించబడిన దేహేంద్రియ మనోబుద్ధులతో ప్రశాంత వదనుడై యున్న యీ పరమహంసను వీక్షింపుడు" యనెను.

ఇష్టా లెరుగని వానికి ఇంద్రియాలు నిగ్రహింప బడతాయి. కోరిక లణగారిన వ్యక్తికి కైవల్యము కరతలామలకమే.

"The fewer our wants, the nearer we resemble the Gods"

"వాంఛలు తగ్గుముఖం పడితే చాలు. వ్యక్తి వేల్పులై వెల్గొందగలడు" యని సోక్రటీస్ అభిప్రాయపడ్డాడు.

భగవంతునికై ఆరాటపడ నవసరము లేదు, భగవంతుని దర్శించుటకు తపించ నవసరము లేదు. ఆశించుట మాని అర్హతను సంపాదించ గలగాలి. వికసిత పుష్పము చెంతకు భ్రమరము నడుగిడినట్లు, నిజభక్తుని సన్నిధికి నిరంజనుడు కదలి వచ్చును.

పార్వతీదేవి పరమేశ్వరునితో, "నాథా! భయంకరమైన గాలులు తగ్గిన పిమ్మట శాంతించిన ప్రశాంతసాగరము వలె ఈ బ్రాహ్మణుడు కన్పట్టుచున్నాడు. నీవు సిద్ధి ప్రదాతవు. అతడి ననుగ్రహింపుము" అనెను.

పార్వతి శక్తి స్వరూపము. శక్తి కనికరిస్తే చాలు. ముక్తి చేరువవుతుంది. సాధకునిలో వృద్ధిపొందిన భక్తియే శక్తి. భక్తి భగవానుని భక్తుని వద్దకు మరలించును. తరలించును. భక్తుని తరింప జేయును. ఇదియే ఉన్నతమైన పదవి. ఈ మహోన్నత పదవియే జీవుని లక్ష్యమై యున్నది.

పదవి నీ సద్భక్తియు కల్గుటే ॥పదవి॥
ధన దార సుతాగార సంపదలు
ధరణీశుల చెలిమొక పదవా
రాగ లోభ యుత యజ్ఞాదులచే
భోగము లబ్బుట యది పదవా ॥పదవి॥

యని త్యాగరాజస్వామి రామభక్తిని నోరార కీర్తించినాడు.

పరమేశ్వరుడు పార్వతీదేవితో ఇట్లనెను: "దేవీ! ఈ మహర్షి వాంఛారహితుడు. వాంఛాతీతుడు. అవ్యయుడైన శ్రీమహావిష్ణువు యొక్క భక్తిలో సర్వమును మరచి

యున్నాడు. ఇతనికి మోక్షము నందు గూడా వాంఛలేదు. అయినను ఇతనితో నేను భాషింతును. ఎందులకనగా

అయం హి పరమో లాభో నృణాం సాధు సమాగమః

"ఈ విధమైన సాధు సమాగమము జీవులకు పరమప్రయోజనమును కలిగించును" యని సాధుసంగము వైశిష్ట్యమును మహేశ్వరుడు తెలిపెను.

పార్వతీపరమేశ్వరులు మార్కండేయుని సమీపించిరి. కానీ మహర్షి ఆది దంపతులను గుర్తించలేదు. చిత్తము నిరోధింపబడి యుండుటచేత, పార్వతీ పరమేశ్వరులతో పాటు, తన దేహము మరియు ఈ ప్రపంచము కూడా తెలియకుండెను. మహర్షి అంతరంగిక వైభవము నెరిగిన శంకరుడు రంధ్రమున ప్రవేశించిన గాలివలె మార్కండేయుని హృదయాకాశమున ప్రవేశించెను. ఈశ్వర దర్శనముతో పరితృప్తుడైన మహర్షి కనులు తెరచి మహేశ్వరుని దర్శించెను. తలవంచి నమస్కరించెను. పార్వతీ పరమేశ్వరులను పూజించెను.

"పరమేశా! నీవు పూర్ణ పురుషుడవు. పురుషోత్తముడవు. సర్వాధారుడ వైన నీకు నే నేమి సేవ లొనర్పగలను?" యని మహర్షి పలికెను.

నమః శివాయ శాన్తాయ సత్త్వాయ ప్రమృడాయచ
రజో జుషే౽ థ ఘోరాయ నమస్తుభ్యం తమోజుషే ॥

"దేవా! శాంతుడు, సత్త్వగుణాధిష్ఠితుడవు, రజోగుణముచే ఘోరరూపుడవు, తమోగుణముచే భయమును కలిగించు స్వరూపముగల వాడవు నగు నీకు నమస్కారము' యని మార్కండేయుడు ప్రార్థించెను.

మార్కండేయుని స్తుతివచనముల నాలకించిన పరమేశ్వరుడు పరితుష్టుడై మహర్షితో ఇలా చెప్పెను: "మహర్షీ! నీకు వలయు వరముల నడుగుము. వరప్రదాతలలో త్రిమూర్తుల మగు మేము శ్రేష్ఠులము. మా ద్వారా మానవులు మోక్షము నొంది తరించుచున్నారు. సదాచారవంతులు, శాంతులు, నిస్సంగులు, భూతవత్సలురు, నిర్వైరులు, సమదర్శను లగు బ్రాహ్మణులు మాయందు ఏకాంత భక్తిగలవా రగుచున్నారు. వారు లోకపూజితులు. త్రిమూర్తులమైన మేము గూడా వారిని గౌరవించుచుందుము. త్రిమూర్తుల యందు వారికి భేదము లేదు.

"తీర్థములు, విగ్రహములు, దేవతలు దీర్ఘకాలము సేవింపబడి మనుజులను పవిత్రులను చేయుదురు. కానీ మీలాంటి సాధువులు దర్శన మాత్రముననే పవిత్రులను చేతురు. సమాహిత చిత్తులై, తపోధనులై, స్వాధ్యాయ సంయమవాదుల చేత వేదమయమైన మా రూపములను ధరించు బ్రాహ్మణులకు మేము నమస్కరించుచున్నాము. మహాపాతకులైన వారు కూడా మీ నామమును వినుట, మిమ్ములను దర్శించుటవలన పునీతులగుచున్నారు. మీతో భాషింపగలిగినచో ఇంకా పవిత్రులగుదురు" అనెను.

నీలకంఠుడు ధర్మరహస్యమును విస్తరించు అమృతమయ వాక్యములను పలికినను మార్కండేయుడు ఏ మాత్రము తృప్తి చెందలేదు. విష్ణుమాయచే చాలా కాలము భ్రమించి, కృశించిన మహర్షి శివ వాగామృతధారను కర్ణపుటముల ద్వారా పానము చేసి మహాక్లేశమును విడనాడి ఇలా పలికెను:

"దేవా! దేహధారుల మైన మాకు ఈశ్వర లీల అసాధ్యమైనది. నీ యధీనములో నున్న జీవులకు మీరు నమస్కరించుట ఆదర్శమును చూపుటకే ననునది సత్యము. లోక కళ్యాణమును వాంఛించి మీరు ఆచరించెడి మాయా స్వరూపములైన ఈ నమస్కారాదుల వలన మీ వైభవము తగ్గదు. మాయ చేయువాడు తన మాయా కార్యములకు తాను లోబడునా? ఇదియునూ అంతే.

"మహాత్మా! ఎవని సందర్శనాభాగ్యముచేత నరులు పూర్ణరూపులు, ఆప్తకాములు నగుచున్నారో అట్టి నిన్ను నే నేవరము నడుగుదును? అయినను సర్వసిద్ధిప్రదుడ వగు నీ నుండి ఒకే ఒక్క వరమును కోరుచున్నాను. అనుగ్రహింపుము.

భగవ త్యచ్యుతాం భక్తిం తత్పరేషు తథా త్వయి

"భగవానుడగు విష్ణుమూర్తియందు, అతని భక్తుల యందు, నీ యందున్నట్లే అపారమైన భక్తి నిలుచునట్లు అనుగ్రహింపుము" అనెను.

"మార్కండేయా! శ్రీహరి భక్తియుతుడ వైన నీకు సర్వకామ్యములు తీరుచున్నవి. పవిత్రమగు నీ యశస్సు కల్పాంతము వరకు స్థిరముగా యుండును. నీకు అజరత్వము, అమరత్వములు కలుగును. నీవు చిరంజీవివై వర్ధిల్లెదవు గాక!" యని ఆశీర్వదించి గిరిజా సమేతుడై కైలాసగిరి కేగెను. ఈ మార్కండేయ చరితమును వినువారు, వినిపించెడివారు విస్తారములైన ప్రపంచ బంధాలనుండి విడివడి తరింతురు యని సూతుడు ఫలశ్రుతి నందించెను.

సంక్షిప్త భాగవతము

మహానుభావు డగు సూతుడు నైమిశారణ్యము నందు శౌనకాది మునులకు భాగవత కథాసుధను విరివిగా పంచిపెట్టి, కథాంతము నందు పూర్ణహృదయుడై ఈ దివ్య చరితమును సంక్షిప్తముగా సింహావలోకనము గావించుచున్నాడు.

నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య ధర్మాన్ వక్ష్యే సనాతనాన్

సూతుడు పలికెను: "శ్రీహరిభక్తిరూపమైన ధర్మమునకు వందనములు. విశ్వవిధాత యగు శ్రీకృష్ణపరమాత్మకు ప్రణామములు. బ్రాహ్మణులకు నమస్కరించి సనాతన ధర్మమును కీర్తింతును" యనెను. కీర్తింపసాగెను.

శ్రవణ యోగ్యము లైన భాగవత విషయములు వర్ణింపబడినవి. మోక్ష ప్రదాతయగు శ్రీకృష్ణుని వైభవము కీర్తించబడినది. సృష్టి ప్రళయాలు తెలుపబడినవి. సగుణ నిర్గుణ తత్త్వ మెరుక పడినది. అపరోక్షమైన జ్ఞానము వివరింపబడినది. సాధన విషయాలు చెప్పబడినవి. భక్తి వైరాగ్యములు నిర్దేశింపబడినవి. నారద పరీక్షిన్మహారాజుల గాథలు చాటబడినవి.

బ్రాహ్మణ శాపము వలన పరీక్షిత్తుడు ప్రాయోపవేశము చేయ నిశ్చయించుకొని ఆహారపానీయాదులను విసర్జించెను. ఆ సమయమున అచ్చట కరుదెంచిన శుకబ్రహ్మకు, పరీక్షిత్తునకు జరిగిన సంవాదము ప్రథమ స్కంధమున వివరింపబడినది.

యోగధారణచే అర్చిరాది గమనము, బ్రహ్మ నారద సంవాదము, శ్రీహరి అవతార కీర్తనము, మహతత్త్వము నుండి క్రమముగా జరిగిన సృష్టి ద్వితీయ స్కంధమున చెప్పబడినది.

విదుర ఉద్ధవ సంవాదము, విదుర మైత్రేయ సంవాదము, పురాణ సంహితలను గూర్చి ప్రశ్నించుట, ప్రళయ కాలమున పరమాత్మ స్వరూప వర్ణనము తృతీయ స్కంధమున చెప్పబడినది.

తరువాత బ్రహ్మాండోత్పత్తి, విరాటపురుష వర్ణనము చెప్పబడినది. హిరణ్యాక్షుని వధించుట, స్వాయంభువు మనువు యొక్క ఉత్పత్తి, అర్ధనారీశ్వర సృష్టి వర్ణింపబడినది. ఉత్తమ స్త్రీ యగు శతరూప రమణి గాథ, కర్దమ ప్రజాపతి ధర్మపత్నులకు కలిగిన సంతానము, మహాత్ముడగు కపిలదేవుని అవతార వైభవము, కపిల దేవహూతుల సంవాదము వర్ణితము లైనవి. మరీచ్యాది నవబ్రహ్మల ఉత్పత్తి, దక్షయజ్ఞ ధ్వంసము, ధ్రువ చరితము, పృథు చరితము, ప్రాచీనబర్హి చరితము, నారద సంవాదము, ప్రియవ్రత చరిత్ర, ఋషభచరిత్ర, భరతుని కథ వర్ణింపబడినవి.

దేవతలు మొదలు పక్షుల వరకు సర్వుల పుట్టుకను వర్ణించుట, వృత్రాసురుని చరితము, హిరణ్యాక్ష హిరణ్యకశిపుల జన్మ వినాశములు, ప్రహ్లాదుని చరిత్ర చెప్పబడినవి. పిమ్మట మన్వంతర వర్ణనము, గజేంద్ర మోక్షము, హయగ్రీవా ద్యవతారములు వర్ణింపబడినవి.

అనంతరము మత్స్య, కూర్మ, నారసింహ, వామనాది అవతారములు వర్ణింపబడినవి. క్షీరసాగర మథనము, దేవాసుర సంగ్రామము, ఇక్ష్వాకు జననము, ఇలోపాఖ్యానము, తారోపాఖ్యానము చెప్పబడినవి. పిమ్మట సుకన్య, శర్యాతి, కుకుత్స్థుడు, ఖట్వాంగుడు, మాంధాత, సౌభరి, సగరుడు అనువారి చరితములు కీర్తించబడినవి.

పిమ్మట రామచంద్రుని రమణీయ గాథ, నిమి యొక్క శరీరత్యాగము, జనకాదుల జననము, పరశురాముని క్షత్రియ సంహారము వర్ణితములు. అనంతరము యదువంశమున శ్రీకృష్ణ జననము, గోకులమున వర్తనము, పూతనాసంహారము, శకట భంజనము, తృణావర్త వధ, బకాసుర వధ, అఘాసుర సంహారము, బ్రహ్మచే గోవత్స హరణము, ధేనుకాసుర వధ, ప్రలంబాసుర వధ, దావానల భక్షణము, కాళీయమర్దనము, విప్రపత్నుల

సేవ, రాసక్రీడ, మథుర ప్రయాణము, గోపికావిరహ వ్యథ, కువలయాపీడవధ, చాణూర ముష్టికులను, కంసుని సంహరించుట ఇత్యాదులు అద్భుతముగా వర్ణింపబడినవి.

అటు పిమ్మట కాలయవనుని సంహరించుట, ద్వారకాపట్టణ నిర్మాణము, రుక్మిణీ హరణము, నరకాసురుని వధించుట, యదువంశ సంహారము, ఉద్ధవగీత, అవతార సమాప్తి వర్ణింపబడినవి. ఆ తరువాత యుగధర్మములు, కలియుగ ఉప ద్రవములు, చతుర్విధ ప్రళయములు చెప్పబడినవి.

అనంతరము పరీక్షిత్తు దేహమును త్యజించుట, వ్యాసుడు వేద పురాణ శాఖలను విస్తరించుట, మార్కండేయుని దివ్యచరితము, సూర్యవైభవము వర్ణితములు.

"మునులారా! మీరు నన్నడిగిన విషయము అన్నియు చక్కగా వర్ణింపబడినవి. సర్వవిధములైన లీలావతారములు ఈ పవిత్ర గ్రంథమున కీర్తింపబడినవి. శ్రీహరి నెవ్వరు కీర్తింతురో, లేదా ఆ దివ్యాత్ముని లీలలను ఎవ్వరు శ్రవణము చేయుదురో అట్టివారి చిత్తముల యందు శ్రీహరి ప్రవేశించి వాయువు మేఘములను పారద్రోలునట్లు మనో క్లేశములను పారద్రోలును. శ్రీహరిని కీర్తింపని కథలు అసత్యములు. మాయా రూపములని గ్రహింపుడు. భక్తి రహిత ఆత్మజ్ఞానము కూడా శోభించదని మరువకుడు. మహర్షులారా! పూర్వము శుకబ్రహ్మ ద్వారా నీ భాగవత ధర్మమును శ్రవణము చేసితినో దాని నీనాడు మఱల మననము చేసికొని తృప్తిచెందు భాగ్యమును మీరు నాకు కల్పించితిరి.

ఏతద్వః కథితం విప్రాః కథ నీ యోరు కర్మణః
మహాత్మ్యం వాసుదేవస్య సర్వాశుభ వినాశనం

"విప్రులారా! ఏ మహానుభావుని మహాచరితము కీర్తనీయమై యున్నదో సర్వ అశుభములను పోగొట్టెడి ఆ శ్రీకృష్ణదేవుని మహాత్మ్యమును మీకు వివరించితిని.

"ఈ దివ్యకథను నిత్యము పఠించువాడు సర్వోపద్రవముల నుండి విడివడును" యని సూతుడు పలికెను. ఈ విధముగా పరీక్షిత్తునకు శుకుడు ద్వాదశ స్కంధయుత మగు శ్రీమద్భాగవతమును తెల్పెనని సూతుడు పలికెను.

కం ॥ **శ్రీరమణీరమణకథా, పారాయణచిత్తునకును బలికెఁ బరీక్ష**
ద్భూరమణున కెలిఁగించెను, పారమతిన్ శుకుఁడు ద్వాదశస్కంధములన్.
అని పోతనామాత్యుడు ఆంధ్రభాగవతమును సమాప్తి చేసెను.

శ్రీమద్భాగవత మహాత్మ్యము

ఇది శ్రీమద్భాగవతము లోని ద్వాదశ స్కంధము నందలి పదమూడవ అధ్యాయము. ఈ అధ్యాయము చివరిది. ఇందు సమస్త పురాణముల శ్లోక సంఖ్య ఇవ్వబడినది. దానము, దానప్రాశస్త్యము వివరింపబడినది. ఇచ్చటనే ఫలశ్రుతిగా భాగవతమహాత్మ్యము వర్ణింప బడినది. ఈ విషయములను తెలుపుట కుపక్రమించుచు ముందుగా శ్రీమన్నారాయణునికి

నమస్కరించుచున్నాడు సూత మహర్షి. ఈ ప్రారంభ శ్లోకము చాలా ప్రశస్తమైనది. వేద స్వరూపమైనది. ఈ శ్లోకమును నిత్యము పఠించువారు తప్పక తరింతురు.

యం బ్రహ్మా వరుణేన్ద్ర రుద్ర మరుతః స్తున్వన్తి దివ్యైః స్తవై
ర్వేదైః సాంగ పదక్రమోప నిషదై ర్గాయన్తి యం సామగాః
ధ్యానావస్థిత తద్గతేన మనసా పశ్యన్తి యం యోగినో
యస్యాన్తం న విదు స్సురాసురగణాః దేవాయ తస్మై నమః

యం = ఎవనిని, బ్రహ్మా = బ్రహ్మదేవుడు, వరుణ = వరుణుడు, ఇంద్ర = ఇంద్రుడు, రుద్ర= రుద్రుడు, మరుతః = మరుద్గణములు, దివ్యైః = దివ్యములైన, స్తవైః= స్తవముల చేత, స్తున్వన్తి = స్తుతించుచున్నారో, సామగాః = సామవేదమును గానము చేయువారు, సాంగ పదక్రమోప నిషదైః = వేదాంగముల నెరిగి శ్రుతి పద ఉపనిషత్తులతో కూడిన, వేదైః = వేదములచే, యం = ఎవనిని, గాయన్తి = గానము చేయుచున్నారో, యం = ఎవనిని, యోగినః = యోగులు, ధ్యానావస్థిత = ధ్యానమగ్నులై, తద్గతేన = దానియందే యుంచిన, మనసా = మనస్సు చేత, పశ్యన్తి = గాంచుచున్నారో, యస్య = ఎవనియొక్క, అంతం = పూర్ణత్వమును, సురాసురగణాః = దేవాసుర గణములు, న విదుః = తెలియరో, తస్మై = అట్టి, దేవాయ = ఆదిదేవునకు, నమః = నమస్కారములు.

భావము:- ఎవనిని బ్రహ్మ, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు, మరుద్గణములు దివ్యస్తోత్రముల చేత, వేదాంగములు, ఉపనిషత్తులు, పదక్రమములతో గూడిన వేదములచేత స్తుతించుచుండురో, ఎవని మహాత్మ్యమును సామవేదమును గానము చేయువారు కీర్తించుచుండిరో, ఎవని స్వరూపమును యోగులు ధ్యానమగ్నులై, తద్గతులై గాంచు చుందురో, సురాసురగణము లెవని వైభవమును ప్రయత్నించి తెలియలేరో అట్టి పూర్ణ రూపుడగు దేవదేవుని నమస్కరించుచున్నాను.

ఈ విధముగా ఆదిదేవునకు నమస్కరించి సూతుడు శౌనకాది మునులకు పురాణముల శ్లోక సంఖ్యను తెలిపెను.

పురాణములు	శ్లోకములు	పురాణములు	శ్లోకములు
1. బ్రహ్మపురాణము	10,000	10. బ్రహ్మ వైవర్తము	18,000
2. పద్మపురాణము	55,000	11. లింగ పురాణము	11,000
3. శ్రీవిష్ణు పురాణము	23,000	12. వరాహ పురాణము	24,000
4. శివ పురాణము	24,000	13. స్కాంద పురాణము	81,100
5. శ్రీమద్భాగవతము	18,000	14. వామన పురాణము	10,000
6. నారద పురాణము	25,000	15. కూర్మ పురాణము	17,000
7. మార్కండేయ పురాణము	9,000	16. మత్స్య పురాణము	14,000
8. అగ్ని పురాణము	15,400	17. గరుడ పురాణము	19,000
9. భవిష్యత్పురాణము	14,500	18. బ్రహ్మాండ పురాణము	12,000

పురాణముల మొత్తము శ్లోకసంఖ్య నాలుగు లక్షలు.

ఈ పదునెనిమిది పురాణములలో శ్రీమద్భాగవత పురాణము పదునెనిమిది వేల శ్లోకములతో శోభించుచున్నది. తన నాభి యందలి పద్మమున నసించుచు సంసారమునకు భీతి చెందుచున్న బ్రహ్మదేవునకు నారాయణుడు మొదట బోధించెను.

భాగవతము సర్వ వేదాంత సిద్ధాంత సారము. జీవ బ్రహ్మైక్యమును ప్రతిపాదించు పావన గ్రంథము. **"తన్నిష్ఠం కైవల్యైక ప్రయోజనమ్"** మోక్షమునే పరమపురుషార్థముగా ఈ గ్రంథము నిర్ణయించును.

నిమ్నగానాం యథా గంగా దేవానా మచ్యుతో యథా
వైష్ణవానాం యథా శంభుః పురాణానా మిదం తథా

"నదులలో గంగానది, దేవతలలో విష్ణుమూర్తి, విష్ణుభక్తులలో శంకరుడు ఎలా శ్రేష్ఠులో పురాణములలో భాగవతము శ్రేష్ఠమైనది."

భక్తులకు ప్రియమైన ఈ భాగవత గ్రంథము దోష రహితమైనది. ఇందు భక్తి, జ్ఞాన, వైరాగ్యములు నిండి యున్నవి. భక్తితో ఈ గ్రంథమును శ్రవణము చేయువాడు, పఠించువాడు, పరిశీలించువాడు సర్వోత్కృష్టమైన మోక్షమును పొందును.

నమస్తస్మై భగవతే వాసుదేవాయ సాక్షిణే
య ఇదం కృపయా కస్మై వ్యాచచక్షే ముముక్షవే ॥

"మోక్షార్థి యగు బ్రహ్మదేవునకు దయతో భాగవతమును ఉపదేశించినవాడును, సర్వసాక్షియునైన వాసుదేవునకు నమస్కారము."

యోగీన్ద్రాయ నమస్తస్మై శుకాయ బ్రహ్మ రూపిణే
సంసార సర్పదష్టం యో విష్ణురాత మమూముచత్ ॥

"సంసారమనెడి కాలసర్పముచే కాటు వేయబడిన పరీక్షిన్మహారాజును బ్రోచినవాడు, బ్రహ్మస్వరూపుడు, యోగీన్ద్రుడు నగు శుకమహర్షికి వందనములు.

శ్రీమద్భాగవత గ్రంథః పరిసమాప్తః

శ్రీమద్భాగవత గ్రంథము పరిసమాప్త మైనది.

హరయే నమః

❀❀❀

జ్ఞానప్రసూన, శ్రీస్వామి సుందర చైతన్యా నందుల వారు తెలుగువారికి తెలియని వారు కారు. విస్పష్టగా, రసవంతంగా, సానుకూలంగా, బోధకంగా, అమోఘ ప్రజ్ఞాశాలిగని భక్తుల చేత, పండితుల చేత కీర్తింపబడి, అఖిలాంధ్ర దేశములోని అనేక ముఖ్య పట్టణాలలో 125 జ్ఞాన యజ్ఞములను నిర్వహించి ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించారు.

స్వామీజీ నిర్వహించిన యజ్ఞాలు అమృత సామ్యమైన రీతిలో కొనసాగి లక్షలాది మందికి జ్ఞానభిక్ష పెట్టించ గలిగినవి. వారిచేత స్థాపించ బడిన సత్సంగశాఖలు ఒకటి వెల్లాల జ్యోతులై వెలుగుచున్నవి. **'గీతధార'** మాసపత్రిక ద్వారా పూజ్య స్వామీజీ ప్రవచనామృతము వేలాది మంది భక్తులకు వారి దివ్య సేవల నందించుచున్నారు. వారి అమృత కలం నుండి వెలువడిన క్యాసెట్లు ఎన్నో హృదయాలకు ఊరటను కల్గించినవి. వారి కమనీయ కలం నుండి జాలువారిన ఆణిముత్యాలైన గ్రంథములు మోక్షమార్గమును [illegible] ముముక్షు వులకు మార్గదాయకమై యున్నాయి. ఎన్నో వెలువడినవి. ఇంకెన్నో వెలువడ నున్నవి. అన్నిటిని మరపించే రీతిలో వెలువడుతున్న అపూర్వ గ్రంథ రాజమే, ఈ,

చైతన్య భాగవతము.

భాగవతము కథల పెంపుడు గాదనియు, శ్రీకృష్ణుడు కేవల పాత్రుడు గాదనియు, వేదాంతములకు పరీక్షాగ్రంథమనబడిన ఈ భాగవత ములోని కథ వృత్తము అన్నియు ఉపనిష త్ప్రతిపాదితమైన జ్ఞానములనియు శ్రీ స్వామీజీ ఈ గ్రంథమును వినిపించినారు.